శ్రీః

శ్రీరామచన్ద్రపరబ్రహ్మణే నమః

బాలానన్దినీ సహితమగు

శ్రీమద్రామాయణము : సుందరకాండము

అథ సున్దరకాణ్డప్రారమ్భః - ప్రథమః సర్గః

[హనుమంతుడు సముద్రమును లంఘించుట. మైనాకుడు ఆతనిని గౌరవించుట. సురసను హనుమంతుడు ఓడించుట. సింహికను వధించుట. దక్షిణతటము చేరి అచట లంక శోభను చూచుట.]

మూ. తతో రావణనీతాయాః సీతాయాః శత్రుకర్శనః,
ఇయేష పదమన్వేష్టుం చారణాచరితే పథి. 1

ప్ర. అ. తతః=అటుపిమ్మట, శత్రుకర్శనః=శత్రువులను కృశింపచేయు హనుమంతుడు, రావణనీతాయాః=రావణునిచే తీసికొనివెళ్లబడిన, సీతయాః=సీత యొక్క, పదమ్=స్థానమును, అన్వేష్టుమ్=వెదకుటకొరకు, చారణాచరితే=చారణు లచేత (చారణు లనువారు దేవయోనులు) సంచరింపబడిన, పథి=మార్గమునందు, (వెళ్లుటకు) ఇయేష=ఇచ్ఛగించెను.

తా. జాంబవదాదులు ప్రేరేపించగా, శత్రుసంహారకుడైన హనుమంతుడు, రావణుడపహరించిన సీతను వెదకుటకై, చారణులు మొదలైన దేవతలు సంచరించు ఆకాశమార్గమునందు ప్రయాణము చేయవలెనని నిశ్చయించు కొనెను. 1

మూ. దుష్కరం నిష్ప్రతిద్వన్ద్వం చికీర్షన్ కర్మ వానరః,
సముదగ్రశిరోగ్రీవో గవాంపతిరివాబభౌ. 2

ప్ర. అ. వానరః= హనుమంతుడు, దుష్కరమ్=చేయ శక్యము కాని, కర్మ=పనిని, నిష్ప్రతిద్వన్ద్వమ్=అడ్డములు (లేదా ఎదిరించువాడు) లేకుండగా, చికీర్షన్=చేయదలచినవాడై, సముదగ్రశిరోగ్రీవః=పైకి ఎత్తబడిన శిరస్సు, కంఠమూ కలవాడై, గవాం పతిః ఇవ=ఆబోతు వలె, బభౌ=ప్రకాశించెను.

తా. మరెవ్వరూ చేయలేని పని చేయ సంకల్పించిన హనుమంతుడు, ఎట్టి అడ్డంకులూ లేనివాడై, మెడను చాచి, శిరస్సు పైకి ఎత్తి, ఆబోతు వలె ఉండెను.. 2

మూ. అథ వైడూర్యవర్ణేషు శాద్వలేషు మహాబలః,
ధీరః సలిలకల్పేషు విచచార యథాసుఖమ్. 3

ప్ర. అ. అథ=అటు పిమ్మట, మహాబలః=గొప్ప బలము గలవాడూ, ధీరః=ధైర్యశాలీ అయిన హనుమంతుడు, వైడూర్యవర్ణేషు=వైడూర్యమణుల వంటి రంగు గలవీ, సలిలకల్పేషు=జలముతో సమానములూ అయిన, శాద్వలేషు=పచ్చికబీళ్ళయందు, యథాసుఖమ్=సుఖము కలుగునట్లుగా, విచచార=సంచరించెను.

తా. పిమ్మట, మహాబలవంతుడూ, ధీరుడూ అయిన హనుమంతుడు వైడూర్యమణులవలె ఆకుపచ్చని వర్ణముతో దూరమునుండి చూచుటకు జలము వలె ఉన్న పచ్చికబీళ్ళపై, సుఖముగా కొంత సేపు, ఇటు అటు పచారుచేసెను.

మూ. ద్విజాన్ విత్రాసయన్ ధీమానురసా పాదపాన్ హరన్,
మృగాంశ్చ సుబాహూన్నిఘ్నన్ ప్రవృద్ధ ఇవ కేసరీ. 4

ప్ర. అ. ధీమాన్=బుద్ధిమంతుడైన హనుమంతుడు, ద్విజాన్=పక్షులను, విత్రాసయన్=భయపెట్టుచు, ఉరసా=వక్షస్థలముచేత, పాదపాన్=వృక్షములను, హరన్=హరించుచు, ప్రవృద్ధః=విజృంభించిన, కేసరీ ఇవ=సింహమువలె, సుబహూన్=అనేకమైన, మృగాంశ్చ=మృగములను కూడ, నిఘ్నన్=చంపుచు, సంచరించెను.

తా. ధీమంతుడైన ఆ హనుమంతుడు ఇటు నటు వేగముగా సంచరించినపుడు పక్షులన్నీ భయపడినవి. ఆతని వక్షస్థలము ఆఘాతమునకు చెట్లు కూలిపోయినవి. సింహము విజృంభించినట్లు ఆతడు విజృంభించుటతో అనేక మృగములు కూడా మరణించినవి. 4

మూ. నీలలోహితమాఞ్జిష్ఠపత్రవర్ణైః సితాసితైః,
స్వభావవిహితైశ్చిత్రైర్ధాతుభిః సమలంకృతమ్. 5
కామరూపిభిరావిష్టమభీక్ష్ణం సపరిచ్ఛదైః,
యక్షకిన్నరగన్ధర్వైర్దేవకల్పైశ్చ పన్నగైః. 6

ప్ర. అ. గిరితలమ్=ఆ మహేంద్రపర్వతము క్రింది ప్రాంతము (అధ్యాహృతము,) నీలలోహితమాఞ్జిష్ఠపత్రవర్ణైః=నీలము, ఎరుపు, పసుపు, ఆకువంటి ఆకుపచ్చరంగులుగలవీ, సితాసితైః=తెల్లగాను నల్లగాను ఉన్నవీ, స్వభావవిహితైః=సహ

జముగా ఏర్పడినవీ, చిత్రైః=నానావర్ణములు గలవీ అయిన, ధాతుభిః=ధాతువులచేత, సమలంకృతమ్=అలంకరింపబడినది. కామరూపిభిః=స్వేచ్ఛానుసారముగా రూపములను ధరించగలిగిన, సపరిచ్ఛదైః=పరివారములతో కూడిన, యక్షకిన్నరగన్ధర్వైః=యక్ష-కింనర-గంధర్వులతోను,అభీక్ష్ణమ్=మిక్కిలి, ఆవిష్టమ్=చుట్టువారుకొనబడినది.

తా. ఆ మహేంద్రపర్వతప్రాంతమంతా నలుపు, ఎరుపు, పసుపు, ఆకుపచ్చన మొదలైన చిత్రవర్ణములు గల సహజములైన ధాతువులతో అందముగా ఉండెను. అక్కడ కోరిన రూపములు ధరించగల యక్షులు, కింనరులు, గంధర్వులు, దేవతాతుల్యులైన పన్నగులు సపరివారముగా నివసించుచుండిరి.

మూ. స తస్య గిరివర్యస్య తలే నాగవరాయుతే,
తిష్ఠన్ కపివరస్తత్ర హ్రదే నాగ ఇవాబభౌ. 7

ప్ర. అ. సః=ఆ,కపివరః=వానరశ్రేష్ఠుడు, తత్ర=అక్కడ, నాగవరాయుతే=శ్రేష్ఠములైన ఏనుగులతో కూడిన, తస్య గిరివర్యస్య=ఆ పర్వత శ్రేష్ఠముయొక్క, తలే=క్రింది ప్రాంతమునందు, తిష్ఠన్=ఉన్నవాడై, హ్రదే=చెరువులో, నాగః ఇవ=ఏనుగు వలె, ఆబభౌ=ప్రకాశించెను.

తా. ఆ శ్రేష్ఠమైన పర్వతము క్రింది ప్రాంతమునందు అనేక ఉత్తమ గజములు నివసించుచున్నవి. అక్కడ ఉన్న హనుమంతుడు మహాహ్రదములో ఉన్న ఏనుగు వలె ప్రకాశించెను. 7

మూ. స సూర్యాయ మహేన్ద్రాయ పవనాయ స్వయంభువే,
భూతేభ్యశ్చాఞ్జలిం కృత్వా చకార గమనే మతిమ్. 8

ప్ర. అ. సః=అతడు, సూర్యాయ=సూర్యునకు, మహేన్ద్రాయ=మహేంద్రునకు, పవనాయ=వాయుదేవునకు, స్వయంభువే=బ్రహ్మదేవునకు, భూతేభ్యః చ=భూతములకు (భూతములు దేవయోనికి చెందినవారు), అఞ్జలిమ్=దోసిలిని, కృత్వా=చేసి, గమనే=వెళ్ళుటయందు, మతిమ్=బుద్ధిని, చకార=చేసెను.

తా. అతడు సూర్యునకు, మహేంద్రునకు, వాయుదేవునకు, బ్రహ్మదేవునకు, భూతములకు నమస్కరించి బయలుదేరుటకు నిశ్చయించుకొనెను. 8

మూ. అఞ్జలిం ప్రాఙ్ముఖః కృత్వా పవనాయాత్మయోనయే,
తతో హి వవృధే గన్తుం దక్షిణో దక్షిణాం దిశమ్. 9

ప్ర. అ. సమర్థు డైన హనుమంతుడు, ప్రాఙ్ముఖః=తూర్పు దిక్కుకు అభిముఖుడై, ఆత్మయోనయే=తనకు కారణభూతు డైన, పవనాయ=వాయుదేవునకు,

అఞ్జలిమ్=దోసిలిని, కృత్వా=చేసి, తతః=పిమ్మట, దక్షిణాం దిశమ్=దక్షిణదిక్కును గూర్చి, గన్తుమ్=వెళ్లుటకు, వవృధే హి=వృద్ధి పొందెను.

తా. మహాసామర్థ్యవంతుడైన హనుమంతుడు, తూర్పుగా తిరిగి, తన తండ్రి యైన వాయుదేవునకు నమస్కరించి, దక్షిణము దిక్కు వైపు వెళ్ళుటకై శరీరమును పెంచెను. 9

మూ. ప్లవఙ్గప్రవరైర్దృష్టః ప్లవనే కృతనిశ్చయః,
వవృధే రామవృద్ధ్యర్థం సముద్ర ఇవ పర్వసు. 10

ప్ర. అ. ప్లవఙ్గప్రవరైః=వానరశ్రేష్ఠులచేత, దృష్టః=చూడబడిన ఆ హనుమంతుడు, ప్లవనే=ఎగురుటయందు, కృతనిశ్చయః=చేయబడిన నిశ్చయము కలవాడై, పర్వసు=పూర్ణిమాపర్వములందు, సముద్రః ఇవ=సముద్రము వలె, రామవృద్ధ్యర్థమ్=రాముని అభివృద్ధికొరకై, వవృధే=వృద్ధి పొందెను.

తా. అక్కడ ఉన్న వానరులందరు హనుమంతుని వైపే చూచుచుండిరి. సముద్రము దాటుటకు నిశ్చయించుకొని ఆతడు పూర్ణిమాపర్వమునందు సముద్రము పెరిగినట్లు, రామునికి సాహాయ్యము చేయుటకై పెరిగెను. 10

మూ. నిష్ప్రమాణశరీరః సన్ లిలఙ్ఘయిషురర్ణవమ్,
బాహుభ్యాం పీడయామాస చరణాభ్యాం చ పర్వతమ్. 11

ప్ర. అ. అర్ణవమ్=సముద్రమును, లిలఙ్ఘయిషుః=లంఘింపగలచిన హనుమంతుడు, నిష్ప్రమాణశరీరః=ప్రమాణము లేని శరీరము కలవాడై, బాహుభ్యామ్=బాహువులతోను, చరణాభ్యాం చ=పాదములతోను, పర్వతమ్=పర్వతమును, పీడయామాస=పీడించెను.

తా. సముద్రమును దాటవలెనను నిశ్చయముతో హనుమంతుడు దేహమును కొలుచుటకు శక్యము కానంతగా, పెద్దగా పెంచి, చేతులతోను, పాదములతోను, పర్వతమును నొక్కిపెట్టెను. 11

మూ. స చచాలాచలశ్చాపి ముహూర్తం కపిపీడితః,
తరూణాం పుష్పితాగ్రాణాం సర్వం పుష్పమశాతయత్. 12

ప్ర. అ. కపిపీడితః=హనుమంతునిచే పీడింపబడిన, సః అచలశ్చాపి=ఆ పర్వతముకూడా, ముహూర్తమ్=క్షణకాలముపాటు, చచాల=చలించెను. పుష్పితాగ్రాణామ్=పుష్పించిన అగ్రభాగములు గల, తరూణామ్=వృక్షముల యొక్క, సర్వమ్=సమస్తమైన, పుష్పమ్=పుష్పమును, అశాతయత్=రాల్చెను.

తా. ఈ విధముగా హనుమంతుడు పీడింపగా ఆ పర్వతము ఒక్క క్షణము ఊగిపోయెను. పూసిన చెట్ల చివర ఉన్న పుష్పములన్నీ రాలిపోయెను.

మూ. తేన పాదపముక్తేన పుష్పౌఘేన సుగన్ధినా,
సర్వతః సంవృతః శైలో బభౌ పుష్పమయో యథా. 13

ప్ర. అ. శైలః=పర్వతము, పాదపముక్తేన=వృక్షములచేత విడువబడిన, సుగన్ధినా=మంచి గంధము గల, పుష్పౌఘేన=పుష్పముల సముదాయముచేత, సర్వతః=అంతటా, సంవృతః=కప్పబడినదై, పుష్పమయో యథా=పుష్పముల వికార మైనది వలె, బభౌ=ప్రకాశించెను.

తా. చెట్లనుండి రాలిన పరిమళించుచున్న ఆ పుష్పములన్నీ అంతటా కప్పివేయుటచే ఆ మహేంద్రపర్వతము పుష్పముల కొండ వలె ప్రకాశించెను.

మూ. తేన చోత్తమవీర్యేణ పీడ్యమానః స పర్వతః,
సలిలం సంప్రసుస్రావ మదం మత్త ఇవ ద్విపః. 14

ప్ర. అ. ఉత్తమవీర్యేణ=గొప్పపరాక్రమము గల, తేన=ఆతనిచేత, పీడ్యమానః=పీడింపబడుచున్నదై, సః పర్వతః=ఆ పర్వతము, మత్తః=మదించిన, ద్విపః=ఏనుగు, మదమ్ ఇవ=మదోదకమును వలె, సలిలమ్=ఉదకమును, సంప్రసుస్రావ=స్రవించెను.

తా. మహావీర్యవంతుడైన ఆ హనుమంతుడు పీడించుటచే ఆ పర్వతము మదించిన ఏనుగు మదోదకమును కార్చినట్లు, జలమును స్రవించెను. 14

మూ. పీడ్యమానస్తు బలినా మహేన్ద్రస్తేన పర్వతః,
రీతీర్నిర్వర్తయామాస కాఞ్చనాఞ్జనరాజతీః. 15

ప్ర. అ. బలినా=బలవంతుడైన, తేన=ఆతనిచేత, పీడ్యమానః=పీడింపబడిన, మహేన్ద్రః పర్వతః=మహేంద్రపర్వతము, కాఞ్చనాఞ్జనరాజతీః=బంగారమునకు, కాటుకకు, వెండికి సంబంధించిన, రీతీః=రేఖలను, నిర్వర్తయామాస=కలుగు నట్లు చేసెను.

తా. బలవంతు డైన హనుమంతుడు పీడించుటచే, మహేంద్రపర్వతము పైన ఉన్న బంగారు శిలలు, నీలవర్ణము గల శిలలు, వెండి శిలలు నలిగి దానిపై అక్కడక్కడ, బంగారు గీతలు, నీలిరంగు గీతలు, వెండిరంగు గీతలు ఏర్పడినవి. 15

మూ. ముమోచ చ శిలాః శైలో విశాలాః సమనఃశిలాః,
మధ్యమేనార్చిషా జుష్టో ధూమరాజీరివానలః. 16

ప్ర. అ. శైలః=పర్వతము, మధ్యమేన=మధ్యమమైన, అర్చిషా=జ్వాలతో, జుష్టః=కూడిన, అనలః=అగ్ని, ధూమరాజీరివ=ధూమపంక్తులనువలె, సమనఃశిలాః= మణిశిలతో కూడిన, విశాలాః=విశాలములైన, శిలాః=శిలలను, ముమోచ చ=విడచెను కూడ.

తా. మధ్యమజ్వాలతో కూడిన అగ్ని నుండి ధూమము బయలుదేరి నట్లు, ఆ పర్వతమునుండి, మణిశిలతో కూడిన రాళ్ళు బయల్వెడలెను.

వి. అగ్నిజ్వాలలు-కాళీ, కరాళీ, విస్ఫులింగినీ, ధూమ్రవర్ణా, విశ్వరుచి, లోహితా, మనోజవా అని ఏడు ఉండును. వాటిలో మధ్యమజ్వాల ధూమ్రవర్ణ, దానినుండి ధూమము బయలుదేరును. 16

మూ. గిరిణా పీడ్యమానేన పీడ్యమానాని సర్వశః,
గుహావిష్టాని భూతాని వినేదుర్వికృతైః స్వరైః. 17

ప్ర. అ. గుహావిష్టాని=గుహలలో ప్రవేశించి ఉన్న, భూతాని=ప్రాణులు, పీడ్యమానేన=పీడింపబడుచున్న, గిరిణా=పర్వతముచేత, సర్వశః=అన్ని వైపులనుండి, పీడ్యమానాని=పీడింపబడుచున్నవై, వికృతైః=వికృతములైన, స్వరైః=స్వరములతో, వినేదుః=ధ్వనిచేసినవి.

తా. పర్వతము పీడింపబడినపుడు ఆ పర్వతము గుహలలో నివసించు ప్రాణులు అన్ని వైపులా నలిగిపోవుచు, వికృతమైన స్వరములతో అరచినవి. 17

మూ. స మహాసత్త్వసంనాదః శైలపీడానిమిత్తజః,
పృథివీం పూరయామాస దిశశ్చోపవనాని చ. 18

ప్ర. అ. శైలపీడానిమిత్తజః=శైలముయొక్క పీడ అను నిమిత్తము వలన కలిగిన, సః=ఆ, మహాసత్త్వసంనాదః=పెద్ద పెద్ద ప్రాణుల ధ్వని, పృథివీమ్= భూమినీ, దిశశ్చ=దిక్కులనూ, ఉపవనాని చ=సమీపమునందున్న అడవులను, పూరయామాస=పూరించెను.

తా. పెద్ద పెద్ద ప్రాణులు పర్వతము నలిగిపోవుటచే చేసిన ఆ ధ్వని భూమినీ, దిక్కులనూ, సమీపమునందున్న అడవులనూ ప్రతిధ్వనింపచేసెను. 18

మూ. శిరోభిః పృథుభిః సర్పా వ్యక్తస్వస్తికలక్షణైః,
వమన్తః పావకం ఘోరం దదంశుర్దశనైః శిలాః. 19

ప్ర. అ. సర్పాః=సర్పములు, వ్యక్తస్వస్తికలక్షణైః=పడగలు విప్పటచే స్పష్టముగా కనబడుచున్న స్వస్తికాకారము గల గుర్తులు గల, పృథుభిః=పెద్దవైన, శిరోభిః=శిరస్సులతో, ఘోరమ్=భయంకరమైన, పావకమ్=అగ్నిని, వమన్తః=కక్కుచున్నవై, దశనైః=దంతములతో, శిలాః=శిలలను, దదంశుః=కరచినవి.

తా. మహాసర్పములు, పడగలు విప్పటచే వాటిపై స్వస్తికాకారములో ఉన్న నల్లని చిహ్నములు స్పష్టముగా కనబడుచున్న పెద్ద పెద్ద తలలనుండి భయంకరమైన విషము కక్కుచు, దంతములతో శిలలను కరచెను. 19

మూ. తాస్తదా సవిషైర్దష్టాః కుపితైస్తైర్మహాశిలాః,
జజ్వలుః పావకోద్దీప్తా బిభిదుశ్చ సహస్రధా. 20

ప్ర. అ. తదా=అప్పుడు, సవిషైః=విషముతో కూడిన, కుపితైః=కోపగించిన, తైః=ఆ సర్పములచేత, దష్టాః=కరవబడిన, తాః మహాశిలాః=ఆ పెద్ద శిలలు, పావకోద్దీప్తాః=అగ్ని చేత ప్రజ్వలింపచేయబడినవై, జజ్వలుః=తగులబడినవి. సహస్రధా=వేయి ముక్కలుగా, బిభిదుశ్చ=బ్రద్దలైపోయినవి.

తా. తీవ్రమైన విషము గల ఆ మహాసర్పములు కరచుటచే, పెద్ద పెద్ద శిలలు అగ్నిజ్వాలలచే దగ్ధములై, వేయి ముక్కలుగా బ్రద్దలై పోయినవి. 20

మూ. యాని చౌషధజాలాని తస్మిన్ జాతాని పర్వతే,
విషఘ్నాన్యపి నాగానాం న శేకుః శమితుం విషమ్. 21

ప్ర. అ. తస్మిన్ పర్వతే=ఆ పర్వతమునందు, జాతాని=పుట్టిన, యాని=ఏ, ఔషధజాలాని=ఔషధసమూహములున్నవో, అవి, విషఘ్నాన్యపి=విషమును నశింపచేయునవైనను, నాగానామ్=సర్పముల, విషమ్=విషమును, శమితుమ్=శమింపచేయుటకు, న శేకుః=సమర్థములు కాలేదు.

తా. ఆ పర్వతముమీద విషసంహారకములైన ఔషధులెన్ని ఉన్నను అవి ఆ సర్పముల విషమును శాంతింపచేయలేకపోయెను. 21

మూ. భిద్యతేఽయం గిరిర్భూతైరితి మత్వా తపస్వినః,
త్రస్తా విద్యాధరాస్తస్మాదుత్పేతుః స్త్రీగణైః సహ. 22
పానభూమిగతం హిత్వా హైమమాసవభాజనమ్,
పాత్రాణి చ మహార్హాణి కరకాంశ్చ హిరణ్మయాన్. 23
లేహ్యానుచ్చావచాన్ భక్ష్యాన్ మాంసాని వివిధాని చ,
ఆర్షభాణి చ చర్మాణి ఖడ్గాంశ్చ కనకత్సరూన్. 24

ప్ర. అ. అయమ్=ఈ, గిరిః=పర్వతము, భూతైః=భూతములచేత, భిద్యతే=బ్రద్దలు కొట్టబడుచున్నది, ఇతి=అని, మత్వా=తలచి, తపస్వినః=మునులు, ఉత్పేతుః=పైకి ఎగిరి వెళ్ళిపోయిరి. విద్యాధరాః=విద్యాధరులు, త్రస్తాః=భయపడినవారై, పానభూమిగతమ్=పానభూమిలో ఉన్న, హైమమ్= బంగారువికారమైన, ఆసవభాజనమ్=మద్యపాత్రను, మహార్హాణి=బంగారువికార మైన, కరకాంశ్చ=పాడవైన చిన్న పాత్రలను, ఉచ్చావచాన్=అనేకవిధము లైన, లేహ్యాన్=నాలుకతో నాకి తినవలసిన పదార్థములను, భక్ష్యాన్=భక్షించవలసిన పదార్థములను, వివిధాని=అనేక విధము లైన, మాంసాని=మాంసములను, ఆర్షభాణి=వృషభములకు సంబంధించిన, చర్మాణి=చర్మలను, కనకత్సరూన్=బంగారు ఒరలు గల,ఖడ్గాంశ్చ=ఖడ్గములను, హిత్వా=విడచి, స్త్రీగణైః సహ=స్త్రీసముదాయములతో కూడ, తస్మాత్=ఆ పర్వతము నుండి, ఉత్పేతుః=ఎగిరిపోయిరి.

తా. ఏవో భూతాలు ఈ పర్వతమును బ్రద్దలుకొట్టి వేయుచున్న వని అనుకొని మునులందరు పైకి ఎగిరి వెళ్ళిపోయిరి. అంతవరకు అక్కడ పానగోష్ఠలలో ఉన్న విద్యాధరులు భయపడి, మద్యముతో నిండిన బంగారు పెద్ద పాత్రనూ, అమూల్యము లైన (మద్యము వడ్డించు) పాత్రలను, (మద్యము త్రాగు) పొడవైన బంగారు చిన్న పాత్రలను, అనేకవిధము లైన లేహ్యములను, భక్ష్యములను, అనేకవిధము లైన మాంసములను, నేలపై పరచుకొనిన ఎద్దుల చర్మలను, బంగారు ఒరలలో ఉన్న ఖడ్గములను అక్కడనే విడిచివేసి, తమ తమ ప్రేయసులతో కూడ ఆ పర్వతమును విడచి, పైకి ఎగిరిపోయిరి.22-24

మూ. కృతకణ్ఠగుణాః క్షీబా రక్తమాల్యానులేపనాః,
రక్తాక్షాః పుష్కరాక్షాశ్చ గగనం ప్రతిపేదిరే. 25

ప్ర. అ. కృతకణ్ఠగుణాః=చేయబడిన (ధరింపబడిన) కంఠసూత్రములు కలవారు, క్షీబాః=మద్యపానముచేత మదించినవారు, రక్తమాల్యానులేపనాః=ఎఱ్ఱని పుష్పమాలలూ, మైపూతలు కలవారు, రక్తాక్షాః=ఎఱ్ఱని నేత్రములు కలవారు, పుష్పరాక్షాశ్చ=పద్మములవంటి నేత్రములు కలవారు అయిన ఆ విద్యాధరులు, గగనమ్=ఆకాశమును, ప్రతిపేదిరే=పొందిరి.

తా. కంఠములలో బంగారు త్రాళ్ళూ, శిరస్సులపై ఎఱ్ఱని పుష్పమాలలూ ధరించి, శరీరములకు ఎఱ్ఱని అనులేపనములను పూసుకొని, మద్యపానముచే మత్తెక్కి ఉన్న ఆ విద్యాధరులలో కొందరికళ్లు చాల ఎఱ్ఱగా ఉండెను. కొందరి కళ్లు పద్మముల (రేకుల) వలె ఉండెను. 25

మూ. హారనూపురకేయూరపారిహార్యధరాః స్త్రియః,
విస్మితాః సస్మితాస్తస్థురాకాశే రమణైః సహ. 26

ప్ర. అ. హారనూపుర కేయూరపారిహార్యధరాః=హారములు, అందెలు, బాహుపురులు, కంకణములు ధరించిన, స్త్రియః=స్త్రీలు, విస్మితాః=ఆశ్చర్యపడుచున్న వారై, సస్మితాః=చిరునగవుతో కూడినవారై, రమణైః సహ=ప్రియులతో కూడ, ఆకాశమునందు, తస్థుః=నిలచిరి.

తా. హారములు, నూపురములు, బాహుపురులు, కంకణములు ధరించిన విద్యాధరస్త్రీలు, ఆశ్చర్యపడుచు, తమప్రియులతో కూడ, చిరునవ్వు నవ్వుచు, ఆకాశములో నిలచిరి. 26

మూ. దర్శయన్తో మహావిద్యాం విద్యాధరమహర్షయః,
సహితాస్తస్థురాకాశే వీక్షాఞ్చక్రుశ్చ పర్వతమ్. 27

ప్ర. అ. విద్యాధరమహర్షయః=విద్యాధరులు, మహర్షులు, మహావిద్యామ్=గొప్ప శక్తిని, దర్శయన్తః=ప్రదర్శించుచు, సహితాః=గుమిగూడినవారై, ఆకాశే=ఆకాశమునందు, తస్థుః=నిలచిరి. పర్వతమ్=పర్వతమును, వీక్షాంచక్రుశ్చ=చూచిరి కూడ.

తా. అణిమాద్యష్టసిద్ధులు గల విద్యాధరులు, మహర్షులు, ఆధారము లేకుండ ఆకాశమునందు నిలువగల తమ మహావిద్యను ప్రదర్శించుచు, గుమిగూడి ఆకాశములో నిలచి, పర్వతమును చూచిరి. 27

మూ. శుశ్రువుశ్చ తదా శబ్దమృషీణాం భావితాత్మనామ్,
చారణానాం చ సిద్ధానాం స్థితానాం విమలేఽమ్బరే. 28

ప్ర. అ. తదా=అప్పుడు, విమలే=స్వచ్ఛమైన, అమ్బరే=ఆకాశము నందు, స్థితానామ్=ఉన్న, చారణానామ్=చారణులయొక్క, సిద్ధానామ్=సిద్ధులయొక్క, భావితాత్మనామ్=పరిశుద్ధము చేయబడిన మనస్సులు గల, ఋషీణాం చ=ఋషులయొక్క, శబ్దమ్=మాటను, శుశ్రువుః=వినిరి.

తా. ఇంతలో వారికి, నిర్మల మైన ఆకాశమునందు నిలచి ఉన్న చారణులు, సిద్ధులు, పవిత్రమైన మనస్సుగల ఋషులు పలికిన మాటలు వినబడినవి. 28

మూ. ఏష పర్వతసంకాశో హనూమాన్ మారుతాత్మజః,
తితీర్షతి మహావేగః సముద్రం మకరాలయమ్. 29

ప్ర. అ. పర్వతసంకాశః=పర్వతముతో సమానుడు, మారుతాత్మజః= వాయుదేవుని కుమారుడు, మహావేగః=గొప్ప వేగము గలవాడూ అయిన, ఏషః=ఈ, హనూమాన్=హనుమంతుడు, మకరాలయమ్=మొసళ్ళకు స్థానమైన, సముద్రమ్=సముద్రమును, తితీర్షతి=దాటదలచుచున్నాడు.

తా. పర్వతముతో సమానమైనవాడూ, మహావేగవంతుడూ వాయుపుత్రుడూ అయిన ఈ హనుమంతుడు మకరములకు నివాసమైన సముద్రమును దాటదలచుచున్నాడు. 29

మూ. రామార్థం వానరార్థం చ చికీర్షన్ కర్మ దుష్కరమ్,
సముద్రస్య పరం పారం దుష్ప్రాపం ప్రాప్తుమిచ్ఛతి. 30

ప్ర. అ. రామార్థమ్=రామునికొరకు, వానరార్థం చ=వానరులకొరకూ, దుష్కరమ్=చేయ శక్యము కాని, కర్మ=పనిని, చికీర్షన్=చేయనిచ్ఛయించుచున్నవాడై, సముద్రముయొక్క, దుష్ప్రాపమ్=పొంద శక్యము కాని, పరం పారమ్=అవతలి ఒడ్డును, ప్రాప్తుమ్=పొందుటకు, ఇచ్ఛతి=కోరుచున్నాడు.

తా. ఇతడు రామునికొరకూ, వానరులకొరకూ, ఇతరులెవ్వరు చేయజాలని పని చేయ సంకల్పించి, చేరుటకు శక్యము కాని సముద్రము ఆవలి ఒడ్డు చేరుటకై కోరుచున్నాడు. 30

మూ. ఇతి విద్యాధరాః శ్రుత్వా వచస్తేషాం మహాత్మనామ్,
తమప్రమేయం దదృశుః పర్వతే వానరర్షభమ్. 31

ప్ర. అ. విద్యాధరాః=విద్యాధరులు, ఇతి=ఇట్లు, మహాత్మనామ్=మహాత్ములైన, తేషామ్=వారియొక్క, వచః=వాక్యమును, శ్రుత్వా=విని, పర్వతే=పర్వతమునందు, అప్రమేయమ్=పోల్చుటకు శక్యముకాని, వానరర్షభమ్=వానర శ్రేష్ఠుడైన తమ్=ఆ హనుమంతుని, దదృశుః=చూచిరి.

తా. విద్యాధరులు, మహాత్ములైన వారందరు పలుకుచున్న ఈ మాటలు విని, అ పర్వతముమీద నిలచి యున్న, సాటిలేని ఆకారము గల, వానరశ్రేష్ఠుడైన ఆ హనుమంతుని చూచిరి. 31

మూ. దుధువే చ స రోమాణి చకమ్పే చాచలోపమః,
ననాద సుమహానాదం సుమహానివ తోయదః. 32

ప్ర. అ. అచలోపమః=పర్వతముతో సమానుడైన, సః=అతడు, రోమాణి= రోమములను, దుధువే చ=దులిపెను. చకమ్పే చ=కంపించెను కూడ.

సుమహాన్=చాల పెద్దదైన, తోయదః ఇవ=మేఘము వలె, సుమహానాదమ్=చాల పెద్ద ధ్వని కలుగునట్లుగా, ననాద=ధ్వనిచేసెను.

తా. పర్వతము వంటి శరీరము గల ఆ హనుమంతుడు, ఒక్కమారు కదలి రోమములను దులుపుకొనెను. మహామేఘము వలె గర్జించెను. 32

మూ. ఆనుపూర్వ్యేణ వృత్తం చ లాఙ్గూలం లోమభిశ్చితమ్,
ఉత్పతిష్యన్ విచిక్షేప పక్షిరాజ ఇవోరగమ్. 33

ప్ర. అ. ఉత్పతిష్యన్=ఎగురబోవుచున్న ఆ హనుమంతుడు, ఆనుపూర్వ్యేణ=పైనుండి క్రిందికి ఒక క్రమముతో, వృత్తమ్=వర్తులముగా ఉన్నదీ, లోమభిః=రోమములతో, చితమ్=నిండినదీ అయిన, లాఙ్గూలమ్=తోకను, పక్షిరాజః=గరుత్మంతుడు, ఉరగం యథా=సర్పమును వలె, విచిక్షేప=విసరెను.

తా. ఇంక పైకి ఎగురబోవుచున్న ఆ హనుమంతుడు, మొదట్లో లావుగాను, చివరికి పోయిన కొలది సన్నముగాను ఉన్నదీ, రోమములతో నిండినదీ, అయిన తోకను, గరుత్మంతుడు సర్పమును పట్టి జాళించి నట్లు జాళించెను. 33

మూ. తస్య లాఙ్గూలమావిద్ధమాత్తవేగస్య పృష్ఠతః,
దదృశే గరుడేనేవ హ్రియమాణో మహోరగః. 34

ప్ర. అ. ఆత్తవేగస్య=గ్రహింపబడిన వేగము గల, తస్య=అతని యొక్క, పృష్ఠతః=వెనుకభాగమునందు, ఆవిద్ధమ్=తగుల్కొని ఉన్న, లాఙ్గూలమ్=తోక, గరుడేన=గరుత్మంతునిచేత, హ్రియమాణః=హరింపబడుచున్న, మహోరగః ఇవ=మహాసర్పము వలె, దదృశే=చూడబడెను.

తా. వేగము పుంజుకొననున్న ఆ హనుమంతుని వీపుమీద నిట్టనిలువుగా నిలచి ఉన్న తోక, గరుత్మంతుడు పట్టి తీసికొనిపోవుచున్న సర్పము వలె కనబడెను. 34

మూ. బాహూ సంస్తంభయామాస మహాపరిఘసంనిభౌ,
ససాద చ కపిః కట్యాం చరణౌ సంచుకోచ చ. 35

ప్ర. అ. కపిః=హనుమంతుడు, మహాపరిఘసన్నిభౌ=గొప్ప పరిఘలతో (కోట గడియలతో) సమానములైన, బాహూ=బాహువులను, సంస్తమ్భయామాస=బిగియ పట్టెను. కట్యామ్=కటిప్రదేశమునందు, ససాద=సన్నగిలెను. చరణౌ=పాదములను, సంచుకోచ చ=మడచెను.

తా. హనుమంతుడు పెద్ద పరిఘ వలె ఉన్న బాహువులు బిగియపట్టి నడుము సన్నము చేసి, పాదములు ఎగురుటకు సిద్ధముగా మడిచెను. 35

మూ. సంహృత్య చ భుజౌ శ్రీమాంస్తథైవ చ శిరోధరామ్,
తేజః సత్త్వం తథా వీర్యమావివేశ స వీర్యవాన్. 36

ప్ర. అ. శ్రీమాన్=శోభాయుక్తుడు, వీర్యవాన్=పరాక్రమవంతుడు అయిన, సః=హనుమంతుడు, భుజౌ చ=భుజములను, తథైవ చ=మరియు, శిరోధరామ్=కంఠమునూ, సంహృత్య=వంచి, తేజః=తేజస్సును, సత్త్వమ్=బలమును, తథా=మరియు, వీర్యమ్=పరాక్రమమునూ, ఆవివేశ=పెంచుకొనెను.

తా. అద్భుత మైన శోభ, పరాక్రమము గల హనుమంతుడు, భుజములను, కంఠమును వంచి, తేజస్సును, బలమును, వీర్యమును పెంచుకొనెను. 36

మూ. మార్గమాలోకయన్దూరాదూర్ధ్వం ప్రణిహితేక్షణః,
రురోధ హృదయే ప్రాణానాకాశమవలోకయన్. 37

ప్ర. అ. ఊర్ధ్వమ్=పైకి, ప్రణిహితేక్షణః=ఉంచబడిన నేత్రములు కలవాడై, దూరాత్=దూరమునుండి, మార్గమ్=మార్గమును, ఆలోకయన్=చూచుచు, ఆకాశమ్=ఆకాశమును, అవలోకయన్=చూచుచు, ప్రాణాన్=ప్రాణములను హృదయే=హృదయమునందు, రురోధ=నిలిపెను.

తా. నేత్రములను పైకి ఎత్తి దూరముగా నున్న, తాను వెళ్ళవలసిన మార్గము చూచుచు ఆకాశము వైపు కూడ చూచుచు, ఊపిరి బిగపట్టెను. 37

మూ. పద్భ్యాం దృఢమవస్థానం కృత్వా స కపికుఞ్జరః,
నికుఞ్చ్య కర్ణౌ హనుమానుత్పతిష్యన్ మహాబలః,
వానరాన్ వానరశ్రేష్ఠ ఇదం వచనమబ్రవీత్. 38

ప్ర. అ. కపికుఞ్జరః=వానరులలో గజము వంటివాడూ, మహాబలః=గొప్ప బలము కలవాడూ, వానరశ్రేష్ఠః=వానరులలో శ్రేష్ఠుడూ అయిన, సః హనుమాన్=ఆ హనుమంతుడు, పద్భ్యామ్=పాదములతో, దృఢమ్= దృఢముగా, అవస్థానమ్=నిలచుటను, కృత్వా=చేసి, కర్ణౌ=చెవులను, నికుఞ్చ్య=వంచి, ఉత్పతిష్యన్=పైకి ఎగురనున్న వాడై, వానరాన్=వానరులను గూర్చి, ఇదమ్=ఈ, వచనమ్=వచనమును, అబ్రవీత్=పలికెను.

తా. వానరుల మధ్య గజము వంటివాడూ, మహాబలశాలీ, వానరశ్రేష్ఠుడూ అయిన ఆ హనుమంతుడు పాదములు గట్టిగా ఆనుకొని నిలచి, చెవులు వంచి పైకి ఎగురుటకు సిద్ధముగా ఉండి, వానరులతో ఇట్లు పలికెను. 38

మూ. యథా రాఘవనిర్ముక్తః శరః శ్వసనవిక్రమః,
గచ్ఛేత్తద్వద్గమిష్యామి లఙ్కాం రావణపాలితామ్. 39

ప్ర. అ. రాఘవనిర్ముక్తః=రామునిచేత విడువబడిన, శరః=బాణము, యథా=ఎట్లు, గచ్ఛేత్=వెళ్ళునో అట్లు, శ్వసనవిక్రమః=వాయువు వంటి వేగము కలవాడనై, రావణపాలితామ్=రావణునిచేత పాలింపబడిన, లఙ్కామ్=లంకను గూర్చి, గమిష్యామి=వెళ్ళగలను.

తా. రాముడు విడచిన బాణము వలె, నేను వాయువేగముతో రావణుడు పాలించుచున్న లంకకు వెళ్ళెదను. 39

మూ. న హి ద్రక్ష్యామి యది తాం లఙ్కాయాం జనకాత్మజామ్,
అనేనైవ హి వేగేన గమిష్యామి సురాలయమ్. 40

ప్ర. అ. లఙ్కాయామ్=లంకలో, తాం జనకాత్మజామ్=ఆ సీతను, న హి ద్రక్ష్యామి యది=(నేను) చూడజాలకపోయినట్లైతే, అనేన=ఈ, వేగేనైవ హి=వేగముతోనే, సురాలయమ్=ఇంద్రలోకమును గూర్చి, గమిష్యామి=వెళ్లగలను.

తా. లంకలో సీత కనబడకపోయినచో, ఈ వేగముతోనే స్వర్గలోకమునకు కూడ వెళ్ళెదను. 40

మూ. యది వా త్రిదివే సీతాం న ద్రక్ష్యామ్యకృతశ్రమః,
బద్ధ్వా రాక్షసరాజానమానయిష్యామి రావణమ్. 41

ప్ర. అ. త్రిదివే=స్వర్గమునందు, సీతామ్=సీతను, న ద్రక్ష్యామి యది వా=చూడజాలక పోయినచో, అకృతశ్రమః=చేయబడని శ్రమకలవాడనై, రాక్షసరాజానమ్=రాక్షసరాజైన, రావణమ్=రావణుని, బద్ధ్వా=బంధించి, ఆనయిష్యామి=తీసికొనివచ్చెదను.

తా. స్వర్గలోకములో కూడ నాకు సీత కనబడక పోయినచో ఏ మాత్రము శ్రమ చెందక, రావణుని బంధించి తీసికొని వచ్చెదను. 41

మూ. సర్వథా కృతకార్యోఽహమేష్యామి సహ సీతయా,
ఆనయిష్యామి వా లఙ్కాం సముత్పాట్య సరావణామ్. 42

ప్ర. అ. అహమ్=నేను, సర్వథా=అన్నివిధముల, కృతకార్యః=చేయబడిన కార్యము కలవాడనై, సహ సీతయా=సీతతో కూడ, ఏష్యామి=రాగలను. వా=లేక, సరావణామ్=రావణునితో కూడిన, లఙ్కామ్=లంకను, సముత్పాట్య=పెకలించి, ఆనయిష్యామి=తీసికొనిరాగలను.

తా. నేను అన్ని విధములా కార్యము సాధించి, సీతతో తిరిగి వచ్చెదను. లేదా రావణునితో సహా లంకను పెకలించుకొని తీసికొని వచ్చెదను. 42

మూ. ఏవముక్త్వా తు హనుమాన్వానరాన్వానరోత్తమః, 43
ఉత్పపాతాథ వేగేన వేగవానవిచారయన్,
సుపర్ణమివ చాత్మానం మేనే స కపికుఞ్జరః. 44

ప్ర. అ. వానరోత్తమః=వానరులలో శ్రేష్ఠుడైన, హనుమాన్=హనుమంతుడు, వానరాన్=వానరులను గూర్చి, ఏవమ్=ఇట్లు, ఉక్త్వా=పలికి, అథ=అటుపిమ్మట, అవిచారయన్=మరి యొక్క విషయమేమీ విచారించని వాడై, వేగవాన్=మహావేగవంతుడై, వేగేన=వేగముతో, ఉత్పపాత=పైకి ఎగిరెను. సః=ఆ, కపికుఞ్జరః=వానరశ్రేష్ఠుడు, ఆత్మానమ్=తనను, సుపర్ణమివ=గరుత్మంతుని వలె, మేనే చ=తలచెను కూడ.

తా. వానరులలో శ్రేష్ఠుడూ, మహావేగవంతుడూ అయిన హనుమంతుడు ఆ వానరులతో ఇట్లు పలికి, ఇతరమైన ఆలోచనలన్నీ, విడచి, వేగముతో పైకి ఎగిరెను. ఆ సమయమునందు ఆ వానరశ్రేష్ఠుడు తాను సాక్షాత్తు గరుత్మంతుని వంటి వాడనని భావించెను. 43, 44

మూ. సముత్పతతి తస్మింస్తు వేగాత్తే నగరోహిణః,
సంహృత్య విటపాన్ సర్వాన్ సముత్పేతుః సమన్తతః.

ప్ర. అ. తస్మిన్=అతడు, సముత్పతతి=ఎగురుచుండగా, వేగాత్=అ వేగమువలన, తే=ఆ, నగరోహిణః=పర్వతముపై మొలచిన వృక్షములు, సర్వాన్=సమస్తమైన, విటపాన్=కొమ్మలను, సంహృత్య=దగ్గరగా ముడుచుకొని, సమన్తతః=నలు వైపులందు, సముత్పేతుః=ఎగిరినవి.

తా. హనుమంతుడు ఎగురగానే, ఆ వేగమునకు, అక్కడ ఉన్న వృక్షములన్నీ తమ కొమ్మలు ముడిచిపెట్టుకొని, నలువైపుల పైకి ఎగిరి పోయినవి.45

మూ. స మత్తకోయష్టిభకాన్ పాదపాన్ పుష్పశాలినః,
ఉద్వహన్నూరువేగేన జగామ విమలేఽమ్బరే. 46

ప్ర. అ. సః=అతడు, మత్తకోయష్టిభకాన్=మదించిన చీకుకొక్కెర పక్షులు గల, పుష్పశాలినః=పుష్పములతో ప్రకాశించుచున్న, పాదపాన్=వృక్షములను, ఊరువేగేన=ఊరువుల వేగముచేత, ఉద్వహన్=ఎగురుగొట్టి తీసికొని పోవుచు, విమలే=నిర్మలమైన, అమ్బరే=ఆకాశమునందు, జగామ=వెళ్లెను.

తా. మదించిన చీకుకొాక్కొర లను పక్షులు నివసించుచున్న, పుష్పములతో నిండిన వృక్షములను తన తొడల వేగముచేత పెకలించి తనతో ఎగురు నట్లు చేయుచు, హనుమంతుడు నిర్మలమైన ఆకాశములో ఎగిరెను. 46

మూ. ఊరువేగోత్థితా వృక్షా ముహూర్తం కపిమన్వయుః,
ప్రస్థితం దీర్ఘమధ్వానం స్వబన్ధుమివ బాన్ధవాః. 47

ప్ర. అ. ఊరువేగోత్థితాః=తొడల వేగముచేత పైకి లేచిపోయిన, వృక్షాః=వృక్షములు, దీర్ఘమ్=దీర్ఘమైన, అధ్వానమ్=మార్గమును, ప్రస్థితమ్=ప్రయాణమైన, స్వబన్ధుమ్=తమ బంధువును, బాన్ధవాః ఇవ=బంధువులువలె, కపిమ్=హనుమంతుని, ముహూర్తమ్=కొంచెము కాలము, అన్వయుః=అనుసరించి వెళ్ళినవి.

తా. తొడల వేగానికి లేచిపోయిన చెట్లు, దూరదేశప్రయాణమునకై బయులు దేరి వెళ్ళుచున్న తమ బంధువును, బంధువులందరు వెంబడించి వెళ్లినట్లు, ఆ హనుమంతుని, కొంచెము సేపు వెంబడించి వెళ్ళినవి. 47

మూ. తమూరువేగోన్మథితాః సాలాశ్చాన్యే నగోత్తమాః,
అనుజగ్ముర్హనూమన్తం సైన్యా ఇవ మహీపతిమ్. 48

ప్ర. అ. ఊరువేగోన్మథితాః=తొడల వేగముచేత పెకలించబడిన, సాలాశ్చ=మద్దిచెట్లు, అన్యే=ఇతర మైన, నగోత్తమాః=మహావృక్షములూ, సైన్యాః=సైన్యములు, మహీపతిమ్ ఇవ=రాజును వలె, హనూమన్తమ్=హనుమంతుని, అనుజగ్ముః=అనుసరించి వెళ్ళినవి.

తా. తొడల వేగముచేత పెకలించివేయుబడిన సాలవృక్షములూ, ఇతర మహావృక్షములూ, సైన్యములు రాజు వెనుక వెళ్ళినట్లు, హనుమంతుని వెనుక వెళ్ళినవి. 48

మూ. సుపుష్పితాగ్రైర్బహుభిః పాదపైరన్వితః కపిః,
హనుమాన్ పర్వతాకారో బభూవాద్భుతదర్శనః. 49

ప్ర. అ. సుపుష్పితాగ్రైః=బాగుగా పుష్పించిన శిఖరములు గల, పాదపైః=వృక్షములతో, అన్వితః=కూడిన, కపిః=వానరుడైన, పర్వతాకారః=పర్వతమువంటి ఆకారము గల, హనుమాన్=హనుమంతుడు, అద్భుతదర్శనః=ఆశ్చర్యకరమైన దర్శనముకలవాడు, బభూవ=ఆయెను.

తా. పర్వతము వంటి ఆకారము గల హనుమంతుని చుట్టూ బాగుగా పుష్పించిన అనేక వృక్షములు చేరుటచే అతడు చూచువారికి చాలా ఆశ్చర్యము కలిగించెను. 49

మూ. సారవన్తోఽథ యే వృక్షా న్యమజ్జన్ లవణామ్భసి,
భయాదివ మహేన్ద్రస్య పర్వతా వరుణాలయే. 50

ప్ర. అ. అథ=పిమ్మట, సారవన్తః=సారముగల, యే=ఏ, వృక్షాః=వృక్షములున్నవో, అవి, మహేన్ద్రస్య=మహేంద్రునియొక్క, భయాత్=భయమువలన, పర్వతాః=పర్వతములు, వరుణాలయే ఇవ=సముద్రమునందు వలె, లవణామ్భసి=లవణసముద్రమునందు, న్యమజ్జన్=మునిగి పోయినవి.

తా. మహేంద్రునికి భయపడి పర్వతములు సముద్రములో మునిగినట్లుగా, బలమైన వృక్షములు లవణసముద్రములో మునిగిపోయినవి. 50

మూ. స నానాకుసుమైః కీర్ణః కపిః సాఙ్కురకోరకైః,
శుశుభే మేఘసంకాశః ఖద్యోతైరివ పర్వతః. 51

ప్ర. అ. సాఙ్కురకోరకైః=అంకురములతోను మొగ్గలతోను కూడిన, నానాకుసుమైః=అనేకవిధములైన పుష్పములచే, కీర్ణః=వ్యాపింపబడిన, మేఘసంకాశః=మేఘముతో సమానుడైన, సః కపిః=ఆ హనుమంతుడు, ఖద్యోతైః=మినుగురుపురుగులతో నిండిన, పర్వతః ఇవ=పర్వతము వలె, శుశుభే=ప్రకాశించెను.

తా. మేఘము వలె ఉన్న ఆ హనుమంతుని మీద అనేకవిధములైన పుష్పములు, అంకురములు, మొగ్గలు పడుటచే అతడు అంతట మినుగురు పురుగులు కప్పివేసిన పర్వతము వలె ప్రకాశించెను. 51

మూ. విముక్తాస్తస్య వేగేన ముక్త్వా పుష్పాణి తే ద్రుమాః,
అవశీర్యన్త సలిలే నివృత్తాః సుహృదో యథా. 52

ప్ర. అ. తస్య=హనుమంతుని యొక్క, వేగేన=వేగముచేత, విముక్తాః=విడవబడిన, తే ద్రుమాః=ఆ వృక్షములు, పుష్పాణి=పుష్పములను, ముక్త్వా=విడచి, నివృత్తాః=వెనుకకు మరలిన, సుహృదో యథా=స్నేహితులు వలె, సలిలే=ఉదకమునందు, అవశీర్యన్త=పడిపోయినవి.

తా. క్రమముగా హనుమంతుడు దూరమగుటచే, అతని వేగముతో సంబంధము తగ్గిన చెట్లు, ఆతని పై పుష్పములు విడచి, ప్రవాసమునకు పోవు చున్న మిత్రుని సాగనంపుటకై కొంత దూరము వెళ్ళిన స్నేహితులు వెనుకకు మరలినట్లు, నీటిలో పడిపోయినవి. 52

మూ. లఘుత్వేనోపపన్నం తద్విచిత్రం సాగరేఽపతత్,
ద్రుమాణాం వివిధం పుష్పం కపివాయుసమీరితమ్, 53
తారాచితమివాకాశం ప్రబభౌ చ మహార్ణవః.

ప్ర. అ. లఘుత్వేన=లఘుత్వముతో, ఉపపన్నమ్=కూడినదీ, విచిత్రమ్=నానావర్ణములు కలదీ, కపివాయుసమీరితమ్=హనుమంతుని వేగము వలన కలిగిన వాయువుచే ప్రేరేపింపబడినదీ అయిన, ద్రుమాణామ్=వృక్షముల యొక్క, తత్=ఆ, వివిధమ్=అనేకవిధములైన, పుష్పమ్=పుష్పము, సాగరే=సముద్రమునందు, అపతత్=పడెను. మహార్ణవః=మహాసముద్రము, తారాచితమ్=నక్షత్రములతో నిండిన, ఆకాశమివ=ఆకాశము వలె, ప్రబభౌ చ=ప్రకాశించెను.

తా. హనుమంతుని వేగముచే కలిగిన వాయువు ఎగురగొట్టగా, తేలికగాను, విచిత్రవర్ణములతోను ఉన్న అనేకవిధములైన పుష్పముల సముదాయము చెట్లనుండి రాలి సముద్రములో పడెను. అప్పడా సముద్రము నక్షత్రములతో నిండిన ఆకాశము వలె ప్రకాశించెను. 53

మూ. పుష్పౌఘేనానుబద్ధేన నానావర్ణేన వానరః,
బభౌ మేఘ ఇవాకాశే విద్యుద్గణవిభూషితః. 54

ప్ర. అ. నానావర్ణేన=అనేకవిధములైన రంగులు గల, అనుబద్ధేన=దేహానికి అంటుకొని ఉన్న, పుష్పౌఘేన=పుష్పముల సముదాయముచేత, వానరః=హనుమంతుడు, ఆకాశే=ఆకాశమునందు, విద్యుద్గణవిభూషితః=మెరుపుల సముదాయముచేత అలంకరింపబడిన, మేఘః ఇవ=మేఘము వలె, బభౌ=ప్రకాశించెను.

తా. అనేకవిధములైన రంగుల పుష్పసముదాయము శరీరముపై కప్పివేయుటచే, ఆ హనుమంతుడు, ఆకాశమునందు, మెరుపుల పంక్తులచే అలంకరింపబడిన మేఘమువలె ప్రకాశించెను. 54

మూ. తస్య వేగసమాధూతైః పుష్పైస్తోయమదృశ్యత, 55
తారాభిరభిరామాభిరుదితాభిరివామ్బరమ్.

ప్ర. అ. తస్య=హనుమంతునియొక్క, వేగసమాధూతైః=వేగముచేత ఎగరకొట్టబడిన, పుష్పైః=పుష్పములతో, తోయమ్=సముద్రజలము, ఉదితాభిః=ఉదయించిన, అభిరామాభిః=మనోహరమైన, తారాభిః=నక్షత్రములతో, అమ్బరమివ=ఆకాశము వలె, అదృశ్యత=కనబడెను.

తా. హనుమంతుని వేగముచే ఎగిరి పడిన పుష్పములతో, ఆ సముద్రజలము, ఉదయించిన, అందమైన నక్షత్రములతో ఆకాశము వలె ప్రకాశించెను. 55

మూ. తస్యామ్బరగతౌ బాహూ దదృశాతే ప్రసారితౌ, 56
పర్వతాగ్రాద్వినిష్క్రాన్తౌ పఞ్చాస్యావివ పన్నగౌ.

ప్ర. అ. ప్రసారితౌ=చాపబడినవై, అమ్బరగతౌ=ఆకాశమునందున్న, తస్య=హనుమంతునియొక్క, బాహూ=బాహువులు, పర్వతాగ్రాత్=పర్వతాగ్రమునుండి, వినిష్క్రాన్తౌ=పైకివచ్చిన, పఞ్చాస్యౌ=ఐదుతలలుగల, పన్నగౌ ఇవ=సర్పములు వలె, దదృశాతే=చూడబడినవి.

తా. ఆకాశము వైపు చాపిన హనుమంతుని బాహువులు, పర్వతాగ్రభాగమునుండి బైటకు వచ్చుచున్న ఐదుతలల సర్పముల వలె కనబడెను. 56

మూ. పిబన్నివ బభౌ చాపి సోర్మిమాలం మహార్ణవమ్, 57
పిపాసురివ చాకాశం దదృశే స మహాకపిః.

ప్ర. అ. సః=ఆ, మహాకపిః=హనుమంతుడు, సోర్మిమాలమ్=తరంగ పంక్తులతో కూడిన, మహార్ణవమ్=మహాసముద్రమును, పిబన్నివ=త్రాగివేయుచున్న వాడు వలె, బభౌ=ప్రకాశించెను. ఆకాశమ్=ఆకాశమును, పిపాసురివ=త్రాగివేయ నిచ్ఛయించుచున్నవాడు వలె, దదృశే=కనబడెను.

తా. ఆ హనుమంతుడు తరంగపంక్తులతో కూడిన మహాసముద్రమును త్రాగివేయుచున్నాడా అన్నట్లు, ఆకాశమును కూడా త్రాగివేయ దలచుచున్నాడా అన్నట్లు కనబడెను. 57

మూ. తస్య విద్యుత్ప్రభాకారే వాయుమార్గానుసారిణః, 58
నయనే విప్రకాశేతే పర్వతస్థావివానలౌ.

ప్ర. అ. వాయుమార్గానుసారిణః=ఆకాశముపై ఎగురుచున్న, తస్య=హనుమంతుని యొక్క, విద్యుత్ప్రభాకారే=మెరుపు కాంతి వంటి కాంతి గల, నయనే=నేత్రములు, పర్వతస్థౌ=పర్వతముపై ఉన్న, అనలౌ ఇవ=(రెండు) అగ్నుల వలె, విప్రకాశేతే=ప్రకాశించుచుండెను.

తా. ఆకాశమార్గమునందు వెళ్లుచున్న ఆ హనుమంతుని నేత్రములు, మెరుపుల వలె మెరయుచు, పర్వతము మీద రెండు నిప్పు నెగళ్ళ వలె ఉండెను.

మూ. పిఙ్గే పిఙ్గాక్షముఖ్యస్య బృహతీ పరిమణ్డలే, 59
చక్షుషీ సంప్రకాశేతే చన్ద్రసూర్యావివోదితౌ.

ప్ర. అ. పిఙ్గాక్షముఖ్యస్య=పచ్చని కండ్లు గల వానరులలో శ్రేష్ఠుడైన హనుమంతునియొక్క, పిఙ్గే=పచ్చగా ఉన్నవీ, బృహతీ=పెద్దవీ, పరిమణ్డలే=గుండ్రంగా ఉన్నవీ అయిన, చక్షుషీ=నేత్రములు, ఉదితౌ=ఉదయించిన, చన్ద్రసూర్యావివ=చంద్రసూర్యులు వలె, సంప్రకాశేతే=ప్రకాశించినవి.

తా. పచ్చగాను, గుండ్రముగాను ఉన్న ఆ హనుమంతుని పెద్ద పెద్ద కళ్ళు, ఉదయించిన చంద్రసూర్యులవలె ఉండెను. 59

మూ. ముఖం నాసికయా తస్య తామ్రయా తామ్రమాబభౌ, 60
సన్ధ్యయా సమభిస్పృష్టం యథా తత్సూర్యమణ్డలమ్.

ప్ర. అ. తస్య=హనుమంతుని యొక్క, తామ్రమ్=ఎఱ్ఱనైన, ముఖమ్=ముఖము, తామ్రయా=ఎఱ్ఱనైన, నాసికయా=ముక్కుతో, సన్ధ్యయా=సంధ్యచేత, సమభిస్పృష్టమ్=స్పృశింపబడిన, తత్=ఆ, సూర్యమణ్డలం యథా=సూర్యమండలము వలె, ఆబభౌ=ప్రకాశించెను.

తా. ఎఱ్ఱగా నున్న ముక్కుతో, హనుమంతుని ఎఱ్ఱనైన ఆ ముఖము, సంధ్యారాగము సంక్రమించిన సూర్యబింబము వలె ప్రకాశించెను. 60

మూ. లాఙ్గూలం చ సమావిద్ధం ప్లవమానస్య శోభతే, 61
అమ్బరే వాయుపుత్రస్య శక్రధ్వజ ఇవోచ్ఛ్రితః.

ప్ర. అ. అమ్బరే=ఆకాశమునందు, ప్లవమానస్య=తేలుచున్న, వాయుపుత్రస్య=హనుమంతుని యొక్క, సమావిద్ధమ్=పైకి ఎత్తి ఉంచబడిన, లాఙ్గూలమ్=తోక, ఉచ్ఛ్రితః=నిలబెట్టబడిన, శక్రధ్వజః ఇవ=ఇంద్రధ్వజము వలె, శోభతే=ప్రకాశించుచున్నది (ప్రకాశించినది).

తా. ఆకాశములో తేలిపోవుచున్న హనుమంతుని లాంగూలము పైకి ఎత్తబడినదై, నిలబెట్టబడిన ఇంద్రధ్వజము వలె (ఇంద్రుని పూజించుటకై చేయు ఉత్సవములో అంగముగా నిలబెట్టబడిన అతిదీర్ఘమైన స్తంభము వలె) ప్రకాశించెను.

మూ. లాఙ్గూలచక్రేణ మహాన్ శుక్లదంష్ట్రోఽనిలాత్మజః, 62
వ్యరోచత మహాప్రాజ్ఞః పరివేషీవ భాస్కరః.

ప్ర. అ. శుక్లదంష్ట్రః=తెల్లనికోరలు కలవాడు, మహాప్రాజ్ఞః=గొప్పబుద్ధిమంతుడూ అయిన, మహాన్=పెద్ద దేహము గల, అనిలాత్మజః=హనుమంతుడు, లాఙ్గూలచక్రేణ=తోక యొక్క చక్రము చేత, పరివేషీ=పరివేషము గల (గూడు కట్టిన), భాస్కరః ఇవ=సూర్యుడు వలె, వ్యరోచత=ప్రకాశించెను.

తా. పెద్ద దేహము, తెల్లని కోరలూ గల, మహాబుద్ధిశాలి యైన ఆ హనుమంతుడు, తోక చక్రాకారముగా ఏర్పడగా, గూడు కట్టిన సూర్యుడు వలె ప్రకాశించెను. 62

మూ. స్ఫిగ్దేశేనాభితామ్రేణ రరాజ స మహాకపిః, 63
మహతా దారితేనేవ గిరిర్గైరికధాతునా.

ప్ర. అ. సః మహాకపిః=ఆ హనుమంతుడు, అభితామ్రేణ=ఎఱ్ఱగానున్న, స్ఫిగ్దేశేన=పిరుదుల ప్రదేశముతో, దారితేన=బ్రద్దలుకొట్టబడిన, మహతా=గొప్ప, గైరికధాతునా=గైరిక మను ఎఱ్ఱని ధాతువుతో, గిరిః ఇవ=పర్వతము వలె, రరాజ=ప్రకాశించెను.

తా. ఎఱ్ఱగా ఉన్న పిరుదులతో ఆ హనుమంతుడు విశాలమైన గైరిక ధాతువు ఉన్న ప్రదేశమును బ్రద్దలు కొట్టగా ఆ ఎరుపుతోకూడిన పర్వతము వలె ప్రకాశించెను. 63

మూ. తస్య వానరసింహస్య ప్లవమానస్య సాగరమ్, 64
కక్షాన్తరగతో వాయుర్జీమూత ఇవ గర్జతి.

ప్ర. అ. సాగరమ్=సముద్రమును, ప్లవమానస్య=దాటుచున్న, తస్య=ఆ, వానరసింహస్య=వానరశ్రేష్ఠుడైన హనుమంతునియొక్క, కక్షాన్తరగతః=చంకల మధ్యనుండి ప్రసరించుచున్న, వాయుః=వాయువు, జీమూతః ఇవ=మేఘము వలె, గర్జతి=గర్జించుచున్నది.

తా. సముద్రమును దాటుచున్న ఆ హనుమంతుని చంకల సందునుండి ప్రసరించుచున్న గాలి ధ్వని మేఘగర్జితము వలె ఉండెను. 64

మూ. ఖే యథా నిపతన్త్యుల్కా హ్యుత్తరాన్తాద్వినిఃసృతా, 65
దృశ్యతే సానుబన్ధా చ తథా స కపికుఞ్జరః.

ప్ర. అ. ఉత్తరాన్తాత్=ఉత్తరదిక్ప్రాంతమునుండి, వినిఃసృతా=మహావేగముతో బయలుదేరిన, సానుబన్ధా చ=నిరంతరత్వముతో కూడిన, ఉల్కా=తేజః పిండము, ఖే=ఆకాశమునందు, యథా=ఎట్లు, దృశ్యతే=చూడబడునో, సః=ఆ,కపికుఞ్జరః=హనుమంతుడు, తథా=అట్లే కనబడుచుండెను.

తా. ఉత్తరదిక్ప్రాంతమునుండి మహావేగముతో బయలుదేరి, దక్షిణము వైపు పోవుచున్న ఉల్క, వేగాతిశయముచే అతిదీర్ఘముగా, నిరంతరముగా ఉన్నట్లు ఆకాశము మీద ఎట్లు కనబడునో, హనుమంతుడు ఆకాశముపై అట్లే కనబడుచుండెను.

ఏదైన పెద్ద తేజఃపిండము ఆకాశముపై మహావేగముతో పోవునపుడు అది, కొరవి గుండ్రముగా త్రిప్పినపుడు ఒక అగ్నిచక్రము వలె కనబడినట్లు, అతిదీర్ఘముగా కనబడును. అట్టి తేజఃపుంజముతో హనుమంతుడు పోల్చబడినాడు.

మూ. పతత్పతఙ్గసంకాశో వ్యాయతః శుశుభే కపిః, 66
ప్రవృద్ధ ఇవ మాతఙ్గః కక్ష్యయా బధ్యమానయా.

ప్ర. అ. పతత్పతఙ్గసంకాశః=శీఘ్రగమనము చేయుచున్న సూర్యునితో సమానుడైన, వ్యాయతః=పొడవైన, కపిః=హనుమంతుడు, బధ్యమానయా=కట్టబడుచున్న (కట్టబడిన), కక్ష్యయా=నడుముత్రాడుచే, ప్రవృద్ధః=పెరిగిన, మాతఙ్గః ఇవ=ఏనుగు వలె, శుశుభే=ప్రకాశించెను.

తా. మహావేగముతో ప్రయాణము చేయుచున్న సూర్యుడు వలె ఉన్న ఆ హనుమంతుడు, నడుముకు కట్టిన బంగారు గొలుసుచే పొడవైనట్లున్న గజము వలె కనబడెను. 66

మూ. ఉపరిష్టాచ్ఛరీరేణ ఛాయయా చావగాఢయా, 67
సాగరే మారుతావిష్టా నౌరివాసీత్తదా కపిః.

ప్ర. అ. తదా=అప్పుడు, కపిః=హనుమంతుడు, ఉపరిష్టాత్=పై భాగమునందు, శరీరేణ=శరీరముతోను, సాగరే=సముద్రమునందు, అవగాఢయా=క్రిందికి మునిగిన, ఛాయయా చ=నీడతోను, మారుతావిష్టా=గాలిచేత వ్యాప్తమైన, నౌరివ=నావ వలె, ఆసీత్=ఉండెను.

తా. హనుమంతుని శరీరము సముద్రము పైన ఆకాశములో ఉండెను. శరీరచ్ఛాయ (నీడ) సముద్రముపై బడెను. ఆ విధముగా ఉన్న హనుమంతుడు గాలికి నడచుచున్న ఓడ వలె కనబడెను. 67

మూ. యం యం దేశం సముద్రస్య జగామ స మహాకపిః,
స స తస్యోరువేగేన సోన్మాద ఇవ లక్ష్యతే. 68

ప్ర. అ. సః మహాకపిః=ఆ హనుమంతుడు, సముద్రస్య=సముద్రము యొక్క, యం యం దేశం=ఏ యే ప్రదేశమును గూర్చి, జగామ=వెళ్ళెనో, సః సః=ఆ యా ప్రదేశము, తస్య=ఆతనియొక్క, ఊరువేగేన=తొడల వేగముచేత, సోన్మాదః ఇవ=ఉన్మాదముతో కూడినది వలె, లక్ష్యతే=చూడబడెను.

తా. హనుమంతుడు సముద్రముమీద ఏ యే ప్రదేశము వైపు వెళ్లెనో ఆ యా ప్రదేశము, ఉన్మాదము చెందినదివలె కలత చెందెను. 68

మూ. సాగరస్యోర్మిజాలానాముర‌సా శైలవర్ష్మణామ్,
అభిఘ్నంస్తు మహావేగః పుప్లువే స మహాకపిః. 69

ప్ర. అ. మహావేగః=గొప్ప వేగముగల, సః=ఆ, మహాకపిః=హనుమంతుడు, శైలవర్ష్మణామ్=పర్వతముల వంటి శరీరము గల, సాగరస్య=సముద్రముయొక్క, ఊర్మిజాలానామ్=తరంగసముదాయములకు (ను), ఉరసా=వక్షఃస్థలముతో, అభిఘ్నన్=ఢీకొనుచు, పుప్లువే=ఎగిరెను.

తా. మహావేగముగల ఆ హనుమంతుడు, కొండంత ఎత్తుగా లేచుచున్న సముద్రతరంగములను వక్షఃస్థలముతో ఢీకొనుచు, ఎగిరెను. 69

మూ. కపివాతశ్చ బలవాన్ మేఘవాతశ్చ నిఃసృతః,
సాగరం భీమనిర్ఘోషం కమ్పయామాసతుర్భృశమ్. 70

ప్ర. అ. బలవాన్=బలము గల, కపివాతశ్చ=హనుమంతునివలన పుట్టిన వాయువు, నిఃసృతః=బయలువెడలిన, మేఘవాతశ్చ=మేఘముల వాయువు, భీమనిర్ఘోషమ్=భయంకరమైన ధ్వని గల, సాగరమ్=సముద్రమును, భృశమ్=మిక్కిలి, కమ్పయామాసతుః=కంపింపచేసినవి.

తా. మంచి బలముతో బయలుదేరిన హనుమంతుని గాలి, మేఘముల గాలి భయంకరమైన ధ్వని కలుగు నట్లు సముద్రమును కంపింపచేసినవి. 70

మూ. వికర్షన్నూర్మిజాలాని బృహన్తి లవణామ్భసి,
పుప్లువే కపిశార్దూలో వికిరన్నివ రోదసీ. 71

ప్ర. అ. కపిశార్దూలః=హనుమంతుడు, లవణామ్భసి=లవణసముద్రమునందు, బృహన్తి=పెద్దవైన, ఊర్మిజాలాని=తరంగపంక్తులను, వికర్షన్=లాగికొనిపోవుచు, రోదసీ=భూమ్యాకాశములను, వికిరన్నివ=చిమ్ముచున్నవాడు వలె, పుప్లువే=ఎగిరెను.

తా. హనుమంతుడు,లవణసముద్రములోని పెద్ద పెద్ద తరంగములను తనతో లాగికొనిపోవుచు, వాటిని భూమ్యాకాశముల మధ్య అంతటా చిమ్ముచున్నట్లు ఉండెను. 71

మూ. మేరుమన్దరసంకాశానుద్ధతాన్ స మహార్ణవే,
అత్యక్రామన్మహావేగస్తరఙ్గాన్ గణయన్నివ. 72

ప్ర. అ. మహావేగః=గొప్ప వేగము గల హనుమంతుడు, మహార్ణవే=మహాసముద్రమునందు, ఉద్ధతాన్=పైకి ఎగిరిన, మేరుమన్దరసంకాశాన్=మేరుమందరపర్వతములతో సమానములైన, తరఙ్గాన్=తరంగములను, గణయన్నివ=లెక్కపెట్టుచున్నవాడు వలె, అత్యక్రామత్=దాటి వెళ్లెను.

తా. మహావేగవంతుడైన ఆ హనుమంతుడు, మహాసముద్రములో లేచుచున్న మేరుమందరపర్వతములతో సమానములైన తరంగములను లెక్క పెట్టుచున్నాడా అన్నట్లు, వాటిని దాటుచు వెళ్ళెను. 72

మూ. తస్య వేగసముద్ధూతం జలం సజలదం తదా,
అమ్బరస్థం విబభ్రాజ శారదాభ్రమివాతతమ్. 73

ప్ర. అ. తదా=అప్పుడు, తస్య=హనుమంతునియొక్క, వేగసముద్ధూతమ్=వేగముచేత ఎగురకొట్టబడిన, సజలదమ్=మేఘములతో కూడిన, జలమ్=జలము, అమ్బరస్థమ్=ఆకాశమునందున్నదై, ఆతతమ్=వ్యాప్తమైన, శారదాభ్రమివ=శరత్కాలపు మేఘము వలె, విబభ్రాజ=ప్రకాశించెను.

తా. అప్పుడు, హనుమంతుని వేగముచేత పైకి ఎగిరి,మేఘములతో కూడిన జలము, ఆకాశముపై వ్యాపించిన శరత్కాలపు మేఘము వలె ప్రకాశించెను. 73

మూ. తిమినక్రఝషాః కూర్మా దృశ్యన్తే వివృతాస్తదా,
వస్త్రాపకర్షణేనేవ శరీరాణి శరీరిణామ్. 74

ప్ర. అ. తదా=అప్పుడు, తిమినక్రఝషాః=తిములు (పెద్ద చేపలు), మొసళ్లు, చేపలు, తాబేళ్లు, వస్త్రాపకర్షణేన=వస్త్రములను తొలగించుటచేత, శరీరిణామ్=మానవులయొక్క, శరీరాణీవ=శరీరములు వలె, వివృతాః=వివృతములై, దృశ్యన్తే=కనబడుచున్నవి.

తా. సముద్రజలము పైకి ఎగిరిపోవుటచే సముద్రములో ఉన్న తిములూ, మొసళ్లూ, చేపలూ, తాబేళ్లూ, వస్త్రమును లాగివేసినచో మానవుల అవయవములన్నీ స్పష్టంగా కనబడినట్లు కనబడినవి. 74

మూ. ప్లవమానం సమీక్ష్యాథ భుజఙ్గాః సాగరాలయాః,
వ్యోమ్ని తం కపిశార్దూలం సుపర్ణ ఇతి మేనిరే. 75

ప్ర. అ. అథ=అటు పిమ్మట, వ్యోమ్ని=ఆకాశమునందు, ప్లవమానమ్=ఎగురుచున్న, తం కపిశార్దూలమ్=ఆ హనుమంతుని, సమీక్ష్య=చూచి, సాగరాలయాః=సముద్రమునందు నివాసము గల, భుజఙ్గాః=సర్పములు, సుపర్ణః ఇతి=గరుత్మంతుడు అని, మేనిరే=తలచినవి.

తా. సముద్రములో నివసించు సర్పములు, ఆకాశము మీద ఎగురుచున్న ఆ హనుమంతుని చూచి, గరుత్మంతుడేమో అని అనుకొనెను. 75

మూ. దశయోజనవిస్తీర్ణా త్రింశద్యోజనమాయతా,
ఛాయా వానరసింహస్య జలే చారుతరాభవత్. 76

ప్ర. అ. దశయోజనవిస్తీర్ణా=పది యోజనముల వెడల్పు కలదీ, త్రింశద్యోజనమ్=ముప్పది యోజనములు, ఆయతా=పొడవూ అయిన, వానర సింహస్య=హనుమంతునియొక్క, ఛాయా=నీడ, జలే=నీటిమీద, చారుతరా=చాల అందమైనది, అభవత్=ఆయెను.

తా. జలముమీద ఆ హనుమంతుని, పది యోజనముల వెడల్పు, ముప్పది యోజనముల పొడవు అయిన నీడ, చక్కగా ఉండెను. 76

మూ. శ్వేతాభ్రఘనరాజీవ వాయుపుత్రానుగామినీ,
తస్య సా శుశుభే ఛాయా వితతా లవణామ్భసి. 77

ప్ర. అ. వాయుపుత్రానుగామినీ=హనుమంతుని అనుసరించి వెళ్లుచున్నదీ, లవణామ్భసి=లవణసముద్రమునందు, వితతా=వ్యాపించినదీ అయిన, తస్య=ఆతనియొక్క, సా=ఆ, ఛాయా=నీడ, శ్వేతాభ్రఘనరాజీవ=తెల్లని మేఘముల దట్టమైన పంక్తి వలె, శుశుభే=ప్రకాశించెను.

తా. సముద్రముమీద విస్తరించి హనుమంతుని అనుసరించి ప్రయాణము చేయుచున్న ఆతని నీడ దట్టమైన తెల్లని మేఘాల పంక్తి వలె ప్రకాశించెను. 77

మూ. శుశుభే స మహాతేజా మహాకాయో మహాకపిః,
వాయుమార్గే నిరాలమ్బే పక్షవానివ పర్వతః. 78

ప్ర. అ. మహాతేజాః=గొప్ప తేజస్సు కలవాడూ, మహాకాయః=గొప్ప శరీరము కలవాడూ అయిన,సః=ఆ, మహాకపిః=హనుమంతుడు, నిరాలమ్బే=ఆధారము లేని, వాయుమార్గే=వాయుమార్గమునందు, పక్షవాన్=రెక్కలు గల, పర్వతః ఇవ=పర్వతము వలె, శుశుభే=ప్రకాశించెను.

తా. గొప్ప తేజస్సూ, పెద్ద శరీరమూ గల హనుమంతుడు, ఆధారమేదియు లేని వాయుమార్గమునందు, రెక్కలు గల పర్వతము వలె ప్రకాశించెను. 78

మూ. యేనాసౌ యాతి బలవాన్ వేగేన కపికుఞ్జరః,
తేన మార్గేణ సహసా ద్రోణీకృత ఇవార్ణవః. 79

ప్ర. అ. బలవాన్=బలవంతు డైన, అసౌ=ఈ, కపికుఞ్జరః=హనుమంతుడు, వేగేన=వేగముతో, యేన మార్గేణ=ఏ మార్గముచే, యాతి=వెళ్ళుచుండెనో, తేన=ఆ

మార్గముచేత, సహసా=వెంటనే, అర్ణవః=సముద్రము, ద్రోణీకృతః ఇవ=తొట్టిగా చేయబడినట్లుండెను.

తా. మహాబలశాలి యైన ఆ హనుమంతుడు ఏ మార్గమున ఎగురుచుండెనో ఆ మార్గమునందు సముద్రము తొట్టి వలె ఏర్పడుచుండెను. 79

మూ. ఆపాతే పక్షిసంఘానాం పక్షిరాజ ఇవ వ్రజన్,
హనుమాన్ మేఘజాలాని ప్రకర్షన్ మారుతో యథా. 80

ప్ర. అ. హనుమాన్=హనుమంతుడు, మారుతో యథా=వాయువువలె, మేఘజాలాని=మేఘపంక్తులను, ప్రకర్షన్=లాగుచు, పక్షిసంఘానామ్=పక్షిసముదాయముల, ఆపాతే=సంచారప్రదేశమైన ఆకాశమునందు, వ్రజన్=వెళ్ళుచు, పక్షిరాజః ఇవ=గరుత్మంతుడు వలె ప్రకాశించెను.

తా. హనుమంతుడు వాయువు వలె మేఘపంక్తులను తనతో లాగి కొని పోవుచు, పక్షిమార్గమునందు వెళ్ళుచు, గరుత్మంతుడు వలె ప్రకాశించెను. 80

మూ. పాణ్డురారుణవర్ణాని నీలమాఞ్జిష్ఠకాని చ,
కపినాకృష్యమాణాని మహాభ్రాణి చకాశిరే. 81

ప్ర. అ. కపినా=హనుమంతునిచేత, ఆకృష్యమాణాని=లాగబడుచున్న, పాణ్డురారుణవర్ణాని=తెల్లని ఎఱ్ఱని రంగులు గలవీ, నీలమాఞ్జిష్ఠకాని చ=నల్లని పచ్చని రంగు కలవీ అయిన, మహాభ్రాణి=గొప్ప మేఘములు, చకాశిరే=ప్రకాశించినవి.

తా. తెల్లరంగు, ఎఱ్ఱరంగు, నల్లరంగు, పచ్చరంగు గల పెద్ద పెద్ద మేఘములను హనుమంతుడు తన వెంట లాగికొని పోవుచుండగా చూచుటకు ముచ్చటగా ఉండెను. 81

మూ. ప్రవిశన్నభ్రజాలాని నిష్పతంశ్చ పునః పునః,
ప్రచ్ఛన్నశ్చ ప్రకాశశ్చ చన్ద్రమా ఇవ లక్ష్యతే. 82

ప్ర. అ. అభ్రజాలాని=మేఘసమూహములను, పునః పునః=మాటిమాటికి, ప్రవిశన్=ప్రవేశించుచున్నవాడూ, నిష్పతంశ్చ=బైటకు వచ్చుచున్నవాడూ అయిన ఆ హనుమంతుడు, ప్రచ్ఛన్నశ్చ=కప్పబడుచున్నవాడూ, ప్రకాశశ్చ=పైకి కనబడుచున్నవాడూ అయిన, చన్ద్రమాః ఇవ=చంద్రుడు వలె, లక్ష్యతే=చూడబడుచున్నాడు.

తా. మాటి మాటికి మేఘాల వెనుకకు వెళ్ళుచూ, బైటకు వచ్చుచూ ప్రయాణం చేయుచున్న హనుమంతుడు, మేఘాల వెనుక దాగుచూ, పైకి కనబడుచూ ఉన్న చంద్రుడు వలె ప్రకాశించెను. 82

మూ. ప్లవమానం తు తం దృష్ట్వా ప్లవఙ్గం త్వరితం తదా,
వవర్షుః పుష్పవర్షాణి దేవగన్ధర్వదానవాః. 83

ప్ర. అ. తదా=అప్పుడు, త్వరితమ్=తొందరగా, ప్లవమానమ్=ఎగురుచున్న, తం ప్లవఙ్గమ్=ఆ హనుమంతుని, దృష్ట్వా=చూచి, దేవగన్ధర్వదానవాః=దేవతలూ, గంధర్వులూ, దానవులూ, పుష్పవర్షాణి=పుష్పవర్షములను, వవర్షుః=వర్షించిరి.

తా. అప్పుడు శీఘ్రముగా ఎగిరి వెళ్ళుచున్న హనుమంతుని చూచి, దేవతలూ, గంధర్వులూ, దానవులూ అతనిపై పుష్పవర్షము కురిపించిరి. 83

మూ. తతాప న హి తం సూర్యః ప్లవన్తం వానరోత్తమమ్,
సిషేవే చ తదా వాయూ రామకార్యార్థసిద్ధయే. 84

ప్ర. అ. తదా=అప్పుడు, ప్లవన్తమ్=ఎగురుచున్న, తం వానరోత్తమమ్=ఆ హనుమంతుని, సూర్యః=సూర్యుడు, రామకార్యార్థసిద్ధయే=రాముని కార్యమను ప్రయోజనము సిద్ధించుటకై, న హి తతాప=తపింపచేయలేదు. వాయుః చ=వాయువుకూడ, సిషేవే=సేవించెను.

తా. ఆకాశమార్గమునందు ప్రయాణము చేయుచున్న ఆ హనుమంతునకు సూర్యుడు వేడి కలుగకుండునట్లు చూచెను. వాయువుకూడా సుఖకరముగా వీచెను. రాముని కార్యము సిద్ధింపవలెనను ఉద్దేశ్యముతో వారు అట్లు చేసిరి.

మూ. ఋషయస్తుష్టువుశ్చైవ ప్లవమానం విహాయసా,
జగుశ్చ దేవగన్ధర్వాః ప్రశంసన్తో మహౌజసమ్. 85

ప్ర. అ. విహాయసా=ఆకాశముచేత (నందు), ప్లవమానమ్=ఎగురుచున్న, మహౌజసమ్=గొప్పతేజస్సు గల ఆ హనుమంతుని, ఋషయః=ఋషులు, తుష్టువుశ్చైవ=స్తుతించిరి. దేవగన్ధర్వాః=దేవతలూ, గంధర్వులూ, ప్రశంసన్తః=ప్రశంసించుచు, జగుశ్చ=గానము కూడ చేసిరి.

తా. ఆకాశమార్గమునందు ప్రయాణము చేయుచున్న ఆ మహాతేజశ్శాలి యైన హనుమంతుని చూచి ఋషీశ్వరులు స్తుతించిరి. దేవతలూ, గంధర్వులూ, అతని పరాక్రమమును ప్రశంసించుచు గానము చేసిరి. 85

మూ. నాగాశ్చ తుష్టువుర్యక్షా రక్షాంసి విబుధాః ఖగాః, 86
ప్రేక్ష్య సర్వే కపివరం సహసా విగతక్లమమ్.

ప్ర. అ. విగతక్లమమ్=పోయిన శ్రమ గల (శ్రమయే లేని), కపివరమ్=హనుమంతుని, ప్రేక్ష్య=చూచి, సహసా=వెంటనే, నాగాశ్చ=నాగులు,

యక్షాః=యక్షులు, రక్షాంసి=రాక్షసులు, విబుధాః=దేవతలు, ఖగాః=పక్షులు, సర్వే=అందరూ, తుష్టువుః=స్తుతించిరి.

తా. ఏ మాత్రము శ్రమ లేకుండ ఆకాశమునందు ప్రయాణము చేయుచున్న హనుమంతుని చూచిన వెంటనే, ఆశ్చర్యముతో, నాగులు, యక్షులు, రాక్షసులు, దేవతలు, పక్షులూ అందరూ కొనియాడిరి. 86

మూ. తస్మిన్ ప్లవగశార్దూలే ప్లవమానే హనూమతి, 87
ఇక్ష్వాకుకులమానార్థీ చిన్తయామాస సాగరః.

ప్ర. అ. ప్లవగశార్దూలే=వానరశ్రేష్ఠుడైన, తస్మిన్ హనూమతి=ఆ హనుమంతుడు, ప్లవమానే=ఎగురుచుండగా, సాగరః=సముద్రము, ఇక్ష్వాకుకులమానార్థీ=ఇక్ష్వాకువంశమునకు గౌరవము చేయవలెనని కోరుచు, చిన్తయామాస=ఆలోచించెను.

తా. వానరశ్రేష్ఠుడైన హనుమంతుడావిధముగా ఆకాశమార్గమున ప్రయాణము చేయుచుండగా చూచిన సముద్రుడు ఇక్ష్వాకువంశమునకు సత్కారము చేయవలెనను ఉద్దేశ్యముతో ఇట్లు తలచెను. 87

మూ. సాహాయ్యం వానరేన్ద్రస్య యది నాహం హనూమతః, 88
కరిష్యామి భవిష్యామి సర్వవాచ్యో వివక్షతామ్.

ప్ర. అ. అహమ్=నేను, వానరేన్ద్రస్య=వానరశ్రేష్ఠుడైన, హనూమతః=హనుమంతునకు, సాహాయ్యమ్=సాహాయ్యమును, న కరిష్యామి యది=చేయకపోయినట్లయితే, వివక్షతామ్=మాటలాడదలచుకొనువారికి అనగా నా దోషములను ఎత్తిచూపదలచినవారికి, సర్వవాచ్యః=అన్నివిధాలా నిందింపదగినవాడను, భవిష్యామి=కాగలను.

తా. వానరశ్రేష్ఠుడైన ఈ హనుమంతునకిపుడు సాహాయ్యము చేయనిచో నన్ను తప్పు పట్టదలచినవారికి అన్ని విధాలా అవకాశము కల్పించినవాడను అగుదును. 88

మూ. అహమిక్ష్వాకునాథేన సగరేణ వివర్ధితః, 89
ఇక్ష్వాకుసచివశ్చాయం నావసీదితుమర్హతి.

ప్ర. అ. అహమ్=నేను, ఇక్ష్వాకునాథేన=ఇక్ష్వాకువంశప్రభువైన, సగరేణ=సగరునిచేత, వివర్ధితః=పెంచబడితిని. ఇక్ష్వాకుసచివః చ=ఆ ఇక్ష్వాకు వంశీయునకు సాహాయ్యము చేయుచున్న, అయమ్=ఇతడు, అవసీదితుమ్=శ్రమచే క్షీణించుటకు, నార్హతి=తగడు.

తా. ఇక్ష్వాకువంశమునకు చెందిన సగరచక్రవర్తి నన్ను వృద్ధి పొందించి నాడు కదా? ఆ ఇక్ష్వాకువంశమునకే చెందిన రామునకు సాహాయ్యము చేయుచున్న ఈ హనుమంతుడు అలసటచే క్షీణించుట యుక్తము కాదు.

మూ. తథా మయా విధాతవ్యం విశ్రమేత యథా కపిః, 90
శేషం చ మయి విశ్రాన్తః సుఖేనాతిపతిష్యతి.

ప్ర. అ. కపిః=హనుమంతుడు, యథా=ఎట్లు, విశ్రమేత=విశ్రమించునో, తథా=అట్లు, మయా=నాచేత, విధాతవ్యమ్=చేయదగియున్నది. మయి=నాయందు, విశ్రాన్తః=విశ్రమించినవాడై, శేషమ్=మిగిలిన దూరమును, సుఖేన=సుఖముతో, అతి పతిష్యతి=దాటగలడు.

తా. ఈ హనుమంతుడు నా మీద కొంత సేపు విశ్రమించునట్లు నేను చేయవలెను. కొంచెము విశ్రమించిన తరువాత మిగిలిన దూరమును సుఖముగా, దాటగలడు. 90

మూ. ఇతి కృత్వా మతిం సాధ్వీం సముద్రశ్ఛన్నమమ్భసి, 91
హిరణ్యనాభం మైనాకమువాచ గిరిసత్తమమ్.

ప్ర. అ. సముద్రః=సముద్రుడు, ఇతి=ఇట్లు, సాధ్వీమ్=మంచి, మతిమ్= ఆలోచనను, కృత్వా=చేసి, అమ్భసి=ఉదకమునందు, ఛన్నమ్=కప్పబడిఉన్న, హిర ణ్యనాభమ్=బంగారము మధ్యప్రదేశమునందు గల, గిరిసత్తమమ్=పర్వతశ్రేష్ఠమైన, మైనాకమ్=మైనాకమును గూర్చి, ఉవాచ=పలికెను.

తా. సముద్రుడీ విధముగా మంచి ఆలోచన చేసి, తన జలములో మునిగి యున్న, మధ్యప్రదేశమునందు అంతటా బంగారముతో నిండిన, మైనాక మను పర్వతశ్రేష్ఠముతో ఇట్లు పలికెను. 91

మూ. త్వమిహాసురసంఘానాం పాతాళతలవాసినామ్, 92
దేవరాజ్ఞా గిరిశ్రేష్ఠ పరిఘః సంనివేశితః.

ప్ర. అ. గిరిశ్రేష్ఠ=ఓ ! పర్వతశ్రేష్ఠమా ! త్వమ్=నీవు, ఇహ=ఇక్కడ, పాతాళతలవాసినామ్=పాతాళమునందు నివసించుచున్న, అసురసంఘానామ్= అసురుల సముదాయములకు, పరిఘః=గడియగా, దేవరాజ్ఞా=దేవేంద్రునిచేత, సంనివేశితః=ఉంచబడితివి.

తా. ఓ పర్వతశ్రేష్ఠమా ! పాతాళములో నివసించు అసురులు పైకి రాకుండా అడ్డుకొనుటకై నిన్ను దేవేంద్రుడు ఇక్కడ, ఒక పెద్ద అడ్డగడియగా ఉంచినాడు. 92

మూ. త్వమేషాం జాతవీర్యాణాం పునరేవోత్పతిష్యతామ్, 93
పాతాళస్యాప్రమేయస్య ద్వారమావృత్య తిష్ఠసి.

ప్ర. అ. జాతవీర్యాణామ్=పుట్టిన పరాక్రమము గల, ఏషామ్=ఈ అసురులు, పునరేవ=మరల, ఉత్పతిష్యతామ్=లేవదలచుచుండగా, త్వమ్=నీవు, అప్రమేయస్య=కొలచుటకు శక్యము కాని, పాతాళస్య=పాతాళము యొక్క, ద్వారమ్=ద్వారమును, ఆవృత్య=ఆవరించి, తిష్ఠసి=ఉంటున్నావు.

తా. ఈ అసురులు పరాక్రమము పెంపొందించుకొని మరల పైకి రావలెనని ప్రయత్నించినపుడు, నీవు అతివిశాలమైన పాతాళలోకము ద్వారమును మూసివేసి నిలచుచున్నావు. 93

మూ. తిర్యగూర్ధ్వమధశ్చైవ శక్తిస్తే శైల వర్ధితుమ్, 94
తస్మాత్సంచోదయామి త్వాముత్తిష్ఠ గిరిసత్తమ.

ప్ర. అ. శైల=ఓ పర్వతమా ! తిర్యక్=అడ్డముగాను, ఊర్ధ్వమ్=పైకీ, అధశ్చైవ=క్రిందికీ, వర్ధితుమ్=వృద్ధిపొందుటకు, తే=నీకు, శక్తిః=శక్తి ఉన్నది. గిరిసత్తమ=ఓ గిరిశ్రేష్ఠమా. తస్మాత్=ఆ కారణమువలన, త్వామ్=నిన్ను, సంచోదయామి=ప్రేరేపించుచున్నాను. ఉత్తిష్ఠ=లెమ్ము.

తా. ఓ పర్వతశ్రేష్ఠమా ! అడ్డముగానూ, పైకీ, క్రిందికీ పెరిగే శక్తి నీకున్నది. అందుచేతనే నిన్ను ప్రేరేపించుచున్నాను. లెమ్ము. 94

మూ. న ఏష కపిశార్దూలస్త్వాముపర్యేతి వీర్యవాన్, 95
హనూమాన్రామకార్యార్థం భీమకర్మా ఖమాప్లుతః.

ప్ర. అ. కపిశార్దూలః=వానరులలో శ్రేష్ఠుడూ, వీర్యవాన్=పరాక్రమవంతుడూ, భీమకర్మా=భయంకరమైన కర్మకలవాడూ, అయిన, సః ఏషః=అట్టి ఈ, హనూమాన్=హనుమంతుడు, రామకార్యార్థమ్=రాముని పని నిమిత్తమై, ఖమ్=ఆకాశమును (పై), ఆప్లుతః=ఎగురుచున్నవాడై, త్వామ్ ఉపరి=నీ మీదుగా, ఏతి=వచ్చుచున్నాడు.

తా. వానరశ్రేష్ఠుడూ, భయంకరమైన పని చేయగలవాడూ, పరాక్రమశాలీ అయిన ఈ హనుమంతుడు, రాముని పనిమీద, ఆకాశములో ఎగురుచు, నీ మీదుగా వచ్చుచున్నాడు. 95

మూ. అస్య సాహ్యం మయా కార్యమిక్ష్వాకుకులవర్తినః, 96
మమ హీక్ష్వాకవః పూజ్యాః పరం పూజ్యతమాస్తవ.

ప్ర. అ. అద్య=ఇప్పుడు, ఇక్ష్వాకుకులవర్తినః=ఇక్ష్వాకుకులమును అనుసరించి ప్రవర్తించుచున్న, అస్య=ఇతనికి, మయా=నా చేత, సాహ్యమ్=సాహాయ్యము, కార్యమ్=చేయదగినది. మమ=నాకు, ఇక్ష్వాకవః=ఇక్ష్వాకువంశీయులు, పూజ్యాః=పూజింపదగినవారు, తవ=నీకు, పూజ్యతమాః=అధికముగా పూజ్యులు.

తా. ఇప్పుడు, ఇక్ష్వాకువంశమునకు చెందిన రాముని పనిమీద వెళ్లుచున్న ఇతనికి, నేను సాహాయ్యము చేయవలెను. ఎందుచేత ననగా నాకు ఇక్ష్వాకువంశీయులు పూజ్యులు. నీకు అంతకంటెను పూజ్యులు. 96

మూ. కురు సాచివ్యమస్మాకం న నః కార్యమతిక్రమేత్, 97
కర్తవ్యమకృతం కార్యం సతాం మన్యుముదీరయేత్.

ప్ర. అ. అస్మాకమ్=మాకు, సాచివ్యమ్=సాహాయ్యమును, కురు=చేయుము. నః=మాయొక్క, కార్యమ్=కార్యము, న అతిక్రమేత్=దాటి పోకుండు గాక. కర్తవ్యమ్=చేయదగిన, కార్యమ్=కార్యము, అకృతమ్=చేయబడనిదై, సతామ్=సత్పురుషులయొక్క, మన్యుమ్=కోపమును, ఉదీరయేత్=పెంచును.

తా. మాకు సాహాయ్యము చేయుము. మా పని దాటిపోకుండునట్లు చూడుము. చేయవలసినపని చేయకున్నచో సత్పురుషులకు కోపము కలిగించును. 97

మూ. సలిలాదూర్ధ్వముత్తిష్ఠ తిష్ఠత్వేష కపిస్త్వయి, 98
అస్మాకమతిథిశ్చైవ పూజ్యశ్చ ప్లవతాం వరః.

ప్ర. అ. సలిలాత్=ఉదకమునుండి, ఊర్ధ్వమ్=పైకి, ఉత్తిష్ఠ=లెమ్ము, అస్మాకమ్=మనకు, అతిథిశ్చైవ=అతిథీ, పూజ్యశ్చ=పూజింపదగినవాడూ, ప్లవతామ్=ఎగిరేవారిలో, వరః=శ్రేష్ఠుడూ అయిన, ఏషః కపిః=ఈ హనుమంతుడు, త్వయి=నీమీద, తిష్ఠతు=నిలచుగాక.

తా. మన పూజ్యుడైన అతిథీ, ఎగరగలిగినవారిలో శ్రేష్ఠుడూ అయిన ఈ హనుమంతుడు నీమీద నిలచుటకు వీలగునట్లు ఉదకమునుండి పైకి లెమ్ము.

మూ. చామీకరమహానాభ దేవగన్ధర్వసేవిత, 99
హనుమాంస్త్వయి విశ్రాన్తస్తతః శేషం గమిష్యతి.

ప్ర. అ. చామీకరమహానాభ=బంగారువికార మైన విశాలమైన మధ్యభాగము గలవాడా ! దేవగన్ధర్వసేవిత=దేవతలచేతను గంధర్వులచేతను సేవింపబడినవాడా! హనుమాన్=హనుమంతుడు, త్వయి=నీపై, విశ్రాన్తః=విశ్రమించిన వాడై, తతః=అటుపిమ్మట, శేషమ్=మిగిలిన మార్గమును, గమిష్యతి=వెళ్లగలడు.

తా. సువర్ణమయమైన విశాలమధ్యప్రదేశము గలవాడా ! దేవగంధర్వాదులచేత సేవింపబడినవాడా ! హనుమంతుడు నీ పై కొంతసేపు విశ్రమించి, పిమ్మట, మిగిలిన దూరము ప్రయాణము చేయగలడు. 99

మూ. కాకుత్థ్సస్యానృశంస్యం చ మైథిల్యాశ్చ వివాసనమ్, 100
శ్రమం చ ప్లవగేన్ద్రస్య సమీక్ష్యోత్థాతుమర్హసి.

ప్ర. అ. కాకుత్థ్సస్య=రామునియొక్క, ఆనృశంస్యం చ=సాధుత్వమును, మైథిల్యాః=సీతయొక్క, వివాసనం చ=విదేశవాసమును, ప్లవగేన్ద్రస్య=హనుమంతునియొక్క, శ్రమం చ=శ్రమను, సమీక్ష్య=చూచి, ఉత్థాతుమ్=లేచుటకు, అర్హసి=తగి ఉన్నావు.

తా. రాముని సాధుత్వమును, సీత కష్టములలో ఉన్నదను విషయమును, హనుమంతుని అలసటను దృష్టిలో నుంచుకొని పైకి లెమ్ము. 100

మూ. హిరణ్యనాభో మైనాకో నిశమ్య లవణామ్భసః, 101
ఉత్పపాత జలాత్తూర్ణం మహాద్రుమలతాయుతః.

ప్ర. అ. హిరణ్యనాభః=బంగారము మధ్యభాగమునందు గల, మైనాకః=మైనాకము, లవణామ్భసః=లవణసముద్రముయొక్క వాక్యమును, నిశమ్య=విని, మహాద్రుమలతాయుతః=గొప్ప వృక్షములతోను, లతలతోను కూడినవాడై, తూర్ణమ్=శీఘ్రముగా, జలాత్=జలమునుండి, ఉత్పపాత=పైకి ఎగిరెను.

తా. బంగారు మధ్యభాగము గల ఆ మైనాకము, సముద్రుని మాటలు విని, మహావృక్షలతాదులతో కూడ, వెంటనే, పైకి లేచెను. 101

మూ. స సాగరజలం భిత్త్వా బభూవాభ్యుత్థితస్తదా, 102
యథా జలధరం భిత్త్వా దీప్తరశ్మిర్దివాకరః.

ప్ర. అ. తదా=అప్పుడు, సః=ఆ మైనాకము, సాగరజలమ్=సముద్రజలమును, భిత్త్వా=భేదించుకొని, దీప్తరశ్మిః=ప్రకాశించుచున్న కిరణములు గల, దివాకరః=సూర్యుడు, జలధరమ్=మేఘమును, భిత్త్వా=భేదించుకొని, యథా=ఎట్లో అట్లు, అభ్యుత్థితః=పైకి లేచినవాడు, బభూవ=ఆయెను.

తా. అప్పుడా మైనాకపర్వతము, ప్రకాశించుచున్న కిరణములు గల సూర్యుడు మేఘమండలమును భేదించుకొని పైకి వచ్చినట్లు సముద్రజలమును భేదించుకొని పైకి వచ్చెను. 102

మూ. స మహాత్మా ముహూర్తేన సర్వతః సలిలావృతః, 103
దర్శయామాస శృఙ్గాణి సాగరేణ నియోజితః,

మూ. శాతకుమ్భమయైః శృఙ్గైః సకిన్నరమహోరగైః, 104
ఆదిత్యోదయసంకాశైరాలిఖద్భిరివామ్బరమ్.

ప్ర. అ. సకిన్నరమహోరగైః=కిన్నరులతోను మహాసర్పములతోను కూడినవీ, ఆదిత్యోదయసంకాశైః=సూర్యోదయముతో సమానములూ, అమ్బరమ్=ఆకాశమును, ఆలిఖద్భిః ఇవ=ఒరయుచున్నట్లు ఉన్నవీ, శాతకుమ్భమయైః=బంగారు వికారమైనవీ అయిన, శృఙ్గైః=శిఖరములతో కూడినవాడూ, సర్వతః=అన్నివైపులా, సలిలావృతః= నీటిచే కప్పబడినవాడూ అయిన, సః మహాత్మా=ఆ మహాత్ముడు, సాగరేణ= సముద్రముచేత, నియోజితః=ఆజ్ఞాపింపబడినవాడై, ముహూర్తేన=క్షణకాలములో. శృఙ్గాణి=శిఖరములను, దర్శయామాస=చూపించెను.

తా. గొప్పబుద్ధి కల ఆ మైనాకపర్వతము సముద్రుని కోరికను అనుసరించి, వెంటనే తన శిఖరములను జలము పైకి వచ్చునట్లు చేసెను. ఆ పర్వతము అన్ని ప్రక్కలా సముద్రజలముతో నిండి యుండెను. ఆకాశమును ఒరయుచున్నట్లు ఉన్న ఆ బంగారు శిఖరములు ఉదయించుచున్న సూర్యుడు వలె ప్రకాశించుచుండెను. వాటిపై కింనరులు, మహోరగులు మొదలైనవారు నివసించుచుండిరి. 103, 104

మూ. తప్తజామ్బూనదైః శృఙ్గైః పర్వతస్య సముత్థితైః, 105
ఆకాశం శస్త్రసంకాశమభవత్కాఞ్చనప్రభమ్.

ప్ర. అ. సముత్థితైః=పైకి లేచిన, తప్తజామ్బూనదైః=కరిగిన బంగారమువలె ఉన్న, పర్వతస్య=పర్వతముయొక్క, శృఙ్గైః=శిఖరములచేత, శస్త్రసంకాశమ్=ఖడ్గము వలె నీలవర్ణమైన, ఆకాశమ్=ఆకాశము, కాఞ్చనప్రభమ్=బంగారు కాంతి కలది, అభవత్=అయెను.

తా. పైకి లేచిన ఆ పర్వతశిఖరములు కరిగించిన బంగారము వలె మెరయుచుండుటచే ఇనుమువలె నీలవర్ణముగా ఉన్న ఆకాశము బంగారు కాంతితో ప్రకాశించెను. 105

మూ. జాతరూపమయైః శృఙ్గైర్భ్రాజమానైః స్వయంప్రభైః, 106
ఆదిత్యశతసంకాశః సోఽభవద్గిరిసత్తమః.

ప్ర. అ. స్వయంప్రభైః=స్వయముగానే కాంతి కలవై, భ్రాజమానైః= ప్రకాశించుచున్న, జాతరూపమయైః=బంగారు వికారమైన, శృఙ్గైః=శిఖరములతో,

సః=ఆ గిరిసత్తమః=పర్వతశ్రేష్ఠము, ఆదిత్యశతసంకాశః=వందలకొలది సూర్యులతో సమానము, అభవత్=అయెను.

తా. సహజమైన కాంతితో ప్రకాశించుచున్న బంగారు శిఖరములతో ఆ పర్వతము వందలకొలది సూర్యులతో సమానముగా ఉండెను. 106

మూ. తముత్థితమసంగేన హనుమానగ్రతః స్థితమ్, 107
మధ్యే లవణతోయస్య విఘ్నోఽయమితి నిశ్చితః.

ప్ర. అ. లవణతోయస్య=లవణసముద్రముయొక్క, మధ్యే=మధ్యయందు, అసంగేన=సంబంధమేదియు లేకుండగా (హటాత్తుగా), ఉత్థితమ్=లేచిన, అగ్రతః=తన ఎదుట నిలచిన, తమ్=ఆ పర్వతమును, హనుమాన్=హనుమంతుడు, అయమ్=ఇది, విఘ్నః ఇతి=విఘ్నము అని, నిశ్చితః=నిశ్చయించుకొనెను.

తా. హఠాత్తుగా లవణసముద్రమునుండి లేచి తన ఎదుట నిలచిన ఆ పర్వతము తనకు విఘ్నము కలిగించుటకు వచ్చినదని హనుమంతుడు నిశ్చయించుకొనెను. 107

మూ. స తముచ్ఛ్రితమత్యర్థం మహావేగో మహాకపిః, 108
ఉరసా పాతయామాస జీమూతమివ మారుతః.

ప్ర. అ. మహావేగః=గొప్ప వేగము గల, సః మహాకపిః=ఆ హనుమంతుడు, అత్యర్థమ్=మిక్కిలి, ఉచ్ఛ్రితమ్=ఉన్నతమైన, తమ్=ఆ పర్వతమును, మారుతః=వాయువు, జీమూతమివ=మేఘమును వలె, ఉరసా=వక్షఃస్థలముచేత, పాతయామాస=పడద్రోసెను.

తా. మహావేగము గల ఆ హనుమంతుడు, చాల ఉన్నతమైన ఆ పర్వతమును, వాయువు మేఘమును పడగొట్టినట్లు, వక్షఃస్థలముతో ఢీకొని క్రిందికి పడగొట్టెను. 108

మూ. స తథా పాతితస్తేన కపినా పర్వతోత్తమః, 109
బుద్ధ్వా తస్య కపేర్వేగం జహర్ష చ ననన్ద చ.

ప్ర. అ. తేన కపినా=ఆ హనుమంతునిచేత, తథా=అట్లు, పాతితః=పడగొట్టబడిన, సః పర్వతోత్తమః=ఆ పర్వతశ్రేష్ఠము, తస్య కపేః=ఆ హనుమంతుని యొక్క, వేగమ్=వేగమును, బుద్ధ్వా=తెలిసికొని, జహర్ష చ=హర్షించెను, ననన్ద చ=ఆనందించెను.

తా. హనుమంతుడా విధముగా క్రిందికి పడద్రోయగా, ఆ పర్వతము హనుమంతునకున్న వేగమును గుర్తించి చాల సంతోషించెను. 109

మూ. తమాకాశగతం వీరమాకాశే సముపస్థితః, 110
ప్రీతో హృష్టమనా వాక్యమబ్రవీత్పర్వతః కపిమ్,
మానుషం ధారయన్ రూపమాత్మనః శిఖరే స్థితః. 111

ప్ర. అ. పర్వతః=మైనాకపర్వతము, ప్రీతః=ప్రేమ కలదై, హృష్టమనాః=సంతోషించిన మనస్సుకలదై, మానుషమ్=మనుష్యసంబంధమైన, రూపమ్=రూపమును, ధారయన్=ధరించుచు, ఆత్మనః=తన యొక్క, శిఖరే=శిఖరమునందు, స్థితః=నిలచినదై, ఆకాశగతమ్=ఆకాశములో ఉన్న, తం వీరం కపిమ్=ఆ వీరుడైన హనుమంతుని, ఆకాశే=ఆకాశమునందు, సముపస్థితః=సమీపించినదై, వాక్యమ్=వాక్యమును, అబ్రవీత్=పలికెను.

తా. ఆ మైనాకపర్వతము ప్రేమతో, చాల సంతోషించిన మనస్సు కలదై మనుష్యరూపముతో తన శిఖరముమీద నిలచి, ఆకాశమునందున్న వీరుడైన ఆ హనుమంతుని దగ్గరకు వెళ్ళి ఇట్లు పలికెను. 110, 111

మూ. దుష్కరం కృతవాన్కర్మ త్వమిదం వానరోత్తమ,
నిపత్య మమ శృఙ్గేషు విశ్రమస్వ యథాసుఖమ్. 112

ప్ర. అ. వానరోత్తమ=ఓ వానరశ్రేష్ఠుడా, త్వమ్=నీవు, దుష్కరమ్=చేయ శక్యము కాని, ఇదమ్=ఈ, కర్మ=పనిని, కృతవాన్=చేసినావు. మమ=నా యొక్క, శృఙ్గేషు=శిఖరములపై, నిపత్య=దిగి, యథాసుఖమ్=సుఖము కలుగునట్లుగా, విశ్రమస్వ=విశ్రమించుము.

తా. వానరోత్తమా ! నీవు ఎవ్వరూ చేయజాలని పని చేసినావు. నా శిఖరములపై సుఖముగా విశ్రమించుము. 112

మూ. రాఘవస్య కులే జాతైరుదధిః పరివర్ధితః,
స త్వాం రామహితే యుక్తం ప్రత్యర్చయతి సాగరః. 113

ప్ర. అ. ఉదధిః=సముద్రము, రాఘవస్య=రాముని యొక్క, కులే=కులమునందు, జాతైః=పుట్టినవారిచేత, పరివర్ధితః=వృద్ధి పొందింపబడినది. సః సాగరః=అట్టి ఆ సముద్రము, రామహితే=రాముని హితమునందు, యుక్తమ్=ఉద్యుక్తుడవైన, త్వామ్=నిన్ను, ప్రత్యర్చయతి=బదులుగా పూజించుచున్నది.

తా. రాముని వంశములో పుట్టినవారు సముద్రమును వృద్ధిపొందించినారు. అందుచే ఈ సముద్రము, రామునికి హితము చేయుటకై ప్రయాణము చేయుచున్న నీకు, ప్రతిపూజ చేయవలె నని కోరుచున్నది. 113

మూ. కృతే చ ప్రతికర్తవ్యమేష ధర్మః సనాతనః,
సోఽయం తత్ప్రతికారార్థీ త్వత్తః సంమానమర్హతి. 114

ప్ర. అ. కృతే=ఉపకారము చేయబడినపుడు, ప్రతికర్తవ్యమ్=ప్రత్యుపకారము చేయదగినది. ఏషః=ఇది, సనాతనః=ప్రాచీనమైన, ధర్మః=ధర్మము. తత్ప్రతికారార్థీ=రఘువంశరాజులకు ప్రత్యుపకారము చేయగోరుచున్న, సః అయమ్=అట్టి ఈ సముద్రము, త్వత్తః=నీ నుండి, సంమానమ్=గౌరవమును, అర్హతి=తగియున్నాడు.

తా. ఎవరైన ఉపకారము చేసినపుడు, వారికి ప్రత్యుపకారము చేయవలెను. ఇది అతిప్రాచీనమైన ధర్మము. నీకు సాహాయ్యము చేయుట ద్వారా రఘువంశరాజులకు ప్రత్యుపకారము చేయదలచుచున్న ఈ సముద్రుని నీవు గౌరవించవలెను. 144

మూ. త్వన్నిమిత్తమనేనాహం బహుమానాత్ప్రచోదితః,
యోజనానాం శతం చాపి కపిరేష సమాప్లుతః, 115
తవ సానుషు విశ్రాన్తః శేషం ప్రక్రమతామితి,
తిష్ఠ త్వం హరిశార్దూల మయి విశ్రమ్య గమ్యతామ్. 116

ప్ర. అ. యోజనానాం శతమ్=నూరు యోజనములు, సమాప్లుతః=ఎగిరిన, ఏషః=ఈ, కపిః=హనుమంతుడు, తవ=నీ యొక్క, సానుషు=చరియలమీద, విశ్రాన్తః=విశ్రమించినవాడై, శేషమ్=మిగిలిన మార్గమును, ప్రక్రమతామ్=వెళ్ళుగాక, ఇతి=అని, అనేన=ఈ సముద్రునిచేత, త్వన్నిమిత్తమ్=నీ నిమిత్తమై, అహమ్=నేను, బహుమానాత్=గౌరవభావమువలన, ప్రచోదితః=ప్రేరేపింపబడితిని. హరిశార్దూల=ఓ వానరశ్రేష్ఠుడా ! త్వమ్=నీవు, తిష్ఠ=ఆగుము. మయి=నాపై, విశ్రమ్య=విశ్రమించి, గమ్యతామ్=వెళ్ళబడుగాక (వెళ్ళెదవుగాక).

తా. "నూరు యోజనములదూరము దాటుటకై ఎగురుచున్న ఈ హనుమంతుడు కొంతసేపు నీ చరియలపై విశ్రమించి, మిగిలిన దూరము తరువాత ప్రయాణము చేయుగాక" అని ఈ సముద్రుడు నీపై ఉన్న గౌరవభావముచే నన్ను ప్రేరేపించినాడు. అందుచే ఓ వానరోత్తమా ! ఆగి, నాపై విశ్రమించి, వెళ్ళుము. 115, 116

మూ. తదిదం గన్ధవత్స్వాదు కన్దమూలఫలం బహు,
తదాస్వాద్య హరిశ్రేష్ఠ విశ్రాన్తోఽను గమిష్యసి. 117

ప్ర. అ. హరిశ్రేష్ఠ=ఓ వానరశ్రేష్ఠుడా ! తత్=ఆ కారణమువలన, గన్ధవత్=సుగంధము కలదీ, స్వాదు=మధురమైనదీ, బహు=అధికమూ అయిన, కన్దమూలఫలమ్=దుంపలూ ఫలములూ మొదలైన వాటి సముదాయము, ఇదమ్=ఇదిగో. తత్=దానిని, ఆస్వాద్య=తిని, విశ్రాన్తః=విశ్రమించినవాడవై, అను=పిదప. గమిష్యసి=వెళ్ళగలవు.

తా. ఓ వానరశ్రేష్ఠుడా ! ఇదిగో ఇక్కడ మధురమూ, మంచి వాసన గలదీ అయిన కందమూలఫలాదికము అత్యధికముగా ఉన్నది. దీనిని తిని విశ్రమించి, పిదప వెళ్ళుము. 117

మూ. అస్మాకమపి సమ్బన్ధః కపిముఖ్య త్వయాస్తి వై,
ప్రఖ్యాతస్త్రిషు లోకేషు మహాగుణపరిగ్రహః. 118

ప్ర. అ. కపిముఖ్య=వానరులలో ప్రధానుడా ! త్రిషు=మూడు, లోకేషు=లోకములందు, ప్రఖ్యాతః=ప్రసిద్ధమూ, మహాగుణపరిగ్రహః=గొప్ప గుణముల స్వీకారము కలదీ (గొప్ప గుణములచే ఏర్పడినదీ) అయిన, సంబన్ధః=సంబంధము, త్వయా=నీతో, అస్మాకమపి=మాకు కూడా, అస్తి వై=ఉన్నది.

తా. ఓ ! వానరశ్రేష్ఠుడా ! మాకు కూడా, గొప్ప గుణములచే ఏర్పడిన సంబంధమొకటి నీతో ఉన్నది. అది మూడు లోకములలోను ప్రసిద్ధమైనది. 118

మూ. వేగవన్తః ప్లవన్తో యే ప్లవగా మారుతాత్మజ,
తేషాం ముఖ్యతమం మన్యే త్వామహం కపికుఞ్జర. 119

ప్ర. అ. మారుతాత్మజ=వాయుపుత్రా ! కపికుఞ్జర=ఓ వానరశ్రేష్ఠుడా! వేగవన్తః=వేగము గల, ప్లవన్తః=ఎగురగల, యే=ఏ, ప్లవగాః=వానరులు గలరో, తేషామ్=వారిలో, ముఖ్యతమమ్=చాలా ముఖ్యునిగా, త్వామ్=నిన్ను, అహమ్=నేను, మన్యే=తలచుచున్నాను.

తా. వానరశ్రేష్ఠుడవైన ఓ హనుమంతుడా ! మహావేగముగా ఆకాశ సంచారము చేయగల వానరులలో నీవు సర్వాధికుడవని నా అభిప్రాయము.

మూ. అతిథిః కిల పూజార్హః ప్రాకృతోఽపి విజానతా,
ధర్మం జిజ్ఞాసమానేన కిం పునస్త్వాదృశో మహాన్. 120

ప్ర. అ. ధర్మమ్=ధర్మమును, జిజ్ఞాసమానేన=తెలుసుకొనదలచిన వానిచేతను, విజానతా=ధర్మము తెలిసిన వానిచేతను, ప్రాకృతోఽపి=సామాన్యుడైనను, అతిథిః=అతిథి, పూజార్హః=పూజకు తగినవాడు. త్వాదృశః=నీ వంటి, మహాన్=మహాపురుషుడు, కిం పునః=చెప్పనేల.

తా. ధర్మము తెలియగోరువారూ, తెలిసినవారు కూడా ఇంటికి వచ్చిన అతిథిని, అతడు సామాన్యవ్యక్తియే యైనను, పూజించవలెను. ఇంక నీవంటి మహాపురుషుడు అతిథిగా వచ్చినప్పుడు వేరే చెప్పవలెనా ? 120

మూ. త్వం హి దేవవరిష్ఠస్య మారుతస్య మహాత్మనః,
పుత్రస్తస్యైవ వేగేన సదృశః కపికుఞ్జర. 121

ప్ర. అ. కపికుఞ్జర=ఓ వానరశ్రేష్ఠుడా ! త్వమ్=నీవు, దేవవరిష్ఠస్య=దేవతలలో శ్రేష్ఠుడైన, మహాత్మనః=మహాత్ముడైన, మారుతస్య=వాయుదేవుని యొక్క, పుత్రః హి=పుత్రుడవు కదా. వేగేన=వేగముచేత, తస్యైవ=అతనికే, సదృశః=సమానుడవు.

తా. ఓ వానరశ్రేష్ఠుడా ! నీవు దేవతలలో శ్రేష్ఠుడైన, మహాత్ముడైన, వాయుదేవుని కుమారుడవు. వేగముతో అతనితో సమానుడవు. 121

మూ. పూజితే త్వయి ధర్మజ్ఞ పూజాం ప్రాప్నోతి మారుతః,
తస్మాత్త్వం పూజనీయో మే శృణు చాప్యత్ర కారణమ్. 122

ప్ర. అ. ధర్మజ్ఞ=ధర్మములు తెలిసినవాడా! త్వయి=నీవు, పూజితే=పూజించబడినవాడవగుచుండగా, మారుతః=వాయుదేవుడు, పూజామ్=పూజను, ప్రాప్నోతి=పొందును. తస్మాత్=ఆ కారణమువలన, త్వమ్=నీవు, మే=నాకు,పూజనీయః=పూజింపదగినవాడవు. అత్ర=ఈ విషయమునందు, కారణం చ=కారణమును కూడ, శృణు=వినుము.

తా. ఓ ధర్మజ్ఞుడా! నిన్ను పూజించినచో వాయుదేవుని పూజించినట్లే అగును. అందుచేత నేను నిన్ను పూజించవలసి ఉన్నది. ఇందుకు కారణము చెప్పెదను. వినుము. 122

మూ. పూర్వం కృతయుగే తాత పర్వతాః పక్షిణోఽభవన్,
తే హి జగ్ము ర్దిశః సర్వా గరుడానిలవేగినః. 123

ప్ర. అ. తాత=తండ్రీ! పూర్వమ్=పూర్వము, కృతయుగే=కృతయుగమునందు, పర్వతాః=పర్వతములు, పక్షిణః=రెక్కలు కలవి, అభవన్=అయినవి.

తే=అవి, గరుడానిలవేగినః=గరుత్మంతుని, వాయుదేవుని వేగము వంటి వేగము గలవై, సర్వాః=సమస్తమైన, దిశః=దిక్కులను గూర్చి, జగ్ముః=వెళ్ళినవి.

తా. నాయనా! పూర్వము కృతయుగములో పర్వతాలకు రెక్కలు ఉండెడివి. అవి గరుత్మంతుని వేగముతోను, వాయుదేవుని వేగముతోను సమానమైన వేగముతో దిక్కులకు వెళ్ళుచుండెడివి. 123

మూ. తతస్తేషు ప్రయాతేషు దేవసంఘాః సహర్షిభిః,
భూతాని చ భయం జగ్ముస్తేషాం పతనశఙ్కయా. 124

ప్ర. అ. తతః=అటుపిమ్మట, తేషు=అవి, ప్రయాతేషు=వెళ్ళిన వగుచుండగా, సహర్షిభిః=ఋషులతో కూడిన, దేవసంఘాః=దేవతాసముదాయములూ, భూతాని చ=ఇతరప్రాణులూ, తేషామ్=వాటియొక్క, పతనశఙ్కయా=పతనమును గూర్చిన శంకచేత, భయమ్=భయమును, జగ్ముః=పొందినవి.

తా. అవి ఆ విధముగా ఎగురుచుండుట చూచి, దేవసంఘములు, ఋషులు, ఇతరప్రాణులు, అవి ఎక్కడ మీదపడునో అను శంకచేత భయపడెను.
124

మూ. తతః క్రుద్ధః సహస్రాక్షః పర్వతానాం శతక్రతుః,
పక్షాన్ చిచ్ఛేద వజ్రేణ తత్ర తత్ర సహస్రశః. 125

ప్ర. అ. తతః=అటుపిమ్మట, శతక్రతుః=నూరు యాగములు గల, సహస్రాక్షః=దేవేంద్రుడు, క్రుద్ధః=కోపగించినవాడై, తత్ర తత్ర=అక్కడక్కడ, సహస్రశః=వేలకొలది, పర్వతానామ్=పర్వతములయొక్క, పక్షాన్=రెక్కలను, వజ్రేణ=వజ్రముచేత, చిచ్ఛేద=ఛేదించెను.

తా. అప్పుడు నూరు యజ్ఞములాచరించిన దేవేంద్రుడు కోపించి, వేలకొలది అక్కడక్కడ ఉన్న పర్వతముల రెక్కలను వజ్రాయుధముతో ఖండించెను. 125

మూ. స మాముపాగతః క్రుద్ధో వజ్రముద్యమ్య దేవరాట్,
తతోఽహం సహసా క్షిప్తః శ్వసనేన మహాత్మనా. 126

ప్ర. అ. సః=ఆ, దేవరాట్=దేవేంద్రుడు, క్రుద్ధః=కోపించినవాడై, వజ్రమ్=వజ్రమును, ఉద్యమ్య=ఎత్తి, మామ్=నన్ను, ఉపాగతః=చేరినాడు. తతః=అటుపిమ్మట, అహమ్=నేను, మహాత్మనా=మహాత్ముడైన, శ్వసనేన=వాయుదేవునిచేత, సహసా=వెంటనే, క్షిప్తః=దూరముగా విసరివేయబడితిని.

తా. దేవేంద్రుడు కోపించి, వజ్రమును ఎత్తి, నా పక్షములను ఛేదించుటకై వచ్చెను. అప్పుడు వెంటనే, వాయువు నన్ను దూరముగా తీసికొనిపోయెను. 126

మూ. అస్మిన్లవణతోయే చ ప్రక్షిప్తః ప్లవగోత్తమ,
గుప్తపక్షసమగ్రశ్చ తవ పిత్రాభిరక్షితః. 127

ప్ర. అ. ప్లవగోత్తమ=వానరశ్రేష్ఠా, గుప్తపక్షసమగ్రశ్చ=రక్షింపబడిన రెక్కలతో పరిపూర్ణుడుగా ఉన్న నేను, అస్మిన్=ఈ, లవణతోయే=లవణసముద్రమునందు, ప్రక్షిప్తః=పడవేయబడినవాడనై, తవ పిత్రా=నీ తండ్రిచేత, అభిరక్షితః=రక్షింపబడితిని.

తా. ఓ ! వానరశ్రేష్ఠుడా ! ఈ విధముగా నీ తండ్రి నన్ను ఈ లవణసముద్రములో పడవేసి నా రెక్కలు ఛిన్నములు కాకుండ నా శరీరము పరిపూర్ణముగా ఉండునట్లు చేసి నన్ను రక్షించినాడు. 127

మూ. తతోఽహం మానయామి త్వాం మాన్యో హి మమ మారుతః,
త్వయా మే హ్యేష సంబన్ధః కపిముఖ్య మహాగుణః. 128

ప్ర. అ. కపిముఖ్య=వానరులలో ముఖ్యుడా! మారుతః=వాయుదేవుడు, మమ=నాకు, మాన్యః హి=గౌరవింపతగినవాడు కదా? తతః=ఆ కారణము వలన, అహమ్=నేను, త్వామ్=నిన్ను, మానయామి=గౌరవించుచున్నాను. త్వయా=నీతో, మే=నాయొక్క, ఏషః=ఈ సంబన్ధః=సంబంధము, మహాగుణః=గొప్ప గుణములు కలది.

తా. ఓ వానరోత్తమా!నాకు సహాయము చేసి ఉండుటచేత వాయుదేవుడు నాకు మాననీయుడు. అందుచేత నిన్ను గౌరవించుచున్నాను. నీకును నాకును గల ఈ సంబంధము ఉత్తమగుణములను పట్టి ఏర్పడినది. 128

మూ. అస్మిన్నేవంగతే కార్యే సాగరస్య మమైవ చ,
ప్రీతిం ప్రీతమనాః కర్తుం త్వమర్హసి మహాకపే. 129

ప్ర. అ. మహాకపే=వానరోత్తమా! అస్మిన్=ఈ, కార్యే=కార్యము, ఏవంగతే=ఈవిధముగా నున్నదగుచుండగా, త్వమ్=నీవు, ప్రీతమనాః=సంతోషించిన మనస్సు కలవాడవై, సాగరస్య చ=సముద్రునకు, మమైవ చ=నాకూ, ప్రీతిమ్=ఆనందమును, కర్తుమ్=చేయుటకు,అర్హసి=తగియున్నావు.

తా. ఓ వానరోత్తమా! ఇట్టి పరిస్థితులలో నీవు, (మా ఆతిథ్యముచేత) సంతోషించిన మనస్సుతో, నాకూ, సముద్రునికి సంతోషము కలిగించుము.129

మూ. శ్రమం మోక్షయ పూజాం చ గృహాణ కపిసత్తమ,
ప్రీతిం చ బహుమన్యస్వ ప్రీతోఽస్మి తవ దర్శనాత్. 130

ప్ర. అ. కపిసత్తమ=వానరోత్తమా! శ్రమమ్=అలసటను, మోక్షయ=త గ్గించుకొనుము. పూజాం చ=పూజను, గృహాణ=గ్రహించుము. ప్రీతిమ్=మా ప్రేమను, బహుమన్యస్వ=గౌరవించుము. తవ=నీయొక్క, దర్శనాత్=దర్శనమువలన, ప్రీతః అస్మి=సంతోషించినాను.

తా. ఓ వానరోత్తమా! మా పూజను అందుకొనుము. కొంతసేపు విశ్రమించుము. మా స్నేహమును గౌరవింపుము. నీ దర్శనము నా కెంతో ఆనందము కలిగించినది. 130

మూ. ఏవముక్తః కపిశ్రేష్ఠస్తం నగోత్తమమబ్రవీత్,
ప్రీతోఽస్మి కృతమాతిథ్యం మన్యురేషోఽపనీయతామ్. 131

ప్ర. అ. ఏవమ్=ఈ విధముగా, ఉక్తః=పలకబడిన, కపిశ్రేష్ఠః=హనుమం తుడు, తం నగోత్తమమ్=ఆ పర్వతోత్తమమును గూర్చి, అబ్రవీత్=పలికెను. ప్రీతః అస్మి=సంతోషించితిని. ఆతిథ్యమ్=ఆతిథ్యము, కృతమ్=చేయబడినది. ఏషః=ఈ, మన్యుః=కోపము, అపనీయతామ్=తొలగించబడుగాక.

తా. హనుమంతుడు ఆ పర్వతోత్తముని మాటలు విని ఇట్లు పలికెను. నీవు ఆతిథ్యము చేసినట్లే సంతోషించుచున్నాను. నీ ఆతిథ్యమును స్వీకరించలేదని కోపగించకుము. 131

మూ. త్వరతే కార్యకాలో మే అహశ్చాప్యతివర్తతే,
ప్రతిజ్ఞా చ మయా దత్తా న స్థాతవ్యమిహాన్తరే. 132

ప్ర. అ. మే=నాయొక్క, కార్యకాలః=కార్యసమయము, త్వరతే=తొం దరపెట్టుచున్నది. అహః చ=పగలు కూడా, అతివర్తతే=దాటిపోవుచున్నది. మయా=నాచేత, ప్రతిజ్ఞా=ప్రతిజ్ఞ, దత్తా చ=ఇవ్వబడినది కూడ. అన్తరే=మధ్య యందు, ఇహ=ఇక్కడ, న స్థాతవ్యమ్=నిలువకూడదు.

తా. నా కార్యసమయము మించిపోవుచున్నది. పగలు గడచి పోవుచున్నది. నేను నా మిత్రుల ఎదుట ప్రతిజ్ఞ చేసి ఉన్నాను. అందుచేత కూడ నేను మార్గమధ్యమునందు ఆగుటకు వీలుకాదు. 132

మూ. ఇత్యుక్త్వా పాణినా శైలమాలభ్య హరిపుఙ్గవః,
జగామాకాశమావిశ్య వీర్యవాన్ ప్రహసన్నివ. 133

ప్ర. అ. వీర్యవాన్=పరాక్రమవంతుడైన, హరిపుఙ్గవః=హనుమంతుడు, ఇతి=ఇట్లు, ఉక్త్వా=పలికి, శైలమ్=మైనాకపర్వతమును, పాణినా=హస్తముతో, ఆలభ్య=స్పృశించి, ఆకాశమ్=ఆకాశమును, ఆవిశ్య=ప్రవేశించి, ప్రహసన్నివ=నవ్వుచు, జగామ=వెళ్ళెను.

తా. వీర్యవంతుడైన ఆ హనుమంతుడు మైనాకునితో ఇట్లు చెప్పి, తన హస్తముతో సస్నేహముగా స్పృశించి, సంతోషించుచు, ఆకాశ మార్గమునందు, ప్రయాణము చేసెను. 133

మూ. స పర్వతసముద్రాభ్యాం బహుమానాదవేక్షితః,
పూజితశ్చోపపన్నాభిరాశీర్భిరనిలాత్మజః. 134

ప్ర. అ. సః=ఆ, అనిలాత్మజః=హనుమంతుడు, పర్వతసముద్రాభ్యామ్=పర్వతముచేతను, సముద్రముచేతను, బహుమానాత్=గౌరవముతో, అవేక్షితః=చూడబడినవాడై, ఉపపన్నాభిః=తగిన, ఆశీర్భిః=ఆశీర్వాదములతో, పూజితః చ=పూజింపబడినాడు కూడ.

తా. ఆ హనుమంతుని మైనాకుడు, సముద్రుడూ గౌరవభావముతో చూచుచు తగిన ఆశీర్వాదవాక్యములతో అభినందించిరి. 134

మూ. అథోర్ధ్వం దూరముత్ప్లుత్య హిత్వా శైలమహార్ణవౌ,
పితుః పన్థానమాస్థాయ జగామ విమలేఽమ్బరే. 135

ప్ర. అ. అథ=అటుపిమ్మట, శైలమహార్ణవౌ=మైనాకపర్వతమును, మహాసముద్రమును, హిత్వా=విడచి, ఊర్ధ్వమ్=పైకి, దూరమ్=దూరముగా, ఉత్ప్లుత్య=ఎగిరి, విమలే=స్వచ్ఛమైన,అమ్బరే=ఆకాశమునందు, పితుః=తండ్రియొక్క, పన్థానమ్=మార్గమును, ఆస్థాయ=అధిష్ఠించి, జగామ=వెళ్ళెను.

తా. హనుమంతుడు మైనాక పర్వతమును, సముద్రమును విడచి, బాగా పైకి ఎగిరి, నిర్మలమైన ఆకాశమునందు, వాయుమార్గమున ప్రయాణము చేసెను. 135

మూ. భూయశ్చోర్ధ్వం గతిం ప్రాప్య గిరిం తమవలోకయన్,
వాయుసూనుర్నిరాలమ్బే జగామ విమలేఽమ్బరే. 136

ప్ర. అ. వాయుసూనుః=హనుమంతుడు, భూయః చ=మరల, ఊర్ధ్వమ్=పైభాగమున, గతిమ్=గమనమును, ప్రాప్య=పొంది, తం గిరిమ్=ఆ పర్వతమును, అవలోకయన్=చూచుచు, నిరాలమ్బే=ఆధారములేని, విమలే=నిర్మలమైన, అమ్బరే=ఆకాశమునందు, జగామ=వెళ్ళెను.

తా. ఆ వాయునందనుడు, ఇంకా పైకి వెళ్ళి, మైనాకపర్వతమును చూచుచు, ఎట్టి ఆధారమూ లేని, నిర్మలమైన ఆకాశమునందు ప్రయాణము చేసెను. 136

మూ. తద్ద్వితీయం హనుమతో దృష్ట్వా కర్మ సుదుష్కరమ్,
ప్రశశంసుః సురాః సర్వే సిద్ధాశ్చ పరమర్షయః. 137

ప్ర. అ. హనుమతః=హనుమంతునియొక్క, తత్=ఆ, సుదుష్కరమ్=చేయుటకు చాల కష్టమైన, ద్వితీయమ్=రెండవ, కర్మ=(మైనాకమును పడగొట్టుట) అను పనిని (మొదటిది సముద్రతరణము), దృష్ట్వా=చూచి, సర్వే=సమస్తమైన, సురాః=దేవతలు, సిద్ధాశ్చ=సిద్ధులు, పరమర్షయః=మహర్షులు, ప్రశశంసుః=ప్రశంసించిరి.

తా. చేయుటకు చాల కష్టమైన ఆ రెండవ కార్యమును హనుమంతుడు చేయగా చూచి, దేవతలు, సిద్ధులు, మహర్షులు, అందరూ ప్రశంసించిరి. 137

మూ. దేవతాశ్చాభవన్ హృష్టాస్తత్రస్థాస్తస్య కర్మణా,
కాఞ్చనస్య సునాభస్య సహస్రాక్షశ్చ వాసవః. 138

ప్ర. అ. తత్రస్థాః=అక్కడ ఉన్న, దేవతాశ్చ=దేవతలు, సహస్రాక్షః=వేయి కనులు గల, వాసవశ్చ=దేవేంద్రుడు, కాఞ్చనస్య=బంగారువికారమైన, తస్య=ఆ, సునాభస్య=మైనాకముయొక్క, ("సునాభ"అనునది మైనాకమునకు అసలు పేరు అయి ఉండును. మేనక కుమారుడు గా మైనాకమని పేరు వచ్చినది), కర్మణా=పనిచేత, హృష్టాః=సంతోషించినవారు, అభవన్=అయిరి.

తా. బంగారువికారమైన ఆ సునాభ (మైనాక) పర్వతము చేసిన పనికి అక్కడ ఉన్న దేవతలు, దేవేంద్రుడు కూడ చాలా సంతోషించిరి. 138

మూ. ఉవాచ వచనం ధీమాన్ పరితోషాత్సగద్గదమ్,
సునాభం పర్వతశ్రేష్ఠం స్వయమేవ శచీపతిః. 139

ప్ర. అ. ధీమాన్=బుద్ధిమంతుడైన, శచీపతిః=దేవేంద్రుడు, పర్వతశ్రేష్ఠమ్=పర్వతములలో శ్రేష్ఠమైన, సునాభమ్=సునాభ పర్వతమును గూర్చి, పరితోషాత్=ఆనందమువలన, సగద్గదమ్=గద్గదస్వరముతో కూడినట్లుగా, స్వయమేవ=స్వయముగానే, వచనమ్=వచనమును, ఉవాచ=పలికెను.

తా. బుద్ధిశాలియైన దేవేంద్రుడు సంతోషముతో డగ్గుత్తిక కలిగిన కంఠస్వరముతో, పర్వతశ్రేష్ఠుడైన ఆ సునాభునితో స్వయముగా ఇట్లు పలికెను.

మూ. హిరణ్యనాభ శైలేన్ద్ర పరితుష్టోఽస్మి తే భృశమ్,
అభయం తే ప్రయచ్ఛామి తిష్ఠ సౌమ్య యథాసుఖమ్. 140

ప్ర. అ. హిరణ్యనాభ=బంగారము మధ్యప్రదేశమునందు గల, శైలేన్ద్ర=ఓ శైలరాజా ! తే=నీ విషయమున, భృశమ్=మిక్కిలి, పరితుష్టః అస్మి=సంతోషించినాను. సౌమ్య=ఓ సౌమ్యుడా, తే=నీకు, అభయమ్=అభయమును, ప్రయచ్ఛామి=ఇచ్చుచున్నాను. యథాసుఖమ్=సుఖముగా, తిష్ఠ=ఉండుము.

తా. హిరణ్యము మధ్యయందు గల ఓ మైనాకుడా ! నీ విషయమున చాలా సంతోషించినాను. ఓ సౌమ్యుడా ! నీకు అభయమిచ్చుచున్నాను. ఇటుపై నీకు ఇష్టము వచ్చిన చోట సుఖముగా ఉండుము. 140

మూ. సాహ్యం కృతం తే సుమహద్విక్రాన్తస్య హనూమతః,
క్రమతో యోజనశతం నిర్భయస్య భయే సతి. 141

ప్ర. అ. విక్రాన్తస్య=పరాక్రమించుచున్నవాడూ, యోజనశతమ్=నూరు యోజనములు, క్రమతః=దాటుచున్నవాడూ, భయే సతి=భయకారణము కలిగినపుడు కూడ, నిర్భయస్య=భయము లేనివాడూ అయిన, హనూమతః=హనుమంతునకు, తే=నీకు(నీ చేత), సుమహత్=చాల గొప్ప, సాహ్యమ్=సాహాయ్యము, కృతమ్=చేయబడినది.

తా. ఎంతో భయపడవలసిన సమయమునందు కూడ ఏ మాత్రము భయము లేక, పరాక్రమము చూపి, నూరు యోజనముల దూరము దాటుచున్న హనుమంతునకు చాల గొప్ప సాహాయ్యము చేసినావు. 141

మూ. రామస్యైష హితాయైవ యాతి దాశరథేర్హరిః,
సత్క్రియాం కుర్వతా తస్య తోషితోఽస్మి దృఢం త్వయా. 142

ప్ర. అ. ఏషః హరిః=ఈ వానరుడు (హనుమంతుడు), దాశరథేః=దశరథకుమారుడైన, రామస్య=రాముని యొక్క, హితాయైవ=హితము కొరకే, యాతి=వెళ్ళుచున్నాడు. తస్య=అతనికి, సత్క్రియామ్=సత్కారమును, కుర్వతా=చేయుచున్న, త్వయా=నీ చేత, దృఢమ్=మిక్కిలి, తోషితః అస్మి=సంతోషపెట్టబడినాను.

తా. ఈ హనుమంతుడు, దశరథకుమారుడైన రామునకు హితము చేయుటకే వెళ్ళుచున్నాడు. అట్టివానికి నీవు సత్కారము చేసినందుకు నేను చాలా సంతోషించుచున్నాను. 142

మూ. తతః ప్రహర్షమగమద్విపులం పర్వతోత్తమః,
దేవతానాం పతిం దృష్ట్వా పరితుష్టం శతక్రతుమ్. 143

ప్ర. అ. తతః=అటు పిమ్మట, పర్వతోత్తమః=ఆ పర్వతశ్రేష్ఠము, దేవతానామ్=దేవతలకు, పతిమ్=ప్రభువైన, శతక్రతుమ్=ఇంద్రుని, పరితుష్టమ్=సంతోషించినవానినిగా, దృష్ట్వా=చూచి, విపులమ్=అధికమైన, ప్రహర్షమ్=ఆనందమును, అగమత్=పొందెను.

తా. దేవాధీశ్వరుడైన ఇంద్రుడు తన విషయమున సంతోషించినాడను విషయమును తెలిసికొని, ఆ పర్వతశ్రేష్ఠము చాలా ఆనందించెను. 143

మూ. స వై దత్తవరః శైలో బభూవావస్థితస్తదా,
హనుమాంశ్చ ముహూర్తేన వ్యతిచక్రామ సాగరమ్. 144

ప్ర. అ. తదా=అప్పుడు, దత్తవరః=ఇవ్వబడిన వరము గల, సః=ఆ, శైలః=పర్వతము, అవస్థితః=అచటనే నిలచినది, బభూవ=ఆయెను. హనుమాంశ్చ=హనుమంతుడు కూడ, ముహూర్తేన=క్షణకాలములో, సాగరమ్=సముద్రమును, వ్యతిచక్రామ=దాటెను.

తా. అప్పుడు దేవేంద్రునినుండి వరము పొందిన మైనాకము అక్కడ నిలచి ఉండగా, హనుమంతుడు అనతికాలములో సముద్రములోని చాల దూరము దాటి వెళ్ళెను. 144

మూ. తతో దేవాః సగన్ధర్వాః సిద్ధాశ్చ పరమర్షయః,
అబ్రువన్ సూర్యసంకాశాం సురసాం నాగమాతరమ్. 145

ప్ర. అ. తతః=అటుపిమ్మట, సగన్ధర్వాః=గంధర్వులతో కూడిన, దేవాః=దేవతలు, సిద్ధాశ్చ=సిద్ధులు, పరమర్షయః=మహర్షులూ, సూర్యసంకాశామ్=సూర్యునితో సమానమైన, నాగమాతరమ్=నాగమాతయైన, సురసామ్=సురసను గూర్చి, అబ్రువన్=పలికిరి.

తా. అప్పుడు, దేవతలు, గంధర్వులు, సిద్ధులు, మహర్షులు, సూర్యునితో సమానమైన ప్రకాశముగల నాగమాతయైన సురసతో ఇట్లు పలికిరి. 145

మూ. అయం వాతాత్మజః శ్రీమాన్ప్లవతే సాగరోపరి,
హనుమాన్నామ తస్య త్వం ముహూర్తం విఘ్నమాచర. 146
రాక్షసం రూపమాస్థాయ సుఘోరం పర్వతోపమమ్,
దంష్ట్రాకరాళం పిఙ్గాక్షం వక్త్రం కృత్వా నభఃసమమ్. 147

ప్ర. అ. హనుమాన్నామ=హనుమంతుడను పేరు గల, శ్రీమాన్=శ్రీమంతుడైన, అయం=ఈ, వాతాత్మజః=వాయుకుమారుడు, సాగరోపరి=సముద్రముపైన, ప్లవతే=ఎగురుచున్నాడు, త్వమ్=నీవు, సుఘోరమ్=చాల భయంకరమూ, పర్వతోపమమ్=పర్వతముతో సమానమూ అయిన, రాక్షసమ్=రాక్షససంబంధమైన, రూపమ్=రూపమును, ఆస్థాయ=గ్రహించి, దంష్ట్రాకరాళమ్=కోరలతో భయంకరమూ, పిఙ్గాక్షమ్=పచ్చని నేత్రములు కలదీ, నభఃసమమ్=ఆకాశముతో సమానమూ అయిన, వక్త్రమ్=ముఖమును, కృత్వా=చేసి, ముహూర్తమ్=క్షణకాలముపాటు, తస్య=వానికి, విఘ్నమ్=విఘ్నమును, ఆచర=చేయుము.

తా. హనుమంతు డను పేరు గల శ్రీమంతుడైన ఈ వాయుపుత్రుడు సముద్రముపై ఎగురుచున్నాడు. నీవు భయంకరమూ పర్వతసమానమూ అయిన రాక్షసరూపము ధరించి కోరలతో భయంకరముగా ఉన్న, పచ్చని కళ్ళు గల, ఆకాశమంత నోరు చేసుకొని ముహూర్తకాలము ఇతనికి విఘ్నము చేయుము.

మూ. బలమిచ్ఛామహే జ్ఞాతుం భూయశ్చాస్య పరాక్రమమ్,
త్వాం విజేష్యత్యుపాయేన విషాదం వా గమిష్యతి. 148

ప్ర. అ. అస్య=ఇతనియొక్క, బలమ్=బలమును, భూయః=మరియు, పరాక్రమం చ=పరాక్రమమును, ఉపాయేన=ఉపాయముచేత, త్వామ్=నిన్ను, విజేష్యతి=జయించగలడా, వా=లేక, విషాదమ్=దుఃఖమును, గమిష్యతి=పొందగలడా అను విషయమునూ, జ్ఞాతుమ్=తెలిసికొనుటకు, ఇచ్ఛామహే=కోరుచున్నాము.

తా. ఇతని బలపరాక్రమములను, నిన్ను ఉపాయమేదైన చేసి జయించ గలడా లేదా దిగులుపాటు చెందునా అను విషయమును తెలుసుకొనవలెనని కోరుచున్నాము.

మూ. ఏవముక్తా తు సా దేవీ దైవతైరభిసత్కృతా,
సముద్రమధ్యే సురసా బిభ్రతీ రాక్షసం వపుః. 149
వికృతం చ విరూపం చ సర్వస్య చ భయావహమ్,
ప్లవమానం హనూమన్తమావృత్యేదముువాచ హ. 150

ప్ర. అ. దేవీ=దేవి యైన, సా సురసా=ఆ సురస, దైవతైః=దేవతల చేత, ఏవమ్=ఇట్లు, ఉక్తా=పలకబడినదై, అభిసత్కృతా=పూజింపబడినదై, సముద్రమధ్యే=సముద్రమధ్యమునందు, వికృతమ్=వికృతమైనదీ, విరూపం చ=వికారమైన రూపము కలదీ, సర్వస్య=అందరికీ, భయావహమ్=భయము కలిగించేదీ అయిన, రాక్షసం వపుః=రాక్షసశరీరమును, బిభ్రతీ=ధరించుచున్నదై, ప్లవమానమ్=ఎగురు

చున్న, హనూమన్తమ్=హనుమంతుని, ఆవృత్య=అడ్డుకొని, ఇదమ్=ఈ వాక్యమును, ఉవాచ హ=పలికెను.

తా. దేవతలు గౌరవపూర్వకముగా ఈ విధముగా కోరగా, ఆ సురసాదేవి అందరికీ భయము కలిగించు చాల వికారముగా ఉన్న రాక్షస శరీరము ధరించినదై ఎగిరి వెళ్లుచున్న హనుమంతుని సముద్రమధ్యమునందు అడ్డుకొని ఇట్లు పలికెను. 149, 150

మూ. మమ భక్షః ప్రదిష్టస్త్వమీశ్వరైర్వానరర్షభ,
అహం త్వా భక్షయిష్యామి ప్రవిశేదం మమాననమ్. 151

ప్ర. అ. వానరర్షభ=ఓ వానరశ్రేష్ఠుడా! త్వమ్=నీవు, ఈశ్వరైః=దేవతలచేత, మమ=నా యొక్క, భక్షః=ఆహారముగా, ప్రదిష్టః=ఇవ్వబడినావు. అహమ్=నేను, త్వామ్=నిన్ను, భక్షయిష్యామి=భక్షించెదను. ఇదమ్=ఈ, మమ=నాయొక్క, ఆననమ్=ముఖమును, ప్రవిశ=ప్రవేశించుము.

తా. ఓ వానరశ్రేష్ఠుడా ! దేవతలు నిన్ను నాకాహారముగా ఇచ్చినారు. నిన్ను భక్షించెదను. నా ముఖములోనికి ప్రవేశించుము. 151

మూ. ఏవముక్తః సురసయా ప్రాఞ్జలిర్వానరర్షభః,
ప్రహృష్టవదనః శ్రీమానిదం వచనమబ్రవీత్. 152

ప్ర. అ. సురసయా=సురసచేత, ఏవమ్=ఇట్లు, ఉక్తః=పలకబడిన, శ్రీమాన్=శోభ గల, వానరర్షభః=ఆ వానరశ్రేష్ఠుడు, ప్రహృష్టవదనః=సంతోషించిన ముఖము కలవాడై, ప్రాఞ్జలిః=కట్టబడిన దోసిలి కలవాడై, ఇదం వచనమ్=ఈ వాక్యమును, అబ్రవీత్=పలికెను.

తా. శ్రీమంతుడైన ఆ వానరోత్తముడు, సురస మాటలు విని, ఏమాత్రము దిగులు చెందక, చేతులు జోడించి నమస్కరించుచు ఇట్లు పలికెను.

మూ. రామో దాశరథిర్నామ ప్రవిష్టో దణ్డకావనమ్,
లక్ష్మణేన సహ భ్రాత్రా వైదేహ్యా చాపి భార్యయా. 153

ప్ర. అ. దాశరథిః=దశరథ కుమారుడైన, రామో నామ=రాముడను పేరు గల వీరుడు, భ్రాత్రా=సోదరుడైన, లక్ష్మణేన సహ=లక్ష్మణునితోను, భార్యయా=భార్యయైన, వైదేహ్యా చాపి=సీతతోను, దణ్డకావనమ్=దండకారణ్యమును, ప్రవిష్టః=ప్రవేశించినాడు.

తా. దశరథకుమారుడైన రాముడు సోదరుడైన లక్ష్మణునితోను, భార్యయైన సీతతోను దండకారణ్యములో ప్రవేశించినాడు. 153

మూ. అన్యకార్యవిషక్తస్య బద్ధవైరస్య రాక్షసైః,
తస్య సీతా హృతా భార్యా రావణేన యశస్వినీ. 154

ప్ర. అ. రాక్షసైః=రాక్షసులతో, బద్ధవైరస్య=కట్టబడిన వైరము కల, తస్య=ఆ రాముడు, అన్యకార్యవిషక్తస్య=కార్యాంతరమునందు లగ్నుడై ఉండగా, యశస్వినీ=కీర్తిమంతురాలైన, భార్యా=భార్యయైన, సీతా=సీత, రావణేన=రావణునిచేత, హృతా=హరింపబడినది.

తా. ఆ రామునకు రాక్షసులతో వైరమేర్పడినది. ఒకనాడాతడు మరియొక పనిలో ఉండగా అతని భార్యయైన, కీర్తిమంతురాలైన సీతను రావణుడు అపహరించెను. 154

మూ. తస్యాః సకాశం దూతోఽహం గమిష్యే రామకారణాత్,
కర్తుమర్హసి రామస్య సాహ్యం విషయవాసిని. 155

ప్ర. అ. అహమ్=నేను, రామకారణాత్=రాముని నిమిత్తమై, దూతః=దూతనై, తస్యాః=ఆమెయొక్క, సకాశమ్=సమీపమును గూర్చి, గమిష్యే=వెళ్ళగలను. విషయవాసిని=రాముని దేశములో (రాజ్యములో) నివసించుచున్నదానా! రామస్య=రామునకు, సాహ్యమ్=సాహాయ్యమును, కర్తుమ్=చేయుటకు, అర్హసి=తగిఉన్నావు.

తా నేను రాముని ఆజ్ఞచే ఆతని దూతగా సీత దగ్గరకు వెళ్ళుచున్నాను. నీవు రాముని రాజ్యమునందే నివసించుచున్నావుగాన నీవు కూడ రామునకు సాహాయ్యము చేయవలెను. 155

మూ. అథవా మైథిలీం దృష్ట్వా రామం చాక్లిష్టకారిణమ్,
ఆగమిష్యామి తే వక్త్రం సత్యం ప్రతిశృణోమి తే. 156

ప్ర. అ. అథవా=అట్లుకానిచో, మైథిలీమ్=సీతను, అక్లిష్టకారిణమ్=శ్రమపడకుండా పనులు చేయు, రామం చ=రామునీ, దృష్ట్వా=చూచి, తే=నీయొక్క, వక్త్రమ్=ముఖమును, ఆగమిష్యామి=పొందగలను. సత్యమ్=యథార్థముగా, తే=నీకు, ప్రతిశృణోమి=ప్రతిజ్ఞ చేయుచున్నాను.

తా. అట్లు నీకు అంగీకారము కాని పక్షమున నేను సీతను చూచి, ఆ విషయము రామునకు తెలిపి, నీ ముఖములోనికి వచ్చెదను. సత్యముగా ప్రతిజ్ఞ చేయుచున్నాను. 156

మూ. ఏవముక్తా హనుమతా సురసా కామరూపిణీ,
అబ్రవీన్నాతివర్తేత కశ్చిదేష వరో మమ. 157

ప్ర. అ. హనుమతా=హనుమంతునిచేత, ఏవమ్=ఇట్లు, ఉక్తా=పలకబడిన, కామరూపిణీ=స్వేచ్ఛారూపము గల, సురసా=సురస, అబ్రవీత్=పలికెను. కశ్చిత్=ఎవ్వడును, నాతివర్తేత=నన్ను అతిక్రమించి పోజాలడు. ఏషః=ఇది, మమ=నా యొక్క, వరః=వరము.

తా. ఇచ్ఛానుసారము రూపము ధరించే శక్తిగల ఆ సురస హనుమంతుని మాటలు విని, "నన్నెవ్వరును అతిక్రమించి పోజాలరు. ఇది నాకున్న వరము" అని పలికెను. 157

మూ. తం ప్రయాన్తం సముద్వీక్ష్య సురసా వాక్యమబ్రవీత్,
బలం జిజ్ఞాసమానా వై నాగమాతా హనూమతః. 158

ప్ర. అ. నాగమాతా=నాగమాతయైన, సురసా=సురస, హనూమతః=హనుమంతునియొక్క, బలమ్=బలమును, జిజ్ఞాసమానా వై=తెలియగోరుచున్నదై, ప్రయాన్తమ్=వెళ్ళిపోవుచున్న, తమ్=ఆతనిని, సముద్వీక్ష్య=చూచి, వాక్యమ్=వాక్యమును, అబ్రవీత్=పలికెను.

తా. నాగమాతయైన సురస హనుమంతునికి ఎంత బలమున్నదో తెలుసుకొనవలెనను ఉద్దేశ్యముతో, వెళ్ళిపోవుచున్న ఆతనిని చూచి ఇట్లు పలికెను.

మూ. ప్రవిశ్య వదనం మేఽద్య గన్తవ్యం వానరోత్తమ,
వర ఏష పురా దత్తో మమ ధాత్రేతి సత్వరా. 159
వ్యాదాయ విపులం వక్త్రం స్థితా సా మారుతేః పురః.

ప్ర. అ. వానరోత్తమ=వానరశ్రేష్ఠుడా ! అద్య=ఇప్పుడు, మే=నాయొక్క, వదనమ్=ముఖమును, ప్రవిశ్య=ప్రవేశించి, గన్తవ్యమ్=వెళ్లదగిఉన్నది. ఏషః వరః=ఈ వరము, పురా=పూర్వమునందు, మమ=నాకు, ధాత్రా=బ్రహ్మదేవునిచేత, దత్తః=ఇవ్వబడినది. ఇతి=ఇట్లు పలికి, సత్వరా=తొందరలో కూడినదై, విపులమ్=విశాలమైన, వక్త్రమ్=ముఖమును, వ్యాదాయ=తెరచి, సా=ఆమె, మారుతేః=హనుమంతుని యొక్క, పురః=ఎదుట, స్థితా=నిలచినది.

తా. "ఓ వానరశ్రేష్ఠుడా ! నా ముఖములో ప్రవేశించిన పిదపనే నీవు వెళ్ళవలసి ఉన్నది. ఇది నాకు పూర్వము బ్రహ్మదేవుడు ఇచ్చిన వరము". ఇట్లు పలుకుచు ఆమె తొందరగా విశాలమైన ముఖమును తెరచి హనుమంతుని ఎదుట నించెను. 159

మూ. ఏవముక్తః సురసయా క్రుద్ధో వానరపుఙ్గవః, 160
అబ్రవీత్కురు వై వక్త్రం యేన మాం విషహిష్యసే.

ప్ర. అ. సురసయా=సురసచేత, ఏవమ్=ఇట్లు, ఉక్తః=పలకబడిన, వానరపుఙ్గవః=హనుమంతుడు, క్రుద్ధః=కోపించినవాడై, అబ్రవీత్=పలికెను, వక్త్రమ్=ముఖమును, కురు వై=పెద్దది చేయుము. యేన=దేనిచేత, మామ్=నన్ను, విషహిష్యసే=సహించగలవో.

తా. సురస మాటలు విన్న హనుమంతుడు కోపముతో ఇట్లనెను - "నీవు ఎంత పెద్దగా నీ నోరు చాపెదవో చాపుము, నన్నెట్లు సహించెదవో చూచెదను". 160

మూ. ఇత్యుక్త్వా సురసాం క్రుద్ధో దశయోజనమాయతః, 161
దశయోజనవిస్తారో బభూవ హనుమాంస్తదా.

ప్ర. అ. తదా=అప్పుడు, హనుమాన్=హనుమంతుడు, సురసామ్=సురసను గూర్చి, ఇతి=ఇట్లు, ఉక్త్వా=పలికి, క్రుద్ధః=కోపించినవాడై, దశయోజనమ్=నూరు యోజనములు, ఆయతః=పొడవైనవాడు గాను, దశయోజనవిస్తారః=పదియోజనముల వైశాల్యము కలవాడు గాను, బభూవ=ఆయెను.

తా. అప్పుడు, హనుమంతుడు సురసతో, ఇట్లు పలికి, కోపించినవాడై, పది యోజనముల పొడవు, పది యోజనముల వైశాల్యము ఉండునట్లు దేహమును పెంచెను. 161

మూ. తం దృష్ట్వా మేఘసంకాశం దశయోజనమాయతమ్, 162
చకార సురసా చాస్యం వింశద్యోజనమాయతమ్.

ప్ర. అ. దశయోజనమ్=పది యోజనములు, ఆయతమ్=పొడవైన, మేఘసంకాశమ్=మేఘముతో సమానమైన, తమ్=అతనిని, దృష్ట్వా=చూచి, సురసా చ=సురస కూడ, ఆస్యమ్=ముఖమును, వింశద్యోజనమ్=ఇరువది యోజనములు, ఆయతమ్=పొడవైన దానినిగా, చకార=చేసెను.

తా. పది యోజనములు పొడవుగా, మేఘము వలె ఉన్న ఆ హనుమంతుని చూచి, సురస కూడ, తన ముఖమును ఇరువది యోజనముల పొడవగునట్లు పెంచెను. 162

మూ. హనుమాంస్తు తతః క్రుద్ధస్త్రింశద్యోజనమాయతః. 163
చకార సురసా వక్త్రం చత్వారింశత్తథోచ్ఛ్రితమ్,
బభూవ హనుమాన్వీరః పఞ్చాశద్యోజనోచ్ఛ్రితః. 164

ప్ర. అ. తతః=పిమ్మట, హనుమాంస్తు=హనుమంతుడైతే, క్రుద్ధః=కోపించినవాడై, త్రింశద్యోజనమ్=ముప్పదియోజనములు, ఆయతః=పొడవాయెను. సురసా=సురస, తథా=అట్లే, వక్త్రమ్=ముఖమును, చత్వారింశత్=నలుబదియోజనములు, ఉచ్ఛ్రితమ్=ఎత్తైనదానినిగా, చకార=చేసెను, వీరః=వీరుడైన, హనుమాన్=హనుమంతుడు, పఞ్చాశద్యోజనోచ్ఛ్రితః=ఏబది యోజనములు ఎత్తు కలవాడు, బభూవ=ఆయెను.

తా. పిమ్మట హనుమంతుడు, కుపితుడై, ముప్పది యోజనముల పొడవాయెను. సురస తన ముఖమును నలుబది యోజనముల ఎత్తు పెంచెను. వీరుడైన హనుమంతుడు ఏబది యోజనముల ఎత్తు పెరిగెను. 163, 164

మూ. చకార సురసా వక్త్రం షష్టియోజనమాయతమ్,
తథైవ హనుమాన్వీరః సప్తతీయోజనోచ్ఛ్రితః. 165

ప్ర. అ. సురసా=సురస, వక్త్రమ్=ముఖమును, షష్టియోజనమ్=అరువది యోజనములు, ఆయతమ్=పొడవైనదానినిగా, చకార=చేసెను. వీరః=వీరుడైన, హనుమాన్=హనుమంతుడు, తథైవ=అట్లే, సప్తతీయోజనోచ్ఛ్రితః=డెబ్బదియోజనముల ఎత్తు కలవాడాయెను.

తా. సురస తన ముఖము అరువది యోజనముల పొడవు పెంచెను. వీరుడైన హనుమంతుడు కూడ డెబ్బది యోజనముల పొడవయ్యెను. 165

మూ. చకార సురసా వక్త్రమశీతీయోజనోచ్ఛ్రితమ్,
హనుమానచలప్రఖ్యో నవతీయోజనోచ్ఛ్రితః. 166

ప్ర. అ. సురసా=సురస, వక్త్రమ్=ముఖమును, అశీతీయోజనోచ్ఛ్రితమ్=ఎనుబదియోజనముల ఎత్తుగలదానినిగా, చకార=చేసెను. అచలప్రఖ్యః=పర్వతముతో సమానుడైన, హనుమాన్=హనుమంతుడు, నవతీయోజనోచ్ఛ్రితః=తొంబది యోజనముల ఎత్తు కలవాడు అయ్యెను.

తా. సురస తన నోరు ఎనుబది యోజనముల పొడవుండునట్లు చేయగా పర్వతాకారుడైన హనుమంతుడు తొంబది యోజనముల ఎత్తు పెరిగెను.166

మూ. తద్దృష్ట్వా వ్యాదితం త్వాస్యం వాయుపుత్రః సుబుద్ధిమాన్,
దీర్ఘజిహ్వం సురసయా సుఘోరం నరకోపమమ్, 167
సుసంక్షిప్యాత్మనః కాయం బభూవాఙ్గుష్ఠమాత్రకః.

ప్ర. అ. సుబుద్ధిమాన్=గొప్ప బుద్ధిమంతుడైన, వాయుపుత్రః=హనుమంతుడు, సురసయా=సురసచేత, వ్యాదితమ్=తెరవబడినదీ, దీర్ఘజిహ్వామ్=దీర్ఘమైన నాలుక కలదీ, సుఘోరమ్=చాల భయంకరమైనదీ, నరకోపమమ్=నరకముతో సమానమైనదీ, అయిన, తత్ ఆస్యమ్=ఆ ముఖమును, దృష్ట్వా=చూచి, ఆత్మనః=తనయొక్క, కాయమ్= శరీరమును, సుసంక్షిప్య=బాగుగా కుదించి (చాల చిన్నదిగా చేసి), అఙ్గుష్ఠమాత్రః=బొటనవ్రేలు ప్రమాణము కలవాడు, బభూవ=ఆయెను.

తా. మహాబుద్ధిశాలియైన హనుమంతుడు, దీర్ఘమైన జిహ్వకలదీ, చాల భయంకరముగా ఉన్నదీ, నరకముతో సమానమైనదీ అయిన, సురస చాపిన ఆ ముఖమును చూచి, తన దేహమును చాల చిన్నదిగా చేసి, బొటనవ్రేలు వంటి ప్రమాణము కలవాడు అయ్యెను.

వి. ఈ శ్లోకానికి వెనుక "తం ప్రయాన్తం సముద్వీక్ష్య" మొదలు "చకార సురసా వక్త్రం .... నవతీయోజనోచ్ఛ్రితః" అను శ్లోకం వరకూ ఉన్న (శ్లో. 158-166) ఎనిమిది శ్లోకాలు బాలుర చమత్కారం కోసం ఎవరో రచించి చేర్చి ఉంటారు. శతయోజన విస్తీర్ణమైన సముద్రాన్ని లంఘించడానికి బయలు దేరి దాదాపు సగం దూరం వచ్చిన హనుమంతుడు సురసను జయించుటకై మొదట పదియోజనాల పొడవు, పదియోజనాల లావు ఉండేటట్లు శరీరం పెంచి చివరకు తొంబైయోజనాల పొడవు (దానికి తగిన లావు) ఉండేటట్లు పెంచినచో ఇంచుమించు ఈ తీరం నుంచి ఆ తీరం వరకూ వ్యాపించినట్లే అయిపోయినది. ఇంక ఎగరవలసిన పని లేదు. 167

మూ. సోఽభిపత్యాశు తద్వక్త్రం నిష్పత్య చ మహాజవః,
అన్తరిక్షే స్థితః శ్రీమానిదం వచనమబ్రవీత్. 168

ప్ర. అ. శ్రీమాన్=శోభావంతుడూ, మహాజవః=గొప్ప వేగము గలవాడూ అయిన, సః=హనుమంతుడు, ఆశు=శీఘ్రముగా, తద్వక్త్రమ్=ఆమె ముఖమును, అభిపత్య=పొంది, నిష్పత్య చ=బైటకు వచ్చి, అన్తరిక్షే=ఆకాశమునందు, స్థితః=ఉన్నవాడై, ఇదమ్=ఈ, వచనమ్=వచనమును, అబ్రవీత్=పలికెను.

తా. శ్రీమంతుడైన హనుమంతుడు వెంటనే మహావేగముతో ఆమె ముఖము లోనికి, ప్రవేశించి, మరల బైటకువచ్చి ఆకాశమునందు నిలచి ఇట్లనెను.

మూ. ప్రవిష్టోఽస్మి హి తే వక్త్రం దాక్షాయణి నమోఽస్తు తే,
గమిష్యే యత్ర వైదేహీ సత్యం చాసీద్వరస్తవ. 169

ప్ర. అ. దాక్షాయణి=ఓ దక్షపుత్రీ ! తే=నీ యొక్క, వక్త్రమ్=ముఖమును, ప్రవిష్టః=ప్రవేశించినవాడను, అస్మి హి=అయితిని కదా. తే=నీకు, నమః=నమస్కారము, అస్తు=అగుగాక, వైదేహీ=సీత, యత్ర=ఎక్కడ ఉన్నదో అక్కడికి, గమిష్యే=వెళ్ళగలను. తవ=నీయొక్క, వరః చ=వరము కూడ, సత్యమ్=సత్యముగా, ఆసీత్=ఆయెను.

తా. దక్షప్రజాపతి కుమార్తెవైన ఓ సురసా ! నీ ముఖములోనికి ప్రవేశించినాను కదా, నీకు నమస్కారము. ఇంక సీత ఉన్న చోటికి వెళ్ళెదను. నీ వరము కూడ సత్యమైనది కదా. 169

మూ. తం దృష్ట్వా వదనాన్ముక్తం చన్ద్రం రాహుముఖాదివ,
అబ్రవీత్సురసా దేవీ స్వేన రూపేణ వానరమ్. 170

ప్ర. అ. రాహుముఖాత్=రాహువుయొక్క ముఖమునుండి, చన్ద్రమివ=చంద్రుని వలె, వదనాత్=తన ముఖమునుండి, ముక్తమ్=విడువబడిన, తం వానరమ్=ఆ హనుమంతుని, దృష్ట్వా=చూచి, సురసా దేవీ=దేవి యైన సురస, స్వేన=తన సంబంధమైన, రూపేణ=రూపముతో, అబ్రవీత్=పలికెను.

తా. రాహుముఖమునుండి చంద్రుడు వలె, తన ముఖమునుండి బైటకు వచ్చిన ఆ హనుమంతుని చూచి, ఆ సురస, తన రూపమును ధరించి, ఇట్లు పలికెను. 170

మూ. అర్థసిద్ధ్యై హరిశ్రేష్ఠ గచ్ఛ సౌమ్య యథాసుఖమ్,
సమానయస్వ వైదేహీం రాఘవేణ మహాత్మనా. 171

ప్ర. అ. సౌమ్య=సౌమ్యుడవైన, హరిశ్రేష్ఠ=ఓ వానరశ్రేష్ఠుడా, అర్థసిద్ధ్యై=కార్యసిద్ధికొరకు, యథాసుఖమ్=సుఖముగా, గచ్ఛ=వెళ్ళుము. వైదేహీమ్=సీతను, మహాత్మనా=మహాత్ముడైన, రాఘవేణ=రామునితో, సమానయస్వ=చేర్చుము.

తా. సౌమ్యుడవైన ఓ ! వానరశ్రేష్ఠుడా !కార్యసిద్ధికై సుఖముగా వెళ్ళుము. సీతను మహాత్ముడైన రామునితో చేర్చుము. 171

మూ. తత్తృతీయం హనుమతో దృష్ట్వా కర్మ సుదుష్కరమ్,
సాధు సాధ్వితి భూతాని ప్రశశంసుస్తదా హరిమ్. 172

ప్ర. అ. సుదుష్కరమ్=చాల కష్టసాధ్యమైన, హనుమతః=హనుమంతునియొక్క, తత్=ఆ, తృతీయం కర్మ=మూడవ పనిని, దృష్ట్వా=చూచి,

తదా=అప్పుడు, భూతాని=ప్రాణులన్నీ, సాధు సాధు ఇతి=బాగు బాగు అని, హరిమ్=హనుమంతుని ప్రశశంసుః=ప్రశంసించినవి.

తా. హనుమంతుడు చేసిన, ఇతరు లెవ్వరూ చేయజాలని ఆ మూడవ పని చూచి, అందరును "చాలా బాగున్నది, చాలా బాగున్నది" అని ప్రశంసించిరి.

మూ. స సాగరమనాధృష్యమభ్యేత్య వరుణాలయమ్,
జగామాకాశమావిశ్య వేగేన గరుడోపమః. 173

ప్ర. అ. వేగేన=వేగముచేత, గరుడోపమః=గరుత్మంతునితో సమానుడైన, సః=హనుమంతుడు, అనాధృష్యమ్=ఎదిరింపశక్యముకాని, వరుణాలయమ్=వరుణదేవుని నివాసస్థానమైన, సాగరమ్=సముద్రమును, అభ్యేత్య=సమీపించి, ఆకాశమ్=ఆకాశమును, ఆవిశ్య=ప్రవేశించి, జగామ=వెళ్లెను.

తా. గరుత్మంతునితో సమానమైన వేగము గల ఆ హనుమంతుడు ఎవ్వరును ఎదిరింప శక్యము కాని, వరుణనివాసమైన సముద్రమును సమీపించి, ఆకాశమార్గమునందు ప్రయాణము చేసెను. 173

మూ. సేవితే వారిధారాభిః పతగైశ్చ నిషేవితే,
చరితే కైశికాచార్యైరైరావతనిషేవితే. 174

సింహకుఞ్జరశార్దూలపతగోరగవాహనైః,
విమానైః సంపతద్భిశ్చ విమలైః సమలంకృతే. 175

వజ్రాశనిసమాఘాతైః పావకైరుపశోభితే,
కృతపుణ్యైర్మహాభాగైః స్వర్గజిద్భిరలంకృతే. 176

వహతా హవ్యమత్యర్థం సేవితే చిత్రభానునా,
గ్రహనక్షత్రచన్ద్రార్కతారాగణవిభూషితే. 177

మహర్షిగణగన్ధర్వనాగయక్షసమాకులే,
వివిక్తే విమలే విశ్వే విశ్వావసునిషేవితే. 178

దేవరాజగజాక్రాన్తే చన్ద్రసూర్యపథే శివే,
వితానే జీవలోకస్య వితతే బ్రహ్మనిర్మితే. 179

బహుశః సేవితే వీరైర్విద్యాధరగణైర్వరైః,
జగామ వాయుమార్గే తు గరుత్మానివ మారుతిః. 180

ప్ర. అ. వారిధారాభిః=జలధారలచేత లేదా మేఘములచేత, సేవితే=సేవింపబడినదీ, పతగైశ్చ=పక్షులచేత కూడ, నిషేవితే=సేవించబడినదీ, కైశికాచార్యైః=కైశికమను రాగమును బోధించు తుంబరుదు మొదలైన వారిచేత (ఈ అర్థం సంతృప్తికరంగ లేదు), చరితే=సంచరించబడినదీ, ఐరావతనిషేవితే=ఐరావతముచేత సేవింపబడినదీ, సింహకుఞ్జరశార్దూలపతగోరగవాహనైః=సింహములు, ఏనుగులు, పెద్దపులులు, పక్షులు, సర్పములు లాగునవిగా గల (సింహాదులచే మోయబడుచున్న), సంపతద్భిః=మహావేగముతో వచ్చిపడుచున్న, విమలైః=స్వచ్ఛమైన, విమానైః=విమానములచేత, సమలంకృతే=అలంకరించబడినదీ, వజ్రాశనిసమాఘాతైః=వజ్రముతోను, పిడుగుతోను సమానమైన ఆఘాతము (వేగముగా తగులు దెబ్బ) గల, పావకైః=అగ్నులచేత, ఉపశోభితే=ప్రకాశింపచేయబడినదీ, కృతపుణ్యైః=చేయబడిన పుణ్యము గల, మహాభాగైః=మహాభాగ్యవంతులైన, స్వర్గజిద్భిః=స్వర్గమును జయించిన వారిచేత, అలంకృతే=అలంకరింపబడినదీ, అత్యర్థమ్=మిక్కిలి, హవ్యమ్=హవిస్సును, వహతా=మోసికొనిపోవుచున్న, చిత్రభానునా=అగ్నిచేత, సేవితే=సేవింపబడినదీ, గ్రహనక్షత్రచన్ద్రార్కతారాగణవిభూషితే=కుజాదిగ్రహములచేతను, అశ్విన్యాదినక్షత్రములచేతను, చంద్రసూర్యులచేతను, తారకలచేతను అలంకరింపబడినదీ, మహర్షిగణగన్ధర్వ నాగయక్షసమాకులే=మహర్షుల సముదాయముచేతను, గంధర్వులచేతను, నాగులచేతను, యక్షులచేతను వ్యాకులమైనదీ, వివిక్తే=జనసంబాధము లేనిదీ, విమలే=నిర్మలమైనదీ, విశ్వే=అంతటా వ్యాపించినదీ, విశ్వావసునిషేవితే=విశ్వావసువను గంధర్వరాజుచేత సేవింపబడినదీ, దేవరాజగజాక్రాన్తే=దేవేంద్రుని గజములచేత సంచరింపబడేదీ, చన్ద్రసూర్యపథే=చంద్రసూర్యుల మార్గమైనదీ, శివే=మంగళకరమైనదీ, జీవలోకస్య=జీవ (భూ) లోకమునకు, బ్రహ్మనిర్మితే=బ్రహ్మదేవునిచేత నిర్మింపబడిన, వితతే=అతివిశాలమైన, వితానే=వితానమైనదీ, (సభామండపాదులలో ఇంటి ఆచ్ఛాదనము కనబడకుండునట్లు కట్టిన చిత్రవిచిత్రమైన రంగులు గల లేదా తెల్లని వస్త్రము వితానము "చాందినీ"), వరైః=శ్రేష్ఠులైన, వీరైః=వీరులైన, విద్యాధరగణైః=విద్యాధరుల సముదాయముల చేత, బహుశః=అనేక విధములుగా, సేవితే=సేవింపబడినదీ అయిన, వాయుమార్గే=ఆకాశమునందు, మారుతిః=హనుమంతుడు, గరుత్మానివ=గరుత్మంతుదు వలె, జగామ=వెళ్లెను.

తా. హనుమంతుడు ఆకాశమునందు గరుత్మంతుడు వలె ఎగురుచు ప్రయాణము చేసెను. ఆ ఆకాశమునందు మేఘములు, పక్షులు, కైశికాచార్యులు, ఐరావతము సంచరించుచుండెను. సింహములు, ఏనుగులు, పెద్దపులులు, పక్షులు, సర్పములూ లాగగా, నిర్మలమైన అందమైన ఎన్నో విమానములు మహా వేగముతో సంచరించుచుండెను. (లేదా సింహాద్యాకారములో ఉన్న అనేక

విమానములు సంచరించుటచే చూడ ముచ్చటగా ఉండెను.) అక్కడక్కడ అగ్ని పిండములు ఢీకొని వజ్రమువంటి, పిడుగులవంటి ధ్వనిని కలిగించుచుండెను. పుణ్యకర్మలాచరించి స్వర్గము జయించిన ఎందరో మహాభాగ్యవంతులు ఆయా ప్రదేశములను అలంకరించి ఉండిరి. యజ్ఞములలో దేవతలకు సమర్పించిన హవిస్సులను మోసికొనిపోవుచు అగ్ని కనబడుచుండెను. చంద్రుడు, సూర్యుడు, ఇతర గ్రహములు, అశ్విన్యాదినక్షత్రములు, తారాగణములు, అందముగా ప్రకాశించుచుండెను. అది అక్కడక్కడ మహర్షిగణములతోను, గంధర్వులతోను, నాగులతోను, యక్షులతోను నిండి ఉండెను. కొన్ని చోట్ల నిర్జనముగా ఉండెను. అతినిర్మలమైన ఆ ఆకాశము అంతటా వ్యాపించి ఉండెను. విశ్వావసువను గంధర్వరాజు అక్కడనే నివసించుచుండెను. మంగళప్రదమూ, సూర్యచంద్రుల గమనమార్గమూ అయిన ఆకాశమునందు, దేవేంద్రుని గజములు సంచరించుచుండెను. వీరులూ, ఉత్తములూ అయిన విద్యాధరులు అచట అధికముగా విహరించుచుండిరి. ఆ ఆకాశము జీవలోకము పై భాగమున అందముగా ఉండుటకై బ్రహ్మదేవుడు కట్టిన వితానము (చాందినీ) వలె ఉండెను. 174-180

మూ. ప్రదృశ్యమానః సర్వత్ర హనుమాన్మారుతాత్మజః,
భేజేఽమ్బరం నిరాలమ్బం లమ్బపక్ష ఇవాద్రిరాట్. 181

ప్ర. అ. సర్వత్ర=అంతటను, ప్రదృశ్యమానః=చూపబడుచున్న, మారుతాత్మజః=వాయుపుత్రుడైన, హనుమాన్=హనుమంతుడు, లమ్బపక్షః=వ్రేలాడుచున్న (లేదా పొడవైన) రెక్కలు గల, అద్రిరాట్ ఇవ=పర్వతరాజు వలె, నిరాలమ్బమ్=ఆధారము లేని, అమ్బరమ్=ఆకాశమును, భేజే=పొందెను.

తా. వాయుతనయుడైన ఆ హనుమంతుడు దీర్ఘమైన రెక్కలు గల మహాపర్వతము వలె, ఎట్టి ఆధారము లేని ఆకాశమార్గమున ప్రయాణము చేయుచు చాల ఎత్తుగా ఎగురుటచేత అన్ని ప్రదేశముల నుంచి కనబడుచుండెను.

మూ. ప్లవమానం తు తం దృష్ట్వా సింహికా నామ రాక్షసీ,
మనసా చిన్తయామాస ప్రవృద్ధా కామరూపిణీ. 182

ప్ర. అ. కామరూపిణీ=ఇచ్ఛానుసారము రూపము కల, సింహికా నామ=సింహిక అను, రాక్షసీ=రాక్షస స్త్రీ, ప్లవమానమ్=ఎగురుచున్న, తమ్=అతనిని, దృష్ట్వా=చూచి, ప్రవృద్ధా=పెరిగినదై, చిన్తయామాస=ఆలోచించెను.

తా. స్వేచ్ఛానుసారముగా రూపములను ధరించగలిగిన సింహిక అను ఒక రాక్షసి, ఆకాశమార్గమున వెళ్లుచున్న హనుమంతుని చూచి, దేహమును పెంచుచు, ఇట్లు ఆలోచించెను. 182

మూ. అద్య దీర్ఘస్య కాలస్య భవిష్యామ్యహమాశితా,
ఇదం హి మే మహత్సత్త్వం చిరస్య వశమాగతమ్. 183

ప్ర. అ. చిరస్య=చాల కాలానికి, ఇదమ్=ఈ, మహత్=గొప్పదైన, సత్త్వమ్=జంతువు, మే=నాయొక్క, వశమ్=వశమును, ఆగతమ్=పొందినది. దీర్ఘస్య=అతి దీర్ఘమైన, కాలస్య=కాలమునకు, అద్య=నేడు, అహమ్=నేను, ఆశితా=భోజనము చేసినదానను, భవిష్యామి=కాగలను.

తా. ఇంత కాలానికి ఈ పెద్ద జంతువేదో నాకు చిక్కినది. చాల కాలము తరువాత నేడు, మంచి భోజనము చేసెదను. 183

మూ. ఇతి సంచిన్త్య మనసా ఛాయామస్య సమాక్షిపత్,
ఛాయాయాం గృహ్యమాణాయాం చిన్తయామాస వానరః. 184

ప్ర. అ. ఇతి=ఇట్లు, మనసా=మనస్సుతో, సంచిన్త్య=ఆలోచించి, అస్య=ఈ తనియొక్క, ఛాయామ్=నీడను, సమాక్షిపత్=ఆకర్షించెను. ఛాయాయామ్=నీడ, గృహ్యమాణాయామ్=గ్రహించబడుచున్న దగుచుండగా, వానరః=హనుమంతుడు, చిన్తయామాస=ఆలోచించెను.

తా. ఆ రాక్షసి ఈ విధముగా ఆలోచించి, హనుమంతుని నీడను ఆకర్షించెను. ఈ విధముగా నీడ ఆకర్షింపబడినప్పుడు హనుమంతుడు ఇట్లు అనుకొనెను. 184

మూ. సమాక్షిప్తోఽస్మి తరసా పఙ్గూకృతపరాక్రమః,
ప్రతిలోమేన వాతేన మహానౌరివ సాగరే. 185

ప్ర. అ. సాగరే=సముద్రమునందు, ప్రతిలోమేన=ప్రతికూలమైన, వాతేన=వాయువుచేత, మహానౌరివ=గొప్ప పడవ వలె, పఙ్గూకృతపరాక్రమః=కుంటిదిగా చేయబడిన (తగ్గించబడిన) పరాక్రమము కలవాడనై, తరసా=బలాత్కారముగా, సమాక్షిప్తః=లాగబడినవాడను, అస్మి=అగుచున్నాను.

తా. మహాసముద్రమధ్యమునందు ఎదురుగాలిచే ఓడ నడక వలె హటాత్తుగా నా పరాక్రమము తగ్గిపోయినది ! నన్నెవరో ఈడ్చి వేయుచున్నట్లున్నది. 185

మూ. తిర్యగూర్ధ్వమధశ్చైవ వీక్షమాణస్తతః కపిః,
దదర్శ స మహత్సత్త్వముత్థితం లవణామ్భసి. 186

ప్ర. అ. తతః=అటుపిమ్మట, కపిః=హనుమంతుడు, తిర్యక్=అడ్డముగాను, ఊర్ధ్వమ్=పైకి, అధశ్చైవ=క్రిందికి, వీక్షమాణః=చూచుచు, లవణామ్భసి=లవణసముద్రమునందు, ఉత్థితమ్=లేచిన, మహత్=పెద్ద, సత్త్వమ్=జంతువును, దదర్శ=చూచెను.

తా. పిమ్మట హనుమంతుడు అడ్డముగాను, పైకి, క్రిందికి చూచుచు లవణసముద్రమునందు లేచిన ఒక మహాజంతువును చూచెను. 186

మూ. తద్దృష్ట్వా చిన్తయామాస మారుతిర్వికృతాననమ్,
కపిరాజేన కథితం సత్త్వమద్భుతదర్శనమ్, 187
ఛాయాగ్రాహి మహావీర్యం తదిదం నాత్ర సంశయః.

ప్ర. అ. మారుతిః=హనుమంతుడు, వికృతాననమ్=వికృతమైన ముఖము గల, తత్=ఆ జంతువును, దృష్ట్వా=చూచి, చిన్తయామాస=ఆలోచించెను. కపిరాజేన=సుగ్రీవునిచేత, కథితమ్=చెప్పబడిన, అద్భుతదర్శనమ్=అద్భుతమైన దర్శనము గల, ఛాయాగ్రాహి=నీడను ఆకర్షించు, మహావీర్యమ్=గొప్ప పరాక్రమము గల, తత్=ఆ, సత్త్వమ్=జంతువు, ఇదమ్=ఇదే. అత్ర=ఈ విషయమున, సంశయః=సంశయము, న=లేదు.

తా. హనుమంతుడు, వికృతమైన ముఖముగల ఆ జంతువును చూచి ఇట్లు ఆలోచించెను. చూచుటకు ఆశ్చర్యకరమూ, నీడను ఆకర్షించే మహావీర్యము కలదీ అయిన, సుగ్రీవుడు చెప్పిన, ఆ జంతువు ఇదే ; సందేహము లేదు.

మూ. స తాం బుద్ధ్వార్థతత్త్వేన సింహికాం మతిమాన్కపిః,
వ్యవర్ధత మహాకాయః ప్రావృషీవ వలాహకః. 188

ప్ర. అ. మతిమాన్=బుద్ధిమంతుడైన, సః కపిః=ఆ హనుమంతుడు, తామ్=దానిని, అర్థతత్త్వేన=యథార్థముగా, సింహికామ్=సింహికనుగా, బుద్ధ్వా=తెలిసికొని, మహాకాయః=గొప్పదేహముకలవాడగునట్లు, ప్రావృషి=వర్షాకాలమునందు, వలాహకః ఇవ=మేఘము వలె, వ్యవర్ధత=వృద్ధిపొందెను.

తా. బుద్ధిమంతుడైన ఆ హనుమంతుడు ఆమె సింహికయే అను యథార్థమును తెలుసుకొని, వర్షాకాలమునందు మేఘము వలె, దేహము పెంచెను. 188

మూ. తస్య సా కాయముద్వీక్ష్య వర్ధమానం మహాకపేః, 189
వక్త్రం ప్రసారయామాస పాతాళాన్తరసన్నిభమ్.

ప్ర. అ. సా=ఆ సింహిక, తస్య మహాకపేః=ఆ హనుమంతుని యొక్క, కాయమ్=శరీరమును, వర్ధమానమ్=వృద్ధిపొందుచున్నదానినిగా, ఉద్వీక్ష్య=చూచి, పాతాళాన్తరసన్నిభమ్=పాతాళమధ్యముతో సమానమైన, వక్త్రమ్=ముఖమును, ప్రసారయామాస=చాపెను.

తా. హనుమంతుని శరీరము పెరుగుట చూచిన ఆ సింహిక పాతాళమధ్యము వంటి తన ముఖమును చాపెను. 189

మూ. ఘనరాజీవ గర్జన్తీ వానరం సమభిద్రవత్. 190
స దదర్శ తతస్తస్యా వివృతం సుమహన్ముఖమ్.
కాయమాత్రం చ మేధావీ మర్మాణి చ మహాకపిః. 191

ప్ర. అ. ఘనరాజీవ=మేఘపంక్తి వలె, గర్జన్తీ=గర్జించుచున్నదై, వానరమ్=హనుమంతుని గూర్చి, సమభిద్రవత్=పరుగెత్తెను. తతః=అటు పిమ్మట, మేధావీ=బుద్ధిశాలియైన, మహాకపిః=హనుమంతుడు, తస్యాః=ఆమెయొక్క, వివృతమ్=తెరవబడిన, కాయమాత్రమ్=తన దేహముతో సమానమైన ప్రమాణము గల, సుమహత్=చాల పెద్దదైన, ముఖమ్=ముఖమును, మర్మాణి చ=మర్మప్రదేశములను, దదర్శ=చూచెను.

తా. ఆమె మేఘపంక్తి వలె గర్జించుచు, హనుమంతుని వైపు పరుగెత్తెను. అప్పుడు, బుద్ధిశాలియైన ఆ హనుమంతుడు, తన దేహమంత ప్రమాణములో ఉన్న, తెరవబడిన, ఆమె నోటిని, మర్మస్థానములనూ చూచెను. 190, 191

మూ. స తస్యా వివృతే వక్త్రే వజ్రసంహననః కపిః,
సంక్షిప్య ముహురాత్మానం నిష్పపాత మహాబలః. 192

ప్ర. అ. మహాబలః=గొప్ప బలము కల, వజ్రసంహననః=వజ్రము వంటి దేహము గల, సః కపిః=ఆ హనుమంతుడు, ఆత్మానమ్=దేహమును, ముహుః=మాటిమాటికి (ఇంకను), సంక్షిప్య=కుదించి, తస్యాః=ఆమెయొక్క, వివృతే=తెరవబడిన, వక్త్రే=ముఖమునందు, నిష్పపాత=పడెను.

తా. వజ్రము వంటి దేహము గల, మహాబలశాలి యైన హనుమంతుడు తన శరీరము చాలా చిన్నదిగా చేసి, తెరచిన ఆమె నోటిలో పడెను. 192

మూ. ఆస్యే తస్యా నిమజ్జన్తం దదృశుః సిద్ధచారణాః,
గ్రస్యమానం యథా చన్ద్రం పూర్ణం పర్వణి రాహుణా. 193

ప్ర. అ. సిద్ధచారణాః=సిద్ధులూ, చారణులూ, తస్యాః=ఆమెయొక్క, ఆస్యే=ముఖములో, నిమజ్జన్తమ్=మునిగిపోవుచున్న ఆ హనుమంతుని, పర్వణి=పూర్ణిమాపర్వమునందు, రాహుణా=రాహువుచేత, గ్రస్యమానమ్=మ్రింగివేయబడుచున్న, పూర్ణమ్=పూర్ణుడైన, చన్ద్రం యథా=చంద్రుని వలె, దద్రుశుః=చూచిరి.

తా. పూర్ణిమయందు రాహువుచేత మ్రింగివేయబడుచున్న పూర్ణచంద్రుడు వలె, హనుమంతుడు ఆమె ముఖములో మునిగిపోవుచుండగా సిద్ధులూ, చారణులూ చూచిరి. 193

మూ. తతస్తస్యా నఖైస్తీక్ష్ణైర్మర్మాణ్యుత్కృత్య వానరః,
ఉత్పపాతాథ వేగేన మనఃసంపాతవిక్రమః. 194

ప్ర. అ. తతః=అటుపిమ్మట, వానరః=హనుమంతుడు, తీక్ష్ణైః=తీక్ష్ణమైన, నఖైః=గోళ్ళతో, తస్యాః=ఆ సింహికయొక్క, మర్మాణి=మర్మప్రదేశములను, ఉత్కృత్య=ఛేదించి, అథ=పిమ్మట, మనఃసంపాతవిక్రమః=మనోవేగము వంటి వేగము గలవాడై, వేగేన=వేగముతో, ఉత్పపాత=పైకి ఎగిరెను.

తా. పిమ్మట హనుమంతుడు వాడియైన గోళ్ళతో ఆమె శరీరములో ఉన్న గుండె మొదలైన మర్మస్థానములను పెకలించివేసి, మనోవేగముతో సమానమైన వేగముతో పైకి వచ్చెను. 194

మూ. తాం తు దృష్ట్వా చ ధృత్యా చ దాక్షిణ్యేన నిపాత్య చ,
స కపిప్రవరో వేగాద్వవృధే పునరాత్మవాన్. 195

ప్ర. అ. ఆత్మవాన్=బుద్ధిమంతుడైన, సః=ఆ, కపిప్రవరః=హనుమంతుడు, తామ్=ఆమెను, దృష్ట్వా చ=చూపు (ఆలోచన) చేతను, ధృత్యా చ=ధైర్యముచేతను, దాక్షిణ్యేన=నేర్పు చేతను, నిపాత్య=పడవేసి, పునః=తిరిగి, వేగాత్=వేగమువలన,వవృధే=వృద్ధిపొందెను.

తా. మహాబుద్ధిశాలి యైన ఆ హనుమంతుడు తగు ఉపాయమును ఆలోచించి, ధైర్యముతోను, నేర్పుతోను ఆ సింహికను సంహరించి, మరల వేగముతో పెరిగెను. 195

మూ. హృతహృత్సా హనుమతా పపాత విధురామ్భసి,
తాం హతాం వానరేణాశు పతితాం వీక్ష్య సింహికామ్. 196
భూతాన్యాకాశచారీణి తమూచుః ప్లవగోత్తమమ్.

ప్ర. అ. సా=ఆ సింహిక, హనుమతా=హనుమంతునిచేత, హృతహృత్=హరింపబడిన హృదయము గలదై, విధురా=వ్యాకులురాలై, అమ్భసి=నీటిలో, పపాత=పడెను. వానరేణ=హనుమంతునిచేత, ఆశు=శీఘ్రముగా, హతామ్=చంపబడిన, పతితామ్=ఆకాశమునందు సంచరించుచున్న, భూతాని=భూతములు,తమ్=ఆ, ప్లవగోత్తమమ్=హనుమంతుని గూర్చి, ఊచుః=పలికినవి.

తా. హనుమంతుడు హృదయమును త్రుంచివేయగా ఆ సింహిక మరణించి క్రింద పడిపోయెను. హనుమంతుడు శీఘ్రముగా చంపివేసిన ఆ సింహికను చూచి ఆకాశమునందు సంచరించు సిద్ధగంధర్వాదులు హనుమంతునితో ఇట్లు పలికిరి. 196

మూ. భీమమద్య కృతం కర్మ మహత్సత్త్వం త్వయా హతమ్, 197
సాధయార్థమభిప్రేతమరిష్టం ప్లవతాం వర.

ప్ర. అ. ప్లవతాం వర=వానరులలో శ్రేష్ఠుడా! అద్య=ఇప్పుడు, త్వయా=నీచేత, మహత్=గొప్ప, సత్త్వమ్=జంతువు, హతమ్=చంపబడినది. భీమమ్=భయంకరమైన, కర్మ=పని, కృతమ్=చేయుబడినది. అభిప్రేతమ్=ఇష్టమైన, అర్థమ్=కార్యమును, అరిష్టమ్=మంగళకర మగునట్లుగా సాధయ=సాధించుము.

తా. ఓ వానరోత్తమా! ఈ గొప్ప జంతువును చంపి, నీవు, ఇప్పుడు భయంకరమైన కార్యము చేసినావు. నీ కిష్టమైన పనిని, మంగళప్రదమగు నట్లు సాధించుము. 197

మూ. యస్య త్వేతాని చత్వారి వానరేన్ద్ర యథా తవ, 198
ధృతిర్దృష్టిర్మతిర్దాక్ష్యం స కర్మసు న సీదతి.

ప్ర. అ. వానరేన్ద్ర=ఓ వానరశ్రేష్ఠుడా! యస్య=ఎవనికి, ధృతిః=ధైర్యము దృష్టిః=మంచి ఆలోచనాశక్తి, మతిః=బుద్ధి, దాక్ష్యమ్=నేర్పు, ఏతాని=ఈ, చత్వారి=నాలుగు లక్షణములు, తవ యథా=నీకు వలె ఉండునో, సః=అతడు,కర్మసు=పనులలో, న సీదతి=నశించదు.

తా. ఓ వానరోత్తమా! నీకు ఉన్నట్లు, ఎవనికి, ధైర్యము, సూక్ష్మదృష్టి, బుద్ధి, నేర్పు అను నాలుగు లక్షణములుండునో ఆతడు ఏ కార్యము చేయవలసివచ్చినను వైఫల్యము పొందడు. 198

మూ. స తైః సంభావితః పూజ్యః ప్రతిపన్నప్రయోజనః, 199
జగామాకాశమావిశ్య పన్నగాశనవత్కపిః.

ప్ర. అ. పూజ్యః=పూజింపదగిన, సః కపిః=ఆ హనుమంతుడు, తైః=వారిచేత, సంభావితః=గౌరవించ బడినవాడై, ప్రతిపన్నప్రయోజనః=పొందబడిన లేదా (నిర్ణయింపబడిన) ప్రయోజనము కలవాడై,ఆకాశమ్=ఆకాశమును, ఆవిశ్య=ప్రవేశించి, పన్నగాశనవత్=గరుత్మంతుడు వలె, జగామ=వెళ్ళెను.

తా. పూజ్యుడైన హనుమంతుడు, వారిచే ఇట్లు స్తుతింపబడుచు, తాను చేయవలసిన కార్యమును గూర్చి నిశ్చయించుకొని, గరుత్మంతుడు వలె, ఆకాశమార్గమునందు ప్రయాణము సాగించెను. 199

మూ. ప్రాప్తభూయిష్ఠపారస్తు సర్వతః ప్రతిలోకయన్, 200
యోజనానాం శతస్యాన్తే వనరాజిం దదర్శ సః.

ప్ర. అ. హనుమంతుడు, ప్రాప్తభూయిష్ఠపారః=ఇంచుమించుగా పొందబడిన అవతలి ఒడ్డు కలవాడై, సర్వతః=నలువైపులా, ప్రతిలోకయన్=చూచుచు, యోజనానామ్=యోజనములయొక్క, శతస్య=శతముయొక్క, అన్తే=అంతమునందు, వనరాజిమ్=వృక్షముల పంక్తిని, దదర్శ=చూచెను.

తా. హనుమంతుడు ఇంచుమించు ఆవలి ఒడ్డు సమీపించి, నలుమూలల పరికించుచు, నూరు యోజనముల తరవాత ఒక వృక్షపంక్తిని చూచెను. 200

మూ. దదర్శ చ పతన్నేవ వివిధద్రుమభూషితమ్, 201
ద్వీపం శాఖామృగశ్రేష్ఠో మలయోపవనాని చ.

ప్ర. అ. శాఖామృగశ్రేష్ఠః=వానరులలో శ్రేష్ఠుడైన హనుమంతుడు, పతన్నేవ=క్రిందికి దిగుచునే, వివిధద్రుమభూషితమ్=అనేకవిధములైన వృక్షములచేత అలంకరింపబడిన, ద్వీపమ్=ద్వీపమును, మలయోపవనాని చ=మలయపర్వతప్రాంతమునందలి వనములను, దదర్శ చ=చూచెను.

తా. హనుమంతుడు క్రిందికి దిగగానే, అనేక వృక్షములచేత అలంకరింపబడిన ద్వీపమును, మలయపర్వతప్రాంతములందలి వనములను చూచెను. 201

మూ. సాగరం సాగరానూపం సాగరానూపజాన్ ద్రుమాన్, 202
సాగరస్య చ పత్నీనాం ముఖాన్యపి విలోకయన్.
స మహామేఘసంకాశం సమీక్ష్యాత్మానమాత్మవాన్, 203
నిరున్ధన్తమివాకాశం చకార మతిమాన్ మతిమ్.

ప్ర. అ. ఆత్మవాన్=బుద్ధిమంతుడు, మతిమాన్=మంచి ఆలోచన కలవాడూ అయిన, సః=హనుమంతుడు, సాగరమ్=సముద్రమును, సాగరానూపమ్=సముద్రమునకు సంబంధించిన జలప్రాయప్రదేశమును, సాగరానూపజాన్=సముద్రము ప్రక్కనున్న జలప్రాయప్రదేశములందు పుట్టిన, ద్రుమాన్=వృక్షములను, సాగరస్య=సముద్రునియొక్క, పత్నీనామ్=భార్యలైన నదులయొక్క, ముఖాన్యపి చ=ముఖములను (నదులు సముద్రములో కలియు ప్రదేశములను), విలోకయన్=చూచుచు,మహామేఘసంకాశమ్=పెద్ద మేఘముతో సమానమైనదీ, ఆకాశమ్= ఆకాశమును, నిరున్ధన్తమివ=అడ్డగించుచున్నట్లున్న, ఆత్మానమ్=తనను (తన దేహమును), సమీక్ష్య=చూచి, మతిమ్=ఆలోచనను, చకార=చేసెను.

తా. బుద్ధిశాలీ, మంచి ఆలోచన చేయ గల సమర్థుడూ అయిన ఆ హనుమంతుడు,సముద్రమునూ, సముద్రతీరమునందలి జలప్రాయ (నీటితో నిండిన) ప్రదేశములనూ, ఆ ప్రదేశములలో పెరిగిన వృక్షములనూ, నదీముఖములను చూచుచు,ఆకాశమును అడ్డగించుచున్నట్లున్న, మహామేఘము వలె ఉన్న తన శరీరమును చూచుకొని ఇట్లు తలచెను. 202, 203

మూ. కాయవృద్ధిం ప్రవేగం చ మమ దృష్ట్వైవ రాక్షసాః, 204
మయి కౌతూహలం కుర్యురితి మేనే మహాకపిః.

ప్ర. అ. మమ=నాయొక్క, కాయవృద్ధిమ్=శరీరముయొక్క వృద్ధినీ, ప్రవేగం చ=వేగమునూ, దృష్ట్వైవ=చూడగానే, రాక్షసాః=రాక్షసులు,మయి=నాయందు, కౌతూహలమ్=కుతూహలమును, కుర్యుః=చేయుదురు, ఇతి= అని, మహాకపిః=హనుమంతుడు, మేనే=తలచెను.

తా. నా పెద్ద శరీరమును,వేగమును చూడగానే రాక్షసులు నా విషయమున "ఇత డెవరా!" అని కుతూహలము చూపుదురు అని హనుమంతుడు తలచెను. 204

మూ. తతః శరీరం సంక్షిప్య తన్మహీధరసన్నిభమ్, 205
పునః ప్రకృతిమాపేదే వీతమోహ ఇవాత్మవాన్.

ప్ర. అ. తతః=ఆ కారణమువలన, తత్=ఆ, మహీధరసన్నిభమ్=పర్వతములో సమానమైన, తత్=ఆ, శరీరమ్=శరీరమును, సంక్షిప్య=చిన్నది చేసి, వీతమోహః=తొలగిన మోహము గల, ఆత్మవానివ=ఆత్మజ్ఞానవంతుడువలె, ప్రకృతిమ్=స్వభావమును, ఆపేదే=పొందెను.

తా. ఆకారణముచేత హనుమంతుడు పర్వతములో సమానమైన ఆ శరీరమును చిన్నదిగా చేసి, అజ్ఞానము తొలగిపోయిన ఆత్మజ్ఞాని తన పరమార్థ స్వరూపమును పొందినట్లు, సహజరూపమును పొందెను. 205

మూ. తద్రూపమతిసంక్షిప్య హనుమాన్ ప్రకృతౌ స్థితః, 206
త్రీన్ క్రమానివ విక్రమ్య బలివీర్యహరో హరిః.

ప్ర. అ. హనుమాన్=హనుమంతుడు, తత్=ఆ, రూపమ్=రూపమును, అతిసంక్షిప్య=చాలా చిన్నది చేసి, బలివీర్యహరః=బలియొక్క పరాక్రమమును హరించిన, హరిః=విష్ణువు (త్రివిక్రముడు), త్రీన్=మూడు, క్రమాన్=పాదన్యాసములను, విక్రమ్య ఇవ=చేసి వలె, ప్రకృతౌ=స్వభావమునందు, స్థితః=ఉండెను.

తా. బలిచక్రవర్తి ఐశ్వర్యమును హరించుటకై త్రివిక్రముడైన విష్ణువు (వామనుడు) మూడు అడుగులు వేసిన పిమ్మట తన స్వాభావికమైన వామనరూపమును పొందినట్లు హనుమంతుడు తన పెద్ద రూపమును ఉపసంహరించుకొని స్వాభావిక రూపము ధరించెను. 206

మూ. స చారునానావిధరూపధారీ
పరం సమాసాద్య సముద్రతీరమ్,
పరైరశక్యః ప్రతిపన్నరూపః
సమీక్షితాత్మా సమవేక్షితార్థః. 207

ప్ర. అ. చారునానావిధరూపధారీ=సుందరమైన అనేకవిధములైన రూపములను ధరించ సమర్థుడూ, పరైః=శత్రువులచేత, అశక్యః=జయింప శక్యము కానివాడూ అయిన, సః=హనుమంతుడు, పరమ్=ఆవలి, సముద్రతీరమ్=సముద్రపుటొడ్డును, సమాసాద్య=పొంది, సమీక్షితాత్మా=చూచుకొనబడిన శరీరముకలవాడై, ప్రతిపన్నరూపః=పొందబడిన మామూలు ఆకారము కలవాడై, సమవేక్షితార్థః=నిశ్చయించబడిన కార్యము కలవాడై (ఉండెను).

తా. అందమైన అనేకరూపములు ధరింప సమర్థుడూ, శత్రువులకు జయింప శక్యముకానివాడూ అయిన హనుమంతుడు, సముద్రము ఆవలి

ఒడ్డు చేరి, తన మహాప్రమాణమైన శరీరమును చూచుకొని, ఇంక తానేమి చేయవలెనో నిర్ణయించుకొని, చిన్నరూపము ధరించి ఉండెను. 207

మూ. తతః స లమ్బస్య గిరేః సమృద్ధే
విచిత్రకూటే నిపపాత కూటే,
సకేతకోద్దాలకనాళికేరే
మహాద్రికూటప్రతిమో మహాత్మా. 208

ప్ర. అ. తతః=అటు పిమ్మట, మహాద్రికూటప్రతిమః=గొప్ప పర్వతపు చరియతో సమానుడైన, సః=ఆ, మహాత్మా=మహాత్ముడైన హనుమంతుడు, లమ్బస్య గిరేః=లంబమను పర్వతముయొక్క, విచిత్రకూటే=వివిధవర్ణములు గల శిఖరములు గల, సమృద్ధే=అనేక విధములగు వస్తువులతో నిండినదీ, సకేతకోద్దాలకనాళికేరే=మొగలిపొదలతోను, విరిగిచెట్లతోను, కొబ్బరిచెట్లతోను కూడినదీ అయిన, కూటే=శిఖరమునందు, నిపపాత=దిగెను.

తా. పిమ్మట, మహాపర్వతశిఖరమువంటి దేహము గల, మహాత్ముడైన హనుమంతుడు, సర్వవస్తుసమృద్ధమూ, విచిత్రమైన రంగులు గల చిన్న చిన్న శిఖరములు కలదీ, మొగలి డొంకలు, విరిగిచెట్లు, కొబ్బరిచెట్లు మొదలైన వాటితో నిండినదీ అయిన, లంబపర్వతశిఖరముపై దిగెను. 208

మూ. తతస్తు సంప్రాప్య సముద్రతీరం
సమీక్ష్య లఙ్కాం గిరివర్యమూర్ధ్ని,
కపిస్తు తస్మిన్నిపపాత పర్వతే
విధూయ రూపం వ్యథయన్మృగద్విజాన్. 209

ప్ర. అ. తతః=అటుపిమ్మట, కపిః తు=హనుమంతుడు, సముద్రతీరమ్=సముద్రతీరమును, సంప్రాప్య=పొంది, గిరివర్యమూర్ధ్ని=ఆ గిరిశ్రేష్ఠము పైభాగమునందు, లఙ్కామ్=లంకను, సమీక్ష్య=చూచి, రూపమ్=రూపమును (పూర్వశరీరమును), విధూయ=విడచి, మృగద్విజాన్=మృగములను పక్షులనూ, వ్యథయన్=బాధించుచు, తస్మిన్=ఆ, పర్వతే=పర్వతముమీద, నిపపాత=దిగెను.

తా. ఆ హనుమంతుడు సముద్రతీరముచేరి, ఆ మహాపర్వతము పైభాగము నందున్న లంకాపట్టణమును చూచి, తన పూర్వశరీరమును విడచి, ఆ పర్వతముపై దిగెను. ఆతడు హటాత్తుగా దిగుటచే అక్కడ నున్న మృగములు, పక్షులు భయపడినవి. 209

మూ. స సాగరం దానవపన్నగాయుతం
బలేన విక్రమ్య మహోర్మిమాలినమ్,
నిపత్య తీరే చ మహోదధేస్తదా
దదర్శ లజ్కామమరావతీమివ. 210

ఇత్యార్షే శ్రీమద్రామాయణే, ఆదికావ్యే, సున్దరకాణ్డే
ప్రథమః సర్గః.

ప్ర. అ. సః=హనుమంతుడు, దానవపన్నగాయుతమ్=దానవులతోను, పన్నగులతోను కూడిన, మహోర్మిమాలినమ్=గొప్ప తరంగపంక్తులు గల, సాగరమ్=సముద్రమును, బలేన=బలముచేత, విక్రమ్య=దాటి, మహోదధేః=మహాసముద్రముయొక్క, తీరే=తీరముపై, నిపత్య=దిగి, తదా=అప్పుడు, అమరావతీమివ=స్వర్గరాజధానియైన అమరావతి వలె ఉన్న, లజ్కామ్=లంకను, దదర్శ=చూచెను.

తా. హనుమంతుడు పెద్ద పెద్ద తరంగముల పంక్తులతో నిండినదీ, దానవులకూ, పన్నగులకూ నివాసస్థానమూ అయిన సముద్రమును బలముచేత దాటి, సముద్రతీరముపై దిగి, అక్కడ అమరావతి వలె ఉన్న లంకాపట్టణమును చూచెను. 210

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు
సుందరకాండలో మొదటి సర్గ సమాప్తము.

అథ ద్వితీయః సర్గః

[లంకావర్ణనము, లంకలో ప్రవేశించుటను గూర్చి హనుమంతుడు ఆలోచించుట, చిన్న రూపముతో అతడు లంకలో ప్రవేశించుట, చంద్రోదయశోభావర్ణనము]

మూ. స సాగరమనాధృష్యమతిక్రమ్య మహాబలః,
త్రికూటశిఖరే లఙ్కాం స్థితాం స్వస్థో దదర్శ హ. 1

ప్ర. అ. మహాబలః=గొప్పబలము గల, సః=హనుమంతుడు, అనాధృష్యమ్=ఎదిరింపశక్యముగాని, సాగరమ్=సముద్రమును, అతిక్రమ్య=దాటి, స్వస్థః=ఆయాసము లేకుండ స్వస్థుడై, త్రికూటశిఖరే= త్రికూటపర్వతశిఖరమునందు, స్థితామ్=ఉన్న, లఙ్కామ్=లంకను, దదర్శ హ=చూచెను.

తా. మహాబలశాలియైన హనుమంతుడు, ఎవ్వరికిని ఎదిరింప శక్యము కాని సముద్రమును దాటి, ఏ మాత్రము అలసట లేని వాడై, త్రికూటపర్వత శిఖరమునందున్న లంకను చూచెను. 1

మూ. తతః పాదపముక్తేన పుష్పవర్షేణ వీర్యవాన్,
అభివృష్టః స్థితస్తత్ర బభౌ పుష్పమయో యథా. 2

ప్ర. అ. తతః=అటు పిమ్మట, తత్ర=అక్కడ, స్థితః=నిలచియున్న, వీర్యవాన్=పరాక్రమవంతుడైన హనుమంతుడు, పాదపముక్తేన=వృక్షములంచే విడువబడిన, పుష్పవర్షేణ=పుష్పముల వర్షముచేత, అభివృష్టః=వర్షింపబడినవాడై, పుష్పమయో యథా=పుష్పముల వికారమైనవాడు వలె, బభౌ=ప్రకాశించెను.

తా. అక్కడ నిలచిన హనుమంతునిపై వృక్షములనుండి పుష్పములు వర్షము వలె కురిసెను. వాటిచే కప్పబడిన ఆతడు పుష్పాలతో నిర్మించిన విగ్రహము వలె కనబడెను. 2

మూ. యోజనానాం శతం శ్రీమాంస్తీర్త్వాప్యుత్తమవిక్రమః,
అనిఃశ్వసన్ కపిస్తత్ర న గ్లానిమధిగచ్ఛతి. 3

ప్ర. అ. ఉత్తమవిక్రమః=ఉత్తమ మైన పరాక్రమము గలవాడు, శ్రీమాన్=శ్రీమంతుడు అయిన, కపిః=హనుమంతుడు, యోజనానామ్=యోజన

ములు, శతమ్=శతమును, తీర్త్వాపి=దాటి కూడ, అనిఃశ్వసన్=నిట్టూర్పు కూడ విడవనివాడై, తత్ర=అక్కడ, గ్లానిమ్=అలసటను, న అధిగచ్ఛతి=పొందలేదు.

తా. మహాపరాక్రమశాలీ, శోభాసంపన్నుడూ అయిన ఆ హనుమంతుడు, నూరు యోజనముల దూరము దాటినను, ఏ మాత్రము అలసట పొందలేదు. నిట్టూర్పు కూడా విడువలేదు. 3

మూ. శతాన్యహం యోజనానాం క్రమేయం సుబహూన్యపి,
కిం పునః సాగరస్యాన్తం సంఖ్యాతం శతయోజనమ్. 4

ప్ర. అ. అహమ్=నేను, యోజనానామ్=యోజనములయొక్క, సుబహూని=అనేకమైన, శతాన్యపి=వందలను కూడ, క్రమేయమ్=దాటుదును. శతయోజనమ్=నూరుయోజనములుగా, సంఖ్యాతమ్=లెక్క పెట్టబడిన, సాగరస్య=సముద్రముయొక్క, అన్తమ్=అంతమును, కిం పునః=చెప్పనేల?

తా. నేను ఎన్నో వందల యోజనములు కూడ దాటగలను. నూరు యోజనములు అను పరిమితసంఖ్య గల సముద్రదూరము మాట చెప్పవలెనా?

మూ. స తు వీర్యవతాం శ్రేష్ఠః ప్లవతామపి చోత్తమః,
జగామ వేగవాన్ లఙ్కాం లఙ్ఘయిత్వా మహోదధిమ్. 5

ప్ర. అ. వీర్యవతామ్=పరాక్రమవంతులలో, శ్రేష్ఠః=శ్రేష్ఠుడూ, ప్లవతామపి=ఎగురగల్గినవారిలో కూడ, ఉత్తమః=ఉత్తముడూ అయిన, సః తు=ఆ హనుమంతుడు, వేగవాన్=వేగవంతుడై, మహోదధిమ్=మహాసముద్రమును, లఙ్ఘయిత్వా=దాటి, లఙ్కామ్=లంకను గూర్చి, జగామ=వెళ్ళెను.

తా. పరాక్రమవంతులలో శ్రేష్ఠుడూ, ఎగురగలవారిలో ఉత్తముడూ అయిన హనుమంతుడు, వేగముగా మహాసముద్రమును దాటి లంక చేరెను. 5

మూ. శాద్వలాని చ నీలాని గన్ధవన్తి వనాని చ,
గణ్డవన్తి చ మధ్యేన జగామ నగవన్తి చ. 6

ప్ర. అ. నీలాని=నల్లని, శాద్వలాని=పచ్చిక బీళ్లను, గన్ధవన్తి=సువాసన గలవీ, గణ్డవన్తి చ=పెద్ద పెద్ద శిలలు కలవీ, మధ్యేన=మధ్యముచేత (నందు), నగవన్తి చ=కొండలు గలవీ అయిన, వనాని చ=అడవులను, జగామ=సంచరించెను.

తా. నల్లని పచ్చికబీళ్లయందు, మధ్య మధ్య పెద్ద శిలలూ, పర్వతములూ ఉన్న అరణ్యములందూ సంచరించెను. 6

మూ. శైలాంశ్చ తరుసంఛన్నాన్ వనరాజీశ్చ పుష్పితాః,
అభిచక్రామ తేజస్వీ హనుమాన్ ప్లవగర్షభః. 7

ప్ర. అ. ప్లవగర్షభః=వానరశ్రేష్ఠుడైన, తేజస్వీ=తేజశ్శాలి యైన, హనుమాన్=హనుమంతుడు, తరుసంఛన్నాన్=వృక్షములచేత కప్పబడిన, శైలాంశ్చ=పర్వతములను, పుష్పితాః=పుష్పించిన, వనరాజీశ్చ=వృక్షపంక్తులను, అభిచక్రామ=సంచరించెను.

తా. గొప్ప తేజస్సు కలవాడూ, వానరశ్రేష్ఠుడూ అయిన హనుమంతుడు వృక్షములతో నిండి యున్న పర్వతములమీదా, పుష్పించిన వృక్షపంక్తుల మీదా సంచరించెను. 7

మూ. స తస్మిన్నచలే తిష్ఠన్వనాన్యుపవనాని చ,
స నగాగ్రే చ తాం లఙ్కాం దదర్శ పవనాత్మజః. 8

ప్ర. అ. సః పవనాత్మజః=ఆ హనుమంతుడు, తస్మిన్=ఆ, అచలే=పర్వతము మీద, తిష్ఠన్=నిలచినవాడై, వనాని=వనములను, ఉపవనాని చ=ఉద్యానములను, నగాగ్రే=పర్వతాగ్రమునందు, తామ్=ఆ, లఙ్కామ్=లంకను, దదర్శ=చూచెను.

తా. హనుమంతుడు ఆ పర్వతముపై నిలచి, వనములను, ఉద్యానములను పర్వతాగ్రమునందున్న లంకాపట్టణమును చూచెను. 8

మూ. సరళాన్ కర్ణికారాంశ్చ ఖర్జూరాంశ్చ సుపుష్పితాన్,
ప్రియాళాన్ముచులిన్దాంశ్చ కుటజాన్ కేతకానపి. 9
ప్రియఙ్గూన్ గన్ధపూర్ణాంశ్చ నీపాన్ సప్తచ్ఛదాంస్తథా,
అసనాన్ కోవిదారాంశ్చ కరవీరాంశ్చ పుష్పితాన్. 10
పుష్పభారనిబద్ధాంశ్చ తథా ముకుళితానపి,
పాదపాన్ విహగాకీర్ణాన్ పవనాధూతమస్తకాన్. 11
హంసకారణ్డవాకీర్ణా వాపీః పద్మోత్పలాయుతాః,
ఆక్రీడాన్ వివిధాన్ రమ్యాన్వివిధాంశ్చ జలాశయాన్. 12
సంతతాన్ వివిధైర్వృక్షైః సర్వర్తుఫలపుష్పితైః,
ఉద్యానాని చ రమ్యాణి దదర్శ కపికుఞ్జరః. 13

ప్ర. అ. కపికుఞ్జరః=హనుమంతుడు, సరళాన్=సరళవృక్షములను, కర్ణికారాంశ్చ=కొండగోగుచెట్లను, సుపుష్పితాన్=బాగుగా పుష్పించిన, ఖర్జూరాంశ్చ=ఖర్జూరపుచెట్లను, ప్రియాలాన్=మోరటి చెట్లను, ముచులిందాంశ్చ=నిమ్మచెట్లను, కుటజాన్=కొండమల్లెచెట్లను, కేతకానపి=మొగలిచెట్లను, గన్ధపూర్ణాన్=సువాసనతో

నిండిన, ప్రియఙ్గూంశ్చ=పిప్పలిచెట్లను, నీపాన్=మంకెన చెట్లను,తథా=మరియు, సప్తచ్ఛదాన్=ఏడాకుల అరటిచెట్లను, అసనాన్=వేగిసచెట్లను, కోవిదారాంశ్చ= కాంచనంచెట్లను, పుష్పితాన్=పుష్పించిన, కరవీరాంశ్చ= గన్నేరుచెట్లను, పుష్పభారనిబద్ధాంశ్చ=పుష్పముల బరువుచే కట్టబడినవీ, తథా=మరియు, ముకులితానపి=మొగ్గలు తొడిగినవీ, విహగాకీర్ణాన్=పక్షులచే వ్యాకులమైనవీ, పవనాధూతమస్తకాన్=గాలిచే కదల్చబడిన శిఖరములు కలవీ అయిన, పాదపాన్=వృక్షములనూ, హంసకారణ్డవాకీర్ణాః=హంసలతోను, కారండవములతోను కూడినవీ అయిన, వాపీః=దిగుడుబావులను, వివిధాన్=అనేకవిధము లైన, రమ్యాన్=మనోహరము లైన, ఆక్రీడాన్=విహారస్థానములను, సర్వర్తుఫలపుష్పైశ్చ=అన్ని ఋతువులలో లభించు ఫలములు కలవీ, పుష్పించినవీ అయిన, వివిధైః=అనేక విధములైన, వృక్షైః=వృక్షములచేత, సంతతాన్=చుట్టూ వ్యాప్తము లైన, వివిధాన్=అనేకవిధము లైన, జలాశయాంశ్చ=చెరువులను, రమ్యాణి=సుందరమైన, ఉద్యానాని చ=ఉద్యానములను, దదర్శ=చూచెను.

తా. హనుమంతుడు అక్కడ, సరళవృక్షములూ, కొండగోగుచెట్లూ, బాగుగా పూసిన ఖర్జూరవృక్షములూ, మోరటి, నిమ్మ, కొండమల్లె, మొగలి చెట్లూ, సువాసనగల పిప్పలిచెట్లూ, మంకెన, ఏడాకుల అరటి, వేగిస, కాంచనం చెట్లూ, పుష్పించిన గన్నేరుచెట్లూ, పుష్పముల బరువుతో నిండినవీ, మొగ్గతొడిగినవీ, పక్షులతో వ్యాకులముగా నున్నవీ, గాలికి కదలుచున్న అగ్రభాగములు గలవీ, అయిన ఇతరవృక్షములూ, హంసలతోను, కారండవములను జలపక్షులతోనూ నిండినవీ, అధికముగా పద్మములూ, కలువలూ ఉన్నవీ అయిన దిగుడుబావులూ, అందమైన, అనేక విధములైన పౌరులు విహరించు ప్రదేశములూ, అన్ని ఋతువులందు లభించు ఫలములతో నిండిన, పుష్పించిన అనేకవిధములైన చెట్లు తీరముల మీద దట్టముగా ఉన్న చెరువులూ, రమ్యమైన ఉద్యానవనములూ చూచెను. 9-13

మూ. సమాసాద్య చ లక్ష్మీవాన్ లఙ్కాం రావణపాలితామ్,
పరిఖాభిః సపద్మాభిః సోత్పలాభిరలంకృతామ్. 14
సీతాపహరణార్థేన రావణేన సురక్షితామ్,
సమన్తాద్విచరద్భిశ్చ రాక్షసైరుగ్రధన్విభిః, 15
కాఞ్చనేనావృతాం రమ్యాం ప్రాకారేణ మహాపురీమ్,
గృహైశ్చ గ్రహసంకాశైః శారదామ్బుదసన్నిభైః. 16
పాణ్డురాభిః ప్రతోళీభిరుచ్చాభిరభిసంవృతామ్,
అట్టాలకశతాకీర్ణాం పతాకాధ్వజమాలినీమ్. 17

తోరణైః కాఞ్చనైర్దివ్యైర్లతాపఙ్క్తి విచిత్రితైః,
దదర్శ హనుమాన్ లఙ్కాం దివి దేవపురీం యథా. 18

ప్ర. అ. లక్ష్మీవాన్=కాంతి గల, హనుమాన్=హనుమంతుడు, లఙ్కామ్=లంకను, సమాసాద్య=సమీపించి, రావణపాలితామ్=రావణునిచేత పాలింపబడినదీ, సపద్మాభిః=పద్మములతో కూడిన, సోత్పలాభిః=కలువలతో కూడిన, పరిఖాభిః=కందకములచేత, అలంకృతామ్=అలంకరింపబడినదీ, సీతాపహరణార్థేన=సీతను అపహరించుట అనే కారణముచేత, రావణేన=రావణునిచేత, సమన్తాత్=చుట్టూ, విచరద్భిః=సంచరించుచున్న, ఉగ్రధన్విభిః=భయంకరమైన ధనస్సులు గల, రాక్షసైః=రాక్షసులచేత, సురక్షితామ్=బాగుగా రక్షింపచేయబడినదీ, కాఞ్చనేన=బంగారువికారమైన, ప్రాకారేణ=ప్రాకారముచేత, ఆవృతామ్=చుట్టబడినదీ, రమ్యామ్=సుందరమైన, మహాపురీమ్=గొప్ప పురమైనదీ, గిరిసంకాశైః=పర్వతములతో సమానములైన, శారదామ్బుదసన్నిభైః=శరత్కాలమేఘములతో సమానము లైన, గృహైశ్చ=గృహములతో, పాణ్డురాభిః=తెల్లనైన, ఉచ్చాభిః=ఎత్తైన, ప్రతోలీభిః=ప్రధాన వీథులతో, అభిసంవృతామ్=కూడినదీ, పతాకాధ్వజమాలినీమ్=అలంకారార్థము కట్టిన పతాకలయొక్క, ధ్వజములయొక్క పంక్తులు కలదీ, దివ్యైః=సుందరములూ, కాఞ్చనైః=బంగారువికారమైనవీ, లతాపఙ్క్తి విచిత్రితైః=చెక్కిన లతల పంక్తులచే చిత్రముగా ఉన్నట్లు చేయబడినవీ అయిన, తోరణైః=ముఖద్వారములతో కూడినదీ, దివి=స్వర్గమునందు, దేవపురీమివ=అమరావతి వలె ఉన్నదీ, అయిన, లఙ్కామ్=ఆ లంకను, దదర్శ=చూచెను.

తా. ఉత్తమమైన కాంతి గల హనుమంతుడు లంకాపట్టణమును సమీపించి రావణుడు పాలించుచున్న, సుందరమైన మహానగరమైన ఆ లంకను చూచెను. ఆ నగరము చుట్టును పద్మములతోను, కలవలతోను ప్రకాశించుచున్న పరిఖ (అగడ్త) ఉండెను. రావణుడు సీతను అపహరించి ఉండుటచే, రాముడు ఎప్పుడు యుద్ధానికి వచ్చునో అను భయముతో, భయంకరములైన ధనస్సులు ధరించి అంతట తిరుగుచున్న రాక్షసులచే ఆ నగరమునకు కాపలా కాపించుచుండెను. ఆ నగరము చుట్టు బంగారు ప్రాకార ముండెను. పర్వతముల వలె ఎత్తుగాను, శరత్కాలమేఘముల వలె తెల్లగాను ఉన్న భవనములతో ఆ నగరములోని ప్రధాన మైన వీథులు తెల్లగాను, ఎత్తుగాను కనబడుచుండెను. వందలకొలది బురుజులతోనూ, వరుసగా కట్టిన పతాకలతోను ధ్వజములతోను ప్రకాశించుచుండెను. అది స్వర్గలోకములో అమరావతి వలె ఉండెను. 14-18

మూ. గిరిమూర్ధ్ని స్థితాం లఙ్కాం పాణ్డురైర్భవనైః శుభైః,
దదర్శ స కపిశ్రేష్ఠః పురమాకాశగం యథా. 19

ప్ర. అ. సః=ఆ, కపిశ్రేష్ఠః=హనుమంతుడు, పాణ్డురైః=తెల్లని, శుభైః=సుందరము లైన, భవనైః=భవనములతో, గిరిమూర్ధ్ని=పర్వతము పై భాగమునందు, స్థితామ్=ఉన్నదీ, ఆకాశగమ్=ఆకాశములో ఉన్న, పురం యథా=పట్టణము వలె ఉన్న, లఙ్కామ్=లంకను, దదర్శ=చూచెను.

తా. తెల్లని అందమైన భవనములతో, పర్వతాగ్రమునందు ఉండుటచే ఆ లంక ఆకాశములో నిర్మించిన పురము వలె ఉండెను. అట్టి లంకను హనుమంతుడు చూచెను. 19

మూ. పాలితాం రాక్షసేన్ద్రేణ నిర్మితాం విశ్వకర్మణా,
ప్లవమానామివాకాశే దదర్శ హనుమాన్ పురీమ్. 20

ప్ర. అ. హనుమాన్=హనుమంతుడు, రాక్షసేన్ద్రేణ=రాక్షస రాజైన రావణునిచేత, పాలితామ్=పాలింపబడినదీ, విశ్వకర్మణా=విశ్వకర్మ చేత, నిర్మితామ్=నిర్మింపబడినదీ, ఆకాశే=ఆకాశమునందు, ప్లవమానామివ= తేలియాడుచున్నట్లున్న, పురీమ్=ఆ పట్టణమును, దదర్శ=చూచెను.

తా. రావణుడు పాలించుచున్న ఆ లంకాపురమును పూర్వము విశ్వకర్మ నిర్మించెను. హనుమంతునకు ఆ నగరము ఆకాశములో తేలిపోవుచున్నట్లు కనబడెను. 20

మూ. వప్రప్రాకారజఘనాం విపులామ్బునవామ్బరామ్,
శతఘ్నీశూలకేశాన్తామట్టాలకవతంసకామ్, 21
మనసేవ కృతాం లఙ్కాం నిర్మితాం విశ్వకర్మణా,
ద్వారముత్తరమాసాద్య చిన్తయామాస వానరః. 22

ప్ర. అ. వానరః=హనుమంతుడు, వప్రప్రాకారజఘనామ్=వప్రము (మట్టిగోడ) ప్రాకారము (శిలానిర్మితప్రాకారము) జఘనముగా కలదీ, విపులామ్బునవామ్బరామ్=అధిక మైన (పరిఖలలోని) ఉదకమే నూతనవస్త్రముగా గలదీ, శతఘ్నీశూలకేశాన్తామ్=శతఘ్నులు, శూలములు కేశాంతము (జుట్టు చివరిభాగముగా) గలదీ, అట్టాలకవతంసకామ్=కోటబురుజు లను కర్ణభూషణములు కలదీ, మనసా=మనస్సుతో, నిర్మితామ్=నిర్మింపబడినదీ అయిన, లఙ్కామ్=లంకను, (చూచెను.) ఉత్తరం ద్వారమ్=ఉత్తరమువైపున ఉన్న ద్వారమును, ఆసాద్య=చేరి, చిన్తయామాస=ఆలోచించెను.

తా. ఊహానిర్మితమా అన్నట్లున్న ఆ లంకను విశ్వకర్మ నిర్మించెను. మట్టి గోడల ప్రాకారము, శిలలతో నిర్మించిన ప్రాకారము దానికి జఘనముగాను, అగడ్తలలో ప్రవహించుచున్న అధికమైన ఉదకము వస్త్రముగాను, శతఘ్నులు శూలములు అను ఆయుధములు కేశపాశముగాను, కోటబురుజులు కుండలము లుగాను ఉండుటచే స్త్రీ వలె ఉన్న ఆ లంకను హనుమంతుడు చూచెను. దాని ఉత్తరద్వారము దగ్గరకు వెళ్ళి అతడు ఆలోచనలో పడెను. 21, 22

మూ. కైలాసశిఖరప్రఖ్యామాలిఖన్తీమివామ్బరమ్,
డీయమానామివాకాశముచ్ఛ్రితైర్భవనోత్తమైః. 23

మూ. సంపూర్ణాం రాక్షసైర్ఘోరైర్నాగైర్భోగవతీమివ,
అచిన్త్యాం సుకృతాం స్పష్టాం కుబేరాధ్యుషితాం పురా. 24

మూ. దంష్ట్రిభిర్బహుభిః శూరైః శూలపట్టిసపాణిభిః,
రక్షితాం రాక్షసైర్ఘోరైర్గుహామాశీవిషైరివ. 25

మూ. తస్యాశ్చ మహతీం గుప్తిం సాగరం చ నిరీక్ష్య సః,
రావణం చ రిపుం ఘోరం చిన్తయామాస వానరః. 26

ప్ర. అ. కైలాసశిఖరప్రఖ్యామ్=కైలాసపర్వతశిఖరములో సమానమైనదీ, అమ్బరమ్=ఆకాశమును, ఆలిఖన్తీమివ=ఒరయుచున్నది వలె ఉన్నదీ, ఉచ్ఛ్రితైః=ఉన్నతము లైన, భవనోత్తమైః=ఉత్తమములైన భవనములచేత, ఆకాశమ్=ఆకాశమును గూర్చి, డీయమానామివ=ఎగురుచున్నదివలె ఉన్నదీ, నాగైః=సర్పములచేత, భోగవతీమివ=భోగవతీనగరము (పాతాళములోనిది) వలె, ఘోరైః=భయంకరు లైన, రాక్షసైః=రాక్షసులతో, సంపూర్ణామ్=నిండినదీ, అచిన్త్యామ్=ఊహింప శక్యము కానిదీ, సుకృతామ్=బాగుగా ఏర్పరుపబడినదీ, స్పష్టామ్=స్పష్టమైనదీ, పురా=పూర్వము, కుబేరాధ్యుషితామ్=కుబేరునిచేత అధిష్ఠింపబడినదీ, ఆశీవిషైః=సర్పములచేత, గుహామివ=గుహవలె, దంష్ట్రిభిః=కోరలుకలవారూ, శూరైః=శూరులూ, శూలపట్టిసపాణిభిః=శూలములు, పట్టిసములు చేతులలో కలవారూ, ఘోరైః=భయంకరులూ అయిన, రాక్షసైః=రాక్షసులచేత, రక్షితామ్=రక్షింపబడినదీ అయిన (లంకను చూచెను). సః వానరః=ఆ హనుమంతుడు, తస్యాః=ఆ లంకయొక్క, మహతీమ్=గొప్ప దైన, గుప్తిమ్=రక్షణను, సాగరం చ=సముద్రమును, ఘోరమ్ రిపుమ్=భయంకరశత్రువైన, రావణం చ=రావణునీ, నిరీక్ష్య=చూచి, చిన్తయామాస=ఈ విధముగా ఆలోచించెను.

తా. కైలాసశిఖరము వలె ఉన్నతముగా ఉన్న ఆ లంకాపట్టణము ఆకాశమును ఒరయుచున్నట్లున్నది. భవనములు అత్యున్నతములుగా ఉన్నవి.

భయంకరు లైన రాక్షసులతో, నాగములతో భోగవతీపట్టణము వలె, నిండి ఉన్నది. దాని శోభ ఊహకు కూడ అందుటలేదు. అతిస్పష్టముగా ప్రకాశించుచున్న ఆ నగరములో పూర్వము కుబేరుడు నివసించుచుండెడివాడు. కోరలు కలవారూ, శూలములు, పట్టసములు అను ఆయుధములు ధరించినవారూ, భయంకరులూ, శూరులూ అయిన ఎందరో రాక్షసులు, సర్పములు గుహను రక్షించుచున్నట్లు, ఆ లంకాపట్టణమును రక్షించుచుండిరి. అట్టి ఆ లంకాపట్టణమునకు ఏర్పరచిన గొప్ప రక్షణవిధానమును, దాని చుట్టును సముద్రమును, చూచి, రావణుడు భయంకరుడైన శత్రువను విషయమును కూడ గుర్తించి, హనుమంతుడీ విధముగా తలచెను. 23-26

మూ. ఆగత్యాపీహ హరయో భవిష్యన్తి నిరర్థకాః,
న హి యుద్ధేన వై లఙ్కా శక్యా జేతుం సురైరపి. 27

ప్ర. అ. హరయః=వానరులు, ఇహ=ఇక్కడికి, ఆగత్యాపి=వచ్చి కూడా, నిరర్థకాః=ఫలము పొందజాలనివారు, భవిష్యన్తి=కాగలరు. లఙ్కా=లంక, యుద్ధేన=యుద్ధముచేత, సురైరపి=దేవతలచేత కూడ, జేతుమ్=జయించుటకు, న శక్యా హి=శక్యమైనది కాదు కదా.

తా. వానరులు ఇక్కడికి వచ్చినా ఏమీ ప్రయోజనము ఉండదు. దేవతలు కూడా, యుద్ధము చేసి ఈ లంకను జయించజాలరు. 27

మూ. ఇమాం తు విషమాం దుర్గాం లఙ్కాం రావణపాలితామ్,
ప్రాప్యాపి స మహాబాహుః కిం కరిష్యతి రాఘవః. 28

ప్ర. అ. విషమామ్=చాలా కష్టమైనదీ,దుర్గామ్=ప్రవేశింప శక్యము కానిదీ, రావణపాలితామ్=రావణునిచేత పాలింపబడినదీ అయిన,ఇమామ్=ఈ, లఙ్కామ్=లంకను, ప్రాప్యాపి=చేరి కూడా, మహాబాహుః=గొప్ప బాహువులు గల, సః రాఘవః=ఆ రాముడు, కిం కరిష్యతి=ఏమి చేయగలడు?

తా. రావణుడు పాలించుచున్న, లోనికి ప్రవేశింప శక్యము కాని, ఈ కష్టమైన లంకాపట్టణమునకు వచ్చి కూడ, మహాబాహువైన రాముడు ఏమి చేయగలడు? 28

మూ. అవకాశో న సాన్త్వస్య రాక్షసేష్వభిగమ్యతే,
న దానస్య న భేదస్య నైవ యుద్ధస్య దృశ్యతే. 29

ప్ర. అ. రాక్షసేషు=రాక్షసుల విషయమున, సాన్త్వస్య=సామోపాయము నకు, అవకాశః=అవకాశము, న అభిగమ్యతే=పొందబడదు. దానస్య=దానమునకు,

న=అవకాశము లేదు. భేదస్య=భేదమునకు, న=అవకాశము లేదు. యుద్ధస్య=యుద్ధమునకు, నైవ దృశ్యతే=ఏ మాత్రమూ కనబడదు.

తా. రాక్షసుల విషయములో సామమునకు గాని, దానమునకు గాని, భేదానికి గాని అవకాశము లేదు. యుద్ధమునకు ఏ మాత్రమూ అవకాశము లేదు. 29

మూ. చతుర్ణామేవ హి గతిర్వానరాణాం మహాత్మనామ్,
వాలిపుత్రస్య నీలస్య మమ రాజ్ఞశ్చ ధీమతః. 30

ప్ర. అ. వాలిపుత్రస్య=అంగదునకు, నీలస్య=నీలునకు, మమ=నాకు, ధీమతః=బుద్ధిమంతుడైన, రాజ్ఞశ్చ=ప్రభువైన సుగ్రీవునకు, మహాత్మనామ్=గొప్ప బలము గల, చతుర్ణామ్=నలుగురు, వానరాణామేవ=వానరులకే, గతిః హి=(ఇక్కడకి) రాక కదా!

తా. అంగదుడూ, నీలుడూ, ధీమంతుడైన సుగ్రీవుడూ, నేనూ, ఈ నలుగురు వానరులము మాత్రమే ఈ లంకలోనికి రాగలుగుదుము. 30

మూ. యావజ్జానామి వైదేహీం యది జీవతి వా న వా,
తత్రైవ చిన్తయిష్యామి దృష్ట్వా తాం జనకాత్మజామ్. 31

ప్ర. అ. వైదేహీమ్=సీతను గూర్చి, యది జీవతి వా=జీవించి ఉన్నదా, న వా=లేదా అను విషయమును, యావత్ జానామి=తెలుసుకొనెదను. తామ్=ఆ, జనకాత్మజామ్=సీతను, దృష్ట్వా=చూచి, తత్రైవ=అక్కడనే, చిన్తయిష్యామి=ఆలోచించెదను.

తా. సీత జీవించి ఉన్నదా లేదా అను విషయము ముందుగా తెలుసుకొనవలెను. ఆమె కనబడిన తరువాత ఈ ఆలోచనలన్నీ చేయవచ్చును. ఇప్పుడెందుకు? 31

మూ. తతః స చిన్తయామాస ముహూర్తం కపికుఞ్జరః,
గిరిశృఙ్గే స్థితస్తస్మిన్ రామస్యాభ్యుదయే రతః. 32

ప్ర. అ. తతః=అటుపిమ్మట, రామస్య=రామునియొక్క, అభ్యుదయే=అభ్యుదయమునందు, రతః=ఆసక్తుడైన, సః కపికుఞ్జరః=ఆ వానరశ్రేష్ఠుడు, తస్మిన్=ఆ, గిరిశృఙ్గే=పర్వతశిఖరమునందు, స్థితః=నిలచిన వాడై, ముహూర్తమ్=ముహూర్తకాలముపాటు, చిన్తయామాస=ఆలోచించెను.

తా. రాముని అభివృద్ధిని కోరుచున్న ఆ హనుమంతుడు ఆ పర్వత శిఖరముపై నిలచి కొంచెముసేపు ఇట్లు ఆలోచించెను. 32

మూ. అనేన రూపేణ మయా న శక్యా రక్షసాం పురీ,
ప్రవేష్టుం రాక్షసైర్గుప్తా క్రూరైర్బలసమన్వితైః. 33

ప్ర. అ. క్రూరైః=క్రూరులూ, బలసమన్వితైః=బలముతో కూడినవారూ అయిన, రాక్షసైః=రాక్షసులచేత, గుప్తా=రక్షింపబడిన, రక్షసామ్=రాక్షసులయొక్క, పురీ=పట్టణము, మయా=నాచేత, అనేన=ఈ, రూపేణ=రూపముతో, ప్రవేష్టుమ్=ప్రవేశించుటకు, న శక్యా=శక్యమైనది కాదు.

తా. క్రూరులూ, బలవంతులూ అయిన రాక్షసులు రక్షించుచున్న ఈ లంకాపట్టణమును, నేనీ రూపముతో ప్రవేశించుటకు శక్యము కాదు. 33

మూ. ఉగ్రౌజసో మహావీర్యా బలవన్తశ్చ రాక్షసాః,
వఞ్చనీయా మయా సర్వే జానకీం పరిమార్గతా. 34

ప్ర. అ. జానకీమ్=సీతను, పరిమార్గతా=వెదకుచున్న, మయా=నాచేత, ఉగ్రౌజసః=ఉగ్రమైన తేజస్సు కలవారూ, మహావీర్యాః=గొప్ప పరాక్రమము కల వారూ, బలవన్తశ్చ=బలవంతులూ అయిన, రాక్షసాః=రాక్షసులు, సర్వే=అందరూ, వఞ్చనీయాః=వంచింపదగినవారు.

తా. ఉగ్రమైన తేజస్సూ, గొప్ప పరాక్రమమూ, గొప్ప బలమూ గల ఈ రాక్షసులనందరినీ మోసగించిగాని నేను సీతను వెదకజాలను. 34

మూ. లక్ష్యాలక్ష్యేణ రూపేణ రాత్రౌ లఙ్కా పురీ మయా,
ప్రవేష్టుం ప్రాప్తకాలం మే కృత్యం సాధయితుం మహత్. 35

ప్ర. అ. మే=నాయొక్క, మహత్=గొప్పదైన, కృత్యమ్=కార్యమును, సాధయితుమ్=సాధించుటకు, మయా=నాచేత,లక్ష్యాలక్ష్యేణ=కనబడీ కనబడకుండా ఉండే, రూపేణ=రూపముతో, రాత్రౌ=రాత్రియందు, లఙ్కాపురీ=లంకానగరము, ప్రవేష్టుమ్=ప్రవేశించుటకు,ప్రాప్తకాలమ్=కాలానుగుణమైన పని.

తా. నే నీ మహాకార్యమును సాధించవలెనన్నచో, కనబడీ కనబడకుండా ఉండే చిన్న రూపము ధరించి, రాత్రి ఈ లంకలో ప్రవేశించుటయే ఈ సమయమున చేయవలసిన పని. 35

మూ. తాం పురీం తాదృశీం దృష్ట్వా దురాధర్షాం సురాసురైః,
హనుమాన్ చిన్తయామాస వినిశ్శ్వస్య ముహుర్ముహుః. 36

ప్ర. అ. హనుమాన్=హనుమంతుడు, సురాసురైః=దేవతలచేతగాని అసురులచేత గాని, దురాధర్షామ్=ఎదిరింప శక్యము కాని, తాదృశీమ్=అట్టి, తామ్=ఆ, పురీమ్=పట్టణమును, దృష్ట్వా=చూచి, వినిశ్చిత్య=నిశ్చయించి, ముహుర్ముహుః=మాటిమాటికి, చిన్తయామాస=ఆలోచించెను.

తా. దేవతలు గాని అసురులు గాని ఎదిరింప శక్యము కాని అట్టి ఆ లంకాపట్టణము చూచి, హనుమంతుడు తన కర్తవ్యమేదో నిశ్చయించుకొని, దానినెట్లు సాధించవలెనా అని మాటిమాటికి ఆలోచించెను. 36

మూ. కేనోపాయేన పశ్యేయం మైథిలీం జనకాత్మజామ్,
అదృష్టో రాక్షసేన్ద్రేణ రావణేన దురాత్మనా. 37

ప్ర. అ. దురాత్మనా=దుష్టబుద్ధికలవాడూ, రాక్షసేన్ద్రేణ=రాక్షసప్రభువూ అయిన, రావణేన=రావణునిచేత, అదృష్టః=చూడబడనివాడనై, కేన=ఏ, ఉపాయేన=ఉపాయముచేత, జనకాత్మజామ్=జనకుని కుమార్తెయైన, మైథిలీమ్=సీతాదేవిని, పశ్యేయమ్=చూచెదను.

తా. దుర్బుద్ధియైన ఆ రాక్షసరాజు రావణుని కంట పడకుండా సీతను చూచుటకు ఉపాయమేమి? 37

మూ. న వినశ్యేత్కథం కార్యం రామస్య విదితాత్మనః,
ఏకామేకశ్చ పశ్యేయం రహితే జనకాత్మజామ్. 38

ప్ర. అ. విదితాత్మనః=ప్రసిద్ధమైన బుద్ధి గల, రామస్య=రాముని యొక్క, కార్యమ్=కార్యము, కథమ్=ఎట్లు, న వినశ్యేత్=చెడిపోకుండా ఉండును? ఏకశ్చ=ఒంటరిగా (నేను), రహితే=జనశూన్యమైన ప్రదేశము నందు, ఏకామ్=ఒంటరిగా ఉన్న, జనకాత్మజామ్=సీతను, (ఎట్లు), పశ్యేయమ్=చూచెదను.

తా. మహాబుద్ధిమంతుడుగా ప్రసిద్ధుడైన రాముని కార్యము నేను ఎట్లు ప్రవర్తించినచో చెడిపోకుండా ఉండును? సీత నిర్జనమైన ప్రదేశములో ఒంటరిగా ఉండగా, నేను ఒంటరిగా ఆమెను చూచుటకు ఉపాయమేమి? 38

మూ. భూతాశ్చార్థా విపద్యన్తే దేశకాలవిరోధితాః,
విక్లబం దూతమాసాద్య తమః సూర్యోదయే యథా. 39

ప్ర. అ. విక్లబమ్=వ్యాకులమైన బుద్ధి గల, దూతమ్=దూతను, ఆసాద్య=పొంది, దేశకాలవిరోధితాః=దేశమునకు కాలములకు విరుద్ధములుగా

చేయబడినవై, భూతాః=సిద్ధమైన, అర్థాః=కార్యములు, సూర్యోదయే=సూర్యోదయ సమయమునందు, తమః యథా=అంధకారము వలె, విపద్యన్తే=చెడిపోవును.

తా. స్థిరచిత్తము లేని దూతలు దేశకాలములకు విరోధము కల్పించుటచే, సిద్ధముగా ఉన్న పనులు కూడ, సూర్యోదయసమయమునందు అంధకారము నశించినట్లు చెడిపోవును. 39

మూ. అర్థానర్థాన్తరే బుద్ధిర్నిశ్చితాపి న శోభతే,
ఘాతయన్తి హి కార్యాణి దూతాః పణ్డితమానినః. 40

ప్ర. అ. నిశ్చితా=నిశ్చయింపబడిన, బుద్ధిరపి=బుద్ధి కూడ, (ఆలోచన కూడ), అర్థానర్థాన్తరే=లాభము నష్టము అనువాటి మధ్య, న శోభతే=ప్రకాశించదు. పణ్డితమానినః=పండితులమనే అభిమానము గల, దూతాః=దూతలు, కార్యాణి=కార్యములను, ఘాతయన్తి హి=చెడగొట్టుదురు కదా.

తా. ఈ కార్యము చేయవలెను అని నిశ్చయము చేసిన పిమ్మట కూడ లాభనష్టాల ఆలోచనలో పడిన బుద్ధి ప్రకాశించదు. దూతలు బుద్ధిమంతుల మను అహంకారముతో కార్యములను చెడగొట్టుచుందురు. 40

మూ. న వినశ్యేత్కథం కార్యం వైక్లబ్యం న కథం భవేత్,
లఙ్ఘనం చ సముద్రస్య కథం ను న వృథా భవేత్. 41

ప్ర. అ. కార్యమ్=కార్యము, కథమ్=ఎట్లు, న వినశ్యేత్=నశించ కుండా ఉండును? వైక్లబ్యమ్=(బుద్ధికి) వ్యాకులత్వము, కథమ్=ఎట్లు, న భవేత్=కల గకుండా ఉండును? సముద్రస్య=సముద్రముయొక్క, లఙ్ఘనం చ=దాటుట కూడా, కథం ను=ఎట్లు, వృథా=వ్యర్థము, న భవేత్=కాకుండును?

తా. వచ్చిన కార్యము ఎట్లు చెడిపోకుండును? బుద్ధి వ్యాకులము కాకుండా చక్కగా పనిచేయు ఉపాయమేమి? సముద్రలంఘనము సఫల మెట్లు అగును? 41

మూ. మయి దృష్టే తు రక్షోభీ రామస్య విదితాత్మనః,
భవేద్వ్యర్థమిదం కార్యం రావణానర్థమిచ్ఛతః. 42

ప్ర. అ. మయి=నేను, రక్షోభిః=రాక్షసులచేత, దృష్టే తు=చూడబడినవా డనగుచుండగా, రావణానర్థమ్=రావణుని సంహారమును, ఇచ్ఛతః=కోరుచున్న, విదితాత్మనః=ప్రసిద్ధమైన బుద్ధిగల, రామస్య=రాముని యొక్క, ఇదమ్=ఈ, కార్యమ్=కార్యము, వ్యర్థమ్=వ్యర్థము, భవేత్=అగును.

తా. నన్ను రాక్షసులు చూచినచో, రావణుని సంహరింపవలెనని కోరుచున్న, ప్రసిద్ధబుద్ధిశాలియైన రాముని కార్యము చెడిపోవును. 42

మూ. న హి శక్యం క్వచిత్ స్థాతుమవిజ్ఞాతేన రాక్షసైః,
అపి రాక్షసరూపేణ కిముతాన్యేన కేనచిత్. 43

ప్ర. అ. రాక్షసైః=రాక్షసులచేత, అవిజ్ఞాతేన=తెలియబడకుండగా, రాక్షస రూపేణాపి=రాక్షసరూపముతో కూడ, క్వచిత్=ఏ ప్రదేశమునందైనను, స్థాతుమ్=ఉండుటకు, న శక్యం హి=శక్యము కాదు కదా. అన్యేన=మరియొక, కేన చిత్=ఏదైన రూపముతో, కిముత=చెప్పనేల.

తా. రాక్షసరూపము ధరించి కూడ, రాక్షసులకు తెలియకుండగా ఈ లంకలో ఎక్కడను ఉండుటకు శక్యము కాదు ; ఇంక ఇతర రూపముతో మాట చెప్పవలెనా ! 43

మూ. వాయురప్యత్ర నాజ్ఞాతశ్చరేదితి మతిర్మమ,
న హ్యస్త్యవిదితం కించిద్రాక్షసానాం బలీయసామ్. 44

ప్ర. అ. అత్ర=ఇక్కడ, వాయురపి=గాలి కూడ, అజ్ఞాతః=తెలియ బడనివాడై, న చరేత్=సంచరించజాలడు, ఇతి=అని, మమ=నా యొక్క, మతిః=అభిప్రాయము, బలీయసామ్=బలవంతులైన, రాక్షసానామ్=రాక్షసులకు, అవిదితమ్=తెలియనిది, కించిత్=ఏదీ, నాస్తి హి=లేదు కదా !

తా. ఈ పట్టణములో రాక్షసులకు తెలియకుండా గాలి కూడ ఎక్కడా సంచరించజాలదని నా అభిప్రాయము. బలవంతులైన రాక్షసులకు తెలియని ప్రదేశమేదీ లేదు కదా ! 44

మూ. ఇహాహం యది తిష్ఠామి స్వేన రూపేణ సంవృతః,
వినాశముపయాస్యామి భర్తురర్థశ్చ హీయతే. 45

ప్ర. అ. అహమ్=నేను, స్వేన=నా సంబంధమైన, రూపేణ=రూప ముతో, సంవృతః=కూడినవాడనై, ఇహ=ఇక్కడ, తిష్ఠామి యది=ఉన్నట్లయితే, వినాశమ్=నాశమును, ఉపయాస్యామి=పొందగలను. భర్తుః=ప్రభువు యొక్క, అర్థశ్చ=కార్యము కూడ, హీయతే=చెడిపోవును.

తా. నేను ఈ (పెద్ద) రూపములోనే ఇక్కడ ఉన్నచో పట్టుబడి చంపబడుదును. ప్రభువైన సుగ్రీవుని కార్యము చెడిపోవును. 45

మూ. తదహం స్వేన రూపేణ రజన్యాం హ్రస్వతాం గతః,
లఙ్కామభిపతిష్యామి రాఘవస్యార్థసిద్ధయే. 46

ప్ర. అ. తత్=ఆ కారణమువలన, అహమ్=నేను, స్వేన రూపేణ=నా రూపముతో, హ్రస్వతామ్=హ్రస్వత్వమును, గతః=పొందినవాడనై, రాఘవస్య=రామునియొక్క, అర్థసిద్ధయే=కార్యము సిద్ధించుటకొరకు, రజన్యామ్=రాత్రియందు, లఙ్కామ్=లంకను, అభిపతిష్యామి=ప్రవేశించెదను.

తా. అందుచేత, నేను నా రూపము చిన్నదిగా చేసికొని, రాముని కార్యము సాధించుటకై, రాత్రివేళ లంకలో ప్రవేశించెదను. 46

మూ. రావణస్య పురీం రాత్రౌ ప్రవిశ్య సుదురాసదామ్,
విచిన్వన్ భవనం సర్వం ద్రక్ష్యామి జనకాత్మజామ్. 47

ప్ర. అ. సుదురాసదామ్=ఏ మాత్రమూ సమీపింప శక్యము కాని, పురీమ్=పట్టణమును, రాత్రౌ=రాత్రియందు, ప్రవిశ్య=ప్రవేశించి, రావణస్య=రావణుని యొక్క, సర్వమ్=సమస్తమైన, భవనమ్=గృహమును, విచిన్వన్=వెదకుచున్నవాడనై, జనకాత్మజామ్=సీతను, ద్రక్ష్యామి=చూడగలను.

తా. దగ్గరకు పోవుటకు కూడ శక్యము కాని ఈ లంకాపట్టణములోనికి రాత్రి ప్రవేశించి, రావణుని గృహము నంతను వెదకి, సీతను చూచెదను.47

మూ. ఇతి సంచిన్త్య హనుమాన్ సూర్యస్యాస్తమయం కపిః,
ఆచకాంక్షే తతో వీరో వైదేహ్యా దర్శనోత్సుకః. 48

ప్ర. అ. వీరః కపిః=వానరవీరుడైన, హనుమాన్=హనుమంతుడు, ఇతి=ఇట్లు, సంచిన్త్య=ఆలోచించి, వైదేహ్యాః=సీతయొక్క, దర్శనోత్సుకః=దర్శనమునందు ఆసక్తి కలవాడై, తదా=అప్పుడు, సూర్యస్య=సూర్యుని యొక్క, అస్తమయమ్=అస్తమయమును, ఆచకాంక్షే=కోరెను.

తా. వానరవీరుడైన హనుమంతుడు ఈ విధముగా ఆలోచించి, సీతను చూడవలెనను అభిలాషతో సూర్యాస్తమయమునకై వేచి ఉండెను. 48

మూ. సూర్యే చాస్తం గతే రాత్రౌ దేహం సంక్షిప్య మారుతిః,
వృషదంశకమాత్రః సన్ బభూవాద్భుతదర్శనః. 49

ప్ర. అ. సూర్యే=సూర్యుడు, అస్తంగతే చ=అస్తమించగానే, మారుతిః=హనుమంతుడు, రాత్రౌ=రాత్రియందు, దేహమ్=దేహమును, సంక్షిప్య=చిన్నది చేసి,

వృషదంశకమాత్రః సన్=పిల్లి అంత ప్రమాణము కలవాడై, అద్భుతదర్శనః=ఆశ్చర్యకరమైన దర్శనము కలవాడు, బభూవ=అయెను.

తా. సూర్యుడు అస్తమించగానే, రాత్రియందు హనుమంతుడు, శరీరమును చాల చిన్నది చేసి, పిల్లియంత ప్రమాణముతో చూచుటకు ఆశ్చర్యము కలుగునట్లు మారెను. 49

మూ. ప్రదోషకాలే హనుమాంస్తూర్ణముత్ప్లుత్య వీర్యవాన్,
ప్రవివేశ పురీం రమ్యాం సువిభక్తమహాపథామ్. 50

ప్ర. అ. వీర్యవాన్=పరాక్రమవంతుడైన, హనుమాన్=హనుమంతుడు, ప్రదోషకాలే=సాయంకాలమునందు, తూర్ణమ్=శీఘ్రముగా, ఉత్ప్లుత్య=ఎగిరి, సువిభక్తమహాపథామ్=చక్కగా విభజింపబడి ఉన్న ప్రధాన మార్గములు గల, రమ్యామ్=సుందర మైన, పురీమ్=పట్టణమును, ప్రవివేశ=ప్రవేశించెను.

తా. పరాక్రమవంతుడైన హనుమంతుడు సాయంకాలసమయమునందు శీఘ్రముగా ఎగిరి, చక్కగా అమర్చిన విశాలప్రధానమార్గములు గల, సుందరమైన లంకాపట్టణములోనికి ప్రవేశించెను. 50

మూ. ప్రాసాదమాలావితతాం స్తమ్భైః కాఞ్చనరాజతైః,
శాతకుమ్భమయైర్జాలైర్గన్ధర్వనగరోపమామ్. 51

మూ. సప్తభౌమాష్టభౌమైశ్చ స దదర్శ మహాపురీమ్,
తలైః స్ఫటికసంకీర్ణైః కార్తస్వరవిభూషితైః. 52

ప్ర. అ. సః=హనుమంతుడు, ప్రాసాదమాలావితతామ్=మేడల పంక్తులతో నిండినదీ, కాఞ్చనరాజతైః=బంగారు వెండి వికారమైన, స్తమ్భైః=స్తంభములతోను, శాతకుమ్భమయైః=బంగారు వికారములైన, జాలైః=కిటికీలతోను, గన్ధర్వనగరోపమామ్=గంధర్వనగరముతో (ఐంద్రజాలికులు నిర్మించిన అద్భుతమైన నగరముతో) సమానమైనదీ, సప్తభౌమాష్టభౌమైః చ=ఏడంతస్తులు, ఎనిమిదంతస్తులు, ఉన్న గృహములతోను, స్ఫటికసంకీర్ణైః=స్ఫటికమాణిక్యములతో వ్యాప్తమైనవీ, కార్తస్వరవిభూషితైః=బంగారముతో అలంకరింపబడినవీ అయిన, తలైః=పై భాగములతోను కూడిన, మహాపురీమ్=మహాపట్టణమును, దదర్శ=చూచెను.

తా. ఆ లంకానగరము ప్రసాదముల పంక్తులతో నిండి ఉండెను. బంగారపు స్తంభములతోను, వెండి స్తంభములతోను, బంగారు కిటికీలతోను, అది గంధర్వనగరము వలె అద్భుతముగా ఉండెను. ఏడంతస్తుల మేడలు,

ఎనిమిదంతస్తుల మేడలు ప్రకాశించుచుండెను. బంగారముతో అలంకరించిన పై భాగములపై స్ఫటికమాణిక్యములు పరచబడి ఉండెను. 51, 52

మూ. వైడూర్యమణిచిత్రైశ్చ ముక్తాజాలవిభూషితైః,
తలైః శుశుభిరే తాని భవనాన్యత్ర రక్షసామ్. 53

ప్ర. అ. అత్ర=ఈ లంకాపురమునందు, రక్షసామ్=రాక్షసులయొక్క, భవనాని=భవనములు, వైడూర్యమణిచిత్రైః=వైడూర్యమణులచే చిత్రింపబడినవీ, ముక్తాజాలవిభూషితైః=ముత్యముల సముదాయముచే అలంకరింపబడినవీ అయిన, తలైః=పై భాగములతో, శుశుభిరే=ప్రకాశించినవి.

తా. ఆ లంకాపట్టణములో రాక్షసుల భవనముల పై భాగములు వైడూర్యమాణిక్యములచే చిత్రవర్ణములై, ముత్యాల సముదాయములచే అలంకృతములై, ప్రకాశించుచుండెను. 53

మూ. కాఞ్చనాని చ చిత్రాణి తోరణాని చ రక్షసామ్,
లఙ్కాముద్ద్యోతయామాసుః సర్వతః సమలంకృతామ్. 54

ప్ర. అ. రక్షసామ్=రాక్షసులయొక్క, కాఞ్చనాని=బంగారు వికారమైన, చిత్రాణి=విచిత్రవర్ణములు గల, తోరణాని=గృహద్వారములు, సమలంకృతామ్=అలంకరింపబడిన, లఙ్కామ్=లంకాపట్టణమును, సర్వతః=నలువైపులందు, ఉద్ద్యోతయామాసుః=ప్రకాశింపచేసినవి.

తా. బంగారముతో నిర్మింపబడిన, విచిత్రవర్ణములు గల రాక్షసగృహద్వారములు చక్కగా అలంకరింపబడిన ఆ లంకాపట్టణమును, నలుమూలలా ప్రకాశింపచేయుచుండెను. 54

మూ. అచిన్త్యామద్భుతాకారాం దృష్ట్వా లఙ్కాం మహాకపిః,
ఆసీద్విషణ్ణో హృష్టశ్చ వైదేహ్యా దర్శనోత్సుకః. 55

ప్ర. అ. మహాకపిః=హనుమంతుడు, అచిన్త్యామ్=ఆలోచించుటకు కూడ శక్యము కానిదీ, అద్భుతాకారామ్=ఆశ్చర్యకరమైన ఆకారము కలదీ అయిన, లఙ్కామ్=లంకను, దృష్ట్వా=చూచి, వైదేహ్యాః=సీతయొక్క, దర్శనోత్సుకః=దర్శనమునందు ఆసక్తి కలవాడై, విషణ్ణః=దిగులు చెందినవాడు, హృష్టశ్చ=సంతోషించినవాడూ, ఆసీత్=ఆయెను.

తా. హనుమంతుడు ఊహకు కూడ అందని విధముగా ఉండి, ఆశ్చర్యమును కలిగించు ఆ లంకాపట్టణమును చూచి, వైదేహిని చూడవలెనని

కుతూహలము చెందుచు, ఈ లంకను జయించుట ఎట్లా అని దిగులును, సీతను చూడగలము గదా అని ఆనందమును కూడ పొందెను. 55

మూ. స పాణ్డురావిద్ధవిమానమాలినీం
మహార్హజామ్బూనదజాలతోరణామ్,
యశస్వినీం రావణబాహుపాలితాం
క్షపాచరైర్భీమబలైః సమావృతామ్. 56

ప్ర. అ. హనుమంతుడు, పాణ్డురావిద్ధవిమానమాలినీమ్=తెల్లనివీ, దగ్గరదగ్గరగా ఉన్నవీ అయిన గృహపంక్తులు కలదీ, మహార్హజామ్బూనదజాలతోరణామ్=గొప్ప విలువ గల, బంగారు వికార మైన కిటికీలు, ముఖద్వారములూ కలదీ, యశస్వినీమ్=కీర్తి గలదీ, భీమబలైః=భయంకరమైన బలము గల, క్షపాచరైః=రాక్షసులతో, సమావృతామ్=కూడినదీ, రావణబాహుపాలితామ్=రావణుని బాహువులచేత పాలింపబడినదీ అయిన (లంకను చూచెను).

తా. ఆ లంకానగరములో తెల్లని గృహములు దగ్గర దగ్గరగా ఉండెను. ఆ గృహములలోని కిటికీలు, ముఖద్వారములు బంగారముతో నిర్మింపబడి అధిక మూల్యములై ఉండెను. రావణుని బాహుబలముచే రక్షింపబడుచున్న కీర్తిమంతమైన ఆ నగరము, భయంకర మైన బలము గల నిశాచరులతో నిండి ఉండెను. 56

మూ. చన్ద్రోఽపి సాచివ్యమివాస్య కుర్వం
స్తారాగణైర్మధ్యగతో విరాజన్,
జ్యోత్స్నావితానేన వితత్య లోక
ముత్తిష్ఠతే నైకసహస్రరశ్మిః. 57

ప్ర. అ. నైకసహస్రరశ్మిః=ఎన్నోవేల కిరణములు గల, చన్ద్రోఽపి=చంద్రుడు కూడ, తారాగణైః=నక్షత్రములగణములతో కూడినవాడై, మధ్యగతః=నక్షత్రమధ్యమును పొందినవాడై, విరాజన్=ప్రకాశించుచు, లోకమ్= భూలోకమును, జ్యోత్స్నావితానేన=వెన్నెల అను చాందినీతో, వితత్య=కప్పివేసి, అస్య=హనుమంతునకు, సాచివ్యమ్=సాహాయ్యమును, కుర్వన్నివ=చేయుచున్నవాడు వలె, ఉత్తిష్ఠతే=లేచెను.

తా. ఆ సమయమున, అనేక సహస్రముల కిరణములు గల చంద్రుడు కూడ, నక్షత్రములతో కూడి, వాటి మధ్య ప్రకాశించుచు, వెన్నెల అను చాందినీతో

లోకమునంతను కప్పివేయుచు, హనుమంతునకు సాహాయ్యము చేయుటకా అన్నట్లు పైకి వచ్చెను. 57

మూ. శఙ్ఖప్రభం క్షీరమృణాలవర్ణ
ముద్గచ్ఛమానం వ్యవభాసమానమ్,
దదర్శ చన్ద్రం స హరిప్రవీరః
పోప్లూయమానం సరసీవ హంసమ్. 58

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే సున్దరకాణ్డే
ద్వితీయః సర్గః.

ప్ర. అ. సః హరిప్రవీరః=ఆ హనుమంతుడు, ఉద్గచ్ఛమానమ్=పైకి లేచుచున్నవాడూ, శఙ్ఖప్రభమ్=శంఖము వంటి కాంతి కలవాడూ, వ్యవభాసమానమ్=ప్రకాశించుచున్న వాడూ, క్షీరమృణాలవర్ణమ్=పాలవంటి తామర తూడు వంటి రంగు గలవాడూ, సరసి=సరస్సు నందు, పోప్లూయమానమ్=ఈదుచున్న, హంసమివ=హంస వలె ఉన్నవాడూ అయిన, చన్ద్రమ్=చంద్రుని, దదర్శ=చూచెను.

తా. ఉదయించి పైకి వచ్చుచు, ప్రకాశించుచున్న ఆ చంద్రుని కాంతి శంఖకాంతి వలె ఉండెను. ఆతని వర్ణము పాల వర్ణము వలె, తామరతూడు వర్ణము వలె ఉండెను. ఆ చంద్రుడు సరస్సులో ఈదుచున్న హంస వలె మనోహరముగా ఉండెను. అట్టి చంద్రుని ఆ హనుమంతుడు చూచెను. 58

*"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు
సుందరకాండలో ద్వితీయసర్గ సమాప్తము.*

అథ తృతీయః సర్గః

[లంకను చూచి హనుమంతుడు ఆశ్చర్యము చెందుట. లోనికి ప్రవేశించుచున్న హనుమంతుని లంక స్త్రీరూపమున వచ్చి అడ్డుకొనుట. ఆతని ప్రహారముచే పీడితురాలై ఆమె హనుమంతునకు లోనికి ప్రవేశించుటకు అనుమతి ఇచ్చుట.]

మూ. స లమ్బశిఖరే లమ్బే లమ్బతోయదసన్నిభే,
సత్త్వమాస్థాయ మేధావీ హనుమాన్ మారుతాత్మజః, 1
నిశి లఙ్కాం మహాసత్త్వో వివేశ కపికుఞ్జరః,
రమ్యకాననతోయాఢ్యాం పురీం రావణపాలితామ్. 2

ప్ర. అ. మేధావీ=బుద్ధిమంతుడూ, మారుతాత్మజః=వాయుపుత్రుడూ, మహాసత్త్వః=గొప్ప బలము కలవాడూ, కపికుఞ్జరః=వానరశ్రేష్ఠుడూ అయిన, సః=ఆ, హనుమాన్=హనుమంతుడు, లమ్బశిఖరే=ఉన్నతమైన శిఖరములు కలదీ, లమ్బతోయదసన్నిభే=ఉన్నతమైన మేఘముతో సమానమైనదీ అయిన, లమ్బే=లంబపర్వతమునందు, సత్త్వమ్=బలమును, ధైర్యమును, ఆస్థాయ=అవలంబించి, రమ్యకాననతోయాఢ్యామ్=సుందరమైన అడవులతోను, ఉదకముతోను నిండిన, రావణపాలితామ్=రావణునిచే పాలించబడిన, లఙ్కాం పురీమ్=లంకానగరమును, నిశి=రాత్రియందు, వివేశ=ప్రవేశించెను.

తా. మహాబుద్ధిశాలీ, వాయునందనుడూ, వానరశ్రేష్ఠుడూ అయిన హనుమంతుడు, ఉన్నతమైన శిఖరములతో ఎత్తైన మేఘము వలె కనబడుచున్న లంబపర్వతముపై ఉన్నదీ, సుందరమైన అరణ్యములతోను ఉదకస్థానములతోను నిండినదీ, రావణునిచే పాలింపబడినదీ అయిన లంకాపురమును, ధైర్యమవలంబించి ప్రవేశించెను. 1, 2

మూ. శారదామ్బుధరప్రఖ్యైర్భవనైరుపశోభితామ్,
సాగరోపమనిర్ఘోషాం సాగరానిలసేవితామ్, 3
సుపుష్టబలసంపుష్టాం యథైవ విటపావతీమ్.
చారుతోరణనిర్యూహాం పాణ్డురద్వారతోరణామ్. 4

భుజగాచరితాం గుప్తాం శుభాం భోగవతీమివ,
తాం స విద్యుద్ఘనాకీర్ణాం జ్యోతిర్మార్గనిషేవితామ్. 5
మన్దమారుతసంచారాం యథేన్ద్రస్యామరావతీమ్,
శాతకుమ్భేన మహతా ప్రాకారేణాభిసంవృతామ్. 6
కిజ్కిణీజాలఘోషాభిః పతాకాభిరలంకృతామ్,
ఆసాద్య సహసా హృష్టః ప్రాకారమభిపేదివాన్. 7

ప్ర. అ. (సః=హనుమంతుడు), శారదామ్బుధరప్రఖ్యైః=శరత్కాల మేఘము లతో సమానము లైన, భవనైః=భవనములచే, ఉపశోభితామ్=ప్రకాశింపచేయబడినదీ, సాగరోపమనిర్ఘోషామ్=సముద్రముతో సమానమైన ధ్వని కలదీ, సాగరానిల సేవితామ్=సముద్రపు గాలిచేత సేవింపబడినదీ, సుపుష్టబలసంపుష్టామ్=బాగుగా పుష్టిచెందిన సేనలతో నిండినదీ, విటపావతీం యథైవ=అలకాపురి వలె ఉన్నదీ, చారుతోరణనిర్యూహామ్=అందమైన తోరణముల వద్ద నిలచిన గజసమూహములు కలదీ, పాణ్డురద్వారతోరణామ్=తెల్లని ద్వారములు, ముఖద్వారములూ కలదీ, భుజగాచరితామ్=సర్పములచే సంచరించబడుచు, గుప్తామ్=వాటిచే రక్షింపబడిన, శుభామ్=సుందరమైన, భోగవతీమివ=(పాతాళములోని) భోగవతీపట్టణము వలె ఉన్నదీ, సవిద్యుద్ఘనాకీర్ణామ్=మెరపులతో కూడిన మేఘములచో వ్యాప్త మైనదీ, జోతిర్మార్గనిషేవితామ్=నక్షత్రమార్గముచే సేవింపబడినదీ, మన్దమారుతసంచారామ్= మందమైన వాయుసంచారము కలదీ, ఇన్ద్రస్య=ఇంద్రునియొక్క, అమరావతీం యథా=అమరావతి వలె ఉన్నదీ, శాతకుమ్భేన=బంగారువికార మైన, మహతా=పెద్ద దైన, ప్రాకారేణ=ప్రాకారముచేత, అభిసంవృతామ్=చుట్టబడినదీ, కిజ్కిణీజాల ఘోషాభిః=చిరుమువ్వల సముదాయముల ధ్వనులు గల, పతాకాభిః=పతాకలచేత, అలంకృతామ్=అలంకరింపబడినదీ అయిన, తామ్=ఆ లంకాపురిని, సహసా=శీఘ్ర ముగా, ఆసాద్య=సమీపించి, హృష్టః=సంతోషించినవాడై, ప్రాకారమ్=ప్రాకారమును, అభిపేదివాన్=పొందినాడు.

తా. సముద్రము పైనుండి వచ్చుచున్న మందమారుతముచే చల్లగా ఉన్న ఆ లంకానగరము సముద్రఘోషవంటి ధ్వనితో నిండి ఉండెను. శరత్కాల మేఘముల వలె ఉన్న భవనములతో ప్రకాశించుచుండెను. బాగుగా బలిసిన సైనికులతో నిండి అలకాపట్టణము వలె ఉండెను. ముఖద్వారములవద్ద నిలిచిన ఏనుగుల సముదాయము అందముగా కనబడుచుండెను. తెల్లని ద్వారములతోను, ముఖద్వారములతోను అది, సర్పములు సంచరించుచున్నదీ, వాటి రక్షణలో ఉన్నదీ అయిన మంగళకర మైన భోగవతీనగరము వలె ఉండెను. మెరుపులతో

కూడిన మేఘములతో వ్యాప్తమై, నక్షత్రమార్గమును అంటుచు, మందమారుతము సంచరించుచున్న ఆ లంక ఇంద్రుని అమరావతి వలె ప్రకాశించుచుండెను. దాని చుట్టు చాల పెద్దదైన బంగారుప్రాకార ముండెను. చిరుమువ్వలతో సవ్వడులు చేయుచున్న పతాకలతో అలంకరింపబడెను. అట్టి ఆ లంకను హనుమంతుడు శీఘ్రముగా సమీపించి, ప్రాకారమువద్దకు వెళ్లెను. 3-7

మూ. విస్మయావిష్టహృదయః పురీమాలోక్య సర్వతః,
జామ్బూనదమయైర్ద్వారైర్వైదూర్యకృతవేదికైః. 8
వజ్రస్ఫటికముక్తాభిర్మణికుట్టిమభూషితైః,
తప్తహాటకనిర్యూహై రాజతామలపాణ్డురైః. 9
వైదూర్యకృతసోపానైః స్ఫాటికాన్తరపాంసుభిః,
చారుసంజవనోపేతైః ఖమివోత్పతితైః శుభైః. 10
క్రౌఞ్చబర్హిణసంఘుష్టై రాజహంసనిషేవితైః.
తూర్యాభరణనిర్ఘోషైః సర్వతః ప్రతినాదితామ్. 11
వస్వౌకసారాప్రతిమాం తాం వీక్ష్య నగరీం తతః,
ఖమివోత్పతితాం లఙ్కాం జహర్ష హనుమాన్ కపిః. 12

ప్ర. అ॥పురీమ్=పట్టణమును, సర్వతః=అంతటా, ఆలోక్య=చూచి, విస్మయా విష్టహృదయః=ఆశ్చర్యముతో నిండిన హృదయముగలవాడయ్యెను. తతః=పిమ్మట, కపిః=వానరుడైన, హనుమాన్=హనుమంతుడు, జామ్బూనదమయైః=బంగారువికార మైన, ద్వారైః=ద్వారములతో కూడినవీ, వైదూర్యకృతవేదికైః=వైదూర్యమాణిక్యములతో చేయబడిన అరుగులు కలవీ, వజ్రస్ఫటికముక్తాభిః=వజ్రములతోను, స్ఫటికముల తోను, ముత్యములతోను కూడినవీ, మణికుట్టిమభూషితైః=మాణిక్యవికారములైన చపటాచేసిన ప్రదేశములతో అలంకరింపబడినవీ, తప్తహాటకనిర్యూహైః=కరిగించిన బంగారముతో తయారుచేసిన మదపుటేనుగులు కలవీ, రాజతామలపాణ్డురైః=వెండితో తయారుచేసినవి వలె నిర్మలములూ, తెల్లనివీ అయినవీ, వైదూర్యకృతసోపానైః=వైదూ ర్యమాణిక్యములతో కట్టబడిన మెట్లు గలవీ, స్ఫాటికాన్తరపాంసుభిః=స్ఫటికమాణిక్యవి కారమైన లోపలి పరాగము గలవీ, చారుసంజవనోపేతైః=అందమైన చతుశ్శాలలతో కూడినవీ, క్రౌఞ్చబర్హిణసంఘుష్టైః=క్రౌంచపక్షులచేతను నెమళ్ళచేతను ధ్వనిచేయింప బడినవీ, రాజహంసనిషేవితైః=రాజహంసలచేత సేవింపబడినవీ, ఖమ్=ఆకాశమును గూర్చి, ఉత్పతితైరివ=ఎగురుచున్నవి వలె ఉన్నవీ అయిన, శుభైః=మంగళక రము లైన గృహములతో కూడినదీ, తూర్యాభరణనిర్ఘోషైః=తూర్యములయొక్క, ఆభరణములయొక్క ధ్వనులచేత, సర్వతః=అంతటను, ప్రతినాదితామ్=ప్రతిధ్వనిం

పచేయబడినదీ, వస్వౌకసారాప్రతిమామ్=తూర్పుదిక్కున ఉన్న వస్వౌకసార అను ఇంద్రుని పట్టణముతో సమానమైనదీ, ఖమ్=ఆకాశమును గూర్చి, ఉత్పతితామ్ ఇవ=ఎగురుచున్నది వలె ఉన్న, తామ్=ఆ, లఙ్కాం నగరీమ్=లంకానగరమును, వీక్ష్య=చూచి, జహర్ష=సంతోషించెను.

తా. హనుమంతుడు ఆ నగరమును నలుమూలల చూచి మనస్సులో చాల ఆశ్చర్యము చెందెను. ఆ నగరమునందలి గృహముల ద్వారములు బంగారముతో నిర్మింపబడెను. వాటి ఎదుట వైదూర్యమాణిక్యములతో నిర్మించిన అరుగులు ఉండెను. ఆ గృహము లన్నియు వజ్రములతోను, స్ఫటికములతోను, ముత్యములతోను, మాణిక్యములు పరచిన చపటాచేసిన చదునైన ప్రదేశములతోను, అక్కడక్కడ నిలబెట్టిన బంగారు మదపుటేనుగులతోను ప్రకాశించుచుండెను. వెండితో నిర్మించినవి వలె స్వచ్ఛముగా తెల్లగా ఉన్న ఆ గృహములలో మెట్లు వైదూర్యమాణిక్యములతో నిర్మింపబడెను. ప్రాకారాదులలోపల స్ఫటికమాణిక్యముల పరాగము ఉండెను. క్రౌంచపక్షులు, నెమళ్ళు, రాజహంసలు అక్కడ నివసించు చుండెను. మంగళప్రదములైన ఆ భవనములు ఆకాశములో ఎగిరిపోవుచున్నట్లు కనబడుచుండెను. ఆ నగరమంతటను వాద్యముల ధ్వని, ఆభరణముల ధ్వని ప్రతిధ్వనించుచుండెను. ఈ విధముగ వస్వౌకసార అను దేవేంద్రనగరమువలె ఆకాశములోనికి ఎగిరిపోవుచున్నదా అన్నట్లు ఉన్న ఆ లంకాపట్టణమును చూచి హనుమంతుడు సంతోషించెను. 8-12

మూ. తాం సమీక్ష్య పురీం రమ్యాం రాక్షసాధిపతేః శుభామ్,
అనుత్తమామృద్ధియుతాం చిన్తయామాస వీర్యవాన్. 13

ప్ర. అ. వీర్యవాన్=పరాక్రమవంతుడైన హమమంతుడు, అనుత్తమామ్= అత్యుత్తమమైనదీ, ఋద్ధియుతామ్=ఐశ్వర్యములో కూడినదీ, రమ్యామ్=సుందర మైనదీ, శుభామ్=మంగళప్రదమైనదీ అయిన, రాక్షసాధిపతేః=రాక్షసరాజుయొక్క, తాం పురీమ్=ఆ పట్టణమును, సమీక్ష్య=చూచి, చిన్తయామాస=ఆలోచించెను.

తా. పరాక్రమవంతుడైన హనుమంతుడు, అత్యుత్తమమూ, ఐశ్వర్య సంపన్నమూ, అతిసుందరమూ, మంగళప్రదమూ అయిన ఆ రావణనగరిని చూచి ఇట్లు ఆలోచించెను. 13

మూ. నేయమన్యేన నగరీ శక్యా ధర్షయితుం బలాత్,
రక్షితా రావణబలైరుద్యతాయుధధారిభిః. 14

ప్ర. అ. ఉద్యతాయుధధారిభిః=ఎత్తబడిన ఆయుధములను ధరించి ఉన్న, రావణబలైః=రావణుని సేనలచేత, రక్షితా=రక్షింపబడిన, ఇయం నగరీ=ఈ పట్టణము, అన్యేన=ఇతరుడెవ్వనిచేతను, బలాత్=బలమువలన, ధర్షయితుమ్=ఎదిరించుటకు, న శక్యా=శక్యమైనది కాదు.

తా. ఆయుధములు ధరించి ఎల్లప్పుడు సర్వసన్నద్ధులై ఉన్న రావణ సైన్యములు రక్షించుచున్న ఈ నగరమును ఎవ్వరూ బలప్రయోగము చేసి ఎదిరించజాలరు. 14

మూ. కుముదాఙ్గదయోర్వాపి సుషేణస్య మహాకపేః,
ప్రసిద్ధేయం భవేద్భూమిర్మైన్దద్వివిదయోరపి. 15

ప్ర. అ. ఇయమ్=ఈ, భూమిః=ప్రదేశము, కుముదాఙ్గదయోర్వాపి=కుముదునకూ, అంగదునకూ గాని, మహాకపేః=మహావానరుడైన, సుషేణస్య=సుషేణునకు గాని, మైన్దద్వివిదయోరపి=మైందద్వివిదులకు గాని, ప్రసిద్ధా=బాగుగా లొంగినది, భవేత్=కావచ్చును.

తా. ఈ ప్రదేశమును కుముదుడు, అంగదుడు, మహాకపియైన సుషేణుడు, మైందుడు, ద్వివిదుడు-వీరిలో ఎవరైన సాధించ కలుగుదురేమో!

మూ. వివస్వతస్తనూజస్య హరేశ్చ కుశపర్వణః,
ఋక్షస్య కపిముఖ్యస్య మమ చైవ గతిర్భవేత్. 16

ప్ర. అ. వివస్వతః=సూర్యునియొక్క, తనూజస్య=కుమారుడైన సుగ్రీవునకు, హరేః=వానరుడైన, కుశపర్వణః=కుశపర్వునకు, కపిముఖ్యస్య=వానరశ్రేష్ఠుడైన, ఋక్షస్య=ఋక్షునకు, మమ చైవ=నాకూ, గతిః=అవకాశము, భవేత్=అగును.

తా. సుగ్రీవుడు, కుశపర్వుడు, వానరశ్రేష్ఠుడైన ఋక్షుడు, నేను ఇక్కడికి రాగలుగుదుము. 16

మూ. సమీక్ష్య చ మహాబాహో రాఘవస్య పరాక్రమమ్,
లక్ష్మణస్య చ విక్రాన్తమభవత్ ప్రీతిమాన్ కపిః. 17

ప్ర. అ. కపిః=హనుమంతుడు, మహాబాహోః=గొప్ప బాహువులు గల, రాఘవస్య=రామునియొక్క, పరాక్రమమ్=పరాక్రమమును, లక్ష్మణస్య=లక్ష్మణునియొక్క, విక్రాన్తం చ=విక్రమమును, సమీక్ష్య=చూచి, ప్రీతిమాన్=ఆనందముకలవాడు, అభవత్=ఆయెను.

తా. లంక ఎంత గొప్ప బలము కలదైనను రామలక్ష్మణుల మహా పరాక్రమము ముందు నిలువజాలదు అనే విషయమును గుర్తించి హనుమంతుడు సంతోషించెను. 17

మూ. తాం రత్నవసనోపేతాం కోష్ఠాగారావతంసకామ్,
యన్త్రాగారస్తనీమృద్ధాం ప్రమదామివ భూషితామ్. 18
తాం నష్టతిమిరాం దీప్తైర్భాస్వరైశ్చ మహాగృహైః,
నగరీం రాక్షసేన్ద్రస్య స దదర్శ మహాకపిః. 19

ప్ర. అ. సః మహాకపిః=ఆ హనుమంతుడు, రత్నవసనోపేతామ్=రత్నము లనెడు (రత్నకాంతులనెడు) వస్త్రముతో కూడినదీ, కోష్ఠాగారావతంసకామ్=వివిధవస్తుసామగ్రిని నిలువ చేయు గృహములే కర్ణభూషణములుగా కలదీ, యన్త్రాగారస్తనీమ్=యంత్రగృహములే స్తనములు కలదీ, ఋద్ధామ్=ఐశ్వర్యముతో కూడినదీ, భూషితామ్=అలంకరించబడిన, ప్రమదామివ=స్త్రీవలె ఉన్నదీ, దీప్తైః=ప్రజ్వలింపచేయబడిన (దీపములు వెలిగించిన), భాస్వరైశ్చ=ప్రకాశించు చున్న, మహాగృహైః=గొప్ప గృహములచేత, నష్టతిమిరామ్=నశించిన చీకటి కలదీ అయిన, తామ్=ప్రసిద్ధ మైన, తామ్=ఆ, రాక్షసేన్ద్రస్య=రాక్షసరాజుయొక్క, నగరీమ్=నగరమును, దదర్శ=చూచెను.

తా. ఆ లంకాపట్టణము రత్నకాంతు లను వస్త్రమును, కోష్ఠాగారము లను కర్ణభూషణములను ధరించి, యన్త్రగృహములు స్తనములుగా ప్రకాశిం చుచుండగా సర్వసంపత్సమృద్ధమై, చక్కగా అలంకరించుకొనిన స్త్రీ వలె ఉండెను. గృహములలోని దీపములు వెలిగించుటచే ఆ గృహములన్నియు ప్రకాశించుచుండగా, నగరములోని చీకటి అంతా తొలగిపోయెను. అట్టి లంకాపట్టణమును హనుమంతుడు చూచెను. 18-19

మూ. అథ సా హరిశార్దూలం ప్రవిశన్తం మహాబలమ్,
నగరీ స్వేన రూపేణ దదర్శ పవనాత్మజమ్. 20

ప్ర. అ. అథ=అటుపిమ్మట, సా నగరీ=ఆ పట్టణము, హరి శార్దూలమ్=వానరశ్రేష్ఠుడూ, మహాబలమ్=గొప్ప బలముకలవాడూ అయిన, పవనాత్మజమ్=హనుమంతుని, ప్రవిశన్తమ్=ప్రవేశించుచుండగా, స్వేన=తన సంబం ధమైన, రూపేణ=రూపముతో, దదర్శ=చూచెను.

తా. మహాబలశాలీ, వానరశ్రేష్ఠుడూ అయిన ఆ హనుమంతుడు లోనికి ప్రవేశించుచుండగా, ఆ లంకానగరి తన రాక్షసస్వరూపముతో ఆతనిని చూచెను.

మూ. సా తం హరివరం దృష్ట్వా లఙ్కా రావణపాలితా,
స్వయమేవోత్థితా తత్ర వికృతాననదర్శనా. 21

ప్ర. అ. రావణపాలితా=రావణునిచేత పాలింపబడిన, సా లఙ్కా=ఆ లంక, తం హరిమ్=ఆ హనుమంతుని, తత్ర=అక్కడ, దృష్ట్వా=చూచి, వికృతాననదర్శనా=వికృత మైన ముఖమూ నేత్రములూ కలదై, స్వయమేవ=స్వయముగానే, ఉత్థితా=లేచినది.

తా. రావణునిచేత పరిపాలింపబడిన ఆ లంకానగరి హనుమంతుని చూచి, భయంకర మైన ముఖముతోను, నేత్రములతోను స్వయముగా లేచెను.21

మూ. పురస్తాత్కపివర్యస్య వాయుసూనోరతిష్ఠత,
ముఞ్చమానా మహానాదమబ్రవీత్పవనాత్మజమ్. 22

ప్ర. అ. కపివర్యస్య=వానరశ్రేష్ఠుడైన, వాయుసూనోః=హనుమంతుని యొక్క, పురస్తాత్=ఎదుట, అతిష్ఠత=నిలచెను. మహానాదమ్=గొప్పధ్వనిని, ముఞ్చమానా=విడచుచు, పవనాత్మజమ్=హనుమంతుని గూర్చి, అబ్రవీత్=పలికెను.

తా. ఆ లంక వానరశ్రేష్ఠుడైన హనుమంతుని ఎదుట నిలచి, బిగ్గరగా ధ్వని చేయుచు, ఆతనితో ఇట్లనెను. 22

మూ. కస్త్వం కేన చ కార్యేణ ఇహ ప్రాప్తో వనాలయ,
కథయస్వేహ యత్తత్త్వం యావత్ప్రాణా ధరన్తి తే. 23

ప్ర. అ. వనాలయ=వనములో నివసించు ఓ వానరుడా! త్వమ్=నీవు, కః=ఎవడవు? కేన కార్యేణ=ఏ పనిచేత, ఇహ=ఇచ్చటికి, ప్రాప్తః=వచ్చినావు? తే=నీ యొక్క, ప్రాణాః=ప్రాణములు, యావత్=ఎంతవరకు, ధరన్తి=నిలచునో, అంతలో, ఇహ=ఇక్కడ, తత్త్వమ్=యథార్థము, యత్=ఏదియో దానిని, కథయస్వ=చెప్పుము.

తా. ఓ వానరుడా! నువ్వు ఎవ్వడవు? ఇక్కడికి ఎందుకు వచ్చినావు? నేను నీ ప్రాణాలు తీసివేసే లోపల యథార్థమేమో చెప్పుము. 23

మూ. న శక్యం ఖల్వియం లఙ్కా ప్రవేష్టుం వానర త్వయా,
రక్షితా రావణబలైరభిగుప్తా సమన్తతః. 24

ప్ర. అ. వానర=వానరుడా! రావణబలైః=రావణుని సేనలచేత, రక్షితా=రక్షింపబడినదీ, సమన్తతః=అంతటను, అభిగుప్తా=రహస్యముగా ఉంచబడినదీ అయిన,

ఇయం లఙ్కా=ఈ లంక, త్వయా=నీచేత, ప్రవేష్టుమ్=ప్రవేశించుటకు, న శక్యం ఖలు=శక్యము కాదు కదా.

తా. ఓ! వానరుడా! అన్ని విధములా రహస్యముగా ఉంచి రావణ సైన్యములు రక్షించుచున్న ఈ లంకలోనికి నీవు ప్రవేశింపజాలవు. 24

మూ. అథ తామబ్రవీద్వీరో హనుమానగ్రతః స్థితామ్,
కథయిష్యామి తే తత్త్వం యన్మాం త్వం పరిపృచ్ఛసి. 25

ప్ర. అ. అథ=పిమ్మట, వీరః=వీరుడైన, హనుమాన్=హనుమంతుడు, అగ్రతః=ఎదుట, స్థితామ్=నిలచిన, తామ్=ఆమెను గూర్చి, అబ్రవీత్=పలికెను. యత్=దేనిని గూర్చి, త్వమ్=నీవు, మామ్=నన్ను, పరిపృచ్ఛసి=ప్రశ్నించుచున్నావో, తత్త్వమ్=ఆ యథార్థమును, తే=నీకు, కథయిష్యామి=చెప్పగలను.

తా. హనుమంతుడు తన ఎదుట నిలచిన ఆ లంకతో ఇట్లు పలికెను-నీవు అడిగిన విధముగ యథార్థవిషయమంతా చెప్పెదను. 25

మూ. కా త్వం విరూపనయనా పురద్వారేఽవతిష్ఠసి,
కిమర్థం చాపి మాం రుద్ధ్వా నిర్భర్త్సయసి దారుణా. 26

ప్ర. అ. పురద్వారే=పట్టణముయొక్క ద్వారమునందు, అవతిష్ఠసి=ఉన్నావు, విరూపనయనా=విపరీత మైన రూపమూ నేత్రములూ గల, త్వమ్=నీవు, కా=ఎవతెవు? దారుణా=భయంకరురాలవైన నీవు, మామ్=నన్ను, రుద్ధ్వా=అడ్డుపెట్టి, కిమర్థమ్=ఎందుకు, నిర్భర్త్సయసి=భయపెట్టుచున్నావు.

తా. లంకాద్వారమునందు ఉన్నావు; నీవెవ్వరవు? వికృతమైన ఆకారముతో, నేత్రములతో భయంకరముగా ఉన్న నీవు నన్ను అడ్డుకొని ఎందుకు బెదిరించుచున్నావు? 26

మూ. హనుమద్వచనం శ్రుత్వా లఙ్కా సా కామరూపిణీ,
ఉవాచ వచనం క్రుద్ధా పరుషం పవనాత్మజమ్. 27

ప్ర. అ. కామరూపిణీ=ఇచ్ఛానుసారము రూపము ధరించగల, సా లఙ్కా=ఆ లంక, హనుమద్వచనమ్=హనుమంతుని వచనమును, శ్రుత్వా=విని, క్రుద్ధా=కోపగించినదై, పవనాత్మజమ్=హనుమంతుని గూర్చి, పరుషమ్=పరుషమైన, వచనమ్=వచనమును, ఉవాచ=పలికెను.

తా. కోరిన రూపము ధరించగల ఆ లంక హనుమంతుని వాక్యము విని కోపించి, అతనితో నిట్లు కఠినముగా పలికెను. 27

మూ. అహం రాక్షసరాజస్య రావణస్య మహాత్మనః,
ఆజ్ఞాప్రతీక్షా దుర్ధర్షా రక్షామి నగరీమిమామ్. 28

ప్ర. అ. రాక్షసరాజస్య=రాక్షసుల ప్రభువు, మహాత్మనః=గొప్ప బుద్ధి కలవాడూ అయిన, రావణస్య=రావణునియొక్క, ఆజ్ఞాప్రతీక్షా=ఆజ్ఞను నిరీక్షించే దాననూ, దుర్ధర్షా=ఎదిరింపశక్యము కానిదాననూ అయిన, అహమ్=నేను, ఇమాం నగరీమ్=ఈ పట్టణమును, రక్షామి=రక్షించుచున్నాను.

తా. నేను మహాబుద్ధిశాలీ, రాక్షసరాజూ అయిన రావణుని ఆజ్ఞను పాలించు దానను. నన్నెవ్వరును ఎదిరించజాలరు. నే నీ నగరమును రక్షించుచున్నాను. 28

మూ. న శక్యా మామవజ్ఞాయ ప్రవేష్టుం నగరీ త్వయా,
అద్య ప్రాణైః పరిత్యక్తః స్వప్స్యసే నిహతో మయా. 29

ప్ర. అ. మామ్=నన్ను, అవజ్ఞాయ=అవమానించి, నగరీ=పట్టణము, త్వయా=నీచేత, ప్రవేష్టుమ్=ప్రవేశించుటకు, న శక్యా=శక్యము కాదు. అద్య=ఇప్పుడు, మయా=నాచేత, నిహతః=కొట్టబడినవాడవై, ప్రాణైః=ప్రాణములచేత, పరిత్యక్తః=విడవబడినవాడవై, స్వప్స్యసే=నిద్రించగలవు.

తా. నన్ను కాదని నీవు ఈ నగరములో ప్రవేశించజాలవు. ఇప్పుడు నిన్ను నేను చంపనున్నాను. నీవు ప్రాణములు విడిచి దీర్ఘనిద్ర పొందగలవు.

మూ. అహం హి నగరీ లఙ్కా స్వయమేవ ప్లవఙ్గమ,
సర్వతః పరిరక్షామి హ్యేతత్తే కథితం మయా. 30

ప్ర. అ. ప్లవఙ్గమ=ఓ వానరుడా! అహమ్=నేను, స్వయమ్=స్వయముగా, లఙ్కానగరీ=లంకానగరిని, సర్వతః=అన్ని వైపులనుండి, పరిరక్షామి=రక్షించుచున్నాను. ఏతత్=ఈ విషయము, తే=నీకు, మయా=నాచేత, కథితం హి=చెప్పబడినది కదా.

తా. నేను సాక్షాత్తు లంకానగరమును. ఈ పురమును అన్ని వైపులా రక్షించుచుందును. నా విషయము అడిగినావు గాన నీకు చెప్పినాను. 30

మూ. లఙ్కాయా వచనం శ్రుత్వా హనుమాన్ మారుతాత్మజః,
యత్నవాన్స హరిశ్రేష్ఠః స్థితశ్శైల ఇవాపరః. 31

ప్ర. అ. మారుతాత్మజః=వాయుపుత్రు డైన, హరిశ్రేష్ఠః=వానరశ్రేష్ఠ డైన, సః=ఆ, హనుమాన్=హనుమంతుడు, లఙ్కాయాః=లంకయొక్క, వచనమ్=

వచనమును, శ్రుత్వా=విని, యత్నవాన్=ప్రయత్నము కలవాడై, అపరః=రెండవ, శైలః=ఇవ=పర్వతము వలె, స్థితః=నిలచెను.

తా. వానరశ్రేష్ఠుడు, వాయుకుమారుడు అయిన హనుమంతుడు లంక మాటలు విని, అవసర మైనచో ఆమెను ఎదిరించుటకు సిద్ధమగుచు రెండవ పర్వతము వలె నిలచెను. 31

మూ. స తాం స్త్రీరూపవికృతాం దృష్ట్వా వానరపుఙ్గవః,
ఆబభాషేఽథ మేధావీ సత్త్వవాన్ ప్లవగర్షభః. 32

ప్ర. అ. అథ=అటుపిమ్మట, మేధావీ=బుద్ధిమంతుడు, సత్త్వవాన్=బలము గలవాడు, ప్లవగర్షభః= ఎగిరివెళ్ళేవారిలో శ్రేష్ఠుడు, వానరపుఙ్గవః=వానరులలో శ్రేష్ఠుడూ అయిన, సః=ఆ హనుమంతుడు, స్త్రీరూపవికృతామ్=స్త్రీరూపములో ఉన్నదీ, వికారముగా కనబడునదీ అయిన, తామ్=ఆ లంకను, దృష్ట్వా=చూచి, ఆబభాషే=పలికెను.

తా. అనంతరము, బుద్ధిమంతుడు, బలవంతుడు, ఎగిరి ప్రయాణము చేయువారిలో గొప్పవాడు, వానరశ్రేష్ఠుడూ అయిన ఆ హనుమంతుడు భయంకర మైన స్త్రీరూపములో ఉన్న ఆ లంకను చూచి ఇట్లు పలికెను. 32

మూ. ద్రక్ష్యామి నగరీం లఙ్కాం సాట్టప్రాకారతోరణామ్,
ఇత్యర్థమిహ సంప్రాప్తః పరం కౌతూహలం హి మే. 33

ప్ర. అ. సాట్టప్రాకారతోరణామ్=బురుజులతోను, ప్రాకారముతోను, ముఖ ద్వారముతోను కూడిన, లఙ్కాం నగరీమ్=లంకాపట్టణమును, ద్రక్ష్యామి=చూడగలను, ఇత్యర్థమ్=ఈ నిమిత్తమై, ఇహ=ఇచటికి, సంప్రాప్తః= వచ్చినాను. మే=నాకు, పరమ్=అధికమైన, కౌతూహలం హి=వేడుక ఉన్నది కదా!

తా. బురుజులతోను, ప్రాకారములతోను, ముఖద్వారములతోను మనో హరముగా ఉన్న ఈ లంకానగరమును చూడవలెనను కోరికతో ఇక్కడికి వచ్చినాను. నాకు ఎంతో కుతూహలముగా ఉన్నది. 33

మూ. వనాన్యుపవనానీహ లఙ్కాయాః కాననాని చ,
సర్వతో గృహముఖ్యాని ద్రష్టుమాగమనం హి మే. 34

ప్ర. అ. లఙ్కాయాః=లంకయొక్క, వనాని=తోటలను, ఉపవనాని=ఉద్యాన ములను, కాననాని చ=అడవులను, సర్వతః=అంతటా ఉన్న, గృహముఖ్యాని=శ్రేష్ఠ

మైన గృహములను, ద్రష్టుమ్=చూచుట కొరకే, ఇహ=ఇక్కడికి, మే=నాయొక్క, ఆగమనం హి=రాక కదా!

తా. లంకలో ఉన్న తోటలను, ఉద్యానములను, అడవులను నగరములో అంతటా ఉన్న అందమైన భవనములను చూచుటకే నేనిక్కడకు వచ్చినాను.

మూ. తస్య తద్వచనం శ్రుత్వా లఙ్కా సా కామరూపిణీ,
భూయ ఏవ పునర్వాక్యం బభాషే పరుషాక్షరమ్. 35

ప్ర. అ. కామరూపిణీ=స్వేచ్ఛారూపము గల, లఙ్కా=లంక,తస్య=అతని యొక్క, తత్=ఆ, వచనమ్=వచనమును, శ్రుత్వా=విని, పునః=మరల, భూయః ఏవ=ఇంకనూ (వెనుకటి వాక్యము కంటె), పరుషాక్షరమ్=పరుష మైన అక్షరములు గల, వాక్యమును, బభాషే=పలికెను.

తా. ఇచ్ఛానుసారముగా వివిధరూపములు ధరించగలిగిన ఆ లంక హనుమంతుని మాటలు విని, మరల ఇంకను పరుషముగా పలికెను. 35

మూ. మామనిర్జిత్య దుర్బుద్ధే రాక్షసేశ్వరపాలితా,
న శక్యమద్య తే ద్రష్టుం పురీయం వానరాధమ. 36

ప్ర. అ. దుర్బుద్ధే=చెడ్డ బుద్ధి గల, వానరాధమ=ఓ వానరాధముడా! మామ్=నన్ను, అనిర్జిత్య=జయించకుండగా, రాక్షసేశ్వరపాలితా=రావణునిచే పాలింపబడిన, ఇయం పురీ=ఈ పట్టణము, అద్య=ఇప్పుడు, ద్రష్టుమ్=చూచుటకు, తే=నీకు, న శక్యమ్=శక్యము కాదు.

తా. ఓరి! దుర్బుద్ధీ! వానరాధమా! నన్ను జయించి కాని నీవు రావణునిచే రక్షింపబడుచున్న ఈ పట్టణములోనికి ప్రవేశింపజాలవు. 36

మూ. తతః స కపిశార్దూలస్తామువాచ నిశాచరీమ్,
దృష్ట్వా పురీమిమాం భద్రే పునర్యాస్యే యథాగతమ్. 37

ప్ర. అ. తతః=అటుపిమ్మట, సః=ఆ, కపిశార్దూలః=వానరశ్రేష్ఠుడు, తామ్=ఆ, నిశాచరీమ్=రాక్షసస్త్రీని గూర్చి, ఉవాచ=పలికెను. భద్రే=మంగళప్రదురాలా! ఇమామ్=ఈ, పురీమ్=పట్టణమును, దృష్ట్వా=చూచి, పునః=మరల, యథాగతమ్=వచ్చినట్లుగానే, యాస్యే=వెళ్ళిపోయెదను.

తా. అప్పుడా హనుమంతుడు, ఆ రాక్షసితో "ఓ! మంగళప్రదురాలా! ఈ పట్టణము ఒక సారి చూచి, వచ్చిన దారినే తిరిగి వెళ్ళిపోయెదను" అని చెప్పెను. 37

మూ. తతః కృత్వా మహానాదం సా వై లఙ్కా భయావహమ్,
తలేన వానరశ్రేష్ఠం తాడయామాస వేగితా. 38

ప్ర. అ. తతః=అటుపిమ్మట, సా లఙ్కా=ఆ లంక, భయావహమ్=భయమును కలిగించు, మహానాదమ్=గొప్ప ధ్వనిని, కృత్వా=చేసి, వేగితా=తొందర పడుచున్నదై, వానరశ్రేష్ఠమ్=హనుమంతుని, తలేన=అరచేతితో, తాడయామాస=కొట్టెను.

తా. అప్పుడా లంక భయంకరముగా అరచుచు, వేగముగా, ఆ హనుమంతునిపై అరచేతితో ఒక్క దెబ్బ చరచెను. 38

మూ. తతః స కపిశార్దూలో లఙ్కయా తాడితో భృశమ్,
ననాద సుమహానాదం వీర్యవాన్ పవనాత్మజః. 39

ప్ర. అ. తతః=అటుపిమ్మట, లఙ్కయా=లంకచేత, భృశమ్=మిక్కిలి, తాడితః=కొట్టబడిన, వీర్యవాన్=పరాక్రమవంతుడైన, పవనాత్మజః=వాయుపుత్రుడైన, సః కపిశార్దూలః=ఆ వానరశ్రేష్ఠుడు, సుమహానాదమ్=చాల పెద్ద ధ్వని వచ్చునట్లు, ననాద=ధ్వని చేసెను.

తా. లంక ఆ విధముగా గట్టిగా కొట్టగానే పరాక్రమవంతుడూ, వాయుపుత్రుడూ అయిన ఆ హనుమంతుడు చాల బిగ్గరగా అరచెను. 39

మూ. తతః సంవర్తయామాస వామహస్తస్య సోఽఙ్గుళీః,
ముష్టినాభిజఘానైనాం హనుమాన్ క్రోధమూర్ఛితః 40
స్త్రీ చేతి మన్యమానేన నాతిక్రోధః స్వయం కృతః.

ప్ర. అ. తతః=అటుపిమ్మట, సః=ఆ, హనుమాన్=హనుమంతుడు, క్రోధమూర్ఛితః=కోపముచే వ్యాపింపబడినవాడై, వామహస్తస్య=ఎడమచేతి యొక్క, అఙ్గుళీః=వేళ్లను, సంవర్తయామాస=మడచెను. ఏనామ్=ఈమెను, ముష్టినా=పిడికిలితో, అభిజఘాన=కొట్టెను. స్త్రీ చ ఇతి=స్త్రీ కదా అని, మన్యమానేన=తలచుచున్న అతనిచేత, స్వయమ్=స్వయముగా, అతిక్రోధః=ఎక్కువ కోపము, న కృతః=చేయబడలేదు.

తా. అప్పుడు హనుమంతుడు క్రోధావిష్టుడై ఎడమచేతి వ్రేళ్లు మడిచి, పిడికిలితో ఆమెను కొట్టెను. స్త్రీ కదా అను భావముతో అతడు తానుగా ఎక్కువ కోపమును ప్రదర్శించలేదు. 40

మూ. సా తు తేన ప్రహారేణ విహ్వలాఙ్గీ నిశాచరీ, 41
పపాత సహసా భూమౌ వికృతాననదర్శనా.

ప్ర. అ. సా=ఆ, నిశాచరీ తు=రాక్షసి యైతే, తేన ప్రహారేణ=ఆ దెబ్బచేత, విహ్వలాఙ్గీ=వ్యాకులమైన శరీరము కలదై, వికృతమైన ముఖము, నేత్రములూ కలదై, సహసా=వెంటనే, భూమౌ=నేలపై, పపాత=పడెను.

తా. ఆ రాక్షసి ఆ దెబ్బతో ఒళ్లు తిరిగి పోగా వికృతమైన ముఖముతోను తేలిపోయిన నేత్రములతోను, వెంటనే నేలపై పడెను. 41

మూ. తతస్తు హనుమాన్ ప్రాజ్ఞస్తాం దృష్ట్వా వినిపాతితామ్, 42
కృపాం చకార తేజస్వీ మన్యమానః స్త్రియం తు తామ్.

ప్ర. అ. తతః=అటుపిమ్మట, ప్రాజ్ఞః=బుద్ధిమంతుడు, తేజస్వీ=తేజశ్శాలీ అయిన, హనుమాన్=హనుమంతుడు, వినిపాతితామ్=క్రిందికి పడవేయబడిన, తామ్=ఆమెను, దృష్ట్వా=చూచి, తామ్=ఆమెను, స్త్రియమ్=స్త్రీనిగా, మన్యమానః=తలచుచు, కృపామ్=జాలిని, చకార=చేసెను.

తా. పిమ్మట, బుద్ధిమంతుడు, తేజఃశాలీ అయిన హనుమంతుడు ఆమె నేలపై పడిపోవుట చూచి, పాపము! స్త్రీని కొట్టినానే అని అనుకొనుచు, ఆమె పై దయ చూపెను. 42

మూ. తతో వై భృశసంవిగ్నా లఙ్కా సా గద్గదాక్షరమ్, 43
ఉవాచాగర్వితం వాక్యం హనూమన్తం ప్లవఙ్గమమ్.

ప్ర. అ. తతః=అటుపిమ్మట, సా=ఆ, లఙ్కా=లంక, భృశసంవిగ్నా=చాలా దిగులు చెందినదై, గద్గదాక్షరమ్=గద్గదమైన అక్షరములు కలుగునట్లుగా, అగర్వితమ్=గర్వము లేని, వాక్యమ్=వాక్యమును, ప్లవఙ్గమమ్=వానరుడైన, హనూమన్తమ్=హనుమంతుని గూర్చి, ఉవాచ=పలికెను.

తా. అప్పుడా లంక చాల భయపడి, హనుమంతునితో ఏ మాత్రము గర్వము లేని మాటలు, గద్గదస్వరముతో ఇట్లు పలికెను. 43

మూ. ప్రసీద సుమహాబాహో త్రాయస్వ హరిసత్తమ, 44
సమయే సౌమ్య తిష్ఠన్తి సత్త్వవన్తో మహాబలాః.

ప్ర. అ. సుమహాబాహో=చాల గొప్ప బాహువులు కలవాడా! హరిసత్తమ వానరశ్రేష్ఠుడా! ప్రసీద=అనుగ్రహించుము. త్రాయస్వ=రక్షించుము. సౌమ్య=ఓ

సౌమ్యుడా! సత్త్వవన్తః=ధైర్యము గల, మహాబలాః=గొప్ప బలము గలవారు, సమయే=కట్టుబాటునందు, తిష్ఠన్తి=ఉందురు.

తా. మహాబాహువైన ఓ వానరశ్రేష్ఠుడా! అనుగ్రహించి రక్షింపుము. నీవంటి ధైర్యశాలులైన మహాబలవంతులు "స్త్రీని చంపకూడదు" ఇత్యాది నియమములను దాటరు కదా! 44

మూ. అహం తు నగరీ లఙ్కా స్వయమేవ ప్లవఙ్గమ, 45
నిర్జితాహం త్వయా వీర విక్రమేణ మహాబల.

ప్ర. అ. ప్లవఙ్గమ=ఓ వానరుడా! అహం తు=నే నైతే, స్వయమ్=స్వయముగా, లఙ్కానగర్యేవ=లంకానగరమునే, మహాబల=గొప్ప బలము కలవాడా! వీర=వీరుడా! అహమ్=నేను, త్వయా=నీచేత, విక్రమేణ=పరాక్రమము చేత, నిర్జితా=జయింపబడినాను.

తా. ఓ! వానరుడా! నేను సాక్షాత్తు లంకానగరమును. మహాబలశాలివైన ఓ వీరుడా! నీవు నన్ను పరాక్రమముచేత జయించినావు. 45

మూ. ఇదం తు తథ్యం శృణు వై బ్రువన్త్యా మే హరీశ్వర, 46
స్వయంభువా పురా దత్తం వరదానం యథా మమ.

ప్ర. అ. హరీశ్వర=ఓ వానరశ్రేష్ఠుడా! పురా=పూర్వము, మమ=నాకు, స్వయంభువా=బ్రహ్మదేవునిచేత, యథా=ఎట్లు, వరదానమ్=వరదానము, దత్తమ్=ఇవ్వబడినదో (చేయబడినదో), ఇదమ్=ఈ, తథ్యం తు=యథార్థమునైతే, బ్రువన్త్యాః=చెప్పుచున్న, మే=నాకు (నా నుండి), శృణు వై=వినుము.

తా. ఓ! వానరశ్రేష్ఠుడా! పూర్వము బ్రహ్మదేవుడు నా కిచ్చిన వరమును గూర్చి యథార్థముగా చెప్పుచున్నాను. వినుము. 46

మూ. యదా త్వాం వానరః కశ్చిద్విక్రమాద్వశమానయేత్, 47
తదా త్వయా హి విజ్ఞేయం రక్షసాం భయామాగతమ్.

ప్ర. అ. యదా=ఎప్పుడు, కశ్చిత్=ఒకానొక, వానరః=వానరుడు, విక్రమాత్=పరాక్రమమువలన, త్వామ్=నిన్ను, వశమ్ ఆనయేత్=వశము చేసుకొనునో, తదా=అప్పుడు, రక్షసామ్=రాక్షసులకు, భయమ్=భయము, ఆగతమ్=వచ్చినదిగా, త్వయా=నీచేత, విజ్ఞేయమ్=తెలియదగినది.

తా. ఏనాడు నిన్ను ఒక వానరుడు తన పరాక్రమముచేత జయించునో ఆ నాడే రాక్షసులకు భయము ప్రాప్తించినట్లు (రానున్నట్లు) తెలుసుకొనుము.

మూ. స హి మే సమయః సౌమ్య ప్రాప్తోఽద్య తవ దర్శనాత్, 48
స్వయంభూవిహితః సత్యో న తస్యాస్తి వ్యతిక్రమః.

ప్ర. అ. సౌమ్య=ఓ! సౌమ్యుడా! అద్య=ఇప్పుడు, తవ=నీయొక్క, దర్శనాత్=దర్శనమువలన, మే=నాకు, సః సమయః=ఆ సమయము, ప్రాప్తః=వచ్చినది. స్వయంభూవిహితః=బ్రహ్మచేత విధింపబడినది. సత్యః=సత్యమైనది. తస్య=దానికి, వ్యతిక్రమః=మార్పు, నాస్తి=లేదు.

తా. సౌమ్యుడా! ఇప్పుడు నీ దర్శనము కలుగుటవలన ఆ సమయము వచ్చినదని అనుకొనుచున్నాను. బ్రహ్మ విధించిన ఆ సమయము సత్యమై తీరును. దానికి తిరుగు ఉండదు. 48

మూ. సీతానిమిత్తం రాజ్ఞస్తు రావణస్య దురాత్మనః, 49
రక్షసాం చైవ సర్వేషాం వినాశః సముపాగతః.

ప్ర. అ. దురాత్మనః=దుష్టబుద్ధిగల, రాజ్ఞః=రాక్షసరాజైన, రావణస్య=రావణునకు, సర్వేషామ్=సమస్తమైన, రక్షసాం చ=రాక్షసులకూ, సీతానిమిత్తమ్=సీతమూలముగా, వినాశః=నాశనము, సముపాగతః=వచ్చినది.

తా. సీతమూలమున, దురాత్ముడైన రావణునకూ, అందరు రాక్షసులకూ వినాశకాలము సంప్రాప్తించినది. 49

మూ. తత్ప్రవిశ్య హరిశ్రేష్ఠ పురీం రావణపాలితామ్, 50
విధత్స్వ సర్వకార్యాణి యాని యానీహ వాఞ్ఛసి.

ప్ర. అ. హరిశ్రేష్ఠ=వానరశ్రేష్ఠుడా! తత్=ఆ కారణమువలన, రావణపాలితామ్=రావణునిచేత పాలింపబడిన, పురీమ్=లంకాపురిని, ప్రవిశ్య=ప్రవేశించి, ఇహ=ఇక్కడ, యాని యాని=వేటిని వేటిని, వాఞ్ఛసి=కోరుచున్నావో, సర్వకార్యాణి=ఆ కార్యములన్నింటిని, విధత్స్వ=చేయుము.

తా. ఓ! వానరశ్రేష్ఠా! రావణునిచేత పాలింపబడుచున్న ఈ లంకలో ప్రవేశించి, నీవు ఏ యే పనులు చేయవలెనని కోరుచున్నావో అవి అన్నీ చేయుము. 50

మూ. ప్రవిశ్య శాపోపహతాం హరీశ్వర
శుభాం పురీం రాక్షసరాజపాలితామ్,
యదృచ్ఛయా త్వం జనకాత్మజాం సతీం
విమార్గ సర్వత్ర గతో యథాసుఖమ్. 51

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే సున్దరకాణ్డే
తృతీయః సర్గః.

ప్ర. అ. హరీశ్వర=వానరశ్రేష్ఠుడా! శాపోపహతామ్=శాపముచేత కొట్టబడి నదీ, రాక్షసరాజపాలితామ్=రావణునిచే పాలింపబడినదీ, శుభామ్=మంగళకరమూ అయిన, పురీమ్=పట్టణమును, యదృచ్ఛయా=స్వేచ్ఛగా, ప్రవిశ్య=ప్రవేశించి, త్వమ్=నీవు, సర్వత్ర=అంతటను, గతః=వెళ్ళిన వాడవై, యథాసుఖమ్=సుఖముగా, సతీమ్=పతివ్రత యైన, జనకాత్మజామ్=సీతను, విమార్గస్వ=వెదకుము.

తా. ఓ వానరోత్తమా! రావణునిచే పాలింపబడుచున్న ఈ శుభమైన లంకాపట్టణమునకు (నందికేశ్వరుని) శాపము తగిలిడున్నది. అట్టి ఈ పట్టణము లోనికి స్వేచ్ఛగా ప్రవేశించి, సుఖముగా అంతటను సంచరించి, పతివ్రతయైన సీతను అన్వేషించుము. 51

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు
సుందరకాండలో తృతీయసర్గ సమాప్తము.

అథ చతుర్థః సర్గః

[హనుమంతుడు లంకలో రావణాంతఃపురమును ప్రవేశించుట]

మూ. స నిర్జిత్య పురీం లఙ్కాం శ్రేష్ఠాం తాం కామరూపిణీమ్,
విక్రమేణ మహాతేజా హనుమాన్ కపిసత్తమః, 1
అద్వారేణ మహాబాహుః ప్రాకారమభిపుప్లువే.

ప్ర. అ. కపిసత్తమః=వానరులలో శ్రేష్ఠుడూ, మహాతేజాః=గొప్ప తేజస్సు కలవాడూ, మహాబాహుః=గొప్ప బాహువులు కలవాడూ అయిన, సః హనుమాన్=ఆ హనుమంతుడు, కామరూపిణీమ్=స్వేచ్ఛానుసారముగా రూపము ధరించగలిగిన, శ్రేష్ఠామ్=శ్రేష్ఠురాలైన, తాం లఙ్కామ్=ఆ లంకను, విక్రమేణ=పరాక్రమము చేత, నిర్జిత్య=జయించి, అద్వారేణ=ద్వారము కాని ప్రదేశముచేత (నందు), ప్రాకారమ్=ప్రాకారమును, అభిపుప్లువే=దుమికెను.

తా. మహాతేజఃశాలీ, వానరశ్రేష్ఠుడూ, మహాబాహువూ అయిన హనుమంతుడు కామరూపము గలదీ, శ్రేష్ఠురాలూ అయిన లంకను ఆ విధముగ తన పరాక్రమముచేత జయించి, శత్రువుల నగరములోనికి ప్రవేశించునపుడు అనుసరించవలసిన ఆచారము ప్రకారము ద్వారము లేని ప్రదేశమునందు ప్రాకారము పైకి దుమికి దానిని దాటెను. 1

మూ. ప్రవిశ్య నగరీం లఙ్కాం కపిరాజహితంకరః, 2
చక్రేఽథ పదం సవ్యం శత్రూణాం స తు మూర్ధని.

ప్ర. అ. కపిరాజహితంకరః=సుగ్రీవునకు హితమును చేయు, సః=ఆ హనుమంతుడు, లఙ్కాం నగరీమ్=లంకానగరమును, ప్రవిశ్య=ప్రవేశించి, అథ= పిమ్మట, శత్రూణామ్= శత్రువులయొక్క, మూర్ధని=శిరస్సుపై, పాదమ్=పాదమును, చక్రే=చేసెను.

తా. సుగ్రీవునకు హితము చేయనున్న ఆ హనుమంతుడు లంకా నగరములో ప్రవేశించి శత్రువుల శిరస్సుపై ఎడమకాలు ఉంచెను.

వి. శత్రువుల శిరస్సుపై ఎడమకాలు పెట్టుట అనగా పురములో ప్రవేశించునపుడు మొట్టమొదట ఎడమపాదము ఉంచుట అని అర్థము. 2

"ప్రయాణకాలే చ గృహప్రవేశే వివాహకాలేఽపి చ దక్షిణాఙ్ఘ్రిమ్,
కృత్వాగ్రతః శత్రుపురప్రవేశే వామం నిదధ్యాచ్చరణం నృపాలః".

అను బృహస్పతివచనము ప్రకారము, ప్రయాణమునందు, గృహప్రవేశమునందు, వివాహసమయమునందు ముందు కుడికాలు ఉంచవలెను. శత్రువుల పట్టణములో ప్రవేశించు నప్పుడు ముందు ఎడమకాలు ఉంచవలెను. హనుమంతుడు ఇక్కడికి ప్రధానముగా సుగ్రీవాజ్ఞను అనుసరించి వచ్చినాడు. అందుచేత సుగ్రీవహితంకరు డని చెప్పబడినది. 2

మూ. ప్రవిష్టః సత్త్వసంపన్నో నిశాయాం మారుతాత్మజః, 3
స మహాపథమాస్థాయ ముక్తాపుష్పవిరాజితమ్,
తతస్తు తాం పురీం లఙ్కాం రమ్యామభియయౌ కపిః. 4

ప్ర. అ. సత్త్వసంపన్నః=బలముతో సంపన్నుడైన, సః మారుతాత్మజః=ఆ హనుమంతుడు, నిశాయామ్=రాత్రియందు, ముక్తాపుష్పవిరాజితమ్=ముత్యముల తోను, పుష్పములతోను ప్రకాశింపచేయబడిన, మహాపథమ్=మహామార్గమును, ఆస్థాయ=అధిష్ఠించి, ప్రవిష్టః=ప్రవేశించెను. తతః=అటుపిమ్మట, కపిః=హనుమం తుడు, తామ్=ఆ, రమ్యామ్=సుందర మైన, లఙ్కాం పురీమ్=లంకాపట్టణమును గూర్చి, అభియయౌ=వెళ్లెను.

తా. బలశాలి యైన ఆ హనుమంతుడు, రాత్రియందు, ముత్యములతోను, పుష్పములతోను ప్రకాశింపచేయ బడిన రాజమార్గము ద్వారా, ప్రవేశించి, రమ్య మైన ఆ లంకాపురము వైపు వెళ్లెను. 3,4

మూ. హసితోత్కృష్టనినదైస్తూర్యఘోషపురఃసరైః,
వజ్రాంకుశనికాశైశ్చ వజ్రజాలవిభూషితైః, 5
గృహమేఘైః పురీ రమ్యా బభాసే ద్యౌరివామ్బుదైః.

ప్ర. అ. హసితోత్కృష్టనినదైః=నవ్వులచేత అధికమైన ధ్వనులుక లవీ, తూర్యఘోషపురఃసరైః=వాద్యముల ధ్వనులు పూర్వమునందు గలవీ, వజ్రాంకుశనికాశైశ్చ=వజ్రములతోను అంకుశములతోను సమానమైనవీ, వజ్రజాల విభూషితైః=వజ్రములు అతికిన కిటికీలతో అలంకరింపబడినవీ అయిన, గృహమేఘైః= మేఘముల వంటి గృహములతో, రమ్యా=సుందరమైన, పురీ=లంకాపట్టణము, అమ్బుదైః=మేఘములతో, ద్యౌరివ=ఆకాశము వలె, బభాసే=ప్రకాశించెను.

తా. అధికమైన నవ్వుల ధ్వనులతో నిండిన లంకాపురములోని గృహములలో అనేక వాద్యములు వినబడుచుండెను. ఆ గృహములు వజ్రములు పొదిగిన

కిటికీలతో అలంకరింపబడి ఉన్నవి. కొన్ని వజ్రముల ఆకారములోను, కొన్ని అంకుశముల ఆకారములోను నిర్మింపబడి ఉన్నవి. మేఘముల వలె ఉన్నతములైన అట్టి గృహములతో లంకానగరము, మేఘములతో ఆకాశము వలె ప్రకాశించుచుండెను. 5

మూ. ప్రజజ్వాల తతో లఙ్కా రక్షోగణగృహైః శుభైః, 6
సితాభ్రసదృశైశ్చిత్రైః పద్మస్వస్తికసంస్థితైః,
వర్ధమానగృహైశ్చాపి సర్వతః సువిభూషితా. 7

ప్ర. అ. తతః=అటుపిమ్మట, సితాభ్రసదృశైః=తెల్లని మేఘములతో సమాన మైనవీ, చిత్రైః=ఆశ్చర్యకర మైనవీ, పద్మస్వస్తికసంస్థితైః=పద్మము యొక్క స్వస్తికముయొక్క ఆకారము కలవీ, శుభైః=మంగళకరమైనవీ అయిన, రక్షోగణగృహైః=రాక్షససముదాయముల గృహములతోను, వర్ధమానగృహైశ్చాపి=వర్ధమాన గృహములతోను, సర్వతః=నలువైపుల, సువిభూషితా=చక్కగా అలంకరించబడినదై, ప్రజజ్వాల=దేదీప్యమానముగా ఉండెను.

తా. ఆ లంకాపట్టణము తెల్లని మేఘముల వంటి ఉన్నతమైన భవనములతో దేదీప్యమానముగా కనబడుచుండెను. కొన్ని రాక్షసగృహములు పద్మాకారములోను కొన్ని స్వస్తికాకారములోను ఉండెను. కొన్ని వర్ధమానక గృహము లుండెను. ఆశ్చర్యకరములు, మంగళప్రదములూ అయిన ఈ భవనములు లంకాపట్టణమునందంతటను వ్యాపించి ఆ నగరశోభను ఇనుమడింప చేయుచుండెను.

వి. "చతుశ్శాలా చతుర్ద్వారా సర్వతోభద్రసంజ్ఞితా,
పశ్చిమద్వారరహితా మధ్యావర్తా హయాననా,
దక్షిణద్వారరహితా వర్ధమానా ధనప్రదా,
ప్రాగ్ద్వారరహితా స్వస్తికాఖ్యా పుత్రధనప్రదా".

నాలుగు దిక్కులకు నాలుగు ద్వారములున్న గృహము సర్వతోభద్రము. దీనికే పద్మము అని నామాంతరము. పశ్చిమద్వారము లేక, మధ్యయందు వంకర తిరిగిన చతుశ్శాలాగృహము హయాననము. దక్షిణద్వారము లేనిది వర్ధమానము, ధనప్రది. తూర్పుద్వారము లేనిది స్వస్తికగృహము; పుత్ర ధనసంపద ఇచ్చునది.

మూ. తాం చిత్రమాల్యాభరణాం కపిరాజహితంకరః,
రాఘవార్థం చరన్ శ్రీమాన్ దదర్శ చ ననన్ద చ. 8

ప్ర. అ. కపిరాజహితంకరః=సుగ్రీవునకు హితమును చేయు, శ్రీమాన్=శోభాయుక్తుడైన హనుమంతుడు, రాఘవార్థమ్=రాముని కార్యముకొరకై, చరన్=సంచరించుచు, చిత్రమాల్యాభరణామ్=చిత్రమైన మాలలు, ఆభరణములూ గల, తామ్=ఆ లంకాపట్టణమును, దదర్శ చ=చూచెను, ననన్ద చ=సంతోషించెను కూడ.

తా. సుగ్రీవునికి హితమును చేయు శ్రీమంతుడైన ఆ హనుమంతుడు, రాముని కార్యము సాధించుటకై సంచరించుచు, విచిత్ర మైన పుష్పమాలలతోను, ఆభరణములతోను ప్రకాశించుచున్న ఆ లంకను చూచి చాలా సంతోషించెను.8

మూ. భవనాద్భవనం గచ్ఛన్ దదర్శ పవనాత్మజః,
వివిధాకృతిరూపాణి భవనాని తతస్తతః. 9

ప్ర. అ. భవనాత్=ఒక భవనమునుండి, భవనమ్=మరి యొక్క భవనమును గూర్చి, గచ్ఛన్=వెళ్లుచు, పవనాత్మజః=హనుమంతుడు, తతస్తతః=అంతకంతకు, వివిధాకృతిరూపాణి=అనేక విధములైన ఆకారములు, రూపములు గల, భవనాని=భవనములను, దదర్శ=చూచెను.

తా. ఒక ఇంటినుండి మరి యొక ఇంటి వైపు వెళ్లుచు హనుమంతుడు, ముందుముందుకు వెళ్లిన కొలది, అనేకవిధములైన ఆకారములు, రూపములు గల భవనములను చూచెను. 9

మూ. శుశ్రావ మధురం గీతం త్రిస్థానస్వరభూషితమ్,
స్త్రీణాం మదసమృద్ధానాం దివి చాప్సరసామివ. 10

ప్ర. అ. దివి=స్వర్గమునందు, అప్సరసామివ=అప్సరస్త్రీలయొక్క వలె, మదసమృద్ధానామ్=మదముతో నిండిన, స్త్రీణామ్=స్త్రీలయొక్క, త్రిస్థాన స్వర భూషితమ్=మూడు స్థానములందు పుట్టిన మంద్ర-మధ్య-తారాస్వరముల చేత భూషింపబడిన, మధురమ్=మధురమైన, గీతమ్=గానమును, శుశ్రావ=వినెను.

తా. స్వర్గలోకములో అప్సరస్త్రీల వలె పాడుచున్న, మదముతో నిండిన స్త్రీల మధురగానమును వినెను. ఆ గానము ఆ యా స్థానములందు పుట్టు మంద్ర-మధ్యమ-తారస్వరము లను స్వరభేదములతో ఒప్పారుచుండెను. 10

మూ. శుశ్రావ కాఞ్చీనినదం నూపురాణాం చ నిఃస్వనమ్,
సోపాననినదాంశ్చైవ భవనేషు మహాత్మనామ్, 11
ఆస్ఫోటితనినాదాంశ్చ క్ష్వేళితాంశ్చ తతస్తతః.

ప్ర. అ. మహాత్మనామ్=గొప్పవారైన (అధికైశ్వర్యసంపన్నులైన) రాక్షసులయొక్క, భవనేషు=భవనములయందు, కాఞ్చీనినదమ్=వడ్డాణముల ధ్వనిని, నూపురాణామ్=నూపురములయొక్క, నిస్స్వనమ్=ధ్వనిని,సోపాననినదాంశ్చైవ=మెట్లయొక్క ధ్వనులను, ఆస్ఫోటితనినాదాంశ్చ=వీరులు తమ జబ్బలు చరచుటవలన కలుగు ధ్వనులను, క్ష్వేళితాంశ్చ=భటుల సింహనాదములను, తతస్తతః=అక్కడక్కడ, శుశ్రావ=వినెను.

తా. మహైశ్వర్యవంతులైన రాక్షసుల భవనములలో వనితలు నడచునప్పుడు జనించు వడ్డాణముల చప్పుళ్ళను, అందెల సవ్వళులను, వారు మేడలపై ఎక్కునపుడు దిగునపుడు కలుగు ధ్వనులను వినెను. కొన్ని ప్రదేశములలో మల్లయుద్ధాలలో వీరులు తమ జబ్బలు చరచుకొనునప్పుడు కలుగు ధ్వనులను, వారు చేయు సింహనాదములను వినెను. 11

మూ. శుశ్రావ జపతాం తత్ర మన్త్రాన్ రక్షోగృహేషు వై, 12
స్వాధ్యాయనిరతాంశ్చైవ యాతుధానాన్ దదర్శ సః,
రావణస్తవసంయుక్తాన్ గర్జతో రాక్షసానపి. 13

ప్ర. అ. తత్ర=అక్కడ, రక్షోగృహేషు=రాక్షసుల గృహములందు, జపతామ్=జపముచేయుచున్న రాక్షసులయొక్క, మన్త్రాన్=మంత్రములను, శుశ్రావ=వినెను. సః=ఆతడు, స్వాధ్యాయనిరతాన్=వేదాధ్యయనమందు ఆసక్తులైన, యాతుధానాన్=రాక్షసులను, దదర్శ=చూచెను. రావణస్తవసంయుక్తాన్=రావణుని స్తుతించుటకై కలసి వచ్చిన రాక్షసులను, గర్జతః=గర్జించుచున్న, రాక్షసానపి=రాక్షసులను, దదర్శ=చూచెను.

తా. హనుమంతుడు, అక్కడ, రాక్షసగృహములందు, జపము చేయుచున్నవారి మంత్రములను వినెను. వేదాధ్యయననిరతులైన రాక్షసులను చూచెను. రావణుని స్తుతించుటకై వచ్చిన రాక్షసులనూ, గర్జించుచున్న రాక్షసులనూ చూచెను. 12, 13

మూ. రాజమార్గం సమావృత్య స్థితం రక్షోబలం మహత్,
దదర్శ మధ్యమే గుల్మే రావణస్య చరాన్ బహూన్. 14

ప్ర. అ. మధ్యమే=మధ్యమమైన, గుల్మే=సేనానివేశమునందు, రాజమార్గమ్=రాజమార్గమును, సమావృత్య=ఆవరించి, స్థితమ్=ఉన్న, మహత్=గొప్పదైన, రక్షోబలమ్=రాక్షససైన్యమును, రావణస్య=రావణునియొక్క, బహూన్=అనేకులైన, చరాన్=గూఢచారులను, దదర్శ=చూచెను.

తా. మధ్యమ సేనానివేశమునకు సంబంధించిన గొప్ప రాక్షససైన్యము రాజమార్గమును ఆవరించి ఉండగా చూచెను. ఎందరో రావణుని గూఢచారులను కూడ చూచెను. 14

మూ. దీక్షితాన్ జటిలాన్ ముణ్డాన్ గోజినామ్బరవాసినః,
దర్భముష్టిప్రహరణానగ్నికుణ్డాయుధాంస్తథా. 15
కూటముద్గరపాణీంశ్చ దణ్డాయుధధరానపి,
ఏకాక్షానేకకర్ణాంశ్చ లమ్బోదరపయోధరాన్. 16
కరాళాన్ భుగ్నవక్త్రాంశ్చ వికటాన్ వామనాంస్తథా,
ధన్వినః ఖడ్గినశ్చైవ శతఘ్నీముసలాయుధాన్. 17
పరిఘోత్తమహస్తాంశ్చ విచిత్రకవచోజ్జ్వలాన్,
నాతిస్థూలాన్నాతికృశాన్నాతిదీర్ఘాతిహ్రస్వకాన్. 18
నాతిగౌరాన్నాతికృష్ణాన్నాతికుబ్జాన్న వామనాన్,
విరూపాన్ బహురూపాంశ్చ సురూపాంశ్చ సువర్చసః, 19
ధ్వజీన్ పతాకినశ్చైవ దదర్శ వివిధాయుధాన్.

ప్ర. అ. దీక్షితాన్=యజ్ఞాదిదీక్ష వహించినవారిని, జటిలాన్=జటాధారులను, ముణ్డాన్=శిరోముండనము చేయించుకొన్న వారిని, గో౽జినామ్బరవాసినః=గోచర్మములను ధరించిన వారిని, ఇతరవస్త్రములు ధరించినవారిని, దర్భముష్టి ప్రహరణాన్=దర్భలయొక్క పిడికెళ్లు ఆయుధములుగా కలవారిని, తథా=మరియు, అగ్నికుణ్డాయుధాన్=అగ్నికుండములే ఆయుధములుగా కలవారిని, కూటముద్గరపాణీన్ చ=కూటములు ముద్గరములు హస్తములందు కలవారిని, దణ్డాయుధధరానపి=దండరూపమైన ఆయుధములు ధరించినవారిని, ఏకాక్షాన్=ఒంటికంటివారిని, ఏకకర్ణాంశ్చ=ఒంటిచెవివారిని, లమ్బోదరపయోధరాన్=వ్రేలాడుచున్న పొట్టలు స్తనములు కలవారిని, కరాళాన్=భయంకరమైన రూపములు కలవారిని, భుగ్నవక్త్రాంశ్చ=వంకర మూతులవాళ్ళను, వికటాన్=వికృతముగా ఉన్నవారిని, తథా=మరియు, వామనాన్=పొట్టివారిని, ధన్వినః=ధనస్సులు కలవారిని, ఖడ్గినశ్చైవ=ఖడ్గములు ధరించినవారిని, శతఘ్నీముసలాయుధాన్=శతఘ్నులు, ముసలములు ఆయుధములుగా కలవారిని, పరిఘోత్తమహస్తాంశ్చ=ఉత్తమమైన పరిఘలు హస్తములందు కలవారిని, విచిత్రకవచోజ్జ్వలాన్=విచిత్రములైన కవచములతో ప్రకాశించుచున్న వారిని, నాతిస్థూలాన్=ఎక్కువగా లావు లేనివారిని, నాతికృశాన్=ఎక్కువగా కృశించని వారిని, నాతిదీర్ఘాతిహ్రస్వకాన్=ఎక్కువ పొడవుగా కాని పొట్టిగా గాని లేనివారిని, నాతిగౌరాన్=ఎక్కువ తెల్లగా లేనివారిని, నాతికృ

ష్ణాన్=ఎక్కువ నల్లగా లేనివారిని, నాతికుబ్జాన్=ఎక్కువ గూనువాళ్లు కానివారిని, న వామనాన్=అంతగా పొట్టికానివారిని, విరూపాన్=వికృతరూపము కలవారిని, బహురూపాంశ్చ=అనేకరూపములు కలవారిని, సురూపాంశ్చ=మంచి రూపము కలవారిని, సువర్చసః=మంచి తేజస్సు కలవారిని, ధ్వజీన్=ధ్వజములు ధరించిన వారిని, పతాకినశ్చైవ=పతాకలు ధరించినవారిని, వివిధాయుధాన్=అనేకవిధముల ఆయుధములు కలవారిని, దదర్శ=చూచెను.

తా. హనుమంతుడు లంకాపురములో అనేకవిధములుగా ఉన్న రాక్షసులను చూచెను. యజ్ఞాదిదీక్షవహించిన కొందరు జటలు ధరించిరి; కొందరు ముండనము చేయించుకొనిరి; కొందరు ఎద్దుచర్మలను, మరికొందరు ఇతరవస్త్రములను ధరించి ఉండిరి. కొందరు పిడికెడు దర్భలు అభిమంత్రించి శత్రువినాశాదులకు ఉపయోగించుటచే అవే వారికి ఆయుధములుగా ఉండెను. మరికొందరు మారణహోమాదులు చేయుచుండుటచే ఆ హోమకుండములే వారికి ఆయుధ ములుగ ఉపయోగపడుచుండెను. కొందరు కూటములు, ముద్గరములు, దండము అను ఆయుధములను ధరించి ఉండిరి. ఒంటికంటివాళ్లు, ఒంటిచెవివాళ్లు, వ్రేలాడుతున్న పొట్టా, చన్నులూ కలవాళ్లు, భయంకరమైన ఆకారము కలవాళ్లు, వంకరమూతుల వాళ్లు, వికృతరూపము కంవాళ్లు, పొట్టి వాళ్లు- ఈ విధముగ అక్కడ అనేకవిధముల రాక్షసులుండిరి. కొందరు విచిత్రములైన కవచములతో ప్రకాశించుచు ధనస్సులు, ఖడ్గములు, శతఘ్నులు (నూరుగురిని ఒక్కమారు చంపగల ఆయుధవిశేషములు), ముసలములు, ఉత్తమమైన పరిఘలు మొదలైన ఆయుధములు ధరించి ఉండిరి. కొందరు అంతగా లావుగా గాని, సన్నముగా గాని కాక సమముగా ఉండిరి. కొందరు అంతగా పొడవుగా గాని, పొట్టిగా గాని కాక వామనఛాయలో ఉండిరి. కొందరికి కొంచెము గూను ఉండెను. కొందరు పొట్టిగా ఉండిరి కాని అంతగా పొట్టిగా లేరు. కొందరు వికృతరూపములతోను, కొందరు అనేకవిధములైన రూపములతోను ఉండిరి. కొందరు మంచి అంద మైన ఆకారములతో, తేజస్సుతో ప్రకాశించుచుండిరి. కొందరు ధ్వజములు, కొందరు పతాకలు, కొందరు అనేకవిధము లైన ఆయుధములు ధరించి యుండిరి. 15-19

మూ. శక్తివృక్షాయుధాంశ్చైవ పట్టిసాశనిధారిణః, 20
క్షేపణీపాశహస్తాంశ్చ దదర్శ స మహాకపిః,
స్రగ్విణస్త్వనులిప్తాంశ్చ వరాభరణభూషితాన్, 21

నానావేషసమాయుక్తాన్యథాస్వైరగతాన్ బహూన్,
తీక్ష్ణశూలధరాంశ్చైవ వజ్రిణశ్చ మహాబలాన్. 22

ప్ర. అ. మహాకపిః=ఆ హనుమంతుడు, శక్తివృక్షాయుధాంశ్చైవ=శక్తులు, వృక్షములు ఆయుధములుగా కలవారిని, పట్టిసాశనిధారిణః=పట్టిసములు అశనులు అను ఆయుధములు ధరించినవారిని, క్షేపణీపాశహస్తాంశ్చ=ఆయుధములను దూరముగా విసరు క్షేపణు లను సాధనములు, పాశములు హస్తములందు కలవారిని, స్రగ్విణః=పుష్పమాలలు కలవారిని, అనులిప్తాంశ్చ=సుగంధాదులు పూసుకొన్నవారిని, వరాభరణభూషితాన్=శ్రేష్ఠములైన అలంకారములతో అలంకరింపబడినవారిని, నానావేషసమాయుక్తాన్=అనేక విధములైన వేషములతో కూడినవారిని, యథాస్వైరగతాన్=స్వేచ్ఛానుసారము గమనము గల, బహూన్=చాలమందిని, తీక్ష్ణశూలధరాంశ్చైవ=తీక్ష్ణమైన శూలములను ధరించినవారిని, వజ్రిణశ్చ=వజ్రములు కలవారిని, మహాబలాన్=గొప్ప బలము కలవారిని, దదర్శ=చూచెను.

తా. అక్కడ హనుమంతుడు చూచిన రాక్షసులలో మహాబలవంతు లైన కొందరు శక్తులు, వృక్షములు, పట్టిసములు, అశనులు, క్షేపణులు, పాశములు, తీక్ష్ణ మైన శూలములు, వజ్రాయుధములు మొదలైన అనేక ఆయుధములు ధరించి ఉండిరి. కొందరు పుష్పమాలలు ధరించి, సుగంధద్రవ్యములు శరీరమునకు అలముకొని, అనేకవిధము లైన ఆభరణములతో అలంకరించుకొని, అనేకవిధము లైన వేషములు ధరించి ఉండిరి. వారిలో చాలామంది ఇష్టము వచ్చిన చోటులకు వెళ్ళ సమర్థులై ఉండిరి. 20 - 22

మూ. శతసాహస్రమవ్యగ్రమారక్షం మధ్యమం కపిః,
రక్షోధిపతినిర్దిష్టం దదర్శాన్తఃపురాగ్రతః. 23

ప్ర. అ. కపిః=హనుమంతుడు, అన్తఃపురాగ్రతః=అంతఃపురము ఎదుట, రక్షోధిపతినిర్దిష్టమ్=రావణుని ఆజ్ఞచే నిలుపబడిన, శతసాహస్రమ్=నూరువేల, అవ్యగ్రమ్=సావధానముగా ఉన్న, మధ్యమమ్ ఆరక్షమ్=మధ్యమ భాగమునందున్న రక్షక సైన్యమును, దదర్శ=చూచెను.

తా. నూరువేలమంది సైనికులున్న ఒక సేనానివేశము పురమధ్యము నందు సర్వసన్నద్ధముగా, సావధానముగా ఉండెను. ఆ సేనానివేశము రావణుని ఆజ్ఞప్రకారము, అతని అంతఃపురము ఎదుట నిలుపబడి ఉండెను. హనుమంతుడు దానినికూడ చూచెను. 23

మూ. స తదా తద్గృహం దృష్ట్వా మహాహాటకతోరణమ్,
రాక్షసేన్ద్రస్య విఖ్యాతమద్రిమూర్ధ్ని ప్రతిష్ఠితమ్. 24
పుణ్డరీకావతంసాభిః పరిఖాభిరలంకృతమ్,
ప్రాకారావృతమత్యన్తం దదర్శ స మహాకపిః. 25

ప్ర. అ. సః=ప్రసిద్ధుడైనన, సః=ఆ, మహాకపిః=హనుమంతుడు, మహాహాటకతోరణమ్=గొప్ప బంగారుముఖద్వారము గలదీ, అద్రిమూర్ధ్ని=పర్వతశిఖరముపై, ప్రతిష్ఠితమ్=ఉన్నదీ, విఖ్యాతమ్=ప్రసిద్ధమైనదీ, పుణ్డరీకావతంసాభిః=పద్మములు అలంకారములుగ గల, పరిఖాభిః=పరిఖలచేత, అలంకృతమ్=అలంకరించబడినదీ, ప్రాకారావృతమ్=ప్రాకారముచేత ఆవరింపబడినదీ అయిన, రాక్షసేన్ద్రస్య=రావణునియొక్క, తత్=ఆ, గృహమ్= గృహమును, తదా=అప్పుడు, దృష్ట్వా=చూచి, అత్యన్తమ్=మిక్కిలి, దదర్శ=చూచెను.

తా. ఆ హనుమంతుడు, పెద్ద బంగారు ముఖద్వారము గల రావణుని గృహమును చూచి, మరల దానినే శ్రద్ధగా చూచెను. ప్రసిద్ధమైన ఆ గృహము పర్వతశిఖరముపై ఉండెను. పద్మములతో నిండిన పరిఖలు దానికి అలంకారముగా ఉండెను. దాని చుట్టును పెద్ద ప్రాకారము ఉండెను. 24, 25

మూ. త్రివిష్టపనిభం దివ్యం దివ్యనాదవినాదితమ్,
వాజిహేషితసంఘుష్టం నాదితం భూషణైస్తథా, 26
రథైర్యానైర్విమానైశ్చ తథా హయగజైః శుభైః,
వారణైశ్చ చతుర్దన్తైః శ్వేతాభ్రనిచయోపమైః, 27
భూషితం రుచిరద్వారం మత్తైశ్చ మృగపక్షిభిః,
రక్షితం సుమహావీర్యైర్యాతుధానైః సహస్రశః, 28
రాక్షసాధిపతేర్గుప్తమావివేశ మహాకపిః.

ప్ర. అ. మహాకపిః=హనుమంతుడు, త్రివిష్టపనిభమ్=స్వర్గముతో సమానమైనదీ దివ్యమ్=శ్రేష్ఠమైనదీ, వాజిహేషితసంఘుష్టమ్=గుఱ్ఱముల సకిలింపులచేత ధ్వనింపచేయబడినదీ, తథా=మరియు, భూషణైః=అలంకారముల చేత, నాదితమ్=ధ్వనింపచేయబడినదీ, రథైః=రథములచేతను, యానైః=వాహనములచేతను, విమానైశ్చ=ఉత్తమగృహములచేతను, తథా=మరియు శుభైః=మంగళకరములైన, హయగజైః=గుఱ్ఱములచేతను, ఏనుగులచేతను, శ్వేతాభ్రనిచయోపమైః=తెల్లని మేఘముల గుంపులతో సమానములైన, చతుర్దన్తైః=నాలుగు దంతములుగల, వారణైశ్చ=మహాగజములచేతను, భూషితమ్=అలంకరించబడినదీ, మత్తైః=మదించిన,

మృగపక్షిభిః=మృగములతోను, పక్షులతోను, రుచిరద్వారమ్=అందమైన ద్వారములు గలదీ, సుమహావీర్యైః=గొప్ప పరాక్రమము గల, సహస్రశః=వేలకొలది, యాతుధానైః=రాక్షసులచేత్, రక్షితమ్=రక్షింపబడినది అయిన, రాక్షసాధిపతేః=రాక్షసరాజైన రావణునియొక్క గృహమును, గుప్తమ్=రహస్యముగా, ఆవివేశ=ప్రవేశించెను.

తా. ఆ రావణుని గృహము స్వర్గము వలె ప్రకాశించుచుండెను. ఆ గృహమునందంతటను మధురమైన ధ్వనులు, అశ్వముల సకిలింపులు, భూషణధ్వనులు వినవచ్చుచుండెను. రథములు, వాహనములు, విమానములు, ఉత్తమమైన అశ్వములు, గజములు, తెల్లని మేఘముల సముదాయమువంటి, నాలుగేసి దంతములు గల, మహాగజములు ఆ గృహమునకు అలంకారముగా ఉండెను. మదించిన లేళ్లతోను, పక్షులతోను, ద్వారములు ఒప్పుచుండెను. మహాపరాక్రమవంతులైన వేలకొలది రాక్షసులు ఆ గృహమును రక్షించుచుండిరి. అట్టి రావణుని గృహమును హనుమంతుడు రహస్యముగా ప్రవేశించెను.26-28

మూ. సహేమజామ్బూనదచక్రవాళం
మహార్హ ముక్తామణిభూషితాన్తమ్,
పరార్థ్యకాలాగురుచన్దనాక్తం
స రావణాన్తఃపురమావివేశ. 29

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే సున్దరకాణ్డే
చతుర్థః సర్గః.

ప్ర. అ. సః=హనుమంతుడు, సహేమ=బంగారముతో కూడినది, జామ్బూనదచక్రవాళమ్=బంగారుప్రాకారమండలము కలదీ, మహార్హముక్తామణిభూషితాన్తమ్=చాల మూల్యము గల ముత్యములతోను మణులతోను అలంకరింపబడిన మధ్య ప్రదేశము కలది, పరార్థ్యకాలాగురుచన్దనాక్తమ్=చాల విలువ గల అగురువుతోను చందనముతోను తడపబడినదీ అయిన, రావణాన్తఃపురమ్=రావణుని అంతఃపురమును, ఆవివేశ=ప్రవేశించెను.

తా. బంగారముతో నిండి ఉన్న ఆ రావణాంతఃపురము చుట్టూ బంగారు ప్రాకారము ఉండెను. మధ్యభాగము చాల విలువైన అగరువు, చందనము కలిపిన జలముతో తడుపబడెను. అట్టి రావణాంతఃపురములోనికి హనుమంతుడు ప్రవేశించెను. 29

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు
సుందరకాండలో చతుర్థసర్గ సమాప్తము.

అథ పఞ్చమః సర్గః

[రావణుని అంతఃపురములో అన్నిప్రదేశములందు సీతను అన్వేషించి, ఆమె కానరాకపోవుటచే హనుమంతుడు విషాదము చెందుట.]

మూ. తతః స మధ్యంగతమంశుమన్తం
జ్యోత్స్నావితానం మహదుద్వమన్తమ్,
దదర్శ ధీమాన్ దివి భానుమన్తం
గోష్ఠే వృషం మత్తమివ భ్రమన్తమ్. 1

ప్ర. అ. తతః=అటుపిమ్మట, ధీమాన్=బుద్ధిమంతుడైన, సః=హనుమంతుడు, మధ్యమ్=ఆకాశమధ్యమును, గతమ్=పొందినవాడూ, అంశుమన్తమ్=కిరణములు కలవాడూ, మహత్=గొప్ప, జ్యోత్స్నావితానమ్=వెన్నెల విస్తారమును, ఉద్వమన్తమ్=చిమ్ముతున్నవాడూ, గోష్ఠే=గోవులు నివసించు ప్రదేశమునందు, భ్రమన్తమ్=తిరుగుచున్న, మత్తమ్=మదించిన, వృషమివ=వృషభము వలె ఉన్నవాడూ అయిన, భానుమన్తమ్=కిరణములు గల చంద్రుని, దివి=ఆకాశమునందు, దదర్శ=చూచెను.

తా. ఇంతలో ధీశాలి యైన ఆ హనుమంతుడు ఆకాశమధ్యలో ప్రవేశించిన చంద్రుని చూచెను. తెల్లని కిరణములు గల ఆ చంద్రుడు దట్టమైన వెన్నెలను వ్యాపింపచేయుచుండెను. గోశాలలో దిరుగుచున్న ఆబోతు వలె ఆ చంద్రుడు ఆకాశమునందు చూచుటకు చాల ముచ్చటగా ఉండెను. 1

మూ. లోకస్య పాపాని వినాశయన్తం
మహోదధిం చాపి సమేధయన్తమ్,
భూతాని సర్వాణి విరాజయన్తం
దదర్శ శీతాంశుమథాభియాన్తమ్. 2

ప్ర. అ. అథ=అటుపిమ్మట, లోకస్య=లోకముయొక్క, పాపాని=పాపములను, వినాశయన్తమ్=నశింపచేయుచున్నవాడు, మహోదధిమ్=మహాసముద్రమును, సమేధయన్తం చాపి=వృద్ధిపొందించుచున్నవాడూ, సర్వాణి=సమస్త మైన, భూతాని=ప్రాణులను (లేదా అగ్ని తప్ప నాలుగు మహాభూతములను),

విరాజయన్తమ్=ప్రకాశింపచేయుచున్నవాడు, అభియాన్తమ్=పైకి వచ్చుచున్నవాడూ అయిన, శీతాంశుమ్=చంద్రుని, దదర్శ=చూచెను.

తా. పైకి వచ్చుచున్న, చల్లని కిరణములు గల ఆ చంద్రుడు లోకముల పాపాల నన్నింటిని నశింపచేయుచు, అన్ని ప్రాణులను ప్రకాశింపచేయుచు, సముద్రము ఉప్పొంగునట్లు చేయుచుండెను. హనుమంతుడు అట్టి చంద్రుని చూచెను. 2

మూ. యా భాతి లక్ష్మీర్భువి మన్దరస్థా
తథా ప్రదోషేషు చ సాగరస్థా,
తథైవ తోయేషు చ పుష్కరస్థా
రరాజ సా చారునిశాకరస్థా. 3

ప్ర. అ. భువి=భూమియందు, యా=ఏ, లక్ష్మీః=లక్ష్మి (శోభ), మన్దరస్థా=మందరపర్వతమునందున్నదై, భాతి=ప్రకాశించుచుండునో, తథా=అట్లే, ప్రదోషేషు=సాయంకాలములందు, సాగరస్థా=సముద్రముపై ఉన్న ఏలక్ష్మి ప్రకాశించుచుండునో, తథైవ=అట్లే, తోయేషు=ఉదకములలో, పుష్కరస్థా=పద్మములలో ఉన్న ఏ లక్ష్మి ప్రకాశించుచుండునో, సా=ఆ లక్ష్మి, చారునిశాకరస్థా=సుందరుడైన చంద్రునిలో ఉన్నదై, రరాజ=ప్రకాశించెను.

తా. ఈ భూతలమునందు, ఏ లక్ష్మి మందరపర్వతముమీద ఉండునో, సాయంసమయములందు ఏ లక్ష్మి సాగరముపై కనబడునో, ఉదకములలో, పద్మములలో ఏ లక్ష్మి కనబడునో ఆ లక్ష్మియే అపుడు చక్కగా చంద్రుని ఆశ్రయించి ఉండెను. 3

మూ. హంసో యథా రాజతపఞ్జరస్థః
సింహో యథా మన్దరకన్దరస్థః,
వీరో యథా గర్వితకుఞ్జరస్థ
శ్చన్ద్రో విబభ్రాజ తథామ్బరస్థః. 4

ప్ర. అ. రాజతపఞ్జరస్థః=వెండి పంజరములో ఉన్న, హంసః=హంస, యథా=ఎట్లు ప్రకాశించునో, మన్దరకన్దరస్థః=మందరపర్వతగుహలో ఉన్న, సింహః=సింహము, యథా=ఎట్లు ప్రకాశించునో, గర్వితకుఞ్జరస్థః=గర్వించిన ఏనుగుపై ఉన్న, వీరః=వీరుడు, యథా=ఎట్లు ప్రకాశించునో, అమ్బరస్థః=ఆకాశములో ఉన్న, చన్ద్రః=చంద్రుడు, తథా=అట్లు, విబభ్రాజ=ప్రకాశించెను.

తా. వెండి పంజరములో ఉన్న హంస ఎట్లు ప్రకాశించునో, మందర పర్వతగుహలో ఉన్న సింహము ఎట్లు ప్రకాశించునో, గర్వించిన ఏనుగుపై కూర్చున్న వీరుడు ఎట్లు ప్రకాశించునో, ఆకాశమునందున్న చంద్రుడు ఆ విధముగా ప్రకాశించెను. 4

మూ. స్థితః కకుద్మానివ తీక్ష్ణశృఙ్గో
మహాచలః శ్వేత ఇవోచ్చశృఙ్గః,
హస్తీవ జామ్బూనదబద్ధశృఙ్గో
రరాజ చన్ద్రః పరిపూర్ణశృఙ్గః. 5

ప్ర. అ. తీక్ష్ణశృఙ్గః=తీక్ష్ణ మైన కొమ్ములు గల, స్థితః=నిలచి యున్న, కకుద్మానివ=ఎత్తైన మూపురము గల వృషభము వలె, ఉచ్చశృఙ్గః=ఎత్తైన, శిఖరములు గల, శ్వేతః=తెల్లని, మహాచలః ఇవ=మహాపర్వతము వలె, జామ్బూనదబద్ధశృఙ్గః= బంగారములో కట్టబడిన దంతములు గల, హస్తీవ=ఏనుగు వలె, పరిపూర్ణశృఙ్గః= పూర్ణమైన కళలు గల, చన్ద్రః=చంద్రుడు, రరాజ=ప్రకాశించెను.

తా. పరిపూర్ణ మైన కళలతో కూడిన ఆ చంద్రుడు, తీక్ష్ణ మైన కొమ్ములు గల వృషభము వలె, ఉన్నత మైన శిఖరము గల తెల్లని మహాపర్వతము వలె, దంతములకు బంగారపు తొడుగు తొడిగిన ఏనుగు వలె ప్రకాశించెను. 5

మూ. వినష్టశీతామ్బుతుషారపఙ్కో
మహాగ్రహగ్రాహవినష్టపఙ్కః,
ప్రకాశలక్ష్మ్యాశ్రయనిర్మలాఙ్కో
రరాజ చన్ద్రో భగవాన్ శశాఙ్కః. 6

ప్ర. అ. వినష్టశీతామ్బుతుషారపఙ్కః=తొలగిన చల్లని ఉదకము (మంచు) యొక్క తుంపురు లనెడు పంకము కలవాడూ, మహాగ్రహగ్రాహ వినష్టపఙ్కః=పెద్ద గ్రహ మైన సూర్యునియొక్క గ్రహణము చేత, అనగా సూర్యకిరణములు తన బింబముపై ప్రతిఫలించుటచేత, నశించిన మాలిన్యము కలవాడూ, ప్రకాశల క్ష్మ్యాశ్రయనిర్మలాఙ్కః=ప్రకాశలక్ష్మికి ఆశ్రయమైన నిర్మలమైన మచ్చ కలవాడూ, శశాఙ్కః=చెవుల పిల్లి చిహ్నముగా కలవాడూ అయిన, భగవాన్=పూజ్యుడైన, చన్ద్రః=చంద్రుడు, రరాజ=ప్రకాశించెను.

తా. చంద్రబింబము ఉదయించి, క్రమముగా మీదిమీదికి రాగా అంత వరకు ఆ చంద్రబింబమును ఆవరించి ఉన్న మంచుతుంపర లను పంకము మెల్ల మెల్లగా తొలగిపోయెను. సూర్యకిరణములు ప్రతిబింబించుటచేత మాలిన్య మంతా పోయి, ఆ చంద్రబింబములో ఉన్న అంకము (మచ్చ) కూడ నిర్మలమై

ప్రకాశలక్ష్మికి ఆశ్రయ మయ్యెను. చెవులపిల్లి అను చిహ్నముతో కూడిన, పూజ్య మైన అట్టి చంద్రబింబము చాల ప్రకాశించుచుండెను. 6

మూ. శిలాతలం ప్రాప్య యథా మృగేన్ద్రో
మహారణం ప్రాప్య యథా గజేన్ద్రః,
రాజ్యం సమాసాద్య యథా నరేన్ద్ర
స్తథాప్రకాశో విరరాజ చన్ద్రః. 7

ప్ర. అ. ప్రకాశః=స్పష్టముగా కనబడుచున్న, చన్ద్రః=చంద్రుడు, మృగేన్ద్రః=సింహము, శిలాతలమ్=చదు నైన రాతి పైభాగమును, ప్రాప్య=పొంది, యథా=ఏట్లో, గజేన్ద్రః=ఉత్తమమైన గజము, మహారణమ్=గొప్ప యుద్ధమును, ప్రాప్య=పొంది, యథా=ఎట్లో, తథా=అట్లు, విరరాజ=ప్రకాశించెను.

తా. ఆకాశముపైకి వచ్చుచున్న ఆ చంద్రుడు శిలాతలము పైకి ఎక్కి నిలచిన సింహము వలె, యుద్ధరంగములో ప్రవేశించిన మహాగజము వలె, రాజ్యమును పొందిన రాజు వలె ప్రకాశించెను. 7

మూ. ప్రకాశచన్ద్రోదయనష్టదోషః
ప్రవృత్తరక్షఃపిశితాశదోషః,
రామాభిరామేరితచిత్తదోషః
స్స్వర్గప్రకాశో భగవాన్ ప్రదోషః. 8

ప్ర. అ. ప్రకాశచన్ద్రోదయనష్టదోషః=ప్రకాశించుచున్న చంద్రుని ఉదయము చేత నశించిన చీకటి అను దోషము కలదీ, ప్రవృత్తరక్షఃపిశితాశదోషః=ప్రారంభమైన రాక్షసుల మాంసభోజన మను దోషము కలదీ, రామాభిరామేరితచిత్తదోషః=స్త్రీల చేతను, వారి ప్రియులచేతను విడువబడిన చిత్తమునందలి కోపరూపమైన దోషము కలదీ అయిన, భగవాన్=పూజ్యమైన, ప్రదోషః=ప్రదోషసమయము, స్వర్గప్రకాశః=స్వర్గమువంటి ప్రకాశము కలది ఆయెను.

తా. స్వర్గము వలె ప్రకాశించుచున్న, పవిత్ర మైన ఆ సాయంకాల సమయమునందు చంద్రుడు ఉదయించి ప్రకాశించుచుండుటచే చీకటి నశించెను. రాక్షసులు మాంసభక్షణము ప్రారంభించిరి. వనితలు వారి ప్రియులు తమ మనస్సులలోని కోపములను విడచి కలియుచుండిరి. 8

మూ. తన్త్రీస్వనాః కర్ణసుఖాః ప్రవృత్తాః
స్వపన్తి నార్యః పతిభిః సువృత్తాః,

నక్తంచరాశ్చాపి తథా ప్రవృత్తా
విహర్తుమత్యద్భుతరౌద్రవృత్తాః. 9

ప్ర. అ. కర్ణసుఖాః=చెవులకు సుఖకరము లైన, తన్త్రీస్వనాః=వీణాతంత్రుల ధ్వనులు, ప్రవృత్తాః=ప్రారంభమైనవి. సువృత్తాః=మంచి చరిత్ర గల, నార్యః=స్త్రీలు పతిభిః=భర్తలతో, స్వపన్తి=శయనించుచుండిరి. తథా=అట్లే, అత్యద్భుతరౌద్ర వృత్తాః=మిక్కిలి ఆశ్చర్యకరమైన ప్రవర్తన గల, నక్తంచరాశ్చాపి=రాక్షసులు కూడ, విహర్తుమ్=విహరించుటకు, ప్రవృత్తాః=ప్రారంభించిరి.

తా. ఆ సమయమునందు, చెవులకు ఇంపైన వీణాధ్వనులు వినవచ్చుచుండెను. పతివ్రత లైన స్త్రీలు భర్తలతో కలసి శయనించుచుండిరి. అత్యాశ్చర్యమును కలిగించు భయంకరమైన పనులు చేయు నిశాచరులు కూడా సంచరించుచుండిరి. 9

మూ. మత్తప్రమత్తాని సమాకులాని
రథాశ్వభద్రాసనసంకులాని,
వీరః శ్రియా చాపి సమాకులాని
దదర్శ ధీమాన్ స కపిః కులాని. 10

ప్ర. అ. వీరః=వీరుడూ, ధీమాన్=బుద్ధిమంతుడూ అయిన, సః కపిః=ఆ హనుమంతుడు, మత్తప్రమత్తాని=మదించి ఏమరుపాటుతో ఉన్న జనులు కలవీ, సమాకులాని=జనులతో నిండినవీ, రథాశ్వభద్రాసనసంకులాని=రథములతోను, అశ్వములతోను, భద్రజాతికి చెందిన ఏనుగులతోను, ఉత్తమ మైన ఆసనములతోను నిండినవీ, శ్రియా చాపి=ఐశ్వర్యముతో, సమాకులాని=కలకలలాడుచున్నవీ అయిన, కులాని=గృహములను, దదర్శ=చూచెను.

తా. వీరుడూ, బుద్ధిమంతుడూ అయిన ఆ హనుమంతుడు అనేక విధము లైన గృహములను చూచెను. కొన్ని గృహములు, మదించి ఏమరుపాటుతో ఉన్న జనులతో నిండి ఉండెను. కొన్ని, రథములతోను, అశ్వములతోను, భద్రజాతికిచెందిన గజములతోను, ఉత్తమము లైన ఆసనములతోను, నిండి యుండెను. ఆ గృహములన్నీ లక్ష్మితో కళకళలాడుచుండెను. 10

మూ. పరస్పరం చాధికమాక్షిపన్తి
భుజాంశ్చ పీనానధినిక్షిపన్తి,
మత్తప్రలాపానధికం క్షిపన్తి
మత్తాని చాన్యోన్యమధిక్షిపన్తి. 11

ప్ర. అ. పరస్పరమ్=ఒకరి నొకరు, అధికమ్=అధికముగా, ఆక్షి పన్తి=పరిహసించుచున్న వారూ, పీనాన్=బలిసిన, భుజాన్ చ=భుజములను, అధినిక్షిపన్తి=కదల్చుచున్నవారూ, అధికమ్=అధికముగా, మత్తప్రలాపాన్=మదించిన ప్రేలాపనలను, క్షిపన్తి=విసరుకొనుచున్నవారూ, మత్తాని=మదించిన వారై, పరస్పరమ్=పరస్పరమూ, అధిక్షిపన్తి=ఆక్షేపించుకొనుచున్నవారూ (ఇవన్నీ రాబోవు శ్లోకములోని 'రక్షాంసి' అనుదానికి విశేషణములు).

తా. ఆ గృహములలోని రాక్షసులు ఒకరినొకరు పరిహసించుకొనుచు బలిసిన బాహువులు ఇటు అటు ఆడించుచుండిరి. కొందరు మద్యపాన మత్తులై అధికముగా ప్రేలాపనలు చేయుచుండిరి. కొందరు పరస్పరము అధిక్షేపించుకొనుచుండిరి. అట్టి రాక్షసులను హనుమంతుడు చూచెను. 11

మూ. రక్షాంసి వక్షాంసి చ విక్షిపన్తి
గాత్రాణి కాన్తాసు చ విక్షిపన్తి,
రూపాణి చిత్రాణి చ విక్షిపన్తి
దృఢాని చాపాని చ విక్షిపన్తి. 12

ప్ర. అ. వక్షాంసి=వక్షఃస్థలములను, విక్షిపన్తి=విరచుకొనుచున్నవారూ, కాన్తాసు=స్త్రీలపై, గాత్రాణి=శరీరమును, విక్షిపన్తి=పడవేయుచున్నవారూ, చిత్రాణి=విచిత్రము లైన, రూపాణి=రూపములను, విక్షిపన్తి=ప్రసరింపచేయుచున్నవారూ, దృఢాని=దృఢము లైన,చాపాని=ధనస్సులను, విక్షిపన్తి=ఆడించుచున్న వారూ అయిన, రక్షాంసి= రాక్షసులను, (దదర్శ=చూచెను).

తా. కొందరు రాక్షసులు రొమ్ములు విరచుకొనుచుండిరి. కొందరు తమ ప్రియురాండ్రపై పడుచుండిరి. కొందరు విచిత్రములైన రూపములు ప్రదర్శించుచుండిరి. మరి కొందరు దృఢములైన ధనస్సులు లాగుచుండిరి. 12

మూ. దదర్శ కాన్తాశ్చ సమాలభన్త్య
స్తథా పరాస్తత్ర పునః స్వపన్త్యః,
సురూపవక్త్రాశ్చ తథా హసన్త్యః
క్రుద్ధాః పరాశ్చాపి వినిఃశ్వసన్త్యః. 13

ప్ర. అ. కాన్తాః చ=కొందరు స్త్రీలు, సమాలభన్త్యః=శరీరమునకు చందనాదులు పూసికొనుచు, (ఆసన్=ఉండిరి). తథా=అట్లే, తత్ర=అక్కడ, అపరాః పునః=మరి కొందరు స్త్రీలైతే, స్వపన్త్యః=నిద్రపోవుచుండిరి. తథా= అట్లే, సురూపవక్త్రాః చ=మంచి రూపము, ముఖములు గల మరి కొందరు స్త్రీలు,

హసన్త్యః=నవ్వుచుండిరి. పరాః చ=మరి కొందరు స్త్రీలు, క్రుద్ధాః=కోపించినవారై, వినిఃశ్వసన్త్యః=నిట్టూర్పు విడచుచుండిరి. అట్టి స్త్రీలను, దదర్శ=చూచెను.

తా. ఆ గృహములలో కొందరు సుందరాంగులు శరీరములకు చందనాదులను పూసుకొనుచుండిరి. కొందరు నిద్రపోవుచుండిరి. మంచి రూపము, అందమైన ముఖములూ గల మరి కొందరు నవ్వుచుండిరి. కొందరు స్త్రీలు ప్రియులపైకోపించి నిట్టూర్పులు విడచుచుండిరి. అట్టి స్త్రీలను హనుమంతుడు చూచెను. 13

మూ. మహాగజైశ్చాపి తథా నదద్భిః
సుపూజితైశ్చాపి తథా సుసద్భిః,
రరాజ వీరైశ్చ వినిఃశ్వసద్భి
ర్హ్రదో భుజఙ్గైరివ నిఃశ్వసద్భిః. 14

ప్ర. అ. తథా=అట్లే, నదద్భిః=ధ్వనిచేయుచున్న, మహాగజైశ్చాపి=మహాగజములతోను, తథా=మరియు, సుపూజితైః=బాగుగా పూజింపబడిన, సుసద్భిః చాపి=ఉత్తమపురుషులతోను, రరాజ=ప్రకాశించెను, వినిఃశ్వసద్భిః=అధికబలశాలు లగుటచేత దీర్ఘమైన శ్వాసలు విడచుచున్న, వీరైశ్చ=వీరులతో, నిఃశ్వసద్భిః=నిట్టూర్చుచున్న, భుజఙ్గైః=సర్పములతో, హ్రదః ఇవ=మడుగువలె, రరాజ=ప్రకాశించెను.

తా. ఆ నగరము ధ్వని చేయుచున్న మహాగజములతోను, సంమానార్హులైన సత్పురుషులతోను నిండి యుండెను. దీర్ఘనిఃశ్వాసములు విడచుచున్న వీరులతో ఆ నగరము బుసలు కొట్టుచున్న సర్పములతో నిండిన మడుగు వలె ప్రకాశించెను. 14

మూ. బుద్ధిప్రధానాన్ రుచిరాభిధానాన్
సంశ్రద్దధానాన్ జగతః ప్రధానాన్,
నానావిధానాన్ రుచిరాభిధానాన్
దదర్శ తస్యాం పురి యాతుధానాన్. 15

ప్ర. అ. బుద్ధిప్రధానాన్=బుద్ధియే ప్రధానముగా కలవారు, రుచిరాభిధానాన్=అందమైన మాటలు కలవారు, సంశ్రద్దధానాన్=మంచి శ్రద్ధ కలవారు, జగతః=జగత్తునకు, ప్రధానాన్=ప్రధానులు, నానావిధానాన్=అనేకవిధములైన ప్రవృత్తులు కలవారూ, రుచిరాభిధానాన్=అందమైన పేర్లు కలవారూ అయిన, యాతుధానాన్=రాక్షసులను, తస్యామ్=ఆ, పురి=పట్టణమునందు, దదర్శ=చూచెను.

తా. హనుమంతుడు ఆ నగరములో ఎందరో బుద్ధిజీవులైన, అనగా వివిధవిద్యలలో ప్రవీణులైన రాక్షసులను చూచెను. వారందరును మనోహరముగా మాటలాడుచు తమ విద్యాకర్తవ్యాదులందు మంచి శ్రద్ధతో అనేకవిధము లైన కార్యములు చేయుచు జగత్తులో ప్రధానులై ఉండిరి. వారి పేర్లు కూడ మనోహరముగా ఉండెను. 15

మూ. ననన్ద దృష్ట్వా స చ తాన్ సురూపా
న్నానాగుణానాత్మగుణానురూపాన్,
విద్యోతమానాన్స తదానురూపాన్
దదర్శ కాంశ్చిచ్చ పునర్విరూపాన్. 16

ప్ర. అ. సః=ఆ హనుమంతుడు, సురూపాన్=మంచి రూపము కలవారూ, నానాగుణాన్=అనేక విధములైన సద్గుణములు కలవారూ, ఆత్మగుణానురూపాన్=తమ తమ గుణములకు అనుగుణముగా ఉన్నవారూ, విద్యోతమానాన్=ప్రకాశించుచున్న వారూ అయిన, తాన్=ఆ బుద్ధిప్రధానులైన పండితులను, దృష్ట్వా=చూచి, ననన్ద=సంతోషించెను. తదా=అప్పుడు, సః=ఆ హనుమంతుడు, విరూపాన్=వికృత మైన రూపము కలవారు, అనురూపాన్=తమ రూపములకు అనుగుణముగా ఉన్నవారూ అయిన, కాంశ్చిత్ చ పునః=మరి కొందరిని కూడా, దదర్శ=చూచెను.

తా. మంచి రూపము గల ఆ బుద్ధిజీవులందరూ అనేకసద్గుణములతో ఒప్పుచుండిరి. తమ తమ విద్యాదులకు అనుగుణముగా ప్రవర్తించుచు ప్రకాశించుచుండిరి. వారిని చూచి హనుమంతుడు సంతోషించెను. అక్కడ వికృతరూపములు గల మరి కొందరు రాక్షసులు కూడ కనబడిరి. వారి ప్రవృత్తులు వారి రూపములకు అనుగుణముగ ఉండెను. 16

మూ. తతో వరార్హాః సువిశుద్ధభావా
స్తేషాం స్త్రియస్తత్ర మహానుభావాః,
ప్రియేషు పానేషు చ సక్తభావా
దదర్శ తారా ఇవ సుప్రభావాః. 17

ప్ర. అ. తతః=అటు పిమ్మట, తత్ర=అక్కడ, వరార్హాః=ఉత్తమ మైన యోగ్యత కలవారూ, మహానుభావాః=గొప్ప సామర్థ్యము కలవారూ, ప్రియేషు=ప్రియుల యందు, పానేషు చ=పానములందును, సక్తభావాః=ఆసక్తి గల హృదయములు కలవారూ, సుప్రభావాః=మంచి ప్రభావము గల, తారాః ఇవ=నక్షత్రముల

వలె ఉన్నవారూ అయిన, తేషాం స్త్రియః=ఆ రాక్షసులయొక్క స్త్రీలను, దదర్శ=చూచెను.

తా. పిమ్మట ఆ హనుమంతుడు ఆ గృహములలో అత్యుత్తమ మైన గుణసంపద గలవారూ, గొప్ప ప్రభావము కలవారూ అయిన స్త్రీలను చూచెను. రాక్షసుల భార్య లైన ఆ స్త్రీలు తమ తమ ప్రియులపై ప్రేమాతిశయము కలవారై, మద్యపానాసక్తులై ఉండిరి. మంచి కాంతి గల నక్షత్రముల వలె ప్రకాశించుచుండిరి. 17

మూ. శ్రియా జ్వలన్తీస్త్రపయోపగూఢా
నిశీథకాలే రమణోపగూఢాః,
దదర్శ కాశ్చిత్ప్రమదోపగూఢా
యథా విహఙ్గాః కుసుమోపగూఢాః. 18

ప్ర. అ. శ్రియా=కాంతితో, జ్వలన్తీః=ప్రకాశించుచున్న వారూ, త్రపయా=సిగ్గుచేత, ఉపగూఢాః=అధికముగా ఆశ్రయించబడినవారూ, నిశీథకాలే=అర్ధరాత్ర సమయమునందు, రమణోపగూఢాః=ప్రియులచేత కౌగలించుకొనబడినవారూ, ప్రమదోపగూఢాః=అత్యధికమైన ఆనందముచేత కౌగలించుకొనబడినవారూ, కుసుమోపగూఢాః=పుష్పములచేత కప్పబడిన, విహఙ్గాః యథా=పక్షుల వలె ఉన్న వారూ అయిన, కాశ్చిత్=కొందరు స్త్రీలను, దదర్శ=చూచెను.

తా. కాంతితో ప్రకాశించుచున్న కొందరు స్త్రీలు అర్ధరాత్రమునందు తమ ప్రియుల కౌగలింతలలో చిక్కి సిగ్గుపడుచు, అత్యానందభరితలై ఉండిరి. వారు పుష్పములు కప్పిన పక్షుల వలె ఉండిరి. అట్టి స్త్రీలను కూడ కొందరిని హనుమంతుడు చూచెను. 18

మూ. అన్యాః పునర్హర్మ్యతలోపవిష్టా
స్తత్ర ప్రియాఙ్కేషు సుఖోపవిష్టాః,
భర్తుః ప్రియా ధర్మపరా నివిష్టా
దదర్శ ధీమాన్ మదనాభివిష్టాః. 19

ప్ర. అ. ధీమాన్=బుద్ధిమంతు డైన హనుమంతుడు, హర్మ్యతలోపవిష్టాః=మేడల పైభాగములందున్నవారై, తత్ర=అక్కడ, ప్రియాఙ్కేషు=ప్రియుల ఒడులలో, సుఖోపవిష్టాః=సుఖముగా కూర్చున్నవారూ, భర్తుః=భర్తకు, ప్రియాః=ఇష్ట మైనవారూ, ధర్మపరాః=ధర్మమునందు ఆసక్తి కలవారూ, మదనాభివిష్టాః=మన్మథునిచేత ఆవేశింపబడినవారూ, నివిష్టాః=అనుభవింపబడినవారూ అయిన, అన్యాః=మరికొందరు స్త్రీలను, దదర్శ=చూచెను.

తా. మరి కొందరు స్త్రీలు మేడల పైభాగములపై, భర్తల ఒడులలో సుఖముగా కూర్చుండిరి. మన్మథావేశముతో కూడిన వారందరు భర్తల ప్రేమకు పాత్రలై వారితో రతికేళులు సలుపుచుండిరి. వారందరు ధర్మమార్గమును అనుసరించుచుండిరి. అట్టి స్త్రీలను హనుమంతుడు చూచెను. 19

మూ. అప్రావృతాః కాఞ్చనరాజివర్ణాః
కాశ్చిత్పరార్ధ్యాస్తపనీయవర్ణాః,
పునశ్చ కాశ్చిచ్ఛశలక్ష్మవర్ణాః
కాన్తప్రహీణా రుచిరాఙ్గవర్ణాః. 20

ప్ర. అ. అప్రావృతాః=వస్త్రవిహీన లైన, కాఞ్చనరాజివర్ణాః=బంగారు రేఖల వంటి వర్ణము కల స్త్రీలను, పరార్ధ్యాః=అత్యానందకర మైన సంభోగమునకు తగిన, తపనీయవర్ణాః=పుటము వేసిన బంగారమువంటి రంగుగల, కాశ్చిత్=మరికొందరు స్త్రీలను, పునశ్చ=మరియు, శశలక్ష్మవర్ణాః=చంద్రునిలోని కలంకము వంటి వర్ణము గల (చామనచాయ గల), కాశ్చిత్=మరి కొందరిని, రుచిరాఙ్గవర్ణాః=అందమైన అవయవములు, వర్ణము గల, కాన్తప్రహీణాః=ప్రియులు లేని మరికొందరిని, (దదర్శ=చూచెను).

తా. అక్కడ హనుమంతునకు కనబడిన స్త్రీలలో కొందరు వస్త్రవిహీనలై బంగారు తీగల వలె ఉండిరి. అత్యధిక సంభోగానందము నివ్వగలిగిన మరి కొందరు పుటము పెట్టిన బంగారము రంగులో ఉండిరి. కొందరి శరీరవర్ణము చంద్రునిలో మచ్చ రంగు వలె ఉండెను. అందమైన అవయవములు, వర్ణము గల మరి కొందరు ప్రియవియోగముతో బాధపడుచుండిరి. 20

మూ. తతః ప్రియాన్ ప్రాప్య మనోభిరామాన్
సుప్రీతియుక్తాః సుమనోభిరామాః,
గృహేషు హృష్టాః పరమాభిరామాః
హరిప్రవీరః స దదర్శ రామాః. 21

ప్ర. అ. హరిప్రవీరః=ఆ వానరవీరుడు, తతః=అటుపిమ్మట, మనోభిరామాన్=మనస్సుకు ఆనందమును కలిగించు, ప్రియాన్=ప్రియులను, ప్రాప్య=పొంది, సుప్రీతియుక్తాః=మంచి ఆనందముతో కూడినవారు, సుమనోభిరామాః=పుష్పములు వలె మనస్సును ఆకర్షించువారు, పరమాభిరామాః=మిక్కిలి సౌందర్యవతులు, గృహేషు=తమ తమ గృహములలో, హృష్టాః=ఆనందముతో కూడినవారూ అయిన, రామాః=స్త్రీలను, దదర్శ=చూచెను. (లేదా గృహేషు=గృహములలో, చూచెను. అని అర్థము).

తా. అక్కడ స్త్రీ లందరును అతి సౌందర్యవతులై, పుష్పముల వలె మనస్సును ఆకర్షించుచు, తమ మనస్సులకు ఇష్టులైన ప్రియులను చేరి ఆనందించుచుండిరి. ఈ విధముగ తమ తమ గృహములలో సుఖముగా ఉన్న స్త్రీలను హనుమంతుడు చూచెను. 21

మూ. చన్ద్రప్రకాశాశ్చ హి వక్త్రమాలా
వక్రాక్షిపక్ష్మాశ్చ సునేత్రమాలాః,
విభూషణానాం చ దదర్శ మాలాః
శతహ్రదానామివ చారుమాలాః. 22

ప్ర. అ. చన్ద్రప్రకాశాః=చంద్రుని వంటి ప్రకాశముగల, వక్త్రమాలాశ్చ=ముఖ పంక్తులను, వక్రాక్షిపక్ష్మాశ్చ=వంకరగా ఉన్న కనుల రెప్పలు గల, సునేత్రమాలాః=అంద మైన నేత్రపంక్తులను, శతహ్రదానామ్=మెరుపులయొక్క, చారుమాలాః=అంద మైన మాలల వలె ఉన్న, విభూషణానామ్=అలంకారములయొక్క, మాలాః చ=మాలలను, దదర్శ=చూచెను.

తా. అక్కడ హనుమంతునకు చంద్రుని వలె ప్రకాశించుచున్న ముఖముల పంక్తులు, రెప్పలు వంకరగా ఉన్న అందమైన నేత్రముల పంక్తులు, మెరపుల పంక్తుల వలె ఉన్న అలంకారముల పంక్తులు కనబడెను. 22

మూ. న త్వేవ సీతాం పరమాభిజాతాం
పథి స్థితే రాజకులే ప్రజాతామ్,
లతాం ప్రఫుల్లామివ సాధు జాతాం
దదర్శ తన్వీం మనసాభిజాతామ్. 23

ప్ర. అ. పరమాభిజాతామ్=గొప్ప సౌందర్యము కలది, పథి=ధర్మమార్గము నందు, స్థితే=ఉన్న, రాజకులే=రాజవంశమునందు, ప్రజాతామ్=ఆవిర్భవించినది, సాధు=బాగుగా, జాతామ్=పుట్టిన (బాగుగా పెరిగిన), ప్రఫుల్లామ్=వికసించిన, లతామ్ ఇవ=లత వలె ఉన్నదీ, తన్వీమ్=సన్ననిది, మనసా=మనస్సుచేత, అభిజాతామ్=పుట్టినదీ అయిన, సీతాం తు=సీత నైతే, న దదర్శ=చూడలేదు.

తా. హనుమంతునకు ఇందరు స్త్రీలు కనబడినారు కాని, ఉత్తమసౌంద ర్యవంతురాలూ, ధార్మిక మైన రాజవంశమునందు జనించినదీ (ఆవిర్భవించినదీ), చక్కగా పెరిగిన, పుష్పించిన లతవలె ఉండునదీ, సన్నని శరీరము గలదీ, మనస్సుచేత నిర్మింపబడినదా అన్నట్లు అతిసౌకుమార్యము కలదీ అయిన సీత మాత్రము కనబడలేదు. 23

మూ. సనాతనే వర్త్మని సంనివిష్టాం
రామేక్షణాం తాం మదనాభివిష్టామ్,
భర్తుర్మనః శ్రీమదనుప్రవిష్టాం
స్త్రీభ్యో వరాభ్యశ్చ సదా విశిష్టామ్. 24

ప్ర. అ. సనాతనే=అతిప్రాచీనమైన, వర్త్మని=ధర్మమార్గమునందు, సంనివిష్టామ్=నిలచి ఉన్నదీ, రామేక్షణామ్=మనోహరమైన నేత్రములు కలదీ, (లేదా రామునియందే దృష్టి కలదీ), మదనాభివిష్టామ్=మన్మథునిచేత ఆవేశింపబడినదీ, శ్రీమత్=శోభాయుక్త మైన, భర్తుః=భర్తయొక్క, మనః=మనస్సును, అనుప్రవిష్టామ్=ప్రవేశించినదీ, వరాభ్యః=శ్రేష్ఠ లైన, స్త్రీభ్యశ్చ=స్త్రీలకంటె, సదా=ఎల్లప్పుడు, విశిష్టామ్=ఉత్తమురాలూ అయిన, తామ్=ఆ సీతను, (న దదర్శ=చూడలేదు).

తా. (24, 25, 26 శ్లోకాలకు 23వ శ్లోకముతో అన్వయము). ఆ సీత అతిపురాతనకాలమునుంచి వచ్చుచున్న ధర్మమార్గమునందు స్థిరముగా నిలచినది. రాముని మనస్సులో స్థిరముగా నిలచి ఉన్నది. ఆమె అన్ని కాలములందును, శ్రేష్ఠమైన స్త్రీలు అందరికంటె కూడ చాల ఉత్తమురాలు. అట్టి సీత మాత్రము కనబడలేదు. 24

మూ. ఉష్ణార్దితాం సానుసృతాస్రకణ్ఠీమ్
పురా వరార్హోత్తమనిష్కకణ్ఠీమ్,
సుజాతపక్ష్మామభిరక్తకణ్ఠీం
వనేఽప్రనృత్తామివ నీలకణ్ఠీమ్. 25

ప్ర. అ. ఉష్ణార్దితామ్=విరహతాపముచేత పీడింపబడినదీ, సానుసృతాస్రకణ్ఠీమ్=అవిచ్ఛిన్నముగా ఉన్న కన్నీళ్లు కంఠమునందు కలదీ, పురా=పూర్వము, వరార్హోత్తమనిష్కకణ్ఠీమ్=అమూల్యము ఉత్తమము అయిన పతకము కంఠమునందు కలదీ, సుజాతపక్ష్మామ్=చక్కగా పుట్టిన (అందమైన) రెప్పలు కలదీ, అభిరక్తకణ్ఠీమ్=మధుర మైన కంఠస్వరము కలదీ, వనే=వనమునందు, అప్రనృత్తామ్=నాట్యము చేయని, నీలకణ్ఠీమివ=ఆడు నెమలి వలె ఉన్న (సీతను మాత్రము చూడలేదు).

తా. విరహతాపముతో బాధపడుచున్న ఆ సీత కంఠము నిరంతరము బాష్పముతో నిండి ఉన్నది. ఆమె పూర్వము కంఠమునందు సువర్ణనిష్కమును ధరించెడిది కాని ఇప్పుడు దానిని ధరించుటలేదు. ఆమె కంటిరెప్పలు దట్టముగా అందముగా ఉండును. కంఠస్వరము స్నేహభరితమై ఉండును. నాట్యము మాని అడవిలో నివసించు ఆడునెమలి వలె ఉన్న ఆ సీత మాత్రము హనుమంతునకు కనబడలేదు. 25

మూ. అవ్యక్తరేఖామివ చన్ద్రరేఖాం
పాంసుప్రదిగ్ధామివ హేమరేఖామ్,
క్షతప్రరూఢామివ బాణరేఖాం
వాయుప్రభిన్నామివ మేఘరేఖామ్. 26

ప్ర. అ. అవ్యక్తరేఖామ్=అస్పష్ట మైన రేఖ గల, చన్ద్రరేఖామివ=చంద్రరేఖ వలె ఉన్నదీ, పాంసుప్రదిగ్ధామ్=పరాగముచేత పూయబడిన, హేమరేఖామివ=బంగారు రేఖ వలె ఉన్నదీ, క్షతప్రరూఢామ్=గాయమునందు మొలచిన, బాణరేఖామివ=బాణముయొక్క రేఖ వలె ఉన్నదీ, వాయుప్రభిన్నామ్=వాయువుచేత చెదరగొట్టబడిన, మేఘరేఖామివ=మేఘపంక్తి వలె ఉన్నదీ అయిన, సీతను మాత్రము చూడలేదు.

తా. సీత అస్పష్ట మైన ఆకారము గల చంద్రకళ వలె, పరాగము కప్పిన బంగారు రేఖ వలె, గాయము తగిలి, అది మానిపోయినను ఆనవాలుగా నిలచిన బాణము దెబ్బవలన కలిగిన రేఖ వలె, గాలిచేత చెదరగొట్టబడిన మేఘరేఖ వలె ఉండెను. అట్టి సీత మాత్రము హనుమంతునకు కనబడలేదు. 26

మూ. సీతామపశ్యన్ మనుజేశ్వరస్య
రామస్య పత్నీం వదతాం వరస్య,
బభూవ దుఃఖాభిహతశ్చిరస్య
ప్లవఙ్గమో మన్ద ఇవాచిరస్య. 27

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే సున్దరకాణ్డే
పఞ్చమః సర్గః.

ప్ర. అ. ప్లవఙ్గమః=హనుమంతుడు, వదతామ్=మాటలాడువారిలో, వరస్య=శ్రేష్ఠుడూ, మనుజేశ్వరస్య=మనుజుల ప్రభువూ అయిన, రామస్య=రామునియొక్క, పత్నీమ్=భార్యయైన, సీతామ్=సీతను, చిరస్య=చిరకాలము, అపశ్యన్=చూడనివాడై, దుఃఖాభిహతః=దుఃఖముచేత కొట్టబడినవాడై, అచిరస్య=కొంచెము సమయము పాటు, మన్దః ఇవ=మందుడు వలె, బభూవ=ఆయెను.

తా. హనుమంతుడు ఇంత సేపు వెదకిన పిమ్మట కూడ, మాట నేర్పు కలవారిలో శ్రేష్ఠుడూ,మానవుల ప్రభువూ అయిన రాముని భార్య అయిన సీత కనబడకపోవుటచే చాల దుఃఖాక్రాంతుడై, కొన్ని క్షణముల పాటు ఉత్సాహశూన్యుడు అయ్యెను. 27

*"బాలానందిని" అని శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు
సుందరకాండలో ఐదవ సర్గ సమాప్తము.*

అథ షష్ఠః సర్గః

[హనుమంతుడు సీతకై రావణుని అంతఃపురములో అన్వేషించుట]

మూ. స నికామం విమానేషు విషణ్ణః కామరూపధృత్,
విచచార పునర్లఙ్కాం లాఘవేన సమన్వితః. 1

ప్ర. అ. కామరూపధృత్=ఇచ్ఛానుసారముగా రూపములను ధరించు, సః=ఆ హనుమంతుడు, విమానేషు=గృహములయందు (అన్వేషించి), నికామమ్=మిక్కిలి, విషణ్ణః=దిగులు చెందినవాడై, లాఘవేన=నేర్పుతో (లేదా శీఘ్రత్వముతో) సమన్వితః=కూడినవాడై, పునః=మరల, లఙ్కామ్=లంకను, విచచార=సంచరించెను.

తా. స్వేచ్ఛానుసారముగా రూపములను ధరింప సమర్థుడైన ఆ హనుమంతుడు ఆ యా భవనములలో అన్వేషించిన పిదప కూడ సీత కనబడకపోవుటచే దిగులు చెంది మరల ఆ లంకాపట్టణమును నేర్పుతో పరిశీలించుచు సంచరించెను. 1

మూ. ఆససాదాథ లక్ష్మీవాన్రాక్షసేన్ద్రనివేశనమ్,
ప్రాకారేణార్కవర్ణేన భాస్వరేణాభిసంవృతమ్. 2

ప్ర. అ. అథ=అటుపిమ్మట, లక్ష్మీవాన్=శోభాయుక్తుడైన హనుమంతుడు, అర్కవర్ణేన=సూర్యుని వర్ణము కల, భాస్వరేణ=ప్రకాశించుచున్న, ప్రాకారేణ=ప్రాకారముచేత, అభిసంవృతమ్=చుట్టబడి ఉన్న, రాక్షసేన్ద్రనివేశనమ్=రావణుని గృహమును, ఆససాద=సమీపించెను.

తా. పిమ్మట, శోభాశాలి యైన ఆ హనుమంతుడు, చుట్టూ బాలసూర్యుని వర్ణము వంటి వర్ణము గల, ప్రకాశించుచున్న ప్రాకారము గల రావణుని గృహమును సమీపించెను. 2

మూ. రక్షితం రాక్షసైర్భీమైః సింహైరివ మహావనమ్,
సమీక్షమాణో భవనం చకాశే కపికుఞ్జరః. 3

ప్ర. అ. సింహైః=సింహములచేత, మహావనమివ=మహావనమును వలె, భీమైః=భయంకరు లైన, రాక్షసైః=రాక్షసులచేత, రక్షితమ్=రక్షింపబడిన, భవ

నమ్=గృహమును, సమీక్షమాణః=పరిశీలించుచు, కపికుఞ్జరః=హనుమంతుడు, చకాశే=ప్రకాశించెను.

తా. సింహముచేత మహారణ్యము రక్షింపబడుచున్నట్లు, భయంకరులైన రాక్షసులచేత రక్షింపబడుచున్న రావణుని గృహమును పరిశీలనపూర్వకముగా చూచుచున్న ఆ హనుమంతుడు ప్రకాశించెను. 3

మూ. రూప్యకోపహితై శ్చిత్రైస్తోరణైర్హేమభూషితైః,
విచిత్రాభిశ్చ కక్ష్యాభిర్ద్వారైశ్చ రుచిరైర్వృతమ్. 4

ప్ర. అ. (నాల్గవ శ్లోకమునుంచి పదమూడవ శ్లోకము వరకు పది శ్లోకములలో ఉన్న ద్వితీయాంతములన్నీ పదమూడవ శ్లోకములోని "వేశ్మ" (గృహము) అను దానికి విశేషములు).

రూప్యకోపహితైః=వెండితో అలంకరించబడినవీ, చిత్రైః=ఆశ్చర్యకరము లైనవీ, హేమభూషితైః=బంగారముచేత అలంకరింపబడినవీ అయిన, తోరణైః=ముఖద్వారములతోను, విచిత్రాభిః=విచిత్రము లైన, కక్ష్యాభిః=వాకిళ్లతోను, రుచిరైః=సుందరము లైన, ద్వారైశ్చ=ద్వారముల తోను, వృతమ్=కూడిన (గృహమును చూచెను).

తా. రావణుని గృహములోని ముఖద్వారము లన్నీ వెండితోను, బంగారముతోను, అలంకరింపబడెను. వాకిళ్లు సుందరములై ఆశ్చర్యకరములుగా ఉండెను. ద్వారము లన్నీ చాల అందముగా ఉండెను. 4

మూ. గజాస్థితైర్మహామాత్రైః శూరైశ్చ విగతశ్రమైః,
ఉపస్థితమసంహార్యైర్హయైః స్యన్దనయాయిభిః. 5

ప్ర. అ. గజాస్థితైః=గజములను అధిష్ఠించి ఉన్నవారూ, శూరైః=శూరులూ, విగతశ్రమైః=తొలగిన శ్రమ గలవారూ అయిన, మహామాత్రైః=గజపాలకులచేతను, అసంహార్యైః=సంహరింప శక్యముకాని, హయైః=అశ్వముల చేతను (అశ్వారూఢులచేతనూ), స్యన్దనయాయిభిః=రథములపై నెక్కి సంచరించువారిచేతను, ఉపస్థితమ్=చేరబడిన, (భవనమును చూచెను).

తా. రావణభవనమునందు, శూరులు, ఏ మాత్రము శ్రమ నెరుగనివారు అయిన గజపాలకులు గజములను అధిష్ఠించి ఉపస్థితులై ఉండిరి. ఎవ్వరికిని సంహరింప శక్యము కాని ఆశ్వికులు, రథముల నధిష్ఠించి సంచరించు వీరులు కూడ అక్కడ ఉండిరి. 5

మూ. సింహవ్యాఘ్రతనుత్రాణైర్దాన్తకాఞ్చనరాజతైః,
ఘోషవద్భిర్విచిత్రైశ్చ సదా విచరితం రథైః. 6

ప్ర. అ. సింహవ్యాఘ్రతనుత్రాణైః=సింహముల చర్మములతోను వ్యాఘ్రముల చర్మములతోను నిర్మించిన కవచములు గల, దాన్తకాఞ్చనరాజతైః=దంతములతో, బంగారముతోను, వెండితోను అలంకరించబడిన, ఘోషవద్భిః=ధ్వని గల, విచిత్రైః=విచిత్రము లైన, రథైః=రథములచేత, సదా=ఎల్లప్పుడూ, విచరితమ్=సంచరించబడిన (రావణభవనమును చూచెను).

తా. దంతపునగిషీలతో బంగారు వెండి అలంకారములతో విచిత్రములుగా ఉన్న రథములు అధికమగు ధ్వని చేయుచు సర్వదా ఆ భవనప్రాంతమునందు సంచరించుచుండెను. ఆ రథములలో సింహవ్యాఘ్రచర్మములతో నిర్మించిన కవచములు అమర్చి ఉండెను. 6

మూ. బహురత్నసమాకీర్ణం పరార్థ్యాసనభాజనమ్,
మహారథసమావాసం మహారథమహాసనమ్. 7

ప్ర. అ. బహురత్నసమాకీర్ణమ్=అనేక రత్నములతో నిండినదీ, పరార్థ్యాసనభాజనమ్=అమూల్య మైన ఆసనములు పాత్రలూ కలదీ, మహారథసమావాసమ్=మహారథులకు నివాసస్థానమూ, మహారథమహాసనమ్=గొప్ప రథములూ గొప్ప ఆసనములూ కలదీ, (అయిన రావణభవనమును చూచెను).

తా. ఆ రావణగృహము అనేకరత్నములతో అలంకృతమై అమూల్యము లైన ఆసనములతోను, పాత్రలతోను నిండి యుండెను. మహారథులు (ఒకే సమయమున పదకొండు వేల ధనుర్ధరులతో యుద్ధము చేయువారు) అక్కడ నివసించుచుండిరి. ఆ భవనములో పెద్ద పెద్ద రథములు, ఆసనములు ఉండెను.

మూ. దృశ్యైశ్చ పరమోదారైస్తైస్తైశ్చ మృగపక్షిభిః,
వివిధై ర్బహుసాహస్రైః పరిపూర్ణం సమన్తతః. 8

ప్ర. అ. దృశ్యైః=చూడదగిన, పరమోదారైః=చాల అందమైనవీ, వివిధైః=అనేకవిధము లైన, బహుసాహస్రైః=అనేకవేల సంఖ్యలో ఉన్న, తైస్తైః=ఆ యా,మృగపక్షిభిః=మృగములతోను, పక్షులతోను, సమన్తతః=అంతటా, పరిపూర్ణమ్=నిండి ఉన్న (భవనమును చూచెను).

తా. ఆ రావణభవనమునందు ఎటు చూచినను అనేకవిధములైన ఆ యా మృగములు, పక్షులు వేల కొలది ఉండెను. అందమైన ఆ మృగపక్ష్యాదులు చూచుటకు చాల ముచ్చట గొల్పునవై ఉండెను. 8

మూ. వినీతైరన్తపాలైశ్చ రక్షోభిశ్చ సురక్షితమ్,
ముఖ్యాభిశ్చ వరస్త్రీభిః పరిపూర్ణం సమన్తతః. 9

ప్ర. అ. వినీతైః=శిక్షితులూ, అన్తపాలైః=మధ్యభాగమును (లేదా సరిహద్దుప్రదేశములను) రక్షించువారూ అయిన,రక్షోభిః=రాక్షసులచేత, సురక్షితమ్=బాగుగా రక్షింపబడినదీ, ముఖ్యాభిః=ముఖ్యలైన, వరస్త్రీభిః=శ్రేష్ఠలైన స్త్రీలతో, సమన్తతః=అంతటా, పరిపూర్ణమ్=నిండినదీ అయిన భవనమును చూచెను.

తా. రక్షణాదికార్యములందు మంచి శిక్షణ పొందిన రాక్షసులు ఆ భవనప్రాంతమును అంతనూ రక్షించుచుండిరి. ఆ భవనము ముఖ్య లైన ఎందరో ఉత్తమస్త్రీలతో నిండి యుండెను. 9

మూ. ముదితప్రమదారత్నం రాక్షసేన్ద్రనివేశనమ్,
వరాభరణసంహ్రాదైః సముద్రస్వననిస్వనమ్. 10

ప్ర. అ. ముదితప్రమదారత్నమ్=ఆనందించిన స్త్రీరత్నములు కలదీ, రాక్షసేన్ద్రనివేశనమ్=రావణుని నివాస మైనదీ, వరాభరణసంహ్రాదైః=శ్రేష్ఠములైన ఆభరణముల ధ్వనులతో, సముద్రస్వననిస్వనమ్=సముద్రధ్వని వంటి ధ్వని కలదీ అయిన (ఆ భవనమును ప్రవేశించెను).

తా. రావణుని నివాసస్థానమైన ఆ గృహములో ఎందరో ఉత్తమస్త్రీలు ఆనందముతో నివసించుచుండిరి. సముద్రధ్వని వంటి ఉత్తమాలంకారముల ధ్వని ఆ భవనమునుండి వినవచ్చుచుండెను. 10

మూ. తద్రాజగుణసంపన్నం ముఖ్యైశ్చాగురుచన్దనైః,
మహాజనైః సమాకీర్ణం సింహైరివ మహద్వనమ్. 11

ప్ర. అ. రాజగుణసంపన్నమ్=రాజచిహ్నములతో కూడినదీ, ముఖ్యైః=శ్రేష్ఠమైన, అగరుచన్దనైః=అగరువులతోను చందనములతోను (కూడినదీ), సింహైః=సింహములతో వ్యాప్తమైన, మహత్ వనమివ=మహారణ్యము వలె, మహాజనైః=మహాజనులతో, సమాకీర్ణమ్=వ్యాప్తమూ అయిన (ఆ భవనమును చూచెను.)

తా. ఆ భవనములో అక్కడక్కడ ఛత్రచామరాది రాజచిహ్నములు కనబడుచుండెను. అది అతిశ్రేష్ఠములైన అగరుచందనాదుల సువాసనతో నిండియుండెను. మహాజనులతో (మాననీయులైనవారితో) నిండిన ఆ భవనము సింహములతో మహారణ్యము వలె శోభిల్లుచుండెను. 11

మూ. భేరీమృదఙ్గాభిరుతం శఙ్ఖఘోషనినాదితమ్,
నిత్యార్చితం పర్వహుతం పూజితం రాక్షసైః సదా. 12

ప్ర. అ. భేరీమృదఙ్గాభిరుతమ్=భేరీలచేతను మృదంగములచేతను ధ్వనింపచేయబడినదీ, శఙ్ఖఘోషనినాదితమ్=శంఖముల ధ్వనులచే ప్రతిధ్వనింపచేయబడినదీ,

నిత్యార్చితమ్=నిత్యము పూజింపబడినదీ, పర్వహుతమ్=పౌర్ణమి అమావాస్య మొద లైన పర్వములందు హోమములు చేయబడినదీ, సదా=ఎల్లప్పుడు, రాక్షసైః=రాక్షసులచేత, పూజితమ్=పూజింపబడినదీ, అయిన (భవనమును చూచెను).

తా. ఆ భవనము భేరీమృదంగధ్వనులతోను, శంఖనాదములతోను ప్రతిధ్వనించుచుండెను. ఆ భవనమునందు నిత్యార్చనలే కాక పూర్ణిమ, అమావాస్య మొదలైన పర్వములందు వివిధహోమములు కూడ జరుగుచుండెను. రాక్షసులందరూ నిత్యమూ, దానిని పూజించుచుందురు. 12

మూ. సముద్రమివ గమ్భీరం సముద్రమివ నిస్స్వనమ్,
మహాత్మనో మహద్వేశ్మ మహారత్నపరిచ్ఛదమ్. 13
మహారత్నసమాకీర్ణం దదర్శ స మహాకపిః.

ప్ర. అ. సముద్రమివ=సముద్రము వలె, గమ్భీరమ్=గంభీరమైనదీ, నిస్స్వనమ్=ధ్వనిలేని, సముద్రమివ=సముద్రమువలె ఉన్నదీ, మహారత్న పరిచ్ఛదమ్=మహారత్నములు పొదిగిన పై కప్పు కలదీ, మహారత్న సమాకీర్ణమ్=గొప్ప రత్నములతో వ్యాప్తమూ అయిన,మహాత్మనః=మహాత్ముడైన రావణునియొక్క, మహత్=గొప్పదైన, వేశ్మ=గృహమును, సః=ఆ, మహాకపిః=హనుమంతుడు, దదర్శ=చూచెను.

తా. ఆ భవనమధ్యభాగము సముద్రమధ్యము వలె గంభీరమై నిశ్శబ్దముగా ఉండెను. దాని పైకప్పునకు అనేకమహారత్నములు పొదిగి యుండెను. ఆ భవనము ఎక్కడ చూచినను మహారత్నములతో నిండి ఉండెను. మహాత్ముడైన రావణుని ఆ మహాభవనమును హనుమంతుడు చూచెను. 13

మూ. విరాజమానం వపుషా గజాశ్వరథసంకులమ్, 14
లఙ్కాభరణమిత్యేవ సోఽమన్యత మహాకపిః.
చచార హనుమాంస్తత్ర రావణస్య సమీపతః. 15

ప్ర. అ. వపుషా=ఆకారముతో, విరాజమానమ్=ప్రకాశించుచున్నదీ, గజాశ్వరథసంకులమ్=గజములతోను, అశ్వములతోను, రథములతోను, ఇరుకుగా ఉన్నదీ అయిన ఆ భవనమును, లఙ్కాభరణమ్ ఇత్యేవ=లంకకే ఆభరణ మని, సః=ఆ, మహాకపిః=హనుమంతుడు, అమన్యత=తలచెను. హనుమాన్=హనుమం తుడు, తత్ర=అక్కడ, రావణస్య=రావణునియొక్క, సమీపతః=సమీపమునందు, చచార=సంచరించెను.

తా. ఆకారమునందు అత్యద్భుతముగా ప్రకాశించుచు, గజాశ్వరథములతో కిక్కిరిసి ఉన్న ఆ రావణప్రాసాదము లంకకే అలంకార మని భావించుచు ఆ హనుమంతుడు రావణుని సమీపమున సంచరించెను. 14, 15

మూ. గృహాద్గృహం రాక్షసానాముద్యానాని చ సర్వశః,
వీక్షమాణో౽ప్యసంత్రస్తః ప్రాసాదాంశ్చ చచార సః. 16

ప్ర. అ. రాక్షసానామ్=రాక్షసులయొక్క, గృహాత్=గృహమునుండి, గృహమ్=గృహమును, ఉద్యానాని చ=ఉద్యానములను, సర్వశః=నలువైపుల, వీక్షమాణః అపి=చూచుచు, అసంత్రస్తః=భయపడనివాడై, ప్రాసాదాంశ్చ=ప్రాసాదములను కూడ, చచార=సంచరించెను.

తా. ఒక గృహమునుండి మరి యొక గృహమునకు వెళ్లుచు రాక్షసులగృహము లన్నీ చూచుచు, ఉద్యానములను కూడ నలు వైపుల చూచుచు ఏ మాత్రము భయము లేని వాడై, ప్రాసాదములను (ధనికుల మహాభవనములను కూడ చూచుచు సంచరించెను). 16

మూ. అవప్లుత్య మహావేగః ప్రహస్తస్య నివేశనమ్,
తతో౽న్యత్పుప్లువే వేశ్మ మహాపార్శ్వస్య వీర్యవాన్. 17

ప్ర. అ. మహావీర్యః=గొప్ప పరాక్రమము గల వాడూ, మహావేగః=మహా వేగము గల వాడూ అయిన హనుమంతుడు, ప్రహస్తస్య=ప్రహస్తుని యొక్క, నివేశనమ్=గృహమును గూర్చి, అవప్లుత్య=దుమికి, తతః=అక్కడినుండి,మహాపార్శ్వస్య=మహాపార్శ్వునియొక్క, అన్యత్=మరియొక్క, వేశ్మ=గృహమును గూర్చి, పుప్లువే=దుమికెను.

తా. పరాక్రమశాలి యైన హనుమంతుడు మహావేగవంతు డై, ముందుగా ప్రహస్తుని గృహముమీదికి దుమికి, అక్కడినుండి మహాపార్శ్వుని ప్రాసాదము మీదికి దుమికెను. 17

మూ. అథ మేఘప్రతీకాశం కుమ్భకర్ణనివేశనమ్,
విభీషణస్య చ తథా పుప్లువే స మహాకపిః. 18

ప్ర. అ. అథ=అటు పిమ్మట, సః=ఆ, మహాకపిః=హనుమంతుడు, మేఘప్రతీకాశమ్=మేఘముతో సమానమైన, కుమ్భకర్ణనివేశనమ్=కుంభకర్ణుని గృహమును గూర్చి, తథా=మరియు, విభీషణస్య=విభీషణునియొక్క గృహమును గూర్చి,పుప్లువే=ఎగిరెను.

తా. పిమ్మట ఆ హనుమంతుడు మేఘముతో సమానమైన కుంభకర్ణుని గృహము మీదకు, విభీషణుని గృహముమీదకు దుమికెను. 18

మూ. మహోదరస్య చ తథా విరూపాక్షస్య చైవ హి,
విద్యుజ్జిహ్వస్య భవనం విద్యున్మాలేస్తథైవ చ, 19
వజ్రదంష్ట్రస్య చ తథా పుప్లువే స మహాకపిః.

ప్ర. అ. సః=ఆ, మహాకపిః=హనుమంతుడు, మహోదరస్య=మహోదరునియొక్క, తథా=అట్లే, విరూపాక్షస్య చైవ హి=విరూపాక్షునియొక్క, విద్యుజ్జిహ్వస్య=విద్యుజ్జిహ్వునియొక్క, తథైవ చ=అట్లే, విద్యున్మాలేః=విద్యున్మాలి యొక్క, తథైవ=అట్లే, వజ్రదంష్ట్రస్య=వజ్రదంష్ట్రునియొక్క, భవనమ్=భవనమును గూర్చి, పుప్లువే=ఎగిరెను.

తా. హనుమంతుడు క్రమముగా మహోదరుడు, విరూపాక్షుడు విద్యుజ్జిహ్వుడు, విద్యున్మాలి, వజ్రదంష్ట్రుడు అను రాక్షసుల భవనములమీదకు దుమికెను. 19

మూ. శుకస్య చ మహాతేజాః సారణస్య చ ధీమతః, 20
తథా చేన్ద్రజితో వేశ్మ జగామ హరియూథపః.

ప్ర. అ. మహాతేజాః=గొప్ప తేజస్సు గల, హరియూథపః=వానరసైన్య పాలకుడైన హనుమంతుడు, శుకస్య=శుకునియొక్క, ధీమతః=బుద్ధిమంతు డైన, సారణస్య=సారణునియొక్క, తథా=అట్లే, ఇన్ద్రజితః=ఇంద్రజిత్తుయొక్క, వేశ్మ=గృహమును గూర్చి, జగామ=వెళ్లెను.

తా. తేజఃశాలీ, వానరసైన్యపాలకుడూ అయిన హనుమంతుడు, శుకుని గృహమునకు, బుద్ధిమంతు డైన సారణుని గృహమునకు, ఇంద్రజిత్తు గృహమునకు కూడ వెళ్లెను. 20

మూ. జమ్బుమాలేః సుమాలేశ్చ జగామ హరిసత్తమః. 21
రశ్మికేతోశ్చ భవనం సూర్యకేతోస్తథైవ చ,
వజ్రకాయస్య చ తథా పుప్లువే స మహాకపిః. 22

ప్ర. అ. హరిసత్తమః=ఆ వానరశ్రేష్ఠుడు, జమ్బుమాలేః=జంబుమాలి యొక్క గృహమును గూర్చి, సుమాలేశ్చ=సుమాలి గృహమును గూర్చి, జగామ=వెళ్ళెను. సః=ఆ, మహాకపిః=హనుమంతుడు, రశ్మికేతోః=రశ్మికేతువు యొక్కా, తథైవ చ=అట్లే, సూర్యకేతోః=సూర్యకేతువుయొక్కా, తథా=అట్లు, వజ్రకాయస్య=వజ్రకాయునియొక్కా, భవనమ్=భవనమును గూర్చి, పుప్లువే=ఎగిరెను.

తా. వానర శ్రేష్ఠు డైన ఆ హనుమంతుడు - జంబుమాలి, సుమాలి, రశ్మికేతువు, సూర్యకేతువు, వజ్రకాయుడు అను రాక్షసుల గృహముల మీదికి కూడ దుమికి అక్కడ అన్వేషించెను. 21, 22

మూ. ధూమ్రాక్షస్య చ సంపాతేర్భవనం మారుతాత్మజః,
విద్యుద్రూపస్య భీమస్య ఘనస్య విఘనస్య చ. 23
శుకనాసస్య వక్రస్య శఠస్య వికటస్య చ,
బ్రహ్మకర్ణస్య దంష్ట్రస్య రోమశస్య చ రక్షసః. 24
యుద్ధోన్మత్తస్య మత్తస్య ధ్వజగ్రీవస్య నాదినః,
విద్యుజ్జిహ్వేన్ద్రజిహ్వానాం తథా హస్తిముఖస్య చ. 25
కరాళస్య పిశాచస్య శోణితాక్షస్య చైవ హి.

ప్ర. అ. మారుతాత్మజః=హనుమంతుడు, ధూమ్రాక్షస్య=ధూమ్రాక్షుని యొక్క, సంపాతేః=సంపాతియొక్క, విద్యుద్రూపస్య=విద్యుద్రూపుని యొక్క, భీమస్య=భీమునియొక్క, ఘనస్య=ఘనునియొక్క, విఘనస్య చ=విఘనునియొక్క, శుకనాసస్య=శుకనాసుని యొక్క, వక్రస్య=వక్రుని యొక్క, శఠస్య=శఠునియొక్క, వికటస్య చ=వికటునియొక్క, బ్రహ్మకర్ణస్య=బ్రహ్మకర్ణునియొక్క, దంష్ట్రస్య=దంష్ట్రునియొక్క, రోమశస్య=రోమశుడను, రక్షసః=రాక్షసునియొక్క, యుద్ధోన్మత్తస్య=యుద్ధోన్మత్తుని యొక్క, మత్తస్య=మత్తునియొక్క, ధ్వజగ్రీవస్య=ధ్వజగ్రీవునియొక్క, నాదినః=నాదియొక్క, విద్యుజ్జిహ్వేన్ద్రజిహ్వానామ్=విద్యుజ్జిహ్వులయొక్క, ఇంద్రజిహ్వులయొక్క, తథా=అట్లే, హస్తిముఖస్య చ=హస్తిముఖుని యొక్క, కరాళస్య=కరాళునియొక్క, పిశాచస్య=పిశాచునియొక్క, శోణితాక్షస్య చైవ హి=శోణితాక్షుని యొక్క, భవనమ్=భవనమును గూర్చి, (దుమికెను).

తా. ధూమ్రాక్షుడు, సంపాతి, విద్యుద్రూపుడు, భీముడు, ఘనుడు, విఘనుడు, శుకనాసుడు, వక్రుడు, శఠుడు, వికటుడు, బ్రహ్మకర్ణుడు, దంష్ట్రుడు, రోమశుడు, యుద్ధోన్మత్తుడు, మత్తుడు, ధ్వజగ్రీవుడు, నాది, విద్యుజ్జిహ్వులు, ఇంద్రజిహ్వులు, హస్తిముఖుడు, కరాళుడు, పిశాచుడు, శోణితాక్షుడు అను రాక్షసుల గృహముల పైకి గూడ హనుమంతుడు దుమికెను. 23 - 25

మూ. క్రమమాణః క్రమేణైవ హనుమాన్మారుతాత్మజః; 26
తేషు తేషు మహార్హేషు భవనేషు మహాయశాః,
తేషామృద్ధిమతామృద్ధిం దదర్శ స మహాకపిః. 27

ప్ర. అ. మారుతాత్మజః=వాయుపుత్రుడూ, మహాయశాః=గొప్ప కీర్తి కలవాడూ, మహాకపిః=వానరులలో గొప్పవాడూ అయిన, సః హనుమాన్=ఆ హనుమంతుడు, మహార్హేషు=శ్రేష్ఠము లైన, తేషు తేషు=ఆ యా, భవనేషు=భవనములలో, క్రమేణైవ=క్రమముతో, క్రమమాణః=సంచరించుచు, బుద్ధిమతామ్=ఐశ్వర్యవంతులైన, తేషామ్=ఆ రాక్షసులయొక్క, ఋద్ధిమ్=ఐశ్వర్యమును, దదర్శ=చూచెను.

తా. వానరశ్రేష్ఠుడూ, మహాకీర్తిశాలీ, వాయుపుత్రుడూ అయిన ఆ హనుమంతుడు ఆ యా భవనములను అన్నింటినీ వరుసగా వెదకుచు, ఐశ్వర్యవంతులైన ఆ యా రాక్షసుల సమృద్ధిని చూచెను. 26, 27

మూ. సర్వేషాం సమతిక్రమ్య భవనాని సమన్తతః,
ఆససాదాథ లక్ష్మీవాన్ రాక్షసేన్ద్రనివేశనమ్. 28

ప్ర. అ. లక్ష్మీవాన్=శోభావంతుడైన హనుమంతుడు, సమన్తతః=నలువైపులున్న, సర్వేషామ్=అందరి, భవనాని=భవనములను, సమతిక్రమ్య=దాటి, అథ=అటుపిమ్మట, రాక్షసేన్ద్రనివేశనమ్=రావణుని గృహమును, ఆససాద=సమీపించెను.

తా. శోభాయుక్తుడైన హనుమంతుడు, రావణుని భవనమునకు నలుప్రక్కలా ఉన్న ప్రహస్తాదుల గృహములను దాటి, పిమ్మట రావణుని భవనము చేరెను. 28

మూ. రావణస్యోపశాయిన్యో దదర్శ హరిసత్తమః,
విచరన్హరిశార్దూలో రాక్షసీర్వికృతేక్షణాః, 29
శూలముద్గరహస్తాశ్చ శక్తితోమరధారిణీః.

ప్ర. అ. హరిశార్దూలః=వానరులలో శార్దూలము వంటివాడూ, హరిసత్తమః=వానరశ్రేష్ఠుడూ, అయిన హనుమంతుడు, విచరన్=సంచరించుచు, రావణస్య=రావణునికి, ఉపశాయిన్యః=సమీపమునందు శయనించి ఉన్నవారూ, వికృతేక్షణాః=వికృతములైన నేత్రములు కలవారూ, శూలముద్గరహస్తాశ్చ=శూలములు, ముద్గరములు హస్తములందు గలవారూ, శక్తితోమరధారిణీః=శక్తులను, తోమరములను ధరించినవారూ అయిన, రాక్షసీః=రాక్షసస్త్రీలను, దదర్శ=చూచెను.

తా. వానరశ్రేష్ఠుడైన ఆ హనుమంతుడు అచట సంచరించుచు రావణుని సమీపమున శయనించి ఉన్న, భయంకర మైన నేత్రములు గల

రాక్షసస్త్రీలను చూచెను. అతని అంగరక్షకులైన ఆ రాక్షసస్త్రీలు, శూలములు, ముద్గరములు, శక్తులు, తోమరములు మొదలైన ఆయుధములను ధరించి ఉండిరి.

మూ. దదర్శ వివిధాన్ గుల్మాన్ తస్య రక్షఃపతేర్గృహే, 30
రాక్షసాంశ్చ మహాకాయాన్నానాప్రహరణోద్యతాన్.

ప్ర. అ. తస్య=ఆ, రక్షఃపతేః=రాక్షసాధిపతియొక్క, గృహే=గృహమునందు, వివిధాన్=అనేకవిధము లైన, గుల్మాన్=సేనావిభాగములను, మహాకాయాన్=పెద్ద దేహములు కలవారూ, నానాప్రహరణోద్యతాన్=ఎత్తబడిన అనేక విధము లైన ఆయుధములు గలవారూ అయిన, రాక్షసాంశ్చ=రాక్షసులను కూడ, దదర్శ=చూచెను.

తా. హనుమంతుడు ఆ రావణుని భవనమునందు అనేకవిధము లైన సైనికుల గుల్మములను (సేనా విభాగములను), అనేక విధము లైన ఆయుధములను ప్రయోగించుటకు సిద్ధముగా ఉంచుకొనిన, పెద్ద పెద్ద దేహములు గల రాక్షసులను చూచెను. 30

మూ. రక్తాన్ శ్వేతాన్ సితాంశ్చైవ హరీంశ్చాపి మహాజవాన్,
కులీనాన్ రూపసంపన్నాన్ గజాన్పరగజారుజాన్.
నిష్ఠితాన్ గజశిక్షాయామైరావతసమాన్యుధి. 32
నిహన్తౄన్ పరసైన్యానాం గృహే తస్మిన్ దదర్శ సః,
క్షరతశ్చ యథా మేఘాన్ స్రవతశ్చ యథా గిరీన్, 33
మేఘస్తనితనిర్ఘోషాన్ దుర్ధర్షాన్ సమరే పరైః.

ప్ర. అ. సః=ఆ హనుమంతుడు, తస్మిన్=ఆ, గృహే=గృహమునందు, రక్తాన్=ఎఱ్ఱనివీ, శ్వేతాన్=తెల్లనివీ, సితాంశ్చైవ=కొంచెము తెల్లనివీ, మహాజవాన్=గొప్ప వేగము గలవీ అయిన, హరీంశ్చాపి=గుఱ్ఱములనూ, కులీనాన్=మంచి జాతియందు పుట్టినవీ, రూపసంపన్నాన్=రూపముతో కూడినవీ, పరగజారుజాన్=శత్రుగజములను పీడించునవీ, గజశిక్షయామ్=గజశిక్షయందు, నిష్ఠితాన్=మంచి జ్ఞానము గలవీ, ఐరావతసమాన్=ఐరావతముతో సమానమైనవీ, యుధి=యుద్ధమునందు, పరసైన్యానామ్=శత్రుసైన్యములకు, నిహన్తౄన్=సంహారకరము లైనవీ, క్షరతః=మదోదకమును స్రవించుచున్నవీ, మేఘాన్ యథా=వర్షించుచున్న మేఘములవలె ఉన్నవీ, స్రవతః=జలము స్రవించుచున్న, గిరీన్ యథా=పర్వతముల వలె ఉన్నవీ, మేఘస్తనితనిర్ఘోషాన్=మేఘముల ఉరుముల వంటి ఘీంకారములు కలవీ, సమరే=యుద్ధమునందు, పరైః=శత్రువులచేత, దుర్ధర్షాన్=ఎదిరింప శక్యము కానివీ అయిన, గజాన్=ఏనుగులనూ, దదర్శ=చూచెను.

తా. హనుమంతుడు ఆ గృహమునందు మహావేగము గల గుఱ్ఱములను చూచెను. వాటిలో కొన్ని ఎఱ్ఱగాను, కొన్ని చాల తెల్లగాను, కొన్ని కొంచెము తెల్లగాను ఉండెను. అట్లే ఆతడక్కడ మంచి శిక్షణ పొందిన ఐరావతము వంటి గజములను కూడ చూచెను. ఉత్తమజాతికి చెందిన ఆ గజములు మంచి ఆకారములతో శత్రుగజములకు పీడ కలిగించునవిగా ఉండెను. పరుల సైన్యములను సంహరింపగల సామర్థ్యము గలవి, నిరంతరము మదోదకము స్రవించు ఆ గజములు వర్షించు మేఘముల వలె, జలపాతములతో గూడిన పర్వతముల వలె ఉండెను. మేఘముల ఉరుములవంటి ఘీంకారము గల వాటిని యుద్ధరంగములో శత్రువులెవ్వరూ ఎదిరింపజాలరు. 31 - 33

మూ. సహస్రం వాహినీస్తత్ర జామ్బూనదపరిష్కృతాః, 34
హేమజాలపరిచ్ఛన్నాస్తరుణాదిత్యసన్నిభాః,
దదర్శ రాక్షసేన్ద్రస్య రావణస్య నివేశనే. 35

ప్ర. అ. తత్ర=అక్కడ, రాక్షసేన్ద్రస్య=రాక్షసరాజైన, రావణస్య=రావణునియొక్క, నివేశనే=గృహమునందు, జామ్బూనదపరిష్కృతాః=బంగారముచేత అలంకరింపబడినవీ, హేమజాలపరిచ్ఛన్నాః=బంగారము రాసులచే కప్పబడినవీ, తరుణాదిత్యసన్నిభాః=బాగా పైకి వచ్చిన సూర్యునితో సమానమైనవీ అయిన, సహస్రమ్=వేలకొలది, వాహినీః=సేనావిభాగములను, దదర్శ=చూచెను.

తా. హనుమంతుడు అక్కడ రావణగృహమునందు, ముదిరిన సూర్యుని వలె ప్రకాశించుచున్న వెయ్యి సేనావిభాగములను చూచెను. అవన్నియు బంగారముతో కప్పి అలంకరింపబడి ఉండెను.

తా. 'వాహిని' అనగా ఒక సేనావిభాగము. వాహినిలో 81 ఏనుగులు, 81 రథములు, 243 గుఱ్ఱములు, 405 కాలి బంటులు ఉందురు. 34, 35

మూ. శిబికా వివిధాకారాః స కపిర్మారుతాత్మజః,
లతాగృహాణి చాన్యాని చిత్రాశాలాగృహాణి చ. 36
క్రీడాగృహాణి చాన్యాని దారుపర్వతకానపి,
కామస్య గృహకం రమ్యం దివాగృహకమేవ చ. 37
దదర్శ రాక్షసేన్ద్రస్య రావణస్య నివేశనే.

ప్ర. అ. మారుతాత్మజః=వాయుదేవుని పుత్రుడైన, సః కపిః=ఆ హనుమంతుడు, రాక్షసేన్ద్రస్య=రాక్షసరాజైన, రావణస్య=రావణునియొక్క, నివేశనే=గృ

హముననందు, వివిధాకారాః=అనేకవిధములైన ఆకారములు గల శిబికాః=పల్లకీలను, చిత్రాణి=ఆశ్చర్యకరము లైన, లతాగృహాణి=లతాగృహములను (తీగలతో అల్లిన గృహములను), చిత్రశాలాగృహాణి=చిత్రశాలల గృహములను (గోడలపై వివిధ వర్ణచిత్రములు నిర్మించిన గృహములను), అన్యాని=ఇతరము లైన, క్రీడాగృహాణి=క్రీడార్థమై నిర్మించిన గృహములను, దారుపర్వతకానపి=కఱ్ఱతో నిర్మించిన చిన్న పర్వతములను, కామస్య=మన్మథుని, గృహకమ్=గృహమును (మన్మథక్రీడల కుప యోగించు శయ్యాగారమును), రమ్యమ్=సుందరమైన, దివాగృహకమేవ చ=పగటి సమయమును గడపు గృహమును, దదర్శ=చూచెను.

తా. వాయుపుత్రుడైన ఆ హనుమంతుడు రాక్షసేంద్రుడైన రావణుని భవనములో అనేక విధములైన ఆకారములు గల పల్లకీలను, విచిత్రము లైన లతాగృహములను, చిత్రశాలలను, ఇతరమైన క్రీడాగృహములను, కఱ్ఱతో నిర్మించిన చిన్న పర్వతములను, కామోపభోగములు అనుభవించు గృహమును, పగటిభాగమును గడపు సుందరమైన గృహమును చూచెను. 36, 37

మూ. స మన్దరగిరిప్రఖ్యం మయూరస్థానసంకులమ్, 38
ధ్వజయష్టిభిరాకీర్ణం దదర్శ భవనోత్తమమ్,
అనేకరత్నసంకీర్ణం నిధిజాలం సమన్తతః, 39
ధీరనిష్ఠితకర్మాన్తం గృహం భూతపతేరివ.

ప్ర. అ. సః=ఆ హనుమంతుడు, మన్దరగిరిప్రఖ్యమ్=మందరపర్వతముతో సమానమూ, మయూరస్థానసంకులమ్=నెమళ్ల నివాసస్థానములతో వ్యాకులముగా నున్నదీ, ధ్వజయష్టిభిః=ధ్వజములచేత, ఆకీర్ణమ్=వ్యాప్తమూ, ధీరనిష్ఠితకర్మాన్తమ్=ధీరులచేత అధిష్ఠింపబడిన కార్యనిర్వహణము గలదీ, భూతపతేః=కుబేరునియొక్క, గృహమివ=గృహమువలె ఉన్నదీ అయిన, భవనోత్తమమ్=శ్రేష్ఠమైన భవనమును, సమన్తతః=అంతటను, అనేకరత్నసంకీర్ణమ్=అనేకమైన రత్నములతో నిండిన, నిధి జాలమ్=నిధుల సముదాయమును, దదర్శ=చూచెను.

తా. మందరపర్వతము వలె, కుబేరభవనము వలె, ఉన్న ఆ రావణ భవనము నెమళ్లు నివసించు ప్రదేశములతో వ్యాకులమై, ధ్వజముల దండములతో నిండి ఉండెను. ఆ భవనమునందు,ఎక్కడ చూచిన అనేక రత్నములతో నిండిన అనేక నిధులుండెను. అక్కడ సమర్థులైన పురుషులు ఆ యా కార్యముల నిర్వహణమును పర్యవేక్షించుచుండిరి. 38, 39

మూ. అర్చిర్భిశ్చాపి రత్నానాం తేజసా రావణస్య చ, 40
విరరాజాథ తద్వేశ్మ రశ్మిమానివ రశ్మిభిః.

ప్ర. అ. తత్=ఆ, వేశ్మ=భవనము, రత్నానామ్=రత్నముల యొక్క, అర్చి ర్భిశ్చాపి=కిరణములతోను, రావణస్య=రావణునియొక్క, తేజసా చ=తేజస్సుచేతను, రశ్మిభిః=కిరణములతో, రశ్మిమానివ=సూర్యుడు వలె, విరరాజ=ప్రకాశించెను.

తా. ఆ భవనము రత్నముల కిరణముల చేతను, రావణుని తేజస్సు చేతను కిరణములతో సూర్యుడు ప్రకాశించునట్లు ప్రకాశించెను. 40

మూ. జామ్బూనదమయాన్యేవ శయనాన్యాసనాని చ, 41
భాజనాని చ ముఖ్యాని దదర్శ హరియూథపః.

ప్ర. అ. హరియూథపః=వానరసైన్యసంరక్షకు డైన హనుమంతుడు, జామ్బూనదమయాన్యేవ=బంగారముతోనే చేయబడిన, శయనాని=శయనములను, ఆసనాని చ=ఆసనములను, ముఖ్యాని=ముఖ్యములైన, భాజనాని=పాత్రలను, దదర్శ=చూచెను.

తా. అక్కడ హనుమంతుడు చూచిన శయనములు, ఆసనములు, ప్రధానమైన పాత్రలూ కూడ బంగారముతోనే చేయబడినవి. 41

మూ. మధ్వాసవకృతక్లేదం మణిభాజనసంకులమ్, 42
మనోరమమసంబాధం కుబేరభవనం యథా,
నూపురాణాం చ ఘోషేణ కాఞ్చీనాం నినదేన చ, 43
మృదఙ్గతలఘోషైశ్చ ఘోషవద్భిర్వినాదితమ్,
ప్రాసాదసంఘాతయుతం స్త్రీరత్నశతసంకులమ్, 44
సువ్యూఢకక్ష్యం హనుమాన్ ప్రవివేశ మహాగృహమ్.

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే సున్దరకాణ్డే
షష్ఠః సర్గః.

ప్ర. అ. మధ్వాసవకృతక్లేదమ్=తేనెతో తయారుచేసిన మద్యముచేత చేయబడిన తడుపుట గలదీ, మణిభాజనసంకులమ్=మాణక్యపాత్రలతో వ్యాకులముగా నున్నదీ, మనోరమమ్=మనోహరమైనదీ, అసంబాధమ్=ఇరుకు లేనిదీ, కుబేరభ వనం యథా=కుబేరభవనమువలె ఉన్నదీ, నూపురాణామ్=నూపురములయొక్క, ఘోషేణ=ధ్వనిచేతను, కాఞ్చీనామ్=వడ్డాణముల యొక్క, నినదేన=ధ్వనిచేతను,

ఘోషవద్భిః=గంభీరమైన నాదము గల, మృదజ్గతల ఘోషైశ్చ=మృదంగములకూ అర చేతులకూ కలిగిన రాపిడిచే పుట్టిన ధ్వనుల చేతనూ, నినాదితమ్=ధ్వనింపచేయబడినదీ, ప్రాసాదసంఘాతయుతమ్=ప్రాసాదముల సముదాయముతో కూడినదీ, స్త్రీరత్నశతసంకులమ్=వందలమంది ఉత్తమస్త్రీలతో నిండియున్నదీ, సువ్యూఢకక్ష్యమ్=బాగుగా ఏర్పరుపబడిన ఆ యా వాకిళ్లు గలదీ అయిన, మహాగృహమ్=మహాగృహమును, ప్రవివేశ=ప్రవేశించెను.

తా. రావణుని మహాభవనములో నిరంతరము తేనెతో చేసిన ఆసవము పానము జరుగుచుండెను. ఎక్కడ చూచిననూ మాణిక్యములు పొదిగిన పాత్రలు కనబడుచుండెను. విశాలమై మనోహరముగా ఉన్న ఆ భవనము కుబేర భవనము వలె ఉండెను. అందెళ్ళ మ్రోతలతోను, వడ్డాణముల చిరుచప్పుళ్లతోను, మృదంగములను అరచేతులతో ఒరయగా పుట్టిన గంభీర మైన నాదములతోను ప్రతిధ్వనించుచుండెను. వందలకొలది స్త్రీలు నివసించుచున్న ఆ మహాభవనము చుట్టును ఎన్నో ప్రాసాదములు ఉండెను. దానిలోని వేరువేరు శాలలు, గదులు వాకిళ్లు చక్కగా అమర్చబడిఉండెను. అట్టి మహాగృహములోనికి హనుమంతుడు ప్రవేశించెను. 42, 43, 44

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు
సుందరకాండలో ఆరవసర్గ సమాప్తము.

అథ సప్తమః సర్గః

[రావణభవన పుష్పకవిమానముల వర్ణనము]

మూ. స వేశ్మజాలం బలవాన్ దదర్శ
వ్యాసక్తవైడూర్యసువర్ణజాలమ్,
యథా మహత్ ప్రావృషి మేఘజాలం
విద్యుత్పినద్ధం సవిహఙ్గజాలమ్. 1

ప్ర. అ. బలవాన్=బలవంతుడైన, సః=ఆ హనుమంతుడు, వ్యాసక్తవైడూర్యసువర్ణజాలమ్=సంబంధించిన వైడూర్యసువర్ణవికారములైన కిటికీలు కలదీ, ప్రావృషి=వర్షాకాలమునందు, విద్యుత్పినద్ధమ్=మెరుపులచేత కట్టబడినదీ, సవిహఙ్గజాలమ్=(వర్షమునకై ఎదురుచూచుచు ఎగురుచున్న) పక్షుల సముదాయము గలదీ అయిన, మహత్=గొప్ప, మేఘజాలం యథా=మేఘసముదాయము వలె ఉన్న, వేశ్మజాలమ్=గృహముల సముదాయమును, దదర్శ=చూచెను.

తా. ఆ మహాభవనములోని గృహములన్నింటికి వైడూర్యమణులు పొదిగిన బంగారుకిటికీలు అమర్చి ఉండుటచే, అవి వర్షాకాలములో మెరుపులతో నిండి, క్రింద పక్షులు ఎగురుచున్న మేఘముల వలె ఉండెను. అట్టి గృహ సముదాయమును హనుమంతుడు చూచెను. 1

మూ. నివేశనానాం వివిధాశ్చ శాలాః
ప్రధానశఙ్ఖాయుధచాపశాలాః,
మనోహరాశ్చాపి పునర్విశాలాః
దదర్శ వేశ్మాద్రిషు చన్ద్రశాలాః. 2

ప్ర. అ. నివేశనానామ్=గృహములయొక్క, వివిధాః=అనేకవిధములైన, శాలాః=శాలలను, ప్రధానశఙ్ఖాయుధచాపశాలాః=ప్రధానమైన శంఖశాలలను, ఆయుధశాలలను, పునః=మరియు, వేశ్మాద్రిషు=పర్వతముల వంటి గృహముల మీద, మనోహరాః=మనోహరములైన, విశాలాః=విశాలములైన, చన్ద్రశాలాః=చంద్రశాలలను (డాబాలను), దదర్శ=చూచెను.

తా. హనుమంతుడు ఆ గృహములలో అనేకవిధములైన శాలలను, ప్రధానములైన శంఖశాలలను, ఆయుధశాలలను, పర్వతములవలె ఉన్నతము లైన గృహములపైన మనోహరములు, విశాలములు అయిన శాలలను చూచెను. 2

మూ. గృహాణి నానావసురాజితాని
దేవాసురైశ్చాపి సుపూజితాని,
సర్వైశ్చ దోషైః పరివర్జితాని
కపిర్దదర్శ స్వబలార్జితాని. 3

ప్ర. అ. కపిః=హనుమంతుడు, నానావసురాజితాని=అనేకవిధములైన ధనములచే ప్రకాశింపచేయబడినవీ, దేవాసురైశ్చాపి=దేవతలచేతను, అసురులచేతను కూడ, సుపూజితాని=బాగుగా పూజింపబడినవీ, సర్వైః=సమస్తమైన, దోషైః=దోషములచేత, పరివర్జితాని=విడువబడినవీ, స్వబలార్జితాని=(రాక్షసులచే) స్వీయబలముచేత సంపాదింపబడినవీ అయిన, గృహాణి=గృహములను, దదర్శ=చూచెను.

తా. అక్కడ హనుమంతుడు చూచిన గృహము లన్నీ రాక్షసులు స్వబలముచే సంపాదించినవి. అవి బహువిధములైన ధనములో ప్రకాశించుచుండెను. దేవతలు, అసురులు కూడ పూజించుటకు తగినవి. ఆ గృహములలో దోషము లేవియు లేవు. 3

మూ. తాని ప్రయత్నాభిసమాహితాని
మయేన సాక్షాదివ నిర్మితాని,
మహీతలే సర్వగుణోత్తరాణి
దదర్శ లఙ్కాధిపతేర్గృహాణి. 4

ప్ర. అ. ప్రయత్నాభిసమాహితాని=ప్రయత్నపూర్వకముగా నిర్మింపబడినవీ, సాక్షాత్=సాక్షాత్తూ, మయేన=మయునిచేత, నిర్మితానీవ=నిర్మింపబడినవా అన్నట్లున్నవీ, మహీతలే=భూలోకమునందు, సర్వగుణోత్తరాణి=సమస్తమైన గుణములతో శ్రేష్ఠమైనవీ అయిన, లఙ్కాధిపతేః=రావణుని యొక్క,తాని గృహాణి=ఆ గృహములను, దదర్శ=చూచెను.

తా. ఆ రావణుని గృహములు, ప్రయత్నపూర్వకముగ నిర్మింపబడుటచే సాక్షాత్తు మయునిచే నిర్మింపబడినవా అన్నట్లు, భూలోకములో సకలగుణములతో శ్రేష్ఠములుగా ఉండెను. 4

మూ. తతో దదర్శోచ్ఛ్రితమేఘరూపం
మనోహరం కాఞ్చనచారురూపమ్,

రక్షోధిపస్యాత్మబలానురూపం
గృహోత్తమం హ్యప్రతిరూపరూపమ్. 5

ప్ర. అ. తతః=అటుపిమ్మట, ఉచ్ఛ్రితమేఘరూపమ్=ఉన్నతమైన మేఘము వంటి రూపముకలదీ, మనోహరమ్=మనోహరమైనదీ, కాఞ్చనచారురూపమ్=బంగారముతో అందమైన రూపము గలదీ, అప్రతిరూపరూపమ్=సాటిలేని రూపము గలదీ, ఆత్మబలానురూపమ్=తన (రావణుని) బలమునకు అనురూపముగా ఉన్నదీ అయిన, రక్షోధిపస్య=రాక్షసాధీశునియొక్క, గృహోత్తమమ్=శ్రేష్ఠమైన గృహమును, దదర్శ=చూచెను.

తా. పిమ్మట, హనుమంతుడు, రావణుని ఉత్తమగృహమును చూచెను. అది ఆతని బలమునకు తగు విధముగ సాటిలేనిదిగా ఉండెను. ఉన్నత మైన మేఘము వలె కనబడుచుండెను. బంగారపు నగిషీలు మొదలైనవాటితో చాల మనోహరముగా ఉండెను. 5

మూ. మహీతలే స్వర్గమివ ప్రకీర్ణం
శ్రియా జ్వలన్తం బహురత్నకీర్ణమ్,
నానాతరూణాం కుసుమావకీర్ణం
గిరేరివాగ్రం రజసావకీర్ణమ్. 6

ప్ర. అ. మహీతలే=భూతలమునందు, ప్రకీర్ణమ్=పడవేయబడిన, స్వర్గమివ=స్వర్గము వలె ఉన్నదీ, శ్రియా=శోభతో, జ్వలన్తమ్=ప్రజ్వలించుచున్నదీ, బహురత్నకీర్ణమ్=అనేకములైన రత్నములతో వ్యాప్తమైనదీ, నానాతరూణామ్=అనేకవిధములైన వృక్షములయొక్క, కుసుమావకీర్ణమ్=పుష్పములచేత కప్పబడినదీ, రజసా=పరాగముచేత, అవకీర్ణమ్=చిమ్మబడిన (కప్పబడిన), గిరేః=పర్వతముయొక్క, అగ్రమివ=శిఖరమువలె ఉన్నదీ అయిన, (8వ శ్లోకములోని "విమానరత్నం దదర్శ" అనుదానితో అన్వయము.) శ్రేష్ఠమైన విమానమును చూచెను.

తా. హనుమంతుడక్కడ ఒక్క శ్రేష్ఠమైన విమానమును చూచెను. అది భూలోకములోనికి జారిపడిన స్వర్గము వలె ఉండెను. అనేక రత్నములతో నిండి శోభతో ప్రజ్వరిల్లుచుండెను. అనేకవిధములైన వృక్షముల పుష్పములు దానిపై చల్లబడి యుండుటచే అది పరాగముచేత కప్పబడిన పర్వతశిఖరము వలె ప్రకాశించుచుండెను. 6

మూ. నారీప్రవేకైరివ దీప్యమానం
తటిద్భిరమ్భోదవదర్చ్యమానమ్,

హంసప్రవేకైరివ వాహ్యమానం
శ్రియా యుతం ఖే సుకృతాం విమానమ్. 7

ప్ర. అ. నారీప్రవేకైః=అత్యుత్తమస్త్రీలతో, దీప్యమానమివ=ప్రకాశింపచేయబడుచున్నదీ, తటిద్భిః=మెరుపులతో, అమ్భోదవత్=మేఘము వలె, అర్చ్యమానమ్=పూజింపబడుచున్నదీ (అలంకరింపబడినదీ), హంసప్రవేకైః=శ్రేష్ఠ మైన హంసలచేత, వాహ్యమానమ్ ఇవ=మోయబడుచున్నది వలె ఉన్నదీ, శ్రియా=శోభతో, యుతమ్=కూడినదీ, ఖే=ఆకాశమునందు, సుకృతామ్=పుణ్యాత్ములయొక్క, విమానమ్=ఉత్తమగృహము వలె ఉన్నదీ (అయిన విమాన రత్నమును చూచెను).

తా. ఉత్తమస్త్రీలతో ప్రకాశించుచున్న ఆ విమానరత్నము, మెరుపులచే అలంకరించబడిన మేఘము వలె ఉండెను. హంసలు మోయుచున్నాయా అన్నట్లు ఆకాశముమీద తేలియాడుచుండెను. ఆకాశముపై ఉన్న పుణ్యాత్ముల విమానము వలె శోభించుచుండెను. 7

మూ. యథా నగాగ్రం బహుధాతుచిత్రం
యథా నభశ్చ గ్రహచన్ద్రచిత్రమ్,
దదర్శ యుక్తీకృతమేఘచిత్రం
విమానరత్నం బహురత్నచిత్రమ్. 8

ప్ర. అ. యుక్తీకృతమేఘచిత్రమ్=తనతో సంబంధించినట్లు చేయబడిన మేఘము లను చిత్రములు కలదీ, (కావుననే) గ్రహచన్ద్రచిత్రమ్=గ్రహములతోను, చంద్రునితోను చిత్రమైన, నభః యథా=ఆకాశము వలె ఉన్నదీ, బహురత్నచిత్రమ్=అనేకము లైన రత్నములతో చిత్రముగా ఉన్నదీ, (అందుచేతనే) బహుధాతుచిత్రమ్=అనేకమైన గైరికాదిధాతువులచేత చిత్రమైన, నగాగ్రం యథా=పర్వతాగ్రము వలె ఉన్నదీ అయిన, విమానరత్నమ్=శ్రేష్ఠమైన విమానమును, దదర్శ=చూచెను.

తా. చిత్రముల వలె ఉన్న మేఘములు ఆ విమానరత్నము దగ్గర ప్రోగులు పడుటచే అది గ్రహములతోను, చంద్రునితోను చిత్రమైన ఆకాశము వలె ఉండెను. అనేకరత్నములతో చిత్రవర్ణముగా ఉండుటచేత అది, అనేకము లైన గైరికాదిధాతువులతో చిత్రవిచిత్రవర్ణములు గల పర్వతాగ్రము వలె ఉండెను. అట్టి విమానరత్నమును హనుమంతుడు చూచెను. 8

మూ. మహీ కృతా పర్వతరాజిపూర్ణా
శైలాః కృతా వృక్షవితానపూర్ణాః,

వృక్షాః కృతాః పుష్పవితానపూర్ణాః
పుష్పం కృతం కేసరపత్రపూర్ణమ్. 9

ప్ర. అ. మహీ=భూమి, పర్వతరాజిపూర్ణా=పర్వతపంక్తితో నిండినదిగా, కృతా=చేయబడినది, శైలాః=పర్వతములు, వృక్షవితానపూర్ణాః=వృక్షముల విస్తృతితో నిండినవిగా, కృతాః=చేయబడినవి, వృక్షాః=వృక్షములు, పుష్పవితానపూర్ణాః=పుష్పముల సముదాయములతో నిండినవిగా, కృతాః=చేయబడినవి. పుష్పమ్=పుష్పము, కేసరపత్రపూర్ణమ్=కింజల్కములతోను, రేకులతోను నిండినదిగా, కృతమ్=చేయబడినది.

తా. అక్కడ భూమి పర్వతపంక్తులతో నిండి ఉండెను. పర్వతపంక్తులు వృక్షసముదాయముతో నిండి యుండెను. వృక్షములు పుష్పసంపదతో నిండి యుండెను. పుష్పములు కింజల్కములతోను, రేకులతోను నిండి యుండెను.9

మూ. కృతాని వేశ్మాని చ పాణ్డురాణి
తథా సుపుష్పాణ్యపి పుష్కరాణి,
పునశ్చ పద్మాని సకేసరాణి
ధన్యాని చిత్రాణి తథా వనాని. 10

ప్ర. అ. పాణ్డురాణి=తెల్లనైన, వేశ్మాని చ=గృహములు, కృతాని=నిర్మింపబడినవి. తథా=అట్లే, సుపుష్పాణి=మంచి పుష్పములు గల, పుష్కరాణి చ=సరస్సులు, పునశ్చ=మరియు, సకేసరాణి=కింజల్కములతో కూడిన, పద్మాని=పద్మములు, తథా=మరియు, ధన్యాని=శ్రేష్ఠము లైన, చిత్రాణి=చిత్రవర్ణము గల, వనాని=వనములు నిర్మింపబడినవి.

తా. అక్కడ తెల్లని భవనములు నిర్మించిరి. మంచిపుష్పములతో నిండిన సరస్సులు ఏర్పరచిరి. ఆ సరస్సులలో కింజల్కములతో నిండిన పద్మములు పెంచుచుండిరి. చిత్రములు, ఉత్తమములూ అయిన వనములను పెంచిరి. 10

మూ. పుష్పాహ్వయం నామవిరాజమానం
రత్నప్రభాభిశ్చ విఘూర్ణమానమ్,
వేశ్మోత్తమానామపి చోచ్చమానం
మహాకపిస్తత్ర మహావిమానమ్. 11

ప్ర. అ. తత్ర=అక్కడ, మహాకపిః=హనుమంతుడు, పుష్పాహ్వయమ్=పుష్పకమను పేరు గలది, నామవిరాజమానమ్=పేరుతో (పేరుకు అనుగుణముగా) ప్రకాశించుచున్నదీ, రత్నప్రభాభిః=రత్నకాంతులతో, విఘూర్ణమానమ్=తిరుగుచున్న

ట్లున్నదీ, వేశ్మోత్తమానామపి=శ్రేష్ఠ మైన గృహములతో కూడ, ఉచ్చ్రమానమ్=ఉన్నతప్రమాణము కలదీ అయిన, మహావిమానమ్=గొప్ప విమానమును, (చూచెను).

తా. హనుమంతుడు అక్కడ పుష్పకమను పేరు గల ఒక మహావిమానమును చూచెను. అది పేరుకు తగినట్లుగా మనోహరముగా ప్రకాశించుచుండెను. దాని చుట్టూ రత్నముల కాంతులు వ్యాపించుటచేత ఆ కాంతుల మధ్య తిరిగిపోవుచున్నట్లు, ఉండెను. అక్కడ ఉన్న ఉత్తమగృహము లన్నింటిలో అది అత్యున్నతముగా ఉండెను. 11

మూ. కృతాశ్చ వైడూర్యమయా విహఙ్గా
రూప్యప్రవాళైశ్చ తథా విహఙ్గాః,
చిత్రాశ్చ నానావసుభిర్భుజఙ్గాః
జాత్యానురూపాస్తురగాః శుభాఙ్గాః. 12

ప్ర. అ. వైడూర్యమయాః=వైడూర్యమాణిక్యవికారములైన, విహఙ్గాః=పక్షులూ, తథా=అట్లే, రూప్యప్రవాళైశ్చ=వెండితోను, పగడములతోను నిర్మించిన, విహఙ్గాః=పక్షులూ, నానావసుభిః=అనేకవిధములైన ధనములతో, (మణులతో) చిత్రాః=విచిత్రము లైన, భుజఙ్గాః=సర్పములు, జాత్యా=జాతిచేత, అనురూపాః=అనుకూలమైన, శుభాఙ్గాః=శుభకరమైన శరీరము గల, తురగాః=గుఱ్ఱములూ, కృతాః=ఏర్పరుపబడినవి.

తా. ఆ విమానమునందు, అలంకారార్థమై, వైడూర్యమణులతోను, బంగారముతోను, పగడములతోను నిర్మించిన పక్షులనూ, మాణిక్యములతో విచిత్రవర్ణముగా ఉన్న సర్పములనూ, మంగళకరమైన శరీరములు గల, ఉత్తమజాతికి చెందిన గుఱ్ఱములనూ అమర్చిరి. 12

మూ. ప్రవాళజామ్బూనదపుష్పపక్షాః
సలీలమావర్జితజిహ్మపక్షాః,
కామస్య సాక్షాదివ భాన్తి పక్షాః
కృతా విహఙ్గాః సుముఖాః సుపక్షాః. 13

ప్ర. అ. ప్రవాళజామ్బూనదపుష్పపక్షాః=రెక్కలపై పగడములతోను, బంగారముతోను చేయబడిన పువ్వులు కలవీ, సుపక్షాః=మంచి రెక్కలు గలవీ, సలీలమ్=విలాసపూర్వకముగా, ఆవర్జితజిహ్మపక్షాః=వంచబడిన వంకర యైన రెక్కలు గలవీ, సుముఖాః=మంచి ముఖములు కలవీ అయిన, విహఙ్గాః=పక్షులు,

కృతాః=నిర్మింపబడినవి. సాక్షాత్=సాక్షాత్తు, కామస్య=మన్మథునియొక్క, పక్షాః ఇవ=పక్షమునకు చెందిన సహాయుల వలె, భాన్తి=ప్రకాశించుచున్నవి.

తా. ఆ విమానముపై మంచి ముఖములు, రెక్కలూ ఉన్న పక్షులను కూడా నిర్మించిరి. విలాసపూర్వముగా వంచబడిన వంకరగా ఉన్న వాటి రెక్కలమీద పగడముల పువ్వులు, బంగారు పువ్వులు చెక్కబడి ఉండెను. అట్టి పక్షులు మన్మథుని పక్షమునకు చెందిన అతని సహాయకుల వలె ఉండెను. 13

మూ. నియుజ్యమానాస్తు గజాః సుహస్తాః
సకేసరాశ్చోత్పలపత్రహస్తాః,
బభూవ దేవీ చ కృతా సుహస్తా
లక్ష్మీస్తథా పద్మిని పద్మహస్తా. 14

ప్ర. అ. పద్మిని=పద్మసరస్సునందు, సుహస్తాః=మంచి తొండములు కలవి, సకేసరాశ్చ=(శరీరములపై) కింజల్కములతో కూడినవీ, ఉత్పలపత్రహస్తాః= పద్మములూ తామరాకులూ తొండములందు గలవీ, నియుజ్యమానాస్తు=నియ మింపబడుచున్నవీ, (లక్ష్మీదేవిని స్నానము చేయించుచున్నట్లు చూపబడినవీ) అయిన, గజాః=గజములు నిర్మింపబడినవి. తథా=అట్లే, పద్మహస్తా=పద్మములు హస్తమునందు గలదీ, సుహస్తా=అందమైన హస్తములు కలదీ అయిన, దేవీ చ=లక్ష్మికూడ, కృతా=నిర్మింపబడినదై, బభూవ=ఉండెను.

తా. ఆ పుష్పకవిమానములో, గజలక్ష్మి ఉండెను. అందమైన తొండములతో తామరపూవులను తామరాకులను పై కెత్తి, బంగారు కలశలతో లక్ష్మి దేవిని స్నానము చేయించుచున్న గజములు పద్మసరస్సులో నిలచి ఉండెను. వాటి శరీరమునిండా పద్మకింజల్కములు పడిఉండెను. లక్ష్మీదేవి మనోహరము లైన హస్తములతో పద్మములు ధరించి ఉండెను. 14

మూ. ఇతీవ తద్గృహమభిగమ్య శోభనమ్
సవిస్మయో నగమివ చారు శోభనమ్,
పునశ్చ తత్పరమసుగన్ధి సున్దరమ్
హిమాత్యయే నగమివ చారుకన్దరమ్. 15

ప్ర. అ. ఇతీవ=ఈ ప్రకారము, శోభనమ్=ప్రకాశించుచున్నదీ, చారు శోభనమ్=అందముగా కాంతిమంతమై ఉన్న, నగమివ=పర్వతము వలె ఉన్నదీ అయిన,తద్గృహమ్=ఆ గృహమును, అభిగమ్య=సమీపించి, సవిస్మయః=ఆశ్చర్య ముతో కూడిన హనుమంతుడు, పరమసుగన్ధి=మిక్కిలి సుగంధము గలదీ,

సున్దరమ్=సుందరమూ, హిమాత్యయే=వసంతర్తువు నందు, చారుకన్దరమ్=అంద మైన గుహలు గల, నగమివ=పర్వతము వలె ఉన్న, తత్=ఆ గృహమును, పునశ్చ=మరల, సమీపించి చూచెను.

తా. హనుమంతుడు, అందమైన పర్వతము వలె, మనోహరముగా ఉన్న ఆ గృహమును చూచి ఆశ్చర్యపడుచు,వసంత ఋతువునందు, మంచి సువాసనలతో నిండి అంద మైన గుహలతో మనోహరముగా ఉన్న పర్వతము వలె ఉన్న ఆ గృహమును మరల ఒకమారు ప్రవేశించి అన్వేషించెను. 15

మూ. తతః స తాం కపిరభిపత్య పూజితాం
చరన్ పురీం దశముఖబాహుపాలితామ్,
అదృశ్య తాం జనకసుతాం సుపూజితాం
సుదుఃఖితః పతిగుణవేగనిర్జితామ్. 16

ప్ర. అ. తతః=అటుపిమ్మట, సః కపిః=ఆ హనుమంతుడు, పూజితామ్=పూజింపబడినదీ, దశముఖబాహుపాలితామ్=రావణుని బాహువులచే పాలింపబడినదీ అయిన, తాం పురీమ్=ఆ లంకానగరమును, అభిపత్య=సమీపించి, చరన్=సంచరించుచు,సుపూజితామ్=బాగుగా పూజింపబడినదీ, పతిగుణవేగనిర్జితామ్=భర్తయొక్క గుణములచే వేగముగా (అధికముగా) జయింపబడినదీ అయిన, తాం జనకసుతామ్=ఆ సీతను, అదృశ్య=చూడక, సుదుఃఖితః=చాల దుఃఖించెను.

తా. పిమ్మట ఆ హనుమంతుడు రావణుని బాహుబలముచేత రక్షింపబడినదీ, గౌరవింపబడినదీ, అయిన ఆ లంకానగరము ప్రవేశించి సంచరించుచు, భర్త సద్గుణములచే అధికముగా ఆకర్షింపబడి ఆతనిమీదనే మనస్సు నిలిపి ఉన్న పూజనీయురాలైన సీతను గానక చాల విషణ్ణు డయ్యెను. 16

మూ. తతస్తదా బహువిధభావితాత్మనః
కృతాత్మనో జనకసుతాం సువర్త్మనః,
అపశ్యతో ఽ భవదతిదుఃఖితం మనః
సుచక్షుషః ప్రవిచరతో మహాత్మనః. 17

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే సున్దరకాణ్డే
సప్తమః సర్గః.

ప్ర. అ. తతః=అటుపిమ్మట, తదా=అప్పుడు, బహువిధభావితాత్మనః=అనేకవిధములగు భావములతో నిండిన మనస్సు కలవాడూ, కృతాత్మనః=నిశ్చితమైన మనస్సు కలవాడూ, సువర్త్మనః=మంచి మార్గము గలవాడూ, సుచక్షుషః=మంచి

నేత్రములు (దృష్టి) కలవాడూ, ప్రవిచరతః=సంచరించుచున్నవాడూ, జనకసుతామ్=సీతను, అపశ్యతః=చూడనివాడూ అయిన, మహాత్మనః=మహాత్ముడైన హనుమంతుని యొక్క, మనః=మనస్సు, అతిదుఃఖితమ్=చాల దుఃఖించినదిగా, అభవత్=ఆయెను.

తా. ధర్మమార్గమును అనుసరించు మహాత్ముడైన హనుమంతుడు దృఢనిశ్చయముతో, నిశితదృష్టితో ఎంత వెదకినను సీత కనబడలేదు. అప్పుడు అతని మనస్సులో ఎన్నో భావములు చెలరేగెను. ఆ విధముగా సంచరించుచు అతడు విషాదము పొందెను. 17

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు సుందరకాండలో సప్తమసర్గ సమాప్తము.

అథ అష్టమః సర్గః

[హనుమంతుడు మరల పుష్పకమును అన్వేషించుట]

మూ. స తస్య మధ్యే భవనస్య సంస్థితం
మహద్విమానం మణివజ్రచిత్రితమ్,
ప్రతప్తజామ్బూనదజాలకృత్రిమం
దదర్శ వీరః పవనాత్మజః కపిః. 1

ప్ర. అ. వీరః=వీరుడు, పవనాత్మజః=వాయుపుత్రుడూ అయిన, సః కపిః=ఆ హనుమంతుడు, తస్య భవనస్య=ఆ భవనముయొక్క, మధ్యే=మధ్య యందు, సంస్థితమ్=ఉన్నదీ, మణివజ్రచిత్రితమ్=మణులచేతను, వజ్రములచేతనూ చిత్రవర్ణము కలదిగా చేయబడినదీ, ప్రతప్తజామ్బూనదజాలకృత్రిమమ్=కాల్చిన బంగా రము సముదాయముతో చేయబడిన నగిషీలు కలదీ అయిన, మహత్=గొప్పదైన, విమానమ్=విమానమును, దదర్శ=చూచెను.

తా. వీరుడైన ఆ మారుతి, ఆ భవనము మధ్య యందు ఉన్న గొప్ప విమానమును చూచెను. అది మాణిక్యములు, వజ్రములు పొదుగుటచే చిత్రవర్ణముగా ఉండెను. కాల్చి పరిశుద్ధము చేసిన, బంగారపు సముదాయముతో ఆ విమానమునకు అంతటను, నగిషీలు చెక్కి ఉండెను. 1

మూ. తదప్రమేయాప్రతికారకృత్రిమం
కృతం స్వయం సాధ్వితి విశ్వకర్మణా,
దివం గతం వాయుపథప్రతిష్ఠితం
వ్యరాజతాదిత్యపథస్య లక్ష్మవత్. 2

ప్ర. అ. అప్రమేయాప్రతికారకృత్రిమమ్=సాటిలేనిదీ, ఎదురులేని అలంకార రచన కలదీ, విశ్వకర్మణా=విశ్వకర్మచేత, స్వయమ్=స్వయముగా, సాధ్వితి=చాలా బాగున్నది అని, కృతమ్=చేయబడినదీ, దివమ్=ఆకాశమును, గతమ్=పొందినదీ, వాయుపథప్రతిష్ఠితమ్=వాయుమార్గమునందు నిలుపబడినదీ అయిన, తత్=అది, ఆదిత్యపథస్య=సూర్యమార్గమునకు, లక్ష్మవత్=చిహ్నము వలె, వ్యరాజత=ప్రకాశిం చెను.

తా. ఆ విమానమునకు చేసిన అలంకరణము సాటిగాని, బదులు (పోటీ) గాని లేనిదై ఉండెను. సాక్షాత్తు విశ్వకర్మయే దీనిని నిర్మించి చాల బాగున్నదని మెచ్చుకొనెను. అది ఆకాశమునందు వాయుమార్గమునందు నిలచినదై, సూర్యమార్గమునకు చిహ్నము వలె ప్రకాశించుచుండెను. 2

మూ. న తత్ర కించిన్న కృతం ప్రయత్నతో
న తత్ర కించిన్న మహార్హరత్నవత్,
న తే విశేషా నియతాః సురేష్వపి
న తత్ర కించిన్న మహావిశేషవత్. 3

ప్ర. అ. తత్ర=దానియందు, ప్రయత్నతః=ప్రయత్నపూర్వకముగా, న కృతమ్=చేయబడనిది, కించిత్=ఏదియు, న=లేదు, తత్ర=దాని యందు, న మహార్హరత్నవత్=శ్రేష్ఠములైన రత్నములు లేనిది, కిం చిత్=ఏదియు, న=లేదు, తే=ఆ, విశేషాః=పుష్పకవిమానమునకు సంబంధించిన విశేషములు, సురేష్వపి= దేవతలలో కూడ, న నియతాః=నిశ్చితములుగా లేవు, తత్ర=దానియందు, న మహావిశేషవత్=గొప్ప విశేషము లేనిది, కించిత్, ఏదియు, న=లేదు.

తా. ఆ విమానమునందు ప్రయత్నపూర్వకముగా నిర్మింపబడనిది ఏదీ లేదు. దానిపై శ్రేష్ఠములైన రత్నములు లేనిది ఏదీ లేదు. దానిలో ఉన్న విశేషములు దేవతల గృహములలో కూడ నిశ్చితముగా ఉన్న వని చెప్ప వీలు లేదు. దానిలో గొప్ప విశేషము లేనిది ఏదీ లేదు. 3

మూ. తపఃసమాధానపరాక్రమార్జితం
మనఃసమాధానవిచారచారిణమ్,
అనేకసంస్థానవిశేషనిర్మితం
తతస్తతస్తుల్యవిశేషదర్శనమ్. 4

ప్ర. అ. తపఃసమాధానపరాక్రమార్జితమ్=తపస్సు చేయుటచేతను పరాక్రమముచేతను సంపాదింపబడినదీ, మనఃసమాధానవిచారచారిణమ్=(ఎక్కినవారి) మనస్సుయొక్క ఏకాగ్రతవలన కలిగిన ఆలోచనలను పట్టి సంచరించునదీ, అనేకసంస్థానవిశేషనిర్మితమ్=ఆ యా భాగములందు అనేకమైన ఆకారముల విశేషములతో నిర్మింపబడినదీ, తతస్తతః=అక్కడక్కడ, తుల్యవిశేషదర్శనమ్=సమానమైన విశేషముల దర్శనము గలదీ (అయిన విమానమును హనుమంతుడు చూచెను.)

తా. ఆ విమానము గొప్ప తపస్సు చేయుటచేతను, పరాక్రమము చేతను సంపాదింపబడినది. దానిలో కూర్చున్నవారి అభిప్రాయమును అనుసరించి

అది సంచరించును. వివిధ భాగములలో అనేకములైన ఆకారవిశేషములతో నిర్మింపబడినది. అన్ని ప్రదేశములలోను నిర్మాణ వైశిష్ట్యము తుల్యముగా ఉండెను.

మూ. విశేషమాలమ్బ్య విశేషసంస్థితం
విచిత్రకూటం బహుకూటమణ్డితమ్,
మనోఽభిరామం శరదిన్దునిర్మలం
విచిత్రకూటం శిఖరం గిరేర్యథా. 5

ప్ర. అ. విశేషమ్=నిర్మాణవిశేషమును, ఆలమ్బ్య=అవలంబించి, విశేషసంస్థితమ్=విశేషరూపమున ఉన్నదీ, విచిత్రకూటమ్=విచిత్రములైన శిఖరములు కలదీ, బహుకూటమణ్డితమ్=అనేకములైన శిఖరములచేత అలంకరింపబడినదీ, మనోభిరామమ్=మనస్సుకు ఆకర్షణమైనదీ, శరదిన్దునిర్మలమ్=శరత్కాలచంద్రుని వలె నిర్మలమైనదీ, గిరేః=పర్వతముయొక్క, విచిత్రకూటమ్=విచిత్రములైన చిన్న చిన్న శిఖరములు గల, శిఖరం యథా=శిఖరము వలె ఉన్నదీ అయిన విమానమును చూచెను.

తా. ఆ విమానము విశిష్టములైన రీతులలో నిర్మింపబడుటచే దాని రూపము విశిష్టముగా ఉండెను. అనేకములైన శిఖరములతో విచిత్రముగా ఉండెను. మనోహరమై, శరత్కాలచంద్రుని వలె నిర్మలమై, చిన్న చిన్న శిఖరములు గల పర్వతశిఖరము వలె ఉండెను. 5

మూ. వహన్తి యం కుణ్డలశోభితాననా
మహాశనా వ్యోమచరా నిశాచరాః,
వివృత్తవిధ్వస్తవిశాలలోచనా
మహాజవా భూతగణాః సహస్రశః. 6

ప్ర. అ. యమ్=దేనిని, కుణ్డలశోభితాననాః=కుండలములచేత శోభింపచేయబడిన ముఖము గల, మహాశనాః=గొప్ప ఆహారముగల, వ్యోమచరాః=ఆకాశమునందు సంచరించు, నిశాచరాః=రాక్షసులు, వివృత్తవిధ్వస్త విశాలలోచనాః=గుండ్రని నేత్రములూ, వంకరగానున్న నేత్రములూ, విశాలములైన నేత్రములూ గల, మహాజవాః=గొప్ప వేగము గల, భూతగణాః=భూతముల సముదాయములు, సహస్రశః=వేలకొలది, వహన్తి=మోయుచున్నవి (దానిని హనుమంతుడు చూచెను.)

తా. ఆ విమానమును కుండలములతో శోభించుచున్న ముఖములు కలవారూ, అధికమైన ఆహారము భుజించువారూ, ఆకాశసంచారులూ

అయిన రాక్షసులూ, గుండ్రనికండ్లు, వంకరకండ్లు, విశాలము లైన కండ్లు గల మహావేగవంతములైన వేలకొలది పిశాచములూ మోయుచుండెను. 6

మూ. వసన్తపుష్పోత్కరచారుదర్శనం
వసన్తమాసాదపి కాన్తదర్శనమ్,
స పుష్పకం తత్ర విమానముత్తమం
దదర్శ తద్వానరవీరసత్తమః. 7

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే సున్దరకాణ్డే
అష్టమః సర్గః.

ప్ర. అ. వానరవీరసత్తమః=వానరవీరులలో శ్రేష్ఠుడైన, సః=హనుమంతుడు, వసన్తపుష్పోత్కరచారుదర్శనమ్=వసంతమునందలి పుష్పసముదాయము వలె అందమైన దర్శనముకలదీ, వసన్తమాసాదపి=వసంతమాసముకంటే కూడ, కాన్తదర్శనమ్=మనోహర మైన దర్శనము గలదీ అయిన, పుష్పకమ్=పుష్పకమను పేరు గల, ఉత్తమమ్=ఉత్తమమైన, విమానమ్=విమానమును, తత్ర=అక్కడ, దదర్శ=చూచెను.

తా. వానరవీరులలో శ్రేష్ఠుడైన ఆ హనుమంతుడు, అక్కడ, వసంతర్తువులోని పుష్పముల సముదాయము వలె చూచుటకు చాలా అందముగా ఉన్నదీ, వసంతమాసముకంటె కూడ మనోహరమైనదీ, అయిన పుష్పకమను విమాన శ్రేష్ఠమును చూచెను. 7

"బాలానందిని"అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు
సుందరకాండలో ఎనిమిదవసర్గ సమాప్తము.

అథ నవమః సర్గః

[హనుమంతుడు రావణుని భవనమును, అక్కడ ఉన్న పుష్పకవిమాన మును చూచిన పిమ్మట అక్కడ నిద్రించుచున్న వేలకొలది స్త్రీలను చూచుట].

మూ. తస్యాలయవరిష్ఠస్య మధ్యే విపులమాయతమ్,
దదర్శ భవనశ్రేష్ఠం హనుమాన్ మారుతాత్మజః. 1

ప్ర. అ. మారుతాత్మజః=వాయుపుత్రుడైన, హనుమాన్=హనుమంతుడు, తస్య=ఆ, ఆలయవరిష్ఠస్య=శ్రేష్ఠమైన గృహసముదాయము యొక్క, మధ్యే=మధ్యయందు, విపులమ్=విస్తృతమైనది, ఆయతమ్=పొడవైనదీ అయిన, భవనశ్రేష్ఠమ్=శ్రేష్ఠమైన భవనమును, దదర్శ=చూచెను.

తా. వాయుపుత్రుడైన ఆ హనుమంతుడు, ఉత్తమమైన ఆ భవన సముదాయము మధ్యయందు, విశాలమూ దీర్ఘమూ అయిన ఒక శ్రేష్ఠమైన భవనమును చూచెను. 1

మూ. అర్ధయోజనవిస్తీర్ణమాయతం యోజనం హి తత్,
భవనం రాక్షసేన్ద్రస్య బహుప్రాసాదసంకులమ్. 2

ప్ర. అ. రాక్షసేన్ద్రస్య=రావణునియొక్క, తత్=ఆ, బహుప్రాసాదసంకులమ్=అనేకప్రాసాదములతో నిండియున్న, భవనమ్=భవనము, అర్ధయోజనవిస్తీర్ణమ్=అర్ధయోజనము (యోజనములో సగము) వెడల్పు గలదీ; యోజనమ్=ఒక యోజనము, ఆయతమ్=పొడవైనది.

తా. చుట్టూ అనేక ప్రాసాదములున్న ఆ రావణభవనము ఎనిమిది లేదా తొమ్మిది మైళ్లు (యోజనము), పొడవు, నాలుగు లేదా నాలుగున్నర మైళ్లు వెడల్పు ఉండెను. 2

మూ. మార్గమాణస్తు వైదేహీం సీతామాయతలోచనామ్,
సర్వతః పరిచక్రామ హనుమానరిసూదనః. 3

ప్ర. అ. అరిసూదనః=శత్రువినాశకుడైన, హనుమాన్=హనుమంతుడు, వైదేహీమ్=విదేహరాజు జనకుని కూతురు, ఆయతలోచనామ్=విశాలమైన నేత్రము

ఋకలదీ అయిన, సీతామ్=సీతను, మార్గమాణః తు=వెదకుచు, సర్వతః=అంతటా, పరిచక్రామ=తిరిగెను.

తా. శత్రువినాశకుడైన, హనుమంతుడు, విశాలనేత్రయైన ఆ జనక రాజకుమారి కొరకై అన్వేషించుచు, అంతట తిరిగెను. 3

మూ. ఉత్తమం రాక్షసావాసం హనుమానవలోకయన్,
ఆససాదాథ లక్ష్మీవాన్ రాక్షసేన్ద్రనివేశనమ్. 4
చతుర్విషాణైర్ద్విరదైస్త్రివిషాణైస్తథైవ చ,
పరిక్షిప్తమసంబాధం రక్ష్యమాణముదాయుధైః. 5

ప్ర. అ. అథ=అటుపిమ్మట, లక్ష్మీవాన్=శోభ గల, హనుమాన్=హనుమంతుడు, ఉత్తమమ్=ఉత్తమమైన, రాక్షసావాసమ్=రాక్షసుల నివాసమూ, చతుర్విషాణైః=నాలుగు దంతములు గలవీ, తథైవ చ=అట్లే, త్రివిషాణైః=మూడు దంతములు గలవీ, ద్విరదైః=రెండు దంతములు గలవీ అయిన ఏనుగుల చేత, పరిక్షిప్తమ్=వ్యాప్తమైనదీ, అసంబాధమ్=ఇరుకుగాలేనిదీ, ఉదాయుధైః=ఎత్తబడిన ఆయుధములు కల భటులచేత, రక్ష్యమాణమ్=రక్షింపబడుచున్నదీ అయిన, రాక్షసేన్ద్రనివేశనమ్=రావణుని గృహమును, అవలోకయన్=చూచుచు, ఆససాద=సమీపించెను.

తా. పిమ్మట, అద్భుతమైన శోభ గల హనుమంతుడు, అనేక రాక్షసులకు నివాసస్థానమైన ఆ రావణభవనమును పరిశీలనపూర్వకముగా చూచుచు దానిని సమాపించెను. ఆ భవనమునందు అన్ని ప్రాంతములందూ రెండు దంతముల ఏనుగులు, మూడు దంతముల ఏనుగులు, నాలుగు దంతముల ఏనుగులు తిరుగుచుండెను. ఏ మాత్రము ఇరుకు లేక విశాలముగా ఉన్న, ఆ భవనమును ఆయుధములు ధరించి సర్వదా యుద్ధసన్నద్ధులైన రాక్షసులు రక్షించుచుండిరి.

మూ. రాక్షసీభిశ్చ పత్నీభీ రావణస్య నివేశనమ్,
ఆహృతాభిశ్చ విక్రమ్య రాజకన్యాభిరావృతమ్. 6
తన్నక్రమకరాకీర్ణం తిమిఙ్గిలఝషాకులమ్,
వాయువేగసమాధూతం పన్నగైరివ సాగరమ్. 7

ప్ర. అ. రావణస్య=రావణునియొక్క, పత్నీభిః=భార్యలైన, రాక్షసీభిః=రాక్షసస్త్రీలతోను, విక్రమ్య=పరాక్రమించి, ఆహృతాభిః=తీసికొని రాబడిన, రాజకన్యాభిః=రాజకన్యలతోను, ఆవృతమ్=ఆవరింపబడిన, నివేశనమ్=గృహమును,

(సమీపించెను) నక్రమకరాకీర్ణమ్=మొసళ్లచేత, పెద్దచేపల చేత వ్యాప్తమూ, తిమిఙ్గిలఝషాకులమ్=తిమింగిలము లను పెద్దచేపలతోను, చేపలతోను వ్యాకులమూ, వాయువేగసమాధూతమ్=వాయువేగముచేత కదల్పబడినదీ, పన్నగైః=సర్పములతో కూడినదీ అయిన, సాగరమ్ ఇవ=సముద్రము వలె ఉన్న, తత్=ఆ భవనమును సమీపించెను.

తా. ఆ భవనము రావణుని భార్యలైన రాక్షసస్త్రీలతోను, అతడు పరాక్రమము చూపి బలాత్కారముగా ఎత్తికొని వచ్చిన రాజకన్యలతోను నిండియుండెను. ఏనుగులతోను, రక్షకభటాదులతోను వ్యాప్తమైయున్న ఆ భవనము మొసళ్ళూ, పెద్దచేపలూ, తిమింగిలములూ, ఝషములను చేపలూ, సర్పములూ తిరుగుచున్నదీ, వాయువేగముచే కదలుచున్నదీ అయిన సముద్రము వలె భయంకరముగా ఉండెను. 6,7

మూ. యా హి వైశ్రవణే లక్ష్మీర్యా చేన్ద్రే హరివాహనే,
సా రావణగృహే సర్వా నిత్యమేవానపాయినీ. 8

ప్ర. అ. వైశ్రవణే=కుబేరునియందు, యా=ఏ, లక్ష్మీః=లక్ష్మి (ఐశ్వర్యము) ఉన్నదో, హరివాహనే=ఆకుపచ్చని గుఱ్ఱములు గల, ఇన్ద్రే చ=ఇంద్రుని యందు, యా=ఏ లక్ష్మి ఉన్నదో, సా=ఆ, సర్వా=సర్వవిధములైన లక్ష్మి, రావణగృహే=రావణుని గృహమునందు, నిత్యమేవ=ఎల్లప్పుడు, అనపాయినీ=నాశనము (లేనిదై) నివసించుచున్నది.

తా. కుబేరునికి ఎట్టి ఐశ్వర్యమున్నదో, ఆకుపచ్చ గుఱ్ఱములు కట్టిన రథము వాహనముగా గల ఇంద్రునికి ఎట్టి ఐశ్వర్యమున్నదో అట్టి ఐశ్వర్యము అంతా రావణుని గృహములో, ఎన్నడును తొలగిపోక, నిత్యము స్థిరముగా ఉన్నది. 8

మూ. యా చ రాజ్ఞః కుబేరస్య యమస్య వరుణస్య చ,
తాదృశీ తద్విశిష్టా వా ఋద్ధీ రక్షోగృహేష్విహ. 9

ప్ర. అ. రాజ్ఞః=యక్షుడైన, కుబేరస్య=కుబేరుని యొక్క, యా=ఏ సమృద్ధి ఉన్నదో, యమస్య=యమునియొక్క, వరుణస్య చ=వరుణుని యొక్క, యా=ఏ లక్ష్మి ఉన్నదో, తాదృశీ=అట్టిదికాని, తద్విశిష్టా వా=దానికంటె విశిష్టము కాని అయిన, ఋద్ధిః=సమృద్ధి, ఇహ=ఇక్కడ, రక్షోగృహేషు=రావణుని గృహమునందు ఉన్నది.

తా. ఇక్కడ రావణుని భవనములో ఉన్న సమృద్ధి యక్షాధిపతియైన కుబేరుని సమృద్ధితోను, యముని సమృద్ధితోను, వరుణుని సమృద్ధితోను సమానమని గాని, దానికంటే కూడ అధికమైన దని కాని చెప్పవలెను. 9

మూ. తస్య హర్మ్యస్య మధ్యస్థం వేశ్మ చాన్యత్సునిర్మితమ్,
బహునిర్య్యూహసంకీర్ణం దదర్శ పవనాత్మజః. 10

ప్ర. అ. పవనాత్మజః=హనుమంతుడు, తస్య=ఆ, హర్మ్యస్య=భవనము యొక్క, మధ్యస్థమ్=మధ్యయం దున్నదీ, సునిర్మితమ్=బాగుగా నిర్మింపబడినదీ, బహునిర్య్యూహసంకీర్ణమ్=అనేకములైన మదించిన ఏనుగుల ఆకారములో ఉన్న శిఖరములతో వ్యాప్తమూ అయిన, అన్యత్=మరియొక, వేశ్మ=గృహమును, దదర్శ=చూచెను.

తా. హనుమంతుడు ఆ భవనము మధ్య మరియొక భవనమును (పుష్పకమును) చూచెను. అది చక్కగా నిర్మింపబడినదై, మత్తగజముల ఆకారములో ఉన్న అనేకశిఖరములతో నిండి యుండెను. 10

మూ. బ్రహ్మణోఽర్థే కృతం దివ్యం దివి యద్విశ్వకర్మణా,
విమానం పుష్పకం నామ సర్వరత్నవిభూషితమ్. 11
పరేణ తపసా లేభే యత్కుబేరః పితామహాత్,
కుబేరమోజసా జిత్వా లేభే తద్రాక్షసేశ్వరః. 12

ప్ర. అ. సర్వరత్నవిభూషితమ్=సమస్తమైన రత్నములచేత అలంకరించబడిన, పుష్పకం నామ=పుష్పకమను పేరుగల, యత్=ఏ, దివ్యమ్=అద్భుతమైన, విమానమ్=విమానము, విశ్వకర్మణా=విశ్వకర్మచేత, దివి=స్వర్గలోకమునందు, బ్రహ్మణః అర్థే=బ్రహ్మకొరకై,, కృతమ్=చేయబడినదో, యత్=దేనిని, కుబేరః=కుబేరుడు, పితామహాత్=బ్రహ్మదేవునినుండి, పరేణ=గొప్ప, తపసా=తపస్సుచేత, లేభే=పొందెనో, తత్=దానిని, రాక్షసేశ్వరః=రావణుడు, ఓజసా=తేజస్సుచేత, కుబేరమ్=కుబేరుని, జిత్వా=జయించి, లేభే=పొందెను.

తా. అనేకములైన రత్నములచే అలంకరించబడిన పుష్పక మను దివ్యమైన విమానమును విశ్వకర్మ బ్రహ్మదేవునికొరకై పూర్వము స్వర్గములో నిర్మించెను. కుబేరుడు గొప్ప తపస్సు చేసి దానిని బ్రహ్మనుండి పొందెను. రావణుడు బలముచేత ఆ కుబేరుని ఓడించి ఆ విమానమును అతనినుండి బలాత్కారముగా హరించెను. 11, 12

మూ. ఈహామృగసమాయుక్తైః కార్తస్వరహిరణ్మయైః,
సుకృతై రాచితం స్తమ్భైః ప్రదీప్తమివ చ శ్రియా. 13
మేరుమన్దరసఙ్కాశైరుల్లిఖద్భిరివామ్బరమ్,
కూటాగారైః శుభాకారైః సర్వతః సమలంకృతమ్. 14

ప్ర. అ. ఈహామృగసమాయుక్తైః=తోడేళ్ళబొమ్మలతో కూడినవీ, కార్తస్వరహిరణ్మయైః=వెండి బంగారు వికారమైనవీ, సుకృతైః=చక్కగా చేయబడినవీ అయిన, స్తమ్భైః=స్తంభములతో, ఆచితమ్=వ్యాప్తమూ, శ్రియా=శోభతో, ప్రదీప్తమివ=ప్రజ్వలించుచున్నది వలె ఉన్నదీ, మేరుమన్దరసంకాశైః=మేరుపర్వతముతోను మందరపర్వతముతోను సమానములూ, అమ్బరమ్=ఆకాశమును, ఉల్లిఖద్భిరివ=వ్రాయుచున్నవి వలె ఉన్నవీ అయిన, శుభాకారైః=శుభకరమైన ఆకారము గల, కూటాగారైః=పైభాగమునందున్న గదులతో, సర్వతః=అంతటా, సమలంకృతమ్=అలంకరించబడినదీ అయిన , ("విమానమ్ ఆరురోహ" అను 19 వ శ్లోకములో ఉన్నదానితో అన్వయము - విమానమును ఎక్కెను).

తా. ఆ విమానమునందు తోడేళ్ళ బొమ్మలు చెక్కిన వెండి స్తంభములు, బంగారు స్తంభములు అంతటా ఉండెను. కాంతితో ఆ విమానము ప్రజ్వలించుచున్నట్లుండెను. దాని పైభాగమునందు మేరుపర్వతముతోను, మందర పర్వతముతోను సమానములైన, ఆకాశమును ఒరయుచున్నవా అన్నట్లున్న ఎన్నో అందమైన గదులు ఉండెను. 13, 14

మూ. జ్వలనార్కప్రతీకాశం సుకృతం విశ్వకర్మణా,
హేమసోపానసంయుక్తం చారుప్రవరవేదికమ్. 15

ప్ర. అ. విశ్వకర్మణా=విశ్వకర్మచేత, సుకృతమ్=చక్కగా నిర్మించబడినదీ, జ్వలనార్కప్రతీకాశమ్=అగ్నితోను, సూర్యునితోను సమానమైనదీ, హేమసోపానసంయుక్తమ్=బంగారు మెట్లతో కూడినదీ, చారుప్రవరవేదికమ్=సుందరమైన శ్రేష్ఠమైన అరుగులు కలదీ, (అయిన విమానమును ఎక్కెను).

తా. విశ్వకర్మ ప్రయత్నపూర్వకముగా నిర్మించిన ఆ విమానము అగ్ని వలె, సూర్యుని వలె ప్రకాశించుచుండెను. దానిలో బంగారు మెట్లు, అందమైన మంచి అరుగులూ ఏర్పరుపబడి ఉండెను. 15

మూ. జాలవాతాయనైర్యుక్తం కాఞ్చనైః స్ఫాటికైరపి,
ఇన్ద్రనీలమహానీలమణిప్రవరవేదికమ్. 16

ప్ర. అ. కాఞ్చనైః=బంగారువికారములు, స్ఫాటికైరపి=స్ఫటికమణి వికారములూ అయిన, జాలవాతాయనైః=అలంకారార్థమేర్పరచిన చిన్న రంధ్రముల కిటికీలతోను (జాల), గాలివచ్చుటకు ఉపయోగించు పెద్ద కిటికీలతోను, యుక్తమ్=కూడినదీ, ఇన్ద్రనీలమహానీలమణిప్రవరవేదికమ్=ఇంద్రనీలమణులు, మహానీలమణులు పరచిన శ్రేష్ఠములైన అరుగులు కలదీ (అయిన విమానమును ఎక్కెను).

తా. ఆ విమానములో బంగారముతోను, స్ఫటికమాణిక్యములతోను చిన్న చిన్న రంధ్రములు గల అలంకారప్రధానము లైన కిటికీలు, గాలి వచ్చు పెద్ద కిటికీలు అమర్చి ఉండెను. ఇంద్రనీలమణులు, మహానీలమణులు పరచిన అరుగులు అందముగా ఏర్పరుపబడెను. (పాలలో వేయగా పాలు నీలవర్ణముగా ఉన్నట్లు కనబడునది ఇంద్రనీలము. ఆజాతికే చెందినది, తద్భిన్నము మహానీలము). 16

మూ. విద్రుమేణ విచిత్రేణ మణిభిశ్చ మహాధనైః,
నిస్తులాభిశ్చ ముక్తాభిస్తలేనాభివిరాజితమ్. 17

ప్ర. అ. విచిత్రేణ=విచిత్రవర్ణము గల, విద్రుమేణ=పగడములతోను, మహాధనైః=గొప్ప ధనము (విలువ) గల, మణిభిశ్చ=మణులతోను, నిస్తులాభిః=సాటిలేని, ముక్తాభిః=ముత్యములతోను, (నిర్మింపబడిన), తలేన=అడుగుభాగముచేత, అభివిరాజితమ్=ప్రకాశింపచేయబడినదీ (అయిన విమానమును ఎక్కెను.)

తా. ఆ విమానము అడుగుభాగమునందు విచిత్రములైన పగడములు, అమూల్య మైన మణులు, సాటి లేని ముత్యములు అతుకుటచే అది అద్భుతముగ ప్రకాశించుచుండెను. 17

మూ. చన్దనేన చ రక్తేన తపనీయనిభేన చ,
సుపుణ్యగన్ధినా యుక్తమాదిత్యతరుణోపమమ్. 18

ప్ర. అ. రక్తేన=ఎఱ్ఱనిదీ, తపనీయనిభేన చ=బంగారముతో సమానమైనదీ, సుపుణ్యగన్ధినా=మంచి సువాసన కలదీ అయిన, చన్దనేన=మంచి గంధముతో, యుక్తమ్=కూడినదీ, ఆదిత్యతరుణోపమమ్=తరుణుడైన (మధ్యాహ్న కాలమునందలి) సూర్యునితో సమానమూ (అయిన విమానమును ఎక్కెను).

తా. ఆ విమానమునందంతటను మంచి సువాసన గల ఎఱ్ఱని చందనము, బంగారు రంగు గల చందనము పూయుటచే అది మధ్యాహ్నము నందలి సూర్యుడు వలె ఉండెను. 18

మూ. కూటాగారైర్వరాకారైర్వివిధైః సమలంకృతమ్,
విమానం పుష్పకం దివ్యమారురోహ మహాకపిః. 19

ప్ర. అ. మహాకపిః=హనుమంతుడు, వరాకారైః=శ్రేష్ఠమైన ఆకారము గల, కూటాగారైః=పై భాగములందలి గృహములచేత, సమలంకృతమ్=అలంకరింపబడిన, దివ్యమ్=దివ్యమైన, పుష్పకం విమానమ్=పుష్పకవిమానమును, ఆరురోహ=ఎక్కెను.

తా. హనుమంతుడు, అంద మైన ఆకారము గల మేడ పై గదులచే అలంకరింపబడిన దివ్య మైన అట్టి పుష్పకవిమానము మీదికి ఎక్కెను. 19

మూ. తత్రస్థః స తదా గన్ధం పానభక్ష్యాన్నసంభవమ్,
దివ్యం సంమూర్ఛితం జిఘ్రద్రూపవన్తమివానిలమ్. 20

ప్ర. అ. సః=ఆ హనుమంతుడు, తదా=అప్పుడు, తత్రస్థః=అక్కడ ఉన్నవాడై, పానభక్ష్యాన్నసంభవమ్=పానములనుండి, భక్ష్యపదార్థములనుండి, అన్నమునుండి పుట్టిన, దివ్యమ్=అద్భుత మైన, సంమూర్ఛితమ్=వ్యాపించిన, రూపవన్తమ్=రూపము గల, అనిలమివ=వాయువు వలె ఉన్న, గన్ధమ్=సువాసనను, జిఘ్రత్=వాసన చూచెను.

తా. హనుమంతుడు అక్కడికి చేరగానే ఆ ప్రాంతమునందు అంతటను వ్యాపించి, మద్యాదిపానీయములు, తినదగిన పిండివంటలు, అన్నములు మొదలైన వాటి అద్భుత మైన సుగంధము వచ్చెను. అది మూర్తీభవించిన వాయువు వలె తీవ్రతర మై ఉండెను. 20

మూ. సగన్ధస్తం మహాసత్త్వం బన్ధుర్బన్ధుమివోత్తమమ్,
ఇత ఏహీత్యువాచేవ తత్ర యత్ర స రావణః. 21

ప్ర. అ. సః గన్ధః=ఆ సువాసన, మహాసత్త్వమ్=మహాబలశాలి యైన, తమ్=ఆ హనుమంతుని, ఉత్తమమ్=ఉత్తము డైన, బన్ధుమ్=బంధువును, బన్ధురివ=బంధువు వలె, సః రావణః=ఆ రావణుడు, యత్ర=ఎక్కడ ఉండునో, తత్ర=అక్కడికి, ఇతః ఏహి=ఇటువైపు రమ్ము, ఇతి=అని, ఉవాచేవ=పలికినట్లుండెను.

తా. ఆ సువాసన, "ఒక ఉత్తము డైన బంధువు తన బంధువును పిలచినట్లు మహాబలశాలి యైన ఆ హనుమంతుని "ఇటు రమ్ము" అని పిలచుచున్నదా అన్నట్లు రావణు డున్న ప్రదేశమునకు తీసికొనివెళ్ళెను. 21

మూ. తతస్తాం ప్రస్థితః శాలాం దదర్శ మహతీం శుభామ్,
రావణస్య మనఃకాన్తాం కాన్తామివ వరస్త్రియమ్. 22

ప్ర. అ. తతః=అటు వైపునకు, ప్రస్థితః=బయులుదేరిన హనుమంతుడు, కాన్తామ్=మనోహరురా లైన, వరస్త్రియమివ=శ్రేష్ఠ మైన స్త్రీ వలె, రావణస్య=

రావణునియొక్క, మనఃకాన్తామ్=మనస్సుకు ఇష్టమైన, శుభామ్=మంగళకర మైన, మహతీమ్=గొప్ప దైన, శాలామ్=శాలను, దదర్శ=చూచెను.

తా. హనుమంతుడు అటు వైపు వెళ్ళి, ఇక్కడ, మనోహరురా లైన ఉత్తమస్త్రీ వలె రావణుని మనస్సునకు చాల ఇష్ట మైన, అంద మైన ఒక పెద్ద శాలను చూచెను. 22

మూ. మణిసోపానవికృతాం హేమజాలవిభూషితామ్,
స్ఫాటికైరావృతతలాం దన్తాన్తరితరూపికామ్. 23

ప్ర. అ. (ఈ శ్లోకములోని,రాబోవు ఐదు శ్లోకములలోను ఉన్న ద్వితీయాంతశబ్దములు పై శ్లోకములోని "శాలామ్" అనుదానికి విశేషణములు. ఆ శాల ఎట్లున్న దనగా:-) మణిసోపానవికృతామ్=మాణిక్యములు పరచిన మెట్లతో చక్కగా అమర్చబడినదీ, హేమజాలవిభూషితామ్=బంగారు కిటికీలతో అలంకరించ బడినదీ, స్ఫాటికైః=స్ఫటికమాణిక్యములతో, ఆవృతతలామ్=కప్పబడిన క్రింది ప్రదేశముకలదీ, దన్తాన్తరితరూపికామ్=దంతములచేత మధ్య మధ్య నిర్మింపబడిన రూపముగలదీ.

తా. ఆ శాలలో మాణిక్యములు అతికిన మెట్లు చక్కగా అమర్చబడెను. అది బంగారు కిటికీలతో అలంకరింపబడెను. దాని క్రింది ప్రదేశమంతా స్ఫటికమాణిక్యములు పరచి ఉండెను. మధ్య మధ్య దంతపు నగిషీలు చెక్కబడెను. 23

మూ. ముక్తాభిశ్చ ప్రవాళైశ్చ రూప్యచామీకరైరపి,
విభూషితాం మణిస్తమ్భైః సుబహుస్తమ్భభూషితామ్. 24

ప్ర. అ. ముక్తాభిశ్చ=ముత్యములతోను, ప్రవాళైశ్చ=పగడములతోను, రూప్యచామీకరైరపి=వెండి బంగారములతోను నిర్మించబడిన, మణిస్తమ్భైః=మాణిక్య స్తంభములతో, విభూషితామ్=అలంకరించబడినదీ, సుబహుస్తమ్భభూషితామ్=అనేక మైన స్తంభములతో అలంకరించబడినదీ.

తా. అనేక మైన ఆధారస్తంభములపై నిలచి ఉన్న ఆ శాలలో అలంకరణార్థమై, ముత్యములు, పగడములు, వెండి, బంగారము మొదలైన వాటితో నిర్మించిన మణిస్తంభములు అక్కడక్కడ అమర్చబడి యుండెను. 24

మూ. నమ్రైరృజుభిరత్యుచ్చైః సమన్తాత్సువిభూషితైః,
స్తమ్భైః పక్షైరివాత్యుచ్చైర్దివం సంప్రస్థితామివ. 25

ప్ర. అ. నమ్రైః=కొంచెము వంగినవి, ఋజుభిః=వంకర లేనివి, అత్యుచ్చైః=మిక్కిలి ఎత్తైనవీ, సమన్తాత్=అంతటను, సువిభూషితైః=బాగుగా అలంకరింపబడినవీ అయిన, స్తమ్భైః=స్తంభములచేత, అత్యుచ్చైః=మిక్కిలి ఎత్తైన, పక్షైః=రెక్కలతో, దివమ్=ఆకాశమును కూర్చి, సంప్రస్థితామివ=బయలుదేరినది వలె ఉన్నదీ.

తా. ఆ శాలలో కొంచెము వంగిన కొన్ని స్తంభములు, వంకర లేని చాల ఎత్తైన కొన్ని స్తంభములు ఉండెను. అవి అన్నియు చక్కగా అలంకరించబడెను. అట్టి స్తంభములతో ఆ శాల చూచువారికి, ఎత్తైన రెక్కలు చాచుచు పైకి ఆకాశముమీదికి ఎగురుటకు సిద్ధమగుచున్నదా అన్నట్లు కనబడుచుండెను. 25

మూ. మహత్యా కుథయాస్తీర్ణాం పృథివీలక్షణాఙ్కయా,
పృథివీమివ విస్తీర్ణాం సరాష్ట్రగృహమాలినీమ్. 26

ప్ర. అ. పృథివీలక్షణాఙ్కయా=భూమిమీద ఉండు (నదీసముద్రారణ్యగృహాదులు) లక్షణములు చిహ్నములుగా గల, మహత్యా=పెద్ద దైన, కుథయా=చిత్ర కంబళముచేత, ఆస్తీర్ణామ్=పరవబడినదీ, సరాష్ట్రగృహమాలినీమ్=రాష్ట్రములతోను గృహపంక్తులతోను కూడిన, విస్తీర్ణామ్=విశాలమైన, పృథివీమివ=భూమి వలె ఉన్నదీ.

తా. ఆ శాలలో ఒక పెద్ద చిత్రకంబళము పరవబడి ఉండెను. ఆ కంబళముమీద సముద్రములు, నదులు, వనములు, గృహములు మొదలైన భూమిమీద ఉండు లక్షణములన్నీ చిత్రింపబడి ఉండుటచే ఆ శాల, రాష్ట్రములతోను, గృహపంక్తులతోను కూడిన విశాలభూతలము వలె ఉండెను.26

మూ. నాదితాం మత్తవిహగైర్దివ్యగన్ధాధివాసితామ్,
పరార్థ్యాస్తరణోపేతాం రక్షోధిపనిషేవితామ్. 27

ప్ర. అ. మత్తవిహగైః=మదించిన పక్షులచేత, నాదితామ్=ధ్వనింపచేయబడినదీ, దివ్యగన్ధాధివాసితామ్=దివ్య మైన సుగంధముచేత పరిమళింపచేయబడినదీ, పరార్థ్యాస్తరణోపేతామ్=అత్యుత్తమము లైన ఆస్తరణలతో కూడినదీ, రక్షోధిపనిషేవితామ్=రాక్షసరాజుచేత సేవింపబడినదీ.

తా. ఆ శాల మదించిన పక్షులధ్వనులతో ప్రతిధ్వనించుచుండెను. దివ్యములైన సుగంధములచేత పరిమళింపచేయబడుచుండెను. దాని నేలమీద అత్యుత్తమములైన ఆస్తరణములు పరవబడెను. అక్కడ రావణుడు సుఖముగా భోగము లనుభవించుచుండెను. 27

మూ. ధూమ్రామగరుధూపేన విమలాం హంసపాణ్డురామ్,
చిత్రాం పుష్పోపహారేణ కల్మాషీమివ సుప్రభామ్. 28

ప్ర. అ. అగరుధూపేన=అగరుధూపముచేత, ధూమ్రామ్=ధూమ్ర వర్ణ ముగా ఉన్నదీ, విమలామ్=స్వచ్ఛ మైనదీ, హంసపాణ్డురామ్=హంస వలె తెల్లగా ఉన్నదీ, పుష్పోపహారేణ=పుష్పములతో చేసిన అలంకరణముచేత, చిత్రామ్=చిత్రవర్ణ మైనదీ, సుప్రభామ్=మంచి కాంతి గల, కల్మాషీమివ=ధేనువు వలె ఉన్నదీ.

తా. ఆ శాల హంస వలె తెల్లగా స్వచ్ఛముగా ఉండెను. అగరుధూపము వేయుటచే ఆ ధూమము అంతటను వ్యాపించి ధూమ్రవర్ణముగా ఉండెను. అంతటను వివిధపుష్పములు చల్లి అలంకరించుటచే చిత్రవర్ణముగా ఉండెను. మంచి కాంతి గల కామధేనువు వలె ఉండెను. 28

మూ. మనఃసంహ్లాదజననీం వర్ణస్యాపి ప్రసాదినీమ్,
తాం శోకనాశనీం దివ్యాం శ్రియః సంజననీమివ. 29

ప్ర. అ. మనఃసంహ్లాదజననీమ్=మనస్సుకు ఆనందము కలిగించునదీ, వర్ణస్యాపి=శరీరవర్ణమునకు కూడ, ప్రసాదినీమ్=నిర్మలత్వము కూర్చునదీ, శోకనాశనీమ్=శోకమును నశింపచేయునదీ, శ్రియః=లక్ష్మికి, సంజననీమివ=పుట్టించునది వలె ఉన్నదీ, దివ్యామ్=అద్భుతమూ అయిన, తామ్=ఆ శాలను, చూచెను.

తా. ఆ శాల మనస్సునకు ఆనందము కలిగించుటే కాక, దానిలో ఉన్న వారి శరీరకాంతిని, వృద్ధిచేయును. అది లక్ష్మికి పుట్టినిల్లువలె నున్నదై శోకమును నశింపచేయును. అత్యాశ్చర్యకరముగా ఉండెను. (అట్టి శాలను హనుమంతుడు చూచెను). 29

మూ. ఇన్ద్రియాణీన్ద్రియార్థైస్తు పఞ్చ పఞ్చభిరుత్తమైః,
తర్పయామాస మాతేవ తదా రావణపాలితా. 30

ప్ర. అ. రావణపాలితా=రావణునిచేత పాలింపబడిన ఆ శాల, తదా=అప్పుడు,మాతేవ=తల్లి వలె, ఉత్తమైః=ఉత్తమము లైన, పఞ్చభిః=ఐదు, ఇన్ద్రియార్థైః=ఇంద్రియవిషయములచేత, పఞ్చ=ఐదు, ఇన్ద్రియాణి=ఇంద్రియములను, తర్పయామాస=తృప్తి పొందించెను.

తా. రావణునిచే పాలింపబడిన ఆ శాల తల్లి వలె ఐదు ఇంద్రియములచే అనుభవింపదగిన ఉత్తమపదార్థములను సమకూర్చుట ద్వారా ఐదు ఇంద్రియములకు తృప్తి కలిగించెను.

వి. ఆ శాల హనుమంతునికి తృప్తి కలిగించినది అను భావమును గ్రహించి కొందరు దానివలన హనుమంతునకు తృప్తి ఎట్లు కలిగెనో వివరించుచు ఏ మేమో వ్రాసిరి. ఆ శాలలో వివిధభోగములు అనుభవించుచున్న రావణుడూ, అతని అంతఃపురస్త్రీలూ ఆనందడోలికలలో తేలియాడుచుందురు". అని ఆ శాలను వర్ణించుటయందే కవి తాత్పర్యమై ఉండును. 30

మూ. స్వర్గోఽయం దేవలోకోఽయమిన్ద్రస్యేయం పురీ భవేత్,
సిద్ధిర్వేయం పరా హి స్యాదిత్యమన్యత మారుతిః. 31

ప్ర.అ. అయమ్=ఇది, స్వర్గః=స్వర్గమా! అయమ్=ఇది, దేవలోకః=దేవలోకమా! ఇయమ్=ఇది, ఇన్ద్రస్య=ఇంద్రుని యొక్క, పురీ=పట్టణము, భవేత్=అయిఉండునా? ఇయమ్=ఇది, పరా=ఉత్తమమైన, సిద్ధిః=తపఃసిద్ధి, స్యాద్వా=అయిఉండునా! ఇతి=అని, మారుతిః=హనుమంతుడు, అమన్యత=తలచెను.

తా. ఇది స్వర్గలోకమా! దేవతల నివాసస్థానమా! ఇంద్రుని పట్టణమైన అమరావతియా! ఉత్తమమైన తపఃసిద్ధియా! అని హనుమంతుడు తలచెను. 31

మూ. ప్రధ్యాయత ఇవాపశ్యత్ప్రదీపాంస్తత్ర కాఞ్చనాన్,
ధూర్తానివ మహాధూర్తైర్దేవనేన పరాజితాన్. 32

ప్ర. అ. మహాధూర్తైః=గొప్ప జూదరులచే, దేవనేన=జూదము ఆడుటచే, పరాజితాన్=ఓడింపబడిన, ధూర్తానివ=జూదరుల వలె, ప్రధ్యాయత ఇవ=ఏమో ఆలోచించుచున్నవా అన్నట్లు నిశ్చలముగా ఉన్న, కాఞ్చనాన్=బంగారువికారమైన, ప్రదీపాన్=దీపములను, అపశ్యత్=చూచెను.

తా. జూదములో మంచి నేర్పు గల పెద్ద జూదరులు, జూదములో ఓడించివేయుగా ఏమి చేయుటకు తోచక జూదరుల వలె, నిశ్చలములై, ఆలోచించుచున్నవా అన్నట్లున్న బంగారు దీపములు, అక్కడ హనుమంతునకు కనబడెను. 32

మూ. దీపానాం చ ప్రకాశేన తేజసా రావణస్య చ,
అర్చిర్భిర్భూషణానాం చ ప్రదీప్తేత్యభ్యమన్యత. 33

ప్ర.అ. దీపానామ్=దీపములయొక్క, ప్రకాశేన=ప్రకాశముచేతా, రావణస్య=రావణునియొక్క, తేజసా చ= తేజస్సుచేతా, భూషణానామ్=అలంకారముల యొక్క, అర్చిర్భిః చ=కాంతులచేతా, ప్రదీప్తా ఇతి=మండుచున్నదని, అమన్యత=తలచెను.

తా. దీపముల ప్రకాశము, రావణుని తేజస్సూ, అలంకారాల కిరణాలూ, ఇవన్నీ, కలియుటచే హనుమంతునకు ఆ భవనము ప్రజ్వలించుచున్నట్లు కనబడెను.

మూ. తతోఽపశ్యత్కుథాసీనం నానావర్ణామ్బరస్రజమ్,
సహస్రం వరనారీణాం నానావేషవిభూషితమ్. 34

ప్ర. అ. తతః=అటుపిమ్మట, కుథాసీనమ్=చిత్రకంబళముపై కూర్చున్నదీ, నానావర్ణామ్బరస్రజమ్=అనేకవర్ణములు గల వస్త్రములూ మాలికలూ గలదీ, నానావేషవిభూషితమ్=అనేకవిధములైన వేషములచే అలంకరింపబడినదీ అయిన, వరనారీణామ్=శ్రేష్ఠమైన స్త్రీలయొక్క, సహస్రమ్=సహస్రమును, అపశ్యత్=చూచెను.

తా. పిమ్మట, అనేకవిధములైన రంగులు గల వస్త్రములూ, మాలికలూ ధరించి, అనేక విధములైన అలంకారములతో అలంకరించుకొని చాల మంది ఉత్తమస్త్రీలు చిత్రకంబళముపై కూర్చుండి (శయనించి) ఉండగా చూచెను.

మూ. పరివృత్తేఽర్ధరాత్రే తు పాననిద్రావశం గతమ్,
క్రీడిత్వోపరతం రాత్రౌ సుష్వాప బలవత్తదా. 35

ప్ర. అ. రాత్రౌ=రాత్రియందు, క్రీడిత్వా=క్రీడించి, ఉపరతమ్=విశ్రమించినదై, పాననిద్రావశం గతమ్=పానమువలన కలిగిన నిద్రకు వశమై ఆ స్త్రీ సహస్రము, తదా=అప్పుడు, అర్ధరాత్రే=అర్ధరాత్రము, పరివృత్తే=తిరిగిన దగుచుండగా, బలవత్=గాఢముగా, సుష్వాప=నిద్రించెను.

తా. ఆ స్త్రీసహస్రము రాత్రి అంతా క్రీడించి, క్రీడనుండి విరమించి, పిదప మద్యపానమువలన కలిగిన నిద్రకు వశమై, అర్ధరాత్రము తిరగగానే గాఢముగా నిద్రించెను. 35

మూ. తత్ప్రసుప్తం విరురుచే నిశ్శబ్దాన్తరభూషణమ్,
నిఃశబ్దహంసభ్రమరం యథా పద్మవనం మహత్. 36

ప్ర. అ. నిఃశబ్దాన్తరభూషణమ్=ధ్వనిలేని లోపలి అలంకారము కలదీ, ప్రసుప్తమ్=నిద్రపోవుచున్న, తత్=ఆ స్త్రీ సహస్రము, నిఃశబ్దహంసభ్రమరమ్=నిశ్శబ్దముగా ఉన్న హంసలూ, తుమ్మెదలూ గల, మహత్=గొప్ప, పద్మవనం యథా=పద్మము వలె, విరురుచే=ప్రకాశించెను.

తా. శరీరమునందలి ఆ యా నడుము మొదలైన అవయవములు అలంకారములు నిఃశబ్దములుగా ఉండగా నిద్రించుచున్న ఆ నారీసహస్రము,

నిశ్శబ్దముగా ఉన్న హంసలు, తుమ్మెదలూ గల గొప్ప పద్మవనము వలె ప్రకాశించెను. 36

మూ. తాసాం సంవృతదన్తాని మీలితాక్షీణి మారుతిః,
అపశ్యత్పద్మగన్ధీని వదనాని సుయోషితామ్. 37

ప్ర. అ. మారుతిః=హనుమంతుడు, తాసాం సుయోషితామ్=ఆ ఉత్తమ స్త్రీల యొక్క, సంవృతదన్తాని=కప్పబడిన దంతములు గల, మీలితాక్షీణి= మూయబడిన నేత్రములు గల, పద్మగన్ధీని=పద్మముల వంటి సువాసనలు గల, వదనాని=ముఖములను, అపశ్యత్=చూచెను.

తా. ఆ ఉత్తమస్త్రీల పద్మముల సువాసన వంటి సువాసన గల ముఖములు, నేత్రములు మూసికొని, దంతములు కనబడక ఉండెను. అట్టి ముఖములను హనుమంతుడు చూచెను. 37

మూ. ప్రబుద్ధానీవ పద్మాని తాసాం భూత్వా క్షపాక్షయే,
పునః సంవృతపత్రాణి రాత్రావివ బభుస్తదా. 38

ప్ర. అ. తాసామ్=ఆ స్త్రీలయొక్క ముఖములు, క్షపాక్షయే=రాత్రిక్షీణించిన సమయమునందు, ప్రబుద్ధాని=వికసించిన, పద్మానీవ=పద్మముల వలె, భూత్వా= అయి, పునః=తిరిగి, రాత్రౌ=రాత్రియందు, సంవృతపత్రాణీవ=ముకుళీభవించిన రేకులు గలవి వలె, తదా=అప్పుడు, బభుః=ప్రకాశించినవి.

తా. ఆ స్త్రీల ముఖములు, వారు మేల్కొని ఉన్నంతసేపు, సూర్యోదయసమయమునందు వికసించిన పద్మములు వలె ఉండి, వాని నిద్రాసమయమునందు ముకుళీభవించిన పత్రములు కల పద్మములు వలె అయినవి.

మూ. ఇమాని ముఖపద్మాని నియతం మత్తషట్పదాః,
అమ్బుజానీవ ఫుల్లాని ప్రార్థయన్తి పునః పునః. 39

ప్ర. అ. మత్తషట్పదాః=మదించిన తుమ్మెదలు, ఇమాని=ఈ, ముఖ పద్మాని=ముఖములనే పద్మములను, ఫుల్లాని=వికసించిన, అమ్బుజానీవ=పద్మములను వలె, పునః పునః=మాటిమాటికి, నియతమ్=తప్పక, ప్రార్థయన్తి=కోరుచున్నవి.

తా. "మదించిన తుమ్మెదలు, ఈ ముఖపద్మములను, వికసించిన పద్మములను వలె మాటిమాటికి ఆస్వాదించుటకై కోరుచుండును ; నిశ్చయము."

మూ. ఇతీవామన్యత శ్రీమానుపపత్త్యా మహాకపిః,
మేనే హి గుణతస్తాని సమాని సలిలోద్భవైః. 40

ప్ర. అ. శ్రీమాన్=శోభావంతుడైన, మహాకపిః=హనుమంతుడు, ఉప పత్త్యా=తగుయుక్తిచేత, ఇతీవ=ఇట్లు, అమన్యత=తలచెను. తాని=ఆ ముఖములను, గుణతః=సౌందర్యసుగంధాదిగుణములవలన, సలిలోద్భవైః=పద్మములతో, సమాని= సమమైనవాటినిగా, మేనే హి=తలచెను గదా.

తా. శ్రీమంతు డైన ఆ హనుమంతుడు ఆ ముఖములను గూర్చి, యుక్తియుక్తముగా, పైన చెప్పిన విధముగా భావించెను. ఎందుచేత ననగా - సౌందర్య సుగంధాదిగుణములచే ఆ ముఖములు పద్మముల వలె ఉన్నవని అనుకొనెను. 40

మూ. సా తస్య శుశుభే శాలా తాభిః స్త్రీభిర్విరాజితా,
శారదీవ ప్రసన్నా ద్యౌస్తారాభిరభిశోభితా. 41

ప్ర. అ. తస్య=ఆ రావణునియొక్క, సా శాలా=ఆ శాల, తాభిః స్త్రీభిః= ఆ స్త్రీలచేత, విరాజితా=ప్రకాశింపచేయబడినదై, తారాభిః=నక్షత్రములచేత, అభిశో భితా=ప్రకాశింపచేయబడిన, ప్రసన్నా=నిర్మలమైన, శారదీ=శరత్కాలసంబంధమైన, ద్యౌః ఇవ=ఆకాశము వలె, శుశుభే=శోభించెను.

తా. ఆ స్త్రీలచేత ప్రకాశింపచేయబడిన, ఆ రావణుని శాల, శరత్కాలము నందు నక్షత్రములచేత ప్రకాశింపచేయబడిన, నిర్మలమైన ఆకాశము వలె శోభించెను. 41

మూ. స చ తాభిః పరివృతః శుశుభే రాక్షసాధిపః,
యథా హ్యుడుపతిః శ్రీమాంస్తారాభిరభిసంవృతః. 42

ప్ర. అ. తాభిః=ఆ స్త్రీలచేత, పరివృతః=చుట్టుకొనబడిన, సః రాక్షసా ధిపః=ఆ రాక్షసరాజు, తారాభిః=నక్షత్రములచేత, అభిసంవృతః=చుట్టుకొనబడిన, శ్రీమాన్=కాంతి గల, ఉడుపతిః యథా=చంద్రుడు వలె, శుశుభే=ప్రకాశించెను.

తా. ఆ స్త్రీలు తన చుట్టును ఉండుటచే, ఆ రావణుడు, నక్షత్రముల మధ్యనున్న, ప్రకాశయుక్తుడైన చంద్రుని వలె శోభించెను. 42

మూ. యాశ్చ్యవన్తేఽమ్బరాత్తారాః పుణ్యశేషసమావృతాః,
ఇమాస్తాః సంగతాః కృత్స్నా ఇతి మేనే హరిస్తదా. 43

ప్ర. అ. యాః=ఏ, తారాః=నక్షత్రములు, పుణ్యశేషసమావృతాః=పుణ్యము యొక్క శేషముతో కూడిన వై, అమ్బరాత్=ఆకాశమునుండి, చ్యవన్తే=జారిపడునో,

తాః=ఆ, కృత్స్నాః=సమస్తమైన తారలు, ఇమాః=ఈ స్త్రీలుగా, సంగతాః=కలిసి ఉన్నవి, ఇతి=అని, తదా=అప్పుడు, హరిః=హనుమంతుడు, మేనే=తలచెను.

తా. "నక్షత్రములు కొంచెము శేషించిన పుణ్యముతో ఆకాశమునుండి జారి భూమిపై పడిపోవుచుండును గదా. ఆ నక్షత్రములే ఈ స్త్రీల రూపముతో ఇక్కడ చేరినవి" అని హనుమంతుడు భావించెను. 43

మూ. తారాణామివ సువ్యక్తం మహతీనాం శుభార్చిషామ్,
ప్రభావర్ణప్రసాదాశ్చ విరేజుస్తత్ర యోషితామ్. 44

ప్ర. అ. తత్ర=అక్కడ, యోషితామ్=స్త్రీలయొక్క, ప్రభావర్ణప్రసాదాశ్చ= కాంతీ, వర్ణమూ, నైర్మల్యమూ కూడ, శుభార్చిషామ్=శుభమైన కాంతి గల, మహతీనామ్=పెద్దవైన, తారాణామివ=నక్షత్రముల ప్రభావర్ణప్రసాదముల వలె, సువ్యక్తమ్=స్పష్టముగా, విరేజుః=ప్రకాశించినవి.

తా. అక్కడ నున్న ఆ స్త్రీల కాంతీ, వర్ణమూ, నైర్మల్యమూ కూడ శుభమైన కాంతి గల పెద్దవైన నక్షత్రముల కాంతివర్ణనైర్మల్యముల వలె ఉండెను.

మూ. వ్యావృత్తగురుపీనస్రక్ప్రకీర్ణవరభూషణాః,
పానవ్యాయామకాలేషు నిద్రాపహృతచేతసః. 45

ప్ర. అ. పానవ్యాయామకాలేషు=మద్యపానసమయమునందు, రతిసమయ మునందు, వ్యావృత్తగురుపీనస్రక్ప్రకీర్ణవరభూషణాః=తారుమారైన పెద్దవీ లావుగా ఉన్నవీ అయిన పుష్పమాలలు కలవారూ, చెల్లాచెదరైన శ్రేష్ఠమైన అలంకారములు కలవారూ అయిన ఆ స్త్రీలు, నిద్రాపహృతచేతసః=నిద్రచేత అపహరింపబడిన చిత్తములు కలవారై ఉండిరి.

తా. మద్యపానమూ రతికేళులూ చేసే సమయమునందు ఆ స్త్రీలు ధరించిన పెద్దగా లావుగా ఉన్న పుష్పమాలలు తారుమారైపోయినవి. శ్రేష్ఠములైన అలంకారము లన్నీ చెల్లాచెదరైపోయెను. అట్టి ఆ స్త్రీలు ఆ సమయమునందు నిద్రాపరవశత్వము పొంది ఉండిరి. 45

మూ. వ్యావృత్తతిలకాః కాశ్చిత్కాశ్చిదుద్భ్రాన్తనూపురాః,
పార్శ్వే గళితహారాశ్చ కాశ్చిత్పరమయోషితః. 46

ప్ర. అ. కాశ్చిత్=కొందరు, పరమయోషితః=ఉత్తమస్త్రీలు, వ్యావృత్త తిలకాః=రేగిపోయిన తిలకములు కలవారైరి. కాశ్చిత్=కొందరు, ఉద్భ్రా

స్తనూపురాః=కదలి స్థానముతప్పిన అందెళ్ళు కలవారైరి. కాశ్చిత్=కొందరు, పార్శ్వే=ప్రక్కయందు (ప్రక్కకు), గళితహారాశ్చ=జారిన హారములు కలవారైరి.

తా. ఆ ఉత్తమస్త్రీలలో కొందరి నుదుటి మీది తిలకము రేగిపోయెను. కొందిరి అందెళ్లు చోటు తప్పెను. కొందరి హారములు ప్రక్కకు వ్రేలాడుచుండెను.
46

మూ. ముక్తాహారావృతాశ్చాన్యాః కాశ్చిద్విస్రస్తవాససః,
వ్యావిద్ధరశనాదామాః కిశోర్య ఇవ వాహితాః. 47

ప్ర. అ. అన్యాః=మరికొందరు స్త్రీలు, ముక్తాహారావృతాః=ముత్యముల చేత చుట్టబడినవారై, కాశ్చిత్=మరికొందరు, విస్రస్తవాససః=జారిపోయిన వస్త్రములుకలవారై, మరికొందరు, వ్యావిద్ధరశనాదామాః=చిక్కులు పడిన మొలనూలు (వడ్డాణములు) కలవారై, వాహితాః=చాలదూరము నడిపింపబడిన, కిశోర్యః ఇవ=చిన్న ఆడగుఱ్ఱముల వలె ఉండిరి.

తా. కొందరి ముత్యాల హారములు తొలిగి వారి శరీరము చుట్టూ వ్రేలాడుచుండెను. కొందరి వస్త్రములు జారిపోయెను. కొందరి వడ్డాణములు చిక్కులు పడి ఉండగా, వారు చాల దూరము నడిపించిన ఆడగుఱ్ఱముల వలె ఉండిరి. 47

మూ. సుకుణ్డలధరాశ్చాన్యా విచ్ఛిన్నమృదితస్రజః,
గజేన్ద్రమృదితాః ఫుల్లా లతా ఇవ మహావనే. 48

ప్ర. అ. సుకుణ్డలధరాః=మంచి కుండలములు ధరించిన, అన్యాః= మరి కొందరు, విచ్ఛిన్నమృదితస్రజః=తెగిపోయిన, నలిగిన, పుష్పమాలలు కలవారై, మహావనే=మహావనమునందు, గజేన్ద్రమృదితాః=గజరాజుచేత నలగకొట్ట బడిన, ఫుల్లాః=వికసించిన, లతాః ఇవ=లతలవలె ఉండిరి.

తా. నలిగి తెగిపోయిన పుష్పమాలలు ధరించిన కొందరు స్త్రీలు మంచి కుండలములు ధరించి ఉండిరి. ఆ స్త్రీలు, మహావనములో, ఏనుగులు నలగగొట్టిన, పుష్పించిన లతల వలె ఉండిరి. 48

మూ. చన్ద్రాంశుకిరణాభాశ్చ హారాః కాసాంచిదుత్కటాః,
హంసా ఇవ బభుః సుప్తాః స్తనమధ్యేషు యోషితామ్. 49

ప్ర. అ. కాసాంచిత్=కొందరు, యోషితామ్=స్త్రీలయొక్క, స్తనమధ్యేషు= స్తనముల మధ్యములందు, ఉత్కటాః=పెద్దవైన, చన్ద్రాంశుకిరణాభాశ్చ=చంద్రుని

కిరణముల వంటి కిరణములు, కాంతి గల, హారాః=ముత్యాల హారములు, సుప్తాః=నిద్రించుచున్న, హంసాః ఇవ=హంసల వలె, బభుః=ప్రకాశించినవి.

తా. చంద్రకిరణముల వలె తెల్లగా ఉన్న పెద్ద పెద్ద ముత్యాలహారములు, కొందరి స్తనమధ్యములందు నిశ్చలముగా పడి యుండుటచే అవి నిద్రించుచున్న హంసల వలె ప్రకాశించుచుండెను. 49

మూ. అపరాసాం చ వైడూర్యాః కాదమ్బా ఇవ పక్షిణః,
హేమసూత్రాణి చాన్యాసాం చక్రవాకా ఇవాభవన్. 50

ప్ర. అ. అపరాసాం చ=మరికొందరు స్త్రీలయొక్క, వైడూర్యాః=వైడూర్యమణులతో చేయబడిన హారములు, కాదమ్బాః=కాదంబములను, పక్షిణః ఇవ=పక్షులు వలె, (వీటి ముక్కులు, కాళ్ళు, రెక్కలు ధూమ్రవర్ణములుగా ఉండును) అన్యాసామ్=మరికొందరు స్త్రీలయొక్క, హేమసూత్రాణి=బంగారు సూత్రములు, చక్రవాకాః ఇవ=చక్రవాకపక్షుల వలె, అభవన్=ఉండెను.

తా. కొందరు స్త్రీలు ధరించిన వైడూర్యమణిహారములు కాదంబపక్షుల వలె, మరి కొందరు ధరించిన బంగారుసూత్రములు చక్రవాకముల వలె ఉండెను. 50

మూ. హంసకారణ్డవాకీర్ణాశ్చక్రవాకోపశోభితాః,
ఆపగా ఇవ తా రేజుర్జఘనైః పులినైరివ. 51

ప్ర. అ. పులినైరివ=ఇసుక తిన్నెల వలె ఉన్న, జఘనైః=జఘనములతో, తాః=ఆ స్త్రీలు, హంసకారణ్డవాకీర్ణాః=హంసలతోను, కారండవపక్షులతోను వ్యాప్తమైన, చక్రవాకోపశోభితాః=చక్రవాకపక్షులచేత అలంకరింపబడిన, ఆపగా ఇవ=నదులు వలె, రేజుః=ప్రకాశించిరి.

తా. ఇసుక తిన్నెల వంటి విశాలములైన జఘనప్రదేశములతో ఆ స్త్రీలు హంస-కారండవ-చక్రవాకపక్షులతో శోభించుచున్న నదుల వలె ప్రకాశించిరి.

మూ. కిఙ్కిణీజాలసంకోశాస్తా హైమవిపులామ్బుజాః,
భావగ్రాహా యశస్తీరాః సుప్తా నద్య ఇవాబభుః. 52

ప్ర. అ. కిఙ్కిణీజాలసంకోశాః=చిరుమువ్వల సముదాయములనే మొగ్గలు కలవారూ, హైమవిపులామ్బుజాః=బంగారు ఆభరణము లనే పెద్ద పద్మములు కలవారూ, భావగ్రాహాః=శృంగారాదిచేష్టలనే మొసళ్లు కలవారూ, యశస్తీరాః=కీర్తి

అను తీరములు కలవారూ అయిన, సుప్తాః=నిద్రపోవుచున్న ఆ స్త్రీలు, నద్యః ఇవ=నదులు వలె, ఆబభుః=ప్రకాశించిరి.

తా. అక్కడ నిద్రించుచున్న స్త్రీలు నదుల వలె ప్రకాశించుచుండిరి. వారు ధరించిన చిరుమువ్వలే మొగ్గలు; బంగారు ఆభరణములే పెద్ద పద్మములు; వారి ప్రేమాదిభావములే మొసళ్లు; కీర్తులే తీరములు. 52

మూ. మృదుష్వఙ్గేషు కాసాంచిత్కుచాగ్రేషు చ సంస్థితాః,
బభూవుర్భూషణానీవ శుభా భూషణరాజయః. 53

ప్ర. అ. కాసాంచిత్=కొందరు స్త్రీలయొక్క, మృదుషు=మృదువులైన, అఙ్గేషు=అవయవములందు, కుచాగ్రేషు చ=స్తనముల అగ్రములందూ, సంస్థితాః=ఉన్న, శుభాః=అందమైన, భూషణరాజయః=అలంకారముల రేఖలు, భూషణానీవ=అలంకారములు వలె, బభూవుః=ఉండెను.

తా. అలంకారముల ఒత్తిడికి కొందరి మెత్తని అవయవములమీదా, కుచాగ్రముల మీదా రేఖలు పడెను. అవి ఆ యా అవయవములపై ధరించిన అలంకారములు వలె ఉండెను. 53

మూ. అంశుకాన్తాశ్చ కాసాంచిన్ముఖమారుతకమ్పితాః,
ఉపర్యుపరి వక్త్రాణాం వ్యాధూయన్తే పునః పునః. 54

ప్ర. అ. కాసాంచిత్=కొందరు స్త్రీలయొక్క, ముఖమారుతకమ్పితాః=ముఖవాయువుచేత కదల్పబడిన, అంశుకాన్తాశ్చ=వస్త్రాంతములు, వక్త్రాణామ్=ముఖములయొక్క, ఉపర్యుపరి=పై పైన, పునః పునః=మాటిమాటికి, వ్యాధూయన్తే=ఎగురగొట్టబడుచుండెను.

తా. కొందరి స్త్రీల శ్వాసనిఃశ్వాసములచే వస్త్రాంతములు ఎగురుచు, మాటిమాటికి వారి ముఖములపై కొట్టుకొనుచుండెను. 54

మూ. తాః పతాకా ఇవోద్ధూతాః పత్నీనాం రుచిరప్రభాః,
నానావర్ణసువర్ణానాం వక్త్రమూలేషు రేజిరే. 55

ప్ర. అ. నానావర్ణసువర్ణానామ్=అనేకవిధములైన మంచి వర్ణములు గల, పత్నీనామ్=రావణభార్యలయొక్క, వక్త్రమూలేషు=ముఖముల మూలము అందు (కంఠములందు), తాః=ఆ వస్త్రాంతములు, రుచిరప్రభాః=అందమైన కాంతులు గల, ఉద్ధూతాః=ఎగురవేయబడిన, పతాకాః ఇవ=పతాకలు వలె, రేజిరే=ప్రకాశించినవి.

తా. అనేకవిధము లైన మంచి రంగులు గల ఆ రావణభార్యల కంఠముల సమీపమునందు, ఆ వస్త్రాంతములు, మంచి కాంతి గల, ఎగురవేసిన పతాకముల వలె ప్రకాశించెను.

వి. "నానావర్ణాః సువర్ణానామ్" అను పాఠమున్నచో బాగుండును. "నానావర్ణాః" అనునది 'తాః' అనుదానికి విశేషణముగా చెప్పవచ్చును. కాని అట్టి పాఠము గోరఖ్‌పూర్‌ప్రతిలో కూడ లేదు. మరెక్కడైనా ఉండవచ్చునని తోచుచున్నది. 55

మూ. వవల్గుశ్చాత్ర కాసాంచిత్కుణ్డలాని శుభార్చిషామ్,
ముఖమారుతసంసర్గాన్మన్దం మన్దం సుయోషితామ్. 56

ప్ర. అ. శుభార్చిషామ్=మంచికాంతి గల, కాసాంచిత్=కొందరు, యోషితామ్=స్త్రీలయొక్క, కుణ్డలాని=కుండలములు, అత్ర=ఇచట, ముఖమారుత సంసర్గాత్=ముఖవాయువుయొక్క సంబంధమువలన, మన్దం మన్దమ్=మెల్లమెల్లగా, వవల్గుశ్చ=కదలినవి కూడ.

తా. ఉత్తమసౌందర్యవతులైన కొందరు స్త్రీల కుండలములు, ముఖవాయుసంబంధము చేత, మెల్ల మెల్లగా కదలుచుండెను. 56

మూ. శర్కరాసవగన్ధైశ్చ ప్రకృత్యా సురభిః సుఖః,
తాసాం వదననిఃశ్వాసః సిషేవే రావణం తదా. 57

ప్ర. అ. తదా=అప్పుడు, ప్రకృత్యా=స్వభావముచేతను,శర్కరాసవగన్ధైశ్చ= శర్కరతో చేయబడిన మద్యము గంధములతోను, సురభిః=పరిమళించుచున్న, సుఖః=సుఖకరమైన, తాసామ్=ఆ స్త్రీలయొక్క, వదననిఃశ్వాసః=ముఖముల నిఃశ్వాసము, రావణమ్=రావణుని, సిషేవే=సేవించెను.

తా. స్వభావసిద్ధముగానే కాకుండా, చక్కెరతో తయారు చేసిన మద్యము గంధముచేత కూడ పరిమళించుచున్న, ఆ స్త్రీల నిట్టూర్పుల వాయువు, అప్పుడు రావణునకు సుఖమును కూర్చి ఆనందము కలిగించెను. 57

మూ. రావణాననశఙ్కాశ్చ కాశ్చిద్రావణయోషితః,
ముఖాని స్మ సపత్నీనాముపాజిఘ్రన్ పునః పునః. 58

ప్ర. అ. కాశ్చిత్=కొందరు, రావణయోషితః=రావణస్త్రీలు, రావణాననశఙ్కాశ్చ=రావణుని ముఖము అను శంక గలవారై, పునః పునః=మాటి మాటికి,

సపత్నీనామ్=సవతుల, ముఖాని=ముఖములను, ఉపాజిఘ్రన్=వాసనచూచిరి (ముద్దు పెట్టుకొనిరి).

తా. రావణుని భార్యలలో కొందరు, రావణుని ముఖమే అను భ్రాంతి చేత, తమ ప్రక్క నున్న సవతుల ముఖములను ముద్దు పెట్టుకొనుచుండిరి. 58

మూ. అత్యర్థం సక్తమనసో రావణే తా వరస్త్రియః,
అస్వతన్త్రాః సపత్నీనాం ప్రియమేవాచరంస్తదా. 59

ప్ర. అ. రావణే=రావణునియందు, అత్యర్థమ్=మిక్కిలి, సక్తమనసః=లగ్న మైన మనస్సులు గల, తాః=ఆ, వరస్త్రియః=శ్రేష్ఠ లైన స్త్రీలు, అస్వతన్త్రాః=స్వ తంత్రులుకాని వారై (ఒడలు తెలియని స్థితిలో ఉన్న వారై), తదా=అప్పుడు, సపత్నీనామ్=సవతులకు, ప్రియమేవ=ప్రియమునే, ఆచరన్=చేసిరి.

తా. రావణునిపై మిక్కిలి లగ్నమైన మనస్సు గల ఆ స్త్రీలు, నిద్రామద్య మదములచేత ఒడలు తెలియని స్థితిలో, తమ ప్రక్క నున్న సవతులను రావణుడే అను భ్రాంతిచే ముద్దు పెట్టుకొని, వారికి ప్రియమునే చేసిరి. ఎందుచేతననగా తమను రావణుడే చుంబించుచున్నాడని వాళ్ళు భ్రాంతిపడుచుండిరి. 59

మూ. బాహూనుపనిధాయాన్యాః పారిహార్యవిభూషితాన్,
అంశుకాని చ రమ్యాణి ప్రమదాస్తత్ర శిశ్యిరే. 60

ప్ర. అ. అన్యాః=మరి కొందరు, ప్రమదాః=స్త్రీలు, పారిహార్యవిభూషితాన్= కంకణములచేత అలంకరింపబడిన, బాహూన్=బాహువులను, రమ్యాణి=సుందరము లైన, అంశుకాని=వస్త్రములను, ఉపనిధాయ=తలగడలుగా చేసికొని, తత్ర=అక్కడ, శిశ్యిరే=శయనించిరి.

తా. కొందరు స్త్రీలు కంకణములచేత అలంకరించబడిన బాహువులను, మరి కొందరు మంచి వస్త్రములను, తలగడలుగా చేసికొని నిద్రించిరి. 60

మూ. అన్యా వక్షసి చాన్యస్యాస్తస్యాః కాచిత్పునర్భుజమ్,
అపరా త్వఙ్కమన్యస్యాస్తస్యాశ్చాప్యపరా కుచౌ. 61

ప్ర. అ. అన్యా=ఒక స్త్రీ, అన్యస్యాః=మరియొక స్త్రీయొక్క, వక్షసి= వక్షఃస్థలమునందు, శయనించెను. కాచిత్పునః=మరి యొక స్త్రీ యైతే, తస్యాః=ఆమెయొక్క, భుజమ్=భుజమును,అపరా తు=మరి యొక స్త్రీ యైతే, అన్యస్యాః=మరి యొక స్త్రీయొక్క, అఙ్కమ్=తొడను, అపరా=మరి యొకతె, తస్యాః=ఆమెయొక్క, కుచౌ=కుచములను, తలగడగా చేసికొని శయనించెను.

తా. ఒక స్త్రీ మరియొకస్త్రీ వక్షస్థలముపై తలపెట్టి నిద్రించెను. ఆమె భుజమును తలగడగా చేసికొని మరియొకతె శయనించెను. ఒక స్త్రీ మరియొక స్త్రీ తొడపై శయనించగా, ఆమె కుచములను తలగడగా చేసికొని మరియొకతె శయనించెను. 61

మూ. ఊరుపార్శ్వకటీపృష్ఠమన్యోన్యస్య సమాశ్రితాః,
పరస్పరనివిష్టాఙ్గ్యో మదస్నేహవశానుగాః. 62

ప్ర. అ. మదస్నేహవశానుగాః=మదమునకు, స్నేహమునకు వశంవదలై, అన్యోన్యస్య=పరస్పరముయొక్క, ఊరుపార్శ్వకటీపృష్ఠమ్=తొడలను, పార్శ్వములను, కటిప్రదేశములను, వీపులను, సమాశ్రితాః=ఆశ్రయించినవారై, పరస్పరనివిష్టాఙ్గ్యః= ఒండొరులపై పడవేయబడిన అవయవములు గలవారై, శయనించిరి.

తా. ఆ స్త్రీలందరు మదమునకు, స్నేహమునకూ లొంగిపోయి, ఒండొరులపై అవయవములు పడవేసి, ఒండొరుల తొడలను, పార్శ్వములను, కటిప్రదేశమును, వీపును ఆశ్రయించుకొని పండుకొని యుండిరి. 62

మూ. అన్యోన్యభుజసూత్రేణ స్త్రీమాలా గ్రథితా హి సా,
మాలేవ గ్రథితా సూత్రే శుశుభే మత్తషట్పదా. 63

ప్ర. అ. అన్యోన్యభుజసూత్రేణ=ఒండొరుల భుజములనెడు త్రాడుతో, గ్రథితా=కట్టబడిన, సా=ఆ, స్త్రీమాలా=స్త్రీల మాల, సూత్రే=దారమునందు, గ్రథితా= గ్రుచ్చబడిన, మత్తషట్పదా=మదించిన తుమ్మెదలు గల, మాలేవ=పుష్పమాల వలె, శుశుభే=ప్రకాశించెను.

తా. ఒండొరుల భుజములనే దారముతో గ్రుచ్చబడిన ఆ స్త్రీమాల (స్త్రీలనే మాల) దారముతో గుచ్చినదీ, మదించిన తుమ్మెదలతో కూడినదీ అయిన పుష్పమాల వలె ప్రకాశించెను. 63

మూ. లతానాం మాధవే మాసి పుల్లానాం వాయుసేవనాత్,
అన్యోన్యమాలాగ్రథితం సంసక్తకుసుమోచ్చయమ్. 64
వ్యతివేష్టితసుస్కన్ధమన్యోన్యభ్రమరాకులమ్,
ఆసీద్వనమివోద్ధూతం స్త్రీవనం రావణస్య తత్. 65

ప్ర. అ. అన్యోన్యమాలాగ్రథితమ్=పరస్పరమూ మాలగా కట్టబడినదీ, సంసక్తకుసుమోచ్చయమ్=కలిసిపోయిన పుష్పసముదాయము కలదీ, వ్యతివేష్టితసుస్కన్ధమ్=చుట్టుకొనబడిన అందమైన భుజములు గలదీ, అన్యోన్యభ్రమరాకులమ్=

పరస్పరము ముంగురులతో వ్యాకులమూ, అయిన, రావణస్య=రావణునియొక్క, తత్=ఆ, స్త్రీవనమ్=స్త్రీసముదాయము, మాధవే మాసి=వైశాఖమాసమునందు, వాయుసంసేవనాత్=వాయువుయొక్క సంపర్కము వలన, పుల్లానామ్=వికసించిన, లతానామ్=లతలయొక్క, అన్యోన్యమాలాగ్రథితమ్=పరస్పరమూ మాలారూపమున కట్టబడినదీ, సంసక్తకుసుమోచ్చయమ్=లగ్నమైన పుష్పసముదాయము గలదీ, వ్యతివేష్టితసుస్కన్ధమ్=చుట్టబడిన మంచి మ్రానులు కలదీ, అన్యోన్యభ్రమరాకులమ్=పరస్పరము తుమ్మెదలతో వ్యాకులమైనదీ, ఉద్ధూతమ్=ఎగురగొట్టబడినదీ అయిన, వనమివ=వనము వలె, ఆసీత్=ఉండెను.

తా. రావణుని స్త్రీలసముదాయ మనే ఆ వనము వసంతర్తువునందు గాలి సోకుటచేత వికసించిన పుష్పములు గల లతల వనము వలె ఉండెను. ఆ స్త్రీవనము పరస్పరము మాల వలె కట్టబడి యుండెను. ఒకరు ధరించిన పుష్పములు మరియొకరి పుష్పములతో కలిసిపోయెను. ఒకరి భుజములతో మరొకరి భుజములు చుట్టుకొని ఉండగా ఒండొరుల ముంగురులు కలిసిపోయెను. లతావనము నందు కూడ లతలన్నీ మాలగా అల్లుకొనిపోయి, వాటి పుష్పములు కలిసి పోవును. లతలు చెట్లమాను (స్కంధము)లకు చుట్టుకొనును. తుమ్మెదలు ఒక లత నుండి మరొకదానిమీదికి తిరుగుచుండును. అందుచే స్త్రీవనము లతావనము వలె ఉండెను. 64, 65

మూ. ఉచితేష్వపి సువ్యక్తం న తాసాం యోషితాం తదా,
వివేకః శక్య ఆధాతుం భూషణాఙ్గామ్బరస్రజామ్. 66

ప్ర. అ. తదా=అప్పుడు, తాసాం యోషితామ్=ఆ స్త్రీలయొక్క, భూషణాఙ్గామ్బరస్రజామ్=భూషణములయొక్క, అవయవములయొక్క, వస్త్రములయొక్క, మాలికలయొక్క, వివేకః=వివేకము, సువ్యక్తమ్=సుస్పష్టముగా, ఆధాతుమ్=చేయుటకు, ఉచితేష్వపి=అలవాటుపడినవారియందు గూడా, న శక్యః=శక్యము కాదు.

తా. ఆ సమయమునందు ఆ స్త్రీల భూషణములు గాని, అవయవములు గాని, వస్త్రములు గాని, మాలలు కాని, ఏవి ఎవరివో స్పష్టముగా చెప్పుటకు వారితో పరిచయము కలవారికి కూడ శక్యము కాకుండెను. 66

మూ. రావణే సుఖసంవిష్టే తాః స్త్రియో వివిధప్రభాః,
జ్వలన్తః కాఞ్చనా దీపాః ప్రైక్షన్తానిమిషా ఇవ. 67

ప్ర. అ. రావణే=రావణుడు, సుఖసంవిష్టే=సుఖముగా శయనించినవా డగుచుండగా, వివిధప్రభాః=అనేకవిధము లైన కాంతులు గల, తాః స్త్రియః=ఆ స్త్రీలను, జ్వలన్తః=ప్రజ్వలించుచున్న, కాఞ్చనాః దీపాః=బంగారుదీపములు, అనిమిషాః=రెప్పపాటులేనివై, ప్రైక్షన్త ఇవ=చూచుచుండెనా అన్నట్లుండెను.

తా. రావణుడు మేల్కొని ఉండగా ఎవ్వరును ఆ స్త్రీల వైపు కన్నెత్తి చూడజాలరు. అందుచేత ప్రజ్వలించుచున్న బంగారు దీపములు, రావణుడు సుఖముగా నిద్రించుచున్న సమయమునందు, అనేకవిధము లైన కాంతులు గల ఆ స్త్రీలను, రెప్పపాటు కూడ వేయకుండ చూచుచున్నవా అన్న ట్లుండెను.67

మూ. రాజర్షిపితృదైత్యానాం గన్ధర్వాణాం చ యోషితః,
రాక్షసానాం చ యాః కన్యాస్తస్య కామవశం గతాః. 68

ప్ర. అ. రాజర్షిపితృదైత్యానామ్=రాజర్షులయొక్క, పితృదేవతల యొక్క దైత్యులయొక్క, గన్ధర్వాణామ్=గంధర్వులయొక్క, యోషితః=స్త్రీలు, రాక్షసానామ్=రాక్షసులయొక్క, యాః=ఏ, కన్యాః=కన్యలు గలరో, వారూ, తస్య=ఆ రావణునికి, కామవశమ్=కామముచే వశమును, గతాః=పొందినారు.

తా. రాజర్షుల స్త్రీలు, పితృదేవతల స్త్రీలు, దైత్యుల స్త్రీలు, గంధర్వుల స్త్రీలు, రాక్షసకన్యలు కామముచేతనే రావణునకు వశమైరి. 68

మూ. యుద్ధకామేన తాః సర్వా రావణేన హృతాః స్త్రియః,
సమదా మదనేనైవ మోహితాః కాశ్చిదాగతాః. 69

ప్ర. అ. సర్వాః=సమస్తమైన, తాః స్త్రియః=ఆ స్త్రీలు, యుద్ధకామేన=యుద్ధమునందు కోరిక గల, రావణేన=రావణునిచేత, హృతాః=హరింపబడిరి. సమదాః=యౌవనమదముతో కూడిన, కాశ్చిత్=కొందరు, మదనేన=మన్మథునిచేత, మోహితాః ఏవ=మోహింపబడినవారే అయి, ఆగతాః=రావణుని పొందినారు.

తా. రావణుడు అనేక యుద్ధములు చేసి ఆ స్త్రీలనందరిని జయించి తెచ్చెను. యౌవనోన్మాదము గల కొందరు స్త్రీలు మాత్రము మన్మథప్రేరణచేతనే రావణుని చేరిరి. 69

మూ. న తత్ర కాచిత్ప్రమదా ప్రసహ్య
వీర్యోపపన్నేన గుణేన లబ్ధా,
న చాన్యకామాపి న చాన్యపూర్వా
వినా వరార్హాం జనకాత్మజాం తామ్. 70

ప్ర. అ. వరార్హామ్=అత్యుత్తమురాలైన, తామ్=ఆ, జనకాత్మజాం వినా=సీత తప్ప, తత్ర=అక్కడ, కాచిత్ ప్రమదా=ఏ స్త్రీ కూడ, వీర్యోపపన్నేన=వీర్యముతో కూడిన రావణుని చేత, ప్రసహ్యా=బలాత్కరించి, లబ్ధా=పొందబడినదీ, న=లేదు. గుణేన=గుణముచేతనే (లబ్ధా=పొందబడినది). అన్యకామా పి=మరియొకనియందు కామము కలది, న చ=లేదు. అన్యపూర్వా చ=పూర్వము అన్యుడు కలది కూడ, న=లేదు.

తా. అత్యుత్తమురాలైన జానకి తప్ప, పరాక్రమవంతుడైన ఆ రావణుడు బలాత్కారముగా తీసికొని తెచ్చిన స్త్రీ ఒక్కతె కూడ అక్కడ లేదు. అందరు స్త్రీలును అతని గుణములను పట్టి వచ్చినవారే. మరొక పురుషునియందు ప్రేమగల స్త్రీ గాని, పూర్వము ఒక పురుషునికి ప్రియురాలుగా ఉన్న స్త్రీ గాని అక్కడ లేదు. 70

మూ. న చాకులీనా న చ హీనరూపా
నాదక్షిణా నానుపచారయుక్తా,
భార్యాభవత్తస్య న హీనసత్త్వా
న చాపి కాన్తస్య న కామనీయా. 71

ప్ర. అ. తస్య=ఆ రావణునియొక్క, భార్యా=భార్య, అకులీనా=సత్కులమునందు పుట్టనిది, న చ అభవత్=లేకుండెను. హీనరూపా చ=తక్కువ సౌందర్యము కలదికూడ, న=లేకుండెను. అదక్షిణా=నేర్పు లేనిది, న=లేకుండెను, అనుపచారయుక్తా=ఉపచారములతో కూడనిది, న=లేకుండెను, హీనసత్త్వా=తక్కువ బుద్ధి గలది, న=లేకుండెను. కాన్తస్య=ప్రియునకు, న కామనీయా చ=కోరదగనిది కూడ, న=లేకుండెను.

తా. ఆ రావణుని భార్యలలో, సత్కులమునందు జనించనిది గాని, సౌందర్యహీనురాలు గాని, నేర్పు లేనిది కాని, ఉపచారములు పొందనిది కాని, బుద్ధిహీనురాలు గాని, ప్రియుని మనస్సు ఆకర్షించనిది గాని ఒక్కతె కూడ లేకుండెను. 71

మూ. బభూవ బుద్ధిస్తు హరీశ్వరస్య
యదీదృశీ రాఘవధర్మపత్నీ,
ఇమా యథా రాక్షసరాజభార్యాః
సుజాతమస్యేతి హి సాధుబుద్ధేః. 72

ప్ర. అ. ఇమాః=ఈ, రాక్షసరాజభార్యాః=రాక్షసరాజుయొక్క భార్యలు, యథా=ఎట్లో, రాఘవధర్మపత్నీ=రాముని ధర్మపత్నియైన సీత కూడ, ఈదృశీ=అట్టిదే అయినచో, అస్య=వీనికి, సుజాతమ్=మంచిది; ఇతి=అని, సాధుబుద్ధేః=మంచిబుద్ధి గల, హరీశ్వరస్య=హనుమంతునకు, బుద్ధిస్తు=ఆలోచనయైతే, బభూవ=(మొదట) కలిగినది.

తా. రావణుని భార్య లైన ఈ స్త్రీలందరు ఏ విధముగా ఈతనిపై ప్రేమానురాగములతో ఉన్నారో రాముని భార్యయైన సీత కూడ ఆ విధముగానే ఈతని వశమై పోయినచో వీనికి మంచిది అని ఆ అంతఃపురకాంతలను చూచిన వెంటనే మొట్టమొదటి బుద్ధిశాలి యైన హనుమంతునకు ఆలోచన కలిగెను.

వి. సీత ఈ రావణునికి లొంగిపోయినచో ఈతనికి మంచిది అని హనుమంతుడు అనుకొనుట యుక్తము కాదని తలచి వ్యాఖ్యాతలు ఈ శ్లోకానికి ఎన్నో విధాల వ్యాఖ్యలు వ్రాసినారు. కాని అవేవీ అక్షరార్థానికి అనుగుణముగా లేవు. రావణుని అత్యద్భుత మైన ఐశ్వర్యమును చూడగానే హనుమంతుడు ఆశ్చర్యచకితుడై ఈ స్త్రీలందరూ ఏ విధముగా రావణునికి వశమైపోయినారో సీత కూడా అట్లే వశమైపోయి ఉండవచ్చును అని అనుకొనుటలో దోషమేమీ లేదు. సీతను గూర్చి అప్పటికి, ఆతనికి పూర్తిగా తెలియదు కదా; దేవగంధర్వాదుల స్త్రీలే లొంగిపోయినపుడు మనుష్యస్త్రీ మాట చెప్పవలెనా అను భావము కలుగవచ్చును కదా. రాబోవు సర్గ చివర కూడ మండోదరిని చూచి సీతయే అని అతడు మొదట భ్రాంతిపడినాడు కదా ! ఇతరస్త్రీల వలె సీత కూడ ఈ రావణునికి వశ మైపోయినచో నిజముగా ఇతడు అదృష్టవంతుడే. అప్పుడు రాముడు ఈతనిని సంహరించడు. అట్లుకానిచో వీనికి రాముని చేతిలో మరణము తప్పదు అని హనుమంతుని అభిప్రాయము. సీత రావణుని అంతఃపురములో ఇతర స్త్రీలతో కలిసి ఉండవచ్చుననే ఉద్దేశ్యముతోనే కదా హనుమంతుడు అంతఃపురములో అన్వేషించుచున్నాడు. హనుమంతుడు మొదట ఈ విధముగా అనుకొని- "ఏమైనా రావణుడు సీత విషయములో చేయకూడని పనియే చేసినాడు" అని తరువాతి శ్లోకములో అనుకొనును. అలా అనుకొన్నప్పుడు కూడ, తన మొదటి అభిప్రాయమును మార్చుకొన్నట్లు లేదు. ఈ సర్గలోను రాబోవు సర్గలోను కూడ సీత రావణాంతఃపురములో ఇతర స్త్రీలతో పాటు ఉండవచ్చుననియే హనుమంతుడు అనుకొన్నట్లు తోచును. వ్యాఖ్యాతలు చెప్పిన కొన్ని అర్థాలు :-

1. "ఈ రావణుని భార్యలు తమ భర్తతో కలిసి ఉన్నట్లు సీత కూడ రామునితో కలిసి ఉండే విధముగా రావణుడు సీతను రామునకు తిరిగి ఇచ్చినచో ఆతనికి మంచిదగును".
2. "గుణవంతురాలైన సీతను రావణుడు హరించినట్లు ఈ రావణ భార్యల నందరిని సుగ్రీవుడు హరించినచో ఆతనికి మంచి దగును".
3. "రావణుడు ఈ స్త్రీలను అపహరించి నట్లు సీతను అపహరించినచో ఇతనికి ఎంతమాత్రము మంగళము కాగదు"
4. "నేను ఈ రావణుని భార్యలను చూచి నట్లు రాముని భార్య యైన సీతను కూడ చూడ గలిగినచో నా జన్మ సఫల మగును."
5. "నేను ఈ రావణ భార్యలను చూచినట్లు రాముని భార్యను కూడ చూడగలిగినచో అంగదాదివానరులు ప్రాయోపవేశము చేయక సుఖముగా ఉందురు."
6. ఈ రావణభార్యలు జీవించి ఉన్నట్లు సీత కూడ జీవించి ఉన్నచో రామునకు ప్రాణహాని కలుగక అతడు సుఖముగా ఉండును".
7. "రావణా ! నీ వీ స్త్రీలను భార్యలనుగా చేసికొన్నట్లు రాముని భార్యను కూడ నీ భార్యగా చేసుకొన్నచో నీకు వినాశము తప్పదు".
8. "సీత ఈ రావణభార్యల వలె అల్పసౌందర్యవతి కాదు. కావుననే ఆమె ఇక్కడ అగపడుటలేదు".

ఈ లాంటి వ్యాఖ్యలకు అంతు ఉండదు. వినేవారికి ఓపిక ఉండవలెను. ప్రాచీన వ్యాఖ్యాతలు కూడ ఈ శ్లోకానికి స్పష్టంగా కనబడు అర్థమును (ప్రతిపదార్థతాత్పర్యములలో చూపినదానిని, గ్రహించి "హనుమంతుడు సీత విషయములో ఆ విధముగా భావించి తన కపిస్వభావమును కనబరచినాడు. అని ఆక్షేపించినారు. దీనిని బట్టి వీరు తరువాత చెప్పిన అర్థాలన్నీ స్వకపోలకల్పితాలని స్పష్టమగుచున్నది.) 72

మూ. పునశ్చ సోఽచిన్తయదార్తరూపో
ధ్రువం విశిష్టా గుణతో హి సీతా,
అథాయమస్యాం కృతవాన్మహాత్మా
లఙ్కేశ్వరః కష్టమనార్యకర్మ. 73

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే సున్దరకాణ్డే
నవమః సర్గః.

ప్ర. అ. సః=హనుమంతుడు, ఆర్తరూపః=మిక్కిలి దుఃఖితుడై, పునశ్చ= మరల, అచిన్తయత్=ఆలోచించెను. సీతా=సీత, ధ్రువమ్=నిశ్చయముగా, గుణతః=గుణములవలన, విశిష్టా=శ్రేష్ఠురాలు, అథ=అట్లైనను, మహాత్మా=గొప్ప బుద్ధిగల, అయం లజ్కేశ్వరః=ఈ లంకాధిపతియైన రావణుడు, అస్యామ్=ఈమె విషయమున, అనార్యమ్=చెడ్డ పనిని, కృతవాన్=చేసినాడు. కష్టమ్=ఏమి కష్టము.

తా. సీత గుణములచేత చాలా ఉత్తమురాలు. సందేహము లేదు. అయినను మహాత్ముడైన ఈ రావణుడు ఈమె విషయమున చేయకూడని పని చేసినాడు. ఎంత కష్టము ! అని హనుమంతుడు చాల దుఃఖించుచు, మరల మనస్సులో అనుకొనెను. 73

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు సుందరకాండలో తొమ్మిదవ సర్గ సమాప్తము.

అథ దశమః సర్గః

[అంతఃపురములో నిద్రించుచున్న రావణుని, అతని అంతఃపుర స్త్రీలను హనుమంతుడు చూచుట. అచట మండోదరిని చూచి సీత అని భ్రాంతిపడి, సీత కనబడినది కదా అని అతడు సంతోషించుట.]

మూ. తత్ర దివ్యోపమం ముఖ్యం స్ఫాటికం రత్నభూషితమ్,
అవేక్షమాణో హనుమాన్ దదర్శ శయనాసనమ్. 1
దాన్తకాఞ్చనచిత్రాఙ్గైర్వైడూర్యైశ్చ వరాసనైః,
మహార్హాస్తరణోపేతైరుపపన్నం మహాధనైః. 2

ప్ర. అ. తత్ర=ఆ అంతఃపురమునందు, అవేక్షమాణః=పరిశీలించు చున్న, హనుమాన్=హనుమంతుడు, దివ్యోపమమ్=స్వర్గములో ఉండుదానితో సమానమూ, ముఖ్యమ్=శ్రేష్ఠమూ, స్ఫాటికమ్=స్ఫటికమణివికారమూ, రత్నభూ షితమ్=రత్నములచేత అలంకరింపబడినదీ, దాన్తకాఞ్చనచిత్రాఙ్గైః=దంతపునగిషీల చేతను, బంగారముచేతను విచిత్రమైన అవయవములు గల, వైడూర్యైః=వై డూర్యవికారములైన, మహార్హాస్తరణోపేతైః=ఉత్తమమైన ఆస్తరణములతో కూడిన, మహాధనైః=గొప్పధనము (మూల్యము) గల, వరాసనైః=శ్రేష్ఠమైన ఆసనములతో, ఉపేతమ్=కూడినదీ అయిన, శయనాసనమ్=శయనములూ ఆసనములూ ఉన్న గృహభాగమును, దదర్శ=చూచెను.

తా. హనుమంతుడు అంతఃపురమునంతను పరిశీలించుచు, అక్కడ ఒక ప్రక్క స్వర్గములోని దేవేంద్రుని శయనాగారము వలె ఉన్న, శ్రేష్ఠమైన శయ్యాసనాగారమును చూచెను. స్ఫటికమాణిక్యములతో చపటా చేసిన ఆ గృహము రత్నములచే అలంకృతమై ఉండెను. ఆ గృహములో అమూల్యములైన మంచి ఆసనములు అమర్చబడి ఉండెను. ఆ ఆసనముల అవయవములు దంతపు నగిషీలతోను బంగారముతోను, వైడూర్యమాణిక్యములతోను విచిత్రములుగా ఉండెను. అత్యుత్తమములైన ఆసనములపై మంచి విలువ గల ఆస్తరణములు పరచి ఉండెను. 1, 2

మూ. తస్య చైకతమే దేశే సోఽగ్ర్యమాలావిభూషితామ్,
దదర్శ పాణ్డురం ఛత్రం తారాధిపతిసన్నిభమ్. 3

ప్ర. అ. సః=హనుమంతుడు, తస్య=ఆ శయనాగారముయొక్క, ఏక తమే=ఒక, దేశే=ప్రదేశమునందు, అగ్ర్యమాలావిభూషితమ్=శ్రేష్ఠమైనపుష్పమాలలచే అలంకరించబడినదీ, తారాధిపతిసన్నిభమ్=చంద్రునితో సమానమూ, పాణ్డురమ్=తెల్లనిదీ అయిన, ఛత్రమ్=ఛత్రమును, దదర్శ=చూచెను.

తా. హనుమంతుడు ఆ శయనగృహమునందు ఒక ప్రక్క, ఉత్తమమైన మాలలచే అలంకరింపబడినదీ, చంద్రునితో సమానమూ అయిన శ్వేతచ్ఛత్రమును చూచెను. 3

మూ. జాతరూపపరిక్షిప్తం చిత్రభానుసమప్రభమ్,
అశోకమాలావితతం దదర్శ పరమాసనమ్. 4

వాలవ్యజనహస్తాభిర్వీజ్యమానం సమన్తతః,
గన్ధైశ్చ వివిధైర్జుష్టం వరధూపేన ధూపితమ్. 5

పరమాస్తరణాస్తీర్ణమావికాజినసంవృతమ్,
దామభిర్వరమాల్యానాం సమన్తాదుపశోభితమ్. 6

ప్ర. అ. జాతరూపపరిక్షిప్తమ్=బంగారముతో చేయబడినదీ, చిత్రభానుసమప్రభమ్=అగ్నితో సమానమైన కాంతి గలదీ, అశోకమాలావితతమ్=అశోకపుష్పమాలలచే వ్యాప్తమూ, వాలవ్యజనహస్తాభిః=వింజామరలు హస్తములందు గల స్త్రీలచేత, సమన్తతః=నలు వైపుల, వీజ్యమానమ్=విసరబడుచున్నదీ, వివిధైః=అనేకవిధములైన, గన్ధైః=సువాసనలచేత, జుష్టమ్=పొందబడినదీ, వరధూపేన=శ్రేష్ఠమైన ధూపముచేత, ధూపితమ్=ధూపింపచేయబడినదీ, పరమాస్తరణాస్తీర్ణమ్=శ్రేష్ఠమైన ఆస్తరణముచేత కప్పబడినదీ, ఆవికాజినసంవృతమ్=గొఱ్ఱెల చర్మములచేత కప్పబడినదీ, సమన్తాత్=అంతటను, వరమాల్యానామ్=శ్రేష్ఠములైన మాలికల, దామభిః=పంక్తులచేత, ఉపశోభితమ్=ప్రకాశింపచేయబడినదీ అయిన,పరమాసనమ్=శ్రేష్ఠమైన ఆసనమును, దదర్శ=చూచెను.

తా. హనుమంతుడు అక్కడ బంగారముతో నిర్మించిన, అగ్ని వంటి కాంతి గల ఉత్తమమైన ఆసనమును చూచెను. అశోకపుష్పమాలలతో వ్యాప్తమై ఉన్న దాని చుట్టును నిలచి వింజామరలు చేత ధరించిన స్త్రీలు వీచుచుండిరి. అనేకవిధము లైన సుగంధద్రవ్యములతో నిండియున్న దానికి మంచి ధూపము వేసి అధికమైన సుగంధమును కల్పించిరి. దానిపై గొఱ్ఱెల చర్మములు ఇతరములైన మంచి ఆచ్ఛాదనములు పరచి ఉండెను. దాని చుట్టు శ్రేష్ఠము లైన పుష్పమాలలు కట్టి ఉండెను. 4 - 6

మూ. తస్మిన్ జీమూతసంకాశం ప్రదీప్తోత్తమకుణ్డలమ్,
లోహితాక్షం మహాబాహుం మహారజతవాససమ్. 7

లోహితేనానులిప్తాఙ్గం చన్దనేన సుగన్ధినా,
సన్ధ్యారక్తమివాకాశే తోయదం సతటిద్గణమ్. 8

వృతమాభరణైర్దివ్యైః సురూపం కామరూపిణమ్,
సవృక్షవనగుల్మాఢ్యం ప్రసుప్తమివ మన్దరమ్. 9

క్రీడిత్వోపరతం రాత్రౌ వరాభరణభూషితమ్,
ప్రియం రాక్షసకన్యానాం రాక్షసానాం సుఖావహమ్. 10

పీత్వా వ్యుపరతం చాపి దదర్శ స మహాకపిః,
భాస్వరే శయనే వీరం ప్రసుప్తం రాక్షసాధిపమ్. 11

ప్ర. అ. సః=ఆ, మహాకపిః=హనుమంతుడు, జీమూతసంకాశమ్=మేఘముతో సమానుడూ, ప్రదీప్తోత్తమకుణ్డలమ్=ప్రజ్వలించుచున్న, (ప్రకాశించుచున్న) ఉత్తమములైన కుండలములు కలవాడూ, లోహితాక్షమ్=ఎఱ్ఱని నేత్రములు కలవాడూ, మహాబాహుమ్=గొప్పబాహువులు కలవాడూ, మహారజతవాససమ్=బంగారు వస్త్రములు ధరించినవాడూ, లోహితేన=ఎఱ్ఱని, సుగన్ధినా=మంచి సువాసన గల, చన్దనేన=చందనముచేత, అనులిప్తాఙ్గమ్=పూయబడిన శరీరము గలవాడూ, దివ్యైః=అద్భుతమైన, ఆభరణైః=ఆభరణములతో, వృతమ్=కూడినవాడూ, సన్ధ్యారక్తమ్=సంధ్యాకాలముచే ఎఱ్ఱగా ఉన్న, సతటిద్గణమ్=మెరపుల సముదాయముతో కూడిన, ఆకాశే=ఆకాశము నందలి, తోయదమివ=మేఘము వలె ఉన్నవాడూ, సురూపమ్=మంచి రూపము గలవాడూ, కామరూపిణమ్=స్వేచ్ఛారూపము గలవాడూ, వరాభరణభూషితమ్=శ్రేష్ఠము లైన అలంకారములచేత అలంకరింపబడినవాడూ, రాత్రౌ=రాత్రియందు, క్రీడిత్వా=రతికేళులు సలిపి, ఉపరతమ్=విరమించినవాడూ, సవృక్షవనగుల్మాఢ్యమ్=వృక్షసముదాయము తోను పొదలతోను నిండిన, ప్రసుప్తమ్=నిద్రించుచున్న, మన్దరమ్ ఇవ=మందర పర్వతము వలె ఉన్నవాడూ, రాక్షసకన్యానామ్=రాక్షసకన్యలకు, ప్రియమ్=ప్రియుడూ, రాక్షసానామ్=రాక్షసులకు, సుఖావహమ్=సుఖము కలిగించువాడూ, పీత్వా=మద్యపానముచేసి, ఉపరతమ్=విరమించిన వాడూ అయిన, తస్మిన్=ఆ, భాస్వరే=ప్రకాశించుచున్న, శయనే=శయనమునందు, ప్రసుప్తమ్=నిద్రించుచున్న, వీరమ్=వీరుడైన, రాక్షసాధిపమ్=రాక్షసరాజును, దదర్శ=చూచెను.

తా. ప్రకాశించుచున్న ఆ శయనముమీద వీరుడైన రావణుడు నిద్రించుచుండెను. అతడు మేఘము వలె ఉండెను. ఆతని ఉత్తమములైన కుండలములు మెరయుచుండెను. ఎఱ్ఱని నేత్రములు, మహాబాహువులు గల ఆతడు బంగారు వస్త్రములు ధరించెను. మంచి సువాసన గల ఎఱ్ఱని చందనము శరీరమంతా పూసికొని, అత్యద్భుతములైన ఆభరణములు ధరించి ఉన్న ఆతడు సంధ్యారాగము ప్రసరించి, మెరపులు మెరయుచున్న ఆకాశముపై ఉన్న మేఘము వలె ఉండెను. స్వేచ్ఛానుసారముగా రూపమును ధరించగలిగిన ఆతని రూపము చాల చక్కగా ఉండెను. శ్రేష్ఠములైన ఆభరణములు ధరించిన ఆతడు రాత్రి అంతయు రతికేళులు సలిపి విశ్రమించుచుండెను. అందుచే ఆతడు వృక్షసమూహములతోను, పొదలతోనూ నిండిన నిద్రించుచున్న మందర పర్వతము వలె ఉండెను. రాక్షసస్త్రీలకు ప్రియుడు, రాక్షసులకు సుఖమును కలిగించువాడూ అయిన అతడు మద్యపానము చేసి ఆ మత్తుతో నిద్రించుచుండెను. అట్టి రాక్షసరాజైన రావణుని హనుమంతుడు చూచెను. 7 - 11

మూ. నిఃశ్వసన్తం యథా నాగం రావణం వానరర్షభః,
ఆసాద్య పరమోద్విగ్నః సోఽపాసర్పత్సుభీతవత్. 12

ప్ర. అ. సః వానరర్షభః=ఆ వానరశ్రేష్ఠుడు, నాగం యథా=మహాసర్పము వలె, నిఃశ్వసన్తమ్=ఊపిరి వదలుచున్న, రావణమ్=రావణుని, ఆసాద్య=సమీపించి, పరమోద్విగ్నః=మిక్కిలి దిగులు చెందినవాడై, సుభీతవత్=చాలభయపడినవాడై, అపాసర్పత్=దూరముగా తొలగిపోయెను.

తా. దీర్ఘనిఃశ్వాసములతో, బుసలు కొట్టుచున్న మహాసర్పము వలె ఉన్న ఆ రావణునికి దగ్గరగా వెళ్ళిన ఆ హనుమంతుడు, మిక్కిలి దిగులు చెంది చాల భయపడి దూరముగా వెళ్ళిపోయెను.

వి. హనుమంతునివంటి మహావీరుడు కూడ నిద్రించుచున్న రావణుని దగ్గరనుండి చూడగానే ఒక్కసారి ఉలిక్కిపడి, భయముతో దూరముగా తొలగిపో యినాడనగా అది రావణుని ప్రభావాతిశయమును సూచించుచున్నది. దీనివలన హనుమంతుని మహత్త్వమునకు ఏదో లోపము వచ్చినదని భావించి వేరువేరు భావములు చెప్పుట అనావశ్యకము. ఇదే వాల్మీకి చూపించు కవితాశిల్పసౌందర్యము.

మూ. అథారోహణమాసాద్య వేదికాన్తరమాశ్రితః,
సుప్తం రాక్షసశార్దూలం ప్రేక్షతే స్మ మహాకపిః. 13

ప్ర. అ. మహాకపిః=హనుమంతుడు, అథ=అటు పిమ్మట, ఆరోహణమ్=మెట్లమార్గమును, ఆసాద్య=చేరి, వేదికాన్తరమ్=మరియొక వేదికను, ఆశ్రితః=ఆశ్రయించిన వాడై, సుప్తమ్=నిద్రించుచున్న, రాక్షసశార్దూలమ్=రాక్షసశ్రేష్ఠుని, ప్రేక్షతే స్మ=చూచెను.

తా. పిమ్మట, హనుమంతుడు మెట్ల మీదుగా మరియొక వేదిక ఎక్కి, అక్కడి నుండి, నిద్రించుచున్న రావణుని పరీక్షగా చూచెను. 13

మూ. శుశుభే రాక్షసేన్ద్రస్య స్వపతః శయనోత్తమమ్,
గన్ధహస్తిని సంవిష్టే యథా ప్రస్రవణం మహత్. 14

ప్ర. అ. స్వపతః=నిద్రించుచున్న, రాక్షసేన్ద్రస్య=రాక్షసరాజుయొక్క, శయనోత్తమమ్=శ్రేష్ఠమైన శయనము, గన్ధహస్తిని=మదపుటేనుగ, సంవిష్టే=శయనించినదగుచుండగా, మహత్=గొప్ప, ప్రస్రవణం యథా=సెలయూట వలె, శుశుభే=ప్రకాశించెను.

తా. రావణుడు పండుకొని నిద్రించుచున్న ఆ శ్రేష్ఠమైన శయనము మదపుటేనుగ కూర్చున్న పెద్ద సెలయూటవలె ప్రకాశించెను. 14

మూ. కాఞ్చనాఙ్గదనద్ధౌ చ దదర్శ స మహాత్మనః,
విక్షిప్తౌ రాక్షసేన్ద్రస్య భుజావిన్ద్రధ్వజోపమౌ. 15

ఐరావతవిషాణాగ్రైరాపీడనకృతవ్రణౌ,
వజ్రోల్లిఖితపీనాంసౌ విష్ణుచక్రపరిక్షతౌ. 16

పీనౌ సమసుజాతాంసౌ సంగతౌ బలసంయుతౌ,
సులక్షణనఖాఙ్గుష్ఠౌ స్వఙ్గులీతలలక్షితౌ. 17

సంహతౌ పరిఘాకారౌ వృత్తౌ కరికరోపమౌ,
విక్షిప్తౌ శయనే శుభ్రే పఞ్చశీర్షావివోరగౌ. 18

శశక్షతజకల్పేన సుశీతేన సుగన్ధినా,
చన్దనేన పరార్థ్యేన స్వనులిప్తౌ స్వలఙ్కృతౌ. 19

ఉత్తమస్త్రీవిమృదితౌ గన్ధోత్తమనిషేవితౌ,
యక్షపన్నగగన్ధర్వదేవదానవరావిణౌ. 20

ప్ర. అ. సః=హనుమంతుడు, మహాత్మనః=మహాత్ముడైన, రాక్షసేన్ద్రస్య=రావణునియొక్క, కాఞ్చనాఙ్గదనద్ధౌ=బంగారు బాహుపురులచే కట్టబడినవీ, విక్షిప్తౌ=

దూరముగా పడవేయబడినవీ, ఇన్ద్రధ్వజోపమౌ=ఇంద్రధ్వజముతో సమానమైనవీ, ఐరావతవిషాణాగ్రైః=ఐరావతముయొక్క దంతాగ్రములచేత, ఆపీడనకృతవ్రణౌ= పొడుచుటచేత చేయబడిన వ్రణములు గలవీ, వజ్రోల్లిఖితపీనాంసౌ=వజ్రముచేత రాయబడిన బలిసిన భుజప్రదేశములు గలవీ, విష్ణుచక్రపరిక్షతౌ=విష్ణువుయొక్క చక్రముచేత కొట్టబడినవీ, పీనౌ=బలిసినవీ, సమసుజాతాంసౌ=సమముగా చక్కగా పెరిగిన భుజములు గలవీ, సంగతౌ=దేహమునకు సరిపడునట్లున్నవీ, బలసంయుతౌ=బలముతో కూడినవీ, సులక్షణనఖాఙ్గుష్ఠౌ=మంచి లక్షణములు గల గోళ్లూ బొటనవ్రేళ్లూ గలవీ, స్వఙ్గుళీతల లక్షితౌ=మంచివేళ్ళతోను అరచేతులతోను కూడినవీ, సంహతౌ=దృఢమైన సంధిబంధములు కలవీ, పరిఘాకారౌ=పరిఘ వంటి ఆకారము కలవీ, వృత్తౌ=మాంసపుష్టిచే గుండ్రముగా ఉన్నవీ, కరికరోపమౌ=ఏనుగ తొండముతో సమానమైనవీ, శుభ్రే=శుభ్రమైన, శయనే=శయనమునందు, విక్షిప్తౌ= పడవేయబడిన, పఞ్చశీర్షౌ=ఐదు తలలు గల, ఉరగౌ ఇవ=సర్పముల వలె ఉన్నవీ, శశక్షతజకల్పేన=చెవుల పిల్లి రక్తముతో సమానమైన, సుశీతేన=చాల చల్లనైన, సుగన్ధినా=మంచి సువాసన గల, పరార్థ్యేన=శ్రేష్ఠమైన, చన్దనేన=చందనముచేత, స్వనులిప్తౌ=బాగుగా పూయబడినవీ, స్వలంకృతౌ=చక్కగా అలంకరింపబడినవీ, ఉత్తమస్త్రీవిమృదితౌ=ఉత్తమస్త్రీలచేత మర్దింపబడినవీ, గన్ధోత్తమనిషేవితౌ=ఉత్తమమైన గంధముచే సేవింపబడినవీ,యక్షపన్నగ గన్ధర్వదేవదానవరావిణౌ=యక్షులకు, పన్నగులను, గంధర్వులను, దేవతలను, దానవులను ఏడ్పించినవీ అయిన, భుజౌ=భుజములను, దదర్శ=చూచెను.

తా. హనుమంతుడు, శుభ్రమైన శయనముమీద అటు ఇటు జారవిడచి ఉన్న, మహాత్ముడైన ఆ రాక్షసేంద్రుని రెండు బాహువులను చూచెను. బంగారపు బాహుపురులు ధరించి ఇంద్రధ్వజము వలె ఉన్న ఆ బాహువుల మీద ఐరావతము దంతములతో పొడుచుటచే ఏర్పడిన గాయములు కనబడుచుండెను. బలిసిన అతని భుజములు ఆ యా యుద్ధములలో దేవేంద్రుడు ప్రయోగించిన వజ్రాయుధపు రాపిడిని, విష్ణుచక్రప్రహారములను పొంది ఉండెను. బలిసి, దేహప్రమాణమునకు అనుగుణముగా ఉన్న ఆ బాహువులు చక్కని భుజములతో చాలబలము కలవిగా కనబడుచుండెను. వాటి గోళ్లు, బొటనవ్రేళ్లు, ఇతరములైన వ్రేళ్లు, అరచేతులు ఉత్తమలక్షణములతో ప్రకాశించుచుండెను. అవి దృఢమైన సంధులతో పరిఘల (కోట గడియల) వలె ఉండెను. ఏనుగ తొండము వలె గుండ్రముగా ఉండెను. బాగుగ అలంకరించిన ఆ బాహువులకు కుందేటి రక్తము వలె ఎఱ్ఱనైన, చల్లని, సుగంధము గల మంచిగంధము పూయబడెను. ఉత్తమ స్త్రీలచే మర్దింపబడుచుండు ఆ బాహువులకు అత్యుత్తమములైన

ఇతర సుగంధద్రవ్యములు కూడ పూయబడి ఉండెను. ఆ బాహువులు ఎన్నో పర్యాయములు యక్షులను, పన్నగులను, గంధర్వులను, దేవతలను, దానవులను ఏడ్పించినవి. 15-20

మూ. దదర్శ స కపిస్తత్ర బాహూ శయనసంస్థితౌ,
మన్దరస్యాన్తరే సుప్తౌ మహాహీ రుషితావివ. 21

ప్ర. అ. సః కపిః=ఆ హనుమంతుడు, తత్ర=అక్కడ, మన్దరస్య=మందరపర్వతముయొక్క, అన్తరే=మధ్యయందు, సుప్తౌ=నిద్రించుచున్న, రుషితౌ=కోపించిన, మహాహీ ఇవ=గొప్ప సర్పముల వలె ఉన్న, శయన సంస్థితౌ=శయనముపై ఉన్న, బాహూ=బాహువులను, దదర్శ=చూచెను.

తా. హనుమంతుడు అక్కడ మందరపర్వతమునందు నిద్రించుచున్న, కోపస్వభావము గల మహాసర్పముల వలె ఉన్న, ఆ రావణుని రెండు బాహువులను చూచెను. 21

మూ. తాభ్యాం స పరిపూర్ణాభ్యాం భుజాభ్యాం రాక్షసేశ్వరః,
శుశుభేఽచలసంకాశః శృఙ్గాభ్యామివ మన్దరః. 22

ప్ర. అ. అచలసంకాశః=పర్వతముతో సమానుడైన, సః=ఆ, రాక్షసేశ్వరః=రాక్షసశ్రేష్ఠుడు, పరిపూర్ణాభ్యామ్=నిండుగా ఉన్న, తాభ్యామ్=ఆ, భుజాభ్యామ్=రెండు భుజములతో, శృఙ్గాభ్యామ్=రెండు శిఖరములతో, మన్దరః ఇవ=మందర పర్వతము వలె, శుశుభే=ప్రకాశించెను.

తా. పర్వతముతో సమానుడైన ఆ రావణుడు, చక్కగా బలిసి ఉన్న రెండు భుజములతో మందరపర్వతము రెండు శిఖరములతో వలె ప్రకాశించెను.

మూ. చూతపున్నాగసురభిర్వకుళోత్తమసంయుతః,
మృష్టాన్నరససంయుక్తః పానగన్ధపురస్కృతః, 23
తస్య రాక్షససింహస్య నిశ్చక్రామ మహాముఖాత్,
శయానస్య వినిఃశ్వాసః పూరయన్నివ తద్ గృహమ్. 24

ప్ర. అ. శయానస్య=శయనించి యున్న, తస్య రాక్షససింహస్య=ఆ రాక్షసశ్రేష్ఠునియొక్క, మహాముఖాత్=గొప్ప ముఖమునుండి, చూతపున్నాగసురభిః=చూతపుష్పముల వలె, పున్నాగపుష్పముల వలె పరిమళించుచున్నదీ, వకుళోత్తమసంయుతః=శ్రేష్ఠమైన వకుళపుష్పగంధముతో కూడినదీ, మృష్టాన్నరససంయుక్తః=మృష్టాన్నముయొక్క రసముతో కూడినదీ, పానగన్ధపురస్సరః=మద్యగంధము

ముందు గలదీ అయిన, వినిఃశ్వాసః=నిశ్వాసము, తత్=ఆ, గృహమ్=గృహమును, పూరయన్నివ=నింపుచున్నది వలె, నిశ్చక్రామ=బయుల్వెడలెను.

తా. నిద్రించుచున్న ఆ రాక్షసశ్రేష్ఠుని విశాలమైన ముఖమునుండి, నిశ్వాసవాయువు, ఆ గృహము నంతను నింపివేయుచున్నట్లు బయలువెడలు చుండెను. చూతపుష్ప - పున్నాగపుష్పముల వలె, ఉత్తమమైన బొగడపూవుల వలె పరిమళించుచున్న ఆ నిశ్వాసవాయువు మధురములైన అన్నముల రసముల సువాసనలతోను, మద్యగంధముతోను కూడ నిండి యుండెను. 23, 24

మూ. ముక్తామణివిచిత్రేణ కాఞ్చనేన విరాజితమ్,
మకుటేనాపవృత్తేన కుణ్డలోజ్జ్వలితాననమ్. 25

రక్తచన్దనదిగ్ధేన తథా హారేణ శోభినా,
పీనాయతవిశాలేన వక్షసాభివిరాజితమ్. 26

పాణ్డరేణాపవిద్ధేన క్షౌమేణ క్షతజేక్షణమ్,
మహార్హేణ సుసంవీతం పీతేనోత్తమవాససా. 27

మాషరాశిప్రతీకాశం నిశ్శ్వసన్తం భుజఙ్గవత్,
గాఙ్గే మహతి తోయాన్తే ప్రసుప్తమివ కుఞ్జరమ్. 28

చతుర్భిః కాఞ్చనైర్దీపైర్దీప్యమానచతుర్దిశమ్,
ప్రకాశీకృతసర్వాఙ్గం మేఘం విద్యుద్గణైరివ. 29

పాదమూలగతాశ్చాపి దదర్శ సుమహాత్మనః,
పత్నీః స ప్రియభార్యస్య తస్య రక్షఃపతేర్గృహే. 30

ప్ర. అ. సః=ఆ హనుమంతుడు, తస్య రక్షఃపతేః=ఆ రాక్షసరాజు యొక్క, గృహే=గృహమునందు, ముక్తామణివిచిత్రేణ=ముత్యములతోను, మణులతోను విచిత్రవర్ణము గల, కాఞ్చనేన=బంగారు వికారమైన, అపవృత్తేన=ప్రక్కకు ఒరిగిన, మకుటేన=కిరీటముచేత, విరాజితమ్=ప్రకాశింపచేయబడినవాడూ, కుణ్డలోజ్జ్వలితాననమ్=కుండలములచేత ప్రకాశింపచేయబడిన ముఖము కలవాడూ, రక్తచన్దనదిగ్ధేన=ఎఱ్ఱని చందనముచేత పూయబడినదీ, హారేణ=హారముతో, శోభినా=ప్రకాశించుచున్నదీ, పీనాయతవిశాలేన=బలిసి పొడవుగా విశాలముగా ఉన్నదీ అయిన, వక్షసా=వక్షఃస్థలము చేత, అభివిరాజితమ్=ప్రకాశింపచేయబడుచున్నవాడూ, పాణ్డరేణ=తెల్లని, అపవిద్ధేన=మీద జారుచున్న, క్షౌమేణ=పట్టువస్త్రముతో కూడినవాడూ, క్షతజేక్షణమ్=రక్తము వలె ఎఱ్ఱగా ఉన్న నేత్రములు కలవాడూ,

మహార్హేణ=శ్రేష్ఠమైన, పీతేన=పచ్చని, ఉత్తమవాససా=ఉత్తమమైన వస్త్రము చేత, సుసంవీతమ్=బాగుగా కట్టబడినవాడూ, మాషరాశిప్రతీకాశమ్=మినుముల రాశితో సమానుడూ, భుజఙ్గవత్=సర్పమువలె, నిఃశ్వసన్తమ్=నిట్టూర్చుచున్నవాడూ, మహతి=విశాలమైన, గాఙ్గే=గంగకు సంబంధించిన, తోయాన్తే=జలమధ్యమునందు, ప్రసుప్తమ్=నిద్రించుచున్న, కుఞ్జరమ్ ఇవ=ఏనుగ వలె ఉన్నవాడూ, కాఞ్చనైః= బంగారువికార మైన, చతుర్భిః=నాలుగు, దీపైః=దీపముల చేత, దీప్యమానచతుర్దిశమ్=ప్రకాశింపచేయబడిన నాలుగు దిక్కులు కలవాడూ, విద్యుద్గణైః=మెరపుల సముదాయముల చేత, ప్రకాశీకృతసర్వాఙ్గమ్=ప్రకాశింప చేయబడిన సకల అవయవములూ గల, మేఘమ్ ఇవ=మేఘము వలె ఉన్నవాడూ అయిన రావణుని, ప్రియభార్యస్య=ఇష్టులైన భార్యలు గల, సుమహాత్మనః=చాల మహాత్ముడైన ఆ రావణుని యొక్క, పాదమూలగతాః=పాదసమీపమునందున్న, పత్నీశ్చ=భార్యలను, దదర్శ=చూచెను.

తా. రావణుని శయనాగారములో, హనుమంతుడు, నిద్రించుచున్న రావణునీ, భార్యలపై అధికానురాగవంతుడైన ఆ మహాత్ముని పాదముల చెంత నిద్రించుచున్న ఆతని భార్యలనూ చూచెను. ఆ రావణుడు, ముత్యములు, మణులు పొదుగుటచేత విచిత్రవర్ణములతో ఉన్న, కొంచెము ప్రక్కకు ఒరిగిన బంగారు కిరీటముతో ప్రకాశించుచుండెను. ఆతని ముఖము కుండలములతో ప్రకాశించుచుండెను. పొడవుగా, విశాలముగా, బలిసి ఉన్న ఆతని వక్షఃస్థలము పూసికొనిన ఎఱ్ఱని చందనముతోను, అందమైన హారములతోను అలరారుచుండెను. ఆతడు తెల్లని పట్టువస్త్రమును ఉత్తరీయముగాను, అత్యుత్తమమైన పీతాంబరమును పరిధానీయము గాను (కట్టువస్త్రముగాను) ధరించెను. కండ్లు రక్తము వలె ఎఱ్ఱగా ఉండెను. (దీనిని పట్టి ఆ సమయమున ఆతడు నిద్రలో కండ్లు సగము తెరచికొని ఉండెనని ఊహించవలెను.) మహాసర్పము వలె బుసలుకొట్టుచు, మినుముల రాసివలె ఉన్న ఆతడు విశాలమైన గంగాజలమధ్యమున నిద్రించుచున్న గజము వలె ఉండెను. నాలుగు దిక్కులను ప్రకాశింపచేయుచున్న నాలుగు దీపములు ఆతని చుట్టూ ఉండుటచే ఆతడు మెరపుల సముదాయముచేత అంతటా ప్రకాశించుచున్న మేఘము వలె ఉండెను. 25 - 30

మూ. శశిప్రకాశవదనాశ్చారుకుణ్డలభూషితాః,
అమ్లానమాల్యాభరణా దదర్శ హరియూథపః. 31

ప్ర. అ. హరియూథపః=హనుమంతుడు, శశిప్రకాశవదనాః=చంద్రుని ప్రకాశమువంటి ప్రకాశము గల ముఖములు గలవారూ, చారుకుణ్డలభూషితాః=

అందమైన కుండలములచే అలంకరింపబడినవారూ, అమ్లానమాల్యాభరణాః=వాడని మాలలూ ఆభరణములూ కలవారూ అయిన రావణభార్యలను, దదర్శ=చూచెను.

తా. ఆ రావణుని భార్యల ముఖములు చంద్రుని వలె ప్రకాశించుచుండెను. వారు అందమైన కుండలములు ధరించిరి. వారు ధరించిన పుష్పమాలలు వాడిపోలేదు. అలంకారములు మాయలేదు. 31

మూ. నృత్తవాదిత్రకుశలా రాక్షసేన్ద్రభుజాఙ్కగాః,
వరాభరణధారిణ్యో నిషణ్ణా దదృశే హరిః. 32

ప్ర. అ. హరిః=హనుమంతుడు, నృత్తవాదిత్రకుశలాః=నృత్తము నందు, వాద్యములందు నేర్పుగలవారు, రాక్షసేన్ద్రభుజాఙ్కగాః=రావణుని భుజములను ఒడిచి పొంది ఉన్నవారూ, వరాభరణధారిణ్యః=శ్రేష్ఠమైన అలంకారములను ధరించినవారూ, నిషణ్ణాః=నిద్రించినవారూ అయిన రావణ భార్యలను, దదృశే=చూచెను.

తా. రావణుని భుజముల దగ్గర, తొడల దగ్గర పడియుండి నిద్రించుచున్న ఆ స్త్రీలు నృత్తమునందు, వివిధవాద్యవాదనమునందునేర్పుగలవారు. వారందరూ ఉత్తమములైన అలంకారములు ధరించి ఉండిరి. 32

మూ. వజ్రవైడూర్యగర్భాణి శ్రవణాన్తేషు యోషితామ్,
దదర్శ తాపనీయాని కుణ్డలాన్యఙ్గదాని చ. 33

ప్ర. అ. యోషితామ్=ఆ స్త్రీలయొక్క, శ్రవణాన్తేషు=చెవుల చివరిప్రదేశములందు, వజ్రవైడూర్యగర్భాణి=వజ్రములూ, వైడూర్యములూ గర్భము నందు గలదీ, తాపనీయాని=బంగారు వికారమైనవీ అయిన, కుణ్డలాని=కుండలములనూ, అఙ్గదాని చ=బాహుపురులనూ, దదర్శ=చూచెను.

తా. హనుమంతుడు ఆ స్త్రీల చెవులకు ధరించిన, మధ్యనున్న వజ్రములతోను, వైడూర్యములతోను మెరయుచున్న బంగారు కుండలములను, అట్టివే అయిన బాహుపురులనూ చూచెను. 33

మూ. తాసాం చన్ద్రోపమైర్వక్త్రైః శుభైర్లలితకుణ్డలైః,
విరరాజ విమానం తన్నభస్తారాగణైరివ. 34

ప్ర. అ. లలితకుణ్డలైః=సుందరము లైన కుండలములు గలవీ, చన్ద్రోపమైః=చంద్రునితో సమానములూ, శుభైః=సుందరములూ అయిన, తాసామ్=ఆ

స్త్రీలయొక్క, వక్త్రైః=ముఖములతో, తత్ విమానమ్=ఆ విమానము, తారాగణైః=నక్షత్రగణములతో, నభః ఇవ=ఆకాశము వలె, విరరాజ=ప్రకాశించెను.

తా. సుందరము లైన కుండలములు గల, చంద్రుని వంటి వారి ముఖములతో, ఆ విమానము, నక్షత్రసముదాయముతో ఆకాశము ప్రకాశించినట్లు ప్రకాశించెను. 34

మూ. మదవ్యాయామఖిన్నాస్తా రాక్షసేన్ద్రస్య యోషితః,
తేషు తేష్వవకాశేషు ప్రసుప్తాస్తనుమధ్యమాః. 35

ప్ర. అ. మదవ్యాయామఖిన్నాః=మదముచేతను, రతికేళిచేతను అలసిన, తనుమధ్యమాః=సన్నని నడుములు గల, తాః=ఆ, రాక్షసేన్ద్రస్య=రావణుని యొక్క, యోషితః=స్త్రీలు, తేషు తేషు=ఆ యా, అవకాశేషు=అవకాశములందు, ప్రసుప్తాః=నిద్రించిరి.

తా. సన్నని నడుములు గల ఆ రావణభార్యలందరు, మదముచేతను, రతికేళులచేతను అలసిపోయినవారై, ఎక్కడ అవకాశము దొరికిన అక్కడ శయనించిరి. 35

మూ. అఙ్గహారైస్తథైవాన్యా కోమలైర్నృత్తశాలినీ,
విన్యస్తశుభసర్వాఙ్గీ ప్రసుప్తా వరవర్ణినీ. 36

ప్ర. అ. అన్యా=మరియొక్క, నృత్తశాలినీ=నృత్తమునందు నేర్పుగల, వరవర్ణినీ=స్త్రీ, కోమలైః=మృదువైన, అఙ్గహారైః=అంగవిన్యాసములతో, తథైవ=అట్లే, విన్యస్తశుభసర్వాఙ్గీ=విన్యాసము చేయబడిన సకలావయవములు కలదై, ప్రసుప్తా=నిద్రించినది.

తా. నృత్తమునందు నేర్పుగల ఒక స్త్రీ, నృత్తము చేయుచున్నపుడు ఎట్టి అంగభంగిమలుండునో అట్టి అంగభంగిమలనే శయనించినపుడు కూడ చేయుచు నిద్రించెను. 36

మూ. కాచిద్వీణాం పరిష్వజ్య ప్రసుప్తా సంప్రకాశతే,
మహానదీప్రకీర్ణేవ నలినీ పోతమాశ్రితా. 37

ప్ర. అ. వీణామ్=వీణను, పరిష్వజ్య=కౌగలించుకొని, ప్రసుప్తా=నిద్రించుచున్న, కాచిత్=ఒకానొక స్త్రీ, మహానదీప్రకీర్ణా=మహానదిచేత బైటకు విసరివేయబడినదై, పోతమ్=నావను, ఆశ్రితా=ఆశ్రయించిన, నలినీవ=పద్మలత వలె, సంప్రకాశతే=ప్రకాశించుచుండెను.

తా. వీణను కౌగిలించుకుని నిద్రించుచున్న ఒక వైణికురాలు, మహానదీ ప్రవాహమునకు బైటకు కొట్టుకొని వచ్చి చిన్న నావకు తగుల్కొన్న పద్మలతవలె ప్రకాశించుచుండెను. 37

మూ. అన్యా కక్షగతేనైవ మడ్డుకేనాసితేక్షణా,
ప్రసుప్తా భామినీ భాతి బాలపుత్రేవ వత్సలా. 38

ప్ర. అ. కక్షగతేనైవ=చంకలోనే ఉన్న, మడ్డుకేన=మడ్డుకమనువాద్యముతో, ప్రసుప్తా=నిద్రించుచున్న, అన్యా=మరి యొక్క, అసితేక్షణా=నల్లని కండ్లు గల వనిత, వత్సలా=వాత్సల్యవంతురాలూ, బాలపుత్రా=బాలుడైన పుత్రుడు కలదీ అయిన, భామినీవ=స్త్రీ వలె, భాతి=ప్రకాశించుచుండెను.

తా. మడ్డుకమను వాద్యము చంకలో ఉండగానే నిద్రించుచున్న మరియొక యువతి, బాలుడైన పుత్రుని చంకలో ఎత్తికొన్న పుత్రవాత్సల్యవంతురాలగు స్త్రీ వలె ఉండెను. 38

మూ. పటహం చారుసర్వాఙ్గీ పీడ్య శేతే శుభస్తనీ,
చిరస్య రమణం లబ్ధ్వా పరిష్వజ్యేవ భామినీ. 39

ప్ర. అ. చారుసర్వాఙ్గీ=అందమైన సకలావయవములు గలదీ, శుభస్తనీ=అందమైన స్తనములు గలదీ అయిన, భామినీ=ఒక స్త్రీ, చిరస్య=చిరకాలమునకు, రమణమ్=ప్రియుని, లబ్ధ్వా=పొంది, పరిష్వజ్యేవ=కౌగలించుకొని వలె, పటహమ్=పటహమనే వాద్యమును, పీడ్య=గట్టిగా కౌగలించుకొని, శేతే=శయనించెను.

తా. అందమైన సర్వావయవములూ, మనోహరములైన స్తనములూ గల మరియొక యువతి, పటహమను వాద్యమును, చాలకాలానికి లభించిన ప్రియుని కౌగలించుకొన్నట్లు గట్టిగా కౌగలించుకొని నిద్రించుచుండెను. 39

మూ. కాచిద్వంశం పరిష్వజ్య సుప్తా కమలలోచనా,
రహః ప్రియతమం గృహ్య సకామేవ చ కామినీ. 40

ప్ర. అ. కమలలోచనా=కమలములవంటి నేత్రములు గల, కాచిత్=ఒకానొక వనిత, వంశమ్=వేణువును, పరిష్వజ్య=కౌగలించుకొని, రహః=రహస్యమునందు, ప్రియతమమ్=అత్యంతము ప్రియుడైన వానిని, గృహ్య=పట్టుకొని, సకామా=కామముతో కూడిన, కామినీవ=కామిని వలె, సుప్తా=నిద్రించినది.

తా. కమలముల వంటి లోచనములు గల మరి యొక యువతి వేణువును కౌగలించుకొని, కామవంతురాలగు కామిని ప్రియతముని ఏకాంతప్రదేశమునందు గ్రహించి శయనించినట్లు శయనించెను. 40

మూ. విపఞ్చీం పరిగృహ్యాన్యా నియతా నృత్తశాలినీ,
నిద్రావశమనుప్రాప్తా సహ కాన్తేవ భామినీ. 41

ప్ర. అ. నృత్తశాలినీ=నృత్తముతో ప్రకాశించు, అన్యా=మరి యొక స్త్రీ, విపఞ్చీమ్=ఏడు తీగల వీణను, పరిగృహ్యా=గ్రహించి, నియతా=దానితో సంబద్ధురాలై, సహకాన్తా=కాంతునితో కూడిన, భామినీవ=స్త్రీ వలె, నిద్రావశమ్=నిద్రావశమును, అనుప్రాప్తా=పొందినది.

తా. నృత్తమునందు నేర్పు గల మరి యొక వనిత, ఏడు తీగల వీణను గ్రహించి, దానిని దగ్గరగా హృదయమునకు హత్తుకొని, కాంతునితో కూడిన యువతి వలె, నిద్రావశురాలయ్యెను. 41

మూ. అన్యా కనకసంకాశైర్మృదుపీనైర్మనోరమైః,
మృదఙ్గం పరిపీడ్యాఙ్గైః ప్రసుప్తా మత్తలోచనా. 42

ప్ర. అ. మత్తలోచనా=మదించిన నేత్రములు గల, అన్యా=మరి యొక స్త్రీ, కనకసంకాశైః=బంగారముతో సమానములు, మృదుపీనైః=మెత్తనివీ, బలిసినవీ, మనోహరైః=మనోహరములూ అయిన, అఙ్గైః=అవయవములతో, మృదఙ్గమ్=మృదంగమును, పరిపీడ్య=కౌగలించుకొని, ప్రసుప్తా=నిద్రించినది.

తా. మదముతో నిండిన నేత్రములు గల మరియొక యువతి, బంగారు రంగు గలవై, మృదువు లై, బలిసిఉన్న మనోహరము లైన అవయవములతో మృదంగమును కౌగలించుకొని నిద్రించెను. 42

మూ. భుజపాశాన్తరస్థేన కక్షగేన కృశోదరీ,
పణవేన సహానిన్ద్యా సుప్తా మదకృతశ్రమా. 43

ప్ర. అ. అనిన్ద్యా=నిందింపదగని, కృశోదరీ=కృశించిన ఉదరము గల మరియొక స్త్రీ, మదకృతశ్రమా=మదముచేత చేయబడిన శ్రమ గలదై, భుజపాశాన్తరస్థేన=భుజముల మధ్యమునందున్న, కక్షగేన=చంకలో చేరిన, పణవేన సహ=పణవమను వాద్యముతో కూడ, సుప్తా=నిద్రించెను.

తా. మదముచేత అలసియున్న మరియొక కృశోదరి, రెండుభుజముల మధ్య చంకవరకు చేరి ఉన్న పణవముతో కూడ నిద్రించెను. 43

మూ. డిణ్డిమం పరిగృహ్యాన్యా తథైవాసక్తడిణ్డిమా,
ప్రసుప్తా తరుణం వత్సముపగూహ్యేవ భామినీ. 44

ప్ర. అ. ఆసక్తడిణ్డిమా=దగ్గరగా ఉన్న డిండిమము గల, అన్యా=మరి యొక స్త్రీ, డిణ్డిమమ్=డిండిమమును, పరిగృహ్య=గ్రహించి, తథైవ=అట్లే, తరుణమ్=వయస్సు ముదిరిన, వత్సమ్=పుత్రుని, ఉపగూహ్య=కౌగలించుకొని, భామినీ ఇవ=స్త్రీ వలె, ప్రసుప్తా=నిద్రించెను.

తా. మరి యొక వనిత తన దగ్గర నున్న డిండిమ మను వాద్యమును గ్రహించి, అది ఆ విధముగానే ఒడిలో ఉండగా, వయస్సు ముదిరిన కుమారుని కౌగలించుకొని శయనించిన భామిని వలె, శయనించెను. 44

కాచిదాడమ్బరం నారీ భుజసంయోగపీడితమ్,
కృత్వా కమలపత్రాక్షీ ప్రసుప్తా మదమోహితా. 45

ప్ర. అ. కమలపత్త్రాక్షీ=కమలపత్రముల వంటి నేత్రములు గల, కాచిత్=ఒకానొక, నారీ=స్త్రీ, ఆడమ్బరమ్=ఆడంబర మను వాద్యమును, భుజసంయోగపీడితమ్=భుజముల సంయోగముచేత పీడింపబడినదానినిగా, కృత్వా=చేసి, మదమోహితా=మదముచేత మోహింపచేయుబడినదై, ప్రసుప్తా=నిద్రించెను.

తా. కమలపత్రముల వంటి నేత్రములు గల ఒకానొక స్త్రీ ఆడంబరమను వాద్యమును భుజములతో గట్టిగా నొక్కి పట్టి, మదమోహితురాలై నిద్రించెను.

కలశీమపవిధ్యాన్యా ప్రసుప్తా భాతి భామినీ,
వసన్తే పుష్పశబలా మాలేవ పరిమార్జితా. 46

ప్ర. అ. కలశీమ్=చిన్న కలశను, అపవిధ్య=క్రిందికి వంచివేసి, ప్రసుప్తా=నిద్రించిన, అన్యా భామినీ=మరి యొక స్త్రీ, వసన్తే=వసంతమునందు, పరిమార్జితా=(నీళ్లు చల్లి) పరిశుద్ధము చేయబడిన, పుష్పశబలా=పుష్పములతో విచిత్రవర్ణము గల, మాలేవ=పుష్పమాల వలె, భాతి=ప్రకాశించుచుండెను.

తా. నిద్రలో, ప్రక్కనున్న కలశను తన్నివేసి ఆ నీటితో తడియుచు నిద్రించిన ఒక యువతి, వసంతర్తువులో, విచిత్రవర్ణములు గల పూవులతో నిర్మించి, నీరు చల్లి శుభ్రము చేయబడిన మాల వలె ప్రకాశించుచుండెను. 46

పాణిభ్యాం చ కుచౌ కాచిత్సువర్ణకలశోపమౌ,
ఉపగూహ్యాబలా సుప్తా నిద్రాబలపరాజితా. 47

ప్ర. అ. కాచిత్=ఒకానొక, అబలా=స్త్రీ, పాణిభ్యామ్=హస్తములచేత, సువర్ణకలశోపమౌ=బంగారుకలశలతో సమానములైన, కుచౌ=తనకుచములను,

ఉపగూహ్య=కౌగలించుకొని, నిద్రాబలపరాజితా=నిద్రాబలముచేత వశముచేసికొన బడినదై, సుప్తా=నిద్రించినది.

తా. మరి యొక అబల, బంగారు కలశల వలె ఉన్న కుచముల పైననే హస్తము లుంచుకొని, నిద్రకు పూర్తిగా వశురాలై, పండుకొనెను. 47

అన్యా కమలపత్రాక్షీ పూర్ణేన్దుసదృశాననా,
అన్యామాలిఙ్గ్య సుశ్రోణీం ప్రసుప్తా మదవిహ్వలా. 48

ప్ర. అ. కమలపత్రాక్షీ=కమలపత్రముల వంటి నేత్రములు గలదీ, పూర్ణేన్దుసదృశాననా=పూర్ణచంద్రునితో సమానమైన ముఖము గలదీ అయిన, అన్యా=మరియొక స్త్రీ, మదవిహ్వలా=మదముచేత వ్యాకులురాలై, సుశ్రోణీమ్=అందమైన కటిప్రదేశము గల, అన్యామ్=మరియొక స్త్రీని, ఆలిఙ్గ్య=కౌగలించుకొని, ప్రసుప్తా=నిద్రించినది.

తా. పద్మపత్రముల వంటి నేత్రములు, పూర్ణచంద్రుని వంటి ముఖము గల మరి యొక యువతి, మదముచేత ఒళ్లు తెలియనిదై, అందమైన కటిప్రదేశము గల మరియొక స్త్రీని కౌగలించుకొని నిద్రించుచుండెను. 48

ఆతోద్యాని విచిత్రాణి పరిష్వజ్య వరస్త్రియః,
నిపీడ్య చ కుచైః సుప్తాః కామిన్యః కాముకానివ. 49

ప్ర. అ. వరస్త్రియః=ఉత్తమ లైన కొందరు స్త్రీలు, విచిత్రాణి=విచిత్రములైన, ఆతోద్యాని=వాద్యములను, పరిష్వజ్య=కౌగలించుకొని, కామిన్యః=కామము గల స్త్రీలు, కాముకానివ=కామము గల పురుషులను వలె, కుచైః=కుచములతో, నిపీడ్య=పీడించి, సుప్తాః=నిద్రించిరి.

తా. కొందరు ఉత్తమస్త్రీలు అనేక విధము లైన వాద్యములను కౌగలించుకొని, కామినులు కాముకులను వలె ఆ వాద్యములను కుచములతో గట్టిగా అదిమిపట్టి, నిద్రించుచుండిరి. 49

తాసామేకాన్తవిన్యస్తే శయానాం శయనే శుభే,
దదర్శ రూపసంపన్నామపరాం స కపిః స్త్రియమ్. 50

ప్ర. అ. సః కపిః=ఆ హనుమంతుడు, తాసామ్=ఆ స్త్రీలలో, ఏకాన్తవిన్యస్తే=ఒక ప్రక్క అమర్చబడిన, శుభే=మంగళకర మైన, శయనే=శయనమునందు, శయానామ్=శయనించి ఉన్న, రూపసంపన్నామ్=ఉత్తమరూపసంపన్నురాలైన, స్త్రియమ్=స్త్రీని, దదర్శ=చూచెను.

తా. ఆ స్త్రీలమధ్యలో ఒక వైపు అమర్చిన మంగళకర మైన శయనముపై శయనించి యున్న ఒక అత్యధికసౌందర్యసంపన్నురాలైన అంగన ఆ హనుమంతునకు కనబడెను. 50

ముక్తామణిసమాయుక్తైర్భూషణైః సువిభూషితామ్,
విభూషయన్తీమివ తత్స్వశ్రియా భవనోత్తమమ్. 51
గౌరీం కనకవర్ణాభామిష్టామన్తఃపురేశ్వరీమ్,
కపిర్మన్దోదరీం తత్ర శయానాం చారురూపిణీమ్. 52

ప్ర. అ. కపిః=హనుమంతుడు, ముక్తామణిసమాయుక్తైః=ముత్యములతోను మణులతోను కూడిన, భూషణైః=అలంకారములచేత, సువిభూషితామ్=చక్కగా అలంకరింపబడినదీ, స్వశ్రియా=తన కాంతిచేత, తత్=ఆ, భవనోత్తమమ్=ఉత్తమ మైన భవనమును, విభూషయన్తీమివ=అలంకరించు చున్నది వలె ఉన్నదీ, గౌరీమ్=పచ్చని శరీరచ్ఛాయ గలదీ, కనకవర్ణాభామ్=బంగారము రంగు వంటి శరీరకాంతి గలదీ, ఇష్టామ్=భర్తకు ప్రియురాలూ, అన్తఃపురేశ్వరీమ్=అంతఃపురమునకు అధిపతీ, తత్ర=అక్కడ, శయానామ్=శయనించినదీ, చారురూపిణీమ్=అందమైన రూపము గలదీ, అయిన, మన్దోదరీమ్=మండోదరిని, (చూచెను).

తా. హనుమంతుడు అక్కడ, ఆ శయనముపై శయనించిన, అత్యద్భుత సౌందర్యవతి యైన మండోదరిని చూచెను. ఆమె, ముత్యములూ, రత్నములూ పొదిగిన అలంకారములు ధరించెను. తన కాంతిచే ఆ భవనమునంతను అలంకరించుచున్నదా అన్నట్లు ఉండెను. బంగారు చాయ గల ఆమె రావణునకు అత్యంతము ప్రియురాలు. అతని అంతఃపురమునకు అధిపతి. 51, 52

స తాం దృష్ట్వా మహాబాహుర్భూషితాం మారుతాత్మజః,
తర్కయామాస సీతేతి రూపయౌవనసంపదా, 53
హర్షేణ మహతా యుక్తో ననన్ద హరియూథపః.

ప్ర. అ. మహాబాహుః=గొప్ప బాహువులు గల, సః మారుతాత్మజః=ఆ హనుమంతుడు, భూషితామ్=అలంకరింపబడిన, తామ్=ఆమెను, దృష్ట్వా=చూచి, రూపయౌవనసంపదా=రూపసంపదచేతను, యౌవనసంపదచేతను, సీతేతి=సీత అని, తర్కయామాస=ఊహించెను. హరియుథపః=వానరసేనాధిపతి యైన ఆ హనుమంతుడు, మహతా=గొప్ప, హర్షేణ=సంతోషముతో, యుక్తః=కూడినవాడై, ననన్ద=ఆనందించెను.

తా. గొప్ప బాహువులు గలవాడూ, వానరయూథమునకు నాయకుడూ అయిన ఆ హనుమంతుడు, అధికముగా అలంకరించుకొని యున్న ఆమెను చూడగానే, ఆమె రూపసంపదను, యౌవనమును పట్టి, ఆమె సీతయై ఉండు నని ఊహించుకొని, అత్యధికముగా సంతోషించెను.

ఆస్ఫోటయామాస చుచుమ్బ పుచ్ఛం
ననన్ద చిక్రీడ జగౌ జగామ,
స్తమ్భానరోహన్నిపపాత భూమౌ
నిదర్శయన్ స్వాం ప్రకృతిం కపీనామ్. 54

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే సున్దరకాణ్డే
దశమ సర్గః.

ప్ర. అ. ఆస్ఫోటయామాస=జబ్బలు చరచెను. పుచ్ఛమ్=తోకను, చుచుమ్బ=ముద్దుపెట్టుకొనెను. ననన్ద=ఆనందించెను. చిక్రీడ=ఆడుకొనెను. జగౌ=పాటపాడెను. జగామ=ఇటు అటు తిరిగెను. స్వామ్=తన, కపీనామ్=వానరుల, ప్రకృతిమ్=స్వభావమును, నిదర్శయన్=చూపుచు, స్తమ్భాన్=స్తంభములను, అరోహత్=ఎక్కెను. భూమౌ=నేలపై, నిపపాత=పడెను.

తా. అప్పుడు ఆ హనుమంతుడు, సీత కనబడినది గదా అను ఆనంద పారవశ్యముతో జబ్బలు చరచుకొనెను; తోక ముద్దుపెట్టుకొనెను; ఆనందించెను; ఆడెను; పాడెను; ఇటు అటు పచారులుచేసెను. సహజమైన వానరస్వభావమును చూపుచు గబగబా స్తంభములపై కెక్కి క్రిందికి దుమికెను. 54

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు
సుందరకాండలో పదవ సర్గ సమాప్తము.

అథ ఏకాదశః సర్గః

[ఈమె సీత కాదని నిశ్చయించుకొని హనుమంతుడు మరల పానగృహములో సీతకై వెదకుట. పరస్త్రీ దర్శనముచేత తనకు ధర్మలోపము కలిగినది కదా అని శంకించుకొని "నా మనస్సు నిష్కల్మషముగా ఉన్నది కదా" అని సమాధానపడుట].

మూ. అవధూయ చ తాం బుద్ధిం బభూవావస్థితస్తదా,
జగామ చాపరాం చిన్తాం సీతాం ప్రతి మహాకపిః. 1

ప్ర. అ. మహాకపిః=హనుమంతుడు, తదా=అప్పుడు, తామ్=ఆ, బుద్ధిమ్=ఆలోచనను, అవధూయ=తొలగించుకొని, అవస్థితః=సరి యైన ఆలోచన కలవాడుగా, బభూవ=ఆయెను. సీతాం ప్రతి=సీతను గూర్చి, అపరామ్=మరి యొక, చిన్తామ్=ఆలోచనను, జగామ=పొందెను.

తా. హనుమంతుడు మండోదరిని చూడగానే, ఈ విధముగా మొదట కలిగిన ఆ ఆలోచనను విడచి, స్వస్థచిత్తుడై, సీతవిషయమున మరి యొక ఆలోచన చేసెను. 1

మూ. న రామేణ వియుక్తా సా స్వప్తుమర్హతి భామినీ,
న భోక్తుం నాప్యలంకర్తుం న పానముపసేవితుమ్. 2
నాన్యం నరముపస్థాతుం సురాణామపి చేశ్వరమ్,
న హి రామసమః కశ్చి ద్విద్యతే త్రిదశేష్వపి, 3
అన్యేయమితి నిశ్చిత్య పానభూమౌ చచార సః.

ప్ర. అ. సా=ఆ, భామినీ=సీత, రామేణ=రామునితో, వియుక్తా=వియోగము పొందినదై, స్వప్తుమ్=నిద్రించుటకు, న అర్హతి=తగదు, భోక్తుమ్=భుజించుటకు, న=తగదు, అలంకర్తుమ్ అపి=అలంకరించుకొనుటకు కూడ, న=తగదు, పానమ్=పానమును, ఉపసేవితుమ్=సేవించుటకు, సురాణామ్=దేవతలయొక్క, ఈశ్వరమపి=ప్రభువైనను, అన్యమ్=మరి యొక, నరమ్=పురుషుని, ఉపస్థాతుమ్=చేరుటకు, న=తగదు. హి=ఎందుచేతననగా, రామసమః=రామునితో సమానుడు, కశ్చిత్=ఒక్కడును, త్రిదశేష్వపి=దేవతలలో కూడ, న విద్యతే హి=లేదు కదా! ఇయమ్=ఈమె, అన్యా=మరియొకతె, ఇతి=అని, నిశ్చిత్య=నిశ్చయించుకొని, సః=హనుమంతుడు, పానభూమౌ=పానగృహమునందు, చచార=తిరిగెను.

తా. ఆ సీత రాముడు లేకుండగా నిద్రింపజాలదు. భోజనము కాని, అలంకారధారణము గాని, పానసేవనము కాని చేయజాలదు. రాముని తప్ప పరపురుషుని ఎవ్వరినీ, అతడు సాక్షాత్తు దేవతాధిపతియే అయినను, చేరదు. రామునితో సమానుడు ఎవ్వడూ దేవతలలోకూడ లేడు కదా! అందుచేత ఈమె మరెవ్వరో అయి ఉండును అని నిశ్చయించుకొని హనుమంతుడు మరల ఆ పానగృహములో సంచరించుటకు ప్రారంభించెను. 2, 3

మూ. క్రీడితేనాపరాః క్లాన్తా గీతేన చ తథాపరాః, 4
నృత్తేన చాపరాః క్లాన్తాః పానవిప్రహతాస్తథా.

ప్ర. అ. అపరాః=కొందరు స్త్రీలు, క్రీడితేన=రతిచేత, క్లాన్తాః=అలసిరి. తథా=అట్లే, అపరాః=మరి కొందరు స్త్రీలు, గీతేన=పాడుటచేత అలసిరి, అపరాః=మరికొందరు స్త్రీలు, నృత్తేన=నృత్తము చేయుటచేత, క్లాన్తాః=అలసిరి, తథా=మరియు, మరికొందరు, పానవిప్రహతాః=మద్యపానముచేత స్మృతి తప్పి పడియుండిరి.

తా. ఆ పానగృహములో కొందరు స్త్రీలు రతిచేత అలసిపోయిరి. కొందరు పాటలు పాడి పాడి అలసిరి. మరికొందరు నృత్తముచేత అలసిపోయిరి. మరికొందరు మద్యపానముచే స్మృతి తప్పి పడిఉండిరి. 4

మూ. మురజేషు మృదఙ్గేషు పీఠికాసు చ సంస్థితాః, 5
తథాస్తరణముఖ్యేషు సంవిష్టాశ్చాపరాః స్త్రియః.

ప్ర. అ. (కొందరు స్త్రీలు), మురజేషు=మురజములపైన, మృదఙ్గేషు=మృదంగములపైనా, పీఠికాసు చ=చిన్న పీఠముల పైనా, సంస్థితాః=శయనించిరి. అపరాః=మరికొందరు, స్త్రియః=స్త్రీలు, ఆస్తరణముఖ్యేషు=ముఖ్యములైన ఆస్తరణములపై, సంవిష్టాః=శయనించిరి.

తా. కొందరు స్త్రీలు మురజములపైన, మద్దెళ్లపైన, చిన్న పీఠముల పైన ఆనుకొని నిద్రించుచుండిరి. మరి కొందరు మంచి తివాచీలపై శయనించిరి.

మూ. అఙ్గనానాం సహస్రేణ భూషితేన విభూషణైః, 6
రూపసల్లాపశీలేన యుక్తగీతార్థభాషిణా,

దేశకాలాభియుక్తేన యుక్తవాక్యాభిధాయినా, 7
రతాభిరతసంసుప్తం దదర్శ హరియూథపః.

ప్ర. అ. విభూషణైః=అలంకారములచేత, భూషితేన=అలంకరించబడినదీ, రూపసల్లాపశీలేన=రూపమును గూర్చి మాటలాడు స్వభావము గలదీ, యుక్తగీతా

ర్థభాషిణా=పాడబడుచున్న గీతముల అర్థమును గూర్చి మాటలాడు కొనునదీ, దేశకాలాభియుక్తేన=దేశకాలములకు అనుగుణముగా ప్రవర్తించునదీ, యుక్తవాక్యాభిధాయినా=తగిన వాక్యములను పలుకునదీ అయిన, అఙ్గనానామ్=స్త్రీలయొక్క, సహస్రేణ=సహస్రముచేత, రతాభిరతసంసుప్తమ్=రతియందు ఆసక్తివలన కలిగిన నిద్రించుటను, హరియూథపః=హనుమంతుడు, దదర్శ=చూచెను.

తా. అక్కడ నున్న వేలకొలది స్త్రీలు వివిధాలంకారములతో ప్రకాశించుచుండిరి. వారికి సౌందర్యాదివిషయములను గూర్చి ముచ్చటించుకొనుట అలవాటు. వారు ఎవరైన పాడుచున్న గీతములలోని అర్థమును గూర్చి మాటలాడు కొనుచుందురు. వారందరూ దేశకాలములు తెలిసినవారు. తగు విధముగా మాటలాడువారు. అట్టి స్త్రీలందరూ రతమునందు అభిరతలై (ఆసక్తలై) పిదప నిద్రించియుండగా హనుమంతుడు చూచెను. 6, 7

మూ. తాసాం మధ్యే మహాబాహుః శుశుభే రాక్షసేశ్వరః, 8
గోష్ఠే మహతి ముఖ్యానాం గవాం మధ్యే యథా వృషః.

ప్ర. అ. తాసామ్=ఆ స్త్రీలయొక్క, మధ్యే=మధ్యయందు, మహాబాహుః=గొప్ప బాహువులు గల, రాక్షసేశ్వరః=రావణుడు, మహతి=గొప్పదైన, గోష్ఠే=గోశాలయందు, గవామ్=గోవులయొక్క, మధ్యే=మధ్యయందు, వృషః ఇవ=వృషభము వలె, శుశుభే=ప్రకాశించెను.

తా. మహాబాహువైన ఆ రావణుడు, ఆ స్త్రీల మధ్య, విశాలమైన గోశాలలో గోవుల మధ్య వృషభమువలె ప్రకాశించెను. 8

మూ. స రాక్షసేన్ద్రః శుశుభే తాభిః పరివృతః స్వయమ్, 9
కరేణుభిర్యథారణ్యే పరికీర్ణో మహాద్విపః.

ప్ర. అ. తాభిః=ఆ స్త్రీలచేత, పరివృతః=చుట్టుకొనబడిన, సః రాక్షసేన్ద్రః=ఆ రావణుడు, స్వయమ్=తాను, మహారణ్యే=మహారణ్యమునందు, కరేణుభిః=ఆడ ఏనుగులచేత, పరికీర్ణః=చుట్టువారుకొనబడిన, మహాద్విపః యథా=మహాగజము వలె, శుశుభే=ప్రకాశించెను.

తా. చుట్టూ ఆ స్త్రీలందరూ ఉండగా మధ్యలో ఉన్న ఆ రావణుడు మహారణ్యములో ఆడ ఏనుగుల మధ్య ఉన్న మహాగజము వలె ప్రకాశించెను.9

మూ. సర్వకామైరుపేతాం చ పానభూమిం మహాత్మనః, 10
దదర్శ హరిశార్దూలస్తస్య రక్షఃపతేర్గృహే.

ప్ర. అ. హరిశార్దూలః=వానరశ్రేష్ఠుడు, మహాత్మనః=మహాత్ముడైన, తస్య=ఆ, రక్షఃపతేః=రావణునియొక్క, గృహే=గృహమునందు, సర్వకామైః=సమస్తమైన భోగ్యవస్తువులతో, ఉపేతామ్=కూడిన, పానభూమిం చ =పానభూమిని కూడ, దదర్శ=చూచెను.

తా. వానరశ్రేష్ఠుడైన ఆ హనుమంతుడు, మహాత్ముడైన ఆ రాక్షసరాజు గృహమునందు, సమస్తభోగ్యవస్తువులతో నిండి యున్న పానభూమిని చూచెను.10

మూ. మృగాణాం మహిషాణాం చ వరాహాణాం చ భాగశః, 11
తత్ర న్యస్తాని మాంసాని పానభూమౌ దదర్శ సః.

ప్ర. అ. సః=హనుమంతుడు, తత్ర=అక్కడ, పానభూమౌ=పానభూమియందు, భాగశః=వేరు వేరుగా, న్యస్తాని=ఉంచబడిన, మృగాణామ్=లేళ్లయొక్క, మహిషాణాం చ=అడవిదున్నపోతులయొక్క, వరాహాణాం చ=అడవిపందులయొక్క, మాంసాని=మాంసములను, దదర్శ=చూచెను.

తా. హనుమంతుడా పానభూమిలో వేరు వేరుగా ఉంచిన లేళ్ల మాంసములను అడవిదున్నపోతుల మాంసములను, అడవిపందుల మాంసములను చూచెను. 11

మూ. రౌక్మేషు చ విశాలేషు భాజనేష్వర్ధభక్షితాన్, 12
దదర్శ హరిశార్దూలో మయూరాన్ కుక్కుటాంస్తథా.

ప్ర. అ. హరిశార్దూలః=హనుమంతుడు, రౌక్మేషు=బంగారువికారమైన, విశాలేషు=విశాలములైన, భాజనేషు=పాత్రలలో, అర్ధభక్షితాన్=సగము భక్షింపబడిన, మయూరాన్=నెమళ్ళను, తథా=మరియు, కుక్కుటాన్=కోళ్లను, దదర్శ=చూచెను.

తా. హనుమంతుడు అక్కడ విశాలములైన, బంగారు పాత్రలలో, సగము తినగా మిగిలిన నెమళ్లను, కోళ్ళను చూచెను. 12

మూ. వరాహవార్ధ్రాణసకాన్ దధిసౌవర్చలాయుతాన్,
శల్యాన్ మృగమయూరాంశ్చ హనుమానన్వవైక్షత. 13

ప్ర. అ. దధిసౌవర్చలాయుతాన్=పెరుగుతోను, సౌవర్చలమను లవణముతోను, కూడిన, వరాహవార్ధ్రాణసకాన్=వరాహములను, వార్ధ్రాణసకములను (ఒక విధ మగు పక్షికి, ఒక విధమైన మేకపోతునకు కూడ వార్ధ్రాణసక మని పేరు), హనుమాన్=హనుమంతుడు, అన్వవైక్షత=చూచెను.

తా. హనుమంతుడక్కడ, పెరుగు, సౌవర్చలలవణము కలిపి వండిన వరాహములు, వార్ధ్రాణసకము లను పక్షులు (లేదా ఒకవిధమైన మేకపోతులు) ఏదుబందులు, లేళ్లు, నెమళ్లు, మొదలైన వాటి మాంసములను చూచెను. 13

మూ. క్రకరాన్వివిధాన్ సిద్ధాంశ్చకోరానర్ధభక్షితాన్, 14
మహిషానేకశల్యాంశ్చ ఛాగాంశ్చ కృతనిష్ఠితాన్,
లేహ్యానుచ్చావచాన్ పేయాన్ భోజ్యాని వివిధాని చ. 15

ప్ర. అ. వివిధాన్=అనేకవిధములైన, సిద్ధాన్=వండి సిద్ధము చేయబడిన, క్రకరాన్=కక్కెరపక్షులను, అర్ధభక్షితాన్=సగము తినబడిన, చకోరాన్=చకోరపక్షులను, మహిషాన్=అడవిదున్నలను, ఏకశల్యాంశ్చ=ఏకశల్యములను చేపలను, ఛాగాంశ్చ=మేకలను, ఉచ్చావచాన్=అనేకవిధములైన, లేహ్యాన్=నాకి తినవలసిన పదార్థములను, పేయాన్=త్రాగదగిన పదార్థములను, వివిధాని=అనేకవిధములైన, భోజ్యాని=తినుబండారములను (చూచెను).

తా. హనుమంతుడు అక్కడ తినుటకు సిద్ధముగా ఉన్న కక్కెరపక్షులను, దున్నపోతులను, ఏకశల్యము లను మత్స్యములను, తయారు చేసి సిద్ధముగా ఉంచిన మేకలను, అనేకవిధము లైన లేహ్యములను, పేయములను, వివిధము లైన భోజ్యములను చూచెను. 14, 15

మూ. తథామ్లలవణోత్తంసైర్వివిధైరాగషాడబైః,
హారనూపురకేయూరైరపవిద్ధైర్మహాధనైః, 16
పానభాజనవిక్షిప్తైః ఫలైశ్చ వివిధైరపి,
కృతపుష్పోపహారా భూరధికం పుష్యతి శ్రియమ్. 17

ప్ర. అ. తథా=అట్లే, ఆమ్లలవణోత్తంసైః=పులుపు, ఉప్పు ప్రధానముగా గల, వివిధైః=అనేకవిధము లైన, రాగషాడబైః=రాగషాడబములలోను, (షాడబ మనగా షడ్రసములు గల పదార్థము లన్నీ కలిపి తయారుచేసిన ఒక భక్ష్యము లేదా పేయము అయిన పదార్థము. ఆరు స్వరములు గల రాగమునకు కూడ షాడబ మని పేరు. ఆ పక్షమున, 'వివిధైః' అనుదానికి వివిధభక్ష్యములని అర్థము చెప్పి 'రాగషాడబైః' అనుదానికి 'షాడబరాగములచేత' అని అర్థము చెప్పవలెను. కాని ఇక్కడ ప్రకరణానుగుణముగా ఉండుటకు షాడబ శబ్దమునకు "భక్ష్యవిశేషము" లేదా "పేయవిశేషము" అను అర్థమే యుక్తము. 'రాగ' అనగా తెల్ల ఆవాలు, అందుచేత "తెల్లఆవాలు చల్లిన షడ్రససంయోగకృతభక్ష్యవిశేషములు" అని షాడబశబ్దమునకు గోవిందరాజులు ఒక అర్థము చెప్పి "సితామధ్వాదిమధురో

ద్రాక్షాదాడిమజో రసః సరళశ్చేత్ కృతో రాగః సాన్ద్రశ్చేత్ షాడబః స్మృతః" అను ప్రదీపకారుని వాక్యము నుదాహరించి "చక్కెర, తేనె, మొదలైనవి కలుపుటచే మధురముగా చేయబడిన ద్రాక్షాదాడిమాదిఫలరసము పల్చగా ఉన్నచో రాగమనీ, గట్టిగా ఉన్నచో షాడబమనీ అర్థము సూచించినారు. ఈ అర్థము బాగున్నది. భరతుని నాట్యశాస్త్రములో కూడ--"యథా హి గుడాదిభిర్ద్రవ్యైః వ్యఞ్జనైరోషధిభిశ్చ షాడబాదయో రసా నిర్వర్త్యన్తే" అని షాడబశబ్దార్థము సూచితము). అపవిద్ధైః=ఇటు అటు చిమ్మివేయబడిన, మహాధనైః=గొప్ప మూల్యము గల, హారనూపురకేయూరైః=హారములతోను, నూపురములతోను, కేయూరముల తోను, పానభాజనవిక్షిప్తైః=పానపాత్రలందు విడువబడిన, వివిధైః=అనేకవిధములైన, ఫలైశ్చ=ఫలములతోను, కృతపుష్పోపహారా=చేయబడిన పుష్పముల ఉపహారము (అలంకారార్థమై నేలపై పువ్వులు చల్లుట ఉపహారము) గల, భూః=ఆ భూమి, అధికమ్=అధికముగా, శ్రియమ్=శోభను, పుష్యతి=పోషించుచుండెను.

తా. ప్రధానముగా పులుపు, ఉప్పు వేసిన వివిధపదార్థములతోను, రాగములతోను, షాడబములతోను, ఇటు నటు చిమ్మబడి ఉన్న అమూల్యము లైన హారములతోను, నూపురములతోను, కేయూరములతోను, పానపాత్రలందు పడవేయబడిన వివిధఫలములతోను, పుష్పములు చల్లి అలంకరింపబడిన ఆ నేల ఎక్కువ శోభను పోషించుచుండెను. 16, 17

మూ. తత్ర తత్ర చ విన్యస్తైః సుశ్లిష్టైః శయనాసనైః,
పానభూమిర్వినా వహ్నిం ప్రదీప్తేవోపలక్ష్యతే. 18

ప్ర. అ. పానభూమిః=ఆ పానభూమి, తత్ర తత్ర=అక్కడక్కడ, విన్యస్తైః=ఉంచబడిన, సుశ్లిష్టైః=చక్కగా అమర్చబడిన, శయనాసనైః=శయనముల తోను, ఆసనములతోను, వినా వహ్నిమ్=అగ్నిలేకుండగనే, ప్రదీప్తేవ=మండుచున్నది వలె, ఉపలక్ష్యతే=చూడబడుచుండెను.

తా. శయనములు, ఆసనములు అక్కడక్కడ ఉంచి, చక్కగా అలంకరించుటచే, ఆ పానశాల అగ్ని లేకుండగనే మండిపోవుచున్నట్లు ఉండెను.

మూ. బహుప్రకారైర్వివిధైర్వరసంస్కారసంస్కృతైః,
మాంసైః కుశలసంయుక్తైః పానభూమిగతైః పృథక్. 19

ప్ర. అ. బహుప్రకారైః=అనేకపద్ధతులు గలవీ, వివిధైః=అనేక విధములైనవీ, వరసంస్కారసంస్కృతైః=మంచి సంస్కారములచే (వండుట, తాలింపులు వేయుట మొదలైనవాటిచే) సంస్కరింపబడినవీ, కుశలసంయుక్తైః=నేర్పుగా అమర్చబడినవీ,

పృథక్=వేరు వేరుగా, పానభూమిగతైః=పానభూమిని పొందినవీ అయిన, మాంసైః=మాంసములతో (వివిధములైన మద్యములచట ఉన్నవి అని ఉత్తరశ్లోకముతో అన్వయము).

తా. ఆ పానభూమిలో అనేకవిధములైన మాంసములను మంచి పాకాది సంస్కారములచే సంస్కరించి, వాటితో అనేకపద్ధతులలో భక్ష్యములను తయారుచేసి, నేర్పుగా, చూచుటకు ఇంపుగా ఉండు నట్లు అమర్చిరి. (అట్టి మాంసములతో పాటు మద్యములు కూడ అచట ఉండెను).

మూ. దివ్యాః ప్రసన్నా వివిధాః సురాః కృతసురా అపి,
శర్కరాసవమార్ద్వీకపుష్పాసవఫలాసవాః, 20
వాసచూర్ణైశ్చ వివిధైర్మృష్టాస్తైస్తైః పృథక్ పృథక్.

ప్ర. అ. దివ్యాః=శ్రేష్ఠమైన, ప్రసన్నాః=నిర్మల మైన, వివిధాః=అనేకవిధము లైన, సురాః=(సహజము లైన కల్లువంటి) మద్యము, శర్కరాసవమార్ద్వీకపుష్పాసవఫలాసవాః=చక్కెరతో చేసిన మద్యము, తేనెతో చేసిన మద్యము, పువ్వులతో చేసిన మద్యము, పండ్లతో చేసిన మద్యము అను, కృతసురాః అపి=కృత్రిమముగా తయారుచేసిన మద్యములు, తైస్తైః=ఆ యా, వివిధైః=అనేకవిధము లైన, వాసచూర్ణైః=సువాసన కలిగించు చూర్ణములచేత, పృథక్ పృథక్=వేరువేరుగా, మృష్టాః=సంస్కరింపబడినవి.

తా. శ్రేష్ఠములూ, నిర్మలములూ అయిన సహజముగా లభ్యములయే మద్యములు, చక్కెర, తేనె, పుష్పములు, ఫలములు మొదలగువాటితో తయారుచేసిన కృత్రిమమద్యములు, సువాసన కలిగించు వివిధములైన చూర్ణములతో సంస్కరించి వేరువేరుగా అచట ఉంచబడెను. 20

మూ. సంతతా శుశుభే భూమిర్మాల్యైశ్చ బహుసంస్థితైః, 21
హిరణ్మయైశ్చ వివిధైర్భాజనైః స్ఫాటికైరపి.
జామ్బూనదమయైశ్చాన్యైః కరకైరభిసంవృతా. 22

ప్ర. అ. బహుసంస్థితైః=అనేకరూపాలలో వున్న, మాల్యైశ్చ=పుష్పమాలలతో, సంతతా=నిండినదీ, హిరణ్యయైః=బంగారువికారములు, స్ఫాటికైరపి=స్ఫటికవికారములు అయిన, వివిధైః=అనేకవిధము లైన, భాజనైః=పాత్రలతోను, జామ్బూనదమయైః=బంగారు వికారమైన, అన్యైః=ఇతరము లైన, కరకైః=చిన్న పాత్రలతోను, అభిసంవృతా=వ్యాప్తమైనదీ అయిన, భూమిః=భూమి, శుశుభే=ప్రకాశించెను.

తా. ఆ పానభూమియందు అంతటను అనేక ఆకారములలో కట్టిన పుష్పమాలలు, బంగారువికారమైన పెద్ద పాత్రలు, స్ఫటిక వికారములైన పాత్రలు, బంగారు చిన్న పాత్రలు ఉండుటచే అది చాల అందముగా ఉండెను.21, 22

మూ. రాజతేషు చ కుమ్భేషు జామ్బూనదమయేషు చ,
పానశ్రేష్ఠం తదా భూరి కపిస్తత్ర దదర్శ హ. 23

ప్ర. అ. కపిః=హనుమంతుడు, తదా=అప్పుడు, రాజతేషు=వెండి వికారమైనవీ, జామ్బూనదమయేషు చ=బంగారువికార మైనవీ అయిన, కుమ్భేషు=కుంభములలో, భూరి=అధికమైన, పానశ్రేష్ఠమ్=శ్రేష్ఠమైన మద్యమును, దదర్శ హ=చూచెను.

తా. హనుమంతుడు, అప్పుడు, బంగారు కడవలలోను, వెండి కడవలలోను అత్యధికప్రమాణములో ఉన్న, శ్రేష్ఠమైన మద్యమును చూచెను. 23

మూ. సోఽపశ్యచ్ఛాతకుమ్భాని శీధోర్మణిమయాని చ,
రాజతాని చ పూర్ణాని భాజనాని మహాకపిః. 24

ప్ర. అ. సః మహాకపిః=ఆ హనుమంతుడు, శీధోః=మద్యముయొక్క, శాతకుమ్భాని=బంగారువికారమైనవీ, మణిమయాని చ=మాణిక్యవికారమైనవీ, రాజతాని చ=వెండివికార మైనవీ అయిన, పూర్ణాని=నిండిన, భాజనాని=పాత్రలను, అపశ్యత్=చూచెను.

తా. ఆ వానరశ్రేష్ఠుడు మద్యముతో నింపిన బంగారు పాత్రలను, మణులు పొదిగిన పాత్రలను, వెండి పాత్రలను చూచెను. 24

మూ. క్వచిదర్ధావశేషాణి క్వచిత్పీతాని సర్వశః,
క్వచిన్నైవ ప్రపీతాని పానాని స దదర్శ హ. 25

ప్ర. అ. సః=ఆ హనుమంతుడు, క్వచిత్=కొన్ని చోట్ల, అర్ధావశేషాణి=సగము మిగిలినవీ, క్వచిత్=కొన్నిచోట్ల, సర్వశః=పూర్తిగా, పీతాని=త్రాగివేయబడినవీ, క్వచిత్=కొన్నిచోట్ల, నైవ ప్రపీతాని=అసలే త్రాగబడనివీ అయిన, పానాని=పానములను, దదర్శ హ=చూచెను.

తా. అక్కడ కొన్ని చోట్ల ఉన్న పాత్రలలోని మద్యము సగము మిగిలి ఉండెను. కొన్ని చోట్ల పూర్తిగా త్రాగివేసిరి. కొన్ని చోట్ల అసలే త్రాగలేదు.25

మూ. క్వచిద్ భక్ష్యాంశ్చ వివిధాన్ క్వచిత్పానాని భాగశః,
క్వచిదన్నావశేషాణి పశ్యన్వై విచచార హ. 26

ప్ర. అ. క్వచిత్=కొన్నిచోట్ల, వివిధాన్=అనేకవిధములైన, భక్ష్యాంశ్చ=భక్ష్యములను, క్వచిత్=కొన్ని చోట్ల, భాగశః=వేరు వేరుగా, పానాని=పానములను, క్వచిత్=కొన్ని చోట్ల, అన్నావశేషాణి=అన్నముల అవశేషములను, పశ్యన్=చూచుచు, విచచార హ=సంచరించెను.

తా. హనుమంతుడు కొన్నిచోట్ల అనేకవిధములైన భక్ష్యములను, కొన్నిచోట్ల వేరు వేరుగా మద్యములను, కొన్నిచోట్ల తినగా మిగిలిన అన్నములను చూచుచు సంచరించెను. 26

మూ. క్వచిత్ప్రభిన్నైః కరకైః క్వచిదాలోళితైర్ఘటైః,
క్వచిత్సంపృక్తమాల్యాని జలాని చ ఫలాని చ. 27

ప్ర. అ. క్వచిత్=కొన్ని చోట్ల, ప్రభిన్నైః=బ్రద్దలైన, కరకైః=పాత్రలతోను, క్వచిత్=కొన్నిచోట్ల, ఆలోళితైః=కలచివేయబడిన, ఘటైః=ఘటములతోనూ, (కూడిన ప్రదేశములను), క్వచిత్=కొన్ని చోట్ల, సంపృక్తమాల్యాని=లగ్నమైన మాలలు గల, జలాని చ=జలములను, ఫలాని చ=ఫలములను, (చూచుచు సంచరించెను).

తా. కొన్ని చోట్ల బ్రద్దలైపోయిన పాత్రలను, కొన్ని చోట్ల కలచివేయబడిన ఘటములను, కొన్ని చోట్ల పుష్పమాలలతో కూడిన జలములను, ఫలములను చూచుచు హనుమంతుడు సంచరించెను. 27

మూ. శయనాన్యత్ర నారీణాం శుభ్రాణి బహుధా పునః,
పరస్పరం సమాశ్లిష్య కాశ్చిత్సుప్తా వరాఙ్గనాః. 28

ప్ర. అ. అత్ర=ఇక్కడ, నారీణామ్=స్త్రీలయొక్క, శయనాని పునః=శయనము లైతే, బహుధా=అనేకవిధములుగా నుండి, శుభ్రాణి=శుభ్రమైనవి. కాశ్చిత్=కొందరు, వరాఙ్గనాః=స్త్రీలు, పరస్పరమ్=పరస్పరమూ, సమాశ్లిష్య=కౌగలించుకొని, సుప్తాః=నిద్రించిరి.

తా. అక్కడనున్న స్త్రీల శయనములు అనేక ఆకారములలో శుభ్రముగా ఉండెను. కొందరు స్త్రీలు ఒండొరులను కౌగలించుకొని నిద్రించుచుండిరి.28

మూ. కాశ్చిచ్చ వస్త్రమన్యస్యాః స్వపన్త్యాః పరిధాయ చ,
ఆహృత్య చాబలాః సుప్తా నిద్రాబలపరాజితాః. 29

ప్ర. అ. కాశ్చిత్=కొందరు, అబలాః=స్త్రీలు, నిద్రాబలపరాజితాః=నిద్రాబలముచేత ఓడింపబడినవారై, స్వపన్త్యాః=నిద్రించుచున్న, అన్యస్యాః=మరియొక స్త్రీయొక్క, వస్త్రమ్=వస్త్రమును, ఆహృత్య=లాగికొని, పరిధాయ=కప్పుకొని, సుప్తాః=నిద్రించిరి.

తా. కొందరు స్త్రీలు నిద్రకు పూర్తిగా ఒడలు తెలియక, ప్రక్కనున్న స్త్రీలవస్త్రములను లాగికొని, వాటిని కప్పుకొని నిద్రించుచుండిరి. 29

మూ. తాసాముచ్ఛ్వాసవాతేన వస్త్రం మాల్యం చ గాత్రజమ్,
నాత్యర్థం స్పన్దతే చిత్రం ప్రాప్య మన్దమివానిలమ్. 30

ప్ర. అ. తాసామ్=ఆ స్త్రీలయొక్క, గాత్రజమ్=గాత్రమునందు పుట్టిన (ఉన్న), వస్త్రమ్=వస్త్రము, మాల్యం చ=మాల్యము, ఉచ్ఛ్వాసవాతేన=శ్వాసల గాలిచేత, మన్దమ్=మందమైన, అనిలమ్=వాయువును, ప్రాప్య ఇవ=పొందివలె, నాత్యర్థమ్=కొంచెముగా, చిత్రమ్=అందముగా, స్పన్దతే=కదలుచుండెను.

తా. ఆ స్త్రీల నిఃశ్వాసవాయువులచేత, వారి శరీరములపై ఉన్న వస్త్రములు, పుష్పమాలలు, మందమారుతముచేత కదలినట్లు, మెల్లగా, చూచుటకు ముచ్చట గొల్పునట్లుగా కదలుచుండెను. 30

మూ. చన్దనస్య చ శీతస్య శీధోర్మధురసస్య చ,
వివిధస్య చ మాల్యస్య ధూపస్య వివిధస్య చ, 31
బహుధా మారుతస్తత్ర గన్ధం వివిధముద్వహన్.

ప్ర. అ. తత్ర=అక్కడ, మారుతః=వాయువు, శీతస్య=చల్లని, గన్ధస్య= గంధముయొక్క, శీధోః=మద్యముయొక్క, మధురసస్య చ=తేనె రసముయొక్క, వివిధస్య=అనేకవిధము లైన, మాల్యస్య=పుష్పమాలల యొక్క, వివిధస్య=అనే కవిధము లైన, ధూపస్య చ=ధూపముయొక్క, వివిధమ్=అనేకవిధము లైన, గన్ధమ్=సువాసనను, బహుధా=అనేకరీతుల (నలుమూలలా), ఉద్వహన్=మోయుచు (వీచెను).

తా. చల్లని చందనము, మద్యము, తేనె, రసము, అనేకవిధములైన పుష్పమాలలు, అనేక విధములైన ధూపములు వీటిఅన్నిటి వివిధ సుగంధములను వ్యాపింపచేయుచు వాయువు నలుమూలల వీచుచుండెను. 31

మూ. స్నానానాం చన్దనానాం చ ధూపానాం చైవ మూర్ఛితః,
ప్రవవౌ సురభిర్గన్ధో విమానే పుష్పకే తదా.

ప్ర. అ. తదా=అప్పుడు, పుష్పకే విమానే=ఆ పుష్పక విమానము నందు, స్నానానామ్=స్నానముల యొక్క, చన్దనానాం చ=చందనముల యొక్క, ధూపానాం చైవ=ధూపముల యొక్క, సురభిః=పరిమళించుచున్న, గన్ధః=సువాసన, మూర్ఛితః=అంతటా వ్యాపించినదై, ప్రవవౌ=వీచెను.

తా. అప్పుడు, స్నానసమయమునందు ఉపయోగించు సుగంధద్రవ్యములు, చందనములు, ధూపములు వీటి సుగంధము అంతట వ్యాపించి ఆ పుష్పకవిమానమునందు ప్రసరించుచుండెను. 32

మూ. శ్యామావదాతాస్తత్రాన్యాః కాశ్చిత్కృష్ణా వరాఙ్గనాః, 33
కాశ్చిత్ కాఞ్చనవర్ణాఙ్గ్యః ప్రమదా రాక్షసాలయే.

ప్ర. అ. తత్ర=ఆ, రాక్షసాలయే=రావణుని అంతఃపురమునందు, అన్యాః=కొందరు స్త్రీలు, శ్యామావదాతాః=చామనచాయ, తెలుపురంగు గలవారు. కాశ్చిత్=కొందరు, వరాఙ్గనాః=శ్రేష్ఠలైన స్త్రీలు, కృష్ణాః=నల్లగా ఉన్నవారు. కాశ్చిత్=కొందరు, ప్రమదాః=స్త్రీలు, కాఞ్చనవర్ణాఙ్గ్యః=బంగారు రంగు శరీరము గలవారు.

తా. రావణాంతఃపురములోని స్త్రీలలో కొందరు చామనచాయగలవాళ్లు, కొందరు తెల్లనివాళ్లు, కొందరు నల్లవాళ్లు, కొందరు బంగారపు వన్నె కలవాళ్లు ఉండిరి. 33

మూ. తాసాం నిద్రావశత్వాచ్చ మదనేన విమూర్ఛితమ్, 34
పద్మినీనాం ప్రసుప్తానాం రూపమాసీద్యథైవ హి.

ప్ర. అ. నిద్రావశత్వాచ్చ=నిద్రాపరవశలగుటవలనను, మదనేన చ=మన్మథునిచేతను, విమూర్ఛితమ్=అలసట చెందిన, ప్రసుప్తానామ్=నిద్రించుచున్న, తాసామ్=ఆ స్త్రీలయొక్క, రూపమ్=రూపము, ప్రసుప్తానామ్=నిద్రించుచున్న (ముణుచుకొనిపోయిన), పద్మినీనామ్=పద్మలతల రూపము, యథైవ=ఎట్లో, అట్లు, ఆసీత్=ఉండెను.

తా. నిద్రాపారవశ్యముచేతను, రతికేళులు సలిపి ఉండుటచేతను అలసిపోయిన ఆ స్త్రీల రూపము, ముకుళీభవించిన పద్మలతల రూపము వలె ఉండెను. 34

మూ. ఏవం సర్వమశేషేణ రావణాన్తఃపురం కపిః, 35
దదర్శ సుమహాతేజాః న దదర్శ చ జానకీమ్.

ప్ర. అ. సుమహాతేజాః=గొప్ప తేజస్సు గల, కపిః=హనుమంతుడు, ఏవమ్=ఇట్లు, సర్వమ్=సమస్తమైన, రావణాన్తఃపురం=రావణుని అంతఃపురమును, అశేషేణ=పూర్తిగా, దదర్శ=చూచెను. జానకీం చ=జానకిని మాత్రము, న దదర్శ=చూడలేదు.

తా. మహాతేజఃశాలి యైన హనుమంతుడు ఈ విధముగా, ఆ రావణాంతఃపురము నంతను పూర్తిగా చూచెను గాని జానకి మాత్రము ఆతనికి కనబడలేదు. 35

మూ. నిరీక్షమాణశ్చ తదా తాః స్త్రియః స మహాకపిః, 36
జగామ మహతీం చిన్తాం ధర్మసాధ్వసశఙ్కితః.

ప్ర. అ. తదా=అప్పుడు, తాః స్త్రియః=ఆ స్త్రీలను, నిరీక్షమాణః=చూచుచున్న, సః=ఆ, మహాకపిః=హనుమంతుడు, ధర్మసాధ్వసశఙ్కితః=ధర్మమునకు సంబంధించిన భయమువలన శంకితుడై, మహతీమ్=గొప్ప, చిన్తామ్=చింతను, జగామ=పొందెను.

తా. అప్పుడు ఆ స్త్రీల నందరిని చూచుచున్న ఆ హనుమంతునకు, ధర్మలోపము చేసినానా అను శంకచే, ఎక్కువ విచారము కలిగెను. 36

మూ. పరదారావరోధస్య ప్రసుప్తస్య నిరీక్షణమ్, 37
ఇదం ఖలు మమాత్యర్థం ధర్మలోపం కరిష్యతి.

ప్ర. అ. ప్రసుప్తస్య=నిద్రించుచున్న, పరదారావరోధస్య=పరభార్యల అంతఃపురముయొక్క, ఇదమ్=ఈ, మమ=నాయొక్క, నిరీక్షణమ్=చూచుట, అత్యర్థమ్=మిక్కిలి, ధర్మలోపమ్=ధర్మమునకు లోపమును, కరిష్యతి=చేయుగలదు.

తా. నేను ఈ విధముగా, నిద్రించుచున్న పరభార్య లున్న అంతఃపురమును చూచినాను. ఇది నాకు చాలా ధర్మలోపమును కలిగించును కదా! 37

మూ. న హి మే పరదారాణాం దృష్టిర్విషయవర్తినీ, 38
అయం చాత్ర మయా దృష్టః పరదారపరిగ్రహః.

ప్ర. అ. మే=నాయొక్క, దృష్టిః=దృష్టి, పరదారాణామ్=పరభార్యల యొక్క, విషయవర్తినీ=విషయమునందు ప్రవర్తించునది, న హి= కాదు కదా? అత్ర=ఇక్కడ, మయా=నాచేత, అయమ్=ఈ, పరదారపరిగ్రహః=భార్యారూపమైన పరుల బంధుజనము, దృష్టశ్చ=చూడబడినది.

తా. నేను పరభార్యలను నా దృష్టికి విషయముగా చేసుకొనను కదా! కాని ఈనాడు ఇక్కడ, నేను ఈ పరభార్యలను పరీక్షగా చూడవలసి వచ్చినది!

మూ. తస్య ప్రాదురభూచ్చిన్తా పునరన్యా మనస్వినః, 39
నిశ్చితైకాన్తచిత్తస్య కార్యనిశ్చయదర్శినీ.

ప్ర. అ. మనస్వినః=ఉత్తమమైన మనస్సు కలవాడూ, నిశ్చితైకాన్తచిత్తస్య=ని శ్చయము గల ఏకాగ్రమైన చిత్తము కలవాడూ అయిన, తస్య=ఆ హనుమంతునకు, పునః=మరల, కార్యనిశ్చయదర్శినీ=కార్యము యొక్క నిశ్చయమును చూపించు, అన్యా=మరియొక, చిన్తా=ఆలోచన, ప్రాదురభూత్=పుట్టెను.

తా. హనుమంతుడు ఏదైన ఒక కార్యమును నిశ్చయించి దానిపై మనస్సును స్థిరముగా నిలపగలవాడు. ఉత్తమమైన ఆలోచనలు కలవాడు అట్టి ఆ హనుమంతునకు మొదట ఇట్టి ఆలోచనలు కలిగినను, మరల, కార్య నిశ్చయమును చూపెడు మరియొక ఆలోచన కలిగెను. 39

మూ. కామం దృష్టా మయా సర్వా విశ్వస్తా రావణస్త్రియః, 40
న హి మే మనసః కించిద్వైకృత్యముపపద్యతే.

ప్ర. అ. విశ్వస్తాః=నమ్మకము గల, సర్వాః=సమస్తమైన, రావణస్త్రియః= రావణుని భార్యలు, మయా=నాచేత, కామం దృష్టాః=చూడబడి ఉండవచ్చును. మే=నాయొక్క, మనసః=మనస్సునకు, కించిత్=ఏమియు, వైకృత్యమ్=వికారము, న ఉపజాయతే హి=పుట్టుటలేదు కదా.

తా. పరపురుషు లెవ్వరూ లేరు కదా అను విశ్వాసముతో ఇష్టమువచ్చినట్లు పరుండి నిద్రించుచున్న రావణుని భార్యలను నేను చూచిన మాట వాస్తవమే యైనను నా మనస్సులో ఎట్టి వికారము కలుగలేదు కదా! 40

మూ. మనో హి హేతుః సర్వేషామిన్ద్రియాణాం ప్రవర్తనే, 41
శుభాశుభాస్వవస్థాసు తచ్చ మే సువ్యవస్థితమ్.

ప్ర. అ. శుభాశుభాసు=శుభములు గాని, అశుభములు గాని అయిన, అవస్థాసు=అవస్థలందు, సర్వేషామ్=సమస్తమైన, ఇన్ద్రియాణామ్=ఇంద్రియముల యొక్క, ప్రవర్తనే=ప్రవర్తనమునందు, మనః=మనస్సే, హేతుః=హేతువు కదా! మే=నాయొక్క, తచ్చ=ఆ మనస్సు, సువ్యవస్థితమ్=బాగుగా స్థిరముగా ఉన్నది.

తా. మంచి పరిస్థితులలో గాని, చెడ్డ పరిస్థితులలో గాని (పుణ్యకా ర్యములందు గాని, పాపకార్యములందు గాని) ఇంద్రియములు ప్రవర్తించుటకు మనస్సే కారణము. ఈ స్త్రీలను చూచినను, నా మనస్సు ఎట్టి వికారము చెందక స్థిరముగా ఉన్నది. 41

మూ. నాన్యత్ర హి మయా శక్యా వైదేహీ పరిమార్గితుమ్, 42
స్త్రియో హి స్త్రీషు దృశ్యన్తే సదా సంపరిమార్గణే.

ప్ర. అ. వైదేహీ=సీత, అన్యత్ర=మరియొకచోట, పరిమార్గితుమ్=వెదకుటకు, మయా=నాచేత, న శక్యా హి=శక్యమైనది కాదు కదా. సదా=ఎల్లప్పుడును, సంపరిమార్గణే=అన్వేషించుటయందు, స్త్రియః=స్త్రీలు, స్త్రీషు=స్త్రీలలో, దృశ్యన్తే=చూడబడుదురు కదా!

తా. సీతకోసము నేను మరొక చోట ఎక్కడా వెదకజాలను కదా! స్త్రీలను వెదకవలసి వచ్చినపుడు, స్త్రీల మధ్యకే వెళ్ళి వెదకవలసి యుండును గదా! 42

మూ. యస్య సత్త్వస్య యా యోనిస్తస్యాం తత్పరిమార్గ్యతే,
న శక్యా ప్రమదా నష్టా మృగీషు పరిమార్గితుమ్. 43

ప్ర. అ. యస్య=ఏ, సత్త్వస్య=జంతువునకు, యా=ఏది, యోనిః=జాతియో, తత్=ఆ జంతువు, తస్యామ్=ఆ జాతియందు, పరిమార్గ్యతే=వెదకబడును. నష్టా=తప్పిపోయిన, ప్రమదా=స్త్రీ, మృగీషు=ఆడలేడుల మధ్య, పరిమార్గితుమ్=అన్వేషించుటకు, న శక్యా=శక్యమైనది కాదు.

తా. ఏ జంతువు ఏ జాతికి చెందినదో ఆ జంతువును ఆ జాతియందే వెదకవలసి ఉండును. తప్పిపోయిన స్త్రీని ఆడ లేళ్ళ మధ్యకు వెళ్ళి వెదికినచో దొరకదు కదా! 43

మూ. తదిదం మార్గితం తావచ్ఛుద్ధేన మనసా మయా, 44
రావణాన్తఃపురం సర్వం దృశ్యతే న చ జానకీ.

ప్ర. అ. తత్=ఆ కారణమువలన, మయా=నాచేత, శుద్ధేన=పరిశుద్ధమైన, మనసా=మనస్సుతో, ఇదమ్=ఈ, సర్వమ్=సమస్తమైన, రావణాన్తఃపురమ్=రావణుని అంతఃపురము, మార్గితమ్=వెదకబడినది. జానకీ చ=జానకి మాత్రము, న దృశ్యతే=చూడబడుటలేదు.

తా. అందుచేత, నేను నిష్కల్మషమైన మనస్సుతో ఈ రావణాంతఃపురమునంతను వెదకినాను ; జానకి మాత్రము కనబడుటలేదు. 44

మూ. దేవగన్ధర్వకన్యాశ్చ నాగకన్యాశ్చ వీర్యవాన్, 45
అవేక్షమాణో హనుమాన్నైవాపశ్యత జానకీమ్.

ప్ర. అ. దేవగన్ధర్వకన్యాశ్చ=దేవకన్యలను, గంధర్వకన్యలను, నాగకన్యాశ్చ=నాగకన్యలను, అవేక్షమాణః=చూచుచున్న, వీర్యవాన్=వీర్యవంతుడైన, హనుమాన్=హనుమంతుడు, జానకీమ్=జానకిని, నైవాపైక్షత=చూడలేదు.

తా. వీర్యవంతుడైన ఆ హనుమంతునకు రావణాంతఃపురములో దేవ-గంధర్వ-నాగకన్యలు కనబడిరి గాని సీత మాత్రము కనబడలేదు. 45

మూ. తామపశ్యన్ కపిస్తత్ర పశ్యంశ్చాన్యా వరస్త్రియః, 46
అపక్రమ్య తదా వీరః ప్రధ్యాతుముపచక్రమే.

ప్ర. అ. వీరః=వీరుడైన, కపిః=హనుమంతుడు, తత్ర=అక్కడ, తామ్=ఆమెను, అపశ్యన్=చూడనివాడై, అన్యాః=ఇతరులైన, వరస్త్రియః=శ్రేష్ఠలైనస్త్రీలను, పశ్యంశ్చ=చూచుచు, తదా=అప్పుడు, అపక్రమ్య=దూరముగా వెళ్ళి, ప్రధ్యాతుమ్=దీర్ఘముగా ఆలోచించుటకు, ఉపచక్రమే=ప్రారంభించెను.

తా. మహావీరుడైన హనుమంతునకు అక్కడ ఎందరో ఉత్తమస్త్రీలు కనబడినారు కాని సీత మాత్రము కనబడలేదు. అపుడు అతడు అక్కడనుండి కొంచెము దూరముగా వెళ్ళి దీర్ఘాలోచన చేయ ప్రారంభించెను. 46

మూ. స భూయస్తు పరం శ్రీమాన్ మారుతిర్యత్నమాస్థితః, 47
ఆపానభూమిముత్సృజ్య తద్విచేతుం ప్రచక్రమే.

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే సున్దరకాణ్డే
ఏకాదశః సర్గః.

ప్ర. అ. శ్రీమాన్=శ్రీమంతుడైన, సః మారుతిః=ఆ హనుమంతుడు, భూయః=మరల, పరమ్=గొప్ప, యత్నమ్=ప్రయత్నమును, ఆస్థితః=అవలంబించినవాడై, ఆపానభూమిమ్=పానభూమిని, ఉత్సృజ్య=విడచి, తత్=ఆ, అంతఃపురమును, విచేతుమ్=అన్వేషించుటకు, ప్రచక్రమే=ఉపక్రమించెను.

తా. శ్రీమంతుడైన ఆ హనుమంతుడు ఆ పానభూమిని విడచి, ఇంకనూ ఎక్కువ ప్రయత్నముతో ఆ అంతఃపురమును వెదకుటకు ప్రారంభించెను. 47

"బాలానందిని"అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు
సుందరకాండలో పదకొండవ సర్గ సమాప్తము.

అథ ద్వాదశః సర్గః

[సీత మరణించినదేమో అని శంకించి హనుమంతుడు ఉత్సాహవిహీను డగుట ; మరల ఉత్సాహము తెచ్చుకొని స్థానాంతరములలో వెదకుట, ఎక్కడా సీత కనబడకపోవుటచే మరల అతడు నిరుత్సాహము చెందుట].

మూ. స తస్య మధ్యే భవనస్య మారుతి
ర్లతాగృహాంశ్చిత్రగృహాన్నిశాగృహాన్,
జగామ సీతాం ప్రతి దర్శనోత్సుకో
న చైవ తాం పశ్యతి చారుదర్శనామ్. 1

ప్ర. అ. సః మారుతిః=ఆ హనుమంతుడు, తస్య=ఆ, భవనస్య=భవనముయొక్క, మధ్యే=మధ్యయందు, సీతాం ప్రతి=సీతను గూర్చి, దర్శనోత్సుకః=చూచుటయందు ఔత్సుక్యము కలవాడై, లతాగృహాన్=లతలతో ఏర్పరచిన గృహములను, చిత్రగృహాన్=చిత్తరువులు వ్రాయుటకై నిర్మించిన గృహములను, నిశాగృహాన్=రాత్రులు గడపు గృహములను గూర్చి, జగామ=వెళ్ళెను. చారుదర్శనామ్=అందమైన దర్శనము గల (చూచుటకు చాలా అందమైన), తామ్=ఆమెను, న చైవ పశ్యతి=చూడలేదు.

తా. ఆ హనుమంతుడు సీతను చూడవలెనను ఔత్సుక్యముతో ఆ భవన మధ్యమునందున్న లతాగృహములకు, చిత్రగృహములకు, రాత్రిగృహములకు వెళ్ళెను గాని, చూచుటకు చాల అందమైన ఆ సీతను మాత్రము చూడజాలక పోయెను. 1

మూ. స చిన్తయామాస తతో మహాకపిః
ప్రియామపశ్యన్ రఘునన్దనస్య తామ్,
ధ్రువం హి సీతా మ్రియతే యథా న మే
విచిన్వతో దర్శనమేతి మైథిలీ. 2

ప్ర. అ. తతః=అటు పిమ్మట, సః మహాకపిః=ఆ హనుమంతుడు, రఘునన్దనస్య=రామునియొక్క, ప్రియామ్=ప్రియురాలైన, తామ్=ఆ సీతను, అపశ్యన్=చూడనివాడై, చిన్తయామాస=ఇట్లు ఆలోచించెను. మైథిలీ=మైథిలి, విచిన్వతః=వెదకుచున్న, మే=నాకు, యథా=ఎట్లు, దర్శనమ్=దర్శనమును, న

ఉపైతి=పొందుటలేదో, దానిని పట్టి, సీతా=సీత, ధ్రువమ్=తప్పక, మ్రియతే=మరణించినది.

తా. ఆ రఘునందనుని భార్య యైన సీత కనబడకపోవుటచే హనుమంతుడు ఈ విధముగా తలచెను. "సీత తప్పక మరణించి యుండును ; అందుచేతనే ఎంత వెదకినను నాకు కనబడుట లేదు". 2

మూ. సా రాక్షసానాం ప్రవరేణ జానకీ
స్వశీలసంరక్షణతత్పరా సతీ,
అనేన నూనం ప్రతిదుష్టకర్మణా
హతా భవేదార్యపథే పరే స్థితా. 3

ప్ర. అ. పరే=శ్రేష్ఠమైన, ఆర్యపథే=పూజ్యమైన పాతివ్రత్య ధర్మమునందు, స్థితా=నిలచి ఉన్న, సా జానకీ=ఆ జానకి, స్వశీలసంరక్షణ తత్పరా సతీ=తన శీలమును రక్షించుకొనుటయందు ఆసక్తి గలదై, ప్రతి దుష్టకర్మణా=చెడ్డపని గల, అనేన=ఈ, రాక్షసానాం ప్రవరేణ=రాక్షసరాజు చేత, హతా=చంపబడినది, భవేత్=అయి ఉండును. నూనమ్=నిశ్చయము.

తా. పూజ్యమైన ధర్మమార్గమునందు స్థిరురాలుగా ఉండి, తన శీలమును రక్షించుకొనుటకై ప్రయత్నించిన సీతను ఈ రాక్షసరాజు, తప్పక చంపివేసి ఉండును. 3

మూ. విరూపరూపా వికృతా వివర్చసో
మహాననా దీర్ఘవిరూపదర్శనాః,
సమీక్ష్య సా రాక్షసరాజయోషితో
భయాద్వినష్టా జనకేశ్వరాత్మజా. 4

ప్ర. అ. సా=ఆ, జనకేశ్వరాత్మజా=జనకమహారాజు కూతురు, విరూపరూపాః=వికారమైన రూపములు కలవారూ, వికృతాః=వికృత స్వభావం గలవారూ, వివర్చసః=కాంతి లేనివారూ, మహాననాః=పెద్ద ముఖములు కలవారూ, దీర్ఘవిరూపదర్శనాః=పొడవైన వికృతరూపము గల నేత్రములు గలవారూ అయిన, రాక్షసరాజయోషితః=రావణుని భార్యలను, సమీక్ష్య=చూచి, భయాత్=భయమువలన, వినష్టా=మరణించినది.

తా. భయంకరములైన ఆకారములు, పెద్దముఖములు, పొడవైన వికృతమైన నేత్రములుగల, వికృతస్వభావలూ, కాంతివిహీనలూ అయిన రావణుని స్త్రీలను చూడగానే సీత భయపడి మరణించి ఉండును. 4

మూ. సీతామదృష్ట్వా హ్యనవాప్య పౌరుషం
విహృత్య కాలం సహ వానరైశ్చిరమ్,
న మేఽస్తి సుగ్రీవసమీపగా గతిః
సుతీక్ష్ణదణ్డో బలవాంశ్చ వానరః. 5

ప్ర. అ. సీతామ్=సీతను, అదృష్ట్వా=చూడక, పౌరుషమ్=పురుష కర్తవ్యమును, అనవాప్య=పొందక, వానరైః సహ=వానరులలో కూడ, చిరం కాలమ్=చాల కాలము. విహృత్య=విహరించి, మే=నాకు, సుగ్రీవసమీపగా=సుగ్రీవుని సమీపమునకు వెళ్ళు, గతిః=మార్గము, నాస్తి=లేదు. వానరః=సుగ్రీవుడు, సుతీక్ష్ణదణ్డః=మిక్కిలి తీక్ష్ణమైన దండము గలవాడు. బలవాంశ్చ=బలవంతుడు కూడ.

తా. చాలకాలము వానరులతో కాలక్షేపము చేసి, నా కర్తవ్యమును పూర్తి చేయజాలనివాడనై, సీతను చూడకుండా నేను సుగ్రీవుని వద్దకు తిరిగి వెళ్లే ఉపాయమేదీ కనబడుటలేదు. ఆతడు తన ఆజ్ఞను పాటించనివారికి అతి తీవ్రమైన దండనము విధించును. అతడు మహాబలవంతుడు కూడ. 5

మూ. దృష్టమన్తఃపురం సర్వం దృష్టా రావణయోషితః,
న సీతా దృశ్యతే సాధ్వీ వృథా జాతో మమ శ్రమః. 6

ప్ర. అ. సర్వమ్=సమస్తమైన, అన్తఃపురమ్=అంతఃపురము, దృష్టమ్=చూడబడినది. రావణయోషితః=రావణుని స్త్రీలు, దృష్టాః=చూడబడినారు. సాధ్వీ=పతివ్రతయైన, సీతా=సీత, న దృశ్యతే=చూడబడుటలేదు. మమ=నా యొక్క, శ్రమః=శ్రమ, వృథా=వ్యర్థముగా, జాతః=అయినది.

తా. అంతఃపురము నంతను చూచితిని. రావణుని భార్యలనందరిని చూచితిని. సీత మాత్రము కనబడలేదు. నా శ్రమ అంతా వృథా అయినది కదా ! 6

మూ. కిం ను మాం వానరాః సర్వే గతం వక్ష్యన్తి సంగతాః,
గత్వా తత్ర త్వయా వీర కిం కృతం తద్వదస్వ నః. 7

ప్ర. అ. గతమ్=తిరిగి వెళ్ళిన, మామ్=నన్ను, సంగతాః=కలసిన వారై, సర్వే=సమస్తమైన, వానరాః=వానరులు, కిం ను=ఏమి, వక్ష్యన్తి=చెప్పగలరో ! వీర=వీరుడా ! తత్ర=అక్కడికి, గత్వా=వెళ్ళి, త్వయా=నీ చేత, కిమ్=ఏమి, కృతమ్=చేయబడినది ! తత్=దానిని, నః=మాకు, వదస్వ=చెప్పుము.

తా. ఉత్తరతీరమునందు నా కోసమై ఎదురుచూచుచున్న వానరులందరు తిరిగి వెళ్ళిన నన్ను చూచి ఏ మందురో గదా ! "ఓ వీరుడా ! లంకకు వెళ్ళి నీవు అక్కడ ఏమి చేసినావు ? చెప్పుము" అని అడిగెదరు. 7

మూ. అదృష్ట్వా కిం ప్రవక్ష్యామి తామహం జనకాత్మజామ్,
ధ్రువం ప్రాయముపైష్యన్తి కాలస్య వ్యతివర్తనే. 8

ప్ర. అ. తామ్=ఆ, జనకాత్మజామ్=సీతను, అదృష్ట్వా=చూడక, కిమ్=ఏమి, ప్రవక్ష్యామి=చెప్పగలను ? కాలస్య=కాలముయొక్క, వ్యతివర్తనే=గడచిపోవుటయందు, ధ్రువమ్=తప్పక, ప్రాయమ్=ప్రాయోపవేశనమును, ఉపైష్యన్తి=పొందగలరు.

తా. జనకాత్మజను చూడజాలని నేను వారి ప్రశ్నలకు ఏమి సమాధానము చెప్పగలను ? నేను తిరిగి వెళ్లుటలో ఆలస్యము చేసినచో వారు తప్పక ప్రాయోపవేశము చేయుదురు. 8

మూ. కిం వా వక్ష్యతి వృద్ధశ్చ జామ్బవానఙ్గదశ్చ సః,
గతం పారం సముద్రస్య వానరాశ్చ సమాగతాః. 9

ప్ర. అ. సముద్రస్య=సముద్రముయొక్క, పారమ్=ఆవలి ఒడ్డును గూర్చి, గతమ్=వెళ్ళిన నన్ను, వృద్ధః=వృద్ధుడైన, జామ్బవాన్=జాంబవంతుడు, కిం వా=ఏమి, వక్ష్యతి=చెప్పగలడో ! సః=ఆ, అఙ్గదశ్చ=అంగదుడూ, సమాగతాః=కలిసిన, వానరాశ్చ=వానరులు, ఏమి అందురో !

తా. నేను సముద్రము ఆవలి ఒడ్డు చేరగానే వృద్ధుడైన జాంబవంతుడు, అంగదుడు, వానరులు, అందరూ కలిసి ఏమందురో ! 9

మూ. అనిర్వేదః శ్రియో మూలమనిర్వేదః పరం సుఖమ్,
అనిర్వేదో హి సతతం సర్వార్థేషు ప్రవర్తకః. 10

ప్ర. అ. అనిర్వేదః=నిర్వేదము (దిగులుపాటు) లేకపోవుట (ఉత్సాహము), శ్రియః=అభివృద్ధికి, మూలమ్=మూలము. అనిర్వేదః=నిర్వేదము లేకపోవుట, పరమ్=గొప్ప, సుఖమ్=సుఖహేతువు. అనిర్వేదః=నిర్వేదము లేకపోవుట, సతతమ్=ఎల్లప్పుడూ, సర్వార్థేషు=సమస్తవిషయములందు, ప్రవర్తకః హి=ప్రవర్తింపచేయునది కదా !

తా. అనిర్వేదము (దిగులు చెందకుండుట) అభివృద్ధికి మూలము. అనిర్వేదమే గొప్ప సుఖహేతువు. ఎల్లప్పుడును అనిర్వేదమే మానవుని సర్వకార్యములందును ప్రవర్తింపచేయుచుండును కదా. 10

మూ. కరోతి సఫలం జన్తోః కర్మ యత్తత్కరోతి సః,
తస్మాదనిర్వేదకృతం యత్నం చేష్టేஉహముత్తమమ్. 11
అదృష్టాంశ్చ విచేష్యామి దేశాన్రావణపాలితాన్.

ప్ర. అ. (మానవుడు) యత్=ఏ, కర్మ=పనిని, కరోతి=చేయునో, జన్తోః=మానవునియొక్క, తత్=దానిని, సఫలమ్=సఫల మైనదానినిగా, సః=ఆ అనిర్వేదము, కరోతి=చేయును, తస్మాత్=ఆ కారణమువల, అహమ్=నేను, అనిర్వేదకృతమ్=అనిర్వేదముతో చేయబడిన, ఉత్తమమ్=ఉత్తమమైన, ప్రయత్నమ్=ప్రయత్నమును, చేష్టే=చేయుదును. అదృష్టాన్=చూడబడని, రావణపాలితాన్=రావణునిచేత పాలించబడిన, దేశాన్=ప్రదేశములను, విచేష్యామి తావత్=అన్వేషించెదను.

తా. అనిర్వేదమే మానవుడు తలబెట్టిన పని సఫలమగునట్లు చేయును. అందుచేత నేను నిర్వేదము చెందక ఉత్తమ మైన ప్రయత్నము చేసెదను. ఇంత వరకూ చూడని రావణుడు పాలించుచున్న ప్రదేశము లన్నీ మరల వెదకెదను.11

మూ. ఆపానశాలా విచితాస్తథా పుష్పగృహాణి చ, 12
చిత్రశాలాశ్చ విచితా భూయః క్రీడాగృహాణి చ,
నిష్కుటాన్తరరథ్యాశ్చ విమానాని చ సర్వశః. 13

ప్ర. అ. ఆపానశాలాః=పానశాలలు, విచితాః=వెదకబడినవి. తథా=అట్లే, పుష్పగృహాణి చ=పుష్పగృహములు, చిత్రశాలాశ్చ=చిత్రశాలలు, విచితాః=వెదకబడినవి. భూయః=మరల, క్రీడాగృహాణి చ=క్రీడాగృహములు, నిష్కుటాన్తరరథ్యాశ్చ=ఉద్యానమధ్యమందలి వీథులు, విమానాని చ=విమానములు, సర్వశః=అన్ని వైపులా, వెదకబడినవి.

తా. నేనింతవరకు పానశాలలు, పుష్పగృహములు, చిత్రశాలలు, క్రీడాగృహములు, ఉద్యానమధ్యవీథులు, విమానము (భవనములు) పూర్తిగా వెదకితిని. 12, 13

మూ. ఇతి సంచిన్త్య భూయోஉపి విచేతుముపచక్రమే,
భూమీగృహాంశ్చైత్యగృహాన్ గృహాతిగృహకానపి. 14

ప్ర. అ. ఇతి=ఇట్లు, సంచిన్త్య=ఆలోచించి, భూమీగృహాన్=భూగృహములను, చైత్యగృహాన్=నాల్గువీధులమొగలలోని గృహములను, గృహాతిగృహకానపి=ప్రధానగృహమునకు దూరముగా నిర్మింపబడిన చిన్న గృహములను కూడ, భూయోஉపి=మరల, విచేతుమ్=వెదకుటకు, ఉపచక్రమే=ప్రారంభించెను.

తా. హనుమంతుడీ విధముగా ఆలోచించి, భూగృహములను, చైత్య గృహములను, ప్రధానగృహములకు దూరముగా నిర్మించిన చిన్న గృహములను మాటిమాటికిని వెదకుటకు ప్రారంభించెను. 14

మూ. ఉత్పతన్నిపతంశ్చాపి తిష్ఠన్గచ్ఛన్ పునః పునః,
అపావృణ్వంశ్చ ద్వారాణి కవాటాన్యవఘాటయన్. 15
ప్రవిశన్నిష్పతంశ్చాపి ప్రపతన్నుత్పతన్నపి,
సర్వమప్యవకాశం స విచచార మహాకపిః. 16

ప్ర. అ. సః మహాకపిః=ఆ హనుమంతుడు, పునః పునః=మాటిమాటికి, ఉత్పతన్=పైకి ఎగురుచు, నిష్పతంశ్చాపి=క్రిందికి దుముకుచు, తిష్ఠన్=నిల బడుచు, గచ్ఛన్=నడచుచు, ద్వారాణి=ద్వారములను, అపావృణ్వన్=తెరచుచు, కవాటాని=తలుపులను, అవఘాటయన్=త్రోయుచు, ప్రవిశన్=లోనికి ప్రవేశించుచు, నిష్పతంశ్చాపి=బైటకు వచ్చుచు, ప్రపతన్=దిగుచు, ఉత్పతన్నపి=ఎక్కుచు, సర్వమ్ అపి=సమస్తమైన, అవకాశమ్=అవకాశమును, విచచార=సంచరించెను.

తా. హనుమంతుడు, మాటిమాటికి పైకి ఎగురుచు, క్రిందికి దుముకుచు, ద్వారములు తెరచుచు, తలుపులు త్రోయుచు, లోనికి ప్రవేశించుచు, బైటకు వచ్చుచు, దిగుచు, ఎక్కుచు, ఆ ప్రదేశము లన్నింటిలోను సంచరించెను.15, 16

మూ. చతురఙ్గులమాత్రోఽపి నావకాశః స విద్యతే,
రావణాన్తఃపురే తస్మిన్ యం కపిర్న జగామ సః. 17

ప్ర. అ. తస్మిన్=ఆ, రావణాన్తఃపురే=రావణుని అంతఃపురమునందు, సః కపిః=ఆ హనుమంతుడు, యమ్=ఏ ప్రదేశమును గూర్చి, న జగామ=వెళ్ళ లేదో, సః=అట్టి, అవకాశః=చోటు, చతురఙ్గులమాత్రోఽపి=నాలుగు అంగుళములు మాత్రము కూడా, న విద్యతే=లేదు.

తా. హనుమంతుడు ఆ రావణాంతఃపురములో నాలుగు అంగుళముల ప్రదేశము కూడ మిగలకుండగా వెదకెను. 17

మూ. ప్రాకారాన్తరరథ్యాశ్చ వేదికాశ్చైత్యసంశ్రయాః,
దీర్ఘికాః పుష్కరిణ్యశ్చ సర్వం తేనావలోకితమ్. 18

ప్ర. అ. ప్రాకారాన్తరరథ్యాశ్చ=ప్రాకారముల మధ్యయందున్న వీథులు (రోడ్లు), చైత్యసంశ్రయాః=చైత్యములకు (నాలుగు వీథుల కూడలులయం దున్న మహావృక్షములకు) చేరి ఉన్న, వేదికాః=అరుగులూ, దీర్ఘికాః=దిగుడుబావులు,

పుష్కరిణ్యశ్చ=పద్మసరస్సులు, సర్వమ్=సమస్తమూ, తేన=హనుమంతుని చేత, అవలోకితమ్=చూడబడినది.

తా. ప్రాకారములలో ఉన్న వీథులూ, చైత్యములకు అనుకొని ఉన్న వేదికలు, దిగుడుబావులు, పద్మసరస్సులూ, వీటినన్నింటినీ హనుమంతుడు చూచెను.

మూ. రాక్షస్యో వివిధాకారా విరూపా వికృతాస్తథా.
దృష్టా హనుమతా తత్ర న తు సా జనకాత్మజా. 19

ప్ర. అ. వివిధాకారాః=అనేకవిధము లైన ఆకారములు కలవారూ, విరూపాః= వికృతము లైన రూపము గలవారూ, తథా=మరియు, వికృతాః=అంగవికారము గలవారూ అయిన, రాక్షస్యః=రాక్షసస్త్రీలు, తత్ర=అక్కడ, హనుమతా=హనుమంతునిచేత, దృష్టాః=చూడబడిరి. సా=ఆ, జనకాత్మజా తు=సీత యైతే, న=చూడబడలేదు.

తా. అనేక విధములైన ఆకారములతో, వికృతము లైన రూపములతో, వికృతము లైన అవయవములతో ఉన్న రాక్షసస్త్రీలు, హనుమంతునకు , అక్కడ కనబడిరి కాని సీత మాత్రము కనబడలేదు. 19

మూ. రూపేణాప్రతిమా లోకే వరా విద్యాధరస్త్రియః,
దృష్టా హనుమతా తత్ర న తు రాఘవనన్దినీ. 20

ప్ర. అ. రూపేణ=సౌందర్యముచేత, లోకే=లోకమునందు, అప్రతిమాః= సాటిలేని, వరాః=శ్రేష్ఠలైన, విద్యాధరస్త్రియః=విద్యాధరస్త్రీలు, తత్ర=అక్కడ, హనుమతా=హనుమంతునిచేత, దృష్టాః=చూడబడిరి. రాఘవనన్దినీ తు=రామునకు ఆనందమును కలిగించు సీత మాత్రము, న=చూడబడలేదు.

తా. సౌందర్యవిషయమునందు లోకములో సాటి లేని విద్యాధరస్త్రీలు, అక్కడ, హనుమంతునకు కనబడినారు కాని సీత మాత్రము కనబడలేదు. 20

మూ. నాగకన్యా వరారోహాః పూర్ణచన్ద్రనిభాననాః,
దృష్టా హనుమతా తత్ర న తు సీతా సుమధ్యమా. 21

ప్ర. అ. వరారోహాః=అందమైన పిరుదులు గలవారూ, పూర్ణచన్ద్రనిభాననాః=పూర్ణచంద్రునితో సమాన మైన ముఖములు గలవారూ అయిన, నాగకన్యాః=నాగకన్యలు, తత్ర=అక్కడ, హనుమతా=హనుమంతునిచేత, దృష్టాః= చూడబడినారు. సుమధ్యమా=మంచి నడుము గల, సీతా తు=సీత యైతే, న=చూడబడలేదు.

తా. అందమైన పిరుదులు, పూర్ణచంద్రుని వంటి ముఖములు గల నాగకన్యలు అక్కడ, హనుమంతునకు కనబడినారు గాని అందమైన నడుము గల సీత మాత్రము కనబడలేదు. 21

మూ. ప్రమథ్య రాక్షసేన్ద్రేణ నాగకన్యా బలాద్ధృతాః,
దృష్టా హనుమతా తత్ర న సా జనకనన్దినీ. 22

ప్ర. అ. రాక్షసేన్ద్రేణ=రావణునిచేత, ప్రమథ్య=జయించి, బలాత్=బలాత్కారముగా, హృతాః=హరింపబడిన, నాగకన్యాః=నాగకన్యలు, తత్ర=అక్కడ, హనుమతా=హనుమంతునిచేత, దృష్టాః=చూడబడిరి. సా=ఆ, జనకనన్దినీ=సీత, న=చూడబడలేదు.

తా. రావణుడు జయించి బలాత్కారముగా తీసికొని వచ్చిన నాగకన్యలు, అక్కడ హనుమంతునికి కనబడిరి. కాని సీత మాత్రము కనబడలేదు. 22

మూ. సోఽపశ్యంస్తాం మహాబాహుః పశ్యంశ్చాన్యా వరస్త్రియః,
విషసాద ముహుర్ధీమాన్ హనుమాన్ మారుతాత్మజః. 23

ప్ర. అ. మహాబాహుః=గొప్పబాహువులు గల, ధీమాన్=బుద్ధిమంతుడైన, మారుతాత్మజః= వాయుపుత్రుడైన, సః హనుమాన్=ఆ హనుమంతుడు, తామ్=ఆ సీతను, అపశ్యన్=చూడనివాడై, అన్యాః=ఇతర లైన, వరస్త్రియః=ఉత్తమస్త్రీలను, పశ్యన్=చూచుచు, ముహుః=మాటిమాటికి (చాలా), విషసాద=నిరుత్సాహవంతుడయ్యెను.

తా. మహాబాహువు, ధీమంతుడు, వాయుపుత్రుడు అయిన హనుమంతుడు అక్కడ ఎందరో ఇతర స్త్రీలు కనబడినను, సీత మాత్రము కనబడకపోవుటచే చాల నిరుత్సాహవంతుడయ్యెను. 23

మూ. ఉద్యోగం వానరేన్ద్రాణాం ప్లవనం సాగరస్య చ,
వ్యర్థం వీక్ష్యానిలసుతశ్చిన్తాం పునరుపాగమత్. 24

ప్ర. అ. వానరేన్ద్రాణామ్=వానరశ్రేష్ఠులయొక్క, ఉద్యోగమ్=ప్రయత్నమును, సాగరస్య=సముద్రము యొక్క, ప్లవనం చ=దాటుటను, వ్యర్థమ్=వ్యర్థమైనదానినిగా, వీక్ష్య=చూచి, అనిలసుతః=హనుమంతుడు, పునః=మరల, చిన్తామ్=ఆలోచనను, (దుఃఖమును), ఉపాగమత్=పొందెను.

తా. వానరులు చేసిన ప్రయత్నము, తాను చేసిన సముద్రలంఘనమూ కూడ వ్యర్థమైపోయినవి కదా అని తలచుచు ఆ వాయునందనుడు మరల దుఃఖితుడయ్యెను. 24

మూ. అవతీర్య విమానాచ్చ హనుమాన్ మారుతాత్మజః,
చిన్తాముపజగామాథ శోకోపహతచేతనః. 25

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే సున్దరకాణ్డే
ద్వాదశః సర్గః.

ప్ర. అ. అథ=అటు పిమ్మట, మారుతాత్మజః=వాయుపుత్రుడైన, హనుమాన్=హనుమంతుడు, విమానాత్=విమానమునుండి, అవతీర్య=దిగి, శోకోపహతచేతనః=శోకము చేత కొట్టబడిన మనస్సు కలవాడై, చిన్తామ్=ఆలోచనను, ఉపజగామ=పొందెను.

తా. వాయుపుత్రుడైన హనుమంతుడు ఆ పుష్పకవిమానమునుండి క్రిందికి దిగి, దుఃఖముచే కలత చెందిన మనస్సుతో "ఏమి చేయవలెనా" అను ఆలోచనలో పడెను. 25

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు
సుందరకాండలో పంద్రెండవ సర్గ సమాప్తము.

అథ త్రయోదశః సర్గః

[సీత మరణించి ఉండునని భావించి హనుమంతుడు విచారించుట. సీత కనబడలేదు అని తెలిపినచో అనర్థము వాటిల్లునను ఉద్దేశ్యముతో వెనుకకు వెళ్లగూడదని అతడు నిశ్చయించుకొనుట. మరల వెదకెదమని అనుకొని అశోకవనములో అన్వేషణమును గూర్చి పరిపరి విధముల ఆలోచించుట.]

మూ. విమానాత్తు సుసంక్రమ్య ప్రాకారం హరియూథపః,
హనుమాన్వేగవానాసీద్యథా విద్యుద్ఘనాన్తరే. 1

ప్ర. అ. హరియూథపః=వానర సేనానాయకుడైన, హనుమాన్=హనుమంతుడు, విమానాత్=విమానమునుండి, ప్రాకారమ్=ప్రాకారమును గూర్చి, సుసంక్రమ్య=దాటి, ఘనాన్తరే=మేఘమధ్యము నందలి, విద్యుత్ యథా=మెరపు వలె, వేగవాన్=వేగముగలవాడు, ఆసీత్=ఆయెను.

తా. వానరసేనానాయకుడైన హనుమంతుడు విమానమునుండి ప్రాకారము మీదకు దుమికి, మేఘమధ్యమునందు మెరుపు సంచరించినట్లు మహావేగముగా సంచరించెను. 1

మూ. సంపరిక్రమ్య హనుమాన్రావణస్య నివేశనాత్,
అదృష్ట్వా జానకీం సీతామబ్రవీద్వచనం కపిః. 2

ప్ర. అ. కపిః=వానరుడైన, హనుమాన్=హనుమంతుడు, రావణస్య=రావణుని యొక్క, నివేశనాత్=గృహమునుండి, సంపరిక్రమ్య=దూరముగా వెళ్ళి, జానకీమ్=జనకుని కూతురైన, సీతామ్=సీతను, అదృష్ట్వా=చూడక, వచనమ్=వచనమును, అబ్రవీత్=పలికెను.

తా. హనుమంతుడు రావణుని గృహమునుండి దూరముగా వెళ్ళి, సీత కనబడకపోవుటచే మనస్సులో ఇట్లు అనుకొనెను. 2

మూ. భూయిష్ఠం లోలితా లఙ్కా రామస్య చరతా ప్రియమ్,
న హి పశ్యామి వైదేహీం సీతాం సర్వాఙ్గశోభనామ్. 3

ప్ర. అ. రామస్య=రామునకు, ప్రియమ్=ప్రియమును, చరతా=ఆచరించుచున్న నా చేత, లఙ్కా=లంక, భూయిష్ఠమ్=చాలవరకు, లోలితా=కలచివేయబడినది.

సర్వాఙ్గశోభనామ్=సకలావయవములందు అందమైన, వైదేహీమ్=విదేహరాజపుత్రి యైన, సీతామ్=సీతను, న హి పశ్యామి=చూడకున్నాను కదా !

తా. రామునకు ప్రియము చేయుటకై నేను సంచరించుచు, లంకాప ట్టణమునంతను పూర్తిగా కలచివేసితిని. సర్వాంగసుందరియైన సీత మాత్రము కనబడలేదు. 3

మూ. పల్వలాని తటాకాని సరాంసి సరితస్తథా,
నద్యోఽనూపవనాన్తాశ్చ దుర్గాశ్చ ధరణీధరాః, 4
లోళితా వసుధా సర్వా న తు పశ్యామి జానకీమ్.

ప్ర. అ. పల్వలాని=నీళ్లు ఉన్న చిన్న పల్లములు, తటాకాని=చెరువులు, సరాంసి=పెద్ద సరస్సులు, తథా=మరియు, సరితః=చిన్న ప్రవాహములు, నద్యః=నదులు, అనూపవనాన్తాశ్చ=జలముతో నిండిన వనప్రాంతములు, దుర్గాః=వెళ్లుటకు కష్టమైన, ధరణీధరాః=పర్వతములు, సర్వా=సమస్తమైన, వసుధా=భూమి, లోళితా=కలచివేయబడినది. జానకీం తు=జానకినైతే, న పశ్యామి=చూడను.

తా. నీళ్ళతో నిండిన చిన్న పల్లములు, చెరువులు, పెద్దచెరువులు, చిన్ననదులు, పెద్దనదులు, జలప్రాయభూప్రాంతములు, ప్రవేశింపశక్యముకాని పర్వతములు మొత్తము ఇక్కడి భూమి అంతా కలచివేసినాను కాని సీత కనబడలేదు. 4

మూ. ఇహ సంపాతినా సీతా రావణస్య నివేశనే, 5
ఆఖ్యాతా గృధ్రరాజేన న చ పశ్యామి తామహమ్.

ప్ర. అ. సీతా=సీత, ఇహ=ఇక్కడ, రావణస్య=రావణునియొక్క, నివేశనే=గృహమునందు, (ఉన్నదిగా), గృధ్రరాజేన=గృధ్రరాజైన, సంపాతినా=సంపాతిచేత, ఆఖ్యాతా=చెప్పబడినది. అహమ్=నేను, తామ్=ఆమెను, న చ పశ్యామి=చూడజాలకున్నాను.

తా. సీత ఇక్కడనే రావణుని గృహములో ఉన్నదని గృధ్రరాజైన సంపాతి చెప్పినాడు. కాని ఆమె నాకు కనబడుటలేదు. 5

మూ. కిం ను సీతాథ వైదేహీ మైథిలీ జనకాత్మజా, 6
ఉపతిష్ఠేత వివశా రావణం దుష్టచారిణమ్.

ప్ర. అ. అథ=లేక, వైదేహీ=విదేహదేశమునకు చెందినదీ, మైథిలీ=మిథిలా నగరముకు సంబంధించినదీ, జనకాత్మజా=జనకుని కూతురూ అయిన, సీతా=సీత,

వివశా=వివశురాలై, దుష్టచారిణమ్=దుష్టప్రవృత్తి గల, రావణమ్=రావణుని, కిం ను ఉపతిష్ఠేత=చేరి ఉండునా !

తా. విదేహదేశమునకు చెందినదీ, మిథిలలో పెరిగినదీ, జనకుని కూతురూ అయిన సీత చేయునది లేక, దుష్టప్రవృత్తి గల రావణుని చేరి యుండునా ! 6

మూ. క్షిప్రముత్పతతో మన్యే సీతామాదాయ రక్షసః, 7
బిభ్యతో రామబాణానామన్తరా పతితా భవేత్.

ప్ర. అ. రామబాణానామ్=రామబాణములకు, బిభ్యతః=భయపడుచున్న, రక్షసః=రావణుడు, సీతామ్=సీతను, ఆదాయ=గ్రహించి, క్షిప్రమ్=శీఘ్రముగా, ఉత్పతతః=ఎగురుచుండగా, అన్తరా=మధ్యయందు, పతితా=పడిపోయినది, భవేత్=అయి ఉండును అని, మన్యే=తలచుచున్నాను.

తా. రాముడు ఎక్కడ వచ్చునో అని రామబాణాలకు భయపడుచు రావణుడు సీతను గ్రహించి అతి శీఘ్రముగా ఎగిరిపోవుచున్నప్పుడు, ఆమె మధ్యలో క్రింద పడిపోయి ఉండునేమో ! 7

మూ. అథవా హ్రియమాణాయాః పథి సిద్ధనిషేవితే, 8
మన్యే పతితమార్యాయా హృదయం ప్రేక్ష్య సాగరమ్.

ప్ర. అ. అథవా=లేదా, సిద్ధనిషేవితే=సిద్ధులచేత సేవింపబడిన, పథి=మార్గమునందు, హ్రియమాణాయాః=హరింపబడుచున్న, ఆర్యాయాః=ఆర్యురాలియొక్క, హృదయమ్=హృదయమును, సాగరమ్=సముద్రమును, ప్రేక్ష్య=చూచి, పతితమ్=పడిపోయినదానినిగా, మన్యే=తలచుచున్నాను.

తా. లేదా, సిద్ధులు సంచరించు ఆకాశమార్గమునందు అపహరింపబడుచున్నప్పుడు క్రిందనున్న మహాసముద్రమును చూడగానే పూజ్యురాలైన సీత గుండె జారిపోయి ఉండును. 8

మూ. రావణస్యోరువేగేన భుజాభ్యాం పీడితేన చ, 9
తయా మన్యే విశాలాక్ష్యా త్యక్తం జీవితమార్యయా.

ప్ర. అ. రావణస్య=రావణుని యొక్క, ఉరువేగేన=గొప్పవేగము చేతను, భుజాభ్యామ్=భుజములచేత, పీడితేన చ=పీడించుటచేతను, విశాలాక్ష్యా=విశాలములైన నేత్రములు గల, తయా=ఆ, ఆర్యయా=పూజ్యురాలిచేత, జీవితమ్=జీవితము, త్యక్తమ్=విడువబడినదని, మన్యే=తలచెదను.

తా. ఎక్కడ జారిపోవునో అని రావణుడు భుజములతో గట్టిగా అదిమి పట్టి మహావేగముగా తీసికొని పోవుచున్నపుడు, విశాలాక్షియైన ఆ పూజ్యురాలు ప్రాణములు విడచియుండు నని తలచెదను.

వి. "రావణస్య+ఊరువేగేన" అని పదచ్ఛేదము చేసి "రావణుని తొడల వేగముచేత" అను ప్రాచీనవ్యాఖ్యాతల అర్థము కంటె "రావణస్య+ఉరువేగేన" అను పదచ్ఛేదము చేసి పై అర్థము చెప్పట యుక్తము. "ఊరువేగేన" అనునది అశ్లీలార్థద్యోతకముగా ఉన్నది. 9

మూ. ఉపర్యుపరి వా నూనం సాగరం క్రమతస్తదా, 10
వివేష్టమానా పతితా సాగరే జనకాత్మజా.

ప్ర. అ. తదా=అప్పుడు, (రావణుడు), సాగరమ్ ఉపర్యుపరి=సముద్రమునకు పై పైన, క్రమతః=నడచుచుండగా (ఎగురుచుండగా), జనకాత్మజా=సీత, వివేష్టమానా=దొరలుచున్నదై, సాగరే=సముద్రమునందు, నూనమ్=తప్పక, పతితా=పడిపోయినది.

తా. రావణుడప్పుడు సముద్రమునకు పై పైన ఎగురుచు వెళ్లుచున్నప్పుడు ఆతని చేతులలో ఇటు అటు పెనగులాడుచున్న సీత, సముద్రములో పడిపోయి ఉండును. 10

మూ. అహో క్షుద్రేణ వానేన రక్షన్తీ శీలమాత్మనః, 11
అబన్ధుర్భక్షితా సీతా రావణేన తపస్వినీ.

ప్ర. అ. అహో=లేదా, ఆత్మనః=తనయొక్క, శీలమ్=శీలమును, రక్షన్తీ=రక్షించుకొనుచున్నదీ, అబన్ధుః=బంధువులు లేనిదీ, తపస్వినీ=దీనురాలూ అయిన, సీతా=సీత, క్షుద్రేణ=నీచుడైన, అనేన=ఈ, రావణేన=రావణుని చేత, భక్షితా=భక్షింపబడినదా !

తా. లేదా, బంధువులెవ్వరూ దగ్గర లేక దీనురాలైన సీత తన శీలమును సంరక్షించుకొనుచు రావణునికి లొంగక పోవుటచే ఆ నీచుడామెను భక్షించె నేమో ! 11

మూ. అథవా రాక్షసేన్ద్రస్య పత్నీభిరసితేక్షణా, 12
అదుష్టా దుష్టభావాభిర్భక్షితా సా భవిష్యతి.

ప్ర. అ. అథవా=లేదా, అదుష్టా=దుష్టురాలు కానిదీ, అసితేక్షణా=నల్లని నేత్రములు కలదీ అయిన, సా=ఆమె, దుష్టభావాభిః=దుష్టము లైన ఆలోచనలు

గల, రాక్షసేన్ద్రస్య=రావణునియొక్క, పత్నీభిః=భార్యలచేత, భక్షితా=భక్షింపబడినది, భవిష్యతి=కాగలదు.

తా. నల్లని నేత్రములు గలదీ, సద్బుద్ధిమంతురాలూ అయిన ఆ సీతను, ఆమె సౌందర్యమునకు అసూయచెందిన రావణభార్యలు దుష్టభావముతో భక్షించినారేమో ! 12

మూ. సంపూర్ణచన్ద్రప్రతిమం పద్మపత్రనిభేక్షణమ్, 13
రామస్య ధ్యాయతీ వక్త్రం పఞ్చత్వం కృపణా గతా.

ప్ర. అ. కృపణా=దీనురాలైన సీత, సంపూర్ణచన్ద్రప్రతిమమ్=పూర్ణచంద్రునితో సమానమైన, పద్మపత్రనిభేక్షణమ్=పద్మపత్రములతో సమాన మైన నేత్రములు గల, రామస్య=రామునియొక్క, వక్త్రమ్=ముఖమును, ధ్యాయతీ=ధ్యానించుచున్నదై, పఞ్చత్వమ్=మరణమును, గతా=పొందియుండును.

తా. దీనురాలైన ఆ సీత, పూర్ణచంద్రునితో సమానమూ, పద్మపత్రముల వంటి నేత్రములు కలదీ అయిన రాముని ముఖమునే ధ్యానించుచు, విరహబాధచే మరణించినదేమో ! 13

మూ. హా రామ లక్ష్మణేత్యేవం హాఽయోధ్యే చేతి మైథిలీ, 14
విలప్య బహు వైదేహీ న్యస్తదేహా భవిష్యతి.

ప్ర. అ. వైదేహీ=విదేహదేశమునకు సంబంధించిన, మైథిలీ=సీత, హా రామ=అయ్యో ! రామా !, హా ! లక్ష్మణ=అయ్యో ! లక్ష్మణా !, హా ! అయోధ్యే=అయ్యో ! అయోధ్యా, ఇతి=అని, బహు=అధికముగా, విలప్య=విలపించి, న్యస్తదేహా=విడువబడిన దేహము గలది, భవిష్యతి=కాగలదు.

తా. విదేహదేశమునందు పుట్టిన జనకరాజకుమారి, అయ్యో ! రామా ! అయ్యో ! లక్ష్మణా ! అయ్యో ! అయోధ్యానగరమా ! అని ఎంతగానో విలపించి దేహము విడచి ఉండును. 14

మూ. అథవా నిహితా మన్యే రావణస్య నివేశనే, 15
నూనం లాలప్యతే సీతా పఞ్జరస్థేవ శారికా.

ప్ర. అ. అథవా=లేదా, రావణస్య=రావణునియొక్క, నివేశనే=గృహమునందు, నిహితా=ఉంచబడినదై, సీతా=సీత, పఞ్జరస్థా=పంజరమునందున్న, శారికా ఇవ=గోరింక వలె, నూనమ్=నిశ్చయముగా, లాలప్యతే=విలపించుచున్నది అని, మన్యే=తలచెదను.

తా. లేదా, రావణుని గృహములో బద్ధురాలై, సీత పంజరములో బంధించిన గోరింక వలె, విలపించుచుండును. 15

మూ. జనకస్య సుతా సీతా రామపత్నీ సుమధ్యమా, 16
కథముత్పలపత్రాక్షీ రావణస్య వశం వ్రజేత్.

ప్ర. అ. జనకస్య=జనకునియొక్క, సుతా=కుమార్తె, రామపత్నీ=రాముని భార్య, సుమధ్యమా=మంచి నడుము గలదీ, ఉత్పలపత్రాక్షీ=నల్లకలువ రేకుల వంటి నేత్రములు కలదీ అయిన, సీతా=సీత, రావణస్య=రావణునియొక్క, వశమ్=వశమును, కథమ్=ఎట్లు, వ్రజేత్=పొందును.

తా. జనకమహారాజు కూతురూ, రాముని భార్యా, సుందరమైన నడుము గలదీ, నల్ల కలువరేకుల వంటి నేత్రములు కలదీ అయిన సీత రావణునకు ఎట్లు లొంగిపోవును ? 16

మూ. వినష్టా వా ప్రణష్టా వా మృతా వా జనకాత్మజా, 17
రామస్య ప్రియభార్యస్య న నివేదయితుం క్షమమ్.

ప్ర. అ. జనకాత్మజా=జనకుని కుమార్తె యైన సీత, వినష్టా వా=తప్పిపోయినను, ప్రణష్టా వా= పూర్తిగా కనబడకపోయినను, మృతా వా=మరణించినను, ప్రియభార్యస్య=ప్రియమైన భార్యగల, రామస్య=రామునకు, నివేదయితుమ్=తెలుపుటకు, న క్షమమ్=యుక్తము కాదు.

తా. సీత తప్పిపోయినా, పూర్తిగా కనబడకుండా పోయినా, మరణించినా, ఏమైనా, భార్యపై అత్యధిక ప్రేమగల రామునకు చెప్పుట మాత్రము యుక్తము కాదు. 17

మూ. నివేద్యమానే దోషః స్యాద్దోషః స్యాదనివేదనే, 18
కథం ను ఖలు కర్తవ్యం విషమం ప్రతిభాతి మే.

ప్ర. అ. నివేద్యమానే=తెలుపబడగా, దోషః=దోషము, స్యాత్=అగును, అనివేదనే=తెలుపకున్నను, దోషః=దోషము, స్యాత్=అగును, కథమ్=ఎట్లు, కర్తవ్యం ను ఖలు=చేయవలెనో ? మే=నాకు, విషమమ్=విషయముగా, ప్రతిభాతి=తోచుచున్నది.

తా. రామునకు చెప్పినా దోషమే, చెప్పకపోయినా దోషమే. ఇప్పుడు నేను ఏమి చేయవలెను ? ఈ పరిస్థితి అంతా విషమముగా కనబడుచున్నది.18

మూ. అస్మిన్నేవంగతే కార్యే ప్రాప్తకాలం క్షమం చ కిమ్, 19
భవేదితి మతం భూయో హనుమాన్ప్రవిచారయత్.

ప్ర. అ. అస్మిన్=ఈ, కార్యే=కార్యము, ఏవంగతే=ఈ విధముగా జరిగిన దగుచుండగా, ప్రాప్తకాలమ్=కాలానుగుణ మైనదీ, క్షమమ్=యుక్తమైనదీ, కిమ్=ఏమి, భవేత్=అగును ? ఇతి=ఇట్లు, మతమ్=పక్షమును,హనుమాన్=హనుమంతుడు, భూయః=మరల, ప్రవిచారయత్=ఆలోచించెను.

తా. తలపెట్టిన పని ఈ విధముగా అయినది కదా ; ఇప్పుడేమి చేసిన కాలానుగుణముగాను, యుక్తముగాను ఉండును అని హనుమంతుడు చాల సేపు ఆలోచించెను. 19

మూ. యది సీతామదృష్ట్వాహం వానరేన్ద్రపురీమితః, 20
గమిష్యామి తతః కో వా పురుషార్థో భవిష్యతి.

ప్ర. అ. అహమ్=నేను, సీతామ్=సీతను, అదృష్ట్వా=చూడకుండగనే, ఇతః=ఇక్కడినుండి, వానరేన్ద్రపురీమ్=సుగ్రీవుని పట్టణమును గూర్చి, గమిష్యామి యది=వెళ్ళినట్లయితే, తతః=దానివలన, కః=ఏమి, పురుషార్థః=పురుషార్థము, భవిష్యతి=కాగలదు.

తా. నేను సీతను చూడకుండగనే ఇక్కడినుండి కిష్కింధకు తిరిగి వెళ్ళినచో ఏమి సాధించినట్లు ? 20

మూ. మమేదం లఙ్ఘనం వ్యర్థం సాగరస్య భవిష్యతి, 21
ప్రవేశశ్చైవ లఙ్కాయాః రాక్షసానాం చ దర్శనమ్.

ప్ర. అ. మమ=నాయొక్క, ఇదమ్=ఈ, సాగరస్య=సాగరముయొక్క, లఙ్ఘనమ్=దాటుట, లఙ్కాయాః=లంకయొక్క, ప్రవేశశ్చ=ప్రవేశము, రాక్షసానామ్= రాక్షసులయొక్క, దర్శనమ్=దర్శనము, వ్యర్థమ్=వ్యర్థము, భవిష్యతి=కాగలదు.

తా. నేను సముద్రమును లంఘించుట, లంకలో ప్రవేశించుట, రాక్షసులను చూచుట ఇవన్నీ వ్యర్థమైపోవును గదా ! 21

మూ. కిం మాం వక్ష్యతి సుగ్రీవో హరయో వా సమాగతాః, 22
కిష్కిన్ధాం సమనుప్రాప్తం తౌ వా దశరథాత్మజౌ.

ప్ర. అ. కిష్కిన్ధామ్=కిష్కింధను, సమనుప్రాప్తమ్=చేరిన, మామ్=నన్ను, సుగ్రీవః=సుగ్రీవుడు, కిమ్=ఏమి, వక్ష్యతి=చెప్పగలడో ! సమాగతాః=చేరిన, హరయః వా=వానరులు గాని, తౌ=ఆ, దశరథాత్మజౌ వా=దశరథకుమారులు గాని, ఏమి అందురో !

తా. కిష్కింధకు తిరిగి వెళ్ళిన నన్ను చూచి, సుగ్రీవుడు, అక్కడ కలసి ఉన్న వానరు లందరూ, ఆ రామలక్ష్మణులూ ఏమందురో ! 22

మూ. గత్వా తు యది కాకుత్థ్సం వక్ష్యామి పరమప్రియమ్, 23
న దృష్టేతి మయా సీతా తతస్త్యక్ష్యతి జీవితమ్.

ప్ర. అ. గత్వా=వెళ్ళి, కాకుత్థ్సమ్=రాముని గూర్చి, మయా=నాచేత, సీతా=సీత, న దృష్టా=చూడబడలేదు, ఇతి=అని, పరమ్=మిక్కిలి, అప్రియమ్=అప్రియమైన వాక్యమును, వక్ష్యామి యది=(నేను) చెప్పిన ట్లయితే, తతః=అటు పిమ్మట, జీవితమ్=జీవితమును, త్యక్ష్యతి=విడువగలడు.

తా. నేను రాముని దగ్గరకు వెళ్ళి "సీత కనబడలేదు" అని, చాల అప్రియమైన మాట చెప్పినచో అది వినగానే అతడు ప్రాణములు విడచును.23

మూ. పరుషం దారుణం క్రూరం తీక్ష్ణమిన్ద్రియతాపనమ్, 24
సీతానిమిత్తం దుర్వాక్యం శ్రుత్వా స న భవిష్యతి.

ప్ర. అ. పరుషమ్=పరుషమూ, దారుణమ్=భయంకరమూ, క్రూరమ్=క్రూరమూ, తీక్ష్ణమ్=తీక్ష్ణమూ, ఇన్ద్రియతాపనం=ఇంద్రియములను తపింపచేయునదీ అయిన, సీతానిమిత్తమ్=సీతకు సంబంధించిన, దుర్వాక్యమ్=దుర్వాక్యమును, శ్రుత్వా=విని, సః=అతడు, న భవిష్యతి=ఉండడు.

తా. "సీత కనబడలేదు" అను దుర్వాక్యము రామునకు చాల పరుషమైనది. భయంకరము; క్రూరము; తీక్ష్ణమైనది; ఇంద్రియములను తపింపచేయునది. అట్టి వాక్యమును వినగానే ఆతడింక జీవించడు. 24

మూ. తం తు కృచ్ఛ్రగతం దృష్ట్వా పఞ్చత్వగతమానసమ్, 25
భృశానురక్తో మేధావీ న భవిష్యతి లక్ష్మణః.

ప్ర. అ. కృచ్ఛ్రగతమ్=కష్టము పొందినవాడూ, పఞ్చత్వగతమానసమ్=మరణము పొందిన మనస్సు కలవాడూ అయిన, తమ్=ఆ రాముని, దృష్ట్వా=చూచి, భృశానురక్తః=మిక్కిలి అనురాగముగలవాడూ, మేధావీ=మేధావంతుడూ అయిన, లక్ష్మణః=లక్ష్మణుడు, న భవిష్యతి=ఉండడు.

తా. కష్టాలలో చిక్కుకొన్న రాముడు మరణోన్ముఖుడై ఉండుట చూడగానే, ఆతనియందు చాలా ప్రేమ గలవాడు, మేధావి అయిన లక్ష్మణుడు కూడ జీవించడు. 25

మూ. వినష్టౌ భ్రాతరౌ శ్రుత్వా భరతోఽపి మరిష్యతి, 26
భరతం చ మృతం దృష్ట్వా శత్రుఘ్నో న భవిష్యతి.

ప్ర. అ. భ్రాతరౌ=సోదరులను, వినష్టౌ=మరణించినవారినిగా, శ్రుత్వా=విని, భరతోఽపి=భరతుడు కూడ, మరిష్యతి=మరణించగలడు, మృతమ్=మరణించిన, భరతమ్=భరతుని, దృష్ట్వా=చూచి, శత్రుఘ్నశ్చ=శత్రుఘ్నుడుకూడ, న భవిష్యతి= ఉండడు.

తా. రామలక్ష్మణుల మరణవార్త వినగానే భరతుడు మరణించును. భరతుడు మరణించుట చూచి శత్రుఘ్నుడు కూడ మరణించును. 26

మూ. పుత్రాన్మృతాన్సమీక్ష్యాథ న భవిష్యన్తి మాతరః, 27
కౌసల్యా చ సుమిత్రా చ కైకేయీ చ న సంశయః.

ప్ర. అ. అథ=అటుపిమ్మట, మాతరః=తల్లులైన, కౌసల్యా చ=కౌసల్య, సుమిత్రా చ=సుమిత్ర, కైకేయీ చ=కైకేయి, పుత్రాన్=పుత్రులను, మృతాన్=మరణించినవారినిగా, సమీక్ష్య=చూచి, న భవిష్యన్తి=ఉండరు, సంశయః=సంశయము, న=లేదు.

తా. పుత్రులందరు మరణించుట చూచి తల్లులైన కౌసల్యా-సుమిత్రా-కైకేయిలు కూడ ప్రాణములు విడచెదరు. 27

మూ. కృతజ్ఞః సత్యసన్ధశ్చ సుగ్రీవః ప్లవగాధిపః, 28
రామం తథా గతం దృష్ట్వా తతస్త్యక్ష్యతి జీవితమ్.

ప్ర. అ. కృతజ్ఞః=కృతజ్ఞుడు, సత్యసన్ధః=సత్యమైన ప్రతిజ్ఞకలవాడూ, ప్లవగాధిపః=వానరరాజు అయిన, సుగ్రీవః=సుగ్రీవుడు, తథా=ఆ విధముగా, గతమ్=మరణించిన, రామమ్=రాముని, దృష్ట్వా=చూచి, తతః=పిమ్మట, జీవితమ్=జీవితమును, త్యక్ష్యతి=విడువగలడు.

తా. కృతజ్ఞుడూ, సత్యసంధుడూ అయిన వానరరాజు సుగ్రీవుడు, ఆ విధముగా రాముడు మరణించుట చూచి, తాను కూడ ప్రాణాలు విడచును.28

మూ. దుర్మనా వ్యథితా దీనా నిరానన్దా తపస్వినీ, 29
పీడితా భర్తృశోకేన రుమా త్యక్ష్యతి జీవితమ్.

ప్ర. అ. భర్తృశోకేన=భర్తృశోకముచేత, పీడితా=పీడింపబడినదీ, దుర్మనాః=దుఃఖముతో కూడిన మనస్సు గలదీ, వ్యథితా=వ్యథ పొందినదీ, దీనా=దీనురాలూ, నిరానన్దా=ఆనందము లేనిదీ, తపస్వినీ=జాలిపడదగినదీ అయిన, రుమా=రుమ, జీవితమ్=జీవితమును, త్యక్ష్యతి=విడువగలదు.

తా. భర్త యైన సుగ్రీవుడు మరణించగానే రుమ, దుఃఖపీడితురాలై కలత చెందిన మనస్సుతో, వ్యథ చెంది, దీనురాలై, ఆనందము లేక, జాలిపడవలసిన స్థితిలో ప్రాణములు విడచును. 29

మూ. వాలిజేన తు దుఃఖేన పీడితా శోకకర్శితా, 30
పఞ్చత్వం చ గతే రాజ్ఞి తారాపి న భవిష్యతి.

ప్ర. అ. వాలిజేన=వాలివలన కలిగిన, దుఃఖేన=దుఃఖముచేత, పీడితా=పీడింపబడినదీ, శోకకర్శితా=శోకముచేత కృశింపచేయబడినదీ అయిన, తారాపి=తారకూడ, రాజ్ఞి=రాజైన సుగ్రీవుడు, పఞ్చత్వమ్=మరణమును, గతే=పొందినవాడగుచుండగా, న భవిష్యతి=ఉండదు.

తా. ముందుగానే వాలి మరణమువలన కలిగిన దుఃఖము పీడించుచుండగా శోకముచేత కృశింపచేయబడిన తార, సుగ్రీవుడు కూడ మరణించినచో, తాను కూడ మరణించును. 30

మూ. మాతాపిత్రోర్వినాశేన సుగ్రీవవ్యసనేన చ, 31
కుమారోఽప్యఙ్గదః కస్మాద్ధారయిష్యతి జీవితమ్.

ప్ర. అ. కుమారః=చిన్నవాడైన, అఙ్గదోఽపి=అంగదుడు కూడ, మాతాపిత్రోః=తలిదండ్రులయొక్క, వినాశేన=మరణముచేతను, సుగ్రీవస్య=సుగ్రీవుని యొక్క, వ్యసనేన=దుఃఖముచేతను, జీవితమ్=జీవితమును, కస్మాత్=ఎందువలన, ధారయిష్యతి=ధరించును.

తా. తలిదండ్రులు మరణించి, సుగ్రీవునకు కూడ అంత ఆపద వచ్చిన పిదప కుమారుడైన అంగదుడు మాత్రము ఎట్లు జీవించును ? 31

మూ. భర్తృజేన తు దుఃఖేన హ్యభిభూతా వనౌకసః, 32
శిరాంస్యభిహనిష్యన్తి తలైర్ముష్టిభిరేవ చ.

ప్ర. అ. వనౌకసః=వానరులు, భర్తృజేన=ప్రభువువలన కలిగిన, దుఃఖేన=దుఃఖముచేత, అభిభూతాః=తిరస్కరించబడినవారై, తలైః=అర చేతులతోను, ముష్టిభిరేవ చ=పిడికిళ్ళతోను, శిరాంసి=శిరస్సులను, అభిహనిష్యన్తి=కొట్టుకొనెదరు.

తా. వానరు లందరు తమ ప్రభువునకు కలిగిన దుఃఖమును భరింపజాలక, అరచేతులతోను, పిడికిళ్ళతోను తమ తలలు బాదుకొనెదరు. 32

మూ. సాన్త్వేనానుప్రదానేన మానేన చ యశస్వినా, 33
లాలితాః కపిరాజేన ప్రాణాంస్త్యక్ష్యన్తి వానరాః.

ప్ర. అ. యశస్వినా=కీర్తి గల, కపిరాజేన=సుగ్రీవునిచేత, సాన్త్వేన=మంచి మాటలచేతను, అనుప్రదానేన=చిన్న చిన్న పారితోషికములు ఇచ్చుట చేతను, మానేన=గౌరవించుటచేతను, లాలితాః=లాలింపబడిన, వానరాః=వానరులు, ప్రాణాన్=ప్రాణములను, త్యక్ష్యన్తి=విడువగలరు.

తా. మంచి మాటలు చెప్పుచు, పారితోషికములు ఇచ్చుచు గౌరవించుచు సుగ్రీవునిచే లాలన చేయుబడిన వానరులు, ఆతడు మరణించగానే ప్రాణములు విడువగలరు. 33

మూ. న వనేషు న శైలేషు న నిరోధేషు వా పునః, 34
క్రీడామనుభవిష్యన్తి సమేత్య కపికుఞ్జరాః.

ప్ర. అ. కపికుఞ్జరాః=వానరశ్రేష్ఠులు, సమేత్య=కలిసి, వనేషు=వనముల యందు, క్రీడామ్=క్రీడను, న అనుభవిష్యన్తి=అనుభవించరు, శైలేషు=పర్వతము లమీద, న=అనుభవించరు, నిరోధేషు వా పునః=గృహాద్యావరణములందైన, న =అనుభవించరు.

తా. ఇటు పైన వానరులందరు కలిసి, వెనుకటి వలె వనములందు గాని, పర్వతములమీద గాని, గృహాదులందు గాని, క్రీడాసుఖమును అనుభవించరు.

మూ. సపుత్రదారాః సామాత్యా భర్తృవ్యసనపీడితాః, 35
శైలాగ్రేభ్యః పతిష్యన్తి సమేషు విషమేషు చ.

ప్ర. అ. సపుత్రదారాః=భార్యాపుత్రులతో కూడినవారై, సామాత్యాః=స హచరులతో కూడినవారై, భర్తృవ్యసనపీడితాః=ప్రభువుయొక్క దుఃఖము చేత పీడింపబడిన వానరులు, శైలాగ్రేభ్యః=పర్వతశిఖరములనుండి, సమేషు=సమమైన ప్రదేశములందు, విషమేషు చ=మిట్టపల్లము లున్న ప్రదేశములందును, పతిష్యన్తి= పడగలరు.

తా. వానరులందరు ప్రభువుకు కలిగిన దుఃఖముచేత పీడింపబడిన వారై భార్యాపుత్రులతోను, ఇతరసహచరులతోను కలిసి, పర్వతశిఖరములపైనుండి సమప్రదేశములందును, విషమప్రదేశములందును దుమికి మరణించగలరు. 35

మూ. విషముద్బన్ధనం వాపి ప్రవేశం జ్వలనస్య వా, 36
ఉపవాసమథో శస్త్రం ప్రచరిష్యన్తి వానరాః.

ప్ర. అ. వానరాః=వానరులు, విషమ్=విషమునుగాని, ఉద్బన్ధనం వాపి= ఉరిపోసికొనుటను గాని, జ్వలనస్య=అగ్ని యొక్క, ప్రవేశం వా=ప్రవేశమునుగాని,

ఉపవాసమ్=ఉపవాసమును గాని, అథో=లేక, శస్త్రమ్=ఆయుధమును గాని, ప్రచరిష్యన్తి=చేయుగలరు.

తా. వానరులు విషము తిని గాని, ఉరి పోసికొని గాని, అగ్నిలో ప్రవేశించి గాని, ఉపవాసము చేసి గాని, ఆయుధములతో పొడుచుకొని గాని ప్రాణములు విడువగలరు. 36

మూ. ఘోరమారోదనం మన్యే గతే మయి భవిష్యతి, 37
ఇక్ష్వాకుకులనాశశ్చ నాశశ్చైవ వనౌకసామ్.

ప్ర. అ. మయి=నేను, గతే=వెళ్ళినవాడనగుచుండగా, ఇక్ష్వకుకులనాశశ్చ= ఇక్ష్వకుకులముయొక్క నాశము, వనౌకసామ్=వానరులయొక్క, నాశశ్చైవ=నాశము, ఘోరమ్=భయంకర మైన, ఆరోదనమ్=ఏడ్పు, భవిష్యతి=కాగలదు అని, మన్యే=తలచెదను.

తా. నేను తిరిగి వెళ్ళినచో ఇక్ష్వాకుకులము నశించును. వానరు లందరు నశించెదరు. ఈ విధముగా భయంకరమైన ఏడ్పు సంభవించును. 37

మూ. సోఽహం నైవ గమిష్యామి కిష్కిన్ధాం నగరీమితః, 38
న చ శక్ష్యామ్యహం ద్రష్టుం సుగ్రీవం మైథిలీం వినా.

ప్ర. అ. అహమ్=అట్టి నేను, ఇతః=ఇక్కడినుండి, కిష్కిన్ధాం నగ రీమ్=కిష్కింధానగరమును గూర్చి, నైవ గమిష్యామి=వెళ్ళను, అహమ్=నేను, మైథిలీం వినా=సీత లేకుండగా, సుగ్రీవమ్=సుగ్రీవుని, ద్రష్టుమ్=చూచుటకు, న చ శక్ష్యామి=సమర్థుడను కాజాలను కూడ.

తా. నే నిక్కడనుండి కిష్కింధకు వెళ్ళనే వెళ్ళను. సీత వార్త తెలియకుండగ నేను సుగ్రీవుని చూచుట కూడ శక్యము కాదు. 38

మూ. మయ్యగచ్ఛతి చేహస్థే ధర్మాత్మానౌ మహారథౌ, 39
ఆశయా తౌ ధరిష్యేతే వానరాశ్చ మనస్వినః.

ప్ర. అ. మయి=నేను, అగచ్ఛతి=వెళ్లకుండగా, ఇహస్థే=ఇక్కడనే ఉన్నవాడ నగుచుండగా, ధర్మాత్మానౌ=ధర్మాత్ములూ, మహారథౌ=మహారథులూ అయిన, తౌ=ఆ రామలక్ష్మణులు, ఆశయా=ఆశచేత, ధరిష్యేతే=జీవించి ఉండగలరు. మనస్వినః=మానవంతులైన, వానరాశ్చ=వానరులు కూడ (జీవించి ఉందురు).

తా. నేను వెళ్ళకుండా ఇక్కడనే ఉండిపోయినచో, ధర్మాత్ములూ మహారథులూ అయిన ఆ రామలక్ష్మణులూ, మానవంతులైన వానరులూ, 'హనుమంతుడు వచ్చును శుభవార్త తెచ్చును' అను ఆశతో జీవించి ఉందురు.

మూ. హస్తాదానో ముఖాదానో నియతో వృక్షమూలికః, 40
వానప్రస్థో భవిష్యామి హ్యదృష్ట్వా జనకాత్మజామ్,
సాగరానూపజే దేశే బహుమూలఫలోదకే. 41

ప్ర. అ. జనకాత్మజామ్=సీతను, అదృష్ట్వా=చూడక, హస్తాదానః=చేతిలో పడినదానిని గ్రహించుచు, ముఖాదానః=ముఖమునకు అందినదానిని తినుచు, నియతః=నియమవంతుడనై, బహుమూలఫలోదకే=అనేక మైన దుంపలు, ఫలములు, ఉదకము గల, సాగరానూపజే=సముద్రజల సమీపమునందలి, దేశే=ప్రదేశమునందు, వృక్షమూలికః=వృక్షమూలములను ఆశ్రయించిన వాడనై, వానప్రస్థః=వానప్రస్థుడను, భవిష్యామి=అగుదును.

తా. సీత కనబడకున్నచో నేను నియమము పాటించుచు, వృక్షమూలము నందు నివసించుచు చేతిలో పడినదానిని గ్రహించుచు, నోటికి అందిన దానిని తినుచు దుంపలూ, ఫలములు, ఉదకము సమృద్ధిగా ఉన్న సముద్ర జలప్రాయ ప్రదేశమునందు వానప్రస్థజీవనము గడపెదను. 40, 41

మూ. చితాం కృత్వా ప్రవేక్ష్యామి సమిద్ధమరణీసుతమ్,
ఉపవిష్టస్య వా సమ్యగ్లిఙ్గినం సాధయిష్యతః, 42
శరీరం భక్షయిష్యన్తి వాయసాః శ్వాపదాని చ.

ప్ర. అ. చితామ్=చితిని, కృత్వా=చేసుకొని, సమిద్ధమ్=ప్రజ్వలించుచున్న, అరణీసుతమ్=అగ్నిని, ప్రవేక్ష్యామి=ప్రవేశించెదను. వా=లేక, ఉపవిష్టస్య=కూర్చుని ఉన్నవాడనై, లిఙ్గినమ్=అనశనవ్రతమును, సాధయిష్యతః=సాధింపనున్న నా యొక్క, శరీరమ్=శరీరమును, వాయసాః=కాకులు, శ్వాపదాని చ=క్రూరజంతువులూ, భక్షయిష్యన్తి=భక్షింపగలవు.

తా. లేదా చితిని ఏర్పరచుకొని ప్రజ్వలించుచున్న అగ్నిలో ప్రవేశించెదను. లేదా అనశనవ్రతమును అవలంబించి కూర్చున్న నా శరీరమును కాకులు, క్రూరజంతువులు తినివేయగలవు.

వి. 'లిఙ్గినమ్' అనగా లింగము (దేహము) గల ఆత్మ, దానిని 'సాధయిష్యతః' సాధింపనున్న అనగా ఆత్మను దేహమునుండి విడదీయనున్న అని కొందరు వ్యాఖ్యాతలు అర్థము చెప్పిరి. లింగ మనగా సంన్యాసము. అనగా

త్రినకుండుట. దానిని సాధింపనున్న అని గోవిందరాజులు. 'లిఙ్గినీమ్' అని గోవింద రాజుల పాఠము. 'లిఙ్గినమ్'లింగరూపుడైన శివుని, సాధయిష్యతః=ధ్యానింపనున్న అను అర్థము కూడా చెప్పవచ్చును. 42

మూ. ఇదం మహర్షిభిర్దృష్టం నిర్యాణమితి మే మతిః, 43
సమ్యగాపః ప్రవేక్ష్యామి న చేత్పశ్యామి జానకీమ్.

ప్ర. అ. ఇదమ్=ఇది, మహర్షిభిః=మహర్షుల చేత, దృష్టమ్=చూడబడిన, నిర్యాణమ్=శరీరత్యాగమార్గము, ఇతి=అని, మే=నాయొక్క, మతిః=అభిప్రాయము, జానకీమ్=సీతను, న చేత్పశ్యామి=చూడకున్నట్లయితే, సమ్యక్=బాగుగా, ఆపః=ఉదకమును, ప్రవేక్ష్యామి=ప్రవేశిచెదను.

తా. ఇట్టి పరిస్థితులలో మహర్షులు చెప్పిన ప్రాణత్యాగోపాయము ఇదే అని నా అభిప్రాయము. అందుచే జానకి కనబడకపోయినచో తిన్నగా పోయి జలములో దుమికెదను. 43

మూ. సుజాతమూలా సుభగా కీర్తిమాలా యశస్వినీ, 44
ప్రభగ్నా చిరరాత్రాయ మమ సీతామపశ్యతః.

ప్ర. అ. సీతామ్=సీతను, అపశ్యతః=చూడని, మమ=నాయొక్క, చిరరాత్రాయ=చిరకాలము, సుజాతమూలా=దృఢముగా ఏర్పడిన మూలము కలదీ, సుభగా=సుందర మైనదీ, యశస్వినీ=యశస్సుతో కూడినదీ అయిన, కీర్తిమాలా=కీర్తియొక్క మాల (పంక్తి), ప్రభగ్నా=భగ్నమైపోయినది.

తా. యశస్సుతో కూడిన సుందరమైన నశించినదనగా యశస్సూ, కీర్తీ రెండూ నశించిన వని యర్థము. విశిష్టము లైన కార్యములు చేయుటవలన కలిగిన గొప్పతనము యశస్సు. అందరును పొగడుట కీర్తి. 'చిరరాత్రీ' అను పాఠము, ఆ పాఠమును అనుసరించి 'దీర్ఘమైన రాత్రి' అను వ్యాఖ్యానము కూడ యుక్తముగా లేవని తోచుచున్నది. 44

మూ. తాపసో వా భవిష్యామి నియతో వృక్షమూలికః, 45
నేతః ప్రతిగమిష్యామి తామదృష్ట్వాసితేక్షణామ్.

ప్ర. అ. నియతః=నియమవంతుడూ, వృక్షమూలికః=వృక్షమూలమును ఆశ్రయించినవాడూ అయిన, తాపసో వా=మునిగా నైనా, భవిష్యామి=కాగలను, అసితేక్షణామ్=నల్లని నేత్రములు గల, తామ్=ఆ సీతను, అదృష్ట్వా=చూడకుండగా, ఇతః=ఇక్కడినుండి, న ప్రతిగమిష్యామి=తిరిగి వెళ్ళను.

తా. లేదా నియమములు అవలంబించి, వృక్షమూలమునందు కూర్చుండి మునిజీవితమును గడపెదను. నల్లని నేత్రములు గల ఆ సీతను చూడకుండా ఇక్కడి నుంచి వెనుకకు మాత్రము వెళ్ళను. 45

మూ. యదీతః ప్రతిగచ్ఛామి సీతామనధిగమ్య తామ్, 46
అఙ్గదః సహ తైః సర్వైర్వానరైర్న భవిష్యతి.

ప్ర. అ. తామ్=ఆ, సీతామ్=సీతను, అనధిగమ్య=తెలుసుకొనకుండగా, ఇతః=ఇక్కడినుండి, ప్రతిగచ్ఛామి యది=(నేను) తిరిగి వెళ్ళినచో, సర్వైః=సమస్త మైన, తైః=ఆ, వానరైః సహ=వానరులతో కూడ, అఙ్గదః=అంగదుడు, న భవిష్యతి=ఉండడు.

తా. నేను సీత జాడ తెలుసుకొనకుండగా ఇక్కడినుండి తిరిగి వెళ్ళినచో, అంగదుడు, వానరు లందరూ కూడ జీవించరు. 46

మూ. వినాశే బహవో దోషా జీవన్ భద్రాణి పశ్యతి, 47
తస్మాత్ప్రాణాన్ ధరిష్యామి ధ్రువో జీవితసంగమః.

ప్ర. అ. వినాశే=మరణించుటలో, బహవః=అనేక మైన, దోషాః=దోషము లున్నవి, జీవన్=బ్రతికి ఉన్నవాడు, భద్రాణి=మంగళములను, పశ్యతి=చూచును. తస్మాత్=ఆ కారణమువలన, ప్రాణాన్=ప్రాణములను, ధరిష్యామి=ధరించెదను. జీవితసంగమః=జీవించి ఉన్నవారియొక్క కలయిక, ధ్రువః=నిశ్చితము.

తా. మరణించుట అనేకదోషములకు హేతువు. మానవుడు బ్రతికి ఉన్నచో మంగళములను చూడవచ్చును. అందువలన నేను ప్రాణములను విడువను. జీవించి ఉన్నవాళ్ళు ఏ నాటికైన తప్పక కలుసుకొందురు. 47

మూ. ఏవం బహువిధం దుఃఖం మనసా ధారయన్ముహుః, 48
నాధ్యగచ్ఛత్తదా పారం శోకస్య కపికుఞ్జరః.

ప్ర. అ. కపికుఞ్జరః=హనుమంతుడు, ఏవమ్=ఇట్లు, బహువిధమ్=అనేకవి ధము లైన, దుఃఖమ్=దుఃఖమును, ముహుః=మాటిమాటికి, మనసా=మనసుతో, ధారయన్=నిలుపుకొనుచు, తదా=అప్పుడు, శోకస్య=శోకముయొక్క, పారమ్=పా రమును, నాధ్యగచ్ఛత్=పొందలేదు.

తా. హనుమంతుడీ విధముగా కలిగిన, అనేకవిధములైన, దుఃఖమును మనస్సులోనే అణచుకొనుచుండెను. ఆ శోకమునకు అంతము కనబడకుండెను.

మూ. రావణం వా వధిష్యామి దశగ్రీవం మహాబలమ్, 49
కామమస్తు హృతా సీతా ప్రత్యాచీర్ణం భవిష్యతి.

ప్ర. అ. వా=లేదా, దశగ్రీవమ్=పదికంఠములు కలవాడూ, మహాబలమ్=గొప్ప బలము లవాడూ అయిన, రావణమ్=రావణుని, వధిష్యామి=చంపెదను, హృతా=హరింపబడిన, సీతా=సీత, కామమ్ అస్తు=ఏమైన అగుగాక. ప్రత్యాచీర్ణమ్=ప్రతిక్రియ చేయబడినది, భవిష్యతి=కాగలదు.

తా. హరించబడిన సీత విషయ మేమైనను, దశకంఠుడు, మహాబలుడూ అయిన రావణుని చంపివేసెదను. దీనితో అతడు చేసినదానికి ప్రతిక్రియ చేసినట్లు అగును. 49

మూ. అథవైనం సముత్క్షిప్య ఉపర్యుపరి సాగరమ్, 50
రామాయోపహరిష్యామి పశుం పశుపతేరివ.

ప్ర. అ. అథవా=లేదా, ఏనమ్=ఈ రావణుని, సాగరమ్ ఉపర్యుపరి=సముద్రము పై పైన, సముత్క్షిప్య=ఎత్తుకొనివెళ్ళి, పశుపతేః=పశువులస్వామికిది, పశుమివ=పశువును వలె, రామాయ=రామునకు, ఉపహరిష్యామి=చేర్చెదను.

తా. లేదా ఈ రావణుని సముద్రము పై పైన ఎత్తికొని పోయి, పశువుల యజమానికి వాని పశువును అప్పగించినట్లు రామునకు అప్పగించెదను.

వి. 'పశుపతేః=అగ్నికి' అని గోవిందరాజవ్యాఖ్య. 'పశుపతి' శబ్దము శివునియందు యోగరూఢముగాన 'శివునకు' అను అర్థము చెప్పవచ్చును. శివునకు పశుబలిని సమర్పించుట కూడ ప్రసిద్ధమే. "పశునా రుద్రం యజతే" "ఉపహృతపశూ రుద్రః" ఇత్యాద్యుదాహరణములు సిద్ధాంతకౌముద్యాదులలో ప్రసిద్ధములు. వాటికి కూడ శ్రుతులే ఆధారము. 50

మూ. ఇతి చిన్తాం సమాపన్నః సీతామనధిగమ్య తామ్, 51
ధ్యానశోకపరీతాత్మా చిన్తయామాస వానరః.

ప్ర. అ. వానరః=హనుమంతుడు, తామ్=ఆ, సీతామ్=సీతను, అనధిగమ్య=పొందక (చూడక), ఇతి=ఇట్లు, చిన్తామ్=చింతను, సమాపన్నః=పొందినవాడై, ధ్యానశోకపరీతాత్మా=ఆలోచనలతోను, శోకములోను నిండిన మనస్సు కలవాడై, చిన్తయామాస=ఆలోచించెను.

తా. హనుమంతుడు, సీత కనబడకపోవుటచే ఈ విధముగా చింతించుచు అనేకవిధములైన ఆలోచనలు, శోకము మనస్సును బాధించుచుండగా, ఇట్లు అనుకొనెను. 51

మూ. యావత్సీతాం హి పశ్యామి రామపత్నీం యశస్వినీమ్, 52
తావదేతాం పురీం లఙ్కాం విచినోమి పునః పునః.

ప్ర. అ. రామపత్నీమ్=రాముని భార్య, యశస్వినీమ్=కీర్తి గలదీ అయిన, సీతామ్=సీతను, యావత్=ఎంత వరకు, పశ్యామి=చూచెదనో, తావత్=అంతవరకు, ఏతామ్=ఈ, లఙ్కాం పురీమ్=లంకా పట్టణమును, పునః పునః=మాటిమాటికి, విచినోమి=వెదకెదను.

తా. రాముని భార్యా, యశఃశాలినీ అయిన సీత కనబడునంతవరకు నే నీ లంకాపట్టణమును మాటిమాటికిని వెదకెదను. 52

మూ. సంపాతివచనాచ్చాపి రామం యద్యానయామ్యహమ్, 53
అపశ్యన్ రాఘవో భార్యాం నిర్దహేత్సర్వవానరాన్.

ప్ర. అ. సంపాతివచనాత్=సంపాతియొక్క వచనమువలన, అహమ్=నేను, రామమ్=రాముని, ఆనయామి యది=తీసికొనివచ్చిన ట్లయితే, రాఘవః=రాముడు, భార్యామ్=భార్యను, అపశ్యన్=చూడనివాడై, సర్వవానరాన్=సమస్తవానరులను, నిర్దహేత్=కాల్చివేయును.

తా. సంపాతి చెప్పినాడు కదా యని, సీత లంకలో ఉన్నదని తెలిపి నేను రాముని ఇక్కడికి తీసికొనివచ్చినచో, ఇక్కడ అతని భార్య కలబడక పోయిన పక్షాన, ఆ రాముడు వానరులందరినీ కాల్చివేయుగలడు. 53

మూ. ఇహైవ నియతాహారో వత్స్యామి నియతేన్ద్రియః, 54
న మత్కృతే వినశ్యేయుః సర్వే తే నరవానరాః.

ప్ర. అ. నియతాహారః=నియతమైన ఆహారము గలవాడనై, నియతేన్ద్రియః=నిగ్రహించుకొనబడిన ఇంద్రియములు గలవాడనై, ఇహైవ=ఇక్కడనే, వత్స్యామి=నివసించెదను. మత్కృతే=నా నిమిత్తముగా, తే=ఆ, నరవానరాః=నర వానరులు, న వినశ్యేయుః=నశించకుందురు గాక.

తా. ఆహారనియమము పాటించుచు, ఇంద్రియములను నిగ్రహించుకొని ఇక్కడనే నివసించెదను. రామాదినరులు, అంగదసుగ్రీవాదివానరులు నా మూలాన నశించకుందురుగాక. 54

మూ. అశోకవనికా చేయం దృశ్యతే యా మహాద్రుమా, 55
ఇమామధిగమిష్యామి న హీయం విచితా మయా.

ప్ర. అ. మహాద్రుమా=పెద్ద పెద్ద వృక్షములు గల, యా=ఏ, ఇయమ్=ఈ, అశోకవనికా=అశోకవనము, దృశ్యతే=చూడబడుచున్నదో, ఇమామ్=దీనిని, అధిగమిష్యామి=పొందెదను. ఇయమ్=ఇది, మయా=నా చేత, న విచితా హి=వెదకబడలేదు కదా.

తా. పెద్ద పెద్ద వృక్షములతో అశోకవనము ఎదుట కనబడుచున్నది. నేను ఈ వనములో వెదకలేదు. అందుచేత దానిలోనికి వెళ్ళెదను. 55

మూ. వసూన్రుద్రాంస్తథాదిత్యానశ్వినౌ మరుతోఽపి చ, 56
నమస్కృత్వా గమిష్యామి రక్షసాం శోకవర్ధనః.

ప్ర. అ. వసూన్=అష్టవసువులను, రుద్రాన్=ఏకాదశరుద్రులను, తథా=మరియు, ఆదిత్యాన్=ద్వాదశాదిత్యులను, అశ్వినౌ=ఇద్దరు అశ్వినీ దేవతలను, మరుతోఽపి చ=సప్తమరుత్తులను, నమస్కృత్వా=నమస్కరించి, రక్షసామ్=రాక్షసులకు, శోకవర్ధనః=శోకమును వృద్ధిపొందించువాడనై, గమిష్యామి=వెళ్ళెదను.

తా. వసువులకు, రుద్రులకు, ఆదిత్యులకు, అశ్వినీదేవతలకు, మరుత్తులకు నమస్కరించి, రాక్షసుల దుఃఖమును వృద్ధిపొందించుటకై, ఈ వనములో ప్రవేశించెదను. 56

మూ. జిత్వా తు రాక్షసాన్ సర్వానిక్ష్వాకుకులనన్దినీమ్, 57
సంప్రదాస్యామి రామాయ యథా సిద్ధిం తపస్వినే.

ప్ర. అ. సర్వాన్=సమస్త మైన, రాక్షసాన్=రాక్షసులను, జిత్వా తు=జయించి, ఇక్ష్వాకుకులనన్దినీమ్=ఇక్ష్వాకువంశమునకు ఆనందమును కలిగించు సీతను, తపస్వినే=తపస్సు చేసినవానికి, సిద్ధిం యథా=సిద్ధిని వలె, రామాయ=రామునికి, సంప్రదాస్యామి=ఇచ్చెదను.

తా. రాక్షసులనందరినీ జయించి, తపోధనునకు సిద్ధిని అందించి నట్లు, ఇక్ష్వాకుకులానందవర్ధని యైన సీతను రామునివద్దకు చేర్చెదను. 57

మూ. స ముహూర్తమివ ధ్యాత్వా చిన్తావగ్రథితేన్ద్రియః, 58
ఉదతిష్ఠన్మహాతేజా హనుమాన్ మారుతాత్మజః.

ప్ర. అ. మహాతేజాః=గొప్ప తేజస్సు గల, మారుతాత్మజః=వాయుపుత్రుడైన, సః హనుమాన్=ఆ హనుమంతుడు, చిన్తావగ్రథితేన్ద్రియః=విచారముచేత కట్టబడిన ఇంద్రియములు కలవాడై, ముహూర్తమివ=క్షణకాలము, ధ్యాత్వా=ధ్యానించి, ఉదతిష్ఠత్=లేచెను.

తా. మహాతేజఃశాలీ, వాయునందనుడూ అయిన ఆ హనుమంతుడు, చింతచేత దుర్బలములై పోయిన ఇంద్రియములు కలవాడై, క్షణకాలము పాటు ఆలోచించి అశోకవన ప్రవేశోద్యుక్తుడై లేచెను. 58

మూ. నమోఽస్తు రామాయ సలక్ష్మణాయ
దేవ్యై చ తస్యై జనకాత్మజాయై,
నమోఽస్తు రుద్రేన్ద్రయమానిలేభ్యో
నమోఽస్తు చన్ద్రార్కమరుద్గణేభ్యః. 59

ప్ర. అ. సలక్ష్మణాయ=లక్ష్మణునితో కూడిన, రామాయ=రామునకు, నమః=నమస్కారము, అస్తు=అగుగాక. దేవ్యై=దేవి యైన, తస్యై=ఆ, జనకాత్మజాయై చ=సీతకు కూడ, నమస్కారము అగుగాక. రుద్రేన్ద్రయమానిలేభ్యః=రుద్రునకు ఇంద్రునకు, యమునకు వాయుదేవునకు, నమః=నమస్కారము, అస్తు=అగుగాక. చన్ద్రార్కమరుద్గణేభ్యః=చంద్రునకు, సూర్యునకు మరుద్గణములకు, నమః=నమస్కారము, అస్తు=అగుగాక.

తా. లక్ష్మణసమేతుడైన రామునకు జనకుని పుత్రి యైన సీతాదేవికిని నమస్కారము. రుద్రునకు ఇంద్రునకు, యమునకు, వాయుదేవునకు నమస్కారము. చంద్రునకు, సూర్యునకు మరుద్గణములకు నమస్కారము. 59

మూ. స తేభ్యస్తు నమస్కృత్వా సుగ్రీవాయ చ మారుతిః,
దిశః సర్వాః సమాలోక్య హ్యాశోకవనికాం గతః. 60

ప్ర. అ. సః మారుతిః=ఆ హనుమంతుడు, తేభ్యః=రామాదులకు, నమస్కృత్వా=నమస్కరించి, సుగ్రీవాయ చ=సుగ్రీవునకు కూడ నమస్కరించి, సర్వాః=సమస్త మైన, దిశః=దిక్కులను, సమాలోక్య=చూచి, అశోకవనికామ్=అశోకవనమును గూర్చి, గతః=వెళ్ళినాడు.

తా. హనుమంతుడు రామాదులకు, సుగ్రీవునకూ నమస్కరించి, ఒక్కసారి అన్ని దిక్కుల వైపు చూచి, అశోకవనము వైపు వెళ్ళెను. 60

మూ. స గత్వా మనసా పూర్వమశోకవనికాం శుభామ్,
ఉత్తరం చిన్తయామాస వానరో మారుతాత్మజః. 61

ప్ర. అ. మారుతాత్మజః=వాయుపుత్రుడైన, సః వానరః=ఆ హనుమంతుడు, మనసా=మనస్సుచేత, పూర్వమ్=ముందుగానే, శుభామ్=సుందరమైన, అశోకవనికామ్=అశోకవనమును గూర్చి, గత్వా=వెళ్ళి, ఉత్తరమ్=తరువాత చేయవలసిన దానిని గూర్చి, చిన్తయామాస=ఆలోచించెను.

తా. వాయుపుత్రుడైన హనుమంతుడు ముందుగానే మనసా ఆ అశోకవనమును ప్రవేశించి, తరువాత చేయవలసిన పనిని గూర్చి ఆలోచించెను.

మూ. ధ్రువం తు రక్షోబహులా భవిష్యతి వనాకులా,
అశోకవనికా పుణ్యా సర్వసంస్కారసంస్కృతా. 62

ప్ర. అ. అశోకవనికా=అశోకవనము, ధ్రువమ్=తప్పక, రక్షోబహులా=రాక్షసులు అధికముగా కలదిగాను, వనాకులా=వృక్షములతో ఆకులముగాను, సర్వసంస్కారసంస్కృతా=సకలసంస్కారములచేత సంస్కరింపబడినదై, పుణ్యా=పుణ్యమైనది గాను, భవిష్యతి=ఉండగలదు.

తా. అశోకవనము రాక్షసులతో నిండినదై, వృక్షములతో వ్యాకులమై, అన్నివిధములైన సంస్కారములచేత సంస్కృతమై పుణ్యప్రదముగా ఉండి యుండును.

మూ. రక్షిణశ్చాత్ర విహితా నూనం రక్షన్తి పాదపాన్,
భగవానపి సర్వాత్మా నాతిక్షోభం ప్రవాతి వై. 63
సంక్షిప్తోఽయం మయాత్మా చ రామార్థే రావణస్య చ.

ప్ర. అ. అత్ర=ఇక్కడ, విహితాః=నియమింపబడిన, రక్షిణశ్చ=వనపాలకులు, పాదపాన్=వృక్షములను, నూనమ్=తప్పక, రక్షన్తి=రక్షించుచుందురు. సర్వాత్మా=సర్వాంతర్గతుడైన, భగవానపి=పూజ్యుడైన వాయుదేవుడు కూడ, నాతిక్షోభమ్=ఎక్కువ క్షోభము లేకుండ, ప్రవాతి వై=వీచుచున్నాడు, మయా=నాచేత, రామార్థే=రామునికొరకు, రావణస్య చ=రావణునికిని, అయమ్=ఈ, ఆత్మా=శరీరము, సంక్షిప్తః=చిన్నదిగా చేయుబడినది.

తా. ఈ ఉద్యానవనమునందు రక్షకభటులు నియమితులై తప్పక వృక్షములను రక్షించుచుందురు. సర్వాంతర్యామి, పూజ్యుడు అయిన వాయుదేవుడు కూడ తీవ్రత్వము లేకుండా వీచుచున్నాడు. రాముని కార్యము సిద్ధించుటకు, రావణుని కంటబడకుండుటకు నేను నా శరీరమును చాలా చిన్నదిగా చేసికొన్నాను.

మూ. సిద్ధిం మే సంవిధాస్యన్తి దేవాః సర్షిగణాస్త్విహ, 64
బ్రహ్మా స్వయంభూర్భగవాన్ దేవాశ్చైవ దిశన్తు మే,
సిద్ధిమగ్నిశ్చ వాయుశ్చ పురుహూతశ్చ వజ్రభృత్, 65
వరుణః పాశహస్తశ్చ సోమాదిత్యౌ తథైవ చ,
అశ్వినౌ చ మహాత్మానౌ మరుతః శర్వ ఏవ చ, 66
సిద్ధిం సర్వాణి భూతాని భూతానాం చైవ యః ప్రభుః,
దాస్యన్తి మమ యే చాన్యే హ్యదృష్టాః పథి గోచరాః. 67

ప్ర. అ. సర్షిగణాః=ఋషిగణములతో కూడిన, దేవాః=దేవతలు, ఇహ=ఇక్కడ, మే=నాకు, సిద్ధిమ్=కార్యసిద్ధిని, సంవిధాస్యన్తి=చేయగలరు. స్వయంభూః=స్వయముగా జన్మించిన, భగవాన్=మాహాత్మ్యము గల, బ్రహ్మా=బ్రహ్మదేవుడు, దేవాశ్చైవ=దేవతలు, అగ్నిశ్చ=అగ్నిదేవుడు, వాయుశ్చ=వాయుదేవుడు, వజ్రభృత్=వజ్రమును ధరించిన, పురుహూతశ్చ=దేవేంద్రుడు, పాశహస్తః=పాశము హస్తమునందు గల, వరుణశ్చ=వరుణుడు, తథైవ చ=మరియు, సోమాదిత్యౌ=చంద్రసూర్యులు, మహాత్మానౌ=మహాత్ము లైన, అశ్వినౌ చ=అశ్వినీ దేవతలు, మరుతః=మరుత్తులు, శర్వః ఏవ చ=ఈశ్వరుడు, మే=నా, సిద్ధిమ్=కార్యసిద్ధిని, దిశన్తు=ఇచ్చెదరు గాక. సర్వాణి=సమస్త మైన, భూతాని=భూతములు, యః=ఎవ్వడు, భూతానామ్=భూతములయొక్క, ప్రభుః=ప్రభువో అతడు, అన్యే=ఇతరులైన, యే=ఎవరు, అదృష్టాః=చూడబడనివారై, పథి=మార్గమునందు, గోచరాః=ఉందురో వారు, మమ=నాకు, సిద్ధిమ్=కార్యసిద్ధిని, దాస్యన్తి=ఇవ్వగలరు.

తా. ఋషిగణములు, దేవతలు నాకు ఇక్కడ కార్యసిద్ధిని ఇచ్చెదరుగాక. స్వయముగా జన్మించినవాడు, మహామహిమశాలీ అయిన బ్రహ్మదేవుడు, దేవతలు, అగ్ని, వాయువు, వజ్రధారి యైన దేవేంద్రుడు, పాశమును ధరించిన వరుణుడు, చంద్రసూర్యులు, మహాత్ములైన అశ్వినీదేవతలు, మరుత్తులు, శివుడు నాకు కార్యసిద్ధిని ఇచ్చెదరుగాక. సకల భూతములు, భూతముల అధిపతి యైన సర్వేశ్వరుడు కనబడకుండా మార్గములో ఉండు ఇతరదేవతలు నాకు కార్యసిద్ధిని ఇవ్వగలరు. 64 - 67

మూ. తదున్నసం పాణ్డురదన్తమవ్రణం
శుచిస్మితం పద్మపలాశలోచనమ్,
ద్రక్ష్యే తదార్యావదనం కదా న్వహం
ప్రసన్నతారాధిపతుల్యదర్శనమ్. 68

ప్ర. అ. ఉన్నసమ్=ఉన్నతమైన నాసిక గలదీ, పాణ్డురదన్తమ్=తెల్లని దంతములు గలదీ, అవ్రణమ్=గాయములు (మచ్చలు మొ॥) లేనిది, శుచిస్మితమ్=తెల్లని చిరునవ్వు గలది, పద్మపలాశలోచనమ్=తామరరేకులవంటి నేత్రములు గలదీ, ప్రసన్నతారాధిపతుల్యదర్శనమ్=నిర్మలమైన చంద్రబింబముతో సమానమైన దర్శనము గలదీ అయిన, తత్=ఆ, తదార్యావదనమ్=పూజ్యురాలైన ఆ సీతయొక్క ముఖమును, అహమ్=నేను, కదా=ఎప్పుడు, ద్రక్ష్యే ను=చూడగలనో కదా !

తా. ఎత్తైన నాసిక, తెల్లని దంతములు, తెల్లని చిరునవ్వు, తామరరేకుల వంటి నేత్రములు గలదీ, ఎట్టి దోషములూ లేనిదీ చంద్రబింబము వలె కనబడునదీ అయిన ఆ పూజ్యురాలైన సీతముఖమును ఎప్పుడు చూచెదనో గదా ! 68

మూ. క్షుద్రేణ పాపేన నృశంసకర్మణా
సుదారుణాలంకృతవేషధారిణా,
బలాభిభూతా హ్యబలా తపస్వినీ
కథం ను మే దృష్టిపథేఽద్య సా భవేత్. 69

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే సున్దరకాణ్డే
త్రయోదశః సర్గః.

ప్ర. అ. క్షుద్రేణ=నీచుడు, పాపేణ=పాపాత్ముడు, నృశంసకర్మణా=క్రూర మైన కర్మ గలవాడూ, సుదారుణాలఙ్కృతవేషధారిణా=చాల భయంకరముగా అలంకరింపబడిన వేషమును ధరించువాడూ అయిన రావణునిచేత, బలాభిభూతా= బలాత్కారముగా తిరస్కరింపబడిన, తపస్వినీ=దీనురా లైన, సా=ఆ, అబలా=దుర్బల యైన సీత, అద్య=ఇప్పుడు, మే=నాయొక్క, దృష్టిపథే=దృష్టిమార్గమునందు, కథం=ఎట్లు, భవేత్ ను=అగునో !

తా. నీచుడు, పాపాత్ముడూ, క్రూర మైన పనులు చేయువాడూ, చాల భయమును కలిగించునట్లు అలంకరించుకొనిన వేషమును ధరించినవాడూ, అయిన రావణుడు, దీనురాలూ, అబల అయిన ఆ సీతను బలాత్కారముగా అపహరించినాడు. అట్టి సీత ఎప్పుడు నా కంటికి కనబడునో కదా ! 69

*"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు
సుందరకాండలో పదమూడవ సర్గ సమాప్తము.*

అథ చతుర్దశః సర్గః

[హనుమంతుడు అశోకవనములో ప్రవేశించి దాని శోభను చూచుట. ఒక అశోకవృక్షము మీద దాగి అతడు దానిపైనుండియే పరీక్షగా ఆ వనమును చూచుట.]

మూ. స ముహూర్తమివ ధ్యాత్వా మనసా చాధిగమ్య తామ్,
అవప్లుతో మహాతేజాః ప్రాకారం తస్య వేశ్మనః. 1

ప్ర. అ. మహాతేజాః=గొప్ప తేజస్సు గల, సః=హనుమంతుడు, ముహూర్తమివ=క్షణకాలము, ధ్యాత్వా=ఆలోచించి, తామ్=ఆ అశోకవనికను, మనసా=మనస్సు చేత, అధిగమ్య=పొంది, తస్య వేశ్మనః=ఆ గృహముయొక్క, ప్రాకారమ్=ప్రాకారమును, అవప్లుతః=దిగెను.

తా. మహాతేజఃశాలి యైన హనుమంతుడు క్షణకాలము ఆలోచించి, మనసా ఆ అశోకవనిలోనికి ప్రవేశించి, ఆ భవనము ప్రాకారమునుండి క్రిందికి దుమికెను. 1

మూ. స తు సంహృష్టసర్వాఙ్గః ప్రాకారస్థో మహాకపిః,
పుష్పితాగ్రాన్ వసన్తాదౌ దదర్శ వివిధాన్ ద్రుమాన్. 2

సాలానశోకాన్ భవ్యాంశ్చ చంపకాంశ్చ సుపుష్పితాన్,
ఉద్దాలకాన్నాగవృక్షాంశ్చూతాన్కపిముఖానపి. 3

ప్ర. అ. ప్రాకారస్థః=ప్రాకారముమీద నున్నవాడై మాత్రము, సః మహాకపిః=ఆ హనుమంతుడు, సంహృష్టసర్వాఙ్గః=ఉప్పొంగిన సకలశరీరము కలవాడై, వసన్తాదౌ=వసంతప్రారంభమున, పుష్పితాగ్రాన్=పుష్పించిన శాఖాగ్రములు గల, వివిధాన్=అనేకవిధము లైన, ద్రుమాన్=వృక్షములను, దదర్శ=చూచెను. సాలాన్=సాలములను, భవ్యాన్=సుందరములైన, అశోకాన్=అశోకములను, సుపుష్పితాన్=బాగుగా పుష్పించిన, చంపకాంశ్చ=చంపకపుష్పములను, ఉద్దాలకాన్=విరిగిచెట్లను, నాగవృక్షాన్=పొన్నచెట్లను, చూతాన్=మామిడిచెట్లను, కపిముఖానపి=తీగగానుగ చెట్లను (చూచెను).

తా. హనుమంతుడు ప్రాకారముపై ఉండగానే, సంతోషముచేత ఉప్పొంగిన శరీరము కలవాడై, వసంతప్రారంభమునందు పుష్పించిన అగ్రభాగములు గల అనేకవిధము లైన వృక్షములను చూచెను. మద్దిచెట్లు, అందమైన అశోక వృక్షములు, చక్కగా పూసిన సంపెంగచెట్లు, విరిగిచెట్లు, పొన్నచెట్లు, మామిడి చెట్లు, తీగకానుగచెట్లు మొదలైన వాటిని చూచెను. 2, 3

మూ. అథామ్రవణసంఛన్నాం లతాశతసమావృతమ్,
జ్యాముక్త ఇవ నారాచః పుప్లువే వృక్షవాటికామ్. 4

ప్ర. అ. అథ=అటుపిమ్మట, ఆమ్రవణసంఛన్నామ్=మామిడి చెట్ల వనముచేత కప్పబడినదీ, లతాశతసమాకులామ్=వందలకొలది లతలచే ఆవరింప బడినదీ, అయిన, వృక్షవాటికామ్=వృక్షవాటికను గూర్చి, జ్యాముక్తః=నారి నుండి విడువబడిన, నారాచః ఇవ=నారాచబాణము వలె, పుప్లువే=ఎగిరెను.

తా. పిమ్మట హనుమంతుడు, వింటి నారి నుండి విడువబడిన నారాచ బాణము వలె మహావేగముతో, అక్కడ ఉన్న వృక్షవాటికలోనికి ప్రవేశించెను. ఆ వృక్షవాటిక అనేకమైన మామిడిచెట్లతోను, వందల కొలది లతలతోను నిండియుండెను. 4

మూ. స ప్రవిశ్య విచిత్రాం తాం విహగైరభినాదితామ్,
రాజతైః కాఞ్చనైశ్చైవ పాదపైః సర్వతో వృతామ్. 5

విహగైర్మృగసంఘైశ్చ విచిత్రాం చిత్రకాననామ్,
ఉదితాదిత్యసంకాశాం దదర్శ హనుమాన్ కపిః. 6

వృతాం నానావిధైర్వృక్షైః పుష్పోపగఫలోపగైః,
కోకిలైర్భృఙ్గరాజైశ్చ మత్తైర్నిత్యనిషేవితామ్. 7

ప్రహృష్టమనుజే కాలే మృగపక్షిసమాకులే,
మత్తబర్హిణసంఘుష్టాం నానాద్విజగణాయుతామ్. 8

ప్ర. అ. కపిః=వానరుడైన, సః హనుమాన్=ఆ హనుమంతుడు, ప్రహృష్ట మనుజే=సంతోషించుచున్న మనుష్యులు కలదీ, మృగపక్షిసమాకులే=మృగములచేత, పక్షులచేవ్యాకులమూ అయిన, కాలే=వసంతకాలమునందు, విచిత్రామ్=అనేకవర్ణములు కలదీ, విహగైః=పక్షులచేత, అభినాదితామ్=ధ్వనింపచేయబడినదీ, రాజతైః=వెండితో చేసినవీ, కాఞ్చనైశ్చైవ=బంగారముతో చేసినవీ అయిన, పాదపైః=వృక్షములతో, సర్వతః=చుట్టూ, వృతామ్=కూడినదీ, విహగైః=పక్షులచేతను, మృగసంఘైశ్చ=మృగ

ముల సముదాయములచేతను, విచిత్రామ్=విచిత్రమైనదీ, చిత్రకాననామ్=చిత్రమైన వనము (వృక్షసముదాయము) కలదీ, ఉదితాదిత్యసంకాశామ్=ఉదయించిన సూర్యునితో సమాన మైనదీ, పుష్పోపగఫలోపగైః=పుష్పములను పొందినవీ ఫలములను పొందినవీ అయిన, నానావిధైః=అనేకవిధములైన, వృక్షైః=వృక్షములతో, వృతామ్=కూడినదీ, మత్తైః=మదించిన, కోకిలైః=కోకిలలచేతను, భృఙ్గరాజైశ్చ=తుమ్మెదలచేతనూ, నిత్యనిషేవితామ్=నిత్యమూ సేవింపబడినదీ, మత్తబర్హిణసంఘుష్టామ్=మదించిన నెమళ్ళచేత ధ్వనింపచేయబడినదీ, నానాద్విజగణాయుతామ్=అనేకవిధములైన పక్షుల సముదాయములతో కూడినదీ అయిన, తామ్=ఆ వృక్షవాటికను, ప్రవిశ్య=ప్రవేశించి, దదర్శ=చూచెను.

తా. మనుష్యులూ, మృగపక్ష్యాదులూ ఆనందముతో విహరించుచుండు ఆ వసంత ప్రారంభసమయమునందు, వివిధవర్ణములు గల పుష్పములతో ఆ వృక్షవాటిక విచిత్రవర్ణముగా ఉండెను. పక్షుల ధ్వనులతో ప్రతిధ్వనించుచున్న ఆ వృక్షవాటిక చుట్టూ వెండి చెట్లూ, బంగారపు చెట్లూ ఉండెను. అనేక విధములైన పక్షులు, మృగములు విహరించుచుండుటచే విచిత్రముగా ఉండెను. వృక్షముల గుంపులు కూడ అనేక వర్ణములతో విచిత్రములుగా ఉండెను. ఆ వాటిక ఉదయించుచున్న సూర్యుడు వలె ప్రకాశించుచుండెను. దాని చుట్టూ అనేక పుష్పములతో నిండిన వృక్షములూ, ఫలములతో నిండిన వృక్షములూ ఉండెను. మదించిన కోకిలలు, తుమ్మెదలు నిత్యము నివసించు ఆ వాటిక మదించిననెమళ్ల ధ్వనులతో ప్రతిధ్వనించుచుండెను. అది వివిధపక్షిగణములతో నిండి యుండెను. అట్టి వృక్షవాటికను చూచి హనుమంతుడు లోనికి ప్రవేశించెను. 5-8

మూ. మార్గమాణో వరారోహాం రాజపుత్రీమనిన్దితామ్,
సుఖప్రసుప్తాన్విహగాన్బోధయామాస వానరః. 9

ప్ర. అ. వానరః=హనుమంతుడు, వరారోహామ్=అందమైన కటి ప్రదేశము గల, అనిన్దితామ్=నిందింపబడని, రాజపుత్రీమ్=రాజపుత్రియైన సీతను, మార్గమాణః=అన్వేషించుచు, సుఖప్రసుప్తాన్=సుఖముగా నిద్రించుచున్న, విహగాన్=పక్షులను, బోధయామాస=మేల్కొల్పెను.

తా. అందమైన కటిప్రదేశము గలదీ, దోషములు లేనిదీ అయిన సీత కొరకై అన్వేషించుచు ఆ వనములో హనుమంతుడు ప్రవేశించగానే చెట్లపై నిద్రించుచున్న పక్షులన్నీ నిద్రనుండి లేచి ఎగిరిపోయెను. 9

మూ. ఉత్పతద్భిర్ద్విజగణైః పక్షైః సాలాః సమాహతాః,
అనేకవర్ణా వివిధా ముముచుః పుష్పవృష్టయః. 10

ప్ర. అ. ఉత్పతద్భిః=ఎగురుచున్న, ద్విజగణైః=పక్షిసముదాయముల చేత, పక్షైః=రెక్కలచేత, సమాహతాః=కొట్టబడిన, సాలాః=వృక్షములు, అనేకవర్ణాః=అనేకమైన వర్ణములు గల, వివిధాః=అనేకవిధము లైన, పుష్పవృష్టయః=పుష్పవృష్టులను, ముముచుః=విడచినవి.

తా. ఎగురు చున్న పక్షుల రెక్కలు తగిలి, వృక్షములు, అనేకవర్ణములు గల, అనేకవిధములైన పుష్పవృష్టులను వర్షించినవి. 10

మూ. పుష్పావకీర్ణః శుశుభే హనుమాన్ మారుతాత్మజః,
అశోకవనికామధ్యే యథా పుష్పమయో గిరిః. 11

ప్ర. అ. పుష్పావకీర్ణః=పుష్పములచే చల్లబడిన, మారుతాత్మజః=వాయుపుత్రుడైన, హనుమాన్=హనుమంతుడు, అశోకవనికామధ్యే=ఆ అశోకవనము మధ్యయందు, పుష్పమయః=పుష్పముల వికారమైన, గిరిః యథా=పర్వతము వలె, శుశుభే=ప్రకాశించెను.

తా. పుష్పములచే కప్పబడిన వాయుపుత్రుడైన హనుమంతుడు, ఆ అశోకవనమధ్యమునందు, పుష్పమయమైన పర్వతము వలె ప్రకాశించెను. 11

మూ. దిశః సర్వాః ప్రధావన్తం వృక్షషణ్డగతం కపిమ్,
దృష్ట్వా సర్వాణి భూతాని వసన్త ఇతి మేనిరే. 12

ప్ర. అ. సర్వాః=సమస్త మైన, దిశః=దిక్కులను గూర్చి, ప్రధావన్తమ్=పరుగెత్తుచున్న, వృక్షషణ్డగతమ్=వృక్షసముదాయము మధ్య నున్న, కపిమ్=హనుమంతుని, దృష్ట్వా=చూచి, సర్వాణి=సమస్తమైన, భూతాని=భూతములు, వసన్తః ఇతి=వసంతుడు అని, మేనిరే=తలచినవి.

తా. ఆ చెట్లతోపుల మధ్య అన్నివైపులా పరుగెత్తుచున్న ఆ హనుమంతుని చూచిన వారందరూ సాక్షాత్తు వసంతుడే తిరుగుచున్నాడా అని అనుకొనిరి.12

మూ. వృక్షేభ్యః పతితైః పుష్పైరవకీర్ణా పృథగ్విధైః,
రరాజ వసుధా తత్ర ప్రమదేవ విభూషితా. 13

ప్ర. అ. తత్ర=అక్కడ, వృక్షేభ్యః=వృక్షములనుండి, పతితైః=రాలిన, పృథగ్విధైః=వేరు వేరు విధము లైన, పుష్పైః=పుష్పములచేత, అవకీర్ణా=చల్ల

బడిన, వసుధా=భూమి, విభూషితా=అలంకరించబడిన, ప్రమదేవ=స్త్రీ వలె, రరాజ=ప్రకాశించెను.

తా. అక్కడ, వేరు వేరు రకముల పూవులు రాలి వాటిచే కప్పబడిన నేల చక్కగా, అలంకరించుకొన్న స్త్రీవలె ప్రకాశించెను. 13

మూ. తరస్వినా తే తరవస్తరసాభిప్రకమ్పితాః,
కుసుమాని విచిత్రాణి ససృజుః కపినా తదా. 14

ప్ర. అ. తదా=అప్పుడు, తరస్వినా=బలవంతుడైన, కపినా=హనుమంతుని చేత, తరసా=బలముచేత, అభిప్రకమ్పితాః=కదల్పబడిన, తే=ఆ, తరవః=వృక్షములు, విచిత్రాణి=విచిత్రములైన, కుసుమాని=పుష్పములను, ససృజుః=విడచినవి.

తా. అప్పుడు, బలవంతుడైన ఆ హనుమంతుని బలానికి ఊగిపోయిన ఆ వృక్షములు రంగురంగుల పువ్వులను రాల్చినవి. 14

మూ. నిర్ధూతపత్రశిఖరాః శీర్ణపుష్పఫలా ద్రుమాః,
నిక్షిప్తవస్త్రాభరణా ధూర్తా ఇవ పరాజితాః. 15

ప్ర. అ. నిర్ధూతపత్రశిఖరాః=ఎగురకొట్టబడిన ఆకులు గల శాఖాగ్రములు గలవీ, శీర్ణపుష్పఫలాః=రాలిన పుష్పములు, ఫలములు గలవీ అయిన, ద్రుమాః=వృక్షములు, పరాజితాః=ఓడిపోయిన వారై, నిక్షిప్తవస్త్రాభరణాః=ఉంచబడిన వస్త్రములూ ఆభరణములూ గల, ధూర్తా ఇవ=జూదరుల వలె, ఉండెను.

తా. హనుమంతుడు వేగముగా ఇటు నటు సంచరించుటచే చెట్ల కొమ్మల చివర్లనుండి ఆకులు ఎగిరిపోయినవి. పుష్పములు, ఫలములు రాలిపోయినవి. అందుచే ఆ వృక్షములు, జూదములో ఓడిపోయి, నెగ్గినవారికిచ్చివేయుటకై తమ వస్త్రములూ, అలంకారములూ తీసి క్రింద బెట్టిన జూదరుల వలె ఉండెను.15

మూ. హనూమతా వేగవతా కమ్పితాస్తే నగోత్తమాః,
పుష్పపర్ణఫలాన్యాశు ముముచుః పుష్పశాలినః. 16

ప్ర. అ. వేగవతా=వేగము గల, హనూమతా=హనుమంతునిచేత, కమ్పితాః=కదల్పబడిన, పుష్పశాలినః=పుష్పములతో ప్రకాశించుచున్న, నగోత్తమాః= ఉత్తమములైన వృక్షములు, ఆశు=శీఘ్రముగా, పుష్పపర్ణఫలాని=పువ్వులను, ఆకులను, పండ్లను, ముముచుః=రాల్చినవి.

తా. పుష్పములతో నిండి యున్న వృక్షములు, హనుమంతుని వేగమునకు ఊగిపోయినవై, వెంటనే పుష్పములను, పత్రములను, ఫలములను రాల్చినవి.16

మూ. విహఙ్గసంఘైర్హీనాస్తే స్కన్ధమాత్రాశ్రయా ద్రుమాః,
బభూవురగమాః సర్వే మారుతేనేవ నిర్ధుతాః. 17

ప్ర. అ. సర్వే=సమస్తమైన, తే ద్రుమాః=ఆ వృక్షములు, మారుతేన=వాయువుచేత, నిర్ధుతాః=కదల్పబడిన, అగమాః ఇవ=వృక్షముల వలె, విహఙ్గసంఘైః=పక్షిసముదాయములచేత, హీనాః=శూన్యములై, స్కన్ధమాత్రాశ్రయాః=మానులకు మాత్రమే ఆశ్రయములుగా, బభూవుః=అయినవి.

తా. పక్షులన్నీ ఎగిరిపోయి, పెద్ద పెద్ద కొమ్మలు మాత్రమే మిగిలిన ఆ వృక్షములు, పెనుగాలి తాకిన వృక్షముల వలె అయినవి. 17

మూ. నిర్ధూతకేశీ యువతిర్యథా మృదితవర్ణకా,
నిష్పీతశుభదన్తోష్ఠీ నఖైర్దన్తైశ్చ విక్షతా. 18

మూ. తథా లాఙ్గూలహస్తైశ్చ చరణాభ్యాం చ మర్దితా,
బభూవాశోకవనికా ప్రభగ్నవరపాదపా. 19

ప్ర. అ. లాఙ్గూలహస్తైశ్చ=తోకచేతను, చేతులచేతను, చరణాభ్యాం చ=పాదములచేతను, మర్దితా=నలగగొట్టబడినదీ, ప్రభగ్నవరపాదపా=విరిగి పోయిన శ్రేష్ఠములైన వృక్షములు కలదీ అయిన, అశోకవనికా=అశోకవనము, నిర్ధూతకేశీ=చెదరగొట్టబడిన కేశములు కలదీ, మృదితవర్ణకా=నలిగిపోయిన అంగరాగము (దేహమునకు పూసికొనిన సుగంధద్రవ్యము) కలదీ, నిష్పీత శుభదన్తోష్ఠీ=పానముచేయబడిన సుందరమైన దంతములు, ఓష్ఠమూ (పెదవీ) కలదీ, నఖైః=గోళ్ళచేతను, దన్తైశ్చ=దంతములచేతను, విక్షతా=గీరబడినదీ అయిన, యువతిః=యువతి, యథా=ఎట్లో, తథా=అట్లు, బభూవ=ఆయెను.

తా. హనుమంతుని రాకచేత, హస్తములచేత, పాదములచేత నలగగొట్టబడి మంచి వృక్షములన్నీ విరిగిపోవుటచే ఆ అశోకవనము, ప్రియునిచే గాఢముగా చుంబింపబడినదై, నఖక్షతదంతక్షతములతో కూడిన శరీరముచే, చెదిరి పోయిన జుట్టుతో, నలిగిపోయిన రంగుతో ఉన్న యువతివలె ఉండెను. 18,19

మూ. మహాలతానాం దామాని వ్యధమత్తరసా కపిః,
యథా ప్రావృషి విన్ధ్యస్య మేఘజాలాని మారుతః. 20

ప్ర. అ. కపిః=హనుమంతుడు, మహాలతానామ్=గొప్పలతలయొక్క, దామాని=వలయములను, తరసా=బలముచేత, మారుతః=వాయువు, ప్రావృషి=వ

ర్షాకాలమునందు, విన్ధ్యస్య=వింధ్యపర్వతముయొక్క, మేఘజాలాని=మేఘపంక్తులను, యథా=ఎట్లో, అట్లు, వ్యధమత్=తెంచెను.

తా. వర్షాకాలమునందు వాయువు వింధ్యపర్వతముమీదనున్న మేఘ పంక్తిని చెదరగొట్టినట్లు, హనుమంతుడు, బలముచే, పెద్ద పెద్ద తీగల పొదలను ఛేదించెను. 20

మూ. స తత్ర మణిభూమీశ్చ రాజతీశ్చ మనోరమాః,
తథా కాఞ్చనభూమీశ్చ దదర్శ విచరన్ కపిః. 21

ప్ర. అ. సః=ఆ, కపిః=హనుమంతుడు, తత్ర=అక్కడ, విచరన్=సం చరించుచు, మణిభూమీశ్చ=మాణిక్యభూములను, రాజతీశ్చ=వెండి భూములను, తథా=మరియు, మనోరమాః=మనోహరములైన, కాఞ్చనభూమీశ్చ=బంగారుభూము లను, దదర్శ=చూచెను.

తా. హనుమంతుడు అక్కడ సంచరించుచు, అతిసుందరములైన మాణిక్యములు పొదిగిన చపటాలను, వెండిచపటాలను, బంగారు చపటాలను చూచెను. 21

మూ. వాపీశ్చ వివిధాకారాః పూర్ణాః పరమవారిణా,
మహార్హైర్మణిసోపానైరుపపన్నాస్తతస్తతః. 22
ముక్తాప్రవాళసికతాః స్ఫాటికాన్తరకుట్టిమాః,
కాఞ్చనైస్తరుభిశ్చిత్రైస్తీరజైరుపశోభితైః. 23
ఫుల్లపద్మోత్పలవనాశ్చక్రవాకోపకూజితాః,
నత్యూహరుతసంఘుష్టా హంససారసనాదితాః. 24
దీర్ఘాభిర్ద్రుమయుక్తాభిః సరిద్భిశ్చ సమన్తతః,
అమృతోపమతోయాభిః శివాభిరుపసంస్కృతాః. 25
లతాశతైరవతతాః సన్తానకుసుమావృతాః,
నానాగుల్మావృతఘనాః కరవీరకృతాన్తరాః. 26

ప్ర. అ. పరమవారిణా=శ్రేష్ఠమైన ఉదకముతో, పూర్ణాః=నిండినవీ, తత స్తతః=అక్కడక్కడ, మహార్హైః=గొప్పమూల్యము గల, మణిసోపానైః=మాణిక్యముల మెట్లతో, ఉపపన్నాః=కూడినవీ, ముక్తాప్రవాళసికతాః=ముత్యములు పొగడములు ఇసుకగా కలవీ, స్ఫాటికాన్తరకుట్టిమాః=స్ఫటికమాణిక్యవికారములైన, మధ్యనున్న చపటాలు గలవీ, తీరజైః=తీరములందు (పుట్టిన) ఉన్న, కాఞ్చనైః=బంగారువికార

మైన, చిత్రైః=చిత్రవర్ణములు గల, తరుభిః=వృక్షములచేత, ఉపశోభితాః=ప్రకాశింప చేయుబడినవీ, ఫుల్లపద్మోత్పలవనాః=వికసించిన పద్మ సముదాయములూ, కలువల సముదాయములూ, కలవీ, చక్రవాకోపకూజితాః=చక్రవాక పక్షులచే సమీపమునందు ధ్వనింపచేయబడినవీ, నత్యూహరుతసంఘుష్టాః=నీరుకోళ్ళచే ధ్వనింపచేయబడినవీ, హంస సారసనాదితాః=హంసలచేతను, సారస పక్షులచేతను ధ్వనింపచేయబడినవీ, దీర్ఘాభిః=పొడవైన, ద్రుమయుక్తాభిః=వృక్షములతో కూడిన, అమృతోపమతోయాభిః=అమృతము వంటి ఉదకములు గల, శివాభిః=మంగళకరము లైన, సరిద్భిః=కాలవలచేత, సమన్తతః=నలుమూలలా, ఉపస్కృతాః=అలంకరింపబడినవీ, లతాశతైః=వందలకొలది లతలచేత, అవతతాః=వ్యాప్తములైనవీ, సంతానకుసుమావృతాః=సంతాన వృక్షముల పుష్పములచేత కప్పబడినవీ, నానాగుల్మావృతఘనాః=అనేక విధములైన పొదలచే ఆవరింపబడి దట్టముగా ఉన్నవీ, కరవీరకృతాంతరాః=కరవీర వృక్షములచే ఏర్పరుపబడిన మధ్యప్రదేశములు గలవీ అయిన, వివిధాకారాః=అనేక ఆకారములలో ఉన్న, వాపీశ్చ=దిగుడుబావులను కూడ (చూచెను.)

తా. హనుమంతుడు ఆ అశోకవనమునందు గుండ్రని, కోలని, చతురశ్రము, దీర్ఘచతురశ్రము మొదలైన వివిధాకారములలో ఉన్న, ఉత్తమమైన జలముతో నిండిన దిగుడుబావులను కూడ చూచెను. వాటికి అక్కడక్కడ శ్రేష్ఠము లైన మాణిక్యముల మెట్లు ఉండెను. వాటిలో ఇసుకకు బదులు ముత్యములు, పొగడములు ఉండెను. వాటి మధ్య కూర్చుండుటకై స్ఫటిక మాణిక్యములు చపటాలు ఉండెను. వాటి తీరములపై బంగారు చెట్లు, చిత్రవర్ణములు గల చెట్లు కృత్రిమముగా నిర్మితములై ప్రకాశించుచుండెను. పద్మములు, కలువలు గుంపుగుంపులుగా వికసించి ఉండెను. చక్రవాకపక్షులు, నీటికోళ్లు, హంసలు, సారసపక్షులు మొదలైన జలపక్షుల కూతలు మధురముగా వినవచ్చుచుండెను. ఆ దిగుడుబావులకు నలువైపులా, అమృతము వంటి ఉదకముతో నిండినవీ, పొడ వైనవీ, మంగళకరములూ, చెట్లచే ఆవరింపబడినవీ అయిన కాలువలు ఒప్పుచుండెను. వందల కొలది తీగలు వ్యాపించి ఉండెను. సంతానక వృక్షముల పుష్పములు వాటిపై రాలి ఉండెను. అనేకవిధములైన పొదలు, చిన్న మొక్కలు వాటి చుట్టూ దట్టముగా వ్యాపించి ఉండెను. మధ్య మధ్య కరవీరవృక్షములుండెను. 22-26

మూ. తతోఽమ్బుధరసంకాశం ప్రవృద్ధశిఖరం గిరిమ్,
విచిత్రకూటం కూటైశ్చ సర్వతః పరివారితమ్. 27

శిలాగృహైరవతతం నానావృక్షైః సమావృతమ్,
దదర్శ హరిశార్దూలో రమ్యం జగతి పర్వతమ్. 28

ప్ర. అ. తతః=అటుపిమ్మట, హరిశార్దూలః=హనుమంతుడు, జగతి=జగత్తులో, రమ్యం పర్వతమ్=అందమైన పర్వతమూ, అమ్బుధరసంకాశమ్=మేఘముతో సమానమూ, ప్రవృద్ధశిఖరమ్=ఎత్తైన శిఖరములు కలదీ, విచిత్రకూటమ్=అనేక వర్ణములు గల శిఖరములు గలదీ, సర్వతః=అన్ని వైపు లందు, కూటైః=శిఖరములచే, పరివారితమ్ =చుట్టబడి ఉన్నదీ, శిలాగృహైః=గుహలచేత, అవతతమ్=వ్యాప్తమైనదీ, నానావృక్షైః=అనేకవిధములైన వృక్షములచే, సమావృతమ్=కప్పబడినదీ అయిన, గిరిమ్=పర్వతమును, దదర్శ=చూచెను.

తా. పిమ్మట ఆ హనుమంతుడు, జగత్తులోని అందమైన పర్వతములలో ఒకటైన, మేఘము వంటి ఎత్తైన శిఖరములు గల పర్వతమును చూచెను. దాని చుట్టును ఉన్న శిఖరములు (చిన్న కొండలు) దానిపై నున్న శిఖరములు విచిత్ర వర్ణములై ఉండెను. అనేకవృక్షములతో నిండిన ఆ పర్వతమునందు, అక్కడక్కడ నివాసయోగ్యములైన గుహలు ఉండెను. 27,28

మూ. దదర్శ చ నగాత్తస్మాన్నదీం నిపతితాం కపిః,
అఙ్కాదివ సముత్పత్య ప్రియస్య పతితాం ప్రియామ్. 29
జలే నిపతితాగ్రైశ్చ పాదపైరుపశోభితామ్,
వార్యమాణామివ క్రుద్ధాం ప్రమదాం ప్రియబన్ధుభిః. 30
పునరావృత్తతోయాం చ దదర్శ స మహాకపిః,
ప్రసన్నామివ కాన్తస్య కాన్తాం పునరుపస్థితామ్. 31

ప్ర. అ. కపిః=హనుమంతుడు, తస్మాత్=ఆ, నగాత్=పర్వతము నుండి, నిపతితామ్=క్రిందికి పడినదీ (ప్రవహించుచున్నదీ), ప్రియస్య=ప్రియుని యొక్క, అఙ్కాత్=తొడనుండి, సముత్పత్య=క్రిందికి దుమికి, పతితామ్=పడిన, ప్రియామ్ ఇవ=ప్రియురాలి వలె ఉన్నదీ, జలే=జలమునందు, నిపతితాగ్రైః=పడిన అగ్ర భాగములు గల, పాదపైః=వృక్షములచేత, ఉపశోభితామ్=ప్రకాశింపచేయబడినదీ, ప్రియబన్ధుభిః=ప్రియునియొక్క బంధువులచేత (లేదా ప్రియులైన బంధువులచేత), వార్యమాణామ్=నివారింపబడుచున్న, క్రుద్ధామ్=కోపించిన, ప్రమదామ్ ఇవ=యువతి వలె ఉన్నదీ అయిన, నదీమ్=నదిని, దదర్శ=చూచెను. ఆవృత్తతోయామ్=మరల వెనుకకుతిరిగిన ఉదకము గలదీ, కాన్తస్య=ప్రియుని విషయమై, ప్రసన్నామ్=ప్రసన్నురాలూ, పునః=మరల, ఉపస్థితామ్=దగ్గరకు చేరిన, కాన్తామివ=ప్రియురాలు

వలె ఉన్నదీ అయిన ఆ నదిని, సః=ఆ, మహాకపిః=హనుమంతుడు, పునః=మరల, దదర్శ=చూచెను.

తా. [మహాతపఃప్రభావసంపన్ను డైన రావణుడు తన తపోబలము నంతను, ఐహికసౌఖ్యానుభవమునకే వినియోగించి అత్యుత్కృతము లైన భోగసాధనములు అమర్చుకొన్నట్లు లంకావర్ణనమువలన స్పష్టమగుచున్నది. అశోకవనములో ఒక కృత్రిమపర్వతమున్నది. దానిపై నుంచి ఒక నది (కాలువ) క్రిందికి కొంత దూరము ప్రవహించి, మళ్ళీ వెనుకకు తిరిగి పర్వతమువైపునకే ప్రవహించునట్లు ఏర్పరుపబడినది. దాని తీరములపై ఉన్న వృక్షముల కొమ్మల అగ్రభాగములు ఆ కాలువ నీటికి తగులుచుండెను. ఆ దృశ్యమును ఆదికవి కవిదృష్టితో చూచి వర్ణించుచున్నాడు] ఆ పర్వతమునుండి క్రిందికి జారి దూరముగా ప్రవహించి పోతూన్న ఆ నది మగనిమీద అలిగి వానిని విడచి, పుట్టినింటికి పయనమైపోవుచున్న భామ వలె ఉండెను. దాని నీటిలో పడిన కొమ్మలు "నీవు భర్తను వదలి వెళ్లుట యుక్తము కాదు" అని చెప్పుచు ఆమెను అడ్డగించు చున్న బంధువుల చేతుల వలె ఉండెను. కొంత దూరము పోయి మరల పర్వతము వైపే ప్రవహించుచున్న ఆ నది బంధువుల మాటలు విని, అలక తీరి, మరల భర్తదరిజేరిన యువతి వలె ఉండెను. హనుమంతుడు అట్టినదిని చూచెను. 29-31

మూ. తస్యాదూరాత్స పద్మిన్యో నానాద్విజగణాయుతాః,
దదర్శ హరిశార్దూలో హనుమాన్ మారుతాత్మజః. 32

ప్ర. అ. హరిశార్దూలః=వానరశ్రేష్ఠుడు, మారుతాత్మజః=వాయుపుత్రుడు అయిన, సః హనుమాన్=ఆ హనుమంతుడు, తస్య=ఆ పర్వతమునకు, అదూరాత్=సమీపమునందే, నానాద్విజగణాయుతాః=అనేక పక్షులసముదాయములతో కూడిన, పద్మిన్యః=పద్మసరస్సులను, దదర్శ=చూచెను.

తా. వానరశ్రేష్ఠుడూ, వాయుపుత్రుడూ అయిన ఆ హనుమంతునకు ఆ పర్వతము సమీపమునందే అనేక పక్షిగణములతో కూడిన పద్మసరస్సులు కనబడెను. 32

మూ. కృత్రిమాం దీర్ఘికాం చాపి పూర్ణాం శీతేన వారిణా,
మణిప్రవరసోపానాం ముక్తాసికతశోభితామ్. 33
వివిధైర్మృగసంఘైశ్చ విచిత్రాం చిత్రకాననామ్,
ప్రాసాదైః సుమహద్భిశ్చ నిర్మితైర్విశ్వకర్మణా, 34

కాననైః కృత్రిమైశ్చాపి సర్వతః సమలంకృతామ్.

ప్ర. అ. శీతేన=చల్లని, వారిణా=నీటితో, పూర్ణామ్=నిండినదీ, మణి ప్రవరసోపానామ్=శ్రేష్ఠమైన మణులతో కట్టిన మెట్లు కలదీ, ముక్తాసికత శోభితామ్=ముత్యముల ఇసుకచే ప్రకాశింపచేయబడినదీ, వివిధైః=అనేక విధము లైన, మృగసంఘైశ్చ=మృగముల సముదాయములచేత, విచిత్రామ్=ఆశ్చర్యకరముగా నున్నదీ, చిత్రకాననామ్=చిత్రమైన అడవులు కలదీ, విశ్వకర్మణా=విశ్వకర్మ చేత, నిర్మితైః=నిర్మింపబడిన, సుమహద్భిః=చాల పెద్దవైన, ప్రాసాదైః=మేడలచేతను, కృత్రిమైః=కృత్రిమములైన(సహజములు కాని), కాననైశ్చాపి=వృక్షసముదాయముల చేతను, సర్వతః=నలువైపులందు, సమలంకృతామ్=అలంకరింపబడినదీ అయిన, కృత్రిమామ్=మనుష్యాదులచే నిర్మింపబడిన, దీర్ఘికాం చాపి=దిగుడుబావిని కూడ (చూచెను).

తా. చల్లని నీటితో నిండిన ఒక పెద్ద దిగుడు బావిని కూడ చూచెను. మణులతో కట్టిన మెట్లతో, ముత్యాల ఇసుకతో ప్రకాశించుచున్న ఆ దిగుడుబావి దగ్గర అనేకవిధములైన మృగముల గుంపులు, విచిత్రములైన చెట్ల తోపులు ఉండెను. దాని చుట్టును ఉన్న విశ్వకర్మ నిర్మించిన పెద్దపెద్ద ప్రాసాదములు, కృత్రిమములైన వృక్షముల సముదాయములు ముచ్చటగొల్పుచుండెను.33,34

మూ. యే కేచిత్పాదపాస్తత్ర పుష్పోపగఫలోపగాః,
సచ్ఛత్రాః సవితర్దికాః సర్వే సౌవర్ణవేదికాః. 35

ప్ర. అ. తత్ర=అక్కడ, పుష్పోపగఫలోపగాః=పుష్పములతోను ఫలముల తోను కూడిన, యే కేచిత్=ఏ, పాదపాః=వృక్షములున్నవో, సర్వే=అవి అన్నీ, సచ్ఛత్రాః=ఛత్రములతో కూడినవి, సవితర్దికాః=పెద్ద అరుగులతో కూడినవి; సౌవర్ణవేదికాః=బంగారు చిన్న తిన్నెలు గలవి.

తా. అక్కడ ఉన్న పుష్పవృక్షముల దగ్గర, ఫలవృక్షముల దగ్గరా కూడ ఛత్రములు, పెద్ద అరుగులు, చిన్న చిన్న బంగారు తిన్నెలు అమర్చబడి ఉండెను. 35

మూ. లతాప్రతానైర్బహుభిః పర్ణైశ్చ బహుభిర్వృతామ్, 36
కాఞ్చనీం శింశుపామేకాం దదర్శ హరియూథపః,
వృతాం హేమమయీభిస్తు వేదికాభిః సమన్తతః. 37

ప్ర. అ. హరియూథపః=హనుమంతుడు, బహుభిః=అనేకమైన, లతా ప్రతానైః=లతాసముదాయములచేతను, బహుభిః=అనేకమైన, పర్ణైశ్చ=ఆకులచేతను,

వృతామ్=కప్పబడినదీ, సమన్తతః=చుట్టూ, హేమమయీభిః=బంగారు, వేదికాభిః=అరుగులతో, వృతామ్=కూడినదీ అయిన, కాఞ్చనీమ్=బంగారువికార మైన, ఏకామ్=ఒక, శింశుపామ్=శింశుపావృక్షమును, దదర్శ=చూచెను.

తా. అక్కడ హనుమంతునకొక బంగారు శింశుపావృక్షము కనబడెను. దాని చుట్టు అనేకములై లతలు అల్లుకొని ఉండెను. అది ఆకులతో దట్టముగా ఉండెను. దానిచుట్టూ బంగారు వేదికలు ఏర్పరుపబడి ఉండెను. 36, 37

మూ. సోఽపశ్యద్భూమిభాగాంశ్చ గర్తప్రస్రవణాని చ,
సువర్ణవృక్షానపరాన్ దదర్శ శిఖిసన్నిభాన్. 38

ప్ర. అ. సః=హనుమంతుడు, భూమిభాగాంశ్చ=భూములను, గర్తప్రస్రవణాని చ=గోతులను, సెలయూటలను, అపరాన్=మరి కొన్ని, శిఖిసన్నిభాన్=అగ్నితో సమానమైన, సువర్ణవృక్షాన్=బంగారు వృక్షములను, అపశ్యత్=చూచెను.

తా. హనుమంతుడు అక్కడ మరి కొన్ని భూభాగములనూ, పల్లపు ప్రాంతములనూ, సెలయూటలనూ, అగ్ని వలె ప్రకాశించుచున్న బంగారు వృక్షములనూ చూచెను. 38

మూ. తేషాం ద్రుమాణాం ప్రభయా మేరోరివ దివాకరః,
అమన్యత తదా వీరః కాఞ్చనోఽస్మీతి వానరః. 39

ప్ర. అ. తదా=అప్పుడు, వీరః=వీరుడైన, వానరః=హనుమంతుడు, మేరోః=మేరుపర్వతముయొక్క, ప్రభయా=కాంతిచేత, దివాకరః ఇవ=సూర్యుడు వలె, తేషామ్=ఆ, ద్రుమాణామ్=వృక్షములయొక్క, ప్రభయా=కాంతిచేత, కాఞ్చనః=బంగారువికారమైనవాడను, అస్మి=అయి ఉన్నాను, ఇతి=అని, అమన్యత=తలచెను.

తా. "మేరుపర్వతము కాంతి సంక్రమించుటచే సూర్యుడు వలె, ఈ వృక్షముల కాంతి నాపై ప్రసరించుటచేత నేను బంగారు రంగుగలవాడ నైనాను" అని వీరుడైన హనుమంతుడు తలచెను. 39

మూ. తాం కాఞ్చనైస్తరుగణైర్మారుతేన చ వీజితామ్,
కిఙ్కిణీశతనిర్ఘోషాం దృష్ట్వా విస్మయమాగమత్. 40

ప్ర. అ. కాఞ్చనైః=బంగారువికారమైన, తరుగణైః=వృక్షసముదాయములచే చుట్టబడినదీ, మారుతేన=వాయువుచేత, వీజితామ్=వీచబడినదీ, కిఙ్కిణీ శతనిర్ఘోషామ్=వందల కొలది చిరుగంటల ధ్వని కలదీ అయిన, తామ్=ఆ శింశుపావృక్షమును, దృష్ట్వా=చూచి, విస్మయమ్=ఆశ్చర్యమును, ఆగమత్=పొందెను.

తా. ఆ శింశుపావృక్షము చుట్టూ అనేక బంగారు వృక్షములుండెను. గాలికి కదలి దానికి కట్టిన అనేకములైన చిరుగంటలు చప్పుడు చేయుచుండెను. అట్టి ఆ శింశుపావృక్షమును చూచి హనుమంతుడు ఆశ్చర్యము పొందెను. 40

మూ. స పుష్పితాగ్రాం రుచిరాం తరుణాఙ్కురపల్లవామ్,
తామారుహ్య మహాబాహుః శింశుపాం పర్ణసంవృతామ్. 41

ప్ర. అ. మహాబాహుః=గొప్ప బాహువులు గల, సః=హనుమంతుడు, పుష్పితాగ్రామ్=పుష్పించిన అగ్రభాగములు కలదీ, రుచిరామ్=సుందరమైనదీ, తరుణాఙ్కురపల్లవామ్=ముదిరిన అంకురములు చిగుళ్లూ కలదీ, పర్ణసంవృతామ్=ఆకులచే కప్పబడినదీ అయిన, తామ్=ఆ శింశుపావృక్షమును, ఆరుహ్య=ఎక్కి (ఇట్లనుకొనెను).

తా. మహాబాహువైన ఆ హనుమంతుడు పుష్పించిన శాఖాగ్రములతోను మనోహరమైన ముదిరిన అంకురములతోను, చిగుళ్ళతోను నిండియుండి, ఆకులతో దట్టముగా ఉన్న ఆ శింశుపావృక్షము నెక్కి ఇట్లు ఆలోచించెను. 41

మూ. ఇతో ద్రక్ష్యామి వైదేహీం రామదర్శనలాలసామ్,
ఇతశ్చేతశ్చ దుఃఖార్తాం సంపతన్తీం యదృచ్ఛయా. 42

ప్ర. అ. రామదర్శనలాలసామ్=రాముని దర్శనమునందు ఆసక్తి గల, వైదేహీమ్=సీతను, ఇతః=ఇటు వైపు, ద్రక్ష్యామి=చూచెదను. దుఃఖార్తామ్=దుఃఖపీడితురాలై, యదృచ్ఛయా=దైవవశముచేత, ఇతశ్చ ఇతశ్చ=ఇటు నటు, సంపతన్తీమ్=సంచరించుచుండగా (చూడగలను).

తా. రాముని చూచుటకై అత్యాసక్తితో ఉన్న సీత ఈ ప్రక్క కనబడవచ్చు నేమో ! దుఃఖపీడితురాలైన ఆ సీత ఇటు నటు తిరుగుచు దైవవశముచేత నాకు కనబడవచ్చునేమో ! 42

మూ. అశోకవనికా చేయం దృఢం రమ్యా దురాత్మనః,
చమ్పకైశ్చన్దనైశ్చాపి వకుళైశ్చ విభూషితా. 43

ప్ర. అ. దురాత్మనః=దుష్టాత్ముడైన రావణునియొక్క, ఇయమ్=ఈ, అశోకవనికా=అశోకవనము, దృఢమ్=నిశ్చితముగా, రమ్యా=సుందరమైనది. చమ్పకైః=సంపెంగచెట్లచేతను, చన్దనైశ్చ=మంచిగంధము చెట్లచేతను, వకుళైశ్చాపి=పొగడచెట్లచేతను, విభూషితా=అలంకరింపబడినది.

తా. దురాత్ముడైన రావణుని ఈ అశోకవనము, చంపకవృక్షములతోను, చందనవృక్షములతోను, వకుళవృక్షములతోను ఒప్పుచున్నది. చాల అందముగా నున్నది. 43

మూ. ఇయం చ నలినీ రమ్యా ద్విజసంఘనిషేవితా,
ఇమాం సా రామమహిషీ నూనమేష్యతి జానకీ. 44

ప్ర. అ. ద్విజసంఘనిషేవితా=పక్షిసముదాయముచేత సేవింపబడిన, ఇయమ్=ఈ, నలినీ చ=పద్మసరస్సు కూడ, రమ్యా=రమ్యముగా నున్నది. సా=ఆ, రామమహిషీ=రామునిభార్య యైన, జానకీ=జానకి, నూనమ్=తప్పక, ఇమామ్=దీనిని గూర్చి, ఏష్యతి=రాగలదు.

తా. పక్షిసమూహములచేత సేవింపబడుచున్న ఈ పద్మసరస్సు చాల రమ్యముగా ఉన్నది. రాముని పట్టపురాణియైన ఆ సీత, తప్పక దీనివద్దకు వచ్చును. 44

మూ. సా రామా రామమహిషీ రాఘవస్య ప్రియా సతీ,
వనసంచారకుశలా నూనమేష్యతి జానకీ. 45

ప్ర. అ. రామమహిషీ=రాముని భార్యా, రాఘవస్య=రామునియొక్క, ప్రియా=ప్రియురాలూ, సతీ=పతివ్రతా, రామా=మనోహరురాలూ, వనసంచారకుశలా=వనమునందు సంచరించుటయందు నేర్పు కలదీ అయిన, సా జానకీ=ఆ జానకి, నూనమ్=తప్పక, ఏష్యతి=రాగలదు.

తా. రామునకు అత్యంతప్రియురాలైన భార్యా, మనోహరురాలూ, పతివ్రతా, వనములో సంచరించుట యందు నేర్పు (ఆసక్తి) కలదీ అయిన జానకి తప్పక ఈ సరస్సుదగ్గరికి రాగలదు. 45

మూ. అథవా మృగశాబాక్షీ వనస్యాస్య విచక్షణా,
వనమేష్యతి సార్యేహ రామచిన్తానుకర్శితా. 46

ప్ర. అ. అథవా=లేదా, మృగశాబాక్షీ=లేడిపిల్ల కండ్లు వంటి కండ్లు కలదీ, అస్య=ఈ, వనస్య=వనమునకు (వనము విషయమున), విచక్షణా=నేర్పు గలదీ (పరిచయము గలదీ), రామచిన్తానుకర్శితా=రాముని గూర్చిన చింత చేత కృశింపచేయబడినదీ అయిన, సా=ఆ, ఆర్యా=పూజ్యురాలు, ఇహ=ఇక్కడ, వనమ్=ఉద్యానవనమును గూర్చి, ఏష్యతి=రాగలదు.

తా. రాముని గూర్చిన ఆలోచనలచే కృశించిపోయినదీ, చిన్న లేడి కళ్ల వంటి కళ్లు కలదీ అయిన ఆ పూజ్యురాలు, ఈ ఉద్యానవనముతో పరిచయము గలదగుటచే, ఈ ఉద్యానమువకు రాగలదు. 46

మూ. రామశోకాభిసంతప్తా సా దేవీ వామలోచనా,
వనవాసే రతా నిత్యమేష్యతే వనచారిణీ. 47

ప్ర. అ. రామశోకాభిసంతప్తా=రాముని గూర్చిన శోకముచే తపింపచేయ బడినదీ, వామలోచనా=సుందరమైన నేత్రములు గలదీ, నిత్యమ్=ఎల్లప్పుడూ, వనవాసే=వనవాసమునందు, రతా=ఆసక్తి గలదీ అయిన, సా=ఆ, దేవీ=దేవి, వనచారిణీ=ఈ ఉద్యానమునందు సంచరించనున్నదై, ఏష్యతే=రాగలదు.

తా. నిత్యము వనవాసమునందు ఆసక్తిగల సుందరనేత్రి యైన ఆ దేవి, రాముని గూర్చిన శోకముతో బాధపడుచు, ఉద్యానమునందు సంచరించుటకు ఇక్కడికి రాగలదు. 47

మూ. వనేచరాణాం సతతం నూనం స్పృహయతే పురా,
రామస్య దయితా భార్యా జనకస్య సుతా సతీ. 48

ప్ర. అ. రామస్య=రామునియొక్క, దయితా=ప్రియురాలైన, భార్యా=భార్యా, జనకస్య= జనకమహారాజుయొక్క, సుతా=కూతురూ, సతీ=పతివ్రతా అయిన సీత, పురా=పూర్వము, సతతమ్=ఎల్లప్పుడూ, వనేచరాణామ్=వనేచరుల విషయమున, స్పృహయతే=ఆసక్తి కలదిగా ఉండెడిది. నూనమ్=సత్యము.

తా. రామునకు అత్యంతప్రియురాలైన భార్యా, జనకుని కూతురూ అయిన ఆ సీత, పూర్వము అరణ్యావాససమయమునందు, వనములో సంచరించు పక్షిమృగాదుల విషయమున, సర్వదా, ప్రేమాసక్తులు కలదై ఉండెడిదను విషయము సత్యము. అందుచే ఆమె ఇక్కడికి రావచ్చును. 48

మూ. సన్ధ్యాకాలమనాః శ్యామా ధ్రువమేష్యతి జానకీ,
నదీం చేమాం శుభజలాం సన్ధ్యార్థే వరవర్ణినీ. 49

ప్ర. అ. శ్యామా=యౌవనమధ్యమునందున్న, వరవర్ణినీ=శ్రేష్ఠమైన దేహవర్ణము గల, జానకీ=సీత,. సన్ధ్యాకాలమనాః=సంధ్యాకాలమునందు మనస్సు కలదై, (సంధ్యాకాలమును గుర్తించి), శుభజలామ్=శుభకరమైన జలము గల, ఇమాం నదీమ్=ఈ నదిని గూర్చి, సన్ధ్యార్థే=సంధ్యోపాసనము నిమిత్తము, ధ్రువమ్=తప్పక, ఏష్యతి=రాగలదు.

తా. యౌవనమధ్యస్థురాలూ, మంచి శరీరవర్ణము గలదీ అయిన జానకి, సంధ్యాకాలమను విషయమును గుర్తించి, సంధ్యోపాసననిమిత్తము, తప్పక, పవిత్రజలములు గల ఈ నదికి రాగలదు. 49

మూ. తస్యాశ్చాప్యనురూపేయమశోకవనికా శుభా,
శుభా యా పార్థివేన్ద్రస్య పత్నీ రామస్య సంమతా. 50

ప్ర. అ. యా=ఏ సీత, పార్థివేన్ద్రస్య=రాజాధిరాజైన, రామస్య=రాముని యొక్క, సంమతా=ప్రియురాలైన, శుభా=మంగళప్రదురాలైన, పత్నీ=భార్యయో, తస్యాః=అట్టి సీతకు, శుభా=మంగళకరమైన, ఇయమ్=ఈ, అశోకవనికా=అశోకవనము, అనురూపాపి చ=అనురూపమైనది కూడ.

తా. మంగళకరమైన ఈ అశోకవనము రాజాధిరాజైన రామునికి అత్యంత ప్రేమాస్పదురాలైన భార్యా, శుభగుణసంపన్నురాలూ అయిన సీత నివసించుట తగినది. 50

మూ. యది జీవతి సా దేవీ తారాధిపనిభాననా,
ఆగమిష్యతి సావశ్యమిమాం శివజలాం నదీమ్. 51

ప్ర. అ. తారాధిపనిభావనా=చంద్రుని వంటి ముఖము గల, సా దేవీ=ఆ దేవి, జీవతి యది=జీవించి ఉన్నట్లయితే, సా=ఆమె, అవశ్యమ్=తప్పక, ఇమామ్=ఈ, శివజలామ్=పవిత్రజలము గల, నదీమ్=నదిని గూర్చి, ఆగమిష్యతి=రాగలదు.

తా. చంద్రబింబము వంటి ముఖము గల ఆ సీతాదేవి జీవించి ఉన్నట్లయితే, పవిత్ర జలము గల ఈ నదికి తప్పక రాగలదు. 51

మూ. ఏవం తు మత్వా హనుమాన్మహాత్మా
ప్రతీక్షమాణో మనుజేన్ద్రపత్నీమ్,
అవేక్షమాణశ్చ దదర్శ సర్వం
సుపుష్పితే పర్ణఘనే నిలీనః. 52

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే సున్దరకాణ్డే
చతుర్దశః సర్గః.

ప్ర. అ. మహాత్మా=మహాత్ముడైన, హనుమాన్=హనుమంతుడు, ఏవమ్=ఇట్లు, మత్వా=తలచి, మనుజేన్ద్రపత్నీమ్=రాజైన రాముని భార్యయైన సీతను, ప్రతీక్షమాణః=నిరీక్షించుచు, సుపుష్పితే=బాగుగా పుష్పించిన, పర్ణఘనే=ఆ

కుల సమూహమునందు, నిలీనః=అణగి ఉన్నవాడై, అవేక్షమాణశ్చ=నలుమూలల పరికించుచు, సర్వమ్=సమస్తమును, దదర్శ=చూచెను.

తా. మహాత్ముడైన హనుమంతుడీ విధముగా ఆలోచించి, సీత వచ్చునేమో అని ఎదురుచూచుచు, చాలా పుష్పములతో నిండిన దట్టమైన ఆకులు గల కొమ్మపై అణగి ఉన్నవాడై, నలుదిక్కులను పరిశీలించుచు, ఆ ప్రదేశము నంతను చూచెను. 52

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు
సుందరకాండలో పదునాల్గవ సర్గ సమాప్తము

అథ పఞ్చదశః సర్గః

[అశోకవనశోభను చూచుచు హనుమంతుడు చైత్యప్రాసాదము దగ్గర దయనీయస్థితిలో ఉన్న సీతను చూచి, ఆమె సీతయై ఉండునని ఊహించి సంతోషించుట].

మూ. స వీక్షమాణస్తత్రస్థో మార్గమాణశ్చ మైథిలీమ్,
అవేక్షమాణశ్చ మహీం సర్వాం తామన్వవైక్షత. 1

ప్ర. అ. సః=ఆ హనుమంతుడు, తత్రస్థః=అక్కడ నున్నవాడై, వీక్షమాణః=చూచుచు, మైథిలీమ్=సీతను, మార్గమాణః=వెదకుచు, అవేక్షమాణః=పరిశీలించుచు, సర్వామ్=సమస్తమైన, తాం మహీమ్=ఆ భూమిని, అన్వవైక్షత=పరీక్షించెను.

తా. హనుమంతుడు అక్కడనే ఉండి చూచుచు, సీతకై వెదకుచు, ఇటునటు పరిశీలించుచు, ఆ ప్రదేశమునంతను పరీక్షించెను. 1

మూ. సన్తానకలతాభిశ్చ పాదపైరుపశోభితామ్,
దివ్యగన్ధరసోపేతాం సర్వతః సమలంకృతామ్. 2

తాం స నన్దనసంకాశాం మృగపక్షిభిరావృతామ్,
హర్మ్యప్రాసాదసంబాధాం కోకిలాకులనిస్స్వనామ్. 3

కాఞ్చనోత్పలపద్మాభిర్వాపీభిరుపశోభితామ్,
బహ్వాసనకుథోపేతాం బహుభూమిగృహాయుతామ్. 4

సర్వర్తుకుసుమై రమ్యాం ఫలవద్భిశ్చ పాదపైః,
పుష్పితానామశోకానాం శ్రియా సూర్యోదయప్రభామ్. 5

ప్రదీప్తామివ తత్రస్థో మారుతిః సముదైక్షత,
నిష్పత్రశాఖాం విహగైః క్రియమాణామివాసకృత్. 6

వినిష్పతద్భిః శతశశ్చిత్రైః పుష్పావతంసకైః,
ఆమూలపుష్పనిచితైరశోకైః శోకనాశనైః. 7

పుష్పభారాతిభారైశ్చ స్పృశద్భిరివ మేదినీమ్,
కర్ణికారైః కుసుమితైః కింశుకైశ్చ సుపుష్పితైః. 8

ప్ర. అ. సః మారుతిః=ఆ హనుమంతుడు, తత్రస్థః=అక్కడ ఉన్నవాడై, సన్తానకలతాభిశ్చ=సంతానకలతలచేతను, (సంతానకము కల్పవృక్షములలో ఒకటి), పాదపైః=సంతానవృక్షములచేతను, ఉపశోభితామ్=ప్రకాశింపచేయబడినదీ, దివ్యగన్ధ రసోపేతామ్=శ్రేష్ఠమైన గంధముతోను, రసముతోను కూడినదీ, సర్వతః=అన్ని వైపులా, సమలంకృతామ్=అలంకరించబడినదీ, నన్దనసంకాశామ్=నందనవనముతో సమానమూ, మృగపక్షిభిః= మృగములచేతను, పక్షులచేతను, ఆవృతామ్=వ్యాప్తమూ, హర్మ్యప్రాసాద సంబాధామ్=మేడలతోను, ధనికుల గృహములతోను ఇరుకుగా ఉన్నదీ, కోకిలాకులనిస్స్వనామ్=వ్యాకులములైన కోకిల ధ్వనులు కలదీ, కాఞ్చనోత్పలపద్మాభిః=బంగారుకలువలూ పద్మములూ గల, వాపీభిః=దిగుడుబావులచేత, ఉపశోభితామ్= ప్రకాశింపచేయబడినదీ, బహ్వాసనకుథోపేతామ్=అనేకములైన ఆసనములతోను, నేలపై పరచుకొనే కంబళ్లతోను కూడినదీ, బహుభూమిగృహాయుతామ్=అనేకమైన భూగృహములతో కూడినదీ, సర్వర్తుకుసుమైః= సకల ఋతువులలో లభించు పుష్పములతోను, ఫలవద్భిః=ఫలములు గల, పాదపైః=వృక్షములతోను, రమ్యామ్=సుందరమైనదీ, పుష్పితానామ్=పుష్పించిన, అశోకానామ్=అశోకవృక్షములయొక్క, శ్రియా=కాంతిచేత, సూర్యోదయప్రభామ్= సూర్యోదయము వంటి కాంతి గలదీ, ప్రదీప్తామివ=ప్రజ్వలించుచున్నది వలె ఉన్నదీ, అసకృత్=మాటిమాటికి, వినిష్పతద్భిః=వాలుచున్న, శతశః=వందలకొలది, విహగైః=పక్షులచేత, నిష్పత్రశాఖామ్=ఆకులు లేని శాఖలు కలదిగా, క్రియమాణామ్ ఇవ=చేయబడుచున్నది వలె ఉన్నదీ, చిత్రైః=చిత్రవర్ణములు కల, పుష్పావతంసకైః=పుష్పములు శిరోభూషణములుగా కల, ఆమూలపుష్పనిచితైః= మొదళ్లవరకు పుష్పములచే వ్యాప్తమైన, శోక నాశనైః= శోకమును నశింపచేయు, అశోకైః=అశోకవృక్షములతోను, పుష్పభారాతిభారైశ్చ=పుష్పముల సముదాయముల అధిక మైన భారముచే, మేదినీమ్=భూమిని, స్పృశద్భిరివ=స్పృశించుచున్నవి వలె ఉన్న, కుసుమితైః=పుష్పించిన,కర్ణికారైః=కర్ణికారవృక్షములతోను, సుపుష్పితైః=బాగుగా పుష్పించిన, కింశుకైః=కింశుకవృక్షములతోను కూడినదీ అయిన, తామ్=ఆ అశోక వనికను, సముద్వీక్షత=పరిశీలనతో చూచెను.

తా. హనుమంతుడు అక్కడనే ఉండి ఆ అశోకవనము నంతను పరిశీలన పూర్వకముగా చూచెను. అది సంతానకలతలతోను, సంతానక వృక్షములతోను ప్రకాశించుచుండెను. శ్రేష్ఠములైన సువాసనలు, రసములూ వ్యాపించి ఉండెను. ఆ ఉద్యానము అలంకరింపబడి నందనవనము వలె ఒప్పుచుండెను. పెంపుడు మృగములు, పక్షులు సంచరించుచుండెను. మేడలతోను, ధనికుల భవనములతోను ఇరుకుగా ఉండెను. కోకిలధ్వనులతో వ్యాప్తమై బంగారు కలువలు, పద్మములూ

ఉన్న దిగుడుబావులతో ప్రకాశించుచుండెను. అక్కడక్కడ అనేకవిధములైన ఆసనములు, కంబళ్లు అమర్చి ఉండెను. కొన్నిచోట్ల భూగృహము లుండెను. అన్ని ఋతువులందు లభించు పుష్పములతోను, ఫలవృక్షములతోను రమ్యమైన ఆ అశోకవనిక, అశోకవృక్షములన్నీ పుష్పించి ఉండుటచే సూర్యోదయసమయ మునందలి కాంతి వంటి కాంతితో ఒప్పుచుండెను. మంటలతో నిండినట్లుండెను. వందలకొలది పక్షులు మాటిమాటికి వ్రాలుచుండుటచే కొమ్మలు ఆకులన్నీ రాల్చివేయుచున్నట్లుండెను. శాఖాగ్రములనుంచి మొదళ్ళవరకు పుష్పములతో నిండిన, శోకనాశకములైన అశోకవృక్షములతోను పుష్పముల బరువునకు వంగి నేలను స్పృశించుచున్న కర్ణికారవృక్షములతోను, బాగుగా పుష్పించిన కింశుకవృక్షములతోను నిండియుండెను. 2-8

మూ. స దేశః ప్రభయా తేషాం ప్రదీప్త ఇవ సర్వతః,
పున్నాగాః సప్తపర్ణాశ్చ చమ్పకోద్దాలకాస్తథా, 9
వివృద్ధమూలా బహవః శోభన్తే స్మ సుపుష్పితాః.

ప్ర. అ. తేషామ్=ఆ వృక్షములయొక్క, ప్రభయా=కాంతిచేత, సః=ఆ, దేశః=ప్రదేశము, సర్వతః=నలువైపుల, ప్రదీప్త ఇవ=మండుచున్నట్లున్నది. వివృద్ధ మూలాః=బాగా లావెక్కిన మొదళ్లు గల, సుపుష్పితాః=చక్కగా పుష్పించిన, పున్నాగాః=పున్నాగవృక్షములు, సప్తపర్ణాశ్చ=ఏడాకుల అరటిచెట్లు, తథా=మరియు, చమ్పకోద్దాలకాః=చంపకవృక్షములు, ఉద్దాలక వృక్షములు, శోభన్తే స్మ=ప్రకాశించు చుండెను.

తా. ఆ వృక్షముల కాంతిచేత ఆ ప్రదేశమంతా ప్రజ్వలించుచున్నట్లు ఉండెను. బాగా లావైన మొదళ్లతో, పుష్పసముదాయములతో, ఆ అశోక వనమునందు, పున్నాగవృక్షములు, ఏడాకుల అరటిచెట్లు, సంపెంగచెట్లు, విరిగిచెట్లు ప్రకాశించుచుండెను. 9

మూ. శాతకుమ్భనిభాః కేచిత్ కేచిదగ్నిశిఖోపమాః, 10
నీలాఞ్జననిభాః కేచిత్తత్రాశోకాః సహస్రశః.

ప్ర. అ. తత్ర=ఆ అశోకవనమునందు, సహస్రశః=వేలకొలదీ, అశోకాః= అశోకవృక్షములు, కేచిత్=కొన్ని, శాతకుమ్భనిభాః=బంగారముతో సమానమైనవీ, కేచిత్=కొన్ని, అగ్నిశిఖోపమాః=అగ్నిజ్వాలలతో సమానమైనవీ, కేచిత్=కొన్ని, నీలాఞ్జననిభాః=నీలమణితోను, కాటుకతోను సమానమైనవీ ఉండెను.

తా. అక్కడ ఉన్న వేలకొలది అశోకవృక్షములలో కొన్ని బంగారు వర్ణముతోను, కొన్ని అగ్నిజ్వాల వలెను, కొన్ని ఇంద్రనీలముల వలెను, కాటుక వలెను ఉండెను. 10

మూ. నన్దనం విబుధోద్యానం చిత్రం చైత్రరథం యథా, 11
అతివృత్తమివాచిన్త్యం దివ్యం రమ్యం శ్రియా వృతమ్.
ద్వితీయమివ చాకాశం పుష్పజ్యోతిర్గణాయుతమ్. 12
పుష్పరత్నశతైశ్చిత్రం ద్వితీయం సాగరం యథా,
సర్వర్తుపుష్పైర్నిచితం పాదపైర్మధుగన్ధిభిః. 13
నానానినాదైరుద్యానం రమ్యం మృగగణైర్ద్విజైః,
అనేకగన్ధప్రవహం పుణ్యగన్ధం మనోరమమ్. 14

ప్ర. అ. విబుధోద్యానమ్=దేవతల ఉద్యానమైన, నన్దనం యథా=నన్దనము వలె, చిత్రమ్=ఆశ్చర్యకరమైన, చైత్రరథం యథా=చైత్రరథమను కుబేరోద్యానము వలె, అతివృత్తమ్=అన్నింటినీ మించినదీ, అచిన్త్యమ్=ఊహింపశక్యము కానిదీ, దివ్యమ్=శ్రేష్ఠమైనదీ, రమ్యమ్=సుందర మైనదీ, శ్రియా=శోభతో, వృతమ్=కూడినదీ, పుష్పజ్యోతిర్గణాయుతమ్=నక్షత్రముల గణముల వంటి పుష్పములతో కూడినదీ కావుననే, ద్వితీయమ్=రెండవ, ఆకాశమివ=ఆకాశము వలె ఉన్నదీ, పుష్పరత్న శతైః=రత్నశతముల వంటి పుష్పములతో, చిత్రమ్=విచిత్రముగా ఉన్నదీ, కావుననే. ద్వితీయమ్=రెండవ, సాగరం యథా=సముద్రము వలె ఉన్నదీ, సర్వర్తుపుష్పైః=అన్ని ఋతువులకు సంబంధించిన పుష్పములతోను, మధుగన్ధిభిః=తేనె వాసన గల, పాదపైః=వృక్షములతోను, నిచితమ్=వ్యాప్తమూ, నానానినాదైః=అనేక విధములైన ధ్వనులు గల, మృగగణైః=మృగముల సముదాయములతోను, ద్విజైః=పక్షులతోను, రమ్యమ్=సుందరమైనదీ, అనేకగన్ధప్రవహమ్=అనేకము లైన వాసనలను వీచుచున్నదీ, పుణ్యగన్ధమ్=పుణ్య మైన గంధము గలదీ, మనోరమమ్=మనోహరమూ అయిన ఉద్యానమును, (హనుమంతుడు చూచెను).

తా. దేవేంద్రుని నందనము వలె, కుబేరుని విచిత్రమైన చైత్రరథము వలె, అన్ని ఉద్యానములనూ మించునట్టి శ్రేష్ఠమైన ఆ అశోకవనమను ఉద్యానమును హనుమంతుడు జూచెను. ఆ ఉద్యానము ఊహించుటకు కూడ శక్యము కాని విధమున సుందరముగా శోభించుచుండెను. నక్షత్రగణములవంటి పుష్పములతో రెండవ ఆకాశము వలె, రత్నముల వంటి వందలాది పుష్పములతో రెండవ సముద్రము వలె కనబడుచుండెను. అన్ని ఋతువులందును లభించు

పుష్పములతోను, తేనె సువాసనలతో కూడిన వృక్షములతోను నిండి ఉండెను. అక్కడ, మృగములు పక్షులు అనేక విధములైన ధ్వనులు చేయుచుండెను. సుగంధముతో నిండి, మనోహరముగా నున్న ఆ ఉద్యానములో అనేక విధములగు గంధములు ప్రవహించుచున్నట్లు ఉండెను. 11-14

మూ. శైలేన్ద్రమివ గన్ధాఢ్యం ద్వితీయం గన్ధమాదనమ్,
అశోకవనికాయాం తు తస్యాం వానరపుఙ్గవః. 15
స దదర్శావిదూరస్థం చైత్యప్రసాదముచ్ఛ్రితమ్,
మధ్యే స్తమ్భసహస్రేణ స్థితం కైలాసపాణ్డురమ్. 16
ప్రవాళకృతసోపానం తప్తకాఞ్చనవేదికమ్.
ముష్ణన్తమివ చక్షూంషి ద్యోతమానమివ శ్రియా. 17
విమలం ప్రాంశుభావత్వాదుల్లిఖన్తమివామ్బరమ్.

ప్ర. అ. సః వానరపుఙ్గవః=ఆ వానరశ్రేష్ఠుడు, తస్యామ్=ఆ, అశోకవనికాయామ్=అశోకవనికయందు, మధ్యే= మధ్యయందు, గన్ధాఢ్యామ్=సువాసనతో నిండినదీ, ద్వితీయమ్=రెండవ, గన్ధమాదనమివ=గంధమాదనపర్వతము వలె ఉన్నదీ, స్తమ్భసహస్రేణ=వేయి స్తంభములతో, స్థితమ్=నిలచినదీ, కైలాసపాణ్డురమ్=కైలాసము వలె తెల్లనిదీ, ప్రవాళకృతసోపానమ్=పగడములతో చేయబడిన మెట్లు కలదీ, తప్తకాఞ్చనవేదికమ్=కాల్చి శుద్ధిచేసిన బంగారు అరుగులు గలదీ, శ్రియా=శోభతో, ద్యోతమానమివ=ప్రజ్వలించుచున్నది వలె ఉన్నదీ, విమలమ్=నిర్మలమూ, ప్రాంశుభావత్వాత్=ఉన్నతముగా ఉండుటవలన, అమ్బరమ్=ఆకాశమును, ఉల్లిఖన్తమివ=ఒరయుచున్నట్లున్నదీ అయిన, అవిదూరస్థమ్=దగ్గరగానే ఉన్న, ఉచ్ఛ్రితమ్=ఎత్తైన, చైత్యప్రాసాదమ్=చైత్యప్రాసాదమును, దదర్శ=చూచెను.

తా. హనుమంతుడు ఆ అశోకవనమధ్యమునందు, తానున్న వృక్షమునకు దగ్గరగా, సుగంధభరితమై రెండవ గంధమాదనపర్వతము వలె ఉన్న, ఉన్నతమైన చైత్యప్రాసాదమును చూచెను. కైలాసము వలె తెల్లగా ఉన్న ఆ ప్రాసాదము వేయి స్తంభములపై నిలచి ఉండెను. దానియందు పగడములతో మెట్లూ, శుద్ధమైన బంగారముతో తిన్నెలు ఏర్పరుపబడి ఉండెను. కాంతితో ప్రజ్వలించుచున్న ఆ ప్రాసాదము కనులకు మిరుమిట్లు కొలుపుచుండెను. నిర్మలమైన ఆ ప్రాసాదము అత్యున్నతమగుటచే ఆకాశమును ఒరయుచున్నట్లు ఉండెను.

వి. చైత్యశబ్దమునకు చాలా అర్థములు ఉన్నవి. రాజవీథులలో ఉండే పవిత్రవృక్షములు, గ్రామాదుల సరిహద్దులలోని రాతికట్టడములు, మృతుల అస్థ్యాదులుంచిన కట్టడములు, దేవాలయములు, జైనబౌద్ధాలయములు, సార్వ

జనికోద్యానాదులలోని కట్టడములు మొదలైన అర్థాలలో దాని ప్రయోగము కనబడుచున్నది. ఇక్కడ ఒక పెద్ద రాతికట్టడము అను అర్థము గ్రహించవలెను. ("చైత్యం పాషాణాదిబన్ధః" అని యాజ్ఞవల్క్యస్మృతివ్యాఖ్యా 11-151) ఇది అశోకవనమధ్యమున ఉద్యానవిహారమునకై వచ్చువారి విశ్రాంత్యాదులకు, రక్షకభటాదుల నివాసమునకు కట్టబడిన ప్రాసాదము. రామాయణకాలం నాటికి బౌద్ధమతం లేదు గాన బౌద్ధచైత్యముల వంటి కట్టడము అను ప్రాచీనవ్యాఖ్యాతల వ్యాఖ్య ఉపేక్షణీయము. 15-17

మూ. తతో మలినసంవీతాం రాక్షసీభిః సమావృతామ్, 18
ఉపవాసకృశాం దీనాం నిశ్శ్వసన్తీం పునః పునః,
దదర్శ శుక్లపక్షాదౌ చన్ద్రరేఖామివామలామ్. 19

ప్ర. అ. తతః=అటుపిమ్మట, (హనుమంతుడు), మలినసంవీతామ్=మలినమైన వస్త్రమును చుట్టబెట్టుకొన్నదీ, రాక్షసీభిః=రాక్షసస్త్రీలచేత, సమావృతామ్=చుట్టువారుకొనబడినదీ, ఉపవాసకృశామ్= ఉపవాసముచే కృశించినదీ, దీనామ్=దీనురాలూ, పునః పునః=మాటిమాటికి, నిశ్శ్వసన్తీమ్=నిట్టూర్చుచున్నదీ, శుక్లపక్షాదౌ=శుక్లపక్షప్రారంభమునందలి, అమలామ్=నిర్మలమైన, చన్ద్రరేఖామివ=చంద్రరేఖ వలె ఉన్నదీ అయిన ఒక స్త్రీని, దదర్శ=చూచెను. (18 వ శ్లోకము మొదలు 25 1/2 శ్లోకమువరకు ఒకటే అన్వయము, వీటిలో సీత వర్ణింపబడినది.)

తా. ఇంతలో హనుమంతునకు, మలినమైన వస్త్రములు చుట్టబెట్టుకొని, రాక్షసస్త్రీల మధ్య ఉన్న ఒక యువతి కనబడెను. ఆహారము తినకపోవుటచే కృశించి, దీనురాలైన ఆమె మాటి మాటికి నిట్టూర్చుచుండెను. శుక్లపక్షప్రారంభమునందలి చంద్రరేఖవలె నిర్మలముగా, సన్నగా ఉండెను. 18, 19

మూ. మన్దప్రఖ్యాయమానేన రూపేణ రుచిరప్రభామ్,
పినద్ధాం ధూమజాలేన శిఖామివ విభావసోః. 20

ప్ర. అ. మన్దప్రఖ్యాయమానేన=మెల్లగా పైకి కనబడుచున్న, రూపేణ=రూపముతో, ధూమజాలేన= ధూమసముదాయముచేత, పినద్ధామ్=కప్పబడిన, రుచిరప్రభామ్=అందమైన కాంతిగల, విభావసోః=అగ్నియొక్క, శిఖామివ=జ్వాల వలె ఉన్న (ఆమెను చూచెను).

తా. ఆమె రూపవతియే యైనను ఆ రూపము స్పష్టముగా కనబడుట లేదు. అందుచేత ఆమె, పొగలో కప్పబడిపోయిన అందమైన కాంతి గల అగ్నిజ్వాల వలె ఉండెను. 20

మూ. పీతేనైకేన సంవీతాం క్లిష్టేనోత్తమవాససా,
సపఙ్కామనలఙ్కారాం విపద్మామివ పద్మినీమ్. 21

ప్ర. అ. క్లిష్టేన=నలిగిపోయిన, పీతేన=పచ్చని, ఏకేన=ఒక, ఉత్తమవాససా= ఉత్తమ మైన వస్త్రముచేత, సంవీతామ్=చుట్టబడినదీ, అనలఙ్కారామ్=అలంకారములు లేనిదీ, కావుననే, సపఙ్కామ్=పంకముతో కూడిన, విపద్మామ్=పద్మములు లేని, పద్మినీమివ=పద్మలత వలె ఉన్నదీ అయిన (ఒక యువతిని చూచెను).

తా. ఏ అలంకారములూ లేని ఆమె నలిగిపోయిన ఒక పచ్చని ఉత్తమ వస్త్రమును శరీరమునకు చుట్టబెట్టుకొని, పద్మములు లేనిదీ, బురదతో కూడినదీ అయిన పద్మలత వలె ఉండెను. 21

మూ. వ్రీడితాం దుఃఖసంతప్తాం పరిమ్లానాం తపస్వినీమ్,
గ్రహేణాఙ్గారకేణేవ పీడితామివ రోహిణీమ్. 22

ప్ర. అ. వ్రీడితామ్=సిగ్గుపడుచున్నదీ, దుఃఖసంతప్తామ్=దుఃఖము చేత తపింపచేయబడినదీ, పరిమ్లానామ్= వాడిపోయినదీ, తపస్వినీమ్=శోచనీయురాలూ, అఙ్గారకేణ గ్రహేణ=అంగారకగ్రహముచేత, పీడితామ్=పీడించబడిన, రోహిణీమ్ ఇవ=రోహిణి వలె ఉన్నదీ (అయిన ఒక యువతిని చూచెను).

తా. దుఃఖపీడితురాలై, వాడిపోయిన శరీరచ్ఛాయతో దయనీయస్థితిలో ఉన్న ఆమె సిగ్గుతో తలవంచుకొని కూర్చుండెను. అంగారకగ్రహముచేత పీడింపబడిన రోహిణీ నక్షత్రము వలె, కాంతిశూన్యురాలై ఉండెను. 22

మూ. అశ్రుపూర్ణముఖీం దీనాం కృశామనశనేన చ,
శోకధ్యానపరాం దీనాం నిత్యం దుఃఖపరాయణామ్. 23

ప్ర. అ. అశ్రుపూర్ణముఖీమ్=కన్నీళ్ళతో నిండిన ముఖము గలదీ, దీనామ్=దీనురాలూ, అనశనేన=ఆహారము తినకపోవుటచే, కృశామ్=కృశించినదీ, శోకధ్యానపరామ్=శోకముతో ఏదో ఆలోచనలో మునిగి యున్నదీ, నిత్యమ్= ఎల్లప్పుడూ, దీనామ్=దీనురాలూ, దుఃఖపరాయణామ్=దుఃఖమునకు వశమై పోయినదీ అయిన (ఒక వనితను చూచెను).

తా. ఆమె కన్నీళ్లు కారుచున్న ముఖముతో దీనురాలై, ఆహారము భుజించకపోవుటచేత కృశించి ఉండెను. తొలగని దైన్యముతో, శోకముచేత ఏమేమో ఆలోచనలలో మునిగి దుఃఖాక్రాంతురాలై ఉండెను. 23

మూ. ప్రియం జనమపశ్యన్తీం పశ్యన్తీం రాక్షసీగణమ్,
స్వగణేన మృగీం హీనాం శ్వగణాభివృతామివ. 24

ప్ర. అ. ప్రియమ్=తనకు ఇష్టమైన, జనమ్=జనమును, అపశ్యన్తీమ్=చూడనిదీ, రాక్షసీగణమ్=రాక్షసస్త్రీల సముదాయమును, పశ్యన్తీమ్=చూచుచున్నదీ, స్వగణేన=తనకు సంబంధించిన మృగసముదాయముతో, హీనామ్= హీనురాలై, శ్వగణాభివృతామ్=కుక్కల గుంపుచేత చుట్టుముట్టబడిన, మృగీమ్ ఇవ=ఆడలేడి వలె ఉన్న (ఒక యువతిని చూచెను).

తా. తనకు కావలసిన బంధుజనమెవ్వరూ కనబడక, రాక్షసీగణమునే నిరంతరమూ చూచుచు వాళ్ళ మధ్య నున్న ఆమె స్వజాతీయములైన లేళ్ళకు దూరమై, కుక్కల గుంపు చుట్టుముట్టిన ఆడలేడి వలె ఉండెను. 24

మూ. నీలనాగాభయా వేణ్యా జఘనం గతయైకయా,
నీలయా నీరదాపాయే వనరాజ్యా మహీమివ. 25
సుఖార్హాం దుఃఖసంతప్తాం వ్యసనానామకోవిదామ్.

ప్ర. అ. జఘనమ్=జఘనప్రదేశమును, గతయా=పొందిన, ఏకయా=ఒక, నీలనాగాభయా=నల్లత్రాచుపాము వంటి కాంతి గల, వేణ్యా=జడతో, నీరదాపాయే=వర్షాకాలాంతమునందు, నీలయా=నీలవర్ణ మైన, వనరాజ్యా= వృక్షపంక్తితో, మహీమివ=భూమి వలె ఉన్నదీ, సుఖార్హామ్=సుఖమునకు తగినదీ, దుఃఖసంతప్తామ్=దుఃఖముచేత పీడింపబడినదీ, వ్యసనానామ్=కష్టములకు, అకోవిదామ్=పరిచితురాలు కానిదీ అయిన (ఒక యువతిని చూచెను.)

తా. కటిప్రదేశమువరకు వ్రేలాడుచున్న, నల్లత్రాచు వంటి ఒక్కజడతో, ఆమె వర్షాకాలాంతమునందు నల్లని వృక్షపంక్తితో కూడిన భూమి వలె ఉండెను. ఎన్నడు ఇట్టి కష్టము లనుభవించి ఎరుగక, సుఖములనుభవించుటకే తగిన ఆమె దుఃఖముచే పీడితురాలై ఉండెను. 25

మూ. తాం సమీక్ష్య విశాలాక్షీమధికం మలినాం కృశామ్, 26
తర్కయామాస సీతేతి కారణైరుపపాదిభిః.

ప్ర. అ. విశాలాక్షీమ్=విశాలములైన నేత్రములు గలదీ, అధికమ్=అధికముగా, మలినామ్=మాలిన్యముతో కూడినదీ, కృశామ్=కృశించినదీ అయిన, తామ్=ఆమెను, సమీక్ష్య=చూచి, ఉపపాదిభిః=ఉపపన్నము లైన (యుక్తికి సరిపోవునట్టి), కారణైః=కారణములచేత, సీతేతి=సీత అని, తర్కయామాస=ఊహించెను.

తా. పూర్తిగా మాసిపోయి, కృశించియున్న ఆ విశాలాక్షియైన యువతిని చూచి హనుమంతుడు యుక్తియుక్తములైన హేతువులచే, ఆమె సీతయై ఉండునని ఊహించెను. 26

మూ. హ్రియమాణా తదా తేన రక్షసా కామరూపిణా, 27
యథారూపా హి దృష్టా వై తథారూపేయమఙ్గనా.

ప్ర. అ. తదా=అప్పుడు, కామరూపిణా=ఇచ్ఛానుసారము రూపము గ్రహించు శక్తి గల, తేన రక్షసా=ఆ రాక్షసునిచేత, హ్రియమాణా=హరింపబడు చున్నదై, యథారూపా=ఎట్టిరూపము గలదిగా, దృష్టా=చూడబడినదో, ఇయమ్=ఈ, అఙ్గనా=స్త్రీ, తథారూపా=అట్టి రూపము కలది.

తా. ఆనాడు కామరూపియైన ఆ రాక్షసునిచే అపహరింపబడుచున్న స్త్రీ ఎట్టి రూపముతో ఉండెనో, అట్టి రూపముతోనే ఈ స్త్రీ ఉన్నది. 27

మూ. పూర్ణచన్ద్రాననాం సుభ్రూం చారువృత్తపయోధరామ్, 28
కుర్వతీం ప్రభయా దేవీం సర్వా వితిమిరా దిశః.

తాం నీలకేశీం బిమ్బోష్ఠీం సుమధ్యాం సుప్రతిష్ఠితామ్, 29
సీతాం పద్మపలాశాక్షీం మన్మథస్య రతిం యథా.

ప్ర. అ. పూర్ణచన్ద్రాననామ్=పూర్ణచంద్రుని వంటి ముఖము గలదీ, సుభ్రూమ్=అందమైన కనుబొమ్మలు కలదీ, చారువృత్తపయోధరామ్=అందము గాను వర్తులాకారముగాను ఉన్న స్తనములు గలదీ, సర్వాః=సమస్తమైన, దిశః=దిక్కులను, ప్రభయా=కాంతిచేత, వితిమిరాః=చీకటి లేనివాటినిగా, కుర్వతీమ్=చేయుచు, దేవీమ్=దేదీప్యమానముగా ఉన్నదీ, నీలకేశీమ్=నల్లని కేశములు కలదీ, బిమ్బోష్ఠీమ్=దొండపండు వంటి పెదవులు కలదీ, సుమధ్యామ్=మంచి నడుము గలదీ, సుప్రతిష్ఠితామ్=చాల స్థిర మైనదీ, పద్మపలాశాక్షీమ్=తామరేకుల వంటి నేత్రములు గలదీ, మన్మథస్య=మన్మథునియొక్క, రతిం యథా=రతిదేవి వలె ఉన్న, సీతామ్=సీతను (చూచెను).

తా. హనుమంతుడు అక్కడ, పూర్ణచంద్రుని వంటి ముఖము, అందమైన కనుబొమ్మలు, సుందరములూ వర్తులాకారములూ అయిన పయోధరములూ గల సీతను చూచెను. దేదీప్యమానముగా ఉన్న ఆమె తన కాంతిచేత అన్ని దిక్కులనుండీ చీకటిని పోగొట్టుచుండెను. నల్లని కేశములు, దొండపండు వంటి పెదవులు, అందమైన నడుము, పద్మపత్రముల వంటి నేత్రములు గల ఆ సీత

మన్మథుని భార్య యైన రతి వలె ఉండెను. ఆమె పాతివ్రత్యధర్మమునందు స్థిరముగా నిలచి ఉండెను. 28, 29

మూ. ఇష్టాం సర్వస్య జగతః పూర్ణచన్ద్రప్రభామివ, 30
భూమౌ సుతనుమాసీనాం నియతామివ తాపసీమ్.

ప్ర. అ. (37 వ శ్లోకము వరకు ఉన్న శ్లోకములలోని ద్వితీయాంతములు "సీతామ్" అనుదానికి విశేషణములు. ఆ యా విధములలో ఉన్న సీతను చూచెను అని అన్వయము). పూర్ణచన్ద్రప్రభామివ=పూర్ణచంద్రుని వెన్నెల వలె, సర్వస్య=సమస్త మైన, జగతః=జగత్తుకు, ఇష్టామ్=ఇష్టురాలూ, నియతామ్=నియమవంతురాలైన, తాపసీమివ=తపస్సులో ఉన్న స్త్రీ వలె, భూమౌ=నేల పైన, ఆసీనామ్=కూర్చున్నదీ, సుతనుమ్=మంచి శరీరము గలదీ (అయిన సీతను చూచెను).

తా. పూర్ణచంద్రుని కాంతి వలె ఆమె సకల ప్రాణులకును ఇష్టురాలైనది. మంచి శరీరము గల ఆమె నియమము పాటించుచున్న ఒక తాపసి వలె నేలపై కూర్చుండెను. 30

మూ. నిఃశ్వాసబహులాం భీరుం భుజగేన్ద్రవధూమివ, 31
శోకజాలేన మహతా వితతేన న రాజతీమ్.

ప్ర. అ. భీరుమ్=భయపడుచున్న, భుజగేన్ద్రవధూమివ=ఆడసర్పము వలె, నిఃశ్వాసబహులామ్=అధికమైన నిట్టూర్పులు గలదీ, మహతా=గొప్ప దైన, వితతేన=విస్తృతమైన, శోకజాలేన=శోక సముదాయముచేత, న రాజతీమ్=ప్రకాశించకుండా ఉన్నదీ (అయిన సీతను చూచెను).

తా. సీత భయపడుచున్న ఆడసర్పము వలె అధికముగా నిట్టూర్చుచుండెను. అత్యధిక మైన దుఃఖసముదాయములో చిక్కుకొని యుండుటచే ప్రకాశవిహీనురాలై ఉండెను. 31

మూ. సంసక్తాం ధూమజాలేన శిఖామివ విభావసోః, 32
తాం స్మృతీమివ సన్దిగ్ధామృద్ధిం నిపతితామివ.

ప్ర. అ. ధూమజాలేన=ధూమపంక్తితో, సంసక్తామ్=కలిసిన, విభావసోః=అగ్నియొక్క, శిఖామివ=జ్వాల వలె ఉన్నదీ, సన్దిగ్ధామ్=సందేహముతో కూడిన, స్మృతీమివ=స్మరణశక్తి వలె ఉన్నదీ, నిపతితామ్=పడిపోయిన, బుద్ధిమివ=సద్బుద్ధి వలె ఉన్నదీ అయిన, తామ్=ఆమెను (చూచెను).

తా. ఆ సీత ధూమముతో కలిసిపోయిన అగ్నిజ్వాల వలె, సందేహముతో నిండిన స్మరణశక్తి వలె, నశించిన సమృద్ధి వలె ఉండెను. 32

మూ. విహతామివ చ శ్రద్ధామాశాం ప్రతిహతామివ, 33
సోపసర్గాం యథా సిద్ధిం బుద్ధిం సకలుషామివ.

ప్ర. అ. విహతామ్=కొట్టబడిన, శ్రద్ధామివ=శ్రద్ధవలె ఉన్నదీ, ప్రతి హతామ్=అడ్డుకొనబడిన, ఆశామివ=ఆశ వలె ఉన్నదీ, సోపసర్గామ్=విఘ్నములతో కూడిన, సిద్ధిమివ=కార్యసిద్ధి వలె ఉన్నదీ, సకలుషామ్=కాలుష్యముతో కూడిన, బుద్ధిమివ=బుద్ధివలె ఉన్నదీ, (అయిన ఆ సీతను చూచెను).

తా. ఆ సీత దెబ్బ తిన్న శ్రద్ధ వలె, అడ్డులు తగిలిన ఆశ వలె, విఘ్నము కలిగిన కార్యసిద్ధి వలె, కాలుష్యముతో కూడిన (నిర్మలముగా లేని) బుద్ధి వలె ఉండెను. 33

మూ. అభూతేనాపవాదేన కీర్తిం నిపతితామివ, 34
రామోపరోధవ్యథితాం రక్షోహరణకర్శితామ్.

ప్ర. అ. అభూతేన=సత్యము కాని, అపవాదేన=అపవాదచేత, నిపతి తామ్=పడిపోయిన, కీర్తిమివ=కీర్తి వలె ఉన్నదీ, కామోపరోధవ్యథితామ్=రామునికి కలిగిన కష్టముచే బాధపడుచున్నదీ, రక్షోహరణకర్శితామ్=రాక్షసుడు (తనను) హరించుటచే కృశింపచేయుబడినదీ అయిన (సీతను చూచెను)

తా. రామునకు కలిగిన కష్టములకు వ్యథ చెందుచు, రావణునిచే అపహరింపబడుటచే కృశించిపోయిన ఆ సీత అసత్యములైన దోషములను ఆరోపించుటచే దెబ్బ తిన్న కీర్తి వలె ఉండెను. 34

మూ. అబలాం మృగశాబాక్షీం వీక్షమాణాం తతస్తతః, 35
బాష్పాంబుపరిపూర్ణేన కృష్ణవక్రాక్షిపక్ష్మణా,
వదనేనాప్రసన్నేన నిఃశ్వసన్తీం పునః పునః. 36

ప్ర. అ. మృగశాబాక్షీమ్=లేడిపిల్ల నేత్రముల వంటి నేత్రములు కలదీ, బాష్పాంబుపరిపూర్ణేన=కన్నీళ్లతో నిండిన, కృష్ణవక్రాక్షిపక్ష్మణా=నల్లని వంకరగా నున్న కనురెప్పలు గల, అప్రసన్నేన=ప్రసన్నముగా లేని, వదనేన=ముఖముతో, తతస్తతః=ఇటు నటు, వీక్షమాణామ్=చూచుచున్నదీ, అబలామ్=దుర్బలురాలూ అయిన (సీతను చూచెను)

తా. లేడిపిల్ల కళ్ళ వంటి కళ్లు గల ఆ సీత కన్నీళ్ళతో నిండిన, నల్లని వంకర యైన కనురెప్పలు గల, కలతచెందిన ముఖముతో ఇటు నటు చూచుచుండెను. మాటిమాటికి నిట్టూర్పులు విడచుచుండెను. 35, 36

మూ. మలపఙ్కధరాం దీనాం మణ్డనార్హామమణ్డితామ్,
ప్రభాం నక్షత్రరాజస్య కాలమేఘైరివావృతామ్. 37

ప్ర. అ. మలపఙ్కధరామ్=మాలిన్యమును పంకమును ధరించినదీ, దీనామ్=దీనురాలూ, మణ్డనార్హామ్=అలంకారములకు తగినది, అమణ్డితామ్= అలంకరించబడనిదీ, కాలమేఘైః=నల్లని మేఘములచేత, ఆవృతామ్=కప్పబడిన, నక్షత్రరాజస్య=చంద్రునియొక్క, ప్రభామివ=కాంతి వలె ఉన్నదీ (అయిన సీతను చూచెను).

తా. స్నానాదిసంస్కారములు లేకపోవుటచే ఆమె శరీరము మాలిన్యము తోను, పంకముతోను నిండియుండెను. అలంకరించుకొనుటకు తగిన ఆమె ఎట్టి అలంకారములూ లేక, దీనురాలై, నల్లని మేఘములచే కప్పివేయబడిన చంద్రుని కాంతి వలె ఉండెను. 37

మూ. తస్య సందిదిహే బుద్ధిర్ముహుః సీతాం నిరీక్ష్య తు,
ఆమ్నాయానామయోగేన విద్యాం ప్రశిథిలామివ. 38

ప్ర. అ. ఆమ్నాయానామ్=ఆవృత్తులయొక్క, (మళ్ళీ మళ్ళీ చదువుట ఆవృత్తి) అయోగేన=సంబంధము లేకపోవుటచేత, ప్రశిథిలామ్=శిథిలమై పోయిన, విద్యామివ=విద్య వలె ఉన్న, సీతామ్=సీతను, నిరీక్ష్య=చూచి, తస్య=హనుమంతునియొక్క, బుద్ధిస్తు=బుద్ధి యైతే, ముహుః=మాటిమాటికి, సందిదిహే=సందేహించెను.

తా. సరియైన ఆవృత్తులు చేయకపోవుటచే గట్టిపడని విద్య వలె ఉన్న సీతను చూచిన ఆ హనుమంతుని మనస్సులో, ఈమె సీతయా కాదా అను సందేహము మాటిమాటికి ఉదయించెను. 38

మూ. దుఃఖేన బుబుధే సీతాం హనుమాననలంకృతామ్,
సంస్కారేణ యథా హీనాం వాచమర్థాన్తరం గతామ్. 39

ప్ర. అ. హనుమాన్=హనుమంతుడు, అనలంకృతామ్=అలంకరింపబడనిదీ, సంస్కారేణ=సంస్కారముతో, హీనామ్=శూన్యమై, అర్థాన్తరమ్=(చెప్పదలచుకొన్న

అర్థము కాక) మరి యొక అర్థమును, గతామ్=పొందిన, వాచమ్ యథా=వాక్కువలె ఉన్నదీ అయిన, సీతామ్=సీతను, దుఃఖేన=అతి కష్టముచేత, బుబుధే=గుర్తించెను.

తా. సంస్కారము (వర్ణోచ్చారణవ్యాకరణాది సౌష్ఠవము) లేకపోవుటచే చెప్పదలచిన అర్థమునకు భిన్నముగా మరొక అర్థము బోధించు వాక్కును శ్రమపడి అర్థము చేసి కొన్నట్లు, హనుమంతుడు, అలంకారవిహీనయై ఉన్న ఆ సీతను అతికష్టము మీద గుర్తించెను. 39

మూ. తాం సమీక్ష్య విశాలాక్షీం రాజపుత్రీమనిన్దితామ్,
తర్కయామాస సీతేతి కారణైరుపపాదిభిః. 40

ప్ర. అ. విశాలాక్షీమ్=విశాలములైన నేత్రములు గల, అనిన్దితామ్=నిందింపబడని, తాం రాజపుత్రీమ్=ఆ రాజకుమారిని, సమీక్ష్య=చూచి, ఉపపాదిభిః=ఉపపన్నములైన, కారణైః=హేతువులచేత, సీతేతి=సీత అని, తర్కయామాస=ఊహించెను.

తా. విశాలము లైన నేత్రములు గల, దోషరహితురా లైన ఆ రాజకుమారిని చూచి, హనుమంతుడు, యుక్తి యుక్తములైన హేతువులచే, ఆమె సీతయే అని ఊహించెను. 40

మూ. వైదేహ్యా యాని చాఙ్గేషు తదా రామోఽన్వకీర్తయత్,
తాన్యాభరణజాలాని గాత్రశోభీన్యలక్షయత్. 41
సుకృతౌ కర్ణవేష్టౌ చ శ్వదంష్ట్రౌ చ సుసంస్థితౌ,
మణివిద్రుమచిత్రాణి హస్తేష్వాభరణాని చ, 42
శ్యామాని చిరయుక్తత్వాత్తథా సంస్థానవన్తి చ.

ప్ర. అ. తదా=అప్పుడు, రామః=రాముడు, యాని=ఏ, ఆభరణజాలాని=ఆభరణముల సముదాయములను, వైదేహ్యాః=సీతయొక్క, అఙ్గేషు=అవయవములందు ఉన్నవాటినిగా, అన్వకీర్తయత్=చెప్పెనో, గాత్రశోభీని=అవయవములందు శోభించుచున్న, తాని=వాటిని, అలక్షయత్=చూచెను. సుకృతౌ=చక్కగా తయారుచేయబడిన, కర్ణవేష్టౌ చ=కుండలములను, సుసంస్థితౌ=బాగుగా అమరి ఉన్న, శ్వదంష్ట్రౌ చ=శ్వదంష్ట్రములు అను కర్ణాభరణములను, హస్తేషు=ముంజేయి, భుజములు మొదలైన హస్తస్థానములందు, మణి విద్రుమచిత్రాణి=మణులతోను, పొగడములతోను చిత్రము లై ఉన్న, ఆభరణాని చ=ఆభరణములను, చిరయుక్తత్వాత్=చిరకాలము శరీరముతో సంబంధించి ఉండుటచేత, శ్యామాని=నల్లబడినవీ, సంస్థానవన్తి చ=ముద్రలుకలవీ (శరీరము మీద తమ ముద్రలు పడునట్లు చేసినవీ) అయిన, అలంకారములను చూచెను.

తా. ఆ నాడు రాముడు, సీత శరీరముమీద ఏ యే అలంకారములున్న వని చెప్పెనో ఆ అలంకారములు ఆమె అవయవములమీద ప్రకాశించుచుండెను. చక్కగా తయారుచేసిన కుండలములు, బాగుగా అమరి ఉన్న శ్వదంష్ట్రము లను కర్ణాభరణములూ, హస్తములపై ధరించు, మణులతోను పొగడములతోను విచిత్రములైన ఆభరణములూ, వీటి నన్నింటినీ హనుమంతుడు చూచెను. చాల కాలము పాటు తీయకుండగా సీత శరీరముమీదనే ఉండుటచే అవి కొంచెము మాసిపోయెను. వాటి ముద్రలు కూడ ఆమె అవయవములపై పడెను. 41, 42

మూ. తాన్యేవైతాని మన్యేఽహం యాని రామోఽన్వకీర్తయత్. 43
తత్ర యాన్యవహీనాని తాన్యహం నోపలక్షయే,
యాన్యస్యా నావహీనాని తానీమాని న సంశయః. 44

ప్ర. అ. ఏతాని=ఇవి, రామః=రాముడు, యాని=వేటిని గూర్చి, అన్వకీర్తయత్=చెప్పెనో, తాన్యేవ=అవే అని, అహమ్=నేను, మన్యే=తలచెదను. తత్ర=వాటిలో, యాని=ఏవి, అవహీనాని=తరిగిపోయినవో, తాని=వాటిని, అహమ్=నేను, నోపలక్షయే=చూడను. అస్యాః=ఈమెయొక్క, యాని=ఏ అలంకారములు, నావహీనాని=తరిగిపోలేదో, తాని=అవి, ఇమాని=ఇవే. సంశయః=సంశయము, న=లేదు.

తా. రాముడు చెప్పిన అలంకారములు ఇవే అని తలచెదను. రావణుడు తనను అపహరించు నప్పుడు సీత కొన్ని అలంకారములను తీసి క్రిందపడవేయుటచే తరిగిపోయిన అలంకారములు ఇక్కడ లేవు. తరగనివి (ఆమె క్రింద పడవేయనివి) ఇవే. సంశయము లేదు. 43, 44

మూ. పీతం కనకపట్టాభం స్రస్తం తద్వసనం శుభమ్,
ఉత్తరీయం నగాసక్తం తదా దృష్టం ప్లవఙ్గమైః. 45

ప్ర. అ. పీతమ్=పచ్చనిదీ, కనకపట్టాభమ్=బంగారు పట్టము (పట్టీ) వంటి కాంతి కలదీ, శుభమ్=మంగళకర మైనదీ, ఉత్తరీయమ్=ఉత్తరీయమూ అయిన, స్రస్తమ్=జారవిడవబడినదై, నగాసక్తమ్=పర్వతమునకు లగ్న మైన, (పర్వతము మీద పడిన) తత్=ఆ, వస్త్రమ్=వస్త్రము, తదా=ఆనాడు, ప్లవఙ్గమైః=వానరులచేత, దృష్టమ్=చూడబడినది.

తా. బంగారు పట్టీ వలె పచ్చగా ఉన్న, మంగళప్రద మైన, ఆ ఉత్తరీయాంశుకము సీత జారవిడువగా పర్వతము మీద పడి నపుడు దానిని ఆనాడు వానరులు చూచినారు. 45

మూ. భూషణాని చ ముఖ్యాని దృష్టాని ధరణీతలే,
అనయైవాపవిద్ధాని స్వనవన్తి మహాన్తి చ. 46

ప్ర. అ. అనయైవ=ఈమెచేతనే, ధరణీతలే=నేలమీద, అపవిద్ధాని=పడవే యబడిన, స్వనవన్తి=ధ్వని గల, మహాన్తి=ఉత్తమము లైన, ముఖ్యాని=ప్రధానము లైన, భూషణాని చ=అలంకారములు కూడా, దృష్టాని=చూడబడినవి.

తా. ఈమెయే పడవేయగా చప్పుడు చేయుచూ నేలపై పడిన, అమూల్యము లైన ప్రధానభూషణములను కూడ వానరులు చూచినారు. 46

మూ. ఇదం చిరగృహీతత్వాద్వసనం క్లిష్టవత్తరమ్,
తథాపి నూనం తద్వర్ణం తథా శ్రీమద్యథేతరత్. 47

ప్ర. అ. ఇదమ్=ఈ, వసనమ్=వస్త్రము, చిరగృహీతత్వాత్=చాల కాలమునుండి ధరింపబడుచుండుట వలన, క్లిష్టవత్తరమ్=ఎక్కువగా నలిగి పోయి నది. తథాపి=అట్లైనను, నూనమ్=నిశ్చయముగా, తద్వర్ణమ్=ఆ వర్ణము కలది. ఇతరత్=ఇతరమైనది (ఉత్తరీయము), యథా=ఎట్లో, తథా=అట్లే, శ్రీమత్=శోభగలది.

తా. ఈమె ధరించిన ఈ వస్త్రము చాలా కాలమునుంచి కట్టుకొనుటచే చాలా నలిగిపోయినది అయినను దాని (ఆ ఉత్తరీయము) రంగు దీని రంగూ ఒక్కటే. అది ఎంత శోభాయుక్తమైనదో ఇదికూడ అంత శోభాయుక్తమై ఉన్నది.

మూ. ఇయం కనకవర్ణాఙ్గీ రామస్య మహిషీ ప్రియా,
ప్రణష్టాపి సతీ యాస్య మనసో న ప్రణశ్యతి. 48

ప్ర. అ. కనకవర్ణాఙ్గీ=బంగారురంగు దేహము గల, ఇయమ్=ఈమె, రామస్య=రాముని యొక్క, ప్రియా=ప్రియురాలైన, మహిషీ=భార్యయే. సతీ=ప తివ్రత యైన, యా=ఏ సీత, ప్రణష్టాపి=కనబడకుండా పోయినను, అస్య=ఈ రామునియొక్క, మనసః=మనస్సునుండి, న ప్రణశ్యతి=తొలగిపోవుటలేదు.

తా. బంగారువన్నె శరీరము గల ఈమె రాముని ప్రియురాలైన సీతయే. రావణుడు అపహరించుటచే ఈమె కనబడక పోయినా రాముని మనస్సులో మాత్రము ఈమె స్థిరముగా నిలచి ఉన్నది. 48

మూ. ఇయం సా యత్కృతే రామశ్చతుర్భిః పరితప్యతే,
కారుణ్యేనానృశంస్యేన శోకేన మదనేన చ. 49

స్త్రీ ప్రణష్టేతి కారుణ్యాదాశ్రితేత్యానృశంస్యతః,
పత్నీ నష్టేతి శోకేన ప్రియేతి మదనేన చ. 50

ప్ర. అ. యత్కృతే=ఎవ్వతె నిమిత్తమై, రామః=రాముడు, ప్రణష్టా=కనబడకుండా పోయినది. స్త్రీ ఇతి=స్త్రీ అని, కారుణ్యాత్=జాలివలనా, ఆశ్రితేతి=నన్ను ఆశ్రయించి ఉండేది కదా అని, ఆనృశంస్యతః=దయవలన, నష్టా=కనబడకుండా పోయినది, పత్నీ ఇతి=భార్య అని, శోకేన=శోకముచేత, ప్రియా ఇతి=ప్రియురాలు అనే కారణముచేత, మదనేన=మన్మథుని చేత, (కామముచేత), ఈ విధముగా, కారుణ్యేన=జాలితోను, ఆనృశంస్యేన=దయతోను, శోకేన=శోకముతోను, మదనేన=మన్మథునితోను, చతుర్భిః=ఈ నాలిగింటితో, పరితప్యతే=బాధపడుచున్నాడో, సా=ఆమె, ఇయమ్=ఈమెయే.

తా. ఎవ్వతెకోసమై రాముడు, జాలి, దయ, శోకము, కామము అను నాల్గింటితో బాధపడుచున్నాడో ఆమె ఈమెయే. కనబడకుండ పోయినది స్త్రీ కదా అని జాలి, ఆమెకు నేను తప్ప మరెవ్వరూ రక్షకులు లేరు కదా అని దయ, కనబడకుండ పోయినది భార్య అగుటచే శోకము, ఆమె ప్రియురాలగుటచే కామము ఈ నాల్గింటితో బాధపడుచున్నాడు. 49, 50

మూ. అస్యా దేవ్యా యథా రూపమఙ్గప్రత్యఙ్గసౌష్ఠవమ్,
రామస్య చ యథా రూపం తస్యేయమసితేక్షణా. 51

ప్ర. అ. అస్యాః=ఈ, దేవ్యాః=దేవియొక్క, రూపమ్=రూపము, అఙ్గప్రత్యఙ్గసౌష్ఠవమ్=దేహముయొక్కా, అవయవములయొక్కా సౌష్ఠవము, (చక్కగా ఉండుట), యథా=ఎట్లో, రామస్య చ=రామునియొక్క కూడా, (రాముని రూపము అంగప్రత్యంగసౌష్ఠవము కూడ) (తథా=అట్లే ఉన్నది). తస్య=ఆ రాముని యొక్క, రూపమ్=రూపము యథా=ఎట్లో, ఇయమ్=ఈ, అసితేక్షణా=నల్లని నేత్రములు గల సీత, (తథా=అట్లే).

తా. ఈ దేవి రూపము, దేహ-దేహావయవముల చక్కదనము ఎట్లున్నవో రాముని రూపము, అతని అంగప్రత్యంగముల చక్కదనము కూడా అట్లే ఉన్నవి. నల్లని నేత్రములు గల సీత రూపము ఆ రాముని రూపమునకు తగి ఉన్నది. 51

మూ. అస్యా దేవ్యా మనస్తస్మింస్తస్య చాస్యాం ప్రతిష్ఠితమ్,
తేనేయం స చ ధర్మాత్మా ముహూర్తమపి జీవతి. 52

ప్ర. అ. అస్యాః=ఈ, దేవ్యాః=దేవియొక్క, మనః=మనస్సు, తస్మిన్=ఆ రామునియందు, తస్య=ఆ రాముని మనస్సు, అస్యాం చ=ఈమెయందు, ప్రతిష్ఠితమ్=స్థిరముగా నిలుపబడి ఉన్నది. తేన=ఆ కారణము చేతనే, ఇయమ్=ఈమె, ధర్మాత్మా=ధర్మాత్ముడైన, స చ=ఆ రాముడూ, ముహూర్తమపి=ముహూర్తకాలమైనను, జీవతి=జీవించియున్నాడు (రు).

తా. ఈ సీతాదేవి మనస్సు రామునిపై స్థిరముగా లగ్నమై ఉన్నది. ఆ రాముని మనస్సు కూడ ఈమెపై స్థిరముగా లగ్నమై ఉన్నది. అందుచేతనే ఈ సీతాదేవీ, ధర్మాత్ముడైన రాముడూ, ఒకరిపై ఒకరు ఆశ పెట్టుకొని క్షణకాలమైనా జీవించ కలుగుచున్నారు. 52

మూ. దుష్కరం కృతవాన్రామో హీనో యదనయా ప్రభుః,
ధారయత్యాత్మనో దేహం న శోకేనావసీదతి. 53

ప్ర. అ. ప్రభుః=ప్రభువైన, రామః=రాముడు, అనయా=ఈమెతో, హీనః=శూన్యుడై, ఆత్మనః=తనయొక్క, దేహమ్=దేహమును, ధారయతి ఇతి యత్=ధరించుచున్నాడు అనునది ఏది కలదో, శోకేన=దుఃఖముచేత, నావసీదతి ఇతి యత్=మరణించుట లేదన్న మాట ఏది కలదో, దుష్కరమ్=చేయశక్యముకాని పనిని, కృతవాన్=చేసినాడు.

తా. ఈ సీతనుండి దూరమైన పిమ్మటకూడ రాముడు ప్రాణములతో ఉండగలిగినాడు, మరణించలేదు, అనగా ఆ ప్రభువు నిజముగా చేయ శక్యము కాని పని చేయుచున్నాడు కదా ! 53

మూ. దుష్కరం కురుతే రామో య ఇమాం మత్తకాశినీమ్,
సీతాం వినా మహాబాహుర్ముహూర్తమపి జీవతి. 54

ప్ర. అ. యః=ఏ రాముడు, ఇమామ్=ఈ, మత్తకాశినీమ్=యౌవనమదముతో ప్రకాశించుచున్న, సీతాం వినా=సీత లేకుండగా, ముహూర్తమపి=ముహూర్త కాల మైన, జీవతి=జీవించి యున్నాడో, మహాబాహుః=గొప్ప బాహువులు గల, రామః=రాముడు, దుష్కరమ్=చేయశక్యము కాని పనిని, కురుతే=చేయుచున్నాడు.

తా. యౌవనమదము ఉప్పొంగుచున్న ఈ సీతను విడచి మహాబాహువైన రాముడు క్షణకాలమైనను జీవించి ఉన్నాడనగా, ఆతడు చేయ శక్యము కాని పని చేయుచున్నాడు ! 54

మూ. ఏవం సీతాం తదా దృష్ట్వా హృష్టః పవనసంభవః,
జగామ మనసా రామం ప్రశశంస చ తం ప్రభుమ్. 55

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే సున్దరకాణ్డే
పఞ్చదశః సర్గః.

ప్ర. అ. పవనసంభవః=హనుమంతుడు, తదా=అప్పుడు, సీతామ్=సీతను, దృష్ట్వా=చూచి, ఏవమ్=ఈ విధముగా, హృష్టః=సంతోషించినవాడై, మనసా=మనస్సుతో, రామమ్=రాముని గూర్చి, జగామ=వెళ్ళెను. తమ్=ఆ, ప్రభుమ్=ప్రభువును, ప్రశశంస చ=ప్రశంసించెను కూడా.

తా. అప్పుడు ఆ పవనతనయుడు సీత కనబడుటచే ఈ విధముగా సంతోషించుచు, ఒక్కమారు మనసారా రాముని స్మరించి, ఆ రామప్రభువును కొనియాడెను. 55

*"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు
సుందరకాండలో పదునైదవసర్గ సమాప్తము.*

అథ షోడశః సర్గః

[హనుమంతుడు సీత శీలమును, సౌందర్యమును ప్రశంసించుచు దుఃఖ మగ్నురాలైన ఆమెను గూర్చి దుఃఖించుట].

మూ. ప్రశస్య తు ప్రశస్తవ్యాం సీతాం తాం హరిపుఙ్గవః,
గుణాభిరామం రామం చ పునశ్చిన్తాపరోఽభవత్. 1

ప్ర. అ. హరిపుఙ్గవః=ఆ వానరశ్రేష్ఠుడు, ప్రశస్తవ్యామ్=ప్రశంసించదగిన, తామ్=ఆ, సీతామ్=సీతను, ప్రశస్య=ప్రశంసించి, గుణాభిరామమ్=సద్గుణాభిరాముడైన, రామం చ=రాముని కూడ ప్రశంసించి, పునః=మరల, చిన్తాపరః=చింతయందు తత్పరుడై, అభవత్=అయెను.

తా. ఆ హనుమంతుడు, ప్రశంసింప దగిన ఆ సీతను, సద్గుణాభిరాముడైన రాముణ్ణి మనస్సులో ప్రశంసించి, మరల ఆలోచనలో మునిగిపోయెను. 1

మూ. స ముహూర్తమివ ధ్యాత్వా బాష్పపర్యాకులేక్షణః,
సీతామాశ్రిత్య తేజస్వీ హనూమాన్విలలాప హ. 2

ప్ర. అ. తేజస్వీ=తేజఃశాలి యైన, సః=ఆ, హనుమాన్=హనుమంతుడు, ముహూర్తమివ=క్షణకాలము, ధ్యాత్వా=ఆలోచించి, బాష్పపర్యాకులేక్షణః=కన్నీటితో వ్యాకులము లైన నేత్రములు కలవాడై, సీతామ్ ఆశ్రిత్య=సీతను గూర్చి, విలలాప హ=విలపించెను.

తా. తేజఃశాలియైన ఆ హనుమంతుడు ఒక్క క్షణము మనస్సులో ఏమేమో ఆలోచించుకొని కన్నీళ్లు కార్చుచు సీతను గూర్చి ఈ విధముగా విలపించెను. 2

మూ. మాన్యా గురువినీతస్య లక్ష్మణస్య గురుప్రియా,
యది సీతాపి దుఃఖార్తా కాలో హి దురతిక్రమః. 3

ప్ర. అ. గురువినీతస్య=గురువులచేత వినీతుడైన, లక్ష్మణస్య=లక్ష్మణునకు, మాన్యా=గౌరవింపదగినదీ, గురుప్రియా=పెద్దలకు ఇష్టురాలూ అయిన, సీతాపి=సీత కూడ, దుఃఖార్తా యది=దుఃఖముచేత పీడింప బడుచున్నట్లయితే, కాలః=కాలము, దురతిక్రమః హి=దాట శక్యము కానిది కదా !

తా. గురువుల వద్ద మంచి వినయము నేర్చుకొన్న లక్ష్మణునికి పూజ్యురాలూ, పెద్దల స్నేహమునకు పాత్రురాలూ అయిన సీతకూడ దుఃఖముతో బాధపడుచున్నదనగా కాలమును ఎవ్వరూ దాట జాలరు కదా ! 3

మూ. రామస్య వ్యవసాయజ్ఞా లక్ష్మణస్య చ ధీమతః,
నాత్యర్థం క్షుభ్యతే దేవీ గఙ్గేవ జలదాగమే. 4

ప్ర. అ. రామస్య=రామునియొక్క, ధీమతః=ధీమంతుడైన, లక్ష్మణస్య చ=లక్ష్మణునియొక్క, వ్యవసాయజ్ఞా=ప్రయత్నమును ఎరిగిన, దేవీ=ఈ సీతాదేవి, జలదాగమే=వర్షాకాలమునందు, గఙ్గేవ=గంగ వలె, అత్యర్థమ్=అధికముగా, న క్షుభ్యతే=క్షోభ చెందుటలేదు.

తా. రాముడూ, బుద్ధిశాలి యైన లక్ష్మణుడూ కూడ పట్టిన పట్టు విడువక ప్రయత్నము చేయు స్వభావము కలవారు అనే విషయము తెలిసిన దగుటచే ఈ దేవి వర్షాకాలములో గూడ గంగానది అంతగా క్షోభించనట్లు, ఎక్కువగా క్షోభించుట లేదు (కంగారుపడి పోవుట లేదు.) 4

మూ. తుల్యశీలవయోవృత్తాం తుల్యాభిజనలక్షణామ్,
రాఘవోఽర్హతి వైదేహీం తం చేయమసితేక్షణా. 5

ప్ర. అ. తుల్యశీలవయోవృత్తామ్=తుల్యమైన శీలము, వయస్సు, ప్రవర్తనా గలదీ, తుల్యాభిజనలక్షణామ్=తుల్యమైన ఉత్తమవంశము, లక్షణములూ కలదీ అయిన, వైదేహీమ్=సీతను, రాఘవః=రాముడు, అర్హతి=తగిఉన్నాడు. ఇయమ్=ఈ, అసితేక్షణా=నల్లని నేత్రములు గల సీత కూడ, తమ్=ఆ రాముని, అర్హతి=తగి యున్నది.

తా. తనతో సమానమైన శీలము, వయస్సు, ప్రవర్తన, సద్వంశము, ఉత్తమలక్షణములు ఉన్న ఈ సీతకు రాముడే తగిన భర్త. అట్టి రామునకు సీతయే తగిన భార్య. 5

మూ. తాం దృష్ట్వా నవహేమాభాం లోకకాన్తామివ శ్రియమ్,
జగామ మనసా రామం వచనం చేదమబ్రవీత్. 6

ప్ర. అ. నవహేమాభామ్=నూతనమైన బంగారము వంటి కాంతి గలదీ, శ్రియమివ=లక్ష్మి వలె, లోకకాన్తామ్=లోకమునకు మనోహరురాలూ అయిన, తామ్=ఆమెను, దృష్ట్వా=చూచి, మనసా=మనస్సుతో, రామమ్=రాముని గూర్చి, జగామ=వెళ్ళెను. ఇదమ్=ఈ, వచనం చ=వచనమును కూడ, అబ్రవీత్=పలికెను.

తా. క్రొత్తబంగారము కాంతి వంటి కాంతితో లక్ష్మి వలె లోకమునకు అంతకూ మనోహరురాలైన ఆ సీతను చూచి, హనుమంతుడు మనసా రాముని దగ్గరకు వెళ్ళి (రాముని స్మరించుచు) ఇట్లు అనుకొనెను. 6

మూ. అస్యా హేతోర్విశాలాక్ష్యా హతో వాలీ మహాబలః,
రావణప్రతిమో వీర్యే కబన్ధశ్చ నిపాతితః. 7

ప్ర. అ. విశాలాక్ష్యాః=విశాలాక్షి యైన, అస్యాః హేతోః=ఈ సీత కొరకై, మహాబలః=గొప్ప బలము గల, వాలీ=వాలి, హతః=చంపబడినాడు. వీర్యే=పరాక్రమమునందు, రావణప్రతిమః=రావణునితో సమానుడైన, కబన్ధశ్చ=కబంధుడు కూడా, నిపాతితః=పడవేయబడినాడు.

తా. విశాలాక్షి యైన ఈ సీతకొరకే కదా రాముడు మహాబలశాలియైన వాలిని, పరాక్రమముచేత రావణునితో సమానుడైన కబంధుని సంహరించినాడు.

మూ. విరాధశ్చ హతః సంఖ్యే రాక్షసో భీమవిక్రమః,
వనే రామేణ విక్రమ్య మహేన్ద్రేణేవ శమ్బరః. 8

ప్ర. అ. వనే=వనమునందు, సంఖ్యే=యుద్ధములో, రామేణ=రామునిచేత, విక్రమ్య=పరాక్రమించి, మహేన్ద్రేణ=మహేంద్రునిచేత, శమ్బరః ఇవ=శంబరుడు వలె, భీమవిక్రమః=భయంకరమైన పరాక్రమము గల, విరాధః=విరాధుడను రాక్షసుడు కూడా, హతః=చంపబడినాడు.

తా. ఈమె కొరకే కదా రాముడు, అరణ్యములో యుద్ధమునందు, మహేంద్రుడు శంబరాసురుని చంపినట్లు, భయంకర మైన పరాక్రమము గల విరాధుడనే రాక్షసుని చంపినాడు. 8

మూ. చతుర్దశ సహస్రాణి రక్షసాం భీమకర్మణామ్,
నిహతాని జనస్థానే శరై రగ్నిశిఖోపమైః. 9

ప్ర. అ. జనస్థానే=జనస్థానమునందు, అగ్నిశిఖోపమైః=అగ్నిజ్వాలలతో సమానములైన, శరైః=బాణములతో, భీమకర్మణామ్=భయంకరమైన కర్మ గల, రక్షసామ్=రాక్షసులయొక్క, చతుర్దశ=పదునాలుగు, సహస్రాణి=సహస్రములు, నిహతాని=చంపబడినవి.

తా. ఈమె కొరకే కదా రాముడు, జనస్థానములో, అగ్నిజ్వాలలవంటి బాణములతో భయంకరమైన కర్మ గల పదునాలుగు వేలమంది రాక్షసులను చంపినాడు. 9

మూ. ఖరశ్చ నిహతః సంఖ్యే త్రిశిరాశ్చ నిపాతితః,
దూషణశ్చ మహాతేజా రామేణ విదితాత్మనా. 10

ప్ర. అ. విదితాత్మనా=ప్రసిద్ధమైన బుద్ధి గల, రామేణ=రామునిచేత, సంఖ్యే=యుద్ధమునందు, ఖరశ్చ=ఖరుడు, నిహతః=చంపబడినాడు, త్రిశిరాశ్చ=త్రిశిరస్సు కూడ, నిపాతితః=పడగొట్టబడినాడు, మహాతేజాః=గొప్ప తేజస్సు గల, దూషణశ్చ=దూషణుడు కూడ (చంపబడినాడు).

తా. ఈ సీతకొరకే కదా మహాబుద్ధిశాలిగా ప్రసిద్ధుడైన రాముడు యుద్ధములో ఖరుని, త్రిశిరస్సును, మహాబలశాలి యైన దూషణుని చంపినాడు.

మూ. ఐశ్వర్యం వానరాణాం చ దుర్లభం వాలిపాలితమ్,
అస్యా నిమిత్తే సుగ్రీవః ప్రాప్తవాన్ లోకసత్కృతమ్. 11

ప్ర. అ. అస్యాః=ఈమెయొక్క, నిమిత్తే=నిమిత్తమున, సుగ్రీవః=సుగ్రీవుడు, వాలిపాలితమ్=వాలిచేత పాలింపబడినదీ, దుర్లభమ్=తేలికగా పొంద శక్యము కానిదీ, లోకసత్కృతమ్=లోకములచేత పూజింపబడినదీ అయిన, వానరాణామ్=వానరులయొక్క, ఐశ్వర్యమ్=ఐశ్వర్యమును, ప్రాప్తవాన్=పొందినాడు.

తా. వాలి పాలనలో ఉండుటచేత తేలికగా పొంద శక్యము కాని, లోకములో గౌరవింపబడిన వానరరాజ్యమును, సుగ్రీవుడు ఈమె మూలముననే కదా పొందగలిగినాడు. 11

మూ. సాగరశ్చ మయా క్రాన్తః శ్రీమాన్ నదనదీపతిః,
అస్యా హేతోర్విశాలాక్ష్యాః పురీ చేయమవేక్షితా. 12

ప్ర. అ. విశాలాక్ష్యాః=విశాలములైన నేత్రములు గల, అస్యాః హేతోః=ఈమెకొరకే, మయా=నాచేత, నదనదీపతిః=పశ్చిమము వైపు ప్రవహించు నదములకు, తూర్పు వైపు ప్రవహించు నదులకు ప్రభువైన, సాగరశ్చ=సముద్రము, క్రాన్తః=దాటబడినది. ఇయమ్=ఈ, పురీ చ=పట్టణము కూడ, అవేక్షితా=చూడబడినది.

తా. నేను ఈమెకోసమే కదా నదములకు, నదులకు ప్రభువైన సాగరమును దాటి వచ్చి ఈ లంకాపురమును చూచినాను. 12

మూ. యది రామః సముద్రాన్తాం మేదినీం పరివర్తయేత్,
అస్యాః కృతే జగచ్చాపి యుక్తమిత్యేవ మే మతిః. 13

ప్ర. అ. రామః=రాముడు, అస్యాః కృతే=ఈమె నిమిత్తమై, సముద్రాన్తామ్=సముద్రము అంతములందు గల, మేదినీమ్=ఈ భూమిని, జగచ్చాపి=జగత్తును అంతనూ కూడ, పరివర్తయేద్యది=తల్రకిందులు చేసినను, యుక్తమిత్యేవ=యుక్తమే అని, మే=నాయొక్క, మతిః=అభిప్రాయము.

తా. రాముడు ఈ సీతకోసమై సముద్రము వరకు వ్యాపించిన భూమినే కాదు జగత్తునంతనూ తల్రకిందులుగా చేసినా యుక్తమే అని నా అభిప్రాయము.

మూ. రాజ్యం వా త్రిషు లోకేషు సీతా వా జనకాత్మజా,
త్రైలోక్యరాజ్యం సకలం సీతాయా నాప్నుయాత్కలామ్. 14

ప్ర. అ. త్రిషు=మూడు, లోకేషు=లోకములయందు, (పైన), రాజ్యం వా=రాజ్యమా, జనకాత్మజా=జనకుని కుమార్తె యైన, సీతా వా=సీతయా అన్నచో, సకలమ్=సమస్త మైన, త్రైలోక్యరాజ్యమ్=త్రిలోకముల రాజ్యము, సీతాయాః=సీత యొక్క, కలామ్=పదహారవభాగమును కూడ, నాప్నుయాత్=పొందదు.

తా. మూడు లోకముల పైన అధికారము గొప్పదా జనకుని కూతురైన సీత గొప్పదా అని చూచినచో, మూడు లోకములపై రాజ్యాధికారము సీతలో పదహారవ పాలుకు కూడా సరిరాదు. 14

మూ. ఇయం సా ధర్మశీలస్య మైథిలస్య మహాత్మనః,
సుతా జనకరాజస్య సీతా భర్తృదృఢవ్రతా. 15
ఉత్థితా మేదినీం భిత్త్వా క్షేత్రే హలముఖక్షతే,
పద్మరేణునిభైః కీర్ణా శుభైః కేదారపాంసుభిః. 16

ప్ర. అ. ఇయమ్=ఈమె, క్షేత్రే=యజ్ఞభూమి, హలముఖక్షతే=నాగలి కొనచే చీల్చబడినదగుచుండగా, పద్మరేణునిభైః=పద్మపరాగములతో సమానము లైన, శుభైః=మంగళకరము లైన, కేదారపాంసుభిః=ఆ పొలము లోని పరాగములచేత, కీర్ణా=వ్యాపింపబడినదై, మేదినీమ్=భూమిని, భిత్త్వా=భేదించుకొని, ఉత్థితా=లేచినదీ, ధర్మశీలస్య=ధర్మస్వభావుడు, మహాత్మనః=మహాత్ముడు, మైథిలస్య=మిథిలాధీశుడు అయిన, జనకరాజస్య=జనక మహారాజుయొక్క, సుతా=కుమార్తెయూ, భర్తృదృఢవ్రతా=భర్త విషయమున దృఢమైన పాతివ్రత్యవ్రతము కలదీ అయిన, సా=ఆ, సీతా=సీత.

తా. యజ్ఞభూమిని నాగలిలో దున్నుచున్నప్పుడు, పద్మపరాగము వంటి మంగళకరములైన పరాగములచే కప్పబడిన శరీరముతో ఆ భూమిని భేదించు

కొని బైటకువచ్చినదీ, ధార్మికుడూ, మిథిలాధిపతీ, మహాత్ముడూ అయిన జనక మహారాజు పుత్రికా, దృఢమైన పాతివ్రత్యధర్మము కలదీ అయిన ఆ సీత ఈమెయే. 15, 16

మూ. విక్రాన్తస్యార్యశీలస్య సంయుగేష్వనివర్తినః,
స్నుషా దశరథస్యైషా జ్యేష్ఠా రాజ్ఞో యశస్వినీ. 17

ప్ర. అ. విక్రాన్తస్య=పరాక్రమవంతుడు, ఆర్యశీలస్య=పూజించ దగిన శీలము గలవాడు, సంయుగేషు=యుద్ధములయందు, అనివర్తినః=మరలనివాడు అయిన, రాజ్ఞః=రాజైన, దశరథస్య=దశరథునియొక్క, యశస్వినీ=కీర్తి గల, జ్యేష్ఠా=జ్యేష్ఠ రాలైన, స్నుషా=కోడలు, ఏషా=ఈమెయే.

తా. పరాక్రమవంతుడు, పూజించదగిన శీలము కలవాడు, యుద్ధము లందు వెనుకకు తిరగనివాడు అయిన దశరథమహారాజునకు కీర్తిమంతురా లైన పెద్దకోడలు ఈమెయే. 17

మూ. ధర్మజ్ఞస్య కృతజ్ఞస్య రామస్య విదితాత్మనః,
ఇయం సా దయితా భార్యా రాక్షసీవశమాగతా. 18

ప్ర. అ. ధర్మజ్ఞస్య=ధర్మములు తెలిసినవాడూ, కృతజ్ఞస్య=కృతజ్ఞుడూ, విదితాత్మనః=ప్రసిద్ధమైన బుద్ధి కలవాడూ అయిన, రామస్య=రామునియొక్క, దయితా=ప్రియురాలైన, భార్యా=భార్యయైన, ఇయమ్=ఈమె, రాక్షసీవశమ్=రాక్ష సస్త్రీల వశమును, ఆగతా=పొందినది.

తా. ధర్మములు తెలిసినవాడు, కృతజ్ఞుడూ, బుద్ధిమంతుడుగా ప్రసిద్ధి పొందినవాడూ అయిన రామునకు ఇష్టురాలైన భార్య యైన ఈ సీత రాక్షస స్త్రీలకు వశమైనది కదా ! 18

మూ. సర్వాన్ భోగాన్ పరిత్యజ్య భర్తృస్నేహబలాత్కృతా,
అచిన్తయిత్వా దుఃఖాని ప్రవిష్టా నిర్జనం వనమ్. 19

సంతుష్టా ఫలమూలేన భర్తృశుశ్రూషణే రతా,
యా పరాం భజతే ప్రీతిం వనేఽపి భవనే యథా. 20

సేయం కనకవర్ణాఙ్గీ నిత్యం సుస్మితభాషిణీ,
సహతే యాతనామేతామనర్థానామభాగినీ. 21

ప్ర. అ. యా=ఏ సీత, సర్వాన్=సమస్తమైన, భోగాన్=భోగములను, పరిత్యజ్య=విడచి, భర్తృస్నేహబలాత్కృతా=భర్తయందలి ప్రేమచేత, బలాత్కరింపబడినదై, దుఃఖాని=దుఃఖములను, అచిన్తయిత్వా=లెక్కచేయక, నిర్జనమ్=జనులు లేని, వనమ్=వనమును, ప్రవిష్టా=ప్రవేశించినదో, ఫలమూలేన=ఫలమూలములతో, సంతుష్టా=సంతోషించినదై, భర్తృశుశ్రూషణే=భర్తను సేవించుటయందు, రతా=ఆసక్తురాలో, వనేఽపి=వనమునందు కూడ, భవనే యథా=గృహమునందు వలె, పరామ్=ఉత్తమమైన, ప్రీతిమ్=సంతోషమును, భజతే=పొందుచున్నదో, కనకవర్ణాఙ్గీ=బంగారుచాయతో కూడిన శరీరము గలదీ, నిత్యమ్=ఎల్లప్పుడు, సుస్మితభాషిణీ=మంచి చిరునవ్వుతో మాటలాడునదీ, అనర్హానామ్=ఆపదలకు, అభాగినీ=తగనిదీ, అయిన, సా ఇయమ్=అట్టిఈ సీత, ఏతామ్=ఈ, యాతనామ్=బాధను, సహతే=సహించుచున్నది.

తా. భర్తపై ఉన్న అసాధారణమైన ప్రేమచేత ఈమె సమస్తభోగములను విడచి, కష్టములకు లెక్కచేయక నిర్జనవనములో ప్రవేశించినది. భర్తకు సేవ చేయుటయందు మాత్రమే ఆసక్తి కలదై, ఫలములతోను, దుంపలతోను సంతుష్టి చెందుచు, వనములో కూడ భవనములో వలె గొప్ప సంతోషమును పొందుచున్నది. ఇట్టి ఆపదలు ఈమెకు రావలసినవి కాదు. బంగారు వన్నె శరీరము గలదీ, ఎల్లప్పుడూ చిరునవ్వుతో మాటలాడునదీ అయిన అట్టి ఈ సీత ఇట్టి బాధలు అనుభవించుచున్నది. 19, 21

మూ. ఇమాం తు శీలసంపన్నాం ద్రష్టుమర్హతి రాఘవః,
రావణేన ప్రమథితాం ప్రపామివ పిపాసితః. 22

ప్ర. అ. రాఘవః=రాముడు, శీలసంపన్నామ్=ఉత్తమశీలముతో కూడినదీ, రావణేన=రావణునిచేత, ప్రమథితామ్=పీడింపబడినదీ అయిన, ఇమామ్=ఈమెను, పిపాసితః=దప్పికొన్నవాడు, ప్రపామివ=చలివెందలిని వలె, ద్రష్టుమ్=చూచుటకు, అర్హతి=తగియున్నాడు.

తా. రావణుడు ఇంతబాధ పెట్టినా తన ఉత్తమ శీలమును విడువని ఈ సీతను రాముడు చూచినచో, దప్పికొన్నవాడు చలివెందలి కనబడినచో పరమానందభరితుడైనట్లు, పరమానందభరితుడగును. 22

మూ. అస్యా నూనం పునర్లాభాద్రాఘవః ప్రీతిమేష్యతి,
రాజా రాజ్యపరిభ్రష్టః పునః ప్రాప్యేవ మేదినీమ్. 23

ప్ర. అ. రాఘవః=రాముడు, పునః=తిరిగి, అస్యాః=ఈమెయొక్క, లాభాత్=లాభము వలన, రాజ్యపరిభ్రష్టః=రాజ్యభ్రష్టుడైన, రాజా=రాజు, మేదినీమ్=భూమిని,

పునః=మరల, ప్రాప్యేవ=పొంది వలె, నూనమ్=తప్పక, ప్రీతిమ్=ఆనందమును, ఏష్యతి=పొందగలదు.

తా. ఈమె మరల లభించుటచేత రాముడు రాజ్యభ్రష్టుడైన రాజు మరల తన రాజ్యమును పొందినపుడు సంతోషించినట్లు తప్పక సంతోషించును. 23

మూ. కామభోగైః పరిత్యక్తా హీనా బన్ధుజనేన చ,
ధారయత్యాత్మనో దేహం తత్సమాగమకాంక్షిణీ. 24

ప్ర. అ. కామభోగైః=కోరికల భోగములచే, పరిత్యక్తా=విడువబడినదీ, బన్ధుజనేన చ=బంధుజనముతో కూడ, హీనా=శూన్యురాలూ అయిన ఈ సీత, తత్స మాగమకాంక్షిణీ=ఆ రామునియొక్క సమాగమమును కోరుచు, దేహమ్=దేహమును, ధారయతి=ధరించుచున్నది.

తా. ఈమెకు ఎట్టి కోరికల భోగములు కూడ లేవు. ఒక్క బంధువు కూడ దగ్గర లేదు. అయినను ఎప్పటికైన రాముని సమాగమము కలుగు నను ఆశతో ప్రాణములు విడువకుండ ఉన్నది. 24

మూ. నైషా పశ్యతి రాక్షస్యో నేమాన్ పుష్పఫలద్రుమాన్,
ఏకస్థహృదయా నూనం రామమేవానుపశ్యతి. 25

ప్ర. అ. ఏషా=ఈమె, రాక్షస్యః=రాక్షసస్త్రీలను, న పశ్యతి=చూచు టలేదు. ఇమాన్=ఈ, పుష్పఫలద్రుమాన్=పుష్పవృక్షములను, ఫలవృక్షములను, న=చూచుటలేదు. ఏకస్థహృదయా=రామునియందు ఒక్కని యందే నిలచిన హృదయము కలదై, రామమేవ=రాముని మాత్రమే, అనుపశ్యతి=ధ్యానించు చున్నది. నూనమ్=నిశ్చయము.

తా. ఈమె ప్రక్కనే ఉన్న రాక్షసస్త్రీలను కాని, పుష్పవృక్షములను కాని, ఫలవృక్షములను గాని చూచుటలేదు. ఏకాగ్రమైన చిత్తముతో రాముణ్ణి మాత్రమే ధ్యానించుచున్నది. సందేహము లేదు. 25

మూ. భర్తా నామ పరం నార్యా భూషణం భూషణాదపి,
ఏషా తు రహితా తేన భూషణార్హా న శోభతే. 26

ప్ర. అ. భర్తా నామ=భర్త అనగా, నార్యాః=స్త్రీకి, భూషణా దపి=అలంకారముకంటె కూడ, పరమ్=శ్రేష్ఠ మైన, భూషణమ్=అలంకారము. భూషణార్హా=అలంకారములకు తగిన, ఏషా తు=ఈ సీత యైతే, తేన=ఆ భర్తతో, రహితా=శూన్యురాలై, న శోభతే=శోభించుట లేదు.

తా. స్త్రీకి భర్త అనగా సువర్ణరత్నాద్యలంకారములకంటె కూడ శ్రేష్ఠమైన అలంకారము. అలంకారములు ధరింపదగిన ఈ సీత భర్త అను ఆ అలంకారము లేకపోవుటచేత శోభించుట లేదు. 26

మూ. దుష్కరం కురుతే రామో హీనో యదనయా ప్రభుః,
ధారయత్యాత్మనో దేహం న దుఃఖేనావసీదతి. 27

ప్ర. అ. రామః=రాముడు, అనయా=ఈమెతో, హీనః=శూన్యుడైనను, ఆత్మనః=తనయొక్క, దేహమ్=దేహమును, ధారయతి ఇతి యత్=ధరించి ఉన్నాడు అనునది ఏది కలదో, దుఃఖేన=దుఃఖముచేత, నావసీదతి ఇతి యత్=క్రుంగిపోకున్నాడనునది ఏది కలదో, ప్రభుః=ఆ రామప్రభువు, దుష్కరమ్=చేయ శక్యము కాని పనిని, కురుతే=చేయుచున్నాడు.

తా. ఈమె అపహరింపబడిన తరవాత కూడ రాముడు దుఃఖముతో నశించకుండా జీవించి ఉన్నాడనగా నిజముగా ఆ రామప్రభువు ఎవ్వరూ చేయలేని పని చేయుచున్నాడు. 27

మూ. ఇమామసితకేశాన్తాం శతపత్రనిభేక్షణామ్,
సుఖార్హాం దుఃఖితాం దృష్ట్వా మమాపి వ్యథితం మనః. 28

ప్ర. అ. అసితకేశాన్తామ్=నల్లని కేశాంతములు కలదీ, శతపత్రనిభేక్షణామ్=తామరపూవుల వంటి నేత్రములు కలదీ, సుఖార్హామ్=సుఖములకు తగినదీ అయిన, ఇమామ్=ఈమెను, దుఃఖితామ్=దుఃఖించుచున్నదానినిగా, దృష్ట్వా=చూచి, మమ=నాయొక్క, మనః అపి=మనస్సు కూడ, వ్యథితమ్=దుఃఖపడుచున్నది.

తా. నల్లని కేశములు, పద్మపత్రముల వంటి నేత్రములు గల ఈమె సుఖములను అనుభవించుటయే యుక్తము. అట్టి ఈమెకు కూడ కలిగిన ఈ కష్టము చూచి, ఈమెతో ఎట్టి సంబంధమూ లేని మధ్యస్థుడనైన నా మనస్సు కూడ బాధ పడుచున్నది. 28

మూ. క్షితిక్షమా పుష్కరసన్నిభాక్షీ
యా రక్షితా రాఘవలక్ష్మణాభ్యామ్,
సా రాక్షసీభిర్వికృతేక్షణాభిః 29
సంరక్ష్యతే సంప్రతి వృక్షమూలే.

ప్ర. అ. క్షితిక్షమా=భూమివంటి ఓర్పు గలదీ, పుష్కరసన్నిభాక్షీ=పద్మములతో సమానమైన నేత్రములు గలదీ అయిన, యా=ఏ సీత,

రాఘవలక్ష్మణాభ్యామ్=రామలక్ష్మణులచేత, రక్షితా=రక్షింపబడెడిదో, సా=ఆ సీత, వికృతేక్షణాభిః=వికృతము లైన నేత్రములు గల, రాక్షసీభిః=రాక్షసస్త్రీల చేత, సంప్రతి=ఇప్పుడు, వృక్షమూలే=వృక్షమూలమునందు, సంరక్ష్యతే=రక్షింపబడుచున్నది.

తా. భూమి వలె ఓర్పు గలదీ, పద్మములతో సమానము లైన నేత్రములు కలదీ అయిన ఏ సీతను రామలక్ష్మణులు రక్షించుచుండెడివారో ఆమెనే ఇప్పుడు రాక్షసస్త్రీలు వృక్షము మూలమునందు కూర్చుండబెట్టి కాపలా కాయుచున్నారు.

మూ. హిమహతనలినీవ నష్టశోభా
వ్యసనపరమ్పరయా నిపీడ్యమానా,
సహచరరహితేవ చక్రవాకీ
జనకసుతా కృపణాం దశాం ప్రపన్నా. 30

ప్ర. అ. హిమహతనలినీవ=మంచుచేత కొట్టబడిన పద్మలత వలె, నష్టశోభా=నశించిన శోభ కలదీ, వ్యసనపరమ్పరయా=వ్యసనముల పరంపర చేత, నిపీడ్యమానా=పీడింపబడుచున్నదీ అయిన, జనకసుతా=సీత, సహచర రహితా=సహచరుడు లేని, చక్రవాకీవ=ఆడచక్రవాక పక్షి వలె, కృపణామ్=దీనమైన, దశామ్=అవస్థను, ప్రపన్నా=పొందినది.

తా. కష్టములు ఒకదాని తరువాత ఒకటిగా వచ్చి పడి పీడించుచుండగా, ఈ సీత మంచు దెబ్బ తిన్న తామరపూల తీగ వలె కాంతి కోల్పోయినదై, మగచక్రవాకము ప్రక్క లేని ఆడచక్రవాకపక్షివలె చాల శోచనీయమైన అవస్థను పొంది ఉన్నది. 30

మూ. అస్యా హి పుష్పావనతాగ్రశాఖాః
శోకం దృఢం వై జనయన్త్యశోకాః,
హిమవ్యపాయేన చ శీతరశ్మి
రభ్యుత్థితో నైకసహస్రరశ్మిః. 31

ప్ర. అ. పుష్పావనతాగ్రశాఖాః=పుష్పములచేత వంగిన శాఖాగ్రములు గల, అశోకాః=అశోకవృక్షములు, అస్యాః=ఈమెకు, దృఢమ్=అధికముగా, శోకమ్=దుఃఖమును, జనయన్తి=పుట్టించుచున్నవి. హిమవ్యపాయేన=మంచు తొలగిపోవుటచేత, అభ్యుత్థితః=పైకి లేచిన, నైకసహస్రరశ్మిః=అనేక సహస్రముల కిరణములు గల, శీతరశ్మిః చ=చంద్రుడు కూడ, శోకమును కలిగించుచున్నాడు.

తా. పువ్వులతో శాఖాగ్రములు వంగిన అశోకవృక్షములు, మంచు తొలగిపోవుటచే స్పష్టముగా అనేక సహస్ర కిరణములతో ప్రకాశించుచున్న చంద్రుడు భర్తృవిరహముతో బాధపడుచున్న ఈమెకు అధికముగా శోకమును కలిగించుచున్నవి. 31

మూ. ఇత్యేవమర్థం కపిరన్వవేక్ష్య
సీతేయమిత్యేవ నివిష్టబుద్ధిః,
సంశ్రిత్య తస్మిన్నిషసాద వృక్షే
బలీ హరీణామృషభస్తరస్వీ. 32

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే సున్దరకాణ్డే
షోడశః సర్గః.

ప్ర. అ. బలీ=బలవంతుడూ, హరీణామ్=వానరులలో, ఋషభః=శ్రేష్ఠుడూ, తరస్వీ=వేగవంతుడూ అయిన, కపిః=హనుమంతుడు, ఇత్యేవమ్=ఈవిధముగా, అర్థమ్=విషయమును, అన్వవేక్ష్య=పరిశీలించి, ఇయమ్=ఈమె, సీతా=సీత, ఇత్యేవ=ఈ విధముగానే, నివిష్టబుద్ధిః=నిశ్చితమైన బుద్ధి కలవాడై, తస్మిన్=ఆ, వృక్షే=వృక్షమునందు, సంశ్రిత్య=ఆశ్రయించి, నిషసాద=కూర్చుండెను.

తా. బలవంతుడు, వానరశ్రేష్ఠుడూ, వేగవంతుడూ అయిన హనుమంతుడు అక్కడ నున్న పరిస్థితులను జాగర్తగా పరిశీలించి, "ఈమె సీతయే" అని నిశ్చయించుకొని, ఆ వృక్షమునే ఆశ్రయించి దానిపై కూర్చుండెను. 32

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు
సుందరకాండలో పదునారవ సర్గ సమాప్తము.

అథ సప్తదశః సర్గః

[భయంకరములైన ఆకారములు గల రాక్షసస్త్రీల మధ్య ఉన్న సీతను చూచి, సీత కనబడినది కదా అని హనుమంతుడు సంతోషించుట].

మూ. తతః కుముదషణ్డాభో నిర్మలం నిర్మలోదయః,
ప్రజగామ నభశ్చన్ద్రో హంసో నీలమివోదకమ్. 1

ప్ర. అ. తతః=అటు పిమ్మట, కుముదషణ్డాభః=కలవల సముదాయము కాంతి వంటి కాంతి గల, నిర్మలోదయః=నిర్మలమైన, ఉదయము గల, చన్ద్రః=చంద్రుడు, హంసః=హంస, నీలమ్=నీలవర్ణమైన, ఉదకమ్ ఇవ=ఉదకమును వలె, నిర్మలమ్=నిర్మలమైన, నభః=ఆకాశమును, ప్రజగామ=పొందెను.

తా. ఇంతలో కలువల సముదాయము వంటి కాంతి గల, ఉదయ సమయమునందే, నిర్మలముగా, నున్న చంద్రుడు, హంస నీలవర్ణమైన జలములో ప్రవేశించినట్లు, నిర్మలమైన ఆకాశములో ప్రవేశించెను. 1

మూ. సాచివ్యమివ కుర్వన్ స ప్రభయా నిర్మలప్రభః,
చన్ద్రమా రశ్మిభిః శీతైః సిషేవే పవనాత్మజమ్. 2

ప్ర. అ. నిర్మలప్రభః=నిర్మలమైన కాంతి గల, సః చన్ద్రమాః=ఆ చంద్రుడు, ప్రభయా=కాంతితో, సాచివ్యమ్=సాహాయ్యమును, కుర్వన్నివ=చేయుచు న్నవాడు వలె, శీతైః=చల్లని, రశ్మిభిః=కిరణములచేత, పవనాత్మజమ్=హనుమంతుని, సిషేవే=సేవించెను.

తా. నిర్మలమైన కాంతి గల చంద్రుడు, తన కాంతితో హనుమంతునకు సాహాయ్యము చేయుచున్నాడా అన్నట్లు, చల్లని కిరణములచే ఆతనిని సేవించెను.

మూ. స దదర్శ తతః సీతాం పూర్ణచన్ద్రనిభాననామ్,
శోకభారైరివ న్యస్తాం భారైర్నావమివామ్భసి. 3

ప్ర. అ. తతః=అటు పిమ్మట, సః=హనుమంతుడు, పూర్ణచన్ద్ర నిభాననామ్=పూర్ణచంద్రునితో సమాన మైన ముఖము కలదీ, భారైః=భారముల చేత, అమ్భసి=నీటియందు, న్యస్తామ్=క్రిందికి దిగిపోవునట్లు చేయబడిన, నావమివ=

ఓడ వలె, శోకభారైః=దుఃఖభారములచేత, న్యస్తామ్=క్రుంగదీయబడినదీ అయిన, సీతామ్=సీతను, దదర్శ=చూచెను.

తా. హనుమంతుడపుడు బరువుచే నీటిలో క్రుంగిపోవుచున్న ఓడ వలె శోకభారముచేత క్రుంగిపోవుచున్న, పూర్ణచంద్రుని వంటి ముఖము గల సీతను స్పష్టముగా చూచెను. 3

మూ. దిదృక్షమాణో వైదేహీం హనుమాన్ మారుతాత్మజః,
స దదర్శావిదూరస్థా రాక్షసీర్ఘోరదర్శనాః, 4

ఏకాక్షీమేకకర్ణాం చ కర్ణప్రావరణాం తథా,
అకర్ణాం శఙ్కుకర్ణాం చ మస్తకోచ్ఛ్వాసనాసికామ్, 5

అతికాయోత్తమాఙ్గీం చ తనుదీర్ఘశిరోధరామ్,
ధ్వస్తకేశీం తథాకేశీం కేశకమ్బలధారిణీమ్. 6

లమ్బకర్ణలలాటాం చ లమ్బోదరపయోధరామ్,
లమ్బోష్ఠీం చుబుకోష్ఠీం చ లమ్బాస్యాం లమ్బజానుకామ్. 7

హ్రస్వాం దీర్ఘాం తథా కుబ్జాం వికటాం వామనాం తథా,
కరాలాం భుగ్నవక్త్రాం చ పిఙ్గాక్షీం వికృతాననామ్. 8

ప్ర. అ. వైదేహీమ్=సీతను, దిదృక్షమాణః=చూడదలచుచున్న, మారుతాత్మజః=వాయుపుత్రుడైన, సః హనుమాన్=ఆ హనుమంతుడు, విదూరస్థాః=సమీపమునందున్న, ఘోరదర్శనాః=భయంకర మైన దర్శనము గల, రాక్షసీః=రాక్షసస్త్రీలను, దదర్శ=చూచెను, ఏకాక్షీమ్=ఒక కన్ను కల దానిని, ఏకకర్ణాం చ=ఒక చెవిగల దానిని, తథా=మరియు, కర్ణప్రావరణామ్=చెవులే అచ్ఛాదనము గలదానినీ, అకర్ణామ్=చెవులు లేనిదానిని, శఙ్కుకర్ణాం చ=శంకువు వలె మొనదేరిన చెవులు గల దానిని, మస్తకోచ్ఛ్వాసనాసికామ్=తలవరకు ఉబ్బిన ముక్కు కల దానిని, తనుదీర్ఘశిరోధరామ్=సన్నని పొడవైన మెడ గల దానిని, ధ్వస్తకేశీమ్=చెదిరిన జుట్టు కల దానిని, తథా=మరియు, అకేశీమ్=జుట్టు లేని దానిని, కేశకమ్బలధారిణీమ్=కంబళీ వలె అల్లుకొని ఉన్న కేశములు ధరించినదానిని (కేశకంబల మనగా విగ్గు కూడ కావచ్చును). లమ్బకర్ణలలాటాం చ=వ్రేలాడుచున్న పొట్టా, స్తనములు కలదానిని, లమ్బోష్ఠీమ్=వ్రేలాడుచున్న ముఖము గలదానిని, చుబుకోష్ఠీం చ=గడ్డమునందు పెదవులు కల దానిని, లమ్బాస్యామ్=వ్రేలాడుచున్న ముఖము కల దానిని, లమ్బజానుకామ్=వ్రేలాడుచున్న మోకాళ్లు గలదానిని, హ్రస్వామ్=

పొట్టిదానిని, దీర్ఘామ్=పొడవుగా ఉన్నదానిని, తథా=మరియు, కుబ్జామ్=గూను దానిని, వికటామ్=వంకరగా ఉన్నదానిని, వామనామ్=పొట్టిదానిని, తథా=మరియు, కరాలామ్=ఎత్తైన పళ్లుగలదానిని, భుగ్నవక్త్రాం చ=వంకర మూతి కలదానిని, పిఙ్గాక్షీమ్=పచ్చని కళ్లు గల దానిని, వికృతాననామ్=వికారముతో కూడిన ముఖము గల దానిని చూచెను.

తా. వాయుపుత్రుడైన ఆ హనుమంతుడు సీతను చూచుటకై పరిశీలనా దృష్టి అటు వైపు ప్రసరింపచేసెను. అప్పుడాతనికి సీత సమీపమునందు, చూచువారికి భయము కలిగించు రాక్షసస్త్రీలు కనబడిరి. ఒకే కన్ను ఉన్నదీ, ఒకే చెవి ఉన్నదీ, గొడుగుల వంటి చెవులున్నదీ, చెవులు లేనిదీ, మొనలు దేరిన చెవు లున్నదీ, తలవరకు వ్యాపించిన ముక్కు ఉన్నదీ, దేహమునకు మించిన తల ఉన్నదీ, సన్నగా పొడవుగా ఉన్న కంఠము కలదీ, జుట్టు చెల్లాచెదురుగా ఉన్నదీ, జుట్టు లేనిదీ, కంబళీ వలె అల్లుకొని పోయిన జుట్టు కలదీ, వ్రేలాడుచున్న చెవులూ నుదురూ గలదీ, వ్రేలాడుచున్న పొట్టా, స్తనములూ గలదీ, వ్రేలాడుచున్న పెదవులు కలదీ, గడ్డముమీద పెదవులు కలదీ, వ్రేలాడుచున్న మూతి కలదీ, వ్రేలాడుచున్న మోకాళ్లు గలదీ, చాల పొట్టిదీ, చాలా పొడవైనదీ, గూనుదీ, వంకరటింకరగా ఉన్నదీ, మరుగుజ్జా, ఎత్తుపళ్లదీ, మూతివంకరగా ఉన్నదీ, పచ్చని కళ్లు కలదీ, వికారముగా ఉన్న ముఖముకలదీ కనబడిరి. 4-8

మూ. వికృతాః పిఙ్గలాః కాలీః క్రోధనాః కలహప్రియాః,
కాలాయసమహాశూలకూటముద్గరధారిణీః. 9

వరాహమృగశార్దూలమహిషాజశివాముఖీః,
గజోష్ట్రహయపాదీశ్చ నిఖాతశిరసోపరాః 10

ఏకహస్తైకపాదాశ్చ ఖరకర్ణ్యశ్వకర్ణికాః,
గోకర్ణీర్హస్తికర్ణీశ్చ హరికర్ణీస్తథాపరాః. 11

అనాసా అతినాసాశ్చ తిర్యఙ్నాసా వినాసికాః.
గజసన్నిభనాసాశ్చ లలాటోచ్ఛ్వాసనాసికాః. 12

హస్తిపాదా మహాపాదా గోపాదాః పాదచూళికాః,
అతిమాత్రశిరోగ్రీవా అతిమాత్రకుచోదరీః. 13

అతిమాత్రాస్యనేత్రాశ్చ దీర్ఘజిహ్వానఖాస్తథా,
అజాముఖీర్హస్తిముఖీర్గోముఖీః సూకరీముఖీః. 14

హయోష్ట్రఖరవక్త్రాశ్చ రాక్షసీర్ఘోరదర్శనాః,
శూలముద్గరహస్తాశ్చ క్రోధనాః కలహప్రియాః. 15

కరాళా ధూమ్రకేశీశ్చ రాక్షసీర్వికృతాననాః,
పిబన్తీః సతతం పానం సదా మాంససురాప్రియాః. 16

మాంసశోణితదిగ్ధాఙ్గీర్మాంసశోణితభోజనాః,
తా దదర్శ కపిశ్రేష్ఠో రోమహర్షణదర్శనాః. 17

స్కన్ధవన్తముపాసీనాః పరివార్య వనస్పతిమ్.

ప్ర. అ. వికృతాః=వికారముగా ఉన్నవాళ్లనూ, పిఙ్గలాః=పచ్చని వాళ్లనూ, కాళీః=నల్లనివాళ్ళనూ, క్రోధనాః=కోపస్వభావం కలవాళ్లనూ, కలహప్రియాః=కలహము ఇష్టమైనవాళ్ళనూ, కాలాయసమహాశూల కూటముద్గరధారిణీః=ఇనుమువికారమైన పెద్ద శూలములను, గూటములను, ముద్గరములను ధరించినవాళ్లనూ, వరాహమృగశార్దూలమహిషాజశివాముఖీః=పందులు, లేళ్ళు, పులులు, దున్నపోతులు, మేకపోతులు, ఆడనక్కలు-వీటి ముఖముల వంటి ముఖములు కలవాళ్లనూ, గజోష్ట్రహయపాదీః చ=ఏనుగులు, ఒంటెలు, గుఱ్ఱములు-వీటి పాదముల వంటి పాదములు కలవాళ్ళనూ, నిఖాతశిరసః=కుదించుకొనిపోయిన తలలు గల, అపరాః=మరికొందరినీ, ఏకహస్తైకపాదాశ్చ=ఒకే చెయ్యి కలవాళ్ళనూ, ఒకే పాదము కలవాళ్లనూ, ఖరకర్ణ్యశ్వకర్ణికాః=గాడిదచెవులవాళ్ళనూ, గుఱ్ఱపు చెవులవాళ్ళనూ, గోకర్ణీః=ఆవు చెవులవాళ్లనూ, హస్తికర్ణీశ్చ=ఏనుగచెవులవాళ్లను, తథా=మరియు, హరికర్ణీః=కోతిచెవుల వాళ్లైన, అపరాః=మరికొందరినీ, అనాసాః=ముక్కు లేనివాళ్ళనూ, అతినాసాశ్చ=పెద్దముక్కువాళ్లనూ, తిర్యఙ్నాసాః=అడ్డం ముక్కువాళ్ళనూ, వినాసికాః=వంకరముక్కువాళ్లనూ, గజసన్నిభనాసాశ్చ=ఏనుగ ముక్కు వంటి ముక్కు కలవాళ్లనూ, లలాటోచ్ఛ్వాసనాసికాః=లలాటమువరకు వ్యాపించిన ముక్కు కలవాళ్లనూ, హస్తిపాదాః=ఏనుగుపాదముల వంటి పాదములు కలవాళ్లనూ, మహాపాదాః=పెద్ద పాదముల వాళ్లనూ, గోపాదాః=ఆవు పాదముల వాళ్లనూ, పాదచూళికాః=పాదాల మీద జుట్టు కలవాళ్ళనూ, అతిమాత్రశిరోగ్రీవాః=పెద్ద తలలూ కంఠములు కలవాళ్లను, అతిమాత్రకుచోదరీః=పెద్ద కుచములు పొట్టలు కలవాళ్ళను, అతిమాత్రాస్యనేత్రాశ్చ=పెద్ద నోళ్ళు కళ్లు కలవాళ్లను, దీర్ఘజిహ్వానఖాః=పొడవైన నాలుకలు గోళ్లు కలవాళ్లను, తథా=మరియు, అజాముఖీః=ఆడమేక ముఖము వంటి ముఖము కలవాళ్లనూ, హస్తిముఖీః=ఏనుగుల ముఖము వంటి ముఖము కలవాళ్లనూ, గోముఖీః=ఆవుముఖము వంటి ముఖము కలవాళ్లనూ,

సూకరీముఖీః=ఆడపంది ముఖము వంటి ముఖము కలవాళ్లను, హయోష్ట్రఖరవక్త్రాశ్చ=గుఱ్ఱములు, ఒంటెలు, గాడిదలు-వీటి ముఖముల వంటి ముఖములు కలవాళ్లను, ఘోరదర్శనాః=ఘోరమైన దర్శనముగల, రాక్షసీః=రాక్షసస్త్రీలను, (చూచెను). శూలముద్గరహస్తాశ్చ=శూలములు, ముద్గరములు హస్తములందు కలవారూ, క్రోధనాః=కోపము కలవాళ్ళూ, కలహప్రియాః=కలహము ప్రియముగ కలవాళ్లూ, కరాళాః=ఎత్తుపళ్లు కలవాళ్లు, ధూమ్రకేశీశ్చ=పొగరంగు జుట్టులు కలవాళ్ళూ, వికృతాననాః=వికృతము లైన ముఖములు కలవాళ్ళూ, సతతమ్=ఎల్లప్పుడు, పానమ్=మద్యమును, పిబన్తీః=త్రాగుతున్నవాళ్ళూ, సదా=ఎల్లప్పుడూ, మాంససురాప్రియాః=మాంసముతోకూడిన కల్లు ఇష్టముగా కలవాళ్ళూ, మాంసశోణితదిగ్ధాఙ్గీః=మాంసముచేత, రక్తముచేత పూయబడిన శరీరము కలవాళ్ళూ, మాంసశోణిత భోజనాః=మాంసము రక్తము ఆహారముగా కలవాళ్ళనూ, రోమహర్షణదర్శనాః=గగుర్పాటు కలిగించే దర్శనముకలవాళ్ళూ, స్కన్ధవన్తమ్=పెద్ద ప్రాను గల, వనస్పతిమ్=మహావృక్షమును, పరివార్య=చుట్టి, ఉపాసీనాః=కూర్చున్న వాళ్ళూ అయిన, తాః=ఆ, రాక్షసీః=రాక్షసస్త్రీలను, కపిశ్రేష్ఠః=హనుమంతుడు, దదర్శ=చూచెను.

తా. హనుమంతుడు వికృతము లైన ఆకారములతో పచ్చగాను, నల్లగాను ఉన్న, కోపస్వభావము కలవారూ, కలహించే స్వభావము కలవారూ అయిన రాక్షసస్త్రీలను చూచెను. వాళ్లు ఇనుముతో చేసిన పెద్ద శూలములు, గూటములు, ముద్గరములు ధరించి ఉండిరి. వాళ్లముఖములు, పందులు, లేళ్ళు, పులులు, దున్నపోతులు, మేకపోతులు, ఆడనక్కలు-వీటి ముఖముల వలె ఉండెను. వాళ్ల పాదములు, ఏనుగులు, ఒంటెలు, గుఱ్ఱములు-వీటి పాదముల వలె ఉండెను. కొందరి తలలు గుండెలలోనికి దించుకొనిపోయి ఉండెను. ఒంటి చేతులవాళ్ళూ, ఒంటి కాళ్లవాళ్ళూ, గాడిద చెవులవాళ్ళూ, గుఱ్ఱపు చెవులవాళ్లూ, ఆవు చెవులవాళ్లూ, ఏనుగు చెవులవాళ్లూ, కోతి చెవులవాళ్లూ, ముక్కు లేని వాళ్లూ, పెద్ద ముక్కువాళ్లూ, అడ్డంముక్కువాళ్ళూ, వంకరముక్కువాళ్ళూ, ఏనుగుముక్కువాళ్ళూ, నుదుటివరకు వ్యాపించిన ముక్కులున్నవాళ్లూ, ఏనుగుపాదాలవాళ్ళూ, పెద్దపాదాలవాళ్ళూ, ఎద్దు పాదాలవాళ్ళూ, పాదాలమీద జుట్టు ఉన్నవాళ్ళూ, పెద్దతలలవాళ్ళూ, పొడవు కంఠాలవాళ్ళూ, పెద్దచన్నులవాళ్ళూ, గూనకడుపువాళ్ళూ, పెద్దమూతులవాళ్ళూ, పెద్ద కళ్లవాళ్ళూ, పొడవు నాలుకలవాళ్ళూ, పొడవు గోళ్లవాళ్ళూ ఉండిరి. ఆ రాక్షసస్త్రీలు, ఆడమేకలు, ఏనుగులు, ఎద్దులు, ఆడపందులు, గుఱ్ఱములు, ఒంటెలు, గాడిదలు-వీటి ముఖములవంటి ముఖములతో చూచేవారికి భయముకలుగునట్లు ఉండిరి. కోపస్వభావము కల వాళ్లు, కలహప్రియులు అయిన ఆ రాక్షసస్త్రీలు కోరలతో

వికారముగా ఉన్న ముఖాలతో, పొగరంగు జుట్టులతో, భయము కలిగించుచు, చేతులలో శూలములు, ముద్గరములు ధరించి ఉండిరి. వాళ్లకు మాంసముతో కూడిన కల్లు చాలా ఇష్టము. నిరంతరము మద్యపానము చేయుచుండిరి. మాంసము, రక్తము వాళ్లకు ఆహార మగుటచే వాళ్ల శరీరములపై మాంసరక్తములు జారిపడి పూసినట్లుండెను. చూచేవారికి గగుర్పాటు కలిగించే ఆ రాక్షసస్త్రీలు విశాలమైన మాను గల ఆ మహావృక్షము చుట్టూ కూర్చుండిరి. 10-17

మూ. తస్యాధస్తాచ్చ తాం దేవీం రాజపుత్రీమనిన్దితామ్, 18
లక్షయామాస లక్ష్మీవాన్ హనుమాన్ జనకాత్మజామ్.

ప్ర. అ. లక్ష్మీవాన్=మంచి శోభ గల, హనుమాన్=హనుమంతుడు, తస్య=ఆ వృక్షముయొక్క, అధస్తాత్=క్రింద, రాజపుత్రీమ్=రాజకుమారి, జనకాత్మజామ్=జనకుని కూతురు, అనిన్దితామ్=నిందింపబడనిదీ అయిన, తాం దేవీమ్=ఆ సీతాదేవిని, లక్షయామాస=చూచెను.

తా. అధికమైన కాంతి గల హనుమంతుడు, ఆ వృక్షముక్రింద, రాజపుత్రి, జనకుని కూతురు, దోషములు లేనిది అయిన ఆ సీతాదేవిని చూచెను. 18

మూ. నిష్ప్రభాం శోకసన్తప్తాం మలసంకులమూర్ధజామ్, 19
క్షీణపుణ్యాం చ్యుతాం భూమౌ తారాం నిపతితామివ.

ఇది మొదలు 22 1/2 శ్లోకం వరకు ఉన్న నాలుగు శ్లోకాలలో ద్వితీయాంతము లన్నీ 18 వ శ్లోకంలోని 'దేవీమ్' అన్నదానికి విశేషణములు).

ప్ర. అ. నిష్ప్రభామ్=కాంతి లేనిదీ, శోకసన్తప్తాన్=శోకముచేత తపింపచేయబడినదీ, మలసంకులమూర్ధజామ్=మురికితో వ్యాకులమైన కేశములు గలదీ, క్షీణపుణ్యామ్=క్షీణించిన పుణ్యము గలదై, చ్యుతామ్=స్వర్గమునుండి జారిన, భూమౌ=భూమిమీద, నిపతితామ్=పడిన, తారామివ=నక్షత్రము వలె ఉన్నదీ (అయిన దేవిని చూచెను).

తా. దుఃఖపీడితురాలై, కాంతి కోల్పోయి, మురికితో నిండిన కేశములు గల ఆ సీతాదేవి పుణ్యము క్షీణించగా, స్వర్గభ్రష్ట మై భూమిపై పడిపోయిన నక్షత్రము వలె ఉండెను. 19

మూ. చారిత్రవ్యపదేశాఢ్యాం భర్తృదర్శనదుర్గతామ్, 20
భూషణైరుత్తమైర్హీనాం భర్తృవాత్సల్యభూషణామ్.

ప్ర. అ. చారిత్రవ్యపదేశాఢ్యామ్=సచ్చరితమను విశేషముచే ఐశ్వర్యవం తురాలు, భర్తృదర్శనదుర్గతామ్=భర్త దర్శనము విషయమున దరిద్రురాలు, ఉత్తమైః=ఉత్తమములైన, భూషణైః=అలంకారములతో, హీనామ్=శూన్యరాలు, భర్తృవాత్సల్య భూషణామ్=భర్తయొక్క ప్రేమయే భూషణముగా గల దానిని.

తా. "ఈమె ఉత్తమశీలము కలది"అను ప్రసిద్ధి అనే గొప్ప ఐశ్వర్యముతో ఒప్పుచున్న ఆ సీతాదేవి భర్తృదర్శనము విషయమున దరిద్రురాలై (భర్త దర్శనము లేనిదై) ఉండెను. ఉత్తమభూషణము లేవీ లేని ఆమెకు భర్తృప్రేమ ఒక్కటే భూషణముగా ఉండెను. 20

మూ. రాక్షసాధిపసంరుద్ధాం బన్ధుభిశ్చ వినా కృతామ్, 21
వియూథాం సింహసంరుద్ధాం బద్ధాం గజవధూమివ.

ప్ర. అ. రాక్షసాధిపసంరుద్ధామ్=రావణునిచేత బంధింపబడినదై, బన్ధుభిః వినా చ=బంధువులు లేకుండా కూడ, కృతామ్=చేయుబడినదీ, వియూథామ్=గుంపు లేనిదీ, సింహసంరుద్ధామ్=సింహముచేత అడ్డగించబడినదీ, బద్ధామ్=బంధింపబడినదీ అయిన, గజవధూమివ=ఆడ ఏనుగ వలె ఉన్నదీ (అయిన దేవిని చూచెను).

తా. రావణునిచే బద్ధురాలై బంధువులకు దూరము చేయబడిన ఆ సీతా దేవి సింహముచేత అడ్డగింపబడినదై గుంపునుండి విడిపోయి, బంధింపబడిన ఆడ ఏనుగు వలె ఉండెను. 21

మూ. చన్ద్రరేఖాం పయోదాన్తే శారదాభ్రైరివావృతామ్, 22
క్లిష్టరూపామసంస్పర్శాదయుక్తామివ వల్లకీమ్.

ప్ర. అ. పయోదాన్తే=వర్షాకాలాంతమునందు, శారదాభ్రైః=శరత్కాల మేఘములచేత, ఆవృతామ్=కప్పబడిన, చన్ద్రరేఖామివ=చంద్రరేఖ వలె ఉన్నదీ, అసంస్పర్శాత్=సంస్కారము లేకపోవుటవలన, క్లిష్టరూపామ్=కాంతి విహీన మైన రూపము కలదీ, అయుక్తామ్=తీగలు సరిచేయని, వల్లకీమివ=వీణ వలె ఉన్నదీ (అయిన దేవిని చూచెను).

తా. ఆ సీతాదేవి వర్షాకాలము గడచిన క్రొత్త దివసములలో శరత్కాల మేఘములు ఆవరించిన చంద్రరేఖ వలె ఉండెను. స్నానాదిశరీరసంస్కారములు లేకపోవుటచే ఆమె రూపము కాంతి తగ్గి ఉండెను. ఆమె తీగలు సారించని వీణ వలె ఉండెను. 22

మూ. సీతాం భర్తృవశే యుక్తామయుక్తాం రాక్షసీవశే, 23
అశోకవనికామధ్యే శోకసాగరమాప్లుతామ్.

తాభిః పరివృతాం తత్ర సగ్రహామివ రోహిణీమ్, 24
దదర్శ హనుమాన్ దేవీం లతామకుసుమామివ.

ప్ర. అ. హనుమాన్=హనుమంతుడు, భర్తృవశే=భర్త వశమునందు, యుక్తామ్=ఉండుటకు తగినదీ, రాక్షసీవశే=రాక్షస్త్రీల వశమునందు, అయుక్తామ్=ఉండదగనిదీ, అశోకవనికామధ్యే=అశోకవనమధ్యమునందు, శోకసాగరమ్=శోక సముద్రమును, ఆప్లుతామ్=మునిగినదీ, తత్ర=అక్కడ, తాభిః=ఆ రాక్షసస్త్రీలచే, పరివృతామ్=చుట్టుకొనబడినది, సగ్రహామ్=గ్రహములతో కూడిన, రోహిణీమివ=రోహిణి వలె ఉన్నదీ, అకుసుమామ్=పుష్పములు లేని, లతామివ=లత వలె ఉన్నదీ అయిన, దేవీమ్=దేవి యైన, సీతామ్=సీతను, దదర్శ=చూచెను.

తా. భర్త దగ్గర ఉండవలసిన సీతాదేవి ఆ విధముగా రాక్షసస్త్రీల వశమునందుండదగినది కాదు. అశోకవనమధ్యములో శోకసాగరములో మునిగి యున్నది. ఆ రాక్షసస్త్రీలందరూ చుట్టూ ఉండుటచే ఆమె గ్రహముల మధ్య నున్న రోహిణి వలె ఉండెను. పుష్పములు లేని లత వలె ఉండెను. అట్టి సీతాదేవిని హనుమంతుడు చూచెను. 23, 24

మూ. సా మలేన చ దిగ్ధాఙ్గీ వపుషా చాప్యలంకృతా, 25
మృణాలీ పఙ్కదిగ్ధేవ విభాతి న విభాతి చ.

ప్ర. అ. మలేన=మురికిచేత, దిగ్ధాఙ్గీ=పూయబడిన శరీరము కలదీ, వపుషా చాపి=దేహముచేత, అలంకృతా=అలంకరించబడినదీ అయిన, సా=ఆ సీతాదేవి, పఙ్కదిగ్ధా=బురదచేత పూయబడిన, మృణాలీవ=తామరతూడువలె, విభాతి=ప్రకాశించుచుండెను; న విభాతి చ=ప్రకాశించకుండెను కూడ.

తా. శరీరమంతా మాలిన్యముతో నిండి యున్నను ఆమె సహజశరీర సౌందర్యము కనబడుచునే ఉండెను. అందుచేత ఆమె బురద పూసిన తామర తూడు వలె ప్రకాశించుచు, ప్రకాశింపక ఉండెను. 25

మూ. మలినేన తు వస్త్రేణ పరిక్లిష్టేన భామినీమ్, 26
సంవృతాం మృగశాబాక్షీం దదర్శ హనుమాన్ కపిః,
తాం దేవీం దీనవదనామదీనాం భర్తృతేజసా, 27
రక్షితాం స్వేన శీలేన సీతామసితలోచనామ్.

ప్ర. అ. కపిః=వానరుడైన, హనుమాన్=హనుమంతుడు, పరిక్లిష్టేన=నలిగిపోయిన, మలినేన=మలిన మైన, వస్త్రేణ=వస్త్రముచేత, సంవృతామ్=చుట్టబడినదీ,

మృగశాబాక్షీమ్=లేడి పిల్ల నేత్రముల వంటి నేత్రములు కలదీ, దీనవదనామ్=దీన మైన ముఖము గలదీ, భర్తృతేజసా=భర్తయొక్క తేజస్సు చేత, అదీనామ్=దైన్యము లేనిదీ, స్వేన=తనసంబంధ మైన, శీలేన=శీలము చేత, రక్షితామ్=రక్షింపబడినదీ, అసితలోచనామ్=నల్లని నేత్రములు కలదీ, భామినీమ్=అత్యుత్తమ మైన సౌందర్యము కలదీ, అయిన, తామ్=ఆ, దేవీం సీతామ్=సీతాదేవిని, దదర్శ=చూచెను.

తా. లోకోత్తరసౌందర్యవతి యైన ఆ సీతాదేవి నలిగి, మాసిపోయిన వస్త్రమును చుట్టబెట్టుకొని ఉండెను. లేడిపిల్ల కళ్ళవంటి కళ్లు గల ఆమె ముఖము దీనముగా ఉండెను. కాని నల్లని నేత్రములు గల ఆమె, భర్త పరాక్రమము ఎరిగినదగుటచే అంతగా దైన్యము పొందుటలేదు. తన పాతివ్రత్యమే ఆమెను రక్షించుచుండెను. అట్టి సీతాదేవిని హనుమంతుడు చూచెను. 26,27

మూ. తాం దృష్ట్వా హనుమాన్ సీతాం మృగశాబనిభేక్షణామ్,
మృగకన్యామివ త్రస్తాం వీక్షమాణాం సమన్తతః, 28
దహన్తీమివ నిఃశ్వాసైర్వృక్షాన్ పల్లవధారిణః,
సంఘాతమివ శోకానాం దుఃఖస్యోర్మిమివోత్థితామ్. 29

ప్ర. అ. హనుమాన్=హనుమంతుడు, మృగశాబనిభేక్షణామ్=లేడి పిల్ల కళ్ళ వంటి కళ్లు గలది, త్రస్తామ్=భయపడిన, మృగకన్యామివ=ఆడలేడి పిల్ల వలె, సమన్తతః=అన్ని వైపులా, వీక్షమాణామ్=చూచుచున్నదీ, పల్లవ ధారిణః=చిగుళ్లను ధరించిన, వృక్షాన్=వృక్షములను, నిఃశ్వాసైః=నిట్టూర్పులతో, దహన్తీమివ=కాల్చివే యుచున్నట్లు ఉన్నదీ, శోకానామ్=శోకముల యొక్క, సంఘాతమివ=ప్రోగు వలె ఉన్నదీ, ఉత్థితామ్=పైకి లేచిన, దుఃఖస్య=దుఃఖముయొక్క, ఊర్మిమివ=తరంగము వలె ఉన్నదీ అయిన, తాం సీతామ్=ఆ సీతను, దృష్ట్వా=చూచి, (రాబోవు శ్లోకములోని **"ప్రహర్షమతులం లేభే"** అను దానితో అన్వయము. చాల సంతోషము పొందెను).

తా. లేడిపిల్ల కళ్ళ వంటి కళ్ళుగల ఆ సీత, భయపడిన ఆడ లేడి పిల్ల వలె ఇటు అటు చూచుచుండెను. వేడిగా ఉన్న నిట్టూర్పులతో, చిగర్చిన వృక్షములను కాల్చివేయుచున్నట్లుండెను. ఆమె శోకముల ప్రోగు వలె, పైకి లేచిన దుఃఖతరంగము వలె ఉండెను. అట్టి సీతను చూచి హనుమంతుడు చాలా సంతోషించెను. 28,29

మూ. తాం క్షమాం సువిభక్తాఙ్గీం వినాభరణశోభినీమ్, 30
ప్రహర్షమతులం లేభే మారుతిః ప్రేక్ష్య మైథిలీమ్.

ప్ర. అ. క్షమామ్=భూదేవివలె ఉన్నదీ, సువిభక్తాఙ్గీమ్=చక్కగా విభజింప బడిన అవయవములు కలదీ, వినాభరణశోభినీమ్=ఆభరణములు లేక పోయినను ప్రకాశించుచున్నదీ, అయిన, తాం మైథిలీమ్=ఆ సీతాదేవిని, ప్రేక్ష్య=చూచి, మారుతిః=హనుమంతుడు, అతులమ్=సాటిలేని, ప్రహర్షమ్=సంతోషమును, లేభే=పొందెను.

తా. అలంకారములు లేకపోయినా శోభించుచున్న ఆ సీత అవయవము లన్నీ వేటికవి ఉండవలసిన విధములో ఉండెను. ఓర్పుచేత ఆమె సాక్షాత్తు భూదేవి వలె ఉండెను. అట్టి సీతను చూచి హనుమంతుడు చాలా సంతోషించెను. 30

మూ. హర్షజాని చ సోఽశ్రూణి తాం దృష్ట్వా మదిరేక్షణామ్,
మముచే హనుమాంస్తత్ర నమశ్చక్రే చ రాఘవమ్. 31

ప్ర. అ. హనుమాన్=ఆ హనుమంతుడు, మదిరేక్షణామ్=మత్తును కలిగించు నేత్రములు గల, తామ్=ఆమెను, తత్ర=అక్కడ, దృష్ట్వా=చూచి, హర్షజాని=ఆనందమువలన కలుగు, అశ్రూణి=కన్నీళ్ళను, ముముచే=విడచెను. రాఘవమ్=రాముని, నమశ్చక్రే చ=నమస్కరించెను కూడ.

తా. మత్తు కలిగించు నేత్రములు గల ఆ సీతాదేవిని చూచిన సంతోషముతో హనుమంతుడు ఆనందాశ్రువులు రాల్చి, రాముని స్మరించి నమస్కరించెను. 31

మూ. నమస్కృత్వా చ రామాయ లక్ష్మణాయ చ వీర్యవాన్,
సీతాదర్శనసంహృష్టో హనుమాన్ సంవృతోఽభవత్. 32

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే సున్దరకాణ్డే
సప్తదశః సర్గః.

ప్ర. అ. సీతాదర్శనసంహృష్టః=సీతయొక్క దర్శనముచేత సంతోషించిన, వీర్యవాన్=పరాక్రమశాలియైన, హనుమాన్=హనుమంతుడు, రామాయ=రామునకు, లక్ష్మణాయ చ=లక్ష్మణునకు, నమస్కృత్వా=నమస్కరించి, సంవృతః=కప్పబడిన వాడు, అభవత్=ఆయెను.

తా. సీత కనబడుటచే ఆనందభరితుడైన పరాక్రమశాలియైన ఆ హనుమంతుడు, రామునకు, లక్ష్మణునకు నమస్కరించి, చెట్టు ఆకులలో అణగి ఉండెను. 32

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు
సుందరకాండలో పదునేడవ సర్గ సమాప్తము.

అథ అష్టాదశః సర్గః

[రావణుడు అంతఃపుర స్త్రీలతో కలిసి అశోకవనమునకు వచ్చుట ; హనుమంతుడు అతనిని చూచుట.]

మూ. తథా విప్రేక్షమాణస్య వనం పుష్పితపాదపమ్,
విచిన్వతశ్చ వైదేహీం కించిచ్ఛేషా నిశాభవత్. 1

ప్ర. అ. (హనుమతః=హనుమంతుడు) పుష్పితపాదపమ్=పుష్పించిన వృక్షములు గల, వనమ్=వనమును, తథా=అట్లు, విప్రేక్షమాణస్య=చూచుచుండగా, వైదేహీమ్=సీతాదేవిని, విచిన్వతశ్చ=వెదకుచుండగా, నిశా=రాత్రి, కించిచ్ఛేషా=కొంచెమే శేషము కలది, అభవత్=ఆయెను.

తా. హనుమంతుడు ఆ విధముగా, పుష్పించిన వృక్షములతో నిండిన ఆ వనమును చూచుచు, సీతాదేవిని వెదకుచుండగా రాత్రి కొంచెమే మిగిలెను.(తెలవారజొచ్చెను) 1

మూ. షడఙ్గవేదవిదుషాం క్రతుప్రవరయాజినామ్,
శుశ్రావ బ్రహ్మఘోషాన్ స విరాత్రే బ్రహ్మరక్షసామ్. 2

ప్ర. అ. సః=హనుమంతుడు, విరాత్రే=తెల్లవారుజామున, షడఙ్గవేద విదుషామ్=ఆరు అంగములు గల వేదములందు పండితులు, క్రతుప్రవర యాజినామ్=శ్రేష్ఠములైన యజ్ఞములు చేసిన వారు అయిన, బ్రహ్మరక్షసామ్=బ్రహ్మరాక్షసులయొక్క, బ్రహ్మఘోషాన్=వేదఘోషలను, శుశ్రావ=వినెను.

తా. షడంగవేదములందు నిష్ణాతులు, అనేక మహాయజ్ఞములు ఆచరించిన వారూ అయిన బ్రహ్మరాక్షసులు తెల్లవారుజామునందే లేచి, వేదములు చదువుచుండగా ఆ వేదఘోషను హనుమంతుడు వినెను. 2

మూ. అథ మఙ్గలవాదిత్రశబ్దైః శ్రుతిమనోహరైః,
ప్రాబుధ్యత మహాబాహుర్దశగ్రీవో మహాబలః. 3

ప్ర. అ. అథ=అటుపిమ్మట, మహాబాహుః=గొప్ప బాహువులు కల వాడు, మహాబలః=గొప్ప బలము కలవాడు అయిన, దశగ్రీవః=రావణుడు, శ్రుతిమనోహరైః=చెవులకు మనోహరము లైన, మఙ్గలవాదిత్రశబ్దైః=మంగలవాద్యధ్వనులచేత, ప్రాబుధ్యత=లేపబడెను.

తా. ఇంతలో, మహాబాహువూ, మహాబలశాలీ అయిన దశకంఠుణ్ణి, ఆతని అనుచరులు, చెవులకు ఇంపైన మంగళవాద్యశబ్దములతో మేల్కొలిపిరి.

మూ. విబుధ్య తు యథాకాలం రాక్షసేన్ద్రః ప్రతాపవాన్,
స్రస్తమాల్యామ్బరధరో వైదేహీమన్వచిన్తయత్. 4

ప్ర. అ. ప్రతాపవాన్=ప్రతాపము గల, రాక్షసేన్ద్రః=ఆ రాక్షసరాజు,యథాకాలమ్=తగిన సమయమునందు, విబుధ్య=లేచి, స్రస్తమాల్యామ్బరధరః=జారిపోవుచున్న పుష్పమాలలను, వస్త్రములను ధరించుచున్నవాడై, వైదేహీమ్=సీతను గూర్చి, అన్వచిన్తయత్=స్మరించెను.

తా. ప్రతాపవంతుడైన ఆ రావణుడు తగు సమయమునందు లేచెను. అప్పుడే నిద్రనుండి మేల్కొని లేచుటచే ఆతని మూలికలు, వస్త్రములు జారిపోవు చుండెను. అప్పుడాతనికి సీత విషయము స్మృతికి వచ్చెను. 4

మూ. భృశం నియుక్తస్తస్యాం చ మదనేన మదోత్కటః,
న స తం రాక్షసః కామం శశాకాత్మని గూహితుమ్. 5

ప్ర. అ. తస్యాం=ఆ సీతవిషయమై, మదనేన=మన్మథునిచేత, భృశమ్=మిక్కిలి, నియుక్తః=ప్రేరేపింపబడిన, మదోత్కటః=మదముచేత తీవ్రముగా ఉన్న, సః రాక్షసః=ఆ రాక్షసుడు, తం కామమ్=ఆ కామమును, ఆత్మని=తనయందు, గూహితుమ్=కప్పిపుచ్చుకొనుటకు, న శశాక=సమర్థుడు కాలేదు.

తా. అత్యుత్కటమైన మదము గల ఆ రావణుడు ఆ సీత విషయము నందు మన్మథుడు ప్రేరేపింపగా కలిగిన ఆ కామమును తనలో అణచుకొనలేక పోయెను.

వి. ఈ ఘట్టంలోని కొన్ని శ్లోకాలకు ప్రాచీనవ్యాఖ్యాతలు రావణునకు సీతపై భక్తియే ఉన్నట్లు, దుర్బుద్ధి లేనట్లు ఏమేమో వ్యాఖ్యానాలు వ్రాసినారు. అవన్నీ వాళ్లభావాలే కాని వాల్మీకి భావాలు కావు. అసంగతంగా కూడా ఉన్నవి. ఈ శ్లోకంలో కూడా "తస్యాం=ఆ సీతయందు, భృశమ్=మిక్కిలి, నియుక్తః=భక్తికలవాడు, మదనే=మన్మథుడున్నను, మదోత్కటః=మదముచే ఉత్కటుడు, న=కాలేదు. కామమును తనలో అణచుకొనుటకు, న శశాక=సమర్థుడు కాలేదా ?" ఇత్యాది విశేషార్థములు చెప్పినారు. ఇలాంటి వ్యాఖ్యాలు పూర్వాపరవిరుద్ధములు. 19 వ శ్లోకంలో 'కామపరాధీనః' "సీతాసక్తమనాః" (కామమునకు లొంగిపోయినవాడై, సీతయందు లగ్నమైన మనస్సుకలవాడై) అని చెప్పబడినది. దానికి ఉన్నదున్నట్లుగానే అర్థం గ్రహించినారు. మార్పడం

కుదరలేదు కాబోలు. దానిని పట్టి చూచినచో ఇక్కడ చెప్పిన అర్థము అనావశ్యకమే కదా! అందుచేత వాక్యానికి ఏ అర్థమో దానినే గ్రహించుట యుక్తము. అట్లు కాని పక్షంలో రామాయణానికి భారతార్థం, భారతానికి భాగవతార్థం చెప్పడం వల్ల స్వపాండిత్యప్రదర్శనమే తప్ప మరొక ప్రయోజనం ఉండదు. ఉన్న కథను ఉన్నట్లుగా తీసికొనడంలో సీతారామాదుల విషయంలో భక్తికేమీ లోటు కలగదు.

మూ. స సర్వాభరణైర్యుక్తో బిభ్రచ్ఛ్రియమనుత్తమామ్,
తాం నగైర్బహుభిర్జుష్టాం సర్వపుష్పఫలోపగైః. 6

ప్ర. అ. సర్వాభరణైః=సమస్త మైన ఆభరణములతో, యుక్తః=కూడినవాడూ, అనుత్తమామ్=చాల గొప్పదైన, శ్రియమ్=శోభను, బిభ్రత్=ధరించుచున్నవాడూ అయిన, సః=ఆ రావణుడు, సర్వపుష్పఫలోపగైః=సమస్తమైన పుష్పములను ఫలములను పొందు (ఇచ్చు), బహుభిః=అనేకమైన, నగైః=వృక్షములచేత, జుష్టామ్=పొందబడిన, తామ్=ఆ, (9 వ శ్లోకములోని "అశోకవనికామేవ ప్రావిశత్" అనుదానితో అన్వయము. అశోకవనమునే ప్రవేశించెను). (7,8,9 శ్లోకాలలోని ద్వితీయాంతపదములన్నీ, 'అశోకవనికామ్' అనుదానికి విశేషణములు.)

తా. సమస్త మైన ఆభరణములు అలంకరించుకొని, అత్యుత్తమ మైన శోభతో కూడిన ఆ రావణుడు సకలవిధము లైన పుష్పములతోను ఫలములతోను నిండిన వృక్షములు గల అశోకవనికలో ప్రవేశించెను. 6

మూ. వృతాం పుష్కరిణీభిశ్చ నానాపుష్పోపశోభితామ్,
సదామదైశ్చ విహగైర్విచిత్రాం పరమాద్భుతామ్. 7

ప్ర. అ. పుష్కరిణీభిః=సరస్సులతో, వృతామ్=కూడినదీ, నానా పుష్పోపశోభితామ్=అనేకవిధములైన పుష్పములచేత ప్రకాశింపచేయబడినదీ, సదా మదైః=ఎల్లప్పుడూ మదము గల, విహగైః=పక్షులతో, విచిత్రామ్=విచిత్ర మైనదీ, పరమాద్భుతామ్=చాలా ఆశ్చర్యకరమైనదీ అయిన అశోకవనికలోనికి ప్రవేశించెను.

తా. అనేకవిధము లైన పుష్పములతో శోభించుచున్న ఆ అశోకవనములో అక్కడక్కడ సరస్సు లుండెను. ఎల్లప్పుడూ మదించి ఉన్న పక్షులతో విచిత్రముగా ఉన్న వనము అత్యద్భుతముగా ఉండెను. 7

మూ. ఈహామృగైశ్చ వివిధైర్జుష్టాం దృష్టిమనోహరైః,
వీథీః సంప్రేక్షమాణశ్చ మణికాఞ్చనతోరణాః, 8
నానామృగగణాకీర్ణాం ఫలైః ప్రపతితైర్వృతామ్,
అశోకవనికామేవ ప్రావిశత్సంతతద్రుమామ్. 9

ప్ర. అ. మణికాఞ్చనతోరణాః=మాణిక్యవికారములు, బంగారువికారములు అయిన ముఖద్వారములు గల, వీథీః=వీథులను, సంప్రేక్షమాణశ్చ=చూచుచున్నవాడై, దృష్టిమనోహరైః=చూపునకు మనస్సుకు ఆకర్షకము లైన, వివిధైః=అనేకవిధము లైన, ఈహామృగైశ్చ=ఈహామృగముల చేత, జుష్టామ్=పొందబడినదీ, నానామృగగణాకీర్ణామ్=అనేకవిధము లైన మృగముల గణములచే వ్యాప్తమూ, ప్రపతితైః=పడిన, ఫలైః=ఫలములతో, వృతామ్=కూడినదీ, సంతతద్రుమామ్=దట్ట మైన వృక్షములు కలదీ అయిన, అశోకవనికామేవ=అశోకవనమునే, ప్రావిశత్=ప్రవేశించెను.

తా. ఆ వనమునందు చూచుటకు చాలా అందముగా ఉన్న ఈహామృగములు, అనేకవిధములైన ఇతరమృగములూ ఉండెను. అనేకఫలములు చెట్ల నుండి రాలి ఉండెను. చెట్లు దట్టముగా ఉండెను. అట్టి అశోకవనములోనికి, రావణుడు, మాణిక్యములు పొదిగిన బంగారు ముఖద్వారములున్న వీథులను చూచుచు ప్రవేశించెను. 8, 9

మూ. అఙ్గనాశతమాత్రం తు తం వ్రజన్తమనువ్రజత్,
మహేన్ద్రమివ పౌలస్త్యం దేవగన్ధర్వయోషితః. 10

ప్ర. అ. వ్రజన్తమ్=వెళ్లుచున్న, తమ్=ఆ, పౌలస్త్యమ్=పులస్త్యుని వంశమునందు పుట్టిన రావణుని, అఙ్గనాశతమాత్రమ్=స్త్రీల శతము, మహేన్ద్రమ్=మహేంద్రుని, దేవగన్ధర్వయోషితః=దేవతాస్త్రీలు, గంధర్వస్త్రీలు వలె, అనువ్రజత్=అనుసరించి వెళ్ళెను.

తా. మహేంద్రుని వెనుక దేవతాస్త్రీలు, గంధర్వస్త్రీలు వెళ్ళినట్లు, ఆతని వెనుక వందమంది కన్యలు వెళ్ళిరి. 10

మూ. దీపికాః కాఞ్చనీః కాశ్చిజ్జగృహుస్తత్ర యోషితః,
వాలవ్యజనహస్తాశ్చ తాలవృన్తాని చాపరాః. 11

ప్ర. అ. తత్ర=అక్కడ, కాశ్చిత్=కొందరు, యోషితః=స్త్రీలు, కాఞ్చనీః=బంగారు వికారమైన, దీపికాః=దీపములను, అపరాః=మరి కొందరు, తాలవృన్తాని=విసనకర్రలను, జగృహుః=గ్రహించిరి. వాలవ్యజన హస్తాశ్చ=(కొందరు) వింజామరలను హస్తములందు ధరించిరి.

తా. అక్కడ కొందరు స్త్రీలు బంగారు దీపములను, కొందరు వింజామరలను, మరికొందరు విసనకఱ్ఱలను ధరించి ఆతని వెనుక వచ్చిరి. 11

మూ. కాఞ్చనైరపి భృఙ్గారైర్జహ్రుః సలిలమగ్రతః,
మణ్డలాగ్రాన్ బ్రుసీంశ్చాపి గృహ్యాన్యాః పృష్ఠతో యయుః. 12

ప్ర. అ. కాఞ్చనైః=బంగారువికారమైన, భృఙ్గారైః=చిన్నపాత్రలతో, అగ్రతః= ముందుభాగమున, సలిలమ్=ఉదకమును, జహ్రుః=తీసికొని వెళ్ళిరి. అన్యాః=మరికొందరు స్త్రీలు, మణ్డలాగ్రాన్=ఖడ్గములను, బ్రుసీంశ్చైవ=చిన్న ఆస్తరణలను, గృహ్య=గ్రహించి, పృష్ఠతః=వెనుకనే, యయుః=వెళ్ళిరి.

తా. కొందరు స్త్రీలు బంగారు పాత్రలలో నీళ్లు తీసికొని ముందు నడచు చుండిరి. మరి కొందరు ఖడ్గములు, ఆస్తరణలూ పట్టుకొని వెనుక వచ్చుచుండిరి. 12

మూ. కాచిద్రత్నమయీం స్థాలీం పూర్ణాం పానస్య భామినీ,
దక్షిణా దక్షిణేనైవ తదా జగ్రాహ పాణినా. 13

ప్ర. అ. కాచిత్=ఒకానొక, భామినీ=స్త్రీ, దక్షిణా=రావణునికి కుడి ప్రక్కనున్నదై, రత్నమయీమ్=రత్నవికారమూ, పూర్ణామ్=నిండి ఉన్నదీ అయిన, పానస్య= మద్యముయొక్క, స్థాలీమ్=పాత్రను, దక్షిణేనైవ=కుడిదైన, పాణినా=హస్తముతో, జగ్రాహ=గ్రహించెను.

తా. మరొక వనిత మద్యము నింపిన రత్నఖచితపాత్రను కుడి చేతిలో పట్టుకొని, రావణునికి కుడిప్రక్కనే నడచుచు ఆతనిని అనుసరించి వెళ్ళెను. 13

మూ. రాజహంసప్రతీకాశం ఛత్రం పూర్ణశశిప్రభమ్,
సౌవర్ణదణ్డమపరా గృహీత్వా పృష్ఠతో యయౌ. 14

ప్ర. అ. అపరా=మరియొక స్త్రీ, రాజహంసప్రతీకాశమ్=రాజహంసతో సమానమూ, పూర్ణశశిప్రభమ్= పూర్ణచంద్రుని వంటి కాంతి కలదీ అయిన, సౌవర్ణదణ్డమ్=బంగారు దండము గల, ఛత్రమ్=ఛత్రమును, గృహీత్వా= గ్రహించి, పృష్ఠతః=వెనుక, యయౌ=వెళ్లెను.

తా. మరియొక స్త్రీ రాజహంసతో సమానమూ, పూర్ణచంద్రుని కాంతి వంటి కాంతి కలదీ అయిన బంగారు దండము గల శ్వేతచ్ఛత్రము పట్టుకొని ఆతని వెనుకనే వెళ్లెను. 14

మూ. నిద్రామదపరీతాక్ష్యో రావణస్యోత్తమాః స్త్రియః,
అనుజగ్ముః పతిం వీరం ఘనం విద్యుల్లతా ఇవ. 15

ప్ర. అ. నిద్రామదపరీతాక్ష్యః=నిద్రమత్తుతో నిండిన కళ్లు గల వారైన, రావణస్య=రావణునియొక్క, ఉత్తమాః=ఉత్తమ లైన, స్త్రియః=స్త్రీలు, విద్యుల్లతాః= మెరపు తీగెలు, ఘనమివ=మేఘమును వలె, వీరమ్= వీరు డైన, పతిమ్=భర్తను, అనుజగ్ముః=అనుసరించి వెళ్ళిరి.

తా. రావణుని ఉత్తమస్త్రీ లందరూ, నిద్రమత్తుతో మూతలు పడుచున్న కళ్లతో, వీరు డైన తమ భర్తను, మెరపుతీగలు మేఘమును అనుసరించి వెళ్ళినట్లు వెళ్ళిరి. 15

మూ. వ్యావిద్ధహారకేయూరాః సమామృదితవర్ణకాః,
సమాగళితకేశాన్తాః సస్వేదవదనాస్తథా. 16

ఘూర్ణన్త్యో మదశేషేణ నిద్రయా చ శుభాననాః,
స్వేదక్లిష్టాఙ్గకుసుమాః సుమాల్యాకులమూర్ధజాః. 17

ప్రయాన్తం నైరృతపతిం నార్యో మదిరలోచనాః,
బహుమానాచ్చ కామాచ్చ ప్రియా భార్యాస్తమన్వయుః. 18

ప్ర. అ. వ్యావిద్ధహారకేయూరాః=తగిన స్థానములనుండి తొలగిన హారములు, బాహుపురులూ కలవారూ, సమామృదితవర్ణకాః=చెరిగి పోయిన మైపూతలు కలవారూ, సమాగళితకేశాన్తాః=జారిన జుట్టులు కలవారూ, తథా=మరియు, సస్వేదవదనాః=చెమటతో కూడిన ముఖములు కలవారూ, మదశేషేణ=మద్యమువలన కలిగిన మదముయొక్క శేషముచేతను, నిద్రయా చ=నిద్రచేతను, ఘూర్ణన్త్యః=తిరిగిపోతున్నవారూ, స్వేదక్లిష్టాఙ్గకుసుమాః=చెమటకు నలిగిన శరీరము లందలి పుష్పములు కలవారూ, సుమాల్యాకులమూర్ధజాః=మంచి మాలికలతో వ్యాకులము లైన కేశములు కలవారూ, మదిరలోచనాః=మత్తును కలిగించు నేత్రములు కలవారూ, ప్రియాః=ఇష్ట లైన, భార్యాః=భార్యలు అయిన, నార్యః=స్త్రీలు, బహుమానాచ్చ=గౌరవమువలనను, కామాచ్చ=కామమువలనను, ప్రయాన్తమ్=వెళ్ళుచున్న, తమ్=ఆ, నైరృతపతిమ్=రాక్షసరాజును, అన్వయుః=అనుసరించి వెళ్ళిరి.

తా. రావణుని ప్రియభార్యలైన ఆ స్త్రీలు, రావణునిపై ఉన్న గౌరవ భావము వలనను, కామమువలనను, అశోకవనములోనికి వెళ్లుచున్న ఆతనిని అనుసరించి వెళ్ళిరి. వాళ్ల దేహములపై ఉన్న హారములు, బాహుపురులూ, ఇటు అటూ జారిపోయినవి. శరీరములకు పూసికొనిన సుగంధాంగరాగములు చెరిగి పోయినవి. జుట్టు ముదులు వదులై పోయినవి. ముఖములకు చెమట పట్టినది. వాళ్లు మద్యపానమువలన కలిగిన, మిగిలిపోయిన మత్తుతోను, నిద్రచేతను, తూలి పోవుచుండిరి. అందమైన ముఖములు గల వాళ్ల శరీరముల మీద నున్న పుష్పమాలలు చెమటకు నలిగిపోయినవి. కేశపాశములలో పుష్పమాలలు చిక్కుకొని ఉన్నవి. వారి చూపులు మత్తు కలిగించేవిగా ఉన్నవి. అట్టి యువతులు ఆతనిని అనుసరించి వెళ్ళిరి. 16 - 18

మూ. స చ కామపరాధీనః పతిస్తాసాం మహాబలః,
సీతాసక్తమనా మన్దో మన్దాఞ్చితగతిర్బభౌ. 19

ప్ర. అ. తాసామ్=ఆ స్త్రీల యొక్క, పతిః=భర్త, మహాబలః=గొప్ప బలము కలవాడు, కామపరాధీనః=కామమునకు లొంగి పోయినవాడు అయిన, స చ=ఆ రావణుడు కూడ, మన్దః=మూఢుడై, సీతాసక్తమనాః=సీతయందు లగ్నమైన మనస్సు కలవాడై, మన్దాఞ్చితగతిః=మందమూ, సుందరమూ అయిన గమనము కలవాడై, బభౌ=ప్రకాశించెను.

తా. ఆ స్త్రీల భర్త, మహాబలుడు అయిన రావణుడు, కామపరాధీనుడై, సీతయందు లగ్న మైన మనస్సుతో, మందబుద్ధియై, మందమూ సుందరమూ అయిన నడకతో వచ్చెను. 19

మూ. తతః కాఞ్చీనినాదం చ నూపురాణాం చ నిస్వనమ్,
శుశ్రావ పరమస్త్రీణాం స కపిర్మారుతాత్మజః. 20

ప్ర. అ. తతః=అటు పిమ్మట, మారుతాత్మజః=వాయుపుత్రుడైన, సః కపిః=ఆ హనుమంతుడు, పరమస్త్రీణామ్=ఉత్తమస్త్రీలయొక్క, కాఞ్చీనినాదం చ=వడ్డాణముల ధ్వనిని, నూపురాణామ్=అందెళ్ళయొక్క, నిస్వనం చ=ధ్వనినీ, శుశ్రావ=వినెను.

తా. ఇంతలో, వాయుపుత్రుడైన ఆ హనుమంతునకు, ఆ ఉత్తమస్త్రీల వడ్డాణముల ధ్వనులూ, అందెల్ల చప్పుళ్లూ వినబడెను. 20

మూ. తం చాప్రతిమకర్మాణమచిన్త్యబలపౌరుషమ్,
ద్వారదేశమనుప్రాప్తం దదర్శ హనుమాన్ కపిః. 21

ప్ర. అ. కపిః=వానరుడైన, హనుమాన్=హనుమంతుడు, అప్రతిమ కర్మాణమ్=సాటిలేని పనులు చేయువాడు, అచిన్త్యబలపౌరుషమ్=ఊహింపశక్యము కాని బలము, పౌరుషమూ కలవాడూ, ద్వారదేశమ్=ద్వారప్రదేశమును, అనుప్రాప్తమ్=చేరినవాడూ అయిన, తం చాపి=ఆ రావణుని కూడ, దదర్శ=చూచెను.

తా. సాటి లేని పనులు చేయుగలవాడూ, ఊహింప శక్యము కాని బలమూ పౌరుషమూ కలవాడూ అయిన ఆ రావణుడు ద్వారదేశమును సమీపింపగా హనుమంతుడాతనిని చూచెను. 21

మూ. దీపికాభిరనేకాభిః సమన్తాదవభాసితమ్,
గన్ధతైలావసిక్తాభిర్ధ్రియమాణాభిరగ్రతః. 22

ప్ర. అ. (22,23,24 శ్లోకములలోని ద్వితీయాంతములు పై శ్లోకములోని 'తమ్' అనుదానికి విశేషణములు.) గన్ధతైలావసిక్తాభిః=సుగంధము గల తైలముచే తడపబడినవీ, అగ్రతః=ఎదుట, ధ్రియమాణాభిః=ధరింపబడుచున్నవీ అయిన, అనేకాభిః=అనేక మైన, దీపికాభిః=దీపములచేత, సమన్తాత్=నలువైపులా, అవభాసితమ్=ప్రకాశింపచేయబడినవాడూ అయిన (రావణుని చూచెను).

తా. ఆ రావణుని ఎదుట భాగమునందు, సుగంధతైలములతో తడపబడిన అనేకదీపములను తీసికొని వెళ్లుచుండిరి. నలుమూలల వ్యాపించిన వాటి కాంతితో ఆతడు ప్రకాశించుచుండెను. 22

మూ. కామదర్పమదైర్యుక్తం జిహ్మతామ్రాయతేక్షణమ్,
సమక్షమివ కన్దర్పమపవిద్ధశరాసనమ్. 23

ప్ర. అ. కామదర్పమదైః=కామముతోను, గర్వముతోను, మదముతోను, యుక్తమ్=కూడినవాడూ, జిహ్మతామ్రాయతేక్షణమ్=వంకర యైన, ఎఱ్ఱగా ఉన్న విశాల నేత్రములు కలవాడూ, అపవిద్ధశరాసనమ్=దూరముగా ఉంచబడిన ధనస్సు గల, సమక్షమ్=ప్రత్యక్షమైన, కన్దర్పమివ=మన్మథుని వలె ఉన్న వాడూ అయిన, (రావణుని చూచెను).

తా. అతనిలో కామము, దర్పము, మదము స్పష్టముగా కనబడుచుండెను. ఆతని విశాలము లైన నేత్రములు వంకరగాను, ఎఱ్ఱగాను ఉండెను. అప్పుడాతడు సాక్షాత్తు, పుష్పధనస్సు దూరముగా విడచి వచ్చిన మన్మథుడు వలె ఉండెను.

మూ. మథితామృతఫేనాభమరజోవస్త్రముత్తమమ్,
సలీలమనుకర్షన్తం విముక్తం సక్తమఙ్గదే. 24

ప్ర. అ. మథితామృతఫేనాభమ్=మథించబడిన అమృతముయొక్క నురుగు వంటి కాంతి గలదీ, అరజః=పరాగము లేనిదీ, విముక్తమ్=జారినదీ, అఙ్గదే=బాహుపురియందు, సక్తమ్=తగులుకొన్నదీ అయిన, ఉత్తమమ్=ఉత్తమమైన, వస్త్రమ్=వస్త్రమును, సలీలమ్=విలాసతో కూడి నట్లుగా, అనుకర్షన్తమ్=లాగుచున్న (ఆ రావణుని చూచెను).

తా. ఏ మాత్రము మకిలి లేక, మథించిన అమృతము నురుగు వలె స్వచ్ఛముగా ఉన్న వస్త్రము జారి అంగదమునకు తగుల్కొని వ్రేలాడుచుండెను. దానిని ఆ రావణుడు విలాసముగా లాగికొనుచు నడచుచుండెను. 24

మూ. తం పత్రవిటపే లీనః పత్రపుష్పఘనావృతః,
సమీపమివ సంక్రాన్తం నిధ్యాతుముపచక్రమే. 25

ప్ర. అ. సమీపమ్=దగ్గరగా, సంక్రాన్తమివ=వచ్చినాడా అన్నట్లున్న, తమ్=ఆ రావణుని, పత్రవిటపే= ఆకులతో నిండిన కొమ్మపై, లీనః=అణగినవాడై, పత్ర పుష్పఘనావృతః=ఆకులయొక్క, పుష్పములయొక్క గుంపుచేత కప్పబడినవాడై, నిధ్యాతుమ్=చూచుటకు, ఉపచక్రమే=ప్రారంభించెను.

తా. హనుమంతుడు ఆకులతో నిండిన కొమ్మమీద అణగి ఉండి, దట్టముగా ఉన్న ఆకులతోను పువ్వులతోను శరీరమును కప్పికొని, తన దగ్గరకే వచ్చినాడా అన్నట్లు ప్రక్కనే ఉన్న ఆ రావణుని పరిశీలనగా చూడ మొదలిడెను.

మూ. అవేక్షమాణస్తు తతో దదర్శ కపికుఞ్జరః,
రూపయౌవనసంపన్నా రావణస్య వరస్త్రియః. 26

ప్ర. అ. తతః=అటుపిమ్మట, కపికుఞ్జరః=హనుమంతుడు, అవేక్ష మాణః=నలుమూలలా పరికించుచు, రావణస్య=రావణునియొక్క, రూపయౌవనసం పన్నాః=రూపముతోను యౌవనముతోను నిండిన, వరస్త్రియః=శ్రేష్ఠలైన స్త్రీలను, దదర్శ=చూచెను.

తా. హనుమంతుడు ఇటు అటు పరికించి, అక్కడ రావణుని వెంట వచ్చిన, సౌందర్యయౌవనములతో ప్రకాశించుచున్న ఉత్తమస్త్రీలను చూచెను. 26

మూ. తాభిః పరివృతో రాజా సురూపాభిర్మహాయశాః,
తన్మృగద్విజసంఘుష్టం ప్రవిష్టః ప్రమదావనమ్. 27

ప్ర. అ. మహాయశాః=గొప్ప కీర్తి గల, రాజా=రాక్షసరాజు, సురూ పాభిః=మంచి రూపముగల, తాభిః=ఆ స్త్రీలతో, పరివృతః=కూడినవాడై, మృగద్విజసంఘుష్టమ్=మృగములచేత, పక్షులచేత ధ్వనింపచేయబడిన, తత్=ఆ, ప్రమదావనమ్=ఉద్యానవనమును, ప్రవిష్టః=ప్రవేశించినాడు.

తా. మహాకీర్తిశాలి యైన రావణుడు, ఉత్తమసౌందర్యవతు లైన ఆ స్త్రీలతో కలిసి, మృగపక్షులధ్వనులతో నిండిన ఆ ఉద్యానమును ప్రవేశించెను.

మూ. క్షీబో విచిత్రాభరణః శఙ్కుకర్ణో మహాబలః,
తేన విశ్రవసః పుత్రః స దృష్టో రాక్షసాధిపః. 28
వృతః పరమనారీభిస్తారాభిరివ చన్ద్రమాః,
తం దదర్శ మహాతేజాస్తేజోవన్తం మహాకపిః. 29

ప్ర. అ. క్షీబః=మత్తులో ఉన్నవాడూ, విచిత్రాభరణః=విచిత్రము లైన అలంకారములు కలవాడూ, శఙ్కుకర్ణః=కోణముల వంటి చెవులు కలవాడూ, విశ్రవసః=విశ్రవస్సుయొక్క, పుత్రః=పుత్రుడూ, తారాభిః=నక్షత్రములతో కూడిన,

చన్ద్రమాః ఇవ=చంద్రుడు వలె, పరమనారీభిః=ఉత్తమ లైన స్త్రీలతో, వృతః=కూడి నవాడూ అయిన, సః=ఆ, రాక్షసాధిపః=రాక్షసరాజు, తేన=ఆ హనుమంతునిచేత, దృష్టః=చూడబడినాడు. మహాతేజాః=గొప్ప తేజస్సు గల, మహాకపిః=హనుమంతుడు, తేజోవన్తమ్=తేజస్సు గల, తమ్=ఆ రావణుని, దదర్శ=చూచెను.

తా. మద్యపానమత్తు డై, విచిత్రము లైన ఆభరణములను ధరించి, తారలతో కూడిన చంద్రుడు వలె, ఉత్తమస్త్రీలతో కూడి ఉన్న మహాబలశాలీ, దీర్ఘము లైన కర్ణములు కలవాడూ, విశ్రవస్సుని కుమారుడూ అయిన ఆ రాక్షసాధిపుని హనుమంతుడు చూచెను. మహాతేజఃశాలి యైన ఆ హనుమంతుడు, మహాతేజఃశాలి యైన ఆ రావణుని చూచెను. 28, 29

మూ. రావణోఽయం మహాబాహురితి సంచిన్త్య వానరః,
అవప్లుతో మహాతేజా హనుమాన్మారుతాత్మజః. 30

ప్ర. అ. మారుతాత్మజః=వాయుపుత్రుడు, వానరః=వానరుడు అయిన, మహాతేజాః=గొప్ప తేజస్సు గల, హనుమాన్=హనుమంతుడు, అయమ్=ఈ, మహాబాహుః=మహాబాహువు, రావణః=రావణుడు, ఇతి=ఇట్లు, సంచిన్త్య=ఆలోచించి, అవప్లుతః=క్రిందికి దుమికినాడు.

తా. మహాతేజఃశాలీ, వాయునందనుడూ అయిన హనుమంతుడు, "ఈ మహాబాహుడు రావణుడు కదా" అని ఆలోచించి, తానున్న కొమ్మమీదినుండి క్రింది కొమ్మమీదికి దుమికెను. 30

మూ. స తథాప్యుగ్రతేజాః సన్నిర్ధూతస్తస్య తేజసా,
పత్రగుహ్యాన్తరే సక్తో హనుమాన్ సంవృతోఽభవత్. 31

ప్ర. అ. తథా=అట్లు, ఉగ్రతేజాః సన్నపి=భయంకరమైన తేజస్సు కలవాడై నను, సః=ఆ, హనుమాన్=హనుమంతుడు, తస్య=ఆ రావణుని యొక్క, తేజసా=తేజస్సుచేత, నిర్ధూతః=తిరస్కరింపబడినవాడై, పత్రగుహ్యాన్తరే=ఆకుల గుంపుల మాటున, సక్తః=తగుల్కొన్నవాడై, సంవృతః=కప్పబడినవాడు, అభవత్=ఆయెను.

తా. అంతటి మహాతేజస్సు గల హనుమంతుడు కూడ, ఆ రావణుని తేజస్సు ముందు నిలువ జాలక, ఆకులు కప్పిన ప్రదేశమునందు ఎవ్వరికిని కనబడకుండ ఉండెను. 31

మూ. స తామసితకేశాన్తాం సుశ్రోణీం సంహతస్తనీమ్,
దిదృక్షురసితాపాఙ్గాముపావర్తత రావణః. 32

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే సున్దరకాణ్డే
అష్టాదశః సర్గః.

ప్ర. అ. సః=ఆ, రావణః=రావణుడు, అసితకేశాన్తామ్=నల్లని కేశములు కలదీ, సుశ్రోణీమ్=అందమైన కటిప్రదేశము కలదీ, సంహతస్తనీమ్=దగ్గరగా కలిసి ఉన్న స్తనములు కలదీ, అసితాపాఙ్గామ్=నల్లని నేత్రాంతములు కలదీ అయిన, తామ్=ఆ సీతను, దిదృక్షుః=చూడదలచినవాడై, ఉపావర్తత=సమీపించెను.

తా. నల్లని కేశపాశము, అందమైన కటిప్రదేశమూ, దగ్గరగా కలిసి ఉన్న స్తనములూ, నల్లని నేత్రాంతములూ గల సీతను చూడవలెనను కోరికతో ఆ రావణుడు ఆమెను సమీపించెను. 32

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు
సుందరకాండలో పదునెనిమిదవ సర్గ సమాప్తము.

అథ ఏకోనవింశః సర్గః

[రావణున్ని చూడగానే దుఃఖ-భయ-చింతలలో మునిగిన సీత అవస్థ]

మూ. తస్మిన్నేవ తతః కాలే రాజపుత్రీ త్వనిన్దితా,
రూపయౌవనసంపన్నం భూషణోత్తమభూషితమ్. 1
తతో దృష్ట్వైవ వైదేహీ రావణం రాక్షసాధిపమ్,
ప్రావేపత వరారోహా ప్రవాతే కదలీ యథా. 2

ప్ర. అ. తతః=అటు పిమ్మట, తస్మిన్=ఆ, కాలే ఏవ=కాలమునందు, రాజపుత్రీ=రాజపుత్రి, అనిన్దితా=దోషములు లేనిదీ, వరారోహా=శ్రేష్ఠమైన కటిప్రదేశము కలదీ అయిన, వైదేహీ=సీత, రూపయౌవనసంపన్నమ్=రూపముతోను, యౌవనముతోను కూడినవాడు, భూషణోత్తమభూషితమ్=శ్రేష్ఠము లైన భూషణములచే అలంకరించబడినవాడు, రాక్షసాధిపమ్=రాక్షసప్రభువూ అయిన, రావణమ్=రావణుని, దృష్ట్వైవ=చూడగానే, ప్రవాతే=అధికమైన గాలిలో, కదలీ యథా=అరటిచెట్టు వలె, ప్రావేపత=వణకెను.

తా. ఆ సమయమునందు, రూపయౌవనములతో కూడి, శ్రేష్ఠము లైన భూషణములతో అలంకరించుకొని ఉన్న ఆ రాక్షసరాజైన రావణుని చూడగానే, జనకరాజపుత్రి, దోషములు లేనిది, శ్రేష్ఠమైన కటిప్రదేశము కలది అయిన సీత పెనుగాలిలో అరటిచెట్టు ఊగిపోయినట్టు వణకిపోయెను. 1,2

మూ. ఆచ్ఛాద్యోదరమూరుభ్యాం బాహుభ్యాం చ పయోధరౌ,
ఉపవిష్టా విశాలాక్షీ రుదన్తీ వరవర్ణినీ. 3

ప్ర. అ. విశాలాక్షీ=విశాలము లైన నేత్రములు కలది, వరవర్ణినీ=శ్రేష్ఠమైన శరీరవర్ణము గలది అయిన ఆ సీత, ఊరుభ్యామ్=తొడలచేత, ఉదరమ్=ఉదరమును, బాహుభ్యామ్=బాహువులచేత, పయోధరౌ=స్తనములను, ఆచ్ఛాద్య=కప్పికొని, రుదన్తీ=ఏడ్చుచు, ఉపవిష్టా=కూర్చున్నది.

తా. విశాలము లైన నేత్రములు, శ్రేష్ఠమైన శరీరచ్ఛాయా గల ఆ సీత, తొడలతో పొట్టను, బాహువులతో స్తనములను కప్పికొని కూర్చుండెను. 3

మూ. దశగ్రీవస్తు వైదేహీం రక్షితాం రాక్షసీగణైః,
దదర్శ సీతాం దుఃఖార్తాం నావం సన్నామివార్ణవే. 4

ప్ర. అ. దశగ్రీవస్తు=రావణుడు, రాక్షసీగణైః=రాక్షసస్త్రీల సముదాయముల చేత, రక్షితామ్=రక్షింపబడినదీ, వైదేహీమ్=విదేహరాజు పుత్రికా, దుఃఖార్తామ్=దుఃఖముచేత పీడింపబడినదీ, అర్ణవే=సముద్రమునందు, సన్నామ్=ఆపదలో చిక్కుకొన్న, నావమివ=ఓడ వలె ఉన్నదీ అయిన, సీతామ్=సీతను, దదర్శ=చూచెను.

తా. జనకుని పుత్రిక యైన ఆ సీత రాక్షసీగణములచే రక్షింపబడుచుండెను. దుఃఖముచేత పీడింపబడిన ఆమె సముద్రమధ్యమునందు ఆపదలో చిక్కుకొన్న ఓడ వలె ఉండెను. అట్టి సీతను రావణుడు చూచెను. 4

మూ. అసంవృతాయామాసీనాం ధరణ్యాం సంశితవ్రతామ్,
ఛిన్నాం ప్రపతితాం భూమౌ శాఖామివ వనస్పతేః. 5

[22 వ శ్లోకం వరకు ఉన్న శ్లోకాలలోని ద్వితీయాంతస్త్రీలింగశబ్దాలు 4 వ శ్లోకంలోని 'సీతామ్' అనుదానికి విశేషణములు. సీత దురవస్థను వర్ణించుచున్నవి.]

ప్ర. అ. అసంవృతాయామ్=ఆచ్ఛాదింపబడని, ధరణ్యామ్=నేలమీద, ఆసీనామ్=కూర్చున్నదీ, సంశితవ్రతామ్=తీవ్ర మైన వ్రతము కలదీ, ఛిన్నామ్=ఛేదింపబడి, భూమౌ=నేలపై, ప్రపతితామ్=పడిపోయిన, వనస్పతేః=వృక్షముయొక్క, శాఖామివ=కొమ్మవలె ఉన్న (సీతను చూచెను).

తా. కఠోరమైన వ్రతమును పాటించుచున్న సీత కటికనేలపై కూర్చుండెను. మహావృక్షమునుంచి ఛేదింపబడి నేలపై పడిన కొమ్మ వలె ఉండెను. 5

మూ. మలమణ్డనచిత్రాఙ్గీం మణ్డనార్హామమణ్డితామ్,
మృణాలీ పఙ్కదిగ్ధేవ విభాతి న విభాతి చ. 6

ప్ర. అ. మలమణ్డనచిత్రాఙ్గీమ్=మాలిన్యము అనే అలంకారముచేత చిత్ర మైన శరీరము కలదీ, మణ్డనార్హామ్=అలంకరించుకొనుటకు తగినదీ, అమణ్డితామ్=అలంకరించబడనిదీ (అయిన సీతను చూచెను). పఙ్కదిగ్ధా=బురదచేత పూయబడిన, మృణాలీవ=తామరతూడు వలె, విభాతి=ప్రకాశించు చున్నది, న విభాతి చ=ప్రకాశించుటలేదు కూడ.

తా. అలంకరించుకొనదగిన ఆమె అలంకారములను ధరించక మాలిన్యమునే అలంకారముగా ధరించుట చేత ఆమె శరీరము విచిత్రముగా ఉండెను. ఆమె, బురద అంటుకొనిన తామరతూడు వలె ప్రకాశించీ ప్రకాశించకుండగా ఉండెను. 6

మూ. సమీపం రాజసింహస్య రామస్య విదితాత్మనః,
సఙ్కల్పహయసంయుక్తైర్యాన్తీమివ మనోరథైః. 7

ప్ర. అ. సంకల్పహయసంయుక్తైః=సంకల్పములు (ఊహలు) అనే గుఱ్ఱములతో కట్టబడిన, మనోరథైః=మనోరథములు (కోరికలు) అనే రథముతో, విదితాత్మనః=ప్రసిద్ధమైన బుద్ధి గల, రాజసింహస్య=రాజశ్రేష్ఠుడైన, రామస్య=రామునియొక్క, సమీపమ్=సమీపమును, గచ్ఛన్తీమివ=వెళ్లుచున్నది వలె ఉన్న (సీతను చూచెను).

తా. ఆ సీత ఊహలనే గుఱ్ఱములు కట్టిన కోరికలనే రథము నెక్కి, రాజులలో శ్రేష్ఠుడు, ప్రసిద్ధమైన బుద్ధి కలవాడూ అయిన, రాముని దగ్గరకు వెళ్లుచున్నదా అన్నట్లుండెను. 7

మూ. శుష్యన్తీం రుదతీమేకాం ధ్యానశోకపరాయణామ్,
దుఃఖస్యాన్తమపశ్యన్తీం రామాం రామమనువ్రతామ్. 8

ప్ర. అ. శుష్యన్తీమ్=ఎండిపోవుచున్నదీ, రుదతీమ్=ఏడ్చుచున్నదీ, ఏకామ్=ఒంటరిగా ఉన్నదీ, ధ్యానశోకపరాయణామ్=ఆలోచనలకు శోకమునకు లొంగిపోయినదీ, దుఃఖస్య=దుఃఖముయొక్క, అన్తమ్=అంతమును, అపశ్యన్తీమ్=చూడనిదీ, రామామ్=మనోహరురా లైనదీ, రామమ్=రాముని, అనువ్రతామ్=అనుసరించిన వ్రతము కలదీ (అయిన సీతను చూచెను).

తా. ఉత్తమసౌందర్యముతో మనోహరురాలైన ఆమె రామునియందే చిత్తము నిలిపి ఉండెను. ఈ దుఃఖమునకు అంతము కనబడకపోవుటచే నిరంతరము ఆలోచనలతో, శోకముతో ఏడ్చుచు, సహాయము ఎవ్వరూ లేక శుష్కించి పోయెను. 8

మూ. వేష్టమానాం తథావిష్టాం పన్నగేన్ద్రవధూమివ,
ధూప్యమానాం గ్రహేణేవ రోహిణీం ధూమకేతునా. 9

ప్ర. అ. తథా=మరియు, ఆవిష్టామ్=మణిమంత్రాది ప్రభావమునకు లోనై, వేష్టమానామ్=చుట్టుకొని పోవుచున్న, పన్నగేన్ద్రవధూమివ=ఆడ దైన

మహాసర్పమువలె ఉన్నదీ, ధూమకేతునా=ధూమకేతు వను, గ్రహేణ=గ్రహముచేత, ధూప్యమానామ్=ధూమముచేత ఉక్కిరి బిక్కిరి చేయబడుచున్న, రోహిణీమివ=రోహిణివలె ఉన్నదీ (అయిన సీతను చూచెను).

తా. ఆ సీత మణిమంత్రాదులచేత కట్టబడి కొట్టుకొనుచున్న మహాసర్పము వలె, ధూమకేతువను గ్రహముచేత (ధూమముతో) ఉక్కిరిబిక్కిరి చేయబడుచున్న రోహిణి వలె ఉండెను. 9

మూ. వృత్తశీలకులే జాతామాచారవతి ధార్మికే,
పునఃసంస్కారమాపన్నాం జాతామివ చ దుష్కులే. 10

ప్ర. అ. ధార్మికే=ధర్మపరమైన, ఆచారవతి=సదాచారము గల, వృత్తశీలకులే=మంచి వృత్తము, శీలము గల కులమునందు, జాతామ్=పుట్టినదీ, సంస్కారమ్=వివాహసంస్కారమును, ఆపన్నామ్=పొందినదై, దుష్కులే=చెడ్డ కులమునందు, పునః=మరల, జాతామివ చ=పుట్టినది వలె ఉన్నదీ (అయిన సీతను చూచెను).

తా. సీత సదాచారసంపన్నమూ, ధర్మతత్పరమూ, మంచివృత్తశీలములు గలదీ అయిన కులములో పుట్టి, వివాహసంస్కారము ద్వారా మరల దుష్కులములో పునర్జన్మ పొందిన కన్య వలె ఉండెను.

వి. పురుషునకు ఉపనయనసంస్కారము పునర్జన్మవంటిదని చెప్పుదురు. అట్లే స్త్రీకి వివాహసంస్కారము పునర్జన్మసదృశమని దీని భావమై యుండును. ఈ సుందరకాండలోనే "సీత సంధ్యావందనార్థము ఈ నదికి రావచ్చును" (14సర్గ. 49శ్లో) అను హనుమంతుని వాక్యమును పట్టి స్త్రీలకు కూడ ఉపనయనాది సంస్కారములున్నట్లు సూచితమగుచున్నది.

మూ. "పురా యుగే తు నారీణాం మౌఞ్జీబన్ధనమిష్యతే,
అధ్యాపనం చ వేదానాం సావిత్రీవచనం తథా"

అని స్మృతివాక్యము. దీనిని పట్టి చూచినచో ద్విజస్త్రీలకు వివాహము తృతీయ జన్మ అనవచ్చునేమో. 10

మూ. అభూతేనాపవాదేన కీర్తిం నిపతితామివ,
ఆమ్నాయానామయోగేన విద్యాం ప్రశిథిలామివ. 11

ప్ర. అ. అభూతేన=అసత్యమైన, అపవాదేన=అపవాదముచేత, నిపతితామ్=పడిపోయిన, కీర్తిమివ=కీర్తి వలె, ఆమ్నాయానామ్=ఆవృత్తుల యొక్క,

అయోగేన=సంబంధము లేకపోవుటచేత, ప్రశిథితామ్=శిథిలమైన, విద్యామివ=విద్య వలె ఉన్న (సీతను చూచెను).

తా. అప్పుడా సీత, అసత్యదోషారోపణముచేత చెడిపోయిన కీర్తివలె మాటిమాటికి అధ్యయనము చేయకపోవుటచేత శిథిలమైన విద్య వలె ఉండెను.11

మూ. సన్నామివ మహాకీర్తిం శ్రద్ధామివ విమానితామ్,
పూజామివ పరిక్షీణామాశాం ప్రతిహతామివ. 12

ప్ర. అ. సన్నామ్=క్షీణించిన, మహాకీర్తిమివ=గొప్ప కీర్తి వలె, విమానితామ్=అవమానింపబడిన, శ్రద్ధామివ=శ్రద్ధవలె, పరిక్షీణామ్=తగ్గిపోయిన, పూజామివ=పూజ వలె, ప్రతిహతామ్=అడ్డుకొనబడిన, ఆశామివ=ఆశ వలె (ఉన్న సీతను చూచెను).

తా. ఆ సీత క్షీణించిన గొప్ప కీర్తి వలె, అవమానింపబడిన శ్రద్ధ వలె, క్షీణించిపోయిన పూజ వలె, దెబ్బతిన్న ఆశ వలె ఉండెను. 12

మూ. ఆయతీమివ విధ్వస్తామాజ్ఞాం ప్రతిహతామివ,
దీప్తామివ దిశం కాలే పూజామపహృతామివ. 13

ప్ర. అ. విధ్వస్తామ్=నశింపచేయబడిన, ఆయతీమివ=భవిష్యద్ధనాది లాభము వలె, ప్రతిహతామ్=అడ్డుకొనబడిన, ఆజ్ఞామివ=ఆజ్ఞ వలె, కాలే=ఉత్పాతకాలము (రాబోవు దేశోపద్రవములను సూచించుచు ఆకాశమునందు అకారణముగా భగ్గున మంటలు మొదలగునవి చెలరేగు కాలము) నందు, దీప్తామ్=మండిపోవుచున్న, దిశమివ=దిక్కు వలె, అవహృతామ్=అపహరింపబడిన, పూజామివ=పూజ వలె (ఉన్న సీతను చూచెను).

తా. సీత, లభించునని ఎదురుచూచుచుండగా రాకుండా పోయిన లాభము వలె, నెరవేర్చబడని ఆజ్ఞ వలె, ఉత్పాతసమయములందు మండుచున్న దిక్కు వలె, ఒకరికొరకై ఉద్దేశింపగా మరొకరు అపహరించుకొని పోయిన పూజ వలె ఉండెను. 13

మూ. పద్మినీమివ విధ్వస్తాం హతశూరాం చమూమివ,
ప్రభామివ తమోధ్వస్తాముపక్షీణామివాపగామ్. 14

ప్ర. అ. విధ్వస్తామ్=నశింపచేయబడిన, పద్మినీమివ=పద్మలత వలె, హతశూరామ్=చంపబడిన శూరులు గల, చమూమివ=సేనవలె, తమోధ్వస్తామ్=చీకటిచేత నశింపచేయబడిన, ప్రభామివ=కాంతి వలె, ఉపక్షీణామ్=క్షీణించిన, ఆపగామివ=నది వలె (ఉన్న సీతను చూచెను).

తా. ఆ సీత త్రొక్కివేయబడిన పద్మలత వలె, శూరులందరూ చచ్చిపోయిన సేన వలె, చీకటి కప్పిన కాంతి వలె, ఎండిపోయిన నది వలె ఉండెను.

మూ. వేదీమివ పరామృష్టాం శాన్తామగ్నిశిఖామివ,
పౌర్ణమాసీమివ నిశాం రాహుగ్రస్తేన్దుమణ్డలామ్. 15

ప్ర. అ. పరామృష్టామ్=(అపవిత్రులచే) స్పృశింపబడిన, వేదీమివ=అగ్నివేదిక వలె, శాన్తామ్=శాంతించిన, అగ్నిశిఖామివ=అగ్నిజ్వాల వలె, రాహుగ్రస్తేన్దుమణ్డలామ్=రాహువుచేత మ్రింగబడిన చంద్రమండలము గల, పౌర్ణమాసీమ్=పూర్ణిమకు సంబంధించిన, నిశామివ=రాత్రి వలె (ఉన్న సీతను చూచెను).

తా. సీత, అపవిత్రవస్తువుల స్పర్శచే అపవిత్రమైపోయిన అగ్నివేదిక వలె, శాంతించిన అగ్నిజ్వాల వలె, చంద్రమండలమును రాహువు మ్రింగివేయగా కాంతివిహీనముగా ఉన్న పూర్ణిమారాత్రి వలె ఉండెను. 15

మూ. ఉత్కృష్టపర్ణకమలాం విత్రాసితవిహఙ్గమామ్,
హస్తిహస్తపరామృష్టామాకులాం పద్మినీమివ. 16

ప్ర. అ. హస్తిహస్తపరామృష్టామ్=ఏనుగు తుండముచేత స్పృశింపబడినదీ, ఉత్కృష్టపర్ణకమలామ్=లాగివేయబడిన ఆకులు పద్మములూ కలదీ, విత్రాసితవిహఙ్గమామ్=భయపెట్టబడిన పక్షులు కలదీ, ఆకులామ్=వ్యాకులమూ అయిన, పద్మినీమివ=పద్మసరస్సు వలె ఉన్న (సీతను చూచెను).

తా. ఏనుగు తొండముతో కొట్టుచు ఆకులను పద్మములను లాగివేయగా, పక్షులన్నీ భయపడి పారిపోగా, వ్యాకులముగా ఉన్న పద్మసరస్సు వలె ఆ సీత మనస్సు కలగిపోయి ఉండెను. 16

మూ. పతిశోకాతురాం శుష్కాం నదీం విస్రావితామివ,
పరయా మృజయా హీనాం కృష్ణపక్షనిశామివ. 17

ప్ర. అ. పతిశోకాతురామ్=భర్తృశోకముచే పీడితురాలూ, విస్రావితామ్=ప్రవహించు నట్లు చేయబడినదై, శుష్కామ్=ఎండిపోయిన, నదీమివ=నదివలె ఉన్నది, పరయా=శ్రేష్ఠమైన, మృజయా=శరీరసంస్కారముతో, హీనామ్=శూన్యురాలూ, కృష్ణపక్షనిశామివ=కృష్ణపక్షరాత్రి వలె ఉన్నదీ (అయిన సీతను చూచెను).

తా. భర్తృశోకముచే పీడితురాలై, ఉత్తమశరీరసంస్కారమేమీ లేని ఆ సీత, ఉన్న నీరంతా క్రిందికి ప్రవహించిపోవునట్లు చేయుటచే ఎండిపోయిన నది వలె కృశించి, కృష్ణపక్షరాత్రి వలె శోభావిహీనురాలై ఉండెను. 17

మూ. సుకుమారీం సుజాతాఙ్గీం రత్నగర్భగృహోచితామ్,
తప్యమానామివోష్ణేన మృణాళీమచిరోద్ధృతామ్. 18

ప్ర. అ. సుకుమారీమ్=సుకుమారురాలూ, సుజాతాఙ్గీమ్=చక్కగా ఉన్న అవయవములు కలదీ, రత్నగర్భగృహోచితామ్=రత్నములు గర్భము నందు గల గృహములకు అలవాటుపడినదీ, ఉష్ణేన=వేడిచేత, తప్యమానామ్=తపింప చేయబడుచున్న, అచిరోద్ధృతామ్=కొంచెము సేపటి క్రితమే పెకలించబడిన, మృణాళీమివ=తామరతూడు వలె ఉన్నదీ (అయిన సీతను చూచెను).

తా. సుకుమారురాలు, చక్కని అవయవనిర్మాణముతో సుందరముగా ఉన్నదీ, రత్నాలతో నిండిన ఇండ్లలో నివసించుటకు అలవాటుపడినదీ అయిన ఆ సీత, కొంచెము సేపటి క్రితమే పెకలింపబడి, వేడికి కమిలిపోవు చున్న తామరతూడు వలె ఉండెను. 18

మూ. గృహీతామాళితాం స్తమ్భే యూథపేన వినాకృతామ్,
నిఃశ్వసన్తీం సుదుఃఖార్తాం గజరాజవధూమివ. 19

ప్ర. అ. గృహీతామ్=పట్టుకొనబడినదీ, స్తమ్భే=స్తంభమునందు, ఆళితామ్=కట్టబడినదీ, యూథపేన వినా=గుంపుకు నాయకుడైన గజము లేకుండా, కృతామ్=చేయబడినదీ, నిఃశ్వసన్తీమ్=నిట్టూర్చుచున్నదీ, సుదుఃఖార్తామ్=మిక్కిలి దుఃఖముచే పీడింపబడినదీ అయిన, గజరాజవధూమివ=గజరాజు భార్య వలె ఉన్నదీ (అయిన సీతను చూచెను).

తా. ఆటవికులు పట్టుకొని, ఏనుగుల గుంపుకు నాయకుడైన మగ ఏనుగుకు దూరముగా తీసికొనిపోయి స్తంభమునకు బంధింపగా చాల దుఃఖముగా నిట్టూర్చుచున్న ఆడ ఏనుగు వలె, ఆ సీత చాల దుఃఖార్తయై ఉండెను. 19

మూ. ఏకయా దీర్ఘయా వేణ్యా శోభమానామయత్నతః,
నీలయా నీరదాపాయే వనరాజ్యా మహీమివ. 20

ప్ర. అ. దీర్ఘయా=పొడవైన, ఏకయా=ఒక, వేణ్యా=జడతో, అయత్నతః=అప్రయత్నముగా, శోభమానామ్=ప్రకాశించుచున్నదీ, నీరదాపాయే=వర్షర్తువు గడచిన పిమ్మట, నీలయా=నల్లనైన, వనరాజ్యా=వనపంక్తితో ప్రకాశించుచున్న, మహీమివ=భూమి వలె ఉన్నదీ (అయిన సీతను చూచెను).

తా. దీర్ఘమైన ఒక్క జడతో సహజముగానే శోభించుచున్న ఆ సీత, వర్షాకాలాంతమునందు నల్లని వృక్షపంక్తితో ప్రకాశించుచున్న భూమి వలె ఉండెను.

మూ. ఉపవాసేన శోకేన ధ్యానేన చ భయేన చ,
పరిక్షీణాం కృశాం దీనామల్పాహారాం తపోధనామ్. 21

ప్ర. అ. ఉపవాసేన=ఉపవాసముచేతను, శోకేన=దుఃఖముచేతను, ధ్యానేన=ఆలోచన చేతను, భయేన చ=భయముచేతను, పరిక్షీణాం=క్షీణించి నదీ, కృశామ్=చిక్కిపోయినదీ, అల్పాహారామ్=అల్ప మైన ఆహారము కలదీ, తపోధనామ్=తపస్సే ధనముగా కలదీ (అయిన సీతను చూచెను.)

తా. ఉపవాసముచేత, దుఃఖముచేత, ఆలోచనలచేత, భయముచేత కూడ సీత చాలా దుర్బలురాలై కృశించి దైన్యముతో నిండి యుండెను. అత్యల్పమైన ఆహారమును భుజించుచు జీవించి ఉన్న ఆమె రామధ్యాన మను గొప్ప తపస్సు చేయుచుండెను. 21

మూ. ఆయాచమానాం దుఃఖార్తాం ప్రాఞ్జలిం దేవతామివ,
భావేన రఘుముఖ్యస్య దశగ్రీవపరాభవమ్. 22

ప్ర. అ. దేవతామివ=దేవతాస్త్రీ వలె ఉన్నదీ, దుఃఖార్తామ్=దుఃఖముచే పీడింపబడుచున్నదీ, భావేన=మనోభావముచేత, రఘుముఖ్యస్య=రఘువంశ రాజు లలో శ్రేష్ఠుడైన రామునియొక్క (రామునిచేత), దశగ్రీవపరాభవమ్=రావణుని పరాభవమును, ఆయాచమానామ్=కోరుకొనుచున్నదీ (అయిన సీతను చూచెను).

తా. సీత దేవతాస్త్రీ వలె ఉండెను. దుఃఖార్తురాలై, అంజలి ఘటించి రాముని చేతిలో పరాభవము కలుగవలెనని మనస్సులో కోరుకొను చుండెను.22

మూ. సమీక్షమాణాం రుదతీమనిన్దితాం
సుపక్ష్మతామ్రాయతశుక్లలోచనామ్,
అనువ్రతాం రామమతీవ మైథిలీం
ప్రలోభయామాస వధాయ రావణః. 23

ఇత్యార్షే శ్రీమద్రామాయణే, ఆదికావ్యే, సున్దరకాణ్డే
ఏకోనవింశః సర్గః.

ప్ర. అ. సమీక్షమాణామ్=నలు వైపులా చూచుచున్నదీ, రుదతీమ్=ఏడ్చు చున్నదీ, అనిన్దితామ్=నిందింపబడనిదీ, సుపక్ష్మతామ్రాయత శుక్లలోచనామ్=మంచి రెప్పలు గల, ఎఱ్ఱని, విశాల మైన తెల్లని నేత్రములు కలదీ, అతీవ=మిక్కిలి, రామమ్= రాముని, అనువ్రతామ్=అనుసరించిన వ్రతము గలదీ అయిన, మైథిలీమ్=సీతను, రావణః=రావణుడు, వధాయ=చంపుటకు, ప్రలోభయామాస=లోభపెట్టెను.

తా. అందమైన రెప్పలతో చివర ఎఱ్ఱగాను, మధ్య తెల్లగాను ఉన్న విశాలములైన నేత్రములు గల, దోషలేశము కూడ లేని ఆ సీత నలు వైపులా చూచుచు ఏడ్చుచుండెను. రాముని విషయమున అచంచలమైన పాతివ్రత్యనియమము అవలంబించి ఉండెను. అట్టి సీతను రావణుడు "నేను చెప్పినట్లు విననిచో చంపెదను" అని భయపెట్టుచు మంచి మాటలతో కూడ ఆమెకు ఆశచూపెను. (లేదా తనకు చావు వచ్చుటకే ఆమెను ఆ విధముగా లోభపెట్టెను). 23

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు
సుందరకాండలో పందొమ్మిదవసర్గ సమాప్తము.

అథ వింశః సర్గః

[రావణుడు సీతను లోభపెట్టుట]

మూ. స తాం పరివృతాం దీనాం నిరానన్దాం తపస్వినీమ్,
సాకారైర్మధురైర్వాక్యైర్న్యదర్శయత రావణః. 1

ప్ర. అ. సః రావణః=ఆ రావణుడు, పరివృతామ్=రాక్షసస్త్రీలచేత, చుట్టబడినదీ, దీనామ్=దీనురాలూ, నిరానన్దామ్=ఆనందము లేనిదీ, తపస్వినీమ్=జాలి పడదగినదీ అయిన, తామ్=ఆ సీతను, సాకారైః=ఆకారములతో (హస్తముఖాదిచేష్టలతో కూడిన) వాక్యైః=మాటలతో, న్యదర్శయత=తెలిపెను.

తా. రాక్షసస్త్రీల మధ్య దీనురాలై, ఆనందము లేక దయనీయస్థితిలో ఉన్న ఆ సీతకు, రావణుడు, హస్తముఖాదులతో చేష్టలు చేయుచు, మంచి మాటలతో తన అభిప్రాయమును తెలిపెను. 1

మూ. మాం దృష్ట్వా నాగనాసోరు గూహమానా స్తనోదరమ్,
అదర్శనమివాత్మానం భయాన్నేతుం త్వమిచ్ఛసి. 2

ప్ర. అ. నాగనాసోరు=ఏనుగ తొండము వంటి తొడలు గలదానా! మామ్=నన్ను, దృష్ట్వా=చూచి, స్తనోదరమ్=స్తనములను ఉదరమును, గూహమానా=కప్పికొనుచు, త్వమ్=నీవు, భయాత్=భయమువలన, ఆత్మానమ్=తనను, అదర్శనమ్=కనబడకుండుటను, నేతుమ్=పొందించుటకు, ఇచ్ఛసీవ=కోరుచున్నట్లున్నావు.

తా. ఏనుగు తొండము వంటి ఆకారము గల తొడలు గల ఓ సీతా! నీవు నన్ను చూడగానే భయపడి స్తనములను, ఉదరమును కప్పుకొనుచు, అదృశ్యురాలవు అగుటకు కోరుచున్నట్లున్నావు. 2

మూ. కామయే త్వాం విశాలాక్షి బహుమన్యస్వ మాం ప్రియే,
సర్వాఙ్గగుణసంపన్నే సర్వలోకమనోహరే. 3

ప్ర. అ. విశాలాక్షి=విశాలములైన నేత్రములు కలదానా! సర్వాఙ్గగుణసంపన్నే=సమస్త అవయవములందు గుణములతో కూడినదానా, సర్వలోకమనోహరే=సమస్తజనులకు మనోహరురాలా, త్వామ్=నిన్ను, కామయే=కోరుచున్నాను. ప్రియే=ఓ ప్రియురాలా! మామ్=నన్ను, బహుమన్యస్వ=గౌరవించుము.

తా. విశాలములైన నేత్రములతో, సద్గుణసంపన్నములైన సర్వావయవములతో సకలజనుల మనస్సును ఆకర్షించుచున్న ఓ సీతా! నేను నిన్ను కామించుచున్నాను. ఓ ప్రియురాలా! నా మీద ప్రేమ జూపుము. 3

మూ. నేహ కేచిన్మనుష్యా వా రాక్షసాః కామరూపిణః,
వ్యపసర్పతు తే సీతే భయం మత్తః సముత్థితమ్. 4

ప్ర. అ. సీతే=సీతా! ఇహ=ఇక్కడ, మనుష్యాః వా=మనుష్యులు గాని, కామరూపిణః=స్వేచ్ఛారూపముగల, రాక్షసాః వా=రాక్షసులు కాని, కేచిత్=ఎవరును, న=లేరు. మత్తః=నావలన, సముత్థితమ్=కలిగిన, తే=నీయొక్క, భయమ్=భయము, వ్యపసర్పతు=తొలగుగాక.

తా. ఓ సీతా! నీవు భయపడుటకు ఇక్కడ మనుష్యులు గాని, కామరూపధారులైన రాక్షసులు గాని ఎవ్వరూ లేరు. నాకు నీపై ప్రేమయే ఉన్నది గాన నావలన కూడ నీవేమీ భయపడవలసిన పని లేదు. 4

మూ. స్వధర్మో రక్షసాం భీరు సర్వథైవ న సంశయః,
గమనం వా పరస్త్రీణాం హరణం సంప్రమథ్య వా. 5

ప్ర. అ. భీరు=భయస్వభావము కలదానా! పరస్త్రీణామ్=పరస్త్రీలయొక్క, గమనం వా=గమనము (పొందు)గాని, సంప్రమథ్య=బలాత్కరించి, హరణం వా=హరించుటగాని, రక్షసామ్=రాక్షసులయొక్క, సర్వథైవ=అన్నివిధములచేత, స్వధర్మః=స్వధర్మము. సంశయః=సంశయము, న=లేదు.

తా. భయస్వభావము గల ఓ సీతా! పరభార్యాగమనము, బలాత్కరించి పరస్త్రీలను అపహరించుటా ఇది అన్నివిధాలా రాక్షసుల స్వధర్మము. ఏ మాత్రము సందేహము లేదు. 5

మూ. ఏవం చైతదకామాం తు న త్వాం స్ప్రక్ష్యామి మైథిలి,
కామం కామః శరీరే మే యథాకామం ప్రవర్తతామ్. 6

ప్ర. అ. మైథిలి=సీతా! ఏతత్=ఇది, ఏవమ్=ఇట్లున్నది, కామః=కామము, కామమ్=అత్యంతము, యథాకామమ్=దాని ఇష్టము వచ్చినట్లుగా, మే=నాయొక్క, శరీరే=శరీరమునందు, ప్రవర్తతామ్=ప్రవర్తించుగాక, తు=కాని, అకామామ్=కామములేని, త్వామ్=నిన్ను, న స్ప్రక్ష్యామి=స్పృశించను.

తా. సీతా! రాక్షసధర్మ మీవిధముగా ఉన్నది. అయినను, నా శరీరమును కామము దాని ఇష్టము వచ్చినట్లు ఎంత పీడించినను, నీకు నాపై ప్రేమ కలుగునంతవరకు నిన్ను స్పృశించను. 6

మూ. దేవి నేహ భయం కార్యం మయి విశ్వసిహి ప్రియే,
ప్రణయస్వ చ తత్త్వేన మైవం భూః శోకలాలసా. 7

ప్ర. అ. దేవి=ఓ దేవీ! ఇహ=ఈ విషయమునందు, భయమ్=భయము, న కార్యమ్=చేయదగినది కాదు, ప్రియే=ప్రియురాలా! మయి=నాయందు, విశ్వసిహి=విశ్వసించుము, తత్త్వేన=యథార్థముగా, ప్రణయస్వ=ప్రేమ గలదాన వగుము, ఏవమ్=ఇట్లు, శోకలాలసా=శోకముచేత వ్యాకులురాలవు, మా భూః=కాకుము.

తా. ఓ దేవీ! ఈ విషయమున భయపడవలసిన పని లేదు. ఓ ప్రియురాలా! నన్ను విశ్వసించుము. నన్ను నిజముగా ప్రేమించుము. ఈ విధముగా శోకపీడితురాలవు కాకుము. 7

మూ. ఏకవేణీ ధరాశయ్యా ధ్యానం మలినమమ్బరమ్,
అస్థానేఽప్యుపవాసశ్చ నైతాన్యౌపయికాని తే. 8

ప్ర. అ. ఏకవేణీ=ఒంటి జడ, ధరాశయ్యా=నేలపై పడక, ధ్యానమ్=నిరంతరాలోచనము, మలినమ్=మలినమైన, అమ్బరమ్=వస్త్రము, అస్థానే=తగని సమయమునందు, ఉపవాసశ్చ=ఉపవాసము, ఏతాని=ఇవి, తే=నీకు, ఔపయికాని=ఉపయోగించేవి, న=కావు.

తా. ఒంటి జడ, నేలపై పరుండుట, ఏదో ఆలోచన, మాసిన వస్త్రములు, నిష్కారణముగా ఉపవాసము చేయుట, ఇవి నీకే మాత్రము తగినవి కావు. 8

మూ. విచిత్రాణి చ మాల్యాని చన్దనాన్యగరూణి చ
వివిధాని చ వాసాంసి దివ్యాన్యాభరణాని చ. 9
మహార్హాణి చ పానాని శయనాన్యాసనాని చ
గీతం నృత్తం చ వాద్యం చ లభ మాం ప్రాప్య మైథిలి. 10

ప్ర. అ. మైథిలి=సీతా! మామ్=నన్ను, ప్రాప్య=పొంది, విచిత్రాణి=విచిత్రములైన, మాల్యాని=మాలలను, చన్దనాని=చందనములను, అగరూణి=అగరువులను, వివిధాని=అనేకవిధములైన, వాసాంసి చ=వస్త్రములను, దివ్యాని=శ్రేష్ఠములైన, ఆభరణాని చ=అలంకారములను, మహార్హాణి=శ్రేష్ఠము లైన, పానాని=పానములనూ, శయనాని=శయనములను, ఆసనాని చ=ఆసనములను, గీతమ్=గీతమును, నృత్తం చ=నృత్తమును, వాద్యం చ=వాద్యమును, లభ=పొందుము.

తా. సీతా! నీవు నన్ను పొందినచో, నీకు విచిత్రములైన మాలలు, చందనములు, అగురువు, అనేకవిధములైన వస్త్రములు, శ్రేష్ఠములైన ఆభరణములు,

ఉత్తమములైన మద్యములు, శయనములు, ఆసనములు, గీతము, నృత్తము, వాద్యము లభించగలవు. 9, 10

మూ. స్త్రీరత్నమసి మైవం భూః కురు గాత్రేషు భూషణమ్,
మాం ప్రాప్య హి కథం ను స్యాస్త్వమనర్హా సువిగ్రహే. 11

ప్ర. అ. స్త్రీరత్నమ్=స్త్రీలలో రత్నము, అసి=అయి ఉన్నావు. ఏవమ్=ఇట్లు, మా భూః=ఉండకుము. గాత్రేషు=అవయవములందు, భూషణమ్=అలంకారమును, కురు=చేయుము, సువిగ్రహే=అంద మైన శరీరము కలదానా! మామ్=నన్ను, ప్రాప్య=పొంది, త్వమ్=నీవు, అనర్హా=సుఖభోగాదులకు అనర్హురాలవు, కథం ను=ఎట్లు, స్యాః=అగుదువు ?

తా. సుందరమైన శరీరము గల ఓ సీతా! నీవు స్త్రీలలో రత్న మైన దానవు. ఈ విధముగా ఉండకూడదు. అవయవములపై అలంకారములను ధరించుము. నన్ను పొందిన పిమ్మట కూడ నీవు భోగాదులనుభవించుటకు అయోగ్యురాలవు ఎట్లగుదువు ? 11

మూ. ఇదం తే చారు సంజాతం యౌవనం వ్యతివర్తతే,
యదతీతం పునర్నైతి స్రోతః శీఘ్రమపామివ. 12

ప్ర. అ. చారు=సుందరముగా, సంజాతమ్=పుట్టిన, ఇదమ్=ఈ, తే యౌవనమ్=నీ యౌవనము, వ్యతివర్తతే=గడచిపోవుచున్నది; యత్=ఏ యౌవనము, శీఘ్రమ్=శీఘ్రముగా, అతీతమ్=గడచిపోయినదై, అపామ్=ఉదకముల, స్రోతః ఇవ=ప్రవాహము వలె, పునః=మరల, నైతి=తిరిగిరాదో.

తా. మనోహరమైన నీ యౌవనము గడచిపోవుచున్నది. ఇది శీఘ్రముగా గడచిపోయిన పిమ్మట, ప్రవహించి వెళ్ళిపోయిన జలము వలె, వెనుకకు మరలి రాదు. 12

మూ. త్వాం కృత్వోపరతో మన్యే రూపకర్తా స విశ్వసృక్,
న హి రూపోపమా త్వన్యా తవాస్తి శుభదర్శనే. 13

ప్ర. అ. శుభదర్శనే=మంగళకరమైన, దర్శనము కలదానా! రూపకర్తా= రూపమును సృజించిన, సః=ఆ, విశ్వసృక్=ప్రపంచమును సృష్టించిన బ్రహ్మదేవుడు, త్వామ్=నిన్ను, కృత్వా=చేసి, ఉపరతః=విరమించినాడు అని, మన్యే=తలచెదను. అన్యా=మరి యొక, తవ రూపోపమా=నీ రూపమునకు సాటి, నాస్తి హి=లేదు కదా.

తా. మంగళకరమైన దర్శనము కలదానా! సౌందర్యనిర్మాత యైన ఆ సృష్టికర్త నిన్ను సృజించిన పిమ్మట, ఇక సౌందర్యమును నిర్మించుట నిలిపివేసినా డని అనుకొనుచున్నాను. కావుననే నీ సౌందర్యమును పోలిన సౌందర్యము మరొకటి లేదు. 13

మూ. త్వాం సమాపాద్య వైదేహి రూపయౌవనశాలినీమ్,
కః పుమానతివర్తేత సాక్షాదపి పితామహః. 14

ప్ర. అ. వైదేహి=సీతా! రూపయౌవనశాలినీమ్=రూపములోను, యౌవనములోను ప్రకాశించుచున్న, త్వామ్=నిన్ను, సమాసాద్య=పొంది, సాక్షాత్=సాక్షాత్తూ, పితామహః=బ్రహ్మదేవుడే అయినా, కః=ఏ, పుమాన్=పురుషుడు, అతివర్తేత=అతిక్రమించును (విడిచి పెట్టును).

తా. సీతా! రూపయౌవనములతో ప్రకాశించుచున్న నిన్ను చూచినచో సాక్షాత్తు బ్రహ్మదేవుడు కూడ విడిచిపెట్టడు. ఇతరుల మాట చెప్పవలెనా ? 14

మూ. యద్యత్పశ్యామి తే గాత్రం శీతాంశుసదృశాననే,
తస్మింస్తస్మిన్ పృథుశ్రోణి చక్షుర్మమ నిబధ్యతే. 15

ప్ర. అ. శీతాంశుసదృశాననే=చంద్రునితో సమాన మైన ముఖము గలదానా! పృథుశ్రోణి=పెద్ద కటిప్రదేశము గలదానా! తే=నీయొక్క, యద్యత్=ఏ యే, గాత్రమ్=అవయవమును, పశ్యామి=చూచుచున్నానో, తస్మిన్ తస్మిన్=ఆ యా అవయవమునందు, మమ=నాయొక్క, చక్షుః=నేత్రము, నిబధ్యతే=కట్టబడుచున్నది.

తా. చంద్రునితో సమానమైన ముఖము, పెద్ద కటిప్రదేశము గల ఓ! సీతా! నా దృష్టి నీ ఏ యే అవయవముమీద ప్రసరించుచున్నదో దానిమీదనే నిలచిపోవుచున్నది. 15

మూ. భవ మైథిలి భార్యా మే మోహమేనం విసర్జయ,
బహ్వీనాముత్తమస్త్రీణామాహృతానామితస్తతః. 16
సర్వాసామేవ భద్రం తే మమాగ్రమహిషీ భవ.

ప్ర. అ. మైథిలి=సీతా! మే=నాయొక్క, భార్యా=భార్యవు, భవ=అగుము, ఏనమ్=ఈ, మోహమ్=అజ్ఞానమును, విసర్జయ=విడిచిపెట్టుము, ఇతస్తతః=ఆ యా ప్రాంతములనుండి, ఆహృతానామ్=తీసికొనిరాబడిన, బహ్వీనామ్=అనేక మైన, మమ=నాయొక్క, ఉత్తమస్త్రీణామ్=ఉత్తమస్త్రీలలో, సర్వాసామేవ=అందరిలో, అగ్రమహిషీ=ప్రధానురాలవైన పట్టపురాణివి, భవ=అగుము, తే=నీకు, భద్రమ్=మంగళమగుగాక.

తా. మైథిలీ! ఈ తెలివితక్కువతనమును విడచి, నాకు భార్యవు అగుము. నేను అనేకదేశములనుండి ఎందరినో ఉత్తమస్త్రీలను తీసికొనివచ్చి ఉన్నాను. నీవు, వారందరిలో ప్రధానురా లైన పట్టమహిషివి అగుము. నీకు భద్రము అగుగాక. 16

మూ. లోకేభ్యో యాని రత్నాని సంప్రమథ్యాహృతాని వై, 17
తాని మే భీరు సర్వాణి రాజ్యం చైతదహం చ తే.

ప్ర. అ. భీరు=భయస్వభావము కలదానా! లోకేభ్యః=లోకముల నుండి, యాని=ఏ, రత్నాని=రత్నములు, సంప్రమథ్య=బలాత్కారము చేసి, ఆహృతాని వై=తీసికొనిరాబడినవో, తాని=అవి, సర్వాణి=అన్నీ, మే=నాయొక్క, ఏతత్=ఈ, రాజ్యమ్=రాజ్యమూ, అహం చ=నేనూ, తే=నీకు సంబంధించినవారము.

తా. ఓ భయస్వభావము గలదానా! ఆ యా లోకములను జయించి నేను తీసికొని వచ్చిన అన్ని శ్రేష్ఠవస్తువులూ, ఈ రాజ్యమూ, నేను కూడ నీకు చెందినవారము. 17

మూ. విజిత్య పృథివీం సర్వాం నానానగరమాలినీమ్, 18
జనకాయ ప్రదాస్యామి తవ హేతోర్విలాసిని.

ప్ర. అ. విలాసిని=విలాసము కలదానా! నానానగరమాలినీమ్=అనేక నగరముల సముదాయముతో కూడిన, సర్వామ్=సమస్త మైన, పృథివీమ్=భూమిని, విజిత్య=జయించి, తవ హేతోః=నీ నిమిత్తము, జనకాయ=జనక మహారాజునకు, ప్రదాస్యామి=ఇవ్వగలను.

తా. ఓ! విలాసినీ! అనేకనగరములతో కూడిన ఈ భూమి నంతను నీకు గాను జయించి, నీ తండ్రియైన జనకునకు ఇచ్చెదను. 18

మూ. నేహ పశ్యామి లోకేఽన్యం యో మే ప్రతిబలో భవేత్.
పశ్య మే సుమహద్వీర్యమప్రతిద్వన్ద్వమాహవే. 19

ప్ర. అ. యః=ఎవడు, మే=నాకు, ప్రతిబలః=ఎదిరించువాడు, భవేత్= అగునో, అట్టి, అన్యమ్=మరియొకనిని, ఇహ లోకే=ఈ లోకము నందు, న పశ్యామి=చూడను, ఆహవే=యుద్ధమునందు, అప్రతిద్వన్ద్వమ్=ఎదిరించువాడులేని, మే=నాయొక్క, సుమహత్=చాల గొప్పదైన, వీర్యమ్=పరాక్రమమును, పశ్య=చూడుము.

తా. ఈ లోకములో నన్నెదిరించగలిగినవాడెవ్వడూ కనబడడు. యుద్ధములో ఎదిరించువారెవ్వరూ లేని నా మహాపరాక్రమము ఎంతటిదో గుర్తించుము. 19

మూ. అసకృత్సంయుగే భగ్నా మయా విమృదితధ్వజాః, 20
అశక్తాః ప్రత్యనీకేషు స్థాతుం మమ సురాసురాః.

ప్ర. అ. మయా=నాచేత, అసకృత్=అనేకపర్యాయములు, సంయుగే=యుద్ధమునందు, భగ్నాః=ఓడించబడినవారూ, విమృదితధ్వజాః=నలగగొట్టబడిన ధ్వజములు కలవారూ అయిన, సురాసురాః=దేవతలూ రాక్షసులూ కూడ, మమ=నాయొక్క, ప్రత్యనీకేషు=ఎదుటి సేనలయందు, స్థాతుమ్=నిలబడుటకు, అశక్తాః=అసమర్థులు.

తా. నేను ఎన్నో పర్యాయములు, యుద్ధములలో సురులను అసురులనూ కూడ ఓడించి వారి ధ్వజములను ఛేదించినాను. వాళ్ళెవ్వరూ నా శత్రుసేనలలో (శత్రువులుగా) నిలబడజాలరు. 20

మూ. ఇచ్ఛ మాం క్రియతామద్య ప్రతికర్మ తవోత్తమమ్, 21
సప్రభాణ్యవసజ్యన్తాం తవాంగే భూషణాని చ,
సాధు పశ్యామి తే రూపం సంయుక్తం ప్రతికర్మణా. 22

ప్ర. అ. మామ్=నన్ను, ఇచ్ఛ=కోరుము, అద్య=ఇప్పుడు, తవ=నీయొక్క, ఉత్తమమ్=ఉత్తమమైన, ప్రతికర్మ=అలంకరణము, క్రియతామ్=చేయబడుగాక. తవ=నీయొక్క, అఙ్గే=శరీరమునందు, సప్రభాణి=కాంతితో కూడిన, భూషణాని చ=అలంకారములు, అవసజ్యన్తామ్=కూర్చబడుగాక, ప్రతికర్మణా=అలంకరణముతో, యుక్తమ్=కూడిన, తే=నీయొక్క, రూపమ్=రూపమును, సాధు=బాగుగా, పశ్యామి=చూచెదను.

తా. నామీద ప్రేమ చూపుము. ఇప్పుడు ఉత్తమమైన అలంకరణము చేసికొనుము. నీ శరీరము మీద కాంతి గల అలంకారములను ధరించుము. నీవు చక్కగా అలంకరించుకొని యుండగా నీ రూపము చూడవలెనని ఉన్నది. 21,22

మూ. ప్రతికర్మాభిసంయుక్తా దాక్షిణ్యేన వరాననే,
భుంక్ష్వ భోగాన్యథాకామం పిబ భీరు రమస్వ చ. 23

ప్ర. అ. వరాననే=శ్రేష్ఠమైన ముఖము గలదానా! భీరు=భయస్వభావము కలదానా! దాక్షిణ్యేన=సరళమైన స్వభావములతో, ప్రతికర్మాభిసంయుక్తా=అలంకరణముతో కూడుకొన్నదానవై, యథాకామమ్=ఇష్టము వచ్చి నట్లుగా, భోగాన్=భోగములను, భుంక్ష్వ=అనుభవింపుము, పిబ=త్రాగుము. రమస్వ చ=క్రీడించుము.

తా. అందమైన ముఖము గల ఓ! భయస్వభావురాలా! సరళమైన ప్రవృత్తిని అవలంబించి చక్కగా అలంకరించుకొని, నీకిష్టము వచ్చినట్లు భోగములనుభవించుము; త్రాగుము; ఆనందముగా ఉండుము. 23

మూ. యథేచ్ఛం చ ప్రయచ్ఛ త్వం పృథివీం వా ధనాని చ,
లలస్వ మయి విస్రబ్ధా ధృష్టమాజ్ఞాపయస్వ చ. 24

ప్ర. అ. త్వమ్=నీవు, పృథివీమ్=భూమిని, ధనాని చ=ధనములను, యథేచ్ఛమ్=నీకు ఇచ్ఛవచ్చినట్లు, ప్రయచ్ఛ=దానము చేయుము. విస్రబ్ధా=విశ్వాసము కలదానివై, మయి=నా విషయమునందు, లలస్వ=క్రీడింపుము. ధృష్టమ్=నిర్భయముగా, ఆజ్ఞాపయస్వ చ= ఆజ్ఞాపించుము కూడ.

తా. నీ కిష్టమైన వారికి భూములను, ధనములను పంచిపెట్టుము. విశ్వాసముతో నన్ను కలిసి ఆనందించుము. నిర్భయముగా నన్ను ఆజ్ఞాపించుము.

మూ. మత్ప్రసాదాల్లలన్త్యాశ్చ లలన్తాం బాన్ధవాస్తవ,
ఋద్ధిం మమానుపశ్య త్వం శ్రియం భద్రే యశశ్చ మే.

ప్ర. అ. మత్ప్రసాదాత్=నా అనుగ్రహము వలన, లలన్త్యాః=క్రీడించుచున్న, తవ=నీయొక్క, బాన్ధవాః=బంధువులు, లలన్తామ్=క్రీడించెదరు గాక, భద్రే=మంగళప్రదురాలా! త్వమ్=నీవు, మమ=నాయొక్క, ఋద్ధిమ్=ఐశ్వర్యమును, మే=నాయొక్క, యశశ్చ=కీర్తినీ, అనుపశ్య=చూడుము.

తా. నా అనుగ్రహముచేత, నీతో పాటు నీ బంధువులు కూడ ఆనందించెదరు గాక. ఓ మంగళప్రదురాలా! నా కెంత ఐశ్వర్యము, కీర్తి ఉన్నవో చూడుము! 25

మూ. కిం కరిష్యసి రామేణ సుభగే చీరవాససా,
నిక్షిప్తవిజయో రామో గతశ్రీర్వనగోచరః, 26
వ్రతీ స్థణ్డిలశాయీ చ శఙ్కే జీవతి వా న వా.

ప్ర. అ. సుభగే=ఓ సుందరీ, చీరవాససా=నారబట్టలను ధరించిన, రామేణ=రామునితో, కిమ్=ఏమి, కరిష్యసి=చేయుగలవు? నిక్షిప్తవిజయః=విడువబడిన జయము కలవాడూ, గతశ్రీః=పోయిన రాజ్యలక్ష్మి కలవాడు, వనగోచరః=వనమునందు సంచరించుచున్నవాడు, వ్రతీ=తాపసవ్రతమును అవలంబించినవాడు, స్థణ్డిలశాయీ చ=నేలపై పరుండువాడు అయిన, రామః=రాముడు, జీవతి వా=జీవించి ఉన్నాడా, న వా=లేడా అని, శఙ్కే=సందేహించుచున్నాను.

తా. ఓ సుందరీ! నారబట్టలు కట్టుకునే రామునితో ఏమి చేసెదవు ? విజయము లేక, ఐశ్వర్యము కోల్పోయి, వనములో నివసించుచు, మునివ్రతము అవలంబించి నేలపై పండుకొనే ఆ రాముడు జీవించి ఉన్నాడా లేదా అనునది కూడ సందిగ్ధమే! 26

మూ. న హి వైదేహి రామస్త్వాం ద్రష్టుం వా ప్యుపలప్స్యతే,
పురోబలాకైరసితైర్మేఘైర్జ్యోత్స్నామివావృతామ్. 27

ప్ర. అ. వైదేహి=సీతా! రామః=రాముడు, త్వామ్=నిన్ను, పురోబలాకైః= ముందుభాగమునందు కొంగలు గల, అసితైః=నల్లని, మేఘైః=మేఘములచేత, ఆవృతామ్=కప్పబడిన, జ్యోత్స్నామివ=వెన్నెలను వలె, ద్రష్టుం వాపి=చూచుటకు కూడ, న హి ఉపలప్స్యతే=అవకాశమును పొందజాలడు కదా!

తా. ఓ! సీతా! ఎదుట కొంగలు ఎగురుచున్న నల్లని మేఘములు కప్పి వేసిన వెన్నెలను వలె నిన్ను చూచుటకు కూడ రామునికి శక్యము కాదు. 27

మూ. న చాపి మమ హస్తాత్త్వాం ప్రాప్తుమర్హతి రాఘవః, 28
హిరణ్యకశిపుః కీర్తిమిన్ద్రహస్తగతామివ.

ప్ర. అ. హిరణ్యకశిపుః=హిరణ్యకశిపుడు, ఇన్ద్రహస్తగతామ్=ఇంద్రుని హస్తమును పొందిన, కీర్తిమివ=కీర్తిని వలె, రాఘవః=రాముడు,మమ హస్తాత్=నా హస్తమునుండి, త్వామ్=నిన్ను, ప్రాప్తుమ్=పొందుటకు, న చాపి అర్హతి=తగడు కూడ.

తా. హిరణ్యకశిపుడు ఇంద్రుని చేతిలో చిక్కిన తన భార్యయైన కీర్తిని పొంద గలిగినాడు. కాని రాముడు మాత్రము నా చేజిక్కిన నిన్ను పొందజాలడు.

మూ. చారుస్మితే చారుదతి చారునేత్రే విలాసిని, 29
మనో హరసి మే భీరు సుపర్ణః పన్నగం యథా.

ప్ర. అ. చారుస్మితే=అందమైన చిరునవ్వు గలదానా! చారుదతి=అంద మైన పలువరస గలదానా! చారునేత్రే=అందమైన నేత్రములు గల దానా! విలాసిని=విలాసము గలదానా! భీరు=భయస్వభావము గలదానా! సుపర్ణః=గరుత్మంతుడు, పన్నగం యథా=సర్పమును వలె, మే=నాయొక్క, మనః=మనస్సును, హరసి=హరించుచున్నావు.

తా. చాల అందమైన చిరునవ్వు, అందమైన పలువరస, అందమైన కళ్లు, మనోహరములైన విలాసములు గల, ఓ భయస్వభావవంతురాలవైన సీతా! గరుత్మంతుడు సర్పమును హరించి నట్లు, నా మనస్సును హరించుచున్నావు.

మూ. క్లిష్టకౌశేయవసనాం తన్వీమప్యనలంకృతామ్, 30
త్వాం దృష్ట్వా స్వేషు దారేషు రతిం నోపలభామ్యహమ్.

ప్ర. అ. క్లిష్టకౌశేయవసనామ్=నలిగిపోయిన పట్టుచీర కట్టుకున్నదానవు, తన్వీమ్=కృశించినదానవు అయిన, త్వామ్=నిన్ను, అనలంకృతామపి=అలంకరించుకొనకున్నను, దృష్ట్వా=చూచి, అహమ్=నేను, స్వేషు=నాసంబంధమైన, దారేషు=భార్యలయందు, రతిమ్=ఆనందమును, నోపలభామి=పొందుట లేదు.

తా. నీవు నలిగిపోయిన పట్టువస్త్రము కట్టుకొని ఉన్నావు. చిక్కిపోయినావు. ఏ అలంకారములూ ధరించలేదు. నీవు ఇట్టి స్థితిలో ఉన్నను నిన్ను చూచిన పిదప నా భార్యలవలన ఆనందము పొందజాలకున్నాను. 30

మూ. అన్తఃపురనివాసిన్యః స్త్రియః సర్వగుణాన్వితాః, 31
యావన్త్యో మమ సర్వాసామైశ్వర్యం కురు జానకి.

ప్ర. అ. జానకి=సీతా!మమ=నాయొక్క, అన్తఃపురనివాసిన్యః=అంతఃపురములో నివసించు, సర్వగుణాన్వితాః=సమస్తగుణములతోకూడిన, యావన్త్యః=ఎందరు, స్త్రియః=స్త్రీలు గలరో, సర్వాసామ్=అందరి విషయమునందూ, ఐశ్వర్యమ్=ఆధిపత్యమును, కురు=చేయుము.

తా. ఓ సీతా! నా అంతఃపురములో ఉత్తమగుణవతులైన ఎందరో స్త్రీలు ఉన్నారు. వారి అందరిపైన నీకు ఆధిపత్యము లభించగలదు. 31

మూ. మమ హ్యసితకేశాన్తే త్రైలోక్యప్రవరాః స్త్రియః, 32
తాస్త్వాం పరిచరిష్యన్తి శ్రియమప్సరసో యథా.

ప్ర. అ. అసితకేశాన్తే=నల్లని కేశములు గలదానా, మమ=నాయొక్క, తాః=ఆ, త్రైలోక్యప్రవరాః=మూడు లోకములందు శ్రేష్ఠులైన, స్త్రియః=స్త్రీలు, అప్సరసః=అప్సరఃస్త్రీలు, శ్రియం యథా=లక్ష్మిని వలె, త్వామ్=నిన్ను, పరిచరిష్యన్తి=ఉపచరించగలరు.

తా. నల్లని కేశపాశము గల ఓ సీతా! మూడులోకములందూ శ్రేష్ఠలైన నా స్త్రీలు అందరూ, అప్సరఃస్త్రీలు లక్ష్మిని సేవించి నట్లు నిన్ను సేవించగలరు.

మూ. యాని వైశ్రవణే సుభ్రు రత్నాని చ ధనాని చ, 33
తాని లోకాంశ్చ సుశ్రోణి మాం చ భుంక్ష్వ యథాసుఖమ్.

ప్ర. అ. సుశ్రోణి=అందమైన కటిప్రదేశము గలదానా! సుభ్రు=అందమైన కనుబొమ్మలు కలదానా, వైశ్రవణే=కుబేరునియందు, యాని=ఏ, రత్నాని=రత్నములు,

ధనాని చ=ధనములూ ఉన్నవో, తాని=వాటినీ, లోకాంశ్చ=మూడులోకములను, మాం చ=నన్నూ, యథాసుఖమ్=సుఖము కలుగునట్లుగా, భుంక్ష్వ=అనుభవించుము.

తా. అందమైన కనుబొమ్మలూ, కటిప్రదేశమూ గల ఓ సీతా! కుబేరునికి సంబంధించిన రత్నములనూ, ధనములనూ, మూడు లోకములనూ, నన్నూ కూడ సుఖముగా అనుభవించుము. 33

మూ. న రామస్తపసా దేవి న బలేన న విక్రమైః, 34
న ధనేన మయా తుల్యస్తేజసా యశసాపి వా.

ప్ర. అ. దేవి=సీతా! రామః=రాముడు, తపసా=తపస్సుచేత, మయా=నాతో, న తుల్యః=సమానుడు కాడు, బలేన=బలముచేత, న=కాడు, విక్రమైః=పరాక్రమములచేత, న=కాడు. ధనేన=ధనముచేత గాని, తేజసా=తేజస్సుచేత గాని, యశసాపి వా=కీర్తిచేత గాని, న=సమానుడు కాడు.

తా. సీతా! రాముడు, తపస్సుచేత గాని, బలముచేత గాని, పరాక్రమముచేత గాని, ధనముచేత గాని, తేజస్సుచేత గాని, కీర్తిచేత గాని నాతో సమానుడు కాడు. 34

మూ. పిబ విహర రమస్వ భుంక్ష్వ భోగాన్
ధననిచయం ప్రదిశామి మేదినీం చ,
మయి లల లలనే యథాసుఖం త్వం
త్వయి చ సమేత్య లలన్తు బాన్ధవాస్తే. 35

ప్ర. అ. లలనే=విలాసస్వభావము గలదానా! ధననిచయమ్=ధనసముదాయమును, మేదినీం చ=భూమినీ, ప్రదిశామి=ఇచ్చెదను, త్వమ్=నీవు, పిబ=త్రాగుము, విహర=విహరించుము. రమస్వ=క్రీడించుము. భోగాన్=భోగములను, భుఙ్క్ష్వ=అనుభవింపుము. యథాసుఖమ్=సుఖముగా, మయి=నాయందు, లల=క్రీడించుము. తే=నీయొక్క, బాన్ధవాః=బంధువులు, సమేత్య=కలసి, త్వయి=నీయందు, లలన్తు=క్రీడించెదరు గాక.

తా. విలాసస్వభావము గల ఓ సీతా! నీకు ధనరాశులను, భూమిని ఇచ్చెదను. నీకు ఇష్టము వచ్చి నట్లు త్రాగుము, విహరించుము; క్రీడించుము; భోగములు అనుభవించుము ; నాతో కలిసి ఆనందించుము. నీ బంధువులందరూ కూడ నీతో కలిసి ఆనందించవచ్చును. 35

మూ. కుసుమితతరుజాలసంతతాని
భ్రమరయుతాని సముద్రతీరజాని,

కనకవిమలహారభూషితాఙ్గీ
విహర మయా సహ భీరు కాననాని. 36

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే సున్దరకాణ్డే
వింశః సర్గః

ప్ర. అ. భీరు=భయస్వభావము కలదానా! కనకవిమలహారభూషితాఙ్గీ=బంగారు వికారములైన, స్వచ్ఛమైన హారములతో అలంకరింపబడిన దేహము కలదానవై, కుసుమితతరుజాలసంతతాని=పుష్పించిన వృక్షసముదాయములతో నిండినవీ, భ్రమరయుతాని=తుమ్మెదలతో కూడినవీ, సముద్రతీరజాని=సముద్రతీరమునందు పుట్టినవీ అయిన, కాననాని=అడవులను, మయా సహ=నాతో కూడ, విహర=విహరించుము.

తా. భయస్వభావము గల సీతా! నీవు బంగారువికారములైన, ప్రకాశించుచున్న హారములను అలంకరించుకొని, నాతో కలిసి, పుష్పించిన వృక్షముల సముదాయములతో నిండినవి, తుమ్మెదలతో ధ్వనించుచున్నవి అయిన సముద్రతీరమునందలి ఉద్యానవనములలో విహరించుము. 36

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు
సుందరకాండలో ఇరువదవ సర్గ సమాప్తము.

అథ ఏకవింశః సర్గః

["నీవు రామునితో పోల్చుటకు కూడ తగని తుచ్ఛుడవు" అని నిందించుచు సీత రావణునికి బోధించుట]

మూ. తస్య తద్వచనం శ్రుత్వా సీతా రౌద్రస్య రక్షసః,
ఆర్తా దీనస్వరా దీనం ప్రత్యువాచ తతః శనైః. 1

ప్ర. అ. సీతా=సీత, రౌద్రస్య=భయంకరుడైన, తస్య=ఆ, రక్షసః=రాక్షసునియొక్క, తత్=ఆ, వచనమ్=వచనమును, శ్రుత్వా=విని, ఆర్తా=పీడితురాలై, దీనస్వరా=దీనమైన స్వరము గలదై, దీనమ్=దీనముగా, శనైః=మెల్లగా, వచః=వాక్యమును, ప్రత్యువాచ=తిరిగి పలికెను.

తా. భయంకరుడైన ఆ రావణుని మాటలు విని, సీత, దుఃఖించుచు, దీనమైన స్వరము కలదై, మెల్లగా, దీనముగా ఇట్లు పలికెను. 1

మూ. దుఃఖార్తా రుదతీ సీతా వేపమానా తపస్వినీ,
చిన్తయన్తీ వరారోహా పతిమేవ పతివ్రతా, 2
తృణమన్తరతః కృత్వా ప్రత్యువాచ శుచిస్మితా.

ప్ర. అ. దుఃఖార్తా=దుఃఖముచేత పీడింపబడినదీ, తపస్వినీ=జాలిగొల్పు స్థితిలో ఉన్నదీ, వరారోహా=శ్రేష్ఠమైన కటిప్రదేశము గలదీ, పతివ్రతా=పతివ్రతా, పతిమేవ=భర్తనే గూర్చి, చిన్తయన్తీ=ఆలోచించుచున్నదీ, శుచిస్మితా=తెల్లని చిరునవ్వు గలదీ అయిన, సీతా=సీత, రుదతీ=ఏడ్చుచున్న దై, వేపమానా=వణికిపోవుచున్నదై, తృణమ్=గడ్డిపరకను, అన్తరతః=మధ్యయందు ఉండునట్లు, కృత్వా=చేసి, ప్రత్యువాచ=బదులు చెప్పెను.

తా. అందమైన కటిప్రదేశము, తెల్లని చిరునవ్వు గల మహాపతివ్రతయైన ఆ సీత, దుఃఖపీడితురాలై, దయనీయమైన స్థితిలో ఏడ్చుచు, భర్తనే తలచుచు, ప్రత్యక్షముగా రావణునితో మాటలాడుటకు ఇష్టము లేకపోవుటచే మధ్య ఒక గడ్డిపరకను అడ్డముగా ఉంచి, వణకిపోవుచు ఇట్లు పలికెను. 2

మూ. నివర్తయ మనో మత్తః స్వజనే క్రియతాం మనః, 3
న మాం ప్రార్థయితుం యుక్తం సుసిద్ధిమివ పాపకృత్.

ప్ర. అ. మత్తః=నానుంచి, మనః=మనస్సును, నివర్తయ=మరల్చుకొనుము. స్వజనే=నీ భార్యలయందు, మనః=మనస్సు, క్రియతామ్=చేయబడుగాక, పాప కృత్=పాపము చేయువాడు, సుసిద్ధిమివ=ఉత్తమమైన సిద్ధిని వలె, మామ్=నన్ను, ప్రార్థయితుమ్=ప్రార్థించుటకు, న యుక్తమ్=యుక్తము కాదు.

తా. నీ మనస్సును నామీదనుంచి మరల్చి నీ భార్యలపై నిలుపుము. నీ భార్యలను ప్రేమించుము. పాపములే చేసినవాడు ఉత్తమమైన సిద్ధిని ఎట్లు ఆశించకూడదో, అట్లే నీవు నన్ను ఆశించకూడదు. 3

మూ. అకార్యం న మయా కార్యమేకపత్న్యా విగర్హితమ్, 4
కులం సంప్రాప్తయా పుణ్యం కులే మహతి జాతయా.

ప్ర. అ. మహతి=గొప్ప, కులే=కులమునందు, జాతయా=పుట్టినదానను, పుణ్యామ్=పవిత్రమైన, కులమ్=కులమును, సంప్రాప్తయా=పొందిన దానను, ఏకపత్న్యా=ఒకే భర్త కలదానను (పతివ్రతను) అయిన, మయా=నా చేత, విగర్హితమ్=నిందింపబడిన, అకార్యమ్=చెడ్డ పని, న కార్యమ్=చేయుదగినది కాదు.

తా. నేను ఉత్తమవంశములో పుట్టి, ఉత్తమ మైన వంశములోనికి కోడలుగా వెళ్ళితిని. పతివ్రతను. నింద్య మైన ఇట్టి అకార్యమును నేను చేయజాలను. 4

మూ. ఏవముక్త్వా తు వైదేహీ రావణం తం యశస్వినీ, 5
రాక్షసం పృష్ఠతః కృత్వా భూయో వచనమబ్రవీత్.

ప్ర. అ. యశస్వినీ=కీర్తి గల, వైదేహీ=సీత, తం రావణమ్=ఆ రావణుని గూర్చి, ఏవమ్=ఇట్లు, ఉక్త్వా=పలికి, రాక్షసమ్= ఆ రాక్షసుని, పృష్ఠతః=వెనుకకు, కృత్వా=చేసి, భూయః=మరల, వచనమ్=వచనమును, అబ్రవీత్=పలికెను.

తా. కీర్తిమంతురాలైన సీత రావణునితో ఇట్లు పలికి అతని వైపు వీపు త్రిప్పి, మరల ఇట్లు పలికెను. 5

మూ. నాహమౌపయికీ భార్యా పరభార్యా సతీ తవ, 6
సాధు ధర్మమవేక్షస్వ సాధు సాధువ్రతం చర.

ప్ర. అ. పరభార్యా=పరభార్యను, సతీ=పతివ్రతను అయిన, అహమ్=నేను, తవ=నీకు, ఔపయికీ=తగిన, భార్యా=భార్యను, న=కాను, ధర్మమ్=ధర్మమును, సాధు=బాగుగా, అవేక్షస్వ=పరిశీలింపుము. సాధువ్రతమ్=సత్పురుషుల వ్రతమును, సాధు=చక్కగా, చర=ఆచరించెను.

తా. పరభార్యను, పతివ్రతను అయిన నేను నీకు తగిన భార్యను కాను. ధర్మమును బాగుగా చూడుము. సత్పురుషులనుసరించు నియమములను చక్కగా పాటించుము. 6

మూ. యథా తవ తథాన్యేషాం దారా రక్ష్యా నిశాచర. 7
ఆత్మానముపమాం కృత్వా స్వేషు దారేషు రమ్యతామ్.

ప్ర. అ. నిశాచర=ఓ! రాక్షసుడా! తవ=నీ భార్యలు, యథా=ఎట్లో, అన్యేషామ్=ఇతరులయొక్క, దారాః=భార్యలు, తథా=అట్లే, రక్ష్యాః=రక్షించదగినవారు. ఆత్మానమ్=తననే, ఉపమామ్=ఉపమానముగా, కృత్వా=చేసికొని, స్వేషు=తన సంబంధమైన, దారేషు=భార్యలయందు, రమ్యతామ్=రమించబడుగాక.

తా. ఓ రాక్షసుడా! నీ భార్యలు ఎట్లు రక్షింపదగినవారో ఇతరుల భార్యలు కూడ అట్లే రక్షింపదగినవారు. అందుచేత నిన్నే ఉపమానము చేసి చూచుకొని, నీ భార్యలను ఇతరులు అభిమర్శించినచో నీకెట్లుండునో అట్లే నీవు ఇతరుల భార్యలను అభిమర్శించినచో వారికుండునను విషయము గ్రహించి, నీ భార్యలతో నీవు రమింపుము. 7

మూ. అతుష్టం స్వేషు దారేషు చపలం చలితేన్ద్రియమ్, 8
నయన్తి నికృతిప్రజ్ఞం పరదారాః పరాభవమ్.

ప్ర. అ. స్వేషు=తన సంబంధమైన, దారేషు=భార్యలయందు, అతుష్టమ్=సంతృప్తి చెందనివాడూ, చపలమ్=చపలస్వభావము కలవాడూ, చలితేన్ద్రియమ్=చలించిన ఇంద్రియములు కలవాడూ అయిన, నికృతిప్రజ్ఞమ్=నీచబుద్ధి గలవానిని, పరదారాః=పరభార్యలు, పరాభవమ్=పరాభవమును, నయన్తి=పొందించెదరు.

తా. చపలస్వభావుడై, తన భార్యలతో సంతృప్తి చెందక ఇంద్రియ నిగ్రహము లేకుండా ఉన్న నీచబుద్ధి కలవానిని, పరభార్యలు పరాభవమును పొందింతురు. (అనగా పరదారాసక్తి వాని పతనమునకు హేతువగును.) 8

మూ. ఇహ సన్తో న వా సన్తి సతో వా నానువర్తసే, 9
తథాహి విపరీతా తే బుద్ధిరాచారవర్జితా.

ప్ర. అ. ఇహ=ఈ దేశములో, సన్తః=సత్పురుషులు, న వా సన్తి=లేరా? సతః=ఉన్నవారిని, నానువర్తసే వా=నీవు అనుసరించుటలేదా? తథాహి=అది యుక్తమే (ఎందుచేత ననగా), ఆచారవర్జితా=సదాచారముతో శూన్యమైన, తే=నీయొక్క, బుద్ధిః=బుద్ధి, విపరీతా=విపరీతముగా ఉన్నది.

తా. నీ బుద్ధి సత్ప్రవర్తన లేక విపరీతముగా ప్రసరించుచున్నది ; ఈ దేశములో నీకు సద్బుద్ధి బోధించే మంచివారే లేరా, ఉన్నా వారి మాటను నీవు వినుటలేదా? 9

మూ. వచో మిథ్యాప్రణీతాత్మా పథ్యముక్తం విచక్షణైః, 10
రాక్షసానామభావాయ త్వం వా న ప్రతిపద్యసే.

ప్ర. అ. మిథ్యాప్రణీతాత్మా=అయుక్తమార్గమునందు నడపబడుచున్న బుద్ధి గల, త్వమ్=నీవు, విచక్షణైః=నీతియందు నేర్పు గలవారిచేత, ఉక్తమ్=చెప్పబడిన, పథ్యమ్=హితమైన, వచః=వచనమును, రాక్షసానామ్=రాక్షసుల యొక్క, అభావాయ=నాశముకొరకు, న ప్రతిపద్యసే=గ్రహించుటలేదా!

తా. ధర్మమార్గము తెలిసిన సత్పురుషులు నీకు హితమును ఉపదేశించినా అధర్మమార్గమునందు ప్రవర్తించుచున్న చిత్తము గల నీవు, రాక్షసుల వినాశము దాపురించుటచే ఆ ఉపదేశమును లెక్కచేయుట లేదా! 10

మూ. అకృతాత్మానమాసాద్య రాజానమనయే రతమ్, 11
సమృద్ధాని వినశ్యన్తి రాష్ట్రాణి నగరాణి చ.

ప్ర. అ. అకృతాత్మానమ్=అదుపులో ఉంచుకొనబడని బుద్ధి గలవాడు, అనయే=చెడుమార్గమునందు, రతమ్=ఆసక్తి కలవాడూ అయిన, రాజానమ్=రాజును, ఆసాద్య=పొంది, సమృద్ధాని=ఐశ్వర్య సంపన్నములైన, రాష్ట్రాణి=రాష్ట్రములు, నగరాణి చ=నగరములూ కూడ, వినశ్యన్తి=నశించును.

తా. మనస్సు అదుపులో లేక అమార్గమునందు ప్రవర్తించు రాజు పరిపాలనలో ఐశ్వర్యసంపన్నములైన రాష్ట్రములు, నగరములూ కూడ నశించును.

మూ. తథేయం త్వాం సమాసాద్య లఙ్కా రత్నౌఘసంకులా, 12
అపరాధాత్తవైకస్య నచిరాద్వినశిష్యతి.

ప్ర. అ. తథా=ఆ విధముగా ఉన్న, త్వామ్=నిన్ను, సమాసాద్య=పొంది, రత్నౌఘసంకులా=శ్రేష్ఠమైన వస్తువుల సముదాయముతో నిండిన, ఇయమ్=ఈ, లఙ్కా=లంక, ఏకస్య=ఒక్క, తవ=నీయొక్క, అపరాధాత్=అపరాధమువలన, నచిరాత్=కొద్ది కాలములో, వినశిష్యతి=నశించగలదు.

తా. అలాంటి నీవు రాజుగా దొరకుటచే సకలైశ్వరసంపన్నమైన ఈ లంక నీ ఒక్కని మూలమున, కొద్ది కాలములో నశించగలదు. 12

మూ. స్వకృతైర్హన్యమానస్య రావణాదీర్ఘదర్శినః. 13
అభినన్దన్తి భూతాని వినాశే పాపకర్మణః.

ప్ర. అ. రావణ=ఓ! రావణా! అదీర్ఘదర్శినః=దూరదృష్టిలేనివాడు, స్వకృతైః=తనచేత చేయబడిన దుష్కార్యములచేత, హన్యమానస్య=కొట్టబడుచున్న వాడు అయిన, పాపకర్మణః=పాపకర్మలు చేయువాని యొక్క, వినాశే=వినాశము కలిగినప్పుడు, భూతాని=ప్రాణులు, అభినన్దన్తి=సంతోషించును.

తా. దీర్ఘదృష్టి లేని పాపాత్ముడు, తాను చేసిన పనులే దెబ్బ తీయగా నశించి పోవుచున్నపుడు, వానిని చూచి సకలప్రాణులు సంతోషింతురు. 13

మూ. ఏవం త్వాం పాపకర్మాణం వక్ష్యన్తి నికృతా జనాః, 14
దిష్ట్యైతద్ వ్యసనం ప్రాప్తో రౌద్ర ఇత్యేవ హర్షితాః.

ప్ర. అ. ఏవమ్=ఇట్లు నశించిన, పాపకర్మాణమ్=పాపకర్మలు గల, త్వామ్=నిన్ను గూర్చి, నికృతాః=నీచేత అవమానింపబడిన, జనాః=జనులు, హర్షితాః=సంతోషించినవారై, రౌద్రః=క్రూరుడైన రావణుడు, దిష్ట్యా=దైవవశముచేత, ఏతత్=ఈ, వ్యసనమ్=ఆపదను, ప్రాప్తః=పొందినాడు, ఇత్యేవ=అని, వక్ష్యన్తి=పలకగలరు.

తా. పాపకర్మలు చేయుచున్న నీవు కూడ ఇట్లే నశించగలవు. అప్పుడు నీచే పీడింపబడిన వారందరూ సంతోషించుచు, "మన అదృష్టము కొలది ఈ క్రూరునికి ఇట్టి ఆపద వచ్చినది" అనుకొనెదరు. 14

మూ. శక్యా లోభయితుం నాహమైశ్వర్యేణ ధనేన వా. 15
అనన్యా రాఘవేణాహం భాస్కరేణ ప్రభా యథా.

ప్ర. అ. అహమ్=నేను, ఐశ్వర్యేణ=ఐశ్వర్యముచేత గాని, ధనేన వా=ధనముచేత గాని, లోభయితుమ్=లోభపెట్టుటకు, న శక్యా=శక్యమైన దానను కాను. ప్రభా=కాంతి, భాస్కరేణ యథా=సూర్యునితో వలె, అహమ్=నేను, రాఘవేణ=రాఘవునితో, అనన్యా=వేరుకానిదానిని.

తా. ఐశ్వర్యమునూ, ధనమునూ, చూపించి నన్నెవరూ లోభపెట్టజాలరు. కాంతి సూర్యునినుండి ఏ విధముగా వేరుకాదో ఆ విధముగా నేను రామునినుండి వేరు కాను. 15

మూ. ఉపధాయ భుజం తస్య లోకనాథస్య సత్కృతమ్, 16
కథం నామోపధాస్యామి భుజమన్యస్య కస్య చిత్.

ప్ర. అ. లోకనాథస్య=సకలలోక ప్రభువైన, తస్య=ఆ రాముని యొక్క, సత్కృతమ్=పూజింపబడిన, భుజమ్=భుజమును, ఉపధాయ=తలగడగా చేసికొని, అన్యస్య=ఇతరుడైన, కస్య చిత్=ఏ ఒక్కనియొక్కయో, భుజమ్=భుజమును, కథం నామ=ఎట్లు, ఉపధాస్యామి=తలగడగా గ్రహించగలను?

తా. ఇంతకాలమూ, సకలలోకనాథుడైన ఆ రాముని భుజమును తలగడగా ఉపయోగించుకొని సుఖముగా నిద్రించిన నేను ఎవ్వడో మరొక్కని భుజమును తలగడగా ఎట్లు స్వీకరించగలను! 16

మూ. అహమౌపయికీ భార్యా తస్యైవ వసుధాపతేః, 17
వ్రతస్నాతస్య విప్రస్య విద్యేవ విదితాత్మనః.

ప్ర. అ. వ్రతస్నాతస్య=విద్యావ్రతస్నానము చేసిన, విదితాత్మనః=ప్రసిద్ధమైన బుద్ధిగల, విప్రస్య=బ్రాహ్మణునకు, విద్యా ఇవ=విద్యవలె, అహమ్=నేను, వసుధాపతేః=ఈ భూమి కంతకీ ప్రభువైన, తస్యైవ=ఆ రామునకే, ఔపయికీ=తగిన, భార్యా=భార్యను.

తా. వేదాధ్యయనము చేయుటకు అవలంబించిన వ్రతమును పూర్తి చేసి కొన్న బ్రాహ్మణునకు ఆ వేదవిద్య ఏ విధముగా తగి యుండునో అట్లే నేను సమస్త మైన భూమికి ప్రభువైన ఆ రామునకు మాత్రమే భార్యనగుటకు తగిన దానను. 17

మూ. సాధు రావణ రామేణ మాం సమానయ దుఃఖితామ్, 18
వనే వాశితయా సార్ధం కరేణ్వేవ గజాధిపమ్.

ప్ర. అ. రావణ=ఓ రావణా ! దుఃఖితామ్=దుఃఖితురాల నైన, మామ్=నన్ను, గజాధిపమ్=గజశ్రేష్ఠమును, వనే=వనమునందు, వాశితయా=ఆడుదైన, కరేణ్వేవ=ఏనుగుతోవలె, రామేణ సార్ధమ్=రామునితో కూడ, సాధు=బాగుగా, సమానయ=చేర్చుము. (వాశితా శబ్దమునకు, స్త్రీలింగ కరేణు శబ్దమునకు ఆడ ఏనుగ అనే అర్థము).

తా. ఓ రావణా ! అరణ్యములో ఆడ ఏనుగును గజరాజుతో చేర్చినట్లు, దుఃఖితురాల నైన నన్ను రామునితో చేర్చుము. అది యుక్తము. 18

మూ. మిత్రమౌపయికం కర్తుం రామః స్థానం పరీప్సతా, 19
వధం చానిచ్ఛతా ఘోరం త్వయాసౌ పురుషర్షభః.

ప్ర. అ. అసౌ=ఈ, పురుషర్షభః=పురుషశ్రేష్ఠుడైన, రామః=రాముడు, స్థానమ్=స్థానమును, పరీప్సతా=కోరుచున్నవాడవూ, ఘోరమ్=ఘోరమైన, వధమ్=వధను, అనిచ్ఛతా చ=కోరని, త్వయా=నీచేత, మిత్రమ్=స్నేహితుడుగా, కర్తుమ్=చేయుటకు, ఔపయికమ్=తగినది.

తా. నీవు నీ రాజ్యమునకు ప్రభువుగా ఉండవలె నన్నచో, ఘోరమైన మరణము పొందకుండా జీవించవలెనన్నచో పురుషశ్రేష్ఠుడైన ఆ రామునితో స్నేహము చేసికొనుట మంచిది. 19

మూ. విదితః స హి ధర్మజ్ఞః శరణాగతవత్సలః, 20
తేన మైత్రీ భవతు తే యది జీవితుమిచ్ఛసి.

ప్ర. అ. ధర్మజ్ఞః=ధర్మముల నెరిగిన, సః=అతడు, శరణాగతవత్సలః=శరణుజొచ్చినవారియందు ప్రేమ కలవాడుగా, విదితః హి=ప్రసిద్ధుడు కదా. జీవితమ్=జీవించుటకు, ఇచ్ఛసి యది=కోరినట్లైతే, తే=నీకు, తేన=ఆ రామునితో, మైత్రీ=స్నేహము, భవతు=అగుగాక.

తా. ధర్మములన్నీ తెలిసిన ఆ రాముడు శరణాగతవత్సలుడను విషయము లోకప్రసిద్ధము. నీకు జీవించవలెనను కోరిక ఉన్నచో ఆ రామునితో స్నేహము చేసికొనుము. 20

మూ. ప్రసాదయస్వ త్వం చైనం శరణాగతవత్సలమ్, 21
మాం చాస్మై నియతో భూత్వా నిర్యాతయితుమర్హసి.

ప్ర. అ. త్వమ్=నీవు, శరణాగతవత్సలమ్=శరణుజొచ్చిన వారిపై జాలిగల, ఏనమ్=ఈ రాముని, ప్రసాదయస్వ చ=అనుగ్రహింప చేసుకొనుము. ప్రయతః=నియమవంతుడవు, భూత్వా=అయి, మామ్=నన్ను, అస్మై= ఈ రామునకు, నిర్యాతయితుమ్=తిరిగి అప్పచెప్పుటకు, అర్హసి=తగియున్నావు.

తా. శరణాగతవత్సలుడైన ఈ రాముని అనుగ్రహింపచేసుకొనుము. నన్ను యథావిధిగా మరల రామునకు సమర్పించుము. 21

మూ. ఏవం హి తే భవేత్స్వస్తి సంప్రదాయ రఘూత్తమే, 22
అన్యథా త్వం హి కుర్వాణో వధం ప్రాప్స్యసి రావణ.

ప్ర. అ. ఏవమ్=ఈ విధముగా, రఘూత్తమే=రాముని యందు (రామునకు), సంప్రదాయ=ఇచ్చి, తే=నీకు, స్వస్తి=క్షేమము, భవేత్=అగును. రావణ=రావణా! త్వమ్=నీవు, అన్యథా=మరి యొక విధముగా, కుర్వాణః=చేయువాడవై, వధమ్=వధను, ప్రాప్స్యసి=పొందగలవు.

తా. రావణా ! ఈ విధముగా నన్ను రామునకు తిరిగి ఇచ్చివేసినచో నీకు క్షేమము కలుగును. నీవు మరొక విధముగా చేసినచో నీకు మరణము తప్పదు. 22

మూ. వర్జయేద్వజ్రముత్సృష్టం వర్జయేదన్తకశ్చిరమ్, 23
త్వద్విధం తు న స క్రుద్ధో లోకనాథః స రాఘవః.

ప్ర. అ. త్వద్విధమ్=నీ వంటివానిని, ఉత్సృష్టమ్=ప్రయోగింపబడిన, వజ్రమ్=వజ్రాయుధము, వర్జయేత్=విడిచిపెట్టవచ్చును. చిరమ్=చిరకాలము, అన్తకః=యముడు కూడ, వర్జయేత్=విడచిపెట్టవచ్చును. సంక్రుద్ధః=కోపించిన, లోకనాథః=లోకముల ప్రభువైన, సః=ఆ, రాఘవః=రాముడు మాత్రము, న=విడిచిపెట్టడు.

తా. ఇంద్రుడు ప్రయోగించిన వజ్రమైనను నీవంటివానిని ఏమీ చేయలేక విడిచి పెట్టవచ్చును ; యముడు కూడ చాలాకాలము పాటు విడిచిపెట్టవచ్చును. కోపము వచ్చినచో, ఆ లోకనాథుడైన రాముడు మాత్రము విడిచిపెట్టడు. 23

మూ. రామస్య ధనుషః శబ్దం శ్రోష్యసి త్వం మహాస్వనమ్, 24
శతక్రతువిసృష్టస్య నిర్ఘోషమశనేరివ.

ప్ర. అ. శతక్రతువిసృష్టస్య=దేవేంద్రునిచేత ప్రయోగింపబడిన, అశనేః=వజ్రాయుధముయొక్క, నిర్ఘోషమివ=మహాధ్వని వంటి, రామస్య=రాముని యొక్క, ధనుషః=ధనస్సుయొక్క, మహాస్వనమ్=గొప్ప ధ్వని గల, శబ్దమ్=శబ్దమును, త్వమ్=నీవు, శ్రోష్యసి=వినగలవు.

తా. నీవు అచిరకాలములో, ఇంద్రుడు ప్రయోగించిన వజ్రాయుధము ధ్వనివంటి, దిక్కులను పిక్కటిల చేయు రామధనుర్ధ్వనిని వినగలవు. 24

మూ. ఇహ శీఘ్రం సుపర్వాణో జ్వలితాస్యా ఇవోరగాః, 25
ఇషవో నిపతిష్యన్తి రామలక్ష్మణలక్షణాః.

ప్ర. అ. సుపర్వాణః=మంచి కణుపులు కలవీ, జ్వలితాస్యాః=ప్రజ్వలించుచున్న ముఖములు గల, ఉరగాః ఇవ=సర్పముల వలె ఉన్నవీ, రామలక్ష్మణలక్షణాః=రామలక్ష్మణుల చిహ్నములు గలవీ అయిన, ఇషవః=బాణములు, ఇహ=ఈ లంకానగరమునందు, నిపతిష్యన్తి=పడగలవు.

తా. గట్టి కణుపులతో, మండుచున్న ముఖములు గల సర్పముల వలె భయంకరములై, రామలక్ష్మణుల పేర్లతో చిహ్నితములైన బాణములు శీఘ్రకాలములో ఈ లంకానగరమునందు పడగలవు. 25

మూ. రక్షాంసి పరినిఘ్నన్తః పుర్యామస్యాం సమన్తతః, 26
అసంపాతం కరిష్యన్తి పతన్తః కఙ్కవాససః.

ప్ర. అ. కఙ్కవాససః=(సూటిగా వేగముగా పోవుటకై) గ్రద్దరెక్కలు కట్టిన బాణములు, అస్యామ్=ఈ, పుర్యామ్=పట్టణమునందు, సమన్తతః=అంతటా, రక్షాంసి=రాక్షసులను, పరినిఘ్నన్తః=కొట్టుచున్నవై, అసంపాతమ్=చోటులేకుండు నట్లు, కరిష్యన్తి=చేయుగలవు.

తా. రామలక్ష్మణుల బాణములు, ఈ నగరములో అంతటా, రాక్షసులను చంపుచు, ఈ నగరమునంతను, కప్పివేయుగలవు. 26

మూ. రాక్షసేన్ద్రమహాసర్పాన్ స రామగరుడో మహాన్. 27
ఉద్ధరిష్యతి వేగేన వైనతేయ ఇవోరగాన్.

ప్ర. అ. మహాన్=గొప్పవాడైన, సః=ఆ, రామగరుడః=రాముడనే గరుత్మంతుడు, రాక్షసేన్ద్రమహాసర్పాన్=రాక్షసులనే మహాసర్పములను, వైనతేయః=గరుత్మంతుడు, ఉరగానివ=సర్పములను వలె, వేగేన=వేగముతో, ఉద్ధరిష్యతి=పెకిలించివేయగలడు.

తా. గరుత్మంతుడు సర్పాలను పెకిలించివేసి నట్లు రాముడనే ఆ గొప్ప బలశాలియైన గరుత్మంతుడు రాక్షసులనే సర్పాలను పెకిలించివేయగలడు.

మూ. అపనేష్యతి మాం భర్తా త్వత్తః శీఘ్రమరిన్దమః, 28
అసురేభ్యః శ్రియం దీప్తాం విష్ణుస్త్రిభిరివ క్రమైః.

ప్ర. అ. అరిందమః=శత్రువినాశకుడైన, భర్తా=నా భర్త, మామ్=నన్ను, త్వత్తః=నీ వద్దనుండి, విష్ణుః=విష్ణువు, త్రిభిః=మూడు, క్రమైః=పాదవిన్యాసముల చేత, దీప్తామ్=ప్రకాశించుచున్న, శ్రియమ్=లక్ష్మిని, అసురేభ్యః ఇవ=రాక్షసులనుండి వలె, అపనేష్యతి=తీసికొనిపోగలడు.

తా. విష్ణువు మూడు అడుగులు వేసి, ప్రకాశించుచున్న లక్ష్మిని అసురులనుండి తీసికొని పోయినట్లు నా భర్తయైన రాముడు, శీఘ్రముగా నన్ను నీ వద్దనుండి తీసికొని పోగలడు. 28

మూ. జనస్థానే హతస్థానే నిహతే రక్షసాం బలే, 29
అశక్తేన త్వయా రక్షః కృతమేతదసాధు వై.

ప్ర. అ. రక్షసామ్=రాక్షసులయొక్క, బలే=సైన్యము, నిహతే=చంపబడినదగుచుండగా, జనస్థానే=జనస్థానము, హతస్థానే=హతుల స్థానమైపోయిన

దగుచుండగా, రక్షః=ఓ రాక్షసుడా! అశక్తేన=అశక్తుడవైన, త్వయా=నీచేత, ఏతత్=ఈ, అసాధు=చెడ్డ పని, కృతం వై=చేయుబడినది.

తా. ఓ రాక్షసా ! రాముడు రాక్షససైన్యమును చంపివేయుటచేత, జనస్థానము హతస్థానము (చచ్చినవాళ్ల స్థానము) అయినది. అప్పుడు నీ వేమీ చేయజాలక ఈ చెడ్డ పని చేసితివి (నన్ను అపహరించితివి.) 29

మూ. ఆశ్రమం తు తయోః శూన్యం ప్రవిశ్య నరసింహయోః, 30
గోచరం గతయోర్భ్రాత్రోరపనీతా త్వయాధమ.

ప్ర. అ. అధమ=ఓ నీచుడా ! నరసింహయోః=నరశ్రేష్ఠులైన, తయోః=ఆ, భ్రాత్రోః=సోదరులు, గోచరమ్=వెలుపలి ప్రదేశమును గూర్చి, గతయోః=వెళ్ళినవారగుచుండగా, శూన్యమ్=వారు లేని, ఆశ్రమమ్=ఆశ్రమమును, ప్రవిశ్య=ప్రవేశించి, త్వయా=నీచేత, అపనీతా=అపహరించబడితిని.

తా. ఓరీ ! నీచుడా ! నరులలో శ్రేష్ఠులైన ఆ రామలక్ష్మణులిద్దరూ బైటకు పోయినపుడు వారు లేని ఆశ్రమములో ప్రవేశించి, నీవు నన్ను అపహరించినావు. 30

మూ. న హి గన్ధముపాఘ్రాయ రామలక్ష్మణయోస్త్వయా, 31
శక్యం సందర్శనే స్థాతుం శునా శార్దూలయోరివ.'

ప్ర. అ. శునా=కుక్కచేత, శార్దూలయోరివ=పెద్దపులులయొక్కవలె, రామలక్ష్మణయోః=రామలక్ష్మణులయొక్క, గన్ధమ్=గంధమును, ఉపాఘ్రాయ=వాసనచూచి, త్వయా=నీచేత, సందర్శనే=వారి దృష్టిలో, స్థాతుమ్=నిలచుట, న శక్యం హి=శక్యము కాదు కదా!

తా. పెద్దపులుల గంధమును వాసన చూచిన కుక్క వాటి ఎదుట ఎట్లు నిలువజాలదో, అట్లే రామలక్ష్మణుల గంధము వాసన చూచిన పిమ్మట నీవు వారి ఎదుట నిలువజాలవు కదా! 31

మూ. తస్య తే విగ్రహే తాభ్యాం యుగగ్రహణమస్థిరమ్, 32
వృత్రస్యేవేన్ద్రబాహుభ్యాం బాహోరేకస్య విగ్రహే.

ప్ర. అ. తస్య=అట్టి, తే=నీకు, తాభ్యామ్=వారిద్దరితో, విగ్రహే=విరోధము కలుగగా, ఇన్ద్రబాహుభ్యామ్=ఇంద్రుని రెండు బాహువులతో, వృత్రస్య=వృత్రాసురునియొక్క, ఏకస్య=ఒక్క, బాహోః=బాహువు యొక్క, విగ్రహే ఇవ=విరోధము కలిగినప్పుడు వలె, యుగగ్రహణమ్=ప్రతిద్వంద్విగా ఉండుట, అస్థిరమ్=స్థిరము కానిది.

తా. ఇంద్రుని రెండు బాహువులతో పోరాడవలసివచ్చినపుడు వృత్రాసురుని ఒక్క బాహువు నిలవజాలనట్లు వారిద్దరితో వచ్చిన యుద్ధములో నీవు నిలవ గలుగుట కల్ల. 32

మూ. క్షిప్రం తవ స నాథో మే రామః సౌమిత్రిణా సహ, 33
తోయమల్పమివాదిత్యః ప్రాణానాదాస్యతే శరైః.

ప్ర. అ. మే నాథః=నా భర్తయైన, సః రామః=ఆ రాముడు, సౌమిత్రిణా సహ=లక్ష్మణునితో కూడినవాడై, ఆదిత్యః=సూర్యుడు, అల్పమ్=స్వల్పమైన, తోయమివ=ఉదకమును వలె, శరైః=బాణములతో, తవ=నీ యొక్క, ప్రాణాన్=ప్రాణములను, క్షిప్రమ్=శీఘ్రముగా, ఆదాస్యతే=గ్రహించగలడు.

తా. అచిరకాలములో నా భర్తయైన రాముడు లక్ష్మణునితో కలసి వచ్చి చాల తక్కువగా ఉన్న జలమును సూర్యుడు ఎండింపచేసినట్లు బాణములతో నీ ప్రాణములను తీసివేయగలడు. 33

మూ. గిరిం కుబేరస్య గతోఽథవాలయం
సభాం గతో వా వరుణస్య రాజ్ఞః,
అసంశయం దాశరథేర్న మోక్ష్యసే
మహాద్రుమః కాలహతోఽశనేరివ. 34

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే సున్దరకాణ్డే
ఏకవింశః సర్గః.

ప్ర. అ. కాలహతః=కాలముచేత హతుడవైన నీవు, కుబేరస్య=కుబేరుని యొక్క, గిరిమ్=పర్వతమును గూర్చి, అథవా=లేక, ఆలయమ్=అతని గృహమును గూర్చి, గతః=వెళ్ళినను, రాజ్ఞః=రాజైన, వరుణస్య=వరుణునియొక్క, సభామ్=సభను గూర్చి, గతో వా=వెళ్ళినను, మహాద్రుమః=మహావృక్షము, అశనేరివ=పిడుగునుండి వలె, దాశరథేః=రాముని నుండి, న మోక్ష్యసే=విడిపించుకొనజాలవు.

తా. నీవు నశించు కాలము సమీపించినది. మహావృక్షము తనపై పడుచున్న పిడుగును ఏ విధముగా తప్పించుకొనకజాలదో, అట్లే నీవు, కైలాస పర్వతమునకు పారిపోయినను, కుబేరుని అలకాపురికి వెళ్ళినను, రాజైన వరుణుని సభకు పారిపోయినను రాముని నుండి తప్పించుకొనజాలవు.

"బాలానందిని"అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు
సుందరకాండలో ఇరువదియొకటవ సర్గ సమాప్తము.

అథ ద్వావింశః సర్గః

[రావణుడు సీతకు రెండు మాసముల గడువు ఇచ్చుట, సీత రావణుని నిందించుట, రావణుడు సీతను భయపెట్టి, ఆమెను రక్షించుచుండవలసినదిగా రాక్షసస్త్రీలను ఆదేశించుట, స్త్రీలతో కలిసి అంతఃపురమునకు పోవుట].

మూ. సీతాయా వచనం శ్రుత్వా పరుషం రాక్షసేశ్వరః,
ప్రత్యువాచ తతః సీతాం విప్రియం ప్రియదర్శనమ్. 1

ప్ర. అ. రాక్షసేశ్వరః=రావణుడు, పరుషమ్=పరుషమైన, సీతాయాః=సీతయొక్క, వచనమ్=వచనమును, శ్రుత్వా=విని, తతః=పిమ్మట, ప్రియదర్శనమ్=ప్రియము వలె కనబడు, విప్రియమ్=అప్రియమైన వాక్యమును, సీతామ్=సీతను గూర్చి, ప్రత్యువాచ=తిరిగి పలికెను.

తా. రావణుడు పరుషములైన సీత మాటలు విని, పైకి ప్రియములుగా ఉన్నట్లు కనబడు అప్రియములైన మాటలు ఈ విధముగా పలికెను. 1

మూ. యథా యథా సాన్త్వయితా వశ్యః స్త్రీణాం తథా తథా,
యథా యథా ప్రియం వక్తా పరిభూతస్తథా తథా. 2

ప్ర. అ. స్త్రీణామ్=స్త్రీలకు, యథా యథా=ఏ యే విధముగా, సాన్త్వయితా=బుజ్జగించువాడో, తథా తథా=ఆ యా విధముగా, వశ్యః=స్వాధీనుడగును. యథా యథా=ఏ యే విధముగా, ప్రియమ్=ప్రియమును, వక్తా=చెప్పువాడో, తథా తథా=ఆ యా విధముగా, పరిభూతః=తిరస్కరించబడును.

తా. స్త్రీలను బుజ్జగించిన కొలది పురుషుడు వాళ్ళకు స్వాధీనుడగును. ఇతడు మనకు దాసుడని వాళ్లు భావింతురు. మంచి మాటలు చెప్పిన కొలదీ ఆతనిని వాళ్లు తిరస్కరించుచుందురు. 2

మూ. సంనియచ్ఛతి మే క్రోధం త్వయి కామః సముత్థితః,
ద్రవతోఽమార్గమాసాద్య హయానివ సుసారథిః. 3

ప్ర. అ. త్వయి=నీ విషయమున, సముత్థితః=ఉదయించిన, కామః=కామము, సుసారథిః=మంచి సారథి, అమార్గమ్=అమార్గమును, ఆసాద్య=పొంది,

ద్రవతః=పరుగెత్తుచున్న, హయానివ=గుఱ్ఱములను వలె, మే=నా యొక్క, క్రోధమ్=కోపమును, సంనియచ్ఛతి=అణచుచున్నది.

తా. నాకు నీయందున్న కామము, చెడు మార్గమునందు, పరిగెత్తుచున్న గుఱ్ఱములను సారథి నిగ్రహించినట్లు నా కోపమును అణచివేయుచున్నది. 3

మూ. వామః కామో మనుష్యాణాం యస్మిన్ కిల నిబధ్యతే,
జనే తస్మింస్త్వనుక్రోశః స్నేహశ్చ కిల జాయతే. 4

ప్ర. అ. మనుష్యాణామ్=మనుష్యులయొక్క, కామః=కామము, వామః=ప్రతికూలస్వభావము గలది. యస్మిన్=ఏ, జనే=జనునియందు, నిబధ్యతే=కట్టబడునో, తస్మిన్=ఆ జనునియందు, అనుక్రోశః=జాలీ, స్నేహశ్చ=స్నేహమూ, జాయతే కిల=కలుగుచుండును కదా!

తా. నిజముగా కామము ప్రతికూలస్వభావము కలది. ఎందుచేతననగా ఏ వ్యక్తిపై కామము కలుగునో ఆ వ్యక్తిపై జాలి, స్నేహము కూడ కలుగుచుండును.

మూ. ఏతస్మాత్కారణాన్న త్వాం ఘాతయామి వరాననే,
వధార్హామవమానార్హాం మిథ్యాప్రవ్రజితే రతామ్. 5

ప్ర. అ. వరాననే=సుందరమైన ముఖము గలదానా! ఏతస్మాత్=ఈ, కారణాత్=కారణమువలననే, వధార్హామ్=వధకు తగినదానవూ, అవమానార్హామ్=అవమానమునకు తగినదానవూ, మిథ్యాప్రవ్రజితే=కపటవనవాసము చేయు రామునియందు, రతామ్=ఆసక్తి గలదానవూ అయిన, త్వామ్=నిన్ను, న ఘాతయామి=చంపించుటలేదు.

తా. సుందరమైన ముఖము గల ఓ సీతా! కపటవనవాసము చేయు రామునియందు ఆసక్తురాలవై, అవమానించుటకు, చంపుటకూ, తగిన నిన్ను ఈ కారణము చేతనే చంపించలేకుండా ఉన్నాను. 5

మూ. పరుషాణీహ వాక్యాని యాని యాని బ్రవీషి మామ్,
తేషు తేషు వధో యుక్తస్తవ మైథిలి దారుణః. 6

ప్ర. అ. మైథిలి=సీతా ! ఇహ=ఇక్కడ, మామ్=నన్ను గూర్చి, యాని యాని=ఏ యే, పరుషాణి=పరుషములైన, వాక్యాని=వాక్యములను, బ్రవీషి=పలుకుచున్నావో, తేషు తేషు=ఆ యా వాక్యములయందు, తవ=నీ యొక్క, దారుణః=భయంకరమైన, వధ=వధ, యుక్తః=తగినది.

తా. మైథిలీ ! నీవు నాతో పలికిన పరుషమైన ఒక్కొక్క మాటకు నిన్ను క్రూరముగా వధించవలసి ఉన్నది. 6

మూ. ఏవముక్త్వా తు వైదేహీం రావణో రాక్షసాధిపః,
క్రోధసంరమ్భసంయుక్తః సీతాముత్తరమబ్రవీత్. 7

ప్ర. అ. రాక్షసాధిపః=రాక్షసరాజైన, రావణః=రావణుడు, వైదేహీమ్=సీతను గూర్చి, ఏవమ్=ఇట్లు, ఉక్త్వా=పలికి, క్రోధసంరమ్భసంయుక్తః=కోపముతోను తొందరతోను కూడినవాడై, సీతామ్=సీతను గూర్చి, ఉత్తరమ్=మరియొక మాటను, అబ్రవీత్=పలికెను.

తా. రాక్షసరాజైన రావణుడు సీతతో ఈ విధముగా పలికి కోపముతోను, తొందరతోను కూడినవాడై ఆమెతో మరల ఈ మాటపలికెను. 7

మూ. ద్వౌ మాసౌ రక్షితవ్యౌ మే యోఽవధిస్తే మయా కృతః,
తతః శయనమారోహ మమ త్వం వరవర్ణిని. 8

ప్ర. అ. మయా=నాచేత, తే=నీకు, యః=ఏ, అవధిః=అవధి, కృతః=చేయబడినదో ఆ, ద్వౌ=రెండు, మాసౌ=మాసములు, మే=నాకు, రక్షితవ్యౌ=రక్షింపదగినవి. వరవర్ణిని=శ్రేష్ఠమైన వర్ణము గల సీతా! తతః=అటుపిమ్మట, మమ=నా యొక్క, శయనమ్=శయనమును, ఆరోహ=ఎక్కుము.

తా. నేను నీకు రెండుమాసములు గడువు ఇచ్చుచున్నాను. ఆ గడువును నేను పాలింపవలసి ఉన్నది. ఓ అందమైన వర్ణము గలదానా! ఆ గడువు దాటిన వెంటనే నీవు నా శయనము పైకి రావలెను. 8

మూ. ఊర్ధ్వం ద్వాభ్యాం తు మాసాభ్యాం భర్తారం మామనిచ్ఛతీమ్,
మమ త్వాం ప్రాతరాశార్థమాలభన్తే మహానసే. 9

ప్ర. అ. ద్వాభ్యామ్=రెండు, మాసాభ్యామ్=మాసములకంటే, ఊర్ధ్వమ్=పైన, మామ్=నన్ను, భర్తారమ్=భర్తనుగా, అనిచ్ఛతీమ్=ఇచ్ఛగించని, త్వామ్=నిన్ను, మమ=నాయొక్క, ప్రాతరాశార్థమ్=ప్రాతఃకాలభోజనము కొరకు, మహానసే=వంటయింట్లో, ఆలభన్తే=చంపివేయగలరు.

తా. ఈ గడువులోగా నీవు నన్ను భర్తగా అంగీకరించకపోయినచో, రెండుమాసముల పిదప నిన్ను నా ప్రాతఃకాలభోజనార్థము వంటింటికి తీసికొని వెళ్ళి చంపివేయగలరు. 9

మూ. తాం తర్జ్యమానాం సంప్రేక్ష్య రాక్షసేన్ద్రేణ జానకీమ్,
దేవగన్ధర్వకన్యాస్తా విషేదుర్వికృతేక్షణాః. 10

ప్ర. అ. రాక్షసేన్ద్రేణ=రావణునిచేత, తర్జ్యమానామ్=భయపెట్టబడుచున్న, తాం జానకీమ్=ఆ సీతను, సంప్రేక్ష్య=చూచి, తాః=ఆ, దేవగన్ధర్వకన్యాః=దేవకన్యలు, గంధర్వకన్యలు, వికృతేక్షణాః=వికారమును పొందిన నేత్రములు కలవారై, విషేదుః=దుఃఖించిరి.

తా. రావణుడు ఆ విధముగ సీతను భయపెట్టుటను చూచి, దేవగంధర్వకన్యలు, కన్నీళ్లు, ఎఱ్ఱబడుట మొదలైన వాటితో (వారి) కండ్లు వికారము చెందగా దుఃఖించిరి. 10

మూ. ఓష్ఠప్రకారైరపరా వక్త్రనేత్రైస్తథాపరాః,
సీతామాశ్వాసయామాసుస్తర్జితాం తేన రక్షసా. 11

ప్ర. అ. తేన=ఆ, రక్షసా=రాక్షసునిచేత, తర్జితామ్=భయపెట్టబడిన, తామ్=ఆ, సీతామ్=సీతను, అపరాః=కొందరు, ఓష్ఠప్రకారైః=పెదవులరీతులచేతను, తథా=అట్లే, అపరాః=మరికొందరు, వక్త్రనేత్రైః=ముఖములచేతను, నేత్రములచేతను, ఆశ్వాసయామాసుః=ఓదార్చిరి.

తా. ఆ రాక్షసునిచేత భయపెట్టబడుచున్న సీతను పెదవులు కదల్చి కొందరు, ముఖములు నేత్రములు కదల్చి మరికొందరు ఓదార్చిరి. 11

మూ. తాభిరాశ్వాసితా సీతా రావణం రాక్షసాధిపమ్,
ఉవాచాత్మహితం వాక్యం వృత్తశౌణ్డీర్యగర్వితమ్. 12

ప్ర. అ. తాభిః=వారిచేత, ఆశ్వాసితా=ఓదార్చబడిన, సీతా=సీత, వృత్తశౌణ్డీర్యగర్వితమ్=సదాచారముయొక్క బలముతో గర్వించిన, ఆత్మహితమ్=తనకు హితమైన, వాక్యమ్=వాక్యమును, రాక్షసాధిపమ్=రాక్షసరాజైన, రావణమ్=రావణుని గూర్చి, ఉవాచ=పలికెను.

తా. దేవగంధర్వకన్యలచేత ఆ విధముగా ఊరడించబడిన సీత, పాతివ్రత్యబలము, దర్పము ఉట్టిపడునట్లు, ఆ రాక్షసరాజుతో తనకు హితమైన వాక్యము పలికెను. 12

మూ. నూనం న తే జనః కశ్చిదస్తి నిఃశ్రేయసే స్థితః,
నివారయతి యో న త్వాం కర్మణోఽస్మాద్విగర్హితాత్. 13

ప్ర. అ. యః=ఎవ్వడు, త్వామ్=నిన్ను, విగర్హితాత్=నింద్యమైన, అస్మాత్=ఈ, కర్మణః=కర్మనుండి, నివారయతి=నివారించునో అట్టి, తే=నీయొక్క, నిఃశ్రేయసే=క్షేమమునందు, రతః=ఆసక్తి గల, జనః=జనుడు, కశ్చిత్=ఎవ్వడూ, నాస్తి=లేదు. నూనమ్=నిశ్చయము.

తా. నీ క్షేమమును కోరి నిన్ను ఈ విధమైన నింద్యమైన పనినుండి నివారించు వారెవ్వరూ ఉన్నట్లులేదు. ఇది నిశ్చయము. 13

మూ. మాం హి ధర్మాత్మనః పత్నీం శచీమివ శచీపతేః,
త్వదన్యస్త్రిషు లోకేషు ప్రార్థయేన్మనసాపి కః. 14

ప్ర. అ. శచీపతేః=దేవేంద్రుని భార్యయైన, శచీమివ=శచీదేవిని వలె, ధర్మాత్మనః=ధర్మాత్ముడైన రాముని యొక్క, పత్నీమ్=భార్యనైన, మామ్=నన్ను, త్రిషు లోకేషు=మూడు లోకములలో, త్వదన్యః=నీ కంటె అన్యుడు, కః=ఎవడు, మనసాపి=మనస్సుచేత కూడ, ప్రార్థయేత్=ప్రార్థించును.

తా. శచీదేవి దేవేంద్రుని భార్య అయినట్లు నేను ధర్మాత్ముడైన రాముని భార్యను. అట్టి నన్ను ఈ మూడులోకములలో నీవు తప్ప మరెవ్వడైనా, మనస్సులో కూడ కోరుకొనునా! 14

మూ. రాక్షసాధమ రామస్య భార్యామమితతేజసః,
ఉక్తవానసి యత్పాపం క్వ గతస్తస్య మోక్ష్యసే. 15

ప్ర. అ. రాక్షసాధమ=ఓ ! నీచరాక్షసుడా! అమితతేజసః=అమితమైన తేజస్సు గల, రామస్య=రాముని యొక్క, భార్యామ్=భార్యనైన నన్ను గూర్చి, యత్=ఏ, పాపమ్=పాపవాక్యమును, ఉక్తవాన్=పలికినవాడవు, అసి=అయితివో, తస్య=ఆ పాపవాక్యమునకు (నుండి), క్వ=ఎక్కడికి, గతః=వెళ్ళినవాడవై, మోక్ష్యసే=విడువబడగలవు.

తా. ఓ రాక్షసాధమా ! అమితమైన తేజస్సు గల రాముని భార్యనైన నాతో ఈ విధముగ పాపపు మాటలు పలికినందుకు, నీ వెక్కడికి పోయినను ఈ అపరాధమునుండి తప్పించుకొనజాలవు. 15

మూ. యథా దృప్తశ్చ మాతఙ్గః శశశ్చ సహితౌ వనే,
తథా ద్విరదవద్రామస్త్వం నీచ శశవత్ స్మృతః. 16

ప్ర. అ. వనే=వనమునందు, సహితౌ=యుద్ధమునకై తలబడిన, దృప్తః=మదించిన, మాతఙ్గశ్చ=ఏనుగూ, శశశ్చ=చెవులపిల్లీ, యథా=ఎట్లో, తథా=అట్లే,

నీచ=ఓరి నీచుడా! రామః=రాముడు, ద్విరదవత్=ఏనుగవంటివాడు, త్వమ్=నీవు, శశవత్=చెవుల పిల్లి వంటివాడవుగా, స్మృతః=చెప్పబడినావు.

తా. నీవు రామునితో యుద్ధమునకు తలపడుట, వనములో చెవులపిల్లి మదించిన ఏనుగును ఎదిరించుట వంటిది. రాముడు మహాగజము. నీవు చెవుల పిల్లివి.

వి. ప్రాచ్యప్రతిలోని శ్లోకము అర్థము దీనికంటె స్పష్టముగా ఉన్నది.

"యథా దృష్టశ్చ మాతఙ్గః శశశ్చ సదృశో యుధి
తథా మాతఙ్గవద్రామస్త్వం నీచః శశవత్ స్మృతః". 16

మూ. స త్వమిక్ష్వాకునాథం వై క్షిపన్నిహ న లజ్జసే,
చక్షుషోర్విషయం తస్య న తావదుపగచ్ఛసి. 17

ప్ర. అ. సః=అట్టి, త్వమ్=నీవు, ఇహ=ఇక్కడ, ఇక్ష్వాకునాథమ్=ఇక్ష్వాకువంశ ప్రభువైన రాముని, క్షిపన్=నిందించుచు, న లజ్జసే=సిగ్గు పడుటలేదు. తస్య=ఆ రామునియొక్క, విషయం తావత్=గోచరమునైతే, న ఉపగచ్ఛసి=పొందుటలేదు.

తా. అట్టి నీవు ఈ లంకాపట్టణములో కూర్చుండి, సిగ్గు లేక ఇక్ష్వాకువంశప్రభువైన ఆ రాముని నిందించుచున్నావు. అతని కంటికి కనబడుటకు మాత్రము భయపడుచున్నావు. 17

మూ. ఇమే తే నయనే క్రూరే విరూపే కృష్ణపిఙ్గలే,
క్షితౌ న పతితే కస్మాన్మామనార్య నిరీక్షతః. 18

ప్ర. అ. అనార్య=దుష్టుడా ! మామ్=నన్ను, నిరీక్షతః=చూచుచున్న, తే=నీయొక్క, క్రూరే=క్రూరములూ, విరూపే=వికారముగా ఉన్నవీ, కృష్ణపిఙ్గలే=నల్లగాను పచ్చగాను ఉన్నవీ అయిన, ఇమే=ఈ, నయనే=నేత్రములు, క్షితౌ=భూమిపై, కస్మాత్=ఏ కారణమువలన, న పతితే=పడిపోలేదు!

తా. దుష్టుడా ! నన్ను దుర్బుద్ధితో చూచుచున్న, నీ క్రూరములు, వికృతములు అయిన (పిల్లికళ్ల వలె) తెల్లగాను పచ్చగాను ఉన్న కళ్లు నేలమీద ఎందుచేత రాలి పడిపోలేదో తెలియదు! 18

మూ. తస్య ధర్మాత్మనః పత్నీం స్నుషాం దశరథస్య చ,
కథం వ్యాహరతో మాం తే న జిహ్వా వ్యవశీర్యతే. 19

ప్ర. అ. ధర్మాత్మనః=ధర్మాత్ముడైన, తస్య=ఆ రామునియొక్క, పత్నీమ్=భార్యనూ, దశరథస్య=దశరథునియొక్క, స్నుషాం చ=కోడలునూ అయిన,

మామ్=నన్ను గూర్చి, వ్యాహరతః=ఇట్లు పలుకుచున్న, తే=నీ యొక్క, జిహ్వా=నాలుక, కథమ్=ఎట్లు, న వ్యవశీర్యతే=తెగిపడిపోకున్నది!

తా. ధర్మాత్ముడైన ఆ రాముని భార్యనూ, దశరథుని కోడలినీ అయిన నన్ను గూర్చి ఇలా మాటలాడినందుకు, నీ నాలుక తెగి క్రింద పడలేదెందుచేతనో!

మూ. అసందేశాత్తు రామస్య తపసశ్చానుపాలనాత్,
న త్వాం కుర్మి దశగ్రీవ భస్మ భస్మార్హ తేజసా. 20

ప్ర. అ. భస్మార్హ=భస్మమగుటకు తగిన, దశగ్రీవ=ఓ రావణా, రామస్య=రామునియొక్క, అసందేశాత్=ఆజ్ఞ లేకుండుటవలన, తపసః=తపస్సు యొక్క, అనుపాలనాత్=పాలించుటవలనా, తేజసా=నా తేజస్సుతో, త్వామ్=నిన్ను, భస్మ=భస్మముగా, న కుర్మి=చేయకున్నాను.

తా. ఓ ! రావణా ! నీవు భస్మముగా చేయదగినవాడవైనను, అట్లు చేయుటకు నాకా రామాజ్ఞ లేకపోవుటచేతను, తపస్సును రక్షించుకొనుటచేతను నా పాతివ్రత్యమహిమచే నిన్ను భస్మము చేయుటలేదు. 20

మూ. నాపహర్తుమహం శక్యా త్వయా రామస్య ధీమతః,
విధిస్తవ వధార్థాయ విహితో నాత్ర సంశయః. 21

ప్ర. అ. ధీమతః=బుద్ధిమంతుడైన, రామస్య=రామునకు సంబంధించిన, అహమ్=నేను, త్వయా=నీచేత, అపహర్తుమ్=అపహరించుటకు, న శక్యా=శక్యమైనదానను కాను. తవ=నీయొక్క, వధార్థాయ=వధకొరకే, విధిః=ఈ ఏర్పాటు, విహితః=చేయబడినది. అత్ర=ఈ విషయమునందు, సంశయః=సంశయము, న=లేదు.

తా. బుద్ధిశాలియైన రామునకు చెందిన నన్ను నీవు అపహరించజాలవు. అయినను ఈ విధముగా నా అపహరము జరిగినదనగా ఇది నీ మృత్యువు కొరకే వచ్చింది. సందేహము లేదు. 21

మూ. శూరేణ ధనదభ్రాత్రా బలైః సముదితేన చ,
అపోహ్య రామం కస్మాద్ధి దారచౌర్యం త్వయా కృతమ్. 22

ప్ర. అ. శూరేణ=శూరుడవు, ధనదభ్రాత్రా=కుబేరుని సోదరుడవు,బలైః=సేనలతో, సముదితేన చ=కూడినవాడవూ అయిన, త్వయా=నీ చేత, రామమ్=రాముని, అపోహ్య=తొలగించి, కస్మాత్=ఏ కారణమువలన, దారచౌర్యమ్=భార్యాపహరణము, కృతమ్=చేయబడినది?

తా. "నేను శూరుడను, కుబేరుని సోదరుడను, అనంతబలసంపన్నుడను" అని చెప్పికొనుచున్నావే! అట్టి నీవు రాముని దూరముగా పంపివేసి ఆతని భార్యనైన నన్ను ఎందువలన అపహరించినావు? 22

మూ. సీతాయా వచనం శ్రుత్వా రావణో రాక్షసాధిపః,
వివృత్య నయనే క్రూరే జానకీమన్వవైక్షత. 23

ప్ర. అ. రాక్షసాధిపః=రాక్షసరాజైన, రావణః=రావణుడు, సీతాయాః=సీత యొక్క, వచనమ్=వచనమును, శ్రుత్వా=విని, క్రూరే=క్రూరములైన, నయనే=నేత్రములను, వివృత్య=త్రిప్పి (పెద్దవి చేసి), జానకీమ్=జానకిని, అన్వవైక్షత=చూచెను.

తా. రాక్షసరాజైన రావణుడు సీత మాటలు విని, క్రూరములైన నేత్రములు పెద్దవి చేసి, సీతను చూచెను. 23

మూ. నీలజీమూతసంకాశో మహాభుజశిరోధరః,
సింహసత్త్వగతిః శ్రీమాన్ దీప్త జిహ్వాగ్రలోచనః. 24

ప్ర. అ. నీలజీమూతసంకాశః=నల్లని మేఘముతో సమానుడు, మహాభుజశిరోధరః=పెద్ద భుజములు, కంఠము కలవాడు, సింహసత్త్వగతిః=సింహము వంటి బలము, గమనము కలవాడు, శ్రీమాన్=శోభాయుక్తుడు, దీప్తజిహ్వాగ్రలోచనః=ప్రజ్వలించుచున్న జిహ్వాగ్రము (నాలుక చివరి భాగము) నేత్రములు కలవాడు, ("అయిన రావణుడు" అని అన్వయము. ఈ శ్లోకము మొదలు 30 వ శ్లోకము వరకు రావణుని వర్ణనము. ప్రథమాంతములు "రావణః" అనుదానికి విశేషణములు).

తా. ఆ రావణుడు నల్లని మేఘము వలె ఉండెను. అతని భుజములు కంఠము చాలా పెద్దవిగా ఉండెను. ఆతని బలము నడక సింహము బలము నడక వలె ఉండెను. శోభాయుక్తుడైన ఆతని జిహ్వాగ్రము, నేత్రములు కూడ మండుచున్నట్లు ఎఱ్ఱగా ఉండెను. 24

మూ. చలాగ్రమకుటప్రాంశుశ్చిత్రమాల్యానులేపనః,
రక్తమాల్యామ్బరధరస్తప్తాఙ్గదవిభూషణః. 25

ప్ర. అ. చలాగ్రమకుటప్రాంశుః=కదలుచున్న అగ్రభాగము గల కిరీటముతో ఎత్తుగా ఉన్నవాడు, చిత్రమాల్యానులేపనః=చిత్రమైన మాల్యములు, మైపూతలు కలవాడూ, రక్తమాల్యామ్బరధరః=ఎఱ్ఱని మాలలను, వస్త్రములను ధరించిన వాడూ, తప్తాఙ్గదవిభూషణః=అగ్నిలో కాల్చిన బంగారముతో చేసిన బాహుపురులు అలంకారములుగా కలవాడూ (అయిన రావణుడు........).

తా. అతడు కిరీటమును ధరించుటచే ఎత్తుగా ఉన్నట్లు కనబడుచుండెను. ఆ కిరీటము పైభాగము కదలుచుండెను. విచిత్రములైన మాలలను, మైపూతలను, ఎఱ్ఱని మాలలను, ఎఱ్ఱని వస్త్రములను ధరించెను. అగ్నిలో కాల్చి శుద్ధము చేసిన బంగారముతో తయారుచేసిన బాహుపురులను అలంకరించుకొనెను. 25

మూ. శ్రోణీసూత్రేణ మహతా మేచకేన సుసంవృతః,
అమృతోత్పాదనద్ధేన భుజగేనేవ మన్దరః. 26

ప్ర. అ. అమృతోత్పాదనద్ధేన=అమృతము పుట్టించుటకై కట్టబడిన, భుజగేన=వాసుకిచేత, మన్దరః ఇవ=మందరపర్వతము వలె, మహతా=గొప్పదైన, మేచకేన=నల్లని, శ్రోణీసూత్రేణ=కటిస్థలమునకు కట్టుకొనెడు త్రాడుచేత, సుసంవృతః=బాగుగా కట్టబడిన (రావణుడు..........).

తా. నల్లగా, లావుగా ఉన్న త్రాడును నడుమునకు బిగించి ఆ రావణుడు, అమృతమునకై, సముద్రమథనము చేయు సమయమున వాసుకిని కట్టిన మందరపర్వతము వలె ఉండెను. 26

మూ. తాభ్యాం స పరిపూర్ణాభ్యాం భుజాభ్యాం రాక్షసేశ్వరః,
శుశుభేఽచలసంకాశః శృఙ్గాభ్యామివ మన్దరః. 27

ప్ర. అ. అచలసంకాశః=పర్వతముతో సమానుడైన, రాక్షసేశ్వరః=రావణుడు, పరిపూర్ణాభ్యామ్=బాగుగా బలిసి ఉన్న, తాభ్యామ్=ఆ, భుజాభ్యామ్=భుజములతో, శృఙ్గాభ్యామ్=శిఖరములతో, మన్దరః ఇవ=మందర పర్వతము వలె, శుశుభే=ప్రకాశించెను.

తా. పర్వతము వలె ఉన్న ఆ రావణుడు, బాగా బలిసిన భుజములతో, రెండు శిఖరములతో కూడిన మందరపర్వతము వలె ప్రకాశించెను. 27

మూ. తరుణాదిత్యవర్ణాభ్యాం కుణ్డలాభ్యాం విభూషితః,
రక్తపల్లవపుష్పాభ్యామశోకాభ్యామివాచలః. 28

ప్ర. అ. తరుణాదిత్యవర్ణాభ్యామ్=లేత సూర్యుని వంటి రంగు గల, కుణ్డలాభ్యామ్=కుండలములచేత, విభూషితః=అలంకరింపబడిన అతడు, రక్తపల్లవపుష్పాభ్యామ్=ఎఱ్ఱని చిగుళ్లు పుష్పములు గల, అశోకాభ్యామ్=అశోకవృక్షములతో, అచలః ఇవ=పర్వతము వలె ఉండెను.

తా. బాలసూర్యుడు వలె ఎఱ్ఱగా ఉన్న కుండలములు అలంకరించుకొని ఆ రావణుడు, ఎఱ్ఱని చిగుళ్ళూ, పుష్పములూ గల రెండు అశోకవృక్షములతో పర్వతము వలె ప్రకాశించుచుండెను. 28

మూ. స కల్పవృక్షప్రతిమో వసన్త ఇవ మూర్తిమాన్,
శ్మశానచైత్యప్రతిమో భూషితో ఽపి భయంకరః. 29

ప్ర. అ. కల్పవృక్షప్రతిమః=కల్పవృక్షముతో సమానుడైన, సః=అతడు, మూర్తిమాన్=మూర్తీభవించిన, వసన్తః ఇవ=వసంతర్తువు వలె ఉండెను. శ్మశానచైత్యప్రతిమః=శ్మశానమునందలి మంటపముతో సమానుడైన అతడు, భూషితోఽపి=అలంకరించబడిన వాడైనను, భయంకరః=భయంకరుడుగా ఉండెను.

తా. కల్పవృక్షము వలె ఉన్న అతడు మూర్తీభవించిన వసంతము వలె ఉండెను. అతడు చక్కగా అలంకరించుకొన్నను, శ్మశానమునందున్న మండపము వలె భయంకరముగా ఉండెను. 29

మూ. అవేక్షమాణో వైదేహీం కోపసంరక్తలోచనః,
ఉవాచ రావణః సీతాం భుజఙ్గ ఇవ నిఃశ్వసన్. 30

ప్ర. అ. కోపసంరక్తలోచనః=కోపముచేత ఎఱ్ఱనైన నేత్రములు గల, రావణః=ఆ రావణుడు, వైదేహీమ్=సీతను, అవేక్షమాణః=చూచుచు, భుజఙ్గః ఇవ=సర్పము వలె, నిఃశ్వసన్=నిట్టూర్చుచు, సీతామ్=సీతను గూర్చి, ఉవాచ=పలికెను.

తా. ఆ రావణుడు, సీతను, కోపముచేత ఎఱ్ఱనైన నేత్రములతో చూచుచు, సర్పము వలె బుసలు కొట్టుచు, ఆమెతో ఇట్లనెను. 30

మూ. అనయేనాభిసంపన్నమర్థహీనమనువ్రతే,
నాశయామ్యహమద్య త్వాం సూర్యః సన్ధ్యామివౌజసా. 31

ప్ర. అ. అనయేన=చెడునీతితో, అభిసంపన్నమ్=కూడినవాడూ, అర్థహీనమ్=ధనహీనుడూ అయిన రాముని, అనువ్రతే=అనుసరించినదానా! అద్య=ఇప్పుడు, అహమ్=నేను, త్వామ్=నిన్ను, సూర్యః=సూర్యుడు, ఓజసా=తేజస్సుతో, సన్ధ్యామివ=సంధ్యను వలె, నాశయామి=నశింపచేసెదను.

తా. చెడ్డ నీతిని అనుసరించువాడు, ధనము లేనివాడు అయిన రాముని పై మక్కువకలదానా! సూర్యుడు తన కాంతిచేత సంధ్యను నశింపచేయునట్లు నేను నిన్ను ఇప్పుడే నశింపచేసెదను. 31

మూ. ఇత్యుక్త్వా మైథిలీం రాజా రావణః శత్రురావణః,
సందిదేశ తతః సర్వా రాక్షసీర్ఘోరదర్శనాః. 32

ప్ర. అ. రాజా=రాక్షసరాజూ, శత్రురావణః=శత్రువులను ఏడిపించువాడూ అయిన, రావణః=రావణుడు, మైథిలీమ్=సీతను గూర్చి, ఇతి=ఇట్లు,

ఉక్త్వా=పలికి, తతః=అటుపిమ్మట, ఘోరదర్శనాః=భయంకరమైన దర్శనము గల, సర్వాః=సమస్తమైన, రాక్షసీః=రాక్షసస్త్రీలను, సందిదేశ=ఆజ్ఞాపించెను.

తా. శత్రువులను ఏడిపించు రాక్షసరాజైన ఆ రావణుడు సీతతో ఇట్లు పలికి చూచువారికి భయంకరముగా ఉన్న రాక్షసస్త్రీలనందరిని ఇట్లు ఆజ్ఞాపించెను.

మూ. ఏకాక్షీమేకకర్ణాం చ కర్ణప్రావరణాం తథా,
గోకర్ణీం హస్తికర్ణీం చ లమ్బకర్ణీమకర్ణికామ్. 33
హస్తిపాద్యశ్వపాద్యౌ చ గోపాదీం పాదచూళికామ్,
ఏకాక్షీమేకపాదీం చ పృథుపాదీమపాదికామ్, 34
అతిమాత్రశిరోగ్రీవామతిమాత్రకుచోదరీమ్,
అతిమాత్రాస్యనేత్రాం చ దీర్ఘజిహ్వామజిహ్వికామ్. 35
అనాసికాం సింహముఖీం గోముఖీం సూకరీముఖీమ్.

ప్ర. అ. ఏకాక్షీమ్=ఒక కన్ను కల, ఏకకర్ణాం చ=ఒక చెవికల దానినీ, తథా=మరియు, కర్ణప్రావరణామ్=చెవులు ఆచ్ఛాదనముగా కలదానిని, గోకర్ణీమ్=ఆవుచెవులదానినీ, హస్తికర్ణీం చ=ఏనుగుచెవులదానిని, లమ్బకర్ణీమ్=వ్రేలాడుచున్న చెవులు కలదానిని, అకర్ణికామ్=చెవులు లేనిదానిని, హస్తిపాద్యశ్వపాద్యౌ చ=ఏనుగు పాదములదానిని, గుఱ్ఱము పాదములదానిని, గోపాదీమ్=ఆవుపాదములదానిని, పాదచూళికామ్=పాదాలపై జుట్టు ఉన్నదానిని, ఏకాక్షీమ్=ఒక కన్ను కలది, ఏకపాదీం చ=ఒక పాదము కలదీ అయినదానిని, పృథుపాదీమ్=పెద్ద పాదములు కలదానిని, అపాదికామ్=పాదములు లేని దానిని, అతిమాత్రశిరోగ్రీవామ్=పెద్ద తల, కంఠము కలదానిని, అతిమాత్రకుచోదరీమ్=పెద్ద స్తనములు ఉదరము కలదానిని, అతిమాత్రాస్యనేత్రాం చ=పెద్ద నోరు, కళ్ళూ కలదానిని, దీర్ఘజిహ్వామ్=పొడవైన నాలుక కలదానిని, అజిహ్వికామ్=నాలుక లేని దానిని, అనాసికామ్=ముక్కు లేని దానిని, సింహముఖీమ్=సింహపు ముఖము దానిని, గోముఖీమ్=ఆవు ముఖముదానిని, సూకరీముఖీమ్=పందిముఖము దానిని (ఈ రాక్షసస్త్రీలను ఆజ్ఞాపించెను).

తా. ఒకే కన్ను, ఒకే చెవి కలదానిని, గొడుగు చెవులదానిని, ఆవు చెవులదానిని, ఏనుగు చెవులదానిని, వ్రేలాడు చెవులదానిని, చెవులు లేనిదానిని, ఏనుగు పాదములదానిని, గుఱ్ఱము పాదముల దానిని, ఆవు పాదముల దానిని, పాదాలమీద జుట్టు ఉన్నదానిని, ఒకే కన్ను ఒకే పాదము ఉన్నదానిని, పెద్ద పాదముల దానిని, పాదాలు లేనిదానిని, పెద్ద తలా కంఠమూ గలదానిని, పెద్ద

పెద్ద స్తనములు, పొట్టా కలదానిని, పెద్ద నోరు, కళ్లూ కలదానిని, పొడవైన నాలుక కలదానిని, నాలుక లేనిదానిని, ముక్కులేనిదానిని, సింహముఖము దానిని, ఆవు ముఖము దానిని, పందిముఖము దానిని ఆజ్ఞాపించెను. 33-35

మూ. యథా మద్వశగా సీతా క్షిప్రం భవతి జానకీ, 36
తథా కురుత రాక్షస్యః సర్వాః క్షిప్రం సమేత్య చ.

ప్ర. అ. రాక్షస్యః=రాక్షసస్త్రీలలారా!జానకీ=జనకుని కూతురైన, సీతా= సీత, క్షిప్రమ్=శీఘ్రముగా, యథా=ఎట్లు, మద్వశగా=నా వశమును పొందినది, భవతి=అగునో, తథా=అట్లు, సర్వాః=మీరందరూ, క్షిప్రమ్=శీఘ్రముగా, సమేత్య చ=కలిసి, కురుత=చెయ్యండి.

తా. ఓ రాక్షసస్త్రీలలారా! మీరందరూ శీఘ్రముగా కలిసి ప్రయత్నించి జనకుని కూతురైన సీత నాకు శీఘ్రముగా వశమగునట్లు చెయ్యండి. 36

మూ. ప్రతిలోమానులోమైశ్చ సామదానాదిభేదనైః, 37
ఆవర్జయత వైదేహీం దణ్డస్యోద్యమనేన చ.

ప్ర. అ. ప్రతిలోమానులోమైశ్చ=ప్రతికూలములైన పనులచేతను, అనుకూలము లైన పనులచేతను, సామదానాదిభేదనైః=సామము (బుజ్జగించుచు చెప్పుట), దానము మొదలైన వాటిచేత, భేదోపాయముచేత, దణ్డస్య=దండోపాయముయొక్క, ఉద్యమనేన చ=ప్రయోగముచేతను, వైదేహీమ్=సీతను, ఆవర్జయత=లొంగదీయండి.

తా. ప్రతికూలములైన కార్యములు చేసి కాని, అనుకూలములైన కార్యములు చేసి కాని, సామ-దాన- భేదోపాయములను ప్రయోగించి కాని, దండమును ప్రయోగించి గాని సీతను లొంగదీసుకొనండి. 37

మూ. ఇతి ప్రతిసమాదిశ్య రాక్షసేన్ద్రః పునః పునః, 38
కామమన్యుపరీతాత్మా జానకీం పర్యతర్జయత్.

ప్ర. అ. రాక్షసేన్ద్రః=రావణుడు, పునః పునః=మాటిమాటికి, ఇతి=ఇట్లు, ప్రతిసమాదిశ్య=ఆజ్ఞాపించి, కామమన్యుపరీతాత్మా=కామముతోను కోపముతోను నిండిన మనస్సు గలవాడై, జానకీమ్=జానకిని, పర్యతర్జయత్=భయపెట్టెను.

తా. రావణుడు ఆ రాక్షసస్త్రీలను ఈ విధముగా అనేక పర్యాయములు ఆజ్ఞాపించి, కామముతోను కోపముతోను నిండిన మనస్సుతో, సీతను భయపెట్టెను.

మూ. ఉపగమ్య తతః శీఘ్రం రాక్షసీ ధాన్యమాలినీ, 39
పరిష్వజ్య దశగ్రీవమిదం వచనమబ్రవీత్.

ప్ర. అ. తతః=అటుపిమ్మట, ధాన్యమాలినీ=ధాన్యమాలిని అను, రాక్షసీ=రాక్షస స్త్రీ, శీఘ్రమ్=శీఘ్రముగా, ఉపగమ్య=సమీపించి, దశగ్రీవమ్=రావణుని, పరిష్వజ్య=కౌగలించుకొని, ఇదమ్=ఈ, వచనమ్=వచనమును, అబ్రవీత్=పలికెను.

తా. అప్పుడు ధాన్యమాలిని అను రాక్షసస్త్రీ తొందరగా రావణుని వద్దకు వచ్చి, అతనిని కౌగలించుకొని ఇట్లనెను. 39

మూ. మయా క్రీడ మహారాజ సీతయా కిం తవానయా, 40
వివర్ణయా కృపణయా మానుష్యా రాక్షసేశ్వర.

ప్ర. అ. మహారాజ=మహారాజా ! మయా=నాతో, క్రీడ=క్రీడించుము. రాక్షసేశ్వర=రాక్షసరాజా! వివర్ణయా=చెడిపోయిన శరీరవర్ణము గలదీ, కృపణయా=దీనురాలూ, మానుష్యా=మనుష్యస్త్రీ అయిన, అనయా=ఈ, సీతయా=సీతతో, తవ=నీకు, కిమ్=ఏమి ప్రయోజనము?

తా. మహారాజా ! నీవు హాయిగా నాతో విహరింపుము. రాక్షసాధిపా! చెడ్డ శరీరవర్ణము గల దీనురాలైన మనుష్యస్త్రీ ఈ సీతతో నీకేమి సుఖము కలుగును? 40

మూ. నూనమస్యా మహారాజ న దివ్యాన్ భోగసత్తమాన్, 41
విదధాత్యమరశ్రేష్ఠస్తవ బాహుబలార్జితాన్.

ప్ర. అ. మహారాజ=మహారాజా!అమరశ్రేష్ఠః=బ్రహ్మదేవుడు, తవ=నీయొక్క, బాహుబలార్జితాన్=బాహుబలముచేత ఆర్జింపబడిన, దివ్యాన్=దివ్యములైన, భోగసత్తమాన్=శ్రేష్ఠములైన భోగములను, అస్యాః=ఈమెకు, న విదధాతి=కల్పించలేదు. నూనమ్=నిశ్చయము.

తా. మహారాజా ! నీ బాహుబలముచేత సంపాదించిన దివ్యములైన ఉత్తమభోగములను బ్రహ్మదేవుడు ఈమెకు రాసి పెట్టలేదు. ఇది నిజము.41

మూ. అకామాం కామయానస్య శరీరముపతప్యతే, 42
ఇచ్ఛన్తీం కామయానస్య ప్రీతిర్భవతి శోభనా.

ప్ర. అ. అకామామ్=కామములేని స్త్రీని, కామయానస్య=కామించుచున్న వానియొక్క, శరీరమ్=శరీరము, ఉపతప్యతే=బాధచెందును. ఇచ్ఛన్తీమ్=కోరుచున్న

స్త్రీని, కామయానస్య=కామించువానికి, శోభనా=మంచి, ప్రీతిః=ఆనందము, భవతి=అగును.

తా. ఏ పురుషుడైనను తనపై ప్రేమ లేని స్త్రీని కామించినచో వాని శరీరమునకు తాపము మాత్రమే కలుగును. తనపై ప్రేమ ఉన్న స్త్రీని కామించు వానికి మంచి ఆనందము కలుగును. 42

మూ. ఏవముక్తస్తు రాక్షస్యా సముత్క్షిప్తస్తతో బలీ, 43
ప్రహసన్మేఘసంకాశో రాక్షసః స న్యవర్తత.

ప్ర. అ. రాక్షస్యా= ఆ రాక్షసస్త్రీచేత, ఏవమ్=ఇట్లు, ఉక్తః=పలుకబడిన, బలీ=బలవంతుడైన, మేఘసంకాశః=మేఘముతో సమానుడైన, సః=ఆ, రాక్షసః=రావణుడు, తతః=అటుపిమ్మట, సముత్క్షిప్తః=ఆమెచే పైకి ఎత్తబడినవాడై, ప్రహసన్=నవ్వుచు, న్యవర్తత=మరలెను.

తా. బలవంతుడు, మేఘములతో సమానుడూ అయిన రావణునితో ఆ ధాన్యమాలి ఇట్లు పలికి, ఆతనిని కౌగలించుకొని పైకి లేవదీసెను. అపుడాతడు నవ్వుచు వెనుకకు మరలెను. 43

మూ. ప్రస్థితః స దశగ్రీవః కమ్పయన్నివ మేదినీమ్, 44
జ్వలద్భాస్కరవర్ణాభం ప్రవివేశ నివేశనమ్.

ప్ర. అ. సః=ఆ, దశగ్రీవః=రావణుడు, మేదినీమ్=భూమిని, కమ్పయన్నివ=కంపింపచేయుచున్నవాడు వలె, ప్రస్థితః=ప్రయాణమైనవాడై, జ్వలద్భాస్కరవర్ణాభమ్=ప్రకాశించుచున్న సూర్యుని కాంతి వంటి కాంతి గల, నివేశనమ్=గృహమును, ప్రవివేశ=ప్రవేశించెను.

తా. ఆ దశకంఠుడు భూమిని కంపింపచేయుచున్నట్లు నడచివెళ్ళి, ప్రకాశించుచున్న సూర్యుని కాంతి వంటి కాంతి గల గృహమును ప్రవేశించెను.

మూ. దేవగన్ధర్వకన్యాశ్చ నాగకన్యాశ్చ సర్వతః, 45
పరివార్య దశగ్రీవం వివిశుస్తం గృహోత్తమమ్.

ప్ర. అ. దేవగన్ధర్వకన్యాశ్చ=దేవకన్యలు, గంధర్వకన్యలు, నాగకన్యాశ్చ=నాగకన్యలు, సర్వతః=నలువైపులా, దశగ్రీవమ్=రావణుని, పరివార్య=చుట్టి, తమ్=ఆ, గృహోత్తమమ్=గృహశ్రేష్ఠమును, వివిశుః=ప్రవేశించిరి.

తా. ఆ దశకంఠునితో కూడా వచ్చిన దేవకన్యలు, గంధర్వకన్యలు, నాగకన్యలు నలుమూలలా ఆతనిని పరివేష్టించి, ఆ శ్రేష్ఠమైన గృహములో ప్రవేశించిరి. 45

మూ. స మైథిలీం ధర్మపరామవస్థితాం
ప్రవేపమానాం పరిభర్త్స్య రావణః,
విహాయ సీతాం మదనేన మోహితః
స్వమేవ వేశ్మ ప్రవివేశ భాస్వరమ్. 46

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే సున్దరకాణ్డే
ద్వావింశః సర్గః.

ప్ర. అ. సః=ఆ, రావణః=రావణుడు, ధర్మపరామ్=ధర్మపరురాలుగా, అవస్థితామ్=స్థిరముగా ఉన్న, ప్రవేపమానామ్=వణకుచున్న, మైథిలీమ్=సీతను, పరిభర్త్స్య=భయపెట్టి, సీతామ్=సీతను, విహాయ=విడచి, భాస్వరమ్=ప్రకాశించుచున్న, స్వమ్=తన సంబంధమైన, వేశ్మైవ=గృహమునే, ప్రవివేశ=ప్రవేశించెను.

తా. ఆ రావణుడు ధర్మమార్గమునందు స్థిరముగా నిలచి ఉన్న, భయముతో వణకిపోవుచున్న సీతను ఈ విధముగా భయపెట్టి, ఆమెను విడచి, మన్మథునిచేత మోహితుడై, ప్రకాశించుచున్న తన గృహములోనికి ప్రవేశించెను.

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు
సుందరకాండలో ఇరువదిరెండవ సర్గ సమాప్తము.

అథ త్రయోవింశః సర్గః

[రాక్షసస్త్రీలు సీతకు ఉపదేశించుట]

మూ. ఇత్యుక్త్వా మైథిలీం రాజా రావణః శత్రురావణః,
సందిశ్య చ తతః సర్వా రాక్షసీర్నిర్జగామ హ. 1

ప్ర. అ. రాజా=రాక్షసరాజు, శత్రురావణః=శత్రువులను ఏడ్పించేవాడూ అయిన, రావణః=రావణుడు, మైథిలీమ్=సీతనుగూర్చి, ఇతి=ఇట్లు, ఉక్త్వా=పలికి, తతః=అటుపిమ్మట, సర్వాః=సమస్తమైన, రాక్షసీః=రాక్షసస్త్రీలను, సందిశ్య చ=ఆజ్ఞాపించి, నిర్జగామ=బయలువెడలిపోయెను.

తా. రాక్షసరాజూ, శత్రువులను ఏడ్పించేవాడూ అయిన రావణుడు సీతతో ఇట్లు పలికి, "సీతను లొంగదీయుడు" అని రాక్షసస్త్రీలను ఆజ్ఞాపించి వెళ్ళిపోయెను. 1

మూ. నిష్క్రాన్తే రాక్షసేన్ద్రే తు పునరన్తఃపురం గతే,
రాక్షస్యో భీమరూపాస్తాః సీతాం సమభిదుద్రువుః. 2

ప్ర. అ. రాక్షసేన్ద్రే=రావణుడు, నిష్క్రాన్తే=నిష్క్రమించినవాడై, పునః=మరల, అన్తఃపురమ్=అంతఃపురమును, గతే=పొందినవాడగుచుండగా, భీమరూపాః=భయంకరమైన రూపములు గల, తాః=ఆ, రాక్షస్యః=రాక్షసస్త్రీలు, సీతామ్=సీతను గూర్చి, సమభిదుద్రువుః=పరుగెత్తికొని వెళ్ళిరి.

తా. రావణుడు తిరిగి వెళ్లి అంతఃపురములో ప్రవేశించిన పిమ్మట, భయంకరములైన రూపములు గల ఆ రాక్షసస్త్రీలు సీత దగ్గరకు పరుగెత్తి వెళ్ళిరి. 2

మూ. తతః సీతాముపాగమ్య రాక్షస్యః క్రోధమూర్ఛితాః,
పరం పరుషయా వాచా వైదేహీమిదమబ్రువన్. 3

ప్ర. అ. తతః=అటుపిమ్మట, రాక్షస్యః=రాక్షసస్త్రీలు, సీతామ్=సీతను, ఉపాగమ్య=చేరి, క్రోధమూర్ఛితాః=క్రోధములో నిండినవారై, పరమ్=మిక్కిలి, పరుషయా=పరుషమైన, వాచా=వాక్కుతో, వైదేహీమ్=సీతను గూర్చి, ఇదమ్=ఈ వాక్యమును, అబ్రువన్=పలికిరి.

తా. పిమ్మట ఆ రాక్షసస్త్రీలు క్రోధావేశముతో సీతను సమీపించి, పరుషముగా మాటలాడుచు సీతతో ఇట్లనిరి. 3

మూ. పౌలస్త్యస్య వరిష్ఠస్య రావణస్య మహాత్మనః,
దశగ్రీవస్య భార్యాత్వం సీతే న బహుమన్యసే. 4

ప్ర. అ. సీతే=సీతా! పౌలస్త్యస్య=పులస్త్యుని వంశములో పుట్టినవాడూ, వరిష్ఠస్య=శ్రేష్ఠుడూ, మహాత్మనః=గొప్ప బుద్ధి కలవాడూ, దశగ్రీవస్య=పదికంఠములు కలవాడూ అయిన, రావణస్య=రావణునికి, భార్యాత్వమ్=భార్య అగుటను, న బహుమన్యసే=నీవు గౌరవించుట లేదు.

తా. సీతా! పది కంఠములు గల రావణుడు, పులస్త్యవంశములో పుట్టినవాడు ; సర్వశ్రేష్ఠుడు ; మహాత్ముడు ; అట్టి రావణునికి భార్య వగుటకు నీవు ఇచ్ఛగించుట లేదు. ఎంత తెలివితక్కువ దానవు! 4

మూ. తతస్త్వేకజటా నామ రాక్షసీ వాక్యమబ్రవీత్,
ఆమన్త్ర్య క్రోధతామ్రాక్షీ సీతాం కరతలోదరీమ్. 5

ప్ర. అ. తతః=అటుపిమ్మట, ఏకజటా నామ=ఏకజట అనే, రాక్షసీ=రాక్షసి, క్రోధతామ్రాక్షీ=క్రోధముచేత ఎఱ్ఱనైన నేత్రములు గలదై, కరతలోదరీమ్=పిడికెడు ఉదరము గల, సీతామ్=సీతను, ఆమన్త్ర్య=పిలచి, వాక్యమ్=వాక్యమును, అబ్రవీత్=పలికెను.

తా. పిమ్మట, ఏకజట యను ఒక రాక్షసి, కోపముతో కన్నులు ఎఱ్ఱజేసి, సన్నని పిడికెడు ఉదరము గల సీతను సంబోధించి ఇట్లు పలికెను.5

మూ. ప్రజాపతీనాం షణ్ణాం తు చతుర్థో యః ప్రజాపతిః,
మానసో బ్రహ్మణః పుత్రః పులస్త్య ఇతి విశ్రుతః. 6

ప్ర. అ. షణ్ణామ్=ఆరుగురు, ప్రజాపతీనామ్=ప్రజాపతులలో, యః=ఎవ్వడు, చతుర్థః=నాల్గవ, ప్రజాపతిః=ప్రజాపతియో, బ్రహ్మణః=బ్రహ్మయొక్క, మానసః=మనస్సువల్ల పుట్టిన , పుత్రః=పుత్రుడైన అతడు, పులస్త్యః ఇతి=పులస్త్యుడు అని, విశ్రుతః=ప్రసిద్ధుడు.

తా. బ్రహ్మదేవుని మానస (మనస్సునుండి పుట్టిన) పుత్రుడైన, పులస్త్యుడను పేరుతో ప్రసిద్ధుడైన ప్రజాపతి, ఆరుగురు ప్రజాపతులలో నాల్గవవాడు. 6

మూ. పులస్త్యస్య తు తేజస్వీ మహర్షిర్మానసః సుతః,
నామ్నా స విశ్రవా నామ ప్రజాపతిసమప్రభః. 7

ప్ర. అ. నామ్నా=పేరుచేత, విశ్రవా నామ=విశ్రవసుడని ప్రసిద్ధుడైన, ప్రజాపతిసమప్రభః=బ్రహ్మదేవునితో సమానమైన కాంతి గల, తేజస్వీ=తేజఃశాలియైన, సః మహర్షిః=ఆ మహర్షి, పులస్త్యస్య=పులస్త్యునియొక్క, మానసః=మనస్సు నుండి జన్మించిన, సుతః=కుమారుడు.

తా. విశ్రవసుడని ప్రసిద్ధమైన నామధేయముగల, బ్రహ్మదేవునితో సమానమైన కాంతి గల, తేజఃశాలియైన మహర్షి, పులస్త్యుని మానసపుత్రుడు.

మూ. తస్య పుత్రో విశాలాక్షి రావణః శత్రురావణః,
తస్య త్వం రాక్షసేన్ద్రస్య భార్యా భవితుమర్హసి, 8
మయోక్తం చారుసర్వాఙ్గి వాక్యం కిం నానుమన్యసే.

ప్ర. అ. విశాలాక్షి=విశాలము లైన నేత్రములు గలదానా! శత్రురావణః=శత్రువులను ఏడ్పించెడివాడైన, రావణః=రావణుడు, తస్య=ఆ విశ్రవసుని యొక్క, పుత్రః=పుత్రుడు, త్వమ్=నీవు, రాక్షసేన్ద్రస్య=రాక్షసుల ప్రభువైన, తస్య=ఆ రావణుని యొక్క, భార్యా=భార్యగా, భవితుమ్=అగుటకు, అర్హసి=తగిఉన్నావు. చారుసర్వాఙ్గి=అందమైన సకలావయవములు కలదానా! మయా=నాచేత, ఉక్తమ్=పలకబడిన, వాక్యమ్=వాక్యమును, కిమ్=ఎందువలన, నానుమన్యసే=అంగీకరించవు?

తా. ఓ విశాలాక్షీ ! శత్రువులను ఏడ్పించిన రావణుడు ఆ విశ్రవసుని కుమారుడు. నీవు రాక్షసరాజైన ఆ రావణుని భార్యవు అగుము. అందమైన సకలావయవములు గల ఓ సీతా! నే చెప్పిన మాట వినవేమి ? 8

మూ. తతో హరిజటా నామ రాక్షసీ వాక్యమబ్రవీత్. 9
వివర్త్య నయనే కోపాన్మార్జారసదృశేక్షణా.

ప్ర. అ. తతః=అటుపిమ్మట, మార్జారసదృశేక్షణా=పిల్లితో సమానమైన కళ్ళుగల, హరిజటా నామ=హరిజట అను పేరు గల, రాక్షసీ=రాక్షసి, కోపాత్=కోపమువలన, నయనే=నేత్రములను, వివర్త్య=త్రిప్పి, వాక్యమ్=వాక్యమును, అబ్రవీత్=పలికెను.

తా. పిమ్మట, పిల్లికళ్ళ వంటి కళ్ళుగల, హరిజట అను రాక్షసి, కోపముతో కళ్లు పెద్దవి చేసి త్రిప్పుచు ఇట్లు పలికెను. 9

మూ. యేన దేవాస్త్రయస్త్రింశద్దేవరాజశ్చ నిర్జితాః, 10
తస్య త్వం రాక్షసేన్ద్రస్య భార్యా భవితుమర్హసి.

ప్ర. అ. యేన=ఎవనిచేత, త్రయస్త్రింశత్=ముప్పదిముగ్గురు, దేవాః=దేవతలూ, దేవరాజశ్చ=దేవతల రాజూ, నిర్జితాః=జయింపబడినారో, తస్య=అట్టి, రాక్షసేన్ద్రస్య=రాక్షసరాజునకు, త్వమ్=నీవు, భార్యా=భార్యగా, భవితుమ్=అగుటకు, అర్హసి=తగియున్నావు.

తా. ముప్పదిముగ్గురు దేవతలను వారి ప్రభువైన దేవేంద్రుని జయించిన రాక్షసరాజునకు నీవు భార్యవగుట మంచిది. 10

మూ. తతస్తు ప్రఘసా నామ రాక్షసీ క్రోధమూర్ఛితా, 11
భర్త్సయన్తీ తదా ఘోరమిదం వచనమబ్రవీత్.

ప్ర. అ. తతః=అటుపిమ్మట, ప్రఘసా నామ=ప్రఘస అను పేరు గల, రాక్షసీ=రాక్షసస్త్రీ, క్రోధమూర్ఛితా=కోపముచే వ్యాపింపబడినదై, తదా=అప్పుడు, భర్త్సయన్తీ=భయ పెట్టుచున్నదై, ఘోరమ్=ఘోరమైన, ఇదమ్=ఈ వచనమును, అబ్రవీత్=పలికెను.

తా. పిమ్మట ప్రఘస అను ఒక రాక్షసి కోపావిష్టు రాలై, సీతను భయపెట్టుచు, ఘోరమైన వాక్యము పలికెను.

మూ: వీర్యోత్సిక్తస్య శూరస్య సంగ్రామే న నివర్తినః, 12
బలినో వీర్యయుక్తస్య భార్యాత్వం కిం న లప్స్యసే.

ప్ర. అ. వీర్యోత్సిక్తస్య=పరాక్రమముచేత గర్వించినవాడూ, శూరస్య=శూరుడు, సంగ్రామేషు=యుద్ధములందు, అనివర్తినః=వెనుకకు మరలని వాడూ, బలినః=బలవంతుడూ, వీర్యయుక్తస్య=పరాక్రమముతో కూడినవాడూ అయిన రావణునికి, భార్యాత్వమ్=భార్యాత్వమును, కిమ్=ఎందువలన, న లప్స్యసే=పొందవు?

తా. రావణుడు మహాబలవంతుడు ; వీర్యవంతుడు ; వీర్యముతో గర్వించినవాడు ; శూరుడు ; యుద్ధములలో వెనుకకు మరలనివాడు. అట్టి రావణుని భార్య అగుటకు ఎందుచేత అంగీకరించ కున్నావు? 12

మూ. ప్రియాం బహుమతాం భార్యాం త్యక్త్వా రాజా మహాబలః. 13
సర్వాసాం చ మహాభాగాం త్వాముపైష్యతి రావణః.

ప్ర. అ. మహాబలః=గొప్ప బలము గల, రావణః=రావణుడు, ప్రియామ్=ప్రియురాలూ, బహుమతామ్=గౌరవపాత్రురాలూ, సర్వాసామ్=భార్యలందరిలోకి,

మహాభాగామ్=గొప్ప భాగ్యము కలదీ అయిన, భార్యామ్=భార్యను (మండోదరిని), త్యక్త్వా=విడచి, త్వామ్=నిన్ను, ఉపైష్యతి=పొందగలడు.

తా. మండోదరి రావణుని భార్యలందరిలోకి చాలా భాగ్యము కలది. రావణునకు ప్రియురాలు, గౌరవపాత్రురాలు, అట్టి ఆమెను కూడ విడచి మహాబలశాలియైన రావణుడు నిన్నే పొందగలడు. 13

మూ. సమృద్ధం స్త్రీసహస్రేణ నానారత్నోపశోభితమ్, 14
అన్తఃపురం సముత్సృజ్య త్వాముపైష్యతి రావణః.

ప్ర. అ. రావణః=రావణుడు, స్త్రీసహస్రేణ=వేయిమంది స్త్రీలతో, సమృద్ధమ్=నిండిన, నానారత్నోపశోభితమ్=అనేకవిధము లైన శ్రేష్ఠవస్తువులచే ప్రకాశింపచేయబడిన, అన్తఃపురమ్=అంతఃపురమును, సముత్సృజ్య=విడచి, త్వామ్=నిన్ను, ఉపైష్యతి=పొందగలడు.

తా. చాలామంది స్త్రీలతో నిండినదై, అనేక రత్నములచేత ప్రకాశింప చేయబడిన అంతఃపురమును విడచి రావణుడు నిన్ను చేరగలడు. 14

మూ. అన్యా తు వికటా నామ రాక్షసీ వాక్యమబ్రవీత్, 15
అసకృద్దేవతా యుద్ధే నాగగన్ధర్వదానవాః,
నిర్జితాః సమరే యేన స తే పార్శ్వముపాగతః. 16

ప్ర. అ. వికటా నామ=వికట అను పేరు గల, అన్యా=మరియొక్క, రాక్షసీ తు=రాక్షస స్త్రీ, వాక్యమ్=వాక్యమును, అబ్రవీత్=పలికెను. యేన=ఎవని చేత, అసకృత్=అనేకపర్యాయములు, యుద్ధే=యుద్ధమునందు, దేవతాః=దేవతలు, సమరే=యుద్ధమునందు, నాగగన్ధర్వదానవాః=నాగులు, గంధర్వులు, దానవులు, నిర్జితాః=జయింపబడినారో, సః=ఆ రావణుడు, తే=నీ యొక్క, పార్శ్వమ్=ప్రక్కకు, ఆగతః=వచ్చినాడు.

తా. వికట అను మరియొక రాక్షసస్త్రీ ఇట్లు పలికెను-యుద్ధాలలో అనేక పర్యాయములు దేవనాగగంధర్వదానవులను ఓడించిన రావణుడు ఇప్పుడు నీ చెంతకు వచ్చినాడు. 15, 16

మూ. తస్య సర్వసమృద్ధస్య రావణస్య మహాత్మనః,
కిమద్య రాక్షసేన్ద్రస్య భార్యాత్వం నేచ్ఛసేஉధమే. 17

ప్ర. అ. అధమే=ఓ! నీచురాలా! సర్వసమృద్ధస్య=అన్ని విధాలా ఐశ్వర్యసంపన్నుడూ, మహాత్మనః=గొప్ప బుద్ధి కలవాడు, రాక్షసేన్ద్రస్య=రాక్షస

రాజూ అయిన, తస్య=అట్టి, రావణస్య=రావణునకు, భార్యాత్వమ్=భార్యాత్వమును, అద్య=ఇప్పుడు, కిమ్=ఎందువలన, నేచ్ఛసే=ఇచ్ఛయించుటలేదు.

తా. ఓ ! నీచురాలా ! సకలైశ్వర్యసంపన్నుడూ, మహాత్ముడూ, రాక్షసరాజూ అయిన అట్టి రావణునికి భార్య అగుటకు అంగీకరించవేమి ? 17

మూ. తతస్తు దుర్ముఖీ నామ రాక్షసీ వాక్యమబ్రవీత్,
యస్య సూర్యో న తపతి భీతో యస్య చ మారుతః, 18
న వాతి స్మాయతాపాఙ్గే కిం త్వం తస్య న తిష్ఠసి.

ప్ర. అ. తతః=అటుపిమ్మట, దుర్ముఖీ నామ=దుర్ముఖి అను, రాక్షసీ=రాక్షసి, వాక్యమ్=వాక్యమును, అబ్రవీత్=పలికెను. ఆయతాపాఙ్గే=దీర్ఘమైన నేత్రాంతములు కలదానా! యస్య=ఎవనికి, భీతః=భయపడినవాడై, సూర్యః=సూర్యుడు, న తపతి=తీక్ష్ణముగా ఎండకాయడో, యస్య=ఎవనికి, భీతః=భయపడినవాడై, మారుతః=వాయువు, న వాతి స్మ=గట్టిగా వీచడో, తస్య=వానికి, త్వమ్=నీవు, కిమ్=ఎందువలన, న తిష్ఠసి=అనుకూలురాలవుగా ఉండవు ?

తా. పిమ్మట దుర్ముఖి అను రాక్షసి ఇట్లు పలికెను. ఓ! దీర్ఘనేత్రాంతములు కలదానా! ఏ రావణునికి భయపడి సూర్యుడు గట్టిగా ఎండ కాయడో, ఎవనికి భయపడి గాలి గట్టిగా వీచదో, అట్టి రావణుని ఆజ్ఞ ప్రకారము నీవు ఎందుకు నడచుకొనుటలేదు ? 18

మూ. పుష్పవృష్టిం చ తరవో ముముచుర్యస్య వై భయాత్, 19
శైలాశ్చ సుభ్రు పానీయం జలదాశ్చ యదేచ్ఛతి,
తస్య నైరృతరాజస్య రాజరాజస్య భామిని, 20
కిం త్వం న కురుషే బుద్ధిం భార్యార్థే రావణస్య హి.

ప్ర. అ. సుభ్రు=మంచి కనుబొమ్మలుగల, భామిని=ఓ! సీతా! యస్య=ఎవనియొక్క, భయాత్=భయమువలన, తరవః=వృక్షములు, పుష్పవృష్టిమ్=పుష్పవర్షమును, ముముచుః=విడచినవో, యదా=ఎప్పుడు, ఇచ్ఛతి=కోరునో, అప్పుడు, శైలాశ్చ=పర్వతములు, జలదాశ్చ=మేఘములూ, పానీయమ్=ఉదకమును, విడచినవో, నైరృతరాజస్య=రాక్షసరాజూ, రాజరాజస్య=రాజులకు కూడ రాజూ అయిన, తస్య=అట్టి, రావణస్య=రావణునియొక్క, భార్యార్థే=భార్యగా ఉండుటకొరకు, బుద్ధిమ్=బుద్ధిని, త్వమ్=నీవు, కిమ్=ఎందువలన, న కురుషే=చేయుటలేదు?

తా. అందమైన కనుబొమ్మలు గల ఓ సీతా! రాక్షసరాజు, రాజాధిరాజు అయిన ఏ రావణునికి భయపడి వృక్షములు పుష్పవర్షము కురిపించుచుండునో, ఏ రావణుడు కోరినప్పుడెల్ల పర్వతములు, మేఘములు కూడ జలము విడచుచుండునో అట్టి రావణునికి భార్య అగుటకు అంగీకరించకున్నావేమి? 19, 20

మూ. సాధు తే తత్త్వతో దేవి కథితం సాధు భామిని, 21
గృహాణ సుస్మితే వాక్యమన్యథా న భవిష్యసి.

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే సున్దరకాణ్డే
త్రయోవింశః సర్గః.

ప్ర. అ. సుస్మితే=మంచి చిరునవ్వుగల, భామిని=సౌందర్యముగల, దేవి=ఓ! సీతా! సాధు=బాగుగా, తత్త్వతః=యథార్థముగా, తే=నీకు, కథితమ్=చెప్పబడిన, సాధు=మంచిదైన, వాక్యమ్=వాక్యమును, గృహాణ=గ్రహించుము. అన్యథా=అట్లుకానిచో, న భవిష్యసి=ఉండవు.

తా. అందమైన చిరునవ్వు గల సౌందర్యవతివైన ఓ! సీతా! చక్కగా, యథార్థముగా నీకు చెప్పుచున్నాను. నా మాట వినుము. అట్లు కానిచో నీ వింక జీవించవు. 21

"బాలానందిని " అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు
సుందరకాండలో ఇరువదిమూడవ సర్గ సమాప్తము.

అథ చతుర్వింశః సర్గః

[సీత రాక్షసస్త్రీల మాటలు తిరస్కరించుట; వాళ్లు సీతను భయపెట్టుట]

మూ. తతః సీతాముపాగమ్య రాక్షస్యో వికృతాననాః,
పరుషం పరుషా నార్య ఊచుస్తాం వాక్యమప్రియమ్. 1

ప్ర. అ. తతః=అటు పిమ్మట, పరుషాః=క్రూరస్వభావము గల, వికృతాననాః=వికృతములైన ముఖములు గల, రాక్షస్యః నార్యః=రాక్షస స్త్రీలు, తాం సీతామ్=ఆ సీతను, ఉపాగమ్య=సమీపించి, అప్రియమ్=అప్రియమైన, వాక్యమ్=వాక్యమును, పరుషమ్=పరుషముగా, ఊచుః=పలికిరి.

తా. పిమ్మట క్రూరస్వభావము గల, వికృతములైన ముఖములతో భయంకరముగా ఉన్న రాక్షసస్త్రీలు సీతను సమీపించి పరుషముగా అప్రియములైన మాటలు పలికిరి. 1

మూ. కిం త్వమన్తఃపురే సీతే సర్వభూతమనోహరే,
మహార్హశయనోపేతే న వాసమనుమన్యసే. 2

ప్ర. అ. సీతే=సీతా ! త్వమ్=నీవు, సర్వభూతమనోహరే=సకల భూతములకు మనోహరమూ, మహార్హశయనోపేతే=అత్యుత్తమములైన శయనములతో కూడినదీ అయిన, అన్తఃపురే=అంతఃపురమునందు, వాసమ్=నివాసమును, కిమ్=ఎందువలన, నానుమన్యసే=అంగీకరించుటలేదు?

తా. ఓ ! సీతా ! రావణాంతఃపురము అందరికి మనోహరమైనదీ; శ్రేష్ఠములైన శయనములతో అలంకరింపబడినది. అట్టి అంతఃపురములో నివసించుటకు ఏల అంగీకరించవు? 2

మూ. మానుషీ మానుషస్యైవ భార్యాత్వం బహుమన్యసే,
ప్రత్యాహర మనో రామాన్న త్వం జాతు భవిష్యసి. 3

ప్ర. అ. మానుషీ=మనుష్యస్త్రీవైన నీవు, మానుషస్యైవ=మనుష్యునకే, భార్యాత్వమ్=భార్య యగుటను, బహుమన్యసే=గొప్పదిగా తలచుచున్నావు. రామాత్=రామునినుండి, మనః=మనస్సును, ప్రత్యాహర=మరల్చుము. త్వమ్=నీవు, జాతు=ఎన్నడును, న భవిష్యసి=ఉండవు.

తా. నీవు మనుష్యస్త్రీవి అగుటచే మనుష్యుని భార్యగా ఉండుటయే గొప్ప అని తలచుచున్నావు. ఇంక రామునినుండి నీ మనస్సును మరల్చుకొనుము. అట్లు కానిచో నీ వెన్నటికీ జీవించవు. 3

మూ. త్రైలోక్యవసుభోక్తారం రావణం రాక్షసేశ్వరమ్,
భర్తారముపసంగమ్య విహరస్వ యథాసుఖమ్. 4

ప్ర. అ. త్రైలోక్యవసుభోక్తారమ్=మూడులోకముల ఐశ్వర్యమును అనుభవించు, రాక్షసేశ్వరమ్=రాక్షసరాజైన, రావణమ్=రావణుని, భర్తారమ్=భర్తనుగా, ఉపసంగమ్య=చేరి, యథాసుఖమ్=సుఖముగా, విహరస్వ=విహరించుము.

తా. రాక్షసరాజైన రావణుడు మూడు లోకముల ఐశ్వర్యమును అనుభవించువాడు. ఆతనిని భర్తగా చేరి సుఖముగా విహరించుము. 4

మూ. మానుషీ మానుషం తం తు రామమిచ్ఛసి శోభనే,
రాజ్యాద్భ్రష్టమసిద్ధార్థం విక్లబం త్వమనిన్దితే. 5

ప్ర. అ. శోభనే=మంగళప్రదురాలా ! అనిన్దితే=నిందింపబడనిదానా! మానుషీ=మనుష్యస్త్రీవైన, త్వం తు=నీవైతే, రాజ్యాత్=రాజ్యమునుండి, భ్రష్టమ్=భ్రష్టుడూ, అసిద్ధార్థమ్=సఫలముకాని కార్యములు కలవాడు, విక్లబమ్=వ్యాకులుడూ అయిన, మానుషమ్=మనుష్యుడైన, తం రామమ్=ఆ రాముని, ఇచ్ఛసి=కోరుచున్నావు!

తా. మంగళప్రదురాలవు, దోషరహితురాలవు అయిన ఓ! సీతా! మనుష్య స్త్రీవగుటచే నీవు మనుష్యుడైన ఆ రాముడే కావాలని కోరుకొనుచున్నావు ! అతడు రాజ్యభ్రష్టుడు. ఏకార్యములు సాధించజాలనివాడు. కష్టాలతో వ్యాకులుడై ఉన్నాడు. 5

మూ. రాక్షసీనాం వచః శ్రుత్వా సీతా పద్మనిభేక్షణా,
నేత్రాభ్యామశ్రుపూర్ణాభ్యామిదం వచనమబ్రవీత్. 6

ప్ర. అ. పద్మనిభేక్షణా=పద్మములతో సమానమైన నేత్రములు గల, సీతా=సీత, రాక్షసీనామ్=రాక్షసస్త్రీలయొక్క, వచః=వచనమును, శ్రుత్వా=విని, అశ్రుపూర్ణాభ్యామ్=కన్నీళ్ళతో నిండిన, నేత్రాభ్యామ్=నేత్రములతో, ఇదమ్=ఈ, వచనమ్=వచనమును, అబ్రవీత్=పలికెను.

తా. పద్మముల వంటి నేత్రములు గల సీత, రాక్షసస్త్రీల మాటలు విని, కన్నీళ్లు నిండిన నేత్రములతో ఇట్లు పలికెను. 6

మూ. యదిదం లోకవిద్విష్టముదాహరథ సంగతాః,
నైతన్మనసి వాక్యం మే కిల్బిషం ప్రతిభాతి వః. 7

ప్ర. అ. సంగతాః=కలిసిన మీరందరూ, లోకవిద్విష్టమ్=లోకములో ద్వేషింపబడిన, యత్=ఏ, ఇదమ్=ఈ వాక్యమును, మే=నా విషయమునందు, ఉదాహరథ=పలుకుచున్నారో, ఏతత్=ఇది, వః=మీయొక్క, మనసి=మనస్సునందు, కిల్బిషమ్=పాపమైనదిగా, న ప్రతిభాతి=తోచుటలేదా?

తా. మీరందరూ కలిసి, నాతో, లోకులు నిందించే మాటలు మాటలాడుచున్నారు! ఇవి పాపపు మాటలని మీకు తోచుటలేదా? 7

మూ. న మానుషీ రాక్షసస్య భార్యా భవితుమర్హతి,
కామం ఖాదత మాం సర్వా న కరిష్యామి వో వచః. 8

ప్ర. అ. మానుషీ=మనుష్యస్త్రీ, రాక్షసస్య=రాక్షసునకు, భార్యా=భార్యగా, భవితుమ్=అగుటకు, న అర్హతి=తగదు. సర్వాః=మీరందరూ, కామమ్=స్వేచ్ఛగా, మామ్=నన్ను, ఖాదత=తినివెయ్యండి. వః=మీయొక్క, వచః=వచనమును, న కరిష్యామి=చెయ్యను.

తా. మనుష్యస్త్రీ రాక్షసునకు భార్య అగుట యుక్తము కాదు. మీరందరూ కలిసి నన్ను చంపి తినివేసినా సరే; మీరు చెప్పినట్లు మాత్రము చెయ్యను.8

మూ. దీనో వా రాజ్యహీనో వా యో మే భర్తా స మే గురుః,
తం నిత్యమనురక్తాస్మి యథా సూర్యం సువర్చలా. 9

ప్ర. అ. దీనో వా=దీనుడైనను, రాజ్యహీనో వా=రాజ్యహీనుడైనను, యః=ఎవడు, మే=నాకు, భర్తా=భర్తయో, సః=ఆతడే, మే=నాకు, గురుః=పూజ్యుడు, సువర్చలా=సువర్చల, సూర్యం యథా=సూర్యుని వలె, నిత్యమ్=ఎల్లప్పుడూ, తమ్=ఆతనిని గూర్చి, అనురక్తా=అనురాగము కలదానను, అస్మి=అయిఉన్నాను.

తా. దీనుడైనా, రాజ్యభ్రష్టుడైనా, నా భర్తయే నాకు పూజ్యుడు. సువర్చల సూర్యునియందు అనురాగముతో ఉన్నట్లు, నేను ఎల్లప్పుడు నా భర్తయందే అనురాగముతో ఉందును. 9

మూ. యథా శచీ మహాభాగా శక్రం సముపతిష్ఠతి,
అరున్ధతీ వసిష్ఠం చ రోహిణీ శశినం యథా. 10

లోపాముద్రా యథాగస్త్యం సుకన్యా చ్యవనం యథా,
సావిత్రీ సత్యవన్తం చ కపిలం శ్రీమతీ యథా, 11

సౌదాసం మదయన్తీవ కేశినీ సగరం యథా,
నైషధం దమయన్తీవ భైమీ పతిమనువ్రతా. 12

తథాహమిక్ష్వాకువరం రామం పతిమనువ్రతా.

ప్ర. అ. మహాభాగా=ఉత్తమభాగ్యవంతురాలైన, శచీ=శచీదేవి, యథా=ఎట్లు, శక్రమ్=దేవేంద్రుని, సముపతిష్ఠతి=చేరునో, అరున్ధతీ=అరుంధతి, వసిష్ఠం చ=వసిష్ఠుని చేరునో, రోహిణీ=రోహిణి, శశినమ్=చంద్రుని, యథా=ఎట్లు చేరునో, లోపాముద్రా=లోపాముద్ర, అగస్త్యమ్=అగస్త్యుని, యథా=ఎట్లు చేరునో, సుకన్యా=సుకన్య, చ్యవనమ్=చ్యవనుని, యథా=ఎట్లు చేరునో, సావిత్రీ=సావిత్రి, సత్యవన్తమ్=సత్యవంతుని ఎట్లు చేరునో, శ్రీమతీ=శ్రీమతి, కపిలమ్=కపిలుని, యథా=ఎట్లు చేరునో అట్లు, సౌదాసమ్=సౌదాసుని, మదయన్తీవ=మదయంతివలె, కేశినీ=కేశినీ, సగరం యథా=సగరుని వలె, పతిమ్=భర్త యైన, నైషధమ్=నలుని, అనువ్రతా=అనుసరించిన వ్రతము గల, భైమీ=భీముని కుమార్తెయైన, దమయన్తీవ=దమయంతి వలె, తథా=అట్లే, అహమ్=నేను, ఇక్ష్వాకువరమ్=ఇక్ష్వాకురాజులలో శ్రేష్ఠుడైన, పతిమ్=భర్తయైన, రామమ్=రాముని, అనువ్రతా=అనుసరించిన వ్రతము కలదానను.

తా. మహాభాగ్యవంతురాలైన శచీదేవి దేవేంద్రుని వలె, అరుంధతి వసిష్ఠుని వలె, రోహిణి చంద్రుని వలె, లోపాముద్ర అగస్త్యుని వలె, సుకన్య చ్యవనుని వలె, సావిత్రి సత్యవంతుని వలె, శ్రీమతి కపిలుని వలె, మదయంతి సౌదాసుని వలె, కేశిని సగరుని వలె, భీమపుత్రియైన దమయంతి నలుని వలె నేను ఇక్ష్వాకువంశీయులలో శ్రేష్ఠుడైన రామునే అనుసరించుదానను. 10-12

మూ. సీతాయా వచనం శ్రుత్వా రాక్షస్యః క్రోధమూర్ఛితాః, 13
భర్త్సయన్తి స్మ పరుషైర్వాక్యై రావణచోదితాః.

ప్ర. అ. రావణచోదితాః=రావణునిచేత ప్రేరేపించబడిన, రాక్షస్యః=రాక్షసస్త్రీలు, సీతాయాః=సీతయొక్క, వచనమ్=వచనమును, శ్రుత్వా=విని, క్రోధమూర్ఛితాః=క్రోధముచే వ్యాపింపబడినవారై, పరుషైః=పరుషములైన, వాక్యైః=వాక్యములచేత, భర్త్సయన్తి స్మ=భయపెట్టిరి.

తా. రావణునిచేత ప్రేరేపింపబడిన ఆ రాక్షసస్త్రీలు, సీత మాటలు విని కోపముతో నిండినవారై, పరుషములైన మాటలతో ఆమెను భయపెట్టిరి.13

మూ. అవలీనః స నిర్వాక్యో హనుమాన్ శింశుపాద్రుమే, 14
సీతాం సంతర్జయన్తీస్తా రాక్షసీరశృణోత్ కపిః.

ప్ర. అ. కపిః=వానరుడైన, సః హనుమాన్=ఆ హనుమంతుడు, నిర్వాక్యః=మాటలాడని వాడై, శింశుపాద్రుమే=శింశుపావృక్షమునందు, అవలీనః= దాగి ఉన్నవాడై, సీతామ్=సీతను, సంతర్జయన్తీః=భయపెట్టుచున్న, తాః=ఆ, రాక్షసీః=రాక్షసస్త్రీలను, అశృణోత్=వినెను.

తా. ఆ హనుమంతుడు ఏమీ మాటలాడకుండా ఆ శింశుపావృక్షము పైననే దాగి ఉండి సీతను భయపెట్టుచున్న రాక్షసస్త్రీల మాటలు వినుచుండెను.

వి. ఈ సందర్భములో హనుమంతుడు మాటలాడే ప్రసక్తియే లేదు గాన "నిర్వాక్యః" అనే విశేషణము అనర్థకముగా కనబడుచున్నది. ఇంత జరుగుచున్నా హనుమంతుడు తాను బైటపడలేదు అనే భావము చెప్పకొనవలసిఉండును. అందుచేత ప్రాచ్యపాఠము బాగున్నది.

"అవలీనస్తు తద్వాక్యం హనుమాన్ శింశుపాద్రుమే,
సీతాం సంతర్జయన్తీనాం రాక్షసీనాం స శుశ్రువే" అని ఆ పాఠము.

మూ. తామభిక్రమ్య సంక్రుద్ధా వేపమానాం సమన్తతః. 15
భృశం సంలిలిహుర్దీప్తాన్ ప్రలమ్బాన్ దశనచ్ఛదాన్.

ప్ర. అ. వేపమానామ్=వణకుచున్న, తామ్=ఆ సీతను, సమన్తతః= నలువైపులా, అభిక్రమ్య=సమీపించి, సంక్రుద్ధాః=కోపగించినవారై, దీప్తాన్=ఎఱ్ఱగా ప్రకాశించుచున్న, ప్రలమ్బాన్=వ్రేలాడుచున్న, దశనచ్ఛదాన్=పెదవులను, భృశమ్= మిక్కిలి, సంలిలిహుః=నాకిరి.

తా. ఆ రాక్షసస్త్రీలు వణకిపోవుచున్న సీతను నలు మూలల చుట్టుముట్టి కోపముతో, వ్రేలాడుచున్న ఎఱ్ఱని తమ పెదవులను నాకుచు, సీతను చంపి తిని వేయుదమన్నట్లు సూచించుచుండిరి. 15

మూ. ఊచుశ్చ పరమక్రుద్ధాః ప్రగృహ్యాశు పరశ్వధాన్, 16
నేయమర్హతి భర్తారం రావణం రాక్షసాధిపమ్.

ప్ర. అ. పరమక్రుద్ధాః=చాలా కోపించినవారై, ఆశు=శీఘ్రముగా, పరశ్వధాన్=గండ్ర గొడ్డళ్ళను, ప్రగృహ్య=గ్రహించి, ఊచుశ్చ=ఇట్లు పలికిరి కూడ, ఇయమ్=ఈమె, రాక్షసాధిపమ్=రాక్షసరాజైన, రావణమ్=రావణుని, భర్తారమ్=భర్తనుగా, నార్హతి=తగదు.

తా. వాళ్లు చాలా కోపముతో వెంటనే, గండ్రగొడ్డళ్లు చేతులతో ధరించి ఇట్లనిరి. "ఈమె రాక్షసరాజైన రావణునకు భార్య అగుటకు తగదు". 16

మూ. సా భర్త్స్యమానా భీమాభీ రాక్షసీభిర్వరాననా, 17
సబాష్పమపసర్పన్తీ శింశుపాం తాముపాగమత్.

ప్ర. అ. భీమాభిః=భయంకరులైన, రాక్షసీభిః=రాక్షసస్త్రీలచేత, భర్త్స్యమానా=భయపెట్టబడుచున్న, సా=ఆ, వరాననా=శ్రేష్ఠమైన ముఖము గల సీత, సబాష్పమ్=కన్నీళ్లతో కూడినట్లుగా, అపసర్పన్తీ=అక్కడినుండి కదలుచున్నదై, తామ్=ఆ, శింశుపామ్=శింశుపావృక్షమును, ఉపాగమత్=చేరెను.

తా. భయంకరమైన ఆ రాక్షసస్త్రీలు భయపెట్టుచుండగా సుందరమైన ముఖము గల సీత, కన్నీళ్లు కార్చుచు అచటినుండి దూరముగా పోయి ఆ శింశుపావృక్షము వైపు వెళ్ళెను. 17

మూ. తతస్తాం శింశుపాం సీతా రాక్షసీభిః సమావృతా, 18
అభిగమ్య విశాలాక్షీ తస్థౌ శోకపరిప్లుతా.

ప్ర. అ. తతః=అటుపిమ్మట, విశాలాక్షీ=విశాలములైన నేత్రములు గల, సీతా=సీత, తాం శింశుపామ్=ఆ శింశుపావృక్షమును, అభిగమ్య=సమీపించి, రాక్షసీభిః=రాక్షసస్త్రీలచేత, సమావృతా=చుట్టువారుకొనబడినదై, శోకపరిప్లుతా=దుఃఖముతో నిండినదై, తస్థౌ=ఉండెను.

తా. పిమ్మట విశాలాక్షియైన ఆ సీత శింశుపావృక్షమును చేరి, అక్కడ కూడ రాక్షసస్త్రీలు చుట్టుముట్టగా, దుఃఖాక్రాంతయై నిలచెను. 18

మూ. తాం కృశాం దీనవదనాం మలినామ్బరధారిణీమ్, 19
భర్త్సయాంచక్రిరే సీతాం రాక్షస్యస్తాం సమన్తతః.

ప్ర. అ. తాః=ఆ, రాక్షస్యః=రాక్షసస్త్రీలు, కృశామ్=కృశించినది, దీనవదనామ్=దీనమైన ముఖము గలది, మలినామ్బరధారిణీమ్=మలినమైన వస్త్రములను ధరించినది అయిన, తాం సీతామ్=ఆ సీతను, సమన్తతః=నలువైపులనుండి, భర్త్సయాంచక్రిరే=భయపెట్టిరి.

తా. కృశించి, దీనమైన ముఖముతో, మలినమైన వస్త్రములను ధరించి ఉన్న ఆ సీతను ఆ రాక్షసస్త్రీలు, చుట్టు చేరి, భయపెట్టిరి. 19

మూ. తతస్తాం వినతా నామ రాక్షసీ భీమదర్శనా, 20
అబ్రవీత్కుపితాకారా కరాళా నిర్ణతోదరీ.

ప్ర. అ. తతః=అటు పిమ్మట, భీమదర్శనా=భయంకరమైన దర్శనము కలదీ, కుపితాకారా=కోపగించిన ఆకారము గలది, కరాళా=వంకరటింకరగా ఉన్నదీ, నిర్ణతోదరీ=లోతుగా దింపుకొనిపోయిన ఉదరము గలదీ అయిన, వినతా నామ=వినత అను, రాక్షసీ=రాక్షసస్త్రీ, తామ్=ఆమెను గూర్చి, అబ్రవీత్=పలికెను.

తా. పిమ్మట, చూచువారికి భయము కలిగించు వినత యను రాక్షసి ఇట్లు పలికెను. ఆ దేహము వంకరటింకరగా ఉండెను. ఆమె కోపముతో నిండి యుండెను. ఆమె పొట్ట లోతుకుపోయి ఉండెను. 20

మూ. సీతే పర్యాప్తమేతావద్భర్తుః స్నేహో నిదర్శితః, 21
సర్వాత్రాతికృతం భద్రే వ్యసనాయోపకల్పతే.

ప్ర. అ. సీతే=సీతా ! భర్తుః=భర్త యొక్క (యందు), స్నేహః=స్నేహము, నిదర్శితః=చూపబడినది. ఏతావత్=ఇంతమాత్రము, పర్యాప్తమ్=చాలును. భద్రే=మంగళప్రదురాలా! సర్వత్ర=అంతటా, అతికృతమ్=అతిగా చేయబడినది, వ్యసనాయ=కష్టమునకు, ఉపకల్పతే=ఏర్పడును.

తా. సీతా ! నీ భర్తపై నీ వింతవరకూ చూపించిన ప్రేమచాలును. ఓ మంగళప్రదురాలా! ఏ విషయమునందైనను అతిగా చేసినదో అది కష్టాలకు దారి తీయును. 21

మూ. పరితుష్టాస్మి భద్రం తే మానుషస్తే కృతో విధిః, 22
మమాపి తు వచః పథ్యం బ్రువన్త్యాః కురు మైథిలి.

ప్ర. అ. మైథిలి=సీతా ! పరితుష్టా=సంతోషించినదానను, అస్మి=అయినాను, తే=నీకు (నీచేత), మానుషః=మనుష్యసంబంధమైన, విధిః=ధర్మము, కృతః=నిర్వర్తింపబడినది. తే=నీకు, భద్రమ్=మంగళ మగుగాక. బ్రువన్త్యాః=చెప్పుచున్న, మమ=నాయొక్క, పథ్యమ్=పథ్యమైన, వచః అపి=వాక్యమును కూడ, కురు=చేయుము.

తా. ఓ !సీతా ! ఒక మనుష్యస్త్రీ చేయవలసిన ధర్మమును నిర్వర్తించినావు. చాలా సంతోషము! నీకు క్షేమమగుగాక. నేను చెప్పుచున్న హితవాక్యమును -కూడ విని, అట్లు ఆచరించుము. 22

మూ. రావణం భజ భర్తారం భర్తారం సర్వరక్షసామ్, 23
విక్రాన్తం రూపవన్తం చ సురేశమివ వాసవమ్,
దక్షిణం త్యాగశీలం చ సర్వస్య ప్రియదర్శనమ్. 24

ప్ర. అ. సర్వరక్షసామ్=సమస్తమైన రాక్షసులకు, భర్తారమ్=భర్తయైనవాడూ, విక్రాన్తమ్=విక్రమించువాడూ, రూపవన్తం చ=సౌందర్యవంతుడూ, సురేశమ్=దేవతాప్రభువైన, వాసవమివ=దేవేంద్రుని వంటివాడూ, దక్షిణమ్=నేర్పుగలవాడూ, త్యాగశీలం చ=త్యాగస్వభావము కలవాడూ, సర్వస్య=అందరికీ, ప్రియదర్శనమ్=ప్రియమైన దర్శనము కలవాడూ అయిన, రావణమ్=రావణుని, భర్తారమ్=భర్తనుగా, భజ=పొందుము.

తా. సకలరాక్షసులకు ప్రభువైన రావణుని భర్తగా పొందుము. అతడు పరాక్రమవంతుడు; సౌందర్యవంతుడు; దేవతల అధిపతియైన దేవేంద్రుని వంటివాడు. నేర్పు కలవాడు. త్యాగశీలము కలవాడు. చూచేవారందరికి ఆనందము కలిగించువాడు. 23, 24

మూ. మానుషం కృపణం రామం త్యక్త్వా రావణమాశ్రయ,
దివ్యాఙ్గరాగా వైదేహి దివ్యాభరణభూషితా, 25
అద్యప్రభృతి సర్వేషాం లోకనామీశ్వరీ భవ.

ప్ర. అ. మానుషమ్=మానవుడూ, కృపణమ్=దీనుడూ అయిన, రామమ్=రాముని, త్యక్త్వా=విడచి, రావణమ్=రావణుని, ఆశ్రయ=ఆశ్రయించుము. వైదేహి=సీతా! దివ్యాఙ్గరాగా=శ్రేష్ఠమైన అంగరాగము గలదానవై, దివ్యాభరణభూషితా=శ్రేష్ఠములైన అలంకారములలో అలంకరించబడినదానవై, అద్యప్రభృతి=నేడు మొదలు, సర్వేషామ్=సమస్తమైన, లోకానామ్=లోకములకు, ఈశ్వరీ=ప్రభువుగా, భవ=అగుము.

తా. సీతా ! మానవుడూ, దీనుడూ అయిన రాముణ్ణి విడిచి పెట్టి రావణుని ఆశ్రయించుము. నేటినుండి దివ్యములైన అంగరాగములను (మైపూతలను) శరీరమునకు పూసికొని శ్రేష్ఠములైన అలంకారములు అలంకరించుకొని సకల లోకములకు ప్రభువు అగుము. 25

మూ. అగ్నేః స్వాహా యథా దేవీ శచీ వేన్ద్రస్య శోభనే, 26
కిం తే రామేణ వైదేహి కృపణేన గతాయుషా.

ప్ర. అ. శోభనే=మంగళప్రదురాలా ! అగ్నేః=అగ్నియొక్క, దేవీ=భార్యయైన, స్వాహా యథా=స్వాహాదేవి వలె, ఇన్ద్రస్య=ఇంద్రునిభార్యయైన, శచీవ=శచీదేవివలె,

(లోకాధీశ్వరురాలవు అగుము). వైదేహి=సీతా!కృపణేన=దీనుడూ, గతాయుషా=గ డచిపోయిన ఆయుర్దాయము కలవాడూ అయిన, రామేణ=రామునితో, కిమ్=ఏమి ప్రయోజనము?

తా. మంగళప్రదురాలవైన సీతా ! అగ్నిదేవుని భార్యయైన స్వాహాదేవి వలె, ఇంద్రుని భార్యయైన శచీదేవి వలె లోకాధీశురాలవు అగుము. దీనుడైన రామునితో నీ కేమి ప్రయోజనమున్నది. ఆతని ఆయుర్దాయము తీరిపోయినది.

మూ. ఏతదుక్తం చ మే వాక్యం యది త్వం న కరిష్యసి, 27
అస్మిన్ముహూర్తే సర్వాస్త్వాం భక్షయిష్యామహే వయమ్.

ప్ర. అ. ఉక్తమ్=పలకబడిన, మే=నాయొక్క, ఏతత్=ఈ, వాక్యమ్=వాక్యమును, త్వమ్=నీవు, న కరిష్యసి యది=చేయకపోయినచో, వయమ్=మేము, సర్వాః=అందరము, అస్మిన్=ఈ, ముహూర్తే=క్షణమునందే, త్వామ్=నిన్ను, భక్షయిష్యామహే=భక్షించెదము.

తా. నేను చెప్పినట్లు నీవు చేయకపోయినచో, మేమందరమూ కలిసి ఈ క్షణంలోనే నిన్ను చంపి తినివేసెదము. 27

మూ. అన్యా తు వికటా నామ లమ్బమానపయోధరా, 28
అబ్రవీత్కుపితా సీతాం ముష్టిముద్యమ్య గర్జతీ.

ప్ర. అ. లమ్బమానపయోధరా=వ్రేలాడుచున్న స్తనములు గల, వికటా నామ=వికట అను పేరుగల, అన్యా తు=మరియొక స్త్రీ యైతే, ముష్టిమ్=పిడికిలిని, ఉద్యమ్య=ఎత్తి, కుపితా=కోపగించినదై, గర్జతీ=గర్జించుచు, సీతామ్=సీతను గూర్చి, అబ్రవీత్=పలికెను.

తా. వ్రేలాడుచున్న స్తనములు గల వికట అను మరొక రాక్షసి, కోపముతో పిడికిలి ఎత్తి గర్జించుచు సీతతో ఇట్లు పలికెను. 28

మూ. బహూన్యప్రియరూపాణి వచనాని సుదుర్మతే, 29
అనుక్రోశాన్మృదుత్వాచ్చ సోఢాని తవ మైథిలి.

ప్ర. అ. సుదుర్మతే=చాలా చెడ్డబుద్ధిగల, మైథిలి=సీతా! అప్రియరూపాణి=చాలా అప్రియములైన, బహూని=అనేకములైన, తవ వచనాని=నీ మాటలు, అనుక్రోశాత్=జాలివలనా, మృదుత్వాచ్చ=మెత్తదనమువలనా, సోఢాని=సహించబడినవి.

తా. చాలా చెడ్డబుద్ధి గల సీతా! నీవు చాలా అప్రియముగా పలికిన ఎన్నోమాటలు, నీపై జాలివలన మెత్తదనము చూపి సహించినాము. 29

మూ. న చ నః కురుషే వాక్యం హితం కాలపురస్కృతమ్, 30
ఆనీతాసి సముద్రస్య పారమన్యైర్దురాసదమ్,
రావణాన్తఃపురం ఘోరం ప్రవిష్టా చాసి మైథిలి. 31

ప్ర. అ. మైథిలి=సీతా ! కాలపురస్కృతమ్=కాలముచేత గౌరవింపబడినదీ, హితమ్=నీకు హితమూ అయిన, నః=మాయొక్క, వాక్యమ్=వాక్యమును, న కురుషే చ=నీవు చేయుటలేదు. అన్యైః=ఇతరులచేత, దురాసదమ్=పొంద శక్యము కాని, సముద్రస్య=సముద్రముయొక్క, పారమ్=ఇవతలి ఒడ్డును గూర్చి, ఆనీతా=తీసికొనిరాబడినదానవు, అసి=అయి ఉన్నావు. ఘోరమ్=భయంకర మైన, రావణాన్తఃపురమ్=రావణుని అంతఃపురమును, ప్రవిష్టా=ప్రవేశించినదానవు, అసి=అయి ఉన్నావు.

తా. సీతా ! కాలానుగుణముగా మేము చెప్పిన హితవాక్యములను నీవు వినుటలేదు. ఇతరులెవ్వరూ చేరలేని సముద్రము ఇవతలి ఒడ్డుకు తీసికొని వచ్చి నిన్ను భయంకరమైన రావణాంతఃపురములో ఉంచినారు!30, 31

మూ. రావణస్య గృహే రుద్ధామస్మాభిస్తు సురక్షితామ్,
న త్వాం శక్తః పరిత్రాతుమపి సాక్షాత్పురన్దరః. 32

ప్ర. అ. రావణస్య=రావణుని యొక్క, గృహే=గృహమునందు, రుద్ధామ్=బంధింపబడినదానవై, అస్మాభిః=మాచేత, సురక్షితామ్=బాగుగా రక్షింపబడిన, త్వామ్=నిన్ను, పరిత్రాతుమ్=రక్షించుటకు, సాక్షాత్=సాక్షాత్తు, పురన్దరః అపి=దేవేంద్రుడు కూడ, న శక్తః=సమర్థుడు కాడు.

తా. రావణుని గృహములో బద్ధురాలవై మేము జాగర్తగా రక్షించుచున్న నిన్ను రక్షించుటకు సాక్షాత్తు దేవేంద్రునికి కూడ శక్యము కాదు. 32

మూ. కురుష్వ హితవాదిన్యా వచనం మమ మైథిలి,
అలమశ్రుప్రపాతేన త్యజ శోకమనర్థకమ్. 33

ప్ర. అ. మైథిలి=సీతా ! హితవాదిన్యాః=హితమును చెప్పుచున్న, మమ=నాయొక్క, వచనమ్=మాటను, కురుష్వ=చేయుము. అశ్రుప్రపాతేన=కన్నీళ్ల యొక్క పడుటచేత, అలమ్=చాలును, అనర్థకమ్=వ్యర్థమైన, శోకమ్=దుఃఖమును, త్యజ=విడిచిపెట్టుము.

తా. సీతా ! నేను చెప్పుచున్న హితవాక్యమును విని ఆ ప్రకారము చేయుము. కన్నీళ్లు కార్చకుము. వ్యర్థమైన దుఃఖమును విడిచిపెట్టుము. 33

మూ. భజ ప్రీతిం చ హర్షం చ త్యజైతాం నిత్యదైన్యతామ్,
సీతే రాక్షసరాజేన సహ క్రీడ యథాసుఖమ్. 34

ప్ర. అ. సీతే=సీతా ! ప్రీతిం చ=ప్రేమను, హర్షం చ=సంతోషమును, భజ=పొందుము. ఏతామ్=ఈ, నిత్యదైన్యతామ్=నిత్యము దైన్యము కలిగి ఉండుటను, త్యజ=విడిచిపెట్టుము. రాక్షసరాజేన సహ=రాక్షసరాజుతో కూడ, యథాసుఖమ్=సుఖముగా, క్రీడ=క్రీడించుము.

తా. సీతా ! ప్రేమతోను, సంతోషముతోను ఉంటూ, ఈ నిత్యదైన్యమును విడిచిపెట్టుము. రావణునితో కలిసి సుఖముగా క్రీడించుము. 34

మూ. జానాసి హి యథా భీరు స్త్రీణాం యౌవనమధ్రువమ్,
యావన్న తే వ్యతిక్రామేత్తావత్సుఖమవాప్నుహి. 35

ప్ర. అ. భీరు=భయస్వభావము కలదానా! స్త్రీణామ్=స్త్రీలయొక్క, యౌవనమ్=యౌవనము, యథా=ఎట్లు, అధ్రువమ్=స్థిరము కానిదో, జానాసి హి=ఎరుగుదువు కదా! తే=నీ యొక్క యౌవనము, యావత్=ఎంతలో, న వ్యతిక్రామేత్=దాటిపోకుండా ఉండునో, తావత్=అంతలోగా, సుఖమ్=సుఖమును, అవాప్నుహి=పొందుము.

తా. భయస్వభావము గలదానా ! స్త్రీల యౌవనము స్థిరము కాదను విషయము నీకు తెలియును కదా! నీ యౌవనము గడచిపోవుటకు ముందుగానే సుఖము అనుభవింపుము. 35

మూ. ఉద్యానాని చ రమ్యాణి పర్వతోపవనాని చ,
సహ రాక్షసరాజేన చర త్వం మదిరేక్షణే. 36

ప్ర. అ. మదిరేక్షణే=మత్తుకలిగించే నేత్రములు గల సీతా! త్వమ్=నీవు, రాక్షసరాజేన=రాక్షసరాజుతో కూడ, రమ్యాణి=రమ్యములైన, ఉద్యానాని=ఉద్యానములను, పర్వతోపవనాని=పర్వతములను, వాటి సమీపమునందున్న వనములను, చర=సంచరించుము.

తా. మత్తు కలిగించు చూపులు గల సీతా! నీవు రావణునితో కలిసి, రమ్యములైన ఉద్యానములలోనూ, పర్వతములపైనా, వాటి దగ్గర నున్న వనములలోనూ హాయిగా విహరించుము. 36

మూ. స్త్రీసహస్రాణి తే సప్త వశే స్థాస్యన్తి సున్దరి,
రావణం భజ భర్తారం భర్తారం సర్వరక్షసామ్. 37

ప్ర. అ. సున్దరి=ఓ సుందరీ ! సప్త=ఏడు, స్త్రీసహస్రాణి=స్త్రీలసహస్రములు, తే=నీయొక్క, వశే=వశమునందు, స్థాస్యన్తి=ఉండగలవు. సర్వరక్షసామ్=సమస్త మైన రాక్షసుల, భర్తారమ్=ప్రభువైన, రావణమ్=రావణుని, భర్తారమ్=భర్తనుగా, భజ=పొందుము.

తా. ఓ సుందరీ ! సకలరాక్షసులకు ప్రభువైన రావణుని భర్తగా అంగీకరించుము. అట్లు చేసినచో ఏడువేలమంది స్త్రీలు నీ చెప్పుచేతలలో ఉండగలరు. 37

మూ. ఉత్పాట్య వా తే హృదయం భక్షయిష్యామి మైథిలి,
యది మే వ్యాహృతం వాక్యం న యథావత్కరిష్యసి. 38

ప్ర. అ. మైథిలి=సీతా ! వ్యాహృతమ్=పలకబడిన, మే=నాయొక్క, వాక్యమ్=వాక్యమును, యథావత్=పలికిన విధముగా, న కరిష్యసి యది=చేయకపోయినచో, తే హృదయమ్=నీ హృదయమును, ఉత్పాట్య వా=పెల్లగించియైనా, భక్షయిష్యామి=భక్షించెదను.

తా. సీతా ! నీవు నా మాట ప్రకారము చేయకపోయినచో నీ గుండెను చీల్చి తినివేసెదను. 38

మూ. తతశ్చణ్డోదరీ నామ రాక్షసీ క్రోధమూర్ఛితా,
భ్రామయన్తీ మహచ్ఛూలమిదం వచనమబ్రవీత్. 39

ప్ర. అ. తతః=అటుపిమ్మట, చణ్డోదరీ నామ=చండోదరి అను, రాక్షసీ=రాక్షసి, క్రోధమూర్ఛితా=క్రోధముచే వ్యాపింపబడినదై, మహత్=పెద్ద, శూలమ్=శూలమును, భ్రామయన్తీ=త్రిప్పుచు, ఇదమ్=ఈ, వచనమ్=వచనమును, అబ్రవీత్=పలికెను.

తా. పిదప, చండోదరి అను రాక్షసస్త్రీ చాలా కోపముతో పెద్ద శూలమును త్రిప్పుచు ఇట్లు పలికెను. 39

మూ. ఇమాం హరిణలోలాక్షీం త్రాసోత్కమ్పిపయోధరామ్,
రావణేన హృతాం దృష్ట్వా దౌహృదో మే మహానభూత్. 40

ప్ర. అ. హరిణలోలాక్షీమ్=లేడి వలె చంచలములైన నేత్రములు గల, త్రాసోత్కమ్పిపయోధరామ్=భయముచేత కదలుచున్న స్తనములు కల, రావణేన=

రావణుని చేత, హృతామ్=హరించబడిన, ఇమామ్=ఈమెను, దృష్ట్వా=చూచి, మే=నాకు, మహాన్=గొప్ప, దౌహృదః=కోరిక (మాలింతరాలుకు ఏదైన భక్ష్యము మీద కలుగు కోరిక దౌహృదము) అభూత్=కలిగినది.

తా. లేడి కండ్లవలె చంచలము లైన నేత్రములు, భయముచే కదులుచున్న స్తనములు గల ఈ సీతను రావణుడు అపహరించి తీసికొని వచ్చినప్పుడు, ఈమెను చూడగానే నాకొక కోరిక కలిగినది. 40

మూ. యకృత్ప్లీహమథోత్పీడం హృదయం చ సబన్ధనమ్,
అన్త్రాణ్యపి తథా శీర్షం ఖాదేయమితి మే మతిః. 41

ప్ర. అ. యకృత్=హృదయము కుడిప్రక్క నుండు మాంసమును, ప్లీహమ్=హృదయమునకు ఎడమప్రక్క నుండు మాంసమును, ఉత్పీడమ్=హృదయమునకు పై నుండు మాంసమును, సబన్ధనమ్=బంధనముతో కూడిన, హృదయం చ=హృదయమును, అన్త్రాణ్యపి చ=ప్రేగులను, తథా=మరియు, శీర్షమ్=శిరస్సును, ఖాదేయమ్ ఇతి=తిందును అని, మే=నాకు, మతిః=ఇచ్ఛ ఉన్నది.

తా. ఈమె గుండెకాయ దగ్గర ఉండు యకృత్తు, ప్లీహము, ఉత్పీడము అను మాంసములను, బంధనముతో (గుండెకాయను పట్టి ఉంచునది) సహా గుండెకాయను, ప్రేగులను, శిరస్సును తినవలె నని నాకు కోరిక ఉన్నది.41

మూ. తతస్తు ప్రఘసా నామ రాక్షసీ వాక్యమబ్రవీత్,
కణ్ఠమస్యా నృశంసాయాః పీడయామ కిమాస్యతే. 42

ప్ర. అ. తతః=అటుపిమ్మట, ప్రఘసా నామ=ప్రఘస అను, రాక్షసీ=రాక్షస స్త్రీ, వాక్యమ్=వాక్యమును, అబ్రవీత్=పలికెను. అస్యాః=ఈ, నృశంసాయాః=క్రూరురాలియొక్క, కణ్ఠమ్=కంఠమును, పీడయామ=నులిమివేసెదము. కిమ్=ఎందువలన, ఆస్యతే=ఈ విధముగాకూర్చుండుట జరుగుచున్నది.

తా. పిమ్మట ప్రఘస అను రాక్షసి పలికెను. క్రూరురాలైన ఈ సీత కంఠము నులిమివేసెదము. ఎందుకు ఈ విధంగా ఊరక కూర్చుండడము.

మూ. నివేద్యతాం తతో రాజ్ఞే మానుషీ సా మృతేతి హ,
నాత్ర కశ్చన సందేహః ఖాదతేతి స వక్ష్యతి. 43

ప్ర. అ. సా=ఆ, మానుషీ=మనుష్యస్త్రీ, మృతేతి=మరణించినది అని, తతః=పిమ్మట, రాజ్ఞే=రాజునకు, నివేద్యతామ్=తెలియపరచబడుగాక, ఖాదత=తినివె

య్యండి, ఇతి=అని, సః=అతడు, వక్ష్యతి=చెప్పగలడు, అత్ర=ఈ విషయమునందు, సన్దేహః=సందేహము, న=లేదు.

తా. పిదప "ఆ మనుష్యస్త్రీ మరణించినది" అని రాజుకు చెప్పెదము. "మీరు తిని వెయ్యండి" అని అతడు తప్పక చెప్పగలడు. 43

మూ. తతస్త్వజాముఖీ నామ రాక్షసీ వాక్యమబ్రవీత్,
విశస్యేమాం తతః సర్వాః సమాన్ కురుత పీలుకాన్. 44

ప్ర. అ. తతః=అటుపిమ్మట, అజాముఖీ నామ=అజాముఖి అను, రాక్షసీ=రాక్షసస్త్రీ, వాక్యమ్=వాక్యమును, అబ్రవీత్=పలికెను. సర్వాః=మీరందరూ, ఇమామ్=ఈమెను, విశస్య=చంపి, తతః=పిమ్మట, సమాన్=సమానములైన, పీలుకాన్=మాంసఖండములను, కురుత=చెయ్యండి.

తా. పిమ్మట అజాముఖి అను మరొక రాక్షసి ఇట్లు పలికెను - "ఈమెను చంపివేసి సమానము లైన మాంసఖండములను చెయ్యండి". 44

మూ. విభజామ తతః సర్వా వివాదో మే న రోచతే,
పేయమానీయతాం క్షిప్రం లేహ్యముచ్చావచం బహు. 45

ప్ర. అ. తతః=అటుపిమ్మట, సర్వాః=మనమందరమూ, విభజామ=పంచుకొనెదము, మే=నాకు, వివాదః=కలహము, న రోచతే=ఇష్టము కాదు, క్షిప్రమ్=శీఘ్రముగా, పేయమ్=మద్యము, ఉచ్చావచమ్=అనేకవిధములైన, బహు=అధికమైన, లేహ్యమ్=లేహ్యము (నాకి తినవలసిన పదార్థము) ఆనీయతామ్=తీసికొనిరాబడుగాక.

తా. "తరువాత మన మందరము సమముగా పంచుకొనెదము. ఎక్కువ తక్కువ అని వివాదము నాకు ఇష్టము లేదు. వెంటనే మద్యము, అనేక విధములైన లేహ్య పదార్థములు తీసికొనిరండు". 45

మూ. తతః శూర్పణఖా నామ రాక్షసీ వాక్యమబ్రవీత్,
అజాముఖ్యా యదుక్తం హి తదేవ మమ రోచతే. 46

ప్ర. అ. తతః=అటుపిమ్మట, శూర్పణఖా నామ=శూర్పణఖ అను పేరుగల, రాక్షసీ=రాక్షసి, వాక్యమ్=వాక్యమును, అబ్రవీత్=పలికెను. అజాముఖ్యా=అజాముఖిచేత, యత్=ఏది, ఉక్తమ్=చెప్పబడినదో, తదేవ=అదే, మమ=నాకు, రోచతే=ఇష్టమగుచున్నది.

తా. పిదప శూర్పణఖ అను రాక్షసి ఇట్లు పలికెను. అజాముఖి చెప్పినట్లే చేయుట నాకు కూడా ఇష్టము. 46

మూ. సురా చానీయతాం క్షిప్రం సర్వశోకవినాశినీ,
మానుషం మాంసమాస్వాద్య నృత్యామోథ నికుమ్భిలామ్. 47

ప్ర. అ. క్షిప్రమ్=శీఘ్రముగా, సర్వశోకవినాశినీ=సమస్తములైన శోకములను నశింపచేయు, సురా చ=మద్యము కూడ, ఆనీయతామ్=తీసికొనిరాబడుగాక. మానుషమ్=మనుష్యసంబంధమైన, మాంసమ్=మాంసమును, ఆస్వాద్య=తిని, అథ= పిమ్మట, నికుమ్భిలామ్=లంక పశ్చిమద్వారమునందున్న నికుంభిల అను శక్తిని గూర్చి, నృత్యామః=నృత్యము చేసెదము.

తా. సకలశోకములను నశింపచేయు మద్యము కూడ వెంటనే తీసికొని రండు. మనుష్యమాంసము తిని, పిమ్మట, నికుంభిలాప్రీత్యర్థమై నృత్యము చేసెదము. 47

మూ. ఏవం సంభర్త్స్యమానా సా సీతా సురసుతోపమా,
రాక్షసీభిః సుఘోరాభిర్ధైర్యముత్సృజ్య రోదితి. 48

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే సున్దరకాణ్డే
చతుర్వింశః సర్గః.

ప్ర. అ. సుఘోరాభిః=చాలా భయంకర లైన, రాక్షసీభిః=రాక్షసస్త్రీల చేత, ఏవమ్=ఇట్లు, సంభర్త్స్యమానా=భయపెట్టపడుచున్నదై, సురసుతోపమా=దేవకన్యతో సమానురాలైన, సా సీతా=ఆ సీత, ధైర్యమ్=ధైర్యమును, ఉత్సృజ్య=విడచి, రోదితి=ఏడ్చుచున్నది.

తా. భయంకర లైన రాక్షసస్త్రీలు ఈ విధముగా భయపెట్టుచుండగా, దేవకన్యతో సమానురాలైన ఆ సీత, ధైర్యము కోల్పోయి ఏడ్చుచుండెను. 48

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు
సుందరకాండలో ఇరువది నాల్గవసర్గ సమాప్తము.

అథ పఞ్చవింశః సర్గః

[రాక్షసస్త్రీలు అనేకవిధముల భయపెట్టుచుండగా సీత శోకార్తయై విలపించుట].

మూ. అథ తాసాం వదన్తీనాం పరుషం దారుణం బహు,
రాక్షసీనామసౌమ్యానాం రురోద జనకాత్మజా. 1

ప్ర. అ. అథ=అటుపిమ్మట, అసౌమ్యానామ్=క్రూరస్వభావము గల, తాసామ్=ఆ, రాక్షసీనామ్=రాక్షసస్త్రీలు, పరుషమ్=పరుషముగాను, దారుణమ్=భయంకరముగాను, బహు=అధికముగా, వదన్తీనామ్=మాటలాడుచుండగా, జనకాత్మజా=సీత, రురోద=ఏడ్చెను.

తా. క్రూరస్వభావము గల ఆ రాక్షసస్త్రీలు ఆ విధముగా పరుషముగా భయము కలుగునట్లు అధికముగా మాటలాడుచుండగా, వారి మాటలు విని సీత ఏడ్చెను. 1

మూ. ఏవముక్తా తు వైదేహీ రాక్షసీభిర్మనస్వినీ,
ఉవాచ పరమత్రస్తా బాష్పగద్గదయా గిరా. 2

ప్ర. అ. రాక్షసీభిః=రాక్షసస్త్రీలచేత, ఏవమ్=ఇట్లు, ఉక్తా=పలకబడిన, మనస్వినీ=ఉత్తమమైన మనస్సు గల (ఆత్మాభిమానవంతురాలైన), వైదేహీ=సీత, పరమత్రస్తా=మిక్కిలి భయపడినదై, బాష్పగద్గదయా=కన్నీటిచే డగ్గుత్తికతో కూడిన, గిరా=వాక్కుతో, ఉవాచ=పలికెను.

తా. ఆత్మాభిమానవంతురాలైన సీత, ఆ రాక్షసస్త్రీల మాటలు విని, చాల భయపడినదై, కన్నీటిచే కలిగిన డగ్గుత్తికతో ఇట్లు పలికెను. 2

మూ. న మానుషీ రాక్షసస్య భార్యా భవితుమర్హతి,
కామం ఖాదత మాం సర్వా న కరిష్యామి వో వచః. 3

ప్ర. అ. మానుషీ=మనుష్యస్త్రీ, రాక్షసస్య=రాక్షసునియొక్క, భార్యా=భార్యగా, భవితుమ్=అగుటకు, న అర్హతి=తగదు. సర్వాః=మీరందరూ, కామమ్=ఇష్టమువచ్చినట్లు, మామ్=నన్ను, ఖాదత=తినండి. వః=మీ యొక్క, వచః=వాక్యమును, న కరిష్యామి=చేయను.

తా. మనుష్యస్త్రీ రాక్షసుని భార్య అగుట కుదరదు. మీరందరూ నన్ను చంపి తినివేసినచో తినివేయండి. మీ మాట మాత్రం నేను చెయ్యను. 3

మూ. సా రాక్షసీమధ్యగతా సీతా సురసుతోపమా,
న శర్మ లేభే దుఃఖార్తా రావణేన చ తర్జితా. 4

ప్ర. అ. రాక్షసీమధ్యగతా=రాక్షసస్త్రీల మధ్యయందున్న, సురసుతోపమా=దేవకన్యతో సమానురాలైన, రావణేన చ=రావణుని చేత కూడ, తర్జితా=భయపెట్టబడిన, సా సీతా=ఆ సీత, దుఃఖార్తా=దుఃఖముచేత పీడింపబడినదై, శర్మ=సుఖమును, న లేభే=పొందలేదు.

తా. రాక్షసస్త్రీల మధ్యలో ఉన్న దేవకన్యాసదృశురాలైన ఆ సీత అంతకు పూర్వమే రావణుడు కూడ భయపెట్టి ఉండుటచే దుఃఖపీడితురాలై, ఏమాత్రము సుఖము లేకుండ ఉండెను. 4

మూ. వేపతే స్మాధికం సీతా విశన్తీ వాఙ్గమాత్మనః,
వనే యూథపరిభ్రష్టా మృగీ కోకైరివార్దితా. 5

ప్ర. అ. వనే=వనమునందు, యూథపరిభ్రష్టా=తన గుంపునుండి దూరమైపోయినదై, కోకైః=తోడేళ్ళచేత, అర్దితా=పీడించబడిన, మృగీవ=ఆడలేడివలె, సీతా=సీత, ఆత్మనః=తనయొక్క, అఙ్గమ్=శరీరమును, విశన్తీవ=ప్రవేశించుచున్నది వలె, అధికమ్=అధికముగా, వేపతే స్మ=వణకి పోయెను.

తా. వనములో తన గుంపునుండి దూరమైపోయి, తోడేళ్ళ చేత బాధింపబడుచున్న లేడి వలె, సీత, భయముచేత తన శరీరములోనికి క్రుంగిపోవుచున్నట్లు, ముణుచికొనిపోవుచు వణకిపోయెను. 5

మూ. సా త్వశోకస్య విపులాం శాఖామాలమ్బ్య పుష్పితామ్,
చిన్తయామాస శోకేన భర్తారం భగ్నమానసా. 6

ప్ర. అ. శోకేన=శోకముచేత, భగ్నమానసా=విరిగిపోయిన మనస్సు గల, సా తు=ఆ సీత, అశోకస్య=అశోకవృక్షముయొక్క, పుష్పితామ్=పుష్పించిన, విపులామ్=విశాలమైన, శాఖామ్=కొమ్మను, ఆలమ్బ్య=పట్టుకొని, భర్తారమ్=భర్తనుగూర్చి, చిన్తయామాస=చింతించెను.

తా. శోకముచేత ఉత్సాహశూన్యమైన మనస్సుతో సీత, పుష్పించిన, పెద్దదైన అశోకవృక్షశాఖను పట్టుకొని నిలబడి, భర్తను గూర్చియే ఆలోచించుచుండెను.

మూ. సా స్నాపయన్తీ విపులౌ స్తనౌ నేత్రజలస్రవైః,
చిన్తయన్తీ న శోకస్య తదాన్తమధిగచ్ఛతి. 7

ప్ర. అ. తదా=అప్పుడు, సా=సీత, నేత్రజలస్రవైః=కన్నీళ్ళస్రావములచేత, విపులౌ=విశాలములైన, స్తనౌ=స్తనములను, స్నాపయన్తీ=స్నానము చేయించుచు, చిన్తయన్తీ=ఆలోచించుచు, శోకస్య=దుఃఖముయొక్క, అన్తమ్=అంతమును, న అధిగచ్ఛతి=పొందలేదు.

తా. అప్పుడా సీత, కారుచున్న కన్నీళ్లతో విశాలములైన స్తనములను తడుపుచు, భర్తను గూర్చి ఆలోచించుచు, శోకమునకు అంతమును పొందజాలక పోయెను. 7

మూ. సా వేపమానా పతితా ప్రవాతే కదళీ యథా,
రాక్షసీనాం భయత్రస్తా వివర్ణవదనాభవత్. 8

ప్ర. అ. సా=ఆ సీత, ప్రవాతే=అధికమైన గాలి గల స్థలమునందు, పతితా=పడిపోయిన (వంగిపోయిన), కదళీ యథా=అరటిచెట్టు వలె, వేపమానా=వణకిపోవుచున్నదై, రాక్షసీభయసంత్రస్తా=రాక్షసస్త్రీలవలన కలుగు భయము (ఆపద) వలన భయపడి, వివర్ణవదనా=చెడిన రంగు గల ముఖము గలది, అభవత్=అయెను.

తా. ఆ సీత, రాక్షస స్త్రీల నుండి ఆపద రాగలదని భయపడుచు అధికమైన గాలి ఉన్న ప్రదేశములోని వంగిపోయిన అరటిచెట్టువలె, వణకుచుండెను. ఆమె ముఖము రంగు మారిపోయెను. 8

మూ. తస్యాః సా దీర్ఘవిపులా వేపన్త్యా సీతయా తదా,
దదృశే కమ్పినీ వేణీ వ్యాళీవ పరిసర్పతీ. 9

("వేపన్త్యాః పరమస్త్రియాః" అను ప్రాచ్య పాఠము బాగున్నది. పై పాఠములో విభక్తులు కుదరవు).

ప్ర. అ. వేపన్త్యాః=వణకుచున్న, తస్యాః=ఆ, పరమస్త్రియాః=ఉత్తమ స్త్రీయైన సీతయొక్క, దీర్ఘవిపులా=పొడవుగాను విశాలముగాను ఉన్న, కమ్పినీ=కదలుచున్న, సా=ఆ, వేణీ=జడ, పరిసర్పతీ=కదలుచున్న, వ్యాళీవ=సర్పమువలె, దదృశే=చూడబడెను.

తా. సీత వణకిపోవుచున్నప్పుడు, విశాలము, దీర్ఘము అయిన ఆమె జడ కూడ కదలుచు, ప్రాకుచున్న సర్పము వలె కనబడుచుండెను. 9

మూ. సా నిఃశ్వసన్తీ దుఃఖార్తా శోకోపహతచేతనా,
ఆర్తా వ్యసృజదశ్రూణి మైథిలీ విలలాప చ. 10

ప్ర. అ. దుఃఖార్తా=దుఃఖముచేత పీడింపబడినదీ, శోకోపహతచేతనా=శోకముచేత కొట్టబడిన బుద్ధికలది, ఆర్తా=రాక్షసస్త్రీలచేత, పీడింపబడినది అయిన సా=ఆ, మైథిలీ=సీత, నిఃశ్వసన్తీ=నిట్టూర్పుచున్నదై, అశ్రూణి=కన్నీళ్ళను, వ్యసృజత్=విడచెను. విలలాప చ=విలపించెను కూడ.

తా. భర్తృవియోగదుఃఖముతో బాధపడుచున్న ఆ సీత మనస్సు శోకముచేత వ్యాకులమయ్యెను. రాక్షసస్త్రీలు కూడ భయపెట్టుటచే ఆమె చాల దుఃఖించుచు, కన్నీళ్ళు కార్చుచు ఇట్లు విలపించెను. 10

మూ. హా రామేతి చ దుఃఖార్తా హా పునర్లక్ష్మణేతి చ,
హా శ్వశ్రు మమ కౌసల్యే హా సుమిత్రేతి భామినీ. 11

ప్ర. అ. భామినీ=సీత, దుఃఖార్తా=దుఃఖపీడితురాలై, హా రామేతి=హా రామా! అని, పునః=మరల, హా లక్ష్మణేతి=హా! లక్ష్మణా! అనీ, మమ=నా యొక్క , శ్వశ్రు=అత్తగారైన, హా! కౌసల్యే=హా! కౌసల్యా అనీ, హా! సుమిత్రేతి=హా!సుమిత్రా! అని విలపించెను.

తా. సీత దుఃఖార్తురాలై, అయ్యో! రామా! అయ్యో లక్ష్మణా! అయ్యో! నా అత్తగారైన కౌసల్యా! అయ్యో సుమిత్రా! అని విలపించెను. 11

మూ. లోకప్రవాదః సత్యోఽయం పణ్డితైః సముదాహృతః,
అకాలే దుర్లభో మృత్యుః స్త్రియా వా పురుషస్య వా. 12

యదాహమేవం క్రూరాభీ రాక్షసీభిరిహార్దితా,
జీవామి హీనా రామేణ ముహూర్తమపి దుఃఖితా. 13

ప్ర. అ. అహమ్=నేను, ఏవమ్=ఈ విధముగా, క్రూరాభిః=క్రూరలైన, రాక్షసీభిః=రాక్షసస్త్రీలచేత, అర్దితా=పీడింపబడినదాననై, ఇహ=ఇక్కడ, రామేణ=రామునిలో, హీనా=శూన్యురాలనై, దుఃఖార్తా=దుఃఖముచేత పీడితురాలనై, ముహూర్తమపి=క్షణకాలమైనను, యదా=ఎప్పుడు, జీవామి=జీవించుచున్నానో, స్త్రియాః వా=స్త్రీకి కాని, పురుషస్య వా=పురుషునకు గాని, అకాలే=కాలము కాని కాలమునందు, మృత్యుః=మరణము, దుర్లభః=దుర్లభము అని, పణ్డితైః=పండితులచేత, సముదాహృతః=చెప్పబడిన, లోకప్రవాదః=లోకములోని ప్రవాదము, సత్యః=సత్యమైనది.

తా. నేను రామునకు దూరముగా, ఇక్కడ, క్రూరురాళ్లైన రాక్షసస్త్రీలు పెట్టుబాధ అనుభవించుచు, దుఃఖితురాలనై, క్షణకాలము కూడ జీవించి ఉండుట అనునది ఊహింపరాని విషయము. అయినను జీవించియే ఉన్నాను. దీనిని బట్టి "స్త్రీయైనా, పురుషుడైనా మరణించవలెనని కోరుకున్నను సమయము ఆసన్నమయే వరకూ మరణము రాదు" అను పండితులు చెప్పే లోకప్రవాదము సత్యము. 12, 13

మూ. ఏషాల్పపుణ్యా కృపణా వినశిష్యామ్యనాథవత్,
సముద్రమధ్యే నౌః పూర్ణా వాయువేగైరివాహతా. 14

ప్ర. అ. అల్పపుణ్యా=అల్పమైన పుణ్యము కలదానను, కృపణా=దీనురాలనూ అయిన, ఏషా=ఈ నేను, అనాథవత్=అనాథురాలను వలె, సముద్రమధ్యే=సముద్ర మధ్యమునందు, వాయువేగైః=వాయువుయొక్క వేగములచేత, ఆహతా=కొట్టబడిన, పూర్ణా=నిండిన, నౌః ఇవ=ఓడ వలె, వినశిష్యామి=నశించెదను.

తా. అల్పమైన పుణ్యము గల, దీనురాలనైన, నేను నాథుడు లేని సామాన్య స్త్రీ వలె, సముద్రమధ్యములో వాయువేగము చేత కొట్టబడిన సరుకుతో నిండిన ఓడవలె నశించగలను. 14

మూ. భర్తారం తమపశ్యన్తీ రాక్షసీవశమాగతా,
సీదామి ఖలు శోకేన కూలం తోయహతం యథా. 15

ప్ర. అ. భర్తారమ్=నా భర్తయైన, తమ్=ఆ రాముని, అపశ్యన్తీ= చూడనిదాననై, రాక్షసీవశమ్=రాక్షసస్త్రీల వశమును, ఆగతా=పొందినదాననై, తోయహతమ్=నీటిచేత కొట్టబడిన, తీరం యథా=ఒడ్డువలె, శోకేన=శోకముతో, సీదామి ఖలు=నశించుచున్నాను కదా.

తా. ఈ రాక్షసస్త్రీలకు లొంగిపోయి నా భర్తను చూడజాలక, నేను, నీటిచే కూల్చబడిన ఒడ్డు వలె, శోకముతో నశించుచున్నాను కదా! 15

మూ. తం పద్మదళపత్రాక్షం సింహవిక్రాన్తగామినమ్,
ధన్యాః పశ్యన్తి మే నాథం కృతజ్ఞం ప్రియవాదినమ్. 16

ప్ర. అ. ("పద్మదలరక్తాక్షమ్"అను ప్రాచ్యపాఠము యుక్తము). పద్మదల రక్తాక్షమ్=పద్మదలముల వంటి ఎఱ్ఱనైన నేత్రములు గలవాడు, సింహవిక్రాన్తగామి నమ్=సింహము వలె పరాక్రమపూర్వకముగా నడుచువాడు, కృతజ్ఞమ్=కృతజ్ఞుడు, ప్రియవాదినమ్=ప్రియముగా మాటలాడువాడూ అయిన, తమ్=ఆ, మే=నాయొక్క, నాథమ్=భర్తను, ధన్యాః=ధన్యులు, పశ్యన్తి=చూచెదరు.

తా. నా నాథుడైన రాముడు పద్మము రేకుల వంటి ఎఱ్ఱని నేత్రములు కలవాడు. సింహము వలె హుందాగా నడచువాడు. కృతజ్ఞుడు, ప్రియముగా మాటలాడువాడు. అట్టి నా నాథుని అదృష్టవంతులు మాత్రమే చూచెదరు.16

మూ. సర్వథా తేన హీనాయా రామేణ విదితాత్మనా,
తీక్ష్ణం విషమివాస్వాద్య దుర్లభం మమ జీవితమ్. 17

ప్ర. అ. విదితాత్మనా=ప్రసిద్ధమైన బుద్ధిగల, తేన=ఆ, రామేణ=రామునితో, హీనాయాః=హీనురాలనైన, మమ=నాకు, తీక్ష్ణమ్=తీక్ష్ణమైన, విషమ్=విషమును, ఆస్వాద్యేవ=తిని వలె, జీవితమ్=జీవితము, సర్వథా=అన్ని విధములా, దుర్లభమ్=దుర్లభమైనది.

తా. ప్రసిద్ధమైన బుద్ధిగల ఆ రాముడు లేకుండా నేనింక జీవించుట, తీక్ష్ణమైన విషము తిన్న పిమ్మట జీవించుట ఎంత కష్టమో అంత కష్టము. 17

మూ. కీదృశం తు మహాపాపం మయా జన్మాన్తరే కృతమ్,
యేనేదం ప్రాప్యతే దుఃఖం మయా ఘోరం సుదారుణమ్. 18

ప్ర. అ. యేన=దేనిచేత, మయా=నాచేత, ఘోరమ్=భయంకరమూ, సుదారుణమ్=చాలా దారుణమూ అయిన, ఇదమ్=ఈ, దుఃఖమ్=దుఃఖము, ప్రాప్యతే=పొందబడుచున్నదో అట్టి, కీదృశమ్=ఏ విధమైన, మహాపాపమ్=గొప్ప పాపము, మయా=నాచేత, జన్మాన్తరే=జన్మాంతరమునందు, కృతమ్=చేయబడినదో కదా!

తా. నేనిపుడు అతిదారుణమూ, భయంకరమూ అయిన దుఃఖమును అనుభవించుచున్నాను. పూర్వజన్మలో నేనెట్టి మహాపాపముచేసితినో కదా! 18

మూ. జీవితం త్యక్తుమిచ్ఛామి శోకేన మహతా వృతా,
రాక్షసీభిశ్చ రక్ష్యన్త్యా రామో నాసాద్యతే మయా. 19

("మయా నావాప్యతే కామో రాక్షసీభిః సురక్షితా"అను ప్రాచ్యపాఠము యుక్తము. రాబోయే శ్లోకము దీనికి అనుగుణముగా ఉన్నది).

ప్ర. అ. మహతా=గొప్ప, శోకేన=దుఃఖముతో, వృతా=కూడిన నేను, జీవితమ్=జీవితమును, త్యక్తుమ్=విడచుటకు, ఇచ్ఛామి=కోరుచున్నాను. కామః=ఈ కోరిక, మయా=నాచేత, న అవాప్యతే=పొందబడదు. రాక్షసీభిః=రాక్షస స్త్రీలచేత, సురక్షితా=బాగా రక్షింపబడి ఉన్నాను కదా!

తా. గొప్ప శోకముతో బాధపడుచున్న నాకు మరణించవలె నను కోరిక ఉన్నది. కాని ఈ రాక్షసస్త్రీలు రక్షించుచుండగా నాకీ కోరిక తీరదు. 19

మూ. ధిగస్తు ఖలు మానుష్యం ధిగస్తు పరవశ్యతామ్,
న శక్యం యత్పరిత్యక్తుమాత్మచ్ఛన్దేన జీవితమ్. 20

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే సున్దరకాణ్డే
పఞ్చవింశః సర్గః.

ప్ర. అ. మానుష్యమ్=మనుష్యత్వమును గూర్చి, ధిక్ అస్తు=నిందఅగు గాక. పరవశ్యతామ్=పరుల వశము నందుటను గూర్చి, ధిక్ అస్తు=నింద అగుగాక. యత్=ఏ కారణమువలన, ఆత్మచ్ఛన్దేన=తన ఇష్టము ప్రకారము, జీవితమ్=జీవితమును, పరిత్యక్తుమ్=విడచుటకు, న శక్యమ్=శక్యము కాదో.

తా. ఇష్టము వచ్చినప్పుడు చచ్చుటకు కూడ శక్యము కాకుండా ఉన్నది! ఛీ! మనుష్యత్వము ఎంత చెడ్డది!ఛీ! పరాధీనత్వము ఎంత దుఃఖకరమైనది! 20

"బాలానందిని"అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు
సుందరకాండలో ఇరువదియైదవ సర్గ సమాప్తము.

అథ షడ్వింశః సర్గః

[సీత దీనముగా విలపించుచు ప్రాణములు విడువవలెనని నిశ్చయించుకొనుట].

మూ. ప్రసక్తాశ్రుముఖీ త్వేవం బ్రువతీ జనకాత్మజా,
అధోగతముఖీ బాలా విలప్తుముపచక్రమే. 1

ప్ర. అ. ప్రసక్తాశ్రుముఖీ=నిరంతరము కారుచున్న కన్నీళ్లు గల ముఖము గల, బాలా=బాలయైన, జనకాత్మజా=సీత, ఏవమ్=ఇట్లు, బ్రువతీ=పలుకుచున్నదై, అధోగతముఖీ=క్రిందికి ఉన్న ముఖము గలదై, విలప్తుమ్=విలపించుటకు, ఉపచక్రమే=ఉపక్రమించెను.

తా. బాల (చిన్న వయస్సు గలది) అయిన సీత నిరంతరముగా కన్నీళ్లుకారుచున్న ముఖముతో ఇట్లు పలుకుచు, తలవంచి, ఈ విధముగా విలపించుటకు ప్రారంభించెను. 1

మూ. ఉన్మత్తేవ ప్రమత్తేవ భ్రాన్తచిత్తేవ శోచతీ,
ఉపావృత్తా కిశోరీవ వివేష్టన్తీ మహీతలే. 2

ప్ర. అ. ఉన్మత్తేవ=ఉన్మత్తురాలు వలె, ప్రమత్తేవ=చాల మత్తెక్కినది వలె, భ్రాన్తచిత్తేవ=భ్రాంతి చెందిన చిత్తముకలది వలె, శోచతీ=ఏడ్చుచు, ఉపావృత్తా (ఆయాసమును పోగొట్టుటకై) నేలపై పండుకొనబెట్టబడిన, కిశోరీవ=ఆడగుఱ్ఱమువలె, మహీతలే=నేలమీద, వివేష్టన్తీ=దొర్లుచున్నదై (విలపించెను).

తా. ఆమె, పిచ్చిదాని వలె, మత్తులో ఉన్నదానివలె, భ్రాంతి చెందిన మనస్సు కలది వలె, ఏడ్చుచు పండుకొనబెట్టబడిన ఆడగుఱ్ఱము వలె నేలపై దొర్లుచు విలపించెను. 2

మూ. రాఘవస్య ప్రమత్తస్య రక్షసా కామరూపిణా,
రావణేన ప్రమథ్యాహమానీతా క్రోశతీ బలాత్. 3

ప్ర. అ. రాఘవస్య=రాముడు, ప్రమత్తస్య=ఏమరిపాటు చెంది ఉండగా, కామరూపిణా=స్వేచ్ఛారూపము గల, రక్షసా=రాక్షసుడైన, రావణేన=రావణుని చేత, ప్రమథ్య=బలాత్కరించి, క్రోశతీ=ఏడ్చుచున్న, అహమ్=నేను, బలాత్=బలమువలన, ఆనీతా=తీసికొనిరాబడితిని.

తా. రాముడు ఏమరి ఉన్న సమయములో కామరూపియైన రాక్షసుడు, రావణుడు ఏడ్చుచున్న నన్ను తన బలముచే బలాత్కారముగా తీసికొని వచ్చినాడు. 3

మూ. రాక్షసీవశమాపన్నా భర్త్స్యమానా సుదారుణమ్,
చిన్తయన్తీ సుదుఃఖార్తా నాహం జీవితుముత్సహే. 4

ప్ర. అ. రాక్షసీవశమ్=రాక్షసస్త్రీల వశమును, ఆపన్నా=పొందినదాననై, సుదారుణమ్=మిక్కిలి దారుణముగా, భర్త్స్యమానా=భయపెట్టబడుచున్నదానను, చిన్తయన్తీ=చింతించుచున్నదానను, సుదుఃఖార్తా=దుఃఖముచేత చాలా పీడించబడినదానను అయిన, అహమ్=నేను, జీవితుమ్=జీవించుటకు, న ఉత్సహే=కోరను.

తా. ఈ రాక్షస స్త్రీలు తమ వశములో ఉన్న నన్ను చాల దారుణముగా భయపెట్టుచున్నారు. దుఃఖముచేత మిక్కిలి పీడితురాలనై ఈ విధముగా చింతించుచు జీవించుటకు ఇచ్ఛగింపను. 4

మూ. న హి మే జీవితేనార్థో నై వార్థైర్న చ భూషణైః,
వసన్త్యా రాక్షసీమధ్యే వినా రామం మహారథమ్. 5

ప్ర. అ. మహారథమ్=మహారథుడైన, రామం వినా=రాముడు లేకుండగా, రాక్షసీమధ్యే=రాక్షసస్త్రీల మధ్య, వసన్త్యాః=నివసించుచున్న, మే=నాకు, జీవితేన=జీవితము చేత, అర్థః=ప్రయోజనము, న=లేదు. అర్థైః=ధనములచేత, న=లేదు. భూషణైశ్చ=భూషణములచేత కూడ, న=లేదు.

తా. మహారథుడైన రామునకు దూరముగా రాక్షసస్త్రీల మధ్య నివసించుచున్న నాకు, ధనములతో గాని, అలంకారములతో గాని, చివరికి ప్రాణములతో కాని పని లేదు. 5

మూ. అశ్మసారమిదం నూనమథవాప్యజరామరమ్,
హృదయం మమ యేనేదం న దుఃఖేనావశీర్యతే. 6

ప్ర. అ. అథవా=లేదా, మమ=నాయొక్క, ఇదమ్=ఈ, హృదయమ్=హృదయము, నూనమ్=యథార్థముగా, అశ్మసారమ్=ఇనుము, అజరామరమపి=జరామరణములు లేనిది. యేన=ఏ కారణము చేత, దుఃఖేన=దుఃఖముచేత, నావశీర్యతే=నశించుటలేదో.

తా. లేదా-ఈ నా హృదయము, నిజముగా ఇనుముతో చేయబడినది. దుర్బలత్వము గాని, నాశనము గాని లేనిది. అందుచేతనే ఇంత దుఃఖము వచ్చినా కూడ బ్రద్దలగుట లేదు. 6

మూ. ధిఙ్మామనార్యామసతీం యాహం తేన వినా కృతా,
ముహూర్తమపి రక్షామి జీవితం పాపజీవితా. 7

ప్ర. అ. పాపజీవితా=పాపమైన జీవితము గల, యా=ఏ, అహమ్=నేను, తేన వినా=ఆ రామునితో కూడ ఉండకుండునట్లు, కృతా=చేయబడినదాననైనను, మహూర్తమపి=క్షణకాలమైనను, జీవితమ్=జీవితమును, రక్షామి=రక్షించుచున్నానో అట్టి, అనార్యామ్=గౌరవమునకు అనర్హురాలను, ఆసతీమ్=చెడ్డదానను అయిన, మామ్=నన్ను గూర్చి, ధిక్=నింద అగుగాక.

తా. ఆ రామునకు దూరము చేయబడి కూడ, పాపజీవితము గల నేను నా జీవితమును మహూర్తముకంటే అధికముగా రక్షించుకొని ఉన్నాననగా ఛీ !నేను ఎంత అనార్యురాలను ! ఎంత చెడ్డదానిని ! 7

మూ. కా చ మే జీవితే శ్రద్ధా సుఖే వా తం ప్రియం వినా,
భర్తారం సాగరాన్తాయా వసుధాయాః ప్రియంవదమ్. 8

ప్ర. అ. సాగరాన్తాయాః=సాగరము అంతమునందు గల, వసుధాయాః=భూమికి, భర్తారమ్=ప్రభువూ, ప్రియంవదమ్=ప్రియముగా మాటలాడు వాడూ అయిన, తమ్=ఆ,ప్రియం వినా=భర్తయైన రాముడు లేకుండా, మే=నాకు, జీవితే=జీవితమునందు గాని, సుఖే వా=సుఖమునందు గాని, శ్రద్ధా=శ్రద్ధ, కా=ఏమి!

తా. నా భర్త సముద్రమువరకు వ్యాపించి యున్న భూమికి ప్రభువు. ప్రియముగానే మాటలాడువాడు. అట్టి భర్తకు దూరమైన నాకు జీవితము పై కాని, సుఖముపై కాని ఆసక్తి ఎందుకు ? 8

మూ. ఛిద్యతాం భక్ష్యతాం వాపి శరీరం విసృజామ్యహమ్,
న చాప్యహం చిరం దుఃఖం సహేయం ప్రియవర్జితా. 9

ప్ర. అ. అహమ్=నేను, శరీరమ్=శరీరమును, విసృజామి=విడచెదను. ఛిద్యతామ్=బ్రద్దలుకొట్టబడుగాక ! భక్ష్యతాం వాపి=లేదా భక్షింపబడు గాక! ప్రియవర్జితా=భర్తతో శూన్యురాలనైన, అహమ్=నేను, చిరమ్=చిరకాలము, దుఃఖమ్=దుఃఖమును, న చ సహేయమ్=సహించను.

తా. ఈ శరీరము చీల్చివేసినా సరే, భక్షించినా సరే ! నే నీ శరీరమును విడచుటకు సిద్ధముగా ఉన్నాను. భర్తకు దూరమైన నేను ఇంక చిరకాలము ఈ దుఃఖమును సహించను. 9

మూ. చరణేనాపి సవ్యేన న స్పృశేయం నిశాచరమ్,
రావణం కిం పునరహం కామయేయం విగర్హితమ్. 10

ప్ర. అ. నిశాచరమ్=రాక్షసుడు, విగర్హితమ్=నిందితుడు అయిన, రావణమ్=రావణుని, అహమ్=నేను, సవ్యేన= ఎడమదైన, చరణేనాపి=పాదముతో కూడా, న స్పృశేయమ్=స్పృశించను. కామయేయం కిం పునః=వానిని కామింతును కూడానా !

తా. నిందింపదగినవాడూ, రాక్షసుడూ అయిన రావణుని ఎడమకాలితో కూడ స్పృశింపను. అట్టి వానిని నేను కోరుదునా ! 10

మూ. ప్రత్యాఖ్యాతం న జానాతి నాత్మానం నాత్మనః కులమ్,
యో నృశంసస్వభావేన మాం ప్రార్థయితుమిచ్ఛతి. 11

ప్ర. అ. యః=ఏ రావణుడు, నృశంసస్వభావేన=క్రూర మైన స్వభావముతో, మామ్=నన్ను, ప్రార్థయితుమ్=ప్రార్థించుటకు, ఇచ్ఛతి=ఇచ్ఛయించుచున్నాడో, అట్టి ఈ రావణుడు, ఆత్మానమ్=తనను, ప్రత్యాఖ్యాతమ్=ప్రత్యాఖ్యానము చేయ బడినవానినిగా, న జానాతి=తెలుసుకొనజాలకున్నాడు. ఆత్మనః=తనయొక్క, కులమ్=కులమును, న=తెలిసికొనుటలేదు.

తా. క్రూరత్వముతో నన్ను ప్రార్థించువలె నని కోరుచున్న ఈ రావణుడు తనను నేను నిరాకరించుచున్నానను విషయమును గాని, తన కులమర్యాదను గాని గుర్తింపజాలకున్నాడు. 11

మూ. ఛిన్నా భిన్నా విభక్తా వా దీప్తేవాగ్నౌ ప్రదీపితా,
రావణం నోపతిష్ఠేయం కిం ప్రలాపేన వశ్చిరమ్. 12

ప్ర. అ. ఛిన్నా వా=ఛేదింపబడినను, భిన్నా వా=బ్రద్దలు కొట్టబడినను, దీప్తే=ప్రజ్వలించుచున్న, అగ్నౌ=అగ్నియందు, ప్రదీపితా వా=ప్రజ్వలింపచేయబడినను, రావణమ్=రావణుని, నోపతిష్ఠేయమ్=చేరను, చిరమ్=చిరకాలము, వః=మీయొక్క, ప్రలాపేన=ప్రేలాపనచేత, కిమ్=ఏమి ప్రయోజనము ?

తా. మీరు నన్ను కోసినను, బ్రద్దలు కొట్టినను, మండుచున్న అగ్నిలో పడవేసినను రావణుని చేరను. మీరు ఎంతసేపు ఏమి ప్రేలినను ప్రయోజనము లేదు. 12

మూ. ఖ్యాతః ప్రాజ్ఞః కృతజ్ఞశ్చ సానుక్రోశశ్చ రాఘవః,
సద్వృత్తో నిరనుక్రోశః శఙ్కే మద్భాగ్యసంక్షయాత్. 13

ప్ర. అ. రాఘవః=రాముడు, ఖ్యాతః=ప్రసిద్ధుడు, ప్రాజ్ఞః=బుద్ధిమంతుడు, సానుక్రోశశ్చ=జాలి కలవాడు. సద్వృత్తః=మంచినడవడిక కలవాడు. మద్భాగ్య సంక్షయాత్=నా భాగ్యము క్షీణించుటచేత, నిరనుక్రోశః=జాలిలేనివాడైనాడు అని, శఙ్కే=సందేహించుచున్నాను.

తా. రాముడు ప్రసిద్ధుడు. మహాబుద్ధిశాలి. కృతజ్ఞతకలవాడు.జాలి కలవాడు, మంచి చరితము కలవాడు. ఇప్పుడు నా అదృష్టము బాగుండకపోవుటచేతనే నా పై జాలి లేనివాడైనాడేమో అని శంకించుచున్నాను. 13

మూ. రాక్షసానాం సహస్రాణి జనస్థానే చతుర్దశ,
యేనైకేన నిరస్తాని స మాం కిం నాభిపద్యతే. 14

ప్ర. అ. ఏకేన=అసహాయుడైన, యేన=ఎవనిచేత, జనస్థానే=జనస్థానము నందు, రాక్షసానామ్=రాక్షసులయొక్క, చతుర్దశ=పదునాలుగు, సహస్రాణి=వేలు, నిరస్తాని=ఎగురకొట్టబడినవో, సః=ఆ రాముడు, మామ్=నన్ను, కిమ్=ఎందువలన, నాభిపద్యతే=రక్షించకున్నాడో !

తా. ఏ రాముడు ఒంటరిగానే, జనస్థానములో పదునాలుగు వేల రాక్షసులను సంహరించినాడో అతడీనాడు నన్నెందుచేత రక్షించుట లేదో ! 14

మూ. నిరుద్ధా రావణేనాహమల్పవీర్యేణ రక్షసా,
సమర్థః ఖలు మే భర్తా రావణం హన్తుమాహవే. 15

ప్ర. అ. అహమ్=నేను, అల్పవీర్యేణ=అల్పమైన వీర్యము గల, రక్షసా=రాక్షసుడైన, రావణేన=రావణునిచేత, నిరుద్ధా=బంధింపబడినాను. మే భర్తా=నా భర్త, ఆహవే=యుద్ధమునందు, రావణమ్=రావణుని, హన్తుమ్=చంపుటకు, సమర్థః ఖలు=సమర్థుడు కదా.

తా. అల్పమైన పరాక్రమము గల ఈ రాక్షసుడు, రావణుడు నన్ను బంధించినాడు. నా భర్త యుద్ధములో వీనిని సంహరించుటకు సమర్థుడు. 15

మూ. విరాధో దణ్డకారణ్యే యేన రాక్షసపుఙ్గవః,
రణే రామేణ నిహతః స మాం కిం నాభిపద్యతే. 16

ప్ర. అ. యేన=ఏ, రామేణ=రాముని చేత, దణ్డకారణ్యే=దండకారణ్యము నందు, రణే=యుద్ధమునందు, రాక్షసపుఙ్గవః=రాక్షసశ్రేష్ఠుడైన, విరాధః=విరాధుడు, నిహతః=చంపబడినాడో, సః=అతడు, మామ్=నన్ను, కిమ్=ఎందువలన, నాభిపద్యతే=రక్షించుట లేదో !

తా. ఏ రాముడు, దండకారణ్యమునందు యుద్ధములో, రాక్షసశ్రేష్ఠుడైన విరాధుని చంపినాడో అట్టి రాముడు నన్ను ఎందుచేత రక్షించుటలేదో !16

మూ. కామం మధ్యే సముద్రస్య లఙ్కేయం దుష్ప్రధర్షణా,
న తు రాఘవబాణానాం గతిరోధో భవిష్యతి. 17

ప్ర. అ. సముద్రస్య=సముద్రముయొక్క, మధ్యే=మధ్యయందు, ఇయమ్=ఈ, లఙ్కా=లంక, దుష్ప్రధర్షణా కామమ్=ఎదిరింపశక్యము కానిదే కావచ్చును. తు=కాని, రాఘవబాణానామ్=రాముని బాణములయొక్క, గతిరోధః=గమనమునకు అడ్డు, న భవిష్యతి=ఉండదు.

తా. సముద్రమధ్యమునందున్న ఈ లంక జయింపశక్యము కాక పోవచ్చును. కాని రాముని బాణముల గమనాన్ని ఏది అడ్డుకొనగలదు? 17

మూ. కిం ను తత్కారణం యేన రామో దృఢపరాక్రమః,
రక్షసాపహృతాం భార్యామిష్టాం నాభ్యవపద్యతే. 18

ప్ర. అ. తత్=ఆ, కారణమ్=కారణము, కిం ను=ఏమో ? యేన=దేనిచేత, దృఢపరాక్రమః=నిశ్చితమైన పరాక్రమము గల, రామః=రాముడు, రక్షసా=రాక్షసునిచేత, అపహృతామ్=అపహరింపబడిన, ఇష్టామ్=ప్రియురాలైన, భార్యామ్=భార్యను, నాభ్యవపద్యతే=రక్షించుట లేదే !

తా. వ్యర్థము కాని పరాక్రమము గల రాముడు, రాక్షసునిచేత అపహరింపబడిన ప్రియభార్యనైన నన్ను రక్షించుటకై రాకుండుటకు కారణమేమో? 18

మూ. ఇహస్థాం మాం న జానీతే శఙ్కే లక్ష్మణపూర్వజః,
జానన్నపి స తేజస్వీ ధర్షణం మర్షయిష్యతి. 19

ప్ర. అ. లక్ష్మణపూర్వజః=రాముడు, మామ్=నన్ను, ఇహస్థామ్=ఇక్కడ ఉన్నదానినిగా, న జానీతే=ఎరుగడు అని, శఙ్కే=శంకించుచున్నాను. జానన్నపి=తెలిసికూడ, సః=ఆ, తేజస్వీ=తేజఃశాలియైన రాముడు, ధర్షణమ్=అవమానమును, మర్షయిష్యతి=సహించునా ?

తా. నేను ఇక్కడ ఉన్నట్లుగా రామునకు తెలియదని నా సందేహము. తేజశ్శాలియైన ఆ రాముడు, తెలిసి కూడ, ఈ అవమానమును సహించునా?19

మూ. హృతేతి యోఽధిగత్వా మాం రాఘవాయ నివేదయేత్,
గృధ్రరాజోఽపి స రణే రావణేన నిపాతితః. 20

ప్ర. అ. యః=ఏ జటాయువు, అధిగత్వా=(రాముని) చేరి, హృతేతి=సీత హరింపబడినది అని, రాఘవాయ=రామునికి, నివేదయేత్=తెలుపునో, సః=ఆ, గృధ్రరాజోఽపి=గృధ్రముల రాజైన జటాయువు కూడా, రావణేన=రావణునిచేత, రణే=యుద్ధమునందు, హతః=చంపబడినాడు.

తా. రాముని వద్దకు వెళ్ళి, సీత రావణునిచేత హరింపబడినదని చెప్పగల జటాయువును రావణుడు యుద్ధములో చంపివేసినాడు ! 20

మూ. కృతం కర్మ మహత్తేన మాం తథాభ్యవపద్యతా,
తిష్ఠతా రావణద్వన్ద్వే వృద్ధేనాపి జటాయుషా. 21

ప్ర. అ. మామ్=నన్ను, తథా=అట్లు, అభ్యవపద్యతా=రక్షించిన, వృద్ధేనాపి=వృద్ధుడైనను, రావణద్వన్ద్వే=రావణునితో ద్వంద్వయుద్ధమునందు, తిష్ఠతా=నిలచిన, తేన జటాయుషా=ఆ జటాయువు చేత, మహత్=గొప్ప, కర్మ=పని, కృతమ్=చేయబడినది.

తా. వృద్ధుడైనా రావణునితో ద్వంద్వయుద్ధానికై తలపడి నన్ను రక్షించుటకై ప్రయత్నించిన ఆ జటాయువు చాలా గొప్ప పని చేసినాడు. 21

మూ. యది మామిహ జానీయాద్వర్తమానాం స రాఘవః,
అద్య బాణైరభిక్రుద్ధః కుర్యాల్లోకమరాక్షసమ్. 22

ప్ర. అ. సః=ఆ, రాఘవః=రాముడు, మామ్=నన్ను, ఇహ=ఇక్కడ, వర్త మానామ్=ఉన్నదానినిగా, జానీయాద్యది=ఎరిగి ఉన్నదో, అభిక్రుద్ధః=కోపించినవాడై, లోకమ్=లోకమును, బాణైః=బాణములచేత, అద్య=ఇప్పుడు, అరాక్షసమ్=రాక్షసులు లేని దానినిగా, కుర్యాత్=చేయును.

తా. నేనిక్కడ ఉన్నట్లు రామునకు తెలిసి ఉన్నట్లయితే ఆతడు కోపించి బాణములతో ఈ లోకములో రాక్షసులే లేకుండేటట్లు చేసి ఉండేవాడు. 22

మూ. విధమేచ్చ పురీం లఙ్కాం శోషయేచ్చ మహోదధిమ్,
రావణస్య చ నీచస్య కీర్తిం నామ చ నాశయేత్. 23

ప్ర. అ. లఙ్కాం పురీమ్=లంకాపట్టణమును, విధమేచ్చ=ఊదివేయును. మహోదధిమ్=మహాసముద్రమును, శోషయేచ్చ=ఎండింపచేయును. నీచస్య=నీచుడైన, రావణస్య=రావణునియొక్క, కీర్తిమ్=కీర్తినీ, నామ చ=పేరునూ, నాశయేత్=నశింపచేయును.

తా. రాముడు లంకాపట్టణమును ఊదివేయును. మహాసముద్రమును ఎండింపచేయును. నీచుడైన రావణునికీర్తిని, పేరునూ నశింపచేయును. 23

మూ. తతో నిహతనాథానాం రాక్షసీనాం గృహే గృహే,
యథాహమేవం రుదతీ తథా భూయో న సంశయః. 24

ప్ర. అ. తతః=అటు పిమ్మట, అహమ్=నేను, యథా=ఎట్లు, ఏవమ్=ఈ విధముగా, రుదతీ=ఏడ్చుచున్నానో, తథా=అట్లే, గృహే గృహే=ప్రతిగృహము నందూ, నిహతనాథానామ్=చంపబడిన భర్తలు గల, రాక్షసీనామ్=రాక్షసస్త్రీలయొక్క, (ఏడ్పు), భూయః=మాటి మాటికి (అధికముగా) (అగును). సంశయః=సంశయము, న=లేదు.

తా. ఇప్పుడు నే నెట్లు ఏడ్చుచున్నానో అట్లే ఈ లంకలోని ప్రతి ఇంటిలోను, భర్తలు మరణించిన రాక్షసస్త్రీల ఏడ్పు అధికముగా వినబడును. సందేహము లేదు.

వి. ఈ శ్లోకమునకు పదాలు అధ్యాహారము తెచ్చుకొని అర్థముచెప్పవలసి ఉన్నది. ప్రాచ్యపాఠము ఇట్లున్నది.

"తతో నిహతనాథానాం రాక్షసీనాం గృహే గృహే.
యథా మే రుదితైరేవం ప్రగీతేవ పురీ భవేత్."

"ఇప్పుడు నా ఏడ్పుచేత వలె, ప్రతిగృహమునందు భర్తలు మరణించిన స్త్రీల ఏడ్పులచేత, ఈ నగరము గోలపెట్టుచున్నట్లు అగును"ఇని దీని భావము. 24

మూ. అన్విష్య రక్షసాం లఙ్కాం కుర్యాద్రామః సలక్ష్మణః,
న హి తాభ్యాం రిపుర్దృష్టో ముహూర్తమపి జీవతి. 25

ప్ర. అ. సలక్ష్మణః=లక్ష్మణునితో కూడిన, రామః=రాముడు, రక్షసామ్=రాక్షసులయొక్క, లఙ్కామ్=లంకను, అన్విష్య=వెదకి, (శత్రునాశనమ్=శత్రునాశనమును), కుర్యాత్=చేయును, తాభ్యామ్=వారిద్దరిచేత, దృష్టః= చూడబడిన, రిపుః=శత్రువు, ముహూర్తమపి=క్షణకాలమైనా, న జీవతి హి=జీవించదు కదా.

తా. లక్ష్మణసమేతుడైన రాముడు రాక్షసుల పురమైన ఈ లంకను వెదకి, శత్రుసంహారము చేయగలడు. వారిద్దరి కంటబడిన శత్రువు క్షణకాలము కూడ జీవించజాలదు కదా !

వి. "అన్విష్యారాక్షసీం లఙ్కాం కుర్యాద్రామః సలక్ష్మణః"

అను ప్రాచ్యపాఠము బాగున్నది. దీనిలో కూడ 'అరాక్షసామ్' అని ఉండి యుండవలెను. "రాముడు లంకను రాక్షసులు లేనిదానిగా చేయును". అని దాని అర్థము. 25

మూ. చితాధూమాకులపథా గృధ్రమణ్డలసంకులా,
అచిరేణ తు లఙ్కేయం శ్మశానసదృశీ భవేత్. 26

ప్ర. అ. ఇయమ్=ఈ, లఙ్కా=లంక, అచిరేణ=కొద్దికాలములో, చితాధూమాకులపథా=చితల ధూమము చేత వ్యాకులమైన మార్గములు కలది గాను, గృధ్రమణ్డలసంకులా=గ్రద్దల మండలములతో వ్యాకులమైనది గాను, శ్మశానసదృశీ=శ్మశానముతో సమానమైనది, భవేత్=కాగలదు.

తా. కొద్ది దినములలో ఈ లంక శ్మశానము వలె అయిపోవును. దీని మార్గములన్నీ చితలనుండి బయలుదేరు ధూమముతో వ్యాకులము లై ఉండును. దీనిపై గ్రద్దలు మండలాకారముగా తిరుగుచుండును. 26

మూ. అచిరేణైవ కాలేన ప్రాప్స్యామ్యేవ మనోరథమ్,
దుష్ప్రస్థానోఽయమాఖ్యాతి సర్వేషాం వో విపర్యయమ్. 27

ప్ర. అ. అచిరేణ కాలేనైవ=దగ్గర కాలమునందే, మనోరథమ్=మనోరథమును, ప్రాప్స్యామ్యేవ=తప్పక పొందగలను. అయమ్=ఈ, దుష్ప్రస్థానః=చెడ్డ నడవడిక, సర్వేషామ్=సమస్తమైన, వః=మీయొక్క, విపర్యయమ్=కీడును, ఆఖ్యాతి=చెప్పుచున్నది.

తా. చాల దగ్గర కాలములోనే నా మనోరథము తప్పక తీరగలదు. మీరు నడిచే ఈ చెడు నడవడిక మీరందరూ నశించనున్నారని చెప్పుచున్నది. 27

మూ. యాదృశానీహ దృశ్యన్తే లఙ్కాయామశుభాని వై,
అచిరేణైవ కాలేన భవిష్యతి హతప్రభా. 28

ప్ర. అ. ఇహ=ఇక్కడ, లఙ్కాయామ్=లంకలో, యాదృశాని=ఎట్టి, అశుభాని=అశుభములు, దృశ్యన్తే=చూడబడుచున్నవో వాటిని పట్టి, అచిరేణైవ=చాల దగ్గరగా ఉన్న, కాలేన=కాలముచేత, హతప్రభా=కొట్టబడిన కాంతి గలది, భవిష్యతి=కాగలదు.

తా. ఈ లంకలో అశుభములైన శకునములు అనేకములు కనబడుచున్నవి. వాటిని బట్టి ఈ లంక కొద్ది దినములలోనే కాంతివిహీనము కాగలదు. 28

మూ. నూనం లఙ్కా హతే పాపే రావణే రాక్షసాధమే,
శోషం యాస్యతి దుర్ధర్షా ప్రమదా విధవా యథా. 29

ప్ర. అ. పాపే=పాపాత్ముడూ, రాక్షసాధమే=నీచరాక్షసుడూ అయిన, రావణే=రావణుడు, హతే=చంపబడినవాడగుచుండగా, దుర్ధర్షా=ఇంతవరకూ ఎదిరింప శక్యము కాకుండా ఉన్న, లఙ్కా=లంక, నూనమ్=తప్పక, విధవా=భర్త లేని, ప్రమదా యథా=స్త్రీ వలె, శోషమ్=ఎండిపోవుటను, యాస్యతి=పొందగలదు.

తా. పాపాత్ముడు, రాక్షసాధముడూ అయిన రావణుడు చంపబడును. అప్పుడు ఈ లంక భర్త మరణించిన స్త్రీ వలె ఎండిపోవును. తప్పదు. 29

మూ. పుణ్యోత్సవసముత్థా చ నష్టభర్త్రీ సరాక్షసీ,
భవిష్యతి పురీ లఙ్కా నష్టభర్త్రీ యథాఙ్గనా. 30

ప్ర. అ. నష్టభర్త్రీ=నశించిన ప్రభువుగల, లఙ్కాపురీ=లంకాపట్టణము, సరాక్షసీ=రాక్షసస్త్రీలతో మాత్రమే కూడినదై, నష్టభర్త్రీ=మరణించిన భర్త గల, అఙ్గనా యథా=స్త్రీ వలె, పుణ్యోత్సవసముత్థా చ= పుణ్యోత్సవములనుండి లేచినది, (దూరమైనది), భవిష్యతి=కాగలదు.

తా. ప్రభువైన రావణుడు, రాక్షసులూ మరణించుటతో ఈ లంకలో రాక్షసస్త్రీలు మాత్రమే మిగులుదురు. అప్పుడీ లంక భర్త మరణించిన స్త్రీ వలె, పుణ్యోత్సవములకు దూరము కాగలదు. 30

మూ. నూనం రాక్షసకన్యానాం రుదన్తీనాం గృహే గృహే,
శ్రోష్యామి నచిరాదేవ దుఃఖార్తానామిహ ధ్వనిమ్. 31

ప్ర. అ. నచిరాదేవ=కొద్దికాలములోనే, ఇహ=ఇక్కడ, గృహే గృహే=ప్రతి ఇంటిలోను, దుఃఖార్తానామ్=దుఃఖముచేత పీడింపబడిన, రుదన్తీనామ్=ఏడ్చుచున్న, రాక్షసకన్యానామ్=రాక్షసకన్యలయొక్క, ధ్వనిమ్=ధ్వనిని, నూనమ్=తప్పక, శ్రోష్యామి=వినగలను.

తా. ఈ నగరములో ప్రతి ఇంటియందు, రాక్షసకన్యలు దుఃఖార్తలై ఏడ్చుచుండగా, ఆ ధ్వనిని అచిరకాలములోనే, తప్పక వినగలను. 31

మూ. సాన్ధకారా హతద్యోతా హతరాక్షసపుఙ్గవా,
భవిష్యతి పురీ లఙ్కా నిర్దగ్ధా రామసాయకైః. 32

ప్ర. అ. లఙ్కాపురీ=లంకాపట్టణము, రామసాయకైః=రాముని బాణముల చేత, నిర్దగ్ధా=కాల్చివేయబడినదై, సాన్ధకారా=అంధకారముతో కూడినది, హతద్యోతా=

నశింపచేయబడిన కాంతి గలది, హతరాక్షసపుఙ్గవా=చంపబడిన రాక్షసశ్రేష్ఠులు కలది, భవిష్యతి=కాగలదు.

తా. రాముడు బాణములతో ఈ లంకను కాల్చివేయును, దీనిలోని రాక్షసవీరులందరూ మరణింతురు. అపుడిది కాంతివిహీనమై అంధకారబంధుర మై పోవును. 32

మూ. యది నామ స శూరో మాం రామో రక్తాన్తలోచనః,
జానీయాద్వర్తమానాం హి రావణస్య నివేశనే. 33

ప్ర. అ. శూరః=శూరుడు, రక్తాన్తలోచనః=ఎఱ్ఱనైన నేత్రాంతములు కలవాడూ అయిన, సః రామః=ఆ రాముడు, మామ్=నన్ను, రావణస్య=రావణు నియొక్క, నివేశనే=గృహమునందు, వర్తమానామ్=ఉన్నదానినిగా, యది నామ జానీయాత్=తెలుసుకొనునా !

తా. శూరుడూ, ఎఱ్ఱని నేత్రాంతములు కలవాడూ అయిన రాముడు నేనిక్కడ రావణుని గృహములో ఉన్నట్లు తెలిసికొనగల్గునా ! 33

మూ. అనేన తు నృశంసేన రావణేనాధమేన మే,
సమయో యస్తు నిర్దిష్టస్తస్య కాలోఽయమాగతః. 34
స చ మే విహితో మృత్యురస్మిన్ దుష్టే న వర్తతే.

ప్ర. అ. నృశంసేన=క్రూరుడు, అధమేన=అధముడు అయిన, అనేన=ఈ, రావణేన=రావణునిచేత, యః=ఏ, సమయః=సమయము, మే=నాకు, నిర్దిష్టః= చెప్పబడినదో, తస్య=దానికి, అయమ్=ఈ, కాలః=కాలము, ఆగతః=వచ్చినది. మే=నాకు, విహితః=విధింపబడిన, సః=ఆ, మృత్యుః=మృత్యువు, అస్మిన్=ఈ, దుష్టే=దుష్టుని విషయమున, న వర్తతే=ప్రవర్తించుట లేదు.

తా. క్రూరుడు, నీచుడు అయిన ఈ రావణుడు నా కిచ్చిన గడువు పూర్తి కావచ్చుచున్నది. నాకు విధించిన ఈ మృత్యువు ఈ దుర్మార్గునికి ఎందువలన వచ్చుట లేదో !

వి. "స చ మే" ఇత్యాది శ్లోకార్థము వావిళ్లప్రతిలో లేదు. గోరఖ్‌పూర్ ప్రతిలోను ఇతరప్రతులలోను ఉన్నది. ప్రాచ్యప్రతిలో ఈ ఘట్టంలోని శ్లోకాలలో చాలావరకు లేవు. 34

మూ. అకార్యం యే న జానన్తి నైరృతాః పాపకారిణః, 35
అధర్మాత్తు మహోత్పాతో భవిష్యతి హి సాంప్రతమ్,
నైతే ధర్మం విజానన్తి రాక్షసాః పిశితాశనాః. 36

ప్ర. అ. పాపకారిణః=పాపము చేయు, యే=ఏ, నైరృతాః=రాక్షసులు, అకార్యమ్=అకార్యమును, న జానన్తి=ఎరుగరో, అధర్మాత్తు=వారియొక్క అధర్మమువలన ఐతే, సాంప్రతమ్=ఇప్పుడు, మహోత్పాతః=గొప్ప ఉపద్రవము, భవిష్యతి=కాగలదు, పిశితాశనాః=పచ్చి మాంసము తిను, ఏతే=ఈ, రాక్షసాః=రాక్షసులు, ధర్మమ్=ధర్మమును, న జానన్తి=ఎరుగరు.

తా. పాపములను చేయు ఈ రాక్షసులకు ఏది చేయగూడని పనియో తెలియదు. వీళ్లు చేసే అధర్మమువలన, ఇపుడు మహోపద్రవము జరుగనున్నది. పచ్చి మాంసము తినే ఈ రాక్షసులకు ధర్మమేదో తెలియదు. 35, 36

మూ. ధ్రువం మాం ప్రాతరాశార్థే రాక్షసః కల్పయిష్యతి,
సాహం కథం కరిష్యామి తం వినా ప్రియదర్శనమ్. 37
రామం రక్తాన్తనయనమపశ్యన్తీ సుదుఃఖితా.

ప్ర. అ. రాక్షసః=రావణుడు, ధ్రువమ్=తప్పక, మామ్=నన్ను, ప్రాతరాశార్థే=ప్రాతఃకాలపు భోజనము కొరకు, కల్పయిష్యతి=చేసికొనగలడు. సా=అట్టి, అహమ్=నేను, ప్రియదర్శనమ్=ప్రియమైన దర్శనముగల, తం వినా=ఆ రాముడు లేకుండా, కథమ్=ఎట్లు, కరిష్యామి=చేయుదును? రక్తాన్తనయనమ్=ఎఱ్ఱని నేత్రాంతములు గల, రామమ్=రాముని, అపశ్యన్తీ=చూడని దాననై, సుదుఃఖితా=చాలా దుఃఖించుచున్నాను.

తా. ఆ రాక్షసుడు నన్ను తప్పకుండగా ప్రాతఃకాలపు భోజనముకొరకు వండించివేయును. చూచువారికి ఆనందము కలిగించు రాముడు దగ్గర లేని నేను ఏమి చేయగలను? ఎఱ్ఱని నేత్రాంతములు గల ఆ రాముని చూడజాలక పోవుటచే నేను చాలా దుఃఖములో ఉన్నాను. 37

మూ. యది కశ్చిత్ ప్రదాతా మే విషస్యాద్య భవేదిహ, 38
క్షిప్రం వైవస్వతం దేవం పశ్యేయం పతినా వినా.

ప్ర. అ. అద్య=ఇప్పుడు, మే=నాకు, విషస్య=విషము యొక్క (మును) ప్రదాతా=ఇచ్చేవాడు, కశ్చిత్=ఎవడైనా, ఇహ=ఇక్కడ, భవేద్యది=ఉన్నట్లయితే, పతినా వినా=భర్త కూడా లేని నేను, క్షిప్రమ్=శీఘ్రముగా, దేవమ్=దేవుడైన, వైవస్వతమ్=యముని, పశ్యేయమ్=చూచెడిదానను.

తా. నాకిక్కడ ఎవరైనా విషము ఇచ్చేవారు ఉన్నట్లయితే భర్త దగ్గరలేని నేను, వెంటనే యమధర్మరాజు సన్నిధికి వెళ్ళి యుండెడిదానను. 38

మూ. నాజానాజ్జీవతీం రామః స మాం లక్ష్మణపూర్వజః, 39
జానన్తౌ తౌ న కుర్యాతాం నోర్వ్యాం హి మమ మార్గణమ్.

ప్ర. అ. లక్ష్మణపూర్వజః=లక్ష్మణుని అన్నగారైన, సః రామః=ఆ రాముడు, మామ్=నన్ను, జీవతీమ్=జీవించి ఉన్నదానినిగా, నాజానాత్=ఎరిగి యుండలేదు. తౌ=వారిద్దరూ, జానన్తౌ=ఎరిగియున్నవారై, మమ=నాయొక్క, మార్గణమ్=అన్వేషణమును, ఉర్వ్యామ్=భూమియందు, న కుర్యాతామ్ ఇతి న=చేయరను మాట ఉండదు.

తా. లక్ష్మణుని అన్నగారైన రామునకు నేను ఇంకా జీవించే ఉన్నట్లు తెలిసి ఉండదు. అట్లు తెలిసి ఉన్నచో వారిద్దరూ ఈ భూమిపై నా కొరకు వెదకకుండా ఉండరుకదా ! 39

మూ. నూనం మమైవ శోకేన స వీరో లక్ష్మణాగ్రజః. 40
దేవలోకమితో యాతస్త్యక్త్వా దేహం మహీతలే.

ప్ర. అ. వీరః=వీరుడు, లక్ష్మణాగ్రజః=లక్ష్మణుని అన్నగారు అయిన, సః=ఆ రాముడు, మమ=నా యొక్క, శోకేనైవ=శోకముచేతనే, మహీతలే=భూలోకమునందు, దేహమ్=దేహమును, త్యక్త్వా=విడచి, ఇతః=ఇక్కడినుండి, దేవలోకమ్=దేవలోకమును గూర్చి, యాతః=వెళ్ళిపోయినాడు. నూనమ్=నిశ్చయము.

తా. వీరుడైన ఆ రాముడు నా శోకముతోనే క్రుంగిపోయి భూలోకములో దేహమును చాలించి స్వర్గమునకు వెళ్ళిపోయి ఉండును నిశ్చయము ! 40

మూ. ధన్యా దేవాః సగన్ధర్వాః సిద్ధాశ్చ పరమర్షయః, 41
మమ పశ్యన్తి యే నాథం రామం రాజీవలోచనమ్.

ప్ర. అ. మమ=నాయొక్క, నాథమ్=నాథుడు, రాజీవలోచనమ్=పద్మముల వంటి నేత్రములు కలవాడు అయిన, రామమ్=రాముని, యే=ఎవరు, పశ్యన్తి=చూచుచున్నారో అట్టి, దేవాః=దేవతలు, సగన్ధర్వాః=గంధర్వులతో కూడిన, సిద్ధాశ్చ=సిద్ధులూ, పరమర్షయః=మహర్షులూ, ధన్యాః=ధన్యులు కదా.

తా. నా నాథుడు, రాజీవలోచనుడూ, అయిన రాముని స్వర్గములో చూడగల్గుచున్న దేవతలు, గంధర్వులు, సిద్ధులు, మహర్షులు, ధన్యాత్ములు కదా ! 41

మూ. అథవా న హి తస్యార్థో ధర్మకామస్య ధీమతః, 42
మయా రామస్య రాజర్షేర్భార్యయా పరమాత్మనః.

ప్ర. అ. అథవా=లేదా, ధర్మకామస్య=ధర్మమునందు కోరికగలవాడు, ధీమతః=బుద్ధిమంతుడు, రాజర్షేః=రాజు ఋషి కూడ అయినవాడు, పరమాత్మనః=ఉత్తమమైన మనస్సు కలవాడు అయిన, తస్య=ఆ, రామస్య=రామునకు, భార్యయా=భార్యనైన, మయా=నాచేత, అర్థః=ప్రయోజనము, న హి=లేదు కదా.

తా. లేదా రాముడు జీవించియే ఉండవచ్చును. బుద్ధిమంతుడు, ధర్మనిష్ఠగలవాడు, ఉత్తమమైన మనస్సు కలవాడు రాజర్షి అయిన ఆ రామునకు భార్యనైన నా వలన ప్రయోజనము ఏమి ఉండును (అనగా ధర్మదృష్టి కలవాడగుటచే వైరాగ్యము చెంది నన్ను మరచినాడేమో అని భావము). 42

మూ. దృశ్యమానే భవేత్ప్రీతిః సౌహృదం నాస్త్యపశ్యతః, 43
నాశయన్తి కృతఘ్నాస్తు న రామో నాశయిష్యతి.

ప్ర. అ. దృశ్యమానే=చూడబడుచున్నవానియందు, ప్రీతిః=స్నేహము భవేత్=అగును. అపశ్యతః=చూడనివానికి, సౌహృదమ్=ప్రేమ, నాస్తి=లేదు. కృతఘ్నాః=కృతఘ్నులు, నాశయన్తి=స్నేహమును నశింపచేయుదురు. రామస్తు=రాముడైతే, న నాశయిష్యతి=నశింపచేయడు.

తా. ఎవరైన వ్యక్తి ఎదురుగా కనబడుచున్నంతవరకు ఆ వ్యక్తి మీద ప్రేమ ఉండును. కనబడనప్పుడు ప్రేమ ఉండదు. కాని ఇది కృతఘ్నులైన ఇతరులవిషయములో యథార్థము కావచ్చును. రాముడు ఆ విధముగా ప్రేమను మరచిపోవువాడు కాదు. 43

మూ. కిం ను మే న గుణాః కేచిత్కిం వా భాగ్యక్షయో మమ, 44
యాహం సీదామి రామేణ హీనా ముఖ్యేన భామినీ.

ప్ర. అ. భామినీ=స్త్రీ నైన, యా=ఏ, అహమ్=నేను, ముఖ్యేన=ముఖ్యుడైన, రామేణ వినా=రాముడు లేకుండా, సీదామి=క్షీణించుచున్నానో, మే=అట్టినాకు, కేచిత్=ఏవీ, గుణాః=సద్గుణములు, న కిం ను=లేవా !, కిం వా=లేక, మమ=నా యొక్క, భాగ్యక్షయః=భాగ్యముయొక్క క్షయము జరిగినదా ?

తా. స్త్రీ నైన నేను, సర్వలోకముఖ్యుడైన రాముడు లేకుండా ఈ విధంగా నశించిపోవుచున్నాను ; నాలో ఏమీ సద్గుణాలు లేవా? లేక నా భాగ్యము క్షీణించిపోయినదా?దీనికి కారణమేమి? 44

మూ. శ్రేయో హి జీవితాన్మర్తుం విహీనాయా మహాత్మనః. 45
రామాదక్లిష్టచారిత్రాచ్ఛూరాచ్ఛత్రునిబర్హణాత్.

ప్ర. అ. అక్లిష్టచారిత్రాత్=క్లేశము లేని చరిత్ర కలవాడు, శూరాత్=శూరుడు, శత్రునిబర్హణాత్=శత్రుసంహారకుడూ, మహాత్మనః=మహాత్ముడూ అయిన, రామాత్=రామునినుండి, విహీనాయాః=హీనురాలనైన, మే=నాకు, జీవితాత్=జీవితముకంటె, మర్తుమ్=మరణించుటకొరకు, శ్రేయః=శ్రేయస్కరము.

తా. మహాత్ముడు, క్లేశము (వ్యర్థప్రయాస) లేని చరిత్ర కలవాడు, శూరుడు, శత్రువినాశకుడు, అయిన రాముడు లేని నేను జీవించుటకంటె, మరణించుటయే మేలు. 45

మూ. అథవా న్యస్తశస్త్రౌ తౌ వనే మూలఫలాశినౌ, 46
భ్రాతరౌ హి నరశ్రేష్ఠౌ సంవృత్తౌ వనగోచరౌ.

ప్ర. అ. అథవా=లేదా, నరశ్రేష్ఠౌ=నరులలో శ్రేష్ఠులైన, తౌ=ఆ, భ్రాతరౌ=సోదరులు, న్యస్తశస్త్రౌ=పరిత్యజింపబడిన ఆయుధములు కలవారై, వనే=వనమునందు, మూలఫలాశనౌ=దుంపలు ఫలములు ఆహారముగా కలవారై, వనగోచరౌ=వననివాసులుగా, సంవృత్తౌ=అయిపోయి ఉందురు.

తా. లేదా, నరశ్రేష్ఠులైన ఆ సోదరులిద్దరూ, శస్త్రపరిత్యాగము చేసి వనములో దుంపలు పండ్లు తినుచు వననివాసులు అయిపోయి ఉందురు. 46

మూ. అథవా రాక్షసేన్ద్రేణ రావణేన దురాత్మనా, 47
ఛద్మనా ఘాతితౌ శూరౌ భ్రాతరౌ రామలక్ష్మణౌ.

ప్ర. అ. అథవా=లేదా, శూరౌ=శూరులైన, భ్రాతరౌ=సోదరులైన, రామలక్ష్మణౌ=రామలక్ష్మణులు, దురాత్మనా=దుష్టబుద్ధి గల, రాక్షసేన్ద్రేణ=రాక్షసరాజైన, రావణేన=రావణునిచేత, ఛద్మనా=వంచనచేత, ఘాతితౌ=చంపబడియుందురు.

తా. లేదా- శూరులైన సోదరులు, ఆ రామలక్ష్మణులను, దురాత్ముడైన రాక్షసరాజు రావణుడు కపటోపాయముచేత చంపించి ఉండును. 47

మూ. సాహమేవంగతే కాలే మర్తుమిచ్ఛామి సర్వథా, 48
న చ మే విహితో మృత్యురస్మిన్ దుఃఖేఽపి వర్తతే.

ప్ర. అ. ఏవంగతే=ఈ విధముగా ఏర్పడిన, కాలే=కాలమునందు, సా=అట్టి, అహమ్=నేను, సర్వథా=అన్ని విధములా, మర్తుమ్=మరణించుటకు, ఇచ్ఛామి=కోరుచున్నాను. అస్మిన్=ఈ, దుఃఖేఽపి=దుఃఖమునందు కూడ, మే=నాకు, మృత్యుః=మృత్యువు, విహితః=విధించబడి, న వర్తతే=లేదు.

తా. ఈ విధముగా ఏర్పడిన ఈ సమయమునందు నేను మరణించవలెనని పూర్తిగా కోరుచున్నాను. కానీ ఇట్టి దుఃఖసమయములో కూడ నాకు మృత్యువు రాకున్నది. 48

మూ. ధన్యాః ఖలు మహాత్మానో మునయస్త్యక్తకిల్బిషాః, 49
జితాత్మానో మహాభాగా యేషాం న స్తః ప్రియాప్రియే.

ప్ర. అ. మహాత్మానః=గొప్ప బుద్ధికలవారు, త్యక్తకిల్బిషాః=విడువబడిన పాపము కలవారు, జితాత్మానః=జయించబడిన మనస్సు కలవారు, మహాభాగాః=మహాభాగ్యవంతులు, (గొప్ప ప్రభావము కలవారు), అయిన, మునయః=మునులు, ధన్యాః ఖలు=ధన్యులు కదా. యేషామ్=ఎవరికి, ప్రియాప్రియే=ప్రియముకాని, అప్రియముకాని, న స్తః=ఉండవో !

తా. మహాత్ములు, పాపములను పరిత్యజించినవారు, మనస్సును జయించినవారు, మహాప్రభావవంతులు అయిన మునులు ధన్యాత్ములు కదా ! వారికి ప్రియము గాని అప్రియము గాని ఉండదు. 49

మూ. ప్రియాన్న సంభవేద్దుఃఖమప్రియాదధికం భయమ్. 50
తాభ్యాం హి యే వియుజ్యన్తే నమస్తేషాం మహాత్మనామ్.

ప్ర. అ. ప్రియాత్=ప్రియమువలన, దుఃఖమ్=దుఃఖముకాని, అప్రియాత్=అప్రియమువలన, అధికమ్=అధికమైన, భయమ్=భయముగాని, న సంభవేత్=కలుగదు. యే=ఎవరు, తాభ్యామ్=ప్రియాప్రియములనుండి, వియుజ్యన్తే=వియుక్తులగుదురో, తేషామ్=అట్టి, మహాత్మనామ్=మహాత్ములకు, నమః=నమస్కారము.

తా. ఆ మహాత్ములకు ప్రియమైనదానినుండి అది దొరకలేదే అను దుఃఖము గాని, అప్రియము నుండి అధికమైన భయము గాని ఉండదు. ఈ విధముగా ప్రియాప్రియములకు దూరముగా నుండువారికి నమస్కారము.

వి. "ప్రియాన్న సంభవేద్దుఃఖమప్రియాదధికం భవేత్" అని గోరఖ్‌పూర్ ప్రతిలో పాఠము, "ప్రియవస్తువు దుఃఖమును కలిగించదు. ఆనందమునే కలిగించును. అప్రియవస్తువు అధికదుఃఖమును కలిగించును. ఆ రెండూ లేని వారికి నమస్కారము" అని దాని భావము చెప్పవచ్చును. 50

మూ. సాహం త్యక్తా ప్రియేణైవ రామేణ విదితాత్మనా, 51
ప్రాణాంస్త్యక్ష్యామి పాపస్య రావణస్య గతా వశమ్.

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే సున్దరకాణ్డే
షడ్వింశః సర్గః

ప్ర. అ. ప్రియేణైవ=ప్రియుడైన, విదితాత్మనా=ప్రసిద్ధమైన బుద్ధి గల, రామేణ=రామునిచేత, త్యక్తా=విడువబడినదానను, పాపస్య=పాపాత్ముడైన, రావణస్య=రావణునియొక్క, వశమ్=వశమును, గతా=పొందిన దానను అయిన, సా అహమ్=అట్టి నేను, ప్రాణాన్=ప్రాణములను, త్యక్ష్యామి=విడచెదను.

తా. ప్రసిద్ధమైన బుద్ధి గలవాడూ, ప్రియుడూ అయిన రామునకు దూరమై, పాపాత్ముడైన రావణుని వశములో ఉన్న నేను ప్రాణత్యాగము చేసెదను.
51

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు
సుందరకాండలో ఇరువదిఆరవ సర్గ సమాప్తము.

అథ సప్తవింశః సర్గః

[త్రిజటాస్వప్నము. రామునకు విజయము, రాక్షసులకు వినాశము వచ్చునని ఆ స్వప్నమునందు సూచన లభించుట.]

మూ. ఇత్యుక్తాః సీతయా ఘోరం రాక్షస్యః క్రోధమూర్ఛితాః,
కాశ్చిజ్జగ్ముస్తదాఖ్యాతుం రావణస్య దురాత్మనః. 1

ప్ర. అ. సీతయా=సీతచేత, ఇతి=ఇట్లు, ఉక్తాః=పలుకబడిన, రాక్షస్యః=రాక్షసస్త్రీలు, ఘోరమ్=తీవ్రముగా, క్రోధమూర్ఛితాః=క్రోధము చేత వ్యాపింపబడినవారు అయిరి. కాశ్చిత్=కొందరు, తత్=దానిని, దురాత్మనః=దురాత్ముడైన, రావణస్య=రావణునకు, ఆఖ్యాతుమ్=చెప్పుటకు, జగ్ముః=వెళ్ళిరి.

తా. సీత మాటలు విని రాక్షసస్త్రీలు చాలా కోపావేశము చెందిరి. వారిలో కొందరు, సీత మాటలను గూర్చి దురాత్ముడైన రావణునకు చెప్పుటకై వెళ్ళిరి. 1

మూ. తతః సీతాముపాగమ్య రాక్షస్యో ఘోరదర్శనాః,
పునః పరుషమేకార్థమనర్థార్థమథాబ్రువన్. 2

ప్ర. అ. తతః=అటుపిమ్మట, ఘోరదర్శనాః=భయంకరమైన దర్శనము గల, రాక్షస్యః=రాక్షసస్త్రీలు, సీతామ్=సీతను, ఉపాగమ్య=చేరి, అథ=అనంతరము, పునః=మరల, అనర్థార్థమ్=అనర్థకరమైన ప్రయోజనము కలదీ, ఏకార్థమ్=ఒకే అర్థముగల, పరుషమ్=పరుషవాక్యమును, అబ్రువన్=పలికిరి.

తా. చూచుటకు భయంకరముగా ఉండు ఆ రాక్షసస్త్రీలు సీతను సమీపించి మరల పూర్వము చెప్పిన విషయమునే చెప్పుచు, అనర్థకరమైన పరుష వాక్యములు పలికిరి. 2

మూ. అద్యేదానీం తవానార్యే సీతే పాపవినిశ్చయే,
రాక్షస్యో భక్షయిష్యన్తి మాంసమేతద్యథాసుఖమ్. 3

ప్ర. అ. అనార్యే=అనార్యురాలా ! పాపవినిశ్చయే=పాపనిశ్చయము గలదానా ! సీతే=సీతా ! అద్య=నేడు, ఇదానీమ్=ఇప్పుడే, తవ=నీ యొక్క,

ఏతత్=ఈ, మాంసమ్=మాంసమును, రాక్షస్యః=రాక్షసస్త్రీలు, యథాసుఖమ్=సుఖము కలుగునట్లుగా, భక్షయిష్యన్తి=భక్షించగలరు.

తా. అనార్యురాలవు, పాపనిశ్చయము గలదానవూ అయిన ఓ సీతా ! రాక్షసస్త్రీలు, ఈనాడు, ఇప్పుడే నీ మాంసమును సుఖముగా భక్షించెదరు. 3

మూ. సీతాం తాభిరనార్యాభిర్దృష్ట్వా సంతర్జితాం తదా,
రాక్షసీ త్రిజటా వృద్ధా శయానా వాక్యమబ్రవీత్. 4

ప్ర. అ. తదా=అప్పుడు, అనార్యాభిః=చెడ్డవారైన, తాభిః=ఆ రాక్షస స్త్రీల చేత, సంతర్జితామ్=భయపెట్టబడిన, సీతామ్=సీతను, దృష్ట్వా=చూచి, శయానా=అంతవరకూ నిద్రించి ఉన్న, వృద్ధా=వృద్ధురాలైన, త్రిజటా=త్రిజట అను, రాక్షసీ=రాక్షసి, వాక్యమ్=వాక్యమును, అబ్రవీత్=పలికెను.

తా. అప్పుడు, చెడ్డవారైన ఆ రాక్షసస్త్రీలు సీతను ఆ విధముగా భయపెట్టుచుండగా చూచి, అంతవరకూ నిద్రించిన త్రిజట అనే ఒక వృద్ధరాక్షసి ఇట్లు పలికెను. 4

మూ. ఆత్మానం ఖాదతానార్యా న సీతాం భక్షయిష్యథ,
జనకస్య సుతామిష్టాం స్నుషాం దశరథస్య చ. 5

ప్ర. అ. అనార్యాః=ఓ ! దుష్టస్త్రీలారా ! ఆత్మానమ్=తమనుతామే, ఖాదత=తినండి. జనకస్య=జనకునియొక్క, ఇష్టామ్=ఇష్టురాలైన, సుతామ్=పుత్రికా, దశరథస్య=దశరథునియొక్క, స్నుషాం చ=కోడలూ అయిన, సీతామ్=సీతను, న భక్షయిష్యథ=మీరు భక్షింపరు.

తా. ఓ ! దుష్టులారా ! మీరు భక్షించవలసినది జనకుని ప్రియపుత్రికా, దశరథుని కోడలూ ఐన సీతను కాదు, మిమ్ములను మీరు భక్షించుడు. 5

మూ. స్వప్నో హ్యద్య మయా దృష్టో దారుణో రోమహర్షణః,
రాక్షసానామభావాయ భర్తురస్యా భవాయ చ. 6

ప్ర. అ. అద్య=ఇప్పుడు, దారుణః=భయంకర మైనదీ, రోమహర్షణః= రోమాంచము కలిగించునదీ అయిన, స్వప్నః=స్వప్నము, రాక్షసానామ్=రాక్షసుల యొక్క, అభావాయ=వినాశముకొరకూ, అస్యాః=ఈమెయొక్క, భర్తుః=భర్తయొక్క, భవాయ=అభ్యుదయము కొరకూ, మయా=నా చేత, దృష్టః=చూడబడినది.

తా. ఇప్పుడే నా కొక భయంకరము, రోమాంచము పుట్టించునదీ అయిన స్వప్నము వచ్చినది. అది రాక్షసుల వినాశమును, ఈమె భర్త అభ్యుదయమును సూచించుచున్నది. 6

మూ. ఏవముక్తాస్త్రిజటయా రాక్షస్యః క్రోధమూర్ఛితాః,
సర్వా ఏవాబ్రువన్భీతాస్త్రిజటాం తామిదం వచః. 7

ప్ర. అ. త్రిజటయా=త్రిజటచేత, ఏవమ్=ఇట్లు, ఉక్తాః=పలకబడిన, క్రోధమూర్ఛితాః=కోపముచే వ్యాపింపబడిన, రాక్షస్యః=రాక్షసస్త్రీలు, సర్వాః ఏవ=అందరూ, భీతాః=భయపడినవారై, తామ్=ఆ, త్రిజటామ్=త్రిజటను గూర్చి, ఇదమ్=ఈ, వచః=వచనమును, అబ్రువన్=పలికిరి.

తా. క్రోధముతో నిండి ఉన్న ఆ రాక్షసస్త్రీలందరూ త్రిజట మాటలు విని, భయపడుచు ఆమెతో ఇట్లనిరి. 7

మూ. కథయస్వ త్వయా దృష్టః స్వప్నోఽయం కీదృశో నిశి,
తాసాం శ్రుత్వా తు వచనం రాక్షసీనాం ముఖాచ్చ్యుతమ్, 8
ఉవాచ వచనం కాలే త్రిజటా స్వప్నసంశ్రితమ్.

ప్ర. అ. నిశి=రాత్రియందు, త్వయా=నీచేత, దృష్టః=చూడబడిన, అయమ్=ఈ, స్వప్నః=స్వప్నము, కీదృశః=ఎట్టిది? కథయస్వ=చెప్పుము. తాసామ్=ఆ, రాక్షసీనామ్=రాక్షసస్త్రీలయొక్క, ముఖాత్=ముఖమునుండి, చ్యుతమ్=వచ్చిన, వచనమ్=వచనమును, శ్రుత్వా=విని, త్రిజటా=త్రిజట, కాలే=ఆ సమయమునందు, స్వప్నసంశ్రితమ్=స్వప్నమునకు సంబంధించిన, వచనమ్=వచనమును, ఉవాచ=పలికెను.

తా. "నీవు రాత్రి ఎట్టి స్వప్నమును చూచితివో చెప్పుము". త్రిజట రాక్షస స్త్రీల మాట విని తనకు ఆ సమయమునందు (ఉషఃకాలమునందు) వచ్చిన స్వప్నమును గూర్చి చెప్పెను. 8

మూ. గజదన్తమయీం దివ్యాం శిబికామన్తరిక్షగామ్, 9
యుక్తాం హంసహస్రేణ స్వయమాస్థాయ రాఘవః,
శుక్లమాల్యామ్బరధరో లక్ష్మణేన సహాగతః. 10

ప్ర. అ. రాఘవః=రాముడు, శుక్లమాల్యామ్బరధరః=తెల్లని మాలలను, వస్త్రములను ధరించినవాడై, గజదన్తమయీమ్=ఏనుగు దంతములతో నిర్మింపబడిన, అన్తరిక్షగామ్=ఆకాశమునందు సంచరించు, హంసహస్రేణ=వేయి

హంసల చేత, యుక్తామ్=కట్టబడిన, శిబికామ్=పల్లకీని, స్వయమ్=స్వయముగా, ఆస్థాయ=అధిష్ఠించి, లక్ష్మణేన సహ=లక్ష్మణునితో కూడ, ఆగతః=వచ్చినాడు.

తా. లక్ష్మణసహితుడైన రాముని, తెల్లని మాలలు, వస్త్రములు, ధరించి, వెయ్యి హంసలు మోయుగా ఆకాశమునందు సంచరించుచున్న, ఏనుగు దంతములతో నిర్మించిన పల్లకిని ఎక్కి వచ్చినాడు. 9,10

మూ. స్వప్నే చాద్య మయా దృష్టా సీతా శుక్లామ్బరావృతా,
సాగరేణ పరిక్షిప్తం శ్వేతం పర్వతమాస్థితా. 11

ప్ర. అ. సీతా చ=సీత కూడ, శుక్లామ్బరావృతా=తెల్లని వస్త్రముల చేత ఆచ్ఛాదింపబడినదై, సాగరేణ=సముద్రముచేత, పరిక్షిప్తమ్=చుట్టబడిన, శ్వేతమ్=తెల్లని, పర్వతమ్=పర్వతమును, ఆస్థితా=అధిష్ఠించి ఉన్నదిగా, మయా=నాచేత, అద్య=ఇప్పుడు, స్వప్నే=స్వప్నమునందు, దృష్టా=చూడబడినది.

తా. సీత కూడ తెల్లని వస్త్రములు ధరించి, చుట్టూ సముద్రమున్న తెల్లని పర్వతము మీద ఉన్నట్లుగా నాకిప్పుడు స్వప్నములో కనబడినది. 11

మూ. రామేణ సంగతా సీతా భాస్కరేణ ప్రభా యథా,
రాఘవశ్చ మయా దృష్టశ్చతుర్దంష్ట్రం మహాగజమ్, 12
ఆరూఢః శైలసంకాశం చచార సహలక్ష్మణః.

ప్ర. అ. సీతా=సీత, రామేణ=రామునితో, ప్రభా=కాంతి, భాస్కరేణ యథా=సూర్యునితోవలె, సంగతా=కలిసినది, రామశ్చ=రాముడు కూడ, చతుర్దంష్ట్రమ్=నాలుగు దంతములు గల, శైలసంకాశమ్=పర్వతముతో సమానమైన, మహాగజమ్=గొప్ప గజమును, ఆరూఢః=ఎక్కినవాడుగా, మయా=నాచేత, దృష్టః=చూడబడినాడు. సహలక్ష్మణః=లక్ష్మణునితో కూడిన వాడై, చచార=సంచరించెను.

తా. కాంతి సూర్యునితో కలిసినట్లు, సీత రామునితో కలిసెను. మరల రాముడు నాలుగు దంతాలు ఉన్న, పర్వతము వంటి మహాగజము నెక్కి, లక్ష్మణునితో కూడి సంచరించుచున్నట్లు నాకు కనబడెను. 12

మూ. తతస్తౌ నరశార్దూలౌ దీప్యమానౌ స్వతేజసా, 13
శుక్లమాల్యామ్బరధరౌ జానకీం పర్యుపస్థితౌ.

ప్ర. అ. తతః=అటుపిమ్మట, స్వతేజసా=తమ తేజస్సుతో, దీప్యమానౌ=ప్రకాశించుచున్న, శుక్లమాల్యామ్బరధరౌ=తెల్లని మాలలను వస్త్రములను

ధరించిన, తౌ=ఆ, నరశార్దూలౌ=నరశ్రేష్ఠులైన రామలక్ష్మణులు, జానకీమ్=జానకిని, పర్యుపస్థితౌ=సమీపించిరి.

తా. పిమ్మట ఆ నరశ్రేష్ఠులైన రామలక్ష్మణులు తమ కాంతితో ప్రకాశించుచు, తెల్లని మాలలను వస్త్రములను ధరించి జానకి దగ్గరకు వచ్చినట్లుగా నాకు కనబడిరి. 13

మూ. తతస్తస్య నగస్యాగ్రే హ్యాకాశస్థస్య దన్తినః, 14
భర్త్రా పరిగృహీతస్య జానకీ స్కన్ధమాశ్రితా.

ప్ర. అ. తతః=అటుపిమ్మట, జానకీ=సీత, తస్య=ఆ, నగస్య=పర్వతము యొక్క, అగ్రే=అగ్రమునందు, భర్త్రా=భర్తయైన రామునిచేత, పరిగృహీతస్య=నిలుపబడిన, ఆకాశస్థస్య=ఆకాశమునందున్న, దన్తినః=ఏనుగయొక్క, స్కన్ధమ్=మూపును, ఆశ్రితా=ఆశ్రయించినది.

తా. పిమ్మట జానకి ఆ పర్వతాగ్రమునందు, ఆకాశమునందున్న ఆ గజమును రాముడు నిలుపగా, దానిమూపుపైకి ఎక్కెను. 14

మూ. భర్తురఙ్కాత్సముత్పత్య తతః కమలలోచనా, 15
చన్ద్రసూర్యౌ మయా దృష్టా పాణినా పరిమార్జతీ.

ప్ర. అ. తతః=అటుపిమ్మట, కమలలోచనా=పద్మములవంటి నేత్రములు గల సీత, భర్తుః=భర్తయొక్క, అఙ్కాత్=అంకమునుండి, సముత్పత్య=పైకిలేచి, పాణినా=హస్తముతో, చన్ద్రసూర్యౌ=చంద్రసూర్యులను, పరిమార్జతీ=తుడుచుచున్నదిగా, మయా=నాచేత, దృష్టా=చూడబడినది.

తా. అటుపిమ్మట, కమలముల వంటి నేత్రములు గల సీత, భర్త అంకమునుండి పైకి లేచి, చేతితో చంద్రసూర్యులను తుడుచుచున్నట్లు నాకు కనబడినది. 15

మూ. తతస్తాభ్యాం కుమారాభ్యామాస్థితః స గజోత్తమః, 16
సీతయా చ విశాలాక్ష్యా లఙ్కాయా ఉపరిస్థితః.

ప్ర. అ. తతః=అటు పిమ్మట, తాభ్యామ్=ఆ, కుమారాభ్యామ్=రామలక్ష్మణులచేతను, విశాలాక్ష్యా=విశాలములైన నేత్రములు గల, సీతయా చ=సీతచేతను, ఆస్థితః=అధిష్ఠింపబడిన, సః=ఆ, గజోత్తమః=శ్రేష్ఠమైన గజము, లఙ్కాయాః=లంకయొక్క, ఉపరి=పైన, స్థితః=నిలిచినది.

తా. అటు పిమ్మట, రామలక్ష్మణులు, విశాలాక్షియైన సీతా ఎక్కి ఉన్న ఆ మహాగజము లంక పైభాగమునందు నిలచెను. 16

మూ. పాణ్డురర్షభయుక్తేన రథేనాష్టయుజా స్వయమ్, 17
ఇహోపయాతః కాకుత్థ్సః సీతయా సహ భార్యయా.

ప్ర. అ. కాకుత్థ్సః=రాముడు, భార్యయా=భార్యయైన, సీతయా సహ=సీతతో కూడ, పాణ్డురర్షభయుక్తేన=తెల్లని వృషభములు కట్టబడిన, అష్టయుజా=ఎనిమిది వృషభములు కట్టిన, రథేన=రథముతో, స్వయమ్=స్వయముగా, ఇహ=ఇక్కడికి, ఉపయాతః=వచ్చినాడు.

తా. రాముడు, భార్యయైన సీతతో, తెల్లని ఎనిమిది వృషభములు కట్టిన రథముతో ఇక్కడికి స్వయముగా వచ్చినాడు.

వి. "పాణ్డురర్షభయుక్తేన" అని చెప్పి "అష్టయుజా" అని మరల అనుటలో సమన్వయము సరిగా కుదురుట లేదు. ప్రాచ్యపాఠములో "పాణ్డురర్షభ యుక్తేన రథేనాశ్వయుజా స్వయమ్" అను పాఠమున్నది. దానికి రాముడు తెల్లని వృషభము కట్టిన రథముపై ఒక మాటు, అశ్వములు కట్టిన రథముపై ఒకమాటు కనబడినాడని అర్థము చెప్పవచ్చును. 17

మూ. లక్ష్మణేన సహ భ్రాత్రా సీతయా సహ వీర్యవాన్, 18
ఆరుహ్య పుష్పకం దివ్యం విమానం సూర్యసన్నిభమ్,
ఉత్తరాం దిశమాలోక్య జగామ పురుషోత్తమః. 19

ప్ర. అ. వీర్యవాన్=పరాక్రమవంతుడు, పురుషోత్తమః=పురుషులలో శ్రేష్ఠుడు అయిన రాముడు, భ్రాత్రా=సోదరుడైన, లక్ష్మణేన=లక్ష్మణునితోను, సీతయా సహ=సీతతోను, దివ్యమ్=దివ్యము, సూర్యసన్నిభమ్=సూర్యునితో సమానము అయిన, పుష్పకం విమానమ్=పుష్పకవిమానమును, ఆరుహ్య=ఎక్కి, ఉత్తరామ్=ఉత్తరపు, దిశమ్=దిక్కును, ఆలోక్య=చూచి, జగామ=వెళ్లెను.

తా. పరాక్రమవంతుడు, పురుషశ్రేష్ఠుడు అయిన ఆ రాముడు, సోదరుడైన లక్ష్మణునితోను, సీతతోను కలిసి, సూర్యుడు వలె ప్రకాశించుచున్న, దివ్యమైన పుష్పకవిమానము ఎక్కి, ఉత్తరదిక్కు వైపు వెళ్ళెను. 18, 19

మూ. ఏవం స్వప్నే మయా దృష్టో రామో విష్ణుపరాక్రమః,
లక్ష్మణేన సహ భ్రాత్రా సీతయా సహ రాఘవః. 20

ప్ర. అ. విష్ణుపరాక్రమః=విష్ణువువంటి పరాక్రమము గల, రాఘవః=రఘువంశసంజాతుడైన, రామః=రాముడు, భ్రాత్రా=సోదరుడైన, లక్ష్మణేన=లక్ష్మణునితోను,

సీతయా సహ=సీతతోను, స్వప్నే=స్వప్నమునందు, ఏవమ్=ఇట్లు, మయా=నాచేత, దృష్టః=చూడబడినాడు.

తా. విష్ణువుతో సమానమైన పరాక్రమము గల ఆ రాముని, ఆతని సోదరుడైన లక్ష్మణుని, సీతను, నేను ఈ విధముగా స్వప్నములో చూచితిని.

మూ. న హి రామో మహాతేజాః శక్యో జేతుం సురాసురైః,
రాక్షసైర్వాపి చాన్యైర్వా స్వర్గః పాపజనైరివ. 21

ప్ర. అ. మహాతేజాః=గొప్ప తేజస్సు గల, రామః=రాముడు, సురాసురైః=సురులచేత గాని అసురులచేత గాని, రాక్షసైర్వాపి=రాక్షసులచేత గాని, అన్యైర్వా=ఇతరులచేత గాని, స్వర్గః=స్వర్గము, పాపజనైరివ=పాపాత్ములచేత వలె, జేతుమ్=జయించుటకు, న శక్యః=శక్యమైనవాడు కాడు కదా !

తా. పాపాత్ములు స్వర్గమునేవిధముగా జయించలేరో, అదే విధముగ, సురులు గాని, అసురులు గాని, రాక్షసులు గాని, ఇతరులు గాని మహాతేజః శాలియైన రాముని జయించజాలరు. 21

మూ. రావణశ్చ మయా దృష్టః క్షితౌ తైలసముక్షితః,
రక్తవాసాః పిబన్ మత్తః కరవీరకృతస్రజః. 22

ప్ర. అ. రావణశ్చ=రావణుడు కూడ, క్షితౌ=భూమియందు, తైలసముక్షితః=తైలముచేత పూయబడినవాడై, రక్తవాసాః=ఎఱ్ఱని వస్త్రములు కలవాడై, కరవీరకృతస్రజః=కరవీరపుష్పములచేత కట్టబడిన మాలలు కలవాడై, పిబన్=తైలము త్రాగుచు, మత్తః=మదించినవాడుగా, మయా=నా చేత, దృష్టః=చూడబడినాడు.

తా. రావణుడు ఎఱ్ఱని వస్త్రములు, ఎఱ్ఱని కరవీరపుష్పముల మాలలు ధరించి, శరీరమునకు తైలము పూసికొని, తైలము త్రాగుచు, మత్తుడై నేలపై పడియున్నట్లు నాకు కనబడినాడు. 22

మూ. విమానాత్పుష్పకాదద్య రావణః పతితో భువి,
కృష్యమాణః స్త్రియా దృష్టో ముణ్డః కృష్ణామ్బరః పునః. 23

ప్ర. అ. అద్య=ఇప్పుడు, పుష్పకాత్ విమానాత్=పుష్పకవిమానమునుండి, భువి=నేలమీద, పతితః=పడిపోయిన, ముణ్డః=శిరస్సు గొరిగించుకున్నవాడూ, కృష్ణామ్బరః=నల్లని వస్త్రములు కలవాడూ అయిన, రావణః=రావణుడు, స్త్రియా=స్త్రీచేత, కృష్యమాణః=లాగబడుచు, పునః=మరల, దృష్టః=చూడబడినాడు.

తా. ముండితమైన శిరస్సుతో, నల్లని వస్త్రములు ధరించిన రావణుడు పుష్పకవిమానమునుండి నేలపై పడిపోయినట్లు, ఆతనిని ఒక స్త్రీ ఈడ్చుచున్నట్లు నాకు మరల కనబడెను. 23

మూ. రథేన ఖరయుక్తేన రక్తమాల్యానులేపనః,
పిబంస్తైలం హసన్నృత్యన్ భ్రాన్తచిత్తాకులేన్ద్రియః 24

ప్ర. అ. రక్తమాల్యానులేపనః=ఎఱ్ఱని మాలలు మైపూతలు కలవాడై, తైలమ్=తైలమును, పిబన్=త్రాగుచు, హసన్=నవ్వుచు, నృత్యన్=నృత్యము చేయుచు, భ్రాన్తచిత్తాకులేన్ద్రియః=భ్రాంతి చెందిన చిత్తము వ్యాకులములైన ఇంద్రియములు కలవాడై, ఖరయుక్తేన=గాడిదలచే కట్టబడిన, రథేన=రథముచేత, (యయౌ=వెళ్ళెను).

తా. రావణుడు ఎఱ్ఱని మాలలు ధరించి, ఎఱ్ఱని మైపూత పూసికొని, తైలము త్రాగుచు, భ్రాంతి చెందిన చిత్తముతో, వ్యాకులములైన ఇంద్రియములతో నవ్వుచు, నృత్యము చేయుచు, గాడిదలు కట్టిన రథము ఎక్కి వెళ్ళెను. 24

మూ. గర్దభేన యయౌ శీఘ్రం దక్షిణాం దిశమాస్థితః,
పునరేవ మయా దృష్టో రావణో రాక్షసేశ్వరః, 25
పతితోఽవాక్శిరా భూమౌ గర్దభాద్భయమోహితః.

ప్ర. అ. దక్షిణాం దిశమ్=దక్షిణపు దిక్కును, ఆస్థితః=అవలంబించినవాడై, గర్దభేన=గాడిదచేత, శీఘ్రమ్=శీఘ్రముగా, యయౌ=వెళ్ళెను. రాక్షసేశ్వరః=రాక్షసరాజైన, రావణః=రావణుడు, భయమోహితః=భయము చేత మోహితుడై, గర్దభాత్=గర్దభముమీదనుంచి, అవాక్శిరాః=క్రిందికి శిరస్సు కలవాడై, పతితః=పడినవాడుగా, మయా=నాచేత, పునరేవ=మరల, దృష్టః=చూడబడెను.

తా. రావణుడు గాడిదను ఎక్కి దక్షిణపు దిక్కు వైపు వెళ్ళిపోయెను. రాక్షసరాజైన రావణుడు భయముతో దిక్కు తోచక, ఆ గాడిదమీదనుంచి తల క్రిందుగా నేలపై పడినట్లు మరల నాకు కనబడినాడు. 25

మూ. సహసోత్థాయ సంభ్రాన్తో భయార్తో మదవిహ్వలః. 26
ఉన్మత్త ఇవ దిగ్వాసా దుర్వాక్యం ప్రలపన్ బహు,
దుర్గన్ధం దుస్సహం ఘోరం తిమిరం నరకోపమమ్, 27
మలపఙ్కం ప్రవిశ్యాశు మగ్నస్తత్ర స రావణః.

ప్ర. అ. సః రావణః=ఆ రావణుడు, సహసా=శీఘ్రముగా, ఉత్థాయ=లేచి, సంభ్రాన్తః=భ్రాంతి చెందినవాడై, భయార్తః=భయముచే పీడితుడై, మదవిహ్వలః=

మదముచేత వ్యాకులుడై, దిగ్వాసాః=దిగంబరుడై, ఉన్మత్తః ఇవ=పిచ్చివాడు వలె, బహు=అధికముగా, దుర్వాక్యమ్=చెడ్డమాటలను, ప్రలపన్=ప్రేలుచు, దుర్గన్ధమ్=దుర్గన్ధము కలదీ, దుస్సహమ్=సహింపశక్యము కానిదీ, ఘోరమ్=భయంకరమైనదీ, తిమిరమ్=చీకటిగా ఉన్నదీ, నరకోపమమ్=నరకముతో సమానమైనదీ అయిన, మలపఙ్కమ్=మలము యొక్క బురదను, ప్రవిశ్య=ప్రవేశించి, ఆశు=శీఘ్రముగా, తత్ర=దానిలో, మగ్నః=మునిగిపోయినాడు.

తా. ఆ రావణుడు వెంటనే లేచి, కంగారు పడుచు, భయముచే పీడితుడై, మదముతో వ్యాకులుడై, దిగంబరుడై, పిచ్చివాని వలె ఏమేమో చాలా చెడ్డ మాటలు పలుకుచు సహింపరాని దుర్గంధముతో భయంకరమైన, అంధకారబంధురమైన, నరకము వంటి మలపంకమును ప్రవేశించి దానిలో మునిగిపోయెను. 26, 27

మూ. కణ్ఠే బద్ధ్వా దశగ్రీవం ప్రమదా రక్తవాసినీ, 28
కాళీ కర్దమలిప్తాఙ్గీ దిశం యామ్యాం ప్రకర్షతి.

ప్ర. అ. రక్తవాసినీ=ఎఱ్ఱని వస్త్రములు ధరించిన, కాళీ=నల్లగా ఉన్న, కర్దమలిప్తాఙ్గీ=బురదచేత పూయబడిన శరీరము గల, ప్రమదా=స్త్రీ, దశగ్రీవమ్=రావణుని, కణ్ఠే=కంఠమునందు, బద్ధ్వా=కట్టి, యామ్యాం దిశమ్=దక్షిణ దిక్కును గూర్చి, ప్రకర్షతి=లాగుచున్నది.

తా. ఎఱ్ఱని వస్త్రములు ధరించి, శరీరమంతా బురద పూసికొని ఉన్న ఒక నల్లని స్త్రీ రావణుని మెడకు త్రాడు కట్టి దక్షిణము వైపు ఈడ్చుచుండెను.

మూ. ఏవం తత్ర మయా దృష్టః కుమ్భకర్ణో నిశాచరః, 29
రావణస్య సుతాః సర్వే దృష్టాస్తైలసముక్షితాః.

ప్ర. అ. తత్ర=స్వప్నములో, నిశాచరః=రాక్షసుడైన, కుమ్భకర్ణః=కుంభకర్ణుడు, మయా=నాచేత, ఏవమ్=ఈ విధముగా, దృష్టః=చూడబడినాడు. రావణస్య=రావణునియొక్క, సుతాః=కుమారులు, సర్వే=అందరూ, తైలసముక్షితాః=తైలముచేత తడపబడినవారుగా, దృష్టాః=చూడబడినారు.

తా. నిశాచరుడైన కుంభకర్ణుడు కూడా నాకు స్వప్నములో ఇట్లే కనబడినాడు. రావణుని కుమారులందరు తైలము పూసికొని ఉండిరి. 29

మూ. వరాహేణ దశగ్రీవః శింశుమారేణ చేన్ద్రజిత్, 30
ఉష్ట్రేణ కుమ్భకర్ణశ్చ ప్రయాతా దక్షిణాం దిశమ్.

ప్ర. అ. దశగ్రీవః=రావణుడు, వరాహేణ=వరాహముచేత, ఇన్ద్రజిత్=ఇంద్రజిత్తు, శింశుమారేణ చ=మొసలిచేత, కుమ్భకర్ణః=కుంభకర్ణుడు, ఉష్ట్రేణ చ=ఒంటెచేత, దక్షిణాం దిశమ్=దక్షిణదిక్కును గూర్చి, ప్రయాతాః=వెళ్ళిరి.

తా. వరాహము నెక్కి రావణుడు, మొసలి నెక్కి ఇంద్రజిత్తు, ఒంటెను ఎక్కి కుంభకర్ణుడు దక్షిణదిక్కు వైపు వెళ్ళినారు. 30

మూ. ఏకస్తత్ర మయా దృష్టః శ్వేతచ్ఛత్రో విభీషణః, 31
శుక్లమాల్యామ్బరధరః శుక్లగన్ధానులేపనః.

ప్ర. అ. తత్ర=వారిలో, ఏకః=ఒక్క, విభీషణః=విభీషణుడే, శ్వేతచ్ఛత్రః=తెల్లని ఛత్రము కలవాడుగాను, శుక్లమాల్యామ్బరధరః=తెల్లనిమాలలను, వస్త్రములను, ధరించినవాడుగాను, శుక్లగన్ధానులేపనః=తెల్లని గంధము మైపూతకలవాడు గాను, మయా=నాచేత, దృష్టః=చూడబడినాడు.

తా. వారిలో ఒక్క విభీషణుడు మాత్రము తెల్లని మాలలను, వస్త్రములను ధరించి, తెల్లని మంచి గంధము పూసికొని, శ్వేతచ్ఛత్రము ధరించి నాకు కనబడెను. 31

మూ. శఙ్ఖదున్దుభినిర్ఘోషైర్నృత్తగీతైరలఙ్కృతః, 32
ఆరుహ్య శైలసంకాశం మేఘస్తనితనిస్వనమ్,
చతుర్దన్తం గజం దివ్యమాస్తే తత్ర విభీషణః, 33
చతుర్భిః సచివైః సార్ధం వైహాయసముపస్థితః.

ప్ర. అ. విభీషణః=విభీషణుడు, శఙ్ఖదున్దుభినిర్ఘోషైః=శంఖముల యొక్క, దుందుభులయొక్కా ధ్వనులతోను, నృత్తగీతైః=నృత్తములతోను, గీతములతోను, అలంకృతః=అలంకరింపబడినవాడై, శైలసంకాశమ్=పర్వతముతో సమానమైన, మేఘస్తనితనిస్వనమ్=మేఘముయొక్క ఉరుము వంటి ధ్వని గల, చతుర్దన్తమ్=నాలుగు దంతములు గల, దివ్యమ్=దివ్యమైన, గజమ్=ఏనుగును, ఆరుహ్య=ఎక్కి, తత్ర=అక్కడ, ఆస్తే=ఉన్నాడు. చతుర్భిః=నలుగురు, సచివైః సార్ధమ్=మంత్రులతో కూడ, వైహాయసమ్=ఆకాశమును, ఉపస్థితః=పొంది ఉన్నాడు.

తా. ఆ విభీషణుడు, శంఖదుందుభుల ధ్వనులు, నృత్తములు, గీతములు మొదలైనవి చుట్టూ జరుగుచుండగా, ఉరుము వంటి ధ్వని గల, పర్వతము వంటి, నాలుగు దంతాల ఏనుగును ఎక్కి, నలుగురు మంత్రులతో కలిసి ఆకాశము మీద ఉండెను. 32, 33

మూ. సమాజశ్చ మయా దృష్టో గీతవాదిత్రనిఃస్వనః, 34
పిబతాం రక్తమాల్యానాం రక్షసాం రక్తవాససామ్.

ప్ర. అ. పిబతామ్=తైలమును త్రాగుచున్న, రక్తమాల్యానామ్=ఎఱ్ఱని మాలలు ధరించిన, రక్తవాససామ్=ఎఱ్ఱని వస్త్రములు గల, రక్షసామ్=రాక్షసులయొక్క, గీతవాదిత్రనిఃస్వనః=గీతములయొక్క, వాద్యములయొక్క ధ్వనిగల, సమాజశ్చ=సమాజము కూడ, మయా=నాచేత, దృష్టః=చూడబడెను.

తా. రాక్షసులందరూ గుమిగూడి, నూనెత్రాగుచు, ఎఱ్ఱని మాలలు, వస్త్రములు ధరించి, వాద్యాలు వాయించుచు, పాటలుపాడుచూ ఉన్నట్లు నేను చూచితిని. 34

మూ. లఙ్కా చేయం పురీ రమ్యా సవాజిరథకుఞ్జరా, 35
సాగరే పతితా దృష్టా భగ్నగోపురతోరణా.

ప్ర. అ. రమ్యా=సుందరమైన, ఇయమ్=ఈ, లఙ్కా పురీ చ=లంకాపట్టణము కూడ, సవాజిరథకుఞ్జరా=గుఱ్ఱములతోను, ఏనుగులతోను కూడినదై, భగ్నగోపురతోరణా=విరుగకొట్టబడిన గోపురములు ముఖద్వారములు కలదై, సాగరే=సముద్రమునందు, పతితా=పడినదిగా, దృష్టా=చూడబడినది.

తా. రమ్యమైన ఈ లంకాపట్టణములోని గోపురములూ, ముఖద్వారములూ భగ్నములైపోయినట్లూ, అశ్వములతోను గజములతోను సహా ఈ లంక సముద్రములో మునిగిపోయినట్లూ నాకు కనబడినది. 35

మూ. లఙ్కా దృష్టా మయా స్వప్నే రావణేనాభిరక్షితా, 36
దగ్ధా రామస్య దూతేన వానరేణ తరస్వినా.

ప్ర. అ. రావణేన=రావణునిచేత, అభిరక్షితా=రక్షింపబడిన, లఙ్కా=లంక, రామస్య=రామునియొక్క, దూతేన=దూతయైన, తరస్వినా=వేగవంతుడైన, వానరేణ=వానరునిచేత, దగ్ధా=కాల్చబడినదిగా, మయా=నాచేత, స్వప్నే=స్వప్నమునందు, దృష్టా=చూడబడినది.

తా. రావణుడు రక్షించుచున్న ఈ లంకాపట్టణమును రాముని దూత, మహావేగవంతుడూ అయిన ఒక వానరుడు కాల్చివేసినట్లు నేను స్వప్నము చూచితిని. 36

మూ. పీత్వా తైలం ప్రనృత్తాశ్చ ప్రహసన్త్యో మహాస్వనాః, 37
లఙ్కాయాం భస్మరూక్షాయాం సర్వా రాక్షసయోషితః.

ప్ర. అ. భస్మరూక్షాయామ్=బూడిదతో భయంకరముగా ఉన్న, లఙ్కాయామ్=లంకలో, సర్వాః=సమస్తమైన, రాక్షసస్త్రియః=రాక్షసస్త్రీలు, తైలమ్=తైలమును, పీత్వా=త్రాగి, ప్రహసన్త్యః=అట్టహాసము చేయుచు, మహాస్వనాః=గొప్పధ్వని కలవారై, ప్రనృత్తాః చ=అధికముగా నృత్తము చేయుచుండిరి.

తా. లంక అంతా బూడిదతో నిండి ఉండెను. దానిలోని స్త్రీ లందరూ తైలము త్రాగుచు, మహాధ్వనితో అట్టహాసములు చేయుచు వెఱ్ఱిగా గంతులు వేయుచుండిరి. 37

మూ. కుమ్భకర్ణాదయశ్చేమే సర్వే రాక్షసపుఙ్గవాః, 38
రక్తం నివసనం గృహ్య ప్రవిష్టా గోమయహ్రదే.

ప్ర. అ. కుమ్భకర్ణాదయః=కుంభకర్ణుడు మొదలైన, ఇమే=ఈ, సర్వే=సమస్తమైన, రాక్షసపుఙ్గవాః=రాక్షసశ్రేష్ఠులు, రక్తమ్=ఎఱ్ఱని, నివసనమ్=వస్త్రమును, గృహ్య=గ్రహించి, గోమయహ్రదే=పేడతో నిండిన గోతిలో, ప్రవిష్టాః=ప్రవేశించిరి.

తా. కుంభకర్ణాదిరాక్షసశ్రేష్ఠులందరూ ఎఱ్ఱని వస్త్రములు ధరించి, పేడతో నిండిన గోతులలో మునిగిపోయిరి. 38

మూ. అపగచ్ఛత నశ్యధ్వం సీతామాప్నోతి రాఘవః, 39
ఘాతయేత్పరమామర్షీ యుష్మాన్ సార్ధం హి రాక్షసైః.

ప్ర. అ. అపగచ్ఛత=తొలగిపొండి. నశ్యధ్వమ్=నశించండి. రాఘవః=రాముడు, సీతామ్=సీతను, ఆప్నోతి=పొందును. పరమామర్షీ=అధికమైన కోపము కలవాడై, రాక్షసైః సార్ధమ్=రాక్షసులతో కూడ, యుష్మాన్=మిమ్ములను, ఘాతయేత్=చంపించును.

తా. మీరు తొలగిపొండి ; చావండి ! రాముడు సీతను పొందుట తథ్యము. అతడు తన భార్యను పీడించినారనే కోపముతో, రాక్షసులతో పాటు మిమ్ములను కూడా చంపించివేయును. 39

మూ. ప్రియాం బహుమతాం భార్యాం వనవాసమనువ్రతామ్, 40
భర్త్సితాం తర్జితాం వాపి నానుమంస్యతి రాఘవః.

ప్ర. అ. రాఘవః=రాముడు, ప్రియామ్=ప్రియురాలు, బహుమతామ్=బహుమానపాత్రురాలు, వనవాసమ్=వనవాసమును, అనువ్రతామ్=అనుసరించి వ్రతము పాలించినదీ అయిన, భార్యామ్=భార్యను, భర్త్సితామ్=మరణాదులు చూపి భయపెట్టబడినను, తర్జితాం వాపి=దూషించి బెదిరింపబడినను, నానుమంస్యతి=అంగీకరించదు.

తా. సీత రామునకు అతిప్రియురాలు, బహుమానపాత్రురాలు అయిన భార్య. ఆతనిని అనుసరించి వచ్చి వనవాసవ్రతమును అవలంబించిన సాధ్వి. అట్టి భార్యను ఎవరైన భయపెట్టినా, దూషించినా రాముడు సహించడు. 40

మూ. తదలం క్రూరవాక్యైశ్చ సాన్త్వమేవాభిధీయతామ్, 41
అభియాచామ వైదేహీమేతద్ధి మమ రోచతే.

ప్ర. అ. తత్=ఆ కారణమువలన, క్రూరవాక్యైః=క్రూరవాక్యములచేత, అలమ్=చాలును. సాన్త్వమేవ=మంచి మాటయే, అభిధీయతామ్=చెప్పబడుగాక. వైదేహీమ్=సీతను, అభియాచామ=బ్రతిమాలుకొందము. ఏతద్ధి=ఇదే, మే=నాకు, రోచతే=ఇష్టమగుచున్నది.

తా. అందుచేత సీతతో పరుషవాక్యములు పలుకవద్దు. మంచి మాటలే చెప్పండి. సీతను బ్రతిమాలుకుందాము. నాకు ఇదే ఇష్టము. 41

మూ. యస్యామేవంవిధః స్వప్నో దుఃఖితాయాం ప్రదృశ్యతే, 42
సా దుఃఖైర్వివిధైర్ముక్తా ప్రియం ప్రాప్నోత్యనుత్తమమ్.

ప్ర. అ. యస్యామ్=ఎవతె, దుఃఖితాయామ్=దుఃఖితురాలై ఉండగా, ఏవంవిధః=ఈ విధమైన, స్వప్నః=స్వప్నము, ప్రదృశ్యతే=చూడబడునో, సా=ఆ స్త్రీ, వివిధైః=అనేకవిధములైన, దుఃఖైః=దుఃఖములచేత, ముక్తా=విడవబడినదై, అనుత్తమమ్=అత్యుత్తమమైన, ప్రియమ్=ప్రియమును, ప్రాప్నోతి=పొందును.

తా. ఎవ్వరైన స్త్రీ కష్టాలలో ఉన్నప్పుడు ఈ విధమైన స్వప్నము వచ్చినచో, ఆమె సర్వదుఃఖములనుండి విముక్తురాలై, అత్యుత్తమమైన ప్రియమును పొందును. 42

మూ. భర్త్సితామపి యాచధ్వం రాక్షస్యః కిం వివక్షయా, 43
రాఘవాద్ధి భయం ఘోరం రాక్షసానాముపస్థితమ్.

ప్ర. అ. రాక్షస్యః=రాక్షసస్త్రీలలారా ! భర్త్సితామపి=భయపెట్టబడినదైనను ఈమెను, యాచధ్వమ్=ప్రార్థించుడు. వివక్షయా=చెప్పవలెనను కోరికచే, కిమ్=ఏమి ప్రయోజనము ? రాక్షసానామ్=రాక్షసులకు, రాఘవాత్=రామునివలన, ఘోరమ్=ఘోరమైన, భయమ్=భయము, ఉపస్థితమ్=వచ్చిపడినది.

తా. రాక్షసస్త్రీలలారా ! ఇంకా ఏమేమో చెప్పి ప్రయోజనము లేదు. ఇంత వరకు ఈమెను భయపెట్టినాము. ఇపుడింక ఈమెను బ్రతిమాలుకొనుట మంచిది. రాక్షసులకు రామునినుండి గొప్ప ఆపద వచ్చిపడినది. 43

మూ. ప్రణిపాతప్రసన్నా హి మైథిలీ జనకాత్మజా, 44
అలమేషా పరిత్రాతుం రాక్షస్యో మహతో భయాత్.

ప్ర. అ. రాక్షస్యః=రాక్షసస్త్రీలలారా ! జనకాత్మజా=జనకుని కుమార్తె యైన, ఏషా=ఈ, మైథిలీ=సీత, ప్రణిపాతప్రసన్నా=నమస్కారముచేత ప్రసన్నురాలై, మహతః=గొప్ప, భయాత్=భయమునుండి, పరిత్రాతుమ్=రక్షించుటకు, అలమ్=సమర్థురాలు.

తా. రాక్షసస్త్రీలలారా ! జనకాత్మజ యైన ఈ సీతను నమస్కరించి అనుగ్రహింపచేసుకొన్నచో ఈమె మనలను మహాభయమునుండి రక్షించగలదు.44

మూ. అపి చాస్యా విశాలాక్ష్యా న కించిదుపలక్షయే, 45
విరూపమపి చాఙ్గేషు సుసూక్ష్మమపి లక్షణమ్.

ప్ర. అ. అపిచ=మరియు, విశాలాక్ష్యాః=విశాలాక్షియైన, అస్యాః=ఈమె యొక్క, అఙ్గేషు=అవయవములయందు, సుసూక్ష్మమపి=చాల సూక్ష్మమైనను, విరూపమ్=చెడ్డదైన, లక్షణమ్=లక్షణమును, కించిదపి=కొంచెముకూడ, న ఉపలక్షయే=చూడను.

తా. విశాలాక్షియైన ఈ సీత అవయవములలో, అంతము లేని దుఃఖమును సూచించు చెడ్డ లక్షణము, అతి సూక్ష్మమైనది కూడ, ఏదీ, నాకు కనబడుటలేదు.

వి. "విరుద్ధం గుణసఙ్గేషు సుసూక్ష్మమపి లక్షణమ్" అను ప్రాచ్యపాఠము బాగున్నది. "మంచిగుణములు ఉండుటకు విరుద్ధమైన అవలక్షణమేదీ నాకు కనబడుటలేదు" అని దీని భావము. మొదట ఇచ్చిన పాఠములో రెండు అపి శబ్దాలుండడం చేత "విరూపమునూ, సుసూక్ష్మమైన సాముద్రికలక్షణమును కూడ నేను చూచుట లేదు." అని వ్యాఖ్యాతలు వ్యాఖ్యానించినారు. ఒక 'అపి' శబ్దాన్ని 'కించిత్'లో కలిపి మేము మరొకవిధముగా వ్యాఖ్యానించినాము. 45

మూ. ఛాయావైగుణ్యమాత్రం తు శఙ్కే దుఃఖముపస్థితమ్, 46
అదుఃఖార్హామిమాం దేవీం వైహాయసముపస్థితామ్.

ప్ర. అ. ఛాయావైగుణ్యమాత్రం తు=కాంతియందు కొంత వైకల్యమును (లోపమును) మాత్రము, (ఉపలక్షయే=చూచుచున్నాను). వైహాయసమ్=విమానమును, ఉపస్థితామ్=చేరినదీ, (అనగా భోగము లనుభవించ తగినది అని భావము), అదుఃఖార్హామ్=దుఃఖములకుతగని, ఇమామ్=ఈ, దేవీమ్=దేవిని, దుఃఖమ్=దుఃఖము, ఉపస్థితమ్=చేరినది అని, శఙ్కే=ఊహించుచున్నాను.

తా. ఈమె శరీరకాంతిలో మాత్రము కొంత లోపమును చూచుచున్నాను. అందుచేతనే విమానమును ఎక్కిన (భోగములనుభవించవలసిన) ఈ దుఃఖములనుభవించకూడని సీతకు దుఃఖము కలిగినదని తలచుచున్నాను.

వి. ఈ శ్లోకం ఏమీ సంతృప్తికరంగా లేదు. "అవయవాలలో ఏ లోపాలూ లేవు కాని శరీరకాంతిలో కొంతలోపం ఉండడంచేత ఈమెకు దుఃఖం వచ్చినది" అని చెప్పడంలో సీత శరీరకాంతిలో కొంత లోపం ఉన్నదని చెప్పినట్లు అయినది. "సీత ఎట్టి లోపములూ లేని అతిలోకసౌందర్యవతి" అని అడుగడుగనా వాల్మీకి చెప్పిన దానికే ఇది విరుద్ధము. ఆ సమయంలో సీత శరీరకాంతి తగ్గి ఉంటే, పదిమాసాలు రావణగృహంలో అనుభవిస్తూన్న కష్టాల వలన తగ్గి ఉండవచ్చును. అనగా కష్టాలవల్ల శరీరకాంతి తగ్గినది కాని శరీరకాంతిలోపం వల్ల కష్టాలు రాలేదు. అదేవిధంగా-"వైహాయసముపస్థితామ్" అనే దానికి ఏదో చెప్పాలి కదా అని చెప్పిన భావంగా కనిపిస్తుంది. అందుచేత ఈ శ్లోకం స్థానంలో ప్రాచ్యపాఠంలో ఉన్న శ్లోకం బాగున్నది. అది ఇట్లున్నది-

"ఇయం ద్వైగుణ్యమాత్రేణ శఙ్కే దుఃఖముపాగతా,
అదుఃఖార్హామిమాం దేవీం న క్లేశయితుమర్హథ."

"ఈమె కేవలము రెండు గుణాల ప్రభావంచేత (రజస్తమోగుణాలప్రభావంచేత) ఈ దుఃఖమును పొందినదని అనుకొనుచున్నాను. దుఃఖములకు తగని ఈ దేవిని దుఃఖపెట్టకండి" అని దీని అర్థము. ఈమె శరీరమునందుగాని, విడివిడిగా అవయవాలయందు గాని ఏ దోషమూ లేకపోయినా మనకండ్లకు కనిపించని రజస్తమోగుణాల ప్రభావం ఏదో ఈమెకు దుఃఖం కలిగిస్తున్నది. ఆ గుణాలు రావణాదులలో ఉద్రిక్తములై సీతను బాధించవచ్చును కదా ! అని భావము. 46

మూ. అర్థసిద్ధిం తు వైదేహ్యాః పశ్యామ్యహముపస్థితామ్, 47
రాక్షసేన్ద్రవినాశం చ విజయం రాఘవస్య చ.

ప్ర. అ. అహమ్=నేను, వైదేహ్యాః=సీతయొక్క, అర్థసిద్ధిం తు=కార్యసిద్ధినైతే, ఉపస్థితామ్=సమీపించినదానినిగా, పశ్యామి=చూచుచున్నాను. రాక్షసేన్ద్రవినాశం చ=రావణుని వినాశనమును, రాఘవస్య=రామునియొక్క, విజయం చ=విజయమును కూడ, (దగ్గరనే ఉన్నట్లు చూచుచున్నాను).

తా. సీతకు కార్యసిద్ధి త్వరలోనే కలుగునట్లు కనుపించుచున్నది. రావణుని వినాశమూ, రాముని విజయమూ కూడా దగ్గరలోనే ఉన్నట్లు కనబడుచున్నది. 47

మూ. నిమిత్తభూతమేతత్తు శ్రోతుమస్యా మహత్ప్రియమ్, 48
దృశ్యతే చ స్ఫురచ్చక్షుః పద్మపత్రమివాయతమ్.

ప్ర. అ. అస్యాః=ఈమెయొక్క, మహత్=గొప్పదైన, ప్రియమ్=ప్రియమును, శ్రోతుమ్=వినుటకు, నిమిత్తభూతమ్=నిమిత్తమగుచు, స్ఫురత్=అదురుచున్న, ఏతత్=ఈ, పద్మపత్రమివ=తామర రేకు వలె, ఆయతమ్=పొడవైన, చక్షుః=నేత్రము, దృశ్యతే=కనబడుచున్నది.

తా. ఈమె గొప్ప ప్రియవార్తను విననున్నది అను విషయమునకు సూచకముగా, పద్మపత్రము వలె ఆయతమైన ఈ నేత్రము (సీత ఎడమ కన్ను) అదురుచున్నది. 48

మూ. ఈషచ్చ హృషితో వాస్యా దక్షిణాయా హ్యదక్షిణః, 49
అకస్మాదేవ వైదేహ్యా బాహురేకః ప్రకమ్పతే.

ప్ర. అ. దక్షిణాయాః=సమర్థురాలైన (సాధుస్వభావము గల), అస్యాః=ఈ, వైదేహ్యాః=సీతయొక్క, అదక్షిణః=ఎడమదైన, ఏకః బాహుః=ఒక బాహువు, అకస్మాదేవ=అకస్మాత్తుగా, హృషితః=పొంగినదై, ఈషత్=కొంచెము, ప్రకమ్పతే=వణకుచున్నది.

తా. సాధుస్వభావము గల ఈ సీత ఎడమ భుజము హటాత్తుగా పొంగినదై, కొంచెము అదరుచున్నది. 49

మూ. కరేణుహస్తప్రతిమః సవ్యశ్చోరురనుత్తమః, 50
వేపమానః సూచయతి రాఘవం పురతః స్థితమ్.

ప్ర. అ. కరేణుహస్తప్రతిమః=ఏనుగు తొండముతో సమానమూ, అనుత్తమః=శ్రేష్ఠమూ అయిన, సవ్యః=ఎడమ, ఊరుః=తొడ, వేపమానః=వణకుచు, రాఘవమ్=రాముని, పురతః=ఎదటనే, స్థితమ్=ఉన్నవానినిగా సూచయతి=సూచించుచున్నది.

తా. ఏనుగు తొండముతో సమానమూ, శ్రేష్ఠమూ అయిన ఈ సీత ఎడమ తొడ అదరుచున్నది. రాముడు దగ్గరనే ఉన్నాడని ఇది సూచించుచున్నది.

మూ. పక్షీ చ శాఖానిలయం ప్రవిష్టః
పునః పునశ్చోత్తమసాన్త్వవాదీ,
సుస్వాగతం వాచముదీరయానః
పునః పునశ్చోదయతీవ హృష్టః. 51

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే సున్దరకాణ్డే
సప్తవింశః సర్గః.

ప్ర. అ. పక్షీ చ=పక్షికూడ, శాఖానిలయమ్=శాఖపైనున్న గూడును, ప్రవిష్టః=ప్రవేశించినదై, పునః పునశ్చ=మాటి మాటికి, ఉత్తమసాన్త్వవాదీ=ఉత్తమమైన ఓదార్పు మాటలను పలుకుచు, సుస్వాగతమ్=మంచి స్వాగతమును చెప్ప, వాచమ్=వాక్కును, ఉదీరయానః=చెప్పుచు, హృష్టః=సంతోషించినదై, పునః పునః=మాటి మాటికి, చోదయతీవ=ప్రేరేపించుచున్నట్లున్నది.

తా. ఒక పక్షి కొమ్మపై ఉన్న గూటిలో కూర్చుండి, మాటిమాటికి ఊరడింపుమాటలు పలుకుచు, చాలా ఉత్సాహముతో కూడినదై, స్వాగతవచనములు పలుకుచు, "రాముడు రానున్నాడు" అని సీతకు చెప్పుచున్నట్లున్నది.

వి. శకుని (పక్షి) ధ్వనులను పట్టి రాబోవు శుభాశుభములను తెలుసుకొనుపద్ధతి పూర్వము చాలా ప్రచారములో ఉండెడిది. మన మిపుడు అలాంటి సత్సంప్రదాయాలన్నింటికీ దూరమై పోయినాము ! 51

*"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు
సుందరకాండలో ఇరువదిఏడవ సర్గ సమాప్తము.*

అథ అష్టావింశః సర్గః

[సీత విలపించుచు ప్రాణములు విడచుటకు ఉద్యమించుట.]

మూ. సా రాక్షసేన్ద్రస్య వచో నిశమ్య
తద్రావణస్యాప్రియమప్రియార్తా,
సీతా వితత్రాస యథా వనాన్తే
సింహాభిపన్నా గజరాజకన్యా. 1

ప్ర. అ. సా సీతా=ఆ సీత, రాక్షసేన్ద్రస్య=రాక్షసరాజైన, రావణస్య=రావణునియొక్క, అప్రియమ్=అప్రియమైన, తత్=ఆ, వచః=వాక్యమును, నిశమ్య=విని, అప్రియార్తా=దుఃఖముచే పీడింపబడినదై, (ప్రియుడైన రాముడు లేకపోవుటచే ఆర్తురాలై,) వనాన్తే=వనమధ్యమునందు, సింహాభిపన్నా=సింహముచేత ఆక్రమింపబడిన, గజరాజకన్యా యథా=చిన్న ఆడ ఏనుగు వలె, వితత్రాస=భయపడెను.

తా. ఆ సీత రాక్షసరాజైన రావణుని అప్రియములైన మాటలు విని, దుఃఖముతో బాధపడుచు, (లేదా రాముడు లేకపోవుటచేత బాధపడుచు) వనమధ్యమునందు సింహముచేత ఆక్రమించబడిన చిన్న ఆడ ఏనుగు వలె భయపడెను. 1

మూ. సా రాక్షసీమధ్యగతా చ భీరు
ర్వాగ్భిర్భృశం రావణతర్జితా చ,
కాన్తారమధ్యే విజనే విసృష్టా
బాలేవ కన్యా విలలాప సీతా. 2

ప్ర. అ. రాక్షసీమధ్యగతా=రాక్షసస్త్రీల మధ్యను పొందినది, భీరుః=భయస్వభావము కలది, భృశమ్=మిక్కిలి, వాగ్భిః=వాక్కులచేత, రావణతర్జితా చ=రావణునిచేత భయపెట్టబడినదీ అయిన, సా=ఆ, సీతా=సీత, విజనే=జనులులేని, కాన్తారమధ్యే=అడవి మధ్యయందు, విసృష్టా=విడవబడిన, బాలా=బాలయైన, కన్యా ఇవ=కన్య వలె, విలలాప=విలపించెను.

తా. రాక్షసస్త్రీల మధ్య ఉన్న భయస్వభావము గల ఆ సీత రావణుడు కూడ మాటలతో అధికముగా భయపెట్టుటచేత, విజనమైన అటవీమధ్యములో ఒంటరిగా విడిచిపెట్టబడిన, బాలయైన కన్య వలె విలపించెను. 2

మూ. సత్యం బతేదం ప్రవదన్తి లోకే
నాకాలమృత్యుర్భవతీతి సన్తః,
యత్రాహమేవం పరిభర్త్స్యమానా
జీవామి దీనా క్షణమప్యపుణ్యా. 3

ప్ర. అ. లోకే=లోకమునందు, అకాలమృత్యుః=అకాలమునందు మృత్యువు, న భవతి=రాదు, ఇతి=అని, ఇదమ్=ఈ మాటను, సత్యమ్=నిజముగానే, సన్తః= సత్పురుషులు, ప్రవదన్తి=చెప్పుదురు. యత్ర=ఏ కారణమునందు (వలన), ఏవమ్=ఇట్లు, పరిభర్త్స్యమానా=భయపెట్టబడుచున్న, అపుణ్యా=పుణ్యము లేని, అహమ్=నేను, దీనా=దీనురాలనై, క్షణమపి=క్షణకాలమైనను, జీవామి=జీవించుచు న్నానో. బత=ఎంత కష్టము !

తా. పాపాత్మురాలనైన నేను ఈ విధముగ వీళ్ళందరూ భయపెట్టు చున్నా దీనురాలనై, క్షణముపాటైనను జీవించుచున్నాను అనగా, అకాలము నందు మరణము రాదు అని సత్పురుషులు లోకములో చెప్పుమాట సత్యమే ! ఎంత కష్టము ! 3

మూ. సుఖాద్విహీనం బహుదుఃఖపూర్ణ
మిదం తు నూనం హృదయం స్థిరం మే,
విశీర్యతే యన్న సహస్రధాద్య
వజ్రాహతం శృఙ్గమివాచలస్య. 4

ప్ర. అ. సుఖాత్=సుఖమునుండి, విహీనమ్=హీనమైనదీ, బహుదుఃఖపూ ర్ణమ్=అధికమైన దుఃఖముతో నిండినదీ అయిన, ఇదమ్=ఈ, మే=నాయొక్క, హృదయమ్=హృదయము, నూనమ్=నిశ్చయముగా, స్థిరమ్=స్థిరమైనది, యత్=ఏ కారణమువలనన, వజ్రాహతమ్=వజ్రముచేత కొట్టబడిన, అచలస్య=పర్వతము యొక్క, శృఙ్గమివ=శిఖరము వలె, సహస్రధా=వెయ్యి ముక్కలుగా, అద్య=ఇప్పుడు, న విశీర్యతే=బద్ద లగుట లేదు.

తా. ఎట్టి సుఖమూ లేక, అత్యధిక మైన దుఃఖముతో నిండిన ఈ నా హృదయము నిజముగా చాల గట్టిది. అందుచేతనే వజ్రముతో కొట్టబడిన పర్వత శిఖరము వలె ఇప్పుడు కూడా ఇది వెయ్యి ముక్కలుగా బద్దలగుట లేదు. 4

మూ. నైవాస్తి దోషో మమ నూనమత్ర
వధ్యాహమస్యాప్రియదర్శనస్య,

భావం న చాస్యాహమనుప్రదాతు
మలం ద్విజో మన్త్రమివాద్విజాయ. 5

ప్ర. అ. అత్ర=ఈ విషయమునందు, మమ=నా యొక్క, దోషః=దోషము, నైవాస్తి=లేదు. అహమ్=నేను, అప్రియదర్శనస్య=అప్రియమైన దర్శనము గల, అస్య=ఈ రావణునకు, వధ్యా=వధ్యురాలను, అస్మి=అయితిని. అహమ్=నేను, అస్య= వీనికి, భావమ్=భావమును, ద్విజః=ద్విజుడు, అద్విజాయ=ద్విజుడు కానివానికి, మన్త్రమివ=మంత్రమును వలె, అనుప్రధాతుమ్=ఇచ్చుటకు, న అలమ్=సమర్థురాలను కాను.

తా. ఈ విషయములో నా దోషమేమీ లేకుండగానే చూచుటకు అప్రియుడైన ఈ రావణుడు నన్ను చంపనున్నాడు. ద్విజుడు ద్విజుడు కాని వానికి మంత్రమును ఏ విధముగా ఇవ్వజాలడో, నేను, అదే విధముగ వీనికి నా మనస్సును ఇవ్వజాలను.

వి. ప్రాచ్యపాఠములో ఈ శ్లోకం క్రింది విధంగా ఉన్నది.
"నూనం త్విదానీం మమ శేషమస్తి
వధ్యాస్మి తస్యాప్రియదర్శనస్య
భావం న తస్యాహమనుప్రపద్యాం
మహద్విజో బ్రహ్మ యథా న త్యజేత్"

"నా హృదయము వెయ్యి ముక్కలు కావలసినది ; కాలేదు, ఇంక మిగిలిన దే మనగా నే నీతనికి వధ్యురాల నైతిని. ద్విజుడు వేదమును ఏ విధముగా పరిత్యజించజాలడో అదే విధముగ నే నీతని భావమును అనుసరించజాలను" అని దీని భావము. 5

మూ. నూనం మమాఙ్గాన్యచిరాదనార్యః
శస్త్రైః శితై శ్ఛేత్స్యతి రాక్షసేన్ద్రః,
తస్మిన్ననాగచ్ఛతి లోకనాథే
గర్భస్థజన్తోరివ శల్యకృన్తః. 6

ప్ర. అ. లోకనాథే=లోకములకు ప్రభువైన, తస్మిన్=రాముడు, అనాగచ్ఛతి=రానివాడగుచుండగా, అనార్యః=చెడ్డవాడైన, రాక్షసేన్ద్రః=రాక్షసరాజు, శల్యకృన్తః=శల్యమును ఛేదించువాడు (శస్త్రచికిత్సకుడు), గర్భస్థజన్తోరివ=గర్భములో ఉన్న జంతువుయొక్క అవయవములను వలె, మమ=నాయొక్క, అఙ్గాని=అవయవములను, నూనమ్=తప్పక, శితైః=వాడియైన, శస్త్రైః=శస్త్రములతో, ఛేత్స్యతి=ఛేదించగలడు.

తా. లోకములకు ప్రభువైన రాముడు రాకున్నచో, పెద్దవాడైన ఈ రావణుడు శస్త్రచికిత్సకుడు గర్భములో ఉన్న శిశువును ఛేదించి నట్లు, నా అవయవములను వాడి యైన శస్త్రములతో తప్పక ఛేదించును. 6

మూ. దుఃఖం బతేదం మమ దుఃఖితాయా
మాసౌ చిరాయాధిగమిష్యతో ద్వౌ,
బద్ధస్య వధ్యస్య తథా నిశాన్తే
రాజాపరాధాదివ తస్కరస్య. 7

ప్ర. అ. రాజాపరాధాత్=రాజు విషయమున జరిగిన అపరాధము వలన, బద్ధస్య=బంధించబడినవాడూ, నిశాన్తే=రాత్రియొక్క అంతమునందు, వధ్యస్య=చంప దగిన వాడూ అయిన, తస్కరస్య ఇవ=దొంగకు వలె, దుఃఖితాయాః=దుఃఖించుచున్న, మమ=నాకు, ద్వౌ=రెండు, మాసౌ=మాసములు, చిరాయ=చాలకాలమునకు, అధిగమిష్యతః=గడవగలవు. ఇదమ్=ఇది, దుఃఖమ్=పెద్ద దుఃఖకారణము. బత= అయ్యో!

తా. రాజు విషయములో చేసిన అపరాధమునకు బద్ధుడై తెల్లవాఁజామున చంపవలసి యున్న దొంగకు వలె దుఃఖితురాలనైన నాకు ఇచ్చిన రెండు మాసములు గడువు ఆలస్యముగా గడచును. అయ్యో ! ఎంత కష్టము వచ్చి పడినది! 7

మూ. హా రామ హా లక్ష్మణ హా సుమిత్రే
హా రామమాతః సహ మే జనన్యా,
ఏషా విపద్యామ్యహమల్పభాగ్యా
మహార్ణవే నౌరివ మూఢవాతా. 8

ప్ర. అ. హా రామ=అయ్యో ! రామా! హా లక్ష్మణ=అయ్యో ! లక్ష్మణా! హా సుమిత్రే=అయ్యో సుమిత్రా ! మే=నాయొక్క, జనన్యా సహ=తల్లితో కూడ, హా రామమాతః=అయ్యో ! కౌసల్యా, అల్పభాగ్యా=అల్పమైన భాగ్యము గల, ఏషా=ఈ, అహమ్=నేను, మహార్ణవే=మహాసముద్రమునందు, మూఢవాతా=నిలచిపోయిన గాలి గల, ('వాతమూఢా' అను ప్రాచ్యపాఠము బాగున్నది. "వాయువు చేత ఎటూ పోజాలని' అని అర్థము) నౌరివ=ఓడవలె, విపద్యామి=నశించుచున్నాను.

తా. అయ్యో! రామా! అయ్యో! లక్ష్మణా! అయ్యో సుమిత్రా! అయ్యో కౌసల్యా! అయ్యో! నాతల్లీ! దుర్భాగ్యవంతురాలనైన నేను మహాసముద్రములో గాలిచేత ఎటు వెళ్లుటకూ వీలు లేని ఓడ వలె, నశించుచున్నాను. 8

మూ. తరస్వినౌ ధారయతా మృగస్య
సత్త్వేన రూపం మనుజేన్ద్రపుత్రౌ,
నూనం విశస్తౌ మమ కారణాత్తౌ
సింహర్షభౌ ద్వావివ వైద్యుతేన. 9

ప్ర. అ. మృగస్య=మృగముయొక్క, రూపమ్=రూపమును, ధారయతా=ధరించుచున్న, సత్త్వేన=ప్రాణిచేత, తరస్వినౌ=వేగవంతులైన, తౌ=ఆ, మనుజేన్ద్రపుత్రౌ=దశరథకుమారులు, వైద్యుతేన=మెరుపుకు సంబంధించిన పిడుగు చేత, ద్వౌ=రెండు, సింహర్షభౌ ఇవ=శ్రేష్ఠము లైన సింహములు వలె, మమ కారణాత్=నా కారణము వలె, నూనమ్=నిశ్చయముగా, విశస్తౌ=చంపబడినారు.

తా. ఆ ప్రాణి ఎవరో మృగరూపమును ధరించి మహాబలశాలులైన ఆ రామలక్ష్మణులను, పిడుగు శ్రేష్ఠములైన రెండు సింహములను చంపివేసి నట్లు, నా మూలమున చంపివేసినది. సందేహము లేదు. 9

మూ. నూనం స కాలో మృగరూపధారీ
మామల్పభాగ్యాం లులుభే తదానీమ్,
యత్రార్యపుత్రం విససర్జ మూఢా
రామానుజం లక్ష్మణపూర్వజం చ. 10

ప్ర. అ. నూనమ్=నిజముగా, సః=ఆ, కాలః=కాలము, మృగరూపధారీ=మృగరూపమును ధరించినదై, తదానీమ్=అప్పుడు, అల్పభాగ్యామ్=అల్పమైన భాగ్యము గల, మామ్=నన్ను, లులుభే=లోభపెట్టెను, యత్ర=ఏ సమయమునందు, మూఢా=మూఢురాలనై, రామానుజమ్=లక్ష్మణునీ, లక్ష్మణపూర్వజమ్=లక్ష్మణుని అన్నగారైన, ఆర్యపుత్రం చ=ఆర్యపుత్రునీ విససర్జ=విడచితినో.

తా. నిజముగా ఆనాడు కాలపురుషుడు, మృగము రూపములో వచ్చి దురదృష్టవంతురాలనైన నన్ను లోభపెట్టినాడు. అందుచేతనే, నేను తెలివి తక్కువతనముచే ఆర్యపుత్రునీ, లక్ష్మణునీ కూడ దూరముగా పంపివేసితిని. 10

మూ. హా రామ సత్యవ్రత దీర్ఘబాహో
హా పూర్ణచన్ద్రప్రతిమానవక్త్ర,
హా జీవలోకస్య హితః ప్రియశ్చ
వధ్యాం న మాం వేత్సి హి రాక్షసానామ్. 11

ప్ర. అ. సత్యవ్రత=సత్యనియమవంతుడవూ, దీర్ఘబాహో=దీర్ఘ బాహువులు గలవాడవు అయిన, హా రామ=అయ్యో! రామా! హా! పూర్ణచన్ద్రప్రతిమాన

వక్త్రి=అయ్యో! పూర్ణచంద్రునితో సమాన మైన ముఖము గలవాడా ! హా=అయ్యో! జీవలోకస్య=ప్రాణిలోకమునకు, హితః=హితుడవూ, ప్రియశ్చ= ప్రియుడవూ అయిన నీవు, మామ్=నన్ను, రాక్షసానామ్=రాక్షసులకు, వధ్యామ్=వధ్యురాల నైన దానినిగా, న వేత్సి=ఎరుగవు కదా !

తా. సత్యవ్రతుడవూ, దీర్ఘములైన బాహువులు కలవాడవు అయిన ఓ రామా!చంద్రుని వంటి ముఖము గలవాడా ! అయ్యో!ప్రాణిలోకానికి హితము చేయువాడవు, ప్రియుడవూ అయిన నీకు, నేను రాక్షసుల చేతిలో చిక్కి వధ్యురాలనుగా ఉన్నానని తెలియదు కదా! 11

మూ. అనన్యదైవత్వమియం క్షమా చ
భూమౌ చ శయ్యా నియమశ్చ ధర్మే,
పతివ్రతాత్వం విఫలం మమేదం
కృతం కృతఘ్నేష్వివ మానుషాణామ్. 12

ప్ర. అ. అనన్యదైవత్వమ్=భర్త తప్ప మరి యొక దేవత లేకుండుట, ఇయమ్=ఈ, క్షమా చ=ఓర్పు, భూమౌ=నేలపై, శయ్యా=శయనించుట, ధర్మే= ధర్మమునందు, నియమశ్చ=నియమము, పతివ్రతాత్వమ్=పతివ్రతగా ఉండుట, మమ=నాయొక్క, ఇదమ్=ఇది అంతా, కృతఘ్నేషు=కృతఘ్నుల విషయములో, మానుషాణామ్=మనుష్యుల, కృతమివ=చేయబడినఉపకారాదికము వలె, విఫలమ్= వ్యర్థమై పోయినది.

తా. మనుష్యులు కృతఘ్నులకు చేసిన ఉపకారము ఎట్లు వ్యర్థమైపోవునో, అట్లే, నేను భర్తను తప్ప మరి ఏ దేవుని పూజించకుండుట, ఈ ఓర్పు, నేల మీద శయనించుట, ధర్మనియమము, పతివ్రతాత్వము - ఇవి అన్నీ వ్యర్థమై పోయినవి. 12

మూ. మోఘో హి ధర్మశ్చరితో మయాయం
తథైకపత్నీత్వమిదం నిరర్థమ్,
యా త్వాం న పశ్యామి కృశా వివర్ణా
హీనా త్వయా సంగమనే నిరాశా. 13

ప్ర. అ. యా=ఏ నేను, త్వామ్=నిన్ను, న పశ్యామి=చూచుట లేదో, త్వయా=నీతో, హీనా=హీనురాలనై, సంగమనే=నీ సంగమునందు, నిరాశా=ఆశ లేనిదాననై, కృశా=కృశించి, వివర్ణా=చెడిన రంగు గలదాననై ఉన్నానో, మయా=

అట్టి నాచేత, చరితః=ఆచరింపబడిన, అయమ్=ఈ ధర్మః=ధర్మము, మోఘః హి=వ్యర్థము కదా. తథా=అట్లే, ఇదమ్=ఈ, ఏకపత్నీత్వమ్=పతివ్రతాత్వము కూడ, నిరర్థమ్=వ్యర్థమై పోయినది.

తా. నీకు దూరమై, నిన్ను చూడజాలక, నిన్ను కలుసుకొందుననే ఆశ కూడ లేక, చిక్కి, సౌందర్యము చెడి ఉన్న నేను చేసిన ఈ ధర్మమంతా వ్యర్థమైనది ! ఈ పతివ్రతాత్వము కూడ నిష్ప్రయోజనము ! 13

మూ. పితుర్నిదేశం నియమేన, కృత్వా వనాన్నివృత్తశ్చరితవ్రతశ్చ,
స్త్రీభిస్తు మన్యే విపులేక్షణాభిస్త్వం రంస్యసే వీతభయః కృతార్థః.

ప్ర. అ. త్వమ్=నీవు, పితుః=తండ్రియొక్క, నిదేశమ్=ఆజ్ఞను, నియమేన=నియమముతో, కృత్వా=చేసి, చరితవ్రతశ్చ=ఆచరించబడిన సత్యపాలనవ్రతము కలవాడవై, వనాత్=వనమునుండి, నివృత్తః=మరలినవాడవై, వీతభయః=పోయిన భయము కలవాడవై, కృతార్థః=కృతార్థుడవై, విపులేక్షణాభిః=విశాలము లైన నేత్రములు గల, స్త్రీభిః=స్త్రీలతో, రంస్యసే=క్రీడించగలవు అని, మన్యే=తలచెదను.

తా. నీవు తండ్రి ఆజ్ఞను నియమపూర్వకముగా పాలించి, సత్యవ్రతమును ఆచరించి, వనమునుండి అయోధ్యకు తిరిగి వెళ్ళినవాడవై, కృతార్థుడవై, ఎట్టి భయములు లేక, విశాలములైన నేత్రములు గల స్త్రీలతో విహరించగలవని అనుకొనుచున్నాను. 14

మూ. అహం తు రామ త్వయి జాతకామా చిరం వినాశాయ నిబద్ధభావా,
మోఘం చరిత్వాథ తపో వ్రతఞ్చ త్యక్ష్యామి ధిగ్జీవితమల్పభాగ్యామ్.

ప్ర. అ. రామ=ఓ రామా, త్వయి=నీయందు, జాతకామా=పుట్టిన కోరిక గల, అహం తు=నేనైతే, వినాశాయ=నాశనముకొరకే, చిరమ్=చిరకాలము, నిబద్ధభావా=నీపై నిలపబడిన మనస్సు కందాననై, తపః=తపస్సును, వ్రతం చ=వ్రతమును, మోఘమ్=వ్యర్థముగా, చరిత్వా=ఆచరించి, జీవితమ్=జీవితమును, త్యక్ష్యామి=విడువగలను, అల్పభాగ్యామ్=అల్పమైన భాగ్యము గల నన్ను గూర్చి, ధిక్=నింద అగుగాక.

తా. రామా ! నీయం దనురక్తురాలనగు నేను వినాశము కొరకే నీపై చిరకాలము మనసు నిలిపి, వ్యర్థముగా తపము, ఏకపత్నీవ్రతము చేసి జీవితము విడచిపెట్టెదను. ఛీ ఛీ నే నెంత దురదృష్టవంతురాలను ! 15

మూ. సా జీవితం క్షిప్రమహం త్యజేయం
విషేణ శస్త్రేణ శితేన వాపి,
విషస్య దాతా న హి మేఽస్తి కశ్చి
చ్ఛస్త్రస్య వా వేశ్మని రాక్షసస్య. 16

ప్ర. అ. సా అహమ్=అట్టి నేను, క్షిప్రమ్=శీఘ్రముగా, జీవితమ్=జీవితమును, విషేణ=విషముచేత గాని, శితేన=వాడి యైన, శస్త్రేణ వాపి=ఆయుధముచేత గాని, త్యజేయమ్=విడచేదను, రాక్షసస్య=రాక్షసునియొక్క, వేశ్మని=గృహమునందు, మే=నాకు, విషస్య=విషముయొక్క (ను) గాని, శస్త్రస్య వా=ఆయుధముయొక్క (ను) గాని, దాతా=ఇచ్చువాడు, కశ్చిత్=ఒక్కడూ, నాస్తి=లేడు.

తా. అట్టి నేను విషముచేత గాని, శస్త్రముచేత గాని శీఘ్రముగా నా జీవితము విడచెదను. రాక్షసుని ఇంటిలో నాకు విషముగాని శస్త్రము గాని ఎవ్వడూ ఇవ్వడు గదా! 16

మూ. ఇతీవ దేవీ బహుధా విలప్య
సర్వాత్మనా రామమనుస్మరన్తీ,
ప్రవేపమానా పరిశుష్కవక్త్రా
నగోత్తమం పుష్పితమాససాద. 17

ప్ర. అ. దేవీ=సీత, ఇతీవ=ఇట్లు, బహుధా=అనేకవిధములుగా, విలప్య=విలపించి, సర్వాత్మనా=అన్ని విధములా, రామమ్=రాముని, అనుస్మరన్తీ=స్మరించుచున్నదై, ప్రవేపమానా=వణికిపోవుచు, పరిశుష్కవక్త్రా=ఎండిన ముఖము గలదై, పుష్పితమ్=పుష్పించిన, నగోత్తమమ్=శ్రేష్ఠమైన వృక్షమును, ఆససాద=సమీపించెను.

తా. సీత ఇట్లు అనేకవిధములుగా విలపించి, సర్వవిధాల రామునే స్మరించుచు, వణకిపోవుచున్నదై, ఎండిపోయిన ముఖముతో పుష్పించిన ఆ ఉత్తమవృక్షము దగ్గరకు వెళ్ళెను. 17

మూ. సా శోకతప్తా బహుధా విచిన్త్య
సీతాథ వేణ్యుద్గ్రథనం గృహీత్వా,
ఉద్బధ్య వేణ్యుద్గ్రథనేన శీఘ్ర
మహం గమిష్యామి యమస్య మూలమ్. 18

ప్ర. అ. శోకాభితప్తా=శోకముచే తపింపచేయబడిన, సీతా=సీత, బహుధా=అనేకవిధములుగా, విచిన్త్య=ఆలోచించి, అథ=అటు పిమ్మట, వేణ్యుద్గ్రథనమ్=జడ అను ఉరిత్రాడును, గృహీత్వా=గ్రహించి, అహమ్=నేను, వేణ్యుద్గ్రథనేన=జడ అను

ఉరిత్రాడుతో, ఉద్బధ్య=ఉరివేసికొని, శీఘ్రమ్=శీఘ్రముగా, యమస్య=యముని యొక్క మూలమ్=సమీపమును, గమిష్యామి=వెళ్ళెదను (అని నిర్ణయించుకొనెను).

తా. శోకములో బాధపడుచున్న సీత ఇట్లు అనేక విధముల ఆలోచించి ఉరిత్రాడు వలె ఉన్న జడను చేతితో పట్టుకొని, ఇట్లు నిర్ణయించెను. "నేను జడను ఉరిపోసికొని, శీఘ్రముగా యమలోకమునకు వెళ్ళెదను." 18

మూ. ఉపస్థితా సా మృదుసర్వగాత్రీ
శాఖాం గృహీత్వాథ నగస్య తస్య,
తస్యాస్తు రామం ప్రవిచిన్తయన్త్యా
రామానుజం స్వం చ కులం శుభాఙ్గ్యాః. 19

శోకానిమిత్తాని తథా బహూని
ధైర్యార్జితాని ప్రవరాణి లోకే,
ప్రాదుర్నిమిత్తాని తదా బభూవుః
పురాపి సిద్ధాన్యుపలక్షితాని. 20

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే సున్దరకాణ్డే
అష్టావింశః సర్గః.

ప్ర. అ. అథ=అటు పిమ్మట, మృదుసర్వగాత్రీ=మృదువైన సకలావయవములు గల, సా=ఆ సీత, తస్య=ఆ, నగస్య=వృక్షముయొక్క, శాఖామ్=కొమ్మను, గృహీత్వా=గ్రహించి, ఉపస్థితా=నించినది. రామమ్=రామునీ, రామానుజమ్=లక్ష్మణునీ, స్వం కులం చ=తన కులమునూ గూర్చి, ప్రవిచిన్తయన్త్యాః=ఆలోచించుచున్న, శుభాఙ్గ్యాః=శుభకర మైన అవయవములు గల, తస్యాః తు=ఆమెకు, తదా=అప్పుడు, శోకానిమిత్తాని=శోకమునకు నిమిత్తము కానివి, ధైర్యార్జితాని=సంపాదింపబడిన ధైర్యము గలవీ, లోకే=లోకమునందు, ప్రవరాణి=శ్రేష్ఠ మైనవీ, తథా=మరియు, పురాపి=పూర్వము కూడ, సిద్ధాని=సఫలము లైనవిగా ఉపలక్షితాని=చూడబడిన, బహూని=అనేకము లైన, నిమిత్తాని=శకునములు, ప్రాదుర్బభూవుః=ఆవిర్భవించెను.

తా. మృదువైన సకలావయవములు గల ఆ సీత ఆ వృక్షశాఖను గ్రహించి నిలిచెను. రాముని, లక్ష్మణుని, తన కులమును గూర్చి ఆలోచించుచున్న, శుభ మైన అవయవములు గల ఆ సీతకు ధైర్యమును కలిగించు అనేకము లైన శుభశకునములు కనబడెను. శోకమును తొలగించేవి, అత్యుత్తమములుగా

లోకములో ప్రసిద్ధములైనవీ అయిన ఆ శకునములు పూర్వము కూడ అనేక పర్యాయములు కనబడి సఫలములయ్యెను.

వి. రావణుడు సీతను అపహరించి లంకలో ప్రవేశపెట్టినది మొదలు ప్రతి దినము ఆతడు, రాక్షసస్త్రీలు ఆమెను పరుషవాక్యములతో భయపెట్టుచునే ఉండి ఉందురని మనము ఊహించుకొనవచ్చును. ఈ విధముగా పది మాసములనుండి బాధపడుచున్న సీత ఆనాడే, హనుమంతుడు అక్కడకు చేరిన దినమునందే, ఉరిపోసికొని ఆత్మహత్య చేసికొనవలెనని అనుకొన్నదనుట సమంజసముగా లేదు. అంతే కాకుండా సీత వంటి మహాధర్మాత్మురాలు ఆత్మహత్య వంటి పాపకార్యమునకు ఒడికట్టుననుట ఆమె చరిత్రకే కళంకము. ప్రాచ్యప్రతిలో ఈ ఆత్మహత్యాప్రయత్నప్రస్తావము కాని చివరికి "నాకెవ్వరైనా విషము గాని, శస్త్రముగాని ఇచ్చిన బాగుండెడిది" అని ఆమె అనుకొన్న మాటలు కాని లేవు. 19, 20

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు సుందరకాండలో ఇరువదిఎనిమిదవ సర్గ సమాప్తము.

అథ ఏకోనత్రింశః సర్గః

[సీతకు కొన్ని శుభశకునములు కనబడుట.]

మూ. తథాగతాం తాం వ్యథితామనిన్దితాం
వ్యపేతహర్షాం పరిదీనమానసామ్,
శుభాం నిమిత్తాని శుభాని భేజిరే
నరం శ్రియా జుష్టమివోపజీవినః. 1

ప్ర. అ. తథాగతామ్=అట్టి పరిస్థితులలో ఉన్నదీ, వ్యథితామ్=వ్యథ చెందినదీ, అనిన్దితామ్=నిందింపబడనిదీ, వ్యపేతహర్షామ్=తొలగిన ఆనందము కలదీ, పరిదీనమానసామ్=దీనమైన మనస్సు కలదీ, శుభామ్=మంగళప్రదురాలూ అయిన, తామ్=ఆమెను, శ్రియా=ఐశ్వర్యముచే, జుష్టమ్=పొందబడిన, నరమ్=నరుని, ఉపజీవినః ఇవ=ఆతనిపై ఆధారపడి జీవించు భృత్యులు వలె, శుభాని=శుభములైన, నిమిత్తాని=శకునములు, భేజిరే=సేవించినవి.

తా. వ్యథ చెంది, సంతోషము లేక దీనమైన మనస్సుతో ఉన్న దోషములేక శూన్య యైన, మంగళప్రదురాలైన ఆ సీతను, ఐశ్వర్యము లభించిన మనుష్యుని భృత్యులందరూ వచ్చి చేరినట్లు, శుభశకునములు వచ్చి చేరినవి. (సీతకు శుభశకునములు కనబడినవి.) 1

మూ. తస్యాః శుభం వామమరాళపక్ష్మ
రాజీవృతం కృష్ణవిశాలశుక్లమ్,
ప్రాస్పన్దతైకం నయనం సుకేశ్యా
మీనాహతం పద్మమివాభితామ్రమ్. 2

ప్ర. అ. సుకేశ్యాః=అందమైన కేశపాశము గల, తస్యాః=ఆమె యొక్క, శుభమ్=మంగళకర మైనదీ, అరాలపక్ష్మరాజీవృతమ్=వంకర యైన రెప్పల వెండ్రుకల పంక్తి కలదీ, కృష్ణవిశాలశుక్లమ్=నల్లగాను, విశాలముగాను తెల్లగాను ఉన్నదీ అయిన, వామనయనమ్=ఎడమ నేత్రము, మీనాహతమ్=మీనముచేత కొట్టబడిన, అభితామ్రమ్=ఎఱ్ఱనైన, ఏకమ్=ఒక, పద్మమివ=పద్మము వలె, ప్రాస్పన్దత=అదిరెను.

తా. అందమైన కేశములు గల ఆ సీత వామనయనము వంకరగా ఉన్న రెప్పల వెండ్రుకల పంక్తితో, శుభకరమై , విశాలముగాను, నల్లగాను తెల్లగాను ఉండెను. ఆ వామనయనము, మీనము తాకిడికి ఎట్టిని పద్మమొకటి కదలినట్లు అదరెను. 2

మూ. భుజశ్చ చార్వఞ్చితపీనవృత్తః
పరార్ధ్యకాలాగురుచన్దనార్హః,
అనుత్తమేనాధ్యుషితః ప్రియేణ
చిరేణ వామః సమవేపతాశు. 3

ప్ర. అ. చార్వఞ్చితపీనవృత్తః=అందమైనది, ఉత్తమము, బలసినది, వర్తులమూ అయినది, పరార్ధ్యకాలాగురుచన్దనార్హః=శ్రేష్ఠమైన కాలాగురుకు చందనమునకు తగినది, అనుత్తమేన=మిక్కిలి ఉత్తముడైన, ప్రియేణ=ప్రియునిచేత, చిరేణ=చిరకాలము, అధ్యుషితః=అధిష్ఠింపబడినదీ అయిన, వామః భుజశ్చ=ఎడమ భుజము కూడ, ఆశు=శీఘ్రముగా, సమవేపత=అదరెను.

తా. సీతాదేవి ఎడమభుజము చక్కగా, చూచుటకు ముచ్చట గొల్పుచు బలిసి, వృత్తముగా (గుండ్రముగా) ఉండెను. అది శ్రేష్ఠమైన అగురువు, చందనము పూసికొనుటకు తగినది. చాలకాలము ఆ భుజమును తలగడగా చేసికొని అత్యుత్తమపురుషుడైన రాముడు శయనించుచుండెడివాడు. అట్టి భుజముకూడ వెంటనే అదరెను. 3

మూ గజేన్ద్రహస్తప్రతిమశ్చ పీన
స్తయోర్ద్వయోః సంహతయోః సుజాతః,
ప్రస్పన్దమానః పునరూరురస్యా
రామం పురస్తాత్ స్థితమాచచక్షే. 4

ప్ర. అ. సంహతయోః=దగ్గరగా కలిసి ఉన్న, తయోః ద్వయోః=ఆ రెండు తొడలలో, గజేన్ద్రహస్తప్రతిమః=ఏనుగు తొండముతో సమానమూ, పీనః=బలిసినదీ, సుజాతః=సుందరముగా అయిన, అస్యాః ఊరుః=ఈమె యొక్క (ఎడమ) తొడ, ప్రస్పన్దమానః=అదురుచు, రామమ్=రాముని, పురస్తాత్=ఎదుటనే, స్థితమ్=ఉన్నవానినిగా, అచచక్షే=చెప్పెను.

తా. దగ్గరగా కలసి ఉన్న ఆమె రెండు తొడలతో ఒక ఎడమ తొడ అదురుచు రాముడు ఎదుటనే ఉన్నాడని ఆమెకు చెప్పెను. సుందరమైన ఆ తొడ ఏనుగు తొండము వలె బలిసి ఉండెను.

వి. రెండు తొడలలో ఒకటి ఈ విధముగా ఉన్నది అని విశేషణములు వేయుటచే రెండవది మరొక విధముగా ఉన్నట్లు తోచును. అందుచేత ప్రాచ్యపాఠము బాగున్నది.

"గజేన్ద్రహస్తప్రతిమశ్చ పీనః పీతోరురేకః సుశుభః సుజాతః,
ప్రస్పన్దమానః కనకావదాతో రామం పురస్తాత్ స్థితమాచచక్షే."

అని ఆ పాఠము. "కనకావదాతః=బంగారము వలె పరిశుద్ధమూ, సుశుభః=చాల శుభకరమూ అయిన, ఏకః=ఒక, పీతోరుః=పచ్చనితొడ.........అని అర్థము. 4

మూ. శుభం పునర్హేమసమానవర్ణ
మీషద్రజోధ్వస్తమివామలాక్ష్యాః,
వాసః స్థితాయాః శిఖరాగ్రదన్త్యాః
కించిత్ పరిస్రంసత చారుగాత్ర్యాః. 5

ప్ర. అ. పునః=మరియు, అమలాక్ష్యాః=నిర్మలము లైన నేత్రములు గలదీ, శిఖరాగ్రదన్త్యాః=మొనలు అగ్రమునందు గల దంతములు గలదీ, చారుగాత్ర్యాః=అందమైన శరీరము గలదీ, స్థితాయాః=నిలచి ఉన్నదీ అయిన సీతయొక్క, శుభమ్=మంగళప్రదమైనదీ, హేమసమానవర్ణమ్=బంగారముతో సమానమైన వర్ణము గలదీ, ఈషత్=కొంచెము, రజోధ్వస్తమివ=పరాగముచేత మలినముగా ఉన్నట్లున్నది, వాసః=వస్త్రము, కించిత్=కొంచెము, పరిస్రంసత=జారెను.

తా. నిర్మలములైన నేత్రములు, కొనలు తేలిన దంతములు, అందమైన శరీరమూ గల ఆ సీత నిలచి ఉండగా, మంగళప్రదమూ, బంగారముతో సమానమైన రంగు గలదీ, పరాగము కప్పివేయుటచే కొంచెము కాంతి విహీనముగా ఉన్నదీ అయిన వస్త్రము, కొంచెము జారెను. 5

మూ. ఏతైర్నిమిత్తైరపరైశ్చ సుభ్రూః
సంబోధితా ప్రాగపి సాధు సిద్ధైః,
వాతాతపక్లాన్తమివ ప్రణష్టం
వర్షేణ బీజం ప్రతిసంజహర్ష. 6

ప్ర. అ. ప్రాగపి=పూర్వము కూడ, సాధు=బాగుగా, సిద్ధైః=సఫలము లైన, ఏతైః=ఈ, నిమిత్తైః=నిమిత్తములచేతను, అపరైశ్చ=మరికొన్ని ఇతర నిమిత్తములచే

తను, సంబోధితా=బోధింపబడిన, సుభ్రూః=అందమైన కనుబొమ్మలు గల సీత, వాతాతపక్లాన్తమ్=గాలిచేతా, ఎండచేతా వాడిపోయిన, ప్రణష్టమ్=కనబడకుండా పోయిన, బీజమ్=బీజము, వర్షేణ ఇవ=వర్షముచేత వలె, ప్రతిసంజహర్ష=సంతోషించెను.

తా. పూర్వము కూడ అనేక పర్యాయములు సత్ఫలమును ఇచ్చిన ఈ శకునములు శుభము రానున్నదని సూచించుటచే, మంచి కనుబొమ్మలు గల సీత, గాలికీ ఎండకూ ఎండిపోయి, కనబడకుండా పోయిన విత్తనము వర్షము కురియగానే మొలకెత్తినట్లు ఆనందించెను. 6

మూ. తస్యాః పునర్బింబఫలాధరోష్ఠం
స్వక్షిభ్రుకేశాన్తమరాళపక్ష్మ,
వక్త్రం బభాసే సితశుక్లదంష్ట్రం
రాహోర్ముఖాచ్చన్ద్ర ఇవ ప్రముక్తః. 7

ప్ర. అ. ("సితశుక్లదంష్ట్రమ్" అను పాఠము కంటె 'సితచారుదన్తమ్' అను ప్రాచ్యపాఠము బాగున్నది) పునః=మరియు, తస్యాః=ఆమెయొక్క, బింబఫలాధరోష్ఠమ్=దొండపండు వంటి అధరోష్ఠము కలదీ, స్వక్షిభ్రుకేశాన్తమ్=అందమైన నేత్రములూ, కనుబొమ్మలూ కలదీ, అరాళపక్ష్మ=వక్రమైన రెప్పలు కలదీ, సితచారుదన్తమ్=తెల్లని అందమైన దంతములు కలదీ, అయిన, వక్త్రమ్=ముఖము, రాహోః=రాహువుయొక్క, ముఖాత్=ముఖము నుండి, ప్రముక్తః=విడవబడిన, చన్ద్రః ఇవ=చంద్రుడు వలెనే,బభాసే=ప్రకాశించెను.

తా. దొండపండు వంటి అధరోష్ఠమూ, అందమైన నేత్రములు, కనుబొమ్మలు కేశాంతములూ, వంకరయైన రెప్పలూ, తెల్లని అందమైన దంతములూ గల ఆమె ముఖము రాహుముఖము నుండి బైటకు వచ్చిన చంద్రబింబము వలె, ప్రకాశించెను.

మూ. సా వీతశోకా వ్యపనీతతన్ద్రీ
శాన్తజ్వరా హర్షవిబుద్ధసత్త్వా,
అశోభతార్యా వదనేన శుక్లే
శీతాంశునా రాత్రిరివోదితేన. 8

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే సున్దరకాణ్డే
ఏకోనత్రింశః సర్గః.

ప్ర. అ. ఆర్యా=పూజ్యురాలైన, సా=ఆ సీత, వీతశోకా=తొలగిపోయిన శోకము గలదై, వ్యపనీతతన్ద్రీ=తొలగింపబడిన అలసత్వము గలదై, శాన్తజ్వరా=శాంతించిన మనస్తాపము కలదై, హర్షవిబుద్ధసత్త్వా=సంతోషముతో వికసించిన మనస్సు కలదై, వదనేన=ముఖముచేత, శుక్లే=శుక్లపక్షమునందు, ఉదితేన=ఉదయించిన, శీతాంశునా=చంద్రునిచేత, రాత్రిరివ=రాత్రివలె, అశోభత=ప్రకాశించెను.

తా. పూజ్యురాలైన ఆ సీతకు శోకము తొలగెను. అలసత్వము పోయెను. మానసికసంతాపము శాంతించెను. సంతోషముతో మనస్సు వికసించెను. అప్పుడామె తేజోవంతమైన ముఖముతో, శుక్లపక్షమునందు ఉదయించిన చంద్రునితో రాత్రి ప్రకాశించునట్లు ప్రకాశించెను. 8

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు
సుందరకాండలో ఇరువదితొమ్మిదవ సర్గ సమాప్తము

అథ త్రింశః సర్గః

[సీతతో ఎట్లు సంభాషణము చేయవలెనా అని హనుమంతుడు ఆలోచిం చుట.]

మూ. హనుమానపి విక్రాన్తః సర్వం శుశ్రావ తత్త్వతః,
సీతాయాస్త్రిజటాయాశ్చ రాక్షసీనాం చ తర్జనమ్. 1

ప్ర. అ. విక్రాన్తః=పరాక్రమవంతుడైన, హనుమానపి=హనుమంతుడు కూడా, సీతాయాశ్చ=సీతయొక్కా, త్రిజటాయాశ్చ=త్రిజటయొక్కా, సర్వమ్=వాక్యము నంతనూ, రాక్షసీనామ్=రాక్షసస్త్రీలయొక్క, తర్జనమ్=భయపెట్టుటను, తత్త్వతః=యథార్థముగా, శుశ్రావ=వినెను.

తా. పరాక్రమశాలియైన హనుమంతుడు కూడా, సీత మాటలను, త్రిజట స్వప్నవృత్తాంతమును, రాక్షసస్త్రీలు భయపెట్టుచు పలికిన మాటలను, సర్వమును, యథాతథముగ వినెను. 1

మూ. అవేక్షమాణస్తాం దేవీం దేవతామివ నన్దనే,
తతో బహువిధాం చిన్తాం చిన్తయామాస వానరః. 2

ప్ర. అ. తతః=అటు పిమ్మట, వానరః=హనుమంతుడు, నన్దనే=నందనవనమునందు, దేవతామివ=దేవతను వలె, తాం దేవీమ్=ఆ సీతాదేవిని, అవేక్షమాణః=చూచుచు, బహువిధామ్=అనేకవిధములైన, చిన్తామ్=ఆలోచనను, చిన్తయామాస=ఆలోచించెను.

తా. పిమ్మట ఆ హనుమంతుడు, నందనవనములో ఉన్న దేవతాస్త్రీ వలె ఉన్న ఆ సీతాదేవిని చూచుచు, అనేక విధముల ఆలోచించెను. 2

మూ. యాం కపీనాం సహస్రాణి సుబహూన్యయుతాని చ,
దిక్షు సర్వాసు మార్గన్తే సేయమాసాదితా మయా. 3

ప్ర. అ. కపీనామ్=వానరులయొక్క, సుబహూని=అనేకములైన, సహస్రాణి=సహస్రములు, అయుతాని చ=అయుతములు, సర్వాసు=సమస్తమైన, దిక్షు=దిక్కులందు, యామ్=ఏ సీతను, మార్గన్తే=వెదకుచున్నవో, సా ఇయమ్=అట్టి ఈ సీత, మయా=నాచేత, ఆసాదితా=పొందబడినది.

తా. ఎన్నో వేలకొలది, అయుతముల కొలది (పదివేలు=అయుతము) వానరులు సకలదిక్కులందు ఏ సీతకై వెదకుచున్నారో ఆమెను నేను చూడగలిగి నాను. 3

మూ. చారేణ తు సుయుక్తేన శత్రోః శక్తిమవేక్షతా,
గూఢేన చరతా తావదవేక్షితమిదం మయా. 4

ప్ర. అ. ("శత్రోః శక్తివ్యపేక్షయా" అను ప్రాచ్యపాఠము బాగున్నది.) సుయుక్తేన=చాల జాగర్తగా ఉన్నవాడనూ, శత్రోః=శత్రువుయొక్క, శక్తివ్యపేక్షయా=శక్తియొక్క దృష్టిచేత, గూఢేన=గూఢుడనై, చరతా=సంచరించుచున్నవాడనూ, చారేణ=గూఢచారినీ అయిన, మయా=నాచేత, ఇదమ్=ఇది, అవేక్షితం తావత్=చూడబడినది.

తా. నేను శత్రుబలమును దృష్టిలో నుంచుకొని అతిజాగరూకతతో, గూఢముగా, గూఢచారివలె సంచరించుచు ఈ విషయము లన్నీ తెలుసుకొన్నాను.

మూ. రాక్షసానాం విశేషశ్చ పురీ చేయమవేక్షితా,
రాక్షసాధిపతేరస్య ప్రభావో రావణస్య చ. 5

ప్ర. అ. రాక్షసానామ్=రాక్షసులయొక్క, విశేషశ్చ=విశేషము (చూడబడినది.) ఇయమ్=ఈ, పురీ చ=పట్టణము, అవేక్షితా=చూడబడినది, అస్య=ఈ, రాక్షసాధిపతేః=రాక్షసరాజైన, రావణస్య=రావణునియొక్క, ప్రభావశ్చ=ప్రభావము కూడా, చూడబడినది.

తా. రాక్షసుల విశేషమును, ఈ పురమును, రాక్షసాధిపతియైన రావణుని ప్రభావమును చూచినాను. 5

మూ. యుక్తం తస్యాప్రమేయస్య సర్వసత్త్వదయావతః,
సమాశ్వాసయితుం భార్యాం పతిదర్శనకాంక్షిణీమ్. 6

ప్ర. అ. సర్వసత్త్వదయావతః=సకలప్రాణులందు దయ గలవాడు, అప్రమేయస్య=ఊహింప శక్యము కాని ప్రభావము కలవాడూ అయిన, తస్య=ఆ రాముని యొక్క, పతిదర్శనకాంక్షిణీమ్=భర్తయొక్క దర్శనము కోరుచున్న, భార్యామ్=భార్యయైన సీతను, సమాశ్వాసయితుమ్=ఊరడింపచేయుటకు, యుక్తమ్=యుక్తము.

తా. సకలప్రాణులందు దయ గల, ఊహింపశక్యము కాని ప్రభావము గల రాముని భార్య పతిదర్శనమునకై తల్లడిల్లుచున్నది. ఈమెను ఓదార్చుట యుక్తము. 6

మూ. అహమాశ్వాసయామ్యేనాం పూర్ణచన్ద్రనిభాననామ్,
అదృష్టదుఃఖాం దుఃఖార్తాం దుఃఖస్యాంతమగచ్ఛతీమ్. 7

ప్ర. అ. పూర్ణచన్ద్రనిభాననామ్=పూర్ణచంద్రునితో సమానమైన ముఖము కలదీ, అదృష్టదుఃఖామ్=చూడబడని దుఃఖము కలదీ, దుఃఖార్తామ్=దుఃఖము చేత పీడింపబడినదీ, దుఃఖస్య=దుఃఖముయొక్క, అన్తమ్= అంతమును, అగచ్ఛతీమ్=పొందనిదీ అయిన, ఏనామ్=ఈమెను, అహమ్=నేను, ఆశ్వాసయామి=ఓదార్చెదను.

తా. పూర్ణచంద్రుని వంటి ముఖము గల ఈ సీత పూర్వమెన్నడూ ఇట్టి దుఃఖములనుభవించలేదు. ఇపుడు దుఃఖార్తురాలై ఈ దుఃఖమునకు అంతముచూడజాలకున్నది. అట్టి ఈమెను ఓదార్చెదను. 7

మూ. యద్యప్యహమిమాం దేవీం శోకోపహతచేతనామ్,
అనాశ్వాస్య గమిష్యామి దోషవద్గమనం భవేత్. 8

ప్ర. అ. శోకోపహతచేతనామపి=శోకముచేత పీడింపబడిన బుద్ధి గలదైనను, ఇమాం దేవీమ్=ఈ దేవిని, అహమ్=నేను, అనాశ్వాస్య=ఓదార్చకుండగా, యది గమిష్యామి=వెళ్ళినట్లయితే, గమనమ్=నా గమనము, దోషవత్=దోషము గలది, భవేత్=అగును.

తా. ఈ సీత శోకముచేత వికలమైన మనస్సుతో బాధపడుచున్నపుడు కూడా నేను ఈమెను ఓదార్చకుండా తిరిగివెళ్ళినచో నా గమనము పొరబాటే అగును. 8

మూ. గతే హి మయి తత్రేయం రాజపుత్రీ యశస్వినీ,
పరిత్రాణమవిన్దన్తీ జానకీ జీవితం త్యజేత్. 9

ప్ర. అ. మయి=నేను, తత్ర=అక్కడికి, గతే=వెళ్ళినవాడనగు చుండగా, యశస్వినీ=కీర్తిమంతురాలు, రాజపుత్రీ=రాజకుమారి అయిన, జానకీ=సీత, పరిత్రాణమ్=రక్షణమును, అవిన్దన్తీ=పొందనిదై, జీవితమ్=జీవితమును, త్యజేత్=విడువవచ్చును.

తా. నేను తిరిగి వెళ్ళిపోయిన పిమ్మట రాజకుమారి, కీర్తిమంతురాలు అయిన సీత, రక్షణోపాయమేదీ లభించక ప్రాణత్యాగము చేయవచ్చును. 9

మూ. మయా చ స మహాబాహుః పూర్ణచన్ద్రనిభాననః,
సమాశ్వాసయితుం న్యాయ్యః సీతాదర్శనలాలసః. 10

ప్ర. అ. మహాబాహుః=గొప్ప బాహువులు కలవాడు, పూర్ణచన్ద్రని భాననః=పూర్ణచంద్రునితో సమానమైన ముఖము కలవాడు, సీతాదర్శనలాలసః=సీతాదర్శనమునందు అత్యాసక్తి కలవాడు అయిన, సః=ఆ రాముడు, మయా=నాచేత, సమాశ్వాసయితుమ్=ఓదార్చుటకు, న్యాయ్యః=తగినవాడు.

తా. పూర్ణచంద్రుని వంటి ముఖము కలవాడు, మహాబాహువు అయిన ఆ రాముడు సీతను చూడవలెనని చాల ఆసక్తితో ఉన్నాడు. అట్టి రాముని ఓదార్చుట కూడ నా కర్తవ్యము. 10

మూ. నిశాచరీణాం ప్రత్యక్షమనర్హం చాభిభాషితమ్,
కథన్ను ఖలు కర్తవ్యమిదం కృచ్ఛ్రగతో హ్యహమ్. 11

ప్ర. అ. నిశాచరీణామ్=రాక్షసస్త్రీలయొక్క, ప్రత్యక్షమ్=ఎదుట, అభిభాషితమ్=మాటలాడుట, అనర్హమ్=తగినది కాదు. ఇదమ్=ఇది, కథమ్=ఎట్లు, కర్తవ్యం ఖలు ను=చేయదగినదో, అహమ్=నేను, కృచ్ఛ్రగతో హి=కష్టాలలో ఉన్నాను కదా.

తా. రాక్షసస్త్రీల ఎదుట మాటలాడుట యుక్తము కాదు. ఇప్పుడు ఈ పని నే నెట్లు చేయవలెనో కదా ! నేను కష్టపరిస్థితిలో చిక్కుకొన్నాను. 11

మూ. అనేన రాత్రిశేషేణ యది నాశ్వాస్యతే మయా,
సర్వథా నాస్తి సన్దేహః పరిత్యక్ష్యతి జీవితమ్. 12

ప్ర. అ. అనేన=ఈ, రాత్రిశేషేణ=రాత్రియొక్క మిగిలిన భాగము చేత, మయా=నాచేత, నాశ్వాస్యతే యది=ఓదార్చబడకపోయినచో, జీవితమ్=జీవితమును, పరిత్యక్ష్యతి=విడువగలదు, సర్వథా=అన్ని విధముల, సన్దేహః=సందేహము, నాస్తి=లేదు.

తా. తెల్లవారేలోగా నేను ఈమెను ఓదార్చకున్నచో తప్పక ఈమె ప్రాణములను త్యజించును. సందేహము లేదు. 12

మూ. రామశ్చ యది పృచ్ఛేన్మాం కిం మాం సీతాబ్రవీద్వచః,
కిమహం తం ప్రతి బ్రూయామసంభాష్య సుమధ్యమామ్. 13

ప్ర. అ. సీతా=సీత, మామ్=నన్ను గూర్చి, కిమ్=ఏమి, వచః=వచనమును, అబ్రవీత్=పలికెను అని, రామశ్చ=రాముడు, మామ్=నన్ను, పృచ్ఛేద్యది=అడిగినట్లయితే, సుమధ్యమామ్=మంచి నడుము గల ఈ సీతను గూర్చి, అసంభాష్య=మాటలాడకుండగా, అహమ్=నేను, తం ప్రతి=ఆ రాముని గూర్చి, కిమ్=ఏమి, బ్రూయామ్=పలుకుదును !

తా. నేను సీతతో మాటలాడకుండనే వెళ్ళిన పిమ్మట- "సీత నాతో ఏమి చెప్పమన్నది" అని రాముడు అడిగినచో నే నాతనికి ఏమి సమాధానము చెప్పగలను ? 13

మూ. సీతాసన్దేశరహితం మామితస్త్వరయాగతమ్,
నిర్దహేదపి కాకుత్థ్సః క్రుద్ధస్తీవ్రేణ చక్షుషా. 14

ప్ర. అ. సీతాసన్దేశరహితమ్=సీతసందేశము లేనివాడనై, ఇతః=ఇక్కడి నుండి, త్వరయా=తొందరతో, గతమ్=వెళ్ళిన, మామ్=నన్ను, కాకుత్థ్సః=రాముడు, క్రుద్ధః=కోపగించినవాడై, తీవ్రేణ=తీవ్రమైన, చక్షుషా=నేత్రముతో, నిర్దహేదపి=కాల్చివేయును కూడ.

తా. నేను సీత సందేశమేదీ తీసికొనకుండా, ఇక్కడినుంచి తొందరగా వెళ్ళిపోయినచో రాముడు కోపించి తీవ్రమైన దృష్టితో కాల్చివేయును గూడ.14

మూ. యది చోద్యోజయిష్యామి భర్తారం రామకారణాత్,
వ్యర్థమాగమనం తస్య ససైన్యస్య భవిష్యతి. 15

ప్ర. అ. రామకారణాత్=రాముని నిమిత్తమై, భర్తారమ్=ప్రభువైన సుగ్రీవుని, యది చ ఉద్యోజయిష్యామి=ప్రయత్నవంతుని చేసినచో, ససైన్యస్య=సైన్యముతో కూడిన, తస్య=ఆతనియొక్క, ఆగమనమ్=రాక, వ్యర్థమ్=వ్యర్థము, భవిష్యతి=కాగలదు.

తా. నేను సుగ్రీవుని రామునికి సాహాయ్యము చేయుటకై బయలుదేరతీసి తీసుకొనివచ్చినచో, ఈలోగా సీత మరణించినచో సేనాసహితుడైన ఆతని రాక వ్యర్థమై పోవును. 15

మూ. అన్తరం త్వహమాసాద్య రాక్షసీనామిహ స్థితః,
శనైరాశ్వాసయిష్యామి సంతాపబహుళామిమామ్. 16

ప్ర. అ. అహమ్=నేను, ఇహ=ఇక్కడ, స్థితః=ఉన్నవాడ నై, రాక్షసీనామ్=రాక్షసస్త్రీలలో, అన్తరమ్=అవకాశమును, ఆసాద్య=పొంది, సంతాపబాహుళామ్=అధికమైన దుఃఖము గల, ఇమామ్=ఈమెను, శనైః=మెల్లగా, ఆశ్వాసయిష్యామి=ఓదార్చెదను.

తా. నేను ఇక్కడనే ఉండి, ఈ రాక్షసస్త్రీలు కొంచెము ఏమరుపాటుతో ఉన్నప్పుడు చాలా దుఃఖపడుచున్న ఈ సీతను మెల్లగా ఓదార్చెదను. 16

మూ. అహం హ్యతితనుశ్చైవ వానరశ్చ విశేషతః,
వాచం చోదాహరిష్యామి మానుషీమిహ సంస్కృతామ్. 17

ప్ర. అ. అహం తు=నేనైతే, అతితనుశ్చ=చాల సూక్ష్మముగా ఉన్నాను; విశేషతః=విశేషించి, వానరశ్చ=వానరుడను, ఇహ=ఇప్పుడు, సంస్కృతామ్=సంస్కృతమైన, మానుషీమ్=మనుష్యసంబంధమైన, వాచం చ=వాక్కును కూడ, ఉదాహరిష్యామి=పలకగలను.

తా. ఇప్పుడు చాల చిన్న శరీరముతో ఉన్న నేను, విశేషించి వానరుడనై యుండి, సంస్కృతమైన మనుష్యవాక్కును ఉచ్చరించవలసి ఉన్నది.

వి. నేను చాలా చిన్నదైన శరీరము గల వానరుడనై ఉండి మనుష్య వాక్కుతో మాటలాడవలసి ఉన్నది. అప్పుడు సీత ఎట్లు నమ్మును ! అని ఈ శ్లోకభావమై ఉండును. ఈ భావమే రాబోవు శ్లోకములో స్పష్టీకరింపబడినది. నేను మనుష్యభాషలో మాటలాడతాను కాబట్టి ఈ రాక్షసస్త్రీలకు అర్థము కాదులే అను భావము అంత యుక్తముగా కనిపించదు. ఏ భాషలో మాటలాడినా సీతతో మాటలాడుచు రాక్షసస్త్రీలకు కనబడినచో ప్రమాదమే కదా ! 18వ శ్లోకం దృష్ట్యా ఈ శ్లోకం అనవసరము. ఈ శ్లోకం ప్రాచ్యపాఠంలో లేదు. 17

మూ. యది వాచం ప్రదాస్యామి ద్విజాతిరివ సంస్కృతామ్,
రావణం మన్యమానా మాం సీతా భీతా భవిష్యతి. 18
వానరస్య విశేషేణ కథం స్యాదభిభాషణమ్.

ప్ర. అ. ద్విజాతిరివ=ద్విజుడు వలె, సంస్కృతామ్=సంస్కృతమైన, వాచమ్=వాక్కును, ప్రదాస్యామి యది=ఇచ్చినట్లైతే (పలికినట్లైతే), సీతా=సీత, మామ్=నన్ను, రావణమ్=రావణునిగా, మన్యమానా=తలచుచు, భీతా భవిష్యతి=భయపడగలదు. విశేషేణ=విశేషించి, వానరస్య=వానరునకు, అభిభాషణమ్=మాటలాడుట, కథమ్=ఎట్లు, స్యాత్=అగును ?

తా. నేను ద్విజుడు వలె సంస్కృతమైన భాషలో మాటలాడినచో నన్ను రావణుడని తలచి సీత భయపడును. విశేషించి, వానరుడు మాటలాడుట అనునది అసంభావ్యము కదా ! 18

మూ. అవశ్యమేవ వక్తవ్యం మానుషం వాక్యమర్థవత్, 19
మయా సాన్త్వయితుం శక్యా నాన్యథేయమనిన్దితా.

ప్ర. అ. అవశ్యమేవ=తప్పక, మయా=నాచేత, అర్థవత్=అర్థము గల, మానుషమ్=మనుష్యసంబంధమైన, వాక్యమ్=వాక్యము, వక్తవ్యమ్=చెప్పదగియున్నది. అనిన్దితా=నిందింపబడని, ఇయమ్=ఈమె, అన్యథా=మరియొక విధముగా, సాన్త్వయితుమ్=ఓదార్చుటకు, శక్యా=శక్యమైనది కాదు.

తా. స్పష్టమైన అర్థమును బోధించు మనుష్యవాక్కులోనే మాటలాడుట తప్పదు. అట్లు కానిచో, దోషరహితురాలైన ఈ సీతను ఓదార్చుట ఎట్లు కుదురును ? 19

మూ. సేయమాలోక్య మే రూపం జానకీ భాషితం తథా, 20
రక్షోభిస్త్రాసితా పూర్వం భూయస్త్రాసం గమిష్యతి.

ప్ర. అ. పూర్వమ్=ముందుగానే, రక్షోభిః=రాక్షసులచేత, త్రాసితా=భయపెట్టబడిన, సా ఇయమ్=అట్టి ఈ, జానకీ=జానకి, మే=నాయొక్క, రూపమ్=రూపమును, తథా=మరియు, భాషితమ్=భాషను, ఆలోక్య=చూచి, భూయః=మరల, త్రాసమ్=భయమును, గమిష్యతి=పొందగలదు.

తా. నా రూపమును చూచి, నా భాషను వినగానే అసలే ఇంతవరకు రాక్షసులచేత భయపెట్టబడుచున్న సీత మరల ఇంకా భయపడును. 20

మూ. తతో జాతపరిత్రాసా శబ్దం కుర్యాన్మనస్వినీ, 21
జానానా మాం విశాలాక్షీ రావణం కామరూపిణమ్.

ప్ర. అ. తతః=అటుపిమ్మట, మనస్వినీ=ఉత్తమమైన మనస్సు కలదీ, విశాలాక్షీ=విశాలనేత్రములు కలదీ అయిన సీత, మామ్=నన్ను, కామరూపిణమ్=స్వేచ్ఛారూపము గల, రావణమ్=రావణునిగా, జానానా=తలచుచున్నదై, జాతపరిత్రాసా=పుట్టిన భయము కలదై, శబ్దమ్=శబ్దమును, కుర్యాత్=చేయును.

తా. పిదప ఉత్తమమైన మనస్సు గల ఈ విశాలాక్షి, నన్ను ఇచ్ఛానుసారముగా రూపములు ధరించగలిగిన రావణుడే అని భావించి, భయపడి అరవవచ్చును. 21

మూ. సీతయా చ కృతే శబ్దే సహసా రాక్షసీగణః, 22
నానాప్రహరణో ఘోరః సమేయాదన్తకోపమః.

ప్ర. అ. సీతయా=సీతచేత, శబ్దే=శబ్దము, కృతే=చేయబడిన దగుచుండగా, సహసా=వెంటనే నానాప్రహరణః=అనేకవిధములైన ఆయుధములు గల, ఘోరః=భయంకరమైన, అన్తకోపమః=యమునితో సమాన మైన, రాక్షసీగణః=రాక్షసస్త్రీల సముదాయము, సమేయాత్=గూమిగూడును.

తా. సీత భయపడి అరవగానే, యముని వలె భయంకరమైన రాక్షస స్త్రీల సముదాయము, అనేకవిధములైన ఆయుధములు ధరించి గుమిగూడి వచ్చును. 22

మూ. తతో మాం సంపరిక్షిప్య సర్వతో వికృతాననాః, 23
వధే చ గ్రహణే చైవ కుర్యుర్యత్నం యథాబలమ్.

ప్ర. అ. తతః=అటుపిమ్మట, వికృతాననాః=వికృతములైన ముఖములు గల ఆ రాక్షసస్త్రీలు, మామ్=నన్ను, సర్వతః=అన్ని వైపులనుండి, సంపరిక్షిప్య=చుట్టుముట్టి, వధే చ=చంపుటయందు, గ్రహణే చైవ=పట్టుకొనుట యందు, యథాబలమ్=వారి శక్త్యనుసారముగా, యత్నమ్=ప్రయత్నమును, కుర్యుః=చేయుదురు.

తా. వికృతములైన ముఖములు గల ఆ రాక్షసస్త్రీలు, నన్ను నలుమూలల నుండి చుట్టుముట్టి, పట్టుకొనుటకూ, చంపుటకూ వారి బలము నంతా ప్రయోగించి ప్రయత్నము చేయుదురు. 23

మూ. గృహ్య శాఖాః ప్రశాఖాశ్చ స్కన్ధాంశ్చోత్తమశాఖినామ్,
దృష్ట్వా విపరిధావన్తం భవేయుర్భయశఙ్కితాః. 24

ప్ర. అ. ఉత్తమశాఖినామ్=ఉత్తమములైన వృక్షములయొక్క, శాఖాః=కొమ్మలను, ప్రశాఖాశ్చ=చిన్న కొమ్మలను, స్కన్ధాంశ్చ=మ్రానులను, గృహ్య=గ్రహించి, విపరిధావన్తమ్=పరుగెత్తుచున్న నన్ను, దృష్ట్వా=చూచి, భయశఙ్కితాః=భయముచేత శంక గలవారు, భవేయుః=అగుదురు.

తా. అపుడు నేను వాళ్లకు దొరకకుండా మహావృక్షముల కొమ్మలూ, చిన్న కొమ్మలూ, మ్రానులూ, పట్టుకొని ఇటు అటు పరుగెత్తుచుండగా చూచి వాళ్లకు భయము, శంకా కలుగును. 24

మూ. మమ రూపం చ సంప్రేక్ష్య వనే విచరతో మహత్, 25
రాక్షస్యో భయవిత్రస్తా భవేయుర్వికృతాననాః.

ప్ర. అ. వికృతాననాః=వికృతములైన ముఖములు గల, రాక్షస్యః=రాక్షసస్త్రీలు, వనే=వనమునందు, విచరతః=సంచరించుచున్న, మమ=నా యొక్క, మహత్=పెద్దదైన, రూపమ్=రూపమును, సంప్రేక్ష్య=చూచి, భయవిత్రస్తాః=భయ కారణమువలన భయపడినవారు, భవేయుః=అగుదురు.

తా. నేను వనములో తిరుగుచున్నప్పుడు, నా పెద్ద ఆకారమును చూచి వికృతముఖములు గల ఈ రాక్షసస్త్రీలు భయపడుదురు. 25

మూ. తతః కుర్యుః సమాహ్వానం రాక్షస్యో రక్షసామపి, 26
రాక్షసేన్ద్రనియుక్తానాం రాక్షసేన్ద్రనివేశనే.

ప్ర. అ. తతః=అటు పిమ్మట, రాక్షస్యః=రాక్షసస్త్రీలు, రాక్షసేన్ద్రనివేశనే=రావణుని గృహములో, రాక్షసేన్ద్రనియుక్తానామ్=రావణునిచేత నియమింపబడిన, రక్షసామ్ అపి=రాక్షసులయొక్క కూడ, సమాహ్వానమ్=ఆహ్వానమును, కుర్యుః=చేయుదురు.

తా. పిమ్మట ఆ రాక్షసస్త్రీలు రావణుని గృహములో అతనిచేత నియుక్తులై ఉన్న రాక్షసులను కూడ పిలచెదరు. 26

మూ. తే శూలశక్తినిస్త్రింశవివిధాయుధపాణయః, 27
ఆపతేయుర్విమర్దేఽస్మిన్వేగేనోద్వేగకారణాత్.

ప్ర. అ. తే=వారు, అస్మిన్=ఈ, విమర్దే=యుద్ధమునందు, శూలశక్తినిస్త్రింశవివిధాయుధపాణయః=శూలములు, ఖడ్గములు అనేకవిధములైన ఆయుధములు హస్తములందు కలవారై, ఉద్వేగకారణాత్=భయావేశము వలన, వేగేన=వేగముతో, ఆపతేయుః=వచ్చి పడుదురు.

తా. అప్పుడు ఆ రాక్షసులు, భయావేశముతో, శీఘ్రముగా, శూలములు, శక్తులు, ఖడ్గములు మొదలైన ఆయుధములు ధరించి యుద్ధమునకు దిగుదురు. 27

మూ. సంరుద్ధస్తైస్తు పరితో విధమన్ రక్షసాం బలమ్, 28
శక్నుయాం న తు సంప్రాప్తుం పరం పారం మహోదధేః.

ప్ర. అ. తైః=వాళ్ళచేత, పరితః=చుట్టూ, సంరుద్ధః=అడ్డగింపబడినవాడనై, రక్షసామ్=రాక్షసులయొక్క, బలమ్=సైన్యమును, విధమన్=ఎగురగొట్టుచు, మహోదధేః=మహాసముద్రముయొక్క, పరం పారమ్=అవతలి ఒడ్డును, సంప్రాప్తుమ్=పొందుటకు, న శక్నుయామ్=సమర్థుడను కాజాలను.

తా. వాళ్ళందరూ నలుమూలలా చుట్టుముట్టగా, ఆ రాక్షససైన్యమును సంహరించుచు నేను సముద్రము ఆవలి ఒడ్డున చేరజాలకపోవచ్చును. 28

మూ. మాం వా గృహ్ణీయురాప్లుత్య బహవః శీఘ్రకారిణః, 29
స్యాదియం చాగృహీతార్థా మమ చ గ్రహణం భవేత్.

ప్ర. అ. శీఘ్రకారిణః=శీఘ్రముగా పనిచేయు, బహవః=చాలమంది రాక్షసులు, ఆప్లుత్య=నాపైకి ఎగిరి, మామ్=నన్ను, గృహ్ణీయుః వా=గ్రహింపవచ్చును.

ఇయం చ=ఈ సీత, అగ్రుహీతార్థా=తెలియబడని విషయము గలది, స్యాత్=అగును. మమ=నాయొక్క, గ్రహణం చ=గ్రహణము కూడ, భవేత్=అగును.

తా. లేదా ఈ రాక్షసులలో చాలా చురుకైనవాళ్లు కొంతమంది, నామీద దుమికి, నన్ను పట్టుకొనవచ్చును. అప్పుడు సీతకు నేను వచ్చిన విషయమే తెలియకుండా పోవును. నేనా పట్టుబడిపోవుదును. 29

మూ. హింసాభిరుచయో హింస్యురిమాం వా జనకాత్మజామ్, 30
విపన్నం స్యాత్తతః కార్యం రామసుగ్రీవయోరిదమ్.

ప్ర. అ. వా=లేదా, హింసాభిరుచయః=హింసయందు ఆసక్తి గల ఈ రాక్షసులు, ఇమామ్=ఈ, జనకాత్మజామ్=సీతను, హింస్యుః=చంపివేయవచ్చును. తతః=అటుపిమ్మట, రామసుగ్రీవయోః=రామసుగ్రీవులయొక్క, ఇదమ్=ఈ, కార్యమ్=కార్యము, విపన్నం స్యాత్=చెడిపోవును.

తా. లేదా, హింసాప్రియులైన ఈ రాక్షసులు సీతను చంపివేయవచ్చును. అట్లు జరిగినచో రామసుగ్రీవుల ఈ కార్యము చెడిపోవును. 30

మూ. ఉద్దేశే నష్టమార్గేఽస్మిన్ రాక్షసైః పరివారితే. 31
సాగరేణ పరిక్షిప్తే గుప్తే వసతి జానకీ.

ప్ర. అ. జానకీ=జానకి, నష్టమార్గే=నష్టమైన మార్గములు గల (దారులు లేని), రాక్షసైః=రాక్షసులచేత, పరివారితే=చుట్టబడిన, సాగరేణ=సాగరము చేత, పరిక్షిప్తే=చుట్టబడిన, గుప్తే=రహస్యమైన, అస్మిన్=ఈ, ఉద్దేశే=ప్రదేశమునందు, వసతి=నివసించుచున్నది.

తా. జానకి రహస్యమైన ప్రదేశములో నివసించుచున్నది. ఇక్కడికి చేరుటకు దారులు లేవు. దీని చుట్టూ సముద్రమున్నది. రాక్షసులు అన్ని మూలలా నిలచి రక్షించుచున్నారు. 31

మూ. విశస్తే వా గృహీతే వా రక్షోభిర్మయి సంయుగే, 32
నాన్యం పశ్యామి రామస్య సహాయం కార్యసాధనే.

ప్ర. అ. మయి=నేను, సంయుగే=యుద్ధమునందు, రక్షోభిః=రాక్షసుల చేత, విశస్తే వా=చంపబడినా, గృహీతే వా=పట్టుకొనబడినా, రామస్య=రామునకు, కార్యసాధనే=కార్యమును సాధించుటయందు, అన్యమ్=మరియొక, సహాయమ్=సహాయుని, న పశ్యామి=చూడను.

తా. యుద్ధములో నన్ను రాక్షసులు చంపివేసినా, బంధించినా, ఈ లంకకు వచ్చి సీతాన్వేషణకార్యమునందు రామునకు సాహాయ్యము చేసేవాడు మరొకడెవ్వడూ నాకు కనబడుటలేదు. 32

మూ. విమృశంశ్చ న పశ్యామి యో హతే మయి వానరః, 33
శతయోజనవిస్తీర్ణం లఙ్ఘయేత మహోదధిమ్.

ప్ర. అ. మయి=నేను, హతే=చంపబడినవాడనగుచుండగా, యః=ఏ, వానరః=వానరుడు, శతయోజనవిస్తీర్ణమ్=నూరు యోజనముల వెడల్పు గల, మహోదధిమ్=మహాసముద్రమును, లఙ్ఘయేత=లంఘించునో, విమృశన్ చ=ఆలోచించి గూడ, న పశ్యామి=చూడను.

తా. నన్ను వీళ్ళు చంపివేసినచో, శతయోజనవిస్తీర్ణమైన ఈ మహాసముద్రమును లంఘింపగల వానరుడెవ్వడూ, ఎంత ఆలోచించినా, నాకు కనబడుట లేదు. 33

మూ. కామం హన్తుం సమర్థోఽస్మి సహస్రాణ్యపి రక్షసామ్, 34
న తు శక్ష్యామి సంప్రాప్తుం పరం పారం మహోదధేః.

ప్ర. అ. రక్షసామ్=రాక్షసులయొక్క, సహస్రాణ్యపి=సహస్రములను, కూడా, హన్తుమ్=చంపుటకు, సమర్థః=సమర్థుడను, అస్మి కామమ్=తప్పక అయి ఉన్నాను. తు=కాని, మహోదధేః=మహాసముద్రముయొక్క, పరం పారమ్=ఆవలి ఒడ్డును, సంప్రాప్తుమ్=చేరుటకు, న శక్ష్యామి=సమర్థుడను కాజాలను.

తా. వేలకొలది రాక్షసులను కూడ చంపుటకు తగిన సామర్థ్యము నాకున్నది. నిజమే ! కాని అంత యుద్ధము చేసిన పిమ్మట మహా సముద్రము అవతలి ఒడ్డున చేరు సామర్థ్యము నాకు ఉండకపోవచ్చును. 34

మూ. అసత్యాని చ యుద్ధాని సంశయో మే న రోచతే, 35
కశ్చ నిఃసంశయం కార్యం కుర్యాత్ప్రాజ్ఞః ససంశయమ్.

ప్ర. అ. యుద్ధాని=యుద్ధములు, అసత్యాని చ=అసత్యమైనవి కూడ. సంశయః=సంశయము, మే=నాకు, న రోచతే=ఇష్టము కాదు. కః=ఏ, ప్రాజ్ఞః=బుద్ధిమంతుడు, నిఃసంశయమ్=సంశయము లేని, కార్యమ్=కార్యమును, ససంశయమ్=సంశయముతో కూడిన దానినిగా, కుర్యాత్=చేయును ?

తా. యుద్ధములో జయాపజయములు అనిశ్చితములు. నాకు సంశయము ఇష్టము కాదు. బుద్ధిమంతుడెవడైనా సంశయము లేని పనిని సంశయాస్పదము చేయునా ? 35

మూ. ప్రాణత్యాగశ్చ వైదేహ్యా భవేదనభిభాషణే, 36
ఏష దోషో మహాన్హి స్యాన్మమ సీతాభిభాషణే.

ప్ర. అ. అనభిభాషణే=మాటలాడకపోవుట జరిగినచో, వైదేహ్యాః=సీత యొక్క, ప్రాణత్యాగశ్చ=ప్రాణత్యాగము, భవేత్=అగును, సీతాభిభాషణే=సీతతో మాటలాడుట జరిగినచో, మమ=నాకు, ఏషః=ఈ, మహాన్=గొప్ప, దోషః=దోషము, స్యాత్=అగును.

తా. నేను సీతతో మాటలాడకుండా వెళ్ళిపోయినచో సీత ప్రాణత్యాగము చేయవచ్చును. సీతతో మాటలాడినచో నాకు ఈ విధముగా ఆపద సంభవించవచ్చును. 36

మూ. భూతాశ్చార్థా వినశ్యన్తి దేశకాలవిరోధితాః, 37
విక్లబం దూతమాసాద్య తమః సూర్యోదయే యథా.

ప్ర. అ. విక్లబమ్=వ్యాకులమైన చిత్తము గల, దూతమ్=దూతను, ఆసాద్య=పొంది, భూతాః=సిద్ధముగా ఉన్న, అర్థాః=కార్యములు, దేశకాలవిరోధితాః=దేశకాలములకు విరుద్ధముగా చేయబడిన వై, సూర్యోదయే=సూర్యోదయ సమయమునందు, తమః యథా=చీకటివలె, వినశ్యన్తి=నశించును.

తా. ఫలోన్ముఖముగా ఉన్న కార్యములు కూడ వివేకశూన్యుడైన దూత చేతిలో పడి, సూర్యోదయము కాగానే తమస్సు తొలగినట్లు నశించును. 37

మూ. అర్థానర్థాన్తరే బుద్ధిర్నిశ్చితాపి న శోభతే, 38
ఘాతయన్తి హి కార్యాణి దూతాః పణ్డితమానినః.

ప్ర. అ. అర్థానర్థాన్తరే=లాభనష్టముల మధ్య, బుద్ధిః=బుద్ధి, నిశ్చితాపి=నిశ్చితమైనను, న శోభతే=ప్రకాశింపదు, పణ్డితమానినః=పండితుల మని తలచు, దూతాః=దూతలు, కార్యాణి=కార్యములను, ఘాతయన్తి హి=చెడగొట్టుదురు గదా !

తా. ఏది లాభకరమో, ఏది నష్టమును కలిగించునో నిర్ణయించుకొన్న కార్యమునందు కూడ, వివేకహీనులైన దూతలను నియమించినచో ఆ కార్యములు సఫలములు కావు. ఎందుచేతననగా, పండితులమను దురభిమానము గల దూతలు కార్యములను చెడగొట్టుదురు. 38

మూ. న వినశ్యేత్కథం కార్యం వైక్లబ్యం న కథం భవేత్, 39
లఙ్ఘనం చ సముద్రస్య కథం ను న వృథా భవేత్.

ప్ర. అ. కార్యమ్=కార్యము, కథమ్=ఎట్లు, న వినశ్యేత్=నశించకుండా ఉండును ? వైక్లబ్యమ్=బుద్ధివ్యాకులత్వము, కథమ్=ఎట్లు, న భవేత్=కలుగదు? సముద్రస్య=సముద్రముయొక్క, లఙ్ఘనం చ=లంఘనము కూడ, కథం ను=ఎట్లు, వృథా=వ్యర్థము ; న భవేత్=కాకుండును ?

తా. ఇప్పుడు నే నేవిధముగా ప్రవర్తించినచో కార్యము చెడిపోకుండా ఉండును? బుద్ధికి వ్యాకులత్వము కలుగకుండా ఉండును? నేను చేసిన ఈ సముద్రలంఘనము వ్యర్థము కాకూడదన్నచో నేనేమి చేయవలెను? 39

మూ. కథం ను ఖలు వాక్యం మే శృణుయాన్నోద్విజేత వా,
ఇతి సంచిన్త్య హనుమాంశ్చకార మతిమాన్మతిమ్. 40

ప్ర. అ. (సీత), మే వాక్యమ్=నా మాటను, కథం ను=ఎట్లు, శృణుయాత్=వినును? న ఉద్విజేత వా=భయపడకుండా కూడ ఉండును ! ఇతి=ఇట్లు, సంచిన్త్య=ఆలోచించి, మతిమాన్=బుద్ధిమంతుడైన, హనుమాన్=హనుమంతుడు, మతిమ్=బుద్ధిని, చకార=చేసెను.

తా. సీత నా మాటలు విని భయపడకుండా ఉండుటకు ఉపాయమేమి? బుద్ధిమంతుడైన హనుమంతుడు ఈ విధముగా ఆలోచించి తానేమి చేయవలెనో నిశ్చయించుకొనెను. 40

మూ. రామమక్లిష్టకర్మాణం సుబన్ధుమనుకీర్తయన్, 41
నైనాముద్వేజయిష్యామి తద్బన్ధుగతమానసామ్.

ప్ర. అ. అక్లిష్టకర్మాణమ్=క్లేశము లేని కర్మలు కలవాడు, సుబన్ధుమ్=ఉత్తమబంధువూ అయిన, రామమ్=రాముని గూర్చి, అనుకీర్తయన్=కీర్తించినచో, తద్బన్ధుగతమానసామ్=ఆ బంధువునే పొందిన మనస్సు గల, ఏనామ్=ఈమెను, నోద్వేజయిష్యామి=భయపెట్టను.

తా. సీత మనస్సు అత్యుత్తమబంధువైన రామునియందే లగ్నమై ఉన్నది. శ్రమపడకుండా పనులను చేయగల సమర్థుడూ, ఉత్తమబంధువూ అయిన రాముణ్ణి గూర్చి కీర్తించినచో ఈమె భయపడకుండా ఉండును. 41

మూ. ఇక్ష్వాకూణాం వరిష్ఠస్య రామస్య విదితాత్మనః, 42
శుభాని ధర్మయుక్తాని వచనాని సమర్పయన్,
శ్రావయిష్యామి సర్వాణి మధురాం ప్రబ్రువన్ గిరమ్. 43
శ్రద్ధాస్యతి యథాహీయం తథా సర్వం సమాదధే.

ప్ర. అ. ఇక్ష్వాకూణామ్=ఇక్ష్వాకురాజులలో, వరిష్ఠస్య=గొప్పవాడైన, విదితాత్మనః=ప్రసిద్ధమైన బుద్ధి గల, రామస్య=రామునకు సంబంధించిన, శుభాని=మంగళప్రదములైన, వచనాని=వచనములను, సమర్పయన్=సమర్పించుచు, (పలుకుచు), మధురామ్=మధురమైన, గిరమ్=వాక్కును, ప్రబ్రువన్=పలుకుచు, సర్వాణి=అన్నింటిని, శ్రావయిష్యామి=వినిపింపచేసెదను. ఇయమ్=ఈమె, యథా= ఎట్లు, శ్రద్ధాస్యతి=నమ్మగలదో, సర్వమ్=సమస్తమునూ, సమాదదే=చేసెదను.

తా. ఇక్ష్వాకువంశరాజులలో శ్రేష్ఠుడూ, ప్రసిద్ధమైన బుద్ధి కలవాడూ అయిన, రామునకు సంబంధించిన, మంగళప్రదములైన వచనములు పలుకుచు మధురముగా మాటలాడుచు, రామాదుల అన్ని కార్యములను ఈమెకు వినిపించెదను. ఈమెకు బాగా నమ్మకము కలుగునట్లు చేసెదను. 42, 43

మూ. ఇతి స బహువిధం మహానుభావో
జగతిపతేః ప్రమదామవేక్షమాణః,
మధురమవితథం జగాద వాక్యం
ద్రుమవిటపాన్తరమాస్థితో హనూమాన్. 44

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే సున్దరకాణ్డే
త్రింశః సర్గః

ప్ర. అ. మహానుభావః=గొప్ప ప్రభావము గల, సః హనూమాన్=ఆ హనుమంతుడు, ద్రుమవిటపాన్తరమ్=చెట్ల కొమ్మల మధ్యభాగమును, ఆస్థితః=అధిష్ఠించి ఉన్నవాడై, జగతిపతేః=భూమికి అధిపతియైన రామునియొక్క, ప్రమదామ్=భార్యయైన సీతను, అవేక్షమాణః=చూచుచు, బహువిధమ్=అనేకవిధములైన, అవితథమ్=వ్యర్థముకాని, వాక్యమ్=వాక్యమును, ఇతి=ఇట్లు, జగాద=పలికెను.

తా. గొప్ప ప్రభావము గల ఆ హనుమంతుడు చెట్టు కొమ్మల మధ్య దాగి యుండి సీతను చూచుచు మధురములు, వ్యర్థము కానివి, అనేక విధములు అయిన మాటలు ఇట్లు పలికెను. 44

"బాలానందిని"అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు
సుందరకాండలో ముప్పదవ సర్గ సమాప్తము.

అథ ఏకత్రింశః సర్గః

[హనుమంతుడు, సీతకు కనబడకుండా ఉండి ఆమెకు రాముని కథ వినిపించుట].

మూ. ఏవం బహువిధాం చిన్తాం చిన్తయిత్వా మహాకపిః,
సంశ్రవే మధురం వాక్యం వైదేహ్యా వ్యాజహార హ. 1

ప్ర. అ. మహాకపిః=హనుమంతుడు, ఏవమ్=ఇట్లు, బహువిధామ్=అనేకవిధములైన, చిన్తామ్=చింతను, చిన్తయిత్వా=చింతించి, వైదేహ్యాః=సీతయొక్క, సంశ్రవే=వినుటయందు, మధురమ్=మధురమైన, వాక్యమ్=వాక్యమును, వ్యాజహార హ=పలికెను.

తా. హనుమంతుడు ఈ విధముగా బహురీతుల ఆలోచించి, సీతకు వినబడునట్లుగా మధురమైన వాక్యమును పలికెను. 1

మూ. రాజా దశరథో నామ రథకుఞ్జరవాజిమాన్,
పుణ్యశీలో మహాకీర్తిరిక్ష్వాకూణాం మహాయశాః. 2

ప్ర. అ. రథకుఞ్జరవాజిమాన్=రథములు, ఏనుగులు, గుఱ్ఱములూ కలవాడు, పుణ్యశీలః=పుణ్యమైన స్వభావము కలవాడు, మహాకీర్తిః=గొప్ప కీర్తి కలవాడు, ఇక్ష్వాకూణామ్=ఇక్ష్వాకువంశరాజులలో, మహాయశాః=గొప్ప కీర్తి కలవాడు అయిన, దశరథో నామ=దశరథుడను పేరు గల, రాజా=రాజు (ఉండెను.)

తా. ఇక్ష్వాకువంశీయులలో గొప్ప యశస్సు గల, పుణ్యస్వభావవంతుడైన దశరథుడనే రాజు ఉండెను. అతడు రథగజాశ్వసైన్యములతో మహాబలశాలియై గొప్ప కీర్తి కలవాడై ఉండెను. 2

మూ. రాజర్షీణాం గుణశ్రేష్ఠస్తపసా చర్షిభిః సమః,
చక్రవర్తికులే జాతః పురన్దరసమో బలే. 3

ప్ర. అ. (అతడు), రాజర్షీణామ్=రాజర్షులలో, గుణశ్రేష్ఠః=గుణముల చేత శ్రేష్ఠుడు, తపసా=తపస్సుచేత, ఋషిభిః=ఋషీశ్వరులతో, సమః=సమానుడు చక్రవర్తికులే=చక్రవర్తుల కులమునందు, జాతః=పుట్టినవాడు, బలే=బలమునందు, పురన్దరసమః=దేవేంద్రునితో సమానుడు.

తా. ఆ దశరథుడు గుణములచేత రాజర్షులందరిలోను శ్రేష్ఠుడు. తపస్సు చేత ఋషులతో సమానుడు. చక్రవర్తుల కులమునందు పుట్టినవాడు. బలములో దేవేంద్రునితో సమానుడు. 3

మూ. అహింసారతిరక్షుద్రో ఘృణీ సత్యపరాక్రమః,
ముఖ్యశ్చేక్ష్వాకువంశస్య లక్ష్మీవాన్ లక్ష్మివర్ధనః. 4

ప్ర. అ. (అతడు), అహింసారతిః=అహింసయందు ఆసక్తి కలవాడు. అక్షుద్రః=నీచుడు కానివాడు. ఘృణీ=దయ గలవాడు. సత్యపరాక్రమః=సత్యమైన పరాక్రమము గలవాడు. ఇక్ష్వాకువంశస్య=ఇక్ష్వాకువంశమునకు, ముఖ్యశ్చ=ముఖ్యుడు. లక్ష్మీవాన్=ఐశ్వర్యము గలవాడు. లక్ష్మీవర్ధనః=లక్ష్మిని వృద్ధి పొందించువాడు.

తా. ఆ దశరథుడు అహింసాపరుడు. నీచస్వభావము లేనివాడు, దయాశీలుడు సత్యమైన పరాక్రమము గలవాడు. ఇక్ష్వాకువంశములో చాలా ప్రధానమైనవాడు. ఐశ్వర్యసంపన్నుడు. ఐశ్వర్యమును పెంపొందించువాడు. 4

మూ. పార్థివవ్యఞ్జనైర్యుక్తః పృథుశ్రీః పార్థివర్షభః,
పృథివ్యాం చతురన్తాయాం విశ్రుతః సుఖదః సుఖీ. 5

ప్ర. అ. (అతడు), పార్థివవ్యఞ్జనైః=రాజలక్షణములతో, యుక్తః= కూడినవాడు. పృథుశ్రీః=గొప్ప ఐశ్వర్యము కలవాడు, పార్థివర్షభః=రాజులలో శ్రేష్ఠుడు, చతురన్తాయామ్=నాలుగు అంతములు (సరిహద్దులు) గల, పృథివ్యామ్=భూమియందు, విశ్రుతః=ప్రసిద్ధుడు. సుఖదః=సుఖమును ఇచ్చువాడు. సుఖీ=సుఖవంతుడు.

తా. (ఆ దశరథమహారాజు) ఉత్తమ రాజలక్షణములు కలవాడు. గొప్ప ఐశ్వర్యము కలవాడు. రాజులలో శ్రేష్ఠుడు. నాలుగు సముద్రముల వరకు వ్యాపించిన భూమిలో ప్రసిద్ధుడు. తాను సుఖపడుచు ఇతరులను కూడ సుఖపెట్టువాడు.5

మూ. తస్య పుత్రః ప్రియో జ్యేష్ఠస్తారాధిపనిభాననః,
రామో నామ విశేషజ్ఞః శ్రేష్ఠః సర్వధనుష్మతామ్. 6

ప్ర. అ. తస్య=ఆ దశరథునకు, ప్రియః=ఇష్టమైనవాడు, తారాధిపనిభాననః=చంద్రునివంటి ముఖము గలవాడు, విశేషజ్ఞః=విశేషములను ఎరిగినవాడు, సర్వధనుష్మతామ్=సకలధనుర్ధరులలో, శ్రేష్ఠః=శ్రేష్ఠుడూ అయిన, రామో నామ= రాముడను పేరు గల, జ్యేష్ఠః పుత్రః=జ్యేష్ఠపుత్రుడు, (అస్తి=ఉన్నాడు.)

తా. ఆ దశరథునకు ప్రియుడైన రాముడను పేరు గల జ్యేష్ఠపుత్రుడు ఉన్నాడు. అతడు చంద్రుని వంటి ముఖము కలవాడు. మానవులలోను, ఇతర వస్తువులలోను ఉన్న విశేషము గుర్తించ సమర్థుడు. ధనుర్ధరులందరిలో శ్రేష్ఠుడు.6

మూ. రక్షితా స్వస్య వృత్తస్య స్వజనస్య చ రక్షితా
రక్షితా జీవలోకస్య ధర్మస్య చ పరంతపః. 7

ప్ర. అ. పరంతపః=శత్రువులను బాధించగల ఆ రాముడు, స్వస్య=తన సంబంధమైన, వృత్తస్య=చరిత్రమునకు, రక్షితా=రక్షకుడు. స్వజనస్య=స్వజనమునకు, రక్షితా=రక్షకుడు. జీవలోకస్య=ప్రాణుల సముదాయమునకు, ధర్మస్య చ=ధర్మమునకూ, రక్షితా=రక్షకుడు.

తా. శత్రువులను పీడించు ఆ రాముడు తన నడవడికలో ఎట్టిలోపములూ లేకుండా రక్షించుకొనుచుండును. తన వాళ్ళను, సకలజీవలోకమును, సకలధర్మములను రక్షించువాడు. 7

మూ. తస్య సత్యాభిసన్ధస్య వృద్ధస్య వచనాత్పితుః,
సభార్యః సహ చ భ్రాత్రా వీరః ప్రవ్రాజితో వనమ్. 8

ప్ర. అ. సత్యాభిసన్ధస్య=సత్యమైన సంకల్పము గల, వృద్ధస్య=వృద్ధుడైన, పితుః=తండ్రియైన, తస్య=ఆ దశరథునియొక్క, వచనాత్=వచనమువలన, వీరః=వీరుడైన ఆ రాముడు, సభార్యః=భార్యతో కూడినవాడై, సహ చ భ్రాత్రా=సోదరునితో కూడ కూడిన వాడై, వనమ్=వనమును గూర్చి, ప్రవ్రాజితః=ప్రవాసమునకు పంపబడెను.

తా. సత్యమైన సంకల్పము గలవాడు, తన తండ్రీ, వృద్ధుడూ అయిన ఆ దశరథమహారాజు ఆజ్ఞచేత వీరుడైన ఆ రాముడు భార్యతోను, సోదరునితోను అరణ్యమునకు ప్రవాసము వెళ్లెను. 8

మూ. తేవ తత్ర మహారణ్యే మృగయాం పరిధావతా,
రాక్షసా నిహతాః శూరా బహవః కామరూపిణః. 9

ప్ర. అ. తత్ర=ఆ, మహారణ్యే=మహారణ్యమునందు, మృగయామ్=వేటనుగూర్చి, పరిధావతా=పరుగెత్తుచున్న, తేన=ఆ రామునిచేత, శూరాః=శూరులు, కామరూపిణః=స్వేచ్ఛారూపము గలవారు అయిన, బహవః=అనేకులు, రాక్షసాః=రాక్షసులు, నిహతాః=చంపబడినారు.

తా. ఆ అరణ్యములో వేటాడు సందర్భములో ఆ రాముడు శూరులూ, స్వేచ్ఛారూపధారులూ అయిన చాలమంది రాక్షసులను సంహరించెను. 9

మూ. జనస్థానవధం శ్రుత్వా హతౌ చ ఖరదూషణౌ.
తతస్త్వమర్షాపహృతా జానకీ రావణేన తు, 10
వఞ్చయిత్వా వనే రామం మృగరూపేణ మాయయా.

ప్ర. అ. తతః=అటు పిమ్మట, జనస్థానవధమ్=జనస్థానములోని రాక్షసుల వధను, హతౌ=చంపబడిన, ఖరదూషణౌ చ=ఖరదూషణులను గూర్చి, శ్రుత్వా=విని, వనే=వనమునందు, రామమ్=రాముని, మృగరూపేణ=మృగముయొక్క రూపము చేత, మాయయా=మాయచేత, వఞ్చయిత్వా=వంచించి, రావణేన=రావణునిచేత, జానకీ=జానకి, అమర్షాపహృతా=కోపముచే అపహరించబడినది.

తా. పిమ్మట, రావణుడు జనస్థానములోని రాక్షసుల వధను, ఖర దూషణుల వధను విని, కోపముతో మాయామృగరూపముచేత అరణ్యములో రాముని వంచించి, జానకిని అపహరించెను. 10

మూ. స మార్గమాణస్తాం దేవీం రామః సీతామనిన్దితామ్, 11
ఆససాద వనే మిత్రం సుగ్రీవం నామ వానరమ్.

ప్ర. అ. సః రామః=ఆ రాముడు, అనిన్దితామ్=నిందింపబడని, దేవీమ్=దేవియైన, తాం సీతామ్=ఆ సీతను, మార్గమాణః=వెదకుచు, వనే=వనమునందు, సుగ్రీవం నామ=సుగ్రీవుడను పేరు గల, వానరమ్=వానరుని, మిత్రమ్=మిత్రునిగా, ఆససాద=పొందెను.

తా. రాముడు ఎట్టి దోషములూ లేని ఆ సీతాదేవిని వెదకుచు, అరణ్యములో సుగ్రీవుడనే వానరునితో మైత్రి చేసికొనెను. 11

మూ. తతః స వాలినం హత్వా రామః పరపురంజయః, 12
ప్రాయచ్ఛత్కపిరాజ్యం తత్సుగ్రీవాయ మహాబలః.

ప్ర. అ. తతః=అటు పిమ్మట, పరపురంజయః=శత్రుపురములను జయించువాడు, మహాబలః=గొప్పబలము గలవాడు అయిన, సః రామః=ఆ రాముడు, వాలినమ్=వాలిని, హత్వా=చంపి, తత్=ఆ, కపిరాజ్యమ్=వానరరాజ్యమును, సుగ్రీవాయ=సుగ్రీవునకు, ప్రాయచ్ఛత్=ఇచ్చెను.

తా. పిమ్మట, శత్రుపురములను జయించు, మహాబలుడైన ఆ రాముడు వాలిని చంపి ఆ వానరరాజ్యమును సుగ్రీవునకు ఇచ్చెను. 12

మూ. సుగ్రీవేణాపి సందిష్టా హరయః కామరూపిణః 13
దిక్షు సర్వాసు తాం దేవీం విచిన్వన్తి సహస్రశః.

ప్ర. అ. సుగ్రీవేణ=సుగ్రీవునిచేత, సందిష్టాః=పంపబడిన, కామరూపిణః=స్వేచ్ఛారూపము గల, కపయః=వానరులు, సహస్రశః=వేలకొలది, సర్వాసు=సమస్తమైన, దిక్షు=దిక్కులందు, తాం దేవీమ్=ఆ దేవిని, విచిన్వన్తి=వెదకుచున్నారు.

తా. సుగ్రీవుడు ఆజ్ఞాపించి పంపగా, స్వేచ్ఛారూపధరణసమర్థులైన వేలకొలది వానరులు ఆ సీతాదేవికొరకై అన్నిదిక్కులందు వెదకుచున్నారు. 13

మూ. అహం సంపాతివచనాచ్ఛతయోజనమాయతమ్, 14
అస్యా హేతోర్విశాలాక్ష్యాః సాగరం వేగవాన్ ప్లుతః.

ప్ర. అ. అహమ్=నేను, సంపాతివచనాత్=సంపాతిమాటవలన, వేగవాన్=వేగవంతుడనై, అస్యాః=ఈ, విశాలాక్ష్యాః హేతోః=విశాలములైన నేత్రములు గల సీతకొరకై, శతయోజనమ్=నూరు యోజనములు, ఆయతమ్=పొడవు గల, సాగరం=సాగరమును, ప్లుతః=దాటినాను.

తా. సంపాతి మాటలచే, విశాలనేత్రములు గల సీత ఇక్కడ నున్నదని తెలుసుకొని, నేను, ఈమెకొరకై, మహావేగముతో, నూరు యోజనములు పొడవైన సముద్రమును దాటితిని. 14

మూ. యథారూపాం యథావర్ణాం యథాలక్ష్మవతీం చ తామ్, 15
అశ్రౌషం రాఘవస్యాహం సేయమాసాదితా మయా.

ప్ర. అ. అహమ్=నేను, రాఘవస్య=రామునివలన, తామ్=ఆ సీతను, యథారూపామ్=ఎట్టిరూపము గలదానినిగా, యథావర్ణామ్=ఎట్టివర్ణము గల దానినిగా, యథాలక్ష్మవతీం చ=ఎట్టి గుర్తులుగలదానినిగా, అశ్రౌషమ్=వింటినో, సా=అట్టి రూపవర్ణచిహ్నములు గల, ఇయమ్=ఈ సీత, మయా=నాచేత, ఆసాదితా=పొందబడినది.

తా. రాముడు ఆ సీతకు ఎట్టిరూపము, ఎట్టివర్ణము, ఎట్టిగుర్తులు ఉన్నట్లు చెప్పెనో అట్టిరూప-వర్ణ-చిహ్నములతోనే ఇపుడు నే నీమెను కనుగొన్నాను.

మూ. విరరామైవముక్త్వాసౌ వాచం వానరపుఙ్గవః, 16
జానకీ చాపి తచ్ఛ్రుత్వా పరం విస్మయమాగతా.

ప్ర. అ. అసౌ=ఆ, వానరపుఙ్గవః=వానరశ్రేష్ఠుడు, ఏవమ్=ఇట్లు, వాచమ్=వాక్కును, ఉక్త్వా=పలికి, విరరామ=విరమించెను. జానకీ చాపి=జానకి కూడ, తత్=ఆ వాక్యమును, శ్రుత్వా=విని, పరమ్=మిక్కిలి, విస్మయమ్=ఆశ్చర్యమును, ఆగతా=పొందినది.

తా. హనుమంతుడు ఈ మాటలు పలికి ఊరకుండెను. ఈ మాటలు వినగానే సీత చాలా ఆశ్చర్యపడెను. 16

మూ. తతః సా వక్రకేశాన్తా సుకేశీ కేశసంవృతమ్, 17
ఉన్నమ్య వదనం భీరుః శింశుపావృక్షమైక్షత.

ప్ర. అ. ("సుకేశీ కేశసంవృతమ్"కు బదులు "క్లేశసంవృతచేతనా" అను ప్రాచ్యపాఠము బాగున్నది). తతః=అటుపిమ్మట, వక్రకేశాన్తా=వంకరగా ఉన్న కేశాంతములు గల, భీరుః=భయస్వభావము గల, క్లేశసంవృతచేతనా=దుఃఖముచేత కప్పివేయబడిన చైతన్యము గల, సా=ఆ సీత, వదనమ్=ముఖమును, ఉన్నమ్య=ఎత్తి, శింశుపావృక్షమ్=శింశుపావృక్షమును, ఐక్షత=చూచెను.

తా. దుఃఖముచేత కప్పబడిన చైతన్యము (ఆలోచనాశక్తి) గలదీ, వంకరగా ఉన్న కేశాంతములు గలదీ, భయస్వభావురాలూ అయిన ఆ సీత, ముఖమునెత్తి ఆ శింశుపావృక్షమువైపు చూచెను. 17

మూ. నిశమ్య సీతా వచనం కపేశ్చ
దిశశ్చ సర్వాః ప్రదిశశ్చ వీక్ష్య,
స్వయం ప్రహర్షం పరమం జగామ
సర్వాత్మనా రామమనుస్మరన్తీ 18

ప్ర. అ. సీతా=సీత, కపేః=హనుమంతునియొక్క, వచనమ్=వచనమును, నిశమ్య=విని, సర్వాః=సమస్తమైన, దిశశ్చ=దిక్కులను, ప్రదిశశ్చ=విదిక్కులను, వీక్ష్య=చూచి, స్వయమ్=తాను, సర్వాత్మనా=అన్ని విధముల, రామమ్=రాముని, అనుస్మరన్తీ=స్మరించుచున్నదై, పరమమ్=గొప్ప, ప్రహర్షమ్=ఆనందమును, జగామ=పొందెను.

తా. హనుమంతుని మాటలు విన్న సీత దిక్కులు, విదిక్కులు చూచుచు, మనస్సులో సర్వవిధములా రాముణ్ణే స్మరించుచు, చాల సంతోషించెను. 18

మూ. సా తిర్యగూర్ధ్వం చ తథాప్యధస్తా
న్నిరీక్షమాణా తమచిన్త్యబుద్ధిమ్,
దదర్శ పిఙ్గాధిపతేరమాత్యం
వాతాత్మజం సూర్యమివోదయస్థమ్. 19

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే సున్దరకాణ్డే
ఏకత్రింశః సర్గః.

ప్ర. అ. సా=ఆ సీత, తిర్యక్=అడ్డంగాను, ఊర్ధ్వం చ=పైకి, తథాపి=మరియు, అధస్తాత్=క్రిందా, నిరీక్షమాణా=చూచుచున్నదై, అచిన్త్యబుద్ధిమ్=ఊహించ శక్యము కాని బుద్ధి కలవాడు, పిఙ్గాధిపతేః=సుగ్రీవుని యొక్క, అమాత్యమ్=మంత్రీ, ఉదయస్థమ్=ఉదయాచలముపై ఉన్న, సూర్యమివ=సూర్యుడు వలె ఉన్నవాడూ అయిన, తం వాతాత్మజమ్=ఆ హనుమంతుని, దదర్శ=చూచెను.

తా. సీత ప్రక్కలకూ, పైకీ, క్రిందికీ చూచుచు, ఊహింప శక్యముకాని బుద్ధిబలము కలవాడూ, సుగ్రీవుని అమాత్యుడూ, వాయుకుమారుడూ అయిన, ఉదయాచలముపై నున్న సూర్యుడు వలె ఉన్న హనుమంతుని చూచెను. 19

"బాలానందిని"అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు
సుందరకాండలో ముప్పదిఒకటవ సర్గ-సమాప్తము.

అథ ద్వాత్రింశః సర్గః

[హనుమంతుని చూచిన సీతకు కలిగిన ఆలోచనలు]

మూ. తతః శాఖాన్తరే లీనం దృష్ట్వా చలితమానసా,
వేష్టితార్జునవస్త్రం తం విద్యుత్సంఘాతపిఙ్గలమ్. 1

ప్ర. అ. తతః=అటుపిమ్మట, (సీత), శాఖాన్తరే=కొమ్మల మధ్య, లీనమ్=అణగి ఉన్నవాడూ, వేష్టితార్జునవస్త్రమ్=చుట్టుకొనబడిన తెల్లని వస్త్రము కలవాడూ, విద్యుత్సంఘాతపిఙ్గలమ్=మెరుపుల గుంపు వలె పచ్చగా ఉన్నవాడూ అయిన, తమ్=ఆ హనుమంతుని, దృష్ట్వా=చూచి, చలితమానసా=చలించిన (ఉలిక్కిపడిన) మనస్సు కలదైనది.

తా. పిమ్మట ఆ సీత, మెరుపుల ప్రోగు వలె పచ్చని శరీరముతో, తెల్లని వస్త్రము ధరించి, కొమ్మల మధ్య అణగి యున్న ఆ హనుమంతుని చూచి ఉలిక్కిపడెను.

మూ. సా దదర్శ కపిం తత్ర ప్రశ్రితం ప్రియవాదినమ్,
ఫుల్లాశోకోత్కరాభాసం తప్తచామీకరేక్షణమ్. 2

ప్ర. అ. సా=ఆ సీత, తత్ర=అక్కడ, ఫుల్లాశోకోత్కరాభాసమ్=వికసించిన అశోకపుష్పముల ప్రోగువంటి కాంతి కలవాడూ, తప్తచామీకరేక్షణమ్=కరిగించిన బంగారమువంటి నేత్రములు కలవాడూ, ప్రశ్రితమ్=వినయముతో ఉన్నవాడూ, ప్రియవాదినమ్=ప్రియముగా మాటలాడుచున్నవాడూ అయిన, కపిమ్=వానరుని, దదర్శ=చూచెను.

తా. సీత, అక్కడ, వికసించిన అశోకపుష్పముల ప్రోగువంటి శరీరకాంతితో, కరిగించిన బంగారము వంటి నేత్రములతో, వినీతుడై, ప్రియవాక్యములు పలుకుచున్న వానరుని చూచెను.

మూ. మైథిలీ చిన్తయామాస విస్మయం పరమం గతా,
అహో భీమమిదం రూపం వానరస్య దురాసదమ్, 3
దుర్నిరీక్షమితి జ్ఞాత్వా పునరేవ ముమోహ సా.

ప్ర. అ. మైథిలీ=సీత, పరమమ్=గొప్ప, విస్మయమ్=ఆశ్చర్యమును, గతా=పొందినదై, చిన్తయామాస=ఆలోచించెను. అహో=ఆహా ! వానరస్య=కోతియొక్క,

దురాసదమ్=చేరరాని ఇదమ్=ఈ, రూపమ్=రూపము, భీమమ్=భయంకరము, దుర్నిరీక్షమ్=చూడ శక్యము కానిది. ఇతి=ఇట్లు, జ్ఞాత్వా=తలచి, సా=ఆమె, పునరేవ=మరల, ముమోహ=మోహము చెందెను.

తా. హనుమంతుని చూడగానే సీత ఆశ్చర్యపడుచు- "అహో ! ఈ కోతి రూపము భయంకరముగాను, సమీపించ రానిది గాను, చూడ శక్యముకానిది గాను ఉన్నది. ఆమె ఈ విధముగా తలచి మరల మోహము చెందెను. 3

మూ. విలలాప భృశం సీతా కరుణం భయమోహితా, 4
రామరామేతి దుఃఖార్తా లక్ష్మణేతి చ భామినీ,
రురోద బహుధా సీతా మన్దం మన్దస్వరా సతీ. 5

ప్ర. అ. భామినీ=ఉత్తమకాంతివంతురాలైన సీతా=సీత, భయమోహితా=భయముచేత మోహింపబడినదై, దుఃఖార్తా=దుఃఖముచేత పీడితురాలై, రామరామేతి=రామా ! రామా ! అని లక్ష్మణేతి చ=లక్ష్మణా ! అని, భృశమ్=మిక్కిలి, కరుణమ్=దీనముగా, విలలాప=విలపించెను, సీతా=సీత, మన్దస్వరా సతీ=మందమైన స్వరము గలదై, బహుధా=అనేక విధముల, రురోద=ఏడ్చెను.

తా. మంచి కాంతిగల స్త్రీ యైన సీత, భయముచే మోహితురాలై దుఃఖముచేత పీడితురాలై రామా ! రామా ! అనుచు, లక్ష్మణా ! అనుచు, దీనముగా మిక్కిలి విలపించెను. మందమైన స్వరములో అనేక విధముల ఏడ్చెను.

మూ. సా తం దృష్ట్వా హరిశ్రేష్ఠం వినీతవదుపస్థితమ్,
మైథిలీ చిన్తయామాస స్వప్నోఽయమితి భామినీ, 6

ప్ర. అ. భామినీ=కాంతిమతియైన, సా మైథిలీ=ఆ సీత, వినీతవత్=వినయవంతుడై, ఉపస్థితమ్=వచ్చిన, తమ్=ఆ, హరిశ్రేష్ఠమ్=వానరశ్రేష్ఠుని, దృష్ట్వా=చూచి, అయమ్=ఇది, స్వప్నః=స్వప్నము, ఇతి=అని, చిన్తయామాస=ఆలోచించెను.

తా. కాంతిమంతురాలైన ఆ సీత, వినయముతో సమీపమునందున్న ఆ హనుమంతుని చూచి "ఇది స్వప్నమై యుండును" అని అనుకొనెను. 6

సా వీక్షమాణా పృథుభుగ్నవక్త్రం శాఖామృగేన్ద్రస్య యథోక్తకారమ్,
దదర్శ పిఙ్గప్రవరం మహార్హం వాతాత్మజం బుద్ధిమతాం వరిష్ఠమ్. 7

ప్ర. అ. సా=ఆ సీత, వీక్షమాణా=ఇటు నటు చూచుచు, పృథుభుగ్నవక్త్రమ్=విశాల వక్రముఖము గలవాడూ, శాఖామృగేన్ద్రస్య=కపిరాజు సుగ్రీవునికి, యథోక్తకారమ్=చెప్పినట్లు చేయు భృత్యుడూ, పిఙ్గప్రవరమ్=వానరు

లలో శ్రేష్ఠుడూ, మహార్హమ్=గొప్పగౌరవపాత్రుడూ, బుద్ధిమతామ్=బుద్ధిమంతులతో, వరిష్ఠమ్=గొప్పవాడూ అయిన, వాతాత్మజమ్=హనుమంతుని, దదర్శ=చూచెను.

తా. సీత ఇటు అటు పర్యవేక్షించుచు, విశాలమూ వక్రమూ అయిన ముఖము కలవాడూ, సుగ్రీవుని అనుచరుడూ, వానరశ్రేష్ఠుడూ, గౌరవమునకు తగినవాడూ, బుద్ధిమంతులలో శ్రేష్ఠుడూ అయిన హనుమంతుని చూచెను. 7

సా తం సమీక్ష్యైవ భృశం విసంజ్ఞా గతాసుకల్పేవ బభూవ సీతా,
చిరేణ సంజ్ఞాం ప్రతిలభ్య భూయో విచిన్తయామాస విశాలనేత్రా. 8

ప్ర. అ. సా సీతా=ఆ సీత, తమ్=ఆ హనుమంతుని, సమీక్ష్యైవ= చూడగానే, భృశమ్=మిక్కిలి, విసంజ్ఞా=సంజ్ఞ లేనిదై, గతాసుకల్పేవ=గతప్రాణ వలె, బభూవ=ఆయెను, విశాలనేత్రా=వెడద కన్నులు గల ఆమె, చిరేణ= చాల తడవుకు, సంజ్ఞామ్=సంజ్ఞను, ప్రతి లభ్య=పొంది, భూయః=మరల, విచిన్తయామాస=ఆలోచించెను.

తా. ఆ సీత హనుమంతుని చూడగానే మిక్కిలి సంజ్ఞను కోల్పోయి, ప్రాణములు పోయినది వలె అయ్యెను. విశాలనేత్రయైన ఆమె చాల సేపటికి సంజ్ఞను పొంది, మరల ఇట్లు ఆలోచించెను. 8

స్వప్నే మయాయం వికృతోఽద్య దృష్టః శాఖామృగః శాస్త్రగణైర్నిషిద్ధః.
స్వస్త్యస్తు రామాయ లక్ష్మణాయ తథా పితుర్మే జనకస్య రాజ్ఞః. 9

ప్ర. అ. అద్య=ఇప్పుడు, మయా=నాచేత, వికృతః=వికృతమైన ఆకారము గల, శాస్త్రగణైః=శాస్త్రసముదాయములచేత, నిషిద్ధః=నిషేధింపబడిన, శాఖామృగః=వానరము, స్వప్నే=స్వప్నమునందు, దృష్టః=చూడబడినది, సలక్ష్మణాయ=లక్ష్మణునితో కూడిన, రామాయ=రామునకు, తథా=మరియు, మే పితుః=నా తండ్రియైన, జనకస్య రాజ్ఞః=జనకమహారాజుకూ, స్వస్తి=క్షేమము, అస్తు=అగుగాక.

తా. నా కీనాడు స్వప్నములో, వికృతాకారము గల వానరము కనబడినది. వానరము స్వప్నములో కనబడుట మంచిది కాదని శాస్త్రములు నిషేధించుచున్నవి. లక్ష్మణసహితుడైన రామునకు నా తండ్రియైన జనకమహారాజునకు క్షేమమగు గాక. 9

మూ. స్వప్నోఽస్తి నాయం నహి మేఽస్తి నిద్రా
శోకేన దుఃఖేన చ పీడితాయాః,
సుఖం హి మే నాస్తి యతోఽస్మి హీనా
తేనేన్దుపూర్ణప్రతిమాననేన. 10

ప్ర. అ. అయమ్=ఇది, స్వప్నోఽపి=స్వప్నము కూడ, న=కాదు, శోకేన=శోకముచేతను, దుఃఖేన చ=దుఃఖముచేతను, పీడితాయాః=పీడింపబడిన, మే=నాకు, నిద్రా=నిద్ర, నాస్తి హి=లేదు కదా ! మే=నాకు, సుఖమ్= సుఖము, నాస్తి హి=లేదు కదా ! యతః=ఎందువలన, ఇన్దుపూర్ణప్రతిమాన నేన=పూర్ణచంద్రునితో సమానమైన ముఖము గల, తేన=రామునితో, హీనా=హీనురాలను (వియుక్తురాలను)అస్మి=అయి ఉన్నానో !

తా. ఇది స్వప్నమై ఉండదు. శోక దుఃఖములతో పీడితురాలనైన నాకు నిద్ర అనేది లేదు కదా ? పూర్ణచంద్రునితో సమానమైన ముఖము గల ఆ రాముడు దగ్గర లేని నాకు సుఖమే లేదు కదా ! 10

రామేతి రామేతి సదైవ బుద్ధ్యా విచిన్త్య వాచా బ్రువతీ తమేవ,
తస్యానురూపం చ కథాం తదర్థా మేవం ప్రపశ్యామి తథా శృణోమి. 11

ప్ర. అ. రామేతి రామేతి=రామా! రామా! అని సదైవ=ఎల్లప్పుడూ,బుద్ధ్యా=బుద్ధితో, విచిన్త్య=ఆలోచించి, తమేవ=ఆ రాముణ్ణే, బ్రువతీ=ఉచ్చరించుచున్న దాననై, తస్య=దానికి, అనురూపమ్=తగునట్లు, తదర్థామ్=అదే విషయము గల, కథామ్=కథను, ఏవమ్=ఈ విధముగా, ప్రపశ్యామి=చూచుచున్నాను. తథా=మరియు, శృణోమి=వినుచున్నాను.

తా. నేను సదా మదిలో రాముణ్ణే స్మరించుచు, రామా ! రామా ! అని పలుకుచు ఉండుటచేత, దానికి తదనుగుణముగా రామునకు సంబంధించిన మాటలే వినుచున్నట్లు, ఆ విషయములే కనబడుచున్నట్లు అనిపించుచున్నది. 11

అహం హి తస్యాద్య మనోభవేన సంపీడితా తద్గతసర్వభావా,
విచిన్తయన్తీ సతతం తమేవ తథైవ పశ్యామి తథా శృణోమి. 12

ప్ర. అ. అద్య=ఇప్పుడు, అహమ్=నేను, తస్య=ఆ రామునకు సంబంధిచిన, మనోభవేన=మన్మథునిచేత, సంపీడితా=పీడింపబడినదాననై, తద్గతసర్వభావా=అతనిచే చేరిన సమస్తభావము కలదాననై, సతతమ్=ఎల్లప్పుడూ, తమేవ=అతనిని గూర్చియే, విచిన్తయన్తీ=ఆలోచించుచున్నదాననై, తథైవ=అట్లే, పశ్యామి=చూచుచున్నాను. తథైవ=అట్లే, శృణోమి=వినుచున్నాను.

తా. నేనిపుడు రామవిరహముతో బాధపడుచు ఆతనిని గూర్చి మన్మథునిచే పీడింపబడుచున్నాను. నా మనస్సు పూర్తిగా రామునియందు లగ్నమై ఉన్నది. ఆ రాముణ్ణే గూర్చియే సర్వదా స్మరించుచున్నాను. అందుచేత ఆ రాముని గూర్చియే వినుచున్నట్లు ఆ విషయములే చూచుచున్నట్లు అనిపించుచున్నది.12

మూ. మనోరథః స్యాదితి చిన్తయామి,
తథాపి బుద్ధ్యా చ వితర్కయామి,
కిం కారణం తస్య హి నాస్తి రూపం
సువ్యక్తరూపశ్చ వదత్యయం మామ్. 13

ప్ర. అ. మనోరథః=మనోరథము, స్యాత్=సఫలమగును, ఇతి=ని, చిన్తయామి=చింతించుచున్నాను. బుద్ధ్యాపి చ =బుద్ధిచేత గూడ, తథా=అట్లే, వితర్కయామి=ఊహించుచున్నాను, తస్య=ఆ మనోరథమునకు, రూపమ్=రూపము, నాస్తి హి=లేదు కదా ! అయమ్=ఇతడు, సువ్యక్తరూపః=బాగుగా స్పష్టమైన రూపము గలవాడై, మామ్=నన్ను గూర్చి, వదతి=మాటలాడుచున్నాడు. కారణమ్=కారణము, కిమ్=ఏమో !

తా. ఎప్పటికైనా నా మనోరథము సఫలమగునను ఆశతో మనస్సులో కూడ ఆ విధముగానే ఊహించుచున్నాను. కాని మనోరథమునకు రూపము ఉండదు కదా ! ఇతడు మాత్రము స్పష్టమైన ఆకారముతో, నాతో మాటలాడుచున్నాడు. దీనికి కారణము ఏమై ఉండునో. 13

నమోఽస్తు వాచస్పతయే సవజ్రిణే స్వయంభువే చైవ హుతాశనాయ చ,
అనేన చోక్తం యదిదం మమాగ్రతో వనౌకసా తచ్చ తథాస్తు నాన్యథా.

ఇత్యార్షే శ్రీమద్రామాయణే, ఆదికావ్యే, సున్దరకాణ్డే,
ద్వాత్రింశః సర్గః

ప్ర. అ. సవజ్రిణే=దేవేంద్రునితో కూడిన, వాచస్పతయే=బృహస్పతికి, స్వయంభువే చైవ=బ్రహ్మకు, హుతాశనాయ చ=అగ్నిదేవునకు, నమః=నమస్కారము. అస్తు=అగుగాక, అనేన=ఈ, వనౌకసా=వానరునిచేత, మమ అగ్రతః=నా ఎదుట, యత్=ఏ, ఇదమ్=ఈ వాక్యము, ఉక్తమ్=పలుకబడినదో, తత్=అది, తథా=అట్లే, అస్తు=అగుగాక, అన్యథా=మరొక విధముగా, న=కాకుండుగాక.

తా. బృహస్పతికి, దేవేంద్రునికి, బ్రహ్మదేవునకు, అగ్నిదేవునకు నమస్కరించుచున్నాను. ఈ వానరుడు నా ఎదుట చెప్పిన మాటలు సత్యమగు గాక! అసత్యము కాకుండుగాక! 14

"బాలనందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు
సుందరకాండలో ముప్పదిరెండవ సర్గ సమాప్తము

అథ త్రయస్త్రింశః సర్గః

[సీత హనుమంతునకు తన విషయము చెప్పుచు తన అరణ్యాగమనమును, రావణుడు తనను అపహరించుటను వర్ణించుట.]

మూ. సోఽవతీర్య ద్రుమాత్తస్మాద్విద్రుమప్రతిమాననః,
వినీతవేషః కృపణః ప్రణిపత్యోపసృత్య చ. 1

తామబ్రవీన్మహాతేజా హనూమాన్ మారుతాత్మజః,
శిరస్యఞ్జలిమాధాయ సీతాం మధురయా గిరా. 2

ప్ర. అ. విద్రుమప్రతిమాననః=పొగడములతో సమానమైన ముఖము గలవాడూ, మహాతేజాః=గొప్పతేజస్సు కలవాడూ, మారుతాత్మజః=వాయుపుత్రుడూ అయిన, సః హనూమాన్=ఆ హనుమంతుడు, తస్మాత్=ఆ, ద్రుమాత్=వృక్షమునుండి, అవతీర్య=దిగి, వినీతవేషః=వినయముతో కూడిన వేషము కలవాడై, కృపణః=దీనుడై, ప్రణిపత్య=నమస్కరించి, ఉపసృత్య=సమీపించి, శిరసి=శిరస్సునందు, అఞ్జలిమ్=దోసిలిని, ఆధాయ=ఉంచి, తాం సీతామ్=ఆ సీతను గూర్చి, మధురయా=మధురమైన, గిరా=వాక్కుతో, అబ్రవీత్=పలికెను.

తా. పగడము వలె ఎఱ్ఱనైన ముఖము కలవాడు, మహాతేజఃశాలీ, వాయుపుత్రుడూ యిన ఆ హనుమంతుడు, వినయముతో కూడిన వేషము గలవాడై, దీనుడై ఆ సీతను సమీపించి, తలపై దోసిలి పట్టి నమస్కరించుచు మధురమైన వాక్కుతో ఇట్లు పలికెను. 1,2

మూ. కా ను పద్మపలాశాక్షి క్లిష్టకౌశేయవాసిని,
ద్రుమస్య శాఖామాలమ్బ్య తిష్ఠసి త్వమనిన్దితే. 3

ప్ర. అ. పద్మపలాశాక్షి=పద్మపత్రముల వంటి నేత్రములు గలదానా ! క్లిష్టకౌశేయవాసిని=నలిగిపోయిన పట్టుబట్ట ధరించినదానా ! అనిన్దితే=నిందింపబడనిదానా ! ద్రుమస్య=వృక్షముయొక్క, శాఖామ్=కొమ్మను, ఆలమ్బ్య=పట్టుకొని, తిష్ఠసి=నిలబడి యున్నావు ! కా ను=ఎవ్వతెవు ?

తా. పద్మపత్రముల వంటి నేత్రములు గలదానా ! నలిగిపోయిన పట్టుబట్ట ధరించినదానా ! ఎట్టి దోషములు లేనిదానా ! ఇక్కడ ఈ చెట్టు కొమ్మను పట్టుకొని నిలబడి ఉన్నావు; నీవెవ్వతెవు ?

మూ. కిమర్థం తవ నేత్రాభ్యాం వారి స్రవతి శోకజమ్,
పుణ్డరీకపలాశాభ్యాం విప్రకీర్ణమివోదకమ్. 4

ప్ర. అ. పుణ్డరీకపలాశాభ్యామ్=రెండు పద్మపత్రములనుండి, విప్రకీర్ణమ్=చిమ్మబడిన, ఉదకమ్ ఇవ=ఉదకము వలె, తవ=నీ యొక్క, నేత్రాభ్యామ్=నేత్రములనుండి, శోకజమ్=శోకమువలన కలిగిన, వారి=నీరు, కిమర్థమ్=ఎందువలన, స్రవతి=కారుచున్నది.

తా. రెండు తామరపూవు రేకులనుండి నీరు కారినట్లు నీ నేత్రములనుండి కన్నీరు కారుచున్నది ; కారణమేమి ? 4

మూ. సురాణామసురాణాం వా నాగగన్ధర్వరక్షసామ్,
యక్షాణాం కింనరాణాం వా కా త్వం భవసి శోభనే. 5

ప్ర. అ. శోభనే=మంగళప్రదురాలా ! త్వమ్=నీవు, సురాణామ్=దేవతలలో కాని, అసురాణాం వా=రాక్షసులలో కాని, నాగగన్ధర్వరక్షసామ్=నాగగంధర్వరాక్షసులలో కాని, యక్షాణామ్=యక్షులలో కాని, కింనరాణాం వా=కింనరులలో గాని, కా=ఎవతెవు, భవసి=అగుచున్నావు.

తా. ఓ ! మంగళప్రదురాలా ! సురులు, అసురులు, నాగులు, గంధర్వులు, రాక్షసులు, యక్షులు, కింనరులు - వీరిలో నీవు ఏ జాతికి చెందినదానవు ? 5

మూ. కా త్వం భవసి రుద్రాణాం మరుతాం వా వరాననే,
వసూనాం హి వరారోహే దేవతా ప్రతిభాసి మే. 6

ప్ర. అ. వరాననే=శ్రేష్ఠమైన ముఖము కలదానా ! త్వమ్=నీవు, రుద్రాణామ్=రుద్రులలో గాని, మరుతాం వా=మరుత్తులలో గాని, వసూనామ్=వసువులలో గాని, కా=ఎవ్వతెవు, భవసి=అగుచున్నావు ? వరారోహే=శ్రేష్ఠమైన కటిప్రదేశము గలదానా ! దేవతా=దేవతవుగా, మే=నాకు, ప్రతిభాసి=తోచుచున్నావు.

తా. అందమైన ముఖము గలదానా ! నీవు, రుద్రగణములో గాని, మరుద్గణములో గాని, వసుగణములో గాని చేరినదానవా ? శ్రేష్ఠమైన కటిప్రదేశము గలదానా ! నీవు దేవతాస్త్రీవి అయి ఉందువని నాకు తోచుచున్నది.

మూ. కిం ను చన్ద్రమసా హీనా పతితా విబుధాలయాత్,
రోహిణీ జ్యోతిషాం శ్రేష్ఠా శ్రేష్ఠసర్వగుణాన్వితా. 7

ప్ర. అ. చన్ద్రమసా=చంద్రునితో, హీనా=శూన్యురాలూ, విబుధాలయాత్=స్వర్గమునుండి, పతితా=పడినదీ, జ్యోతిషామ్=నక్షత్రములలో, శ్రేష్ఠా=శ్రేష్ఠురాలూ, శ్రేష్ఠసర్వగుణాన్వితా=శ్రేష్ఠములైన సమస్తగుణములతో కూడినదీ అయిన, రోహిణీ కిం ను=రోహిణివా ?

తా. నీవు స్వర్గమునుండి భూలోకములో పడి, చంద్రునికి దూరమైన, నక్షత్రములలో శ్రేష్ఠురాలైన, శ్రేష్ఠములైన గుణములు గల రోహిణివా ? 7

మూ. కా త్వం భవసి కల్యాణి త్వమనిన్దితలోచనే,
కోపాద్వా యది వా మోహాద్భర్తారమసితేక్షణే, 8
వసిష్ఠం కోపయిత్వా త్వం నాపి కల్యాణ్యరున్ధతీ.

ప్ర. అ. (కా త్వం భవసి.....లోచనే అను శ్లోకార్థము రెండు 'త్వమ్' లతో ఉన్నది అనవసరము. గోరఖ్‌పూర్ ప్రతిలో లేదు.)

ప్ర. అ. అసితేక్షణే=నల్లని నేత్రములు కలదానా! త్వమ్=నీవు, కోపాద్వా=కోపమువలన గాని, యది వా=లేక, మోహాత్=మోహము (అజ్ఞానము) వలన గాని,. భర్తారమ్=భర్త యైన, వసిష్ఠమ్=వసిష్ఠుని, కోపయిత్వా=కోపింప చేసి వచ్చిన, కల్యాణీ=మంగళప్రదురాలైన, అరున్ధతీ=అరుంధతీ, నాపి=కావు కదా !

తా. ఓ ! నల్లని నేత్రములు గలదానా ! భర్తయైన వసిష్ఠునకు, కోపము వలననో, అజ్ఞానమువలననో కోపము కలిగించి ఇక్కడికి వచ్చిన అరుంధతివి కాదు కదా ! 8

మూ. కో ను పుత్రః పితా భ్రాతా భర్తా వా తే సుమధ్యమే, 9
అస్మాల్లోకాదముం లోకం గతం త్వమనుశోచసి.

ప్ర. అ. సుమధ్యమే=మంచి నడుము గలదానా ! అస్మాత్=ఈ, లోకాత్=లోకమునుండి, అముం లోకమ్=పరలోకమును గూర్చి, గతమ్=వెళ్ళిపోయిన ఎవనిని గూర్చి, త్వమ్=నీవు, అనుశోచసి=దుఃఖించుచున్నావో అట్టి, తే=నీయొక్క, పుత్రః=పుత్రుడు, పితా=తండ్రి, భ్రాతా=సోదరుడు, భర్తా వా=లేదా భర్త, కో ను=ఎవ్వడు ?

తా. మంచి నడుము గలదానా ! నీవు మరణించిన వారి నెవరినో గూర్చి దుఃఖించుచున్నట్లున్నది. ఆ విధముగా మరణించినవాడు నీ పుత్రుడా, తండ్రియా, సోదరుడా, భర్తయా ?

వి. ఈ ప్రశ్న చాలా అసంగతముగా, అమంగళాశ్లీలరూపముగా ఉన్నది. పూర్వార్థానికి నీ పుత్రుడెవ్వరు, తండ్రి ఎవ్వరు....ఇత్యాదివిధముగా అర్థం చెప్పి దానిని వేరు చేయడానికి కూడ వీలు లేదు. 'వా' అని ఉండుటచే 'నీ కుమారుడు' ఇత్యాదివిధముగానే అర్థము చెప్పవలసి ఉండును. అలా చెప్పినా కూడా ఉత్తరార్థంలో అశ్లీలము ఉండనే ఉన్నది. ఈ శ్లోకం ప్రాచ్యపాఠంలో లేదు. 9

మూ. రోదనాదతినిఃశ్వాసాద్భూమిసంస్పర్శనాదపి, 10
న త్వాం దేవీమహం మన్యే రాజ్ఞః సంజ్ఞావధారణాత్.

ప్ర. అ. రోదనాత్=ఏడ్చుటవలనను, అతినిఃశ్వాసాత్=చాలా నిట్టూర్పులవలనను, భూమిసంస్పర్శనాదపి=భూమిని స్పృశించుటవలనను, రాజ్ఞః=రాజుయొక్క, సంజ్ఞావధారణాత్=చిహ్నముల నిశ్చయమువలనను, త్వామ్=నిన్ను, దేవీమ్=దేవతా స్త్రీనిగా, అహమ్=నేను, న మన్యే=తలవను.

తా. నీవు ఏడ్చుచున్నావు. ఎక్కువ నిట్టూర్చుచున్నావు. భూమిని స్పృశించుచున్నావు. నీయందు రాజలక్షణములున్నవి. వీటిని అన్నిటిని పట్టి నీవు దేవతాస్త్రీవి కావని తలచుచున్నాను. 10

మూ. వ్యఞ్జనాని చ తే యాని లక్షణాని చ లక్షయే, 11
మహిషీ భూమిపాలస్య రాజకన్యా చ మే మతా.

ప్ర. అ. తే=నీయొక్క, యాని=ఏ, వ్యఞ్జనాని=చిహ్నములను, లక్షణాని చ=సాముద్రికలక్షణములను, లక్షయే=చూచుచున్నానో, వాటిని పట్టి, భూమిపాలస్య=చక్రవర్తియొక్క, మహిషీ=రాణివి గాను, రాజకన్యా చ=రాజకన్యవు గాను, మే=నాకు, మతా=తోచుచున్నావు.

తా. నీ అవయవసౌష్ఠవము మొదలైన చిహ్నములు, సాముద్రికశాస్త్రోక్త లక్షణములు చూడగా, నీవు చక్రవర్తి భార్య యైన క్షత్రియవనితవై ఉందువని ఊహించుచున్నాను. 11

మూ. రావణేన జనస్థానాద్బలాదపహృతా యది, 12
సీతా త్వమసి భద్రం తే తన్మమాచక్ష్వ పృచ్ఛతః.

ప్ర. అ. త్వమ్=నీవు, జనస్థానాత్=జనస్థానమునుండి, రావణేన=రావణునిచేత, బలాత్=బలాత్కారముగా, అపహృతా=అపహరింపబడిన, సీతా=సీతవు, అసి యది=అయినట్లయితే, తత్=దానిని, పృచ్ఛతః=అడుగుచున్న, మమ=నాకు, ఆచక్ష్వ=చెప్పుము. తే=నీకు, భద్రమ్=మంగళము అగుగాక !

తా. నేను అడుగుచున్నాను ! చెప్పుము. నీకు మంగళము అగును. రావణుడు జనస్థానమునుండి బలాత్కారముగా ఎత్తికొని వచ్చిన సీతవు కావు కదా ! 12

మూ. యథా హి తవ వై దైన్యం రూపం చాప్యతిమానుషమ్, 13
తపసా చాన్వితో వేషస్త్వం రామమహిషీ ధ్రువమ్.

ప్ర. అ. తవ=నీ యొక్క, దైన్యమ్=దైన్యము, అతిమానుషమ్=మనుష్యులను అతిక్రమించిన, రూపం చ=రూపము, తపసా=తపస్సుతో, అన్వితః=కూడిన, వేషః=వేషము, యథా=ఎట్లున్నదో, దానిని పట్టి, త్వమ్=నీవు, ధ్రువమ్=నిశ్చయముగా, రామమహిషీ=రామభార్యవే.

తా. నీ దైన్యమును, మనుష్యులలో ఎవ్వరియందూ కనబడని సౌందర్యమును, తపస్సును సూచించు వేషమును చూడగా నీవు రాముని భార్యవే అని స్పష్టముగా తెలియుచున్నది. 13

మూ. సా తస్య వచనం శ్రుత్వా రామకీర్తనహర్షితా, 14
ఉవాచ వాక్యం వైదేహీ హనుమన్తం ద్రుమాశ్రితమ్.

ప్ర. అ. సా వైదేహీ=ఆ సీత, తస్య=అతనియొక్క, వచనమ్=వచనమును, శ్రుత్వా=విని, రామకీర్తనహర్షితా=రాముణ్ణి గూర్చి చెప్పుటచేత సంతోషింపచేయబడినదై, ద్రుమాశ్రితమ్=వృక్షమును ఆశ్రయించి ఉన్న, హనుమన్తమ్= హనుమంతుని గూర్చి, వాక్యమ్=వాక్యమును, ఉవాచ=పలికెను.

తా. హనుమంతుని మాటలు విన్న సీత, రాముణ్ణి గూర్చి చెప్పుటచే చాల సంతోషించుచు, చెట్టుమీద నున్న అతనితో ఇట్లనెను. 14

మూ. పృథివ్యాం రాజసింహానాం ముఖ్యస్య విదితాత్మనః, 15
స్నుషా దశరథస్యాహం శత్రుసైన్యప్రతాపినః.

ప్ర. అ. అహమ్=నేను, పృథివ్యామ్=భూమియందు, రాజసింహానామ్=రాజశ్రేష్ఠులలో, ముఖ్యస్య=ప్రధానుడూ, విదితాత్మనః=ప్రసిద్ధమైన బుద్ధి కలవాడూ, శత్రుసైన్యప్రతాపినః=శత్రువుల సైన్యమును తపింపచేయువాడూ అయిన, ధశరథస్య=దశరథునియొక్క, స్నుషా=కోడలిని.

తా. నేను, భూమండలములోని రాజులందరికంటె గొప్పవాడు, ప్రసిద్ధమైన బుద్ధిబలము కలవాడు, శత్రుసైన్యమును బాధించువాడు అయిన దశరథుని కోడలిని. 15

మూ. దుహితా జనకస్యాహం వైదేహస్య మహాత్మనః, 16
సీతేతి నామ నామ్నాహం భార్యా రామస్య ధీమతః.

ప్ర. అ. అహమ్=నేను, వైదేహస్య=విదేహదేశరాజూ, మహాత్మనః=గొప్ప బుద్ధి కలవాడూ అయిన, జనకస్య=జనకునియొక్క, దుహితా=కుమార్తెను. నామ్నా=పేరుచేత, సీతేతి నామ=సీత అను ప్రసిద్ధి గల, అహమ్=నేను, ధీమతః=బుద్ధిమంతుడైన, రామస్య=రామునియొక్క, భార్యా=భార్యను.

తా. నేను మహాబుద్ధిశాలీ, విదేహదేశప్రభువూ అయిన జనకుని కుమార్తెను, నాపేరు సీత. ధీమంతుడైన రాముని భార్యను. 16

మూ. సమా ద్వాదశ తత్రాహం రాఘవస్య నివేశనే, 17
భుఞ్జానా మానుషాన్ .భోగాన్ సర్వకామసమృద్ధినీ.

ప్ర. అ. అహమ్=నేను, తత్ర=అక్కడ, రాఘవస్య=రామునియొక్క, నివేశనే=గృహమునందు, మానుషాన్=మనుష్యులకు లభించు, భోగాన్=భోగములను, భుఞ్జానా=అనుభవించు, సర్వకామసమృద్ధినీ=సమస్తకామసమృద్ధి కలదాననై, ద్వాదశ=పండ్రెండు, సమాః=సంవత్సరములను, ఉంటిని.

తా. నేను అక్కడ రాముని ఇంటిలో మనుష్యులకు లభించుటకు వీలున్న సకలభోగములు అనుభవించుచు, సమస్తకామముల సమృద్ధితో, పండ్రెండు సంవత్సరములు ఉంటిని. 17

మూ. తతస్త్రయోదశే వర్షే రాజ్యేనేక్ష్వాకునన్దనమ్, 18
అభిషేచయితుం రాజా సోపాధ్యాయః ప్రచక్రమే.

ప్ర. అ. తతః=అటుపిమ్మట, త్రయోదశే=పదమూడవ, వర్షే=సంవత్సరమునందు, సోపాధ్యాయః=పురోహితులతో కూడిన, రాజా=దశరథమహారాజు, ఇక్ష్వాకునన్దనమ్=ఇక్ష్వాకువంశమునకు ఆనందకరుడైన రాముని, రాజ్యేన= రాజ్యముచేత, అభిషేచయితుమ్=అభిషేకింపచేయుటకు, ప్రచక్రమే=ప్రారంభించెను.

తా. పిమ్మట పదమూడవ సంవత్సరమునందు, దశరథమహారాజు, పురోహితులలో కూడి, ఇక్ష్వాకువంశమునకు ఆనందకరుడైన రామునకు రాజ్యాభిషేకము చేయుటకు ప్రయత్నించెను. 18

మూ. తస్మిన్ సంభ్రియమాణే తు రాఘవస్యాభిషేచనే, 19
కైకేయీ నామ భర్తారం దేవీ వచనమబ్రవీత్.

ప్ర. అ. తస్మిన్=ఆ, రాఘవస్య=రామునియొక్క, అభిషేచనే=అభిషేచనము, సంభ్రియమాణే=ఏర్పరుపబడుచుండగా, కైకేయీ నామ=కైకేయి అను పేరు గల, దేవీ=రాణి, భర్తారమ్=భర్తనుగూర్చి, వచనమ్=వచనమును, అబ్రవీత్=పలికెను.

తా. రామాభిషేకమునకు ఏర్పాట్లు జరుగుచుండగా కైకేయి అను రాణి భర్తయైన దశరథునితో ఇట్లనెను. 19

మూ. న పిబేయం న ఖాదేయం ప్రత్యహం మమ భోజనమ్, 20
ఏష మే జీవితస్యాన్తో రామో యద్యభిషిచ్యతే.

ప్ర. అ. న పిబేయమ్=నీరు త్రాగను, ప్రత్యహమ్=ప్రతిదినము, భోజనమ్=భోజనమును, న ఖాదేయమ్=తినను, రామః=రాముడు, యది అభిషిచ్యతే=అభిషేకింపబడినట్లయితే, ఏషః=ఇది, మే=నాయొక్క, జీవితస్య=జీవితము యొక్క, అన్తః=అంతము.

తా. నీవు రామునకు పట్టాభిషేకము చేసినచో నేనిదిమొదలు ఏ దినము నందూ నీళ్ళు త్రాగను; ఆహారము తినను. ఇదే నా జీవితమునకు అంతము. 20

మూ. యత్తదుక్తం త్వయా వాక్యం ప్రీత్యా నృపతిసత్తమ, 21
తచ్చేన్న వితథం కార్యం వనం గచ్ఛతు రాఘవః.

ప్ర. అ. నృపతిసత్తమ=ఓ ! రాజశ్రేష్ఠుడా ! త్వయా=నీచేత, ప్రీత్యా=ప్రేమతో, యత్=ఏ, తత్ వాక్యమ్=ఆ మాట, ఉక్తమ్=చెప్పబడినదో, తత్=అది, వితథమ్=వ్యర్థము, న కార్యం యది=చేయబడకుండవలెనన్నచో, రాఘవః=రాముడు, వనమ్=వనమును గూర్చి, గచ్ఛతు=వెళ్ళుగాక.

తా. ఓ ! రాజశ్రేష్ఠుడా ! నీవానాడు ప్రేమపూర్వకముగా పలికిన మాటపై నీవు నిలచినచో రాముణ్ణి అరణ్యమునకు పంపుము. 21

మూ. స రాజా సత్యవాగ్దేవ్యా వరదానమనుస్మరన్, 22
ముమోహ వచనం శ్రుత్వా కైకేయ్యాః క్రూరమప్రియమ్.

ప్ర. అ. సత్యవాక్=సత్యమైన వాక్కుగల, సః రాజా=ఆ రాజు, దేవ్యాః=రాణియొక్క, వరదానమ్=వరదానమును, అనుస్మరన్=స్మరించుచు, కైకేయ్యాః=కైకేయియొక్క, క్రూరమ్=క్రూరమైన, అప్రియమ్=అప్రియమైన, వచనమ్=వచనమును; శ్రుత్వా=విని, ముమోహ=మోహము చెందెను.

తా. ఆ దశరథమహారాజు క్రూరమూ, అప్రియమూ అయిన కైకేయి

మాట విని, రాణికి తానిచ్చిన వరమును స్మరించుచు, మూర్ఛపోయెను. 22

మూ. తతస్తు స్థవిరో రాజా సత్యే ధర్మే వ్యవస్థితః, 23
జ్యేష్ఠం యశస్వినం పుత్రం రుదన్రాజ్యమయాచత.

ప్ర. అ. తతః=అటుపిమ్మట, సత్యే=సత్యమునందు, ధర్మే=ధర్మమునందు, వ్యవస్థితః=నిలచిన, స్థవిరః=వృద్ధుడైన, రాజా=రాజు, రుదన్=ఏడ్చుచు, యశస్వినమ్=కీర్తిగల, జ్యేష్ఠమ్=జ్యేష్ఠుడైన, పుత్రమ్=పుత్రుని, రాజ్యమ్=రాజ్యమును, అయాచత=యాచించెను.

తా. సత్యధర్మములపై స్థిరముగా నిలచిన, వృద్ధుడైన ఆ రాజు అపుడు "నే నిచ్చిన రాజ్యము మరల నా కిమ్ము" అని యశఃశాలియైన జ్యేష్ఠపుత్రుని యాచించెను. 23

మూ. స పితుర్వచనం శ్రీమానభిషేకాత్పరం ప్రియమ్, 24
మనసా పూర్వమాసాద్య వాచా ప్రతిగృహీతవాన్.

ప్ర. అ. శ్రీమాన్=శ్రీమంతుడైన, సః=ఆ రాముడు, పితుః=తండ్రియొక్క, వచనమ్=వచనమును, అభిషేకాత్=అభిషేకముకంటే, పరమ్=మిక్కిలి, ప్రియమ్=ప్రియమైనదానినిగా, మనసా=మనస్సుతో, పూర్వమ్=ముందుగా, ఆసాద్య=పొంది, వాచా=వాక్కుతో, ప్రతిగృహీతవాన్=స్వీకరించెను.

తా. శ్రీమంతుడైన ఆ రాముడు తండ్రి ఆజ్ఞను అభిషేకముకంటె గూడ చాల ప్రియమైన దానినిగా మనసా భావించి, పిదప మాటతో అంగీకరించెను.24

మూ. దద్యాన్న ప్రతిగృహ్ణీయాన్న బ్రూయాత్కించిదప్రియమ్, 25
అపి జీవితహేతోర్వా రామః సత్యపరాక్రమః.

ప్ర. అ. సత్యపరాక్రమః=సత్యమైనపరాక్రమము గల, రామః=రాముడు, దద్యాత్=ఇచ్చును. న ప్రతిగృహ్ణీయాత్=ప్రతిగ్రహించదు, జీవితహేతోర్వా=జీవితము కొరకైనా, కించిత్=ఏమియు, అప్రియమ్=అప్రియమును, న బ్రూయాత్=పలకదు.

తా. సత్యమైన పరాక్రమము గల రాముడు ఇతరులకు దానము చేయును గాని తాను ఇతరులనుండి ప్రతిగ్రహించదు. జీవితమునకు ఆపద సంభవించినప్పుడు కూడ అప్రియమును మాటలాడదు. 25

మూ. స విహాయోత్తరీయాణి మహార్హాణి మహాయశాః, 26
విసృజ్య మనసా రాజ్యం జనన్యై మాం సమాదిశత్.

ప్ర. అ. మహాయశాః=గొప్ప కీర్తి గల, సః=ఆ రాముడు, మహార్హాణి=చాల

విలువ గల, ఉత్తరీయాణి=ఉత్తరీయములను, విహాయ=విడచి, మనసా=మన స్సుచేత, రాజ్యమ్=రాజ్యమును, విసృజ్య=విడచి, మామ్=నన్ను, జనన్యై=తల్లికి, సమాదిశత్=అప్పగించెను.

తా. గొప్ప కీర్తి గల ఆ రాముడు చాల విలువైన వస్త్రములను విడచి, నార చీరలు ధరించి, రాజ్యమును పరిత్యజించవలెనని ధృఢముగా సంకల్పించి నన్ను తన తల్లికి అప్పచెప్పెను. 26

మూ. సాహం తస్యాగ్రతస్తూర్ణం ప్రస్థితా వనచారిణీ, 27
న హి మే తేన హీనాయా వాసః స్వర్గేఽపి రోచతే.

ప్ర. అ. సా అహమ్=అట్టినేను, వనచారిణీ=వనమునందు సంచరించు చున్న దాననై, తూర్ణమ్=శీఘ్రముగా, తస్య=ఆ రామునియొక్క, అగ్రతః=ఎదుట, ప్రస్థితా=ప్రయాణ మైతిని, తేన=ఆతనితో, హీనాయాః=శూన్యురాలనైన, మే=నాకు, స్వర్గేఽపి=స్వర్గములో కూడ, వాసః=నివాసము, న రోచతే హి=ఇష్టము కాదు కదా !

తా. రాముడు లేకున్నచో నాకు స్వర్గములో నివాసము కూడ ఇష్టము కాదు. అందుచే నేను వనములో సంచరించుటకై నిశ్చయించుకొని, వెంటనే అతనికంటే ముందుగానే అడవికి బయలుదేరితిని. 27

మూ. ప్రాగేవ తు మహాభాగః సౌమిత్రిర్మిత్రనన్దనః, 28
పూర్వజస్యానుయాత్రార్థే ద్రుమచీరైరలంకృతః.

ప్ర. అ. మహాభాగః=గొప్ప భాగ్యము గలవాడు, మిత్రనన్దనః=మిత్రులను ఆనందింపచేయువాడు అయిన, సౌమిత్రిః=లక్ష్మణుడు, ప్రాగేవ=ముందుగానే, పూర్వజస్య=అన్నగారియొక్క, అనుయాత్రార్థే=అనుసరించి వెళ్లుటకై, ద్రుమచీరైః= నారచీరలతో, అలంకృతః=అలంకరింపబడెను.

తా. మహాభాగ్యవంతుడు, మిత్రులకు ఆనందకరుడు అయిన లక్ష్మణుడు, అన్నగారిని అనుసరించి వెళ్లుటకై, నా కంటె ముందే నారచీరలు ధరించి సిద్ధముగా ఉండెను. 28

మూ. తే వయం భర్తురాదేశం బహుమాన్య దృఢవ్రతాః, 29
ప్రవిష్టాః స్మ పురాదృష్టం వనం గమ్భీరదర్శనమ్.

ప్ర. అ. తే=అట్టి, వయమ్=మేము, భర్తుః=ప్రభువైన దశరథమహారా జుయొక్క, ఆదేశమ్=ఆజ్ఞను, బహుమాన్య=గౌరవించి, దృఢవ్రతాః=దృఢ మైన నియమము కలవారమై, పురా=పూర్వము, అదృష్టమ్=చూడబడని, గమ్భీరదర్శ

నమ్=గంభీరమైన దర్శనము గల, వనమ్=వనమును, ప్రవిష్టాః స్మః=ప్రవేశించితిమి.

తా. ఈ విధముగ మే మందరము రాజాజ్ఞ పాటించుచు, దృఢమైన నియమములు అనుసరించుచు, పూర్వ మెన్నడూ చూడని, చూచుటకు భయంకరముగానుండు అరణ్యములో ప్రవేశించితిమి. 29

మూ. వసతో దణ్డకారణ్యే తస్యాహమమితౌజసః, 30
రక్షసాపహృతా భార్యా రావణేన దురాత్మనా.

ప్ర. అ. దణ్డకారణ్యే=దండకారణ్యమునందు, వసతః=నివసించుచున్న, అమితౌజసః=గొప్ప తేజస్సు గల, తస్య=ఆ రామునియొక్క, భార్యా=భార్యనైన, అహమ్=నేను, దురాత్మనా=దుష్టబుద్ధి గల, రావణేన=రావణునిచేత, అపహృతా=అపహరింపబడితిని.

తా. అనంతమైన తేజస్సు గల ఆ రాముడు దండకారణ్యములో నివసించుచుండగా, అతని భార్యనైన నన్ను దురాత్ముడైన రావణుడు అపహరించినాడు. 30

మూ. ద్వౌ మాసౌ తేన మే కాలో జీవితానుగ్రహః కృతః, 31
ఊర్ధ్వం ద్వాభ్యాం తు మాసాభ్యాం తతస్త్యక్ష్యామి జీవితమ్.

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే సున్దరకాణ్డే
త్రయస్త్రింశః సర్గః

ప్ర. అ. తేన=వానిచేత, ద్వౌ=రెండు, మాసౌ=మాసములను, మే=నాకు, జీవితానుగ్రహః=జీవితముయొక్క అనుగ్రహము, కృతః=చేయుబడినది. తతః=ఆ కారణమువలన, ద్వాభ్యామ్=రెండు, మాసాభ్యామ్=మాసములకంటె, ఊర్ధ్వమ్=పైన, జీవితమ్=జీవితమును, త్యక్ష్యామి=విడువగలను.

తా. ఆ రావణుడు నాకు రెండు మాసముల పాటు జీవితమును అనుగ్రహించినాడు. రెండు మాసాల తరువాత నేను ప్రాణములు వదలగలను.31

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు
సుందరకాండలో ముప్పదిమూడవ సర్గ సమాప్తము.

అథ చతుస్త్రింశః సర్గః

[హనుమంతుని విషయమున సీతకు సందేహము కలుగుట. హనుమంతుడు ఆ సందేహమును తొలగించుట. సీత కోరగా హనుమంతుడు శ్రీరాముని గుణములు వర్ణించి చెప్పుట.]

మూ. తస్యాస్తద్వచనం శ్రుత్వా హనుమాన్ హరిపుఙ్గవః,
దుఃఖాద్దుఃఖాభిభూతాయాః సాన్త్వముత్తరమబ్రవీత్. 1

ప్ర. అ. హరిపుఙ్గవః=వానరశ్రేష్ఠుడైన, హనుమాన్=హనుమంతుడు, దుఃఖాత్=ఒక దుఃఖమునుండి, దుఃఖాభిభూతాయాః=మరియొక దుఃఖముచేత తిరస్కరింపబడిన (ఆవరింపబడిన), తస్యాః=ఆ సీతయొక్క, తత్=ఆ, వచనమ్=వచనమును, శ్రుత్వా=విని, సాన్త్వమ్=ఓదార్పు రూపమైన, ఉత్తరమ్=ప్రత్యుత్తరమును, అబ్రవీత్=పలికెను.

తా. వానరశ్రేష్ఠుడైన ఆ హనుమంతుడు, ఒక దుఃఖము తరువాత మరొక దుఃఖములో చిక్కుకొని ఉన్న ఆ సీత పలికిన మాటలు విని, ఓదార్పుచు ఇట్లు ప్రత్యుత్తర మిచ్చెను. 1

మూ. అహం రామస్య సందేశాద్దేవి దూతస్తవాగతః,
వైదేహి కుశలీ రామస్త్వాం చ కౌశలమబ్రవీత్. 2

ప్ర. అ. దేవి=ఓ దేవీ ! వైదేహి=సీతా ! అహమ్=నేను, రామస్య=రామునియొక్క, సందేశాత్=సందేశమువలన, తవ=నీయొక్క, దూతః=దూతగా, ఆగతః=వచ్చినాను, కుశలీ=క్షేమముగా నున్న, రామః=రాముడు, త్వాం చ=నిన్ను కూడ, కుశలమ్=కుశలమును గూర్చి, అబ్రవీత్=పలికెను.

తా. విదేహరాజకుమారివైన ఓ సీతాదేవీ ! నేను రాముడు పంపగా, నీ వద్దకు దూతనై వచ్చినాను. రాముడు క్షేమముగా ఉన్నాడు. నిన్ను కూడా నీ క్షేమము గూర్చి అడుగుచున్నాడు. (నీ క్షేమమును తెలుసుకొమ్మని నాతో చెప్పినాడు). 2

మూ. యో బ్రాహ్మమస్త్రం వేదాంశ్చ వేద వేదవిదాంవరః,
స త్వాం దాశరథీ రామో దేవి కౌశలమబ్రవీత్. 3

ప్ర. అ. దేవి=ఓ దేవీ ! వేదవిదామ్=వేదవేత్తలలో, వరః=శ్రేష్ఠుడైన, యః=ఎవ్వడు, బ్రాహ్మమ్ అస్త్రమ్=బ్రహ్మాస్త్రమును, వేదాంశ్చ=వేదములను, వేద=ఎరుగునో, సః=అట్టి, దాశరథిః=దశరథకుమారుడైన, రామః=రాముడు, త్వామ్=నిన్ను, కౌశలమ్=క్షేమమును, అబ్రవీత్=పలికెను.

తా. ఓ దేవీ !వేదవేత్తలలో గొప్పవాడు, దశరథకుమారుడూ అయిన ఏ రాముడు బ్రహ్మాస్త్రమును, సకలవేదములను ఎరుగునో ఆ రాముడు నీ క్షేమమును తెలిసికొని రమ్మన్నాడు. 3

మూ. లక్ష్మణశ్చ మహాతేజా భర్తుస్తేఽనుచరః ప్రియః,
కృతవాన్ శోకసంతప్తః శిరసాతేఽభివాదనమ్. 4

ప్ర. అ. మహాతేజాః=గొప్పతేజస్సు కలవాడూ, తే భర్తుః=నీ భర్త యొక్క, ప్రియః=ఇష్టుడైన, అనుచరః=అనుచరుడూ అయిన, లక్ష్మణశ్చ=లక్ష్మణుడు కూడ, శోకసంతప్తః=శోకముచేత తపింపచేయబడినవాడై, శిరసా=శిరస్సుతో, తే=నీయొక్క, అభివాదనమ్=నమస్కారమును, కృతవాన్=చేసినాడు.

తా. నీ భర్తకు చాల ఇష్టుడైన అనుచరుడూ, గొప్ప తేజస్సు కలవాడూ అయిన లక్ష్మణుడు కూడ శోకముతో బాధపడుచు శిరస్సు వంచి నీకు అభివాదనము చేసినాడు. 4

మూ. సా తయోః కుశలం దేవీ నిశమ్య నరసింహయోః,
ప్రీతిసంహృష్టసర్వాఙ్గీ హనుమన్తమథాబ్రవీత్. 5

ప్ర. అ. సా దేవీ=ఆ సీతాదేవి, తయోః=ఆ, నరసింహయోః=నరశ్రేష్ఠులైన రామలక్ష్మణులయొక్క, కుశలమ్=క్షేమమును, నిశమ్య=విని, ప్రీతిసంహృష్టసర్వాఙ్గీ=ఆనందముతో వికసించిన సమస్త అవయవములు కలదై, అథ=పిమ్మట, హనుమన్తమ్=హనుమంతుని గూర్చి, అబ్రవీత్=పలికెను.

తా. ఆ సీతాదేవి నరులలో శ్రేష్ఠులైన రామలక్ష్మణుల క్షేమవార్త వినగానే ఆనందముతో గగుర్పొడిచిన సకలావయవములతో, హనుమంతునితో ఇట్లనెను. 5

మూ. కల్యాణీ బత గాథేయం లౌకికీ ప్రతిభాతి మే,
ఏతి జీవన్తమానన్దో నరం వర్షశతాదపి. 6

ప్ర. అ. జీవన్తమ్=జీవించి ఉన్న, నరమ్=నరుణ్ణి, వర్షశతాదపి=నూరు సంవత్సరాలకైనా, ఆనన్దః=ఆనందము, ఏతి=పొందును. ఇయమ్=ఈ, లౌకికీ=లో

కమునకు సంబంధించిన, గాథా=గాథ, కల్యాణీ=మంగళప్రదమైనదిగా, మా=నన్ను గూర్చి, (నాకు) ప్రతిభాతి=తోచుచున్నది.

తా. "మానవుడు కనుక జీవించి ఉన్నట్లయితే నూరు సంవత్సరాలకైనా ఆనందమును పొంద కలుగుతాడు". లోకములో ఉన్న ఈ సామెత మంగళకరమైనది, సత్యమైనది అని నేను తలచుచున్నాను. 6

మూ. తయా సమాగతే తస్మిన్ ప్రీతిరుత్పాదితాద్భుతా,
పరస్పరేణ చాలాపం విశ్వస్తౌ తౌ ప్రచక్రతుః. 7

ప్ర. అ. సమాగతే=వచ్చిన, తస్మిన్=ఆ హనుమంతునియందు, తయా=ఆ మెచేత, అద్భుతా=ఆశ్చర్యకరమైన, ప్రీతిః=స్నేహము, ఉత్పాదితా=పుట్టింపబడినది (చూపబడినది), తౌ=వారిద్దరూ, విశ్వస్తౌ=విశ్వసించిన వారై, పరస్పరేణ=పరస్పరముతో, ఆలాపం చ=సంభాషణను కూడ, చక్రతుః=చేసిరి.

తా. తన దగ్గరకు వచ్చిన ఆ హనుమంతునిపై సీత అద్భుతమైన స్నేహమును చూపెను. వారిద్దరూ విశ్వాసము కలవారై పరస్పరము సంభాషణము చేసిరి. 7

మూ. తస్యాస్తద్వచనం శ్రుత్వా హనుమాన్హరియూథపః,
సీతాయాః శోకదీనాయాః సమీపముపచక్రమే. 8

ప్ర. అ. హరియూథపః=వానర సేనాపతియైన, హనుమాన్=హనుమంతుడు, శోకదీనాయాః=శోకముచేత దీనురాలైన, తస్యాః=ఆ, సీతాయాః=సీతయొక్క, తత్=ఆ, వచనమ్=వచనమును, శ్రుత్వా=విని, సమీపమ్=సమీపమును గూర్చి, ఉపచక్రమే=మెల్లగా జరిగి వెళ్లెను.

తా. వానర సేనాధిపతియైన హనుమంతుడు శోకముచేత దీనురాలైన ఆ సీత మాట విని మెల్ల మెల్లగా ఆమె దగ్గరగా వెళ్ళెను. 8

మూ. యథా యథా సమీపం స హనుమానుపసర్పతి,
తథా తథా రావణం సా తం సీతా పరిశఙ్కతే. 9

ప్ర. అ. సః హనుమాన్=ఆ హనుమంతుడు, యథా యథా=ఎట్లు ఎట్లు, సమీపమ్=సమీపమును గూర్చి, ఉపసర్పతి=వచ్చుచున్నాడో, తథా తథా= అట్లు అట్లు, సా సీతా=ఆ సీత, తమ్=ఆతనిని, రావణమ్=రావణునిగా, పరిశఙ్కతే=శంకించుచున్నది.

తా. హనుమంతుడు తనకు దగ్గరగా వచ్చిన కొలది, ఆ సీత, అతడు రావణుడై యుండునని సందేహించెను. 9

మూ. అహో ధిగ్దుష్కృతమిదం కథితం హి యదస్య మే,
రూపాన్తరముపాగమ్య స ఏవాయం హి రావణః. 10

ప్ర. అ. అహో=అయ్యో ! ధిక్=ఛీ ! మే=నాయొక్క, ఇదమ్=ఈ, అస్య=వీనికి, కథితమ్=చెప్పుట, దుష్కృతమ్=చెడ్డపని చేయబడినది. అయమ్=ఇతడు, రూపాన్తరమ్=మరియొక రూపమును, ఉపాగమ్య=పొంది (వచ్చిన), సః రావణః హి= ఆ రావణుడే కదా !

తా. అయ్యో !ఛీ !ఛీ ! నేనీ విషయమంతా వీనికి చెప్పి ఎంత తప్పు చేసితిని ! ఆ రావణుడే ఈ రూపము ధరించి వచ్చినాడు ! 10

మూ. తామశోకస్య శాఖాం సా విముక్త్వా శోకకర్శితా,
తస్యామేవానవద్యాఙ్గీ ధరణ్యాం సముపావిశత్. 11

ప్ర. అ. అనవద్యాఙ్గీ=దోషములు లేని అవయవములు గల, సా=ఆ సీత, అశోకస్య=అశోకవృక్షముయొక్క, తామ్=ఆ, శాఖామ్=కొమ్మను, విముక్త్వా=విడచి, శోకకర్శితా=శోకముచేత కృశింపచేయబడినదై, తస్యామ్=ఆ, ధరణ్యామేవ=నేలమీదనే, సముపావిశత్=కూర్చుండెను.

తా. దోషములు లేని శరీరము గల ఆ సీత ఆ అశోకవృక్షశాఖను విడచి, శోకముచేత దుర్బలురాలై, నేలపైననే కూర్చుండెను. 11

మూ. హనుమానపి దుఃఖార్తాం తాం దృష్ట్వా భయమోహితామ్,
అవన్దత మహాబాహుస్తతస్తాం జనకాత్మజామ్. 12
సా చైనం భయవిత్రస్తా భూయో నైవాభ్యుదైక్షత.

ప్ర. అ. మహాబాహుః=గొప్ప బాహువులు గల, హనుమానపి=హనుమంతుడు కూడ, దుఃఖార్తామ్=దుఃఖముచేత పీడింపబడిన, భయమోహితామ్=భయముచేత మోహము చెందిన, తామ్=ఆమెను, దృష్ట్వా=చూచి, తతః=అటుపిమ్మట, తాం జనకాత్మజామ్=ఆ సీతను, అవన్దత=నమస్కరించెను. సా చ=ఆమె కూడ, భయవిత్రస్తా=భయముతో వణకుచు, ఏనమ్=ఈతనిని, భూయః=మరల, నాభ్యుదైక్షత=చూడలేదు.

తా. దుఃఖార్తురాలై భయముచేత ఏమీ ఆలోచించ లేని స్థితిలో ఉన్న ఆ సీతను చూచి, మహాబాహువైన హనుమంతుడు ఏమి చేయుటకూ తోచక కేవలము నమస్కరించెను. సీత కూడ భయభ్రాంతురాలై మరల హనుమంతుని వైపు చూడలేదు. 12

మూ. తం దృష్ట్వా వన్దమానం తు సీతా శశినిభాననా, 13
అబ్రవీద్దీర్ఘముచ్ఛ్వస్య వానరం మధురస్వరా.

ప్ర. అ. శశినిభాననా=చంద్రునితో సమానమైన ముఖము గల, సీతా=సీత, తమ్=ఆతనిని, వన్దమానమ్=నమస్కరించుచున్న వానినిగా, దృష్ట్వా=చూచి, దీర్ఘమ్=దీర్ఘముగా, ఉచ్ఛ్వస్య=నిట్టూర్చి, మధురస్వరా=మధురమైన స్వరము గలదై, వానరమ్=హనుమంతుని గూర్చి, అబ్రవీత్=పలికెను.

తా. చంద్రబింబము వంటి ముఖము గల సీత ఆ హనుమంతుడు తనకు నమస్కరించుచున్నట్లు చూచి, దీర్ఘముగా నిట్టూర్చి మధురమైన స్వరముతో ఆతనితో ఇట్లనెను. 13

మూ. మాయాం ప్రవిష్టో మాయావీ యది త్వం రావణః స్వయమ్, 14
ఉత్పాదయసి మే భూయః సంతాపం తన్న శోభనమ్.

ప్ర. అ. త్వమ్=నీవు, మాయామ్=మాయను, ప్రవిష్టః=ప్రవేశించిన, మాయావీ=మాయావియైన, స్వయమ్=స్వయముగా, రావణః యది=రావణుడవైతే, మే=నాకు, భూయః=ఇంకను, సంతాపమ్=బాధను, ఉత్పాదయసి=పుట్టించుచున్నావు. తత్=అది, శోభనమ్=మంచిది, న=కాదు.

తా. నీవు, సాక్షాత్తు, మాయారూపములో వచ్చిన రావణుడవే అయితే, నాకు మరల బాధ కలిగించుచున్నావు. ఇట్లు నాకు మాటిమాటికి బాధ కలిగించుట మంచిది కాదు. 14

మూ. స్వం పరిత్యజ్య రూపం యః పరివ్రాజకరూపధ్రుత్,
జనస్థానే మయా దృష్ట స్త్వం స ఏవాసి రావణః. 15

ప్ర. అ. యః రావణః=ఏ రావణుడు, స్వం రూపమ్=తన రూపమును, పరిత్యజ్య=విడచి, పరివ్రాజకరూపవాన్=పరివ్రాజకుని రూపము ధరించినవాడై, జనస్థానే=జనస్థానమునందు, మయా=నాచేత, దృష్టః=చూడబడినాడో, త్వం=నీవు, స ఏవ అసి=ఆ రావణుడవే.

తా. ఏ రావణుడు తన రూపమును విడచి పరివ్రాజక రూపముతో నాకు జనస్థానములో కనబడినాడో ఆ రావణుడవే నువ్వు. 15

మూ. ఉపవాసకృశాం దీనాం కామరూప నిశాచర,
సంతాపయసి మాం భూయస్సంతప్తాం తన్న శోభనమ్. 16

ప్ర. అ. కామరూప=ఇచ్ఛానుసారము రూపము ధరించు, నిశాచర=ఓ రాక్షసుడా!ఉపవాసకృశాం=ఉపవాసాలచేత కృశించిన, దీనాం=దీనురాలనైన, మామ్=నన్ను, భూయః=మరల, సన్తాపం=అత్యధికమైన తాపము కలుగునట్లుగా, సన్తాపయసి=బాధ పెట్టుచున్నావు, తత్=అది, శోభనం న=మంచిది కాదు.

తా. ఇష్టము ప్రకారము రూపాలు మార్చగలిగిన ఓ రాక్షసుడా! ఉపవాసాలతో కృశించి, దీనురాలనై ఉన్న నన్ను ఇంకను అధికముగా బాధించుచున్నావు. ఇది మంచిది కాదు. 16

మూ. అథవా నైతదేవం హి యన్మయా పరిశఙ్కితమ్, 17
మనసో హి మమ ప్రీతిరుత్పన్నా తవ దర్శనాత్.

ప్ర. అ. అథవా=లేదా, మయా=నాచేత, యత్=ఏది, పరిశఙ్కితమ్=శంకించబడినదో, ఏతత్=ఇది, ఏవమ్=ఇట్లు, న హి=కాదు, తవ=నీ యొక్క, దర్శనాత్=దర్శనమువలన, మమ=నాయొక్క, మనసః=మనస్సునకు, ప్రీతిః=సంతోషము, ఉత్పన్నా హి=పుట్టినది కదా.

తా. లేదా-నేను శంకించినది నిజము కాదు. ఎందుచేతననగా నిన్ను చూడగానే నా మనస్సుకు ఆనందము కలిగినది. 17

మూ. యది రామస్య దూత స్త్వమాగతో భద్రమస్తు తే, 18
పృచ్ఛామి త్వాం హరిశ్రేష్ఠ ప్రియా రామకథా హి మే.

ప్ర. అ. త్వమ్=నీవు, రామస్య=రామునియొక్క, దూతః=దూతగా, ఆగతఃయది=వచ్చినట్లయితే, తే=నీకు, భద్రమ్=మంగళము, అస్తు=ఆగుగాక. హరిశ్రేష్ఠ=ఓ! వానరశ్రేష్ఠా! మే=నాకు, రామకథా=రాముని కథ, ప్రియా హి=ఇష్టమైనది కదా! త్వామ్=నిన్ను, పృచ్ఛామి=అడుగుచున్నాను.

తా. నీవు రాముని దూతగా వచ్చినవాడవే అయితే నీకు భద్రమగుగాక! ఓ! వానర శ్రేష్ఠా ! నాకు రామకథ చాలా ఇష్టము. అందుకే నిన్ను అడుగుచున్నాను. 18

మూ. గుణాన్రామస్య కథయ ప్రియస్య మమ వానర, 19
చిత్తం హరసి మే సౌమ్య నదీకూలం యథా రయః.

ప్ర. అ. వానర=ఓ! వానరా ! మమ=నాయొక్క, ప్రియస్య=ప్రియుడైన, రామస్య=రామునియొక్క, గుణాన్=గుణములను, కథయ=చెప్పుము. సౌమ్య=ఓ! సౌమ్యుడా ! నదీకూలమ్=నది ఒడ్డును, రయః యథా=వేగము వలె, మే=నాయొక్క, చిత్తమ్=చిత్తమును, హరసి=హరించుచున్నావు.

తా. ఓ! వానరా! నా ప్రియుడైన రాముని గుణములను వర్ణించి చెప్పుము. ప్రవాహవేగము నది ఒడ్డును హరించినట్లు నా చిత్తమును హరించుచున్నావు. 19

మూ. అహో స్వప్నస్య సుఖతా యాహమేవం చిరాహృతా, 20
ప్రేషితం నామ పశ్యామి రాఘవేణ వనౌకసమ్.

ప్ర. అ. స్వప్నస్య=స్వప్నముయొక్క, సుఖతా=సుఖకర మగుట, అహో=ఎంత ఆశ్చర్యము ! చిరాహృతా=చిరకాలము క్రితమే హరింపబడిన, యా=ఏ నేను, రాఘవేణ=రామునిచేత, ప్రేషితం నామ=పంపబడిన, వనౌకసమ్=వానరుని, ఏవమ్=ఈ విధముగా, పశ్యామి కిల=చూచుచున్నానో !

తా. చాల కాలము క్రితము అపహరింపబడిన నేను రాముడు పంపిన వానరుని చూచుచున్నానట. ఎంత సుఖకరమైన స్వప్నము వచ్చినది. ! 20

మూ. స్వప్నే౽పి యద్యహం వీరం రాఘవం సహలక్ష్మణమ్, 21
పశ్యేయం నావసీదేయం స్వప్నో౽పి మమ మత్సరీ.

ప్ర. అ. అహమ్=నేను, స్వప్నే౽పి=స్వప్నమునందైనా, సహలక్ష్మణమ్=లక్ష్మణునితో కూడిన, వీరమ్=వీరుడైన, రాఘవమ్=రాముని, పశ్యేయం యది=చూడగలిగినట్లయితే, నావసీదేయమ్=నశించకుందును, మమ=నా విషయమునందు, స్వప్నో౽పి=స్వప్నము కూడ, మత్సరీ=కోపము గలది.

తా. లక్ష్మణసమేతుడైన వీరుడైన రాముడు నాకు స్వప్నములో కనబడినను నేను జీవించగలిగేదానను. నా విషయములో స్వప్నము కూడా పగ పట్టిఉన్నది. 21

మూ. నాహం స్వప్నమిమం మన్యే స్వప్నే దృష్ట్వా హి వానరమ్, 22
న శక్యో౽భ్యుదయః ప్రాప్తుం ప్రాప్తశ్చాభ్యుదయో మమ.

ప్ర. అ. అహమ్=నేను, ఇమమ్=దీనిని, స్వప్నమ్=స్వప్నమునుగా, న మన్యే=తలవను. స్వప్నే=స్వప్నమునందు, వానరమ్=వానరుణ్ణి, దృష్ట్వా=చూచి, అభ్యుదయః=అభ్యుదయము (భాగ్యాభివృద్ధి), ప్రాప్తుమ్=పొందుటకు, న శక్యః=శక్యమైనది కాదు. మమ=నాకు, అభ్యుదయః=అభ్యుదయము, ప్రాప్తశ్చ=వచ్చినది.

తా. ఇది స్వప్నమని అనుకొనను. స్వప్నములో వానరుణ్ణి చూచినవారు అభ్యుదయము పొందజాలరు. నాకు అభ్యుదయము కలిగినది కదా ! 22

మూ. కిం ను స్యాచ్చిత్తమోహో౽యం భవేద్వాతగతిస్త్వియమ్, 23
ఉన్మాదజో వికారో వా స్యాదియం మృగతృష్ణికా.

ప్ర. అ. అయమ్=ఇది, చిత్తమోహః=చిత్తముయొక్క మోహము, స్యాత్ కిం ను=అగునా ? ఇయమ్=ఇది, వాతగతిః=వాతముయొక్క ప్రకోపము, భవేత్=అగునా ? ఉన్మాదజః=ఉన్మాదము (పిచ్చి) వలన కలిగిన, వికారో వా=వికారమా ? ఇయమ్=ఇది, మృగతృష్ణికా=ఎండమావి, స్యాత్=అగునా ?

తా. నా కేమైనా చిత్తమునకు మోహము కలిగినదా ? ఇది ఏమైనా వాత ప్రకోపమా ? ఉన్మాదమువలన కలిగిన వికారమా ? లేక ఇదంతా ఏమీ లేని ఎండమావులేనా ? 23

మూ. అథవా నాయమున్మాదో మోహోఽప్యున్మాదలక్షణః, 24
సంబుధ్యే చాహమాత్మానం చాముం చాపి వనౌకసమ్.

ప్ర. అ. అథవా=లేదా, అయమ్=ఇది, ఉన్మాదః=ఉన్మాదము గాని, ఉన్మాదలక్షణః=ఉన్మాదము వంటి లక్షణములు గల, మోహోఽపి=మోహము కూడ గాని, న=కాదు, అహమ్=నేను, ఆత్మానమ్=నన్నుగూర్చి, ఇమమ్=ఈ, వనౌకసమ్=వానరుని గూర్చి, సంబుధ్యే=తెలుసుకొనుచున్నాను.

తా. లేదా-ఇది ఉన్మాదమూ కాదు, ఉన్మాదలక్షణములున్న మోహమూ కాదు. ఎందుచేత ననగా-నేను నన్ను, ఈ వానరునీ కూడ గుర్తుపట్టగలుగుచున్నాను.

మూ. ఇత్యేవం బహుధా సీతా సంప్రధార్య బలాబలమ్, 25
రక్షసాం కామరూపత్వాన్మేనే తం రాక్షసాధిపమ్.

ప్ర. అ. సీతా=సీత, ఇత్యేవమ్=ఈ విధముగా, బలాబలమ్=(వివిధ యుక్తులలోని) బలాబలములను (ఏది సంభావ్యము, ఏది కాదు అను విషయమును), బహుధా=అనేకవిధములుగా, సంప్రధార్య=నిర్ణయించి, రక్షసామ్=రాక్షసులు, కామరూపత్వాత్=కామరూపము కలవారగుటవలన, తమ్=ఆతనిని, రాక్షసాధిపమ్=రావణునిగా, మేనే=తలచెను.

తా. సీత ఈ విధముగ పరి పరి విధముల బలాబలములను ఆలోచించి, రాక్షసులు కామరూపులు గాన ఇతడు రావణుడే అని చివరికి నిర్ణయించుకొనెను. 25

మూ. ఏతాం బుద్ధిం తదా కృత్వా సీతా సా తనుమధ్యమా, 26
న ప్రతివ్యాజహారాథ వానరం జనకాత్మజా.

ప్ర. అ. తదా=అప్పుడు, తనుమధ్యమా=సన్నని నడుము గల, జనకాత్మజా=జనకుని కుమార్తెయైన, సా సీతా=ఆ సీత, ఏతామ్=ఈ, బుద్ధిమ్=

బుద్ధిని, కృత్వా=చేసి, అథ=అటుపిమ్మట, వానరమ్=హనుమంతుని గూర్చి, న ప్రతివ్యాజహార=తిరిగి పలకలేదు.

తా. అప్పుడు, సన్నని నడుము గల, జనకాత్మజయైన ఆ సీత ఈ విధముగా నిర్ణయించుకొని, ఇక హనుమంతునకు ప్రత్యుత్తరమివ్వలేదు. 26

మూ. సీతాయాశ్చిన్తితం బుద్ధ్వా హనుమాన్మారుతాత్మజః, 27
శ్రోత్రానుకూలైర్వచనైస్తదా తాం సంప్రహర్షయత్.

ప్ర. అ. మారుతాత్మజః=వాయుపుత్రుడైన, హనుమాన్=హనుమంతుడు, సీతాయాః=సీతయొక్క, చిన్తితమ్=ఆలోచనను, బుద్ధ్వా=తెలిసికొని, తదా=అప్పుడు, తామ్=ఆమెను, శ్రోత్రానుకూలైః=చెవులకు అనుకూలములైన, వచనైః=మాటలతో, సంప్రహర్షయత్=సంతోషపెట్టెను.

తా. వాయుపుత్రుడైన హనుమంతుడు సీత ఆలోచనను కనిపెట్టి, అపుడామెను చెవులకు అనుకూలములైన మాటలతో సంతోషపెట్టెను. 27

మూ. ఆదిత్య ఇవ తేజస్వీ లోకకాన్తః శశీ యథా, 28
రాజా సర్వస్య లోకస్య దేవో వైశ్రవణో యథా,
విక్రమేణోపపన్నశ్చ యథా విష్ణుర్మహాయశాః. 29

ప్ర. అ. (రాముడు), ఆదిత్య ఇవ=సూర్యుడు వలె, తేజస్వీ=గొప్ప తేజస్సు కలవాడు, శశీ యథా=చంద్రుడు వలె, లోకకాన్తః=లోకములకు మనోహరుడు, దేవః=దేవుడైన, వైశ్రవణో యథా=కుబేరుడు వలె, సర్వస్య=సమస్తమైన, లోకస్య=లోకమునకు, రాజా=రాజు. మహాయశాః=గొప్ప కీర్తి కలవాడు. విష్ణుః యథా=విష్ణువు వలె, విక్రమేణ=పరాక్రమముతో, ఉపపన్నశ్చ=కూడినవాడు.

తా. రాముని తేజస్సు సూర్యుని తేజస్సు వంటిది. అతడు చంద్రుడు వలె లోకములకు (జనులకు) మనోహరుడు. కుబేరుడువలె సకలలోకములకు ప్రభువు. విష్ణువు వలె పరాక్రమవంతుడు. గొప్ప కీర్తి కలవాడు. 28, 29

మూ. సత్యవాదీ మధురవాగ్దేవో వాచస్పతిర్యథా,
రూపవాన్ సుభగః శ్రీమాన్ కన్దర్ప ఇవ మూర్తిమాన్. 30

ప్ర. అ. సత్యవాదీ=సత్యము పలుకువాడు. దేవః=దేవుడైన, వాచస్పతిర్యథా=బృహస్పతి వలె, మధురవాక్=మధురమైన వాక్కు కలవాడు. రూపవాన్=రూపవంతుడు. సుభగః=మంచి భాగ్యము కలవాడు. శ్రీమాన్=శోభకలవాడు. మూర్తిమాన్=శరీరము గల, కన్దర్పః ఇవ=మన్మథుడు వలె ఉన్నవాడు.

తా. రాముడు సత్యమునే పలుకును. బృహస్పతి వలె మధురముగా మాటలాడును. రూపవంతుడు. మంచి భాగ్యము కలవాడు. మంచి శోభ కలవాడు. దేహము ధరించిన మన్మథుని వలె ఉండును. 30

మూ. స్థానక్రోధః ప్రహర్తా చ శ్రేష్ఠో లోకే మహారథః,
బాహుచ్ఛాయామవష్టబ్ధో యస్య లోకో మహాత్మనః. 31

ప్ర. అ. స్థానక్రోధః=తగినవాని విషయమున కోపము గలవాడు. ప్రహర్తా చ=తగిన వారిని దెబ్బతీయువాడు. లోకే=లోకమునందు, శ్రేష్ఠః=శ్రేష్ఠుడైన, మహారథః=మహారథుడు. (తనను, సారథిని, గుఱ్ఱములను రక్షించుకొనుచు పదివేలమంది ధనుర్ధరులతో యుద్ధము చేయగలవాడు మహారథుడు). లోకః=లోకము, యస్య=ఏ, మహాత్మనః=మహాత్మునియొక్క, బాహుచ్ఛాయామ్=బాహువుల నీడను, సమాశ్రితః=ఆశ్రయించినదో.

తా. రాముడు కోపము చూపవలసిన సమయములో కోపము చూపించును. తగినవారిని సంహరించును. లోకములో శ్రేష్ఠుడైన మహారథుడు. ఆ మహాత్ముని బాహువుల నీడను ఆశ్రయించుకొని లోకము జీవించుచున్నది.31

మూ. అపకృష్యాశ్రమపదాన్మృగరూపేణ రాఘవమ్,
శూన్యే యేనాపనీతాసి తస్య ద్రక్ష్యసి యత్ ఫలమ్. 32

ప్ర. అ. యేన=ఏ రావణునిచేత, రాఘవమ్=రాముణ్ణి, మృగరూపేణ=మృగరూపముచేత, ఆశ్రమపదాత్=ఆశ్రమస్థానమునుండి, అపకృష్య=దూరముగా తీసికొనిపోయి, శూన్యే=శూన్యమైన పర్ణశాలయందు, అపనీతా అసి=అపహరించబడితివో, తస్య=అట్టి రావణునకు, యత్=ఏ, ఫలమ్=ఫలము కలుగునో, ద్రక్ష్యసి=చూడగలవు.

తా. రావణుడు మాయామృగమునుచూపి, రాముడు దూరముగా వెళ్ళిపోవునట్లు చేసి, శూన్యమైన పర్ణశాల నుండి నిన్ను అపహరించినాడు కదా ! దానికి అతనికెట్టి ఫలము లభించనున్నదో నీవే చూడగలవు. 32

మూ. న చిరాద్రావణం సంఖ్యే యో వధిష్యతి వీర్యవాన్,
రోషప్రముక్తైరిషుభిర్జ్వలద్భిరివ పావకైః. 33
తేనాహం ప్రేషితో దూతస్త్వత్సకాశమిహాగతః,
త్వద్వియోగేన దుఃఖార్తః స త్వాం కౌశలమబ్రవీత్. 34

ప్ర. అ. వీర్యవాన్=పరాక్రమవంతుడైన, యః=ఏ రాముడు, నచిరాత్=అచి

రకాలములో, రోషప్రముక్తైః=రోషముతో విడువబడిన, జ్వలద్భిః=ప్రజ్వలించుచున్న, పావకైః ఇవ=అగ్నుల వలె ఉన్న, ఇషుభిః=బాణములచేత, సంఖ్యే=యుద్ధమునందు, రావణమ్=రావణుని, వధిష్యతి-చంపగలడో, తేన=అట్టి రామునిచేత, దూతః=దూతగా, ప్రేషితః=పంపబడినవాడనై, ఇహ=ఇక్కడికి, త్వత్సకాశమ్=నీ సమీపమును, ఆగతః=వచ్చినాను. త్వద్వియోగేన=నీ వియోగముచేత, దుఃఖార్తః=దుఃఖముచేత పీడింపబడిన, సః=ఆ రాముడు, త్వామ్=నిన్నుగూర్చి, కౌశలమ్=కుశలవార్తను, అబ్రవీత్=పలికెను.

తా. పరాక్రమవంతుడైన ఏ రాముడు ఇంక అతిశీఘ్రముగానే, మండుచున్న అగ్నుల వలె ఉన్న బాణములను కోపముతో ప్రయోగించి, యుద్ధములో రావణుని సంహరించ నున్నాడో ఆ రాముడే నన్ను దూతగా చేసి నన్నిక్కడికి నీ దగ్గరకు పంపినాడు. అతడు నీ వియోగముతో చాలా బాధపడుచున్నాడు. అతడు నీ కుశలమును తెలిసికొన గోరుచున్నాడు. 33, 34

మూ. లక్ష్మణశ్చ మహాతేజాః సుమిత్రానన్దవర్ధనః,
అభివాద్య మహాబాహుః స త్వాం కౌశలమబ్రవీత్. 35

ప్ర. అ. మహాతేజాః=గొప్ప తేజస్సు గల, సుమిత్రానన్దవర్ధనః=సుమిత్ర యొక్క ఆనందమును వృద్ధిపొందించు, మహాబాహుః=గొప్పబాహువులు గల, సః లక్ష్మణశ్చ=ఆ లక్ష్మణుడు కూడా, త్వామ్=నిన్ను, అభివాద్య=నమస్కరించి, కౌశలమ్=క్షేమమును, అబ్రవీత్=పలికెను.

తా. మహాతేజఃశాలీ, సుమిత్ర ఆనందమును వృద్ధిపొందించువాడు, మహాబాహువు అయిన ఆ లక్ష్మణుడు కూడ, నీకు నమస్కరించి నీ క్షేమవృత్తాంతమును అడిగినాడు (అడగమన్నాడు). 35

మూ. రామస్య చ సఖా దేవి సుగ్రీవో నామ వానరః,
రాజా వానరముఖ్యానాం స త్వాం కౌశలమబ్రవీత్. 36

ప్ర. అ. దేవి= ఓ ! దేవీ ! రామస్య=రామునియొక్క, సఖా=స్నేహితుడు, వానరముఖ్యానామ్=వానరశ్రేష్ఠులయొక్క, రాజా=రాజు అయిన, సుగ్రీవో నామ=సుగ్రీవుడను పేరు గల, సః వానరః=ఆ వానరుడు, త్వామ్=నిన్ను, కౌశలమ్=క్షేమమును, అబ్రవీత్=పలికెను.

తా. దేవీ ! రాముని స్నేహితుడు, వానర రాజు అయిన ఆ సుగ్రీవుడు కూడ నీ క్షేమము అడిగినాడు (అడుగమన్నాడు). 36

మూ. నిత్యం స్మరతి రామస్త్వాం ససుగ్రీవః సలక్ష్మణః,

దిష్ట్యా జీవసి వైదేహి రాక్షసీవశమాగతా. 37

ప్ర. అ. ససుగ్రీవః=సుగ్రీవునితో కూడిన, సలక్ష్మణః=లక్ష్మణునితో కూడిన, రామః=రాముడు, త్వామ్=నిన్ను, నిత్యమ్=ఎల్లప్పుడూ, స్మరతి=స్మరించుచున్నాడు. వైదేహి=సీతా ! రాక్షసీవశమ్=రాక్షసస్త్రీవశమును, ఆగతా=చెందిన నీవు, దిష్ట్యా=దైవవశముచేత, జీవసి=జీవించి ఉన్నావు.

తా. రామలక్ష్మణసుగ్రీవులు నిత్యము నిన్నే స్మరించుచున్నారు. ఓ ! వైదేహీ ! రాక్షసస్త్రీల వశములో ఉన్నా నీవు దైవవశముచేత జీవించి ఉన్నావు.37

మూ. నచిరాద్ద్రక్ష్యసే రామం లక్ష్మణం చ మహాబలమ్,
మధ్యే వానరకోటీనాం సుగ్రీవం చామితౌజసమ్. 38

ప్ర. అ. రామమ్=రాముణ్ణి, మహాబలమ్=గొప్పబలము గల, లక్ష్మణం=లక్ష్మణుణ్ణి, వానరకోటీనామ్=కోట్లకొలది వానరుల, మధ్యే=మధ్యయందున్న, అమితౌజసమ్=గొప్పతేజస్సు గల, సుగ్రీవం చ=సుగ్రీవుణ్ణి, నచిరాత్=కొంచెముకాలములో, ద్రక్ష్యసే=చూడగలవు.

తా. నీవు కొద్ది దినములలోనే రాముణ్ణి, మహాబలుడైన లక్ష్మణుణ్ణీ, కోట్ల కొలది వానరులతో వచ్చిన మహాతేజఃశాలి యైన సుగ్రీవుణ్ణీ చూడగలవు.

మూ. అహం సుగ్రీవసచివో హనుమాన్నామ వానరః,
ప్రవిష్టో నగరీం లఙ్కాం లఙ్ఘయిత్వా మహోదధిమ్. 39

ప్ర. అ. అహమ్=నేను, సుగ్రీవసచివః=సుగ్రీవుని సచివుడనైన, హనుమాన్నామ=హనుమంతుడను పేరు గల, వానరః=వానరుడను, మహోదధిమ్=మహాసముద్రమును, లఙ్ఘయిత్వా=దాటి, లఙ్కాం నగరీమ్=లంకానగరమును, ప్రవిష్టః=ప్రవేశించినాను.

తా. నేను సుగ్రీవుని సచివుడైన వానరుడను. నాపేరు హనుమంతుడు. మహాసముద్రమును దాటి లంకానగరములో ప్రవేశించినాను. 39

మూ. కృత్వా మూర్ధ్ని పదన్యాసం రావణస్య దురాత్మనః,
త్వాం ద్రష్టుముపయాతోఽహం సమాశ్రిత్య పరాక్రమమ్.

ప్ర. అ. దురాత్మనః=దుష్టబుద్ధియైన, రావణస్య=రావణునియొక్క, మూర్ధ్ని=శిరస్సుమీద, పదన్యాసమ్=పాదన్యాసమును, కృత్వా=చేసి, పరాక్రమమ్=పరాక్రమమును, సమాశ్రిత్య=ఆశ్రయించి, అహమ్=నేను, త్వామ్=నిన్ను, ద్రష్టుమ్=చూచుటకు, ఉపయాతః=వచ్చినాను.

తా. నేను పరాక్రమమును చూపుచు, దురాత్ముడైన రావణుని శిరస్సుపై

పాదము ఉంచి, నిన్ను చూచుటకై వచ్చినాను. 40

మూ. నాహమస్మి తథా దేవి యథా మామవగచ్ఛసి,
విశఙ్కా త్యజ్యతామేషా శ్రద్ధత్స్వ వదతో మమ. 41

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే సున్దరకాణ్డే
చతుస్త్రింశః సర్గః.

ప్ర. అ. దేవి=ఓ దేవీ ! మామ్=నన్ను గూర్చి, యథా=ఎట్లు, అవగచ్ఛసి=తెలుసుకొనుచున్నావో (భావించుచున్నావో), అహమ్=నేను, తథా=అట్లు, నాస్మి=కాను. ఏషా=ఈ, విశఙ్కా=సందేహము, త్యజ్యతామ్=విడువబడుగాక. వదతః=చెప్పుచున్న, మమ=నాకు, శ్రద్ధత్స్వ=నమ్ముము.

తా. ఓ ! దేవీ !నేను నీవు అనుకొన్నట్లు రావణుడను కాను. ఈ సందేహమును విడిచిపెట్టుము. నా మాట నమ్ముము. 41

*"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానము నందు
సుందరకాండలో ముప్పదినాల్గవ సర్గ సమాప్తము.*

అథ పఞ్చత్రింశః సర్గః

[సీత కోరికను అనుసరించి హనుమంతుడు రాముని శరీర లక్షణములను, గుణములను వర్ణించి చెప్పి, నరవానరుల మైత్రి ఎట్లు జరిగెనో కూడ తెలిపి, ఆమెకు తనపై విశ్వాసము కలుగునట్లు చేయుట].

మూ. తాం తు రామకథాం శ్రుత్వా వైదేహీ వానరర్షభాత్,
ఉవాచ వచనం సాన్త్వమిదం మధురయా గిరా. 1

ప్ర. అ. వైదేహీ=సీత, వానరర్షభాత్=వానరశ్రేష్ఠుడైన హనుమంతుని నుండి, తామ్=ఆ, రామకథామ్=రామకథను, శ్రుత్వా=విని, మధురయా=మధురమైన, గిరా=వాక్కుతో (స్వరముతో), సాన్త్వమ్=బుజ్జగింపుగా ఉన్న ("తత్త్వమ్" అను ప్రాచ్యపాఠము బాగున్నది. 'యథార్థమైన' అని అర్థము). ఇదమ్=ఈ, వచనమ్=వచనమును, ఉవాచ=పలికెను.

తా. సీత హనుమంతుడు చెప్పిన ఆ రామకథను విని, మధురస్వరముతో యథార్థమైన వచనమును ఇట్లు పలికెను. 1

మూ. క్వ తే రామేణ సంసర్గః కథం జానాసి లక్ష్మణమ్,
వానరాణాం నరాణాం చ కథమాసీత్సమాగమః. 2

ప్ర. అ. తే=నీకు, రామేణ=రామునితో, సంసర్గః=సంబంధము, క్వ=ఎక్కడ జరిగెను ? లక్ష్మణమ్=లక్ష్మణుని, కథమ్=ఎట్లు, జానాసి=ఎరుగుదువు ? వానరాణామ్=వానరులయొక్క, నరాణాం చ=నరులయొక్క, సమాగమః=సమాగమము, కథమ్=ఎట్లు, ఆసీత్=ఆయెను.

తా. నీకు రామునితో సంబంధము ఎక్కడ కలిగినది ? లక్ష్మణుని ఎట్లు ఎరుగుదువు ? వానరులకూ, నరులకూ సంబంధము ఎట్లు ఏర్పడినది ?2

మూ. యాని రామస్య లిఙ్గాని లక్ష్మణస్య చ వానర,
తాని భూయః సమాచక్ష్వ న మాం శోకః సమావిశేత్. 3

ప్ర. అ. వానర=ఓ ! హనుమంతుడా ! రామస్య=రామునియొక్క, లక్ష్మణస్య చ=లక్ష్మణునియొక్క, యాని=ఏ, లిఙ్గాని=గుర్తులు కలవో, తాని=వాటిని, సమాచక్ష్వ=చెప్పుము. మామ్=నన్ను, భూయః=మరల, శోకః=శోకము, న సమావిశేత్=చేరదు.

తా. ఓ హనుమంతుడా ! రాముని లక్షణములనూ, లక్ష్మణుని లక్షణములనూ వర్ణించి చెప్పుము. అవి విన్నచో నన్ను మరల శోకము ఆవహించదు. 3

మూ. కీదృశం తస్య సంస్థానం రూపం రామస్య కీదృశమ్,
కథమూరూ కథం బాహూ లక్ష్మణస్య చ శంస మే. 4

ప్ర. అ. తస్య=ఆ, రామస్య=రామునియొక్క, లక్ష్మణస్య చ=లక్ష్మణుని యొక్క, సంస్థానమ్=ఆకారము, కీదృశమ్=ఎట్టిది ? రూపమ్=రూపు, కీదృశమ్=ఎట్టిది ? ఊరూ=తొడలు, కథమ్=ఎట్లు ఉండును ? బాహూ=బాహువులు, కథమ్=ఎట్లు ఉండును ? మే=నాకు, శంస=చెప్పుము.

తా. ఆ రామలక్ష్మణుల ఆకారము ఎట్లు ఉండును ? రూప మెట్లుండును ? తొడలు ఎట్లుండును ? బాహువులు ఎట్లుండును ? నాకు చెప్పుము. 4

మూ. ఏవముక్తస్తు వైదేహ్యా హనుమాన్మారుతాత్మజః,
తతో రామం యథాతత్త్వమాఖ్యాతుముపచక్రమే. 5

ప్ర. అ. వైదేహ్యా=సీతచేత, ఏవమ్=ఇట్లు, ఉక్తః=పలకబడిన, మారుతాత్మజః=వాయుకుమారుడైన, హనుమాన్=హనుమంతుడు, తతః=పిమ్మట, రామమ్=రాముణ్ణిగూర్చి, యథాతత్త్వమ్=ఉన్నది ఉన్నట్లుగా, ఆఖ్యాతుమ్=చెప్పుటకు, ఉపచక్రమే=ఉపక్రమించెను.

తా. వాయుకుమారుడైన హనుమంతుడు సీత మాటవిని, రాముణ్ణి గూర్చి ఉన్నదున్నట్లు వర్ణించి చెప్పుటకు ఉపక్రమించెను. 5

మూ. జానన్తీ బత దిష్ట్యా మాం వైదేహి పరిపృచ్ఛసి,
భర్తుః కమలపత్రాక్షి సంస్థానం లక్ష్మణస్య చ. 6

ప్ర. అ. కమలపత్రాక్షి=తామరరేకుల వంటి నేత్రములు కలదానా! వైదేహి=సీతాదేవీ, జానన్తీ=తెలిసినదానవగుచునే, దిష్ట్యా=నా భాగ్యముచేత, భర్తుః=భర్తయొక్క, లక్ష్మణస్య చ=లక్ష్మణునియొక్కా, సంస్థానమ్= ఆకారమును, పరిపృచ్ఛసి=అడుగుచున్నావు. బత=ఎంత ఆనందము !

తా. కమలపత్రముల వంటి నేత్రములు గల ఓ ! సీతాదేవీ ! నా అదృష్టముచే, నీవే తెలిసి ఉండి కూడ నీ భర్తయైన రాముని ఆకారమునూ, లక్ష్మణుని ఆకారమునూ గూర్చి అడుగుచున్నావు. చాల సంతోషము ! 6

మూ. యాని రామస్య చిహ్నాని లక్ష్మణస్య చ యాని వై,
లక్షితాని విశాలాక్షి వదతః శృణు తాని మే. 7

ప్ర. అ. విశాలాక్షి=విశాలములైన నేత్రములు కలదానా ! రామస్య=రాముని యొక్క, యాని లక్షణాని=ఏ లక్షణములు, లక్ష్మణస్య చ=లక్ష్మణుని యొక్క, యాని=ఏ లక్షణములు, లక్షితాని=చూడబడినవో, తాని=వాటిని, వదతః=చెప్పుచున్న, మే=నాకు (నానుండి), శృణు=వినుము.

తా. ఓ !విశాలాక్షి ! నేను గుర్తించిన రాముని లక్షణములనూ, లక్ష్మణుని లక్షణములనూ చెప్పెదను ; వినుము. 7

మూ. రామః కమలపత్రాక్షః సర్వసత్త్వమనోహరః,
రూపదాక్షిణ్యసంపన్నః ప్రసూతో జనకాత్మజే. 8

ప్ర. అ. జనకాత్మజే=ఓ ! జనకరాజపుత్రీ ! రామః=రాముడు, కమలపత్రాక్షః=కమలపత్రముల వంటి నేత్రములు కలవాడు. సర్వసత్త్వమనోహరః=సమస్తప్రాణుల మనస్సును ఆకర్షించువాడు. రూపదాక్షిణ్యసంపన్నః=రూపముతోను దాక్షిణ్యముతోను (నేర్పుతోను) కూడినవాడుగా, ప్రసూతః=కనబడినాడు (పుట్టినాడు).

తా. సీతా ! రాముని కండ్లు పద్మముల రేకుల వలె విశాలమైనవి. అతడు సమస్తమైన ప్రాణుల మనస్సును ఆకర్షించు సౌందర్యము కలవాడు. అతడు పుట్టుకతోనే మంచి రూపముతోను, దాక్షిణ్యముతోను జనించినాడు. 8

మూ. తేజసాదిత్యసంకాశః క్షమయా పృథివీసమః,
బృహస్పతిసమో బుద్ధ్యా యశసా వాసవోపమః. 9

ప్ర. అ. తేజసా=తేజస్సుచేత, ఆదిత్యసంకాశః=సూర్యునితో సమానుడు. క్షమయా=ఓర్పుచేత, పృథివీసమః=భూమితో సమానుడు, బుద్ధ్యా=బుద్ధిచేత, బృహస్పతిసమః=బృహస్పతితో సమానుడు. యశసా=కీర్తిచేత, వాసవోపమః=దేవేంద్రునితో సమానుడు.

తా. రాముడు తేజస్సుచేత సూర్యునితోను, ఓర్పుచేత భూమితోను, బుద్ధిచేత బృహస్పతితోను, కీర్తిచేత దేవేంద్రునితోను సమానుడు. 9

మూ. రక్షితా జీవలోకస్య స్వజనస్యాభిరక్షితా,
రక్షితా స్వస్య వృత్తస్య ధర్మస్య చ పరంతపః. 10

ప్ర. అ. పరంతపః=శత్రువులను పీడించు ఆ రాముడు, జీవలోకస్య=ప్రాణిలోకమునకు, రక్షితా=రక్షకుడు. స్వజనస్య=తనవారికి, అభిరక్షితా=అధికముగా,

రక్షకుడు. స్వస్య=తనసంబంధమైన, వృత్తస్య=చరిత్రకు, ధర్మస్య చ=ధర్మమునకు, రక్షితా=రక్షకుడు. సః=అతడు, లోకానామ్=లోకముల, మర్యాదానామ్=కట్టుబాట్లకు, కర్తా=చేయువాడు, కారయితా చైవ=చేయించేవాడు కూడ.

తా. శత్రుసంహారకు డైన రాముడు ప్రపంచకములోని ప్రాణు లందరినీ, విశేషించి తనవారినీ, తన నడవడికనూ, ధర్మమునూ బాగుగా రక్షించుచుండును.

రామో భామిని లోకస్య చాతుర్వర్ణ్యస్య రక్షితా,
మర్యాదానాం చ లోకస్య కర్తా కారయితా చ సః. 11

ప్ర. అ. భామిని=సీతా, రామః=రాముడు, లోకస్య=ప్రపంచకమునకు, చాతుర్వర్ణ్యస్య=నాలుగు వర్ణములకు, రక్షితా=రక్షకుడు. సః=అతడు, లోకానామ్=లోకముల, మర్యాదానామ్=కట్టుబాట్లుకు, కర్తా=చేయువాడు, కారయితా చైవ=చేయించేవాడు కూడ.

తా. ఓ సీతా ! రాముడు ఈ సమస్త ప్రపంచకమును, నాలుగు వర్ణముల వారినీ రక్షించుచుండును. లోకములో కట్టుబాట్లు ఏర్పరచి అందరూ ఆ కట్టుబాట్లకు లొంగి ఉండునట్లు చూచుచుండును. 11

మూ. అర్చిష్మానర్చితోఽత్యర్థం బ్రహ్మచర్యవ్రతే స్థితః,
సాధూనాముపకారజ్ఞః ప్రచారజ్ఞశ్చ కర్మణామ్. 12

ప్ర. అ. అర్చిష్మాన్=కాంతి గలవాడు. అత్యర్థమ్=మిక్కిలి, అర్చితః=పూజించబడినవాడు. బ్రహ్మచర్యవ్రతే=బ్రహ్మచర్యవ్రతమునందు, స్థితః=ఉన్నవాడు. సాధూనామ్=సత్పురుషులయొక్క, ఉపకారజ్ఞః=ఉపకారమును ఎరిగినవాడు. కర్మణామ్=కర్మలయొక్క, ప్రచారజ్ఞశ్చ=ప్రవృత్తిని కూడ ఎరిగినవాడు.

తా. రాముడు కాంతిమంతుడు. మిక్కిలి గౌరవింపబడినవాడు: బ్రహ్మచర్యవ్రతములో ఉన్నవాడు. సత్పురుషులకు ఉపకార మెట్లు చేయవలెనో తెలిసినవాడు. ఆ యా కర్మల ప్రయోజనము, ఫలితము తెలిసినవాడు. అనగా ఏ పని చేసిన ఎట్టి ఫలితము కలుగునో ఊహించగలవాడు. 12

మూ. రాజవిద్యావినీతశ్చ బ్రాహ్మణానాముపాసితా,
శ్రుతవాన్ శీలసంపన్నో వినీతశ్చ పరంతపః. 13

ప్ర. అ. రాజవిద్యావినీతశ్చ=రాజవిద్యలో శిక్షణ పొందినవాడు, బ్రాహ్మణానామ్=బ్రాహ్మణులకు, ఉపాసితా=గౌరవించువాడు, శ్రుతవాన్=శాస్త్రాభ్యాసము కలవాడు. శీలసంపన్నః=మంచి శీలముతో కూడినవాడు. వినీతః=వినయవంతుడు, పరంతపః=శత్రువులను పీడించువాడు.

తా. రాముడు రాజనీతిని చక్కగా అభ్యసించెను. బ్రాహ్మణుల విషయమున గౌరవము చూపును. విద్యాశీలసంపన్నుడు. వినయవంతుడు. శత్రువులను పీడించువాడు. 13

మూ. యజుర్వేదవినీతశ్చ వేదవిద్భిః సుపూజితః,
ధనుర్వేదే చ వేదేషు వేదాఙ్గేషు చ నిష్ఠితః. 14

ప్ర. అ. యజుర్వేదవినీతశ్చ=యజుర్వేదమునందు శిక్షణము పొందినవాడు. వేదవిద్భిః=వేదవేత్తలచేత, సుపూజితః=బాగుగా పూజించబడినవాడు. ధనుర్వేదే చ=ధనుర్వేదమునందు, వేదేషు=ఇతరవేదములయందు, వేదాఙ్గేషు చ=వేదాంగములయందు, నిష్ఠితః=ప్రవీణుడు.

తా. రాముడు స్వశాఖయైన యజుర్వేదమును చక్కగా అధ్యయనము చేసెను. వేదవేత్తలందరు అతనిని గౌరవించుచుందురు. ధనుర్వేదమునందు, మిగిలిన మూడు వేదములందు, ఉపవేదములందు, వేదాంగములయందు పాండిత్యము కలవాడు. 14

మూ. విపులాంసో మహాబాహుః కమ్బుగ్రీవః శుభాననః,
గూఢజత్రుః సుతామ్రాక్షో రామో దేవి జనైః శ్రుతః. 15

ప్ర. అ. దేవి=ఓ దేవీ ! రామః=రాముడు, విపులాంసః=విశాలములైన భుజములు కలవాడు. మహాబాహుః=గొప్ప బాహువులు కలవాడు. కమ్బుగ్రీవః=శంఖము వంటి కంఠము గలవాడు. శుభాననః=మంగళప్రదమైన ముఖము కలవాడు. గూఢజత్రుః=పైకి కనబడని మూపుల సంధి యెముకలు కలవాడు. సుతామ్రాక్షః=అందమైన ఎఱ్ఱని నేత్రములు కలవాడు. జనైః=జనులచేత, శ్రుతః=వినబడినవాడు.

తా. రాముని భుజములు విశాలమైనవి. బాహువులు దీర్ఘ మైనవి.కంఠము శంఖాకారములో ఉండును. ముఖము మంగళప్రదమైనది. మూపుసంధి ఎముకలు పైకి కనబడవు. సుందరములైన అతని నేత్రములు ఎఱ్ఱగా ఉండును. రాముని గూర్చి విననివారు లోకములో లేరు. 15

మూ. దున్దుభిస్వననిర్ఘోషః స్నిగ్ధవర్ణః ప్రతాపవాన్,
సమః సమవిభక్తాఙ్గో వర్ణం శ్యామం సమాశ్రితః. 16

ప్ర. అ. దున్దుభిస్వననిర్ఘోషః=దుందుభిధ్వని వంటి కంఠధ్వని కలవాడు. స్నిగ్ధవర్ణః=నిగనిగలాడు శరీరచ్ఛాయ గలవాడు. ప్రతాపవాన్=ప్రతాపవంతుడు. సమః=పొట్టిగా గాని, పొడవుగా గాని కాక సమముగా ఉన్నవాడు. సమవిభక్తాఙ్గః=సమముగా విభజింపబడిన అవయవములు కలవాడు. శ్యామమ్=నల్లని, వర్ణమ్=వర్ణమును, సమాశ్రితః=ఆశ్రయించినవాడు.

తా. రాముని కంఠధ్వని దుందుభిధ్వని వలె గంభీరముగా ఉండును. రంగు నిగనిగ లాడుచుండును. అతడు గొప్ప ప్రతాపము గలవాడు. (పొట్టి పొడవులు లేక) సమముగా ఉండును. ఆతని అవయవము లన్నీ సమముగా విభక్తములై ఉండును. ఆతని శరీరచ్ఛాయ శ్యామము (చామన). 16

మూ. త్రిస్థిరస్త్రిప్రలమ్బశ్చ త్రిసమస్త్రిషు చోన్నతః,
త్రితామ్రస్త్రిషు చ స్నిగ్ధో గమ్భీరస్త్రిషు నిత్యశః. 17

ప్ర. అ. (రాముడు), త్రిస్థిరః=వక్షస్థలము, ముంజేయి, పిడికిలి అను మూడింటియందు స్థైర్యము కలవాడు. "ఉరశ్చ మణిబన్ధశ్చ ముష్టిశ్చ నృపతేః స్థిరాః" అని సాముద్రికశాస్త్రప్రకారము ఇది రాజలక్షణము. త్రిప్రలమ్బశ్చ=కనుబొమ్మలు, ముష్కములు, బాహువులు అను మూడింటియందు దీర్ఘత్వము కలవాడు. "ప్రలమ్బా యస్య స ధనీ త్రయో భ్రూముష్కబాహవః" అని ఇది ధనికలక్షణముగా చెప్పబడినది. త్రిసమః=తలవెంట్రుకలు, ముష్కములు, మోకాళ్ళు అను మూడింటియందు హెచ్చుతగ్గులు లేకుండా సమముగా ఉన్నవాడు. "కేశాగ్రం వృషణం జాను సమా యస్య స భూపతిః" అని ఇది రాజలక్షణము. త్రిషు=బొడ్డు, క్రిందికడుపు, వక్షఃస్థలము అను మూడింటియందు, ఉన్నతః=ఎత్తైనవాడు (పొడవు గలవాడు). "నాభ్యన్తఃకుక్షివక్షోభిరున్నతః క్షితిపో భవేత్"అని ఇది కూడ రాజలక్షణము, త్రితామ్రః=నేత్రాంతములు, గోళ్లు, అరచేతులు-అరకాళ్ళు అను మూడింటియందు ఎఱ్ఱగా ఉన్నవాడు. "నేత్రాన్త నఖపాణ్యఙ్ఘ్రితలై స్తామ్రైః సుఖీ భవేత్" - అని ఇది సుఖవంతుని లక్షణము. త్రిషు చ=పాదములయందున్న రేఖలు, తలవెంట్రుకలు లింగమణి అను మూడింటియందు, స్నిగ్ధః=నునుపుకలవాడు. "స్నిగ్ధా భవన్తి వై యేషాం పాదరేఖాః శిరోరుహాః తథా లిఙ్గమణిస్తేషాం మహాభాగ్యం వినిర్దిశేత్" అని ఇది మహాభాగ్యవంతుని లక్షణము. నిత్యశః=ఎల్లప్పుడూ, త్రిషు=కంఠధ్వని, నడక, నాభి అను మూడింటియందు, గమ్భీరః=గంభీరుడు (నాభిలో గాంభీర్యమనగా లోతు). "స్వరే గతౌ చ నాభౌ చ గమ్భీరస్త్రిషు శస్యతే" అని ఇది ప్రశంసాపాత్రుని లక్షణము.

తా. రాముని వక్షఃస్థలము, ముంజేయి, పిడికిలి స్థిరముగా ఉండును. ఆతని కనుబొమ్మలు, ముష్కములు, బాహువులు దీర్ఘములు. కేశములు, ముష్కములు, మోకాళ్లు హెచ్చుతగ్గులు లేకుండా ఉండును. నాభి, కడుపు క్రింది భాగము, వక్షఃస్థలము పొడవుగా ఉండును. నేత్రాంతములు, గోళ్లు, అరచేతులు అరకాళ్లు ఎఱ్ఱగా ఉండును. పాదరేఖలు, కేశములు, లింగమణి నున్నగా ఉండును. కంఠధ్వని, నడక, నాభి గంభీరముగా ఉండును. 17

మూ. త్రివలీవాంస్త్ర్యవనతశ్చతుర్వ్యఙ్గస్త్రిశీర్షవాన్,
చతుష్కలశ్చతుర్లేఖశ్చతుష్కిష్కుశ్చతుఃసమః. 18

ప్ర. అ. త్రివలీవాన్=ఉదరమునందు మూడు ముడతలు కలవాడు. త్ర్యవనతః=స్తనములు, స్తనాగ్రములు, రేఖలు అను మూడింటియందు లోతైనవాడు. "పీనోపచితైర్నిమ్నైఃక్షితిపతయశ్చూచుకైః స్తనైః సుఖినః స్నిగ్ధా నిమ్నా రేఖా ధనినాం తద్వ్యత్యయేన నిస్స్వానామ్" అని చెప్పినట్లు బలిసి పల్లముగా స్తనములుండుట రాజలక్షణము. స్తనాగ్రములు లోతుగా ఉండుట ధనికలక్షణము. రేఖలు నున్నగా లోతుగా ఉండుట ధనికలక్షణము. తద్భిన్నముగా ఉండుట దరిద్రలక్షణము. చతుర్వ్యఙ్గః=కంఠము, లింగము, వీపు, పిక్క అను నాలుగు హ్రస్వములుగా ఉన్నవాడు. "గ్రీవా ప్రజననం పృష్ఠం హ్రస్వం జఙ్ఘా చ పూజ్యతే" అని చెప్పినట్లు ఇవి పూజ్యాని లక్షణములు. త్రిశీర్షవాన్=మూడు సుళ్లు శిరస్సునందు కలవాడు. "ఆవర్తత్రయరుచిరం యస్య శిరః స క్షితిభృతాం నేతా" అని. ఇది రాజులు నాయకుని లక్షణము. చతుష్కలః=నాలుగువేదములను సూచించు రేఖలు కలవాడు. "మూలేఽఙ్గుష్ఠస్య వేదానాం చతస్రస్త్రిస ఏవ వా, ఏకా ద్వే వా యథాయోగం రేఖా జ్ఞేయా ద్విజన్మనామ్" అని చెప్పుటచే అంగుష్ఠము మొదట్లో ఎన్ని రేఖలుండునో అన్ని వేదములలో ప్రావీణ్యముండును. చతుర్లేఖః=నాలుగురేఖలు కలవాడు. "లలాటే యస్య దృశ్యన్తే చతుస్త్రిద్వ్యేక రేఖికాః, శతద్వయం శతం షష్టిస్తస్యాయుర్వింశతిస్తథా" (లలాటముమీద ఒక రేఖ ఉన్నచో ఇరవై సంవత్సరములు, మూడు ఉన్నచో అరవై సంవత్సరములు, రెండుఉన్నచో నూరు సంవత్సరాలు నాలుగు ఉన్నచో రెండువందల సంవత్సరాలు ఆయుర్దాయము). "యస్య పాదతలే వజ్రధ్వజశఙ్ఖాఙ్కుశోపమాః, రేఖాః సమ్యక్ ప్రకాశన్తే మనుజేన్ద్రం తమాదిశేత్" (అరికాలులో వజ్ర-ధ్వజ-శంఖ-అంకుశముల ఆకారములుగ రేఖలున్నవాడు మనుజేంద్రుడగును). "పాణౌ చతస్రో రేఖాశ్చ యస్య తిష్ఠన్త్యభఙ్గురాః" (ఇట్టినాలుగు రేఖలే విరిగిపోకుండగా చేతిలో ఉన్నవాడు కూడ మనుజేంద్రుడగును). ఈ విధముగా ఆయా అవయవములలో నాలుగేసి రేఖలు కలవాడని అర్థము. చతుష్కిష్కుః=నాలుగు హస్తముల ప్రమాణము కలవాడు. ఇరవైనాలుగు అంగుళములు ఒక హస్తము. అందుచేత తొంభైఆరు అంగుళములు ఎత్తైనవాడు అని అర్థము. "షణ్ణవత్యఙ్గులోత్సేధో యః పుమాన్ స దివౌకసః" (తొంభై ఆరు అంగుళాలు పొడవైనవాడు దేవతలతో సమానుడు.) చతుస్సమః=బాహువులు, మోకాళ్లు, తొడలు, పిక్కలు అను నాలిగింటియందు సమముగా హెచ్చుతగ్గులు లేకుండా ఉన్నవాడు. "బాహుజానూరుజఙ్ఘాశ్చ చత్వార్యథ సమాని చ".

తా. రాముని ఉదరముపై మూడు ముడతలున్నవి. ఆతని స్తనములు, స్తనాగ్రములు, రేఖలు పల్లముగా ఉండును. కంఠము, లింగము, వీపు, పిక్కలు హ్రస్వములుగా ఉండును. ఆతని తలపై మూడు సుళ్లు ఉండును. అంగుష్ఠము మొదట నాలుగు రేఖలుండును. ఆతని నుదుటిపైన, అరచేతులలోను, అరకాళ్లలోను నాలుగేసి రేఖలు ఉండును. ఆతడు తొంభైయారు అంగుళములు ఎత్తు ఉండును. ఆతని బాహువులు, మోకాళ్లు, తొడలు, పిక్కలు సమానములుగా ఉండును.

వి. "స్థిరా త్రిరేఖా సుభగోపపన్నా స్నిగ్ధా సుమాంసోపచితా సువృత్తా, న చాతిదీర్ఘా చతురఙ్గులా చ గ్రీవా చ దీర్ఘా భవతీహ ధన్యా" (కంఠము స్థిరముగా, మూడురేఖలతో అందమైనదై, సుందరమై, బలిసి గుండ్రముగా ఉండవలెను. ఎక్కువ పొడవుగా ఉండకూడదు. నాలుగు అంగుళములు పొడవు ఉండవలెను) అని చెప్పినట్లు "త్రివలీవాన్" అనుదానికి కంఠముమీద మూడురేఖలు కలవాడు అని కూడ అర్థము వ్యాఖ్యానములలో ఉన్నది. స్తనములు పల్లముగా ఉన్నవి అనగా అర్థమేమో తెలియలేదు. 18

మూ. చతుర్దశసమద్వన్ద్వశ్చతుర్దంష్ట్రశ్చతుర్గతిః,
మహోష్ఠహనునాసశ్చ పఞ్చస్నిగ్ధోఽష్టవంశవాన్. 19

ప్ర. అ. చతుర్దశసమద్వన్ద్వః=పద్నాలుగు జతలు సమముగా (హెచ్చు తగ్గులు లేకుండా) ఉన్నవాడు. రెండేసిగా ఉన్న కనుబొమ్మలు, ముక్కు రంధ్రములు, నేత్రములు, చెవులు, పెదవులు, స్తనాగ్రములు, మోచేతులు, ముంజేతులు, మోకాళ్లు, ముష్కములు, చేతులు, పాదములు, పిరుదులపై ఎత్తైన కందరములు, హెచ్చుతగ్గులు లేకుండా ఉన్నవని అర్థము. "భ్రువౌ నాసాపుటే నేత్రే కర్ణావోష్ఠౌ చ చూచుకే, కూర్పరౌ మణిబన్ధౌ చ జానునీ వృషణౌ కటీ, కరౌ పాదౌ స్ఫిజౌ యస్య సమౌ జ్ఞేయః స భూపతిః" అని చెప్పిన విధముగా ఇవి రాజలక్షణములు. చతుర్దంష్ట్రః=నాలుగు కోరలు (సూదిగా ఉన్న దంతాలు) కలవాడు. పండ్లవరుసలు రెండింటిలో మధ్య ఉన్న నాలుగు పండ్లకు ప్రక్క ఉన్న నాలుగు పండ్లకు దంష్ట్ర లని పేరు. కాంతి గలవి, పెద్దవి, తీక్ష్ణమైనవి, సమములు అయిన దంష్ట్రలు మంగళకరము లని చెప్పబడినది. "స్నిగ్ధా ఘనాశ్చ దశనాః సుతీక్ష్ణదంష్ట్రాః సమాశ్చ శుభాః". చతుర్గతిః=నాలుగు మృగముల నడక వంటి- అనగా సింహము, పెద్దపులి, ఏనుగ, వృషభము-వీటి నడక వంటి నడక గలవాడు. మహోష్ఠహనునాసశ్చ=పెద్దవైన, (అనగా కొట్టవచ్చినట్లు అందముగా కనబడే) పెదవులు, గడ్డము, ముక్కు కలవాడు. "బంధుజీవకుసుమోపమోఽధరో మాంసలో రుచిరబిమ్బరూపధృత్, పూర్ణమాంసలహనుస్తుభూమిపస్తుఙ్గతుణ్డరుచిరాకృతిస్తథా" (మంకెనపువ్వు వంటి

రంగుతో బలిసి మనోహరమై, దొండపండు ఆకారములో ఉన్న అధరోష్ఠము, బలిసి నిండుగా ఉన్న గడ్డము, ఎత్తైన ముక్కు ఉన్నవాడు రాజగును అని చెప్పబడినది. పఞ్చస్నిగ్ధః=కాంతితో నిగనిగలాడుచుండు నేత్రములు, దంతములు, చర్మము, పాదాలు, కేశాలు అను ఈ ఐదు కలవాడు, "చక్షుః స్నేహేన సౌభాగ్యం దన్తస్నేహేన భోజనమ్, త్వచః స్నేహేన శయనం పాదస్నేహేన వాహనమ్; స్నిగ్ధనీలమృదుకుఞ్చితాస్తథా మూర్ధజాః సుఖకరాః" నేత్రములు నిగనిగలాడువారికి సౌభాగ్యము, దంతములు నిగనిగలాడువారికి మంచి భోజనము, చర్మము నిగనిగలాడువారికి మంచి శయనము, పాదములు నిగనిగలాడువారికి వాహనసౌఖ్యము, నల్లగా, మెల్లగా, వంకరగా నిగనిగలాడు కేశములు కలవారికి సుఖము కలుగును) అని సాముద్రికశాస్త్రము. అష్టవంశవాన్=అందమైన ఎనిమిది వంశకములు కలవాడు. రెండుచేతులు, కాలివ్రేళ్లు, చేతివ్రేళ్లు, రెండు తొడలు, రెండు పిక్కలు వీటికి వంశకము లని పేరు. "బాహూ చ నలకౌ చోరూ జఙ్ఘే చేత్యష్టవంశకాః".

తా. రాముని కనుబొమ్మలు, నాసికారంధ్రములు, నేత్రములు, చెవులు, పెదవులు, స్తనాగ్రములు, మోచేతులు, మణికట్లు, మోకాళ్లు, ముష్కములు, పిరుదులు, చేతులు, పాదములు, పిరుదులపై ఎత్తైన కండరములు-జంటలుగా ఉన్న ఈ అన్ని అంగములూ సమములుగా ఉండును. అందమైన నాలుగు దంష్ట్రము ఉండును. అతడు సింహము వలె, పెద్దపులి వలె, ఏనుగ వలె వృషభము వలె నడచును. ఆతని పెదవులు, గడ్డము, ముక్కు, చాల అందముగా ఉండును. ఆతని కండ్లు, పండ్లు, చర్మము, పాదములు, కేశములు, నిగనిగలాడుచుండును. ఆతని బాహువులు, వ్రేళ్లు, తొడలు, పిక్కలు అను అష్టవంశకములు తీర్చిదిద్దినట్లుండును. 19

మూ. దశపద్మో దశబృహత్త్రిభిర్వ్యాప్తో ద్విశుక్లవాన్,
షడున్నతో నవతనుస్త్రిభిర్వ్యాప్నోతి రాఘవః. 20

ప్ర. అ. రాఘవః=రాముడు, దశపద్మః=పద్మము వలె ఉన్న ముఖము, నేత్రములు, నోరు, నాలుక, పెదవులు, దవడలు, స్తనములు, గోళ్లు, హస్తములు, పాదములు అను పది అవయవములు కలవాడు. "ముఖనేత్రాస్యజిహ్వోష్ఠ తాలుస్తననఖాః కరౌ, పాదౌ చ దశ పద్మాని పద్మాకారాణి యస్య చ" అని సాముద్రికశాస్త్రము. దశబృహత్=శిరస్సు, లలాటము, చెవులు, కంఠము, వక్షము, హృదయము, నోరు, చేతులు, కాళ్లు, వీపు అను ఈ పది అవయవములు పెద్దవిగా ఉన్నవాడు. "శిరోలలాటే శ్రవణే గ్రీవా వక్షశ్చ హృత్తథా, ఉదరం పాణిపాదౌ చ పృష్ఠం దశ బృహన్తి చ". త్రిభిః=తేజస్సు, యశస్సు, లక్ష్మి అను మూడింటిచేత

; వ్యాప్తః=(లోకమును) వ్యాపించినవాడు. "త్రిభిర్వ్యాప్తశ్చ యస్య స్యాత్తేజసా యశసా శ్రియా" ద్విశుక్లవాన్=శుద్ధములైన మాతృవంశపితృవంశములు కలవాడు. "ద్వౌ శుక్లౌ తు శుభౌ శుద్ధౌ వంశౌ మాతుః పితుస్తథా" అని శాస్త్రము. షడున్నతః=చంకలు, కడుపు, వక్షము, ముక్కు, మూపు, లలాటము అను ఆరు అంగములు ఉన్నతములైనవి కలవాడు, "కక్షః కుక్షిశ్చ వక్షశ్చ ఘ్రాణస్కన్ధౌ లలాటికా, సర్వభూతేషు నిర్దిష్టా ఉన్నతాఙ్గాః శుభప్రదాః" అని సాముద్రికము. నవతనుః=తొమ్మిదింట సూక్ష్మమైనవాడు. వ్రేళ్ల కణుపులు, వెంట్రుకలు, రోమములు, గోళ్లు, చర్మము, లింగము, మీసము, దృష్టి, బుద్ధి సూక్ష్మములుగా (సన్నగా అని అవయవముల పక్షమునందు, దృష్టిబుద్ధిపక్షములందు మంచి చురుకుగలవని అర్థము) ఉండవలెనని సాముద్రికశాస్త్రము. "సూక్ష్మాణ్యఙ్గులిపర్వాణి కేశరోమనఖత్వచః, శేఫశ్చ యేషాం సూక్ష్మాణి తే నరా దీర్ఘజీవినః; అస్ఫుటితాగ్రం సూక్ష్మం శ్మశ్రు శుభం మృదు చ సంతతం స్నిగ్ధమ్" "సూక్ష్మదృక్ సూక్ష్మబుద్ధిశ్చ యో నరః స సుఖీ భవేత్" త్రిభిః=పూర్వాహ్ణమధ్యాహ్నకాలములను మూడింటిచేత, వ్యాప్నోతి=(ధర్మార్థకామములను) పొందుచున్నాడు.

తా. రాముని ముఖము, కండ్లు, నోరు, నాలుక, పెదవులు, దవడలు, స్తనములు, గోళ్లు, హస్తములు, పాదములు-ఈ పదీ పద్మములవలె ఉండును. శిరస్సు, లలాటము, చెవులు, కంఠము, వక్షము, హృదయము, కడుపు, చేతులు, కాళ్లు, వీపు-ఈ పదీ పెద్దవిగా ఉండును. తేజస్సు, కీర్తి, సంపద అను ఈ మూడింటిచేత లోకము నంతను వ్యాపించినాడు. ఆతని మాతృపితృవంశములు రెండూ కూడ పరిశుద్ధమైనవి. చంకలు, కడుపు, వక్షము, ముక్కు, మూపు, లలాటము ఈ ఆరూ ఉన్నతములై ఉండును. ఆతని వ్రేళ్ల కణుపులు, తలవెంట్రుకలు, రోమములు, గోళ్లు, చర్మము, లింగము, మీసము, దృష్టి, బుద్ధి అను తొమ్మిదీ సూక్ష్మములుగా ఉండును. ఆతడు పూర్వాహ్ణమధ్యాహ్నా పరాహ్ణములయందు ధర్మార్థకామములను సంపాదించుచుండును. 20

మూ. సత్యధర్మపరః శ్రీమాన్ సంగ్రహానుగ్రహే రతః,
దేశకాలవిభాగజ్ఞః సర్వలోకప్రియంవదః. 21

ప్ర. అ. సత్యధర్మపరః=సత్యధర్మములందు ఆసక్తి కలవాడు. శ్రీమాన్=శ్రీమంతుడు. సంగ్రహానుగ్రహే=జనులను చేరదీయుటయందు వారిని అనుగ్రహించుటయందు, రతః=ఆసక్తి గలవాడు. దేశకాలవిభాగజ్ఞః=దేశకాలముల విభాగమును ఎరిగినవాడు. సర్వలోకప్రియంవదః=అందరికీ ప్రియముగా మాటలాడువాడు.

తా. రాముడు సత్యధర్మములందు ఆసక్తి కలవాడు. శ్రీమంతుడు. జనులను దగ్గరకు తీయుటయందు, వారిని అనుగ్రహించుటయందు ఆసక్తి

కలవాడు. దేశకాలముల యుక్తాయుక్తముల (మంచిచెడ్డల) జ్ఞానము కలవాడు. అందరికీ ప్రియముగా మాటలాడువాడు. 21

మూ. భ్రాతా తస్య చ వైమాత్రః సౌమిత్రిరపరాజితః,
అనురాగేణ రూపేణ గుణైశ్చైవ తథావిధః. 22

ప్ర. అ. తస్య=ఆ రామునియొక్క, వైమాత్రః=సవతితల్లి కుమారుడైన, భ్రాతా=సోదరుడైన, అపరాజితః=ఎవ్వరిచేతను పరాజితుడు కాని, సౌమిత్రిః=లక్ష్మణుడు, అనురాగేణ=అనురాగముచేత, రూపేణ=రూపముచేత, గుణైశ్చైవ=గుణములచేత, తథావిధః=ఆ రామునివంటివాడు.

తా. ఎవ్వరిచేతను పరాజితుడు కాని లక్ష్మణుడు రాముని సవతితల్లి కుమారుడైన సోదరుడు. అతడు అనురాగముచేత, రూపముచేత, గుణములచేత కూడ రాముని వంటివాడే.

వి. గోరఖ్‌పూర్ ప్రతిలో "స సువర్ణచ్ఛవిః శ్రీమాన్ రామః శ్యామో మహాయశాః" అను పాదద్వయమధికముగా ఉన్నది. ఆ లక్ష్మణుడు బంగారుచాయవాడు. రాముడు శ్యామవర్ణుడు. 22

మూ. తావుభౌ నరశార్దూలౌ త్వద్దర్శనసముత్సుకౌ,
విచిన్వన్తౌ మహీం కృత్స్నామస్మాభిరభిసంగతౌ. 23

ప్ర. అ. నరశార్దూలౌ=నరశ్రేష్ఠులైన, తౌ=ఆ, ఉభౌ=ఇద్దరూ, త్వద్దర్శనసముత్సుకౌ=నీ దర్శనమునందు ఆసక్తి కలవారై, కృత్స్నామ్=సమస్తమైన, మహీమ్=భూమిని, విచిన్వన్తౌ=అన్వేషించుచున్నవారై, అస్మాభిః=మాతో, అభిసంగతౌ=కలిసినారు.

తా. మనుజులలో శ్రేష్ఠులైన ఆ రామలక్ష్మణులిద్దరూ నిన్ను చూచుటకు ఆసక్తితో భూమిపై అంతటా సంచరించుచు మమ్ములను కలుసుకొన్నారు. 23

మూ. త్వామేవ మార్గమాణౌ తౌ విచరన్తౌ వసుంధరామ్,
దదర్శతుర్మృగపతిం పూర్వజేనావరోపితమ్. 24
ఋశ్యమూకస్య పృష్ఠే తు బహుపాదపసంకులే,
భ్రాతుర్భయార్తమాసీనం సుగ్రీవం ప్రియదర్శనమ్. 25

ప్ర. అ. త్వామేవ=నిన్నే, మార్గమాణౌ=వెదకుచున్నవారై, వసున్ధరామ్=భూమిని, విచరన్తౌ=సంచరించుచున్న, తౌ=ఆ రామలక్ష్మణులు, బహుపాదపసంకులే=అనేకములైన వృక్షములతో వ్యాకులమైన, ఋశ్యమూకస్య పృష్ఠే=ఋశ్యమూక పర్వతము పైభాగమునందు, ఆసీనమ్=కూర్చున్నవాడూ, పూర్వజేన=అన్నచేత,

అవరోపితమ్=సింహాసనమునుండి దింపివేయబడినవాడూ, భ్రాతుః=అన్ననుండి, భయార్తమ్=భయముచేత పీడితుడూ, ప్రియదర్శనమ్=ప్రియమైన దర్శనము గలవాడూ, మృగపతిమ్=వానర ప్రభువూ అయిన, సుగ్రీవమ్=సుగ్రీవుని, దదర్శతుః=చూచిరి.

తా. నీ కోసమే భూమినంతనూ వెదకుచు తిరుగుచున్న ఆ రామలక్ష్మణులు అనేక వృక్షములతో నిండిన ఋశ్యమూకపర్వతశిఖరమునందు కూర్చొని ఉన్న వానరప్రభువైన సుగ్రీవుని చూచిరి. చూచుటకు ఆనందమును కలిగించు ఆ సుగ్రీవుడు తన సోదరుడు రాజ్యమునుండి తొలగించుటచే ఆతనికి భయపడి ఆ పర్వతముపై నివసించుచుండెను. 24, 25

మూ. వయం తు హరిరాజం తం సుగ్రీవం సత్యసంగరమ్,
పరిచర్యాస్మహే రాజ్యాత్పూర్వజేనావరోపితమ్. 26

ప్ర. అ. వయం తు=మేమైతే, పూర్వజేన=అన్నచేత, రాజ్యాత్=రాజ్యమునుండి, అవరోపితమ్=దింపివేయబడిన, సత్యసంగరమ్=సత్యమైన ప్రతిజ్ఞగల, హరిరాజమ్=వానరప్రభువైన, తమ్=ఆ, సుగ్రీవమ్=సుగ్రీవుని, పరిచర్యాస్మహే=సేవించుచున్నాము.

తా. సత్యమైన ప్రతిజ్ఞ గల ఆ సుగ్రీవుని అన్న రాజ్యభ్రష్టుని చేయగా మేము ఆ వానరరాజైన సుగ్రీవునే సేవించుచు ఉన్నాము. 26

మూ. తతస్తౌ చీరవసనౌ ధనుఃప్రవరపాణినౌ,
ఋశ్యమూకస్య శైలస్య రమ్యం దేశముపాగతౌ. 27

ప్ర. అ. తతః=అటుపిమ్మట, చీరవసనౌ=నారచీరలు ధరించినవారు, ధనుఃప్రవరపాణినౌ=శ్రేష్ఠములైన ధనస్సులు హస్తములందు కలవారు అయిన, తౌ=ఆ రామలక్ష్మణులు, ఋశ్యమూకస్య శైలస్య=ఋశ్యమూకపర్వతము యొక్క, రమ్యమ్=సుందరమైన, దేశమ్=ప్రదేశమును గూర్చి, ఉపాగతౌ=వచ్చినారు.

తా. ఇంతలో నారచీరలు ధరించి, శ్రేష్ఠములైన ధనస్సులు చేతులలో ధరించి ఆ రామలక్ష్మణులు ఆ ఋశ్యమూకపర్వతప్రాంతమునకు వచ్చినారు.27

మూ. స తౌ దృష్ట్వా నరవ్యాఘ్రౌ ధన్వినౌ వానరర్షభః,
అభిప్లుతో గిరేస్తస్య శిఖరం భయమోహితః. 28

ప్ర. అ. సః=ఆ, వానరర్షభః=వానరశ్రేష్ఠుడు, ధన్వినౌ=ధనుర్ధరులైన, తౌ=ఆ, నరవ్యాఘ్రౌ=నరశ్రేష్ఠులను, దృష్ట్వా=చూచి, భయమోహితః=భయముచేత

ఆలోచన తప్పినవాడై, తస్య=ఆ, గిరేః=పర్వతముయొక్క, శిఖరమ్=శిఖరమును గూర్చి, అభిప్లుతః=దుమికినాడు.

తా. వానరశ్రేష్ఠుడైన ఆ సుగ్రీవుడు ధనుర్ధరులై వచ్చుచున్న, మనుష్య శ్రేష్ఠులైన రామలక్ష్మణులను చూడగానే భయభ్రాంతుడై ఆ పర్వతము శిఖరము మీదికి ఎక్కెను. 28

మూ. తతః స శిఖరే తస్మిన్వానరేన్ద్రో వ్యవస్థితః,
తయోః సమీపం మామేవ ప్రేషయామాస సత్వరమ్. 29

ప్ర. అ. తతః=అటుపిమ్మట, సః=ఆ, వానరేన్ద్రః=వానరప్రభువు, తస్మిన్=ఆ, శిఖరే=శిఖరమునందు, వ్యవస్థితః=నిలచినవాడై, మామేవ=నన్నే, తయోః=ఆ ఇద్దరియొక్క, సమీపమ్=సమీపమును, సత్వరమ్=తొందరగా, ప్రేషయామాస=పంపెను.

తా. పిమ్మట ఆ సుగ్రీవుడు తాను ఆ పర్వతశిఖరముపైననే ఉండి, వారి దగ్గరకు నన్నే శీఘ్రముగా పంపినాడు. 29

మూ. తావహం పురుషవ్యాఘ్రౌ సుగ్రీవవచనాత్ప్రభూ,
రూపలక్షణసంపన్నౌ కృతాఞ్జలిరుపస్థితః. 30

ప్ర. అ. అహమ్=నేను, సుగ్రీవవచనాత్=సుగ్రీవుని వచనమువలన, పురుషవ్యాఘ్రౌ=పురుషశ్రేష్ఠులూ, ప్రభూ=సమర్థులూ, రూపలక్షణసంపన్నౌ=మంచి రూపముతోను, సల్లక్షణములతోను కూడినవారు అయిన, తౌ=ఆ రామలక్ష్మణులను, కృతాఞ్జలిః=చేయబడిన దోసిలి కలవాడనై, ఉపస్థితః=చేరితిని.

తా. సుగ్రీవాజ్ఞానుసారము నేను పురుషశ్రేష్ఠులు, సర్వసమర్థులు, సౌందర్యము, మంచిలక్షణములూ కలవారూ అయిన ఆ రామలక్ష్మణుల దగ్గరకు నమస్కరించుచు వెళ్ళినాను. 30

మూ. తౌ పరిజ్ఞాతతత్త్వార్థౌ మయా ప్రీతిసమన్వితౌ,
పృష్ఠమారోప్య తం దేశం ప్రాపితౌ పురుషర్షభౌ. 31

ప్ర. అ. పరిజ్ఞాతతత్త్వార్థౌ=తెలియబడిన యథార్థము గల, ప్రీతిసమన్వితౌ= సంతోషముతో కూడిన, పురుషర్షభౌ=పురుషశ్రేష్ఠులైన, తౌ=ఆ రామలక్ష్మణులు, మయా=నాచేత, పృష్ఠమ్=వీపును, ఆరోప్య=అధిష్ఠింపచేసి, తం దేశమ్=ఆ ప్రదేశమును, ప్రాపితౌ=పొందింపబడిరి.

తా. పురుషశ్రేష్ఠులైన ఆరామలక్ష్మణులు సుగ్రీవుని గూర్చిన యథార్థ విషయము తెలిసికొని సంతోషించిరి. అప్పుడు నేను వారిని నా వీపు పైన ఎక్కించుకొని సుగ్రీవాదులున్న చోటుకు తీసికొనిపోయితిని. 31

మూ. నివేదితౌ చ తత్త్వేన సుగ్రీవాయ మహాత్మనే,
తయోరన్యోన్యసల్లాపాద్భృశం ప్రీతిరజాయత. 32

ప్ర. అ. మహాత్మనే=మహాత్ముడైన, సుగ్రీవాయ=సుగ్రీవునికొరకు, తత్త్వేన=యథార్థముగా, నివేదితౌ=తెలుపబడిరి. తయోః=వారిద్దరికీ, అన్యోన్యసంలాపాత్=పరస్పరము మాటలాడుకొనుటవలన, భృశమ్=మిక్కిలి, ప్రీతిః=ప్రేమ, అజాయత=పుట్టెను.

తా. నేను మహాత్ముడైన సుగ్రీవునకు రామలక్ష్మణులను గూర్చిన యథార్థ విషయములను తెలిపితిని. పరస్పర సంభాషణానంతరము, రామసుగ్రీవులిద్దరికి అన్యోన్యము స్నేహము కలిగెను. 32

మూ. తతస్తౌ ప్రీతిసంపన్నౌ హరీశ్వరనరేశ్వరౌ,
పరస్పరకృతాశ్వాసౌ కథయా పూర్వవృత్తయా. 33

ప్ర. అ. తతః=అటుపిమ్మట, ప్రీతిసంపన్నౌ=స్నేహముతో కూడిన, తౌ=ఆ, హరీశ్వరనరేశ్వరౌ=వానరాధిపతియైన సుగ్రీవుడూ, నరాధిపతియైన రాముడు, పూర్వవృత్తయా=పూర్వము జరిగిన, కథయా=కథచేత, పరస్పరకృతాశ్వాసౌ=పరస్పరము చేయబడిన విశ్వాసము కలవారైరి.

తా. ఈ విధముగా రామసుగ్రీవుల మధ్య స్నేహము ఏర్పడిన పిమ్మట, పూర్వము జరిగిన కథలను చెప్పుకొనుటచే వారిద్దరికి పరస్పరము విశ్వాసము ఏర్పడినది. 33

మూ. తతః స సాన్త్వయామాస సుగ్రీవం లక్ష్మణాగ్రజః,
స్త్రీహేతోర్వాలినా భ్రాత్రా నిరస్తమురుతేజసా. 34

ప్ర. అ. తతః=అటుపిమ్మట, సః=ఆ, లక్ష్మణాగ్రజః=రాముడు, ఉరుతేజసా=గొప్ప తేజస్సు గల, భ్రాత్రా=సోదరుడైన, వాలినా=వాలిచేత, నిరస్తమ్=దూరముగా పంపివేయబడిన, సుగ్రీవమ్=సుగ్రీవుని, సాన్త్వయామాస=ఓదార్చెను.

తా. పిమ్మట రాముడు సోదరుడూ, గొప్ప తేజస్సు కలవాడూ అయిన వాలిచేత, స్త్రీ నిమిత్తమై, (అనగా సుగ్రీవుని భార్యయైన రుమను వశము చేసుకొనుటకై) రాజ్యమునుండి వెడలగొట్టబడిన సుగ్రీవుని ఓదార్చెను. 34

మూ. తతస్త్వన్నాశజం శోకం రామస్యాక్లిష్టకర్మణః,
లక్ష్మణో వానరేన్ద్రాయ సుగ్రీవాయ న్యవేదయత్. 35

ప్ర. అ. తతః=అటుపిమ్మట, లక్ష్మణః=లక్ష్మణుడు, అక్లిష్టకర్మణః=శ్రమపడకుండా పనులుచేయు, రామస్య=రామునియొక్క, త్వన్నాశజమ్=నీవుకనబడకపోవుట వలన కలిగిన, శోకమ్=దుఃఖమును, వానరేన్ద్రాయ=వానరరాజైన, సుగ్రీవాయ=సుగ్రీవునకు, న్యవేదయత్=తెలిపెను.

తా. పిమ్మట, శ్రమపడకుండా పనులు సాధించు రామునికి, నీవు కనబడకపోవుటచేత కలిగిన దుఃఖమును గూర్చి లక్ష్మణుడు వానరప్రభువైన సుగ్రీవునకు తెలిపెను. 35

మూ. స శ్రుత్వా వానరేన్ద్రస్తు లక్ష్మణేనేరితం వచః,
తదాసీన్నిష్ప్రభోఽత్యర్థం గ్రహగ్రస్త ఇవాంశుమాన్. 36

ప్ర. అ. సః=ఆ, వానరేన్ద్రస్తు=సుగ్రీవుడైతే, లక్ష్మణేన=లక్ష్మణునిచేత, ఈరితమ్=పలకబడిన, వచః=వచనమును, శ్రుత్వా=విని, తదా=అప్పుడు, గ్రహగ్రస్తః=రాహువుచేత మ్రింగబడిన, అంశుమానివ=సూర్యుడువలె, అత్యర్థమ్=మిక్కిలి, నిష్ప్రభః=కాంతి లేనివాడు, ఆసీత్=ఆయెను.

తా. ఆ సుగ్రీవుడు లక్ష్మణుడు చెప్పినది విని, రాహువు మ్రింగిన సూర్యుడు వలె మిక్కిలి కాంతివిహీనుడయ్యెను. 36

మూ. తతస్త్వద్గాత్రశోభీని రక్షసా హ్రియమాణయా,
యాన్యాభరణజాలాని పాతితాని మహీతలే, 37
తాని సర్వాణి రామాయ ఆనీయ హరియూథపాః,
సంహృష్టా దర్శయామాసుర్గతిం తు న విదుస్తవ. 38

ప్ర. అ. తతః=అటు పిమ్మట, రక్షసా=రాక్షసునిచేత, హ్రియమాణయా=హరించబడుచున్న నీ చేత, త్వద్గాత్రశోభీని=నీ శరీరమునందు శోభించుచున్న, యాని=ఏ, ఆభరణజాలాని=అలంకారముల సముదాయములు, మహీతలే, నేలపై, పాతితాని=పడవేయబడినవో, తాని సర్వాణి=వాటిని అన్నింటినీ, ఆనీయ=తీసుకొని వచ్చి, హరియూథపాః=వానరనాయకులు, సంహృష్టాః=సంతోషించుచున్నవారై, రామాయ=రామునకు, దర్శయామాసుః=చూపించిరి. తవ= నీయొక్క, గతిం తు=గతినైతే, న విదుః=ఎరుగరైరి.

తా. రావణుడు హరించుచున్నప్పుడు నీవు నీ శరీరముపై ప్రకాశించుచున్న ఏ అలంకారములను తీసి భూమిమీద పడవేసితివో వాటిని అన్నింటిని తీసికొనివచ్చి

వానర నాయకులు, సంతోషపూర్వకముగా, రామునకు చూపించిరి. కాని నీ దారి మాత్రము వారికి తెలియకపోవుటచే చెప్పలేకపోయిరి. 37, 38

మూ. తాని రామాయ దత్తాని మయైవోపహృతాని చ,
స్వనవన్త్యవకీర్ణాని తస్మిన్విగతచేతసి. 39

ప్ర. అ. మయైవ=నాచేతనే, ఉపహృతాని=దగ్గరకు తీసికొని వెళ్ళబడినవై, తాని=ఆ అలంకారములు, రామాయ=రామునకు, దత్తాని=ఇవ్వబడినవి. తస్మిన్=ఆతడు, విగతచేతసి=పోయినమనస్సు కలవాడగుచుండగా (మూర్ఛచెందగా), స్వనవన్తి=ధ్వని గల ఆ ఆభరణములు, అవకీర్ణాని=చిమ్మివేయబడినవి.

తా. నేనే వాటిని రామునివద్దకు తీసికొనిపోయి ఆతనికి ఇచ్చితిని. అపుడు వాటిని గ్రహించగానే రాముడు మూర్ఛపోవుటచే అవి అన్నీ చప్పుడు చేయుచు నలుమూలలా చెల్లాచెదరై పడిపోయినవి. 39

మూ. తాన్యఙ్కే దర్శనీయాని కృత్వా బహువిధం తవ,
తేన దేవప్రకాశేన దేవేన పరిదేవితమ్. 40

ప్ర. అ. దర్శనీయాని=సుందరములైన, తవ=నీయొక్క, తాని=ఆ అలంకారములను, అఙ్కే=ఒడిలో, కృత్వా=ఉంచుకొని, దేవప్రకాశేన=దేవతాపురుషునితో సమానుడైన, తేన=ఆ, దేవేన=ప్రభువైన రామునిచేత, బహువిధమ్=అనేకవిధములుగా, పరిదేవితమ్=విలపించుట.

తా. దేవతాపురుషునితో సమానుడైన, ప్రభువైన ఆ రాముడు నీ సుందరములైన ఆ ఆభరణములు ఒడిలో ఉంచుకొని పరిపరివిధముల విలపించెను.

మూ. పశ్యతస్తాని రుదతస్తామ్యతశ్చ పునః పునః,
ప్రాదీపయన్ దాశరథేస్తాని శోకహుతాశనమ్. 41

ప్ర. అ. తాని=వాటిని, పశ్యతః=చూచుచున్న, రుదతః=ఏడ్చుచున్న, పునః పునః=మాటి మాటికి, తామ్యతశ్చ=పరితపించుచున్న, దాశరథేః=రామునియొక్క, శోకహుతాశనమ్=శోకాగ్నిని, తాని=అవి, ప్రాదీపయన్=ప్రజ్వలింపజేసినది.

తా. రాముడు ఆ అలంకారములను చూచుచు, ఏడ్చుచు, మాటి మాటికి పరితపించెను.ఈ విధముగ ఆ అలంకారములు రాముని శోకాగ్నిని ప్రజ్వలింపచేసినవి. 41

మూ. శయితం చ చిరం తేన దుఃఖార్తేన మహాత్మనా,
మయాపి వివిధైర్వాక్యైః కృచ్ఛ్రాదుత్థాపితః పునః. 42

ప్ర. అ. దుఃఖార్తేన=దుఃఖపీడితుడైన, తేన=ఆ, మహాత్మనా=మహాత్ముని చేత, శయితం చ=శయనించుట. మయాపి=నాచేత, వివిధైః=అనేక విధములైన, వాక్యైః=మాటలతో, కృచ్ఛ్రాత్=అతికష్టముగా, పునః=మరల, ఉత్థాపితః=లేపబడి నాడు.

తా. దుఃఖార్తుడైన ఆ మహాత్ముడు చాల సేపు అట్లే నేలపై పడియుండెను. అప్పుడు నేను ఏవేవో మాటలు చెప్పి ఆతనిని లేవదీసితిని.42

మూ. తాని దృష్ట్వా మహాబాహుర్దర్శయిత్వా ముహుర్ముహుః,
రాఘవః సహ సౌమిత్రిః సుగ్రీవే స న్యవేదయత్. 43

ప్ర. అ. మహాబాహుః=గొప్ప బాహువులు గల, సః రాఘవః=ఆ రాముడు, సహసౌమిత్రిః=లక్ష్మణునితో కూడినవాడై, తాని=ఆ అలంకారములను, ముహుః ముహుః=మాటిమాటికి, దర్శయిత్వా=ప్రక్కనున్నవారికి చూపించి, సుగ్రీవే=సుగ్రీవునియందు, న్యవేదయత్=ఇచ్చెను.

తా. మహాబాహువైన ఆ రాముడు లక్ష్మణసహితుడై, ఆ అలంకారములను మాటిమాటికి చూచి, ప్రక్కనున్న వారికి చూపి, వాటిని సుగ్రీవునకు ఇచ్చెను.43

మూ. స తవాదర్శనాదార్యే రాఘవః పరితప్యతే,
మహతా జ్వలతా నిత్యమగ్నినేవాగ్నిపర్వతః. 44

ప్ర. అ. ఆర్యే=పూజ్యురాలా ! సః రాఘవః=ఆ రాముడు, తవ=నీయొక్క, అదర్శనాత్=కనబడకపోవుటవలన, నిత్యమ్=ఎల్లప్పుడు, జ్వలతా=మండుచున్న, మహతా=గొప్ప, అగ్నినా=అగ్నిచేత, అగ్నిపర్వతః ఇవ=అగ్నిపర్వతము వలె, పరితప్యతే=తపించుచున్నాడు.

తా. పూజ్యురాలా ! నీవు కనబడకపోవుటచే, ఆ రాముడు నిత్యమూ ప్రజ్వలించుచున్న అగ్నిచేత అగ్నిపర్వతము వలె, తపించుచున్నాడు. 44

మూ. త్వత్కృతే తమనిద్రా చ శోకశ్చిన్తా చ రాఘవమ్,
తాపయన్తి మహాత్మానమగ్న్యగారమివాగ్నయః. 45

ప్ర. అ. త్వత్కృతే=నీ నిమిత్తమై, మహాత్మానమ్=మహాత్ముడైన, తం రాఘవమ్=ఆ రాముణ్ణి, అనిద్రా చ=నిద్రలేకపోవడము, శోకః=దుఃఖము, చిన్తా చ=చింతా, అగ్న్యగారమ్=అగ్నిగృహమును, అగ్నయః ఇవ=అగ్నులు వలె, తాపయన్తి=తపింపచేయుచున్నవి.

తా. నీ నిమిత్తమై మహాత్ముడైన ఆ రాముణ్ణి, నిద్రలేకపోవడము, శోకమూ, చింతా, అగ్నిగృహమును అగ్నులు తపింపచేయునట్లు తపింపచేయుచున్నవి. 45

మూ. తవాదర్శనశోకేన రాఘవః ప్రవిచాల్యతే,
మహతా భూమికమ్పేన మహానివ శిలోచ్చయః. 46

ప్ర. అ. తవ=నీయొక్క, అదర్శనశోకేన=కనబడకపోవుటచే కలిగిన శోక ముచేత, రాఘవః=రాముడు, మహతా=గొప్పదైన, భూమికమ్పేన=భూకంపముచేత, మహాన్=గొప్ప, శిలోచ్చయః ఇవ=పర్వతము వలె, ప్రవిచాల్యతే=చలింపచేయబడు చున్నాడు.

తా. గొప్ప భూకంపము పెద్ద పర్వతమును కదల్చివేసినట్లు నీవు కనబడకపోవుటచే కలిగిన శోకము రాముణ్ణి కదల్చివేయుచున్నది. 46

మూ. కాననాని సురమ్యాణి నదీః ప్రస్రవణాని చ,
చరన్న రతిమాప్నోతి త్వామపశ్యన్నృపాత్మజే. 47

ప్ర. అ. నృపాత్మజే=రాజకుమారీ ! త్వామ్=నిన్ను, అపశ్యన్=చూడ నివాడై, (రాముడు), సురమ్యాణి=చాల అందమైన, కాననాని=అడవులను, నదీః=నదులను, ప్రస్రవణాని చ=సెలయేళ్లను, చరన్=సంచరించుచున్నా కూడ, రతిమ్=ఆనందమును, న ఆప్నోతి=పొందుటలేదు.

తా. ఓ ! దేవీ ! అందమైన అరణ్యములలోను, నదీతీరములందు, సెలయేళ్ల దగ్గరగా సంచరించుచున్నను రాముడు, నీవు కనబడకపోవుటచేత, ఆనందమును పొందుటలేదు. 47

మూ. స త్వాం మనుజశార్దూలః క్షిప్రం ప్రాప్స్యతి రాఘవః,
సమిత్రబాన్ధవం హత్వా రావణం జనకాత్మజే. 48

ప్ర. అ. జనకాత్మజే=ఓ జనకనందినీ ! మనుజశార్దూలః=మనుజు లలో శ్రేష్ఠుడైన, సః రాఘవః=ఆ రాముడు, సమిత్రబాన్ధవమ్=మిత్రులతోను, బంధువులతోను కూడిన, రావణమ్=రావణుని, హత్వా=చంపి, త్వామ్=నిన్ను, క్షిప్రమ్=శీఘ్రముగా, ప్రాప్స్యతి=పొందగలడు.

తా. ఓ ! సీతాదేవీ ! మనుష్యులలో శ్రేష్ఠుడైన రాముడు, రావణుని మిత్రబంధుసహితముగా సంహరించి, శీఘ్రముగా నిన్ను పొందగలడు. 48

మూ. సహితౌ రామసుగ్రీవావుభావకురుతాం తదా,
సమయం వాలినం హన్తుం తవ చాన్వేషణం తథా. 49

ప్ర. అ. తదా=అప్పుడు, రామసుగ్రీవౌ=రామసుగ్రీవులు, ఉభౌ=ఇద్దరూ, సహితౌ=కలిసినవారై, వాలినమ్=వాలిని, హన్తుమ్=చంపుటకు, తథా=మరియు,

తవ=నీయొక్క, అన్వేషణమ్=అన్వేషణమును చేయుటకూ, సమయమ్=ఒప్పంద మును, అకురుతామ్=చేసిరి.

తా. ఆనాడు రామసుగ్రీవులిద్దరూ కలిసినప్పుడు, రాముడు వాలిని చంపవలెననీ, సుగ్రీవుడు నిన్ను వెదకించవలెననీ ఒప్పందము చేసికొన్నారు. 49

మూ. తతస్తాభ్యాం కుమారాభ్యాం వీరాభ్యాం స హరీశ్వరః,
కిష్కిన్ధాం సముపాగమ్య వాలీ యుద్ధే నిపాతితః. 50

ప్ర. అ. తతః=అటుపిమ్మట, వీరాభ్యామ్=వీరులైన, తాభ్యామ్=ఆ, కుమారాభ్యామ్=యువకులైన రామలక్ష్మణులచేత, కిష్కిన్ధాం=కిష్కింధను, సముపాగమ్య=చేరి, హరీశ్వరః=వానరరాజైన, సః=ఆ, వాలీ=వాలి, యుద్ధే=యుద్ధమునందు, నిపాతితః=పడవేయబడినాడు.

తా. పిమ్మట వీరులైన ఆ రాజకుమారులిద్దరూ కిష్కింధకు వెళ్ళిరి. అక్కడ వానరరాజైన వాలిని రాముడు యుద్ధములో చంపెను. 50

మూ. తతో నిహత్య తరసా రామో వాలినమాహవే,
సర్వర్‌క్షహరిసంఘానాం సుగ్రీవమకరోత్పతిమ్. 51

ప్ర. అ. తతః=అటుపిమ్మట, రామః=రాముడు, ఆహవే=యుద్ధమునందు, తరసా=బలముచేత, వాలినమ్=వాలిని, నిహత్య=చంపి, సుగ్రీవమ్=సుగ్రీవుని, సర్వర్‌క్షహరిసంఘానామ్=సమస్తమైన, ఎలుగుబంటుల, వానరుల సముదాయములకు, పతిమ్=ప్రభువునుగా, అకరోత్=చేసెను.

తా. పిమ్మట రాముడు యుద్ధమునందు, బలముచేత, వాలిని చంపి, సమస్తమైన ఎలుగుబంటుల సముదాయమునకు, వానరుల సముదాయమునకు సుగ్రీవుణ్ణి రాజుగా చేసెను. 51

మూ. రామసుగ్రీవయోరైక్యం దేవ్యేవం సమజాయత,
హనుమన్తం చ మాం విద్ధి తయోర్దూతమిహాగతమ్. 52

ప్ర. అ. దేవి=ఓ దేవీ ! రామసుగ్రీవయోః=రామసుగ్రీవులయొక్క, ఐక్యమ్=స్నేహము, ఏవమ్=ఇట్లు, సమజాయత=కలిగెను. మామ్=నన్ను, తయోః=వారిద్దరియొక్క, దూతమ్=దూతగా, ఆగతమ్=వచ్చిన, హనుమన్తమ్=హనుమంతునిగా, విద్ధి=తెలిసికొనుము.

తా. ఓ ! దేవీ ! రామసుగ్రీవుల మధ్య స్నేహము ఈ విధముగ ఏర్పడెను. నేను వారిద్దరూ పంపగా, నీ వద్దకు దూతగా వచ్చిన హనుమంతుడను.

మూ. స్వరాజ్యం ప్రాప్య సుగ్రీవః సమానీయ హరీశ్వరాన్,
త్వదర్థం ప్రేషయామాస దిశో దశ మహాబలాన్. 53

ప్ర. అ. సుగ్రీవః=సుగ్రీవుడు, స్వరాజ్యమ్=తన రాజ్యమును, ప్రాప్య=పొంది, మహాబలాన్=గొప్పబలము గల, హరీశ్వరాన్=వానరప్రముఖులను, సమానీయ= రప్పించి, త్వదర్థమ్=నీ నిమిత్తమై, దశ=పది, దిశః=దిక్కులను, ప్రేషయామాస= పంపెను.

తా. సుగ్రీవుడు స్వరాజ్యము లభించిన పిమ్మట మహాబలశాలులైన వానరనాయకులను రప్పించి, నిన్ను అన్వేషించుటకై, పది దిక్కులకు పంపెను.

మూ. ఆదిష్టా వానరేన్ద్రేణ సుగ్రీవేణ మహౌజసా,
అద్రిరాజప్రతీకాశాః సర్వతః ప్రస్థితా మహీమ్. 54

ప్ర. అ. వానరేన్ద్రేణ=వానర రాజైన, మహౌజసా=గొప్ప తేజస్సు గల, సుగ్రీవేణ=సుగ్రీవునిచేత, ఆదిష్టాః=ఆజ్ఞాపించబడిన, అద్రిరాజప్రతీకాశాః=పర్వతరాజుతో సమానులైన ఆ వానరులు, సర్వతః=నలువైపులా, మహీమ్=భూమిని గూర్చి, ప్రస్థితాః=ప్రయాణమైరి.

తా. మహాతేజఃశాలియైన వానరరాజు సుగ్రీవుడు ఆజ్ఞాపించుటచే, హిమవత్పర్వతము వంటి ఆకారము గల వానరులు అన్ని వైపులా భూమిని వెదకుటకై, బయలుదేరిరి. 54

మూ. తతస్తే మార్గమాణా వై సుగ్రీవవచనాతురాః,
చరన్తి వసుధాం కృత్స్నాం వయమన్యే చ వానరాః. 55

ప్ర. అ. తతః=అటుపిమ్మట, తే=అట్టి, వయమ్=మేము, అన్యే=ఇతరులైన, వానరాః చ=వానరులూ, సుగ్రీవవచనాతురాః=సుగ్రీవాజ్ఞకు భయపడుచున్నవారై, మార్గమాణాః=అన్వేషించుచు, కృత్స్నామ్=సమస్తమైన, వసుధామ్=భూమిని, చరన్తి=సంచరించుచున్నారు.

తా. అట్టిమేము, ఇతరవానరులు కూడ సుగ్రీవాజ్ఞ నెరవేర్చ వలె నను ఆతురతతో, నిన్ను అన్వేషించుచు, ఈ పృథివిపై అంతా తిరుగుచున్నాము.55

మూ. అఙ్గదో నామ లక్ష్మీవాన్ వాలిసూనుర్మహాబలః,
ప్రస్థితః కపిశార్దూలస్త్రిభాగబలసంవృతః. 56

ప్ర. అ. లక్ష్మీవాన్=లక్ష్మీవంతుడు, వాలిసూనుః=వాలికుమారుడు, మహాబలః=గొప్ప బలము కలవాడు అయిన, అఙ్గదో నామ=అంగదుడను పేరు గల,

హరిశార్దూలః=వానరశ్రేష్ఠుడు, త్రిభాగబలసంవృతః=మూడవవంతు సైన్యముతో కూడినవాడై, ప్రస్థితః=ప్రయాణమైనాడు.

తా. లక్ష్మీసంపన్నుడు, వాలిపుత్రుడు, మహాబలశాలి అయిన అంగదుడను వానరశ్రేష్ఠుడు మూడవవంతు సైన్యమును తీసికొని నీ అన్వేషణమునకై బయలుదేరినాడు. 56

మూ. తేషాం నో విప్రణష్టానాం విన్ధ్యే పర్వతసత్తమే,
భృశం శోకపరీతానామహోరాత్రగణా గతాః 57

ప్ర. అ. విన్ధ్యే=వింధ్యమను, పర్వతసత్తమే=పర్వత శ్రేష్ఠమునందు, విప్రణష్టానామ్=దారి తప్పినవారమూ, భృశమ్=మిక్కిలి, శోకపరీతానామ్=దుఃఖముతో నిండిన, తేషామ్=అట్టి, నః=మాకు, అహోరాత్రగణాః=పగళ్ల రాత్రుల సముదాయములు, గతాః=వెళ్ళినవి.

తా. మేమందరమూ వింధ్యపర్వతమునందు దారి తప్పి మిక్కిలి దుఃఖాక్రాంతులమై ఉండగా ఎన్నో పగళ్లు, రాత్రులు గడచిపోయినవి. 57

మూ. తే వయం కార్యనైరాశ్యాత్కాలస్యాతిక్రమేణ చ,
భయాచ్చ కపిరాజస్య ప్రాణాంస్త్యక్తుం వ్యవస్థితాః. 58

ప్ర. అ. తే వయమ్=అట్టి మేము, కార్యనైరాశ్యాత్=కార్యము విషయమున నిరాశాభావము వలనను, కాలస్య=కాలముయొక్క, అతిక్రమేణ చ=దాటిపోవుటచేతను, కపిరాజస్య=సుగ్రీవుని యొక్క, భయాచ్చ=భయము వలనను, ప్రాణాన్=ప్రాణములను, త్యక్తుమ్=విడచుటకు, వ్యవస్థితాః=నిశ్చయించుకొంటిమి.

తా. అట్టి పరిస్థితిలో మేము కార్యము సాధించలేకపోయినామనే నిరాశాభావముచేత, సుగ్రీవుడిచ్చిన గడువు దాటిపోవుటచేత, సుగ్రీవుడు దండించునను భయముచేత, ప్రాణత్యాగము చేయవలెనని నిశ్చయించుకొంటిమి. 58

మూ. విచిత్య వనదుర్గాణి గిరిప్రస్రవణాని చ,
అనాసాద్య పదం దేవ్యాః ప్రాణాంస్త్యక్తుం సముద్యతాః. 59

ప్ర. అ. వనదుర్గాణి=వనములలోని దుర్గమప్రదేశములను, గిరిప్రస్రవణాని చ=పర్వతములను, సెలయేళ్లను, విచిత్య=వెదకి, దేవ్యాః=దేవి వైన నీయొక్క, పదమ్=స్థానమును, అనాసాద్య=పొందక, ప్రాణాన్=ప్రాణములను, త్యక్తుమ్=విడచుటకు, సముద్యతాః=సిద్ధమైతిమి.

తా. అడవులలో ప్రవేశింపశక్యముకాని ప్రదేశములను, నదులను, సెలయేళ్లను వెదకినను నీవెక్కడా కనబడకపోవుటచే ప్రాణములను విడచుటకు సిద్ధపడితిమి. 59

మూ. దృష్ట్వా ప్రాయోపవిష్టాంశ్చ సర్వాన్వానరపుఙ్గవాన్,
భృశం శోకార్ణవే మగ్నః పర్యదేవయదఙ్గదః. 60

తవ నాశం చ వైదేహి వాలినశ్చ వధం తథా,
ప్రాయోపవేశమస్మాకం మరణం చ జటాయుషః. 61

ప్ర. అ. వైదేహి=ఓ సీతాదేవీ ! ప్రాయోపవిష్టాన్=ప్రాయోపవేశము చేసిన, సర్వాన్=సమస్తమైన, వానరపుఙ్గవాన్=వానరశ్రేష్ఠులను, దృష్ట్వా=చూచి, అఙ్గదః=అంగదుడు, భృశమ్=మిక్కిలి, శోకార్ణవే=శోకసముద్రము నందు, మగ్నః=మునిగినవాడై, తవ=నీయొక్క, నాశం చ=కనబడకుండాపోవుటను, తథా=మరియు, వాలినః=వాలియొక్క, వధం చ=వధను, జటాయుషః=జటాయువుయొక్క, మరణం చ=మరణమును, అస్మాకమ్=మాయొక్క, ప్రాయోపవేశమ్=ప్రాయోపవేశమును గూర్చి, పర్యదేవయత్=విలపించెను.

తా. ఓ సీతాదేవీ ! వానరశ్రేష్ఠులందరూ ఈ విధముగా ప్రాణత్యాగమునకై ఆహారము విసర్జించి పండుకొని ఉండుట చూచి, అంగదుడు, చాల దుఃఖసముద్రములో మునిగినవాడై, నీ అపహరణమునూ, వాలి వధనూ, జటాయు మరణమునూ, మేమందరమూ ప్రాయోపవేశము చేయుటను గూర్చి విలపించెను. 60, 61

మూ. తేషాం నః స్వామిసందేశాన్నిరాశానాం ముమూర్షతామ్,
కార్యహేతోరివాయాతః శకునిర్వీర్యవాన్ మహాన్. 62

ప్ర. అ. స్వామిసందేశాత్=రాజాజ్ఞవలన, నిరాశానామ్=ప్రాణములపై ఆశ లేనివారమై, ముమూర్షతామ్=మరణించదలచిఉన్న, తేషామ్=అట్టి, నః=మాయొక్క, కార్యహేతోరివ=కార్యముకొరకు అన్నట్లు, వీర్యవాన్=పరాక్రమము గల, మహాన్=గొప్ప, శకునిః=పక్షి, ఆయాతః=వచ్చినది.

తా. "ఇచ్చిన గడువులోపుగా రాకపోయినచో చంపెదను" అను సుగ్రీవాజ్ఞను స్మరించి, ప్రాణములపై ఆశ వదలుకొని, మేము మరణించుటకు సిద్ధముగా ఉండగా, మేము వచ్చిన పని సఫలము చేయుటకా అన్నట్లు, పరాక్రమవంతుడైన ఒక గొప్ప పక్షిరాజు అక్కడికి వచ్చెను. 62

మూ. గృధ్రరాజస్య సోదర్యః సంపాతిర్నామ గృధ్రరాట్,
శ్రుత్వా భ్రాతృవధం కోపాదిదం వచనమబ్రవీత్. 63

ప్ర. అ. గృధ్రరాజస్య=గృధ్రరాజైన జటాయువుయొక్క, సోదర్యః=సోదరుడైన, సంపాతిర్నామ=సంపాతి అను, గృధ్రరాట్=గృధ్రరాజు, భ్రాతృవధమ్=సోదరుని వధను, శ్రుత్వా=విని, కోపాత్=కోపమువలన, ఇదమ్=ఈ, వచనమ్=వచనమును, అబ్రవీత్=పలికెను.

తా. జటాయువు సోదరుడైన సంపాతి అనే ఆ గృధ్రరాజు సోదరుని వధను గూర్చి విని కోపముతో ఇట్లు పలికెను. 63

మూ. యవీయాన్ కేన మే భ్రాతా హతః క్వ చ నిపాతితః,
ఏతదాఖ్యాతుమిచ్ఛామి భవద్భిర్వానరోత్తమాః. 64

ప్ర. అ. మే=నాయొక్క, యవీయాన్=చిన్నవాడైన, భ్రాతా=సోదరుడు, కేన=ఎవనిచేత, హతః=చంపబడినాడు ? క్వ=ఎక్కడ, నిపాతితః=పడగొట్టబడినాడు ? వానరోత్తమాః=వానరోత్తములారా ! భవద్భిః=మీచేత, ఏతత్=దీనిని, ఆఖ్యాతుమ్=చెప్పుటకు, ఇచ్ఛామి=కోరుచున్నాను.

తా. వానరోత్తములారా ! నా తమ్ముడైన జటాయువును ఎవ్వడు, ఎక్కడ, చంపి పడవేసినాడో చెప్పుడు. 64

మూ. అఙ్గదోఽకథయత్తస్య జనస్థానే మహద్వధమ్,
రక్షసా భీమరూపేణ త్వాముద్దిశ్య యథాతథమ్. 65

ప్ర. అ. త్వామ్=నిన్ను, ఉద్దిశ్య=ఉద్దేశించి, భీమరూపేణ=భయంకరమైన రూపము గల, రక్షసా=రాక్షసునిచేత, జనస్థానే=జనస్థానమునందు, మహద్వధమ్=ఆ మహాపక్షి యొక్క వధను, యథాతథమ్=జరిగినది జరిగినట్లుగా, అఙ్గదః=అఙ్గదుడు, తస్య=ఆ సంపాతికి, అకథయత్=చెప్పెను.

తా. అప్పుడు అంగదుడు, జనస్థానములో భయంకరమైన రూపము గల రాక్షసుడు, నీ నిమిత్తమై చేసిన ఆ మహావ్యక్తి వధను గూర్చి, యథాతథముగా ఆ సంపాతికి చెప్పెను. 65

మూ. జటాయుషో వధం శ్రుత్వా దుఃఖితః సోఽరుణాత్మజః,
త్వాం శశంస వరారోహే వసన్తీం రావణాలయే. 66

ప్ర. అ. వరారోహే=శ్రేష్ఠమైన కటిప్రదేశము గల ఓ సీతాదేవీ! సః=ఆ, అరుణాత్మజః=అరుణుని కుమారుడైన సంపాతి, జటాయుషః=జటా

యువు యొక్క, వధమ్=వధను, శ్రుత్వా=విని, దుఃఖితః=దుఃఖించినవాడై, త్వామ్=నిన్ను, రావణాలయే=రావణుని గృహమునందు, వసన్తీమ్=నివసించుచున్న దానినిగా, శశంస=చెప్పెను.

తా. సీతాదేవీ ! ఆ సంపాతి జటాయువు మరణమును విని చాల దుఃఖించెను. నీవు రావణుని గృహములో ఉన్నట్లు ఆతడు మాకు చెప్పెను.66

మూ. తస్య తద్వచనం శ్రుత్వా సంపాతేః ప్రీతివర్ధనమ్,
అఙ్గదప్రముఖాస్తూర్ణం తతః సంప్రస్థితా వయమ్. 67

ప్ర. అ. తస్య=ఆ, సంపాతేః=సంపాతియొక్క, ప్రీతివర్ధనమ్=సంతోషమును వృద్ధిపొందించు, తత్=ఆ, వచనమ్=వచనమును, శ్రుత్వా=విని, అఙ్గదప్రముఖాః=అంగదుడు నాయకుడుగా గల, వయమ్=మేము, తూర్ణమ్=శీఘ్రముగా, తతః=అక్కడినుండి, ప్రస్థితాః=బయలుదేరితిమి.

తా. సంతోషజనకమైన ఆ సంపాతి మాటలు విని అంగదుడు మొదలైన మేమందరము అక్కడినుండి వెంటనే బయలుదేరితిమి. 67

మూ. విన్ధ్యాదుత్థాయ సంప్రాప్తాః సాగరస్యాన్తముత్తరమ్,
త్వద్దర్శనకృతోత్సాహా హృష్టాస్తుష్టాః ప్లవఙ్గమాః. 68

ప్ర. అ. ప్లవఙ్గమాః=వానరులు, త్వద్దర్శనకృతోత్సాహాః=నీ దర్శనమునందు చేయబడిన ఉత్సాహము కలవారై, హృష్టాః=హర్షించినవారై, తుష్టాః=సంతోషించినవారై, విన్ధ్యాత్=వింధ్యపర్వతమునుండి, ఉత్థాయ=లేచి, సాగరస్య=సముద్రము యొక్క, ఉత్తరమ్=ఉత్తరమునందున్న, అన్తమ్=తీరమును, సంప్రాప్తాః=చేరినారు.

తా. వానరులందరు చాలా సంతోషించి, నిన్ను చూడవలెనను ఉత్సాహముతో వింధ్యపర్వతమునుండి బయలుదేరి, సముద్రము ఉత్తరపు తీరము చేరిరి. 68

మూ. అఙ్గదప్రముఖాః సర్వే వేలోపాన్తముపస్థితాః,
చిన్తాం జగ్మః పునర్భీతాస్త్వద్దర్శనసముత్సుకాః. 69

ప్ర. అ. అఙ్గదప్రముఖాః=అంగదుడు మొదలైన, సర్వే=అందరూ, త్వద్దర్శనసముత్సుకాః=నీ దర్శనమునందు ఆసక్తి కలవారై, వేలోపాన్తమ్=సముద్రతీరప్రాంతమును, ఉపస్థితాః=చేరినవారై, భీతాః=భయపడినవారై, పునః=మరల, చిన్తామ్=చింతను, జగ్మః=పొందిరి.

తా. అంగదుడు మొదలైన వానరులందరూ నిన్ను చూడవలెనను ఔత్సుక్యముతో సముద్రము చేరి, అక్కడ సముద్రమును చూడగానే భయపడి, మరల చింతాగ్రస్తులైరి. 69

మూ. అథాహం హరిసైన్యస్య సాగరం ప్రేక్ష్య సీదతః,
వ్యవధూయ భయం తీవ్రం యోజనానాం శతం ప్లుతః. 70

ప్ర. అ. అథ=అటుపిమ్మట, అహమ్=నేను, సాగరమ్=సముద్రమును, ప్రేక్ష్య=చూచి, సీదతః=దిగులు చెందుచున్న, హరిసైన్యస్య=వానరసైన్యము యొక్క, తీవ్రమ్=తీవ్రమైన, భయమ్=భయమును, వ్యవధూయ=తొలగించి, యోజనానామ్=యోజనములయొక్క, శతమ్=శతమును, ప్లుతః=దాటితిని.

తా. అప్పుడు నేను, సముద్రమును చూచి దిగులుచెందిన ఆ వానరసైన్యమునకు కలిగిన తీవ్రమైన భయమును తొలగించి, నూరు యోజనముల దూరము దుమికితిని. 70

మూ. లఙ్కా చాపి మయా రాత్రౌ ప్రవిష్టా రాక్షసాకులా.
రావణశ్చ మయా దృష్టస్త్వం చ శోకపరిప్లుతా. 71

ప్ర. అ. రాక్షసాకులా=రాక్షసులతో వ్యాకులమై, లఙ్కా చాపి=లంక కూడ, మయా=నాచేత, రాత్రౌ=రాత్రియందు, ప్రవిష్టా=ప్రవేశింపబడినది. మయా=నా చేత, రావణశ్చ=రావణుడు కూడ, దృష్టః=చూడబడినాడు. శోకపరిప్లుతా=శోకముతో నిండిన, త్వం చ=నీవు కూడ చూడబడితివి.

తా. నేను రాక్షసులతో నిండిన లంకలో రాత్రి ప్రవేశించి, రావణునీ, దుఃఖములో మునిగియున్న నిన్నూ చూచినాను. 71

మూ. ఏతత్తే సర్వమాఖ్యాతం యథావృత్తమనిన్దితే,
అభిభాషస్వ మాం దేవి దూతో దాశరథేరహమ్. 72

ప్ర. అ. అనిన్దితే=నిందించబడనిదానా ! దేవి=ఓ ! దేవీ ! ఏతత్=ఇది, సర్వమ్=అంతా, యథావృత్తమ్=జరిగినది జరిగినట్లుగా, తే=నీకు, ఆఖ్యాతమ్=చెప్పబడినది. మామ్=నన్ను గూర్చి, అభిభాషస్వ=మాటలాడుము. అహమ్=నేను, దాశరథేః=రాముని యొక్క, దూతః=దూతను.

తా. ఎట్టి దోషములూ లేని ఓ ! సీతాదేవీ ! ఈ విషయమునంతా నీకు యథాతథముగా చెప్పినాను. నేను రాముని దూతను. నాతో మాటలాడుము.72

మూ. తం మాం రామకృతోద్యోగం త్వన్నిమిత్తమిహాగతమ్,
సుగ్రీవసచివం దేవి బుద్ధ్యస్వ పవనాత్మజమ్. 73

ప్ర. అ. దేవి=ఓ ! దేవీ ! తం మామ్=అట్టి నన్ను, రామకృతోద్యోగమ్=రామునినిమిత్తమై చేయబడిన ప్రయత్నము గలవాడనూ, త్వన్నిమిత్తమ్=నీ నిమిత్తమై, ఇహ=ఇక్కడికి, ఆగతమ్=వచ్చినవాడనూ, సుగ్రీవసచివమ్=సుగ్రీవుని మంత్రినీ అయిన, పవనాత్మజమ్=వాయుపుత్రునిగా, బుద్ధ్యస్వ=తెలిసికొనుము.

తా. ఓ ! దేవీ ! నేను రామునికోసమై ప్రయత్నము చేసి, ఇక్కడకు వచ్చినాను. సుగ్రీవుని మంత్రిని. వాయుదేవుని కుమారుడను. ఈ విషయము తెలిసికొనుము. 73

మూ. కుశలీ తవ కాకుత్స్థః సర్వశస్త్రభృతాం వరః,
గురోరారాధనే యుక్తో లక్ష్మణశ్చ సులక్షణః. 74

ప్ర. అ. సర్వశస్త్రభృతామ్=సమస్తమైన ఆయుధధారులలో, వరః=శ్రేష్ఠుడైన, తవ=నీయొక్క, కాకుత్స్థః=రాముడు, కుశలీ=క్షేమముగా ఉన్నాడు. గురోః=అన్నగారియొక్క, ఆరాధనే=సేవయందు, యుక్తః=సంలగ్నుడైఉన్న, సులక్షణః=మంచి లక్షణములు గల, లక్ష్మణశ్చ=లక్ష్మణుడు కూడ క్షేమముగా ఉన్నాడు.

తా. అస్త్రధారులందరిలోను శ్రేష్ఠుడైన నీ రాముడు క్షేమముగా ఉన్నాడు. అన్నగారి సేవ చేయుట యందు శ్రద్ధగల, మంచి లక్షణములు గల లక్ష్మణుడు కూడ క్షేమముగా ఉన్నాడు. 74

మూ. తస్య వీర్యవతో దేవి భర్తుస్తవ హితే రతః,
అహమేకస్తు సంప్రాప్తః సుగ్రీవవచనాదిహ. 75

ప్ర. అ. దేవి=దేవీ! వీర్యవతః=పరాక్రమవంతుడైన, తవ=నీయొక్క, భర్తుః=భర్తయైన, తస్య=రామునియొక్క, హితే=హితమునందు, రతః=ఆసక్తుడనైన, అహమ్=నేను, సుగ్రీవవచనాత్=సుగ్రీవుని ఆజ్ఞవలన, ఇహ=ఇక్కడికి, ఏకః=ఒక్కడనే, ప్రాప్తః=వచ్చినాను.

తా. ఓ ! దేవీ ! పరాక్రమవంతుడు, నీ భర్తా అయిన ఆ రాముని హితమునందు ఆసక్తి గల నేను సుగ్రీవుని ఆజ్ఞచే, ఒంటరిగా ఇక్కడికి వచ్చినాను.

మూ. మయేయమసహాయేన చరతా కామరూపిణా,
దక్షిణా దిగనుక్రాన్తా త్వన్మార్గవిచయైషిణా. 76

ప్ర. అ. త్వన్మార్గవిచయైషిణా=నీ జాడను వెదకుటకు కోరుచున్న వాడనూ, కామరూపిణా=కామరూపము గల (ఇష్టము వచ్చిన రూపము ధరించగల) వాడనూ, అసహాయేన=సహాయుడు లేనివాడనూ, చరతా=సంచరించువాడనూ అయిన, మయా=నాచేత, ఇయమ్=ఈ, దక్షిణా దిక్=దక్షిణదిక్కు, అనుక్రాన్తా=పొందబడినది.

తా. స్వేచ్ఛానుసారముగా రూపములు ధరించగలిగిన నేను, నీ జాడ తెలిసికొనుటకై ఎవ్వరూ సహాయుడు లేకుండా, ఒంటరిగా సంచరించు, ఈ దక్షిణదిక్కుకు వచ్చితిని. 76

మూ. దిష్ట్యాహం హరిసైన్యానాం త్వన్నాశమనుశోచతామ్,
అపనేష్యామి సంతాపం తవాభిగమశంసనాత్. 77

ప్ర. అ. దిష్ట్యా=భాగ్యవశముచేత, అహమ్=నేను, త్వన్నాశమ్=నీవు కనబడకపోవుటనుగూర్చి, అనుశోచతామ్=దుఃఖించుచున్న, హరిసైన్యానామ్=వానరసైన్యములయొక్క, సంతాపమ్=తాపమును, తవ=నీయొక్క, అభిగమశంసనాత్=లభించుటను గూర్చి చెప్పుటవలన, అపనేష్యామి=తొలగించగలను.

తా. భాగ్యవశముచేత, నేను, నీవు కనబడినావని చెప్పి, నీవు కనబడకపోవుటచే దుఃఖించుచున్న వానరసైన్యముల సంతాపమును తొలగించెదను.

మూ. దిష్ట్యా హి మమ న వ్యర్థం దేవి సాగరలఙ్ఘనమ్,
ప్రాప్స్యామ్యహమిదం దిష్ట్యా త్వద్దర్శనకృతం యశః. 78

ప్ర. అ. దేవి=ఓ ! దేవీ ! దిష్ట్యా=అదృష్టముచేత, మమ=నాయొక్క, సాగరలఙ్ఘనమ్=సాగరమును దాటుట, న వ్యర్థమ్=వ్యర్థము కాలేదు. దిష్ట్యా=అదృష్టముచేత, అహమ్=నేను, త్వద్దర్శనకృతమ్=నీ దర్శనమువలన కలిగిన, ఇదమ్=ఈ, యశః=కీర్తిని, ప్రాప్స్యామి=పొందగలను.

తా. ఓ ! దేవీ ! నా అదృష్టము బాగున్నది; నేను సాగరము లంఘించుట వ్యర్థము కాలేదు. నిన్ను చూడగలిగితినను కీర్తిని పొందగలను. ఇది కూడ నా అదృష్టమే. 78

మూ. రాఘవశ్చ మహావీర్యః క్షిప్రం త్వామభిపత్స్యతే,
సమిత్రబాన్ధవం హత్వా రావణం రాక్షసాధిపమ్. 79

ప్ర. అ. మహావీర్యః=గొప్ప పరాక్రమము గల, రాఘవశ్చ=రాముడు, సమిత్రబాన్ధవమ్=మిత్రులతోను బంధువులతోను కూడిన, రాక్షసాధిపమ్=రాక్షసరాజైన, రావణమ్=రావణుని, హత్వా=చంపి, క్షిప్రమ్=శీఘ్రముగా, త్వామ్=నిన్ను, అభిపత్స్యతే=పొందగలడు.

తా. మహాపరాక్రమశాలియైన రాముడు రాక్షసాధిపతియైన రావణుని మిత్రబంధుసహితముగా సంహరించి, శీఘ్రముగా నిన్ను పొందగలడు. 79

మూ. మాల్యవాన్నామ వైదేహి గిరీణాముత్తమో గిరిః,
తతో గచ్ఛతి గోకర్ణం పర్వతం కేసరీ హరిః. 80

ప్ర. అ. వైదేహి=సీతాదేవీ ! గిరీణామ్=పర్వతములలో, ఉత్తమః=ఉత్తమమైన, మాల్యవాన్నామ=మాల్యవంతమను, గిరిః=పర్వతమున్నది. తతః=అక్కడినుండి, కేసరీ=కేసరి అను, హరిః=వానరుడు, గోకర్ణమ్=గోకర్ణమను, పర్వతమ్=పర్వతమును గూర్చి, గచ్ఛతి=వెళ్లుచున్నాడు (వెళ్ళెను).

తా. ఓ ! సీతాదేవీ ! పర్వతములన్నింటిలోకి శ్రేష్ఠమైన మాల్యవంతమను పర్వతమున్నది. అక్కడినుండి కేసరి అను వానరుడు గోకర్ణపర్వతమునకు వెళ్ళెను.

మూ. స చ దేవర్షిభిర్దిష్టః పితా మమ మహాకపిః,
తీర్థే నదీపతేః పుణ్యే శమ్బసాదనముద్ధరత్. 81

ప్ర. అ. దేవర్షిభిః=దేవతలచేతను, ఋషులచేతను, దిష్టః=ఆజ్ఞాపింపబడినవాడై, మమ=నాయొక్క, పితా=తండ్రియైన, సః మహాకపిః=ఆ కేసరి, నదీపతేః=సముద్రముయొక్క, పుణ్యే=పవిత్రమైన, తీర్థే=తీర్థమునందు, శమ్బసాదనమ్=శంబసాదనుడను రాక్షసుని, ఉద్ధరత్=సంహరించెను.

తా. నా తండ్రియైన ఆ కేసరి, దేవతలు, ఋషులు ప్రార్థింపగా, సముద్రతీరమునందున్న పవిత్రతీర్థమునందు శంబసాదనుడను రాక్షసుని చంపెను. 81

మూ. తస్యాహం హరిణః క్షేత్రే జాతో వాతేన మైథిలి,
హనుమానితి విఖ్యాతో లోకే స్వేనైవ కర్మణా. 82

ప్ర. అ. మైథిలి=ఓ ! సీతాదేవీ ! అహమ్=నేను, తస్య=ఆ, హరిణః=వానరుడైన కేసరియొక్క, క్షేత్రే=భార్యయందు, వాతేన=వాయుదేవునిచేత, జాతః=పుట్టితిని. స్వేన కర్మణా ఏవ=నా పనిచేతనే, లోకే=లోకమునందు, హనుమానితి=హనుమంతుడు అని, విఖ్యాతః=ప్రసిద్ధిపొందితిని.

తా. ఓ సీతాదేవీ ! నేను ఆ కేసరి భార్యయందు వాయుదేవునివలన పుట్టినాను. నేను చేసిన పనినే పట్టి నాకు లోకములో హనుమంతుడను ప్రసిద్ధి వచ్చినది. 82

మూ. విశ్వాసార్థం తు వైదేహి భర్తురుక్తా మయా గుణాః,
అచిరాద్రాఘవో దేవి త్వామితో నయితానఘే. 83

ప్ర. అ. వైదేహి=ఓ సీతాదేవీ ! విశ్వాసార్థమ్=నీకు నమ్మకము కలిగించుటకై, మయా=నాచేత, భర్తుః=నీ భర్తయైన రామునియొక్క, గుణాః=గుణములు, ఉక్తాః=చెప్పబడినవి. దేవి=ఓ! దేవీ! రాఘవః=రాముడు, అచిరాత్=కొద్దికాలములో, త్వామ్=నిన్ను, ఇతః=ఇక్కడనుండి, నయితా=తీసికొనిపోగలడు.

తా. ఓ ! సీతాదేవీ ! నీకు నమ్మకము కలిగించుటకై, నీ భర్తయైన రాముని గుణములు వర్ణించి చెప్పినాను. ఓ ! దేవీ ! కొద్దికాలములో రాముడు నిన్ను ఇక్కడినుండి తీసికొని వెళ్ళగలడు. 83

మూ. ఏవం విశ్వాసితా సీతా హేతుభిః శోకకర్శితా,
ఉపపన్నైరభిజ్ఞానైర్దూతం తమవగచ్ఛతి. 84

ప్ర. అ. శోకకర్శితా=శోకముచేత కృశింపచేయబడిన, సీతా=సీత, ఏవమ్=ఈ విధముగా, హేతుభిః=తగిన హేతువులచేత, విశ్వాసితా=విశ్వసింపజేయబడినదై, ఉపపన్నైః=తగిన, అభిజ్ఞానైః=ఆనవాళ్లచేత, తమ్=ఆతనిని, దూతమ్=దూతనుగా, అవగచ్ఛతి=తెలుసుకొనుచున్నది (తెలుసుకొన్నది).

తా. శోకముచేత కృశింపచేయబడిన సీత ఈ విధముగా, సరియైన హేతువులను చూపుట ద్వారా హనుమంతునిచే విశ్వాసము కలుగునట్లు చేయబడినదై, సరియైన ఆనవాళ్ళను బట్టి అతడు దూతయే అని తెలుసుకొనెను. 84

మూ. అతులం చ గతా హర్షం ప్రహర్షేణ చ జానకీ,
నేత్రాభ్యాం వక్రపక్ష్మాభ్యాం ముమోచానన్దజం జలమ్. 85

ప్ర. అ. జానకీ=సీత, అతులమ్=సాటిలేని, హర్షమ్=ఆనందమును, గతా చ=పొందినది కూడ. ప్రహర్షేణ=అధికమైన ఆనందముతో, వక్రపక్ష్మాభ్యామ్=వంకరయైన రెప్పలు గల, నేత్రాభ్యామ్=నేత్రములతో, ఆనన్దజమ్=ఆనందమువలన కలిగిన, జలమ్=జలమును, ముమోచ=విడచెను.

తా. జానకి సాటిలేని సంతోషమును కూడ పొందెను. అధికమైన ఆనందముతో, వంకరయైన రెప్పలు గల నేత్రములనుండి ఆనందబాష్పములను రాల్చెను. 85

మూ. చారు తద్వదనం తస్యాస్తామ్రశుక్లాయతేక్షణమ్,
అశోభత విశాలాక్ష్యా రాహుముక్త ఇవోడురాట్. 86

ప్ర. అ. విశాలాక్ష్యాః=విశాలములైన నేత్రములు గల, తస్యాః=ఆ, సీతయొక్క, చారు=అందమైన, తామ్రశుక్లాయతేక్షణమ్=ఎఱ్ఱగాను, తెల్లగాను, దీర్ఘముగాను ఉన్న నేత్రములు గల, తత్=ఆ, వదనమ్=ముఖము, రాహుముక్తః=రాహువుచేత విడువబడిన, ఉడురాడివ=నక్షత్రములరాజైన చంద్రుడు వలె, అశోభత=ప్రకాశించెను.

తా. ఎఱ్ఱగాను, తెల్లగాను, దీర్ఘముగాను ఉన్న నేత్రములు గలదీ, సుందరమూ అయిన ఆ విశాలాక్షియైన సీత ముఖము రాహువు విడచిన చంద్రుడు వలె ప్రకాశించెను. 86

మూ. హనుమన్తం కపిం వ్యక్తం మన్యతే నాన్యథేతి సా,
అథోవాచ హనూమాంస్తాముత్తరం ప్రియదర్శనామ్. 87

ప్ర. అ. సా=ఆమె, హనుమన్తమ్=హనుమంతుని, వ్యక్తమ్=స్పష్టముగా, కపిమ్=వానరునిగానే, మన్యతే=తలచెను. అన్యథా ఇతి=మరొక విధముగా ఉన్నవాడని, న=తలపలేదు. అథ=అటు పిమ్మట, హనూమాన్=హనుమంతుడు, ప్రియదర్శనామ్=ప్రియమైన దర్శనము గల, తామ్=ఆమెను గూర్చి, ఉత్తరమ్=పై మాటను, ఉవాచ=పలికెను.

తా. హనుమంతుణ్ణి వానరుడే అనీ, మరొకడు ఎవ్వడూ కాడనీ ఆ సీత తెలిసికొనెను. పిమ్మట హనుమంతుడు చూచువానికి ఆనందమును కలిగించు ఆ సీతతో మరల ఇట్లనెను. 87

మూ. ఏతత్తే సర్వమాఖ్యాతం సమాశ్వసిహి మైథిలి,
కిం కరోమి కథం వా తే రోచతే ప్రతియామ్యహమ్. 88

ప్ర. అ. మైథిలి=ఓ ! సీతాదేవీ ! తే=నీకు, ఏతత్ సర్వమ్=ఇది అంతా, ఆఖ్యాతమ్=చెప్పబడినది. సమాశ్వసిహి=ఊరడిల్లుము. కిమ్=ఏమి, కరోమి=చేయుదును ? తే=నీకు, కథం వా=ఎట్లు, రోచతే=ఇష్టమగును? అహమ్=నేను, ప్రతియామి=తిరిగి వెళ్లుచున్నాను.

తా. ఓ ! సీతాదేవీ ! నీకిది అంతా చెప్పినాను కదా. నీవు ఊరడిల్లుము. నీ కొరకే నేనేమి చేయవలెనో, నీకేది ఇష్టమో చెప్పుము. నే నిక తిరిగి వెళ్ళెదను. 88

మూ. హతేஉసురే సంయతి శమ్బసాదనే
కపిప్రవీరేణ మహర్షిచోదనాత్,
తతోஉస్మి వాయుప్రభవో హి మైథిలి
ప్రభావతస్తత్ప్రతిమశ్చ వానరః. 89

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే సున్దరకాణ్డే
పఞ్చత్రింశః సర్గః.

ప్ర. అ. మైథిలి=ఓ ! సీతాదేవీ ! సంయతి=యుద్ధమునందు, శమ్బసాదనే=శంబసాదనుడను, అసురే=అసురుడు, కపిప్రవీరేణ=కపివీరుడైన కేసరిచేత, మహర్షిచోదనాత్=మహర్షుల ప్రేరేపణవలన, హతే సతి=చంపబడిన వాడగుచుండగా, అథ=పిమ్మట, వాయుప్రభవః=వాయువువలన పుట్టినవాడను, ప్రభావతః=ప్రభావమువలన, తత్ప్రతిమః=ఆతనితో సమానుడను అయిన, వానరః=వానరుడను, అస్మి=అయి ఉన్నాను.

తా. ఓ ! సీతాదేవీ ! మహర్షులు ప్రేరేపింప, కపివీరుడైన కేసరి, యుద్ధమందు, శంబసాదనుడను అసురుని చంపిన పిమ్మట నేను వాయువువలన జనించిన వానరుడను. ప్రభావముచేత నేను ఆ వాయుదేవుని అంతటి వాడను.

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు
సుందరకాండలో ముప్పదియైదవ సర్గ సమాప్తము.

అథ షట్త్రింశః సర్గః

[హనుమంతుడు సీతకు రామముద్రిక ఇచ్చుట. రాముడు నన్నీ దుఃఖ సముద్రమునుండి ఎప్పుడు ఉద్ధరించును అని ఆత్రముతో సీత ప్రశ్నించుట. రామునకు ఆమెపై ఉన్న ప్రేమను వర్ణించి చెప్పి హనుమంతుడు ఆమెను ఓదార్చుట].

మూ. భూయ ఏవ మహాతేజా హనూమాన్ పవనాత్మజః,
అబ్రవీత్ ప్రశ్రితం వాక్యం సీతాప్రత్యయకారణాత్. 1

ప్ర. అ. మహాతేజాః=గొప్ప తేజస్సు గల, పవనాత్మజః=వాయుపుత్రుడైన, హనుమాన్=హనుమంతుడు, సీతాప్రత్యయకారణాత్=సీతకు నమ్మకము కలుగుట అనే కారణము వలన (నమ్మకము కొరకై), భూయ ఏవ=మరల, ప్రశ్రితమ్=వినయపూర్వకమైన, వాక్యమ్=వాక్యమును, అబ్రవీత్=పలికెను.

తా. మహాతేజఃశాలీ వాయుపుత్రుడూ అయిన హనుమంతుడు, సీతకు నమ్మకము కలుగుటకై, మరల వినయపూర్వకముగా ఇట్లు పలికెను. 1

మూ. వానరో౭హం మహాభాగే దూతో రామస్య ధీమతః,
రామనామాఙ్కితం చేదం పశ్య దేవ్యఙ్గులీయకమ్. 2

ప్ర. అ. మహాభాగే=గొప్ప భాగ్యము గలదానా ! అహమ్=నేను, ధీమతః=బుద్ధిమంతుడైన, రామస్య=రామునియొక్క, దూతః=దూతయైన, వానరః=వానరుడను. దేవి=ఓ ! దేవీ ! రామనామాఙ్కితమ్=రాముని పేరుతో చిహ్నితమైన, ఇదమ్=ఈ, అఙ్గులీయకం చ=ఉంగరమును కూడా, పశ్య=చూడుము.

తా. ఓ మహాభాగ్యవంతురాలా ! నేను బుద్ధిశాలియైన రాముని దూతను ! ఓ ! దేవీ ! రాముని పేరు గుర్తు ఉన్న ఈ ఉంగరమును చూడుము. 2

మూ. ప్రత్యయార్థం తవానీతం తేన దత్తం మహాత్మనా,
సమాశ్వసిహి భద్రం తే క్షీణదుఃఖఫలా హ్యసి. 3

ప్ర. అ. మహాత్మనా=మహాత్ముడైన, తేన=ఆ రామునిచేత, దత్తమ్=ఇవ్వబడిన ఈ ఉంగరము, తవ=నీయొక్క, ప్రత్యయార్థమ్=నమ్మకము కొరకు, ఆనీతమ్=తీసికొనిరాబడినది. సమాశ్వసిహి=ఊరడిల్లుము. తే=నీకు, భద్రమ్=

మంగళమగుగాక ! క్షీణదుఃఖఫలా=క్షీణించిన దుఃఖఫలము కలదానవు, అసి హి=అయితివి కదా !

తా. మహాత్ముడైన ఆ రాముడిచ్చిన ఈ ఉంగరమును, నీ నమ్మకమునకై తీసికొని వచ్చినాను. ఊరడిల్లుము. నీకు మంగళ మగుగాక. నీ దుఃఖఫలము తొలగిపోవు సమయము వచ్చినది. 3

మూ. గృహీత్వా ప్రేక్షమాణా సా భర్తుః కరవిభూషణమ్,
భర్తారమివ సంప్రాప్తా జానకీ ముదితాభవత్. 4

ప్ర. అ. భర్తుః=భర్తయొక్క, కరవిభూషణమ్=హస్తాలంకారమైన ఆ ఉంగరమును, గృహీత్వా=గ్రహించి, ప్రేక్షమాణా=చూచుచున్న, సా జానకీ=ఆ జానకి, భర్తారమ్=భర్తను, సంప్రాప్తా ఇవ=చేరినది వలె, ముదితా=సంతోషించినది, అభవత్=ఆయెను.

తా. ఆ జానకి, భర్త ఉంగరమును గ్రహించి చూచుచు, భర్తను చేరినంత సంతోషము పొందెను. 4

మూ. చారు తద్వదనం తస్యాస్తామ్రశుక్లాయతేక్షణమ్,
అశోభత విశాలాక్ష్యా రాహుముక్త ఇవోడురాట్. 5

(దీని టీకా తాత్పర్యములకు, 35వ సర్గలోని 87వ శ్లోకము చూడుడు.)

మూ. తతః సా హ్రీమతీ బాలా భర్తృసన్దేశహర్షితా,
పరితుష్టా ప్రియం కృత్వా ప్రశశంస మహాకపిమ్. 6

ప్ర. అ. తతః=అటుపిమ్మట, బాలా=బాలయైన, సా=ఆ సీత, భర్తృసందేశహర్షితా=భర్తయొక్క సందేశముచేత సంతోషింపచేయబడినదై, హ్రీమతీ=సిగ్గు గలదై, సంతుష్టా=సంతోషించుచు, ప్రియమ్=ప్రియవాక్యమును, కృత్వా=చేసి, మహాకపిమ్=హనుమంతుని, ప్రశశంస=ప్రశంసించెను.

తా. భర్త వార్తను అందించి హనుమంతునిచేత సంతోషపెట్టబడిన బాలయైన (నిర్మలహృదయము గల) ఆ సీత సిగ్గుపడుచు, చాల సంతోషించుచు, ప్రియవాక్యము పలుకుచు, ఆ హనుమంతుని ప్రశంసించెను. 6

మూ. విక్రాన్తస్త్వం సమర్థస్త్వం ప్రాజ్ఞస్త్వం వానరోత్తమ,
యేనేదం రాక్షసపదం త్వయైకేన ప్రధర్షితమ్. 7

ప్ర. అ. వానరోత్తమ=ఓ ! వానరశ్రేష్ఠుడా ! ఏకేన=ఒంటరివాడవైన, యేన త్వయా=ఏ నీ చేత, ఇదమ్=ఈ, రాక్షసపదమ్=రాక్షసస్థానము,

ప్రధర్షితమ్=తిరస్కరింపబడినదో, త్వమ్=అట్టి నీవు, విక్రాన్తః=పరాక్రమవంతుడవు. త్వమ్=నీవు, సమర్థః=సమర్థుడవు. త్వమ్=నీవు, ప్రాజ్ఞః=చాల బుద్ధిశాలివి.

తా. ఓ !వానరోత్తమా ! నీవే పరాక్రమవంతుడవు, నీవే సమర్థుడవు. నీవే బుద్ధిశాలివి. అందుచేతనే నీవు ఒంటరిగా ఈ రాక్షసుల నగరములో నిర్భయముగా ప్రవేశించితివి. 7

మూ. శతయోజనవిస్తీర్ణః సాగరో మకరాలయః,
విక్రమశ్లాఘనీయేన క్రమతా గోష్పదీకృతః. 8

ప్ర. అ. విక్రమశ్లాఘనీయేన=పరాక్రమముచేత శ్లాఘింపదగిన, క్రమతా=దాటిన నీచేత, శతయోజనవిస్తీర్ణః=నూరు యోజనముల విస్తారము గల, మకరాలయః=మొసళ్ళకు నిలయమైన, సాగరః=సముద్రము, గోష్పదీకృతః=ఆవు పాదము వంటిదిగా చేయబడినది.

తా. శ్లాఘింపదగిన పరాక్రమము గల నీవు, నూరు యోజనములు విస్తారము గలదీ, మొసళ్లకు నివాసస్థానమూ అయిన సముద్రమును ఆవు పాదంవంటిదానినిగా చేసి, దాటినావు. 8

మూ. న హి త్వాం ప్రాకృతం మన్యే వానరం వానరర్షభ,
యస్య తే నాస్తి సంత్రాసో రావణాన్నాపి సంభ్రమః. 9

ప్ర. అ. వానరర్షభ=వానరశ్రేష్ఠుడా ! యస్య=ఏ, తే=నీకు, రావణాత్=రావణునినుండి, సంత్రాసః=భయము, నాస్తి=లేదో, సంభ్రమః అపి=కంగారుకూడ, న=లేదో, త్వామ్=అట్టి నిన్ను, ప్రాకృతమ్=సామాన్యుడైన, వానరమ్=వానరునిగా, న మన్యే=తలవను.

తా. ఓ ! వానరశ్రేష్ఠుడా ! రావణునివల్ల భయముగాని, కొంచెమైన తొట్రుపాటు గాని నీలో కనబడుటలేదు ! నీవు సామాన్యుడైన వానరుడవని అనుకొనను. 9

మూ. అర్హాసే చ కపిశ్రేష్ఠ మయా సమభిభాషితుమ్,
యద్యసి ప్రేషితస్తేన రామేణ విదితాత్మనా. 10

ప్ర. అ. కపిశ్రేష్ఠ=వానరశ్రేష్ఠుడా ! విదితాత్మనా=ప్రసిద్ధమైన బుద్ధిగల, తేన=ఆ, రామేణ=రామునిచేత, ప్రేషితః=పంపబడినవాడవు, అసి యది=అయితే, మయా=నాతో, సమభిభాషితుమ్=మాటలాడుటకు, అర్హాసే=తగియున్నావు.

తా. ఓ వానరశ్రేష్ఠా ! నిన్ను బుద్ధిమంతుడుగా ప్రసిద్ధుడైన ఆ రాముడు పంపినచో నాతో మాటలాడుటకు తగిఉన్నావు. 10

మూ. ప్రేషయిష్యతి దుర్ధర్షో రామో న హ్యపరీక్షితమ్,
పరాక్రమమవిజ్ఞాయ మత్సకాశం విశేషతః. 11

ప్ర. అ. దుర్ధర్షః=ఎదిరింప శక్యము కాని, రామః=రాముడు, పరాక్రమమ్=పరాక్రమమును, అవిజ్ఞాయ=తెలిసికొనకుండగా, అపరీక్షితమ్=పరీక్షింపబడని వానిని, న ప్రేషయిష్యతి హి=పంపడు కదా ! విశేషతః=విశేషించి, మత్సకాశమ్=నా వద్దకు పంపడు కదా !

తా. ఎదిరించుటకు శక్యము కాని రాముడు, నిన్ను పరీక్షించకుండగా, నీ పరాక్రమము ఎట్టిదో తెలిసికొనకుండగా పంపి ఉండడు కదా ! అందులోను నావద్దకు అసలే పంపి ఉండడు కదా. 11

మూ. దిష్ట్యా చ కుశలీ రామో ధర్మాత్మా సత్యసంగరః,
లక్ష్మణశ్చ మహాతేజాః సుమిత్రానన్దవర్ధనః. 12

ప్ర. అ. దిష్ట్యా=భాగ్యవశముచేత, ధర్మాత్మా=ధర్మాత్ముడు, సత్య సంగరః=సత్యమైన ప్రతిజ్ఞ కలవాడు అయిన, రామః=రాముడు, మహాతేజాః=గొప్ప తేజస్సు కలవాడు, సుమిత్రానన్దవర్ధనః=సుమిత్రయొక్క ఆనందమును వృద్ధిపొందించు, లక్ష్మణశ్చ=లక్ష్మణుడూ, కుశలీ=కుశలముగా నున్నాడు.

తా. ధర్మాత్ముడూ, సత్యమైన ప్రతిజ్ఞ కలవాడూ అయిన రాముడూ, మహాతేజఃశాలీ, సుమిత్ర ఆనందమును వృద్ధి పొందించువాడూ అయిన లక్ష్మణుడూ భాగ్యవశముచేత క్షేమముగా ఉన్నారు. 12

మూ. కుశలీ యది కాకుత్స్థః కిం న సాగరమేఖలామ్,
మహీం దహతి కోపేన యుగాన్తాగ్నిరివోత్థితః. 13

ప్ర. అ. కాకుత్స్థః=రాముడు, కుశలీ యది=క్షేమముగాఉన్నట్లయితే, ఉత్థితః=పైకి లేచిన (విజృంభించిన), యుగాన్తాగ్నిరివ=ప్రళయ కాలాగ్ని వలె, సాగర మేఖలామ్=సముద్రము వడ్డాణముగా గల, మహీమ్=భూమిని, కోపేన=కోపముతో, కిమ్=ఎందువలన, న దహతి=కాల్చివేయుట లేదు?

తా. రాముడు క్షేమముగా ఉన్నచో, ప్రజ్వలించుచున్న ప్రళయకాలాగ్ని వలె సముద్రమువరకు వ్యాపించి యున్న భూమిని, కోపముతో కాల్చివేయుటలేదేమి ? 13

మూ. అథవా శక్తిమన్తౌ తౌ సురాణామపి నిగ్రహే,
మమైవ తు న దుఃఖానామస్తి మన్యే విపర్యయః. 14

ప్ర. అ. అథవా=లేదా, తౌ=ఆ రామలక్ష్మణులు, సురాణామపి= దేవతలయొక్క కూడ, నిగ్రహే=నిగ్రహించుటయందు, శక్తిమన్తౌ=శక్తికలవారే. తు=కాని, మమ=నాయొక్క, దుఃఖానామేవ=దుఃఖములకే, విపర్యయః=అంతము, నాస్తి=లేదు అని, మన్యే=తలచెదను.

తా. లేదా అది వారి లోపమని చెప్పటకు వీలు లేదు. ఆ రామలక్ష్మణులు దేవతలను కూడ నిగ్రహించ సమర్థులు. కాని నా దుఃఖాలకే అంతము లేదని తలచెదను. 14

మూ. కచ్చిన్న వ్యథితో రామః కచ్చిన్న పరితప్యతే,
ఉత్తరాణి చ కార్యాణి కురుతే పురుషోత్తమః. 15

ప్ర. అ. రామః=రాముడు, న వ్యథితః కచ్చిత్=వ్యథ చెందుటలేదు కదా ? న పరితప్యతే కచ్చిత్=దుఃఖించుటలేదు కదా ? పురుషోత్తమః=పురుషులలో ఉత్తముడైన రాముడు, ఉత్తరాణి=తరువాత చేయవలసిన, కార్యాణి=కార్యములను, కురుతే=చేయుచున్నాడా ?

తా. రాముడు మనస్సులో బాధపడుట లేదు కదా ? దుఃఖించుటలేదు కదా ? ఆ పురుషోత్తముడు శత్రువును జయించుటకై చేయవలసిన పనులన్నీ చేయుచున్నాడా ? 15

మూ. కచ్చిన్న దీనః సంభ్రాన్తః కార్యేషు న చ ముహ్యతి,
కచ్చిత్పురుషకార్యాణి కురుతే నృపతేః సుతః. 16

ప్ర. అ. నృపతేః సుతః=రాజకుమారుడైన ఆ రాముడు, దీనః=దీనుడు, సంభ్రాన్తః=పొరబాటుచెందుచున్నవాడూ, న కచ్చిత్=కాదు కదా? కార్యేషు=పనులలో, న చ ముహ్యతి=మోహము చెందుటలేదు కదా ? పురుషకార్యాణి= మానవప్రయత్నములో చేయవలసిన పనులను, కచ్చిత్ కురుతే=చేయుచున్నాడా?

తా. రాజకుమారుడైన ఆ రాముడు దైన్యమూ, భ్రాంతీ లేకుండా ఉన్నాడా? పనులలో పొరబాటుపడుట లేదు కదా ? ప్రయత్నము చేసి సాధించవలసిన కార్యములను చేయుచున్నాడు కదా? 16

మూ. ద్వివిధం త్రివిధోపాయముపాయమపి సేవతే,
విజిగీషుః సుహృత్కచ్చిన్మిత్రేషు చ పరంతపః. 17

ప్ర. అ. పరంతపః=శత్రువులను పీడించు ఆ రాముడు, ద్వివిధమ్=రెండువిధములైన, ఉపాయమ్=ఉపాయమును (సామదానములను), త్రివిధోపాయ

మపి=మూడు విధములైన ఉపాయమును (దానభేద దండోపాయములను), అపి సేవతే=అవలంబించుచున్నాడా ? విజిగీషుః=శత్రువులను జయించుటకు ఇచ్ఛ కలవాడై, మిత్రేషు=మిత్రుల విషయమున, సుహృత్ కచ్చిత్=మంచి హృదయముతో ఉన్నాడా?

తా. శత్రుసంహారకుడైన ఆ రాముడు, అవసరమును బట్టి సామదానోపాయములను, దానభేదదండోపాయములను అవలంబించుచున్నాడా? శత్రుజయమును కోరి మిత్రుల విషయమున మైత్రితో ప్రవర్తించుచున్నాడా? 17

మూ. కచ్చిన్మిత్రాణి లభతే మిత్రైశ్చాప్యభిగమ్యతే,
కచ్చిత్కల్యాణమిత్రశ్చ మిత్రైశ్చాపి పురస్కృతః. 18

ప్ర. అ. మిత్రాణి=మిత్రులను, కచ్చిత్ లభతే=పొందుచున్నాడు కదా ? మిత్రైః=మిత్రులచేత, అపి అభిగమ్యతే=చేరబడుచున్నాడా ? కల్యాణమిత్రశ్చ కచ్చిత్=శుభకరులైన మిత్రులు కలవాడు కదా? మిత్రైశ్చ=మిత్రులచేత, అపి పురస్కృతః=గౌరవింపబడుచున్నాడు కదా?

తా. రాముడు మిత్రులను సంపాదించుకొనుచున్నాడు కదా? ఇతరులు కూడ అతని మైత్రిని కోరి ఆతనిని చేరుచున్నారు కదా ? ఆతని మిత్రులందరూ మంచివారే కదా? మిత్రులు ఆతనిని గౌరవించుచున్నారు కదా? 18

మూ. కచ్చిదాశాస్తి దేవానాం ప్రసాదం పార్థివాత్మజః,
కచ్చిత్పురుషకారం చ దైవం చ ప్రతిపద్యతే. 19

ప్ర. అ. పార్థివాత్మజః=రాజకుమారుడు, దేవానామ్=దేవతలయొక్క, ప్రసాదమ్=అనుగ్రహమును, ఆశాస్తి కచ్చిత్=కోరుచున్నాడు కదా? పురుషకారం చ=పురుషకారమును, దైవం చ=దైవమును, కచ్చిత్ ప్రతిపద్యతే=పొందుచున్నాడు కదా?

తా. రాజకుమారుడైన రాముడు దేవతల అనుగ్రహమును కోరి వారిని ఆరాధించుచున్నాడు కదా? పురుషకారానికీ, దైవానికీ సమమైన ప్రాధాన్యం ఇచ్చి, వాటిని సమముగా సేవించుచున్నాడు కదా? 19

మూ. కచ్చిన్న విగతస్నేహః ప్రవాసాన్మయి రాఘవః,
కచ్చిన్మాం వ్యసనాదస్మాన్మోక్షయిష్యతి వానర. 20

ప్ర. అ. రాఘవః=రాముడు, ప్రవాసాత్=ప్రవాసమువలన, మయి=నాయందు, విగతస్నేహః=పోయిన స్నేహము కలవాడు, న కచ్చిత్=కాదు కదా? వానర=హనుమంతుడా !మామ్=నన్ను, అస్మాత్=ఈ, వ్యసనాత్=వ్యసనమునుండి, మోక్షయిష్యతి కచ్చిత్=విడిపించునా ?

తా. ఓ హనుమంతుడా ! నేను దూరముగా ఉండిపోవుటవలన రామునికి నామీద ప్రేమ తగ్గిపోలేదు కదా ? నన్ను ఈ కష్టమునుండి ఆతడు విడిపించునా? 20

మూ. సుఖానాముచితో నిత్యమసుఖానామనౌచితః,
దుఃఖముత్తరమాసాద్య కచ్చిద్రామో న సీదతి. 21

ప్ర. అ. నిత్యమ్=నిత్యమూ, సుఖానామ్=సుఖములకు, ఉచితః=అలవాటు పడినవాడూ, అసుఖానామ్=కష్టములకు, అనౌచితః=అలవాటు లేనివాడూ అయిన, రాఘవః=రాముడు, ఉత్తరమ్=అధికమైన, దుఃఖమ్=దుఃఖమును, ఆసాద్య=పొంది, న సీదతి కచ్చిత్=క్రుంగిపోవుట లేదుకదా ?

తా. రాముడు సుఖాలకు అలవాటుపడినవాడు. కాని దుఃఖాలకు అలవాటుపడినవాడు కాదు. అట్టి రాముడు ఇప్పుడు వచ్చిన ఈ అత్యధిక మైన దుఃఖానికి క్రుంగిపోవుటలేదు కదా? 21

మూ. కౌసల్యాయాస్తథా కచ్చిత్సుమిత్రాయాస్తథైవ చ,
అభీక్ష్ణం శ్రూయతే కచ్చిత్కుశలం భరతస్య చ. 22

ప్ర. అ. కౌసల్యాయాః=కౌసల్యయొక్క, తథా=మరియు, సుమిత్రాయాః=సుమిత్రయొక్క, తథైవ చ=మరియు, భరతస్య=భరతునియొక్క, కుశలమ్=క్షేమము, అభీక్ష్ణమ్=అధికముగా, శ్రూయతే కచ్చిత్=వినబడుచున్నదా?

తా. కౌసల్య, సుమిత్ర, భరతుడు క్షేమముగా ఉన్నట్లు వార్తలు ఎక్కువగా వచ్చుచున్నవా? 22

మూ. మన్నిమిత్తేన మానార్హః కచ్చిచ్ఛోకేన రాఘవః,
కచ్చిన్నాన్యమనా రామః కచ్చిన్మాం తారయిష్యతి. 23

ప్ర. అ. మానార్హః=గౌరవమునకు తగిన, రాఘవః=రాముడు, మన్నిమిత్తేన=నాకొరకైన, శోకేన=శోకముచేత, (పరితప్యతే) కచ్చిత్=బాధపడుచున్నాడా? రామః=రాముడు, అన్యమనాః=మరొక దృష్టికలవాడు, న కచ్చిత్=కాదు కదా? మామ్=నన్ను, కచ్చిత్ తారయిష్యతి=దాటింపచేయునా?

తా. గౌరవార్హుడైన రాముడు నా నిమిత్తమై కలిగిన శోకముతో బాధపడుచున్నాడా? రాముడు ఇతరదృష్టి ఏదీలేక నన్ను శోకమునుండి దాటించునా?

మూ. కచ్చిదక్షౌహిణీం భీమాం భరతో భ్రాతృవత్సలః,
ధ్వజినీం మన్త్రిభిర్గుప్తాం ప్రేషయిష్యతి మత్కృతే. 24

ప్ర. అ. భ్రాతృవత్సలః=సోదరునియందు ప్రేమగల, భరతః=భరతుడు, మత్కృతే=నా నిమిత్తమై, మన్త్రిభిః=మంత్రులచేత, గుప్తామ్=రక్షించబడిన, భీమామ్=భయంకరమైన, అక్షౌహిణీమ్=అక్షౌహిణి ప్రమాణముగల, ధ్వజినీమ్=సేనను, కచ్చిత్ ప్రేషయిష్యతి=పంపును గదా?

తా. సోదరునియందు ప్రేమగల భరతుడు, నా నిమిత్తమై, మంత్రులచేత రక్షింపబడిన, అక్షౌహిణి ప్రమాణము గల, భయంకరమైన సైన్యమును పంపునుగదా?

మూ. వానరాధిపతిః శ్రీమాన్ సుగ్రీవః కచ్చిదేష్యతి,
మత్కృతే హరిభిర్వీరైర్వృతో దన్తనఖాయుధైః. 25

ప్ర. అ. మత్కృతే=నా నిమిత్తమై, శ్రీమాన్=శ్రీమంతుడైన, వానరాధిపతిః=వానరప్రభువైన, సుగ్రీవః=సుగ్రీవుడు, దన్తనఖాయుధైః=దంతములు, నఖములు ఆయుధములుగా గల, వీరైః=వీరులైన, హరిభిః=వానరులతో, వృతః=కూడినవాడై, ఏష్యతి కచ్చిత్=రాగలడు కదా?

తా. శ్రీమంతుడు, వానరాధిపతి అయిన సుగ్రీవుడు, దంతములు, నఖములు ఆయుధములుగా గల వీరులైన వానరులతో కూడి నా కొరకై రాగలడు కదా? 25

మూ. కచ్చిచ్చ లక్ష్మణః శూరః సుమిత్రానన్దవర్ధనః,
అస్త్రవిచ్ఛరజాలేన రాక్షసాన్విధమిష్యతి. 26

ప్ర. అ. శూరః=శూరుడు, సుమిత్రానందవర్ధనః=సుమిత్రయొక్క ఆనందమును వృద్ధి పొందించువాడు, అస్త్రవిత్=అస్త్రములను ఎరిగినవాడు అయిన, లక్ష్మణః=లక్ష్మణుడు, శరజాలేన=బాణముల సముదాయముచేత, రాక్షసాన్=రాక్షసులను, కచ్చిత్ విధమిష్యతి=ఎగురగొట్టివేయును కదా?

తా. శూరుడు, సుమిత్రకు ఆనందము కలిగించువాడు, అస్త్రవిద్యలో ప్రవీణుడు అయిన లక్ష్మణుడు, బాణముల సముదాయములతో రాక్షసులను సంహరించును కదా? 26

మూ. రౌద్రేణ కచ్చిదస్త్రేణ జ్వలతా నిహతం రణే,
ద్రక్ష్యామ్యల్పేన కాలేన రావణం ససుహృజ్జనమ్. 27

ప్ర. అ. జ్వలతా=ప్రజ్వలించుచున్న, రౌద్రేణ=భయంకరమైన, అస్త్రేణ=అస్త్రముచేత, రణే=యుద్ధమునందు, ససుహృజ్జనమ్=స్నేహితులతో సహా, నిహతమ్=చంపబడిన, రావణమ్=రావణుని, అల్పేన కాలేన=అల్పమైన కాలముచేత, ద్రక్ష్యామి కచ్చిత్=చూడగలను కదా?

తా. మిత్రజనసహితుడైన రావణుడు ప్రజ్వలించుచున్న భయంకరమైన అస్త్రముచేత యుద్ధరంగమునందు చంపబడగా, అచిరకాలములో చూడగలను కదా? 27

మూ. కచ్చిన్న తద్ధేమసమానవర్ణం
తస్యాననం పద్మసమానగన్ధి,
మయా వినా శుష్యతి శోకదీనం
జలక్షయే పద్మమివాతపేన. 28

ప్ర. అ. తస్య=ఆ రామునియొక్క, హేమసమానవర్ణమ్=బంగారముతో సమానమైన వర్ణము కలది, పద్మసమానగన్ధి=పద్మముతో సమానమైన గంధముకలది అయిన, తత్=ఆ, ఆననమ్=ముఖము, మయా వినా=నేను లేకపోవుట చేత, శోకదీనమ్=శోకముచేత దీనమై, జలక్షయే=జలము క్షీణించగా, ఆతపేన=ఎండచేత, పద్మమివ=పద్మమువలె, న శుష్యతి కచ్చిత్=ఎండిపోవుట లేదు కదా?

తా. బంగారముతో సమానమైన రంగు గలది, పద్మముతో సమానమైన సువాసన గలది అయిన, రాముని ఆ ముఖము, నేను దగ్గర లేకపోవుటచేత శోకముతో దీనమై, నీరు ఎండిపోయినపుడు ఎండచేత పద్మము వలె శుష్కించలేదు కదా?

వి. రాముడు నీలమేఘచ్ఛాయుడు (చూ. 35. 16)ఆతని ముఖమును "హేమసమానవర్ణమ్" అని వర్ణించుట యుక్తముగా లేదు. "సోమసమానకాన్తమ్" అను ప్రాచ్యపాఠము బాగున్నది. "చంద్రుడు వలె మనోహరమైనది" అని అర్థము. మనోహరత్వములోనే చంద్రునితో సామ్యము ; వర్ణములో కాదు. 28

మూ. ధర్మాపదేశాత్త్యజతశ్చ రాజ్యం
మాం చాప్యరణ్యం నయతః పదాతిమ్,
నాసీద్వ్యథా యస్య న భీర్న శోకః
కచ్చిత్స ధైర్యం హృదయే కరోతి. 29

ప్ర. అ. ధర్మాపదేశాత్=ధర్మమనే వంకవలన ("ధర్మోపదేశాత్" అను ప్రాచ్యపాఠము యుక్తము. ధర్మముయొక్క ఉపదేశమువలన. "తండ్రి సత్య వాక్యమువలన" లేదా "లోకమునకు ధర్మము ఉపదేశించుట అను కారణము వలన" అని అర్థము.) రాజ్యమ్=రాజ్యమును, త్యజతః=విడచినవాడూ, మాం చాపి=నన్ను కూడ, పదాతిమ్=కాలినడకచే ప్రయాణము చేయుదానినిగా, అరణ్యమ్=అరణ్యమును గూర్చి, నయతః=తీసికొనివెళ్లుచున్నవాడూ అయిన, యస్య=ఏ రామునకు, వ్యథా=మనోవ్యథ, నాసీత్=కలగలేదో, భీః=భయము, న=కలగలేదో,

శోకః=శోకము, న=కలగలేదో, సః=అట్టి రాముడు, హృదయే=హృదయమునందు, ధైర్యమ్=ధైర్యమును, కరోతి కచ్చిత్=చేయుచున్నాడు కదా?

తా. పితృవాక్యపాలనరూప ధర్మోపదేశమువలన రాజ్యమును విడచి, నన్ను కాలి నడకచే అరణ్యమునకు తీసికొనివెళ్లుచున్నప్పుడు కూడ ఏ రామునకు మనోవ్యథ కాని, భయము కాని, శోకము కాని కలగలేదో అట్టి రాముడు ధైర్యముగా ఉన్నాడు కదా? 29

మూ. న చాస్య మాతా న పితా చ నాన్యః
స్నేహాద్విశిష్టోఽస్తి మయా సమో వా,
తావత్త్వహం దూత జిజీవిషేయం
యావత్ప్రవృత్తిం శృణుయాం ప్రియస్య 30

ప్ర. అ. అస్య=ఈ రామునకు, స్నేహాత్=స్నేహమువలన, మయా=నాతో, సమో వా=సముడు గాని, విశిష్టః=అధికుడు గాని, మాతా=తల్లి, న=కాదు. పితా=తండ్రి, న=కాదు. అన్యః=మరియెవ్వడూ, నాస్తి=లేడు. దూత=ఓ !దూతవైన హనుమంతుడా ! ప్రియస్య=ప్రియునియొక్క, ప్రవృత్తిమ్=వృత్తాంతమును, యావత్=ఎంతవరకు, శృణుయామ్=విందునో, తావత్ తు=అంతవరకు, అహమ్=నేను, జిజీవిషేయమ్=జీవింపనిచ్ఛయింతును.

తా. హనుమంతుడా ! రామునకు స్నేహము విషయమున తల్లిగాని, తండ్రిగాని, మరి ఏ ఇతరవ్యక్తి గాని నాతో సమానులు లేదా అధికులు లేరు. ప్రియుని వృత్తాంతమును వినునంతవరకే జీవించవలెనని కోరుచున్నాను. 30

మూ. ఇతీవ దేవీ వచనం మహార్థం
తం వానరేన్ద్రం మధురార్థముక్త్వా,
శ్రోతుం పునస్తస్య వచోభిరామం
రామార్థయుక్తం విరరామ రామా. 31

ప్ర. అ. దేవీ=దేవియైన, రామా=సీత, తం వానరేన్ద్రమ్=ఆ హనుమంతుని గూర్చి, మహార్థమ్=గొప్ప అర్థము గల, మధురార్థమ్=మధురమైన అర్థము గల, వచనమ్=వచనమును, ఉక్త్వా=పలికి, తస్య=ఆతనియొక్క, అభిరామమ్=మనోహరమైనదీ, రామార్థయుక్తమ్=రామునకు సంబంధించిన విషయముతో కూడినదీ అయిన, వచః=వాక్కును, పునః=మరల, శ్రోతుమ్=వినుటకు, విరరామ=ఊరకుండెను.

తా. ఆ సీతాదేవి హనుమంతునితో ఆ విధముగా గొప్పదీ, మధురమూ అయిన అర్థము గల మాటలు పలికి, రామునకు సంబంధించిన విషయములు తెలిపే మనోహరమైన హనుమంతుని మాటలు వినుటకై ఊరకుండెను. 31

మూ. సీతాయా వచనం శ్రుత్వా మారుతిర్భీమవిక్రమః,
శిరస్యఞ్జలిమాధాయ వాక్యముత్తరమబ్రవీత్. 32

ప్ర. అ. భీమవిక్రమః=భయంకరమైన పరాక్రమము గల, మారుతిః=హనుమంతుడు, సీతాయాః=సీతయొక్క, వచనమ్=వచనమును, శ్రుత్వా=విని, శిరసి=శిరస్సుయందు, అఞ్జలిమ్=దోసిలిని, ఆధాయ=ఉంచి, ఉత్తరమ్=ఉత్తర (బదులు) రూపమైన, వాక్యమ్=వాక్యమును, అబ్రవీత్=పలికెను.

తా. భయంకరమైన పరాక్రమము గల హనుమంతుడు సీత మాటలు విని, శిరస్సుపై అంజలి ఘటించి ఇట్లు బదులు చెప్పెను. 32

మూ. న త్వామిహస్థాం జానీతే రామః కమలలోచనే,
తేన త్వాం నానయత్యాశు శచీమివ పురన్దరః. 33

ప్ర. అ. కమలలోచనే=కమలములవంటి నేత్రములు గల సీతాదేవీ! త్వామ్=నిన్ను, ఇహస్థామ్=ఇక్కడ ఉన్నదానినిగా, రామః=రాముడు, న జానీతే=ఎరుగడు. తేన=ఆ కారణముచేత, పురన్దరః=దేవేంద్రుడు, శచీమివ=శచీదేవిని వలె, త్వామ్=నిన్ను, ఆశు=శీఘ్రము, నానయతి=తీసికొని వెళ్లుటలేదు.

తా. ఓ సీతాదేవీ !నీవు ఇక్కడ ఉన్నట్లు రామునకు తెలియదు. అందుచేతనే దేవేంద్రుడు భార్యయైన శచీదేవిని తీసికొనివెళ్ళినట్లు నిన్ను శీఘ్రముగా తీసికొని వెళ్ళలేదు. 33

మూ. శ్రుత్వైవ తు వచో మహ్యం క్షిప్రమేష్యతి రాఘవః,
చమూం ప్రకర్షన్మహతీం హర్యృక్షగణసంకులామ్. 34

ప్ర. అ. ("మమ శ్రుత్వైవ తు వచః" అను ప్రాచ్యపాఠము బాగున్నది) మమ=నాయొక్క, వచః=వాక్యమును, శ్రుత్వైవ తు=వినగానే, రాఘవః=రాముడు, హర్యృక్షగణసంకులామ్=వానరగణములతోను, ఋక్ష (ఎలుగుబంట్లు) గణముల తోను నిండిన, మహతీమ్=గొప్ప, చమూమ్=సేనను, ప్రకర్షన్=లాగికొనుచు, క్షిప్రమ్=శీఘ్రముగా, ఏష్యతి=రాగలడు.

తా. నా మాట వినిన వెంటనే రాముడు వానరగణములతోను, ఎలుగుబంట్ల గుంపులతోను నిండిన పెద్ద సైన్యముతో శీఘ్రముగా రాగలడు.34

మూ. విష్టమ్భయిత్వా బాణౌఘైరక్షోభ్యం వరుణాలయమ్,
కరిష్యతి పురీం లఙ్కాం కాకుత్స్థః శాన్తరాక్షసామ్. 35

ప్ర. అ. కాకుత్థ్సః=రాముడు, అక్షోభ్యమ్=క్షోభింప శక్యము కాని, వరుణాలయమ్=సముద్రమును, బాణౌఘైః=బాణముల సముదాయములచేత, విష్టమ్భయిత్వా=స్తంభింపచేసి, లఙ్కాం పురీమ్=లంకాపట్టణమును, శాన్తరాక్షసామ్=శాంతించిన రాక్షసులు కలదానినిగా, కరిష్యతి=చేయగలడు.

తా. రాముడు, క్షోభింప శక్యము కాని సముద్రమును బాణసముదాయములచేత స్తంభింపచేసి (కదలకుండునట్లు చేసి), లంకాపట్టణములోని రాక్షసుల నందరిని నశింపచేయగలడు. 35

మూ. తత్ర యద్యన్తరా మృత్యుర్యది దేవాః సహాసురాః,
స్థాస్యన్తి పథి రామస్య స తానపి వధిష్యతి. 36

ప్ర. అ. తత్ర=ఆ సమయమునందు, రామస్య=రామునియొక్క, పథి=మార్గమునందు, అన్తరా=మధ్యయందు, మృత్యుః=మృత్యుదేవత గాని, సహాసురాః=అసురులతో గూడిన, దేవాః=దేవతలు గాని, స్థాస్యన్తి యది=నిలచినట్లయితే, సః=ఆ రాముడు, తానపి=వాళ్ళను కూడ, వధిష్యతి=చంపగలడు.

తా. ఆ సమయమునందు, మృత్యుదేవత గాని అసురులు గాని, దేవతలు గాని రాముని మార్గములో అడ్డుతగిలినచో అతడు వాళ్ళను కూడ చంపగలడు.

మూ. తవాదర్శనజేనార్యే శోకేన స పరిప్లుతః,
న శర్మ లభతే రామః సింహార్దిత ఇవ ద్విపః. 37

ప్ర. అ. ఆర్యే=ఓ పూజ్యురాలా ! సః రామః=ఆ రాముడు, తవ=నీయొక్క, అదర్శనజేన=కనబడకపోవుటచేత కలిగిన, శోకేన=శోకముతో, పరిప్లుతః=నిండినవాడై, సింహార్దితః=సింహముచేత పీడించబడిన, ద్విపః ఇవ=ఏనుగ వలె, శర్మ=సుఖమును, న లభతే=పొందుటలేదు.

తా. ఓ పూజ్యురాలా ! నీవు కనబడని దుఃఖముతో నిండిన ఆ రాముడు, సింహముచేత పీడించబడిన ఏనుగ వలె సుఖము పొందజాలకున్నాడు. 37

మూ. మలయేన చ విన్ధ్యేన మేరుణా మన్దరేణ చ,
దర్దురేణ చ తే దేవి శపే మూలఫలేన చ. 38
యథా సునయనం వల్గు బిమ్బోష్ఠం చారుదర్శనమ్,
ముఖం ద్రక్ష్యసి రామస్య పూర్ణచన్ద్రమివోదితమ్. 39

ప్ర. అ. దేవి=ఓ !సీతాదేవి, మలయేన చ=మలయ పర్వతము చేత, విన్ధ్యేన=వింధ్యపర్వతముచేత, మేరుణా=మేరుపర్వతముచేత, దర్దురేణ=దర్దురపర్వతముచేత,

మూలఫలేన=మూలఫలములచేత, తే=నీకు, శపే=ఒట్టుపెట్టి చెప్పుచున్నాను. యథా=ఏమనగా, సునయనమ్=మంచి నేత్రములు గలదీ, వల్గు=సుందరమైనదీ, బిమ్బోష్ఠమ్=దొండపండు వంటి పెదవులు గలదీ, చారుదర్శనమ్=అందమైన దర్శనము కలదీ, ఉదితమ్=ఉదయించిన, పూర్ణచన్ద్రమివ=పూర్ణచంద్రుడు వలె ఉన్నదీ అయిన, రామస్య=రాముని యొక్క, ముఖమ్=ముఖమును, ద్రక్ష్యసి=చూడగలవు.

తా. ఓ ! దేవీ ! మలయపర్వతముపైనా, వింధ్యపర్వతముపైనా, మేరు పర్వతముపైనా, మందరపర్వతముపైనా, దర్దురపర్వతముపైనా, మా ఆహారమైన కందమూలములపైనా ఒట్టు పెట్టి చెప్పుచున్నాను. సుందరములైన నేత్రములు కలదీ, మనోహరమూ, దొండపండువంటి పెదవులు కలదీ, చూచుటకు అందమైనదీ, ఉదయించిన పూర్ణచంద్రునితో సమానమూ అయిన రాముని ముఖమును తప్పక చూడగలవు.

వి. వనవాసములో ఉన్న రామునకు కుండలములు లేవు గాన "చారు కుణ్డలమ్" అను పాఠమునకు బదులు "చారుదర్శనమ్" అను ప్రాచ్యపాఠము గ్రహింపబడినది. 38, 39

మూ. క్షిప్రం ద్రక్ష్యసి వైదేహి రామం ప్రస్రవణే గిరౌ,
శతక్రతుమివాసీనం నాగరాజస్య మూర్ధని. 40

ప్ర. అ. వైదేహి=సీతాదేవీ ! ప్రస్రవణే గిరౌ=ప్రస్రవణపర్వతమునందు, రామమ్=రాముణ్ణి, నాగరాజస్య=గజరాజైన ఐరావతము యొక్క, మూర్ధని=శిరస్సుమీద (మూపుమీద), ఆసీనమ్=కూర్చున్న, శతక్రతుమ్ ఇవ=దేవేంద్రుని వలె, క్షిప్రమ్=శీఘ్రముగా, ద్రక్ష్యసి=చూడగలవు.

తా. సీతాదేవీ ! ఐరావతము మూపు మీద కూర్చున్న దేవేంద్రుడు వలె ప్రస్రవణపర్వతము పై ఉన్న రాముణ్ణి శీఘ్రముగా చూడగలవు. 40

మూ. న మాంసం రాఘవో భుంక్తే న చాపి మధు సేవతే,
వన్యం సువిహితం నిత్యం భక్తమశ్నాతి పఞ్చమమ్. 41

ప్ర. అ. రాఘవః=రాముడు, మాంసమ్=మాంసమును, న భుఙ్క్తే= తినుటలేదు. మధుచాపి=మద్యమును కూడ, న సేవతే=సేవించుటలేదు, నిత్యమ్=ప్రతిదినము, పఞ్చమమ్=సాయంకాలమును (నందు), సువిహితమ్= చక్కగా ఏర్పరుపబడిన, వన్యమ్=వనమునందు తగిన, భక్తమ్=అన్నమును అశ్నాతి=తినుచున్నాడు.

తా. రాముడు మాంసాహారమును భుజించుటలేదు. మద్యమును సేవించుట లేదు. ప్రతిదినము సాయంకాలము మాత్రమే వానప్రస్థులకు తగిన, చక్కగా ఏర్పరుపబడిన ఫలమూలాద్యాహారమును మాత్రమే భుజించుచున్నాడు.

వి. ప్రాతఃకాలము, సంగవకాలము, మధ్యాహ్నము, అపరాహ్ణము, సాయంకాలము అని పగటిభాగము ఐదు భాగములుగా విభజింపబడినది. 41

మూ. నైవ దంశాన్న మశకాన్న కీటాన్న సరీసృపాన్,
రాఘవోఽపనయేద్గాత్రాత్త్వద్గతేనాన్తరాత్మనా. 42

ప్ర. అ. రాఘవః=రాముడు, త్వద్గతేన=నిన్ను చేరియున్న, అన్తరాత్మనా=మనస్సుతో, గాత్రాత్=శరీరమునుండి, దంశాన్=అడవి ఈగలను, నైవ అపనయేత్=తొలగించుకొనుటలేదు. మశకాన్=దోమలను, న=తొలగించుకొనుట లేదు. కీటాన్=పురుగులను, న=తొలగించుకొనుటలేదు, సరీసృపాన్=సర్పాదులను కూడ, న=తొలగించుకొనుటలేదు.

తా. రాముడు తన మనస్సు పూర్తిగా నీ మీదనే నిలచి ఉండుటచే శరీరము మీద వ్రాలిన (కుట్టే) అడవి ఈగలను గాని, దోమలను గాని శరీరముమీద పాకే పురుగులను గాని, సర్పములను గాని తొలగించుకొనుటలేదు.

మూ. నిత్యం ధ్యానపరో రామో నిత్యం శోకపరాయణః,
నాన్యచ్చిన్తయతే కించిత్స తు కామవశంగతః. 43

ప్ర. అ. రామః=రాముడు, నిత్యమ్=నిత్యమూ, ధ్యానపరః=ధ్యానమునందు ఆసక్తి కలవాడు. నిత్యమ్=ఎల్లప్పుడూ, శోకపరాయణః=శోకమునందు ఆసక్తి కలవాడు. సః=అతడు, కామవశంగతః=మన్మథునికి వశుడై, అన్యత్=మరొకదానిని దేనినీ, న చిన్తయతే=ఆలోచించుటలేదు.

తా. రాముడు ఎల్లవేళలా ఏదో ఆలోచించుచు, దుఃఖాక్రాంతుడై, ఉన్నాడు. మన్మథునకు వశుడై అతడు నిన్ను తప్ప మరి దేనిని గూర్చి కూడా ఆలోచించుటలేదు. 43

మూ. అనిద్రః సతతం రామః సుప్తోఽపి చ నరోత్తమః,
సీతేతి మధురాం వాణీం వ్యాహరన్ ప్రతిబుధ్యతే. 44

ప్ర. అ. రామః=రాముడు, సతతమ్=ఎల్లప్పుడూ, అనిద్రః=నిద్రలేకుండానే ఉన్నాడు. నరోత్తమః=ఆ నరశ్రేష్ఠుడు, సుప్తోఽపి=కొంచెము నిద్రించినా, సీతేతి= సీతా అని, మధురామ్=మధురమైన, వాణీమ్=వాక్కును, వ్యాహరన్=పలుకుచు, ప్రతిబుధ్యతే=మేల్కొనుచున్నాడు.

తా. రామునకు చాలవరకు నిద్రయే లేదు. ఎప్పుడైనా కొంచెము నిద్రపట్టినా ఆ నరోత్తముడు "సీతా సీతా" అని అనుచు మేల్కొనుచున్నాడు. 44

మూ. దృష్ట్వా ఫలం వా పుష్పం వా యద్వాన్యత్సుమనోహరమ్,
బహుశో హా ప్రియేత్యేవం శ్వసంస్త్వామభిభాషతే. 45

ప్ర. అ. ఫలం వా=ఫలమును కాని, పుష్పం వా=పుష్పమును కాని, యద్వా=లేక, సుమనోహరమ్=చాల అందమైన, అన్యత్=మరొక వస్తువును గాని, దృష్ట్వా=చూచి, శ్వసన్=నిట్టూర్చుచు, హా ప్రియేత్యేవమ్=హా ! ప్రియురాలా ! అని, త్వామ్=నిన్ను గూర్చి, బహుశః=అనేక పర్యాయములు, అభిభాషతే=మాటలాడుచుండును.

తా. ఏదైన పండుకాని, పువ్వు కాని, అందమైన మరేదైన వస్తువు కాని కనబడినపుడు 'హా ప్రియే'! అని నిన్ను అనేకవిధముల స్మరించుచు నిట్టూర్పు విడచుచుండును. 45

మూ. స దేవి నిత్యం పరితప్యమాన
స్త్వామేవ సీతేత్యభిభాషమాణః,
ధృతవ్రతో రాజసుతో మహాత్మా
తవైవ లాభాయ కృతప్రయత్నః. 46

ప్ర. అ. దేవి=ఓ ! సీతాదేవీ ! మహాత్మా=మహాత్ముడైన, సః=ఆ, రాజసుతః=రాజకుమారుడైన రాముడు, నిత్యమ్=ఎల్లప్పుడు, పరితప్యమానః=బాధపడుచు, సీతేతి=సీతా అని, త్వామేవ=నిన్ను గూర్చియే, అభిభాషమాణః=మాటలాడుచు, ధృతవ్రతః=అవలంబింపబడిన వ్రతము కలవాడై, తవ=నీ యొక్క, లాభాయైవ=లాభము కొరకే, కృతప్రయత్నః=చేయబడిన ప్రయత్నము గలవాడు.

తా. ఓ !సీతాదేవీ ! మహాత్ముడైన ఆ రాజకుమారుడు, రాముడు, నిత్యము దుఃఖించుచున్నాడు. 'సీతా! అని నిన్నే తలచుచున్నాడు. నియమము అవలంబించి నిన్ను పొందుటకే ప్రయత్నము చేయుచున్నాడు. 46

మూ. సా రామసంకీర్తనవీతశోకా
రామస్య శోకేన సమానశోకా,
శరన్ముఖే సాంబుదశేషచన్ద్రా
నిశేవ వైదేహసుతా బభూవ. 47

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే సున్దరకాణ్డే
షట్త్రింశః సర్గః.

ప్ర. అ. రామస్య=రామునియొక్క, శోకేన=శోకముతో, సమానశోకా=సమానమైన శోకము కల, రామసంకీర్తనవీతశోకా=రాముణ్ణి గూర్చి వర్ణించుటచేత, తొలగిన శోకముగల, సా=ఆ, వైదేహసుతా=సీత, శరన్ముఖే=శరత్కాల ప్రారంభమునందు, సామ్బుదశేషచన్ద్రా=మేఘముల శేషముతో కూడిన చంద్రుడు గల, నిశేవ=రాత్రివలె, బభూవ=ఆయెను (ఉండెను).

తా. రామునకు ఎంత శోకము ఉండెనో, సీతకు కూడ అంత శోకమే ఉండెను. కాని రాముని వర్ణనము వినుటచే ఆమె శోకము కొంత తగ్గెను. ఇట్లు శోకానందములతో అప్పుడా సీత, శరత్కాలప్రారంభమునందు కొంచెము మేఘాలు మిగిలి ఉండగా చంద్రునితో కూడిన రాత్రి వలె ఉండెను. 47

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు
సుందరకాండలో ముప్పైఆరవ సర్గ సమాప్తము.

అథ సప్తత్రింశః సర్గః

[రాముని శీఘ్రముగా తీసికొని రమ్మని సీత హనుమంతునితో చెప్పుట ; తనతో రాముని వద్దకు రమ్మని హనుమంతుడు ఆమెను కోరుట ; సీత అందుకు నిరాకరించుట].

మూ. సా సీతా వచనం శ్రుత్వా పూర్ణచన్ద్రనిభాననా,
హనూమన్తమువాచేదం ధర్మార్థసహితం వచః. 1

ప్ర. అ. పూర్ణచన్ద్రనిభాననా=పూర్ణచంద్రునితో సమానమైన ముఖము గల, సా=ఆ, సీతా=సీత, తద్వచనమ్=హనుమంతుని వచనమును, శ్రుత్వా=విని, హనూమన్తమ్=హనుమంతుని గూర్చి, ఇదమ్=ఈ, ధర్మార్థసహితమ్=ధర్మార్థములతో కూడిన, వచః=వాక్యమును, ఉవాచ=పలికెను.

తా. పూర్ణచంద్రుని వంటి ముఖము గల ఆ సీత హనుమంతుని మాటలు విని, ధర్మార్థములకు సంమతమైన మాట ఆతనితో ఇట్లనెను. 1

మూ. అమృతం విషసంసృష్టం త్వయా వానర భాషితమ్,
యచ్చ నాన్యమనా రామో యచ్చ శోకపరాయణః. 2

ప్ర. అ. వానర=హనుమంతుడా ! రామః=రాముడు, అన్యమనాః న ఇతి యత్=ఇతరములైన ఆలోచనలు లేనివాడై ఉన్నాడు అనునది ఏది కలదో, శోకపరాయణః ఇతి చ యత్=దుఃఖముతో నిండి యున్నాడు అనునది కూడ ఏది కలదో, త్వయా=నీచేత, భాషితమ్=పలుకబడినమాట, విషసంసృష్టమ్=విషముతో కూడిన, అమృతమ్=అమృతము. లేదా-యత్,=ఏ కారణము వలన, రామః=రాముడు, అన్యమనాః=ఇతరమనస్కుడు, న=కాడో, యత్=ఏ కారణమువలన, శోకపరాయణుడైఉన్నాడో, ఆ కారణము వలన.... అని కూడ అర్థము చెప్పవచ్చును.

తా. హనుమంతుడా ! రాముడు ఇతర దృష్టి లేకుండా ఉన్నాడనీ, శోకముతో నిండి ఉన్నాడనీ చెప్పినావు. అందుచే నీ మాటలు విషము కలిపిన అమృతము వలె ఉన్నవి. 2

మూ. ఐశ్వర్యే వా సువిస్తీర్ణే వ్యసనే వాతిదారుణే,
రజ్జ్వేవ పురుషం బద్ధ్వా కృతాన్తః పరికర్షతి. 3

ప్ర. అ. కృతాన్తః=దైవము, పురుషమ్=పురుషుణ్ణి, రజ్జ్వా=త్రాడుతో, బద్ధ్వా ఇవ=కట్టి వలె, సువిస్తీర్ణే=బాగా అధికమైన, ఐశ్వర్యే వా=ఐశ్వర్యము లోనికి గాని, అతిదారుణే=చాలా భయంకరమైన, వ్యసనే వా=వ్యసనములోనికి గాని, పరికర్షతి=ఈడ్చుకొనిపోవుచుండును.

తా. దైవము అత్యధికమైన ఐశ్వర్యములోనికి గాని, అతి భయంకరమైన దుఃఖములోనికి గాని, పురుషుణ్ణి, త్రాడు కట్టి ఈడ్చుకొని పోయినట్లు ఈడ్చుకొనిపోవును. 3

మూ. విధిర్నూనమసంహార్యః ప్రాణినాం ప్లవగోత్తమ,
సౌమిత్రిం మాం చ రామం చ వ్యసనైః పశ్య మోహితాన్. 4

ప్ర. అ. ప్లవగోత్తమ=ఓ ! వానరశ్రేష్ఠుడా ! ప్రాణినామ్=ప్రాణులకు, నూనమ్=నిశ్చయముగా, విధిః=దైవము, అసంహార్యః=దాట శక్యము కానిది. వ్యసనైః=కష్టములచేత, మోహితాన్=బాధపెట్టబడుచున్న, సౌమిత్రిమ్=లక్ష్మణునీ, మాం చ=నన్నూ, రామం చ=రాముణ్ణీ, పశ్య=చూడుము.

తా. ఓ హనుమంతుడా ! ప్రాణులెవ్వరూ దైవమును దాటజాలరు. ఇది నిశ్చయము. లక్ష్మణుడూ, రాముడూ, నేనూ కష్టాలలో చిక్కుకొని ఎంత బాధపడుచున్నామో చూడుము. 4

మూ. శోకస్యాస్య కదా పారం రాఘవో ఽధిగమిష్యతి,
ప్లవమానః పరిశ్రాన్తో హతనౌః సాగరే యథా. 5

ప్ర. అ. సాగరే=సముద్రమునందు, హతనౌః=బద్దలైపోయిన ఓడ కలవాడై, ప్లవమానః=ఈదుచు, పరిశ్రాన్తః యథా=అలసిపోయిన పురుషుడువలె, రాఘవః=రాముడు, అస్య=ఈ, శోకస్య=శోకముయొక్క, పారమ్=అంతమును, కదా=ఎప్పుడు, అధిగమిష్యతి=పొందగలడో కదా !

తా. సముద్రమధ్యములో ఓడ బద్దలైపోగా ఈది, ఈది, అలసి పోయిన వాడు వలె ఉన్న రాముడు ఈ శోకము అంతమును ఎప్పుడు చూచునో కదా !

మూ. రాక్షసానాం వధం కృత్వా సూదయిత్వా చ రావణమ్,
లఙ్కామున్మూలితాం కృత్వా కదా ద్రక్ష్యతి మాం పతిః. 6

ప్ర. అ. పతిః=నా భర్త యైన రాముడు, రాక్షసానామ్=రాక్షసుల యొక్క, వధమ్=వధను, కృత్వా=చేసి, రావణం చ=రావణుని కూడ, సూదయిత్వా=సంహరించి, లఙ్కామ్=లంకను, ఉన్మూలితామ్=పెకిలించి వేయబడినదానినిగా, కృత్వా=చేసి, మామ్=నన్ను, కదా=ఎప్పుడు, ద్రక్ష్యతి=చూడగలడో !

తా. నా భర్త రాక్షసులను సంహరించి, రావణుని హతమార్చి, లంకా పట్టణమును పూర్తిగా నశింపచేసి, నన్నెప్పుడు చూడగలడో కదా ! 6

మూ. స వాచ్యః సంత్వరస్వేతి యావదేవ న పూర్యతే,
అయం సంవత్సరః కాలస్తావద్ధి మమ జీవితమ్. 7

ప్ర. అ. అయమ్=ఈ, సంవత్సరః కాలః=సంవత్సరకాలము, యావదేవ= ఎంతలో, న పూర్యతే=నిండిపోదో, అంతలో, సంత్వరస్వేతి=తొందర పడుము అని, సః=ఆ రాముడు, వాచ్యః=చెప్పదగినవాడు. మమ=నా యొక్క, జీవితమ్=జీవితము, తావద్ధి=అంతవరకు మాత్రమే కదా !

తా. ఈ సంవత్సరకాలము పూర్తి అగుటకుముందే నన్ను రక్షించుటకై తొందరపడవలెనని ఆ రామునితో చెప్పుము. ఎందుచేతననగా నేను అంత వరకు మాత్రమే జీవించగలను. 7

మూ. వర్తతే దశమో మాసో ద్వౌ తు శేషౌ ప్లవంగమ,
రావణేన నృశంసేన సమయో యః కృతో మమ. 8

ప్ర. అ. ప్లవఙ్గమ=హనుమంతుడా ! నృశంసేన=క్రూరుడైన, రావణేన= రావణునిచేత, మమ=నాకు, యః=ఏ, సమయః=గడువు, కృతః=చేయుబడినదో దానిలో, దశమః=పదవ, మాసః=మాసము, వర్తతే=నడచుచున్నది. ద్వౌ తు=రెండు మాసములు మాత్రమే, శేషౌ=మిగిలి ఉన్నవి.

తా. ఓ ! హనుమంతుడా ! క్రూరుడైన రావణుడు నాకిచ్చిన గడువులో ఇప్పుడు పదవ మాసము జరుగు చున్నది. ఇంక రెండుమాసములు మిగిలి ఉన్నవి. 8

మూ. విభీషణేన చ భ్రాత్రా మమ నిర్యాతనం ప్రతి,
అనునీతః ప్రయత్నేన న చ తత్కురుతే మతిమ్. 9

ప్ర. అ. భ్రాత్రా=సోదరుడైన, విభీషణేన=విభీషణునిచేత, మమ=నా యొక్క, నిర్యాతనం ప్రతి=తిరిగి ఇచ్చివేయుటను గూర్చి, ప్రయత్నేన=ప్రయత్నముచేత, అనునీతః=బతిమాలుకొనబడినవాడైనను, తల్=ఆ విషయమునందు, మతిమ్=బుద్ధిని, న కురుతే=చేయుటలేదు.

తా. "సీతను రామునకు తిరిగి ఇచ్చివేయుము"అని సోదరుడైన విభీషణుడు ఆ రావణుని ఎంత బ్రతిమాలి చెప్పినను అతడు అట్టి ఆలోచన చేయుట లేదు. 9

మూ. మమ ప్రతిప్రదానం హి రావణస్య న రోచతే,
రావణం మార్గతే సంఖ్యే మృత్యుః కాలవశం గతమ్. 10

ప్ర. అ. మమ=నా యొక్క, ప్రతిప్రదానమ్=తిరిగి ఇచ్చివేయుట, రావణస్య=రావణునకు, న రోచతే=ఇష్టమగుట లేదు. కాలవశం గతమ్=కాలమునకు వశుడైపోయిన, రావణమ్=రావణుని, సంఖ్యే=యుద్ధమునందు, మృత్యుః=మృత్యువు, మార్గతే=అన్వేషించుచున్నది.

తా. నన్ను తిరిగి ఇచ్చివేయుట రావణునకు ఏ మాత్రము ఇష్టము కాదు. అతడు కాలానికి లొంగిపోయినాడు; యుద్ధములో ఆతనిని మృత్యువు వెదకుచున్నది. 10

మూ. జ్యేష్ఠా కన్యా నలా నామ విభీషణసుతా కపే,
తయా మమేదమాఖ్యాతం మాత్రా ప్రహితయా స్వయమ్. 11

ప్ర. అ. కపే=హనుమంతుడా ! నలా=నల అను పేరు గల, జ్యేష్ఠా=పెద్దదైన, విభీషణసుతా=విభీషణుని కుమార్తె ఉన్నది. మాత్రా=తల్లిచేత, ప్రహితయా=పంపబడిన, తయా=ఆమెచేత, స్వయమ్=స్వయముగా, ఇదమ్=ఇది, మమ=నాకు, ఆఖ్యాతమ్=చెప్పబడినది.

తా. హనుమంతుడా ! విభీషణుని పెద్దకూతురైన నల, తల్లి పంపగా వచ్చి స్వయముగా నాతో ఈ విషయము చెప్పినది. 11

మూ. అసంశయం హరిశ్రేష్ఠ క్షిప్రం మాం ప్రాప్స్యతే పతిః,
అన్తరాత్మా చ మే శుద్ధస్తస్మింశ్చ బహవో గుణాః. 12

ప్ర. అ. హరిశ్రేష్ఠ=వానరోత్తమా ! పతిః=నా భర్త యైన రాముడు, క్షిప్రమ్=శీఘ్రముగా, మామ్=నన్ను, అసంశయమ్=నిస్సంశయముగా, ప్రాప్స్యతి=పొందగలడు. మే=నాయొక్క, అన్తరాత్మా చ=అంతరాత్మ, శుద్ధః=పరిశుద్ధముగా ఉన్నది. తస్మింశ్చ=ఆ రామునియందు కూడ, బహవః=అనేకములైన, గుణాః=సద్గుణములున్నవి.

తా. హనుమంతుడా ! నిస్సంశయముగా నా భర్త నన్ను శీఘ్రముగా పొందగలడు. ఎందుచేతననగా నా అంతరాత్మ (మనసు)పరిశుద్ధముగా ఉన్నది. ఆ రామునియందు అనేక సద్గుణములు వున్నవి. 12

మూ. ఉత్సాహః పౌరుషం సత్త్వమానృశంస్యం కృతజ్ఞతా,
విక్రమశ్చ ప్రభావశ్చ సన్తి వానర రాఘవే. 13

ప్ర. అ. వానర=హనుమంతుడా ! రాఘవే=రామునియందు, ఉత్సాహః=ఉత్సాహము, పౌరుషమ్=పురుషకారము, సత్త్వమ్=బలము, ఆనృశంస్యమ్=క్రూరత్వము లేకుండుట, కృతజ్ఞతా=కృతజ్ఞత్వము, విక్రమశ్చ=పరాక్రమము, ప్రభావశ్చ=ప్రభావము (అధికారనిర్వాహణ శక్తి) సన్తి=ఉన్నవి.

తా. హనుమంతుడా ! రామునిలో ఉత్సాహము, పురుషప్రయత్నము చేయుట, బలము, క్రూరస్వభావము లేకుండుట, కృతజ్ఞత్వము, పరాక్రమము, ప్రభావము మొదలైన సద్గుణములు ఉన్నవి. 13

మూ. చతుర్దశసహస్రాణి రాక్షసానాం జఘాన యః,
జనస్థానే వినా భ్రాత్రా శత్రుః కస్తస్య నోద్విజేత్. 14

ప్ర. అ. యః=ఏ రాముడు, జనస్థానే=జనస్థానమునందు, వినా భ్రాత్రా=సోదరుడు కూడ లేకుండా, రాక్షసానామ్=రాక్షసులయొక్క, చతుర్దశసహస్రాణి=పదునాలుగువేలను, జఘాన=చంపెనో, తస్య=అట్టి రామునకు, కః=ఏ, శత్రుః=శత్రువు, నోద్విజేత్=భయపడకుండా ఉండును ?

తా. ఏ రాముడు, లక్ష్మణుని సహాయము కూడ లేకుండ, జనస్థానములో పదునాలుగువేలమంది రాక్షసులను చంపెనో ఆతనికి ఏ శత్రువు భయపడదు?

మూ. న స శక్యస్తులయితుం వ్యసనైః పురుషర్షభః,
అహం తస్య ప్రభావజ్ఞా శక్రస్యేవ పులోమజా. 15

ప్ర. అ. పురుషర్షభః=పురుషులలో శ్రేష్ఠుడైన, సః=ఆ రాముడు, వ్యసనైః=కష్టములచేత, తులయితుమ్=చలింపచేయుటకు, న శక్యః=శక్యమైనవాడు కాడు. పులోమజా=శచీదేవి, శక్రస్యేవ=దేవేంద్రునియొక్క వలె, అహమ్=నేను, తస్య=ఆ రామునియొక్క, ప్రభావజ్ఞా=ప్రభావమును ఎరిగిన దానను

తా. పురుషశ్రేష్ఠుడైన ఆ రాముడు ఎన్ని కష్టములు వచ్చినను చలించడు. శచీదేవికి దేవేంద్రుని ప్రభావము తెలిసినట్లు, నాకు రాముని ప్రభావము బాగుగా తెలియును. 15

మూ. శరజాలాంశుమాన్ శూరః కపే రామదివాకరః,
శత్రురక్షోమయం తోయముపశోషం నయిష్యతి. 16

ప్ర. అ. కపే=హనుమంతుడా ! శూరః=శూరుడు, శరజాలాంశుమాన్=బాణసముదాయ మను కిరణములు గలవాడు అయిన, రామదివాకరః=రాముడనే సూర్యుడు, శత్రురక్షోమయమ్=శత్రువు లైన రాక్షసులనే, తోయమ్=ఉదకమును, ఉపశోషమ్=ఎండిపోవుటను, నయిష్యతి=పొందించగలడు.

తా. హనుమంతుడా! బాణసముదాయము లనే కిరణములుగల, శూరుడైన రాముడనే సూర్యుడు, శత్రువులైన రాక్షసులనే జలమును ఎండింపచేయగలడు.

మూ. ఇతి సంజల్పమానాం తాం రామార్థే శోకకర్శితామ్,
అశ్రుసంపూర్ణనయనామువాచ వచనం కపిః. 17

ప్ర. అ. ఇతి=ఇట్లు, సంజల్పమానామ్=మాటలాడుచున్నది, రామార్థే=రామునినిమిత్తము, శోకకర్శితామ్=శోకముచేత కృశింపచేయబడినది, అశ్రు సంపూర్ణనయనామ్=కన్నీళ్ళతో నిండిన నేత్రములు కలది అయిన, తామ్=ఆ సీతను గూర్చి, కపిః=హనుమంతుడు, వచనమ్=వచనమును, ఉవాచ=పలికెను.

తా. రామునికొరకై శోకముతో కృశించి, కన్నీళ్ళతో నిండిన నేత్రములతో ఈ విధముగా పలుకుచున్న సీతతో హనుమంతుడిట్లనెను. 17

మూ. శ్రుత్వైవ తు వచో మహ్యం క్షిప్రమేష్యతి రాఘవః,
చమూం ప్రకర్షన్మహతీం హర్యృక్షగణసంకులామ్. 18

(ప్రతిపదార్థతాత్పర్యమునకు 36వ సర్గలోని 34వ శ్లోకం చూడండి)

మూ. అథవా మోచయిష్యామి త్వామద్యైవ వరాననే,
అస్మాద్దుఃఖాదుపారోహ మమ పృష్ఠమనిన్దితే. 19

ప్ర. అ. అథవా=లేదా, వరాననే=సుందరమైన ముఖము గల సీతాదేవీ ! త్వామ్=నిన్ను, అద్యైవ=ఇప్పుడే, అస్మాత్=ఈ, దుఃఖాత్=దుఃఖము నుండి, మోచయిష్యామి=విడిపింపచేసెదను. అనిన్దితే=నిందింపబడనిదానా ! మమ=నాయొక్క, పృష్ఠమ్=వీపును, ఉపారోహ=ఎక్కుము.

తా. సుందరమైన ముఖము గల ఓ ! సీతాదేవీ ! లేదా నిన్ను ఇప్పుడే ఈ దుఃఖము నుండి విముక్తురాలిని చేసెదను. ఓ ! దోషరహితురాలా ! నా వీపుపై ఎక్కుము. నిన్నిప్పుడే రాముని వద్దకు చేర్చెదను. 19

మూ. త్వాం హి పృష్ఠగతాం కృత్వా సంతరిష్యామి సాగరమ్,
శక్తిరస్తి హి మే వోఢుం లఙ్కామపి సరావణామ్. 20

ప్ర. అ. త్వామ్=నిన్ను, పృష్ఠగతామ్=వీపుపై ఉన్నదానినిగా, కృత్వా=చేసి, సాగరమ్=సముద్రమును, సంతరిష్యామి=దాటెదను. సరావణామ్=రావణునితో కూడిన, లఙ్కామపి=లంకను కూడ, వోఢుమ్=మోయుటకు, మే=నాకు, శక్తిః=శక్తి, అస్తి హి=ఉన్నది కదా !

తా. నిన్ను నా వీపుపై కూర్చుండబెట్టుకొని సముద్రమును దాటెదను. రావణునితో సహా ఈ లంకను కూడా మోయుటకు నాకు శక్తి ఉన్నది. 20

మూ. అహం ప్రస్రవణస్థాయ రాఘవాయాద్య మైథిలి,
ప్రాపయిష్యామి శక్రాయ హవ్యం హుతమివానలః. 21

ప్ర. అ. మైథిలి=సీతాదేవీ! అనలః=అగ్ని, హుతమ్=హోమము చేయబడిన, హవ్యమ్=హోమద్రవ్యమును, శక్రాయ=దేవేంద్రునకు వలె, నిన్ను, అహమ్=నేను, ప్రస్రవణస్థాయ=ప్రస్రవణ పర్వతము మీద ఉన్న, రాఘవాయ=రామునకు, అద్యైవ=ఇప్పుడే, ప్రాపయిష్యామి=పొందింపచేసెదను.

తా. సీతాదేవీ ! హోమము చేసిన హోమద్రవ్యమును అగ్నిదేవుడు దేవేంద్రునకు అందజేసినట్లు, నేను, నిన్ను ప్రస్రవణ పర్వతము మీద ఉన్న రామునకు ఇప్పుడే అందజేసెదను. 21

మూ. ద్రక్ష్యస్యద్యైవ వైదేహి రాఘవం సహలక్ష్మణమ్,
వ్యవసాయసమాయుక్తం విష్ణుం దైత్యవధే యథా. 22

ప్ర. అ. వైదేహి=సీతాదేవీ ! దైత్యవధే=దైత్యుల వధయందు, వ్యవసాయసమాయుక్తమ్=ఉద్యమముతో కూడిన, విష్ణుం యథా=విష్ణువును వలె, వ్యవసాయసమాయుక్తమ్=రాక్షసవధకై ఉద్యమము చేయుచున్న, సహలక్ష్మణమ్=లక్ష్మణునితో కూడిన, రాఘవమ్=రాముణ్ణి, అద్యైవ=ఇప్పుడే, ద్రక్ష్యసి=చూడగలవు.

తా. ఓ సీతాదేవీ ! విష్ణువు దైత్యులను సంహరించుటకై ఉద్యమించు చున్నట్లు, లక్ష్మణసమేతుడైన రాముడు రాక్షసవధకై ఉద్యమించుచున్నాడు. అట్టి రాముణ్ణి నీవిప్పుడే చూడగలవు. 22

మూ. త్వద్దర్శనకృతోత్సాహమాశ్రమస్థం మహాబలమ్,
పురందరమివాసీనం నాగరాజస్య మూర్ధని. 23

ప్ర. అ. త్వద్దర్శనకృతోత్సాహమ్=నీ దర్శనమునిమిత్తము చేయబడిన ఉత్సాహము కలవాడు, ఆశ్రమస్థమ్=ఆశ్రమమునందు ఉన్నవాడు, మహాబలమ్=గొప్ప బలము కలవాడూ, నాగరాజస్య=ఐరావతముయొక్క, మూర్ధని=శిరస్సుపై, ఆసీనమ్=కూర్చున్న, పురందరమివ=దేవేంద్రునివలె ఉన్న రాముణ్ణి చూడగలవు.

తా. మహాబలశాలి యైన రాముడు, నిన్ను చూడవలె నను ఉత్సాహముతో ఐరావతము మీద కూర్చున్న ఇంద్రుడు వలె, ఆశ్రమములో ఉన్నాడు. అట్టి రాముణ్ణి ఇప్పుడే చూడగలవు. 23

మూ. పృష్ఠమారోహ మే దేవి మా వికాంక్షస్వ శోభనే,
యోగమన్విచ్ఛ రామేణ శశాఙ్కేనేవ రోహిణీ. 24

ప్ర. అ. ('మా విచారయ శోభనే' అను ప్రాచ్యపాఠము స్పష్టార్థముగా ఉన్నది). దేవి=ఓ !దేవీ ! మమ=నాయొక్క, పృష్ఠమ్=వీపును, ఆరోహ=ఎక్కుము. శోభనే=మంగళప్రదురాలా ! మా విచారయ=ఆలోచించకుము. రోహిణీ=రోహిణి, శశాఙ్కేనేవ=చంద్రునితో వలె, రామేణ=రామునితో, యోగమ్=సంబంధమును, అన్విచ్ఛ=కోరుము.

తా. మంగళప్రదురాలవైన ఓ ! సీతాదేవీ !నా వీపుపైకి ఎక్కుము. ఆలోచించకుము. రోహిణి చంద్రుని దగ్గరకు వెళ్ళినట్లు రాముని దగ్గరకు వెళ్లుటకు నిశ్చయించుకొనుము. 24

మూ. కథయన్తీవ చన్ద్రేణ సూర్యేణ చ మహార్చిషా,
మత్పృష్ఠమధిరుహ్య త్వం తరాకాశమహార్ణవౌ. 25

ప్ర. అ. త్వమ్=నీవు, మత్పృష్ఠమ్=నా వీపును, అధిరుహ్య=ఎక్కి, చన్ద్రేణ=చంద్రునితోను, మహార్చిషా=గొప్ప తేజస్సు గల, సూర్యేణ=సూర్యునితోను, కథయన్తీవ=చెప్పుచున్నదానవు వలె, ఆకాశమహార్ణవౌ=ఆకాశమును, మహాసముద్రమును, తర=దాటుము.

తా. నీవు నా వీపుపై ఎక్కి చంద్రునితోను, మహాతేజస్సు గల సూర్యునితోను మాటలాడుచున్నావా అన్నట్లు ఆకాశమార్గమునందు ప్రయాణము చేసి మహాసముద్రమును దాటుము. 25

మూ. న హి మే సంప్రయాతస్య త్వామితో నయతోఽఙ్గనే,
అనుగన్తుం గతిం శక్తాః సర్వే లఙ్కానివాసినః. 26

ప్ర. అ. అఙ్గనే=ఓ సీతాదేవీ ! త్వామ్=నిన్ను, ఇతః=ఇక్కడి నుండి, నయతః=తీసికొనివెళ్లుచున్న, సంప్రయాతస్య=ప్రయాణమైన, మే=నాయొక్క, గతిమ్=గమనమార్గమును, అనుగన్తుమ్=అనుసరించుటకు, సర్వే=సమస్తమైన, లఙ్కానివాసినః=లంకలో నివసించువారు, న శక్తాః=సమర్థులు కారు.

తా. ఓ సీతాదేవీ ! నేను ఇక్కడినుండి నిన్ను తీసికొని వెళ్ళిపోవునప్పుడు ఈ లంకలో ఉన్నవారిలో ఎవ్వడూ కూడ నా వెంట రాజాలడు. 26

మూ. యథైవాహమిహ ప్రాప్తస్తథైవాహమసంశయమ్,
యాస్యామి పశ్య వైదేహి త్వాముద్యమ్య విహాయసమ్. 27

ప్ర. అ. వైదేహి=ఓ ! సీతాదేవీ ! అహమ్=నేను, యథైవ=ఎట్లు, ఇహ=ఇచటికి, ప్రాప్తః=వచ్చినానో, తథైవ=అట్లే, త్వామ్=నిన్ను, ఉద్యమ్య=ఎత్తికొని, విహాయసమ్=ఆకాశమును గూర్చి, అసంశయమ్=నిస్సంశయముగ, యాస్యామి=వెళ్ళెదను, పశ్య=చూడుము.

తా. ఓ ! సీతాదేవీ ! నేను ఇక్కడికి వచ్చినప్పుడు ఎట్లు వచ్చినానో అట్లే నిన్ను నా వీపుపై ఎక్కించుకొని ఆకాశమార్గములో వెళ్ళెదను. సందేహము లేదు. చూడుము. 27

మూ. మైథిలీ తు హరిశ్రేష్ఠాచ్ఛ్రుత్వా వచనమద్భుతమ్,
హర్షవిస్మితసర్వాఙ్గీ హనుమన్తమథాబ్రవీత్. 28

ప్ర. అ. మైథిలీ తు=సీత యైతే, హరిశ్రేష్ఠాత్=హనుమంతునినుండి, అద్భుతమ్=ఆశ్చర్యకరమైన, వచనమ్=వచనమును, శ్రుత్వా=విని, హర్షవిస్మిత సర్వాఙ్గీ=సంతోషములో వికసించిన సకలదేహము కలదై, అథ=అటుపిమ్మట, హనుమన్తమ్=హనుమంతుని గూర్చి, అబ్రవీత్=పలికెను.

తా. ఆశ్చర్యకరములైన హనుమంతుని మాటలు వినగానే సీత సంతోషముతో వికసించిన సకలావయవములు కలదై ఆతనితో ఇట్లు పలికెను.28

మూ. హనుమన్ దూరమధ్వానం కథం మాం వోఢుమిచ్ఛసి,
తదేవ ఖలు తే మన్యే కపిత్వం హరియూథప. 29

ప్ర. అ. హనుమన్=హనుమంతుడా ! దూరమ్=దూరమైన, అధ్వానమ్=మార్గమును, మామ్=నన్ను, వోఢుమ్=మోయుటకు, కథమ్=ఎట్లు, ఇచ్ఛసి=కోరుచున్నావు. హరియూథప=ఓ వానరసేనానాయకుడా ! తే=నీ యొక్క, కపిత్వమ్=వానరుడగుట, తదేవ ఖలు=అదియే కదా అని, మన్యే=తలచుచున్నాను.

తా. ఓ !హనుమంతుడా ! ఇంత దూరమైన మార్గము నన్ను మోసికొని వెళ్లవలెనని నీ వెట్లు అనుకొనుచున్నావు ? ఓ ! వానరనాయకుడా ! దీనిని బట్టి నీవు వానరుడవని నిరూపించుకొనుచున్నావు ! 29

మూ. కథం వాల్పశరీరస్త్వం మామితో నేతుమిచ్ఛసి,
సకాశం మానవేన్ద్రస్య భర్తుర్మే ప్లవగర్షభ. 30

ప్ర. అ. ప్లవగర్షభ=ఓ ! వానరశ్రేష్ఠుడా ! అల్పశరీరః=అల్పమైన శరీరము గల, త్వమ్=నీవు, ఇతః=ఇక్కడినుండి, మే=నా యొక్క, భర్తుః=భర్తయైన, మానవేన్ద్రస్య=మానవుల ప్రభువైన రాముని యొక్క, సకాశమ్=సమీపమును, నేతుమ్=తీసికొనివెళ్లుటకు, కథం వా=ఎట్లు, ఇచ్ఛసి=కోరుచున్నావు.

తా. ఓ !వానరోత్తమా ! ఇంత చిన్న శరీరము గల నీవు, నన్ను, ఇక్కడి నుండి నా భర్తయైన రాముని వద్దకు తీసికొనిపోగలవని ఎట్లు అనుకొనుచున్నావు? 30

మూ. సీతాయా వచనం శ్రుత్వా హనుమాన్ మారుతాత్మజః,
చిన్తయామాస లక్ష్మీవాన్ నవం పరిభవం కృతమ్. 31

ప్ర. అ. మారుతాత్మజః=వాయుపుత్రుడైన, లక్ష్మీవాన్=శోభగల, హనుమాన్=హనుమంతుడు, సీతాయాః=సీతయొక్క, వచనమ్=వచనమును, శ్రుత్వా=విని, నవమ్=క్రొత్త, పరిభవమ్=పరాభవమును, కృతమ్=చేయబడిన దానినిగా, చిన్తయామాస=ఆలోచించెను.

తా. వాయుపుత్రుడూ శోభాసంపన్నుడూ, అయిన హనుమంతుడు సీత మాటలు విని, "ఆహా ! ఈనాడు నా కొక క్రొత్త అవమానము జరిగినది కదా"! అని భావించెను. 31

మూ. న మే జానాతి సత్త్వం వా ప్రభావం వాసితేక్షణా,
తస్మాత్ పశ్యతు వైదేహీ యద్రూపం మమ కామతః. 32

ప్ర. అ. అసితేక్షణా=నల్లని నేత్రములు గల, వైదేహీ=సీతాదేవి, మే=నాయొక్క, సత్త్వం వా=బలమును గాని, ప్రభావం వా=ప్రభావమునుగాని, న జానాతి=ఎరుగదు. తస్మాత్=ఆ కారణము వలన, కామతః=ఇచ్ఛానుసారముగా, మమ=నాయొక్క, యత్=ఏ, రూపమ్=రూపము ఉన్నదో దానిని, పశ్యతు=చూచుగాక.

తా. నల్లని నేత్రములు గల ఈ సీతకు నా బలముగాని, ప్రభావము గాని తెలియదు. అందుచేత నేను ఇచ్ఛానుసారముగా ఎట్టి రూపము ధరించగలనో ఈమెకు చూపెదను. 32

మూ. ఇతి సంచిన్త్య హనుమాంస్తదా ప్లవగసత్తమః,
దర్శయామాస వైదేహ్యాః స్వరూపమరిమర్దనః. 33

ప్ర. అ. ప్లవగసత్తమః=వానరులలో గొప్పవాడు, అరిమర్దనః=శత్రుసంహారకుడు అయిన, హనుమాన్=హనుమంతుడు, ఇతి=ఇట్లు, సంచిన్త్య=ఆలోచించి, తదా=అప్పుడు, స్వరూపమ్=తన రూపమును, వైదేహ్యాః=సీతాదేవికి, దర్శయామాస=చూపించెను.

తా. వానరశ్రేష్ఠుడు, శత్రుసంహారకుడు అయిన హనుమంతుడు ఈ విధముగా ఆలోచించి, సీతాదేవికి తన స్వరూపమును చూపించెను. 33

మూ. స తస్మాత్పాదపాద్ధీమానాప్లుత్య ప్లవగర్షభః,
తతో వర్ధితుమారేభే సీతాప్రత్యయకారణాత్. 34

ప్ర. అ. ధీమాన్=బుద్ధిమంతుడు, ప్లవగర్షభః=వానరశ్రేష్ఠుడూ అయిన, సః=ఆ హనుమంతుడు, తస్మాత్=ఆ, పాదపాత్=వృక్షమునుండి, ఆప్లుత్య=క్రిందికి దుమికి, తతః=అటుపిమ్మట, సీతాప్రత్యయకారణాత్=సీతకు నమ్మకము కలుగుటకై, వర్ధితుమ్=వృద్ధి పొందుటకు, ఆరేభే=ప్రారంభించెను.

తా. ధీమంతుడు, వానరశ్రేష్ఠుడు అయిన హనుమంతుడు ఆ వృక్షము నుండి క్రిందికి దుమికి, సీతకు నమ్మకము కలిగించుటకై పెరుగుటకు ప్రారంభించెను. 34

మూ. మేరుమన్దరసంకాశో బభౌ దీప్తానలప్రభః,
అగ్రతో వ్యవతస్థే చ సీతాయా వానరోత్తమః. 35

ప్ర. అ. వానరోత్తమః=ఆ హనుమంతుడు, మేరుమన్దరసంకాశః=మేరు మందరపర్వతములతో సమానుడై, దీప్తానలప్రభః=ప్రజ్వలించుచున్న అగ్ని వంటి కాంతి గలవాడై, బభౌ=ప్రకాశించెను. సీతాయాః=సీతయొక్క, అగ్రతః=ఎదుట, వ్యవతస్థే చ=నిలచెను కూడ.

తా. ఆ వానరోత్తముడైన హనుమంతుడు మేరుపర్వతము వలె, మందరపర్వతము వలె ఉన్నతమైన శరీరముతో, ప్రజ్వలించుచున్న అగ్ని వంటి కాంతితో ప్రకాశించుచు సీత ఎదుట నిలచెను. 35

మూ. హరిః పర్వతసంకాశస్తామ్రవక్త్రో మహాబలః,
వజ్రదంష్ట్రనఖో భీమో వైదేహీమిదమబ్రవీత్. 36

ప్ర. అ. పర్వతసంకాశః=పర్వతముతో సమానుడు, తామ్రవక్త్రః=ఎఱ్ఱని ముఖము కలవాడు, మహాబలః=గొప్పబలము గలవాడు, వజ్రదంష్ట్రనఖః=వజ్రము వంటి కోరలు గోళ్లు కలవాడు, భీమః=భయంకరుడు అయిన, హరిః=హనుమంతుడు, వైదేహీమ్=సీతను గూర్చి, ఇదమ్=ఈ వాక్యమును, అబ్రవీత్=పలికెను.

తా. ఎఱ్ఱని ముఖముతోను వజ్రము వంటి కోరలతోను, గోళ్లతోను, భయంకరుడై, పర్వతము వలె ఉన్న మహాబలశాలియైన ఆ హనుమంతుడు సీతతో ఇట్లు పలికెను. 36

మూ. సపర్వతవనోద్దేశాం సాట్టప్రాకారతోరణామ్,
లఙ్కామిమాం సనాథాం వా నయితుం శక్తిరస్తి మే. 37

ప్ర. అ. సపర్వతవనోద్దేశామ్=పర్వతములతోను, వనప్రదేశములతోను కూడినది, సాట్టప్రాకారతోరణామ్=కోటబురుజులతోను, ప్రాకారములతోను, ముఖ ద్వారములతోను కూడినది, సనాథామ్=ప్రభువైన రావణునితో కూడినది అయిన, ఇమామ్=ఈ, లఙ్కాం వా=లంక నైన కూడ, నయితుమ్=తీసికొని పోవుటకు, మే=నాకు, శక్తిః=శక్తి, అస్తి=ఉన్నది.

తా. పర్వతములు, వనప్రదేశములు, కోటబురుజులు, ప్రాకారములు, ముఖద్వారములు, ప్రభువైన రావణుడు వీటి అన్నింటితో సహా ఈ లంకాపురమును కూడా తీసికొని వెళ్లుటకు నాకు శక్తి ఉన్నది. 37

మూ. తదవస్థాప్యతాం బుద్ధిరలం దేవి వికాంక్షయా,
విశోకం కురు వైదేహి రాఘవం సహలక్ష్మణమ్. 38

ప్ర. అ. దేవి=ఓ! దేవీ! తత్=ఆ కారణమువలన, వికాంక్షయా=సందేహ ముచేత, అలమ్=చాలును. బుద్ధిః=బుద్ధి, అవస్థాప్యతామ్=స్థిరము చేయబడుగాక ! వైదేహి=ఓ ! సీతాదేవీ !సహలక్ష్మణమ్=లక్ష్మణసహితుడైన, రాఘవమ్=రాముని, విశోకమ్=శోకము లేనివానినిగా, కురు=చేయుము.

తా. సీతాదేవీ ! ఈ కారణముచే, సందేహము విడచి మనస్సును స్థిరముగా చేసికొనుము. నా వెంట వచ్చి లక్ష్మణసమేతుడైన రాముని దుఃఖము పోగొట్టుము. 38

మూ. తం దృష్ట్వా భీమసంకాశమువాచ జనకాత్మజా,
పద్మపత్రవిశాలాక్షీ మారుతస్యౌరసం సుతమ్. 39

ప్ర. అ. పద్మపత్రవిశాలాక్షీ=పద్మపత్రముల వలె విశాలములైన నేత్రములు గల, జనకాత్మజా=సీత, భీమసంకాశమ్=భయంకరుడూ, మారుతస్య=వాయుదేవు నియొక్క, ఔరసం సుతమ్=ఔరసపుత్రుడూ అయిన, తమ్=ఆ హనుమంతుని, దృష్ట్వా=చూచి, ఉవాచ=ఇట్లు పలికెను.

తా. పద్మపత్రములవలె విశాలములైన నేత్రములు గల సీత, భయం కరాకారముతో ఉన్న ఆ వాయుదేవుని ఔరసపుత్రుడైన హనుమంతుని చూచి ఇట్లనెను. 39

మూ. తవ సత్త్వం బలం చైవ విజానామి మహాకపే,
వాయోరివ గతిం చైవ తేజశ్చాగ్నేరివాద్భుతమ్. 40

ప్ర. అ. మహాకపే=ఓ మహావానరుడా ! తవ=నీ యొక్క, సత్త్వమ్=ధైర్యమును, బలం చైవ=బలమును, వాయోరివ=వాయువుయొక్క వలె,

గతిమ్=గమనశక్తిని, అగ్నేరివ=అగ్నియొక్క వలె, అద్భుతమ్=ఆశ్చర్యకరమైన, తేజశ్చ=తేజస్సును, విజానామి=నేను ఎరుగుదును.

తా. ఓ !వానరోత్తమా !నీ ధైర్యమును, బలమును, వాయువునకు వలె నీ కున్న అడ్డులేని గమనమును, అగ్ని తేజస్సువలె అద్భుతమైన నీ తేజస్సునూ నేను ఎరుగుదును. 40

మూ. ప్రాకృతోఽన్యః కథం చేమాం భూమిమాగన్తుమర్హతి,
ఉదధేరప్రమేయస్య పారం వానరపుఙ్గవ. 41

ప్ర. అ. వానరపుఙ్గవ=ఓ వానరశ్రేష్ఠుడా ! ప్రాకృతః=సామాన్యుడైన, అన్యః=మరియొకడు, అప్రమేయస్య=ఊహింపశక్యము కాని, ఉదధేః=సముద్రముయొక్క, పారమ్=ఇవతలి ఒడ్డును, ఇమామ్=ఈ, భూమిమ్=ప్రదేశమును, ఆగన్తుమ్=వచ్చుటకు, కథమ్=ఎట్లు, అర్హతి=తగి ఉన్నాడు?

తా. ఓ !వానరశ్రేష్ఠుడా ! ఊహింపశక్యము కాని ఈ సముద్రమును దాటి, సామాన్యుడెవ్వడైనా ఈ ప్రదేశమునకు రాగలడా? 41

మూ. జానామి గమనే శక్తిం నయనే చాపి తే మమ,
అవశ్యం సంప్రధార్యాశు కార్యసిద్ధిర్మహాత్మనః. 42

ప్ర. అ. గమనే=వెళ్లుటయందు, మమ=నాయొక్క, నయనే=తీసికొని వెళ్లుటయందు, శక్తిమ్=నీ సామర్థ్యమును, జానామి=ఎరుగుదును. మహాత్మనః= మహాత్ముడైన రాముని యొక్క, కార్యసిద్ధిః=కార్యముయొక్క సిద్ధి, అవశ్యమ్=తప్పక, ఆశు=శీఘ్రముగా, సంప్రధార్యా=నిర్ణయింపదగినది.

తా. నీవు నన్ను తీసికొని వెళ్లగలవను విషయమును నే నెరుగుదును. మహాత్ముడైన రాముని కార్యము ఎట్లు చెడిపోకుండునో మనము నిర్ణయించవలసి ఉన్నది. 42

మూ. అయుక్తం తు కపిశ్రేష్ఠ మమ గన్తుం త్వయానఘ,
వాయువేగసవేగస్య వేగో మాం మోహయేత్తవ. 43

ప్ర. అ. అనఘ=దోషములు లేనివాడా ! కపిశ్రేష్ఠ=ఓ వానరశ్రేష్ఠుడా ! త్వయా=నీతో, మమ=నాకు, గన్తుమ్=వెళ్లుటకు, అయుక్తమ్=యుక్తముకాదు. వాయువేగసవేగస్య=వాయువేగముతో సమానమైన వేగము గల, తవ=నీయొక్క, వేగః=వేగము, మామ్=నన్ను, మోహయేత్=మనస్సు కంగారుపడునట్లు చేయవచ్చును.

తా. నేను నీతో వెళ్లుట యుక్తము కాదు. ఎందుచేతననగా వాయువేగముతో సమానమైన వేగముతో నీవు వెళ్లుచున్నప్పుడు నా మనసు కంగారు పడవచ్చును. 43

మూ. అహమాకాశమాపన్నా హ్యుపర్యుపరి సాగరమ్,
ప్రపతేయం హి తే పృష్ఠాద్భయాద్వేగేన గచ్ఛతః. 44

ప్ర. అ. సాగరమ్ ఉపర్యుపరి=సముద్రానికి చాల ఎత్తున, ఆకాశమ్=ఆకాశ మును, ఆపన్నా=పొందిన, అహమ్=నేను, వేగేన=వేగముతో, గచ్ఛతః=వెళ్లుచున్న, తే=నీయొక్క, పృష్ఠాత్=వీపునుండి, భయాత్=భయమువలన, ప్రపతేయమ్=పడి పోవుదును.

తా. నీవు మహావేగముతో వెళ్లుచున్నప్పుడు నీ వీపుమీద ఉన్న నేను సముద్రమునకు చాలా ఎత్తుగా ఆకాశములో ప్రవేశించగానే కళ్లు తిరిగి క్రింద పడిపోవుదును. 44

మూ. పతితా సాగరే చాహం తిమినక్రఝషాకులే,
భవేయమాశు వివశా యాదసామన్నముత్తమమ్. 45

ప్ర. అ. తిమినక్రఝషాకులే=తిములతోను, మొసళ్ళతోను,ఝషము లను పెద్ద చేపలతోను వ్యాకులమైన, సాగరే=సముద్రమునందు, పతితా=పడిపోయిన, అహమ్=నేను, వివశా=వివశురాలనై, ఆశు=శీఘ్రముగా, యాదసామ్=జలజంతువుల యొక్క, ఉత్తమమ్=ఉత్తమ మైన, అన్నమ్=అన్నముగా, భవేయమ్=అయిపోవుదును.

తా. నేను వివశురాలనై, తిములతోను (పెద్దచేప), మొసళ్ళతోను సొరచేపలతోను, నిండిన సముద్రములో పడిపోయి, జలజంతువులకు మంచి ఆహారము అయిపోవుదును. 45

మూ. న చ శక్ష్యే త్వయా సార్ధం గన్తుం శత్రువినాశన,
కళత్రవతి సన్దేహస్త్వయ్యపి స్యాదసంశయః. 46

ప్ర. అ. శత్రువినాశన=శత్రువులను నశింపచేయువాడా ! త్వయా సార్ధమ్=నీతో కూడ, గన్తుమ్=వెళ్ళుటకు, న శక్ష్యే చ=సమర్థురాలను కాజాలను. కళ త్రవతి=రక్షింపదగిన వ్యక్తి గల, త్వయ్యపి=నీయందు కూడ, సందేహః=సందేహము, స్యాత్=అగును; అసంశయః=సంశయము లేదు.

తా. శత్రువినాశకుడవైన ఓ !హనుమంతుడా ! నేను నీతో వచ్చుట మంచిది కాదు. నీవు నీతో ఉన్న నన్ను కూడ రక్షించవలసి యుండును కదా ! అప్పుడు నీ ప్రాణాలకు కూడా సందేహము కలుగవచ్చును. 46

మూ. హ్రియమాణాం తు మాం దృష్ట్వా రాక్షసా భీమవిక్రమాః,
అనుగచ్ఛేయురాదిష్టా రావణేన దురాత్మనా. 47

ప్ర. అ. హ్రియమాణామ్=హరింపబడుచున్న, మామ్=నన్ను, దృష్ట్వా=చూచి, భీమవిక్రమాః=భయంకరమైన పరాక్రమము గల, రాక్షసాః=రాక్షసులు, దురాత్మనా=దుష్టస్వభావము గల, రావణేన=రావణునిచేత, ఆదిష్టాః=ఆజ్ఞాపించబడినవారై, అనుగచ్ఛేయుః=వెంబడింతురు.

తా. నీవు నన్ను తీసికొనిపోవుచుండగా చూచి, భయంకరమైన పరాక్రమము గల రాక్షసులు, దురాత్ముడైన రావణుడు ప్రేరేపింపగా నిన్ను వెంబడింతురు. 47

మూ. తైస్త్వం పరివృతః శూరైః శూలముద్గరపాణిభిః,
భవేస్త్వం సంశయః ప్రాప్తో మయా వీర కళత్రవాన్. 48

ప్ర. అ. త్వమ్=నీవు, శూలముద్గరపాణిభిః=శూలములు, ముద్గరములు హస్తములందు గల, తైః=ఆ, శూరైః=శూరులైన రాక్షసులచేత, పరివృతః=చుట్టబడినవాడవు అయ్యెదవు. వీర=ఓ !వీరుడా, మయా=నాచేత, కళత్రవాన్=రక్షింపదగిన వ్యక్తి గల, త్వమ్=నీవు, సంశయమ్=సంశయమును, ప్రాప్తః=పొందినవాడవు, భవేః=అగుదువు.

తా. ఓ !వీరుడా ! శూలములు, ముద్గరములు, హస్తములందు ధరించిన ఆ శూరులు నిన్ను చుట్టుముట్టెదరు. ఆ సమయమునందు, నన్ను కూడ రక్షించవలసిన నీ పరిస్థితి సంశయములో పడును. 48

మూ. సాయుధా బహవో వ్యోమ్ని రాక్షసాస్త్వం నిరాయుధః,
కథం శక్ష్యసి సంయాతుం మాం చైవ పరిరక్షితుమ్. 49

ప్ర. అ. వ్యోమ్ని=ఆకాశమునందు, సాయుధాః=ఆయుధములతో కూడిన, రాక్షసాః=రాక్షసులు, బహవః=చాలామంది ఉందురు. త్వమ్=నీవు, నిరాయుధః=ఆయుధములు లేనివాడవు. సంయాతుమ్=వెళ్లుటకూ, మామ్=నన్ను, పరిరక్షితుం చ=రక్షించుటకూ, కథమ్=ఎట్లు, శక్ష్యసి=సమర్థుడవగుదువు ?

తా. ఆకాశము మీద అనేకులు రాక్షసులు ఆయుధములు ధరించి వచ్చెదరు. నీవో ఆయుధము ఏదీ లేక ఒంటరిగా ఉందువు. ఇటు నన్ను రక్షించుకొనుచు ఎట్లు ప్రయాణము సాగించగలవు? 49

మూ. యుధ్యమానస్య రక్షోభిస్తవ తైః క్రూరకర్మభిః,
ప్రపతేయం హి తే పృష్ఠాద్భయార్తా కపిసత్తమ. 50

ప్ర. అ. కపిసత్తమ=వానరశ్రేష్ఠుడా ! తవ=నీవు, క్రూరకర్మభిః=క్రూరమైన కర్మ గల, తైః=ఆ, రక్షోభిః=రాక్షసులతో, యుధ్యమానస్య=యుద్ధము చేయుచుండగా, భయార్తా=భయము చేత పీడితురాలనై, తే=నీ యొక్క, పృష్ఠాత్=వీపునుండి, ప్రపతేయం హి=పడిపోవుదును కదా !

తా. వానరశ్రేష్ఠా ! నీవు క్రూరమైన పనులు చేయు రాక్షసులతో యుద్ధము చేయుచుండగా, నేను భయముచే పీడితురాలనై, నీ వీపునుండి పడిపోవుదును. 50

మూ. అథ రక్షాంసి భీమాని మహాన్తి బలవన్తి చ,
కథంచిత్సాంపరాయే త్వాం జయేయుః కపిసత్తమ. 51

ప్ర. అ. కపిసత్తమ=ఓ వానరశ్రేష్ఠుడా ! అథ=అటుపిమ్మట, భీమాని=భయంకరులు, మహాన్తి=పెద్ద శరీరము కలవారు, బలవన్తి చ=బలము కలవారు అయిన, రక్షాంసి=రాక్షసులు, సాంపరాయే=యుద్ధమునందు, కథంచిత్=ఏదో విధముగా, త్వామ్=నిన్ను, జయేయుః=జయింతురు.

తా. వానరోత్తమా ! అప్పుడు, భయంకరులు, గొప్ప దేహములు గలవారు, బలవంతులు అయిన రాక్షసులు ఏదో విధముగ నిన్ను జయించి వేయవచ్చును. 51

మూ. అథవా యుధ్యమానస్య పతేయం విముఖస్య తే,
పతితాం చ గృహీత్వా మాం నయేయుః పాపరాక్షసాః.

ప్ర. అ. అథవా=లేదా, యుధ్యమానస్య=యుద్ధము చేయుచున్న, తే=నీవు, విముఖస్య=(నా విషయమున), ఏమరిపాటుతో ఉండగా, పతేయమ్=పడిపోవుదును. పతితామ్=పడిన, మామ్=నన్ను, గృహీత్వా=గ్రహించి, పాపరాక్షసాః=పాపాత్ములైన రాక్షసులు, నయేయుః=తీసికొని పోవుదురు.

తా. లేదా నీవు యుద్ధము చేయుచు నా విషయమున ఏమరెపాటుతో ఉండగా నేను క్రింద పడిపోవచ్చును. అప్పుడు నన్ను రాక్షసులు పట్టి తీసికొని పోవచ్చును. 52

మూ. మాం వా హరేయుస్త్వద్ధస్తాద్విశసేయురథాపి వా,
అవ్యవస్థౌ హి దృశ్యేతే యుద్ధే జయపరాజయౌ. 53

ప్ర. అ. త్వద్ధస్తాత్=నీ చేతినుండి, మామ్=నన్ను, హరేయుః=హరింతురు. అథాపి వా=లేదా, విశసేయుః=చంపివేయుదురు. యుద్ధే=యుద్ధమునందు, జయపరాజయౌ=జయపరాజయములు, అవ్యవస్థౌ=వ్యవస్థలేనివిగా, దృశ్యేతే హి=చూడబడుచున్నవి కదా.

తా. లేదా ఆ రాక్షసులు నీ నుండి నన్ను హరించవచ్చును. లేదా చంపి వేయవచ్చును. యుద్ధములో జయపరాజయములు నిశ్చితములు కావు కదా. జయము కలుగవచ్చును. పరాజయము కలుగవచ్చును. 53

మూ. అహం వాపి విపద్యేయం రక్షోభిరభితర్జితా,
త్వత్ప్రియత్నో హరిశ్రేష్ఠ భవేన్నిష్ఫల ఏవ తు. 54

ప్ర. అ. రక్షోభిః=రాక్షసులచేత, అభితర్జితా=భయపెట్టబడినదాననై, అహమ్=నేను, విపద్యేయం వాపి=ఆపద చెందవచ్చును. హరిశ్రేష్ఠ=ఓ !వానరశ్రేష్ఠా ! త్వత్ప్రియత్నః=నీ ప్రయత్నము, నిష్ఫల ఏవ తు=నిష్ఫలమే, భవేత్=అగును.

తా. వానరోత్తమా !లేదా రాక్షసులు నన్ను భయపెట్టగా నేనాపద చెందవచ్చును. ఇట్లు నీ ప్రయత్నము విఫలమే అగును. 54

మూ. కామం త్వమసి పర్యాప్తో నిహన్తుం సర్వరాక్షసాన్,
రాఘవస్య యశో హీయేత్త్వయా శస్తైస్తు రాక్షసైః. 55

ప్ర. అ. త్వమ్=నీవు, సర్వరాక్షసాన్=అందరు రాక్షసులను, నిహన్తుమ్=చంపుటకు, పర్యాప్తః అసి కామమ్=నిశ్చితముగా సమర్థుడవు అయి ఉండవచ్చును. త్వయా=నీచేత, శస్తైః=చంపబడిన, రాక్షసైః=రాక్షసులచేత, రాఘవస్య=రామునియొక్క, యశః=కీర్తి, హీయేత్=తగ్గిపోవును.

తా. నీవు రాక్షసులను అందరినీ చంపుటకు సమర్థుడవే. కాని రాక్షసుల నందరిని నీవే చంపినచో రాముని కీర్తికి దెబ్బ తగులును. 55

మూ. అథవాదాయ రక్షాంసి న్యసేయుః సంవృతే హి మామ్,
యత్ర తే నాభిజానీయుర్హరయో నాపి రాఘవౌ. 56

ప్ర. అ. అథవా=లేదా, రక్షాంసి=రాక్షసులు, మామ్=నన్ను, ఆదాయ=గ్రహించి, యత్ర=ఏ స్థలమునందు, తే హరయః=ఆ వానరులు గాని, రాఘవౌ అపి=రామలక్ష్మణులు గాని, నాభిజానీయుః=గుర్తింపజాలరో, సంవృతే=అట్టి రహస్యప్రదేశమునందు, న్యసేయుః=ఉంచివేయుదురు.

తా. లేదా-రాక్షసులు నన్ను తీసుకొనిపోయి వానరులకు గాని రామ లక్ష్మణులకు గాని తెలియని రహస్యప్రదేశమునందు ఎక్కడైనా దాచివేయవచ్చును. 56

మూ. ఆరమ్భస్తు మదర్థోఽయం తతస్తవ నిరర్థకః,
త్వయా హి సహ రామస్య మహానాగమనే గుణః. 57

ప్ర. అ. తతః=అటు పిమ్మట, మదర్థః=నా కొరకైన, తవ=నీ యొక్క, ఆరమ్భస్తు=కార్యారంభమైతే, నిరర్థకః=వ్యర్థమగును. త్వయా సహ=నీతో కూడ, రామస్య=రామునియొక్క, ఆగమనే=వచ్చుటయందు, మహాన్=గొప్ప, గుణః=గుణము ఉన్నది.

తా. అప్పుడు నాకోసం నీవు చేసిన ప్రయత్నమంతా వ్యర్థమైపోవును అందుచేత రాముడు నీతో కలిసి వచ్చుటయే మంచిది. 57

మూ. మయి జీవితమాయత్తం రాఘవస్య మహాత్మనః,
భ్రాతౄణాం చ మహాబాహో తవ రాజకులస్య చ. 58

ప్ర. అ. మహాబాహో=గొప్ప బాహువులు కలవాడా ! మహాత్మనః=మహాత్ముడైన, రాఘవస్య=రామునియొక్క, భ్రాతౄణామ్=ఆతని సోదరుల యొక్క, తవ=నీ యొక్క, రాజకులస్య చ=నీ రాజకుటుంబముయొక్క, జీవితమ్=జీవితము, మయి=నాయందు, ఆయత్తమ్=అధీనమైనది.

తా. హనుమంతుడా ! మహాత్ముడైన రాముడూ, ఆతని సోదరులూ, నీవూ, నీ రాజైన సుగ్రీవుడు మొదలైన వారూ వీరందరి జీవితము నామీద ఆధారపడిఉన్నది కదా ! 58

మూ. తౌ నిరాశౌ మదర్థం తు శోకసంతాపకర్శితౌ,
సహ సర్వర్క్షహరిభిస్త్యక్ష్యతః ప్రాణసంగ్రహమ్. 59

ప్ర. అ. మదర్థమ్=నా నిమిత్తమై, శోకసంతాపకర్శితౌ=శోకము చేతను, సంతాపముచేతను, కృశింపచేయబడి ఉన్న, తౌ=ఆ రామలక్ష్మణులు, నిరాశౌ=నిరాశులై, సర్వర్క్షహరిభిః సహ=సమస్తమైన ఎలుగుబంట్లతోను, వానరులతోను, ప్రాణసంగ్రహమ్=ప్రాణరక్షణమును, త్యక్ష్యతః=విడువగలరు.

తా. నా నిమిత్తమై శోకసంతాపములతో కృశించి ఉన్న ఆ రామలక్ష్మణులు, సమస్తమైన ఎలుగుబంటులు, వానరులు, నిరాశచే ప్రాణములు విడిచెదరు. 59

మూ. భర్తుర్భక్తిం పురస్కృత్య రామాదన్యస్య వానర,
న స్పృశామి శరీరం తు పుంసో వానరపుఙ్గవ. 60

ప్ర. అ. వానరపుఙ్గవ=వానరులలో శ్రేష్ఠుడవైన, వానర=హనుమంతుడా ! భర్తుః=భర్తయొక్క (యందు) భక్తిమ్=భక్తిని, పురస్కృత్య=పురస్కరించుకొని, రామాత్=రామునికంటె, అన్యస్య=ఇతరుడైన, పుంసః=పురుషునియొక్క, శరీరం తు=శరీరమును, న స్పృశామి=స్పృశించను.

తా. వానరోత్తమా ! పాతివ్రత్యధర్మమును అనుసరించి నేను రాముడు తప్ప మరియే పురుషుని శరీరమును స్పృశించను.

వి. ఈ శ్లోకములోని ఉత్తరార్ధానికి బదులు "నాహం స్ప్రిష్టుం స్వతో గాత్రమిచ్ఛేయం వానరోత్తమ" అను గోరఖ్‌పూరు పాఠము బాగున్నది. "అహమ్=నేను, స్వతః=నా అంతట నేనుగా, స్ప్రిష్టుమ్=స్పృశించుటకు, నేచ్ఛే యమ్=ఇచ్ఛయించను" అని అర్థము. స్వతః అని చెప్పడంలో అందమున్నది తరువాతి శ్లోకం ఈ భావాన్నే వివరిస్తూన్నది. 60

మూ. యదహం గాత్రసంస్పర్శం రావణస్య బలాద్గతా,
అనీశా కిం కరిష్యామి వినాథా వివశా సతీ. 61

ప్ర. అ. అహమ్=నేను, బలాత్=బలాత్కారమువలన, రావణస్య=రావణునియొక్క, గాత్రసంస్పర్శమ్=శరీరస్పర్శను, గతా యత్=పొందినానన్నచో, అనీశా=శక్తి లేనిదానను గాను, వివశా సతీ=పరాధీనురాలనుగాను ఉన్న నేను, వినాథా=రక్షించువారు లేనిదాననై, కిం కరిష్యామి=ఏమి చేయుదును ?

తా. బలాత్కారమువలన, రావణుని శరీరస్పర్శ నాకు కలిగినదన్నచో ఆ సమయములో రక్షించే నాథుడు లేక స్వయముగా రక్షించుకొనే శక్తి లేక, పరాధీనురాలనైన నేను ఏమి చేయగలను ? 61

మూ. యది రామో దశగ్రీవమిహ హత్వా సబాన్ధవమ్,
మామితో గృహ్య గచ్ఛేత తత్తస్య సదృశం భవేత్. 62

ప్ర. అ. రామః=రాముడు, సబాన్ధవమ్=బంధువులతో కూడిన, దశగ్రీవమ్ రావణుని, ఇహ=ఇక్కడ, హత్వా=చంపి, మామ్=నన్ను, ఇతః=ఇక్కడి నుండి, గృహ్య=గ్రహించి, గచ్ఛేత యది=వెళ్ళినట్లయితే, తత్=అది, తస్య=ఆతనికి, సదృశమ్=తగినది, భవేత్=అగును.

తా. రాముడిక్కడ బంధుసహితుడైన రావణుని సంహరించి, నన్నీ ప్రదేశము నుండి తీసికొని వెళ్ళినచో అది ఆతనికి యుక్తముగా ఉండును. 62

మూ. శ్రుతా హి దృష్టాశ్చ మయా పరాక్రమా
మహాత్మనస్తస్య రణావమర్దినః,
న దేవగన్ధర్వభుజఙ్గరాక్షసా
భవన్తి రామేణ సమా హి సంయుగే. 63

ప్ర. అ. రణావమర్దినః=యుద్ధమునందు శత్రువులను పీడించు, మహాత్మనః=మహాత్ముడైన, తస్య=ఆ రామునియొక్క, పరాక్రమాః=పరాక్రమములు,

మయా=నాచేత, శ్రుతాః=వినబడినవి. దృష్టాశ్చ=చూడబడినవి కూడ. సంయుగే=యుద్ధమునందు, దేవగన్ధర్వభుజఙ్గరాక్షసాః=దేవతలు, గంధర్వులు, నాగులు, రాక్షసులు, రామేణ=రామునితో, సమాః=సమానమైనవారు, నహి=కారు కాదా ?

తా. యుద్ధములో శత్రువులను సంహరించు ఆ రాముని పరాక్రమాలను గూర్చి నేను వినుటయే కాదు, స్వయముగా కూడ చూచినాను. యుద్ధములో దేవతలుగాని, గంధర్వులుగాని, నాగులు గాని, రాక్షసులు గాని రాముని ముందు నిలవజాలరు. 63

మూ. సమీక్ష్య తం సంయతి చిత్రకార్ముకమ్
మహాబలం వాసవతుల్యవిక్రమమ్,
సలక్ష్మణం కో విషహేత రాఘవం
హుతాశనం దీప్తమివానలేరితమ్. 64

ప్ర. అ. చిత్రకార్ముకమ్=చిత్రమైన ధనస్సు కలవాడు, మహాబలమ్=గొప్ప బలము కలవాడు. వాసవతుల్యవిక్రమమ్=దేవేంద్రునితో సమానమైన పరాక్రమము కలవాడు, సలక్ష్మణమ్=లక్ష్మణునితో కూడినవాడు, అనిలేరితమ్=వాయువుచే ప్రజ్వలింపచేయుబడిన, దీప్తమ్=ప్రజ్వలించుచున్న, హుతాశనమివ=అగ్ని వలె ఉన్నవాడు అయిన, తం రాఘవమ్=ఆ రాముని, సమితి=యుద్ధమునందు, సమీక్ష్య=చూచి, కః=ఎవడు, విషహేత=సహించగలడు.

తా. చిత్రమైన ధనస్సు ధరించి, మహాబలశాలి, దేవేంద్రునివంటి పరాక్రమము గలవాడు అయిన రాముడు లక్ష్మణసహితుడై, వాయువుచే ప్రజ్వలింపచేయబడుచున్న అగ్ని వలె యుద్ధభూమిలో నిలచి ఉండగా చూచి, ఎవ్వడైన నిలవగలడా ? 64

మూ. సలక్ష్మణం రాఘవమాజిమర్దనం
దిశాగజం మత్తమివ వ్యవస్థితమ్,
సహేత కో వానరముఖ్య సంయుగే
యుగాన్తసూర్యప్రతిమం శరార్చిషమ్. 65

ప్ర. అ. వానరముఖ్య=ఓ వానరశ్రేష్ఠుడా ! సలక్ష్మణమ్=లక్ష్మణునితో కూడినవాడు, ఆజిమర్దనమ్=యుద్ధములో సంహరించువాడు, మత్తమ్=మదించిన, దిశాగజమివ=దిగ్గజము వలె, వ్యవస్థితమ్=నిలచినవాడు, శరార్చిషమ్=శరము లనే కిరణములు కలవాడు, యుగాన్తసూర్యప్రతిమమ్=యుగాంతము నందలి సూర్యునితో సమానుడూ అయిన, రాఘవమ్=రాముణ్ణి, సంయుగే=యుద్ధమునందు, కః=ఎవ్వడు, సహేత=సహించగలడు ?

తా. యుద్ధములో శత్రుసంహారకుడైన, లక్ష్మణసహితుడైన రాముడు శరములనే కిరణములతో ప్రళయకాలసూర్యుడు వలె ప్రకాశించుచు, మదించిన దిగ్గజము వలె నిలచి యుండగా యుద్ధభూమిలో ఆతనిని ఎవ్వడు ఎదుర్కొన గలడు ? 65

మూ. స మే హరిశ్రేష్ఠ సలక్ష్మణం పతిం
సయూథపం క్షిప్రమిహోపపాదయ,
చిరాయ రామం ప్రతి శోకకర్శితాం
కురుష్వ మాం వానరముఖ్య హర్షితామ్. 66

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే సున్దరకాణ్డే
సప్తత్రింశః సర్గః.

ప్ర. అ. హరిశ్రేష్ఠ=వానరశ్రేష్ఠుడా ! సః=అట్టి నీవు, సలక్ష్మణమ్=లక్ష్మణునితో కూడినవాడూ, సయూథపమ్=సేనానాయకులతో కూడినవాడూ అయిన, పతిమ్=నా భర్తను, క్షిప్రమ్=శీఘ్రముగా, ఇహ=ఇక్కడికి, ఉపపాదయ=పొందింపుము. వానరముఖ్య=వానరులలో శ్రేష్ఠుడా ! రామం ప్రతి=రాముని గూర్చి, చిరాయ=చిరకాలము నుండి, శోకకర్శితామ్=శోకముచేత కృశింపచేయబడిన, మామ్=నన్ను, హర్షితామ్=సంతోషింపచేయబడినదానినిగా, కురుష్వ=చేయుము.

తా. వానరశ్రేష్ఠుడ వైన హనుమంతుడా ! నా భర్తను, లక్ష్మణుని, వానర సేనానాయకులను శీఘ్రముగా ఇక్కడికి తీసికొని రమ్ము. రాముని గూర్చి శోకముతో కృశించి ఉన్న నాకు హర్షము కలిగించుము.

వి. ఈ ఘట్టంలో దాక్షిణాత్యపాఠంలో 26 శ్లోకాలు ఉన్నవి. ఇవి తనతో రాముని వద్దకు రమ్మని పలికిన హనుమంతుని మాటలకు సీత చెప్పిన సమాధానము. దీనిలో మూడు అంశాలు ఉన్నవి. (1) తాను హనుమంతుని వీపుపై ఎక్కి వెళ్ళుటచే రాబోవు అపాయముల వర్ణనము (2) పరపురుషుని స్పృశించనను తన నియమము (3) రామపరాక్రమాతిశయవర్ణనము. మొదటి విషయమే అతి విస్తృతముగా 20శ్లోకాలలో వర్ణింపబడినది. రెండవ అంశము రెండే శ్లోకాలలో చెప్పబడినది. దీనిని పట్టి సీత తనకూ హనుమంతునకూ, అపాయము రావచ్చుననీ, కార్యభంగము కలుగుననీ ఈ విషయాలకే రెండవ అంశం కంటె ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చుచున్నట్లు కనబడుచున్నది. ఇంక మూడవ అంశమైన రామపరాక్రమవర్ణనానికి ఇక్కడ ఆవశ్యకతయే లేదు. దాని విషయమున హనుమంతునికి గూడ విప్రతిపత్తి లేదు కదా. ఆతడు కోరినదల్లా సీతను శీఘ్రముగా రాముని వద్దకు చేర్చి వారి దుఃఖమును తొలగించుట.

వాస్తవానికి రెండవ అంశానికి ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వడం సముచితం. అందుచేత ప్రాచ్యపాఠము బాగున్నట్లు తోచుచున్నది. దానిలో ఈ ఘట్టములో ఐదే శ్లోకాలున్నవి. రెండు శ్లోకాలలో సీత హనుమంతుని గమనవేగమునకు ఆగలేక తాను సముద్రములో పడిపోయి, జలజంతువులకు ఆహారమై పోవుదును అను ఆశంకను వ్యక్తపరచినది. తరువాతి రెండు శ్లోకాలలో పరపురుష స్పర్శ తాను చేయదు గాన హనుమంతునితో వెళ్ళే ప్రసక్తి లేదన్నట్లు చెప్పి ఐదవశ్లోకంలో రాముణ్ణి శీఘ్రంగా తీసికొని రమ్మని ఈ 66 వ శ్లోకంలో వలె హనుమంతుని కోరినది. 66

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు సుందరకాండలో ముప్పదియేడవ సర్గ సమాప్తము.

అథ అష్టత్రింశః సర్గః

[సీత హనుమంతునకు చిత్రకూటముపై జరిగిన కాకవృత్తాంతమును గూర్చి చెప్పి, రామునకు నమ్మిక కలుగుటకై హనుమంతునకు చూడామణిని ఇచ్చుట].

మూ. తతః స కపిశార్దూలస్తేన వాక్యేన తోషితః,
సీతామువాచ తచ్ఛ్రుత్వా వాక్యం వాక్యవిశారదః. 1

ప్ర. అ. తతః=అటుపిమ్మట, వాక్యవిశారదః=మాటలలో నేర్పుగల, సః కపిశార్దూలః=ఆ వానరశ్రేష్ఠుడు, తత్ వాక్యమ్=ఆ వాక్యమును, శ్రుత్వా=విని, తేన వాక్యేన=ఆ వాక్యము చేత, తోషితః=సంతోషింపచేయబడినవాడై, సీతామ్=సీతను గూర్చి, ఉవాచ=పలికెను.

తా. పిదప, మాటలలో నేర్పరియైన ఆ హనుమంతుడు, సీత పలికిన మాటలు విని, చాలా సంతోషించి, ఆమెతో ఇట్లు పలికెను. 1

మూ. యుక్తరూపం త్వయా దేవి భాషితం శుభదర్శనే,
సదృశం స్త్రీస్వభావస్య సాధ్వీనాం వినయస్య చ. 2

ప్ర. అ. శుభదర్శనే=మంగళప్రదమైన దర్శనము గలదానా ! దేవి=ఓ !దేవీ ! త్వయా=నీచేత, భాషితమ్=పలకబడినది, యుక్తరూపమ్=చాల యుక్తముగా ఉన్నది. స్త్రీస్వభావస్య=స్త్రీలస్వభావమునకు, సాధ్వీనామ్=పతివ్రతలయొక్క, వినయస్య చ=వినయమునకు, సదృశమ్=తగినదిగా ఉన్నది.

తా. మంగళప్రదమైన దర్శనము గల ఓ సీతాదేవీ ! నీవు చెప్పిన విషయము చాలా బాగున్నది. స్త్రీల స్వభావమునకు, పతివ్రతల వినయానికీ అనుగుణముగా ఉన్నది. 2

మూ. స్త్రీత్వం న తు సమర్థం హి సాగరం వ్యతివర్తితుమ్,
మామధిష్ఠాయ విస్తీర్ణం శతయోజనమాయతమ్. 3

ప్ర. అ. మామ్=నన్ను, అధిష్ఠాయ=అధిష్ఠించి, విస్తీర్ణమ్=విశాలమూ, శతయోజనమ్=నూరుయోజనములు, ఆయతమ్=దీర్ఘమూ అయిన, సాగరమ్=సము

ద్రమును, వ్యతివర్తితుమ్=దాటుటకు, స్త్రీత్వమ్=స్త్రీయై ఉండుట (స్త్రీ స్వభావము), న సమర్థం హి=సమర్థము కాదు కదా?

తా. నా వీపుపై ఎక్కి, అతివిశాలమూ, నూరు యోజనాలు దీర్ఘమూ అయిన సముద్రమును దాటుట స్త్రీకి చాల కష్టమైన విషయము. 3

మూ. ద్వితీయం కారణం యచ్చ బ్రవీషి వినయాన్వితే,
రామాదన్యస్య నార్హామి సంస్పర్శమితి జానకి. 4
ఏతత్తే సదృశం దేవి పత్న్యాస్తస్య మహాత్మనః,
కా హ్యన్యా త్వామృతే దేవి బ్రూయాద్వచనమీదృశమ్. 5

ప్ర. అ. వినయాన్వితే=వినయముతో కూడినదానా ! జానకి=ఓ !సీతాదేవీ !రామాత్=రామునికంటె, అన్యస్య=ఇతరుని యొక్క, సంస్పర్శమ్=స్పర్శను, నార్హామీతి=చేయతగను (చేయను) అని, యత్=ఏ, ద్వితీయమ్=రెండవ, కారణమ్=కారణమును, బ్రవీషి=చెప్పుచున్నావో, ఏతత్=ఇది, తస్య=ఆ, మహాత్మనః=మహాత్ముడైన రాముని యొక్క, పత్న్యాః=భార్యవైన, తే=నీకు, సదృశమ్=తగియున్నది. దేవి=ఓ !దేవీ ! త్వామ్ ఋతే=నీవు తప్ప, అన్యా=మరియొక, కా=ఏ స్త్రీ, ఈదృశమ్=ఇట్టి, వచనమ్=వచనమును, బ్రూయాత్=పలుకును !

తా. వినయవంతురాలవైన జానకీ ! రాముడు తప్ప, ఇతరుని ఎవ్వనినీ స్పృశింపను అని నీవు చెప్పిన రెండవ కారణము మహాత్ముడైన ఆ రాముని భార్యవైన నీకే తగి ఉన్నది. ఓ ! దేవీ ! నీవు తప్ప మరి యే స్త్రీ యైనా ఇట్టి మాట చెప్పగలదా ! 4, 5

మూ. శ్రోష్యతే చైవ కాకుత్స్థః సర్వం నిరవశేషతః,
చేష్టితం యత్త్వయా దేవి భాషితం మమ చాగ్రతః. 6

ప్ర. అ. దేవి=ఓ ! దేవీ ! త్వయా=నీచేత, యత్=ఏది, చేష్టితమ్=చేయబడినదో, మమ=నాయొక్క, అగ్రతః=ఎదుట, భాషితం చ=పలకబడినదో, సర్వమ్=అంతనూ, నిరవశేషతః=పూర్తిగా, కాకుత్స్థః=రాముడు, శ్రోష్యతే చ=వినగలడు.

తా. ఓ !దేవీ ! నీవు ఏ విధముగా ప్రవర్తించినావో, నా ఎదుట ఏమేమి మాటలాడినావో దానినంతనూ రామునకు పూర్తిగా తెలుపగలను. 6

మూ. కారణైర్బహుభిర్దేవి రామప్రియచికీర్షయా,
స్నేహప్రస్కన్నమనసా మయైతత్సముదీరితమ్. 7

ప్ర. అ. దేవి=ఓ !దేవీ ! బహుభిః=అనేకములైన, కారణైః=కారణముల చేతను, రామప్రియచికీర్షయా=రామునకు ప్రియము చేయవలె నను ఇచ్ఛ చేతను, స్నేహప్రస్కన్నమనసా=స్నేహము చేత ద్రవించిన మనస్సు గల, మయా=నాచేత, ఏతత్=ఇది, సముదీరితమ్=చెప్పబడినది.

తా. ఓ !సీతాదేవీ ! అనేక కారణములు ఉండుటచేతను, రామునకు ప్రియము చేయవలె నను ఇచ్ఛచేతను, స్నేహముచే నా మనస్సు కరిగి నే నిట్లు చెప్పినాను. 7

మూ. లఙ్కాయా దుష్ప్రధర్షత్వాద్దుస్తరత్వాన్మహోదధేః,
సామర్థ్యాదాత్మనశ్చైవ మయైతత్సముదీరితమ్. 8

ప్ర. అ. లఙ్కాయాః=లంక, దుష్ప్రధర్షత్వాత్=ఎదిరింప శక్యము కాని దగుట వలనను, మహోదధేః=మహాసముద్రము, దుస్తరత్వాత్=దాటశక్యము కాని దగుటవలనను, ఆత్మనః=నాయొక్క, సామర్థ్యాచ్చైవ=సామర్థ్యము వలనను, మయా=నాచేత, ఏతత్=ఇది, సముదీరితమ్=చెప్పబడినది.

తా. లంక ఎదిరింపశక్యము కానిది. మహాసముద్రమును దాటుట చాల కష్టము. నాకు నిన్ను తీసికొనిపోవుటకు తగిన సామర్థ్యము కూడ ఉన్నది. ఈ అన్ని కారణములను దృష్టిలో ఉంచుకొని నే నిట్లు చెప్పినాను. 8

మూ. ఇచ్ఛామి త్వాం సమానేతుమద్యైవ రఘుబన్ధునా,
గురుస్నేహేన భక్త్యా చ నాన్యథైతదుదాహృతమ్. 9

ప్ర. అ. గురుస్నేహేన=గొప్ప స్నేహముచేతను, భక్త్యా చ=భక్తి చేతను, త్వామ్=నిన్ను, రఘుబన్ధునా=రామునితో, అద్యైవ=ఇప్పుడే, సమానేతుమ్=చేర్చుటకు, ఇచ్ఛామి=కోరుచున్నాను. ఏతత్=ఈ వాక్యము, అన్యథా=మరొకవిధముగా, న ఉదాహృతమ్=పలకబడలేదు.

తా. మీ విషయమున నాకున్న గొప్ప స్నేహముచేతను, భక్తిచేతను, ఇప్పుడే నిన్ను రాముని దగ్గరకు తీసికొనివెళ్ళవలెనను కోరికచేతను ఇట్లు పలికినాను కాని మరొక కారణమేదీ లేదు. 9

మూ. యది నోత్సహసే యాతుం మయా సార్ధమనిన్దితే,
అభిజ్ఞానం ప్రయచ్ఛ త్వం జానీయాద్రాఘవో హి యత్. 10

ప్ర. అ. అనిన్దితే=నిందింపబడని ఓ ! సీతాదేవీ ! మయా సార్ధమ్= నాతో కూడ, యాతుమ్=వెళ్లుటకు, నోత్సహసే యది=ఇచ్ఛయించనట్లయితే,

యత్=దేనిని, రాఘవః=రాముదు, జానీయాత్=గుర్తుపట్టునో, అభిజ్ఞానమ్=అట్టి ఆనవాలును, త్వమ్=నీవు, ప్రయచ్ఛ=ఇమ్ము.

తా. దోషము లేని ఓ ! సీతాదేవీ ! నీవు నాతో కూడ రాముని వద్దకు వెళ్లుటకు ఇష్టపడనిచో, రాముదు గుర్తించే ఆనవాలు ఏదైనా ఇమ్ము.10

మూ. ఏవముక్తా హనుమతా సీతా సురసుతోపమా,
ఉవాచ వచనం మన్దం బాష్పప్రగ్రథితాక్షరమ్. 11
ఇదం శ్రేష్ఠమభిజ్ఞానం బ్రూయాస్త్వం తు మమ ప్రియమ్.

ప్ర. అ. హనుమతా=హనుమంతుని చేత, ఏవమ్=ఇట్లు, ఉక్తా=పలకబడిన, సురసుతోపతా=దేవకన్యతో సమానురాలైన, సీతా=సీత, బాష్పప్రగ్రథితాక్షరమ్=బాష్పముతో గ్రుచ్చబడిన అక్షరములు గల, వచనమ్=వచనమును, మన్దమ్=మందముగా, ఉవాచ=పలికెను. త్వం తు=నీవు, మమ=నాయొక్క, ప్రియమ్=ప్రియుని గూర్చి, శ్రేష్ఠమ్=శ్రేష్ఠమైన, ఇదమ్=ఈ, అభిజ్ఞానమ్=ఆనవాలును, బ్రూయాః=చెప్పుము.

తా. దేవకన్యతో సమానురాలైన సీత హనుమంతుని మాటలు విని కన్నీటితో అక్షరములు కూర్చిన మాటలతో మందముగా ఇట్లు పలికెను. "నీవు నా భర్తయైన రామునితో ఈ విషయమును శ్రేష్ఠమైన గుర్తుగా చెప్పుము".11

మూ. శైలస్య చిత్రకూటస్య పాదే పూర్వోత్తరే పురా, 12
తాపసాశ్రమవాసిన్యాః ప్రాజ్యమూలఫలోదకే,
తస్మిన్ సిద్ధాశ్రితే దేశే మన్దాకిన్యవిదూరతః. 13
తపోవనఖణ్డేషు నానాపుష్పసుగన్ధిషు,
విహృత్య సలిలే క్లిన్నో మమాఙ్కే సముపావిశః. 14

ప్ర. అ. పురా=పూర్వము, చిత్రకూటస్య శైలస్య=చిత్రకూటపర్వతము యొక్క, పూర్వోత్తరే=ఈశాన్యపుదిక్కున ఉన్న, పాదే=సమీపమునందున్న చిన్న పర్వతమునందు, (పెద్ద పర్వతము ప్రక్కనే ఉన్న చిన్న పర్వతమునకు "పాదము" అని పేరు), ప్రాజ్యమూలఫలోదకే=అధికమైన మూలములు, ఫలములు, ఉదకమూ గల, తస్మిన్=ఆ, సిద్ధాశ్రితే=సిద్ధులచే ఆశ్రయింపబడిన, దేశే=ప్రదేశమునందు, మన్దాకిన్యవిదూరతః=గంగకు సమీపమునందు, తస్య=ఆ పాదపర్వతము యొక్క, నానాపుష్పసుగన్ధిషు=అనేక విధములైన పుష్పముల సువాసనతో కూడిన, ఉపవనఖణ్డేషు=సమీప వనసముదాయములందు, సలిలే=జలములో, విహృత్య=విహరించి, క్లిన్నః=తడిసినవాడవై, తాపసాశ్రమవాసిన్యాః=ఋషుల ఆశ్రమమునందు నివసించుచున్న, మమ=నాయొక్క, అఙ్కే=సమీపమునందు, సముపావిశః=కూర్చుంటివి.

తా. చిత్రకూటపర్వతమునకు సంబంధించిన ఈశాన్యపు పాదపర్వతము నందు, సిద్ధులు నివసించే ఒక ప్రదేశము ఉన్నది. అది మూలఫలోదకములతో సమృద్ధమైనది. గంగానదికి దగ్గరగా ఉన్న ఆ ప్రదేశమునందు, నేను (మనము) మునుల ఆశ్రమములో నివసించుచుండగా, పూర్వము నీవొక దినమున, వివిధ పుష్పముల సువాసనలతో నిండిన ఉపవనప్రాంతములందు, జలములో విహరించి, తడిసి నా సమీపమునందే కూర్చుంటివి. 12-14

మూ. తతో మాంససమాయుక్తో వాయసః పర్యతుణ్డయత్.
తమహం లోష్టముద్యమ్య వారయామి స్మ వాయసమ్. 15

ప్ర. అ. తతః=అటు పిమ్మట, మాంససమాయుక్తః=మాంసమునందు ఆసక్తి కల, వాయసః=కాకి, పర్యతుణ్డయత్=ముట్టెతో పొడిచెను. అహమ్=నేను, లోష్టమ్=మట్టి బెడ్డను, ఉద్యమ్య=ఎత్తి, తమ్=ఆ, వాయసమ్=కాకిని, వారయామి స్మ=నివారించితిని.

తా. ఇంతలో ఒక కాకి వచ్చి మాంసమునందు, ఆసక్తిచే నన్ను ముట్టెతో పొడవ ప్రారంభించినది. అప్పుడు నేను మట్టి బెడ్డలు విసరి దానిని నివారించితిని. 15

మూ. దారయన్ స చ మాం కాకస్తత్రైవ పరిలీయతే,
న చాప్యుపారమన్మాంసాద్భక్షార్థీ బలిభోజనః. 16

ప్ర. అ. సః కాకః=ఆ కాకి, మామ్=నన్ను, దారయన్=చీల్చుచు, తత్రైవ=అక్కడనే, పరిలీయతే=దాగుచుండెను. భక్షార్థీ=ఆహారమును కోరుచున్న, సః=ఆ, బలిభోజనః=కాకి, మాంసాత్=మాంసమునుండి, న ఉపారమచ్చాపి=విర మించలేదు కూడ.

తా. ఆ కాకి నన్ను మాటిమాటికి పొడుచుచు, పారిపోయి దాగికొనుచుండెను. అది ఎంతసేపైనను ఇట్లే చేయుచు మాంసమునుండి మరలలేదు. 16

మూ. ఉత్కర్షన్త్యాం చ రశనాం క్రుద్ధాయాం మయి పక్షిణా,
స్రస్యమానే చ వసనే తతో దృష్టా త్వయా హ్యహమ్. 17

ప్ర. అ. మయి=నేను, పక్షిణా=పక్షిచేత, క్రుద్ధాయామ్=కోపించిన దాన నగుచుండగా, వసనే=వస్త్రము, స్రస్యమానే చ=జారిపోవుచుండగా, (నేను) రశనామ్=వడ్డాణమును, ఉత్కర్షన్త్యాం చ=పైకి లాగికొనుచుండగా, తతః=పిమ్మట, త్వయా=నీచేత, అహమ్=నేను, దృష్టా=చూడబడితిని.

తా. నాకు ఆ కాకిపై చాల కోపము వచ్చినది. ఒక ప్రక్క వస్త్రము జారిపోవుచుండెను. దానిని సరిచేసికొనుటకై నేను వడ్డాణమును పైకి లాగుకొనుచుంటిని. ఆ సమయమునందు నీవు నన్ను చూచితివి. 17

మూ. త్వయాపహసితా చాహం క్రుద్ధా సంలజ్జితా తదా,
భక్షగృధ్నేన కాకేన దారితా త్వాముపాగతా. 18

ప్ర. అ. తదా=అప్పుడు, క్రుద్ధా=కోపించిన, అహమ్=నేను, త్వయా=నీచేత, అపహసితా=పరిహసింపబడినదాననై, సంలజ్జితా=సిగ్గుపడితిని. భక్షగృధ్నేన=ఆహార మునందు ఆసక్తి గల, కాకేన=కాకిచేత, దారితా=చీల్చబడినదాననై, త్వామ్=నిన్ను, ఉపాగతా=చేరితిని.

తా. అపుడు ఆ కాకిమీద కోపముతో ఉన్న నన్ను నీవు పరిహసింపగా నేను సిగ్గు చెందితిని. ఆహారము కొరకై ఆ కాకి నన్ను చీరగా నేను నీవద్దకు వచ్చితిని. 18

మూ. ఆసీనస్య చ తే శ్రాన్తా పునరుత్సఙ్గమావిశమ్,
క్రుధ్యన్తీ చ ప్రహృష్టేన త్వయాహం పరిసాన్త్వితా. 19

ప్ర. అ. శ్రాన్తా=అలసినదాననై, ఆసీనస్య=కూర్చొనియున్న, తే=నీయొక్క, ఉత్సఙ్గమ్=ఒడిని, పునః=మరల, ఆవిశమ్=ప్రవేశించితిని. క్రుధ్యన్తీ=కోపగించిన, అహమ్=నేను, ప్రహృష్టేన=సంతోషించిన, త్వయా=నీచేత, పరిసాన్త్వితా=ఓదార్చ బడినాను.

తా. నేను అలసిపోయి, అచటనే కూర్చొని యున్న నీ ఒడిలో కూర్చుంటిని. అప్పుడు కోపముతో ఉన్న నన్ను నీవు నవ్వుచు ఓదార్చితివి. 19

మూ. బాష్పపూర్ణముఖీ మన్దం చక్షుషీ పరిమార్జతీ,
లక్షితాహం త్వయా నాథ వాయసేన ప్రకోపితా. 20

ప్ర. అ. నాథ=ఓ! నాథా! వాయసేన=కాకిచేత, ప్రకోపితా=కోపింపచే యుబడినదాననై, బాష్పపూర్ణముఖీ=బాష్పములతో నిండిన ముఖము గల దానను, మన్దమ్=మెల్లిగా, చక్షుషీ=నేత్రములను, పరిమార్జతీ=తుడుచుకొనుచున్నదానను అయిన, అహమ్=నేను, త్వయా=నీచేత, లక్షితా=చూడబడితిని.

తా. నాథా ! ఆ విధముగా కాకి కోపము కలిగించుటచే ముఖము కన్నీళ్లతో నిండగా, మెల్లగా నేత్రములు తుడుచుకొనుచున్న నన్ను నీవు చూచితివి. 20

మూ. పరిశ్రమాత్ప్రసుప్తా చ రాఘవాఙ్కే ఽప్యహం చిరమ్,
పర్యాయేణ ప్రసుప్తశ్చ మమాఙ్కే భరతాగ్రజః. 21

ప్ర. అ. అహమపి=నేను కూడా, పరిశ్రమాత్=అలసటవలన, రాఘవాఙ్కే=రాముని ఒడిలో, చిరమ్=చిరకాలము, ప్రసుప్తా చ=నిద్రించితిని, పర్యాయేణ=పర్యాయము చేత, (నా తరవాత), భరతాగ్రజః=రాముడు, మమ=నాయొక్క, అఙ్కే=ఒడిలో, ప్రసుప్తః=నిద్రపోయినాడు.

తా. నేను ఎక్కువ అలసట చెంది ఉండుటచేత రాముని ఒడిలో చాల సేపు నిద్రించితిని. పిదప రాముడు నా ఒడిలో నిద్రించినాడు. 21

మూ. స తత్ర పునరే వాథ వాయసః సముపాగమత్,
తతః సుప్తప్రబుద్ధాం మాం రామస్యాఙ్కాత్సముత్థితామ్, 22
వాయసః సహసాగమ్య విదదార స్తనాన్తరే,
పునః పునరథోత్పత్య విదదార స మాం భృశమ్. 23

ప్ర. అ. అథ=అటు పిమ్మట, సః వాయసః=ఆ కాకి, పునరేవ=మరల, తత్ర=అచటికి, సముపాగమత్=వచ్చెను. తతః=అటు పిమ్మట, సః=ఆ, వాయసః=కాకి, సహసా=శీఘ్రముగా, ఆగమ్య=వచ్చి, సుప్తప్రబుద్ధామ్=నిద్రించి మేల్కొన్నదాననై, రామస్య=రామునియొక్క, అఙ్కాత్=తొడనుండి, సముత్థితామ్=లేచిన, మామ్=నన్ను, స్తనాన్తరే=స్తనముల మధ్యయందు, విదదార=చీల్చెను. అథ=మరియు, పునః=మాటిమాటికి, ఉత్పత్య=ఎగిరి, మామ్=నన్ను, భృశమ్=మిక్కిలి, విదదార=చీల్చెను.

తా. పిదప, ఆ కాకి అక్కడికి మళ్ళీ వచ్చి నిద్రనుండి మేల్కొని రాముని తొడనుండి లేచిన నా దగ్గరకు వచ్చి, స్తనమధ్యప్రదేశమునందు చీరెను. మాటిమాటికి ఎగిరి ఎగిరి అది నన్ను చాల ఎక్కువగా చీరెను. 22, 23

మూ. తతః సముక్షితో రామో ముక్తైః శోణితబిన్దుభిః,
వాయసేన తతస్తేన బలవత్క్లిశ్యమానయా, 24
స మయా బోధితః శ్రీమాన్ సుఖసుప్తః పరంతపః.

ప్ర. అ. తతః=అటు పిమ్మట, రామః=రాముడు, ముక్తైః=విడువబడిన (స్రవించిన), శోణితబిన్దుభిః=రక్తబిందువులచేత, సముక్షితః=తడిపబడెను. తతః=అటుపిమ్మట, తేన వాయసేన=ఆ కాకిచేత, బలవత్=అధికముగా, క్లిశ్యమానయా=భాధపెట్టబడుచున్న, మయా=నాచేత, శ్రీమాన్=శ్రీమంతుడు, పరంతపః=శత్రువులను పీడింపచేయువాడు, సుఖసుప్తః=సుఖముగా నిద్రపోవుచున్నవాడు అయిన, సః=ఆ రాముడు, బోధితః=మేల్కొల్పబడినాడు.

తా. అప్పుడు స్రవించిన రక్తబిందువులు మీద పడి రాముని దేహము తడిసెను. ఆ విధముగా ఆ కాకి నన్ను బాధించుచుండగా, నేను సుఖముగా నిద్రపోవుచున్న, శోభావంతుడు, శత్రుసంహారి అయిన రాముని మేల్కొలిపితిని. 24

మూ. స మాం దృష్ట్వా మహాబాహుర్వితున్నాం స్తనయోస్తదా, 25
ఆశీవిష ఇవ క్రుద్ధః శ్వసన్ వాక్యమభాషత.

ప్ర. అ. మహాబాహుః=గొప్ప బాహువులు గల, సః=ఆ రాముడు, తదా=అప్పుడు, స్తనయోః=స్తనములమీద, వితున్నామ్=పీడింపబడిన,మామ్=నన్ను, దృష్ట్వా=చూచి, క్రుద్ధః=కోపించిన, ఆశీవిష ఇవ=సర్పము వలె, శ్వసన్=బుసకొట్టుచు, వాక్యమ్=వాక్యమును, అభాషత=పలికెను.

తా. మహాబాహువైన ఆ రాముడు, అప్పుడు స్తనములపై పీడింపబడిన నన్ను చూచి, కోపించిన సర్పము వలె బుసలు గొట్టుచు ఇట్లు పలికెను. 25

మూ. కేన వై నాగనాసోరు విక్షతం వై స్తనాన్తరమ్. 26
కః క్రీడతి సరోషేణ పఞ్చవక్త్రేణ భోగినా.

ప్ర. అ. నాగనాసోరు=ఏనుగు తొండము వంటి తొడలు గల ఓ ! సీతా ! తే=నీయొక్క, స్తనాన్తరమ్=స్తనముల మధ్యభాగము, కేన=ఎవనిచేత, విక్షతం వై=గాయపరచబడినది ? సరోషేణ=రోషముతో కూడిన, పఞ్చవక్త్రేణ= ఐదుముఖములు గల, భోగినా=సర్పముతో, కః=ఎవడు, క్రీడతి=ఆడుచున్నాడు ?

తా. ఏనుగు తొండము వంటి ఊరువులు గల సీతా ! నీ స్తనమధ్యప్రదేశమునందు గాయపరచినవాడు ఎవడు ? కోపించిన ఐదు తలల మహాసర్పముతో ఆడుకుంటున్నవాడు ఎవడు ? 26

మూ. వీక్షమాణస్తతస్తం వై వాయసం సముదైక్షత, 27
నఖైః సరుధిరైస్తీక్ష్ణైర్మామేవాభిముఖం స్థితమ్.

ప్ర. అ. తతః=అటుపిమ్మట, వీక్షమాణః=చూచుచు, సరుధిరైః=రక్తముతో కూడిన, తీక్ష్ణైః=తీక్ష్ణములైన, నఖైః=గోళ్లతో, మామేవ=నన్నే, అభిముఖమ్=అభిముఖముగా, స్థితమ్=ఉన్న, తం వాయసమ్=ఆ కాకిని, సముదైక్షత వై=చూచెను.

తా. పిమ్మట ఆ రాముడు నాలుగు వైపుల పరికించి, రక్తముతో కూడిన వాడి యైన గోళ్లతో నాకే ఎదురుగా ఉన్న ఆ కాకిని చూచెను. 27

మూ. పుత్రః కిల స శక్రస్య వాయసః పతతాం వరః, 28
ధరాన్తరగతః శీఘ్రం పవనస్య గతౌ సమః.

ప్ర. అ. పతతామ్=పక్షులలో, వరః=శ్రేష్ఠమైన, సః వాయసః=ఆ కాకి, శక్రస్య=ఇంద్రునియొక్క, పుత్రః కిల=పుత్రుడట. ధరాన్తరగతః=పర్వతమధ్యములందు నివసించునది, శీఘ్రమ్=శీఘ్రముగా, గతౌ=వెళ్లుటలో, పవనస్య=వాయువునకు, సమః=సమానమైనదట.

తా. పక్షులలో శ్రేష్ఠమైన ఆ కాకి దేవేంద్రుని కుమారుడట. పర్వత మధ్యములందు నివసించునట. శీఘ్రగమనములో వాయువుతో సమానమట. 28

మూ. తతస్తస్మిన్ మహాబాహుః కోపసంవర్తితేక్షణః, 29
వాయసే కృతవాన్ క్రూరాం మతిం మతిమతాం వరః.

ప్ర. అ. తతః=అటుపిమ్మట, మతిమతామ్=బుద్ధిమంతులలో వరః=శ్రేష్ఠుడైన, మహాబాహుః=గొప్ప బాహువులు గల ఆ రాముడు, కోపసంవర్తితేక్షణః=కోపముచేత త్రిప్పబడిన నేత్రములు కలవాడై, తస్మిన్=ఆ, వాయసే=కాకి యందు, క్రూరామ్=క్రూరమైన, మతిమ్=బుద్ధిని, కృతవాన్=చేసినాడు.

తా. బుద్ధిమంతులలో శ్రేష్ఠుడు, మహాబాహువు అయిన ఆ రాముడు, అప్పుడు, కోపముతో కండ్లు త్రిప్పుచు, ఆ కాకి విషయమున క్రూరమైన నిర్ణయమును చేసెను. 29

మూ. స దర్భం సంస్తరాద్గృహ్య బ్రాహ్మేణాస్త్రేణ యోజయత్. 30
స దీప్త ఇవ కాలాగ్నిర్జజ్వాలాభిముఖో ద్విజమ్.

ప్ర. అ. సః=ఆ రాముడు, సంస్తరాత్=ఆస్తరణమునుండి, దర్భమ్=దర్భను, గృహ్య=గ్రహించి, బ్రాహ్మేణ అస్త్రేణ=బ్రహ్మాస్త్రముతో, యోజయత్=కూర్చెను. సః=ఆ, దీప్తః=ప్రజ్వలించుచున్న దర్భ, కాలాగ్నిరివ=ప్రలయకాలాగ్ని వలె, ద్విజమ్ అభిముఖః=ఆ పక్షికి అభిముఖమై, జజ్వాల=ప్రజ్వలించెను.

తా. రాముడు దర్భాసనము నుండి ఒక దర్భ తీసికొని, దానిపై బ్రహ్మాస్త్రమును సంధించెను. ఆ దర్భ ప్రలయకాలాగ్ని వలె, ఆ పక్షి ఎదుట ప్రజ్వలించెను. 30

మూ. స తం ప్రదీప్తం చిక్షేప దర్భం తం వాయసం ప్రతి, 31
తతస్తం వాయసం దర్భః సోఽమ్బరేఽనుజగామ హ.

ప్ర. అ. సః=ఆ రాముడు, ప్రదీప్తమ్=మండుచున్న, తం దర్భమ్=ఆ దర్భను, తం వాయసం ప్రతి=ఆ కాకిని గూర్చి, చిక్షేప=విసరెను, తతః=అటు పిమ్మట, సః దర్భః=ఆ దర్భ, తం వాయసమ్=ఆ కాకిని, అమ్బరే=ఆకాశమునందు, అనుజగామ హ=అనుసరించెను.

తా. రాముడా మండుచున్న దర్భను ఆ కాకివైపు విసరగా, ఆ దర్భ ఆకాశమునందు దానిని తరుముకొనుచు వెళ్ళెను. 31

మూ. అనుసృష్టస్తదా కాకో జగామ వివిధాం గతిమ్, 32
త్రాణకామ ఇమం లోకం సర్వం వై విచచార హ.

ప్ర. అ. తదా=అప్పుడు, కాకః=కాకి, అనుసృష్టః=అనుసరింపబడినదై, వివిధామ్=అనేకవిధములైన, గతిమ్=గతిని, జగామ=వెళ్ళెను (పరుగెత్తెను). త్రాణ కామః=రక్షణమునందు కోరిక గలదై, ఇమమ్=ఈ సర్వమ్=సమస్తమైన, లోకమ్=లోకమును, విచచార హ=సంచరించెను.

తా. అప్పుడు, ఆ దర్భ తరుముకొని వచ్చుచుండగా, ఆ కాకి, ఎన్ని విధముల ఎగురుచు పోవుటకు వీలగునో అన్ని విధముల ఎగురుచు పోయెను. రక్షణము కోరుచు ఆ లోకములో అంతటా తిరిగెను. 32

మూ. స పిత్రా చ పరిత్యక్తః సురైశ్చ సమహర్షిభిః, 33
త్రీన్ లోకాన్ సంపరిక్రమ్య తమేవ శరణం గతః.

ప్ర. అ. సః=ఆ కాకి, త్రీన్=మూడు, లోకాన్=లోకములను, సంపరి క్రమ్య=సంచరించి, పిత్రా చ=తండ్రియైన ఇంద్రునిచేత, సమహర్షిభిః=మహర్షులతో కూడిన, సురైశ్చ=దేవతలచేతను, పరిత్యక్తః=విడవబడినదై, తమేవ=ఆ రాముణ్ణే, శరణం గతః=శరణుపొందినది.

తా. ఆ కాకి రక్షకుని కొరకై మూడు లోకాలు తిరిగి, తండ్రియైన ఇంద్రుడు, ఇతర దేవతలు, మహర్షులు కూడ తమకు వానిని రక్షించు శక్తి లేదని పరిత్యజించగా చివరికి వచ్చి ఆ రాముణ్ణే శరణుపొందినది. 33

మూ. స తం నిపతితం భూమౌ శరణ్యః శరణాగతమ్, 34
వధార్హమపి కాకుత్స్థః కృపయా పర్యపాలయత్.

ప్ర. అ. శరణ్యః=శరణాగతరక్షకుడైన, సః కాకుత్స్థః=ఆ రాముడు, శరణాగతమ్=శరణుజొచ్చినదీ, భూమౌ=నేలపై, నిపతితమ్=పడినదీ, అయిన, తమ్=ఆ కాకిని, వధార్హమపి=చంపదగినదేయైనను, కృపయా=జాలిచేత, పర్యపాల యత్=పరిపాలించెను.

తా. శరణాగతరక్షకుడైన ఆ రాముడు, శరణుజొొచ్చి నేలపై పడి నమస్కరించుచున్న ఆ కాకిని, అది చంపదగినదే అయినను, జాలిగొని రక్షించెను. 34

మూ. పరిద్యూనం విషణ్ణం చ స తమాయాన్తమబ్రవీత్, 35
మోఘం కర్తుం న శక్యం తు బ్రాహ్మమస్త్రం తదుచ్యతామ్.

ప్ర. అ. సః=ఆ రాముడు, పరిద్యూనమ్=అలసిపోయినది, విషణ్ణమ్=దిగులుపాటు చెందినదీ అయిన, ఆయాన్తమ్=వచ్చుచున్న, తమ్=దానిని గూర్చి, అబ్రవీత్=పలికెను. బ్రాహ్మమ్ అస్త్రమ్=బ్రహ్మాస్త్రము, మోఘమ్=వ్యర్థమైనదిగా, కర్తుమ్=చేయుటకు, న శక్యం తు=శక్యము కాదు. తత్=ఆ కారణము వలన, ఉచ్యతామ్=ఏమి చేయవలెనో చెప్పబడుగాక.

తా. అలసిపోయి దుఃఖించుచు వచ్చుచున్న ఆ కాకిని చూచి, రాముడు "బ్రహ్మాస్త్రమును వ్యర్థముచేయుట శక్యము కాదు. అందుచేత ఏమి చేయవలెనో చెప్పుము" అని పలికెను. 35

మూ. హినస్తు దక్షిణాక్షి త్వచ్ఛర ఇత్యథ సోఽబ్రవీత్. 36
తతస్తస్యాక్షి కాకస్య హినస్తి స్మ స దక్షిణమ్,
దత్త్వా స దక్షిణం నేత్రం ప్రాణేభ్యః పరిరక్షితః. 37

ప్ర. అ. అథ=అటు పిమ్మట, సః=ఆ కాకి, త్వచ్ఛరః=నీ బాణము, దక్షిణాక్షి=కుడి కన్నును, హినస్తు=హింసించుగాక, ఇతి=అని, అబ్రవీత్=పలికెను. తతః=అటుపిమ్మట, సః=ఆ దర్భ, తస్య కాకస్య=ఆ కాకియొక్క, దక్షిణమ్=కుడిదైన, అక్షి=నేత్రమును, హినస్తి స్మ=హింసించెను. సః=ఆ కాకి, దక్షిణమ్=కుడి కన్నును, దత్త్వా=ఇచ్చి, ప్రాణేభ్యః=ప్రాణముల వలన, పరిరక్షితః=రక్షింపబడినది.

తా. "నీ బాణముతో నా కుడి కన్నును హింసించుము"అని ఆ కాకి కోరగా, రాముడు ప్రయోగించిన ఆ దర్భ ఆ కాకి కుడికంటిని హింసించెను. ఈ విధముగా ఆ కాకి తన కుడికన్ను ఇచ్చివేసి ప్రాణములను రక్షించుకొనెను.

మూ. స రామాయ నమస్కృత్వా రాజ్ఞే దశరథాయ చ,
విసృష్టస్తేన వీరేణ ప్రతిపేదే స్వమాలయమ్. 38

ప్ర. అ. సః=ఆ కాకి, రామాయ=రామునకు, రాజ్ఞే=రాజైన, దశరథాయ చ=దశరథునకు, నమస్కృత్వా=నమస్కరించి, తేన=ఆ, వీరేణ=వీరుడైన రాముని చేత, విసృష్టః=విడవబడినదై, స్వమ్=తన సంబంధమైన, ఆలయమ్=నివాసమును, ప్రతిపేదే=పొందెను.

తా. ఆ కాకి రామునకూ, దశరథమహారాజునకూ నమస్కారము చేసి, రాముని అనుజ్ఞ తీసికొని తన నివాసమునకు వెళ్ళిపోయెను. 38

మూ. మత్కృతే కాకమాత్రే తు బ్రహ్మాస్త్రం సముదీరితమ్,
కస్మాద్యో మా హరత్త్వత్తః క్షమసే తం మహీపతే. 39

ప్ర. అ. మహీపతే=రాజా ! మత్కృతే=నా నిమిత్తమైన, కాకమాత్రే= కాకియందు కూడ, బ్రహ్మాస్త్రమ్=బ్రహ్మాస్త్రము, సముదీరితమ్=ప్రయోగిపబడినది. త్వత్తః=నీ నుండి, మా=నన్ను, యః=ఎవడు, అహరత్=హరించెనో, తమ్=వానిని, కస్మాత్=ఏ కారణము వలన, క్షమసే=క్షమించుచున్నావు ?

తా. మహారాజా ! నన్ను బాధించి నందుకు ఒక కాకి మీద కూడ బ్రహ్మాస్త్రమును ప్రయోగించినావు కదా ! నీ వద్దనుండి నన్నే అపహరించుకొని పోయిన వానిని ఇట్లు క్షమించి ఊరకున్నావేమి ? 39

మూ. స కురుష్వ మహోత్సాహః కృపాం మయి నరర్షభ,
త్వయా నాథవతీ నాథ హ్యనాథా ఇవ దృశ్యతే. 40

ప్ర. అ. నరర్షభ=నరశ్రేష్ఠుడా ! సః=అట్టి నీవు, మహోత్సాహః=గొప్ప ఉత్సాహము కలవాడవై, మయి=నా యందు, కృపామ్=జాలిని, కురుష్వ=చేయుము. నాథ =ఓ !నాథుడా ! త్వయా=నీచేత, నాథవతీ=నాథుడు కల స్త్రీ, అనాథా ఇవ=నాథుడు లేనిది వలె, దృశ్యతే=చూడబడుచున్నది.

తా. మనుష్యులలో శ్రేష్ఠుడవైన ఓ ! రామా ! నీవు గొప్ప ఉత్సాహముతో శత్రుసంహారము చేసి నాపై కృప చూపుము. ఓ ! నాథా! నీవు నాథుడవై ఉండగా నేను ఇపుడు అనాథురాలను వలె అయితిని. 40

మూ. ఆనృశంస్యం పరో ధర్మస్త్వత్త ఏవ మయా శ్రుతః,
జానామి త్వాం మహావీర్యం మహోత్సాహం మహాబలమ్, 41

అపారపారమక్షోభ్యం గామ్భీర్యాత్సాగరోపమమ్,
భర్తారం ససముద్రాయా ధరణ్యా వాసవోపమమ్. 42

ప్ర. అ. ఆనృశంస్యమ్=క్రూరముగా లేకపోవుట, (దయ), పరః=ఉత్తమమైన, ధర్మః=ధర్మముగా, మయా=నాచేత, త్వత్తః ఏవ=నీనుండియే, శ్రుతః=వినబడినది. త్వామ్=నిన్ను, మహావీర్యమ్=గొప్ప పరాక్రమము కలవానినిగాను, మహోత్సాహమ్= గొప్ప ఉత్సాహము కలవానినిగాను, మహాబలమ్=గొప్ప బలము కలవానినిగాను, అపారపారమ్=పొంద శక్యము కాని అంతము కలవానిని గాను (నీవెంతటి వాడవో ఊహించుటకు కూడ శక్యము కాదు అని భావము), అక్షోభ్యమ్=క్షోభింపచేయ

శక్యము కాని వానిని గాను, గామ్భీర్యాత్=గాంభీర్యమువలన, సాగరోపమమ్=సముద్రముతో సమానునిగను, ససముద్రాయాః=సముద్రముతో కూడిన, ధరణ్యాః=భూమియొక్క, భర్తారమ్=ప్రభువుగాను, వాసవోపమమ్=దేవేంద్రునితో సమానునిగాను, జానామి=ఎరుగుదును.

తా. దయ ధర్మములలో కెల్ల ఉత్తమధర్మమను విషయమును నీవే నాకు చెప్పితివి కదా ! నీవు గొప్ప వీర్యము, ఉత్సాహము, బలము కలవాడవు. నీ వెంతటివాడవో ఎవ్వరూ తెలిసికొనజాలరు. నిన్నెవ్వరూ క్షోభింపచేయుజాలరు. గాంభీర్యములో సముద్రమువంటివాడవు. సముద్రసహితమైన భూమండలమునకు అంతకూ ప్రభువు అయినవాడవు. దేవేంద్రునితో సమానుడవు. ఈ విషయములన్నీ నాకు తెలియును. 41, 42

మూ. ఏవమస్త్రవిదాం శ్రేష్ఠః సత్యవాన్ బలవానపి,
కిమర్థమస్త్రం రక్షస్సు న యోజయసి రాఘవ. 43

ప్ర. అ. రాఘవ=రామా !ఏవమ్=ఇట్లు, అస్త్రవిదామ్=అస్త్రవేత్తలలో, శ్రేష్ఠః=శ్రేష్ఠుడవు, సత్యవాన్=సత్యవంతుడవు, బలవానపి=బలవంతుడవు అయినను, రక్షస్సు=రాక్షసులమీద, అస్త్రమ్=అస్త్రమును, కిమర్థమ్=ఎందువలన, న యోజయసి=సంధించుట లేదు?

తా. రామా ! ఈ విధముగా అస్త్రవేత్తలలో శ్రేష్ఠుడవైనా, సత్యవంతుడవైనా, బలవంతుడవైనా, నీవు రాక్షసులమీద అస్త్రములను ఎందువలన ప్రయోగించుట లేదు? 43

మూ. న నాగా నాపి గన్ధర్వా నాసురా న మరుద్గణాః,
రామస్య సమరే వేగం శక్తాః ప్రతిసమీహితుమ్. 44

ప్ర. అ. సమరే=యుద్ధమునందు, రామస్య=రామునియొక్క, వేగమ్=వేగమును, ప్రతిసమీహితుమ్=ఎదుర్కొనుటకు, నాగాః=నాగులు, న శక్తాః=సమర్థులు కారు. గన్ధర్వా అపి=గంధర్వులు కూడ, న= సమర్థులు కారు. అసురాః=అసురులు, న=సమర్థులు కారు. మరుద్గణాః=దేవతల గణములు, న=సమర్థులు కారు.

తా. నాగులు కాని, గంధర్వులు కాని, అసురులు కాని, దేవతాగణములు కాని యుద్ధములో రాముని వేగమును ఎదుర్కొనుటకు సమర్థులు కారు. 44

మూ. తస్య వీర్యవతః కశ్చిద్యద్యస్తి మయి సంభ్రమః,
కిమర్థం న శరైస్తీక్ష్ణైః క్షయం నయతి రాక్షసాన్. 45

ప్ర. అ. వీర్యవతః=పరాక్రమవంతుడైన, తస్య=ఆ రామునకు, మయి=నా విషయమునందు, కశ్చిత్=ఏదైన, సంభ్రమః=తొందర, అస్తి యది=ఉన్నట్లయితే, తీక్ష్ణైః=తీక్ష్ణములైన, శరైః=బాణములతో, రాక్షసాన్=రాక్షసులను, కిమర్థమ్=ఎందువలన, క్షయమ్=వినాశనమును, న నయతి=పొందించుటలేదు.

తా. పరాక్రమశాలియైన అట్టి రామునకు నా విషయమునందు ఏ మాత్రమైన తొందర ఉన్నచో, ఆతడు తీక్ష్ణములైన శరములతో ఈ రాక్షసులను నశింపచేయుటలేదేమి? 45

మూ. భ్రాతురాదేశమాదాయ లక్ష్మణో వా పరంతపః,
కస్య హేతోర్న మాం వీరః పరిత్రాతి మహాబలః. 46

ప్ర. అ. పరంతపః=శత్రువులను పీడించువాడూ, మహాబలః=గొప్ప బలము కలవాడు, వీరః=వీరుడు అయిన, లక్ష్మణో వా=లక్ష్మణుడైనను, భ్రాతుః=సోదరునియొక్క, ఆదేశమ్=ఆజ్ఞను, ఆదాయ=గ్రహించి, కస్య హేతోః=ఏ కారణమువలన, మామ్=నన్ను, న పరిత్రాతి=రక్షించుట లేదు?

తా. శత్రువులను పీడించువాడు, మహావీరుడు, మహాబలుడు అయిన లక్ష్మణుడైనా, అన్నగారి ఆజ్ఞచేత నన్ను, ఎందువలన రక్షించుటలేదు? 46

మూ. యది తౌ పురుషవ్యాఘ్రౌ వాయ్వగ్నిసమతేజసౌ,
సురాణామపి దుర్ధర్షౌ కిమర్థం మాముపేక్షతః. 47

ప్ర. అ. వాయ్వగ్నిసమతేజసౌ=వాయువుతోను, అగ్నితోను సమానమైన తేజస్సు గల, పురుషవ్యాఘ్రౌ=పురుషశ్రేష్ఠులైన, తౌ=ఆ రామలక్ష్మణులు, సురాణామ్=దేవతలకు కూడ, దుర్ధర్షౌ యది అపి=ఎదిరింపశక్యము కానివారై ఉండి కూడ, మామ్=నన్ను, కిమర్థమ్=ఎందుకొరకు, ఉపేక్షతః=ఉపేక్షించుచున్నారో కదా !

తా. వాయ్వగ్నులతో సమానమైన తేజస్సు గల పురుషశ్రేష్ఠులైన ఆ రామలక్ష్మణులను దేవతలు కూడ ఎదిరింపజాలరు. అట్టివారై ఉండి కూడ వారు నన్ను ఎందువలన ఉపేక్షించుచున్నారు? 47

మూ. మమైవ దుష్కృతం కించిన్మహదస్తి న సంశయః,
సమర్థావపి తౌ యన్మాం నావేక్షేతే పరంతపౌ. 48

ప్ర. అ. మమైవ=నాయొక్కయే, మహత్=గొప్పదైన, కించిత్=ఏదో, దుష్కృతమ్=పాపము, అస్తి=ఉన్నది. సంశయః=సంశయము, న=లేదు. యత్=ఏ

కారణము వలన, సమర్థావపి=సమర్థులే అయినను, పరంతపౌ=శత్రువులను పీడించు, తౌ=ఆ రామలక్ష్మణులు, మామ్=నన్ను, న అవేక్షేతే=చూచుటలేదు.

తా. నేనే ఏదో గొప్ప పాపము చేసిఉన్నాను. సందేహము లేదు. అందుచేతనే, సమర్థులై యుండి కూడ, శత్రుపీడకులైన ఆ రామలక్ష్మణులు నన్ను ఉపేక్షించుచున్నారు. 48

మూ. వైదేహ్యా వచనం శ్రుత్వా కరుణం సాశ్రుభాషితమ్,
అథాబ్రవీన్మహాతేజా హనుమాన్ మారుతాత్మజః. 49

ప్ర. అ. అథ=అటు పిమ్మట, మహాతేజాః=గొప్ప తేజస్సు గల, మారుతాత్మజః=వాయుపుత్రుడైన, హనుమాన్=హనుమంతుడు, వైదేహ్యా=సీత చేత, సాశ్రు=కన్నీళ్లతో కూడుకొన్నట్లు, కరుణమ్=జాలి గొలుపునట్లూ, భాషితమ్=పలకబడిన, వచనమ్=వచనమును, శ్రుత్వా=విని, అబ్రవీత్=పలికెను.

తా. సీత కన్నీళ్లు కార్చుచు దీనముగా పలికిన మాటలు విని మహాతేజః శాలి, వాయునందనుడు అయిన హనుమంతుడు ఇట్లు పలికెను. 49

మూ. త్వచ్ఛోకవిముఖో రామో దేవి సత్యేన తే శపే,
రామే దుఃఖాభిపన్నే చ లక్ష్మణః పరితప్యతే. 50

ప్ర. అ. దేవి=ఓ !సీతాదేవీ ! రామః=రాముడు, త్వచ్ఛోకవిముఖః=నిన్ను గూర్చిన శోకముచేత భోగాదులందు ఆసక్తి లేనివాడై ఉన్నాడు. సత్యేన=సత్యముచేత, తే=నీకు, శపే=ఒట్టు పెట్టి చెప్పుచున్నాను. రామే=రాముడు, దుఃఖాభిపన్నే= దుఃఖముచేత ఆక్రమింపబడినవాడగుచుండగా, లక్ష్మణః చ=లక్ష్మణుడు కూడ, పరితప్యతే=దుఃఖించుచున్నాడు.

తా. ఓ ! సీతాదేవీ ! నీ వియోగమువలన కలిగిన దుఃఖముచేత రాముడు భోగాదులందు ఆసక్తి లేకుండా ఉన్నాడు. సత్యము మీద ఒట్టు పెట్టి చెప్పుచున్నాను. రాముడు దుఃఖాక్రాంతుడైనపుడల్లా లక్ష్మణుడు కూడ దుఃఖించుచున్నాడు. 50

మూ. కథం చిద్భవతీ దృష్టా న కాలః పరిదేవితుమ్.
ఇమం ముహూర్తం దుఃఖానాం ద్రక్ష్యస్యన్తమనిన్దితే. 51

ప్ర. అ. కథం చిత్=ఎటులనో, భవతీ=నీవు, దృష్టా=చూడబడినావు. పరిదేవితుమ్=విలపించుటకు, కాలః=కాలము, న=కాదు. అనిన్దితే=నిందింపబడనిదానా ! ఇమమ్=ఈ, ముహూర్తమ్=ముహూర్తమునందే, దుఃఖానామ్=దుఃఖములయొక్క, అన్తమ్=అంతమును, ద్రక్ష్యసి=చూడగలవు.

తా. ఓ ! దోషములు లేని సీతాదేవీ ! అదృష్టవశముచేత నీవు కనబడితివి. ఇక ఇది విలపించుటకు సమయము కాదు. స్వల్పకాలములోనే దుఃఖముల అంతము చూడగలవు. 51

మూ. తావుభౌ పురుషవ్యాఘ్రౌ రాజపుత్రౌ మహాబలౌ,
త్వద్దర్శనకృతోత్సాహౌ లఙ్కాం భస్మీకరిష్యతః. 52

ప్ర. అ. పురుషవ్యాఘ్రౌ=పురుషశ్రేష్ఠులు, మహాబలౌ=గొప్పబలము కలవారు, త్వద్దర్శన కృతోత్సాహౌ=నీ దర్శనమునందు చేయబడిన ఉత్సాహము కలవారు అయిన, ఉభౌ=ఇద్దరైన, తౌ రాజపుత్రౌ=ఆ రాజకుమారులు, లఙ్కామ్=లంకను, భస్మీకరిష్యతః=భస్మము , చేయగలరు.

తా. పురుషులలో శ్రేష్ఠులు, మహాబలశాలులు అయిన ఆ రాజపుత్రులిద్దరూ నిన్ను చూడవలెనని ఉత్సాహముతో ఉన్నారు. వారు లంకను భస్మము చేసి వేయగలరు. 52

మూ. హత్వా చ సమరే క్రూరం రావణం సహబాన్ధవమ్,
రాఘవస్త్వాం విశాలాక్షి నేష్యతి స్వాం పురీం ప్రతి. 53

ప్ర. అ. విశాలాక్షి=విశాలములైన నేత్రములు గల ఓ ! సీతాదేవీ ! రాఘవః=రాముడు, సమరే=యుద్ధమునందు, సహబాన్ధవమ్=బంధువులతో కూడిన, క్రూరమ్=క్రూరుడైన, రావణమ్=రావణుని, హత్వా=చంపి, స్వాం పురీం ప్రతి=తన పట్టణమును గూర్చి, త్వామ్=నిన్ను, నేష్యతి=తీసికొని వెళ్ళగలడు.

తా. ఓ !విశాలాక్షీ ! రాముడు క్రూరుడైన రావణుని, అతని బంధువులను, రణరంగములో సంహరించి, నిన్ను తన పట్టణమునకు తీసికొని వెళ్లగలడు. 53

మూ. బ్రూహి యద్రాఘవో వాచ్యో లక్ష్మణశ్చ మహాబలః,
సుగ్రీవో వాపి తేజస్వీ హరయోఽపి సమాగతాః. 54

ప్ర. అ. రాఘవః=రాముడు, యత్=ఏది, వాచ్యః=చెప్పదగినవాడో, మహాబలః=గొప్ప బలము గల, లక్ష్మణశ్చ=లక్ష్మణుడు గాని, తేజస్వీ=తేజస్సు గల, సుగ్రీవో వాపి=సుగ్రీవుడు గాని, సమాగతాః=కలిసి ఉన్న, హరయోఽపి=వానరులు గాని, ఏది చెప్పదగినవారో అది, బ్రూహి=చెప్పుము.

తా. రామునకు గాని, మహాబలశాలియైన లక్ష్మణునకు గాని, తేజశ్శాలియైన సుగ్రీవునకు గాని, కలిసి ఉన్న ఇతర వానరులకు గాని ఏమి చెప్పవలెనో చెప్పుము. 54

మూ. ఇత్యుక్తవతి తస్మింస్తు సీతా సురసుతోపమా,
ఉవాచ శోకసంతప్తా హనుమన్తం ప్లవంగమమ్. 55

ప్ర. అ. తస్మిన్=ఆ హనుమంతుడు, ఇతి=ఇట్లు, ఉక్తవతి=పలికిన వాడగుచుండగా, సురసుతోపమా=దేవకన్యతో సమానురాలైన, సీతా=సీత, శోకసన్తప్తా=దుఃఖముచేత పీడింపబడినదై, ప్లవంగమమ్=వానరుడైన, హనుమన్తమ్=హనుమంతుని గూర్చి, ఉవాచ=పలికెను.

తా. హనుమంతుని మాటలు విని, దేవకన్యతో సమానురాలైన సీత, శోకపీడితయై ఆ హనుమంతునితో ఇట్లనెను. 55

మూ. కౌసల్యా లోకభర్తారం సుషువే యం మనస్వినీ,
తం మమార్థే సుఖం పృచ్ఛ శిరసా చాభివాదయ. 56

ప్ర. అ. లోకభర్తారమ్=లోకములకు ప్రభువైన, యమ్=ఏ రాముని, మనస్వినీ=ఉత్తమమైన మనస్సు గల, కౌసల్యా=కౌసల్య, సుషువే=కనెనో, తమ్=అట్టి రాముని, మదర్థే=నా కొరకై (నా పక్షమున), సుఖమ్=సుఖమును, పృచ్ఛ=అడుగుము. శిరసా=శిరస్సుతో, అభివాదయ చ=నమస్కరించుము.

తా. ఉత్తమైన మనస్సు గల కౌసల్య లోకములకు ప్రభువైన ఏ రాముని కనెనో అట్టి రామునకు నా పక్షమున శిరస్సు వంచి నమస్కారము చేసి సుఖమును అడుగుము. 56

మూ. స్రజశ్చ సర్వరత్నాని ప్రియా యాశ్చ వరాఙ్గనాః,
ఐశ్వర్యం చ విశాలాయాం పృథివ్యామపి దుర్లభమ్. 57
పితరం మాతరం చైవ సంమాన్యాభిప్రసాద్య చ,
అనుప్రవ్రజితో రామం సుమిత్రా యేన సుప్రజాః. 58

ప్ర. అ. యేన=ఎవ్వనిచేత, సుమిత్రా=సుమిత్ర, సుప్రజాః=మంచి సంతానము గలదో, అట్టి లక్ష్మణుడు, స్రజశ్చ=మాలికలను, సర్వరత్నాని=సమస్తమైన శ్రేష్ఠవస్తువులను, ప్రియాః=ఇష్టమైన, యాః=ఏ, వరాఙ్గనాః=శ్రేష్ఠమైన స్త్రీలు ఉన్నారో వారిని, విశాలాయామ్=విశాలమైన, పృథివ్యామ్=భూమియందు, దుర్లభమ్=పొందుటకు కష్టమైన, ఐశ్వర్యం చాపి=ఐశ్వర్యమును, (త్యక్త్వా=విడచి), పితరమ్=తండ్రిని, మాతరం చాపి=తల్లినీ, సంమాన్య=గౌరవించి, అభిప్రసాద్య చ=అనుగ్రహింపచేసికొని, రామమ్=రాముణ్ణి, అనుప్రవ్రజితః=అనుసరించి ప్రవాసమునకు వెళ్ళినాడు.

తా. సుమిత్ర సుపుత్రుడైన లక్ష్మణుడు, మాలికలను, ఉత్తమములైన భోగ్యవస్తువులను, ప్రియులైన ఉత్తమస్త్రీలను, విశాలమైన భూమండలము నందు అనాయాసముగా లభించని ఐశ్వర్యమును విడచి, తల్లిదండ్రులకు నమస్కరించి వారిని అనుమతింపచేసికొని, రామునితో కలసి ప్రవాసమునకు వెళ్ళినాడు. 57, 58

మూ. ఆనుకూల్యేన ధర్మాత్మా త్యక్త్వా సుఖమనుత్తమమ్,
అనుగచ్ఛతి కాకుత్థ్సం భ్రాతరం పాలయన్వనే. 59

ప్ర. అ. ధర్మాత్మా=ధర్మాత్ముడైన లక్ష్మణుడు, అనుత్తమమ్=చాల గొప్పదైన, సుఖమ్=సుఖమును, త్యక్త్వా=విడచి, భ్రాతరమ్=సోదరుడైన, కాకుత్థ్సమ్=రాముణ్ణి, వనే=వనమునందు, ఆనుకూల్యేన=అనుకూలముగా నుండుటచే, పాలయన్=పాలించుచు, అనుగచ్ఛతి=అనుసరించి వెళ్ళెను.

తా. ధర్మాత్ముడైన లక్ష్మణుడు అత్యుత్తమమైన సుఖమును పరిత్యజించి, సోదరుడైన రామునకు అనుకూలముగా ఉంటూ, అరణ్యములో ఆతని సంరక్షణము చేయుచు ఆతనిని అనుసరించి వెళ్ళినాడు. 59

మూ. సింహస్కన్ధో మహాబాహుర్మనస్వీ ప్రియదర్శనః,
పితృవద్వర్తతే రామే మాతృవన్మాం సమాచరన్. 60

ప్ర. అ. సింహస్కన్ధః=సింహము వంటి మూపు గలవాడు, మహాబాహుః=గొప్ప బాహువులు గలవాడు, మనస్వీ=ఉత్తమమైన మనస్సు కలవాడు, ప్రియదర్శనః=ప్రియమైన దర్శనము కలవాడు అయిన లక్ష్మణుడు, మామ్=నన్ను, మాతృవత్=తల్లిని వలె, సమాచరన్=చూచుచు, రామే=రామునియందు, పితృవత్=తండ్రియందు వలె, వర్తతే=ప్రవర్తించుచున్నాడు.

తా. సింహము వంటి మూపు, పెద్ద బాహువులు, ఉత్తమమైన మనస్సూ కలవాడు, చూచువారికి ఆనందము కలిగించువాడు అయిన లక్ష్మణుడు నన్ను తల్లి వలె చూచుకొనుచు, రాముని విషయమున తండ్రి విషయమునందు వలె ప్రవర్తించును. 60

మూ. హ్రియమాణాం తదా వీరో న తు మాం వేద లక్ష్మణః,
వృద్ధోపసేవీ లక్ష్మీవాన్ శక్తో న బహుభాషితా. 61
రాజపుత్రః ప్రియః శ్రేష్ఠః సదృశః శ్వశురస్య మే.

ప్ర. అ. వీరః=వీరుడైన, లక్ష్మణః=లక్ష్మణుడు, తదా=అప్పుడు, మామ్=నన్ను, హ్రియమాణామ్=హరింపబడుచున్న దానినిగా, న వేద=ఎరుగడు.

వృద్ధోప సేవీ=వృద్ధులను సేవించువాడు, లక్ష్మీవాన్=లక్ష్మీవంతుడు, శక్తః=సమర్థుడు, న బహుభాషితా=ఎక్కువగా మాటలాడనివాడు, మే=నాయొక్క, శ్వశురస్య=మామగారైన దశరథునకు, సదృశః=సమానుడైన, (తగిన), ప్రియః=ప్రియుడు, శ్రేష్ఠః=శ్రేష్ఠుడు అయిన, రాజపుత్రః=రాజకుమారుడు.

తా. వీరుడైన లక్ష్మణునకు ఆనాడు నన్ను రావణుడు హరించుచున్నట్లు తెలియదు. అతడు పెద్దలను సేవించువాడు. శోభ కలవాడు. సమర్థుడైనను అధికముగా మాటలాడడు. నా మామగారైన దశరథునకు తగిన, ఇష్టుడు, శ్రేష్ఠుడు అయిన రాజకుమారుడు. 61

మూ. మత్తః ప్రియతరో నిత్యం భ్రాతా రామస్య లక్ష్మణః, 62
నియుక్తో ధురి యస్యాం తు తాముద్వహతి వీర్యవాన్.

ప్ర. అ. రామస్య=రామునియొక్క, భ్రాతా=సోదరుడైన, లక్ష్మణః=లక్ష్మణుడు, నిత్యమ్=ఎల్లప్పుడూ, మమ=నాకు, ప్రియతరః=చాల ఇష్టమైనవాడు. వీర్యవాన్=పరాక్రమవంతుడైన ఆ లక్ష్మణుడు, యస్యామ్=ఏ, ధురి=కార్యభారమునందు, నియుక్తః=నియమించబడుతాడో, తామ్=దానిని, ఉద్వహతి=చక్కగా భరించును.

తా. రాముని సోదరుడైన లక్ష్మణుడు నిత్యము నాకు చాల ఇష్టుడు. పరాక్రమశాలియైన ఆతనికి ఏ కార్యభారమును అప్పచెప్పినను దానిని ఆతడు చక్కగా పూర్తిచేయును. 62

మూ. యం దృష్ట్వా రాఘవో నైవ వృత్తమార్యమనుస్మరేత్, 63
స మమార్థాయ కుశలం వక్తవ్యో వచనాన్మమ.

ప్ర. అ. యమ్=ఎవనిని, దృష్ట్వా=చూచి, రాఘవః=రాముడు, వృత్తమ్=మరణించిన, ఆర్యమ్=తండ్రిని, న అనుస్మరేత్=స్మరించడో, సః=అట్టి లక్ష్మణుడు, మమ=నాయొక్క, అర్థాయ=ప్రయోజనము కొరకై, మమ=నాయొక్క, వచనాత్=వచనమువలన, కుశలమ్=క్షేమమును, వక్తవ్యః=చెప్పదగినవాడు.

తా. ఏ లక్ష్మణుని చూచుకొనుచు రాముడు స్వర్గస్థుడైన తన తండ్రిగారిని గూర్చి బెంగబెట్టుకొనుటలేదో అట్టి లక్ష్మణునితో నా కొరకై, నా మాటగా కుశలవార్తను చెప్పుము. (నేనాతని క్షేమము అడిగినానని చెప్పుము).63

మూ. మృదుర్నిత్యం శుచిర్దక్షః ప్రియో రామస్య లక్ష్మణః, 64
యథా హి వానరశ్రేష్ఠ దుఃఖక్షయకరో భవేత్,
త్వమస్మిన్ కార్యనిర్యోగే ప్రమాణం హరిసత్తమ. 65

ప్ర. అ. వానరశ్రేష్ఠ=వానరులలో శ్రేష్ఠుడా ! హరిసత్తమ=వానరులలో మంచివాడా ! మృదుః=మృదువైనవాడూ, నిత్యమ్=ఎల్లప్పుడు, శుచిః=పరిశుద్ధుడూ, దక్షః=సమర్థుడూ, రామస్య=రామునకు, ప్రియః=ఇష్టుడూ అయిన, లక్ష్మణః=లక్ష్మణుడు, యథా=ఎట్లు, దుఃఖక్షయకరః=దుఃఖక్షయము చేయువాడు, భవేత్=అగునో ఆ విధముగా, అస్మిన్=ఈ, కార్యనిర్యోగే=కార్యసాధనమునందు, త్వమ్=నీవు, ప్రమాణమ్=ప్రమాణమైన వాడవు.

తా. వానరశ్రేష్ఠుడవైన ఓ ! హనుమంతుడా ! మృదువైన స్వభావము కలవాడూ, ఎల్లప్పుడు పరిశుద్ధుడు, సమర్థుడు, రామునకు చాల ఇష్టుడు అయిన లక్ష్మణుడు నా దుఃఖములను నశింపచేయునట్లు ఈ కార్యమును సాధించుట అనేది నీ మీదనే ఆధారపడియున్నది. 64, 65

మూ. రాఘవస్త్వత్సమారమ్భాన్మయి యత్నపరో భవేత్,
ఇదం బ్రూయాశ్చ మే నాథం శూరం రామం పునః పునః. 66

ప్ర. అ. రాఘవః=రాముడు, త్వత్సమారమ్భాత్=నీయొక్క ప్రయత్నము వలన, మయి=నా విషయమై, యత్నపరః=ప్రయత్నపరుడు, భవేత్=అగును. మే=నాయొక్క, నాథమ్=నాథుడు, శూరమ్=శూరుడూ అయిన, రామమ్=రాముని గూర్చి, పునః పునః=మాటి మాటికి, ఇదమ్=ఈ వాక్యమును, బ్రూయాః=చెప్పుము.

తా. నీవు చేసే ప్రయత్నమును బట్టి రాముడు, నా విషయమున ప్రయత్నము చేయును. నా నాథుడు, శూరుడు అయిన రామునితో ఈ మాట మాటిమాటికి చెప్పుము. 66

మూ. జీవితం ధారయిష్యామి మాసం దశరథాత్మజ,
ఊర్ధ్వం మాసాన్న జీవేయం సత్యేనాహం బ్రవీమి తే. 67

ప్ర. అ. దశరథాత్మజ=రామా ! మాసమ్=ఒక మాసమును మాత్రమే, జీవితమ్=జీవితమును, ధారయిష్యామి=ధరించగలను. మాసాత్=మాసముకంటె, ఊర్ధ్వమ్=పైన, న జీవేయమ్=జీవించను. అహమ్=నేను, సత్యేన=సత్యముతో, తే=నీకు, బ్రవీమి=చెప్పుచున్నాను.

తా. "రామా ! నేను ఒక్క మాసము మాత్రమే జీవించెదను. మాసము దాటి జీవించను. సత్యము చెప్పుచున్నాను". 67

మూ. రావణేనోపరుద్ధాం మాం నికృత్యా పాపకర్మణా,
త్రాతుమర్హసి వీర త్వం పాతాలాదివ కౌశికీమ్. 68

ప్ర. అ. వీర=ఓ !వీరుడా !పాపకర్మణా=పాపమైన కర్మ గల, రావణేన=రావణునిచేత, నికృత్యా=అవమానముచేత, ఉపరుద్ధామ్=బంధింపబడిన, మామ్=నన్ను, త్వమ్=నీవు, పాతాలాత్=పాతాలమునుండి, కౌశికీమివ=దేవేంద్రుని లక్ష్మిని వలె, త్రాతుమ్=రక్షించుటకు, అర్హసి=తగియున్నావు.

తా. "వీరుడా ! పాపాత్ముడైన రావణునిచే అవమానపూర్వకముగా బంధింపబడి ఉన్న నన్ను, పాతాలమునుండి ఇంద్రుని లక్ష్మిని రక్షించినట్లు నీవు రక్షించవలెను". 68

మూ. తతో వస్త్రగతం ముక్త్వా దివ్యం చూడామణిం శుభమ్,
ప్రదేయో రాఘవాయేతి సీతా హనుమతే దదౌ. 69

ప్ర. అ. తతః=అటుపిమ్మట, సీతా=సీత, వస్త్రగతమ్=వస్త్రములో ఉన్న, శుభమ్=మంగళకరమైన, దివ్యమ్=శ్రేష్ఠమైన, చూడామణిమ్=చూడామణిని, (శిరస్సుపై అలంకారముగా ధరించు మణిని), ముక్త్వా=ముడి విప్పి, రాఘవాయ=రామునకు, ప్రదేయః=ఇవ్వదగినది, ఇతి=అని చెప్పి, హనుమతే=హనుమంతునకు, దదౌ=ఇచ్చెను.

తా. పిమ్మట సీత కొంగులో ముడిపెట్టి ఉన్న చూడామణిని, ముడి విప్పితీసి, "దీనిని రామునకు ఇమ్ము" అని చెప్పుచు హనుమంతునకు ఇచ్చెను.69

మూ. ప్రతిగృహ్య తతో వీరో మణిరత్నమనుత్తమమ్,
అఙ్గుల్యా యోజయామాస న హ్యస్య ప్రాభవద్భుజః. 70

ప్ర. అ. తతః=అటుపిమ్మట, వీరః=వీరుడైన హనుమంతుడు, అనుత్తమమ్=చాల ఉత్తమమైన, మణిరత్నమ్=శ్రేష్ఠమైన మణిని, ప్రతిగృహ్య=స్వీకరించి, అఙ్గుల్యా=వ్రేలితో, యోజయామాస=కూర్చెను. అస్య=ఈతని యొక్క, భుజః=భుజము, న ప్రాభవత్ హి=సరిపోలేదు కదా.

తా. హనుమంతుడా శ్రేష్ఠమైన చూడామణిని గ్రహించి, అది భుజానికి పెట్టుకొనుటకు సరిపోవకపోవుటచేత వ్రేలికి తొడుగుకొనెను.

వి. ఇక్కడ ఈ శ్లోకం భావం సరిగా కుదురుటలేదు. 'చూడామణి' అనే పేరునుపట్టి అది శిరస్సుపై ధరించు మణి అని తెలియుచున్నది. అది అట్టిదే అని రాముని మాటలను పట్టి స్పష్టమగును. ఈ శ్లోకాన్ని పట్టి చూడగా అదేదో భుజానికి పెట్టుకొనే దండకడియంవంటి దన్నట్లూ సీతనుండి దానిని తీసికొని హనుమంతుడు మొదట తన భుజానికి పెట్టుకోవడానికి ప్రయత్నించి, అది చాలక పోవుటచేత ఉంగరం వలె వ్రేలికి పెట్టుకున్నట్లు కనబడుతున్నది.

ఇది అసంగతము. సీత అలంకారాన్ని హనుమంతుడు, భక్తిపూర్వకముగా, మరొక విధముగా, జాగర్తచేసి తన దగ్గర ఉంచుకొనవలెను కాని ఆమె ధరించునట్లు తాను కూడా ధరించుట, లేదా ధరింప యత్నించుట మహాపచారమగును. అందుచేత ఈ శ్లోకం అసంగతము. ప్రాచ్యపాఠము బాగున్నది-

"సా నిరీక్ష్య తతః సర్వం వేణ్యాం గ్రథితముత్తమమ్,
విముచ్య ప్రదదౌ తస్మై మణిరత్నం హనూమతే.
దేయోఽయం రాఘవాయేతి సీతా సురసుతోపమా"

ఏదైనా ఆనవాలు ఇమ్ము అని హనుమంతుడు ప్రార్థింపగా సీత అటు ఇటు చూచి పరిశీలించి, తన వేణిలో ఉన్న మణిశ్రేష్ఠమును తీసి "ఇది రామునకిమ్ము"అని హనుమంతున కిచ్చెను అని దీని భావము. దీని తరువాత (దాక్షిణాత్య ప్రతిలో 72 వ శ్లోకంగా ఉన్న) "మణిరత్నం కపివరః........పార్శ్వతః స్థితః"అను శ్లోకమున్నది. ఈ ("ప్రతిగృహ్య" ఇత్యాది) శ్లోకము లేదు. 70

మూ. మణిరత్నం కపివరః ప్రతిగృహ్యాభివాద్య చ,
సీతాం ప్రదక్షిణం కృత్వా ప్రణతః పార్శ్వతః స్థితః. 71

ప్ర. అ. కపివరః=వానరశ్రేష్ఠుడు, మణిరత్నమ్=ఆ శ్రేష్ఠమైన మని, ప్రతిగృహ్య=స్వీకరించి, సీతామ్=సీతను, అభివాద్య చ=నమస్కరించి, ప్రదక్షిణం కృత్వా=ప్రదక్షిణము చేసి, ప్రణతః=నమ్రుడై, పార్శ్వతః=ప్రక్కన, స్థితః=ఉండెను.

తా. హనుమంతుడు ఆ మణిశ్రేష్ఠమును గ్రహించి, సీతకు నమస్కరించి ప్రదక్షిణపూర్వకముగా ఆమె ప్రక్కకు వెళ్ళి నిలచెను. 71

మూ. హర్షేణ మహతా యుక్తః సీతాదర్శనజేన సః,
హృదయేన గతో రామం శరీరేణ తు విష్ఠితః. 72

ప్ర. అ. సః=ఆ హనుమంతుడు, సీతాదర్శనజేన=సీతయొక్క దర్శనము వలన కలిగిన, మహతా=గొప్ప, హర్షేణ=సంతోషముతో, యుక్తః=కూడినవాడై, హృదయేన=హృదయముతో, రామమ్=రాముని గూర్చి, గతః=వెళ్ళినాడు. శరీరేణ తు=శరీరముతో మాత్రము, విష్ఠితః=అక్కడ నిలచి ఉండెను.

తా. హనుమంతుడు సీత దర్శనము లభించినందుకు (సీత కనబడినందుకు) చాల సంతోషించుచు, మనస్సుతో రామునివద్దకు వెళ్ళిపోయెను. ఆతని శరీరము మాత్రమే అక్కడ ఉండెను. 72

మూ. మణివరముపగృహ్య తం మహార్హం
జనకనృపాత్మజయా ధృతం ప్రభావాత్,

గిరిరివ పవనావధూతముక్తః
సుఖితమనాః ప్రతిసంక్రమం ప్రపేదే. 73

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే సున్దరకాణ్డే
అష్టత్రింశః సర్గః.

ప్ర. అ. మహార్హమ్=చాలా శ్రేష్ఠమైనదీ, జనకనృపాత్మజయా=సీత చేత, ధృతమ్=ధరింపబడినదీ అయిన, తం మణివరమ్=ఆ శ్రేష్ఠమైన మణిని, ఉపగృహ్య=గ్రహించి, (ఆ హనుమంతుడు), ప్రభావాత్=దానియొక్క ప్రభావమువలన, పవనావధూతముక్తః=వాయువుచేత కదల్పబడి విడువబడిన, గిరిరివ=పర్వతము వలె, సుఖితమనాః=సుఖములో కూడిన మనస్సు కలవాడై, ప్రతిసంక్రమమ్=తిరిగి సముద్రమును దాటుటను, ప్రపేదే=పొందెను. (ఆలోచించెను).

తా. సీతాదేవి ధరించిన ఆ శ్రేష్ఠమైన మణిని తీసికొనగానే, దాని ప్రభావము చేత, హనుమంతుడు, గాలికి కదల్పబడి విడువబడిన పర్వతము వలె, సుఖించినవాడై (స్వస్థచిత్తుడై) తిరిగి వెళ్లుటకు ఆలోచించెను.

వి. ఇక్కడ గాలికి కదలి మరల నిలచిన పర్వతమును ఉపమానముగా చెప్పుట అంతగా స్వాభావికముగా లేదు. గాలికి పర్వతాలు కదలవు కదా? ఇంక అభూతోపమ అని చెప్పాలి. ఇక్కడ ప్రాచ్యపాఠములో చూడామణి ప్రభావము సూచితమగుచున్నది. ఆ పాఠమిది :-

"మణివరముపగృహ్య తం మహార్హం
జనకనృపాత్మజా (జయా) ధృతం పురస్తాత్,
ద్రుమ ఇవ పవనావధూతమూర్తిః
క్షుభితతనుర్హనుమాన్ కృతస్తదానీమ్."

"అంతవరకు సీత ధరించిన ఆ చూడామణిని గ్రహించగానే దాని ప్రభావముచేత హనుమంతుని శరీరము గాలిచే కదల్చివేయబడిన చెట్టువలె గజగజలాడిపోయెను" అని దీని భావము. చూడామణిద్వారా ఆ జగజ్జనని శక్తి సంక్రమించగానే హనుమంతుని శరీరము అట్లగుట స్వాభావికము. ఈ శక్తి సంక్రమముచేతనే ఆతడు తిరిగి వెళ్ళేలోగా అంత మహాపరాక్రమము చూపగలిగినాడు. 73

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు
సుందరకాండలో ముప్పదియెనిమిదవ సర్గ సమాప్తము.

అథ ఏకోనచత్వారింశః సర్గః

[చూడామణిని తీసుకొని తిరుగు ప్రయాణము చేయుటకు సిద్ధమగుచున్న హనుమంతునితో సీత శ్రీరామాదులను ప్రోత్సహించవలెనని చెప్పుచు, వారందరు సముద్రమును ఎట్లు లంఘించగలరో అను సంశయమును వ్యక్తము చేయగా హనుమంతుడు వానరుల పరాక్రమమును వర్ణించి చెప్పి ఆమెను ఊరడించుట.]

మూ. మణిం దత్త్వా తతః సీతా హనూమన్తమథాబ్రవీత్,
అభిజ్ఞానమభిజ్ఞాతమేతద్రామస్య తత్త్వతః. 1

ప్ర. అ. తతః=అటుపిమ్మట, సీతా=సీత, మణిమ్=మణిని, దత్త్వా=ఇచ్చి, అథ=పిదప, హనూమన్తమ్=హనుమంతుని గూర్చి, అబ్రవీత్=పలికెను. ఏతత్=ఈ, అభిజ్ఞానమ్=గుర్తు, రామస్య=రామునకు, తత్త్వతః=యథార్థముగా, అభిజ్ఞాతమ్=తెలిసినది.

తా. సీత హనుమంతునకు చూడామణిని ఇచ్చిన పిమ్మట ఆతనితో ఇట్లు చెప్పెను-"ఈ అభిజ్ఞానము (ఆనవాలుగా ఇచ్చిన వస్తువు)ను గూర్చి రామునకు పూర్తిగా తెలియును. 1

మూ. మణిం తు దృష్ట్వా రామో వై త్రయాణాం సంస్మరిష్యతి,
వీరో జనన్యా మమ చ రాజ్ఞో దశరథస్య చ. 2

ప్ర. అ. మణిమ్=మణిని, దృష్ట్వా=చూచి, రామః=రాముడు, త్రయాణామ్=ముగ్గురికి (ని), జనన్యాః=నాతల్లికి (ని), మమ చ=నన్నూ, రాజ్ఞః=రాజైన, దశరథస్య చ=దశరథుని, సంస్మరిష్యతి=స్మరించగలడు.

తా. ఈ చూడామణి చూడగానే రాముడు, నా తల్లినీ, నన్నూ, దశరథ మహారాజునూ, ఈ ముగ్గురినీ స్మరించగలడు. 2

మూ. స భూయస్త్వం సముత్సాహచోదితో హరిసత్తమ,
అస్మిన్ కార్యసమారమ్భే ప్రచిన్తయ యదుత్తరమ్. 3

ప్ర. అ. హరిసత్తమ=వానరశ్రేష్ఠా !సః త్వమ్=అట్టి నీవు, భూయః=మరల, సముత్సాహచోదితః=ఉత్సాహముచేత ప్రేరితుడవై, అస్మిన్=ఈ, కార్యసమారమ్భే=

కార్యప్రారంభమునందు, యత్=ఏది, ఉత్తరమ్= తరవాత చేయదగినదో, ప్రచిన్తయ=ఆలోచించుము.

తా. ఓ! వానరశ్రేష్ఠుడా ! నీవు మరల ఉత్సాహముచేత ప్రేరేపింపబడిన వాడవై, ఈ కార్యమువిషయమున, మున్ముందు ఏమి చేయవలెనో ఆలోచించుము.

మూ. త్వమస్మిన్ కార్యనిర్యోగే ప్రమాణం హరిసత్తమ,
హనుమన్ యత్నమాస్థాయ దుఃఖక్షయకరో భవ. 4
తస్య చిన్తయతో యత్నో దుఃఖక్షయకరో భవేత్.

ప్ర. అ. హరిసత్తమ=వానరశ్రేష్ఠుడా ! అస్మిన్=ఈ, కార్యనిర్యోగే=కార్యమును సమకూర్చుటయందు, త్వమ్=నీవే, ప్రమాణమ్=ప్రమాణము. హనుమన్=హనుమంతుడా ! యత్నమ్=ప్రయత్నమును, ఆస్థాయ=అవలంబించి, దుఃఖక్షయకరః=దుఃఖముయొక్క నాశనమును చేయువాడవు, భవ=అగుము. తస్య=అట్టినీవు, చిన్తయతః=ఆలోచించినచో, యత్నః=ప్రయత్నము, దుఃఖక్షయకరః=దుఃఖమును నశింపచేయునది, భవేత్=అగును.

తా. ఓ! వానరశ్రేష్ఠుడా ! ఈ కార్యమును సంధించుటలో నీవే సరియైన నిర్ణయము తీసికొనవలెను. హనుమంతుడా !ప్రయత్నము చేసి నా దుఃఖమును నశింపచేయుము. నీవు బాగుగా ఆలోచించి ప్రయత్నించినచో దుఃఖములు నశించును. 4

మూ. స తథేతి ప్రతిజ్ఞాయ మారుతిర్భీమవిక్రమః, 5
శిరసా వన్ద్య వైదేహీం గమనాయోపచక్రమే.

ప్ర. అ. భీమవిక్రమః=భయంకరమైన పరాక్రమము గల, సః మారుతిః=ఆ హనుమంతుడు, తథేతి=అట్లే అని, ప్రతిజ్ఞాయ=ప్రతిజ్ఞ చేసి, వైదేహీమ్=సీతను, శిరసా=శిరస్సుతో, వన్ద్య=నమస్కరించి, గమనాయ=వెళ్లుటకు, ఉపచక్రమే=ప్రారంభించెను.

తా. భయంకరమైన పరాక్రమము గల హనుమంతుడు అట్లే చేసెదను అని ప్రతిజ్ఞ చేసి, సీతకు శిరస్సు వంచి నమస్కరించి, వెళ్లుటకు బయలుదేరెను.

మూ. జ్ఞాత్వా సంప్రస్థితం దేవీ వానరం మారుతాత్మజమ్, 6
బాష్పగద్గదయా వాచా మైథిలీ వాక్యమబ్రవీత్.

ప్ర. అ. దేవీ=దేవియైన, మైథిలీ=సీత, మారుతాత్మజమ్=వాయుపుత్రుడైన, వానరమ్=హనుమంతుని, సంప్రస్థితమ్=ప్రయాణమైనవానినిగా, జ్ఞాత్వా=తెలిసికొని,

బాష్పగద్గదయా=బాష్పముచే డగ్గుత్తికతో కూడిన, వాచా=వాక్కుతో, వాక్యమ్=వాక్యమును, అబ్రవీత్=పలికెను.

తా. వాయుపుత్రుడు ప్రయాణమైనట్లు తెలిసికొని సీతాదేవి, బాష్పము చేత డగ్గుత్తికచెందిన వాక్కుతో ఇట్లనెను. 6

మూ. కుశలం హనుమన్ బ్రూయాః సహితౌ రామలక్ష్మణౌ. 7
సుగ్రీవం చ సహామాత్యం వృద్ధాన్ సర్వాంశ్చ వానరాన్,
బ్రూయాస్త్వం వానరశ్రేష్ఠ కుశలం ధర్మసంహితమ్. 8

ప్ర. అ. వానరశ్రేష్ఠ=వానరులలో శ్రేష్ఠుడా! హనుమన్=హనుమంతుడా! సహితౌ=కూడి యున్న, రామలక్ష్మణౌ=రామలక్ష్మణులను గూర్చి, కుశలమ్=కుశలము, బ్రూయాః=చెప్పుము. సహామాత్యమ్=మంత్రులతో కూడిన, సుగ్రీవం చ=సుగ్రీవునిగూర్చి,వృద్ధాన్=వృద్ధులైన, సర్వాన్=సమస్తమైన, వానరాన్=వానరులను గూర్చి, త్వమ్=నీవు, ధర్మసంహితమ్=ధర్మముతో కూడిన, కుశలమ్=కుశలమును, బ్రూయాః=చెప్పుము.

తా. వానరశ్రేష్ఠుడవైన ఓ! హనుమంతుడా! రామలక్ష్మణులిద్దరికీ, మంత్రిసమేతుడైన సుగ్రీవునకూ, నేను వారి కుశలము అడిగినట్లు చెప్పుము. పెద్ద వాళైన ఇతర వానరులకు కూడ, ధర్మసంమతముగా, నేను కుశలమడిగినట్లు చెప్పుము. 7, 8

మూ. యథా స చ మహాబాహుర్మాం తారయతి రాఘవః,
అస్మాద్దుఃఖామ్బుసంరోధాత్త్వం సమాధాతుమర్హసి. 9

ప్ర. అ. మహాబాహుః=గొప్ప బాహువులు గల, సః రాఘవః=ఆ రాముడు, అస్మాత్=ఈ, దుఃఖామ్బుసంరోధాత్=దుఃఖమనే సముద్రము నుండి, యథా=ఎట్లు, తారయతి=దాటించునో, ఆవిధముగ, త్వమ్=నీవు, సమాధాతుమ్=చేయుటకు, అర్హసి=తగి యున్నావు.

తా. మహాబాహువైన ఆ రాముడు నన్ను ఈ దుఃఖసముద్రమునుండి ఉద్ధరించు ఉపాయమును చేయుము. 9

మూ. జీవన్తీం మాం యథా రామః సంభావయతి కీర్తిమాన్,
తత్తథా హనుమన్ వాచ్యం వాచా ధర్మమవాప్నుహి. 10

ప్ర. అ. హనుమన్=హనుమంతుడా ! కీర్తిమాన్=కీర్తి గల, రామః=రాముడు, మామ్=నన్ను, జీవన్తీమ్=జీవించి ఉండగా, యథా=ఎట్లు,

సంభావయతి=ఊరడించునో, తత్=అది, తథా=అట్లు, వాచ్యమ్=చెప్పదగినది. వాచా=మాటచేత, ధర్మమ్=ధర్మమును, అవాప్నుహి=పొందుము.

తా. హనుమంతుడా ! కీర్తిమంతుడైన రాముడు, నేను ప్రాణములతో ఉండగా పొంది ఊరడించు నట్లు తగిన విధముగా చెప్పుము. మాటతో ఉపకారము చేసి పుణ్యము కట్టుకొనుము. 10

మూ. నిత్యముత్సాహయుక్తాశ్చ వాచః శ్రుత్వా త్వయేరితాః,
వర్ధిష్యతే దాశరథేః పౌరుషం మదవాప్తయే. 11

ప్ర. అ. త్వయా=నీచేత, ఈరితాః=పలకబడిన, ఉత్సాహయుక్తాః=ఉత్సాహముతో కూడిన, వాచః=వాక్యములను, నిత్యమ్=నిత్యము, శ్రుత్వా=విని, మదవాప్తయే=నన్ను పొందుటకు, దాశరథేః=రామునియొక్క, పౌరుషమ్=పౌరుషము, వర్ధిష్యతే=వృద్ధిపొందగలదు.

తా. నీవు నిత్యము ఉత్సాహభరితము లైన మాటలు చెప్పగా విని విని, రామునకు నన్ను ఈ ఆపదనుండి ఉద్ధరించవలెనని పౌరుషము వృద్ధి పొందును. 11

మూ. మత్సన్దేశయుతా వాచస్త్వత్తః శ్రుత్వా చ రాఘవః,
పరాక్రమవిధిం వీరో విధివత్సంవిధాస్యతి. 12

ప్ర. అ. వీరః=వీరుడైన, రాఘవః=రాముడు, త్వత్తః=నీనుండి, మత్సన్దేశయుతాః=నా సందేశముతో కూడిన, వాచః=వాక్కులను, శ్రుత్వా=విని, విధివత్=యథావిధిగా, పరాక్రమవిధమ్=పరాక్రమప్రయోగమును, సంవిధాస్యతి=చేయగలడు.

తా. వీరుడైన రాముడు, నా సందేశముతో కూడిన మాటలు నీవు చెప్పగా విని, చేయవలసిన రీతిలో పరాక్రమప్రదర్శనము చేయగలడు. 12

మూ. సీతాయా వచనం శ్రుత్వా హనుమాన్ మారుతాత్మజః,
శిరస్యఞ్జలిమాధాయ వాక్యముత్తరమబ్రవీత్. 13

ప్ర. అ. మారుతాత్మజః=వాయుపుత్రుడైన, హనుమాన్=హనుమంతుడు, సీతాయాః=సీతయొక్క, వచనమ్=వచనమును, శ్రుత్వా=విని, శిరసి=శిరస్సుపై, అఞ్జలిమ్=దోసిలిని, ఆధాయ=ఉంచి, ఉత్తరమ్=బదులుగా, వాక్యమ్=వాక్యమును, అబ్రవీత్=పలికెను.

తా. వాయుపుత్రుడైన హనుమంతుడు సీత మాటలు విని, శిరస్సుపై అంజలి ఘటించి, ఈ విధముగా బదులు చెప్పెను. 13

మూ. క్షిప్రమేష్యతి కాకుత్స్థో హర్యృక్షప్రవరైర్యుతః,
యస్తే యుధి విజిత్యారీన్ శోకం వ్యపనయిష్యతి. 14

ప్ర. అ. కాకుత్స్థః=రాముడు, హర్యృక్షప్రవరైః=వానరశ్రేష్ఠులతోను, భల్లూకశ్రేష్ఠులతోను కూడినవాడై, క్షిప్రమ్=శీఘ్రముగా, ఏష్యతి=రాగలడు. యః=ఏ రాముడు, యుధి=యుద్ధమునందు, అరీన్=శత్రువులను, విజిత్య=జయించి, తే=నీయొక్క, శోకమ్=శోకమును, వ్యపనయిష్యతి=తొలగించగలడు.

తా. రాముడు వీరులైన వానరులతోను, భల్లూకములతోను కలిసి శీఘ్రముగా వచ్చి, యుద్ధములో శత్రువులను ఓడించి నీ శోకమును తొలగించగలడు. 14

మూ. న హి పశ్యామి మర్త్యేషు వానరేషు సురేషు వా,
యస్తస్య క్షిపతో బాణాన్ స్థాతుముత్సహతేఽగ్రతః. 15

ప్ర. అ. యః=ఎవడు, బాణాన్=బాణములను, క్షిపతః=ప్రయోగించుచున్న, తస్య=ఆ రాముని యొక్క, అగ్రతః=ఎదుట, స్థాతుమ్=నిలచుటకు, ఉత్సహతే=సమర్థుడగునో అట్టి వానిని, మర్త్యేషు=మానవులలో కాని, వానరేషు=వానరులలో కాని, సురేషు వా=దేవతలలో కాని, న హి పశ్యామి=చూడను.

తా. రాముడు బాణములు ప్రయోగించుచుండగా ఆతని ఎదుట నిలవగలవాడు, నాకు వానరులలో గాని, నరులలోగాని, సురులలో గాని ఎక్కడా కనబడుటలేదు. 15

మూ. అప్యర్కమపి పర్జన్యమపి వైవస్వతం యమమ్,
స హి సోఢుం రణే శక్తస్తవ హేతోర్విశేషతః. 16

ప్ర. అ. సః=ఆ రాముడు, రణే=యుద్ధరంగమునందు, అర్కమపి=సూర్యునైనా, పర్జన్యమపి=ఇంద్రునైనా, వైవస్వతమ్=సూర్యుని కుమారుడైన, యమమ్=యమునైనా, సోఢుమ్=సహించుటకు, శక్తః=సమర్థుడు. తవ హేతోః=నీ నిమిత్తమైతే, విశేషతః=విశేషించి సహింప సమర్థుడు.

తా. రాముడు యుద్ధరంగములో సూర్యునైనా, ఇంద్రునైనా, సూర్యకుమారుడైన యమునైనా ఎదిరించ సమర్థుడు. నీ కోసమైతే విశేషించి ఎదిరించ సమర్థుడు. 16

మూ. స హి సాగరపర్యన్తాం మహీం సాధితుమర్హతి,
త్వన్నిమిత్తో హి రామస్య జయో జనకనన్దిని. 17

ప్ర. అ. సః=ఆ రాముడు, సాగరపర్యన్తామ్=సాగరమువరకు వ్యాపించి ఉన్న, మహీమ్=భూమిని, సాధితుమ్=సాధించుటకు, అర్హతి హి=తగి యున్నాడు కదా. జనకనన్దిని=ఓ సీతాదేవీ !రామస్య=రాముని యొక్క, జయః=జయము, త్వన్నిమిత్తో హి=నీ కొరకే అయినది కదా?

తా. ఆ రాముడు సముద్రమువరకు వ్యాపించి యున్న ఈ భూమిని అంతనూ జయించుటకు సమర్థుడు. ఓ ! సీతాదేవీ ! రాముడు సంపాదించే ఈ జయము కూడా నీకొరకే కదా? 17

మూ. తస్య తద్వచనం శ్రుత్వా సమ్యక్సత్యం సుభాషితమ్,
జానకీ బహుమేనేఽథ వచనం చేదమబ్రవీత్. 18

ప్ర. అ. జానకీ=సీత, తస్య=ఆ హనుమంతునియొక్క, సత్యమ్=సత్యమైన, సమ్యక్=బాగుగా, సుభాషితమ్=మధురముగా పలకబడిన, తత్=ఆ, వచనమ్=వచనమును, శ్రుత్వా=విని, బహుమేనే=గౌరవించెను. అథ=అటుపిమ్మట, ఇదమ్=ఈ, వచనం చ=వచనమును కూడ, అబ్రవీత్=పలికెను.

తా. హనుమంతుడు చక్కగా, మధురముగా పలికిన ఆ మాటలు విని, సీత ఆతనిని మెచ్చుకొనుచు ఇట్లు పలికెను. 18

మూ. తతస్తం ప్రస్థితం సీతా వీక్షమాణా పునః పునః,
భర్తృస్నేహాన్వితం వాక్యం సౌహార్దాదనుమానయత్. 19

ప్ర. అ. తతః=అటుపిమ్మట, సీతా=సీత, ప్రస్థితమ్=ప్రయాణమైన, తమ్=ఆతనిని, పునః పునః=మాటిమాటికి, వీక్షమాణా=చూచుచు, భర్తృస్నేహాన్వితమ్=తన భర్తయందు స్నేహముతో కూడిన, వాక్యమ్=ఆతని వాక్యమును, సౌహార్దాత్=స్నేహమువలన, అనుమానయత్=గౌరవించెను.

తా. పిదప, సీత తిరిగి వెళ్ళుటకు ప్రయాణమైన ఆ హనుమంతుని వైపు మాటి మాటికి చూచుచు, తన భర్తయైన రాముని పై ఆతనికి ఉన్న స్నేహమును సూచించుచున్న ఆతని మాటలను, స్నేహపూర్వకముగా అభినందించెను. 19

మూ. యది వా మన్యసే వీర వసైకాహమరిన్దమ,
కస్మింశ్చిత్సంవృతే దేశే విశ్రాన్తః శ్వో గమిష్యసి. 20

ప్ర. అ. అరిందమ=శత్రువులను సంహరించే వాడా! వీర=వీరుడా! మన్యసే యది=బాగుండు నని తలచినచో, కస్మింశ్చిత్=ఒకానొక, సంవృతే= రహస్యమైన, దేశే=ప్రదేశమునందు, ఏకాహమ్=ఒక రోజు, వస=నివసించుము. విశ్రాన్తః=విశ్రమించినవాడవై, శ్వః=రేపు, గమిష్యసి=వెళ్ళగలవు.

తా. శత్రుసంహారకుడవైన ఓ వీరుడా ! నీకు అంగీకారయోగ్యమైనచో, ఒక్క రోజుపాటు ఏదైన రహస్యమైన ప్రదేశములో ఉండుము. విశ్రాంతి తీసికొని రేపు వెళ్లవచ్చును. 20

మూ. మమ చేదల్పభాగ్యాయాః సాన్నిధ్యాత్తవ వానర,
అస్య శోకస్య మహతో ముహూర్తం మోక్షణం భవేత్

ప్ర. అ. వానర=హనుమంతుడా !తవ=నీయొక్క, సాన్నిధ్యాత్=సాం నిధ్యమువలన, అల్పభాగ్యాయాః=అల్పమైన భాగ్యము గల, మమ=నాయొక్క, మహతః=గొప్పదైన, అస్య శోకస్య=ఈ శోకమునకు, ముహూర్తమ్=క్షణకాలము, మోక్షణమ్=విమోక్షము, భవేత్ చేత్=కలుగును.

తా. నీవు ఈ సమీపమునందు ఉన్నచో అల్పభాగ్యవంతురాలనైన నా ఈ గొప్ప శోకమునకు క్షణకాలము పాటు శాంతి కలుగును. 21

మూ. గతే హి హరిశార్దూల పునరాగమనాయ తు,
ప్రాణానామపి సందేహో మమ స్యాన్నాత్ర సంశయః. 22

ప్ర. అ. హరిశార్దూల=వానరశ్రేష్ఠుడా ! పునరాగమనాయ=తిరిగి వచ్చు టకు, గతే=వెళ్ళినవాడవగుచుండగా, మమ=నాయొక్క, ప్రాణానామపి=ప్రాణాలకు కూడ, సన్దేహః=సందేహము, స్యాత్=అగును. అత్ర=ఈ విషయమునందు, సందేహః=సందేహము, న=లేదు.

తా. ఓ వానరశ్రేష్ఠా ! నీవు తిరిగి వచ్చుటకై వెళ్ళిన తరువాత నేను బ్రతికి ఉందునో ఉండనో సందేహమే. ఈ విషయమున సంశయము లేదు.22

మూ. తవాదర్శనజః శోకో భూయో మాం పరితాపయేత్,
దుఃఖాద్దుఃఖపరామృష్టాం దీపయన్నివ వానర. 23

ప్ర. అ. వానర=హనుమంతుడా ! దుఃఖాత్=ఒక దుఃఖమునుండి, దుఃఖప రామృష్టామ్=మరొక దుఃఖముచేత స్పృశింపబడిన, మామ్=నన్ను, తవ=నీయొక్క, అదర్శనజః=కనబడకపోవుటవలన కలుగు, శోకః=శోకము, దీపయన్నివ=మండించు చున్నది వలె, భూయః=మరల, పరితాపయేత్=తపింపచేయును.

తా. హనుమంతుడా ! ఒక దుఃఖము తరువాత మరొక్క దుఃఖముతో బాధపడుచున్న నన్ను, నీవు కనబడకపోవుటవలన కలుగు దుఃఖము కాల్చివేయుచున్నట్లు ఇంకను, తపింపచేయును. 23

మూ. అయం చ వీర సందేహస్తిష్ఠతీవ మమాగ్రతః,
సుమహాంస్త్వత్సహాయేషు హర్యృక్షేషు హరీశ్వర. 24

ప్ర. అ. వీర=వీరుడా ! హరీశ్వర=వానరశ్రేష్ఠుడా ! త్వత్సహాయేషు=నీకు సహాయులైన, హర్యృక్షేషు=వానరుల విషయమునందు, భల్లూకముల విషయము నందు, అయమ్=ఈ, సుమహాన్=చాల గొప్పదైన, సన్దేహః=సందేహము, మమ అగ్రతః=నా ఎదుట, తిష్ఠతీవ=నిలచుచున్నట్లున్నది.

తా. వీరుడవైన వానరశ్రేష్ఠుడా ! నీకు సహాయభూతులైన వానరభల్లూకాదుల విషయమునందు ఒక పెద్ద సందేహము నా ఎదుట నిలచి ఉన్నది. 24

మూ. కథం ను ఖలు దుష్పారం తరిష్యన్తి మహోదధిమ్,
తాని హర్యృక్షసైన్యాని తౌ వా నరవరాత్మజౌ. 25

ప్ర. అ. తాని=ఆ, హర్యృక్షసైన్యాని=వానరభల్లూకసైన్యములు గాని, తౌ=ఆ, నరవరాత్మజౌ వా=రాజకుమారులు గాని, దుష్పారమ్=దాట శక్యముకాని, మహోదధిమ్=మహాసముద్రమును, కథం ను=ఎట్లు, తరిష్యన్తి=దాటగలరు?

తా. ఆ వానర భల్లూకసైన్యములు గాని, ఆ రామలక్ష్మణులు గాని దాటశక్యము కాని మహాసముద్రమును ఎట్లు దాటగలరో? 25

మూ. త్రయాణామేవ భూతానాం సాగరస్యాస్య లఙ్ఘనే,
శక్తిః స్యాద్వైనతేయస్య తవ వా మారుతస్య వా. 26

ప్ర. అ. అస్య=ఈ, సాగరస్య=సముద్రముయొక్క, లఙ్ఘనే=దాటుటయందు, వైనతేయస్య వా=గరుత్మంతునకు గాని, తవ వా=నీకు గాని, మారుతస్య వా=వాయువునకు గాని, త్రయాణామ్=ముగ్గురు, భూతానామ్=ప్రాణులకే, శక్తిః=శక్తి, స్యాత్=ఉండవచ్చును.

తా. గరుత్మంతుడు, నీవు, వాయుదేవుడు ఈ ముగ్గురు మాత్రమే ఈ సముద్రమును దాట సమర్థులు. 26

మూ. తదస్మిన్ కార్యనిర్యోగే వీరైవం దురతిక్రమే,
కిం పశ్యసి సమాధానం త్వం హి కార్యవిదాం వరః. 27

ప్ర. అ. వీర=వీరుడా !తత్=ఆ కారణము వలన, ఏవమ్=ఇట్లు, దురతిక్రమే=అతిక్రమింప శక్యముకాని, అస్మిన్=ఈ, కార్యనిర్యోగే=కార్యమును నిర్వహించుటయందు, కిమ్=ఏ, సమాధానమ్=ఉపాయమును, పశ్యసి=చూచు చున్నావు? త్వమ్=నీవు, కార్యవిదామ్=కార్యవేత్తలలో, వరః హి=గొప్పవాడవు కదా?

తా. ఓ వీరుడా ! ఈ విధముగ ఈ కార్యమును సాధించుట అనేది చాల కష్టముగా కనబడుచున్నది. ఇట్టిస్థితిలో నీ వేమి ఉపాయము ఆలోచించితివి? కార్యము లెట్లు సాధించవలెనో తెలిసినవారిలో నీవు శ్రేష్ఠుడవు కదా ! 27

మూ. కామమస్య త్వమేవైకః కార్యస్య పరిసాధనే,
పర్యాప్తః పరవీరఘ్న యశస్యస్తే ఫలోదయః. 28

ప్ర. అ. పరవీరఘ్న=శత్రువీరులను సంహరించువాడా !అస్య కార్యస్య=ఈ కార్యము యొక్క, పరిసాధనే=సాధించుటయందు, త్వమ్=నీవు, ఏక ఏవ=ఒక్కడవే, పర్యాప్తః కామమ్=సమర్థుడవే. తే=నీయొక్క, ఫలోదయః=ఫలముయొక్క లాభము, యశస్యః=యశస్సును కలిగించేది.

తా. శత్రువీరులను నశింపచేయు ఓ హనుమంతుడా ! ఈ కార్యమును నీవే ఒంటరిగా సాధించగలవు. నీ కార్యము సఫలమై యశస్సును కలిగించును.28

మూ. బలైః సమగ్రైర్యది మాం రావణం జిత్య సంయుగే,
విజయీ స్వపురం యాయాత్తత్తస్య సదృశం భవేత్. 29

ప్ర. అ. (రాముడు), సంయుగే=యుద్ధమునందు, సమగ్రైః=సమస్త మైన, బలైః=సైన్యములతో, రావణమ్=రావణుని, జిత్వా=జయించి, మామ్=నన్ను, (గ్రహించి), విజయీ=విజయవంతుడై, స్వపురమ్=తన పురమును గూర్చి, యాయాత్ యది=వెళ్ళినట్లయితే, తత్=అది, తస్య=ఆతనికి, సదృశమ్=తగినది, భవేత్=అగును.

తా. రాముడు యుద్ధములో రావణుని సకలసేనలతో ఓడించి, నన్ను తీసికొని తన పట్టణమునకు వెళ్ళినచో అది ఆయనకు తగి ఉండును. 29

మూ. శరైస్తు సంకులాం కృత్వా లఙ్కాం పరబలార్దనః,
మాం నయేద్యది కాకుత్స్థః తత్తస్య సదృశం భవేత్. 30

ప్ర. అ. పరబలార్దనః=శత్రుసేనలను పీడించు, కాకుత్స్థః=రాముడు, లఙ్కామ్=లంకను, శరైః=బాణములచేత, సంకులామ్=వ్యాకులమైనదానినిగా, కృత్వా=

చేసి, మామ్=నన్ను, నయేద్యది=తీసికొని వెళ్ళినట్లయితే, తత్=అది, తస్య=ఆతనికి, సదృశమ్=సమానము (తగినది), భవేత్=అగును.

తా. శత్రుసేనలను సంహరించు రాముడు లంకను బాణములతో నింపి, నన్ను తీసికొనివెళ్ళినచో అది ఆయనకు తగినదై ఉండును. 30

మూ. తద్యథా తస్య విక్రాన్తమనురూపం మహాత్మనః,
భవేదాహవశూరస్య తథా త్వముపపాదయ. 31

ప్ర. అ. తత్=ఆ కారణమువలన, మహాత్మనః=మహాత్ముడూ, ఆహవశూరస్య=యుద్ధములో శూరుడూ అయిన, తస్య=ఆ రామునియొక్క, అనురూపమ్=తగిన, విక్రాన్తమ్=పరాక్రమించుట, యథా=ఎట్లు, భవేత్=అగునో, తథా=అట్లు, త్వమ్=నీవు, ఉపపాదయ=ఏర్పరచుము.

తా. అందుచేత యుద్ధములో శూరుడూ, మహాబుద్ధిశాలీయైన ఆ రాముడు తనకు తగిన విధముగా పరాక్రమము చూపించునట్లు చేయుము.31

మూ. తదర్థోపహితం వాక్యం ప్రశ్రితం హేతుసంహితమ్,
నిశమ్య హనుమాన్ శేషం వాక్యముత్తరమబ్రవీత్. 32

ప్ర. అ. హనుమాన్=హనుమంతుడు, అర్థోపహితమ్=మంచి అర్థముతో కూడినదీ, ప్రశ్రితమ్=వినయపూర్వకమూ, హేతుసంహితమ్=యుక్తులతో కూడినదీ అయిన, తత్ వాక్యమ్=ఆ వాక్యమును, నిశమ్య=విని, శేషమ్=మిగిలిన, ఉత్తరం వాక్యమ్=ప్రత్యుత్తరరూపమైన వాక్యమును, అబ్రవీత్=పలికెను.

తా. హనుమంతుడు, మంచి అర్థముతో కూడినదీ, వినయసంపన్నమూ, యుక్తిసంగతమూ అయిన ఆ వాక్యమును విని ప్రత్యుత్తరరూపమున తాను చెప్పవలసిన మిగిలిన మాట నిట్లు చెప్పెను. 32

మూ. దేవి హర్యృక్షసైన్యానామీశ్వరః ప్లవతాం వరః,
సుగ్రీవః సత్త్వసంపన్నస్తవార్థే కృతనిశ్చయః. 33

ప్ర. అ. దేవి=ఓ దేవీ !హర్యృక్షసైన్యానామ్=వానరభల్లూకసైన్యములకు, ఈశ్వరః=ప్రభువు, ప్లవతాం వరః=వానరులలో శ్రేష్ఠుడూ అయిన, సత్త్వసంపన్నః=బలముతో కూడిన, సుగ్రీవః=సుగ్రీవుడు, తవ అర్థే=నీ నిమిత్తమై, కృతనిశ్చయః=చేయబడిన నిశ్చయము కలవాడు.

తా. ఓ! సీతాదేవీ ! వానరభల్లూకసైన్యముల అధిపతీ, వానరశ్రేష్ఠుడూ, బలశాలీ అయిన సుగ్రీవుడు నిన్నెట్లైన రక్షించవలెనని దృఢనిశ్చయముతో ఉన్నాడు.

మూ. స వానరసహస్రాణాం కోటీభిరభిసంవృతః,
క్షిప్రమేష్యతి వైదేహి రాక్షసానాం నిబర్హణః. 34

ప్ర. అ. వైదేహి=ఓ !సీతాదేవీ ! సః=ఆ సుగ్రీవుడు, వానరసహస్రాణామ్=వేలకొలది వానరులయొక్క, కోటీభిః=కోటులతో, అభిసంవృతః=కూడినవాడై, రాక్షసానామ్=రాక్షసులకు, నిబర్హణః=సంహారము చేయువాడై, క్షిప్రమ్=శీఘ్రముగా, ఏష్యతి=రాగలడు.

తా. ఓ !సీతాదేవీ ! ఆ సుగ్రీవుడు వేలకొలది, కోట్లకొలది వానరులు వెంటరాగా, రాక్షసులను చంపుటకై శీఘ్రముగా రాగలడు. 34

మూ. తస్య విక్రమసంపన్నాః సత్త్వవన్తో మహాబలాః,
మనఃసంకల్పసంపాతా నిదేశే హరయః స్థితాః. 35

ప్ర. అ. విక్రమసంపన్నాః=పరాక్రమముతో కూడినవారు, సత్త్వవన్తః=కష్టములను సహించు శక్తి కలవారు, మహాబలాః=గొప్ప బలము కలవారు, మనఃసంకల్పసంపాతాః=మనస్సుయొక్క సంకల్పము ప్రకారము శీఘ్రముగా వెళ్లగలవారు అయిన, హరయః=వానరులు, తస్య=ఆ సుగ్రీవునియొక్క, నిదేశే=ఆజ్ఞయందు, స్థితాః=ఉన్నారు.

తా. పరాక్రమవంతులు, కష్టసహనశక్తి కలవారు, మహాబలశాలులు, వెళ్లదలచిన ఏ ప్రదేశమునకైనా వెళ్లగలవారు అయిన ఎందరో వానరులు ఆ సుగ్రీవుని ఆజ్ఞకు కట్టుబడి ఉన్నారు. 35

మూ. యేషాం నోపరి నాధస్తాన్న తిర్యక్సజ్జతే గతిః,
న చ కర్మసు సీదన్తి మహత్స్వమితతేజసః. 36

ప్ర. అ. యేషామ్=ఏ వానరులయొక్క, గతిః=గమనము, ఉపరి=ఆకాశముపైన, న సజ్జతే=అడ్డుపడదో, అధస్తాత్=క్రింద, న=అడ్డుపడదో, తిర్యక్=అడ్డముగా, న=అడ్డుపడదో, (అట్టివారు ఉన్నారు), అమితతేజసః=అనంతమైన తేజస్సు గలవారు, మహత్సు=గొప్పవైన, కర్మసు=పనుల విషయమున, న సీదన్తి=దుఃఖించరు.

తా. ఆకాశముపై గాని, క్రిందగాని, అడ్డముగా గాని వారి గమనానికి ఎక్కడా అడ్డము ఉండదు. అపరిమితమైన తేజస్సు గల ఆ వానరులు ఎట్టి పెద్ద పనులు చేయవలసివచ్చినను వెనుదీయరు. 36

మూ. అసకృత్తైర్మహోత్సాహైః ససాగరధరాధరా,
ప్రదక్షిణీకృతా భూమిర్వాయుమార్గానుసారిభిః. 37

ప్ర. అ. మహోత్సాహైః=గొప్ప ఉత్సాహము గలవారు, వాయుమార్గానుసారిభిః=ఆకాశమును అనుసరించువారు అయిన, తైః=ఆ వానరులచేత, అసకృత్=అనేక పర్యాయములు, ససాగరధరాధరా=సాగరముతోను పర్వతములతోను కూడిన, భూమిః=భూమి, ప్రదక్షిణీకృతా=ప్రదక్షిణము చేయబడినది.

తా. మహోత్సాహవంతులైన ఆ వానరులు అనేక పర్యాయములు, ఆకాశ మార్గమునందు సంచరించుచు, సముద్రపర్వతాదులలో కూడిన ఈ భూమిని ప్రదక్షిణము చేసిరి. 37

మూ. మద్విశిష్టాశ్చ తుల్యాశ్చ సన్తి తత్ర వనౌకసః,
మత్తః ప్రత్యవరః కశ్చిన్నాస్తి సుగ్రీవసన్నిధౌ. 38

ప్ర. అ. తత్ర=వారిలో, మద్విశిష్టాశ్చ=నాకంటె గొప్పవారు, తుల్యాశ్చ=సమానులు అయిన, వనౌకసః=వానరులు, సన్తి=ఉన్నారు. మత్తః=నాకంటె, ప్రత్యవరః=తక్కువవాడు, కశ్చిత్=ఒక్కడూ, సుగ్రీవసన్నిధౌ=సుగ్రీవుని వద్ద, నాస్తి=లేడు.

తా. ఆ వానరులలో కొందరు వానరులు నాకంటె గొప్పవారు. కొందరు నాతో సమానులు. నాకు తీసిపోయేవాడు ఒక్కడూ సుగ్రీవుని దగ్గర లేడు. 38

మూ. అహం తావదిహ ప్రాప్తః కిం పునస్తే మహాబలాః,
న హి ప్రకృష్టాః ప్రేష్యన్తే ప్రేష్యన్తే హీతరే జనాః. 39

ప్ర. అ. అహం తావత్=నేనే, ఇహ=ఇక్కడికి, అనుప్రాప్తః=వచ్చినాను. మహాబలాః=గొప్ప బలము గల, తే=వారు, కిం పునః=చెప్పనేల? ప్రకృష్టాః=శ్రేష్ఠులైనవారు, న ప్రేష్యన్తే హి=పంపబడరు కదా. ఇతరే=శ్రేష్ఠులు కాని, జనాః=జనులు, ప్రేష్యన్తే హి=పంపబడుదురు కదా.

తా. నేను ఇక్కడికి వచ్చినానంటే మహాబలవంతులైన వాళ్ళ మాట చెప్పవలెనా! ఏ పనిమీద నైనా సామాన్యులను పంపుదురు కాని శ్రేష్ఠులను పంపరు కదా ? 39

మూ. తదలం పరితాపేన దేవి శోకో వ్యపైతు తే,
ఏకోత్పాతేన తే లఙ్కామేష్యన్తి హరియూథపాః. 40

ప్ర. అ. దేవి=సీతాదేవీ, తత్=ఆ కారణమువలన, పరితాపేన=చింతచేత, అలమ్=చాలును, తే=నీయొక్క, శోకః=శోకము, వ్యపైతు=తొలగుగాక తే=ఆ, హరియూథపాః=వానరసేనానాయకులు, ఏకోత్పాతేన=ఒక్క గంతులో, లఙ్కామ్=లంకనుగూర్చి, ఏష్యన్తి=రాగలరు.

తా. ఓ! సీతాదేవీ ! అందుచేత నీవు విచారించకుము. నీ దుఃఖము విడిచి పెట్టుము. ఆ వానరసేనానాయకులందరు ఒక్క దుముకులో లంక చేరగలరు.

మూ. మమ పృష్ఠగతౌ తౌ చ చన్ద్రసూర్యావివోదితౌ,
త్వత్సకాశం మహాసత్త్వౌ నృసింహావాగమిష్యతః. 41

ప్ర. అ. మహాసత్త్వౌ=గొప్ప బలము గల, నృసింహౌ=నరశ్రేష్ఠులైన, తౌ చ=ఆ రామలక్ష్మణులు కూడ, మమ=నాయొక్క, పృష్ఠగతౌ=వీపుపై కూర్చున్నవారై, ఉదితౌ=ఉదయించిన, చన్ద్రసూర్యావివ=చంద్రసూర్యులు వలె, త్వత్సకాశమ్=నీ సమీపమునకు, ఆగమిష్యతః=రాగలరు.

తా. గొప్ప బలము గల నరశ్రేష్ఠులైన ఆ రామలక్ష్మణులు, నా బుజములపై ఎక్కి, ఉదయించిన సూర్యచంద్రుల వలె నీ దగ్గరకు రాగలరు.41

మూ. తతో వీరౌ నరవరౌ సహితౌ రామలక్ష్మణౌ,
ఆగమ్య నగరీం లఙ్కాం సాయకైర్విధమిష్యతః. 42

ప్ర. అ. తతః=అటుపిమ్మట, వీరౌ=వీరులు, నరవరౌ=నరశ్రేష్ఠులు అయిన, రామలక్ష్మణౌ=రామలక్ష్మణులు, సహితౌ=కలిసినవారై, ఆగమ్య=వచ్చి, లఙ్కాం నగరీమ్=లంకాపట్టణమును, సాయకైః=బాణములచేత, విధమిష్యతః=నశింపచేయగలరు.

తా. నరులలో శ్రేష్ఠులు, వీరులు అయిన రామలక్ష్మణులు కలిసి వచ్చి, బాణములచేత లంకానగరమును నశింపచేయగలరు. 42

మూ. సగణం రావణం హత్వా రాఘవో రఘునన్దనః,
త్వామాదాయ వరారోహే స్వపురీం ప్రతియాస్యతి. 43

ప్ర. అ. వరారోహే=మంచినితంబము గల ఓ !సీతాదేవీ ! రఘునన్దనః=రఘువంశమునకు ఆనందము కలిగించు, రాఘవః=రాముడు, సగణమ్=పరివారముతో గూడిన, రావణమ్=రావణుని, హత్వా=చంపి, త్వామ్=నిన్ను, ఆదాయ=తీసికొని, స్వపురీమ్=తన పట్టణమును గూర్చి, ప్రతియాస్యతి=తిరిగివెళ్లగలడు.

తా. ఓ, సీతాదేవీ ! రఘువంశమునకు ఆనందము కలిగించు రాముడు పరివారముతో కూడి రావణుని సంహరించి, నిన్ను తీసికొని తన పట్టణమునకు తిరిగి వెళ్లగలడు. 43

మూ. తదాశ్వసిహి భద్రం తే భవ త్వం కాలకాంక్షిణీ,
నచిరాద్ద్రక్ష్యసే రామం ప్రజ్వలన్తమివానలమ్. 44

ప్ర. అ. తత్=ఆ కారణమువలన, ఆశ్వసిహి=ఊరడిల్లుము. తే=నీకు, భద్రమ్=మంగళమగుగాక. త్వమ్=నీవు, కాలకాంక్షిణీ=కాలమును కోరుదానవు, భవ=అగుము, ప్రజ్వలన్తమ్=ప్రజ్వలించుచున్న, అనలమ్ ఇవ=అగ్నివలె ఉన్న, రామమ్=రాముణ్ణి, నచిరాత్=కొద్ది కాలములో, ద్రక్ష్యసే=చూడగలవు.

తా. అందువలన నీవు ఊరడిల్లుము. నీకు క్షేమమగుగాక. కాలమునకై వేచి యుండుము. ప్రజ్వలించుచున్న అగ్ని వలె ఉన్న రాముని కొద్దికాలములో చూడగలవు. 44

మూ. నిహతే రాక్షసేన్ద్రేఽస్మిన్ సపుత్రామాత్యబాన్ధవే,
త్వం సమేష్యసి రామేణ శశాఙ్కేనేవ రోహిణీ. 45

ప్ర. అ. సపుత్రామాత్యబాన్ధవే=పుత్రులతోను, అమాత్యులతోను, బంధువులతోను కూడిన, అస్మిన్=ఈ, రాక్షసేన్ద్రే=రాక్షసరాజు, నిహతే=చంపబడినవాడగుచుండగా, త్వమ్=నీవు, రోహిణీ=రోహిణి, శశాఙ్కేనేవ=చంద్రునితో వలె, రామేణ=రామునితో, సమేష్యసి=కలవగలవు.

తా. ఈ రాక్షసరాజు పుత్రులతోను, అమాత్యులతోను, బంధువులతోను సహా చంపబడిన పిమ్మట నీవు, రోహిణి చంద్రునితో కలసి నట్లు, రామునితో కలవగలవు. 45

మూ. క్షిప్రం త్వం దేవి శోకస్య పారం యాస్యసి మైథిలి,
రావణం చైవ రామేణ నిహతం ద్రక్ష్యసేఽచిరాత్. 46

ప్ర. అ. దేవి=ఓ! దేవీ! మైథిలి=ఓ! మైథిలీ! త్వమ్=నీవు, క్షిప్రమ్=శీఘ్రముగా, శోకస్య=శోకముయొక్క, పారమ్=అంతమును, యాస్యసి=పొందగలవు. అచిరాత్=కొద్దికాలములో, రామేణ=రామునిచేత, రావణమ్=రావణుని, నిహతం=చంపబడినవానినిగా, ద్రక్ష్యసే చైవ=చూడగలవు కూడ.

తా. ఓ ! సీతాదేవీ ! నీవు శీఘ్రముగా శోకపు అంతము చూడగలవు. అచిరకాలములో రామునిచే సంహరించబడిన రావణుని చూడగలవు. 46

మూ. ఏవమాశ్వాస్య వైదేహీం హనుమాన్మారుతాత్మజః,
గమనాయ మతిం కృత్వా వైదేహీం పునరబ్రవీత్. 47

ప్ర. అ. మారుతాత్మజః=వాయుపుత్రుడైన, హనుమాన్=హనుమంతుడు, వైదేహీమ్=సీతను, ఏవమ్=ఇట్లు, ఆశ్వాస్య=ఓదార్చి, గమనాయ=వెళ్లుటకు, మతిమ్=బుద్ధిని, కృత్వా=చేసి, పునః=మరల, వైదేహీమ్=సీతను గూర్చి, అబ్రవీత్=పలికెను.

తా. వాయుపుత్రుడైన హనుమంతుడు సీతను ఈ విధముగ ఓదార్చి, తిరిగి వెళ్లుటకు నిశ్చయించుకొని సీతతో మరల ఇట్లు పలికెను. 47

మూ. తమరిఘ్నం కృతాత్మానం క్షిప్రం ద్రక్ష్యసి రాఘవమ్,
లక్ష్మణం చ ధనుష్పాణిం లఙ్కాద్వారముపాగతమ్. 48

ప్ర. అ. లఙ్కాద్వారమ్=లంకాపట్టణము ద్వారమును, ఉపాగతమ్=చేరిన, అరిఘ్నమ్=శత్రువులను నశింపచేయువాడూ, కృతాత్మానమ్=నిశ్చయించుకొనిన బుద్ధి కలవాడూ అయిన, తం రాఘవమ్=ఆ రామునీ, ధనుష్పాణిమ్=ధనస్సు హస్తమునందు గల, లక్ష్మణం చ =లక్ష్మణునీ, క్షిప్రమ్=శీఘ్రముగా, ద్రక్ష్యసి=చూడగలవు.

తా. శత్రువులను సంహరించుటకు దృఢముగా నిశ్చయించుకొనిన శత్రు సంహారకుడైన రాముడు, ధనస్సు చేతిలో ధరించి లక్ష్మణుడు లంకాద్వారమునకు శీఘ్రముగా రాగలరు. నీవు వారిని చూడగలవు. 48

మూ. నఖదంష్ట్రాయుధాన్వీరాన్ సింహశార్దూలవిక్రమాన్,
వానరాన్వారణేన్ద్రాభాన్ క్షిప్రం ద్రక్ష్యసి సంగతాన్. 49

ప్ర. అ. నఖదంష్ట్రాయుధాన్=గోళ్లు, కోరలు ఆయుధములుగా గలవారూ, వీరాన్=వీరులూ, సింహశార్దూలవిక్రమాన్=సింహముల వంటి, పెద్ద పులుల వంటి పరాక్రమము గలవారూ, వారణేన్ద్రాభాన్=గజరాజుల వంటి కాంతి గలవారూ అయిన, సంగతాన్=కలిసి వచ్చిన, వానరాన్=వానరులను, క్షిప్రమ్=శీఘ్రముగా, ద్రక్ష్యసి=చూడగలవు.

తా. వానరులు సింహములూ, పెద్దపులులూ వంటి పరాక్రమము గలవారు. వారి శరీరములు ఏనుగుల వలె ఉన్నతమైనవి. వారికి గోళ్ళూ కోరలే ఆయుధాలు. అట్టి వానరులందరూ కలిసి శీఘ్రముగా రాగలరు. వారిని నీవు చూడగలవు. 49

మూ. శైలామ్బుదనికాశానాం లఙ్కామలయసానుషు,
నర్దతాం కపిముఖ్యానామార్యే యూథాన్యనేకశః. 50

ప్ర. అ. ఆర్యే=ఓ! పూజ్యురాలా ! శైలామ్బుదనికాశానామ్=శైలములతోను, మేఘములతోను, సమానులైన, నర్దతామ్=గర్జించుచున్న, కపిముఖ్యానామ్=వానర శ్రేష్ఠులయొక్క, అనేకశః=అనేకములైన, యూథాని=గుంపులను, లఙ్కామలయసానుషు=లంకయందు, మలయపర్వతము చరియలయందు (చూడగలవు).

తా. ఓ! పూజ్యురాలా ! పర్వతాల వలె, మేఘాల వలె ఉన్న వానరశ్రేష్ఠుల అనేకమైన గుంపులు లంకలోను, మలయపర్వతప్రాంతములందును గర్జించుచు సంచరించుచుండగా నీవు చూడగలవు. 50

మూ. స తు మర్మణి ఘోరేణ తాడితో మన్మథేషుణా.
న శర్మ లభతే రామః సింహార్దిత ఇవ ద్విపః. 51

ప్ర. అ. సః రామః=ఆ రాముడు, ఘోరేణ=తీక్ష్ణమైన, మన్మథేషుణా=మన్మథుని బాణముచేత, మర్మణి=మర్మప్రదేశమునందు, తాడితః=కొట్టబడినవాడై, సింహార్దితః=సింహముచేత పీడింపబడిన, ద్విపః ఇవ=ఏనుగ వలె, శర్మ= సుఖమును, న లభతే=పొందుటలేదు.

తా. తీక్ష్ణమైన మన్మథబాణముచేత మర్మస్థానమునందు కొట్టబడి రాముడు సింహముచేత పీడింపబడిన ఏనుగు వలె సుఖమును పొందజాలకున్నాడు.

మూ. మారుదో దేవి శోకేన మా భూత్తే మనసోఽప్రియమ్,
శచీవ పత్యా శక్రేణ భర్త్రా నాథవతీ హ్యసి. 52

ప్ర. అ. దేవి=సీతాదేవీ ! శోకేన=దుఃఖముతో, మారుదః=ఏడవకుము. తే=నీయొక్క, మనసః=మనస్సుకు, అప్రియమ్=అప్రియము, మా భూత్=లేకపోవుగాక !పత్యా=భర్తయైన, శక్రేణ=దేవేంద్రునితో, శచీవ=శచీదేవి వలె, భర్త్రా=భర్తయైన రామునిచేత, నాథవతీ=రక్షకుడు కలదానవు. అసి హి=అయి ఉన్నావు కదా.

తా. ఓ ! సీతాదేవీ! దుఃఖముతో ఏడవకుము. నీ మనస్సుకు దుఃఖము కలుగకుండుగాక. శచీదేవికి భర్తయైన దేవేంద్రుడు రక్షకుడుగా ఉన్నట్లు నీకు భర్తయైన రాముడు రక్షకుడుగా ఉన్నాడు కదా ! 52

మూ. రామాద్విశిష్టః కోఽన్యోఽస్తి కశ్చిత్సౌమిత్రిణా సమః,
అగ్నిమారుతకల్పౌ తౌ భ్రాతరౌ తవ సంశ్రయౌ. 53

ప్ర. అ. రామాత్=రామునికంటె, విశిష్టః=గొప్పవాడు, అన్యః=మరియొకడు, కః=ఎవడు, అస్తి=ఉన్నాడు ! సౌమిత్రిణా=లక్ష్మణునితో, సమః=సమానుడు కశ్చిత్=ఎవ్వడైనా ఉన్నాడా !అగ్నిమారుతకల్పౌ=అగ్నితోను వాయువుతోను సమా

నులైన, తౌ భ్రాతరౌ=ఆ సోదరులిద్దరూ, తవ=నీకు, సంశ్రయౌ=ఆశ్రయముగా ఉన్నారు.

తా. రామునికంటె గొప్పవాడు గాని, లక్ష్మణునితో సమానుడు గాని మరొకడు ఎవ్వడైనా ఉన్నాడా ! అగ్నివాయువులతో సమానులైన ఆ సోదరులిద్దరూ నీకు ఆశ్రయముగా ఉన్నారు కదా ! నీకేమి భయము? 53

మూ. నాస్మింశ్చిరం వత్స్యసి దేవి దేశే
రక్షోగణైరధ్యుషితేఽతిరౌద్రే,
న తే చిరాదాగమనం ప్రియస్య
క్షమస్వ మత్సంగమకాలమాత్రమ్. 54

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే సున్దరకాణ్డే
ఏకోనచత్వారింశః సర్గః.

ప్ర. అ. దేవి=ఓ సీతాదేవీ ! రక్షోగణైః=రాక్షససముదాయములచేత, అధ్యుషితే=అధిష్ఠింపబడిన, అతిరౌద్రే=చాల భయంకరమైన, అస్మిన్ దేశే=ఈ ప్రదేశమునందు, చిరమ్=చిరకాలము, న వత్స్యసి=నివసించవు. తే ప్రియస్య=నీ భర్త యొక్క, ఆగమనమ్=రాక, చిరాత్=ఆలస్యముగా, న=కాదు. మత్సంగమ కాలమాత్రమ్=నేను చేరునంతసమయము మాత్రమే, క్షమస్వ=ఓపికపట్టుము.

తా. ఓ !దేవీ ! రాక్షసగణములతో నిండి అతిభయంకరమైన ఈ ప్రదేశములో ఇంక నీవు చాలకాలము ఉండవు. రాముడిక్కడికి వచ్చుటలో ఏ మాత్రము ఆలస్యము ఉండదు. నేను తిరిగి వెళ్ళి ఆ రాముణ్ణి కలిసే టంతకాలము ఓపికపట్టుము. 54

*"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు
సుందరకాండలో ముప్పదితొమ్మిదవ సర్గ సమాప్తము.*

అథ చత్వారింశః సర్గః

[సీత రామునకు మరల సందేశము ఇచ్చుట. హనుమంతుడు ఆమెను ఓదార్చి ఉత్తర దిక్కువైపు ప్రయాణమగుట].

మూ. శ్రుత్వా తు వచనం తస్య వాయుసూనోర్మహాత్మనః,
ఉవాచాత్మహితం వాక్యం సీతా సురసుతోపమా. 1

ప్ర. అ. మహాత్మనః=మహాత్ముడైన, తస్య=ఆ, వాయుసూనోః=హనుమంతునియొక్క, వచనమ్=వచనమును, శ్రుత్వా=విని, సురసుతోపమా=దేవకన్యతో సమానురాలైన, సీతా=సీత, ఆత్మహితమ్=తనకు హితమైన, వాక్యమ్=వాక్యమును, ఉవాచ=పలికెను.

తా. దేవకన్యతో సమానురాలైన సీత, మహాత్ముడైన హనుమంతుని మాటలు విని, తనకు హితమైన వాక్యము ఇట్లు పలికెను. 1

మూ. త్వాం దృష్ట్వా ప్రియవక్తారం సంప్రహృష్యామి వానర,
అర్థసంజాతసస్యేవ వృష్టిం ప్రాప్య వసుంధరా. 2

ప్ర. అ. వానర=హనుమంతుడా ! ప్రియవక్తారమ్=ప్రియముగా మాటలాడు, త్వామ్=నిన్ను, దృష్ట్వా=చూచి, (నేను), అర్థసంజాతసస్యా=సగముమొలిచిన సస్యము గల, వసుంధరా=భూమి, వృష్టిమ్=వర్షమును, ప్రాప్యేవ=పొందివలె, సంప్రహృష్యామి=సంతోషించుచున్నాను.

తా. హనుమంతుడా ! సగము సగము సస్యము మొలిచిన భూమి వర్షము పడగానే వికసించినట్లు మంచి మాటలు చెప్పుచున్న నిన్ను చూచి, నేను ఆనందించుచున్నాను. 2

మూ. యథా తం పురుషవ్యాఘ్రం గాత్రైః శోకాభికర్శితైః,
సంస్పృశేయం సకామాహం తథా కురు దయాం మయి. 3

ప్ర. అ. సకామా=కోరికతో కూడిన, అహమ్=నేను, శోకాభికర్శితైః=శోకముచేత కృశింపచేయబడిన, గాత్రైః=అవయవములచేత, తం పురుషవ్యాఘ్రమ్=పురుషులలో శ్రేష్ఠుడైన ఆ రాముని, యథా=ఎట్లు, సంస్పృశేయమ్=స్పృశింతునో, తథా=అట్లు, మయి=నాయందు, దయామ్=దయను, కురు=చేయుము.

తా. దుఃఖముచేత కృశించిన అవయవములతో నేను పురుషశ్రేష్ఠుడైన ఆ రాముణ్ణి స్పృశింపవలెనని నాకు కోరిక ఉన్నది. నా పై దయచూపి ఆ కోరిక సఫలమగునట్లు చేయుము. 3

మూ. అభిజ్ఞానం చ రామస్య దద్యా హరిగణోత్తమ,
క్షిప్తామిషీకాం కాకస్య కోపాదేకాక్షిశాతనీమ్. 4

ప్ర. అ. హరిగణోత్తమ=వానరుల గణములో ఉత్తముడవైన ఓ !హను మంతుడా ! కోపాత్=కోపమువలన, క్షిప్తామ్=విసరబడినదీ, కాకస్య=కాకియొక్క, ఏకాక్షిశాతనీమ్=ఒక కన్నును నశింపచేసినదీ అయిన, ఇషీకామ్=ఇషీక అను తృణమును, రామస్య=రామునకు, అభిజ్ఞానమ్=ఆనవాలుగా, దద్యాః=ఇమ్ము. (చెప్పుము).

తా. హనుమంతుడా ! కోపముతో కాకిపై విసరగా దాని కన్నును నశింపచేసిన ఇషీకను రామునకు ఆనవాలుగా చెప్పుము. 4

మూ. మనఃశిలాయాస్తిలకో గణ్డపార్శ్వే నివేశితః,
త్వయా ప్రణష్టే తిలకే తం కిల స్మర్తుమర్హసి. 5

ప్ర. అ. తిలకే=బొట్టు, ప్రణష్టే=చెరిగిపోయినదగుచుండగా, త్వయా=నీ చేత, మనశ్శిలాయాః=మణిసిలయొక్క, తిలకః=బొట్టు, గణ్డపార్శ్వే=చెక్కిలి ప్రక్క, నివేశితః కిల=ఉంచబడినది కదా ! తమ్=దానిని, స్మర్తుమ్=స్మరించుటకు, అర్హసి=తగియున్నావు.

తా. "రామా ! ఒకనాడు నా నుదుట తిలకము చెరిగిపోయెను. అప్పుడు నీవు మణిసిల తీసి, దానితో, నుదుట తిలకము ఉంచుటకు బదులు గండస్థలము పై ఉంచితివి. ఆ విషయమును గుర్తు చేసికొనుము". 5

మూ. స వీర్యవాన్కథం సీతాం హృతాం సమనుమన్యసే,
వసన్తీం రక్షసాం మధ్యే మహేన్ద్రవరుణోపమః. 6

ప్ర. అ. వీర్యవాన్=పరాక్రమవంతుడవు, మహేన్ద్రవరుణోపమః=మహేంద్రునితోను వరుణునితోను సమానుడవూ అయిన, సః=అట్టి నీవు, హృతామ్=హరించబడినదై, రక్షసామ్=రాక్షసులయొక్క, మధ్యే=మధ్యయందు, వసన్తీమ్=నివసించుచున్న, సీతామ్=సీతను, కథమ్=ఎట్లు, సమనుమన్యసే=అట్లే ఉండిపోవుటకు అంగీకరించుచున్నావు?

తా. "పరాక్రమవంతుడవు, మహేంద్రవరుణులతో సమానుడవు అయిన అట్టి నీవు, సీత (నేను) హరింపబడి రాక్షసుల మధ్య నివసించుచుండగా ఎందుకు ఉపేక్షించుచున్నావు"? 6

మూ. ఏష చూడామణిర్దివ్యో మయా సుపరిరక్షితః,
ఏతం దృష్ట్వా ప్రహృష్యామి వ్యసనే త్వామివానఘ. 7

ప్ర. అ. అనఘ=దోషములు లేని రామా ! దివ్యః=దివ్యమైన, ఏషః=ఈ, చూడామణిః=చూడామణి, మయా=నాచేత, సుపరిరక్షితః=బాగుగా రక్షింపబడినది. వ్యసనే=దుఃఖమునందు, ఏతమ్=దీనిని, దృష్ట్వా=చూచుకొని, త్వామివ=నిన్ను చూచినట్లు, ప్రహృష్యామి=సంతోషించుచున్నాను.

తా. "దోషములేవీ లేని ఓ !రామా ! దివ్యమైన ఈ చూడామణిని చాల జాగర్తతో కాపాడుకొనుచున్నాను. ఈ దుఃఖకాలములో దీనిని చూచుకొనుచు, నిన్ను చూచినట్లు సంతోషించుచున్నాను". 7

మూ. ఏష నిర్యాతితః శ్రీమాన్మయా తే వారిసమ్భవః,
అతః పరం న శక్ష్యామి జీవితుం శోకలాలసా. 8

ప్ర. అ. శ్రీమాన్=శోభకలదీ, వారిసంభవః=ఉదకములో జనించినదీ అయిన, ఏషః=ఈ చూడామణి, తే=నీకు, నిర్యాతితః=పంపివేయబడినది. శోకలాలసా=దుఃఖముచేత వ్యాకులురాల నైన నేను, అతః పరమ్=ఇటు పైన, జీవితుమ్=జీవించుటకు న శక్ష్యామి=సమర్థురాలను కాను.

తా. "జలములో పుట్టిన, శోభాయుక్తమైన ఈ చూడామణిని నీకు పంపివేయుచున్నాను. శోకముతో వ్యాకులురాలనైన నేను ఇటుపైన జీవింపజాలను".

మూ. అసహ్యాని చ దుఃఖాని వాచశ్చ హృదయచ్ఛిదః,
రాక్షసీనాం సుఘోరాణాం త్వత్కృతే మర్షయామ్యహమ్. 9

ప్ర. అ. అహమ్=నేను, అసహ్యాని=సహింప శక్యము కాని, దుఃఖాని=దుఃఖములను, సుఘోరాణామ్=చాల భయంకరలైన, రాక్షసీనామ్=రాక్షస స్త్రీలయొక్క, హృదయచ్ఛిదః=హృదయములను ఛేదించు, వాచశ్చ=మాటలను, త్వత్కృతే=నీ నిమిత్తమై, మర్షయామి=సహించుచున్నాను.

తా. "నీవు ఏనాటికైన రాకపోదువా అను ఆశతో భరింపరాని కష్టములను, చాల భయంకరములైన రాక్షసస్త్రీల మాటలను నేను సహించుచున్నాను." 9

మూ. ధారయిష్యామి మాసం తు జీవితం శత్రుసూదన,
ఊర్ధ్వం మాసాన్న జీవిష్యే త్వయా హీనా నృపాత్మజ. 10

ప్ర. అ. శత్రుసూదన=శత్రువులను నశింపచేయువాడా ! నృపాత్మజ=రాజకుమారా !మాసం తు=ఒక్క మాసముమాత్రమే, జీవితమ్=జీవితమును,

ధారయిష్యామి=ధరించెదను. త్వయా=నీతో, హీనా=శూన్యురాలనైన నేను, మాసాత్=ఒక మాసము కంటె, ఊర్ధ్వమ్=పైన, న జీవిష్యే=జీవించను.

తా. "శత్రుసంహారకుడవైన రామా ! నేను ఒక్క మాసము మాత్రమే జీవించగలను. అటుపైన, నీవు లేకుండా జీవించజాలను." 10

మూ. ఘోరో రాక్షసరాజోఽయం దృష్టిశ్చ న సుఖా మయి,
త్వాం చ శ్రుత్వా విషజ్జన్తం న జీవేయమహం క్షణమ్. 11

ప్ర. అ. అయమ్=ఈ, రాక్షసరాజః=రాక్షసరాజు, ఘోరః=భయంకరమైన వాడు. మయి=నావిషయమునందు, దృష్టిః=ఆతని దృష్టి, సుఖా=సుఖకరమైనదిగా, న=లేదు. త్వామ్=నిన్ను, విషజ్జన్తమ్=ఆలస్యము చేయుచున్నవానినిగా, శ్రుత్వా=విని, అహమ్=నేను, క్షణమ్=క్షణకాలమైనా, న జీవేయమ్=జీవించను.

తా. "ఈ రావణుడు చాల క్రూరుడు. నా విషయములో ఈతని దృష్టి సరిగా లేదు. నీవు ఇంకా ఆలస్యము చేయుచున్నావని తెలిసినచో నేను క్షణకాలమైనను జీవించను". 11

మూ. వైదేహ్యా వచనం శ్రుత్వా కరుణం సాశ్రు భాషితమ్,
అథాబ్రవీన్మహాతేజా హనుమాన్మారుతాత్మజః. 12

ప్ర. అ. అథ=అటుపిమ్మట, మహాతేజాః=గొప్ప తేజస్సు గల, మారుతాత్మజః=వాయుపుత్రుడైన హనుమాన్=హనుమంతుడు, సాశ్రు=కన్నీళ్ళతో కూడినట్లుగా, భాషితమ్=పలకబడిన, కరుణమ్=దీనమైన, వైదేహ్యాః=సీతయొక్క, వచనమ్=వచనమును, శ్రుత్వా=విని, అబ్రవీత్=పలికెను.

తా. పిమ్మట, గొప్పతేజస్సు గల, మారుతాత్మజుడైన హనుమంతుడు, ఆ సీత కన్నీళ్లు కార్చుచు దీనముగా పలికిన మాటలను విని ఇట్లనెను. 12

మూ. త్వచ్ఛోకవిముఖో రామో దేవి సత్యేన తే శపే.
రామే దుఃఖాభిభూతే తు లక్ష్మణః పరితప్యతే. 13
కథంచిద్భవతీ దృష్టా న కాలః పరిశోచితమ్,
ఇమం ముహూర్తం దుఃఖానామన్తం ద్రక్ష్యసి భామిని. 14
తావుభౌ పురుషవ్యాఘ్రౌ రాజపుత్రావరిందమౌ,
త్వద్దర్శనకృతోత్సాహౌ లఙ్కాం భస్మీకరిష్యతః. 15
హత్వా చ సమరే క్రూరం రావణం సహబాంధవమ్,
రాఘవౌ త్వాం విశాలాక్షి స్వాం పురీం ప్రాపయిష్యతః. 16

ఈ శ్లోకాలు నాలుగూ 38వ సర్గలో 50, 51, 52, 53 శ్లోకాలుగా చిన్న చిన్న మార్పులతో ఉన్నవి. 14వ శ్లోకంలో 'అనిందితే'కి బదులు 'భామిని' (ఓ !వనితా !)అని ఉన్నది. 15వ శ్లోకంలో 'మహాబలౌ'కు బదులు 'అరిందమౌ' (శత్రునాశకులు) అని ఉన్నది. 16వ శ్లోకం చివరి రెండుపాదాలు "రామస్త్వాం విశాలాక్షి నేష్యతి స్వాం పురీం ప్రతి"కి బదులు పై విధముగా ఉన్నది. "రామలక్ష్మణులు నిన్ను తమ పురమునకు తీసికొని వెళ్ళగలరు" అని అర్థము.

మూ. యత్తు రామో విజానీయాదభిజ్ఞానమనిన్దితే,
ప్రీతిసంజననం తస్య భూయస్త్వం దాతుమర్హసి. 17

ప్ర. అ. అనిన్దితే=నిందింపబడని ఓ సీతాదేవీ ! రామః=రాముడు, యత్=ఏ, అభిజ్ఞానమ్=ఆనవాలును, విజానీయాత్=గుర్తించునో, తస్య=ఆ రామునకు, ప్రీతిసంజననమ్=సంతోషమును కలిగించు, అట్టి ఆనవాలును, భూయః=మరల, త్వమ్=నీవు, దాతుమ్=ఇచ్చుటకు, అర్హసి=తగి యున్నావు.

తా. దోషములు లేని సీతాదేవీ ! రాముడు గుర్తించగలిగిన, రామునకు సంతోషము కలిగించు మరొక అభిజ్ఞానమేదైన ఉన్నచో అది కూడ ఇమ్ము. 17

మూ. సాఽబ్రవీద్దత్తమేవేతి మయాభిజ్ఞానముత్తమమ్,
ఏతదేవ హి రామస్య దృష్ట్వా మత్కేశభూషణమ్, 18
శ్రద్ధేయం హనుమన్వాక్యం తవ వీర భవిష్యతి.

ప్ర. అ. మయా=నాచేత, ఉత్తమమ్=ఉత్తమమైన, అభిజ్ఞానమ్=అభిజ్ఞానము, దత్తమేవ=ఇవ్వబడినదే, ఇతి=అని, సా=ఆమె, అబ్రవీత్=పలికెను. వీర=వీరుడా ! హనుమన్=హనుమంతుడా ! ఏతత్=ఈ, మత్కేశభూషణమ్=నా కేశాలంకారమైన చూడారత్నమును, దృష్ట్వా=చూచి, తవ వాక్యమ్=నీమాట, రామస్య=రామునకు, శ్రద్ధేయమ్=విశ్వసింపదగినది, భవిష్యతి=కాగలదు.

తా. "ఉత్తమమైన అభిజ్ఞానమును నీ కిదివరకే ఇచ్చినాను. వీరుడవైన ఓ ! హనుమంతుడా !నా కేశభూషణమైన ఈ మణిని చూడగానే రాముడు నీ మాటలు విశ్వసించును" అని సీత పలికెను. 18

మూ. స తం మణివరం గృహ్య శ్రీమాన్ ప్లవగసత్తమః, 19
ప్రణమ్య శిరసా దేవీం గమనాయోపచక్రమే.

ప్ర. అ. శ్రీమాన్=శ్రీమంతుడైన, సః=ఆ, ప్లవగసత్తమః=వానరశ్రేష్ఠుడు, తం మణివరమ్=శ్రేష్ఠమైన ఆ మణిని, గృహ్య=గ్రహించి, దేవీమ్=సీతాదేవిని, శిరసా=శిరస్సులో, ప్రణమ్య=నమస్కరించి, గమనాయ=వెళ్లుటకు, ఉపచక్రమే=ప్రారంభించెను.

తా. శ్రీమంతుడు, వానరులలో శ్రేష్ఠుడూ అయిన హనుమంతుడు ఆ శ్రేష్ఠమైన మణిని గ్రహించి, సీతకు తల వంచి నమస్కరించి తిరిగి వెళ్ళుటకు బయలుదేరెను. 19

మూ. తముత్పాతకృతోత్సాహమవేక్ష్య హరిపుఙ్గవమ్, 20
వర్ధమానం మహావేగమువాచ జనకాత్మజా,
అశ్రుపూర్ణముఖీ దీనా బాష్పగద్గదయా గిరా. 21

ప్ర. అ. జనకాత్మజా=సీతాదేవి, ఉత్పాతకృతోత్సాహమ్=ఎగురుట యందు చేయబడిన ఉత్సాహము కలవాడూ, వర్ధమానమ్=పెరుగుచున్నవాడూ, మహావేగమ్=గొప్ప వేగము గలవాడూ అయిన, తం హరిపుఙ్గవమ్=ఆ వానరశ్రేష్ఠుని, అవేక్ష్య=చూచి, అశ్రుపూర్ణముఖీ=కన్నీళ్ళతో నిండిన ముఖము కలదై, దీనా=దీనురాలై, బాష్పగద్గదయా=బాష్పముతో డగ్గుత్తిక చెందిన, గిరా=వాక్కుతో, ఉవాచ=పలికెను.

తా. వానరశ్రేష్ఠుడైన హనుమంతుడు పైకి ఎగురుటకు ఉత్సాహముతో దేహమును పెంచుచుండగా, మహావేగవంతుడైన ఆతనిని చూచి సీత కన్నీళ్లతో నిండిన ముఖముతో, దీనురాలై, బాష్పముచేత డగ్గుత్తికతో కూడిన కంఠస్వరముతో ఇట్లు పలికెను. 20, 21

మూ. హనుమన్ సింహసంకాశౌ భ్రాతరౌ రామలక్ష్మణౌ,
సుగ్రీవం చ సహామాత్యం సర్వాన్ బ్రూయా హ్యనామయమ్. 22

ప్ర. అ. హనుమన్=హనుమంతుడా ! సింహసంకాశౌ=సింహములతో సమానులైన, భ్రాతరౌ=సోదరులైన, రామలక్ష్మణౌ=రామలక్ష్మణులను, సహామాత్యమ్=మంత్రులతో కూడిన, సుగ్రీవం చ=సుగ్రీవునీ, సర్వాన్=మిగిలిన అందరినీ గూర్చి, అనామయమ్=ఆరోగ్యమును, బ్రూయాః=చెప్పుము.

తా. హనుమంతుడా !సింహముల వంటి వారైన, సోదరులైన రామలక్ష్మణులనూ, అమాత్యసమేతుడైన సుగ్రీవునీ, ఇతరులందరినీ, నేను కుశల మడిగినట్లు చెప్పుము. 22

మూ. యథా చ స మహాబాహుర్మాం తారయతి రాఘవః,
అస్మాద్దుఃఖామ్బుసంరోధాత్త్వం సమాధాతుమర్హసి. 23

(ఇదే శ్లోకము 39వ సర్గలో 9 వ శ్లోకంగా వచ్చినది. అది చూడుడు.)

మూ. ఇమం చ తీవ్రం మమ శోకవేగం
రక్షోభిరేభిః పరిభర్త్సనం చ,

బ్రూయాస్తు రామస్య గతః సమీపమ్
శివశ్చ తేఽధ్వాస్తు హరిప్రవీర. 24

ప్ర. అ. హరిప్రవీర=వానరులలో గొప్ప వీరుడా ! రామస్య=రాముని యొక్క, సమీపమ్=సమీపమును గూర్చి, గతః=వెళ్ళినవాడవై, మమ=నా యొక్క, ఇమమ్=ఈ, తీవ్రమ్=తీవ్రమైన, శోకవేగమ్=శోకముయొక్క వేగమును, ఏభిః=ఈ, రక్షోభిః=రాక్షసస్త్రీలచేత, పరిభర్త్సనం చ=భయపెట్టుటను, బ్రూయాః=చెప్పుము. తే=నీయొక్క, అధ్వా=మార్గము, శివః=మంగళకరమైనది, అస్తు=అగుగాక.

తా. ఓ !వానరవీరుడా ! నీవు రాముని వద్దకు వెళ్ళి తీవ్రమైన నా ఈ దుఃఖవేగమును గూర్చి, ఈ రాక్షసస్త్రీలు నన్ను భయపెట్టుచున్నారను విషయము ఆయనకు తెలుపుము. నీ మార్గము సుఖకరమగుగాక. 24

మూ. స రాజపుత్ర్యా ప్రతివేదితార్థః
కపిః కృతార్థః పరిహృష్టచేతాః,
అల్పావశేషం ప్రసమీక్ష్య కార్యం
దిశం హ్యుదీచీం మనసా జగామ. 25

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే సున్దరకాణ్డే
చత్వారింశః సర్గః.

ప్ర. అ. సః కపిః=ఆ హనుమంతుడు, రాజపుత్ర్యా=రాజకుమారియైన సీతచేత, ప్రతివేదితార్థః=తెలుపబడిన విషయము గలవాడై, కృతార్థః=సాధింపబడిన కార్యము గలవాడై, పరిహృష్టచేతాః=సంతోషించిన మనస్సు గలవాడై, కార్యమ్=కార్యమును, అల్పావశేషమ్=కొంచెమే మిగిలి ఉన్న దానినిగా, ప్రసమీక్ష్య=చూచి, ఉదీచీమ్=ఉత్తరము, దిశమ్=దిక్కును గూర్చి, మనసా=మనస్సుతో, జగామ=వెళ్ళెను.

తా. కార్యము సాధించుటచే సంతోషించుచున్న మనస్సు గల ఆ హనుమంతుడు, సీత చెప్పిన విషయములన్నీ గ్రహించి, ఇంక చేయవలసినది కొంచెమే మిగిలిఉన్నదని అనుకొనుచు, ఉత్తరపు దిక్కునకు వెళ్ళిపోయినట్లే భావించెను. 25

*"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు
సుందరకాండలో నలుబదవ సర్గ సమాప్తము.*

అథ ఏకచత్వారింశః సర్గః

[హనుమంతుడు ఉద్యానమును ధ్వంసము చేయుట]

మూ. స చ వాగ్భిః ప్రశస్తాభిర్గమిష్యన్ పూజితస్తయా,
తస్మాద్దేశాదపక్రమ్య చిన్తయామాస వానరః. 1

ప్ర. అ. గమిష్యన్=వెళ్ళనున్న, సః వానరః=ఆ హనుమంతుడు, తయా=సీతచేత, ప్రశస్తాభిః=ప్రశస్తములైన, వాగ్భిః=మాటలతో, పూజితః=ఆదరించ బడినవాడై, తస్మాత్=ఆ, దేశాత్=ప్రదేశమునుండి, అపక్రమ్య=దూరముగా వెళ్ళి, చిన్తయామాస=ఆలోచించెను.

తా. తిరిగి వెళ్లుటకు సిద్ధముగా ఉన్న ఆ హనుమంతుని ఆ సీత మంచి మాటలతో ఆదరించెను. పిదప ఆతడు ఆ ప్రదేశమునుండి కొంచెము దూరముగా వెళ్ళి ఇట్లు ఆలోచించెను. 1

మూ. అల్పశేషమిదం కార్యం దృష్టేయమసితేక్షణా,
త్రీనుపాయానతిక్రమ్య చతుర్థ ఇహ దృశ్యతే. 2

ప్ర. అ. ఇదం కార్యమ్=ఈ పని, అల్పశేషమ్=కొంచెము మిగిలిఉన్నది. ఇయమ్=ఈ, అసితేక్షణా=నల్లనినేత్రములు గల సీత, దృష్టా=చూడబడినది. త్రీన్=మూడు, ఉపాయాన్=ఉపాయములను, అతిక్రమ్య=దాటి, ఇహ=ఇక్కడ, చతుర్థః=నాల్గవ ఉపాయము, దృశ్యతే=చూడబడుచున్నది.

తా. నల్లని కన్నులు గల ఈ సీతను చూచినాను. ఇంక నేను చేయవలసినది కొంచెమే మిగిలి ఉన్నది. ఇప్పుడు సామదానభేదములను మూడు ఉపాయములను విడిచిపెట్టి నాల్గవదైన దండోపాయమునే ప్రయోగించవలసి ఉన్నది. 2

మూ. న సామ రక్షస్సు గుణాయ కల్పతే
న దానమర్థోపచితేషు యుజ్యతే,
న భేదసాధ్యా బలదర్పితా జనాః
పరాక్రమస్త్వేవ మమేహ రోచతే. 3

ప్ర. అ. రక్షస్సు=రాక్షసుల విషయములో, సామ=సామోపాయము (మంచిమాటలు చెప్పుట), గుణాయ=గుణమునకు, న కల్పతే=సమర్థము కాదు. అర్థోపచితేషు=ధనముచేత బలిసిన వారి విషయమున, దానమ్=దానోపాయము, న యుజ్యతే=యుక్తము కాదు. బలదర్పితాః=బలముచేత గర్వించిన, జనాః= జనులు, భేదసాధ్యాః=భేదోపాయముచేత (విడదీయుటచేత) సాధింపదగినవారు, న=కారు. ఇహ=ఇక్కడ, మమ=నాకు, పరాక్రమస్త్వేవ=పరాక్రమమొక్కటే, రోచతే=ఇష్టమగుచున్నది.

తా. రాక్షసుల విషయములో సామోపాయము కుదరదు. ధనముతో బలిసి యున్నవాళ్ల విషయములో దానము పనిచేయదు. బలముతో గర్వించి ఉన్నవాళ్ల విషయములో భేదోపాయము సరిపడదు. అందుచేత ఇప్పుడు నాకు పరాక్రమమును చూపుట అనునది ఒక్కటే సమంజసమని కనబడుచున్నది. 3

మూ. న చాస్య కార్యస్య పరాక్రమాదృతే
వినిశ్చయః కశ్చిదిహోపపద్యతే,
హతప్రవీరా హి రణే హి రాక్షసాః
కథం చిదీయుర్యదిహాద్య మార్దవమ్. 4

ప్ర. అ. ఇహ=ఇక్కడ, అస్య=ఈ, కార్యస్య=కార్యమునకు, పరాక్రమాత్ ఋతే=పరాక్రమము తప్ప, వినిశ్చయః=నిర్ణయము, కశ్చిత్=ఏదీ, న ఉపపద్యతే=కుదరదు. యత్=ఎందువలన అనగా, రణే=యుద్ధమునందు, హతప్రవీరాః=చంపబడిన వీరులు గలవారై, రాక్షసాః=రాక్షసులు, అద్య=ఇప్పుడు, ఇహ=ఇక్కడ, కథం చిత్=ఎట్లో, మార్దవమ్=మృదుత్వమును, ఈయుః=పొందవచ్చును.

తా. ఇక్కడ ఈ కార్యమునందు పరాక్రమము చూపుట తప్ప మరొక ఉపాయమేదీ లేదు, ఎందుచేతననగా యుద్ధములో మహావీరులనందరినీ చంపివేసినచో మిగిలిన రాక్షసులు ఏదో విధముగా ఇప్పుడు లొంగిపోవచ్చును.

మూ. కార్యే కర్మణి నిర్దిష్టే యో బహూన్యపి సాధయేత్,
పూర్వకార్యావిరోధేన స కార్యం కర్తుమర్హతి. 5

ప్ర. అ. కార్యే=చేయదగిన, కర్మణి=పని, నిర్దిష్టే=చెప్పబడినదగుచుండగా, యః=ఎవ్వడు, పూర్వకార్యావిరోధేన=మొదటి పనికి విరోధములేకుండునట్లు, బహూన్యపి=అధికములైన కార్యములను కూడ, సాధయేత్=సాధించునో, సః=అతడు, కార్యమ్=కార్యమును, కర్తుమ్=చేయుటకు, అర్హతి=తగియున్నాడు.

తా. ఏదైన ఒక కార్యము చేయవలెనని ఆజ్ఞాపించినపుడు, ఆ కార్యమునకు విరోధము లేకుండా ఇతరములైన అనేక కార్యములను కూడ ఎవడు సాధించునో అతడే కార్యములను సాధింపసమర్థుడు. 5

మూ. న హ్యేకః సాధకో హేతుః స్వల్పస్యాపీహ కర్మణః,
యో హ్యర్థం బహుధా వేద స సమర్థోఽర్థసాధనే. 6

ప్ర. అ. ఇహ=ఇక్కడ (కార్యములను సాధించు విషయములో), స్వల్పస్య అపి=స్వల్పమే యైనను, కర్మణః=కర్మకు, సాధకః=సాధించే, హేతుః=హేతువు, ఏకః=ఒక్కటే, న హి=కాదు కదా. యః=ఎవడు, అర్థమ్=కార్యమును, బహుధా=అనేకవిధములుగా, వేద=ఎరుగునో, సః=ఆతడే, అర్థసాధనే=కార్యమును సాధించుటయందు, సమర్థః=సమర్థుడు.

తా. ఎంత చిన్న కార్యమైనా, దాని సాధించుటకు ఒకే ఉపాయముండదు. అనేక ఉపాయములుండవచ్చును. అందుచేత ఒక కార్యమును సాధించుటకు అనేకములైన ఉపాయములు ఎవనికి తెలియునో ఆతడే కార్యములు సాధించుటకు సమర్థుడు. 6

మూ. ఇహైవ తావత్కృతనిశ్చయో హ్యహం
యది వ్రజేయం ప్లవగేశ్వరాలయమ్,
పరాత్మసమ్మర్దవిశేషతత్త్వవి
త్తతః కృతం స్యాన్మమ భర్తృశాసనమ్. 7

ప్ర. అ. అహమ్=నేను, ఇహైవ తావత్=ఇక్కడనే, పరాత్మసమ్మర్దవిశేషతత్త్వవిత్=శత్రువులయొక్క, మనవారియొక్క యుద్ధమునందలి విశేషమును తెలిసికొన్నవాడనై, ప్లవగేశ్వరాలయమ్=సుగ్రీవుని గృహమును గూర్చి, వ్రజేయం యది=వెళ్ళినట్లయితే, తతః=అప్పుడు, మమ=నాకు (నాచేత), భర్తృశాసనమ్=ప్రభువు ఆజ్ఞ, కృతమ్=చేయబడినది, స్యాత్=అగును.

తా. యుద్ధములో శత్రువుల బలమునందు, మనవారి బలమునందు ఎట్టి తారతమ్యమున్నదో నేను ఇక్కడనే తెలుసుకొని, అటుపిమ్మట సుగ్రీవుని వద్దకు వెళ్ళినచో అప్పుడు నేను ప్రభువు ఆజ్ఞను బాగుగా నిర్వహించినట్లు అగును. 7

మూ. కథం ను ఖల్వద్య భవేత్సుఖాగతం
ప్రసహ్య యుద్ధం మమ రాక్షసైః సహ,
తథైవ ఖల్వాత్మబలం చ సారవ
త్సమానయేన్మాం చ రణే దశాననః. 8

ప్ర. అ. అద్య=ఇప్పుడు, మమ=నాకు, రాక్షసైః సహ=రాక్షసులతో కూడ, ప్రసహ్య=బలాత్కారముగా, (తప్పక) యుద్ధమ్=యుద్ధము, కథం ను=ఎటుల, సుఖాగతమ్=సుఖముగా వచ్చినది. భవేత్=అగునో ! తథైవ=అట్లే (మరియు)

ఆత్మబలం చ=నా బలము, సారవత్=సారము (ఫలము) కలది, ఎట్లగునో ! సః=ఆ, దశాననః చ=రావణుడు కూడ, మామ్=నన్ను, రణే=యుద్ధమునందు, మానయేత్=గౌరవించునో !

తా. నా కిప్పుడు రాక్షసులతో సులభముగా, యుద్ధము, తప్పక వచ్చే ఉపాయమేమో కదా ! అట్లే నా బలము సఫలము ఎట్లగునో కదా ! ఆ రావణుడు యుద్ధములో నన్నెట్లు మెచ్చునో కదా ! 8

మూ. తతః సమాసాద్య రణే దశాననం
సమన్త్రివర్గం సబలప్రయాయినమ్,
హృది స్థితం తస్య మతం బలం చ వై
సుఖేన మత్త్వాఽహమితః పునర్వ్రజే. 9

ప్ర. అ. తతః=అటుపిమ్మట, సమన్త్రివర్గమ్=మంత్రిగణముతో కూడిన, సబలప్రయాయినమ్=సైన్యముతోను అనుచరులతోను కూడిన, దశాననమ్=రావణుని,రణే=యుద్ధమునందు, సమాసాద్య=పొంది, తస్య=వానియొక్క, హృది=హృదయమునందు, స్థితమ్=ఉన్న, మతమ్=అభిప్రాయమును, బలం చ వై=బలమును, మత్త్వా=తెలిసికొని, అహమ్=నేను, ఇతః=ఇక్కడినుండి, సుఖేన=సుఖముతో, పునః=మరల, వ్రజే=వెళ్లెదను.

తా. రావణుని, ఆతని మంత్రులను, సైన్యమును, అనుచరులను యుద్ధములో ఎదిరించి, ఆతని మనస్సులో ఉన్న అభిప్రాయమును, ఆతని కున్న బలమును తెలిసికొని, నేను సుఖముగా ఇక్కడినుండి తిరిగి వెళ్లెదను. 9

మూ. ఇదమస్య నృశంసస్య నన్దనోపమముత్తమమ్,
వనం నేత్రమనఃకాన్తం నానాద్రుమలతాయుతమ్. 10

ప్ర. అ. నృశంసస్య=క్రూరుడైన, అస్య=ఈ రావణునియొక్క, ఇదమ్=ఈ, నేత్రమనఃకాన్తమ్=నేత్రములకు, మనస్సుకూ మనోహరమైన, నానాద్రుమలతాయుతమ్=అనేకవిధములైన, వృక్షములతోను లతలతోను కూడిన, ఉత్తమమ్=ఉత్తమమైన, వనమ్=ఉద్యానవనము, నన్దనోపమమ్=నందనవనముతో సమానమైనది.

తా. క్రూరుడైన ఈ రావణుని ఉత్తమమైన ఉద్యానవనము అనేక విధములైన వృక్షములతోను, లతలతోను, నేత్రములను, మనస్సును ఆకర్షించునదై నందనవనము వలె ఉన్నది. 10

మూ. ఇదం విధ్వంసయిష్యామి శుష్కం వనమివానలః,
అస్మిన్ భగ్నే తతః కోపం కరిష్యతి దశాననః. 11

ప్ర. అ. శుష్కమ్=ఎండిపోయిన, వనమ్=వనమును, అనలః ఇవ=అగ్ని వలె, ఇదమ్=ఈ వనమును, విధ్వంసయిష్యామి=నశింపచేసెదను. అస్మిన్=ఈ వనము, భగ్నే=భగ్నమైన దగుచుండగా, తతః=అటుపిమ్మట, దశాననః=రావణుడు, కోపమ్=కోపమును, కరిష్యతి=చేయగలడు.

తా. ఎండిపోయిన అడవిని అగ్ని కాల్చివేసినట్లు ఈ ఉద్యానమును నశింపచేసెదను. దీనిని భగ్నము చేసినచో అప్పుడు రావణునకు కోపము కలుగును. 11

మూ. తతో మహత్సాశ్వమహారథద్విపం
బలం సమాదేక్ష్యతి రాక్షసాధిపః,
త్రిశూలకాలాయసపట్టిసాయుధం
తతో మహద్యుద్ధమిదం భవిష్యతి. 12

ప్ర. అ. తతః=అటుపిమ్మట, రాక్షసాధిపః=రావణుడు, సాశ్వమహారథద్విపమ్=అశ్వములతోను, గొప్ప రథములతోను, ఏనుగులతోను కూడిన, మహత్=గొప్ప, త్రిశూలకాలాయసపట్టిసాయుధమ్=త్రిశూలములు, ఇనుముతో చేసిన పట్టిసములు ఆయుధములుగా గల, బలమ్=సైన్యమును, సమాదేక్ష్యతి=ఆజ్ఞాపించగలడు. తతః=అటుపిమ్మట, ఇదమ్=ఈ, మహత్=గొప్ప, యుద్ధమ్=యుద్ధము, భవిష్యతి=కాగలదు.

తా. అప్పుడు రావణుడు అశ్వములతోను, మహారథములతోను (లేదా మహారథులతోను) ఏనుగులతోను నిండినదీ, త్రిశూలములు ఇనుప పట్టిసములు మొదలైన ఆయుధములతో కూడినదీ అయిన గొప్ప సైన్యమును ఆజ్ఞాపించగలడు. అప్పుడు గొప్ప యుద్ధము జరుగగలదు. 12

మూ. అహం తు తైః సంయతి చణ్డవిక్రమైః
సమేత్య రక్షోభిరసహ్యవిక్రమః,
నిహత్య తద్రావణచోదితం బలం
సుఖం గమిష్యామి కపీశ్వరాలయమ్. 13

ప్ర. అ. అహం తు=నేను కూడా, చణ్డవిక్రమైః=తీక్ష్ణమైన పరాక్రమము గల, తైః=ఆ, రక్షోభిః=రాక్షసులతో, సంయతి=యుద్ధమునందు, సమేత్య=కలిసి, అసహ్యవిక్రమః=సహింపశక్యము కాని పరాక్రమము గల వాడనై, రావణచోదితమ్=రావణునిచేత ప్రేరేపింపబడిన, తత్=ఆ, బలమ్=సైన్యమును, నిహత్య=చంపి, సుఖమ్=సుఖముగా, కపీశ్వరాలయమ్=సుగ్రీవుని స్థానమును గూర్చి, గమిష్యామి=వెళ్ళగలను.

తా. నేను కూడా తీక్ష్ణమైన పరాక్రమము గల ఆ రాక్షసులను యుద్ధములో ఎదుర్కొని, సహింప శక్యము కాని బలముతో రావణుడు పంపిన ఆ సైన్యమును చంపి, సుఖముగా సుగ్రీవుని వద్దకు వెళ్ళెదను. 13

మూ. తతో మారుతవత్క్రుద్ధో మారుతిర్భీమవిక్రమః,
ఊరువేగేన మహతా ద్రుమాన్ క్షేప్తుమథారభత్. 14

ప్ర. అ. తతః=అటు పిమ్మట, భీమవిక్రమః=భయంకరమైన పరాక్రమము గల, మారుతిః=హనుమంతుడు, క్రుద్ధః=కోపగించినవాడై, అథ=అటు పిమ్మట, మహతా=గొప్ప, ఊరువేగేన=తొడల వేగముచేత, మారుతవత్=వాయువువలె, ద్రుమాన్=వృక్షములను, క్షేప్తుమ్=విసిరివేయుటకు, ఆరభత్=ప్రారంభించెను.

తా. ఈ విధముగా ఆలోచించి, భయంకరమైన పరాక్రమము గల హనుమంతుడు, కోపించినవాడై, గొప్పదైన తొడల వేగముచేత, వృక్షములను వాయువు విరచివేసినట్లు విరచివేసి, పడవేయ ప్రారంభించెను. 14

మూ. తతస్తు హనుమాన్వీరో బభఞ్జ ప్రమదావనమ్,
మత్తద్విజసమాఘుష్టం నానాద్రుమలతాయుతమ్. 15

ప్ర. అ. తతః=అటు పిమ్మట, వీరః=వీరుడైన, హనుమాన్=హనుమంతుడు, మత్తద్విజసమాఘుష్టమ్=మదించిన పక్షులచేత ధ్వనింపచేయుబడినదీ, నానాద్రుమలతాయుతమ్=అనేకములైన వృక్షములతోను లతలతోను కూడినదీ అయిన, ప్రమదావనమ్=ఉద్యానవనమును, బభఞ్జ=విరచెను.

తా. అప్పుడా వీరుడైన హనుమంతుడు, మదించిన పక్షుల ధ్వనితో నిండినదీ, అనేకవిధములైన వృక్షలతాదులతో వ్యాప్తమూ అయిన ఆ ఉద్యానవనమును విరిచివేసెను. 15

మూ. తద్వనం మథితైర్వృక్షైర్భిన్నైశ్చ సలిలాశయైః,
చూర్ణితైః పర్వతాగ్రైశ్చ బభూవాప్రియదర్శనమ్. 16

ప్ర. అ. తత్ వనమ్=ఆ వనము, మథితైః=నలిపివేయబడిన, వృక్షైః=వృక్షములతోను, భిన్నైః=పగలకొట్టబడిన, సలిలాశయైః=చెరువులతోను, చూర్ణితైః=నలగకొట్టబడిన, పర్వతాగ్రైశ్చ=పర్వతశిఖరములతోను, అప్రియదర్శనమ్=సంతోషజనకము కాని దర్శనము కలది, బభూవ=అయెను.

తా. హనుమంతుడు ఆ వనములోని చెట్లు విరుగగొట్టెను. సరస్సుల గట్లు త్రెంచివేసెను. పర్వతశిఖరములను నలగగొట్టెను. ఈ విధముగా ఆ ఉద్యానవనము చూచుటకు సంతోషము కలిగించని స్థితిలో ఉండెను. 16

మూ. నానాశకున్తవిరుతైః ప్రభిన్నైః సలిలాశయైః,
తామ్రైః కిసలయైః క్లాన్తైః క్లాన్తద్రుమలతాయుతమ్. 17
న బభౌ తద్వనం తత్ర దావానలహతం యథా,
వ్యాకులావరణా రేజుర్విహ్వలా ఇవ తా లతాః. 18

ప్ర. అ. క్లాన్తద్రుమలతాయుతమ్=వాడిపోయిన వృక్షములతోను లతలతోను కూడిన, తత్ వనమ్=ఆ వనము, నానాశకున్తవిరుతైః=అనేకవిధములైన పక్షుల ధ్వనులతోను, ప్రభిన్నైః=బ్రద్దలు కొట్టబడిన, సలిలాశయైః=చెరువులతోను, క్లాన్తైః=వాడిపోయిన, తామ్రైః=ఎఱ్ఱని, కిసలయైః=చిగుళ్ళతోను, దావానలహతం యథా=దావాగ్ని చేత కొట్టబడినది వలె, న బభౌ=ప్రకాశించలేదు. వ్యాకులావరణాః=వ్యాకులమైన ఆవరణములు (తీగకు ఆధారముగా ఉండుటకు నిలిపిన కఱ్ఱలు మొదలైనవి) గల, తాః లతాః=ఆ లతలు, విహ్వలాః ఇవ=దుఃఖాక్రాంతలైన స్త్రీల వలె, రేజుః=ప్రకాశించినవి.

తా. ఆ ఉద్యానములో అనేకవిధములైన పక్షులు అరుపులు ప్రారంభించెను. చెరువుల గట్లు తెగిపోయెను. ఎఱ్ఱని చిగుళ్లు, అనేకవిధములైన వృక్షములు, లతలు వాడిపోయెను. ఈ విధముగ అది దావాగ్నిచే కాల్చివేయబడినట్లు కనబడుచుండెను. ఆధారమైన స్తంభములు, చెట్లు మొదలైనవి అస్తవ్యస్తములగుటచేత లతలు, దుఃఖాక్రాంతలైన స్త్రీల వలె పడి యుండెను. 17, 18

మూ. లతాగృహైశ్చిత్రగృహైశ్చ నాశితై
ర్మహోరగైర్వ్యాళమృగైశ్చ నిర్ధుతైః,
శిలాగృహైరున్మథితైస్తథా గృహైః
ప్రణష్టరూపం తదభూన్మహద్వనమ్. 19

ప్ర. అ. మహత్=గొప్పదైన, తత్ వనమ్=ఆ ఉద్యానవనము, నాశితైః=నశింపచేయబడిన, లతాగృహైః=పొదరిండ్లతోను, చిత్రగృహైః=చిత్ర (చిత్తరువులువేసి ఉంచు) గృహములతోను, నిర్ధుతైః=ఎగురగొట్టబడిన, మహోరగైః=మహాసర్పములతోను, వ్యాళమృగైశ్చ=క్రూరమృగములతోను, తథా=మరియు, ఉన్మథితైః=పగులగొట్టబడిన, శిలాగృహైః=ఱాతి ఇండ్లతోను, గృహైః=ఇతరగృహములతోను, ప్రణష్టరూపమ్=నశించిన సౌందర్యము కలది. అభూత్=ఆయెను.

తా. హనుమంతుడు గొప్పదైన ఆ ఉద్యానములోని లతాగృహములను, చిత్రగృహములను నశింపచేసెను. మహాసర్పములను, ఇతరక్రూరమృగములను ఎగురగొట్టెను. ఱాతి కట్టడములను ఇతర గృహములను పడగొట్టెను. అట్టి లతాగృహాదులతో ఆ ఉద్యానము తన సౌందర్యమునంతను కోల్పోయెను. 19

మూ. సా విహ్వలాఽశోకలతాప్రతానా
వనస్థలీ శోకలతాప్రతానా,
జాతా దశాస్యప్రమదావనస్య
కపేర్బలాద్ధి ప్రమదావనస్య. 20

ప్ర. అ. దశాస్యప్రమదా+అవనస్య=రావణుని స్త్రీలను రక్షించు (ఆనందింపచేయు), ప్రమదావనస్య=ఉద్యానముయొక్క, అశోకలతాప్రతానా=అశోకలతల సమూహము గల, సా వనస్థలీ=ఆ వనస్థలి, కపేః=కపియొక్క, బలాత్=బలమువలన, విహ్వలా=వ్యాకులమైనదై, శోకలతాప్రతానా=శోకమను లతల సముదాయము గలదై, జాతా=అయినది. (ప్రతానమనగా వెదుళ్ళు మొదలైన వాటితో ఎత్తుగా, నలుచదరం మొదలైన ఆకారములలో నిర్మించిన పందిరిపై పాకిన తీగల పందిరి).

తా. రావణుని స్త్రీలకు ఆనందము కలిగించు అశోకలతల సముదాయము గల ఆ ఉద్యానవనప్రదేశము, హనుమంతుని బలముచే, శోకమను లతకు ప్రతానముగా (పందిరిగా) అయ్యెను. 20

మూ. స తస్య కృత్వా జగతీపతేర్మహా
న్మహద్వ్యలీకం మనసో మహాత్మనః,
యుయుత్సురేకో బహుభిర్మహాబలైః
శ్రియా జ్వలంస్తోరణమాస్థితః కపిః. 21

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే సున్దరకాణ్డే
ఏకచత్వారింశః సర్గః.

ప్ర. అ. సః మహాకపిః=ఆ హనుమంతుడు, మహాత్మనః=మహాత్ముడైన, తస్య=ఆ, జగతీపతేః=భూమికి ప్రభువైన రావణునియొక్క, మనసః=మనస్సునకు, మహత్=గొప్ప, వ్యలీకమ్=అప్రియమును, కృత్వా=చేసి, మహాబలైః=గొప్ప బలము గల, బహుభిః=అనేకులతో, ఏకః=ఒంటరిగా, యుయుత్సుః=యుద్ధము చేయదలచుచున్నవాడై, శ్రియా=శోభతో, జ్వలన్=ప్రజ్వరిల్లుచు, తోరణమ్=ముఖద్వారమును, ఆస్థితః=ఆశ్రయించిఉండెను.

తా. ఆ హనుమంతుడు మహాత్ముడైన ఆ రావణుని మనస్సునకు ఆ విధముగా గొప్ప అప్రియమును చేసి, చాలమంది మహాబలశాలులైన వీరులతో ఒంటరిగానే యుద్ధము చేయుటకు నిశ్చయించుకొని, ఆ ఉద్యానము తోరణము (ముఖద్వారము) దగ్గర నిలచి ఉండెను. 21

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు
సుందరకాండలో నలుబదియొకటవ సర్గ సమాప్తము.

అథ ద్విచత్వారింశః సర్గః

[ఎవడో ఉద్యానమును ధ్వంసము చేసినట్లు రాక్షసస్త్రీలు తెలుపగా విని రావణుడు కింకరులను పంపగా హనుమంతుడు వాళ్ళను సంహరించుట.]

మూ. తతః పక్షినినాదేన వృక్షభఙ్గస్వనేన చ,
బభూవుస్త్రాససంభ్రాన్తాః సర్వే లఙ్కానివాసినః. 1

ప్ర. అ. తతః=అటుపిమ్మట, పక్షినినాదేన=పక్షుల ధ్వనిచేతను, వృక్షభఙ్గస్వనేన చ=వృక్షములను విరచిన ధ్వనిచేతను, సర్వే=సమస్తమైన, లఙ్కానివాసినః=లంకలో నివసించువారు, త్రాససంభ్రాన్తాః=భయముచేత చలించినవారు, బభూవుః=అయిరి.

తా. అప్పుడు లంకలో ఉన్నవారందరు పక్షుల అరపులు, వృక్షములు విరిగిపోయినపుడు కలిగిన ధ్వనీ విని భయముచేత చలించిపోయిరి. 1

మూ. విద్రుతాశ్చ భయత్రస్తా వినేదుర్మృగపక్షిణః,
రక్షసాం చ నిమిత్తాని క్రూరాణి ప్రతిపేదిరే. 2

ప్ర. అ. మృగపక్షిణః=మృగములూ, పక్షులూ, విద్రుతాః=పారిపోవుచున్నవై, భయత్రస్తాః=భయముతో వ్యాకులములై, వినేదుః=ధ్వనిచేసినవి. రక్షసాం చ=రాక్షసులకు కూడ, క్రూరాణి=క్రూరములైన, నిమిత్తాని=శకునములు, ప్రతిపేదిరే=వచ్చి చేరినవి.

తా. ఆ ఉద్యానములోని మృగములు, పక్షులూ భయముతో వ్యాకులములై పారిపోవుచు ధ్వని చేసెను. రాక్షసులకు భయసూచకములైన శకునములు కనబడినవి. 2

మూ. తతో గతాయాం నిద్రాయాం రాక్షస్యో వికృతాననాః,
తద్వనం దదృశుర్భగ్నం తం చ వీరం మహాకపిమ్. 3

ప్ర. అ. తతః=అటుపిమ్మట, వికృతాననాః=వికృతములైన ముఖములు గల, రాక్షస్యః=రాక్షసస్త్రీలు, నిద్రాయామ్=నిద్ర, గతాయామ్=పోయినదగుచుండగా, భగ్నమ్=విరిగియున్న, తత్ వనమ్=ఆ వనమును, వీరమ్=వీరుడైన, తం మహాకపిం చ=ఆ గొప్ప వానరుని, దదృశుః=చూచిరి.

తా. అప్పుడు, వికృతములైన ముఖములు గల రాక్షసస్త్రీలు నిద్రనుండి మేల్కొని, విరిగిపోయి ఉన్న ఆ ఉద్యానమును, వీరుడైన ఆ హనుమంతుని చూచిరి. 3

మూ. స తా దృష్ట్వా మహాబాహుర్మహాసత్త్వో మహాబలః,
చకార సుమహద్రూపం రాక్షసీనాం భయావహమ్. 4

ప్ర. అ. మహాబాహుః=గొప్ప బాహువులు కలవాడు, మహాసత్త్వః=గొప్ప ధైర్యము కలవాడు, మహాబలః=గొప్ప బలము గలవాడు అయిన, సః=ఆ హనుమంతుడు, తాః=ఆ రాక్షసస్త్రీలను, దృష్ట్వా=చూచి, రాక్షసీనామ్=ఆ రాక్షసస్త్రీలకు, భయావహమ్=భయమును కలిగించు, సుమహత్=చాలా పెద్దదైన, రూపమ్=రూపమును, చకార=చేసెను.

తా. గొప్ప బాహువులు, గొప్ప ధైర్యము, గొప్ప బలము గల ఆ హనుమంతుడు ఆ రాక్షసస్త్రీలను చూచి, వాళ్లను ఇంకను భయపెట్టుటకై, ఇంకా పెద్దదైన ఆకారము ధరించెను. 4

మూ. తతస్తం గిరిసంకాశమతికాయం మహాబలమ్,
రాక్షస్యో వానరం దృష్ట్వా పప్రచ్ఛుర్జనకాత్మజామ్. 5

ప్ర. అ. తతః=అటుపిమ్మట, గిరిసంకాశమ్=పర్వతముతో సమానుడూ, అతికాయమ్=పెద్ద శరీరము కలవాడూ, మహాబలమ్=గొప్ప బలము కలవాడూ అయిన, తం వానరమ్=ఆ వానరుని, దృష్ట్వా=చూచి, రాక్షస్యః=రాక్షస స్త్రీలు, జనకాత్మజామ్=సీతను, పప్రచ్ఛుః=అడిగిరి.

తా. పిమ్మట ఆ రాక్షసస్త్రీలు, పెద్దశరీరముతో పర్వతము వలె ఉన్న మహాబలశాలియైన ఆ వానరుని చూచి సీతను ఇట్లు ప్రశ్నించిరి. 5

మూ. కోఽయం కస్య కుతో వాయం కిం నిమిత్తమిహాగతః,
కథం త్వయా సహానేన సంవాదః కృత ఇత్యుత. 6

ప్ర. అ. అయమ్=ఇతడు, కః=ఎవడు? కస్య=ఎవరివాడు ? అయమ్=ఇతడు, కుతః=ఎక్కడినుండి, కిం నిమిత్తమ్=ఎందునిమిత్తము, ఇహ=ఇక్కడికి, ఆగతః=వచ్చినాడు ? ఉత=మరియు, అనేన=వీనిచేత, త్వయా సహ=నీతో కూడ, సంవాదః=సంభాషణము, కృతః=చేయబడినది?

తా. ఇతడు ఎవరు ? ఎవరికి సంబంధించినవాడు ? ఇతడు ఇక్కడికి ఎక్కడినుండి, ఎందుకు వచ్చినాడు ? నీతో ఈతడు ఏమి మాటలాడినాడు ?6

మూ. ఆచక్ష్వ నో విశాలాక్షి మా భూత్తే సుభగే భయమ్,
సంవాదమసితాపాఙ్గే త్వయా కిం కృతవానయమ్. 7

ప్ర. అ. విశాలాక్షి=విశాలములైన నేత్రములు కలదానా ! నః=మాకు, ఆచక్ష్వ=చెప్పుము. సుభగే=సౌభాగ్యవంతురాలా !తే=నీకు, భయమ్=భయము, మా భూత్=లేకపోవు గాక, అసితాపాఙ్గే=నల్లని నేత్రాంతములు కలదానా ! అయమ్=ఇతడు, త్వయా=నీతో, కిమ్=ఏమి, సంవాదమ్=సంవాదమును, కృతవాన్=చేసినాడు ?

తా. సౌభాగ్యవంతురాలవైన ఓ !విశాలాక్షి !నీ వేమీ భయపడకుము. మాకు చెప్పుము. నల్లని నేత్రాంతములు గల ఓ !సీతా ! ఇతడు నీతో ఏమి మాటలాడినాడు ? 7

మూ. అథాబ్రవీత్తదా సాధ్వీ సీతా సర్వాఙ్గసున్దరీ,
రక్షసాం భీమరూపాణాం విజ్ఞానే మమ కా గతిః. 8

ప్ర. అ. అథ=అటుపిమ్మట, సాధ్వీ=పతివ్రత, సర్వాఙ్గసున్దరీ=అన్ని అవయవములందు సౌందర్యము గలదీ అయిన, సీతా=సీత, తదా=అప్పుడు, అబ్రవీత్=పలికెను. భీమరూపాణామ్=భయంకరమైన రూపము గల, రక్షసామ్=రాక్షసులయొక్క,విజ్ఞానే=తెలియుటయందు, గతిః=జ్ఞానము, మమ=నాకు,కా=ఏది?

తా. ఆ మాటలు విని, పతివ్రతా, సకలావయవములందు సౌందర్యవతీ అయిన సీత ఇట్లు పలికెను. "భయంకరమైన రూపము గల రాక్షసులను గూర్చి తెలుసుకొనుటకు నాకు జ్ఞానము (శక్తి) ఎక్కడ ఉన్నది?" 8

మూ. యూయమేవాభిజానీత యోఽయం యద్వా కరిష్యతి,
అహిరేవ హ్యహేః పాదాన్ విజానాతి న సంశయః. 9

ప్ర. అ. అయమ్=ఇతడు, యః=ఎవడో, యద్వా=ఏమి, కరిష్యతి=చేయ గలడో, యూయమేవ=మీరే, అభిజానీత=గుర్తింతురు. అహేః=సర్పముయొక్క, పాదాన్=పాదములను, అహిరేవ=సర్పమే, విజానాతి=తెలుసుకొనును. సంశయః= సంశయము, న=లేదు.

తా. ఇతడు ఎవరో, ఏమి చేయనున్నాడో మీకే తెలియవలెను. పాము పాదాలు పాముకే తెలియును కదా ! ఈ విషయములో సందేహమేమీ లేదు.9

మూ. అహమప్యస్య భీతాస్మి నైనం జానామి కో న్వహమ్,
వేద్మి రాక్షసమేవైనం కామరూపిణమాగతమ్. 10

ప్ర. అ. అహమపి=నేను కూడా, అస్య=వీనికి, భీతా అస్మి=భయపడుచున్నాను. ఏనమ్=ఇతనిని గూర్చి, కో ను=ఎవ్వడో, అహమ్=నేను, న జానామి=ఎరుగను. ఏనమ్=ఈతనిని, ఆగతమ్=వచ్చిన, కామరూపిణమ్=కామరూపము గల, రాక్షసమేవ=రాక్షసునిగా మాత్రమే, వేద్మి=ఎరుగుదును.

తా. ఇతని చూచి నాకు కూడా భయము వేయుచున్నది. ఇతడెవడో నేనెరుగను. ఎవడో కామరూపము గల రాక్షసుడే ఇట్లు వచ్చినాడని నేను అనుకొనుచున్నాను. 10

మూ. వైదేహ్యా వచనం శ్రుత్వా రాక్షస్యో విద్రుతా దిశః,
స్థితాః కాశ్చిద్గతాః కాశ్చిద్రావణాయ నివేదితుమ్. 11

ప్ర. అ. వైదేహ్యాః=సీతయొక్క, వచనమ్=వచనమును, శ్రుత్వా=విని, రాక్షస్యః=రాక్షసస్త్రీలు, దిశః=దిక్కులను గూర్చి, విద్రుతాః=పారిపోయిరి. కాశ్చిత్=కొందరు, స్థితాః=అక్కడనే ఉండిపోయిరి. కాశ్చిత్=కొందరు, రావణాయ=రావణునికి, నివేదితుమ్=తెలుపుటకు, గతాః=వెళ్ళిరి.

తా. కొందరు రాక్షసస్త్రీలు సీత మాటలు విని, హనుమంతునికి భయపడుచు ఆ యా దిక్కులకు పారిపోయిరి. కొందరు సీతను రక్షించుటకై అక్కడనే ఉండిపోయిరి. మరికొందరు ఆ విషయము రావణునకు చెప్పుటకై వెళ్ళిరి. 11

మూ. రావణస్య సమీపే తు రాక్షస్యో వికృతాననాః,
విరూపం వానరం భీమమాఖ్యాతుముపచక్రముః. 12

ప్ర. అ. వికృతాననాః=వికృతములైన ముఖములు గల, రాక్షస్యః=రాక్షసస్త్రీలు, రావణస్య=రావణునియొక్క, సమీపే=సమీపమునందు, విరూపమ్=విపరీతమైన రూపము గల, భీమమ్=భయంకరుడైన, వానరమ్=వానరుని గూర్చి, అఖ్యాతుమ్=చెప్పుటకు, ఉపచక్రముః=ఉపక్రమించిరి.

తా. వికృతమైన ముఖము గల రాక్షసస్త్రీలు రావణుని వద్దకు వెళ్ళి, ఆతనితో వికృతమైన రూపముతో భయంకరుడుగా ఉన్న వానరుని గూర్చి చెప్పుటకు ప్రారంభించిరి. 12

మూ. అశోకవనికామధ్యే రాజన్ భీమవపుః కపిః,
సీతయా కృతసంవాదస్తిష్ఠత్యమితవిక్రమః. 13

ప్ర. అ. రాజన్=రాజా, సీతయా=సీతతో, కృతసంవాదః=చేయబడిన సంభాషణము గల, భీమవపుః=భయంకరమైన శరీరము గల, అమితవిక్రమః=సాటి

లేని పరాక్రమము గల, కపిః=వానరుడు, అశోకవనికామధ్యే=అశోకవనమధ్యమునందు, తిష్ఠతి=ఉన్నాడు.

తా. మహారాజా ! భయంకరమైన శరీరము, అమితమైన పరాక్రమము గల ఒక వానరుడు అశోకవనమధ్యలో ఉన్నాడు. అతడు సీతతో సంభాషణము చేసినాడు. 13

మూ. న చ సా జానకీ సీతా హరిం హరిణలోచనా,
అస్మాభిర్బహుధా పృష్టా నివేదయితుమిచ్ఛతి. 14

ప్ర. అ. హరిణలోచనా=లేడి వంటి నేత్రములు కలదీ, జానకీ=జనకుని పుత్రీ అయిన, సీతా=సీత, అస్మాభిః=మాచేత, బహుధా=అనేకవిధములుగా, పృష్టా=అడగబడినను, తమ్=ఆతనిని గూర్చి, నివేదయితుమ్=తెలుపుటకు, న ఇచ్ఛతి=ఇష్టపడుటలేదు.

తా. లేడి నేత్రముల వంటి నేత్రములు గల, జనకనందినియైన సీత, మేమెంత అడిగినను ఆతనిని గూర్చి చెప్పటలేదు. 14

మూ. వాసవస్య భవేద్దూతో దూతో వైశ్రవణస్య వా,
ప్రేషితో వాపి రామేణ సీతాన్వేషణకాంక్షయా. 15

ప్ర. అ. వాసవస్య=దేవేంద్రునియొక్క, దూతః=దూతగాని, వైశ్రవణస్య=కుబేరునియొక్క, దూతో వా=దుత గాని, సీతాన్వేషణకాంక్షయా=సీతను అన్వేషించుటయందు కోరికచేత, రామేణ=రామునిచేత, ప్రేషితో వాపి=పంపబడిన దూతగాని, భవేత్=అయి ఉండును.

తా. అతడు దేవేంద్రుని దూత గాని, కుబేరుని దూత గాని, సీతను వెదకుటకై రాముడు పంపిన దూత గాని అయి ఉండును. 15

మూ. తేన త్వద్భుతరూపేణ యత్తత్తవ మనోహరమ్,
నానామృగగణాకీర్ణం ప్రమృష్టం ప్రమదావనమ్. 16

ప్ర. అ. అద్భుతరూపేణ=ఆశ్చర్యకరమైన రూపము గల, తేన=వానిచేత, మనోహరమ్=మనోహరమైనదీ, నానామృగగణాకీర్ణమ్=అనేక విధములైన మృగసముదాయములతో వ్యాప్తమూ అయిన, యత్=ఏ, తవ=నీయొక్క, ప్రమదావనమ్=ఉద్యానవనమున్నదో, అది, ప్రమృష్టమ్=తుడిచి పెట్టి వేయబడినది.

తా. ఆశ్చర్యకరమైన రూపము గల అతడు, మనోహరమూ, అనేక విధములైన మృగములతోను పక్షులతోను నిండినదీ అయిన నీ ఉద్యానవనమును తుడిచిపెట్టివేసినాడు. 16

మూ. న తత్ర కశ్చిదుద్దేశో యస్తేన న వినాశితః,
యత్ర సా జానకీ సీతా స తేన న వినాశితః. 17

ప్ర. అ. తేన=వానిచేత, యః=ఏది, న వినాశితః=నశింపచేయబడలేదో, అట్టి, ఉద్దేశః=ప్రదేశము, తత్ర=అక్కడ, కశ్చిత్=ఏదీ, న=లేదు. సా=ఆ, జానకీ=జనకుని కుమార్తెయైన, సీతా=సీత, యత్ర=ఎక్కడ ఉన్నదో, సః=అది, తేన=ఆతనిచేత, న వినాశితః=నశింపచేయబడలేదు.

తా. ఆ ఉద్యానములో అతడు నశింపచేయని ప్రదేశమేదీ లేదు. సీత ఎక్కడ కూర్చుండునో ఆ ప్రదేశమును మాత్రము అతడు నశింపచేయలేదు.

మూ. జానకీరక్షణార్థం వా శ్రమాద్వా నోపలభ్యతే,
అథవా కః శ్రమస్తస్య సైవ తేనాభిరక్షితా. 18

ప్ర. అ. జానకీరక్షణార్థం వా=జానకిని రక్షించుటకొరకో, శ్రమాద్వా=శ్రమ వలననో, నోపలభ్యతే=తెలియుటలేదు, అథవా=లేదా, తస్య=ఆతనికి, శ్రమః=శ్రమ, కః=ఏమిటి? తేన=వానిచేత, సైవ=ఆమెయే, అభిరక్షితా=రక్షింపబడినది

తా. ఆతడు జానకిని రక్షించుటకై ఆ ప్రదేశమును నశింపచేయకుండా విడచినాడో శ్రమవలన అట్లు చేసినాడో తెలియదు. లేదా అతనికి శ్రమ ఏమిటి? జానకిని రక్షించుటకై అతడట్లు చేసినాడు. 18

మూ. చారుపల్లవపుష్పాఢ్యం యం సీతా స్వయమాస్థితా,
ప్రవృద్ధః శింశుపావృక్షః స చ తేనాభిరక్షితః. 19

ప్ర. అ. సీతా=సీత, చారుపల్లవపుష్పాఢ్యమ్=అందమైన చిగుళ్లతోను పుష్పములతోను నిండిన, యమ్=దేనిని, స్వయమ్=స్వయముగా, ఆస్థితా=ఆశ్రయించినదో, సః=ఆ, ప్రవృద్ధః=పెరిగిన, శింశుపావృక్షః=శింశుపావృక్షము, తేన=ఆతనిచేత, అభిరక్షితః=రక్షింపబడినది.

తా. అందమైన చిగుళ్ళతోను, పుష్పములతోను నిండి ఉన్న ఏ శింశుపావృక్షమును సీత స్వయముగా ఆశ్రయించినదో, దానిని ఆతడు భగ్నము చేయలేదు. 19

మూ. తస్యోగ్రరూపస్యోగ్రం త్వం దణ్డమాజ్ఞాతుమర్హసి,
సీతా సంభాషితా యేన తద్వనం చ వినాశితమ్. 20

ప్ర. అ. యేన=ఏ వానరునిచేత, సీతా=సీత, సంభాషితా=భాషింపబడినదో, తత్ వనం చ=ఆ వనము కూడ, వినాశితమ్=నశింపచేయబడినదో,

తస్య=ఆ, ఉగ్రరూపస్య=భయంకరమైన రూపము గల వానరునకు, త్వమ్=నీవు, ఉగ్రమ్=భయంకరమైన, దణ్డమ్=దండమును, ఆజ్ఞాతుమ్=విధించుటకు, అర్హసి=తగిఉన్నావు.

తా. సీతతో మాటలాడి, ఆ వనమును నశింపచేసిన, భయంకరాకారుడైన ఆ వానరునకు నీవు, భయంకరమైన దండమును విధింపుము. 20

మూ. మనఃపరిగృహీతాం తాం తవ రక్షోగణేశ్వర,
కః సీతామభిభాషేత యో న స్యాత్త్యక్తజీవితః. 21

ప్ర. అ. రక్షోగణేశ్వర=రాక్షససముదాయమునకు ప్రభువా ! తవ=నీ యొక్క, మనఃపరిగృహీతామ్=మనస్సుచేత పరిగ్రహింపబడిన, తాం సీతామ్=ఆ సీతను గూర్చి, యః=ఎవడు, త్యక్తజీవితః=విడువబడిన జీవితము కలవాడు, న స్యాత్=కాడో, అట్టి, కః=ఎవడు, అభిభాషేత=భాషణము చేయును ?

తా. ఓ ! రాక్షసరాజా ! తన జీవితమును విడచుటకు సిద్ధముగా ఉన్నవాడు తప్ప మరెవ్వడైనా, నీవు మనస్సుతో స్వీకరించిన సీతతో మాట్లాడునా?

మూ. రాక్షసీనాం వచః శ్రుత్వా రావణో రాక్షసేశ్వరః,
హుతాగ్నిరివ జజ్వాల కోపసంవర్తితేక్షణః. 22

ప్ర. అ. రాక్షసేశ్వరః=రాక్షసప్రభువైన, రావణః=రావణుడు, రాక్షసీనామ్=రాక్షసస్త్రీలయొక్క, వచః=వచనమును, శ్రుత్వా=విని, కోపసంవర్తితేక్షణః=కోపముచేత త్రిప్పబడిన నేత్రములు కలవాడై, హుతాగ్నిరివ=హోమముచేయబడిన అగ్ని వలె, జజ్వాల=మండిపడెను.

తా. రాక్షసరాజైన రావణుడు, రాక్షసస్త్రీల మాటలు వినగానే, కోపముతో నేత్రములు పెద్దవిగా చేసి హోమము చేసిన అగ్ని వలె, మండిపడెను. 22

మూ. తస్య క్రుద్ధస్య నేత్రాభ్యాం ప్రాపతన్నస్రబిన్దవః,
దీప్తాభ్యామివ దీపాభ్యాం సార్చిషః స్నేహబిన్దవః. 23

ప్ర. అ. క్రుద్ధస్య=కోపించిన, తస్య=ఆతనియొక్క, నేత్రాభ్యామ్=నేత్రములనుండి, దీప్తాభ్యామ్=ప్రజ్వలించుచున్న, దీపాభ్యామ్=దీపములనుండి, సార్చిషః=జ్వాలలతో కూడిన, స్నేహబిన్దవః ఇవ=తైలబిందువులు వలె, అస్రబిన్దవః=కన్నీటి బిందువులు, ప్రాపతన్=పడినవి.

తా. కోపించిన ఆతని నేత్రముల నుండి, మండుచున్న దీపములనుండి మంటతో కూడిన తైలబిందువులు పడినట్లు, కన్నీటి బిందువులు రాలెను. 23

మూ. ఆత్మనః సదృశాన్ క్రూరాన్ కింకరాన్నామ రాక్షసాన్,
వ్యాదిదేశ మహాతేజా నిగ్రహార్థం హనూమతః. 24

ప్ర. అ. మహాతేజాః=గొప్ప తేజస్సు గల ఆ రావణుడు, హనూమతః=హనుమంతునియొక్క, నిగ్రహార్థమ్=నిగ్రహించుటకొరకు, ఆత్మనః=తనకు, సదృశాన్=తగిన, శూరాన్=శూరులైన, కింకరాన్నామ=కింకరులను పేరు గల, రాక్షసాన్=రాక్షసులను, వ్యాదిదేశ=ఆజ్ఞాపించెను.

తా. గొప్ప తేజస్సు గల ఆ రావణుడు, హనుమంతుని పట్టుకొనుటకు తనతో సమానులైన, శూరులైన కింకరులను పేరు గల రాక్షసులను పంపెను.

మూ. తేషామశీతిసాహస్రం కింకరాణాం తరస్వినామ్,
నిర్యయుర్భవనాత్తస్మాత్కూటముద్గరపాణయః. 25

మహోదరా మహాదంష్ట్రా ఘోరరూపా మహాబలాః,
యుద్ధాభిమనసః సర్వే హనుమద్గ్రహణోద్యతాః. 26

ప్ర. అ. తరస్వినామ్=బలవంతులైన, తేషాం కింకరాణామ్=ఆ కింకరులయొక్క, అశీతిసాహస్రమ్=ఎనభైవేలను, (ఆజ్ఞాపించెను). మహోదరాః=పెద్ద ఉదరములు కలవారూ, మహాదంష్ట్రాః=పెద్ద కోరలు కలవారూ, ఘోరరూపాః=భయంకరములైన ఆకారములు కలవారూ, మహాబలాః=గొప్ప బలము కలవారూ, యుద్ధాభిమనసః=యుద్ధము చేయుటయందు ఆసక్తి కలవారూ అయిన, సర్వే=అందరూ, కూటముద్గరపాణయః=కూటములు ముద్గరములు హస్తములందు కలవారై, హనుమద్గ్రహణోద్యతాః=హనుమంతుని పట్టుకొనుటలో ఆసక్తి కలవారై, తస్మాత్=ఆ, భవనాత్=గృహమునుండి, నిర్యయుః=బయులుదేరిరి.

తా. బలవంతులైన ఎనభైవేలమంది కింకరులను ఆజ్ఞాపించెను. పెద్ద పెద్ద ఉదరములూ పొడవైన కోరలూ, భయంకరమైన ఆకారములు గల ఆ మహాబలశాలులైన కింకరులందరూ కూటములు, ముద్గరములు అను ఆయుధములు ధరించి, యుద్ధము చేయవలెనను ఉత్సాహముతో, హనుమంతుని పట్టుకొనుటకై ఆ గృహమునుండి వెడలిరి. 25,26

మూ. తే కపీన్ద్రం సమాసాద్య తోరణస్థమవస్థితమ్,
అభిపేతుర్మహావేగాః పతఙ్గా ఇవ పావకమ్. 27

ప్ర. అ. తే=వారు, తోరణస్థమ్=ముఖద్వారమునందున్న, అవస్థితమ్=స్థిరముగా నిలచి ఉన్న, కపీన్ద్రమ్=హనుమంతుని, సమాసాద్య=సమీపించి,

మహావేగాః=గొప్ప వేగము గలవారై, పతఙ్గాః=మిడతలు, పావకమ్ ఇవ=అగ్నిని గూర్చి వలె, అభిపేతుః=ఎదురుగా వెళ్ళిరి.

తా. ఆ కింకరులు, ముఖద్వారము దగ్గర స్థిరముగా నిలచి ఉన్న ఆ హనుమంతునిదగ్గరకు చేరి, మిడతలు అగ్ని వైపు ఎగిరినట్లు, అతనిమీదికి అతివేగముగా వెళ్ళిరి. 27

మూ. తే గదాభిర్విచిత్రాభిః పరిఘైః కాఞ్చనాఙ్గదైః,
ఆజఘ్నుర్వానరశ్రేష్ఠం శరైశ్చాదిత్యసన్నిభైః. 28

ప్ర. అ. తే=వారు, విచిత్రాభిః=విచిత్రములైన, గదాభిః=గదలతోను, కాఞ్చనాఙ్గదైః=బంగారుకట్లుగల, పరిఘైః=పరిఘలతోను, ఆదిత్యసంనిభైః=సూర్యునితో సమానములైన, శరైశ్చ=బాణములతోను, వానరశ్రేష్ఠమ్=వానరశ్రేష్ఠుడైన హనుమంతుని, ఆజఘ్నుః=కొట్టిరి.

తా. ఆ కింకరులు అనేకవిధములైన గదలతోను, బంగారు కట్లు గల పరిఘలతోను, సూర్యుని వలె మెరయుచున్న బాణములతోను హనుమంతుని కొట్టిరి. 28

మూ. ముద్గరైః పట్టిసైః శూలైః ప్రాసతోమరశక్తిభిః,
పరివార్య హనూమన్తం సహసా తస్థురగ్రతః. 29

ప్ర. అ. ముద్గరైః=ముద్గరములతోను, పట్టిసైః=పట్టిసములతోను, శూలైః=శూలములతోను, ప్రాసతోమరశక్తిభిః=ప్రాసలతోను, తోమరములతోను, శక్తులతోను, సహసా=శీఘ్రముగా, హనుమన్తమ్=హనుమంతుని, పరివార్య=చుట్టుముట్టి, అగ్రతః=ఆతని ఎదుట, తస్థుః=నిలచిరి.

తా. ఆ కింకరులు ముద్గరములు, పట్టిసములు, శూలములు, ప్రాసలు, తోమరములు, శక్తులు ధరించి, వెంటనే హనుమంతుని చుట్టుముట్టి, ఆతని ఎదుట నిలచిరి. 29

మూ. హనుమానపి తేజస్వీ శ్రీమాన్పర్వతసన్నిభః,
క్షితావావిధ్య లాఙ్గూలం ననాద చ మహాస్వనమ్. 30

ప్ర. అ. తేజస్వీ=తేజస్సు గలవాడు, శ్రీమాన్=శోభాయుక్తుడు, పర్వతసన్నిభః=పర్వతముతో సమానుడు అయిన, హనుమానపి=హనుమంతుడు కూడ, లాఙ్గూలమ్=తోకను, క్షితౌ=నేలపై, ఆవిధ్య=కొట్టి, మహాస్వనమ్=గొప్ప ధ్వని కలుగునట్లుగా, ననాద చ=ధ్వని చేసెను.

తా. గొప్ప తేజస్సు, శోభా గల, పర్వతసమానుడైన హనుమంతుడు కూడ వాళ్లను చూడగానే తోక నేలపై వేసి కొట్టి గొప్ప శబ్దము కలుగునట్లు ధ్వని చేసెను. 30

మూ. స భూత్వా సుమహాకాయో హనుమాన్ మారుతాత్మజః,
ధృష్టమాస్ఫోటయామాస లఙ్కాం శబ్దేన పూరయన్. 31

ప్ర. అ. మారుతాత్మజః=వాయుపుత్రుడైన, సః హనుమాన్=ఆ హనుమంతుడు, సుమహాకాయః=చాల పెద్ద దేహము కలవాడుగా, భూత్వా=అయి, శబ్దేన=శబ్దముచేత, లఙ్కామ్=లంకను, పూరయన్=నింపుచు, ధృష్టమ్=గట్టిగా, ఆస్ఫోటయామాస=జబ్బలు చరచెను.

తా. వాయుపుత్రుడైన హనుమంతుడు దేహము చాల పెద్దదిగా పెంచి, లంకాపట్టణమంతా మార్మ్రోగేటట్లు జబ్బలు చరిచెను. 31

మూ. తస్యాస్ఫోటితశబ్దేన మహతా సానునాదినా,
పేతుర్విహఙ్గా గగనాదుచ్చైశ్చేదమఘోషయత్. 32

ప్ర. అ. సానునాదినా=ప్రతిధ్వనితో కూడిన, మహతా=గొప్పదైన, తస్య=ఆ హనుమంతునియొక్క, అస్ఫోటితశబ్దేన=జబ్బలు చరచిన చప్పుడు చేత, విహఙ్గాః=పక్షులు, గగనాత్=ఆకాశమునుండి, పేతుః=పడిపోయినవి. ఉచ్చైః=గట్టిగా, ఇదమ్=దీనిని, అఘోషయత్ చ=ఘోషించెను కూడ.

తా. ప్రతిధ్వని కలుగునట్లుగా హనుమంతుడు జబ్బలు చరచి చేసిన ఆ ధ్వనికి పక్షులు రాలి క్రింద పడిపోయెను. హనుమంతుడీ విధముగా, బిగ్గరగా, ఘోషణము కూడ చేసెను. 32

మూ. జయత్యతిబలో రామో లక్ష్మణశ్చ మహాబలః,
రాజా జయతి సుగ్రీవో రాఘవేణాభిపాలితః. 33

ప్ర. అ. అతిబలః=అత్యధిక మైన బలము గల, రామః=రాముడు, జయతి=సర్వోత్కర్షగా ఉన్నాడు. మహాబలః=గొప్ప బలము గల, లక్ష్మణశ్చ=లక్ష్మణుడు కూడ, సర్వోత్కర్షగా ఉన్నాడు. రాఘవేణ=రాముని చేత, అనుపాలితః=పాలింపబడిన, రాజా=రాజైన, సుగ్రీవః=సుగ్రీవుడు, జయతి=సర్వోత్కర్షగా ఉన్నాడు.

తా. లోకాతీతమైన బలము గల రాముడు సర్వోత్కర్షగా ఉన్నాడు. మహాబలశాలియైన లక్ష్మణుడు, రామునిచేత పాలింపబడిన సుగ్రీవమహారాజు కూడ సర్వోత్కర్షగా ఉన్నారు. 33

మూ. దాసోఽహం కోసలేన్ద్రస్య రామస్యాక్లిష్టకర్మణః,
హనుమాన్ శత్రుసైన్యానాం నిహన్తా మారుతాత్మజః. 34

ప్ర. అ. శత్రుసైన్యానామ్=శత్రుసైన్యములకు, నిహన్తా=సంహారకుడను, మారుతాత్మజః=వాయుపుత్రుడను, హనుమాన్=హనుమంతుడను పేరుగలవాడను అయిన, అహమ్=నేను, కోసలేన్ద్రస్య=కోసలదేశరాజూ, అక్లిష్టకర్మణః=శ్రమపడకుండా పనులు సాధించువాడూ అయిన, రామస్య=రామునియొక్క, దాసః=దాసుడను.

తా. శత్రువులసైన్యములను సంహరించగలవాడను, వాయుపుత్రుడను అయిన నా పేరు హనుమంతుడు. నేను శ్రమపడకుండా కార్యములను సాధింప సమర్థుడైన కోసలాధిపతియైన రాముని దాసుడను. 34

మూ. న రావణసహస్రం మే యుద్ధే ప్రతిబలం భవేత్,
శిలాభిస్తు ప్రహరతః పాదపైశ్చ సహస్రశః. 35

ప్ర. అ. సహస్రశః=వేల కొలది, శిలాభిః=శిలలతోను, పాదపైశ్చ=వృక్షములతోను, ప్రహరతః=కొట్టుచున్న, మే=నాకు, యుద్ధే=యుద్ధమునందు, రావణసహస్రమ్=రావణులయొక్క సహస్రము కూడ, ప్రతిబలమ్=ఎదుట నిలువగల బలము కలది, న భవేత్=కాజాలదు.

తా. నేను వేలకొలది శిలలు,వృక్షములు ప్రయోగించుచు యుద్ధము చేయుచున్నప్పుడు వెయ్యిమంది రావణులు కూడ యుద్ధరంగములో నా ఎదుట నిలవజాలరు. 35

మూ. అర్దయిత్వా పురీం లఙ్కామభివాద్య చ మైథిలీమ్,
సమృద్ధార్థో గమిష్యామి మిషతాం సర్వరక్షసామ్. 36

ప్ర. అ. సర్వరక్షసామ్=సమస్తమైన రాక్షసులు, మిషతామ్=చూచుచుండగా, లఙ్కాం పురీమ్=లంకాపట్టణమును, అర్దయిత్వా=పీడించి, మైథిలీమ్=సీతను, అభివాద్య చ=నమస్కరించి, సమృద్ధార్థః=పూర్తిచేసికొబడిన కార్యము కలవాడనై, గమిష్యామి=తిరిగి వెళ్లగలను.

తా. రాక్షసులందరూ చూచుచుండగానే నేను లంకాపట్టణమును పీడించి, సీతకు నమస్కరించి, నే వచ్చిన పని పూర్తి చేసికొని వెళ్లగలను. 36

మూ. తస్య సన్నాదశబ్దేన తేఽభవన్భయశఙ్కితాః,
దదృశుశ్చ హనూమన్తం సన్ధ్యామేఘమివోన్నతమ్. 37

ప్ర. అ. తే=వారు, తస్య=ఆ హనుమంతునియొక్క, సంనాదశబ్దేన=గొప్ప అరపుల ధ్వనిచేత, భయశఙ్కితాః=భయముచేత శంకితులై, అభవన్=అయిరి.

సన్ధ్యామేఘమివ=సంధ్యాకాలమేఘము వలె, ఉన్నతమ్=ఎత్తైన, హనూమన్తమ్=హనుమంతుని, దదృశుశ్చ=చూచిరి కూడ.

తా. ఆ కింకరులు హనుమంతుడు బిగ్గరగా అరచుటచేత కలిగిన ఆ శబ్దమును విని భయభ్రాంతులై, సంధ్యాకాలమేఘము వలె ఉన్నతుడుగా ఉన్న ఆ హనుమంతుని చూచిరి. 37

మూ. స్వామిసందేశనిఃశఙ్కాస్తతస్తే సర్వరాక్షసాః,
చిత్రైః ప్రహరణైర్భీమైరభిపేతుస్తతస్తతః. 38

ప్ర. అ. తతః=అటుపిమ్మట, తే=ఆ, రాక్షసాః=రాక్షసులు, స్వామిసందేశనిఃశఙ్కాః=ప్రభువు ఆజ్ఞచేత శంక లేనివారై, తతస్తతః=ఆ యా వైపుల నుండి, భీమైః=భయంకరములైన, చిత్రైః=విచిత్రములైన, ప్రహరణైః=ఆయుధములతో, కపిమ్=హనుమంతుని గూర్చి, అభిపేతుః=ఎదురుగా వచ్చిపడిరి.

తా. తమ ప్రభువు ఆజ్ఞాపించుటచే ఇంక ఆ రాక్షసులు శంక విడచి, భయంకరములైన అనేక విధములైన ఆయుధములతో ఆ హనుమంతుని మీదకు వెళ్ళిరి. 38

మూ. స తైః పరివృతః శూరైః సర్వతః సమహాబలః,
ఆససాదాయసం భీమం పరిఘం తోరణాశ్రితమ్. 39

ప్ర. అ. సమహాబలః=గొప్ప బలముతో కూడిన, సః=ఆ హనుమంతుడు, శూరైః=శూరులైన, తైః=ఆ రాక్షసులచేత, సర్వతః=నలు వైపులా, పరివృతః=చుట్టబడినవాడై, తోరణాశ్రితమ్=ముఖద్వారమును ఆశ్రయించి ఉన్న, భీమమ్=భయంకరమైన, ఆయసమ్=ఇనుపదైన, పరిఘమ్=పరిఘను (పెద్దగడియ), ఆససాద=పొందెను.

తా. శూరులైన ఆ రాక్షసులందరూ చుట్టుముట్టగానే, మహాబలశాలియైన హనుమంతుడు ముఖద్వారమున కున్న భయంకరమైన ఇనుప గడియను సమీపించెను. 39

మూ. స తం పరిఘమాదాయ జఘాన రజనీచరాన్,
స పన్నగమివాదాయ స్ఫురన్తం వినతాసుతః, 40
విచచారామ్బరే వీరః పరిగృహ్య చ మారుతిః.

ప్ర. అ. సః=హనుమంతుడు, తం పరిఘమ్=ఆ పరిఘను, ఆదాయ=గ్రహించి, రజనీచరాన్=రాక్షసులను, జఘాన=చంపెను. వీరః=వీరుడైన, సః మారుతిః=ఆ హనుమంతుడు, వినతాసుతః=గరుత్మంతుడు, స్ఫురన్తమ్=కదలుచున్న,

పన్నగమ్=సర్పమును, ఆదాయేవ=గ్రహించి వలె, పరిగృహ్య=ఆ పరిఘను గ్రహించి, అమ్బరే=ఆకాశమునందు, విచచార=సంచరించెను.

తా. వీరుడైన ఆ హనుమంతుడు ఆ పరిఘను గ్రహించి రాక్షసులను చంపెను. కొట్టుకొనుచున్న మహాసర్పమును పంజాతో పట్టి గరుత్మంతుడు ఆకాశములో తిరిగినట్లు ఆ పరిఘను చేతిలో పట్టుకొని ఆకాశములో తిరిగెను.

మూ. స హత్వా రాక్షసాన్వీరాన్ కింకరాన్మారుతాత్మజః, 41
యుద్ధాకాంక్షీ పునర్వీరస్తోరణం సముపాశ్రితః.

ప్ర. అ. వీరః=వీరుడైన, సః మారుతాత్మజః=ఆ హనుమంతుడు, వీరాన్=వీరులైన, కింకరాన్=కింకరులను పేరు గల, రాక్షసాన్=రాక్షసులను, హత్వా=చంపి, పునః=మరల, యుద్ధాకాంక్షీ=యుద్ధమును కోరుచున్నవాడై, తోరణమ్=ముఖద్వారమును, సముపాశ్రితః=ఆశ్రయించినాడు.

తా. మహావీరుడైన ఆ హనుమంతుడు కింకరు లను వీరులైన ఆ రాక్షసులను చంపి, ఇంకను యుద్ధము చేయుటకై సన్నద్ధుడై, మరల ఆ ముఖద్వారము దగ్గరనే నిలచెను. 41

మూ. తతస్తస్మాద్భయాన్ముక్తాః కతిచిత్తత్ర రాక్షసాః, 42
నిహతాన్ కింకరాన్ సర్వాన్రావణాయ న్యవేదయన్.

ప్ర. అ. తతః=అటుపిమ్మట, తత్ర=అక్కడ, తస్మాత్=ఆ, భయాత్=భయమునుండి, ముక్తాః=విముక్తులైన, కతి చిత్=కొందరు, రాక్షసాః=రాక్షసులు, సర్వాన్=సమస్తమైన, కింకరాన్=కింకరులను, నిహతాన్=చంపబడినవారినిగా, రావణాయ=రావణునకు, న్యవేదయన్=తెలిపిరి.

తా. అక్కడ ఆ భయమునుండి ఎట్లో తప్పించుకొన్న కొందరు రాక్షసులు రావణుని దగ్గరకు వెళ్ళి కింకరులందరూ చంపబడినట్లు తెలిపిరి.42

మూ. స రాక్షసానాం నిహతం మహద్బలం
నిశమ్య రాజా పరివృత్తలోచనః,
సమాదిదేశాప్రతిమం పరాక్రమే
ప్రహస్తపుత్రం సమరే సుదుర్జయమ్. 43

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే సున్దరకాణ్డే
ద్విచత్వారింశః సర్గః.

ప్ర. అ. సః=ఆ, రాజా=రావణుడు, రాక్షసానామ్=రాక్షసులయొక్క, మహత్=గొప్పదైన, బలమ్=సైన్యమును, నిహతమ్=చంపబడినదానినిగా, నిశమ్య=విని, పరివృత్తలోచనః=త్రిప్పబడిన నేత్రములు కలవాడై, పరాక్రమే=పరాక్రమమునందు, అప్రతిమమ్=సాటిలేనివాడూ, సమరే=యుద్ధమునందు, సుదుర్జయమ్=జయించుటకు శక్యము కానివాడూ అయిన, ప్రహస్తపుత్రమ్=ప్రహస్తుని కుమారుని, సమాదిదేశ=ఆజ్ఞాపించెను.

తా. రాక్షసుల ఆ పెద్ద సేన చంపబడినట్లు విన్న రావణుడు, కోపముతో కళ్లుత్రిప్పుచు, పరాక్రమములో సాటిలేనివాడూ యుద్ధములో జయింపశక్యము కానివాడూ అయిన ప్రహస్తపుత్రుని, యుద్ధమునకు వెళ్లుమని ఆజ్ఞాపించెను. 43

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు
సుందరకాండలో నలుబది రెండవ సర్గ సమాప్తము.

అథ త్రిచత్వారింశః సర్గః

[హనుమంతుడు చైత్యప్రాసాదమును ధ్వంసము చేసి దాని రక్షకులను వధించుట]

మూ. తతః స కింకరాన్ హత్వా హనుమాన్ ధ్యానమాస్థితః,
వనం భగ్నం మయా చైత్యప్రాసాదో న వినాశితః. 1

తస్మాత్ప్రాసాదమద్యైవమిమం విధ్వంసయామ్యహమ్,
ఇతి సంచిన్త్య హనుమాన్ మనసా దర్శయన్ బలమ్, 2

చైత్యప్రాసాదముత్ప్లుత్య మేరుశృఙ్గమివోన్నతమ్,
ఆరురోహ హరిశ్రేష్ఠో హనుమాన్ మారుతాత్మజః. 3

ప్ర. అ. తతః=అటుపిమ్మట, సః హనుమాన్=ఆ హనుమంతుడు, కింకరాన్=కింకరులను, హత్వా=చంపి, ధ్యానమ్=ఆలోచనను, ఆస్థితః=అవలంబించెను (పొందెను). మయా=నాచేత, వనమ్=వనము, భగ్నమ్=విరగగొట్టబడినది. చైత్యప్రాసాదః=వనమధ్యమునందున్న భవనము, న వినాశితః=నశింపచేయబడలేదు. తస్మాత్=ఆ కారణమువలన, అద్య=ఇప్పుడు, అహమ్=నేను, ఇమమ్=ఈ, ప్రాసాదమ్=ప్రాసాదమును, ఏవమ్=ఇట్లే, విధ్వంసయామి=నశింపచేసెదను. హరిశ్రేష్ఠః=వానరులలో శ్రేష్ఠుడు, మారుతాత్మజః=వాయుపుత్రుడు, హనుమాన్=విశిష్టమైన గడ్డము గలవాడు అయిన, హనుమాన్=హనుమంతుడు, మనసా=మనస్సుతో, ఇతి=ఇట్లు, సంచిన్త్య=ఆలోచించి, బలమ్=బలమును, దర్శయన్=చూపుచు, మేరుశృఙ్గమివ=మేరు పర్వతశిఖరము వలె, ఉన్నతమ్=ఉన్నతమైన, చైత్యప్రాసాదమ్=ఉద్యానవనమధ్యమునందున్న ప్రాసాదమును గూర్చి, ఉత్ప్లుత్య=ఎగిరి, ఆరురోహ=ఎక్కెను.

తా. కింకరులను చంపిన పిమ్మట, హనుమంతుడీ విధముగా ఆలోచించెను. "నేను ఉద్యానవనమును విరిచివేసినాను కాని ఈ చైత్యప్రాసాదమును నశింపచేయులేదు. అందుచే దీనిని ఇప్పుడే నశింపచేసెదను." వానరశ్రేష్ఠుడు, వాయుపుత్రుడు అయిన హనుమంతుడు మనస్సులో ఈ విధముగా ఆలోచించుకొని ఒక్క గంతు వేసి, మేరు పర్వతశిఖరము వలె ఉన్నతముగా ఉన్న ఆ చైత్యప్రాసాదమును ఎక్కెను. 1-3

మూ. ఆరుహ్యా గిరిసంకాశం ప్రాసాదం హరియూథపః,
బభౌ స సుమహాతేజాః ప్రతిసూర్య ఇవోదితః. 4

ప్ర. అ. హరియూథపః=వానరసేనానాయకుడు, సుమహాతేజాః=చాల గొప్ప తేజస్సు కలవాడు అయిన, సః=ఆ హనుమంతుడు, గిరిసంకాశమ్=పర్వతముతో సమానమైన, ప్రాసాదమ్=ప్రాసాదమును, ఆరుహ్యా=ఎక్కి, ఉదితః=ఉదయించిన, ప్రతిసూర్యః ఇవ=సూర్యునకు పోటీ వచ్చిన రెండవ సూర్యుడు వలె, బభౌ=ప్రకాశించెను.

తా. వానరసేనానాయకుడు, మహాతేజఃశాలీ అయిన ఆ హనుమంతుడు పర్వతముతో సమానమైన ఆ ప్రాసాదమును ఎక్కి, ఉదయించిన రెండవ సూర్యుడా అన్నట్లు ప్రకాశించెను. 4

మూ. సంప్రధృష్య చ దుర్ధర్షం చైత్యప్రాసాదముత్తమమ్,
హనుమాన్ ప్రజ్వలన్ లక్ష్మ్యా పారియాత్రోపమోఽభవత్. 5

ప్ర. అ. హనుమాన్=హనుమంతుడు, దుర్ధర్షమ్=ఆక్రమించుటకు శక్యము కాని, ఉత్తమమ్=ఉత్తమమైన, చైత్యప్రాసాదమ్=చైత్యప్రాసాదమును, సంప్రధృష్య చ=ఆక్రమించి, లక్ష్మ్యా=శోభతో, ప్రజ్వలన్=ప్రజ్వలించుచు, పారియాత్రోపమః=పారియాత్రపర్వతముతో సమానుడు, అభవత్=ఆయెను.

తా. హనుమంతుడు ఆక్రమింప శక్యము కాని ఉత్తమమైన ఆ చైత్యప్రాసాదమును ఆక్రమించి, శోభతో తేజరిల్లుచు, పారియాత్రపర్వతమంత పెరిగెను. 5

మూ. స భూత్వా సుమహాకాయః ప్రభావాన్మారుతాత్మజః,
ధృష్టమాస్ఫోటయామాస లఙ్కాం శబ్దేన పూరయన్. 6

ప్ర. అ. సః మారుతాత్మజః=ఆ హనుమంతుడు, ప్రభావాత్=ప్రభావమువలన, సుమహాకాయః=చాల పెద్దశరీరము కలవాడు, భూత్వా=అయి, శబ్దేన=శబ్దముచేత, లఙ్కామ్=లంకను, పూరయన్=నింపుచు, ధృష్టమ్=గట్టిగా, ఆస్ఫోటయామాస=జబ్బలు చరచెను.

తా. ఆ హనుమంతుడు, ప్రభావము చేత తన శరీరమును చాల పెద్దదిగా పెంచి, లంకాపట్టణమంతా శబ్దముతో నిండిపోవునట్లు, గట్టిగా జబ్బలు చరచెను. 6

మూ. తస్యాస్ఫోటితశబ్దేన మహతా శ్రోత్రఘాతినా,
పేతుర్విహఙ్గమాస్తత్ర చైత్యపాలాశ్చ మోహితాః. 7

ప్ర. అ. తస్య=హనుమంతుని యొక్క, శ్రోత్రఘాతినా=చెవులను పీడించు, మహతా=గొప్పదైన, ఆస్ఫోటితశబ్దేన=జబ్బలు చరచిన శబ్దము చేత, తత్ర=అక్కడ, విహఙ్గమాః=పక్షులు, పేతుః=పడిపోయినవి. చైత్యపాలాశ్చ=ఆ చైత్యమును రక్షించువారు కూడ, మోహితాః=మోహము చెందిరి.

తా. చెవులను పీడించునట్లు హనుమంతుడు చేసిన ఆ గొప్ప జబ్బలు చరచిన ధ్వనిచేత, అక్కడ పక్షులు ఆకాశమునుండి రాలి పడిపోయెను. చైత్య రక్షకులు కూడ మూర్ఛపోయిరి. 7

మూ. అస్త్రవిజ్జయతాం రామో లక్ష్మణశ్చ మహాబలః,
రాజా జయతి సుగ్రీవో రాఘవేణాభిపాలితః. 8

దాసోఽహం కోసలేన్ద్రస్య రామస్యాక్లిష్టకర్మణః,
హనుమాన్ శత్రుసైన్యానాం నిహన్తా మారుతాత్మజః. 9

న రావణసహస్రం మే యుద్ధే ప్రతిబలం భవేత్,
శిలాభిస్తు ప్రహరతః పాదపైశ్చ సహస్రశః. 10

అర్దయిత్వా పురీం లఙ్కా మభివాద్య చ మైథిలీమ్,
సమృద్ధార్థో గమిష్యామి మిషతాం సర్వరక్షసామ్. 11

(ఈ నాలుగు శ్లోకములు 42 వ సర్గలో 33, 34, 35, 36 శ్లోకాలుగా వచ్చినవి. "అస్త్రవిత్=అస్త్రముల నన్నింటిని ఎరిగిన, రామః=రాముడు, జయతామ్=సర్వోత్కర్షగా ఉండుగాక" అని ఈ పాదములో మాత్రమే కొంచెము భేదమున్నది). 8-11

మూ. ఏవముక్త్వా విమానస్థశ్చైత్యస్థాన్ హరియూథపః,
ననాద భీమనిర్హ్రాదో రక్షసాం జనయన్ భయమ్. 12

ప్ర. అ. హరియూథపః=వానరసేనానాయకుడైన, హనుమంతుడు, విమానస్థః=చైత్యప్రాసాదముపై నిలచినవాడై, చైత్యస్థాన్=ఆ చైత్యప్రాసాదములో ఉన్నవారిని గూర్చి, ఏవమ్=ఇట్లు, ఉక్త్వా=పలికి, భీమనిర్హ్రాదః=భయంకరమైన ధ్వని కలవాడై, రక్షసామ్=రాక్షసులకు, భయమ్=భయమును, జనయన్=పుట్టించుచు, ననాద=ధ్వనిచేసెను.

తా. వానరసేనానాయకుడైన ఆ హనుమంతుడు, చైత్యప్రాసాదముమీద నిలచి, ఆ ప్రాసాదమును రక్షించువారితో ఇట్లు పలికి, భయంకరముగా గర్జించుచు, రాక్షసులకు భయము కలుగునట్లు ధ్వనిచేసెను. 12

మూ. తేన శబ్దేన మహతా చైత్యపాలాః శతం యయుః,
గృహీత్వా వివిధానస్త్రాన్ ప్రాసాన్ ఖడ్గాన్ పరశ్వథాన్, 13
విసృజన్తో మహాకాయా మారుతిం పర్యవారయన్.

ప్ర. అ. మహతా=గొప్పదైన, తేన శబ్దేన=ఆ శబ్దముచేత, శతమ్=వందమంది, చైత్యపాలాః=చైత్యపాలకులు, వివిధాన్=అనేకవిధములైన, అస్త్రాన్=అస్త్రములను, ప్రాసాన్=ప్రాసలను, ఖడ్గాన్=కత్తులను, పరశ్వథాన్=గండ్రగొడ్డళ్ళను, గృహీత్వా=గ్రహించి, యయుః=వెళ్ళిరి. మహకాయాః=పెద్ద దేహము గల వాళ్లు, విసృజన్తః=ఆయుధములను ప్రయోగించుచు, మారుతిమ్=హనుమంతుని, పర్యవారయన్=చుట్టుముట్టిరి.

తా. ఆ గొప్ప శబ్దమును విని వందమంది చైత్యపాలకులు అనేక విధములైన అస్త్రములు, ప్రాసలు, ఖడ్గములు, గండ్రగొడ్డళ్లు ధరించి హనుమంతుని మీదికి వెళ్ళిరి. పెద్ద పెద్ద దేహములు గల వాళ్లు ఆ ఆయుధములు ప్రయోగించుచు హనుమంతుని చుట్టుముట్టిరి. 13

మూ. తే గదాభిర్విచిత్రాభిః పరిఘైః కాఞ్చనాఙ్గదైః, 14
ఆజఘ్నుర్వానరశ్రేష్ఠం శరైశ్చాదిత్యసన్నిభైః.

ప్ర. అ. (మూ. 42 వ సర్గలోని 28 వ శ్లోకం).

మూ. ఆవర్త ఇవ గఙ్గాయాస్తోయస్య విపులో మహాన్, 15
పరిక్షిప్య హరిశ్రేష్ఠం స బభౌ రక్షసాం గణః.

ప్ర. అ. సః=ఆ, రక్షసాం గణః=రాక్షసుల సముదాయము, హరిశ్రేష్ఠమ్=వానరశ్రేష్ఠుడైన హనుమంతుని, పరిక్షిప్య=చుట్టుముట్టి, గఙ్గాయాః=గంగానది యొక్క, తోయస్య=జలము యొక్క, మహాన్=గొప్ప, విపులః=విశాలమైన, ఆవర్త ఇవ=సుడివలె, బభౌ=ప్రకాశించెను.

తా. వానరశ్రేష్ఠుడైన హనుమంతుని చుట్టూ నిలచి ఉన్న ఆ రాక్షస సముదాయము గంగానదిలో జలములో ఏర్పడిన చాల పెద్దదైన సుడి వలె ప్రకాశించెను. 15

మూ. తతో వాతాత్మజః క్రుద్ధో భీమం రూపం సమాస్థితః. 16
ప్రాసాదస్య మహాంస్తస్య స్తమ్భం హేమపరిష్కృతమ్,
ఉత్పాటయిత్వా వేగేన హనుమాన్ పవనాత్మజః. 17
తతస్తం భ్రామయామాస శతధారం మహాబలః.

ప్ర. అ. తతః=అటుపిమ్మట, వాతాత్మజః=హనుమంతుడు, క్రుద్ధః=కోపగించినవాడై, భీమమ్=భయంకరమైన, రూపమ్=రూపమును, సమాస్థితః=గ్రహించెను. మహాన్=పెద్ద దేహము గలవాడు అయిన, పవనాత్మజః=వాయుపుత్రుడు, మహాబలః=గొప్ప బలము కలవాడు అయిన, హనుమాన్=హనుమంతుడు, తస్య ప్రాసాదస్య=ఆ ప్రాసాదముయొక్క, హేమపరిష్కృతమ్=బంగారముచే అలంకరించబడిన, స్తమ్భమ్=స్తంభమును, ఉత్పాటయిత్వా=పెకలించి, తతః=అటుపిమ్మట, శతధారమ్=నూరు అంచులుగల, తమ్=దానిని, వేగేన=వేగముతో, భ్రామయామాస=తిప్పెను.

తా. పిమ్మట ఆ హనుమంతుడు కోపించి భయంకరమైన రూపము దాల్చెను. ఆ ప్రాసాదమునందున్న బంగారముచే అలంకృతమైన పెద్దస్తంభమును పెకలించి, వాయుపుత్రుడు, మహాశరీరము గలవాడు, మహాబలశాలీ అయిన హనుమంతుడు, ఆ నూరు అంచులు గల స్తంభమును వేగముగా త్రిప్పెను.

మూ. తత్ర చాగ్నిః సమభవత్ప్రాసాదశ్చాప్యదహ్యత. 18
దహ్యమానం తతో దృష్ట్వా ప్రాసాదం హరియూథపః,
స రాక్షసశతం హత్వా వజ్రేణేన్ద్ర ఇవాసురాన్, 19
అన్తరిక్షే స్థితః శ్రీమానిదం వచనమబ్రవీత్.

ప్ర. అ. తత్ర=అక్కడ, అగ్నిః చ=అగ్ని కూడ, సమభవత్=పుట్టెను. ప్రాసాదశ్చ=ప్రాసాదము కూడ, అదహ్యత=దహింపబడెను. తతః=అటుపిమ్మట, సః హరియూథపః=ఆ హనుమంతుడు, దహ్యమానమ్=కాల్చివేయబడుచున్న, ప్రాసాదమ్=ప్రాసాదమును, దృష్ట్వా=చూచి, ఇన్ద్రః=ఇంద్రుడు, వజ్రేణ=వజ్రముతో, అసురానివ=అసురులను వలె, రాక్షసశతమ్=నూర్గురు రాక్షసులను, హత్వా=చంపి, శ్రీమాన్=శోభాయుక్తుడై, అన్తరిక్షే=ఆకాశమునందు, స్థితః=ఉన్నవాడై, ఇదమ్=ఈ, వచనమ్=వచనమును, అబ్రవీత్=పలికెను.

తా. హనుమంతుడా స్తంభమును అట్లు త్రిప్పగా అక్కడ అగ్ని పుట్టెను. ఆ ప్రాసాదమంతా మండిపోయెను. హనుమంతుడా ప్రాసాదము ఆ విధముగా మండిపోవుచుండగా చూచి, ఇంద్రుడు వజ్రాయుధముతో అసురులను చంపినట్లు నూరుగురు రాక్షసులను చంపి, శోభాయుక్తుడై, ఆకాశముమీద నిలచి ఇట్లు పలికెను. 18, 19

మూ. మాదృశానాం సహస్రాణి విసృష్టాని మహాత్మనామ్, 20
బలినాం వానరేన్ద్రాణాం సుగ్రీవవశవర్తినామ్,
అటన్తి వసుధాం కృత్స్నాం వయమన్యే చ వానరాః. 21

ప్ర. అ. మహాత్మనామ్=పెద్దదేహములు గలవారు, బలినామ్=బలవంతులైన వారు, సుగ్రీవవశవర్తినామ్=సుగ్రీవుని వశమునందున్నవారూ అయిన, మాదృశా నామ్=నావంటి, వానరేన్ద్రాణామ్=వానరశ్రేష్ఠులయొక్క, సహస్రాణి=సహస్రములు, విస్పృష్టాని=పంపబడినవి. వయమ్=మేము, అన్యే=ఇతరులైన, వానరాశ్చ=వానరులూ, కృత్స్నామ్=సమస్తమైన, వసుధామ్=భూమిని, అటన్తి=తిరుగుచున్నారు.

తా. పెద్దపెద్ద దేహములు కలవారు, బలశాలులు, సుగ్రీవుని ఆజ్ఞకు లొంగినవారూ అయిన నావంటి వానరులు వేలకొలది పంపబడియున్నారు. మేము, మరికొందరు ఇతర వానరులు కూడ భూమిమీద అంతటా సంచరించుచున్నారు(ము). 20, 21

మూ. దశనాగబలాః కేచిత్కేచిద్దశగుణోత్తరాః,
కేచిన్నాగసహస్రస్య బభూవుస్తుల్యవిక్రమాః. 22

ప్ర. అ. కేచిత్=కొందరు, దశనాగబలాః=పది ఏనుగుల బలము కలవారు, కేచిత్=కొందరు, దశగుణోత్తరాః=పదిరెట్లు అధికమైనవారు, కేచిత్=కొందరు, నాగసహస్రస్య=వెయ్యి ఏనుగులకు, తుల్యవిక్రమాః=సమానమైన పరాక్రమము కలవారు, బభూవుః=ఉండిరి (ఉన్నారు).

తా. ఈ వానరులలో కొందరు పది ఏనుగుల బలము గలవారు. కొందరు నూరు ఏనుగుల బలము గలవారు. కొందరు వెయ్యి ఏనుగుల బలము గలవారు. 22

మూ. సన్తి చౌఘబలాః కేచిత్కేచిద్వాయుబలోపమాః,
అప్రమేయబలాశ్చాన్యే తత్రాసన్ హరియూథపాః. 23

ప్ర. అ. కేచిత్=కొందరు, ఓఘబలాః=మహాజలప్రవాహము వంటి బలము గలవారు, సన్తి=ఉన్నారు. కేచిత్=కొందరు, వాయుబలోపమాః=వాయుబలముతో సమానమైన బలము గలవారు. తత్ర=వారిలో, అన్యే=మరికొందరు, హరి యూథపాః=వానరసేనానాయకులు, అప్రమేయబలాశ్చ=కొలవశక్యముకాని బలము కలవారు కూడ, ఆసన్=ఉండిరి (ఉన్నారు). ('ఓఘము' ఒక సంఖ్య అనే అర్థం ఏ నిఘంటువులోను కనబడలేదు).

తా. కొందరు మహాజలప్రవాహము వంటి బలము గలవారు ఉన్నారు. కొందరు వాయువుతో సమానమైన బలము గలవారు. కొందరు వానరనాయకుల బలము ఇంత అని కొలచుటకు శక్యము కాదు. 23

మూ. ఈదృగ్విధైస్తు హరిభిర్వృతో దన్తనఖాయుధైః,
శతైః శతసహస్రైశ్చ కోటీభిరయుతైరపి, 24
ఆగమిష్యతి సుగ్రీవః సర్వేషాం వో నిషూదనః.

ప్ర. అ. ఈదృగ్విధైః=ఇట్టివారైన, దన్తనఖాయుధైః=దంతములు నఖములు ఆయుధములుగా గల, శతైః=వందలు, అయుతైః=పదివేలు, శతసహస్రైః=లక్షలు, కోటీభిః=కోట్లు, హరిభిః=వానరులతో, వృతః=కూడినవాడై, సుగ్రీవః=సుగ్రీవుడు, సర్వేషామ్=సమస్తమైన, వః=మీకు, (మిమ్ములను), నిషూదనః=సంహరింపనున్న వాడై, ఆగమిష్యతి=రాగలడు.

తా. సుగ్రీవుడు ఈ విధమైన బలము గలవారు, దంతములు గోళ్లు ఆయుధములుగా కలవారు అయిన వానరులు వందలకొలది, పదివేల కొలది, లక్షల కొలది, కోట్ల కొలది వెంటరాగా మిమ్ములనందరిని చంపుటకు రాగలడు.

మూ. నేయమస్తి పురీ లఙ్కా న యూయం న చ రావణః, 25
యస్మాదిక్ష్వాకునాథేన బద్ధం వైరం మహాత్మనా.

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే సున్దరకాణ్డే
త్రిచత్వారింశః సర్గః.

ప్ర. అ. యస్మాత్=ఎందువలన, మహాత్మనా=మహాత్ముడైన, ఇక్ష్వాకునాథేన=ఇక్ష్వాకువంశప్రభువైన రామునితో, వైరమ్=వైరము, బద్ధమ్=కట్టబడినదో, అందువలన, ఇయమ్=ఈ, లఙ్కాపురీ=లంకాపట్టణము, నాస్తి=లేదు. యూయమ్=మీరు, న=లేరు. రావణః చ=రావణుడు కూడ, న=లేడు.

తా. మీరు మహాత్ముడైన రామునితో విరోధము పెట్టుకొన్నారు. అందువలన ఈ లంకానగరము ఇంక ఉండదు. మీరు ఉండరు. రావణుడు కూడ ఉండడు. 25

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు
సుందరకాండలో నలుబది మూడవ సర్గ సమాప్తము.

అథ చతుశ్చత్వారింశః సర్గః

[హనుమంతుడు ప్రహస్తపుత్రుడైన జంబుమాలిని వధించుట]

మూ. సందిష్టో రాక్షసేన్ద్రేణ ప్రహస్తస్య సుతో బలీ,
జమ్బుమాలీ మహాదంష్ట్రో నిర్జగామ ధనుర్ధరః. 1

రక్తమాల్యామ్బరధరః స్రగ్వీ రుచిరకుణ్డలః,
మహాన్వివృత్తనయనశ్చణ్డః సమరదుర్జయః. 2

ధనుః శక్రధనుఃప్రఖ్యం మహద్రుచిరసాయకమ్,
విస్ఫారయాణో వేగేన వజ్రాశనిసమస్వనమ్. 3

ప్ర. అ. మహాదంష్ట్రః=పెద్ద కోరలు కలవాడు, ధనుర్ధరః=ధనస్సు ధరించినవాడు, రక్తమాల్యామ్బరధరః=ఎఱ్ఱనిమాలలు వస్త్రములు ధరించినవాడు, స్రగ్వీ=అంద మైన మాలలు కలవాడు, రుచిరకుణ్డలః=అందమైన కుండలములు కలవాడు, మహాన్=పెద్ద దేహము కలవాడు, వివృత్తనయనః=త్రిప్పబడిన నేత్ర ములు (లేదా గుండ్రని నేత్రములు) కలవాడు, చణ్డః=తీవ్రమైన వాడు, సమరదుర్జయః=యుద్ధములో జయింప శక్యము కానివాడు, బలీ=బలశాలి, ప్రహస్తస్య సుతః=ప్రహస్తుని కుమారుడు అయిన, జమ్బుమాలీ=జంబుమాలి, రాక్షసేన్ద్రేణ=రావణునిచేత, సన్దిష్టః=ఆజ్ఞాపించబడినవాడై, మహత్=పెద్దది, రుచి రసాయకమ్=అందమైన బాణములు కలది, వజ్రాశనిసమప్రభమ్=వజ్రముతోను, పిడుగుతోను సమాన మైన కాంతి గలది, శక్రధనుఃప్రఖ్యమ్=ఇంద్రధనుస్సుతో సమా నమూ అయిన, ధనుః=ధనస్సును, వేగేన=వేగముతో, విస్ఫారయాణః=చరచుచు, నిర్జగామ=బయలు దేరెను.

తా. ప్రహస్తుని కుమారుడూ, బలశాలీ అయిన జంబుమాలి, రావణుని ఆజ్ఞచేత ధనుర్ధరుడై బయలుదేరెను. పెద్ద కోరలు గల ఆతడు ఎఱ్ఱని పుష్పమాలలు, వస్త్రములు, అంద మైన ఇతర మాలలు, కుండలములు ధరించెను. పెద్ద దేహముతో, గుండ్రని కళ్ళతో, భయంకరుడుగా ఉన్న అతడు యుద్ధములో జయింప శక్యము కానివాడు, ఇంద్రధనస్సు వలె చాలా పెద్దదీ, అంద మైన బాణములు కలదీ అయిన ధనస్సును వజ్రముతోను, పిడుగుతోను సమాన మైన ధ్వని కలుగునట్లు అతడు చరచుచుండెను.

మూ. తస్య విస్ఫారఘోషేణ ధనుషో మహతా దిశః,
ప్రదిశశ్చ నభశ్చైవ సహసా సమపూర్యత. 4

ప్ర. అ. తస్య=ఆ, ధనుషః=ధనస్సుయొక్క, మహతా=గొప్ప దైన, విస్ఫార ఘోషేణ=చరచుటవలన కలిగిన ధ్వనిచేత, దిశః=దిక్కులు, ప్రదిశశ్చైవ=విదిక్కులు, నభశ్చైవ=ఆకాశము, సహసా=వెంటనే, సమపూర్యత=నింపబడెను.

తా. ఆ ధనస్సును చరచుటచే కలిగిన గొప్ప ధ్వని వెంటనే దిక్కులను, విదిక్కులను, ఆకాశమును నింపివేసెను. 4

మూ. రథేన ఖరయుక్తేన తమాగతముదీక్ష్య సః,
హనుమాన్వేగసంపన్నో జహర్ష చ ననాద చ. 5

ప్ర. అ. ఖరయుక్తేన=గాడిదలతో కట్టబడిన, రథేన=రథముచేత, ఆగ తమ్=వచ్చిన, తమ్=ఆతనిని, ఉదీక్ష్య=చూచి, సః హనుమాన్=ఆ హనుమంతుడు, వేగసంపన్నః=వేగముతో కూడినవాడై, జహర్ష చ=ఆనందించెను. ననాద చ=ధ్వనిచేసెను కూడ.

తా. గాడిదలు కట్టిన రథమెక్కి వచ్చిన ఆతనిని చూచి, హనుమంతుడు, వేగసంపన్నుడై, సంతోషముతో ధ్వని చేసెను. 5

మూ. తం తోరణవిటఙ్కస్థం హనుమన్తం మహాకపిమ్,
జమ్బుమాలీ మహాబాహుర్వివ్యాధ నిశితైః శరైః. 6

ప్ర. అ. మహాబాహుః=గొప్ప బాహువులు గల, జమ్బుమాలీ=జంబుమాలి, తోరణవిటఙ్కస్థమ్=ముఖద్వారము శిఖరమునందున్న, మహాకపిమ్=మహావానరుడైన, తం హనుమన్తమ్=ఆ హనుమంతుని, నిశితైః=వాడియైన, శరైః=బాణములతో, వివ్యాధ=కొట్టెను.

తా. మహాబాహువైన ఆ జంబుమాలి, ముఖద్వారము పైభాగముపై నిలచి ఉన్న మహాకపి హనుమంతునిపై వాడియైన బాణములు ప్రయోగించెను.

మూ. అర్ధచన్ద్రేణ వదనే శిరస్యేకేన కర్ణినా,
బాహ్వోర్వివ్యాధ నారాచైర్దశభిస్తం కపీశ్వరమ్. 7

ప్ర. అ. అర్ధచంద్రేణ=అర్ధచంద్రాకారమైన బాణముతో, వదనే=ముఖము నందు, ఏకేన=ఒక, కర్ణినా=వంకరములికి గల బాణముతో, శిరసి=శిరస్సునందు, దశభిః=పది, నారాచైః=పూర్తిగా ఇనుముతో చేసిన బాణములతో, బాహ్వోః=బా హువులమీదను, తం కపీశ్వరమ్=ఆ హనుమంతుని, వివ్యాధ=కొట్టెను.

తా. అర్ధచంద్రబాణముతో ముఖముమీద, ఒక కర్ణిబాణముతో శిరస్సుమీద, పది నారాచబాణములతో బాహువులమీద ఆ హనుమంతుని కొట్టెను. 7

మూ. తస్య తచ్ఛుశుభే తామ్రం శరేణాభిహతం ముఖమ్,
శరదీవామ్బుజం ఫుల్లం విద్ధం భాస్కరరశ్మినా. 8

ప్ర. అ. శరేణ=బాణముచేత, అభిహతమ్=కొట్టబడిన, తామ్రమ్=ఎఱ్ఱనైన, తత్=ఆ, ముఖమ్=ఆతని ముఖము, శరది=శరత్కాలమునందు, భాస్కరరశ్మినా=సూర్యకిరణముచేత, విద్ధమ్=గ్రుచ్చబడిన, ఫుల్లమ్=వికసించిన, అమ్బుజమివ=పద్మము వలె, శుశుభే=ప్రకాశించెను.

తా. హనుమంతుని ఎఱ్ఱని ముఖముపై బాణము దెబ్బ తగులుటచే అది, శరత్కాలమునందు సూర్యకిరణస్పర్శచే వికసించిన పద్మము వలె ప్రకాశించెను.8

మూ. తత్తస్య రక్తం రక్తేన రఞ్జితం శుశుభే ముఖమ్,
యథాకాశే మహాపద్మం సిక్తం చన్దనబిన్దుభిః. 9

ప్ర. అ. రక్తేన=రక్తముచేత, రఞ్జితమ్=పూయబడిన, రక్తమ్=సహజముగా ఎఱ్ఱనైన, తస్య=హనుమంతునియొక్క, తత్=ఆ, ముఖమ్=ముఖము, చన్దన బిన్దుభిః=చందనము బిందువులచేత, సిక్తమ్=తడపబడిన, ఆకాశే=ఆకాశమునందున్న, మహాపద్మం యథా=పెద్ద పద్మము వలె, శుశుభే=ప్రకాశించెను.

తా. స్వభావముచేతనే ఎఱ్ఱగా ఉన్న హనుమంతుని ముఖము రక్తముతో తడియుటచే, ఆకాశమధ్యమునందున్న పెద్ద పద్మముమీద ఎఱ్ఱని చందనము చుక్కలు పడినట్లు ఉండెను. 9

మూ. చుకోప బాణాభిహతో రాక్షసస్య మహాకపిః,
తతః పార్శ్వేఽతివిపులాం దదర్శ మహతీం శిలామ్. 10

ప్ర. అ. బాణాభిహతః=బాణములచేత కొట్టబడిన, మహాకపిః=హనుమంతుడు, రాక్షసస్య=ఆ రాక్షసునికి, చుకోప=కోపించెను. తతః=అటుపిమ్మట, పార్శ్వే=ప్రక్కన, అతివిపులామ్=చాలా విశాలమైన, మహతీమ్=గొప్పదైన, శిలామ్=శిలను, దదర్శ=చూచెను.

తా. బాణముల దెబ్బ తిన్న హనుమంతుడు ఆ రాక్షసునిపై చాల కోపించి, ప్రక్కనే ఉన్న అతివిశాల మైన ఒక ఱాతిబండను చూచెను. 10

మూ. తరసా తాం సముత్పాట్య చిక్షేప బలవద్బలీ,
తాం శరైర్దశభిః క్రుద్ధస్తాడయామాస రాక్షసః. 11

ప్ర. అ. బలీ=బలవంతుడైన హనుమంతుడు, తామ్=ఆ శిలను తరసా=బలముతో, సముత్పాట్య=పెకలించి, బలవత్=బలముగా, చిక్షేప=విసరెను. రాక్షసః=రాక్షసుడు, క్రుద్ధః=కోపగించినవాడై, తామ్=ఆ శిలను, దశభిః=పది, శరైః=బాణములతో, తాడయామాస=కొట్టెను.

తా. బలశాలి యైన హనుమంతుడు ఆ ఱాతిబండను పెకలించి, చాల బలముగా దానిని విసరెను. ఆ రాక్షసుడు కోపించి, దానిని పది బాణాలతో ముక్కలు చేసెను. 11

మూ. విపన్నం కర్మ తద్దృష్ట్వా హనుమాంశ్చణ్డవిక్రమః,
పాలం విపులముత్పాట్య భ్రామయామాస వీర్యవాన్. 12

ప్ర. అ. చణ్డవిక్రమః=తీక్ష్ణమైన పరాక్రమము గల, వీర్యవాన్=బలము గల, హనుమాన్=హనుమంతుడు, తత్ కర్మ=ఆ పనిని, విపన్నమ్=విఫలమైన దానినిగా, దృష్ట్వా=చూచి, విపులమ్=చాలా పెద్ద దైన, సాలమ్=మద్దిచెట్టును, ఉత్పాట్య=పెకలించి, భ్రామయామాస=త్రిప్పెను.

తా. భయంకర మైన పరాక్రమము కలవాడు, బలశాలి అయిన హనుమంతుడు తాను విసరిన శిల నిష్ఫలమైనట్లు చూచి, పెద్ద మద్దిచెట్టు నొకదానిని పెకలించి, దానిని త్రిప్పెను. 12

మూ. భ్రామయన్తం కపిం దృష్ట్వా సాలవృక్షం మహాబలమ్,
చిక్షేప సుబహూన్ బాణాన్ జమ్బుమాలీ మహాబలః. 13

ప్ర. అ. మహాబలః=గొప్ప బలము గల, జమ్బుమాలీ=జంబుమాలి, సాల వృక్షమ్=సాలవృక్షమును, భ్రామయన్తమ్=త్రిప్పుచున్న, మహాబలమ్=గొప్ప బలము గల, కపిమ్=హనుమంతుని, దృష్ట్వా=చూచి, సుబహూన్=చాలా అధిక మైన, బాణాన్=బాణములను, చిక్షేప=విసరెను.

తా. మహాబలవంతు డైన ఆ జంబుమాలి, మహాబలశాలి యైన హనుమంతుడు సాలవృక్షమును త్రిప్పుట చూచి అనేకమైన బాణములు ప్రయోగించెను.

మూ. సాలం చతుర్భిశ్చిచ్ఛేద వానరం పఞ్చభిర్భుజే,
ఉరస్యేకేన బాణేన దశభిస్తు స్తనాన్తరే. 14

ప్ర. అ. సాలమ్=సాలవృక్షమును, చతుర్భిః=నాలుగు బాణముల చేత, చిచ్ఛేద=ఛేదించెను. వానరమ్=హనుమంతుని, పఞ్చభిః=ఐదు బాణములతో,

భుజే=భుజమునందు, ఉరసి=వక్షఃస్థలమునందు, ఏకేన బాణేన=ఒక్కబాణముతోను, స్తనాన్తరే=స్తనముల మధ్య, దశభిః=పది బాణములతోను, (కొట్టెను.)

తా. జంబుమాలి నాలుగు బాణములచేత సాలవృక్షమును ఛేదించి, హనుమంతుని ఐదు బాణాలతో భుజమునందు, ఒక బాణముతో వక్షఃస్థలమునందు, పది బాణాలతో స్తనముల మధ్య కొట్టెను. 14

మూ. స శరైః పూరితతనుః క్రోధేన మహతా వృతః,
తమేవ పరిఘం గృహ్య భ్రామయామాస వేగితః. 15

ప్ర. అ. శరైః=బాణములతో, పూరితతనుః=నింపబడిన శరీరముగల, సః=హనుమంతుడు, మహతా=గొప్ప, క్రోధేన=కోపముతో, వృతః=కూడినవాడై, వేగితః=వేగము దాల్చినవాడై, తం పరిఘమేవ=ఆ పరిఘనే, గృహ్య=గ్రహించి, భ్రామయామాస=త్రిప్పెను.

తా. దేహమంతా శరములతో నిండిపోవుటచే హనుమంతుడు చాలా క్రోధము చెంది, వేగమును అవలంబించి, ఆ పరిఘనే గ్రహించి త్రిప్పెను. 15

మూ. అతివేగోఽతివేగేన భ్రామయిత్వా బలోత్కటః,
పరిఘం పాతయామాస జమ్బుమాలేర్మహోరసి. 16

ప్ర. అ. బలోత్కటః=బలముచేత అతితీవ్రముగా ఉన్న హనుమంతుడు, అతివేగః=చాల వేగము కలవాడై, పరిఘమ్=పరిఘను, అతివేగేన=చాల వేగముచేత, భ్రామయిత్వా=త్రిప్పి, జమ్బుమాలేః=జంబుమాలియొక్క, మహోరసి=విశాలమైన వక్షఃస్థలమునందు, పాతయామాస=పడవేసెను.

తా. అత్యధిక మైన బలము, మహావేగము గల హనుమంతుడు, పరిఘను మహావేగముతో త్రిప్పి విశాలమైన జంబుమాలి వక్షఃస్థలము పైకి విసిరెను. 16

మూ. తస్య చైవ శిరో నాస్తి న బాహూ న చ జానునీ,
న ధనుర్న రథో నాశ్వాస్తత్రాదృశ్యన్త నేషవః. 17

ప్ర.అ. తత్ర=అక్కడ, తస్య=ఆ జంబుమాలియొక్క, శిరః చైవ=శిరస్సు, నాస్తి=లేదు, బాహూ=బాహువులు, న=లేవు. జానునీ=మోకాళ్లు, న=లేవు, ధనుః=ధనస్సు, న=లేదు. రథః=రథము, న=లేదు. అశ్వాః=గుఱ్ఱములు (గాడిదలు), నాదృశ్యన్త=చూడబడలేదు. ఇషవః=బాణములు, న=చూడబడలేదు.

తా. (ఆ పరిఘ పడి రథాశ్వాదులతో కూడ ఆ జంబుమాలి ఒక ముద్దగా అయిపోవుటచేత) ఆతని శిరస్సుగాని, బాహువులు గాని, మోకాళ్లు గాని, ధనస్సు గాని, రథము గాని, అశ్వములు గాని, బాణాలు గాని అక్కడ కనబడలేదు. 17

మూ. స హతః సహసా తేన జమ్బుమాలీ మహాబలః,
పపాత నిహతో భూమౌ చూర్ణితాఙ్గవిభూషణః. 18

ప్ర. అ. తేన=హనుమంతునిచేత, హతః=కొట్టబడిన, మహాబలః=గొప్ప బలముగల, జమ్బుమాలీ=జంబుమాలి, సహసా=వెంటనే, నిహతః=చంపబడినవాడై, చూర్ణితాఙ్గవిభూషణః=చూర్ణము చేయబడిన అవయవములు, అలంకారము కలవాడై, భూమౌ=నేలమీద, పపాత=పడెను.

తా. హనుమంతుడావిధముగ పరిఘతో కొట్టగానే, మహాబలవంతు డైన జంబుమాలి, వెంటనే అవయవములు, అలంకారములు చూర్ణమైపోగా, చచ్చి నేలపై పడెను. 18

మూ. జమ్బుమాలిం చ నిహతం కింకరాంశ్చ మహాబలాన్,
చుక్రోధ రావణః శ్రుత్వా కోపసంరక్తలోచనః. 19

ప్ర. అ. రావణః=రావణుడు, జమ్బుమాలిం చ=జంబుమాలిని, నిహతమ్=చంపబడినవానినిగా, మహాబలాన్=గొప్ప బలము గల, కింకరాంశ్చ=కింకరులను కూడ (చంపబడినవారినిగా), శ్రుత్వా=విని, కోపసంరక్తలోచనః=కోపముతో ఎఱ్ఱనైన నేత్రములు కలవాడై, చుక్రోధ=కోపించెను.

తా. రావణుడు, మహాబలశాలులైన కింకరులు మరణించినట్లు, పిదప జంబుమాలి కూడ మరణించినట్లు విని చాల కోపించెను. కోపోద్రేకము చేత ఆతని కళ్ళు ఎఱ్ఱబడెను. 19

మూ. స రోషసంవర్తితతామ్రలోచనః
ప్రహస్తపుత్రే విహతే మహాబలే,
అమాత్యపుత్రానతివీర్యవిక్రమాన్
సమాదిదేశాశు నిశాచరేశ్వరః. 20

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే సున్దరకాణ్డే
చతుశ్చత్వారింశః సర్గః.

ప్ర. అ. మహాబలే=గొప్ప బలము గల, ప్రహస్తపుత్రే=ప్రహస్తుని కుమారుడు, నిహతే=చంపబడినవాడగుచుండగా, సః నిశాచరేశ్వరః=ఆ రావణుడు, రోషసంవర్తితతామ్రలోచనః=రోషముతో త్రిప్పబడిన ఎర్రని నేత్రములు కలవాడై, ఆశు=వెంటనే, అతివీర్యవిక్రమాన్=అధికమైన బలము, పరాక్రమము గల, అమాత్యపుత్రాన్=మంత్రుల కుమారులను, సమాదిదేశ=ఆజ్ఞాపించెను.

తా. మహాబలశాలి యైన ప్రహస్తపుత్రుడు మరణించుటచే ఆ రావణుడు, రోషముతో ఎఱ్ఱని నేత్రములను త్రిప్పుచు, అధికమైన బలపరాక్రమములు గల మంత్రిపుత్రులను వెంటనే యుద్ధమునకు వెళ్లుడు అని ఆదేశించెను. 20

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్ర వ్యాఖ్యానమునందు సుందరకాండలో నలుబదినాల్గవ సర్గ సమాప్తము.

అథ పఞ్చచత్వారింశః సర్గః

[హనుమంతుడు ఏడుగురు మంత్రిపుత్రులను వధించుట.]

మూ. తతస్తే రాక్షసేన్ద్రేణ చోదితా మన్త్రిణః సుతాః,
నిర్యయుర్భవనాత్తస్మాత్సప్త సప్తార్చిరోచిషః. 1

మహాబలపరీవారా ధనుష్మన్తో మహాబలాః,
కృతాస్త్రాస్త్రవిదాం శ్రేష్ఠాః పరస్పరజయైషిణః. 2

హేమజాలపరిక్షిప్తైర్ధ్వజవద్భిః పతాకిభిః
తోయదస్వననిర్ఘోషైర్వాజియుక్తైర్మహారథైః. 3

తప్తకాఞ్చనచిత్రాణి చాపాన్యమితవిక్రమాః,
విస్ఫారయన్తః సంహృష్టాస్తటిత్వన్త ఇవామ్బుదాః. 4

ప్ర. అ. తతః=అటుపిమ్మట, సప్తార్చిరోచిషః=అగ్నివంటి కాంతి గలవారూ, మహాబలపరీవారాః=గొప్ప సైన్యము పరివారముగా కలవారూ, ధనుష్మన్తః=ధనుర్ధరులు, మహాబలాః=గొప్ప బలము గలవారు, కృతాస్త్రాః=అభ్యసింపబడిన అస్త్రములు కలవారూ, అస్త్రవిదామ్=అస్త్రవేత్తలలో, శ్రేష్ఠాః=శ్రేష్ఠులూ, పరస్పరజయైషిణః=ఒండొరుల జయమును కోరుచున్నవారు, అమిత విక్రమాః=అత్యధిక మైన పరాక్రమము గలవారు అయిన, సప్త=ఏడుగురైన, తే=ఆ, మన్త్రిణః=మంత్రియొక్క, సుతాః=కుమారులు, రాక్షసేన్ద్రేణ=రాక్షస రాజుచేత, చోదితాః=ప్రేరేపింపబడినవారై, సంహృష్టాః=సంతోషించినవారై, తప్తకాఞ్చనచిత్రాణి=పరిశుద్ధమైన బంగారముతో చిత్రవర్ణములైన, చాపాని=ధనస్సులను, విస్ఫారయన్తః=చరచుచు, తటిత్వన్తః=మెరుపులు గల, అమ్బుదాః ఇవ=మేఘములు వలె, హేమజాలపరిక్షిప్తైః=బంగారపు జాలములతో (చిక్కములతో) చుట్టబడిన, ధ్వజవద్భిః=పెద్ద జండాలు కలవి, పతాకిభిః=చిన్న జండాలు కలవి, తోయదస్వననిర్ఘోషైః=మేఘధ్వని వంటి ధ్వనిక లవి, వాజియుక్తైః=గుఱ్ఱములతో కూడినవి అయిన, మహారథైః=మహారథములతో, తస్మాత్=ఆ, భవనాత్=భవనమునుండి, నిర్యయుః=బయలు వెడలిరి.

తా. పిమ్మట, అగ్నితో సమానమైన కాంతి గల, మహాబలశాలులైన ఆ మంత్రికుమారులేడుగురు, రావణుడు ప్రేరేపించుటచే, అశ్వములు కట్టిన మహారథములపై ఎక్కి ఆ భవనము నుండి బయలుదేరిరి. మేఘధ్వని వంటి ధ్వనులు గల ఆ రథములకు చుట్టూ బంగారు జాలము కట్టబడెను. యోధుల చిహ్నము లైన ధ్వజములు, అలంకరణార్థము లైన పతాకలు (చిన్నజండాలు) వాటిపై ఎగురుచుండెను. ధనస్సులను ధరించిన మహాబలశాలులైన ఆ మంత్రి కుమారుల వెనుక పెద్ద సైన్యము కూడ బయలుదేరెను. బాగుగా అస్త్రవిద్యలో ఆరితేరిన ఆ మంత్రికుమారులు అస్త్రవేత్తలలో శ్రేష్ఠులు. వాళ్ళు జయమును సంపాదించుటకై ఒకరిపై ఒకరు పోటీపడుచుండిరి. మంచి ఉత్సాహముతో పరిశుద్ధమైన బంగారముతో చిత్రవర్ణములుగా ఉన్న ధనస్సులను చరచుచున్న ఆ మంత్రి కుమారులు, మెరుపులతో కూడిన మేఘముల వలె ఉండిరి. 1-4

మూ. జనన్యస్తు తతస్తేషాం విదిత్వా కింకరాన్ హతాన్,
బభూవుః శోకసంభ్రాన్తా సబాన్ధవసుహృజ్జనాః. 5

ప్ర. అ. తతః=అటుపిమ్మట, తేషామ్=వారియొక్క, సబాన్ధవసుహృజ్జనాః=బంధువులతోను, స్నేహితులతోను కూడిన, జనన్యస్తు=తల్లులైతే, కింకరాన్=కింకరులను, హతాన్=చంపబడినవారినిగా, విదిత్వా=తెలుసుకొని, శోకసంభ్రాన్తాః=దుఃఖముచేత పీడింపబడినవారు, బభూవుః=అయిరి.

తా. కింకరుల వంటి మహావీరులే చంపబడినారను విషయము తెలిసిన ఆ మంత్రికుమారుల తల్లులు, బంధువులు, మిత్రులు కూడ, వీళ్లేమగుదురో కదా అని దుఃఖముతో వ్యాకులత్వము చెందిరి. 5

మూ. తే పరస్పరసంఘర్షాత్తప్తకాఞ్చనభూషణాః,
అభిపేతుర్హనూమన్తం తోరణస్థమవస్థితమ్. 6

ప్ర. అ. తప్తకాఞ్చనభూషణాః=శుద్ధమైన బంగారు అలంకారములు గల, తే=వారు, పరస్పరసంఘర్షాత్=పరస్పరము పోటీవలన, తోరణస్థమ్=ముఖద్వారము వద్ద ఉన్న, అవస్థితమ్=యుద్ధానికి సిద్ధముగా ఉన్న, హనూమన్తమ్=హనుమంతుని గూర్చి, అభిపేతుః=ఎదురుగా వెళ్ళిరి.

తా. పరిశుద్ధమైన బంగారముతో చేసిన అలంకారములు ధరించిన ఆ మంత్రిపుత్రులు ముఖద్వారము వద్ద యుద్ధానికి సిద్ధముగా నిలబడిన హనుమంతుని మీదికి, ఒకరిపై ఒకరు పోటీ పడుచు, వెళ్ళిరి. 6

మూ. సృజన్తో బాణవృష్టిం తే రథగర్జితనిఃస్వనాః,
వృష్టిమన్త ఇవామ్భోదా విచేరుర్నైరృతామ్బుదాః. 7

ప్ర. అ. రథగర్జితనిఃస్వనాః=రథములయొక్క మేఘగర్జనమువంటి ధ్వని గల, తే=ఆ, నైరృతామ్బుదాః=మేఘముల వంటి రాక్షసులు, బాణవృష్టిమ్=బాణముల వర్షమును, సృజన్తః=సృష్టించుచున్నవారై, వృష్టిమన్తః=వర్షము గల, అమ్భోదాః ఇవ=మేఘముల వలె, విచేరుః=సంచరించిరి.

తా. మేఘముల వలె ఉన్న ఆ రాక్షసులు, ఉరుముల వంటి రథధ్వనులు వ్యాపించగా బాణవర్షము వర్షించుచు, వర్షించుచున్న మేఘముల వలె సంచరించిరి.

మూ. అవకీర్ణస్తతస్తాభిర్హనుమాన్ శరవృష్టిభిః,
అభవత్సంవృతాకారః శైలరాడివ వృష్టిభిః. 8

ప్ర. అ. తతః=అటుపిమ్మట, తాభిః శరవృష్టిభిః=ఆ శరవర్షముల చేత, అవకీర్ణః=చల్లబడిన, హనుమాన్=హనుమంతుడు, వృష్టిభిః=వర్షముల చేత, సంవృతాకారః=కప్పబడిన ఆకారము గల, శైలరాడివ=పర్వతరాజువలె, అభవత్=ఆయెను.

తా. అప్పుడా బాణవర్షము కప్పివేయగా, హనుమంతుడు, వర్షముచే కప్పివేయబడిన పర్వతరాజు వలె ఉండెను. 8

మూ. స శరాన్మోఘయామాస తేషామాశుచరః కపిః,
రథవేగం చ వీరాణాం విచరన్విమలేఽమ్బరే. 9

ప్ర. అ. ఆశుచరః=శీఘ్రముగా సంచరించు, సః కపిః=ఆ హనుమంతుడు, విమలే=నిర్మలమైన, అమ్బరే=ఆకాశమునందు, విచరన్=సంచరించుచు, తేషాం వీరాణామ్=ఆ వీరులయొక్క, శరాన్=బాణములను, రథవేగం చ=రథముల వేగమును, మోఘయామాస=వ్యర్థము చేసెను.

తా. అతిశీఘ్రముగా సంచరించు ఆ హనుమంతుడు, నిర్మలమైన ఆకాశమునందు తిరుగుచు, వీరులైన ఆ రాక్షసులు ప్రయోగించిన బాణములు, వారి రథాల వేగము కూడ నిష్ఫలమగునట్లు చేసెను. 9

మూ. స తైః క్రీడన్ధనుష్మద్భిర్వ్యోమ్ని వీరః ప్రకాశతే,
ధనుష్మద్భిర్యథా మేఘైర్మారుతః ప్రభురమ్బరే. 10

ప్ర. అ. వ్యోమ్ని=ఆకాశమునందు, ధనుష్మద్భిః=ధనుర్ధరులైన, తైః=ఆ రాక్షసులతో, క్రీడన్=ఆడుకొనుచున్న, సః వీరః=ఆ వీరుడు, అమ్బరే=ఆకాశము

నందు, ధనుష్మద్భిః=ఇంద్రధనుస్సులు గల, మేఘైః=మేఘములతో ఆడుకొనుచున్న, ప్రభుః=ప్రభువైన, మారుతః యథా=వాయువు వలె, ప్రకాశతే=ప్రకాశించుచుండెను.

తా. ఇంద్రధనస్సులతో కూడిన మేఘములతో వాయుదేవుడు ఆకాశము నందు ఆడుకొనుచున్నట్లు, హనుమంతుడు, ధనస్సులు ధరించి ఉన్న ఆ మంత్రి పుత్రులతో ఆకాశమార్గమునందు క్రీడించెను. 10

మూ. స కృత్వా నినదం ఘోరం త్రాసయంస్తాం మహాచమూమ్,
చకార హనుమాన్వేగం తేషు రక్షస్సు వీర్యవాన్. 11

ప్ర. అ. వీర్యవాన్=పరాక్రమవంతుడైన, సః=హనుమంతుడు, ఘోరమ్=భయంకరమైన, నినదమ్=ధ్వనిని, కృత్వా=చేసి, తామ్=ఆ, మహాచమూమ్=గొప్పసైన్యమును, త్రాసయన్=భయపెట్టుచు, తేషు రక్షస్సు=ఆ రాక్షసుల విషయమునందు, వేగమ్=వేగమును, చకార=చేసెను.

తా. పరాక్రమశాలియైన హనుమంతుడు ఆ మహాసేనకు భయము కలుగు నట్లు గొప్ప ధ్వని చేసి ఆ రాక్షసుల విషయమున వేగముగా ప్రవర్తించెను.

మూ. తలేనాభ్యహనత్కాంశ్చిత్పాదైః కాంశ్చిత్పరం తపః,
ముష్టినాభ్యహనత్కాంశ్చిన్నఖైః కాంశ్చిద్వ్యదారయత్. 12

ప్ర. అ. పరంతపః=శత్రుసంహారకుడైన ఆ హనుమంతుడు, కాంశ్చిత్=కొందరిని, తలేన=అరచేతితో, అభ్యహనత్=కొట్టెను. కాంశ్చిత్=కొందరిని, పాదైః=పాదాఘాతములచేత, కాంశ్చిత్=కొందరిని, ముష్టినా=పిడికిలిచేత, అభ్యహనత్=కొట్టెను. కాంశ్చిత్=కొందరిని, నఖైః=గోళ్ళతో, వ్యదారయత్=చీల్చెను.

తా. శత్రుసంహారకుడైన ఆ హనుమంతుడు కొందరిని అరచేతులతోను, కొందరిని పాదాఘాతములతోను, కొందరిని గ్రుద్దులతోను కొట్టి చంపెను. మరికొందరిని గోళ్ళతో చీల్చివేసెను. 12

మూ. ప్రమమాథోరసా కాంశ్చిదూరుభ్యామపరాన్ కపిః,
కేచిత్తస్య నినాదేన తత్రైవ పతితా భువి. 13

ప్ర. అ. కపిః=హనుమంతుడు, కాంశ్చిత్=కొందరిని, ఉరసా=వక్షస్థలముచేతను, అపరాన్=మరికొందరిని, ఊరుభ్యామ్=తొడలతోను, ప్రమమాథ=నలిపివేసెను. కేచిత్=కొందరు, తస్య=ఆతనియొక్క, నినాదేన=ధ్వనిచేత, తత్రైవ=అక్కడనే, భువి=నేలమీద, పతితాః=పడిరి.

తా. హనుమంతుడు కొందరిని వక్షఃస్థలముచేతను, మరికొందరిని తొడలచేతను మథించి చంపెను. మరికొందరు ఆ హనుమంతుడు చేసిన ధ్వనికే క్రిందపడిపోయిరి. 13

మూ. తతస్తేష్వవసన్నేషు భూమౌ నిపతితేషు చ,
తత్సైన్యమగమత్సర్వం దిశో దశ భయార్దితమ్. 14

ప్ర. అ. తేషు=ఆ రాక్షసులు, అవసన్నేషు=నశించినవారై, భూమౌ=నేలపై, నిపతితేషు చ=పడిపోయినవారగుచుండగా, తతః=పిమ్మట, సర్వమ్=సమస్తమైన, తత్=ఆ, సైన్యమ్=సైన్యము, భయార్దితమ్=భయముచేత పీడించబడినదై, దశ దిశః=పది దిక్కులను గూర్చి, అగమత్=పారిపోయెను.

తా. ఆ రాక్షసులీ విధముగా మరణించి నేలపై పడిపోవుట చూచి, మిగిలిన సైన్యమంతా భయముచేత పీడితమై పదిదిక్కులకు పారిపోయెను. 14

మూ. వినేదుర్విస్వరం నాగా నిపేతుర్భువి వాజినః,
భగ్ననీడధ్వజచ్ఛత్త్రైర్భూశ్చ కీర్ణాభవద్రథైః. 15

ప్ర. అ. నాగాః=ఏనుగులు, విస్వరమ్=విపరీతమైన స్వరము కలుగునట్లుగా, వినేదుః=ధ్వని చేసినవి. వాజినః=అశ్వములు, భువి=నేలమీద, నిపేతుః=పడిపోయినవి. భూశ్చ=భూమి కూడ, భగ్ననీడధ్వజచ్ఛత్త్రైః=విరిగిపోయిన పై కప్పులు, ధ్వజములు, ఛత్రములు, గల, రథైః=రథములతో, కీర్ణా అభవత్=వ్యాప్తమైనది.

తా. ఏనుగులు విపరీతస్వరముతో ధ్వనిచేసినవి. అశ్వములు నేలపై పడినవి. భూమికూడ, పై కప్పులు, ధ్వజములు, ఛత్రములు విరిగిపోయిన రథములతో వ్యాప్తమై యుండెను. 15

మూ. స్రవతా రుధిరేణాథ స్రవన్త్యో దర్శితాః పథి,
వివిధైశ్చ స్వరైర్లఙ్కా ననాద వికృతం తదా. 16

ప్ర. అ. అథ=అటుపిమ్మట, స్రవతా=స్రవించుచున్న, రుధిరేణ=రక్తముచేత, పథి=మార్గమునందు, స్రవన్త్యః=నదులు, దర్శితాః=చూపబడినవి. తదా=అప్పుడు, లఙ్కా=లంక, వివిధైః=అనేకవిధములైన, స్వరైః=స్వరములతో, వికృతమ్=వికారముగా, ననాద=మారుమ్రోగెను.

తా. పిమ్మట స్రవించుచున్న రక్తముచేత మార్గమునందు కాల్వలు ఏర్పడినవి. అప్పుడు అనేకవిధములైన స్వరములతో లంక మార్మోగెను. 16

మూ. స తాన్ ప్రవృద్ధాన్వినిహత్య రాక్షసాన్
మహాబలశ్చణ్డపరాక్రమః కపిః,
యుయుత్సురన్యైః పునరేవ రాక్షసై
స్తమేవ వీరోఽభిజగామ తోరణమ్. 17

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే సున్దరకాణ్డే
పఞ్చచత్వారింశః సర్గః.

ప్ర. అ. వీరః=వీరుడైన, మహాబలః=గొప్ప బలము గల, చణ్డపరాక్రమః=తీవ్రమైన పరాక్రమము గల, సః కపిః=ఆ హనుమంతుడు, ప్రవృద్ధాన్=బలముచేత పెరిగిన, తాన్ రాక్షసాన్=ఆ రాక్షసులను, వినిహత్య=చంపి, అన్యైః=ఇతరులైన, రాక్షసైః=రాక్షసులతో, యుయుత్సుః=యుద్ధముచేయదలచినవాడై, పునరేవ=తిరిగి, తమ్=ఆ, తోరణమేవ=తోరణమునే, అభిజగామ=చేరెను.

తా. వీరుడు, మహాబలశాలి, తీవ్రమైన పరాక్రమము కలవాడూ అయిన ఆ హనుమంతుడు అధికమైన బలము గల ఆ రాక్షసులను చంపి, ఇతర రాక్షసులతో కూడ యుద్ధము చేయవలెనను ఇచ్ఛతో, మళ్ళీ ఆ తోరణము దగ్గరకే వెళ్ళి నిలిచెను. 17

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు
సుందరకాండలో నలుబదిఐదవ సర్గ సమాప్తము.

అథ షట్చత్వారింశః సర్గః

[హనుమంతుడు రావణుని ఐదుగురు సేనాపతులను వధించుట]

మూ. హతాన్ మన్త్రిసుతాన్ బుద్ధ్వా వానరేణ మహాత్మనా,
రావణః సంవృతాకారశ్చకార మతిముత్తమామ్. 1

ప్ర. అ. రావణః=రావణుడు, మహాత్మనా=మహాత్ముడైన, వానరేణ=వానరునిచేత, మన్త్రిసుతాన్=మంత్రికుమారులను, హతాన్=చంపబడిన వారినిగా,బుద్ధ్వా=తెలిసికొని, సంవృతాకారః=కప్పబడిన ఆకారము కలవాడై, ఉత్తమామ్=ఉత్తమమైన, మతిమ్=ఆలోచనను, చకార=చేసెను.

తా. మహాత్ముడైన హనుమంతుడు మంత్రిపుత్రులను వధించినట్లు విని రావణుడు, మనస్సులోని దిగులు పైకి కనబడకుండ లోపలనే అణచుకొని, ఒక ఉత్తమమైన ఆలోచన చేసెను. 1

మూ. స విరూపాక్షయూపాక్షౌ దుర్ధరం చైవ రాక్షసమ్,
ప్రఘసం భాసకర్ణం చ పఞ్చ సేనాగ్రనాయకాన్. 2

సందిదేశ దశగ్రీవో వీరాన్నయవిశారదాన్,
హనుమద్గ్రహణవ్యగ్రాన్వాయువేగసమాన్యుధి. 3

ప్ర. అ. సః దశగ్రీవః=ఆ రావణుడు, వీరాన్=వీరులూ, నయవిశారదాన్=నీతియందు సమర్థులూ, హనుమద్గ్రహణవ్యగ్రాన్=హనుమంతునిపట్టుకొనుటయందు తొందరపడుచున్నవారూ, యుధి=యుద్ధమునందు, వాయువేగసమాన్=వాయువేగముతో సమానులు అయిన, విరూపాక్షయూపాక్షౌ=విరూపాక్షయూపాక్షులను, దుర్ధరమ్=దుర్ధరుడను, రాక్షసం చైవ=రాక్షసుని, ప్రఘసమ్=ప్రఘసునీ, భాసకర్ణం చ=భాసకర్ణునీ, సేనాగ్రనాయకాన్=సేనాప్రధాననాయకులైన, పఞ్చ=ఈ ఐదుగురునీ, సందిదేశ=ఆజ్ఞాపించెను.

తా. ఆ దశగ్రీవుడు వీరులూ, నీతిలో నిపుణులూ, హనుమంతుని పట్టుకొనుటకు తొందరపడుచున్నవారూ, యుద్ధములో వాయువేగముతో సమానులూ అయిన విరూపాక్షుడు, యూపాక్షుడు, దుర్ధరుడు, ప్రఘసుడు, భాసకర్ణుడు అను ఐదుగురు సేనాప్రధాననాయకులను ఇట్లాజ్ఞాపించెను. 2, 3

మూ. యాత సేనాగ్రగాః సర్వే మహాబలపరిగ్రహాః,
సవాజిరథమాతఙ్గాః స కపిః శాస్యతామితి. 4

ప్ర. అ. సేనాగ్రగాః=ఓ ! సేనాపతులారా !సర్వే=మీరందరు, మహాబలపరిగ్రహాః=మహాసేనయొక్క స్వీకారము కలవారై, సవాజిరథమాతఙ్గాః=అశ్వములతోను, రథములతోను, ఏనుగులతోను కూడినవారై, యాత=వెళ్ళండి. సః కపిః=ఆ వానరుడు, శాస్యతామ్=శిక్షింపబడుగాక, ఇతి=అని (ఆజ్ఞాపించెను).

తా. "ఓ ! సేనానాయకులారా ! పెద్దసైన్యమును తీసికొని, అశ్వములను, రథములను, గజములను తీసికొని, మీరందరు వెళ్ళి ఆ వానరుని శిక్షించండి" అని ఆజ్ఞాపించెను. 4

మూ. యత్నైశ్చ ఖలు భావ్యం స్యాత్తమాసాద్య వనాలయమ్,
కర్మ చాపి సమాధేయం దేశకాలవిరోధితమ్. 5

ప్ర. అ. తమ్=ఆ, వనాలయమ్=వానరుని, ఆసాద్య=సమీపించి, యత్నైః చ=ప్రయత్నవంతులుగా కూడ, భావ్యమ్=కాదగి ఉన్నది. దేశకాలవిరోధితమ్=దేశకాలములకు విరుద్ధముగా ఉన్న, కర్మ చాపి=పని కూడ, సమాధేయమ్=సరిచేయదగినది.

తా. "మీరు ఆ వానరుని విషయములో చాల ప్రయత్నపూర్వకముగా వ్యవహరించవలెను. పనులలో దేశవిరోధము, కాలవిరోధము లేకుండ చూచుకొనవలెను". 5

మూ. న హ్యహం తం కపిం మన్యే కర్మణా ప్రతితర్కయన్,
సర్వథా తన్మహద్భూతం మహాబలపరిగ్రహమ్. 6

ప్ర. అ. అహమ్=నేను, కర్మణా=అతడు చేసిన పనిచేత, ప్రతితర్కయన్=ఊహించుచు, తమ్=అతనిని, కపిమ్=వానరునిగా, న మన్యే=తలవను. సర్వథా=అన్ని విధములా, తత్=అది, మహాబలపరిగ్రహమ్=గొప్ప బలమును స్వీకరించి, మహత్=గొప్పదైన, భూతమ్=భూతము.

తా. "అతడు చేసిన పనిని పట్టి చూడగా నా కాతడు వానరుడని తోచుట లేదు. అదేదో మహాబలము గల మహాభూతమై ఉండును. సందేహము లేదు". 6

మూ. భవేదిన్ద్రేణ వా సృష్టమస్మదర్థం తపోబలాత్,
సనాగయక్షగన్ధర్వా దేవాసురమహర్షయః. 7

యుష్మాభిః సహితైః సర్వైర్మయా సహ వినిర్జితాః,
తైరవశ్యం విధాతవ్యం వ్యళీకం కించిదేవ నః. 8

తదేవ నాత్ర సందేహః ప్రసహ్య పరిగృహ్యతామ్,
నావమాన్యో భవద్భిశ్చ హరిర్ధీరపరాక్రమః. 9

ప్ర. అ. అస్మదర్థమ్=మనకోసమై, తపోబలాత్=తపోబలమువలన, ఇన్ద్రేణ=ఇంద్రునిచేత, సృష్టం వా=సృష్టింపబడిన దైనా, భవేత్=కావచ్చును. సహితైః=కలసి యున్న, సర్వైః=సమస్తమైన, యుష్మాభిః సహ=మీతో కూడిన, మయా=నాచేత, సనాగయక్షగన్ధర్వాః=నాగులతోను, యక్షులతోను, గంధర్వులతోను కూడిన, దేవాసురమహర్షయః=దేవతలు, అసురులు, మహర్షులు, వినిర్జితాః=జయింపబడినారు. తైః=వాళ్ళచేత, నః=మనకు, కించిదేవ=ఏదైన, వ్యళీకమ్=అపకారము, అవశ్యమ్=తప్పక, విధాతవ్యమ్=చేయదగినది. తదేవ=అట్టి భూతమే. అత్ర=ఈ విషయమునందు, సందేహః=సందేహము, న=లేదు. ప్రసహ్య=బలాత్కారముగా, పరిగృహ్యతామ్=పట్టుకొనబడుగాక. ధీరపరాక్రమః=గొప్ప పరాక్రమము గల, హరిః=ఈ వానరుడు, భవద్భిః=మీచేత, నావమాన్యః=అవమానింపదగినవాడుకాడు.

తా. "ఈ మహాభూతమును, మనకోసమై, ఇంద్రుడైనా తపోబలముతో సృష్టించి ఉండాలి. నేను మీరందరు వెంటరాగా, పూర్వము నాగులను, యక్షులను, గంధర్వులను, దేవతలను, అసురులను, మహర్షులను జయించి ఉన్నాను కదా. వాళ్లందరూ మనకేదో ఒక అపకారము చేయుటకు ప్రయత్నించుచునే ఉందురు. అందుచేత ఇది అట్టి మహాభూతమే ; సందేహము లేదు.దానిని బలప్రయోగము చేసి పట్టుకొనండి. మహాపరాక్రమముగల ఈ వానరుని విషయములో మీకు చిన్న చూపు ఉండగూడదు." 7-9

మూ. దృష్టా హి హరయః పూర్వం మయా విపులవిక్రమాః,
వాలీ చ సహసుగ్రీవో జామ్బవాంశ్చ మహాబలః. 10

నీలః సేనాపతిశ్చైవ యే చాన్యే ద్వివిదాదయః,
నైవం తేషాం గతిర్భీమా న తేజో న పరాక్రమః, 11
న మతిర్న బలోత్సాహౌ న రూపపరికల్పనమ్.

ప్ర. అ. పూర్వమ్=పూర్వము, మయా=నాచేత, విపులవిక్రమాః=అధికమైన పరాక్రమము గల, హరయః=వానరులు, సహసుగ్రీవః=సుగ్రీవునితో కూడిన, వాలీ చ=వాలి, మహాబలః=గొప్ప బలము గల, జామ్బవాంశ్చ=జాంబవంతుడు, సేనాపతిః=సేనాపతియైన, నీలః=నీలుడు, ద్వివిదాదయః=ద్వివిదుడు మొదలైన,

అన్యే చ=ఇతరులు, యే=ఎవరున్నారో వారూ, దృష్టాః హి=చూడబడినారు కదా. తేషామ్=వారియొక్క, గతిః=పద్ధతి, ఏవమ్=ఇట్లు, భీమా=భయంకరమైనది, న=కాదు. తేజః=తేజస్సు, న=కాదు. పరాక్రమః=పరాక్రమము, న=కాదు. మతిః=బుద్ధి, న=కాదు. బలోత్సాహౌ=బలము ఉత్సాహము కూడ (కావు) రూపపరికల్పనమ్=రూపమును చేయుట, న=కాదు.

తా. "వాలి, సుగ్రీవుడు, మహాబలశాలియైన జాంబవంతుడు, సేనాపతియైన నీలుడు, ద్వివిదుడు మొదలైన అత్యధికమైన బలము గల వానరులను ఎందరినో పూర్వము నేను చూచి ఉన్నాను. వాళ్ళకు ఇంత భయంకరమైన గతికాని, తేజస్సుకాని, పరాక్రమము కాని లేదు. ఇంత బుద్ధి, బలము, ఉత్సాహము, రూపమును మార్చదగిన శక్తి కూడ లేవు." 10, 11

మూ. మహత్సత్త్వమిదం జ్ఞేయం కపిరూపం వ్యవస్థితమ్. 12
ప్రయత్నం మహదాస్థాయ క్రియతామస్య నిగ్రహః.

ప్ర. అ. ఇదమ్=ఇది, కపిరూపమ్=కపిరూపము కలదై, వ్యవస్థితమ్=ఉన్న, మహత్=గొప్ప, సత్త్వమ్=ప్రాణిగా, జ్ఞేయమ్=తెలియదగినది. మహత్=గొప్ప, ప్రయత్నమ్=ప్రయత్నమును, ఆస్థాయ=అవలంబించి, అస్య=దీనియొక్క, నిగ్రహః=నిగ్రహము, క్రియతామ్=చేయబడుగాక.

తా. "ఇదేదో వానరరూపములో ఉన్న మహాభూతమనే విషయము గుర్తు ఉంచుకొని ప్రయత్నపూర్వకముగా దీనిని నిగ్రహింపుడు." 12

మూ. కామం లోకాస్త్రయః సేన్ద్రాః ససురాసురమానవాః, 13
భవతామగ్రతః స్థాతుం న పర్యాప్తా రణాజిరే.

ప్ర. అ. సేన్ద్రాః=ఇంద్రునితో కూడిన, ససురాసురమానవాః=సురులతోను, అసురులతోను, మానవులతోను కూడిన, త్రయః=మూడు, లోకాః=లోకములు, రణాజిరే=యుద్ధరంగమునందు, భవతామ్=మీయొక్క, అగ్రతః=ఎదుట, స్థాతుమ్=నిలచుటకు, న పర్యాప్తాః కామమ్=సరిపడినవారు కారు అనునది నిజమే.

తా. "ఇంద్రునితోను, సురులతోను, అసురులతోను, మానవులతోను, సహా మూడు లోకములూ కూడ రణరంగములో మీ ఎదుట నిలువజాలవనే విషయం వాస్తవమే !" 13

మూ. తథాపి తు నయజ్ఞేన జయమాకాంక్షతా రణే, 14
ఆత్మా రక్ష్యః ప్రయత్నేన యుద్ధసిద్ధిర్హి చఞ్చలా.

ప్ర. అ. తథాపి తు=అట్లయినను, రణే=యుద్ధమునందు, జయమ్=జయమును, ఆకాంక్షతా=కోరుచున్న, నయజ్ఞేన=నీతి తెలిసిన వానిచేత, ప్రయత్నేన=ప్రయత్న పూర్వకముగా, ఆత్మా=తాను, రక్ష్యః=రక్షించుకొనదగినవాడు. యుద్ధసిద్ధిః=యుద్ధమునందు సిద్ధి, చఞ్చలా హి=చంచలమైనది కదా.

తా. "అయినా కూడ, యుద్ధములో జయము పొందవలె నని కోరు నీతి విశారదుడు, ప్రయత్నపూర్వకముగా తనను తాను కాపాడుకొనవలెను. ఎందుచేత ననగా యుద్ధములో జయమనేది చంచలమైనది". 14

మూ. తే స్వామివచనం సర్వే ప్రతిగృహ్య మహౌజసః. 15
సముత్పేతుర్మహావేగా హుతాశసమతేజసః,
రథైర్మత్తైశ్చ మాతఙ్గైర్వాజిభిశ్చ మహాజవైః, 16
శస్త్రైశ్చ వివిధైస్తీక్ష్ణైః సర్వైశ్చోపచితా బలైః.

ప్ర. అ. మహౌజసః=గొప్ప బలము గలవారు, హుతాశసమతేజసః=అగ్నితో సమమైన తేజస్సు కలవారు అయిన, తే సర్వే=వారు అందరు, స్వామివచనమ్=ప్రభువు వాక్యమును, ప్రతిగృహ్య=స్వీకరించి, మహావేగాః=గొప్ప వేగము గలవారై, రథైః=రథములచేత, మత్తైః=మదించిన, మాతంగైః=ఏనుగలచేత, మహాజవైః=గొప్పవేగము గల, వాజిభిశ్చ=గుఱ్ఱములచేత, తీక్ష్ణైః=తీక్ష్ణములైన, వివిధైః=అనేకవిధములైన, శస్త్రైః=ఆయుధములచేత, సర్వైః=సమస్తములైన, బలైః=సేనలచేత, ఉపచితాః=వృద్ధిపొందించబడినవారై, సముత్పేతుః=శీఘ్రముగా వెళ్ళిరి.

తా. మహాబలవంతులు, అగ్నితో సమానమైన తేజస్సు కలవారు అయిన వాళ్ళందరూ ప్రభువు ఆజ్ఞను పాలించుచు, రథములచేత, మదించిన ఏనుగుల చేత, మహావేగము గల అశ్వములచేత, తీక్ష్ణములైన వివిధశస్త్రములచేత, సమస్తమైన సేనలచేత తమ బలమును పెంపొందించుకొని మహావేగముతో బయలుదేరిరి.

మూ. తతస్తం దదృశుర్వీరా దీప్యమానం మహాకపిమ్, 17
రశ్మిమన్తమివోద్యన్తం స్వతేజోరశ్మిమాలినమ్,
తోరణస్థం మహోత్సాహం మహాసత్త్వం మహాబలమ్. 18

ప్ర. అ. తతః=అటుపిమ్మట, వీరాః=ఆ వీరులు, స్వతేజోరశ్మి మాలినమ్=తన తేజస్సు యొక్క కిరణముల మాలలు కలవాడు, ఉద్యన్తమ్=ఉదయించుచున్న, రశ్మిమన్తమివ=సూర్యుడు వలె, దీప్యమానమ్=ప్రకాశించుచున్న వాడు, తోరణస్థమ్=ముఖద్వారమునందు ఉన్నవాడూ, మహోత్సాహమ్=గొప్ప ఉత్సాహము

కలవాడూ,మహాసత్త్వమ్=గొప్ప మనోధైర్యము కలవాడు, మహాబలమ్=గొప్ప బలము కలవాడూ అయిన, తం మహాకపిమ్=ఆ వానరుని, దదృశుః=చూచిరి.

తా. గొప్ప ఉత్సాహము, గొప్ప ధైర్యము, గొప్ప బలము గల ఆ హనుమంతుడు ముఖద్వారము వద్ద నిలచి ఉండెను. ఆతని శరీరము నుండి బయలువెడలిన తేజస్సు కిరణములు చుట్టూ వ్యాపించగా, ఆతడు ఉదయించుచున్న సూర్యుడు వలె ఉండెను. అట్టి హనుమంతుణ్ణి ఆ వీరు లందరు చూచిరి. 17, 18

మూ. మహామతిం మహావేగం మహాకాయం మహాబలమ్,
తం సమీక్ష్యైవ తే సర్వే దిక్షు సర్వాస్వవస్థితాః, 19
తై స్తైః ప్రహరణైర్భీమైరభిపేతుస్తతస్తతః.

ప్ర. అ. సర్వే=వాళ్ళందరూ, మహామతిమ్=గొప్ప బుద్ధి కలవాడూ; మహావేగమ్=గొప్ప వేగము కలవాడూ, మహాకాయమ్=గొప్ప శరీరము కల వాడూ, మహాబలమ్=గొప్పబలము కలవాడూ అయిన, తమ్=ఆ హనుమంతుని, సమీక్ష్యైవ=చూడగానే, సర్వాసు=సమస్తమైన, దిక్షు=దిక్కులందు, అవస్థితాః=నిలబడినవారై, తతస్తతః=ఆ యా వైపులనుండి, భీమైః=భయంకరమైన, తైస్తైః=ఆయా, ప్రహరణైః=ఆయుధములతో, అభిపేతుః=ఎదిరించిరి.

తా. గొప్ప బుద్ధి, గొప్ప వేగము, గొప్ప దేహము, గొప్ప బలము గల ఆ హనుమంతుని చూడగానే ఆ రాక్షసులందరు అన్ని దిక్కులందు నిలచి, ఆయా ప్రదేశాలనుండి, భయంకములైన ఆయా ఆయుధాలతో అతనిని ఎదుర్కొనిరి.19

మూ. తస్య పఞ్చాయసాస్తీక్ష్ణాః శితాః పీతముఖాః శరాః, 20
శిరస్యుత్పలపత్రాభా దుర్ధరేణ నిపాతితాః.

ప్ర. అ. తీక్ష్ణాః=తీక్ష్ణమైనవీ, శితాః=వాడి యైనవీ, పీతముఖాః=పచ్చని అగ్రభాగములు కలవీ, ఉత్పలపత్రాభాః=నల్లకలువ రేకుల వంటి కాంతి గలవీ, ఆయసాః=ఇనుపవీ అయిన, పఞ్చ=ఐదు, శరాః=బాణములు, దుర్ధరేణ=దుర్ధరునిచేత, తస్య=ఆ హనుమంతునియొక్క, శిరసి శిరస్సునందు, నిపాతితాః=పడవేయబడినవి.

తా. దుర్ధరుడు తీక్ష్ణములు, వాడి యైనవి, పచ్చని అగ్రభాగములు కలవి, నల్లకలువ రేకుల వంటి రంగు కలవి అయిన ఐదు ఇనుప బాణములను హనుమంతుని తలపై ప్రయోగించెను. 20

మూ. స తైః పఞ్చభిరావిద్ధః శరైః శిరసి వానరః, 21

ఉత్పపాత నదన్ వ్యోమ్ని దిశో దశ వినాదయన్.

ప్ర. అ. వానరః=ఆ హనుమంతుడు, తైః=ఆ, పఞ్చభిః=ఐదు, శరైః=బాణములచేత, శిరసి=శిరస్సుమీద, ఆవిద్ధః=కొట్టబడినవాడై, నదన్=ధ్వనిచేయుచు, దశ దిశః=పది దిక్కులను, వినాదయన్=ప్రతిధ్వనింపచేయుచు, వ్యోమ్ని=ఆకాశమునందు, ఉత్పపాత=ఎగిరెను.

తా. శిరస్సుపై ఆ అయిదు ప్రహారలు తగలగానే, హనుమంతుడు పది దిక్కులు ప్రతిధ్వనించునట్లు ధ్వని చేయుచు, ఆకాశములోనికి ఎగిరెను. 21

మూ. తతస్తు దుర్ధరో వీరః సరథః సజ్యకార్ముకః, 22
కిరన్ శరశతైః స్తీక్ష్ణైరభిపేదే మహాబలః.

ప్ర. అ. తతః=అటు పిమ్మట, మహాబలః=గొప్ప బలము గల, వీరః=వీరు డైన, దుర్ధరః=దుర్ధరుడు, సరథః=రథముతో కూడినవాడై, సజ్యకార్ముకః=ఎక్కుపెట్టబడిన నారి గల ధనస్సుతో కూడినవాడై, తీక్ష్ణైః=తీక్ష్ణములైన, శరశతైః=వందలకొలది శరముల చేత, కిరన్=చిమ్ముచు, అభిపేదే= హనుమంతుని ఎదిరించెను.

తా. పిమ్మట, మహాబలవంతుడు, వీరుడూ అయిన దుర్ధరుడు రథముతో ఆకాశము పైకి ఎగిరి, ధనస్సును ఎక్కుపెట్టి, తీక్ష్ణము లైన వందల కొలది శరములు చిమ్ముచు, హనుమంతుని ఎదిరించెను. 22

మూ. స కపిర్వారయామాస తం వ్యోమ్ని శరవర్షిణమ్, 23
వృష్టిమన్తం పయోదాన్తే పయోదమివ మారుతః.

ప్ర. అ. సః కపిః=ఆ హనుమంతుడు, వ్యోమ్ని=ఆకాశమునందు, శరవర్షిణమ్=శరములను వర్షించుచున్న, తమ్=ఆతనిని, పయోదాన్తే=వర్షాకాలము అంతమునందు, వృష్టిమన్తమ్=వర్షము గల, పయోదమ్=మేఘమును, మారుతః ఇవ=వాయువు వలె, వారయామాస=నివారించెను.

తా. ఆకాశమునందు ఆ విధముగా శరవర్షము కురిపించుచున్న ఆ దుర్ధరుని, హనుమంతుడు, వర్షించుచున్న మేఘమును, వర్షాకాలాంతమునందు, వాయువు వారించినట్లు వారించెను. 23

మూ. అర్ద్యమానస్తతస్తేన దుర్ధరేణానిలాత్మజః, 24
చకార కదనం భూయో వ్యవర్ధత చ వేగవాన్.

ప్ర. అ. తేన=ఆ, దుర్ధరేణ=దుర్ధరునిచేత, అర్ద్యమానః=పీడింపబడుచున్న,

అనిలాత్మజః=వాయునందనుడు, తతః=అటు పిమ్మట, కదనమ్=యుద్ధమును, చకార=చేసెను, వేగవాన్=వేగవంతుడై, భూయః=మరల, వ్యవర్ధత=పెరిగెను.

తా. దుర్ధరుడీ విధముగా పీడింపగా హనుమంతుడు యుద్ధము చేయుచు, వేగవంతుడై మరల శరీరమును పెంచెను. 24

మూ. స దూరం సహసోత్పత్య దుర్ధరస్య రథే హరిః, 25
నిపపాత మహావేగో విద్యుద్రాశిర్గిరావివ.

ప్ర. అ. సః హరిః=ఆ హనుమంతుడు, సహసా=హటాత్తుగా, ఉత్పత్య=ఎగిరి, మహావేగః=గొప్ప వేగము గలవాడై, గిరౌ=పర్వతముమీద, విద్యుద్రాశిరివ=మెరుపుల రాశి వలె, దుర్ధరస్య=దుర్ధరుని యొక్క, రథే=రథము మీద, నిపపాత=పడెను.

తా. హనుమంతుడు హటాత్తుగా చాలా పైకి ఎగిరి, మహావేగముతో, మెరుపుల సముదాయము పర్వతము మీద పడినట్లు దుర్ధరుని రథము మీద పడెను. 25

మూ. తతః స మథితాష్టాశ్వం రథం భగ్నాక్షకూబరమ్, 26
విహాయ న్యపతద్భూమౌ దుర్ధరస్త్యక్తజీవితః.

ప్ర. అ. తతః=అటు పిమ్మట, సః దుర్ధరః=ఆ దుర్ధరుడు, మథితాష్టాశ్వమ్=నలగకొట్టబడిన ఎనిమిది గుఱ్ఱములు గల, భగ్నాక్షకూబరమ్=విరిగిన ఇరుసులు నిలువు కఱ్ఱ గల, రథమ్=రథమును, విహాయ=విడచి, త్యక్తజీవితః=విడువబడిన జీవితము గలవాడై, భూమౌ=నేలపై, న్యపతత్=పడెను.

తా. హనుమంతుడు రథము మీద పడగానే దాని ఇరుసులు, నిలువు కఱ్ఱ విరిగిపోయెను. ఎనిమిది గుఱ్ఱములు నలిగిపోయెను. దుర్ధరుడు దానినుండి క్రింద పడి ప్రాణములు విడచెను. 26

మూ. తం విరూపాక్షయూపాక్షౌ దృష్ట్వా విపతితం భువి, 27
సంజాతరోషౌ దుర్ధర్షావుత్పేతతురరిందమౌ.

ప్ర. అ. దుర్ధర్షౌ=ఎదిరింప శక్యము కాని వారు, అరిందమౌ=శత్రుసంహారకులు అయిన, విరూపాక్షయూపాక్షౌ=విరూపాక్షయూపాక్షులు, భువి=నేలపై, నిపతితమ్=పడిన, తమ్=అతనిని, దృష్ట్వా=చూచి, సంజాతరోషౌ=పుట్టిన రోషము కలవారై, ఉత్పేతతుః=పైకి ఎగిరిరి.

తా. ఎదిరింప శక్యము కానివారు, శత్రుసంహారకులూ అయిన

విరూపాక్షయూపాక్షులు, ఆ దుర్ధరుడు నేలపై పడిపోయినట్లు చూచి, చాల కోపించి, ఆకాశములోనికి ఎగిరిరి. 27

మూ. స తాభ్యా సహసోత్పత్య విష్ఠితో విమలేఽమ్బరే, 28
ముద్గరాభ్యాం మహాబాహుర్వక్షస్యభిహతః కపిః.

ప్ర. అ. విమలే=స్వచ్ఛమైన, అమ్బరే=ఆకాశమునందు, విష్ఠితః=నిలచిఉన్న, మహాబాహుః=గొప్పబాహువులు గల, సః కపిః=ఆ హనుమంతుడు, తాభ్యామ్=వారిచేత, సహసా=శీఘ్రముగా, ఉత్పత్య=ఎగిరి, ముద్గరాభ్యామ్=ముద్గరములతో, వక్షసి=వక్షఃస్థలమునందు, అభిహతః=కొట్టబడెను.

తా. ఆ రాక్షసు లిద్దరూ శీఘ్రముగా పైకి ఎగిరి, నిర్మలమైన ఆకాశములో ఉన్న మహాబాహువైన హనుమంతుని, ముద్గరములతో వక్షఃస్థలముపై కొట్టిరి.28

మూ. తయోర్వేగవతోర్వేగం వినిహత్య మహాబలః, 29
నిపపాత పునర్భూమౌ సుపర్ణసమవిక్రమః.

ప్ర. అ. మహాబలః=గొప్ప బలము గల, సుపర్ణసమవిక్రమః=గరుత్మంతునితో సమానమైన పరాక్రమముగల హనుమంతుడు, వేగవతోః=వేగము గల, తయోః=ఆ రాక్షసులయొక్క, వేగమ్=వేగమును, వినిహత్య=అణచివేసి, పునః=మరల, భూమౌ=నేలమీదకు, నిపపాత=దిగెను.

తా. గరుత్మంతునితో సమానమైన పరాక్రమము కలవాడూ, మహాబలశాలీ అయిన హనుమంతుడు వేగవంతులైన ఆ రాక్షసుల వేగమును అణచివేసి, మళ్ళీ నేలమీదకు దిగెను. 29

మూ. స సాలవృక్షమాసాద్య తముత్పాట్య చ వానరః, 30
తావుభౌ రాక్షసౌ వీరౌ జఘాన పవనాత్మజః.

ప్ర. అ. వానరః=వానరుడైన, సః పవనాత్మజః=ఆ హనుమంతుడు, సాలవృక్షమ్=సాలవృక్షమును, ఆసాద్య=సమీపించి, తమ్=దానిని, ఉత్పాట్య చ=పెకలించి, తౌ=ఆ, ఉభౌ=ఇద్దరు, వీరౌ=వీరులైన, రాక్షసౌ=రాక్షసులను, జఘాన=చంపెను.

తా. ఆ హనుమంతుడు ఒక సాలవృక్షము దగ్గరకు వెళ్ళి, దానిని పెకలించి, దానితో ఆ రాక్షసవీరులిద్దరినీ వధించెను. 30

మూ. తతస్తాంస్త్రీన్ హతాన్ జ్ఞాత్వా వానరేణ తరస్వినా, 31
అభిపేదే మహావేగః ప్రసహ్య ప్రఘసో హరిమ్,
భాసకర్ణశ్చ సంక్రుద్ధః శూలమాదాయ వీర్యవాన్. 32

ప్ర. అ. తతః=అటుపిమ్మట, తరస్వినా=బలముగల, వానరేణ=హనుమంతునిచేత, తాన్ త్రీన్=ఆ ముగ్గురినీ, హతాన్=చంపబడినవారినిగా, జ్ఞాత్వా=తెలిసికొని, ప్రఘసః=ప్రఘసుడు, మహావేగః=గొప్ప వేగము గలవాడై, ప్రసహ్యా=బలాత్కారముగా, అభిపేదే=ఎదిరించెను. వీర్యవాన్=పరాక్రమవంతుడైన, భాసకర్ణశ్చ=భాసకర్ణుడు కూడ, సంక్రుద్ధః=కోపించిన వాడై, శూలమ్=శూలమును, ఆదాయ=గ్రహించి, (అభిపేదే=ఎదిరించెను).

తా. మహాబలశాలియైన హనుమంతుడు ఆ ముగ్గురు రాక్షసులను వధించుట చూచి ప్రఘసుడు, మహావేగముతో, బలమును చూపుచు, హనుమంతుని ఎదిరించెను. పరాక్రమవంతుడైన భాసకర్ణుడు కూడ శూలము గ్రహించి ఆతని మీదకు వెళ్ళెను. 31, 32

మూ. ఏకతః కపిశార్దూలం యశస్వినమవస్థితౌ,
పట్టిసేన శితాగ్రేణ ప్రఘసః ప్రత్యయోధయత్. 33
భాసకర్ణశ్చ శూలేన రాక్షసః కపిసత్తమమ్.

ప్ర. అ. యశస్వినమ్=కీర్తిమంతుడైన, కపిశార్దూలమ్=వానరశ్రేష్ఠుడైన హనుమంతుని గూర్చి, ఏకతః=ఒక ప్రక్క, అవస్థితౌ=నిలచిరి. ప్రఘసః=ప్రఘసుడు, శితాగ్రేణ=వాడియైన అగ్రము గల, పట్టిసేన=పట్టిసముతో, కపిసత్తమమ్=హనుమంతుని, ప్రత్యయోధయత్=ఎదిరించి యుద్ధము చేసెను. భాసకర్ణః=భాసకర్ణుడను, రాక్షసః=రాక్షసుడు, శూలేన=శూలముతో, ఎదిరించి యుద్ధము చేసెను.

తా. వాళ్ళిద్దరూ, కీర్తిమంతుడైన, ఆ వానరశ్రేష్ఠునకు ఎదురుగా ఒక ప్రక్క నిలచిరి. ప్రఘసుడు వాడియైన అగ్రము గల పట్టిసముతో హనుమంతుని ఎదిరించి యుద్ధము చేసెను. భాసకర్ణుడు శూలముతో యుద్ధము చేసెను. 33

మూ. స తాభ్యాం విక్షతైర్గాత్రైరసృగ్దిగ్ధతనూరుహః, 34
అభవద్వానరః క్రుద్ధో బాలసూర్యసమప్రభః.

ప్ర. అ. తాభ్యామ్=వారిద్దరిచేత, విక్షతైః=కొట్టబడిన, గాత్రైః=అవయవములతో, అసృగ్దిగ్ధతనూరుహః=రక్తము చేత పూయబడిన రోమములు గల, సః వానరః=ఆ హనుమంతుడు, బాలసూర్యసమప్రభః=బాలసూర్యునితో సమానమైన కాంతి కలవాడై, క్రుద్ధః=కోపించిన వాడు, అభవత్=ఆయెను.

తా. ఆ రాక్షసులిరువురు కొట్టి అవయవములకు గాయములు చేయుగా, రక్తముతో శరీరముపై ఉన్న రోమములు తడియుటచే హనుమంతుడు బాలసూర్యుడు వలె ప్రకాశించెను. అప్పుడాతడు కోపోద్రిక్తుడయ్యెను. 34

మూ. సముత్పాట్య గిరేః శృఙ్గం సమృగవ్యాళపాదపమ్, 35
జఘాన హనుమాన్ వీరో రాక్షసౌ కపికుఞ్జరః.

ప్ర. అ. కపికుఞ్జరః=వానరశ్రేష్ఠుడు, వీరః=వీరుడు అయిన, హనుమాన్=హనుమంతుడు, సమృగవ్యాళపాదపమ్=మృగములతోను, సర్పములతోను, వృక్షములతోను కూడిన, గిరేః శృఙ్గమ్=పర్వతశిఖరమును, సముత్పాట్య=పెకలించి, రాక్షసౌ=ఆ రాక్షసులిద్దరినీ, జఘాన=చంపెను.

తా. వానరశ్రేష్ఠుడు, వీరుడు అయిన హనుమంతుడు మృగములతోను, సర్పములతోను, వృక్షములతోను సహా ఒక పర్వతశిఖరము పెకలించి ఆ రాక్షసుల నిద్దరినీ చంపివేసెను. 35

మూ. తతస్తేష్వవసన్నేషు సేనాపతిషు పఞ్చసు, 36
బలం తదవశేషం చ నాశయామాస వానరః.

ప్ర. అ. తతః=అటుపిమ్మట, తేషు=ఆ, పఞ్చసు=ఐదుగురు, సేనాపతిషు=సేనాపతులు, అవసన్నేషు=నశించిన వారగుచుండగా, వానరః=హనుమంతుడు, తత్=ఆ, అవశేషమ్=మిగిలిన, బలమ్=సైన్యమును, నాశయామాస=నశింపచేసెను.

తా. ఆ అయిదుగురు సేనాపతులు మరణించిన పిమ్మట, హనుమంతుడు మిగిలిన సైన్యమును కూడ సంహరించెను. 36

మూ. అశ్వైరశ్వాన్ గజైర్నాగాన్ యోధైర్యోధాన్రథై రథాన్, 37
స కపిర్నాశయామాస సహస్రాక్ష ఇవాసురాన్.

ప్ర. అ. సః కపిః=ఆ హనుమంతుడు, సహస్రాక్షః=దేవేంద్రుడు, అసురానివ=అసురులను వలె, అశ్వైః=అశ్వములచేత, అశ్వాన్=అశ్వములను, గజైః=గజములచేత, నాగాన్=గజములను, యోధైః=యోధులచేత, యోధాన్=యోధులను, రథైః=రథములచేత, రథాన్=రథములను, నాశయామాస=నశింపచేసెను.

తా. హనుమంతుడు అశ్వములమీద అశ్వాలను, గజములమీద గజములను, యోధులమీద యోధులను, రథాలమీద రథాలను వేసి కొట్టి, దేవేంద్రుడు అసురులను సంహరించినట్లు సంహరించెను. 37

మూ. హతైర్నాగైశ్చ తురగైర్భగ్నాక్షైశ్చ మహారథైః. 38
హతైశ్చ రాక్షసైర్భూమీ రుద్ధమార్గా సమన్తతః.

ప్ర. అ. హతైః=చంపబడిన, నాగైః=ఏనుగులచేతను, తురగైః=గుఱ్ఱములచేతను, భగ్నాక్షైః=విరగ కొట్టబడిన ఇరుసులు గల, మహారథైశ్చ=పెద్ద

రథములచేతను, హతైః=చంపబడిన, రాక్షసైః=రాక్షసులచేతను, భూమిః=భూమి, సమన్తతః=అంతటా, రుద్ధమార్గా=అడ్డుకొనబడిన మార్గములు కలది అయ్యెను.

తా. చచ్చిపడి ఉన్న గజములతోను, అశ్వములతోను, రాక్షసులతోను, ఇరుసులు విరిగిన మహారథములతోను నలుమూలలా, భూమిపై నడుచుటకు (శక్యము) కాకుండా ఉండెను. 38

మూ. తతః కపిస్తాన్ ధ్వజినీపతీన్ రణే
నిహత్య వీరాన్ సబలాన్ సవాహనాన్,
తథైవ వీరః పరిగృహ్య తోరణం
కృతక్షణః కాల ఇవ ప్రజాక్షయే. 39

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే సున్దరకాణ్డే
షట్చత్వారింశః సర్గః.

ప్ర. అ. తతః=అటుపిమ్మట, వీరః=వీరుడైన, కపిః=హనుమంతుడు, వీరాన్=వీరులు, సబలాన్=సైన్యముతో కూడినవారు, సవాహనాన్=వాహనములతో కూడినవారు అయిన, తాన్=ఆ, ధ్వజినీపతీన్=సేనాపతులను, రణే=యుద్ధమునందు, నిహత్య=చంపి, తథైవ=అట్లే, తోరణమ్=ముఖద్వారమును, పరిగృహ్య=గ్రహించి, ప్రజాక్షయే=ప్రజల వినాశమునందు (కొరకు), కాలః ఇవ=యముడు వలె, కృతక్షణః=చేయబడిన నిరీక్షణము కలవాడై, (ఉండెను).

తా. వీరుడైన హనుమంతుడు సేనావాహన సహితులైన ఆ సేనానాయకులను యుద్ధరంగములో వధించి, వెనుకటివలె ఆ తోరణమునే ఆశ్రయించి, ప్రజలను సంహరించుటకై యముడు నిరీక్షించునట్లు రాక్షసుల రాకకై నిరీక్షించుచుండెను.

"బాలానందిని"అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు
సుందరకాండలో నలుబదియారవ సర్గ సమాప్తము.

అథ సప్తచత్వారింశః సర్గః

[హనుమంతుడు అక్షకుమారుని వధించుట]

మూ. సేనాపతీన్ పఞ్చ స తు ప్రమాపితాన్
హనూమతా సానుచరాన్ సవాహనాన్,
నిశమ్య రాజా సమరోద్ధతోన్ముఖం
కుమారమక్షం ప్రసమైక్షతాగ్రతః. 1

ప్ర. అ. సః రాజా=ఆ రావణుడు, సానుచరాన్=అనుచరులతో కూడిన, సవాహనాన్=వాహనాలతో కూడిన, పఞ్చ=ఐదుగురు, సేనాపతీన్=సేనాపతులను, హనూమతా=హనుమంతునిచేత, హతాన్=చంపబడినవారినిగా, నిశమ్య=విని, సమరోద్ధతోన్ముఖమ్=యుద్ధమునందు తీవ్రమైనవాడు, యుద్ధాభిముఖుడూ అయిన, అగ్రతః=తన ఎదుట కూర్చున్న, కుమారమ్=కుమారుడైన, అక్షమ్=అక్షుణ్ణి, ప్రసమైక్షత=చూచెను.

తా. ఐదుగురు సేనాపతులను కూడా, సవాహనపరివారముగా హనుమంతుడు చంపివేసినట్లు విని రావణుడు, యుద్ధములో ఉద్ధతుడూ, యుద్ధోన్ముఖుడూ అయిన, ఎదుటనే కూర్చొని ఉన్న తన కుమారుడైన అక్షుని వైపు చూచెను. 1

మూ. స తస్య దృష్ట్యర్పణసంప్రచోదితః
ప్రతాపవాన్ కాఞ్చనచిత్రకార్ముకః,
సముత్పపాతాథ సదస్యుదీరితో
ద్విజాతిముఖ్యైర్హవిషేవ పావకః. 2

ప్ర. అ. అథ=అటుపిమ్మట, తస్య=రావణుని యొక్క, దృష్ట్యర్పణసంప్రచోదితః=దృష్టిని ప్రసరింపచేయుటచేత ప్రేరేపింపబడినవాడై, ప్రతాపవాన్=ప్రతాపవంతుడైన, సః=ఆ అక్షుడు, కాఞ్చనచిత్రకార్ముకః=బంగారముచేత చిత్రవర్ణమైన ధనస్సు కలవాడై, సదసి=యజ్ఞమునందు, ద్విజాతిముఖ్యైః=శ్రేష్ఠులైన బ్రాహ్మణుల చేత, హవిషా=హవిస్సుచేత, ఉదీరితః=ప్రజ్వలింపచేయబడిన, పావకః ఇవ =అగ్ని వలె, సముత్పపాత=వేగముగా లేచెను.

తా. ప్రతాపవంతుడైన ఆ అక్షుడు, రావణుని దృష్టిచే ప్రేరితుడై, బంగారముచేత చిత్రవర్ణమైన ధనస్సు ధరించి, యజ్ఞములో బ్రాహ్మణశ్రేష్ఠులు ప్రజ్వలింపచేసిన అగ్ని వలె, వెంటనే లేచెను. 2

మూ. తతో మహద్బాలదివాకరప్రభం
ప్రతప్తజామ్బూనదజాలసంతతమ్,
రథం సమాస్థాయ యయౌ స వీర్యవాన్
మహాహరిం తం ప్రతి నైర్ఋతర్షభః. 3

ప్ర. అ. తతః=అటుపిమ్మట, వీర్యవాన్=పరాక్రమవంతుడైన, సః నైర్ఋతర్షభః=రాక్షసశ్రేష్ఠుడు, బాలదివాకరప్రభమ్=బాలసూర్యుని వంటి కాంతి గలదీ, ప్రతప్తజామ్బూనదజాలసంతతమ్=కరిగించిన బంగారము జాలముతో (వలతో) చుట్టబడినదీ అయిన, మహత్=గొప్ప, రథమ్=రథమును, సమాస్థాయ=అధిష్ఠించి, తమ్=ఆ, మహాహరిం ప్రతి=మహావానరుని గూర్చి, యయౌ=వెళ్లెను.

తా. పరాక్రమవంతుడైన ఆ రాక్షసశ్రేష్ఠుడు, చుట్టూ పరిశుద్ధమైన బంగారు జాలము కట్టుటచే బాలసూర్యుని వంటి కాంతితో మెరయుచున్న గొప్ప రథమును అధిష్ఠించి, ఆ వానరోత్తమునితో యుద్ధమునకై వెళ్లెను. 3

మూ. తతస్తపఃసంగ్రహసంచయార్జితం
ప్రతప్తజామ్బూనదజాలశోభితమ్,
పతాకినం రత్నవిభూషితధ్వజం
మనోజవాష్టాశ్వవరైః సుయోజితమ్. 4

ప్ర. అ. (4, 5 శ్లోకాలలోని ద్వితీయాంతాలన్నీ 6 వ శ్లోకంలోని "రథమ్" అనేదానికి విశేషణాలు). తతః=అటుపిమ్మట, తపఃసంగ్రహ సంచయార్జితమ్=తపఃసంపాదనముల సముదాయముల చేత (అనేకవిధములైన తపస్సులచేత) సంపాదించబడినదీ, ప్రతప్తజామ్బూనదజాలశోభితమ్=కరిగించబడిన బంగారపు జాలముచేత శోభింపచేయబడినదీ, పతాకినమ్=పతాకలతో కూడినదీ, రత్నవిభూషితధ్వజమ్=రత్నములచేత అలంకరింపబడిన ధ్వజముగలదీ, మనోజవాష్టాశ్వవరైః=మనోవేగము వంటి వేగము గల ఎనిమిది శ్రేష్ఠములైన అశ్వములతో, సుయోజితమ్=బాగుగా కూర్చబడినదీ (అయిన రథము నెక్కి వెళ్ళెను.)

తా. ఆ రథమును అతడు ఎన్నో తపస్సుల సముదాయములు చేసి సంపాదించుకొనెను. కరిగించిన పరిశుద్ధమైన బంగారు వలతో అది ప్రకాశించుచుండెను. దానిపై అలంకరణార్థమై చిన్న పతాకలు, రత్నములచే అలంకృతమైన ధ్వజము అమర్చబడి ఉండెను. మనోవేగముతో సమానమైన వేగము గల ఎనిమిది గుఱ్ఱములు దానికి కట్టి యుండెను. 4

మూ. సురాసురాధృష్యమసంగచారిణం
రవిప్రభం వ్యోమచరం సమాహితమ్,
సతూణమష్టాసి నిబద్ధబన్ధురం
యథాక్రమావేశితశక్తితోమరమ్. 5

ప్ర. అ. సురాసురాధృష్యమ్=సురులచేతను, అసురులచేతను, ఎదిరింప శక్యము కానిదీ, అసంగచారిణమ్=అడ్డులేకుండా నడిచేదీ, రవిప్రభమ్=సూర్యుని వంటికాంతి గలదీ, వ్యోమచరమ్=ఆకాశము మీద కూడ సంచరించేదీ, సమాహితమ్=చక్కగా అమర్చబడినదీ, సతూణమ్=అంబులపొదులతో కూడినదీ, అష్టాసి=ఎనిమిది కత్తులు కలదీ, నిబద్ధబన్ధురమ్=కట్టబడిన గంటలు కలదీ, యథాక్రమావేశితశక్తితోమరమ్=క్రమానుసారముగా ఉంచబడిన శక్తులు, తోమరములు గలది (అయిన రథము నెక్కి వెళ్ళెను).

తా. ఆ రథమును సురులు, అసురులు కూడా ఎదిరించజాలరు. అది ఎక్కడనైనా అడ్డులేకుండా ప్రయాణము చేయగలదు. సూర్యునివంటి కాంతి గల, గంటలు కట్టిన, ఆ రథము ఆకాశము మీద కూడ సంచరించగలదు. చక్కగా కూర్చబడిన ఆ రథము మీద ఆయాస్థానములందు అంబులపొదులు, ఎనిమిది ఖడ్గములు, శక్తులు, తోమరములు అమర్చబడియుండెను. 5

మూ. విరాజమానం ప్రతిపూర్ణవస్తునా
సహేమదామ్నా శశిసూర్యవర్చసా,
దివాకరాభం రథమాస్థితస్తతః
స నిర్జగామామరతుల్యవిక్రమః. 6

ప్ర. అ. తతః=అటు పిమ్మట, అమరతుల్యవిక్రమః=దేవతలతో సమానమైన పరాక్రమము గల, సః=అతడు, సహేమదామ్నా=బంగారుమాలతో కూడినదీ, శశిసూర్యవర్చసా=చంద్రసూర్యులవంటి కాంతి గలదీ అయిన, ప్రతిపూర్ణవస్తునా=నిండిన సామగ్రితో, విరాజమానమ్=ప్రకాశించుచున్నదీ, దివాకరాభమ్=సూర్యుని వంటి కాంతి కలదీ అయిన, రథమ్=రథమును, ఆస్థితః=అధిష్ఠించినవాడై, నిర్జగామ=బయలుదేరెను.

తా. దేవతలతో సమానమైన పరాక్రమము గల ఆ అక్షకుమారుడు, బంగారు మాలలచే అలంకరింపబడి, చంద్రసూర్యుల వలె ప్రకాశించుచున్న పరిపూర్ణ సామాగ్రి ఉంచిన, సూర్యుని వంటి కాంతి గల రథము నెక్కి బయలుదేరెను.6

మూ. స పూరయన్ ఖం చ మహీం చ సాచలాం
తురఙ్గమాతఙ్గమహారథస్వనైః,

బలైః సమేతైః సహ తోరణస్థితమ్
సమర్థమాసీనముపాగమత్కపిమ్. 7

ప్ర. అ. సః=అతడు, తురఙ్గమాతఙ్గమహారథస్వనైః=అశ్వముల యొక్క, ఏనుగులయొక్క, రథములయొక్క, ధ్వనులచేత, ఖం చ=ఆకాశమును, సాచలామ్=పర్వతములతో కూడిన, మహీం చ=భూమినీ, పూరయన్=నింపుచు, సమేతైః=కలిసి వచ్చిన, బలైః సహ=సేనలతో కూడినవాడై, తోరణస్థితమ్=తోరణము వద్ద ఉన్నవాడు, సమర్థమ్=సమర్థుడూ, ఆసీనమ్=కూర్చొని ఉన్నవాడూ అయిన, మహాకపిమ్=హనుమంతుని, ఉపాగమత్=సమీపించెను.

తా. ఆ అక్షకుమారుడు కలిసి వచ్చిన సైన్యముతో, అశ్వ గజ మహారథముల ధ్వనులతో ఆకాశమును, పర్వతాలతో కూడిన భూమిని నింపుచు వచ్చి తోరణమువద్ద కూర్చున్న, సమర్థుడైన హనుమంతుని సమీపించెను. 7

మూ. స తం సమాపాద్య హరిం హరీక్షణో
యుగాన్తకాలాగ్నిమివ ప్రజాక్షయే,
అవస్థితం విస్మితజాతసంభ్రమః
సమైక్షతాక్షో బహుమానచక్షుషా. 8

ప్ర. అ. హరీక్షణః=సింహము వంటి నేత్రములు గల, సః అక్షః=ఆ అక్షుడు, ప్రజాక్షయే=ప్రజలను నశింపచేయుటయందు (కు), అవస్థితమ్=నిలచిఉన్న, కాలాగ్నిమ్ ఇవ=ప్రళయకాలాగ్ని వలె ఉన్న, తమ్=ఆ, హరిమ్=హనుమంతుని, సమాసాద్య=సమీపించి, విస్మితజాతసంభ్రమః=ఆశ్చర్యపడినవాడై, పుట్టిన తొందరకలవాడై, బహుమానచక్షుషా=గౌరవదృష్టితో, సమైక్షత=చూచెను.

తా. సింహము వంటి నేత్రములు గల ఆ అక్షకుమారుడు, ప్రజలను నశింపచేయుటకు సిద్ధముగా ఉన్న ప్రళయకాలాగ్ని వలె ఉన్న హనుమంతుని సమీపించి, ఆశ్చర్యచకితుడై, గౌరవదృష్టితో చూచెను. 8

మూ. స తస్య వేగం చ కపేర్మహాత్మనః
పరాక్రమం చారిషు పార్థివాత్మజః,
విధారయన్ స్వం చ బలం మహాబలో
హిమక్షయే సూర్య ఇవాభివర్ధతే. 9

ప్ర. అ. మహాబలః=గొప్ప బలము గల, పార్థివాత్మజః=రాజకుమారుడైన, సః= ఆ అక్షకుమారుడు, మహాత్మనః=మహాత్ముడైన, తస్య కపేః=ఆ హనుమంతుని యొక్క, వేగం చ=వేగమును, అరిషు=శత్రువుల విషయమునందు,

పరాక్రమం చ=పరాక్రమమును, స్వమ్=తన సంబంధమైన, బలం చ=బలమును, విధారయన్=అంచనావేసికొనుచు, హిమక్షయే=మంచు తొలగిన పిమ్మట, సూర్య ఇవ=సూర్యుడు వలె, అభివర్ధతే=వృద్ధిపొందెను.

తా. గొప్ప బలము గల ఆ రాజకుమారుడైన అక్షకుమారుడు, మహాత్ముడైన ఆ హనుమంతుని వేగమును, శత్రువుల విషయమున అతడు చూపుచున్న పరాక్రమమును, తనకున్న బలమును అంచనా వేసికొనుచు, మంచు తొలగిన సూర్యుడు వలె వృద్ధి పొందెను. 9

మూ. స జాతమన్యుః ప్రసమీక్ష్య విక్రమం
స్థిరం స్థిరః సంయతి దుర్నివారణమ్,
సమాహితాత్మా హనుమన్తమాహవే
ప్రచోదయామాస శరైస్త్రిభిః శితైః. 10

ప్ర. అ. సంయతి=యుద్ధమునందు, దుర్నివారణమ్=నివారింపశక్యము కాని, స్థిరమ్=స్థిరమైన, విక్రమమ్=(హనుమంతుని), పరాక్రమమును, ప్రసమీక్ష్య = చూచి, సః=అక్షకుమారుడు, జాతమన్యుః=పుట్టిన కోపము కలవాడై, స్థిరః=స్థిరుడై, సమాహితాత్మా= సావధానమైన చిత్తము కలవాడై, హనుమన్తమ్=హనుమంతుని, శితైః=వాడియైన, త్రిభిః శరైః=మూడుబాణములచేత, ఆహవే=యుద్ధమునందు, ప్రచోదయామాస=ప్రేరేపించెను.

తా. ఆ అక్షకుమారుడు యుద్ధములో నివారింప శక్యము కాని, చలనము లేని, హనుమంతుని పరాక్రమమును చూచి, కోపించినవాడై తాను కూడ స్థిరుడై, సావధానమైన మనస్సుతో, వాడియైన మూడు బాణములు ప్రయోగించి హనుమంతుని యుద్ధానికి పురిగొల్పెను. 10

మూ. తతః కపిం తం ప్రసమీక్ష్య గర్వితం
జితశ్రమం శత్రుపరాజయోర్జితమ్,
అవైక్షతాక్షః సముదీర్ణమానసః
సబాణపాణిః ప్రగృహీతకార్ముకః. 11

ప్ర. అ. తతః=అటుపిమ్మట, సః అక్షః=ఆ అక్షకుమారుడు, గర్వితమ్=గర్వించినవాడు, శత్రుపరాజయోర్జితమ్=శత్రువుల పరాజయముచేత విజృంభించినవాడూ అయిన, తం కపిమ్=ఆ హనుమంతుని, జితశ్రమమ్=జయించబడిన శ్రమ కలవాానిగా, ప్రసమీక్ష్య=గ్రహించి, బాణపాణిః=బాణములు హస్తమునందు కలవాడై, ప్రగృహీతకార్ముకః=గ్రహింపబడిన ధనస్సు కలవాడై, సముదీర్ణమానసః=గర్వించిన మనస్సు కలవాడై, అవైక్షత=చూచెను.

తా. ఆ హనుమంతుడు గర్వితుడై, శత్రువులను జయించుటచే విజృంభించినవాడై, శ్రమ ఏ మాత్రము లేకుండ ఉన్నాడని గ్రహించిన ఆ అక్షకుమారుడు బాణములను ధనస్సును ధరించి, ఉత్సాహపూర్ణమైన మనస్సుతో ఆతనిని చూచెను. 11

మూ. స హేమనిష్కాఙ్గదచారుకుణ్డలః
సమాససాదాశుపరాక్రమః కపిమ్,
తయోర్బభూవాప్రతిమః సమాగమః
సురాసురాణామపి సంభ్రమప్రదః. 12

ప్ర. అ. ఆశుపరాక్రమః=శీఘ్రమైన పరాక్రమము గల, హేమనిష్కాఙ్గదచారుకుణ్డలః=బంగారు కంఠాలంకారము, బాహుపురులు, అందమైన కుండలములు గల, సః=అక్షకుమారుడు, కపిమ్=హనుమంతుని, సమాససాద=సమీపించెను. తయోః=వారిద్దరియొక్క, అప్రతిమః=సాటిలేని, సమాగమః=యుద్ధములో కలియుట, సురాసురాణామపి=సురులకు అసురులకు కూడ, సంభ్రమప్రదః=తొందరను కలిగించేది, అభూత్=ఆయెను.

తా. బంగారు కంఠసూత్రము, బాహుపురులు, అందమైన కుండలములు ధరించినవాడు శీఘ్రముగా పరాక్రమమును చూపువాడు అయిన ఆ అక్షకుమారుడు, హనుమంతుని సమీపించెను. సాటిలేని వారి కలయిక, దేవాసురులకు కూడ ఆశ్చర్యము కలిగించేదిగా ఉండెను. 12

మూ. రరాస భూమిర్న తతాప భానుమాన్
వవౌ న వాయుః ప్రచచాల చాచలః,
కపేః కుమారస్య చ వీక్ష్య సంయుగం
ననాద చ ద్యౌరుదధిశ్చ చుక్షుభే. 13

ప్ర. అ. కపేః=హనుమంతునియొక్క, కుమారస్య చ=అక్షకుమారుని యొక్క, సంయుగమ్=యుద్ధమును, వీక్ష్య=చూచి, భూమిః=భూమి, రరాస=ధ్వని చేసెను. భానుమాన్=సూర్యుడు, న తతాప=ప్రకాశించలేదు. వాయుః=వాయువు, న వవౌ=వీచలేదు. అచలః చ=పర్వతము కూడా, ప్రచచాల=చలించెను. ద్యౌః=ఆకాశము, ననాద చ=ధ్వనిచేసెను. ఉదధిశ్చ=సముద్రము కూడ, చుక్షుభే=క్షోభించెను.

తా. హనుమంతుడు, అక్షకుమారుడు చేయుచున్న యుద్ధమును చూచి భూమి దద్దరిల్లెను. సూర్యుడు ప్రకాశించలేదు. వాయువు వీచలేదు. పర్వతము కూడ చలించెను. ఆకాశము ధ్వనించెను. సముద్రము కూడ క్షోభ చెందెను.

మూ. తతః స వీరః సుముఖాన్ పతత్రిణః
సువర్ణపుఙ్ఖాన్ సవిషానివోరగాన్,
సమాధిసంయోగవిమోక్షతత్త్వవి
చ్ఛరానథ త్రీన్ కపిమూర్ధ్న్యపాతయత్. 14

ప్ర. అ. తతః=అప్పుడు, అథ=అటు పిమ్మట, వీరః=వీరుడు, సమాధిసంయోగవిమోక్షతత్త్వవిత్=గురిపెట్టుట, బాణము సంధించుట, విడచుట, వీటి తత్త్వము ఎరిగిన, సః=అక్షకుమారుడు, సుముఖాన్=మంచి అగ్రములు కలవి, సువర్ణపుఙ్ఖాన్=బంగారు పొన్నులు కలవీ, పతత్త్రిణః=రెక్కలు గలవి, సవిషాన్=విషముతో కూడిన, ఉరగానివ=సర్పముల వలె ఉన్నవీ అయిన, త్రీన్=మూడు, శరాన్=బాణములను, కపిమూర్ధ్ని=హనుమంతుని శిరస్సుపై, అపాతయత్=పడవేసెను.

తా. అప్పుడు సరిగా గురి చూచి, బాణములను బాగుగా సంధించి విడచుటలో మంచి నేర్పు గల వీరుడైన ఆ అక్షకుమారుడు, మంచి అగ్రభాగములు, రెక్కలు, బంగారుపొన్నులు ఉన్నవీ, విషముతో కూడిన సర్పముల వలె ఉన్నవీ అయిన మూడు బాణములతో హనుమంతుని శిరస్సుపై కొట్టెను. 14

మూ. స తైః శరైర్మూర్ధ్ని సమం నిపాతితైః
క్షరన్నసృగ్దిగ్ధవివృత్తలోచనః,
నవోదితాదిత్యనిభః శరాంశుమాన్
వ్యరాజతాదిత్య ఇవాంశుమాలికః. 15

ప్ర. అ. సమమ్=ఒకే సమయమునందు, మూర్ధ్ని=శిరస్సుమీద, నిపాతితైః=పడవేయబడిన, తైః శరైః=ఆ బాణములచేత, క్షరన్=రక్తమును స్రవించుచున్నవాడు, అసృగ్దిగ్ధవివృత్తలోచనః=రక్తముచేత పూయబడిన తిరిగి పోవుచున్న నేత్రములు గలవాడు, నవోదితాదిత్యనిభః=నూతనముగా ఉదయించిన సూర్యునితో సమానుడు, శరాంశుమాన్=శరములే కిరణములుగా కలవాడు అయిన, సః=ఆ హనుమంతుడు, అంశుమాలికః=కిరణముల పంక్తిగల, ఆదిత్య ఇవ=సూర్యుడు వలె, వ్యరాజత=ప్రకాశించెను.

తా. ఒకే సమయమునందు మూడు బాణములతో శిరస్సుమీద కొట్టుటచే ఆ హనుమంతుని ముఖమునుండి రక్తము స్రవించెను. రక్తముతో తడిసి తిరిగి పోవుచున్న కళ్ళతో, బాణములనే కిరణములతో కూడిన అతడు అప్పుడే ఉదయించిన సూర్యుడు వలె ఉండెను. 15

మూ. తతః స పిఙ్గాధిపమన్త్రిసత్తమః
సమీక్ష్య తం రాజవరాత్మజం రణే,
ఉదగ్రచిత్రాయుధచిత్రకార్ముకం
జహర్ష చాపూర్యత చాహవోన్ముఖః. 16

ప్ర. అ. తతః=అటు పిమ్మట, సః=ఆ, పిఙ్గాధిపమన్త్రిసత్తమః=వానరరాజైన సుగ్రీవుని మంత్రులలో శ్రేష్ఠుడైన హనుమంతుడు, ఉదగ్రచిత్రాయుధచిత్రకార్ముకమ్=గొప్పవైన విచిత్రములైన ఆయుధములు, చిత్రమైన ధనస్సు గల, తమ్=ఆ, రాజవరాత్మజమ్=రాజకుమారుని, రణే=యుద్ధమునందు, సమీక్ష్య=చూచి, జహర్ష=సంతోషించెను. ఆహవోన్ముఖః=యుద్ధముచేయుటకు అభిముఖుడై, అపూర్యత చ=లావెక్కెను.

తా. సుగ్రీవుని మంత్రులలో శ్రేష్ఠుడైన ఆ హనుమంతుడు, ఉత్తమములైన విచిత్రములైన ఆయుధములతోను, చిత్రమైన ధనస్సుతోను యుద్ధానికి వచ్చిన ఆ అక్షకుమారుని చూచి, సంతోషించుచు, యుద్ధోన్ముఖుడై దేహమును పెంచెను.

మూ. స మన్దరాగ్రస్థ ఇవాంశుమాలికో
వివృద్ధకోపో బలవీర్యసంయుతః,
కుమారమక్షం సబలం సవాహనం
దదాహ నేత్రాగ్నిమరీచిభిస్తదా. 17

ప్ర. అ. మన్దరాగ్రస్థః=మందరపర్వతశిఖరముపై ఉన్న, అంశుమాలికః ఇవ=సూర్యుడు వలె ఉన్న, బలవీర్యసంయుతః=బలముతోను, పరాక్రమముతోను కూడిన, సః=ఆ హనుమంతుడు, వివృద్ధకోపః=వృద్ధిపొందిన కోపము కలవాడై, సబలమ్=సైన్యముతో కూడినవాడూ, సవాహనమ్=వాహనములతో కూడినవాడూ అయిన, కుమారమ్=కుమారుడైన, అక్షమ్=అక్షుణ్ణి, తదా=అప్పుడు, నేత్రాగ్నిమరీచిభిః=నేతాగ్నికిరణములచేత, దదాహ=కాల్చివేసెను.

తా. మందరపర్వతశిఖరాగ్రముపై ఉన్న సూర్యుడు వలె ఉన్నవాడు, బలపరాక్రమములు కలవాడు అయిన ఆ హనుమంతుడు అత్యధిక మైన కోపముతో అప్పుడా అక్షకుమారుని, అతని సేనను, వాహనములను నేత్రములందున్న అగ్ని కిరణములతో కాల్చివేయుచున్నట్లు చూచెను. 17

మూ. తతః స బాణాసనచిత్రకార్ముకః
శరప్రవర్షో యుధి రాక్షసామ్బుదః,

శరాన్ముమోచాశు హరీశ్వరాచలే
వలాహకో వృష్టిమివాచలోత్తమే. 18

ప్ర. అ. తతః=అటుపిమ్మట, బాణాసనచిత్రకార్ముకః=ధనస్సు అనే చిత్రవర్ణమైన ధనస్సు (ఇంద్రధనస్సు) గల, శరప్రవర్షః=బాణములనే అధికవర్షము గల, సః రాక్షసామ్బుదః=ఆ రాక్షసుడనే మేఘము, యుధి=యుద్ధమునందు, ఆశు=శీఘ్రముగా, హరీశ్వరాచలే=హనుమంతుడనే పర్వతముపై, వలాహకః=మేఘము, అచలోత్తమే=ఉన్నతమైన పర్వతముపై, వృష్టిమివ=వర్షమును వలె, శరాన్=బాణములను, ముమోచ=విడచెను.

తా. ధనస్సు అనే ఇంద్రధనస్సు ధరించి, బాణవర్షమనే వర్షము కురిపించుచున్న ఆ రాక్షసుడనే మేఘము, ఉన్నతమైన పర్వతము మీద మేఘము వర్షము కురిపించి నట్లు, ఆ హనుమంతునిమీద వెంటనే బాణములు కురిపించెను.

మూ. తతః కపిస్తం రణచణ్డవిక్రమం
వివృద్ధతేజోబలవీర్యసంయుతమ్,
కుమారమక్షం ప్రసమీక్ష్య సంయుగే
ననాద హర్షాద్ఘనతుల్యవిక్రమమ్. 19

ప్ర. అ. తతః=అటుపిమ్మట, కపిః=హనుమంతుడు, రణచణ్డవిక్రమమ్=రణమునందు తీవ్రమైన పరాక్రమము కలవాడు, వివృద్ధతేజోబలవీర్యసంయుతమ్=వృద్ధిపొందిన తేజస్సుతోను, బలముతోను, పరాక్రమముతోను కూడినవాడు, ఘనతుల్యవిక్రమమ్=మేఘముతో సమానమైన ఆకాశగమనము గలవాడు అయిన, తమ్=ఆ, కుమారమ్ అక్షమ్=అక్షకుమారుని, సంయుగే=యుద్ధమునందు, ప్రసమీక్ష్య=చూచి, హర్షాత్=సంతోషమువలన, ననాద=ధ్వనిచేసెను.

తా. పిమ్మట ఆ హనుమంతుడు యుద్ధమునందు తీవ్రమైన పరాక్రమము కలవాడు, వృద్ధి పొందిన తేజస్సు, బలము, వీర్యము కలవాడు, మేఘమువలె ఆకాశమునందు నడుచుటకు సమర్థుడు అయిన ఆ అక్షకుమారుడు యుద్ధమునకు వచ్చుట చూచి సంతోషముతో ధ్వనిచేసెను. 19

మూ. స బాలభావాద్యుధి వీర్యదర్పితః
ప్రవృద్ధమన్యుః క్షతజోపమేక్షణః,
సమాససాదాప్రతిమం కపిం రణే
గజో మహాకూపమివావృతం తృణైః. 20

ప్ర. అ. బాలభావాత్=బాలుడగుటవలన, యుధి=యుద్ధమునందు, వీర్యదర్పితః=పరాక్రమము చేత గర్వించినవాడు, ప్రవృద్ధమన్యుః=వృద్ధిపొందిన కోపము గలవాడు, క్షతజోపమేక్షణః=రక్తముతో సమానమైన నేత్రములు కలవాడు అయిన, సః=ఆ అక్షకుమారుడు, రణే=యుద్ధమునందు, అప్రతిమమ్=సాటిలేని, కపిమ్=హనుమంతుని, గజః=ఏనుగు, తృణైః=తృణములచేత, ఆవృతమ్=కప్పబడిన, మహాకూపమివ=పెద్ద కూపమును వలె, సమాససాద= సమీపించెను.

తా. చిన్నవాడగుటచే, యుద్ధములో పరాక్రమముచేత గర్వించిన ఆ అక్షకుమారుడు, అధికమైన కోపముతో, కళ్లు రక్తము వలె ఎఱ్ఱపడగా గజము గడ్డిచే కప్పబడి యున్న మహాకూపమును చేరినట్లు, యుద్ధములో సాటిలేని ఆ హనుమంతుని సమీపించెను. 20

మూ. స తేన బాణైః ప్రసభం నిపాతితై
శ్చకార నాదం ఘననాదనిఃస్వనః,
సముత్పపాతాశు నభః స మారుతి
ర్భుజోరువిక్షేపణఘోరదర్శనః. 21

ప్ర. అ. సః=ఆ హనుమంతుడు, తేన=అక్షకుమారుని చేత, ప్రసభమ్=బలపూర్వకముగా, నిపాతితైః=వేయబడిన, బాణైః=బాణములచేత, ఘననాదనిఃస్వనః=మేఘధ్వనివంటి ధ్వనికలవాడై, నాదమ్=ధ్వనిని, చకార=చేసెను. సః మారుతిః=ఆ హనుమంతుడు, భుజోరువిక్షేపణ ఘోరదర్శనః=భుజములను, తొడలను విసరుటచే భయంకరమైన దర్శనము కలవాడై, ఆశు=శీఘ్రముగా, నభః=ఆకాశమును గూర్చి, సముత్పపాత=ఎగిరెను.

తా. ఆ అక్షకుమారుడు బాణములతో బలపూర్వకముగా కొట్టుటచే ఆ హనుమంతుడు ఉరుముల ధ్వనితో గొప్ప ధ్వనిచేసి, చూచువారికి భయము కలుగునట్లుగా కాళ్ళు చేతులు విసరుచు, శీఘ్రముగా ఆకాశముపైకి ఎగిరెను.21

మూ. సముత్పతన్తం సమభిద్రవద్బలీ
స రాక్షసానాం ప్రవరః ప్రతాపవాన్,
రథీ రథిశ్రేష్ఠతమః కిరన్ శరైః
పయోధరః శైలమివాశ్మవృష్టిభిః. 22

ప్ర. అ. బలీ=బలవంతుడు, రాక్షసానామ్=రాక్షసులలో, ప్రవరః=శ్రేష్ఠుడు, ప్రతాపవాన్=ప్రతాపవంతుడు, రథీ=రథికుడు, రథిశ్రేష్ఠతమః=రథికులలో శ్రేష్ఠుడు అయిన, సః=ఆ అక్షకుమారుడు, పయోధరః=మేఘము, అశ్మవృష్టిభిః=వడగళ్ల

వానచేత, శైలమివ=పర్వతమును వలె, శరైః=బాణములతో, కిరన్=చిమ్ముచు, ఉత్పతన్తమ్=పైకి ఎగురుచున్న ఆ హనుమంతుని, సమభిద్రవత్=తరుముచు వెళ్లెను.

తా. బలవంతుడు, రాక్షసులలో శ్రేష్ఠుడు, ప్రతాపవంతుడు, రథికుడు, రథికులలో శ్రేష్ఠుడు అయిన ఆ అక్షకుమారుడు పైకి ఎగురుచున్న ఆ హనుమంతునిపై, మేఘము పర్వతము మీద వడగళ్లు కురిపించునట్లు బాణములు కురిపించుచు, ఆతని వెనువెంటనే పైకి వెళ్లెను. 22

మూ. స తాన్ శరాంస్తస్య హరిర్విమోక్షయం
శ్చచార వీరః పథి వాయుసేవితే,
శరాన్తరే మారుతవద్వినిష్పత
న్మనోజవః సంయతి చణ్డవిక్రమః. 23

ప్ర. అ. మనోజవః=మనస్సు వంటి వేగము గలవాడు, సంయతి=యుద్ధము నందు, చణ్డవిక్రమః=తీవ్రమైన పరాక్రమము కలవాడు, వీరః=వీరుడు అయిన, సః హరిః=ఆ హనుమంతుడు, శరాన్తరే=బాణముల మధ్య, మారుతవత్=వాయువువలె, వినిష్పతన్=తిరుగుచు, తస్య=ఆ అక్షకుమారునియొక్క, శరాన్=బాణములను, విమోక్షయన్=విడిపించుకొనుచు, వాయుసేవితే=వాయువుచేత సేవింపబడిన, పథి=మార్గమునందు, చచార=సంచరించెను.

తా. మనోవేగము వంటి వేగము గలవాడు, యుద్ధమునందు తీవ్రమైన పరాక్రమము గలవాడు, మహావీరుడు అయిన ఆ హనుమంతుడు, బాణమునకు బాణమునకూ మధ్య వాయువు వలె తిరుగుచు ఆతని బాణములనుండి తప్పించుకొనుచు, ఆకాశ మార్గమునందు సంచరించెను. 23

మూ. తమాత్తబాణాసనమాహవోన్ముఖం
ఖమాస్తృణన్తం విశిఖైః శరోత్తమైః,
అవైక్షతాక్షం బహుమానచక్షుషా
జగామ చిన్తాం చ స మారుతాత్మజః. 24

ప్ర. అ. సః మారుతాత్మజః=ఆ హనుమంతుడు, ఆత్తబాణాసనమ్=గ్రహింపబడిన ధనస్సు కలవాడు, ఆహవోన్ముఖమ్=యుద్ధమునకు సన్నద్ధుడూ, విశిఖైః=అనేకవిధములైన అగ్రభాగములు గల, శరోత్తమైః=ఉత్తమములైన బాణములచేత, ఖమ్=ఆకాశమును, ఆస్తృణన్తమ్=ఆచ్ఛాదించుచున్నవాడు అయిన, తమ్=ఆ, అక్షమ్=అక్షుణ్ణి, బహుమానచక్షుషా=గౌరవభావముతో కూడిన దృష్టితో, అవైక్షత=చూచెను, చిన్తాం చ=చింతను కూడ, జగామ=పొందెను.

తా. ఆ అక్షకుమారుడు ధనుర్ధరుడై, యుద్ధము చేయుటకు సన్నద్ధుడై, అనేకవిధములైన అగ్రభాగములున్న శ్రేష్ఠమైన బాణాలతో ఆకాశము నంతనూ కప్పివేయుచుండగా హనుమంతుడాతనిని గౌరవభావముతో చూచుచు, ఆలోచనలో పడెను. 24

మూ. తతః శరైర్భిన్నభుజాన్తరః కపిః
కుమారవీరేణ మహాత్మనా నదన్,
మహాభుజః కర్మవిశేషతత్త్వవి
ద్విచిన్తయామాస రణే పరాక్రమమ్. 25

ప్ర. అ. తతః=అటు పిమ్మట, మహాభుజః=గొప్ప భుజములు గలవాడు, కర్మ విశేషతత్త్వవిత్=పనులలోని విశేషముల యథార్థస్వరూపమును గుర్తించ సమర్థుడు అయిన, కపిః=హనుమంతుడు, మహాత్మనా=మహాత్ముడైన, కుమారవీరేణ=వీరుడైన ఆ అక్షకుమారునిచేత, భిన్నభుజాన్తరః=భేదింపబడిన వక్షస్థలము కలవాడై, నదన్=ధ్వనిచేయుచు, రణే=యుద్ధమునందు, పరాక్రమమ్=శత్రువుయొక్క ఆక్రమణమును గూర్చి, విచిన్తయామాస=ఆలోచించెను.

తా. అప్పుడు మహాభుజుడు, ఆ యా కార్యముల యథార్థస్వరూపము తెలిసినవాడూ అయిన ఆ హనుమంతుడు, మహాత్ముడు, వీరుడూ అయిన ఆ అక్షకుమారుడు బాణములతో వక్షస్థలమును చీల్చివేయుచుండగా, యుద్ధములో ఈ శత్రువును ఎట్లు ఆక్రమించవలెనా అని ఆలోచించెను. 25

మూ. అబాలవద్బాలదివాకరప్రభః
కరోత్యయం కర్మ మహన్మహాబలః,
న చాస్య సర్వాహవకర్మశోభినః
ప్రమాపణే మే మతిరత్ర జాయతే. 26

ప్ర. అ. బాలదివాకరప్రభః=బాలసూర్యుని వంటి కాంతి గలవాడు, మహాబలః=గొప్ప బలము కలవాడు అయిన, అయమ్=ఇతడు, అబాలవత్=ఆరితేరిన యువకుడు వలె, మహత్=గొప్ప, కర్మ=కార్యము, కరోతి=చేయుచున్నాడు. అత్ర=ఇక్కడ, సర్వాహవకర్మశోభినః=సమస్తమైన యుద్ధకార్యములచే శోభించుచున్న, అస్య=ఈతనియొక్క, ప్రమాపణే=చంపుట యందు, మే=నాయొక్క, మతిః=బుద్ధి, న చ జాయతే=పుట్టుటలేదు.

తా. "బాలసూర్యుని వంటి కాంతి గల, మహాబలుడైన ఈ అక్షకుమారుడు ఆరితేరిన యువకుడు వలె కార్యములు చేయుచున్నాడు. యుద్ధములో చేయదగిన

అన్ని పనులను చక్కగా నిర్వహించుచున్నాడు. ఇప్పుడీతనిని చంపుటకు నాకు మనసొప్పుటలేదు." 26

మూ. అయం మహాత్మా చ మహాంశ్చ వీర్యతః
సమాహితశ్చాతిసహశ్చ సంయుగే,
అసంశయం కర్మగుణోదయాదయం
సనాగయక్షైర్మునిభిశ్చ పూజితః. 27

ప్ర. అ. అయమ్=ఇతడు, మహాత్మా చ=గొప్ప బుద్ధి కలవాడు, వీర్యతః చ=వీర్యము వలన కూడ, మహాన్=గొప్పవాడు, సమాహితః=సావధానచిత్తుడు, సంయుగే=యుద్ధమునందు, అతిసహః=చాల శ్రమను సహించ సమర్థుడు. అయమ్=ఇతడు, అసంశయమ్=నిఃసంశయముగా, కర్మగుణోదయాత్=కార్యములందు అభివృద్ధి కలుగుటవలన, సనాగయక్షైః=నాగయక్షులతో కూడిన, మునిభిశ్చ=మునులచేత కూడ, పూజితః=పూజింపబడినవాడు.

తా. "ఇతడు మహాబుద్ధిశాలి, పరాక్రమము చేత కూడ గొప్పవాడు. సావధానమైన చిత్తము కలవాడు. యుద్ధములో ఎంత శ్రమనైనను సహించకలవాడు. కార్యములలో చూపుచున్న నేర్పును బట్టి ఇతనిని నాగులు, యక్షులు, మునులు మొదలగువారు కూడ తప్పక మెచ్చుకొందురు." 27

మూ. పరాక్రమోత్సాహవివృద్ధమానసః
సమీక్షతే మాం ప్రముఖాగ్రతః స్థితః,
పరాక్రమో హ్యస్య మనాంసి కమ్పయే
త్సురాసురాణామపి శీఘ్రగామినః. 28

ప్ర. అ. పరాక్రమోత్సాహవివృద్ధమానసః=పరాక్రమముచేత, ఉత్సాహముచేత వృద్ధి పొందిన మనస్సు కలవాడై, ప్రముఖాగ్రతః=ఎదుట దగ్గరగా, స్థితః=నిలచినవాడై, మామ్=నన్ను, సమీక్షతే=చూచుచున్నాడు. శీఘ్రగామినః=శీఘ్రముగా సంచరించు, అస్య=ఇతనియొక్క, పరాక్రమః=పరాక్రమము, సురాసురాణామ్=సురులయొక్క అసురులయొక్క, మనాంసి అపి=మనస్సులను కూడ, ప్రకమ్పయేత్=కంపింపచేయును.

తా. "ఈతడు నాకు చాల దగ్గరగా నిలచి, పరాక్రమోత్సాహములతో వృద్ధి పొందిన మనస్సుతో, నన్ను చూచుచున్నాడు. అతిశీఘ్రముగా పనులుచేయు ఈతని పరాక్రమము చూచి సురాసురుల మనస్సులు కూడ భయపడును". 28

మూ. న ఖల్వయం నాభిభవేదుపేక్షితః
పరాక్రమో హ్యస్య రణే వివర్ధతే,
ప్రమాపణం త్వేవ మమాద్య రోచతే
న వర్ధమానోఽగ్నిరుపేక్షితుం క్షమః. 29

ప్ర. అ. అయమ్=ఇతడు, ఉపేక్షితః=ఉపేక్షించబడినవాడై, నాభిభవేత్ న ఖలు=తిరస్కరించడనుమాటలేదు. రణే=యుద్ధమునందు, అస్య=వీనియొక్క, పరాక్రమః=పరాక్రమము, వర్ధతే హి=వృద్ధిపొందుచున్నది కదా. అద్య=ఇప్పుడు, ప్రమాపణం త్వేవ=ఇతనిని చంపుటే, మమ=నాకు, రోచతే=ఇష్టమగుచున్నది. వర్ధమానః=వృద్ధిపొందుచున్న, అగ్నిః=అగ్ని, ఉపేక్షితుమ్=ఉపేక్షించుటకు, న క్షమః=తగినది కాదు.

తా. "ఇంక ఈతనిని ఉపేక్షించినచో ఇతడు తప్పక నన్ను తిరస్కరించును. ఎందుచేతననగా, రణములో ఈతని పరాక్రమము పెరిగిపోవుచున్నది. అందుచేత ఇప్పుడీతని చంపుటయే మంచిది. పెరిగిపోవుచున్న అగ్నిని ఉపేక్షించకూడదు కదా !" 29

మూ. ఇతి ప్రవేగం తు పరస్య చిన్తయన్
స్వకర్మయోగం చ విధాయ వీర్యవాన్,
చకార వేగం తు మహాబలస్తదా
మతిం చ చక్రేఽస్య వధే మహాకపిః. 30

ప్ర. అ. వీర్యవాన్=పరాక్రమవంతుడు, మహాబలః=గొప్ప బలము కల వాడు అయిన, మహాకపిః=హనుమంతుడు, ఇతి=ఇట్లు, పరస్య=శత్రువుయొక్క, ప్రవేగమ్=వేగమును, చిన్తయన్=ఆలోచించుచు, స్వకర్మయోగం చ=తన కార్యము యొక్క యోగమును (ఆలోచనను) కూడ, విధాయ=చేసి, తదా=అప్పుడు, వేగమ్=వేగమును, చకార=చేసెను. అస్య=ఈతనియొక్క, వధే=వధయందు, మతిం చ=బుద్ధిని కూడ, చక్రే=చేసెను.

తా. పరాక్రమవంతుడు, మహాబలశాలీ అయిన హనుమంతుడు ఈ విధముగా శత్రువు బలమును గూర్చి ఆలోచించి, తాను చేయవలసిన కార్యము ఆలోచన కూడ చేసి, వేగమును చూపించెను. అతనిని చంపుటకు కూడ నిర్ణయము చేసికొనెను. 30

మూ. స తస్య తానష్టహయాన్ మహాజవాన్
సమాహితాన్ భారసహాన్వివర్తనే,

జఘాన వీరః పథి వాయుసేవితే
తలప్రహారైః పవనాత్మజః కపిః. 31

ప్ర. అ. వీరః=వీరుడు, పవనాత్మజః=వాయుపుత్రుడు అయిన, సః కపిః=ఆ హనుమంతుడు, వాయుసేవితే=వాయువుచేత సేవింపబడిన, పథి=మార్గమునందు, మహాజవాన్=గొప్ప వేగము గలవి, సమాహితాన్=జాగరూకతతో కూడినవి, వివర్తనే=మళుపులు తిరుగుటయందు, భారసహాన్=భారమును మోయుగల్గినవీ అయిన, తాన్=ఆ, అష్ట=ఆరు, హయాన్=అశ్వములను, తలప్రహారైః=అరచేతుల దెబ్బలచే, జఘాన=చంపెను.

తా. వీరుడైన ఆ హనుమంతుడు, ఆకాశమార్గములో, మహావేగముగలవి, జాగరూకతతో కూడినవి, మళుపులు తిరుగునపుడు రథభారమును మోయుటలో సమర్థమైనవీ, అయిన ఎనిమిది గుఱ్ఱములను అరచేతులతో కొట్టి చంపెను. 31

మూ. తతస్తలేనాభిహతో మహారథః
స తస్య పిఙ్గాధిపమన్త్రినిర్జితః,
ప్రభగ్ననీడః పరిముక్తకూబరః
పపాత భూమౌ హతవాజిరమ్బరాత్. 32

ప్ర. అ. తతః=అటుపిమ్మట, తలేన=అరచేతితో, అభిహతః=కొట్టబడినదీ, పిఙ్గాధిపమన్త్రినిర్జితః=వానరరాజైన సుగ్రీవుని మంత్రియైన హనుమంతుని చేత జయింపబడినదీ అయిన, తస్య=అక్షకుమారునియొక్క, మహారథః=గొప్ప రథము, ప్రభగ్ననీడః=విరగకొట్టబడిన లోపలి భాగము కలదై, పరిముక్తకూబరః=ఊడి పోయిన పొడవు కఱ్ఱ కలదై, హతవాజీః=చంపబడిన అశ్వములు గలదై, అమ్బరాత్=ఆకాశమునుండి, భూమౌ=నేలమీద, పపాత=పడెను.

తా. అపుడు హనుమంతుడు అరచేతితో కొట్టగా ఆ అక్షకుమారుని రథము లోపలిభాగము విరిగిపోయి, నిలువుదూలము ఊడిపోయి, గుఱ్ఱములు మరణించగా ఆకాశమునుండి నేలమీద పడెను. 32

మూ. స తం పరిత్యజ్య మహారథో రథం
సకార్ముకః ఖడ్గధరః ఖముత్పతన్,
తపోభియోగాదృషిరుగ్రవీర్యవాన్
విహాయ దేహం మరుతామివాలయమ్. 33

ప్ర. అ. మహారథః=మహారథుడైన, సః=ఆ అక్షకుమారుడు, రథమ్=రథమును, పరిత్యజ్య=విడచి, సకార్ముకః=ధనస్సుతో కూడినవాడై, ఖడ్గధరః=ఖడ్గమును ధరించినవాడై, ఖమ్=ఆకాశమును గూర్చి, ఉత్పతన్=ఎగురుచు, ఉగ్రవీర్యవాన్=ఉగ్రమైన తపః శక్తి కలవాడు, దేహమ్=దేహమును, విహాయ=విడచి, తపోభియోగాత్=తపస్సంబంధమువలన, మరుతామ్=దేవతలయొక్క, ఆలయమ్=నివాసమైన స్వర్గమును గూర్చి ఎగురుచున్నవాడు అయిన, ఋషిః ఇవ=ఋషి వలె, (అదృశ్యత=చూడబడెను).

తా. మహారథుడైన ఆ అక్షకుమారుడు రథమును విడచి, ధనస్సు, ఖడ్గము చేత ధరించి, ఆకాశముమీదికి ఎగిరెను. అపుడాతడు ఉగ్రమైన తపః శక్తి గలవాడై, తపఃప్రభావముచేత స్వర్గలోకమునకు ఎగిరి వెళ్లుచున్న ఋషి వలె కనబడెను. 33

మూ. తతః కపిస్తం విచరన్తమమ్బరే
పతత్రిరాజానిలసిద్ధసేవితే,
సమేత్య తం మారుతతుల్యవిక్రమః
క్రమేణ జగ్రాహ స పాదయోర్దృఢమ్. 34

ప్ర. అ. తతః=అటుపిమ్మట, మారుతతుల్యవిక్రమః=వాయువుతో సమానమైన పరాక్రమము గల, కపిః=హనుమంతుడు, పతత్రిరాజానిలసిద్ధసేవితే=గరుత్మంతునిచేత, వాయువుచేత, సిద్ధులచేత సేవింపబడిన, అమ్బరే=ఆకాశమునందు, విచరన్తమ్=సంచరించుచున్న, తమ్=ఆతనిని, సమేత్య=సమీపించి, క్రమేణ=క్రమముచేత, తమ్=ఆతనిని, పాదయోః=పాదములయందు, దృఢమ్=గట్టిగా, జగ్రాహ=పట్టుకొనెను.

తా. వాయువుతో సమానమైన పరాక్రమము గల ఆ హనుమంతుడు అప్పుడు, గరుత్మంతుడు, వాయువు, సిద్ధులు సంచరించు ఆకాశమునందు సంచరించుచున్న ఆ అక్షకుమారుని వద్దకు మెల్లగా వెళ్ళి, ఆతని పాదాలు గట్టిగా పట్టుకొనెను. 34

మూ. స తం సమావిధ్య సహస్రశః కపి
ర్మహోరగం గృహ్య ఇవాణ్డజేశ్వరః,
ముమోచ వేగాత్పితృతుల్యవిక్రమో
మహీతలే సంయతి వానరోత్తమః. 35

ప్ర. అ. పితృతుల్యవిక్రమః=తన తండ్రితో సమానమైన పరాక్రమము కల వాడు, వానరోత్తమః=వానరులలో శ్రేష్ఠుడు అయిన, సః కపిః=ఆ హనుమంతుడు, అణ్డజేశ్వరః=గరుత్మంతుడు, మహోరగమ్=మహాసర్పమును, గృహ్య ఇవ=గ్రహించి వలె, తమ్=ఆ అక్షకుమారుని, సంయతి=యుద్ధమునందు, సహస్రశః=వెయ్యి మార్లు (అనేకపర్యాయములు), సమావిధ్య=విసిరి (జాడించి), వేగాత్=వేగమువలన (వేగముగా), మహాతలే=నేలమీద, ముమోచ=విసిరికొట్టెను.

తా. తన తండ్రియైన వాయుదేవుని వంటి పరాక్రమము గల, వానరోత్తముడైన ఆ హనుమంతుడు గరుత్మంతుడు మహాసర్పమును వలె, ఆ అక్షకుమారుని పట్టుకొని, ఆతనిని అనేకపర్యాయములు విసురుగా త్రిప్పి, త్రిప్పి నేల మీద వేసి కొట్టెను. 35

మూ. స భగ్నబాహూరుకటీశిరోధరః
క్షరన్నసృఙ్నిర్మథితాస్థిలోచనః,
సంభిన్నసంధిః ప్రవికీర్ణబన్ధనో
హతః క్షితౌ వాయుసుతేన రాక్షసః. 36

ప్ర. అ. సః రాక్షసః=ఆ రాక్షసుడు, భగ్నబాహూరుకటీశిరోధరః=విరిగిన బాహువులు, తొడలు, కటిప్రదేశము, కంఠము కలవాడై, అసృక్=రక్తము, క్షరన్=స్రవించుచు, నిర్మథితాస్థిలోచనః=మథింపబడిన ఎముకలు నేత్రములు కల వాడై, సంభిన్నసన్ధిః=విరుగగొట్టబడిన సంధులు కలవాడై, ప్రవికీర్ణబన్ధనః=శిథిలమైన శరీరబంధవు కలవాడై, వాయుసుతేన=హనుమంతునిచేత, క్షితౌ=భూమిమీద, హతః=చంపబడెను.

తా. హనుమంతుడా విధముగా నేలపై కొట్టి చంపగా ఆ రాక్షసుని బాహువులు, తొడలు, కటిప్రదేశము, కంఠము, విరిగిపోయెను. రక్తము స్రవించుచుండెను. ఎముకలు, కళ్లు నలిగిపోయెను. సంధులు ఊడిపోయెను. శరీరబంధమంతా శిథిలమైపోయెను. అట్టి స్థితిలో ఆతడు మరణించెను. 36

మూ. మహాకపిర్భూమితలే నిపీడ్య తం
చకార రక్షోధిపతేర్మహద్భయమ్.
మహర్షిభిశ్చక్రచరైర్మహావ్రతైః
సమేత్య భూతైశ్చ సయక్షపన్నగైః,
సురైశ్చ సేన్ద్రైర్భృశజాతవిస్మయై
ర్హతే కుమారే స కపిర్నిరీక్షితః. 37

ప్ర. అ. మహాకపిః=హనుమంతుడు, తమ్=ఆతనిని, భూమితలే=నేల మీద, నిపీడ్య=నలగకొట్టి, రక్షోధిపతేః=రావణునకు, మహత్=గొప్ప, భయమ్=భయమును, చకార=చేసెను. కుమారే=అక్షకుమారుడు, హతే=చంపబడిన వాడగుచుండగా, సః కపిః=ఆ హనుమంతుడు, భృశజాతవిస్మయైః=అధికముగా కలిగిన ఆశ్చర్యము కల, చక్రచరైః=జ్యోతిశ్చక్రమునందు సంచరించు, మహావ్రతైః=గొప్ప వ్రతములు గల, మహర్షిభిః=మహర్షులచేత, సయక్షపన్నగైః=యక్షులతోను పన్నగులతోను కూడిన, భూతైశ్చ=భూతములచేత, సేన్ద్రైః=ఇంద్రునితో కూడిన, సురైశ్చ=దేవతలచేత, సమేత్య=కలిసి, నిరీక్షితః=చూడబడెను.

తా. అక్షకుమారుని ఆ విధముగా హనుమంతుడు సంహరించగా, జ్యోతిశ్చక్రములో సంచరించు మహానియమవంతులైన మహర్షులు, భూతములు యక్షులు, పన్నగులు, దేవేంద్రుడు, దేవతలు - వీరందరూ కలిసి, అత్యధిక మైన ఆశ్చర్యముతో ఆతనిని చూచిరి. 37

మూ. నిహత్య తం వజ్రిసుతోపమప్రభం
కుమారమక్షం క్షతజోపమేక్షణమ్,
తమేవ వీరోఽభిజగామ తోరణం
కృతక్షణః కాల ఇవ ప్రజాక్షయే. 38

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే సున్దరకాణ్డే
సప్తచత్వారింశః సర్గః.

ప్ర. అ. వీరః=వీరుడైన హనుమంతుడు, వజ్రిసుతోపమప్రభమ్=ఇంద్రుని కుమారుడైన జయంతునితో సమానమైన కాంతి కలవాడు, క్షతజోపమేక్షణమ్=రక్తముతో సమానమైన నేత్రములు కలవాడు అయిన, తమ్ అక్షమ్=ఆ అక్షకుమారుని, నిహత్య=చంపి, ప్రజాక్షయే=ప్రజలను సంహరించుటయందు, కృతక్షణః=చేయబడిన నిరీక్షణము గల, కాలః ఇవ=యముడువలె, తమ్=ఆ, తోరణమేవ=తోరణమునే, అభిజగామ=చేరెను.

తా. వీరుడైన హనుమంతుడు, జయంతుని వంటి కాంతి కలవాడు, రక్తము వంటి నేత్రములు కలవాడు అయిన ఆ అక్షకుమారుణ్ణి చంపి, ప్రజలను సంహరించుటకై తీరిక చేసికొని కూర్చున్న యముడు వలె, ఆ తోరణము దగ్గరనే ఇతరరాక్షసుల రాకకై నిరీక్షించుచుండెను. 38

*"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు
సుందరకాండలో నలుబదియేడవ సర్గ సమాప్తము.*

అథ అష్టచత్వారింశః సర్గః

[ఇంద్రజిత్తుతో యుద్ధముచేసి హనుమంతుడు, అతని అస్త్రములచేత బద్ధుడై రావణుని సభలోనికి వెళ్ళుట.]

మూ. తతస్తు రక్షోధిపతిర్మహాత్మా
హనూమతాక్షే నిహతే కుమారే,
మనః సమాధాయ స దేవకల్పం
సమాదిదేశేన్ద్రజితం సరోషః. 1

ప్ర. అ. తతః=అటుపిమ్మట, మహాత్మా=గొప్ప బుద్ధిగల, సః=ఆ, రక్షోధిపతిః=రాక్షసరాజు, హనూమతా=హనుమంతునిచేత, కుమారే=కుమారుడైన, అక్షే=అక్షుడు, నిహతే=చంపబడగా, సరోషః=కోపముతో కూడినవాడై, మనః=మనస్సును, సమాధాయ=కుదుటపరుచుకొని, దేవకల్పమ్=దేవతలతో సమానుడైన, ఇన్ద్రజితమ్=ఇంద్రజిత్తును, సమాదిదేశ=ఆజ్ఞాపించెను.

తా. ఈ విధముగ హనుమంతుడు అక్షకుమారుని సంహరించెనని తెలిసిన మహాత్ముడైన రావణుడు మనస్సు కుదుటపరచుకొని, కోపముతో కూడినవాడై దేవతాతుల్యుడైన ఇంద్రజిత్తును యుద్ధమునకు వెళ్లుమని ఆదేశించెను. 1

మూ. త్వమస్త్రవిచ్ఛస్త్రవిదాం వరిష్ఠః
సురాసురాణామపి శోకదాతా,
సురేషు సేన్ద్రేషు చ దృష్టకర్మా
పితామహారాధనసంచితాస్త్రః. 2

ప్ర. అ. త్వమ్=నీవు, అస్త్రవిత్=అస్త్రములు ఎరిగినవాడవు. శస్త్రవిదామ్=శస్త్రప్రయోగము తెలిసినవారిలో, వరిష్ఠః=గొప్పవాడవు. సురాసురాణామపి=సురులకు అసురులకు కూడ, శోకదాతా=శోకమును ఇచ్చువాడవు. సేన్ద్రేషు=ఇంద్రునితో కూడిన, సురేషు=దేవతలలో కూడ, దృష్టకర్మా=చూడబడిన కార్యము కలవాడవు, పితామహారాధనసంచితాస్త్రః=బ్రహ్మదేవుని ఆరాధించుటచేత సంపాదింపబడిన అస్త్రములు కలవాడవు.

తా. నీవు అస్త్రములన్నీ తెలిసినవాడవు. శస్త్రముల ప్రయోగము తెలిసినవారిలో ప్రముఖుడవు. సురులకు అసురులకు కూడ దుఃఖమును

కల్గించినవాడవు. బ్రహ్మదేవుని ఆరాధించి అస్త్రములను సంపాదించిన నీ కార్యకౌశలమును ఇంద్రాదిదేవతలు కూడ చవిచూచి ఉన్నారు. 2

మూ. తవాస్త్రబలమాసాద్య ససురాః సమరుద్గణాః,
న శేకుః సమరే స్థాతుం సురేశ్వరసమాశ్రితాః. 3

ప్ర. అ. తవ=నీయొక్క, అస్త్రబలమ్=అస్త్రబలమును, ఆసాద్య=పొంది (ఎదిరించి), ససురాః=సురులతో కూడిన, సమరుద్గణాః=దేవతాగణములతో కూడిన, సురేశ్వరసమాశ్రితాః=దేవేంద్రుని ఆశ్రయించినవారు కూడ, సమరే=యుద్ధమునందు, స్థాతుమ్=నిలచుటకు, న శేకుః=సమర్థులు కాలేదు.

తా. దేవేంద్రుని ఆశ్రయించుకొని ఉన్న సురులు, మరుద్గణములు (ఆ యా దేవతల గణములు) కూడ యుద్ధములో నీ అస్త్రబలము ఎదుట నిలువలేకపోయినారు. 3

మూ. న కశ్చిత్త్రిషు లోకేషు సంయుగే న గతశ్రమః,
భుజవీర్యాభిగుప్తశ్చ తపసా చాభిరక్షితః, 4
దేశకాలవిభాగజ్ఞస్త్వమేవ మతిసత్తమః.

ప్ర. అ. సంయుగే=నీతో యుద్ధమునందు, న గతశ్రమః=పొందబడిన శ్రమకలవాడు కానివాడు (శ్రమ పొందనివాడు), కశ్చిత్=ఎవ్వడూ, త్రిషు లోకేషు= మూడులోకాలలో, న=లేడు, మతిసత్తమః=బుద్ధిచేత గొప్పవాడవైన, త్వమేవ=నీవే, భుజవీర్యాభిగుప్తశ్చ=భుజబలముచేత రక్షింపబడిన వాడవు, తపసా=తపస్సుచేత, అభిరక్షితః చ=రక్షింపబడిన వాడవు కూడ. దేశకాలవిభాగజ్ఞః=దేశకాలముల విభాగమును ఎరిగినవాడవు.

తా. యుద్ధములో నిన్నెదిరించి ఓడిపోనివాడెవ్వడూ మూడు లోకాల లోను లేడు. మంచి బుద్ధి గల నీవు, నీ భుజబలము చేత, తపోబలముచేత రక్షింపబడినవాడవు. ఏ దేశములో, ఏ కాలములో ఏ పని చేయవలెనో తెలిసినవాడవు. 4

మూ. న తేఽస్త్యశక్యం సమరేషు కర్మణా
న తేఽస్త్యకార్యం మతిపూర్వమన్త్రిణే,
న సోఽస్తి కశ్చిత్త్రిషు సంగ్రహేషు వై
న వేద యస్తేఽస్త్రబలం బలం చ తే. 5

ప్ర. అ. సమరేషు=యుద్ధములందు, కర్మణా=కార్యముచేత, తే=నీకు, అశక్యమ్=శక్యము కానిది, నాస్తి=లేదు. మతిపూర్వమన్త్రిణే=బుద్ధిపూర్వకముగా

ఆలోచన చేయుటయందు, తే=నీకు, అకార్యమ్=చేయశక్యము కానిది, నాస్తి=లేదు. త్రిషు=మూడు, సంగ్రహేషు=లోకములలో, యః=ఎవడు, తే=నీయొక్క, అస్త్రబలమ్=అస్త్రముల బలమును, తే బలం చ=నీ బలమును, న వేద=ఎరుగడో, సః=అట్టివాడు, కశ్చిత్=ఎవ్వడూ, నాస్తి=లేదు.

తా. యుద్ధములలో నీవు ప్రయత్నించి సాధింపరాని కార్యము లేదు. బుద్ధితో ఆలోచించి నీవు చేయజాలని కార్యము కూడ లేదు. నీకున్న బలమునూ, నీ అస్త్రబలమునూ గూర్చి తెలియనివాడు ఎవ్వడూ, ఈ మూడులోకములలోను లేదు. 5

మూ. మమానురూపం తపసో బలం చ తే
పరాక్రమశ్చాస్త్రబలం చ సంయుగే,
న త్వాం సమాపాద్య రణావమర్దే
మనః శ్రమం గచ్ఛతి నిశ్చితార్థమ్. 6

ప్ర. అ. తే=నీయొక్క, తపసః=తపస్సుయొక్క, బలమ్=బలము, మమ=నాకు, అనురూపమ్=తగినది. సంయుగే=యుద్ధమునందు, పరాక్రమశ్చ=పరాక్రమము, బలం చ=బలమూ (నాకు తగినవి). రణావమర్దే=యుద్ధసంఘర్షమునందు, త్వామ్=నిన్ను, సమాసాద్య=పొంది, మనః=మనస్సు, నిశ్చితార్థమ్=నిశ్చితమైన ప్రయోజనము కలదై, శ్రమమ్=బాధను, న గచ్ఛతి=పొందదు.

తా. నీ తపోబలములోను, యుద్ధమునందు నీవు చూపు బలపరాక్రమములలోను కూడ నీవు నాకు అన్ని విధాల తగినవాడవు. యుద్ధములు వచ్చినప్పుడు నా మనస్సు నిన్ను తలచుకొని, తప్పక విజయము కలుగునను నిశ్చయముతో నిశ్చింతగా ఉండును. 6

మూ. నిహతాః కింకరాః సర్వే జమ్బుమాలీ చ రాక్షసః,
అమాత్యపుత్రా వీరాశ్చ పఞ్చ సేనాగ్రయాయినః, 7
బలాని సుసమృద్ధాని సాశ్వనాగరథాని చ.

ప్ర. అ. సర్వే=సమస్తమైన, కింకరాః=కింకరులు, జమ్బుమాలీ=జంబుమాలి అను, రాక్షసశ్చ=రాక్షసుడు, వీరాః=వీరులైన, అమాత్యపుత్రాః=మంత్రిపుత్రులు, పఞ్చ=ఐదుగురు, సేనాగ్రయాయినః=సేనానాయకులు, నిహతాః=చంపబడినారు. సుసమృద్ధాని=బాగాసమృద్ధములైన, సాశ్వనాగరథాని చ=అశ్వములతోను, గజములతోను, రథములతోను కూడిన, బలాని చ=సైన్యములు కూడ (చంపబడినవి).

తా. కింకరులందరు, జంబుమాలి, వీరులైన అమాత్యపుత్రులు, ఐదుగురు సేనానాయకులు, అశ్వగజరథాలతో సహా పూర్తి సేనలు చంపబడినవి. 7

మూ. సహోదరస్తే దయితః కుమారోऽక్షశ్చ సూదితః, 8
న హి తేష్వేవ మే సారో యస్త్వయ్యరినిషూదన.

ప్ర. అ. తే=నీయొక్క, దయితః=ఇష్టుడైన, సహోదరః=సోదరుడైన, కుమారః అక్షశ్చ=అక్షకుమారుడు కూడ, సూదితః=చంపబడినాడు. అరినిషూదన= శత్రువులను నశింపచేయువాడా ! మే=నాకు, త్వయి=నీయందు, యః=ఏ, సారః=బలము ఉన్నదో అది, తేష్వేవ=వీరందరియందు, న హి=లేదు కదా.

తా. నీ ప్రియసోదరుడు అక్షకుమారుడు కూడ చంపబడినాడు. ఓ ! శత్రుసంహారకా ! నాకున్న బలమంతా నీలోనే ఉన్నది. వారిలో లేదు. 8

మూ. ఇదం హి దృష్ట్వా మతిమన్ మహద్బలం
కపేః ప్రభావం చ పరాక్రమం చ,
త్వమాత్మనశ్చాపి సమీక్ష్య సారం
కురుష్వ వేగం స్వబలానురూపమ్. 9

ప్ర. అ. మతిమన్=బుద్ధిమంతుడా ! త్వమ్=నీవు, కపేః=వానరుని యొక్క, ఇదమ్=ఈ, మహత్=గొప్ప, బలమ్=బలమును, ప్రభావం చ=ప్రభా వమును, పరాక్రమం చ=పరాక్రమమును, దృష్ట్వా=చూచి, ఆత్మనః=నీయొక్క, సారం చాపి=బలమును, సమీక్ష్య=చూచి, స్వబలానురూపమ్=నీ బలమునకు అనురూపమైన, వేగమ్=వేగమును, కురుష్వ=చేయుము.

తా. ఓ ! బుద్ధిమంతుడా ! ఆ వానరుని ఈ బలమును, ప్రభావమును, పరాక్రమమును దృష్టిలో ఉంచుకొని, నీ బలమును కూడ చూచుకొని, నీవు, నీ బలమునకు అనురూపమైన వేగమును చేయుము. 9

మూ. బలావమర్దస్త్వయి సంనికృష్టే
యథా గతే శామ్యతి శాన్తశత్రౌ,
తథా సమీక్ష్యాత్మబలం పరం చ
సమారభస్వాస్త్రవిదాం వరిష్ఠ. 10

ప్ర. అ. అస్త్రవిదామ్=అస్త్రవేత్తలలో, వరిష్ఠ=గొప్పవాడా, త్వయి= నీవు, సంనికృష్టే=యుద్ధములో సన్నిహితుడవై ఉండగా, శాన్తశత్రౌ=శాంతించిన శత్రువు, గతే=వెళ్ళిపోయినవాడగుచుండగా (మరణించగా), బలావమర్దః=సేనాసం ఘర్షము (యుద్ధము), యథా=ఎట్లు, శామ్యతి=శాంతించునో, తథా=ఆవిధముగా, ఆత్మబలమ్=నీ బలమును, పరం చ=శత్రువును, సమీక్ష్య=చూచి, సమారభస్వ= ప్రారంభించుము.

తా. అస్త్రవేత్తలలో శ్రేష్ఠుడవైన ఓ కుమారా ! నీవు యుద్ధరంగములో ప్రవేశించిన పిమ్మట శత్రువు శాంతించి మరణించగా యుద్ధము ఎట్లు ఆగిపోవునో అట్లు, నీ బలమును, శత్రుబలమును చూచుకొని కార్యము ప్రారంభించుము.

వి. పై శ్లోకంలో అన్వయం సరిగా కుదురుట లేదు. ప్రాచ్యపాఠం బాగున్నది.

"బలావమర్దస్త్వయి సంనివిష్టో
యథా న గర్త్వేయురుదారసత్త్వాః,
తథా సమీక్ష్యాత్మబలం పరం చ
వ్రజాహవం కర్మ సమారభస్వ".

"యుద్ధము నీమీదనే ఆధార పడి ఉన్నది. నీవు యుద్ధానికి వెళ్లుము. మహాబలశాలులు ఏ విధముగా ఆక్షేపించరో ఆ విధముగా నీ బలమును, శత్రుబలమును చూచుకొని కార్యమును ప్రారంభించుము" అని అర్థము. అన్వయము బాగున్నది. 10

మూ. న వీరసేనా గణశోచ్య (ప్య) వన్తి
న వజ్రమాదాయ విశాలసారమ్,
న మారుతస్యాస్య గతేః ప్రమాణం
న చాగ్నికల్పః కరణేన హన్తుమ్. 11

ప్ర. అ. వీర=వీరుడా ! గణశోచి=గుంపుల కొలది రాక్షసులను దుఃఖపెట్టుచున్న ఆ వానరుని విషయమున, సేనాః=సేనలు, న అవన్తి=రక్షింపవు. "గణశోఽప్యవన్తి" అని పాఠాంతర మున్నట్లు ఒక వ్యాఖ్యాత వ్రాసినారు. అప్పుడు అర్థం గణశోఽపి=గుంపుల కొలది కూడ; సేనాః న అవన్తి=సేనలు రక్షించ జాలవు. అల్పసారమ్=తగ్గిపోయిన సారము గల, వజ్రమ్=వజ్రమును, ఆదాయ=గ్రహించినను, న=ప్రయోజనము లేదు అని అర్థము చెప్పిన బాగుండునేమో ? (సాధారణంగా నిషేధించేటప్పుడు 'మా విశ' అని ప్రయోగముండును గాని "న విశ" అని ఉండదు). అస్య=ఈ వానరునియొక్క, గతేః=గతికి, మారుతస్య=వాయువుయొక్క గతి, న ప్రమాణమ్=ప్రమాణము (కొలత) కాదు. అగ్నికల్పః=అగ్నితో సమానుడు, కరణేన=పిడికిలి మొదలైన సాధనములచేత, హన్తుమ్=చంపుటకు, న=శక్యమైన వాడుకాడు.

తా. ఓ వీరుడా ! గుంపుల కొలది సేనలున్నను అవి రక్షించజాలవు. అధికమైన సారము గల వజ్రము కూడ ఈతనివిషయమునందు ఉపయోగించదు.

వాయువు గతికూడ ఈతని గతికి సరి రాదు. అగ్నివంటి ఇతనిని సామాన్యములైన పిడికిలి మొదలైన సాధనాలతో చంపశక్యము కాదు.

వి. ఏదో అర్థం చెప్పినా ఈ శ్లోకం సమస్యాశోకం వలెనే ఉన్నది. ఇది ప్రాచ్యపాఠంలో లేదు. 11

మూ. తమేవమర్థం ప్రసమీక్ష్య సమ్యక్
స్వకర్మసామ్యాద్ధి సమాహితాత్మా,
స్మరంశ్చ దివ్యం ధనుషోఽస్త్రవీర్యం
వ్రజాక్షతం కర్మ సమారభస్వ. 12

ప్ర. అ. తమ్=ఆ, ఏవమ్=ఈ విధముగా ఉన్న, అర్థమ్=విషయమును, సమ్యక్=బాగుగా, ప్రసమీక్ష్య=చూచి, స్వకర్మసామ్యాత్=తన కార్యముయొక్క సమత్వమువలన, సమాహితాత్మా=సావధానచిత్తుడవై, ధనుషః=ధనస్సుయొక్క, దివ్యమ్=దివ్యమైన, అస్త్రవీర్యమ్=అస్త్రముల బలమును, స్మరంశ్చ=స్మరించుచు, వ్రజ=వెళ్లుము. కర్మ=కార్యము, అక్షతమ్=ఎట్టి విఘాతమూ లేకుండగా, సమారభస్వ=ప్రారంభించుము.

తా. అందుచేత ఈ విషయములన్నీ బాగుగా పరిశీలించి, ఇది నీకే సంబంధించిన పని వంటిది అను భావముతో సావధానచిత్తుడవై, నీ ధనుస్సుకు సంబంధించిన దివ్యమైన అస్త్రముల పరాక్రమమును స్మరించుచు, యుద్ధమునకు వెళ్లుము. ఎట్టి భంగము లేకుండ కార్యమును ప్రారంభించుము. 12

మూ. న ఖల్వియం మతిః శ్రేష్ఠా యత్త్వాం సంప్రేషయామ్యహమ్,
ఇయం చ రాజధర్మాణాం క్షత్రియస్య మతిర్మతా. 13

ప్ర. అ. అహమ్=నేను. త్వామ్=నిన్ను, సంప్రేషయామి ఇతి యత్=పంపుచున్నానన్న మాట ఏది కలదో, ఇయం మతిః=ఈ బుద్ధి, శ్రేష్ఠా=శ్రేష్ఠమైనది, న ఖలు=కాదు కదా? ఇయమ్=ఇది, రాజధర్మాణామ్=రాజధర్మములకు సంబంధించిన, క్షత్రియస్య=క్షత్రియునియొక్క, మతిః=బుద్ధిగా, మతా=చెప్పబడినది.

తా. ఈ విధముగా నేను నిన్ను పంపుచున్నాననగా, ఇది శ్రేష్ఠమైన ఆలోచన కాదు. కాని ఇది క్షత్రియుడు చేయవలసిన రాజధర్మములకు సంబంధించిన ఆలోచన. 13

మూ. నానాశస్త్రేషు సంగ్రామే వైశారద్యమరిందమ,
అవశ్యమేవ బోద్ధవ్యం కామ్యశ్చ విజయో రణే. 14

ప్ర. అ. అరిందమ=శత్రువులను నశింపచేయువాడా ! సంగ్రామే=యుద్ధ మునందు, నానాశస్త్రేషు=అనేక విధములైన ఆయుధములందు, వైశారద్యమ్=నేర్పు, అవశ్యమేవ=తప్పక, బోద్ధవ్యమ్=తెలియదగినది. రణే=యుద్ధమునందు, విజయశ్చ= జయము కూడ, కామ్యః=కోరదగినది.

తా. ఓ !శత్రువినాశకుడా ! యుద్ధములో ఉపయోగించు అనేకవిధ ములైన ఆయుధముల ప్రయోగములో నేర్పు సంపాదించవలెను. రణమునందు విజయమును కూడ కోరుకొనవలెను. ఇది రాజధర్మము. 14

మూ. తతః పితుస్తద్వచనం నిశమ్య
ప్రదక్షిణం దక్షసుతప్రభావః,
చకార భర్తారమదీనసత్త్వో
రణాయ వీరః ప్రతిపన్నబుద్ధిః. 15

ప్ర. అ. తతః=అటుపిమ్మట, దక్షసుతప్రభావః=దేవతల వంటి ప్రభావము గల, వీరః=వీరుడైన, ఇంద్రజిత్తు, పితుః=తండ్రియొక్క, తత్ వచనమ్=ఆ మాటను, నిశమ్య=విని, అదీనసత్త్వః=దీనముకాని బుద్ధి కలవాడై, రణాయ=యుద్ధముకొరకు, ప్రతిపన్నబుద్ధిః=నిశ్చయింపబడిన బుద్ధి కలవాడై, భర్తారమ్=ప్రభువైన రావణుని, ప్రదక్షిణం చకార=ప్రదక్షిణము చేసెను.

తా. దేవతల వంటి ప్రభావము గల వీరుడైన ఆ ఇంద్రజిత్తు తండ్రి మాటలు విని, దైన్యము లేని మనస్సుతో యుద్ధము చేయుటకు నిర్ణయించుకొని, తండ్రియైన రావణునకు ప్రదక్షిణము చేసెను. 15

మూ. తతస్తైః స్వగణైరిష్టైరిన్ద్రజిత్ ప్రతిపూజితః,
యుద్ధోద్ధతః కృతోత్సాహః సంగ్రామం ప్రత్యపద్యత. 16

ప్ర. అ. తతః=అటుపిమ్మట, యుద్ధోద్ధతః=యుద్ధమునందు గర్వితుడైన, ఇన్ద్రజిత్=ఇంద్రజిత్తు, ఇష్టైః=ఇష్టులైన, తైః స్వగణైః=ఆ తనవారిచేత, ప్రతి పూజితః=పూజింపబడినవాడై, కృతోత్సాహః=చేయబడిన ఉత్సాహము కలవాడై, సంగ్రామమ్=యుద్ధమును, ప్రత్యపద్యత=పొందెను.

తా. ఇష్టులైన తనవారందరూ కొనియాడుచుండగా, ఇంద్రజిత్తు మంచి ఉత్సాహముతో యుద్ధరంగమునకు వెళ్లెను. 16

మూ. శ్రీమాన్ పద్మపలాశాక్షో రాక్షసాధిపతేః సుతః,
నిర్జగామ మహాతేజాః సముద్ర ఇవ పర్వసు. 17

ప్ర. అ. శ్రీమాన్=శోభాయుక్తుడు, పద్మపలాశాక్షః=పద్మపత్రముల వంటి నేత్రములు కలవాడు, మహాతేజాః=గొప్ప తేజస్సు కలవాడు అయిన, రాక్షసాధిపతేః సుతః=రావణుని కుమారుడైన ఇంద్రజిత్తు, పర్వసు=పర్వములయందు, సముద్రః ఇవ=సముద్రము వలె, నిర్జగామ=బయలుదేరెను.

తా. అధికమైన శోభ కలవాడు, పద్మపత్రముల వంటి నేత్రములు కలవాడు, మహాతేజఃశాలీ అయిన ఆ ఇంద్రజిత్తు పర్వములయందు సముద్రము వలె ఉప్పొంగి యుద్ధమునకై బయలువెడలెను. 17

మూ. స పక్షిరాజోపమతుల్యవేగై
ర్వ్యాళైశ్చతుర్భిః సితతీక్ష్ణదంష్ట్రైః,
రథం సమాయుక్తమసంగవేగం
సమారురోహేన్ద్రజిదిన్ద్రకల్పః. 18

ప్ర. అ. ఇన్ద్రకల్పః=ఇంద్రునితో సమానుడైన, సః ఇంద్రజిత్=ఇంద్రజిత్తు,పక్షిరాజోపమతుల్యవేగైః=గరుత్మంతునితో సమానమైన వేగము గల, సితతీక్ష్ణదంష్ట్రైః=తీక్ష్ణమైన తెల్లని కోరలు గల, చతుర్భిః=నాలుగు, వ్యాళైః=క్రూర మృగములతో, సమాయుక్తమ్=కూర్చబడిన, అసంగవేగమ్=అడ్డులేని వేగము గల, రథమ్=రథమును, సమారురోహ=ఎక్కెను.

తా. ఇంద్రునితో సమానుడైన ఆ ఇంద్రజిత్తు అడ్డులేని వేగము గల రథము నెక్కెను. దానికి గరుత్మంతుని వంటి వేగము గలవి, తెల్లని తీక్ష్ణములైన దంతములు కలవీ అయిన క్రూరమృగములు (పెద్దపులులు, లేదా తోడేళ్లు మొ.)కట్టబడెను. 18

మూ. స రథీ ధన్వినాం శ్రేష్ఠః శస్త్రజ్ఞోఽస్త్రవిదాం వరః,
రథేనాభియయౌ క్షిప్రం హనుమాన్యత్ర సోఽభవత్. 19

ప్ర. అ. రథీ=రథము కలవాడు, ధన్వినామ్=ధనుర్ధరులలో, శ్రేష్ఠః=శ్రేష్ఠుడు, శస్త్రజ్ఞః=శస్త్రములు తెలిసినవాడు, అస్త్రవిదామ్=అస్త్రములు తెలిసినవారిలో, వరః=శ్రేష్ఠుడూ అయిన, సః=అతడు, సః హనుమాన్=ఆ హనుమంతుడు, యత్ర=ఎక్కడ, అభవత్=ఉండెనో అక్కడికి, శీఘ్రమ్=శీఘ్రముగా, రథేన=రథముచేత, అభియయౌ=వెళ్లెను.

తా. ఆ ఇంద్రజిత్తు ధనుర్ధరులలో శ్రేష్ఠుడు, శస్త్రముల ప్రయోగములో నిపుణుడు. అస్త్రములు తెలిసినవారిలో శ్రేష్ఠుడు. ఉత్తమమైన రథము కలవాడు. అట్టి ఇంద్రజిత్తు రథమును అధిరోహించి, హనుమంతుడున్న ప్రదేశమునకు వెళ్లెను. 19

మూ. స తస్య రథనిర్ఘోషం జ్యాస్వనం కార్ముకస్య చ,
నిశమ్య హరివీరోఽసౌ సంప్రహృష్టతరోఽభవత్. 20

ప్ర. అ. సః అసౌ=అట్టివాడైన ఈ, హరివీరః=హనుమంతుడు, తస్య=ఆ ఇంద్రజిత్తుయొక్క, రథనిర్ఘోషమ్=రథధ్వనిని, కార్ముకస్య=ధనస్సు యొక్క, జ్యాస్వనం చ=నారి ధ్వనిని, నిశమ్య=విని, సంప్రహృష్టః=చాలా సంతోషించినవాడు, అభవత్=ఆయెను.

తా. అప్పుడా హనుమంతుడు, ఇంద్రజిత్తు రథధ్వనిని, ధనుష్టంకారమును విని చాల సంతోషించెను. 20

మూ. సుమహచ్చాపమాదాయ శితశల్యాంశ్చ సాయకాన్,
హనుమన్తమభిప్రేత్య జగామ రణపణ్డితః. 21

ప్ర. అ. రణపణ్డితః=యుద్ధమునందు పండితుడైన ఆ ఇంద్రజిత్తు, సుమహత్=చాల పెద్దదైన, చాపమ్=ధనస్సును, శితశల్యాన్=వాడియైన అగ్రభాగములు గల, సాయకాన్=బాణములను, ఆదాయ=గ్రహించి, హనుమన్తమ్=హనుమంతుని, అభిప్రేత్య=ఉద్దేశించి, జగామ=వెళ్ళెను.

తా. యుద్ధములో ప్రవీణుడైన ఆ ఇంద్రజిత్తు గొప్ప ధనస్సును, వాడియైన అగ్రభాగములు గల బాణములను ధరించి, హనుమంతునిమీదికి యుద్ధానికి వెళ్ళెను. 21

మూ. తస్మింస్తతః సంయతి జాతహర్షే
రణాయ నిర్గచ్ఛతి చాపపాణౌ,
దిశశ్చ సర్వాః కలుషా బభూవు
ర్మృగాశ్చ రౌద్రా బహుధా వినేదుః. 22

ప్ర. అ. తతః=అటుపిమ్మట, సంయతి=యుద్ధమునందు, జాతహర్షే=పుట్టిన సంతోషము గల, తస్మిన్=ఆ ఇంద్రజిత్తు, చాపపాణౌ=ధనస్సు హస్తమునందు కలవాడై, రణాయ=యుద్ధముకొరకు, నిర్గచ్ఛతి సతి=బయలుదేరుచుండగా, సర్వాః=సమస్తమైన, దిశః=దిక్కులు, కలుషాః=కలుషములు, బభూవుః=అయినవి. రౌద్రాః=భయంకరములైన, మృగాశ్చ=మృగములు కూడ, బహుధా=అనేకవిధములుగా, వినేదుః=ధ్వని చేసినవి.

తా. యుద్ధములో ఉత్సాహవంతుడైన ఆ ఇంద్రజిత్తు ధనస్సు ధరించి యుద్ధానికై బయలు దేరుచుండగా, దిక్కులన్నీ మలినముగా ఉన్నట్లు కనబడినవి. క్రూరమృగములు కూడ అనేకవిధముల అరచినవి. 22

మూ. సమాగతాస్తత్ర తు నాగయక్షా
మహర్షయశ్చక్రచరాశ్చ సిద్ధాః,
నభః సమావృత్య చ పక్షిసంఘా
వినేదురుచ్చైః పరమప్రహృష్టాః. 23

ప్ర. అ. తత్ర=అక్కడికి, సమాగతాః=వచ్చిన, నాగయక్షాః=నాగులు, యక్షులు, చక్రచరాః=జ్యోతిశ్చక్రమునందు సంచరించు, మహర్షయః=మహర్షులు, సిద్ధాశ్చ=సిద్ధులు, పక్షిసంఘాః=పక్షిసముదాయములు, నభః=ఆకాశమును, సమావృత్య=ఆవరించి, పరమప్రహృష్టాః=చాల సంతోషించినవారై, ఉచ్చైః=గట్టిగా, వినేదుః=ధ్వనిచేసిరి.

తా. అక్కడ కలిసిన నాగులు, యక్షులు, జ్యోతిశ్చక్రమునందు సంచరించు మహర్షులు, సిద్ధులు, పక్షిసముదాయములు, ఆకాశమును ఆవరించి, చాల సంతోషముతో గట్టిగా ధ్వనిచేసెను. 23

మూ. ఆయాన్తం సరథం దృష్ట్వా తూర్ణమిన్ద్రజితం కపిః,
వినినాద మహానాదం వ్యవర్ధత చ వేగవాన్. 24

ప్ర. అ. కపిః=హనుమంతుడు, తూర్ణమ్=శీఘ్రముగా, ఆయాన్తమ్=వచ్చుచున్న, సరథమ్=రథముతోకూడిన, ఇన్ద్రజితమ్=ఇంద్రజిత్తును, దృష్ట్వా=చూచి, మహానాదమ్=గొప్పధ్వని కలుగునట్లుగా, వినినాద=ధ్వనిచేసెను. వేగవాన్=వేగవంతుడై, వ్యవర్ధత చ=వృద్ధి పొందెను కూడ.

తా. రథముపై ఎక్కి శీఘ్రముగా వచ్చుచున్న ఇంద్రజిత్తును చూచి, హనుమంతుడు పెద్దశబ్దము కలుగునట్లు ధ్వని చేసి, వేగముతో వృద్ధిపొందెను.24

మూ. ఇన్ద్రజిత్తు రథం దివ్యమాస్థితశ్చిత్రకార్ముకః,
ధనుర్విష్ఫారయామాస తటిదూర్జితనిస్స్వనమ్. 25

ప్ర. అ. ఇన్ద్రజిత్తు=ఇంద్రజిత్తైతే, దివ్యమ్=దివ్యమైన, రథమ్=రథమును, ఆస్థితః=అధిష్ఠించినవాడై, చిత్రకార్ముకః=చిత్రమైన ధనస్సు కలవాడై, తటిదూర్జితనిఃస్వనమ్=మెరుపు వలె గొప్ప ధ్వని గల, ధనుః=ధనస్సును, విష్ఫారయామాస=చరచెను.

తా. ఇంద్రజిత్తు దివ్యమైన రథమునెక్కి, చిత్రమైన ధనస్సు ధరించి, మెరుపువలె (పిడుగువలె) అధికమైన ధ్వని కలుగునట్లు ధనస్సు చరచెను. 25

మూ. తతః సమేతావతితీక్ష్ణవేగౌ
మహాబలౌ తౌ రణనిర్విశఙ్కౌ,

కపిశ్చ రక్షోధిపతేస్తనూజః
సురాసురేన్ద్రావివ బద్ధవైరౌ. 26

ప్ర. అ. తతః=అటుపిమ్మట, అతితీక్ష్ణవేగౌ=చాల తీక్ష్ణమైన వేగము గలవారూ, మహాబలౌ=గొప్ప బలము గలవారూ, రణనిర్విశఙ్కౌ=యుద్ధము నందు భయము లేనివారూ అయిన, తౌ=ఆ, కపిశ్చ=హనుమంతుడు, రక్షోధిపతేః=రావణునియొక్క, తనూజః=కుమారుడూ, బద్ధవైరౌ=కట్టబడిన వైరము గల, సురాసురేన్ద్రావివ=దేవేంద్రుడూ, అసురప్రభువూ వలె, సమేతౌ=యుద్ధానికి కలియబడిరి.

తా. చాల తీక్ష్ణమైన వేగము గలవారు, గొప్ప బలము గలవారు, యుద్ధములో భయములేనివారు అయిన ఆ హనుమంద్రజిత్తులు, వైరముతో కూడిన దేవేంద్ర-అసురేంద్రులు వలె యుద్ధరంగములో కలిసిరి. 26

మూ. స తస్య వీరస్య మహారథస్య
ధనుష్మతః సంయతి సంమతస్య,
శరప్రవేగం వ్యహనత్ప్రవృద్ధ
శ్చచార మార్గే పితురప్రమేయః. 27

ప్ర. అ. అప్రమేయః=ఊహింప శక్యము కాని బలము గల, సః=హనుమంతుడు, ప్రవృద్ధః=వృద్ధిపొందినవాడై, మహారథస్య=మహారథుడు, ధనుష్మతః=ధనుర్ధరుడు, సంయతి=యుద్ధమునందు, సంమతస్య=గౌరవింపబడినవాడు అయిన, తస్య వీరస్య=వీరుడైన ఆ ఇంద్రజిత్తుయొక్క, శరప్రవేగమ్=బాణముల వేగమును, వ్యహనత్=వ్యర్థము చేసెను. పితుః=తండ్రియైన వాయుదేవుని యొక్క, మార్గే=మార్గమునందు, చచార=సంచరించెను.

తా. సాటిలేని పరాక్రమము గల ఆ హనుమంతుడు పెచ్చు పెరిగి పోయినవాడై, మహారథుడు, ధనుర్ధరుడు, యుద్ధములో గౌరవింపబడినవాడు, వీరుడు అయిన ఆ ఇంద్రజిత్తు ప్రయోగించిన బాణముల వేగమును వ్యర్థము చేసి ఆకాశమార్గమునందు సంచరించెను. 27

మూ. తతః శరానాయతతీక్ష్ణశల్యాన్
సుపత్రిణః కాఞ్చనచిత్రపుఙ్ఖాన్,
ముమోచ వీరః పరవీరహన్తా
సుసన్నతాన్ వజ్రనిపాతవేగాన్. 28

ప్ర. అ. తతః=అటుపిమ్మట, పరవీరహన్తా=శత్రువీరులను వధించు, వీరః=వీరుడైన ఇంద్రజిత్తు, ఆయతతీక్ష్ణశల్యాన్=పొడవైనవీ, తీక్ష్ణమైన ములుకులు కలవీ, సుపత్రిణః=మంచి రెక్కలు కలవి, కాఞ్చనచిత్రపుఙ్ఖాన్=బంగారు చిత్రవర్ణములైన పొన్నులు కలవి, సుసన్నతాన్=బాగుగా వంగినవీ, వజ్రనిపాతవేగాన్=వజ్రపాతము వంటి వేగము గలవి అయిన, శరాన్=బాణములను, ముమోచ=విడచెను.

తా. శత్రువీరులను సంహరించు ఆ ఇంద్రజిత్తు, అప్పుడు పొడవైనవీ, తీక్ష్ణమైన ములుకులు కలవి, మంచి ఱెక్కలు కట్టినవి, బంగారు విచిత్రవర్ణము లైన పొన్నులు కలవి, బాగా వంగిన అగ్రభాగములు కలవి అయిన బాణములను ప్రయోగించెను. 28

మూ. తతః స తత్స్యన్దననిఃస్వనం చ
మృదఙ్గభేరీపటహస్వనం చ,
వికృష్యమాణస్య చ కార్ముకస్య
నిశమ్య ఘోషం పునరుత్పపాత. 29

ప్ర. అ. తతః=అటుపిమ్మట, సః=ఆ హనుమంతుడు, తత్స్యన్దననిః స్వనం చ=ఆ రథముయొక్క ధ్వనిని, మృదఙ్గభేరీపటహస్వనం చ=మృదంగభేరీ-పటహముల ధ్వనిని, వికృష్యమాణస్య=లాగబడుచున్న, కార్ముకస్య=ధనస్సుయొక్క, ఘోషమ్=ధ్వనిని, నిశమ్య=విని, పునః=మరల, ఉత్పపాత=ఎగిరెను.

తా. అప్పుడా హనుమంతుడు, రథధ్వనిని, మృదంగభేరీపటహముల ధ్వనిని, ధనస్సు లాగిన ధ్వనిని విని, మరల ఎగిరెను. 29

మూ. శరాణామన్తరేష్వాశు వ్యవర్తత మహాకపిః,
హరిస్తస్యాభిలక్ష్యస్య మోఘయన్ లక్ష్యసంగ్రహమ్. 30

ప్ర. అ. మహాకపిః=మహా వానరుడైన, హరిః=హనుమంతుడు, ఆశు=శీఘ్ర ముగా, అభిలక్ష్యస్య=లక్ష్యమును కొట్టుటయందు నేర్పరియైన, తస్య=ఇంద్రజిత్తుని యొక్క, లక్ష్యసంగ్రహమ్=లక్ష్యముయొక్క గ్రహణమును, మోఘయన్=వ్యర్థముచే యుచు, శరాణామ్=బాణముల, అన్తరేషు=మధ్యములందు, వ్యవర్తత=పంచరించెను.

తా. గురి చూచి కొట్టుటలో చాల నేర్పరియైన ఇంద్రజిత్తు లక్ష్యమును వ్యర్థము చేయుచు, హనుమంతుడు, అతిశీఘ్రముగా ఆతని బాణముల మధ్య సంచరించెను. 30

మూ. శరాణామగ్రతస్తస్య పునః సమభివర్తత,
ప్రసార్య హస్తౌ హనుమానుత్పపాతానిలాత్మజః. 31

ప్ర. అ. అనిలాత్మజః=వాయుపుత్రుడైన, హనుమాన్=హనుమంతుడు, పునః=మరల, తస్య=ఆతనియొక్క, శరాణామ్=బాణములయొక్క, అగ్రతః=ఎదుట, సమభివర్తత=ఉండెను. హస్తౌ=హస్తములను, ప్రసార్య=చాపి, ఉత్పపాత=పైకి ఎగిరెను.

తా. వాయుకుమారుడైన హనుమంతుడు కొంత సేపు బాణములు తప్పించుకొనుచు తిరిగి, మరల ఆతని బాణములకు ఎదురుగా నిలబడెను. పిదప రెండు చేతులూ చాపి ఆకాశముమీదికి ఎగిరెను. 31

మూ. తావుభౌ వేగసంపన్నౌ రణకర్మవిశారదౌ,
సర్వభూతమనోగ్రాహి చక్రతుర్యుద్ధముత్తమమ్. 32

ప్ర. అ. వేగసంపన్నౌ=వేగముతో కూడినవారూ, రణకర్మవిశారదౌ=యుద్ధముచేయుటలో నేర్పు గలవారూ అయిన, తౌ ఉభౌ=వారిద్దరూ, సర్వభూతమనోగ్రాహి=సకలభూతముల మనస్సును ఆకర్షించు, ఉత్తమమ్=ఉత్తమమైన, యుద్ధమ్=యుద్ధమును, చక్రతుః=చేసిరి.

తా. వేగముతో కూడినవారూ, యుద్ధముచేయుటలో నేర్పరులూ అయిన ఆ ఇద్దరూ కూడ, అందరి మనస్సులకు ఆశ్చర్యము కలిగించు విధముగా యుద్ధము చేసిరి. 32

మూ. హనుమతో వేద న రాక్షసోఽన్తరం
న మారుతిస్తస్య మహాత్మనోఽన్తరమ్,
పరస్పరం నిర్విషహౌ బభూవతుః
సమేత్య తౌ దేవసమానవిక్రమౌ. 33

ప్ర. అ. రాక్షసః=ఇంద్రజిత్తు, హనూమతః=హనుమంతునియొక్క, అన్తరమ్=ఛిద్రమును (లోపమును), న వేద=తెలుసుకొనజాలకపోయెను. మారుతిః=హనుమంతుడు, మహాత్మనః=మహాత్ముడైన, తస్య=ఆ ఇంద్రజిత్తుయొక్క ఛిద్రమును, న=తెలుసుకొనలేకపోయెను. దేవసమానవిక్రమౌ=దేవతలతో సమానమైన పరాక్రమము గల, తౌ=వాళ్ళిద్దరు, సమేత్య=యుద్ధములో కలిసి, పరస్పరమ్=పరస్పరము, నిర్విషహౌ=సహింప అసమర్థులుగా, బభూవతుః=అయిరి.

తా. హనుమంతునిలో ఉన్న లోపాలను ఇంద్రజిత్తు కాని, ఇంద్రజిత్తులో ఉన్న లోపాలను హనుమంతుడు కాని తెలిసికొనలేకపోయెను. దేవతలతో సమానమైన పరాక్రమము గల వారిద్దరు యుద్ధములో తలబడి ఒకరికొరకు లొంగకుండ ఉండిరి. 33

మూ. తతస్తు లక్ష్యే స విహన్యమానే
శరేష్వమోఘేషు చ సంపతత్సు,
జగామ చిన్తాం మహతీం మహాత్మా
సమాధిసంయోగసమాహితాత్మా. 34

ప్ర. అ. తతః=అటుపిమ్మట, లక్ష్యే=లక్ష్యము, విహన్యమానే=వ్యర్థము చేయబడుచుండగా, అమోఘేషు=వ్యర్థముకాని, శరేషు=బాణములు, సంపతత్సు=క్రిందపడిపోవుచుండగా, మహాత్మా=గొప్ప బుద్ధి కల, సమాధిసంయోగసమాహితాత్మా=లక్ష్యము చూచుటయందు, బాణము కూర్చుటయందు స్థిరముగా నిలపబడిన చిత్తము గల, సః=ఇంద్రజిత్తు, మహతీమ్=గొప్ప, చిన్తామ్=ఆలోచనను, జగామ=పొందెను.

తా. వ్యర్థములగుటకు వీలులేని బాణములు కూడ గురి తప్పి క్రింద పడిపోవుచుండగా, గొప్ప బుద్ధిశాలి, గురి చూచుటయందు, బాణమును సంధించుటయందు సావధానమైన చిత్తము గల ఆ ఇంద్రజిత్తు పెద్ద ఆలోచనలో పడెను. 34

మూ. తతో మతిం రాక్షసరాజసూను
శ్చకార తస్మిన్ హరివీరముఖ్యే,
అవధ్యతాం తస్య కపేః సమీక్ష్య
కథం నిగచ్ఛేదితి నిగ్రహార్థమ్. 35

ప్ర. అ. తతః=అటుపిమ్మట, రాక్షసరాజసూనుః=రాక్షసరాజైన రావణుని కుమారుడు, తస్య కపేః=ఆ హనుమంతునియొక్క, అవధ్యతామ్=చంపుటకు శక్యము కాకుండుటను, సమీక్ష్య=చూచి, నిగ్రహార్థమ్=నిగ్రహించుటకు, కథమ్=ఎట్లు, నిగచ్ఛేత్=లొంగును, ఇతి=అని, తస్మిన్=ఆ, హరివీరముఖ్యే=హనుమంతుని విషయమున, మతిమ్=ఆలోచనను, చకార=చేసెను.

తా. హనుమంతుని చంపుటకు శక్యము కాదు అను విషయమును చూచి, ఆ ఇంద్రజిత్తు, "ఇతడు పట్టుకొనుటకు ఎట్లు లొంగును" అని ఆలోచించి, వానర వీరులలో ముఖ్యుడైన హనుమంతుని గూర్చి ఒక నిర్ణయము చేసెను.35

మూ. తతః పైతామహం వీరః సోఽస్త్రమస్త్రవిదాం వరః,
సందధే సుమహాతేజాస్త్రం హరిప్రవరం ప్రతి. 36

ప్ర. అ. తతః=అటుపిమ్మట, వీరః=వీరుడు, అస్త్రవిదామ్=అస్త్రవేత్తలలో, వరః=శ్రేష్ఠుడు, సుమహాతేజాః=చాల గొప్ప తేజస్సు కలవాడు అయిన, సః=ఆ

ఇంద్రజిత్తు, తం హరిప్రవరం ప్రతి=ఆ వానరశ్రేష్ఠుని గూర్చి, పైతామహమ్=బ్రహ్మసంబంధమైన, అస్త్రమ్=అస్త్రమును, సందధే=సంధించెను.

తా. పిమ్మట, వీరుడు, అస్త్రవేత్తలలో శ్రేష్ఠుడు, చాల గొప్ప తేజస్సు కలవాడు అయిన ఆ ఇంద్రజిత్తు హనుమంతునిపై బ్రహ్మాస్త్రమును సంధించెను.

మూ. అవధ్యోఽయమితి జ్ఞాత్వా తమస్త్రేణాస్త్రతత్త్వవిత్,
నిజగ్రాహ మహాబాహుర్మారుతాత్మజమిన్ద్రజిత్. 37

ప్ర. అ. అస్త్రతత్త్వవిత్=అస్త్రముల తత్త్వమును ఎరిగినవాడు, మహాబాహుః=గొప్ప బాహువులు కలవాడు అయిన, ఇన్ద్రజిత్=ఇంద్రజిత్తు, అయమ్=ఇతడు, అవధ్యః=చంప శక్యము కానివాడు, ఇతి=అని, జ్ఞాత్వా=తెలుసుకొని, తమ్=ఆ, మారుతాత్మజమ్=హనుమంతుని, అస్త్రేణ=బ్రహ్మాస్త్రముచేత నిజగ్రాహ=నిగ్రహించెను.

తా. అస్త్రముల బలాబలములు తెలిసినవాడు, మహాబాహువు అయిన ఇంద్రజిత్తు "ఇతనిని చంపుట శక్యము కాదు" అని తెలిసికొని, ఆ హనుమంతుని బ్రహ్మాస్త్రముచేత బంధించెను. 37

మూ. తేన బద్ధస్తతోఽస్త్రేణ రాక్షసేన స వానరః,
అభవన్నిర్విచేష్టశ్చ పపాత స మహీతలే. 38

ప్ర. అ. తతః=అటుపిమ్మట, రాక్షసేన=రాక్షసునిచేత, అస్త్రేణ=అస్త్రముచేత, బద్ధః=కట్టబడిన, సః వానరః=ఆ వానరుడు, నిర్విచేష్టః=చేష్టలేనివాడు, అభవత్=ఆయెను. సః=అతడు, మహీతలే=నేలపై, పపాత=పడెను.

తా. అప్పుడు ఇంద్రజిత్తు చేత బ్రహ్మాస్త్రమును ప్రయోగించి బంధించబడిన ఆ హనుమంతుడు కదలజాలక నేలపై పడిపోయెను. 38

మూ. తతోఽథ బుద్ధ్వా స తదస్త్రబన్ధం
ప్రభోః ప్రభావాద్విగతాత్మవేగః,
పితామహానుగ్రహమాత్మనశ్చ
విచిన్తయామాస హరిప్రవీరః. 39

ప్ర. అ. తతః=అందువలన, అథ=అటుపిమ్మట, సః హరిప్రవీరః=ఆ హనుమంతుడు, తదస్త్రబన్ధమ్=ఆ అస్త్రబంధమును, బుద్ధ్వా=తెలిసికొని, ప్రభోః=ప్రభువైన బ్రహ్మయొక్క, ప్రభావాత్=ప్రభావమువలన, విగతాత్మవేగః=పోయిన తన వేగము గలవాడై, ఆత్మనః=తనయొక్క, పితామహానుగ్రహమ్=బ్రహ్మయొక్క అనుగ్రహమునుగూర్చి, విచిన్తయామాస=ఆలోచించెను.

తా. అపుడు ఆ హనుమంతుడు అస్త్రబంధముచే తాను బంధింపబడినట్లు తెలుసుకొని, బ్రహ్మదేవుని ప్రభావముచే తన వేగమును కోల్పోయినవాడై, తన విషయమున బ్రహ్మదేవుని అనుగ్రహమును గూర్చి కూడ స్మరించెను. 39

మూ. తతః స్వాయమ్భువైర్మన్త్రైర్బ్రహ్మాస్త్రమభిమన్త్రితమ్,
హనుమాంశ్చిన్తయామాస వరదానం పితామహాత్. 40

ప్ర. అ. తతః=అటుపిమ్మట, హనుమాన్=హనుమంతుడు, స్వాయంభువైః=బ్రహ్మకు సంబంధించిన, మన్త్రైః=మంత్రములచేత, అభిమన్త్రితమ్=అభిమంత్రించబడిన, బ్రహ్మాస్త్రమ్=బ్రహ్మాస్త్రమును, తెలిసికొని, పితామహాత్=బ్రహ్మదేవునివలన, వరదానమ్=వరదానమును, చిన్తయామాస=గుర్తుచేసికొనెను.

తా. ఇంద్రజిత్తు బ్రాహ్మమంత్రములచేత అభిమంత్రించిన బ్రహ్మాస్త్రమును ప్రయోగించినాడని తెలుసుకొని, హనుమంతుడు తనకు బ్రహ్మదేవుడిచ్చిన వరమును గుర్తు చేసికొనెను. 40

మూ. న మేఽస్త్రబన్ధస్య చ శక్తిరస్తి
విమోక్షణే లోకగురోః ప్రభావాత్,
ఇత్యేవ మత్వా విహితోఽస్త్రబన్ధో
మయాత్మయోనేరనువర్తితవ్యః. 41

ప్ర. అ. లోకగురోః=లోకములకు గురువైన బ్రహ్మదేవునియొక్క, ప్రభావాత్=ప్రభావమువలన, అస్త్రబన్ధస్య=అస్త్రబంధముయొక్క, విమోక్షణే=విడిపించుటయందు, మే=నాకు, శక్తిః=శక్తి, నాస్తి=లేదు, ఇత్యేవ=ఇట్లే, మత్వా=తెలిసికొని, విహితః=(శత్రువుచేత) చేయుబడిన, ఆత్మయోనేః=బ్రహ్మ దేవునియొక్క, అస్త్రబన్ధః=అస్త్రముచేత బంధనము, మయా=నాచేత, అనువర్తితవ్యః=అనుసరించతగినది.

తా. "ఈ అస్త్రబంధమును విడిపించుకొను శక్తి నాకు లేదు. బ్రహ్మదేవుని ప్రభావము అట్టిది. ఈ విషయము తెలిసికొని నేను ఈ బ్రహ్మాస్త్రబంధమునకు కట్టుబడియే ఉండవలెను." 41

మూ. స వీర్యమస్త్రస్య కపిర్విచార్య
పితామహానుగ్రహమాత్మనశ్చ,
విమోక్షశక్తిం పరిచిన్తయిత్వా
పితామహాజ్ఞామనువర్తతే స్మ. 42

ప్ర. అ. సః కపిః=ఆ హనుమంతుడు, అస్త్రస్య=అస్త్రముయొక్క, వీర్యమ్=బలమును, విచార్య=ఆలోచించి, ఆత్మనః=తనయొక్క, పితామహానుగ్రహం

చ=బ్రహ్మదేవుని అనుగ్రహమును కూడ, ఆలోచించి, విమోక్షశక్తిమ్=విడిపించుకొనే శక్తిని, పరిచిన్తయిత్వా=ఆలోచించి, పితామహాజ్ఞామ్=బ్రహ్మదేవుని ఆజ్ఞను, అనువర్తతే స్మ=అనుసరించి ఉండెను.

తా. హనుమంతుడు బ్రహ్మాస్త్రప్రభావమును, తన విషయమున బ్రహ్మదేవుని అనుగ్రహమును స్మరించుచు, ఆ అస్త్రమునుండి విడిపించుకొనుటకు తనకున్న శక్తిని కూడ తెలుసుకొని, బ్రహ్మదేవుని ఆజ్ఞకు బద్ధుడై ఉండెను.42

మూ. అస్త్రేణాపి హి బద్ధస్య భయం మమ న జాయతే,
పితామహమహేన్ద్రాభ్యాం రక్షితస్యానిలేన చ. 43

ప్ర. అ. పితామహమహేన్ద్రాభ్యామ్=బ్రహ్మదేవునిచేతను, మహేంద్రుని చేతను, అనిలేన చ=వాయుదేవునిచేతను, రక్షితస్య=రక్షింపబడిన, మే=నాకు, అస్త్రేణ=అస్త్రముచేత, బద్ధస్యాపి=కట్టబడినను, భయమ్=భయము, న జాయతే=కలుగుట లేదు.

తా. నన్ను బ్రహ్మదేవుడు, మహేంద్రుడు, వాయుదేవుడు రక్షించుచుండుటచే, అస్త్రముచేత బంధింపబడినను నాకు భయమేమీ కలుగుటలేదు. 43

మూ. గ్రహణే చాపి రక్షోభిర్మహన్మే గుణదర్శనమ్,
రాక్షసేన్ద్రేణ సంవాదస్తస్మాద్గృహ్ణన్తు మాం పరే. 44

ప్ర. అ. రక్షోభిః=రాక్షసులచేత, గ్రహణే చాపి=గ్రహణము జరిగినను, మే=నాకు, మహత్=గొప్ప, గుణదర్శనమ్=గుణముల దర్శనము ఉన్నది. రాక్షసేన్ద్రేణ=రావణునితో, సంవాదః=సంవాదము (జరుగును). తస్మాత్=అందువలన, మామ్=నన్ను, పరే=శత్రువులు, గృహ్ణన్తు=పట్టుకొందురు గాక.

తా. నన్ను రాక్షసులు పట్టుకొన్నా లాభమే కలుగును. ఎందుచేతననగా నేను రావణునితో మాటలాడవచ్చును, అందుచేత శత్రువులు నన్ను పట్టుకొందురుగాక. 44

మూ. స నిశ్చితార్థః పరవీరహన్తా
సమీక్ష్యకారీ వినివృత్తచేష్టః,
పరైః ప్రసహ్యాభిగతైర్నిగృహ్య
ననాద తైస్తైః పరిభర్త్స్యమానః. 45

ప్ర. అ. పరవీరహన్తా=శత్రువీరులను చంపేవాడు, సమీక్ష్యకారీ=ఆలోచించి పనులు చేసేవాడూ అయిన, సః=ఆ హనుమంతుడు, నిశ్చితార్థః=నిశ్చయింపబడిన

విషయముగలవాడై, వినివృత్తచేష్టః=నివర్తించిన చేష్టలు కలవాడై, అభిగతైః=తన మీదకు వచ్చిన, తైస్తైః=ఆయా, పరైః=శత్రువులచేత, ప్రసహ్య=బలాత్కారముగా, నిగృహ్య=నిగ్రహించి, పరిభర్త్స్యమానః=భయపెట్టబడుచున్నవాడై, ననాద=ధ్వనిచేసెను.

తా. శత్రువీరులను సంహరించేవాడూ, ఆలోచించి పనులు చేసేవాడూ అయిన ఆ హనుమంతుడు ఈ విధముగా తన కర్తవ్యమును నిర్ణయించుకొని, చేష్టలు ఉడిగి పడి ఉండెను. ఆయా శత్రువులందరు దగ్గరకు వచ్చి బలాత్కారముగా పట్టుకొని భయపెట్టుచుండగా, బిగ్గరగా అరచెను. 45

మూ. తతస్తం రాక్షసా దృష్ట్వా నిర్విచేష్టమరిందమమ్,
బబన్ధుః శణవల్కైశ్చ ద్రుమచీరైశ్చ సంహతైః. 46

ప్ర. అ. తతః=అటుపిమ్మట, రాక్షసాః=రాక్షసులు, అరిందమమ్=శత్రుసంహారకుడైన, తమ్=ఆ హనుమంతుని, నిర్విచేష్టమ్=చేష్టలు లేని వానినిగా, దృష్ట్వా=చూచి, శణవల్కైశ్చ=జనపనారలచేతను, సంహతైః=పేనబడిన, ద్రుమచీరైశ్చ=చెట్ల నారచీరలచేతను, బబన్ధుః=కట్టిరి.

తా. అప్పుడా రాక్షసులు, శత్రుసంహారకుడైన ఆ హనుమంతుడు కదలకుండా పడి యుండుట చూచి, ఆతనిని, జనపనారలతోను, పేనినచెట్ల నారచీరలతోను కట్టిరి. 46

మూ. స రోచయామాస పరైశ్చ బన్ధనం
ప్రసహ్య వీరైరభినిగ్రహం చ,
కౌతూహలాన్మాం యది రాక్షసేన్ద్రో
ద్రష్టుం వ్యవస్యేదితి నిశ్చితార్థః. 47

ప్ర. అ. రాక్షసేన్ద్రః=రావణుడు, మామ్=నన్ను, కౌతూహలాత్=వేడుకవలన, ద్రష్టుమ్=చూచుటకు, వ్యవస్యేద్యది=నిశ్చయించవచ్చును. ఇతి=అని, నిశ్చితార్థః=నిశ్చయింపబడిన విషయము కలవాడై, సః=హనుమంతుడు, పరైః=శత్రువులచేత, బన్ధనమ్=బంధనమును, వీరైః=వీరులచేత, ప్రసహ్య=బలాత్కరించి, అభినిగ్రహం చ=నిగ్రహమును, రోచయామాస=ఇష్టపడెను.

తా. "రావణుడు కుతూహలముతో నన్ను చూడవలెనని అనుకొనినా అనుకొనవచ్చును," అని మనస్సులో నిశ్చయించుకొని, హనుమంతుడు, శత్రువీరులు బలాత్కారముగా తనను పట్టుకొని బంధించుటకు ఇష్టపడెను. 47

మూ. స బద్ధస్తేన వల్కేన విముక్తోఽస్త్రేణ వీర్యవాన్,
అస్త్రబన్ధః స చాన్యం హి న బన్ధమనువర్తతే. 48

ప్ర. అ. తేన=ఆ, వల్కేన=నారచీరచేత, బద్ధః=కట్టబడిన, వీర్యవాన్=పరాక్రమవంతుడైన, సః=హనుమంతుడు, అస్త్రేణ=అస్త్రముచేత, విముక్తః=విడవబడినాడు. సః=ఆ, అస్త్రబన్ధః=అస్త్రబంధనము, అన్యమ్=మరియొక, బన్ధమ్=బంధనమును, న అనువర్తతే హి=అనుసరించి ఉండదు కదా.

తా. నార చీరంతో కట్టిన వెంటనే, వీర్యవంతుడైన ఆ హనుమంతుణ్ణి అస్త్రము విడిచివేసెను. ఎందుచేతననగా మరొక దానితో కట్టినపుడు ఆ అస్త్రబంధము నిలువదు. 48

మూ. అథేన్ద్రజిత్తు ద్రుమచీరబద్ధం
విచార్య వీరః కపిసత్తమం తమ్,
విముక్తమస్త్రేణ జగామ చిన్తాం
నాన్యేన బద్ధో హ్యనువర్తతేఽస్త్రమ్. 49

ప్ర. అ. అథ=అటుపిమ్మట, వీరః=వీరుడైన, ఇన్ద్రజిత్తు=ఇంద్రజిత్తైతే, ద్రుమచీరబద్ధమ్=నారచీరలచేత కట్టబడిన, తమ్=ఆ, కపిసత్తమమ్=వానరశ్రేష్ఠుని, అస్త్రేణ=అస్త్రముచేత, విముక్తమ్=విడవబడినవానినిగా, విచార్య=ఆలోచించి (తెలుసుకొని), చిన్తామ్=చింతను, జగామ=పొందెను. అన్యేన=మరొకదానిచేత, బద్ధః=కట్టబడినవాడు, అస్త్రమ్=అస్త్రమును, నాను వర్తతే హి=అనుసరించదు కదా.

తా. నారచీరలతో కట్టిన ఆ హనుమంతుని బ్రహ్మాస్త్రము విడిచివేసిన దను విషయమును గుర్తించి, ఇంద్రజిత్తు ఆలోచనలో పడెను - "మరొకదానితో కట్టుబడిన వానిని అస్త్రబంధము విడిచివేయును కదా !" 49

మూ. అహో మహత్కర్మ కృతం నిరర్థకం
న రాక్షసైర్మన్త్రగతిర్విమృష్టా,
పునశ్చ మన్త్రే విహతేఽస్త్రమన్య
త్ప్రవర్తతే సంశయితాః స్మ సర్వే. 50

ప్ర. అ. అహో=అయ్యో ! మహత్=గొప్పదైన, కర్మ=పని, నిరర్థకమ్=వ్యర్థమైనదిగా, కృతమ్=చేయబడినది. రాక్షసైః=రాక్షసుల చేత, మన్త్రగతిః=మంత్రము యొక్క విధానము, న విమృష్టా=ఆలోచింపబడలేదు. మన్త్రే=మంత్రము,

విహతే=కొట్టబడినదగుచుండగా, అన్యత్=మరియొక, అస్త్రమ్=అస్త్రము, న ప్రవర్తతే=ప్రవర్తించదు. సర్వే=అందరము, సంశయితాః=సంశయగ్రస్తులము, స్మ=అయితిమి.

తా. "అయ్యో! ఈ రాక్షసులు మంత్రవిధానమును ఆలోచించకుండగా, ఇంతటి మహాకార్యమును వ్యర్థము చేసినారు. మంత్రము ఒకసారి విహతమై పోయినపుడు మరియొక అస్త్రము పని చేయదు కదా ! ఇప్పుడు అందరము సంశయాస్పదమైన పరిస్థితిలో ఉంచబడినాము". 50

మూ. అస్త్రేణ హనుమాన్ ముక్తో నాత్మానమవబుధ్యత,
కృష్యమాణస్తు రక్షోభిస్తైశ్చ బన్ధైర్నిపీడితః. 51

ప్ర. అ. అస్త్రేణ=అస్త్రముచేత, ముక్తః=విదువబడిన, హనుమాన్=హనుమంతుడు, తైః=ఆ, రక్షోభిః=రాక్షసులచేత, కృష్యమాణః=లాగబడుచున్నవాడై, బన్ధైః=బంధములచేత, నిపీడితః=పీడించబడుచున్నవాడై, ఆత్మానమ్=తనను, న అవబుధ్యత=తెలిసికొనలేదు.

తా. అస్త్రముచే విముక్తుడైన ఆ హనుమంతుడు రాక్షసులు తనను బంధించి ఈడ్చికొనిపోవుచుండగా తాను అస్త్రవిముక్తుడైనట్లు గ్రహించలేదు. 51

మూ. హన్యమానస్తతః క్రూరై రాక్షసైః కాష్ఠముష్టిభిః,
సమీపే రాక్షసేన్ద్రస్య ప్రాకృష్యత స వానరః. 52

ప్ర. అ. తతః=అటుపిమ్మట, సః వానరః=ఆ హనుమంతుడు, క్రూరైః=క్రూరులైన, రాక్షసైః=రాక్షసులచేత, కాష్ఠముష్టిభిః=కఱ్ఱలచేత, పిడికిళ్ళచేతను, హన్యమానః=కొట్టబడుచు, రాక్షసేన్ద్రస్య=రావణునియొక్క, సమీపమ్=సమీపమును గూర్చి, ప్రాకృష్యత=ఈడ్వబడెను.

తా. పిమ్మట, క్రూరులైన ఆ రాక్షసులు హనుమంతుణ్ణి కఱ్ఱలతోను, పిడికిళ్ళతోను కొట్టుచు రావణుని వద్దకు ఈడ్చుకొని వెళ్ళిరి. 52

మూ. అథేన్ద్రజిత్తం ప్రసమీక్ష్య ముక్త
మస్త్రేణ బద్ధం ద్రుమచీరసూత్రైః,
వ్యదర్శయత్తత్ర మహాబలం తం
హరిప్రవీరం సగణాయ రాజ్ఞే. 53

ప్ర. అ. అథ=అటుపిమ్మట, ద్రుమచీరసూత్రైః=నారచీరలచేతను, తాళ్లచేతను, బద్ధమ్=కట్టబడిన, తమ్=వానిని, అస్త్రేణ=అస్త్రముచేత, ముక్తమ్=విడవబడినవానినిగా, ప్రసమీక్ష్య=చూచి, ఇన్ద్రజిత్=ఇంద్రజిత్తు, మహాబలమ్=గొప్ప బలము

గల, తం హరిప్రవీరమ్=ఆ వానరశ్రేష్ఠుని, తత్ర=అక్కడ, సగణాయ=పరివారముతో కూడిన, రాజ్ఞే=రాజుకు, వ్యదర్శయత్=చూపెను.

తా. పిమ్మట ఇంద్రజిత్తు ఆ వానరశ్రేష్ఠుడు నారచీరలచేతను, తాళ్లచేతను కట్టబడి బ్రహ్మాస్త్రమునుండి విముక్తుడైనట్లు తెలిసికొని, ఆతనిని అట్లే బంధించి తీసికొని వెళ్ళి, పరివారసమేతుడైన రావణునకు చూపెను. 53

మూ. తం మత్తమివ మాతఙ్గం బద్ధం కపివరోత్తమమ్,
రాక్షసా రాక్షసేన్ద్రాయ రావణాయ న్యవేదయన్. 54

ప్ర. అ. మత్తమ్=మదించిన, మాతఙ్గమివ=ఏనుగ వలె ఉన్న, బద్ధమ్=కట్టబడిన, కపివరోత్తమమ్=కపివరులలో శ్రేష్ఠుడైన, తమ్=ఆ హనుమంతుని, రాక్షసాః=రాక్షసులు, రాక్షసేన్ద్రాయ=రాక్షసరాజైన, రావణాయ=రావణునకు, న్యవేదయన్=చూపిరి.

తా. మదించిన ఏనుగు వలె ఉన్న, బంధింపబడిన ఆ హనుమంతుని తీసికొని వెళ్ళి రాక్షసులు రావణునకు ఆ వానరుడితడే అని తెలిపిరి. 54

మూ. కోఽయం కస్య కుతో వాత్ర కిం కార్యం కో వ్యపాశ్రయః,
ఇతి రాక్షసవీరాణాం తత్ర సంజజ్ఞిరే కథాః. 55

ప్ర. అ. అయమ్=ఇతడు, కః=ఎవడు? కస్య=ఎవరికి సంబంధించినవాడు ? కుతో వా=ఎక్కడినుండి వచ్చినాడు ? అత్ర=ఇక్కడ, కిమ్=ఏమి, కార్యమ్=పని ? వ్యపాశ్రయః=వీనికి ఆశ్రయమిచ్చినవాడు, కః=ఎవడు? ఇతి=అని, తత్ర=అక్కడ, రాక్షసవీరాణామ్=రాక్షసవీరుల, కథాః=కథలు, సంజజ్ఞిరే=కలిగినవి.

తా. ఇతడు ఎవ్వరు ? ఎవరివాడు? ఎక్కడినుండి వచ్చినాడు ? ఇక్కడ ఇతనికి ఏమి పని ? ఇతని ఆశ్రయము ఏది? (సహాయకులు ఎవరు?) అని ఆ సభలోని రాక్షసవీరులు ఒకరితో ఒకరు అనుకొనిరి. 55

మూ. హన్యతాం దహ్యతాం వాపి భక్ష్యతామితి చాపరే,
రాక్షసాస్తత్ర సంక్రుద్ధాః పరస్పరమథాబ్రువన్. 56

ప్ర. అ. అథ=పిమ్మట, అపరే=మరికొందరు, రాక్షసాః=రాక్షసులు, సంక్రుద్ధాః=కోపించినవారై, హన్యతామ్=చంపబడుగాక, దహ్యతాం చాపి=కాల్చివేయబడు గాక ; భక్ష్యతామ్=భక్షింపబడుగాక, ఇతి=అని, పరస్పరమ్=పరస్పరము, అబ్రువన్=పలికిరి.

తా. మరికొందరు రాక్షసులు చాల కోపించినవారై, "వీనిని చంపండి; కాల్చివేయండి; భక్షించండి" అని ఒకరితో ఒకరు పలికిరి. 56

మూ. అతీత్య మార్గం సహసా మహాత్మా
స తత్ర రక్షోధిపపాదమూలే,
దదర్శ రాజ్ఞః పరిచారవృద్ధాన్
గృహం మహారత్నవిభూషితం చ. 57

ప్ర. అ. మహాత్మా=మహాత్ముడైన, సః=ఆ హనుమంతుడు, సహసా=శీఘ్రముగా, మార్గమ్=మార్గమును, అతీత్య=దాటి వెళ్ళి, తత్ర=అక్కడ, రాజ్ఞః=రావణునియొక్క, మహారత్నవిభూషితమ్=గొప్ప రత్నములచేత అలంకరించబడిన, గృహమ్=గృహమును, రక్షోధిపపాదమూలే=రావణుని పాదాల చెంత, పరిచారవృద్ధాన్=మంత్రివృద్ధులను, దదర్శ=చూచెను.

తా. ఆ మార్గమును శీఘ్రముగా దాటి వెళ్ళిన పిమ్మట మహాత్ముడైన ఆ హనుమంతుడు, అక్కడ మహారత్నములచేత అలంకరింపబడిన రావణుని గృహమును, ఆ రావణుని పాదాల చెంత మంత్రివృద్ధులను చూచెను. 57

మూ. స దదర్శ మహాతేజా రావణః కపిసత్తమమ్,
రక్షోభిర్వికృతాకారైః కృష్యమాణమితస్తతః. 58

ప్ర. అ. మహాతేజాః=గొప్ప తేజస్సు గల, సః రావణః=ఆ రావణుడు, వికృతాకారైః=వికృతమైన ఆకారము గల, రక్షోభిః=రాక్షసులచేత, ఇతస్తతః=ఇటు అటు, కృష్యమాణమ్=లాగబడుచున్న, కపిసత్తమమ్=వానర శ్రేష్ఠుడైన హనుమంతుని, దదర్శ=చూచెను.

తా. మహాతేజఃశాలియైన ఆ రావణుడు, వికృతములైన ఆకారములు గల రాక్షసులచేత ఇటు అటు లాగబడుచున్న హనుమంతుని చూచెను. 58

మూ. రాక్షసాధిపతిం చాపి దదర్శ కపిసత్తమః,
తేజోబలసమాయుక్తం తపన్త మివ భాస్కరమ్. 59

ప్ర.అ. కపిసత్తమః చ=వానరశ్రేష్ఠుడును, తేజోబలసమాయుక్తమ్=తేజస్సు, బలములతో కూడిన, తపన్తమ్=వెలుగుచున్న, భాస్కరమ్ ఇవ=సూర్యునివలె ఉన్న, రాక్షసాధిపతిమ్=రాక్షసరాజు రావణుని, దదర్శ=చూచెను.

తా. హనుమంతుడు కూడ తేజము, బలములతో కూడినవాడై ప్రకాశించు సూర్యునివలె నున్న రాక్షసరాజు రావణుని చూచెను. 59

మూ. స రోషసంవర్తితతామ్రదృష్టి
ర్దశాననస్తం కపిమన్వవేక్ష్య,

అథోపవిష్టాన్ కులశీలవృద్ధాన్
సమాదిశత్తం ప్రతి మన్త్రిముఖ్యాన్. 60

ప్ర. అ. సః దశాననః=ఆ రావణుడు, రోషసంవర్తితతామ్రదృష్టిః=రోష ముతో త్రిప్పబడిన ఎఱ్ఱని నేత్రములు కలవాడై, తం కపిమ్=ఆ హనుమంతుని, అన్వవేక్ష్య=చూచి, అథ=అటుపిమ్మట, ఉపవిష్టాన్=అక్కడ కూర్చొని యున్న, కులశీలవృద్ధాన్=కులముచేత శీలముచేత వృద్ధులైన, మంత్రి ముఖ్యాన్=ముఖ్యులైన మంత్రులను, తం ప్రతి=ఆ హనుమంతుని గూర్చి, సమాదిశత్=ఆజ్ఞాపించెను.

తా. ఆ రావణుడు కోపముతో, ఎఱ్ఱనైన నేత్రములను త్రిప్పుచు, ఆ హనుమంతుని చూచి, పిమ్మట అక్కడ కూర్చుని యున్న, కులముచేతను, శీలముచేతను పెద్దవారైన ముఖ్యులైన మంత్రులను, "ఈతనిని గూర్చి తెలిసి కొనండి"అని ఆజ్ఞాపించెను. 60

మూ. యథాక్రమం తైః స కపిర్విపృష్టః
కార్యార్థమర్థస్య చ మూలమాదౌ,
నివేదయామాస హరీశ్వరస్య
దూతః సకాశాదహమాగతోఽస్మి. 61

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే సున్దరకాణ్డే
అష్టచత్వారింశః సర్గః.

ప్ర. అ. తైః=ఆ మంత్రులచేత, యథాక్రమమ్=క్రమానుసారముగా కార్యార్థమ్=అతడు వచ్చిన పనిని గూర్చి, అర్థస్య=కార్యముయొక్క, మూలమ్=మూలమును గూర్చి, విపృష్టః=అడగబడిన, సః కపిః=ఆ హనుమంతుడు, హరీశ్వరస్య సకాశాత్=సుగ్రీవుని వద్దనుండి, ఆగతః అస్మి=వచ్చినాను అని, ఆదౌ=ముందుగా, నివేదయామాస=తెలిపెను.

తా. "నీవు వచ్చిన పని ఏమి ? ఆ పనిపై పంపినవారెవరు"? అని ఆ మంత్రులు క్రమముగా ప్రశ్నింపగా హనుమంతుడు - "నేను సుగ్రీవుని దూతగా వచ్చినాను" అని ముందుగా చెప్పెను. 61

"బాలానందిని"అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు
సుందరకాండలో నలుబదిఎనిమిదవ సర్గ సమాప్తము.

అథ ఏకోనపఞ్చాశః సర్గః

[ప్రభావశాలియైన రావణుని రూపమును చూడగానే హనుమంతుని మనస్సులో అనేక విధములైన భావములు కలుగుట].

మూ. తతః స కర్మణా తస్య విస్మితో భీమవిక్రమః,
హనుమాన్ క్రోధతామ్రాక్షో రక్షోధిపమవైక్షత. 1

ప్ర. అ. తతః=అటుపిమ్మట, భీమవిక్రమః=భయంకరమైన పరాక్రమము గల, సః హనుమాన్=ఆ హనుమంతుడు, తస్య=రావణుని యొక్క, తేన కర్మణా=ఆ కార్యము చేత, విస్మితః=ఆశ్చర్యపడినవాడై, క్రోధతామ్రాక్షః=క్రోధముచేత ఎఱ్ఱనైన నేత్రములు గలవాడై, రక్షోధిపమ్=ఆ రావణుని, అవైక్షత=చూచెను.

తా. భయంకరమైన పరాక్రమము గల హనుమంతుడు "ఈతడు నన్ను కూడ బంధింపచేసి తన దగ్గరకు రప్పించుకొన్నాడు కదా" ! అని ఆశ్చర్య పడుచు క్రోధముచేత కళ్ళు ఎఱ్ఱబడగా, ఆ రావణుని చూచెను. 1

మూ. భ్రాజమానం మహార్హేణ కాఞ్చనేన విరాజతా,
ముక్తాజాలావృతేనాథ మకుటేన మహాద్యుతిమ్. 2

ప్ర. అ. (ఈ శ్లోకము మొదలు 14 వ శ్లోకం వరకు ఉన్న శ్లోక-లకు ఒకటే అన్వయము. ఈశ్లోకాలలో ఉన్న ద్వితీయాంతాలన్నీ 14వ శ్లోకంలో ఉన్న 'రాక్షసపతిమ్' అను దానికి విశేషణములు). మహార్హేణ=గొప్ప ప్రాశస్త్యము కలదీ, కాఞ్చనేన=బంగారు వికారమైనదీ, విరాజతా=ప్రకాశించుచున్నదీ, అథ=మరియు ముక్తాజాలావృతేన=ముత్యాల సముదాయముచేత చుట్టబడినదీ అయిన, మకుటేన=కిరీటముతో, భ్రాజమానమ్=ప్రకాశించుచున్నవాడు, మహాద్యుతిమ్=గొప్ప కాంతి కలవాడూ అయిన (రావణుని చూచెను).

తా. గొప్పకాంతి గల ఆ రావణుదు చాల ప్రశంసింప దగిన, చుట్టూ ముత్యాలు కట్టిన, మెరిసిపోవుచున్న బంగారు కిరీటముతో ప్రకాశించుచుండెను.

మూ. వజ్రసంయోగసంయుక్తైర్మహార్హమణివిగ్రహైః,
హైమైరాభరణైశ్చిత్రైర్మనసేవ ప్రకల్పితైః. 3

ప్ర. అ. వజ్రసంయోగసంయుక్తైః=వజ్రముల పొదుగుటతో కూడిన, మహార్హమణివిగ్రహైః=శ్రేష్ఠమైన మణులు గల రూపములు గల, మనసా=

మనస్సుచేత, ప్రకల్పితైరివ=కల్పింపబడినవా అన్నట్లున్న, చిత్రైః=విచిత్రములైన, హైమైః=బంగారువికారములైన, ఆభరణైః=అలంకారములతో ఉన్న (రావణుని చూచెను)

తా. ఆ రావణుడు వజ్రములు, చాల ప్రశస్తములైన మణులు పొదిగిన, మనస్సుతో నిర్మించినవా అన్నట్లున్న, విచిత్రములైన బంగారు ఆభరణములు అలంకరించుకొని ఉండెను. 3

మూ. మహార్హక్షౌమసంవీతం రక్తచన్దనరూషితమ్,
స్వనులిప్తం విచిత్రాభిర్వివిధాభిశ్చ భక్తిభిః. 4

ప్ర. అ. మహార్హక్షౌమసంవీతమ్=శ్రేష్ఠము లైన తెల్లని పట్టుబట్టలచే కట్టబడినవాడు, రక్తచన్దనరూషితమ్=ఎఱ్ఱని చందనముచేత పూయబడినవాడు, విచిత్రాభిః=విచిత్రములైన, వివిధాభిశ్చ=అనేక విధములైన, భక్తిభిః=(శరీరముపై వేరు వేరు రంగులతో వేసిన) రచనలచేత, స్వనులిప్తమ్=బాగుగా పూయబడినవాడు అయిన (రావణుని చూచెను)

తా. ఆ రావణుడు శ్రేష్ఠములైన పట్టుబట్టలు ధరించి ఎఱ్ఱని చందనము పూసుకొనెను. ఆతని శరీరముపై అనేక విధముల విచిత్రములైన బొమ్మలు చిత్రింపబడి ఉండెను. 4

మూ. విచిత్రం దర్శనీయైశ్చ రక్తాక్షైర్భీమదర్శనైః,
దీప్తతీక్ష్ణమహాదంష్ట్రైః ప్రలమ్బదశనచ్ఛదైః. 5
శిరోభిర్దశభిర్వీరం భ్రాజమానం మహౌజసమ్,
నానావ్యాళసమాకీర్ణైః శిఖరైరివ మన్దరమ్. 6

ప్ర. అ. దర్శనీయైః=సుందరమైనవి, రక్తాక్షైః=ఎఱ్ఱని కళ్ళు కలవి, భీమదర్శనైః=భయంకరమైన దర్శనము కలవి, దీప్తతీక్ష్ణమహాదంష్ట్రైః=ప్రకాశించుచున్న తీక్ష్ణము లైన పెద్ద కోరలు కలవి, ప్రలమ్బదశనచ్ఛదైః=వ్రేలాడుచున్న పెదవులు కలవి అయిన, దశభిః=పది, శిరోభిః=శిరస్సులతో, విచిత్రమ్=విచిత్రముగా ఉన్నవాడూ, నానావ్యాళసమాకీర్ణైః=అనేక క్రూరమృగములతో వ్యాప్తములైన, శిఖరైః=శిఖరములతో, మన్దరమ్ ఇవ=మందర పర్వతము వలె, భ్రాజమానం=ప్రకాశించుచున్నవాడు, మహౌజసమ్=గొప్పతేజస్సు కలవాడు, వీరమ్=వీరుడు అయిన (రావణుని చూచెను).

తా. మహాతేజఃశాలి యైన ఆ రావణుడు, అనేక క్రూరమృగములతో నిండిన శిఖరములతో మందరపర్వతము వలె, సుందరములు, ఎఱ్ఱని కళ్లు కలవి,

చూచుటకు భయంకరములుగా ఉన్నవి, ప్రకాశించుచున్న తీక్ష్ణమైన కోరలు గలవి, వ్రేలాడుచున్న పెదవులు గలవి అయిన పది తలలతో విచిత్రముగా ప్రకాశించుచుండెను. 5, 6

మూ. నీలాఞ్జనచయప్రఖ్యం హారేణోరసి రాజతా,
పూర్ణచన్ద్రాభవక్త్రేణ సబాలార్కమివామ్బుదమ్. 7

ప్ర. అ. నీలాఞ్జనచయప్రఖ్యమ్=నల్లని కాటుక గుట్ట వలె ఉన్నవాడు, ఉరసి=వక్షఃస్థలమునందు, రాజతా=ప్రకాశించుచున్న, హారేణ=హారముతోను, పూర్ణ చన్ద్రాభవక్త్రేణ=పూర్ణచంద్రుని వంటి కాంతి గల ముఖముతోను, సబాలార్కమ్=బాల సూర్యునితో కూడిన, అమ్బుదమివ=మేఘము వలె ఉన్నవాడు అయిన (రావణుని చూచెను).

తా. ఆతని వక్షఃస్థలముపై ముత్యాలహారము ప్రకాశించుచుండెను. ముఖము పూర్ణచంద్రుడు వలె ఉండెను. నల్లని కాటుక కొండవలె ఉన్న అట్టి రావణుడు బాలసూర్యునితో కూడిన మేఘము వలె ఉండెను. 7

మూ. బాహుభిర్బద్ధకేయూరైశ్చన్దనోత్తమరూషితైః,
భ్రాజమానాఙ్గదైః పీనైః పఞ్చశీర్షైరివోరగైః. 8

ప్ర. అ. బద్ధకేయూరైః=కట్టబడిన బాహుపురులు కలవి, చన్దనోత్తమ రూషితైః=ఉత్తమమైన చందనముచేత పూయబడినవి, భ్రాజమానాఙ్గదైః=ప్రకాశిం చుచున్న అంగదములు కలవి, పీనైః=బలిసినవి, పఞ్చశీర్షైః=ఐదు శిరస్సులు గల, ఉరగైరివ=సర్పముల వలె ఉన్న, బాహుభిః=బాహువులతో కూడినవాడూ (అయిన రావణుని చూచెను).

తా. బాహుపురులు ధరించిన, బలిసిన, ఆతని బాహువులకు ఉత్తమమైన చందనము పూయబడెను. అవి అంగదములతో ప్రకాశించుచుండెను. ఆ బాహువులు ఐదు తలల సర్పముల వలె ఉండెను.

వి. "కేయూర" "అఙ్గద" శబ్దములు పర్యాయపదములు. 'బాహుపురులు' అని అర్థము. ఇక్కడ రెండు పదాలు ప్రయోగించుటచే వేరు వేరు రకాల దండ కడియములు అని అర్థము చెప్పుకొనవలెను. 8

మూ. మహతి స్ఫాటికే చిత్రే రత్నసంయోగసంస్కృతే,
ఉత్తమాస్తరణాస్తీర్ణే సూపవిష్టం వరాసనే. 9

ప్ర. అ. రత్నసంయోగసంస్కృతే=రత్నములు పొదుగుటచేత, అలంకరిం పబడినదీ, చిత్రే=చిత్రవర్ణము కలదీ, ఉత్తమాస్తరణాస్తీర్ణే=ఉత్తమమైన ఆస్తరణము

చేత కప్పబడినదీ, స్ఫాటికే=స్ఫటికమణి వికారమూ అయిన, మహతి=గొప్ప, వరాసనే=శ్రేష్ఠమైన ఆసనమునందు, సూపవిష్టమ్=బాగుగా కూర్చున్నవాడు అయిన (రావణుని చూచెను).

తా. ఆ రావణుడు గొప్ప స్ఫటికవికారమైన ఆసనము మీద కూర్చొని ఉండెను. ఆ ఆసనమునకు రత్నములను పొదుగుటచేత అది చిత్రవర్ణముగా ఉండెను. దానిపై ఉత్తమమైన ఆస్తరణము కప్పబడియుండెను. 9

మూ. అలంకృతాభిరత్యర్థం ప్రమదాభిః సమన్తతః,
వాలవ్యజనహస్తాభిరారాత్సముపసేవితమ్. 10

ప్ర. అ. అత్యర్థమ్=మిక్కిలి, అలంకృతాభిః=అలంకరించబడిన, వాలవ్యజన హస్తాభిః=వింజామరలు హస్తములందుగల, ప్రమదాభిః=స్త్రీలచేత, సమన్తతః=నలు వైపుల, ఆరాత్=దగ్గరగా, సముపసేవితమ్=సేవించబడిన (రావణుని చూచెను.)

తా. చక్కగా అలంకరించుకొన్న స్త్రీలు, వింజామరలు, హస్తములతో గ్రహించి, దగ్గర రావణుని చుట్టూ నిలబడి ఆతనిని సేవించుచుండిరి. 10

మూ. దుర్ధరేణ ప్రహస్తేన మహాపార్శ్వేన రక్షసా,
మన్త్రిభిర్మన్త్రితత్త్వజ్ఞైర్నికుమ్భేన చ మన్త్రిణా. 11

ఉపోపవిష్టం రక్షోభిశ్చతుర్భిర్బలదర్పితైః,
కృత్స్నం పరివృతం లోకం చతుర్భిరివ సాగరైః. 12

ప్ర. అ. దుర్ధరేణ=దుర్ధరునిచేతను, ప్రహస్తేన=ప్రహస్తునిచేతను, రక్షసా=రాక్షసుడైన, మహాపార్శ్వేన=మహాపార్శ్వునిచేతను, మన్త్రిణా=మంత్రియైన, నికుమ్భేన=నికుంభునిచేతను, మన్త్రితత్త్వజ్ఞైః=ఆలోచనల తత్త్వము ఎరిగిన, మన్త్రిభిః=మంత్రులైన, బలదర్పితైః=బలముచేత గర్వించిన, చతుర్భిః=నలుగురు, రక్షోభిః=రాక్షసులచేత, ఉపోపవిష్టమ్=సమీపమున కూర్చుండి చుట్టబడినవాడు, చతుర్భిః=నాలుగు, సాగరైః=సముద్రములచేత, పరివృతమ్=చుట్టబడిన, కృత్స్నమ్=సమస్తమైన లోకమ్ ఇవ=లోకము వలె ఉన్నవాడూ అయిన (రావణుని చూచెను).

తా. దుర్ధరుడు, ప్రహస్తుడు, మహాపార్శ్వుడు, నికుంభుడు అను ఆలోచనల తత్త్వము తెలిసిన, బలముచేత గర్వితులైన, నలుగురు రాక్షసమంత్రులు ఆతని చుట్టు దగ్గరనే కూర్చొని యుండుటచే ఆ రావణుడు చుట్టూ నాలుగు సముద్రములు ఉన్న సమస్తమైన లోకము వలె ఉండెను. 11, 12

మూ. మన్త్రిభిర్మన్త్రితత్త్వజ్ఞైరన్యైశ్చ శుభబుద్ధిభిః,
అన్వాస్యమానం రక్షోభిః సురై రివ సురేశ్వరమ్. 13

ప్ర. అ. మన్త్రితత్త్వజ్ఞైః=ఆలోచనల తత్త్వము ఎరిగినవారు, శుభబుద్ధిభిః=మంగళకరమైన బుద్ధి కలవారు, మన్త్రిభిః=మంత్రులూ అయిన, అన్యైః=ఇతరులైన, రక్షోభిః=రాక్షసులచేత, సురైః=దేవతలచేత, సురేశ్వరమ్ ఇవ=దేవేంద్రుడు వలె, అన్వాస్యమానమ్=దగ్గర కూర్చొని సేవింపబడుచున్నవాడూ అయిన (రావణుని చూచెను).

తా. ఆలోచనల యథార్థస్వరూపము చక్కగా తెలిసినవారు, మంగళకరమైన బుద్ధి కలవారు అయిన మరికొందరు రాక్షసమంత్రులు కూడ ఆ రావణుని ప్రక్కనే కూర్చుండి, దేవతలు దేవేంద్రుని సేవించినట్లు సేవించుచుండిరి. 13

మూ. అపశ్యద్రాక్షసపతిం హనుమానతితేజసమ్,
విష్ఠితం మేరుశిఖరే సతోయమివ తోయదమ్. 14

ప్ర. అ. హనుమాన్=హనుమంతుడు, అతితేజసమ్=గొప్ప తేజస్సు కలవాడు, మేరుశిఖరే=మేరుపర్వతశిఖరమునందు, విష్ఠితమ్=నిలచి ఉన్న, సతోయమ్=జలముతో కూడిన, తోయదమ్ ఇవ=మేఘము వలె ఉన్నవాడూ అయిన, రాక్షసపతిమ్=రావణుని, అపశ్యత్=చూచెను.

తా. అతితేజఃశాలియైన ఆ రావణుడు, ఉన్నతమైన ఆసనము మీద, మేరు పర్వతశిఖరముమీద ఉన్న నీటితో నిండిన, మేఘము వలె ఉండెను. అట్టి రావణుని హనుమంతుడు చూచెను. 14

మూ. స తైః సంపీడ్యమానోఽపి రక్షోభిర్భీమవిక్రమైః,
విస్మయం పరమం గత్వా రక్షోధిపమవైక్షత. 15

ప్ర. అ. సః=హనుమంతుడు, భీమవిక్రమైః=భయంకరమైన పరాక్రమము గల, రక్షోభిః=రాక్షసులచేత, సంపీడ్యమానోఽపి=పీడింపబడుచున్నను, పరమమ్=గొప్ప, విస్మయమ్=ఆశ్చర్యమును, గత్వా=పొంది, రక్షోధిపమ్=రావణుని, అవైక్షత=చూచెను.

తా. భయంకరమైన పరాక్రమము గల ఆ రాక్షసులొక మూల పీడించుచున్నను ఆ హనుమంతుడా రావణుని ఆశ్చర్యముతో చూచెను. 15

మూ. భ్రాజమానం తతో దృష్ట్వా హనుమాన్రాక్షసేశ్వరమ్,
మనసా చిన్తయామాస తేజసా తస్య మోహితః. 16

ప్ర. అ. తతః=అటుపిమ్మట, హనుమాన్=హనుమంతుడు, భ్రాజమానమ్=ప్రకాశించుచున్న, రాక్షసేశ్వరమ్=రాక్షసరాజును, దృష్ట్వా=చూచి, తస్య=ఆతనియొక్క, తేజసా=తేజస్సు చేత, మోహితః=మోహింపచేయబడినవాడై, మనసా=మనస్సుతో, చిన్తయామాస=ఆలోచించెను.

తా. పిమ్మట, హనుమంతుడు, ప్రకాశించుచున్న రావణుని చూచి ఆతని తేజస్సుచేత మోహము చెందినవాడై మనస్సులో ఇట్లు అనుకొనెను. 16

మూ. అహో రూపమహో ధైర్యమహో సత్త్వమహో ద్యుతిః,
అహో రాక్షసరాజస్య సర్వలక్షణయుక్తతా. 17

ప్ర. అ. రాక్షసరాజస్య=ఈ రాక్షసరాజుయొక్క, రూపమ్=రూపము, అహో=ఎంత ఆశ్చర్యకరమైనది ! ధైర్యమ్=ధైర్యము, అహో=ఎంత ఆశ్చర్యకరమైనది ! సత్త్వమ్=బలము, అహో=ఎంత ఆశ్చర్యకరమైనది ! ద్యుతిః=కాంతి, అహో=ఎంత ఆశ్చర్యకరమైనది ! సర్వలక్షణయుక్తతా=సమస్త లక్షణములతో కూడియుండుట. అహో=ఎంత ఆశ్చర్యకరమైనది !

తా. ఆహా ! ఏమి ఈ రావణుని రూపము ! ఏమి ధైర్యము ! ఏమి బలము ! ఏమి కాంతి ! ఏమి సర్వలక్షణసంపన్నత్వము ! 17

మూ. యద్యధర్మో న బలవాన్ స్యాదయం రాక్షసేశ్వరః,
స్యాదయం సురలోకస్య సశక్రస్యాపి రక్షితా. 18

ప్ర. అ. అయమ్=ఈ, అధర్మః=అధర్మము, బలవాన్=బలము కలది, న స్యాద్యది=కాకున్నచో, అయమ్=ఈ, రాక్షసేశ్వరః=రాక్షసరాజు, సశక్రస్య=దేవేంద్రసహితమైన, సురలోకస్యాపి=దేవలోకమునకు కూడ, రక్షితా=రక్షకుడు, స్యాత్=కావచ్చును.

తా. వీనిలో బలవత్తరమైన ఈ అధర్మమే లేకున్నచో ఈ రాక్షసరాజు ఇంద్రునితో సహా దేవలోకానికంతటికీ ప్రభువు అయి ఉండెడివాడు. 18

మూ. అస్య క్రూరైర్నృశంసైశ్చ కర్మభిర్లోకకుత్సితైః,
సర్వే బిభ్యతి ఖల్వస్మాల్లోకాః సామరదానవాః, 19
అయం హ్యుత్సహతే క్రుద్ధః కర్తుమేకార్ణవం జగత్.

ప్ర. అ. క్రూరైః=క్రూరములు, నృశంసైశ్చ=మానవులను హింసించేవి, లోకకుత్సితైః=లోకములో నింద్యములూ అయిన, అస్య కర్మభిః=ఈతని పనుల చేత, సామరదానవాః=అమరులతోను దానవులతోను కూడిన, సర్వే=సమస్తమైన, లోకాః=లోకములు, అస్మాత్=వీనినుండి, బిభ్యతి హి=భయపడుచున్నవి కదా!

అయమ్=ఇతడు, క్రుద్ధః=కోపించినవాడై, జగత్=జగత్తును, ఏకార్ణవమ్=ఒకే సముద్రమునుగా, కర్తుమ్=చేయుటకు, ఉత్సహతే హి=సమర్థుడగును కదా !

తా. ఇతడు లోకములో నిందింపబడు క్రూరకర్మలతో అందరిని హింసించుచుండుటచేత దేవతలతో, దానవులతో సహా సకలలోకములు ఇతని నుండి భయపడుచున్నవి. కోపగించినచో ఇతడు ఈ జగత్తునంతనూ ఒక్క సముద్రముగా చేసి వేయగలడు. 19

మూ. ఇతి చిన్తాం బహువిధామకరోన్మతిమాన్ హరిః, 20
దృష్ట్వా రాక్షసరాజస్య ప్రభావమమితౌజసః.

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే సున్దరకాణ్డే
ఏకోనపఞ్చాశః సర్గః.

ప్ర. అ. అమితౌజసః=అపరిమితమైన తేజస్సు గల, రాక్షసరాజస్య=రాక్షసరాజుయొక్క, ప్రభావమ్=ప్రభావమును, దృష్ట్వా=చూచి, మతిమాన్=బుద్ధిమంతుడైన, హరిః=హనుమంతుడు, ఇతి=ఇట్లు, బహువిధామ్=అనేక విధములైన, చిన్తామ్=చింతను, అకరోత్=చేసెను.

తా. బుద్ధిమంతుడైన హనుమంతుడు, అపరిమితమైన తేజస్సు గల ఆ రావణుని ప్రభావము చూచి, ఈ విధముగా అనేకములైన ఆలోచనలు చేసెను.

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్ర వ్యాఖ్యానమునందు
సుందరకాండలో నలుబదితొమ్మిదవ సర్గ సమాప్తము.

అథ పఞ్చాశః సర్గః

[రావణుడు ప్రేరేపింపగా లంకకు ఎందుకు వచ్చినావని ప్రహస్తుడు హనుమంతుని ప్రశ్నించుట, రాముని దూతగా వచ్చినానని హనుమంతుడు చెప్పుట.]

మూ. తముద్వీక్ష్య మహాబాహుః పిఙ్గాక్షం పురతః స్థితమ్,
కోపేన మహతావిష్టో రావణో లోకరావణః, 1
శఙ్కాహృతాత్మా దధ్యౌ స కపీన్ద్రం తేజసావృతమ్.

ప్ర. అ. మహాబాహుః=గొప్పబాహువులు కల, లోకరావణః=లోకములను ఏడ్పించిన, సః రావణః=ఆ రావణుడు, పురతః=ఎదుట, స్థితమ్=నిలచిఉన్న, తం పిఙ్గాక్షమ్=ఆ వానరుని, ఉద్వీక్ష్య=తల ఎత్తి చూచి, మహతా=గొప్ప, కోపేన=కోపముతో, ఆవిష్టః=ఆవేశింపబడినవాడై, శఙ్కాహృతాత్మా=శంకచేత హరింపబడిన మనస్సు కలవాడై, తేజసా=తేజస్సు చేత, ఆవృతమ్=కప్పబడియున్న, కపీన్ద్రమ్=వానరశ్రేష్ఠునిగూర్చి, దధ్యౌ=ఇట్లు ఆలోచించెను.

తా. గొప్ప బాహువులు కలవాడు, లోకములను ఏడ్పించినవాడు అయిన ఆ రావణుడు తన ఎదుట నిలచిన ఆ వానరుని, తలయెత్తి చూచి, కోపావిష్టుడై మనస్సులో ఏవేవో శంకలు కలుగగా, గొప్ప తేజస్సు చేత ఆవరింపబడి ఉన్న ఆ వానరశ్రేష్ఠుని గూర్చి ఈ విధముగా ఆలోచించెను. 1

మూ. కిమేష భగవాన్నన్దీ భవేత్సాక్షాదిహాగతః, 2
యేన శప్తోఽస్మి కైలాసే మయా సంచాలితే పురా,
సోఽయం వానరమూర్తిః స్యాత్కింస్విద్బాణో మహాసురః. 3

ప్ర. అ. ఏషః=ఇతడు, పురా=పూర్వము, మయా=నాచేత, కైలాసే=కైలాసము, సంచాలితే=కదల్చబడిన దగుచుండగా, యేన=ఎవ్వనిచేత, శప్తః అస్మి=శపించబడితినో, అట్టి, భగవాన్=పూజ్యుడైన, సాక్షాత్=సాక్షాత్తూ, ఇహ=ఇక్కడికి, ఆగతః=వచ్చిన, నన్దీ=నందీశ్వరుడు, కిం భవేత్=అయిఉండునా ? సః అయమ్=అట్టి ఇతడు, వానరమూర్తిః=వానరమూర్తి ధరించిన, మహాసురః=మహాసురుడైన, బాణః=బాణుడు, స్యాత్ కిం స్విత్=అయిఉండునా?

తా. "పూర్వము నేను కైలాసపర్వతమును కదల్చినపుడు నన్ను శపించిన నందియే ఈ రూపముతో ఇక్కడికి వచ్చినాడా, లేక ఇతడు వానర రూపముతో వచ్చిన మహాసురుడైన బాణుడా !" 2, 3

మూ. స రాజా రోషతామ్రాక్షః ప్రహస్తం మన్త్రిసత్తమమ్,
కాలయుక్తమువాచేదం వచోఽవిపులమర్థవత్. 4

ప్ర. అ. సః రాజా=ఆ రాజు, రోషతామ్రాక్షః=రోషముతో ఎఱ్ఱనైన నేత్రములు కలవాడై, మన్త్రిసత్తమమ్=మంత్రిశ్రేష్ఠుడైన, ప్రహస్తమ్=ప్రహస్తుని గూర్చి, కాలయుక్తమ్=కాలమునకు తగినది, అర్థవత్=అర్థము కలది, అవిపులమ్=సంక్షిప్తమూ అయిన, ఇదం వచః=ఈ వచనమును, ఉవాచ=పలికెను.

తా. ఆ రావణుడు, రోషముచేత ఎఱ్ఱబడిన నేత్రములతో, మంత్రిశ్రేష్ఠుడైన ప్రహస్తునితో, కాలానుగుణము, అర్థపూర్ణము, సంక్షిప్తము అయిన ఈ మాటపలికెను.

మూ. దురాత్మా పృచ్ఛ్యతామేష కుతః కిం వాత్ర కారణమ్,
వనభఙ్గే చ కోఽస్యార్థో రాక్షసీనాం చ తర్జనే. 5

ప్ర. అ. ఏషః=ఈ, దురాత్మా=దురాత్ముడు, పృచ్ఛ్యతామ్=అడగబడుగాక. కుతః=ఎక్కడినుండి వచ్చినాడు? అత్ర=ఈ వచ్చుటయందు, కిం కారణమ్=కారణమేమి? వనభఙ్గే చ=వనమును విరచుటయందు, రాక్షసీనామ్=రాక్షసస్త్రీల, తర్జనే=భయపెట్టుటయందు, అస్య=వీనికి, అర్థః=ప్రయోజనము, కః=ఏది?

తా. "ఈ దురాత్ముడు ఎక్కడనుండి వచ్చినాడో, ఎందుకు వచ్చినాడో, వనమును విరిచివేసి రాక్షసస్త్రీలను ఎందుకు భయపెట్టినాడో అడుగుము". 5

మూ. మత్పురీమప్రధృష్యాం వాగమనే కిం ప్రయోజనమ్,
ఆయోధనే వా కిం కార్యం పృచ్ఛ్యతామేష దుర్మతిః. 6

ప్ర. అ. అప్రధృష్యామ్=ఎదిరింపశక్యము కాని, మత్పురీమ్=నా పట్టణమును గూర్చి, ఆగమనే=వచ్చుటయందు, కిం ప్రయోజనమ్=ఏమి ప్రయోజనము ? ఆయోధనే వా=యుద్ధము చేయుటయందు, కిం కార్యమ్=ఏమి కార్యము? ఏషః దుర్మతిః=ఈ దుర్బుద్ధి, పృచ్ఛ్యతామ్=ప్రశ్నించబడుగాక.

తా. "ఎదిరింప శక్యము కాని నా నగరమునకు ఏ ప్రయోజనమును ఉద్దేశించి వచ్చినాడో, ఎందుకు యుద్ధము చేసినాడో ఈ దుర్మతిని అడుగుము".

మూ. రావణస్య వచః శ్రుత్వా ప్రహస్తో వాక్యమబ్రవీత్.
సమాశ్వసిహి భద్రం తే న భీః కార్యా త్వయా కపే. 7

ప్ర. అ. ప్రహస్తః=ప్రహస్తుడు, రావణస్య=రావణునియొక్క, వచః=వచనమును, శ్రుత్వా=విని, వాక్యమ్=వాక్యమును, అబ్రవీత్=పలికెను. కపే=ఓ ! వానరుడా ! సమాశ్వసిహి=ఊరడిల్లుము. తే=నీకు, భద్రమ్=క్షేమమగుగాక. త్వయా=నీచేత, భీః=భయము, న కార్యా=చేయదగినది కాదు.

తా. రావణుని మాటలు విని ప్రహస్తుడు హనుమంతునితో ఇట్లు పలికెను. "ఓ ! వానరుడా ! ఊరడిల్లుము (కంగారుపడకుము). నీకు క్షేమమగుగాక. నీవేమీ భయపడనవసరము లేదు". 7

మూ. యది తావత్త్వమిన్ద్రేణ ప్రేషితో రావణాలయమ్,
తత్త్వమాఖ్యాహి మా భూత్తే భయం వానర మోక్ష్యసే. 8

ప్ర. అ. వానర=వానరుడా !త్వమ్=నీవు, ఇన్ద్రేణ=ఇంద్రునిచేత, రావణాలయమ్=రావణుని గృహమును గూర్చి, ప్రేషితః యది తావత్=పంపబడి ఉన్నట్లయితే, తత్త్వమ్=యథార్థమును, ఆఖ్యాహి=చెప్పుము. తే=నీకు, భయమ్=భయము, మా భూత్=కలగకుండుగాక. మోక్ష్యసే=విడువబడగలవు.

తా. "ఓ ! వానరుడా ! నీవు ఇంద్రుడు పంపగా ఈ లంకకు వచ్చినావా? యథార్థము చెప్పుము. భయపడకుము. నిన్ను విడిచివేయగలము".8

మూ. యది వైశ్రవణస్య త్వం యమస్య వరుణస్య చ,
చారరూపమిదం కృత్వా ప్రవిష్టో నః పురీమిమామ్, 9
విష్ణునా ప్రేషితో వాపి దూతో విజయకాంక్షిణా.

ప్ర. అ. ఇదమ్=ఈ, చారరూపమ్=గూఢచారి రూపమును, కృత్వా=చేసి (ధరించి), నః=మాయొక్క, ఇమాం పురీమ్=ఈ పట్టణమును, ప్రవిష్టః=ప్రవేశించిన, త్వమ్=నీవు, వైశ్రవణస్య=కుబేరునకు సంబంధించినవాడవా, యమస్య=యమునకు సంబంధించినవాడవా, వరుణస్య చ=వరుణునకు సంబంధించినవాడవా, విజయకాంక్షిణా=విజయమును కోరుచున్న, విష్ణునా=విష్ణువుచేత, దూతః=దూతగా, ప్రేషితో వాపి=పంపబడినావా ?

తా. "ఈ గూఢచారిరూపముతో మా నగరములోనికి ప్రవేశించినావు. నిన్ను కుబేరుడు పంపినాడా? యముడు పంపినాడా? వరుణుడు పంపినాడా? లేక, విజయమును కోరుచు విష్ణువు నిన్ను దూతగా పంపినాడా"? 9

మూ. న హి తే వానరం తేజో రూపమాత్రం తు వానరమ్. 10
తత్త్వతః కథయస్వాద్య తతో వానర మోక్ష్యసే.

ప్ర. అ. వానర=ఓ ! వానరుడా ! తే=నీయొక్క, రూపమాత్రం తు=రూపము మాత్రమే, వానరమ్=వానరునికి సంబంధించినది. తేజః=తేజస్సు, వానరమ్=వానరునకు సంబంధించినది, న హి=కాదు కదా. అద్య=ఇప్పుడు, తత్త్వతః=యథార్థముగా, కథయస్వ=చెప్పుము. తతః=అటుపిమ్మట, మోక్ష్యసే=విడువబడగలవు.

తా. "ఓ ! వానరా ! నీ రూపము వానర రూపము వలె ఉన్నది. కాని నీ తేజస్సు మాత్రము వానరులకుండదగినది కాదు. ఇప్పుడు సత్యము చెప్పుము. పిదప నిన్ను విడిచి పెట్టివేసెదము". 10

మూ. అనృతం వదతశ్చాపి దుర్లభం తవ జీవితమ్, 11
అథవా యన్నిమిత్తస్తే ప్రవేశో రావణాలయే.

ప్ర. అ. తవ=నీవు, అనృతమ్=అసత్యమును, వదతః=చెప్పినచో, జీవితమ్=జీవితము, దుర్లభమ్=దుర్లభమైనది. అథవా=లేదా, రావణాలయే=రావణుని గృహములో, తే ప్రవేశః=నీ ప్రవేశము, యన్నిమిత్తః=ఏ నిమిత్తము కలదో (అది చెప్పుము).

తా. "అసత్యము చెప్పినచో నీవు జీవించుట కష్టము. లేదా ఎవ్వరూ పంపకుండా నువ్వే వచ్చినచో, రావణగృహములోనికి ఎందుకు వచ్చినావో చెప్పుము".

మూ. ఏవముక్తో హరిశ్రేష్ఠస్తదా రక్షోగణేశ్వరమ్, 12
అబ్రవీన్నాస్మి శక్రస్య యమస్య వరుణస్య వా,
ధనదేన న మే సఖ్యం విష్ణునా నాస్మి చోదితః, 13
జాతిరేవ మమ త్వేషా వానరోఽహమిహాగతః.

ప్ర. అ. ఏవమ్=ఇట్లు, ఉక్తః=పలకబడిన, హరిశ్రేష్ఠః=హనుమంతుడు, తదా=అప్పుడు, రక్షోగణేశ్వరమ్=రాక్షసాధిపతియైన రావణుని గూర్చి, అబ్రవీత్=పలికెను. శక్రస్య=ఇంద్రునకు గాని, యమస్య=యమునకు గాని, వరుణస్య=వరుణునకు గాని సంబంధించినవాడను, నాస్మి=కాను. మే=నాకు, ధనదేన=కుబేరునితో, సఖ్యమ్=స్నేహము, న=లేదు. విష్ణునా=విష్ణువుచేత, చోదితః=ప్రేరేపింపబడినవాడను, న=కాను. ఏషా=ఇది, మమ=నాయొక్క, జాతిరేవ=జాతియే. అహమ్=నేను, వానరః=వానరుడను, ఇహ=ఇక్కడికి, ఆగతః=వచ్చినాను.

తా. ప్రహస్తుని మాటలు విని హనుమంతుడు రావణునితో ఇట్లు పలికెను. "నేను యమునకు గాని, దేవేంద్రునికి గాని, వరుణునికి గాని

సంబంధించిన వాడను కాను. నాకు కుబేరునితో సంబంధమేదీ లేదు. నన్ను విష్ణువు పంపలేదు. నేను మారు రూపములో రాలేదు. నేను వానరుడను. ఇదే నా జాతి. ఈ నగరానికి రావలెననియే వచ్చినాను." 12, 13

మూ. దర్శనే రాక్షసేన్ద్రస్య దుర్లభే తదిదం మయా, 14
వనం రాక్షసరాజస్య దర్శనార్థే వినాశితమ్.

ప్ర. అ. రాక్షసేన్ద్రస్య=రాక్షసప్రభువైన నీయొక్క, దర్శనే=దర్శనము, దుర్లభే=దుర్లభమైనదగుచుండగా, మయా=నాచేత, తత్=ఆ, ఇదమ్=ఈ, వనమ్=వనము, రాక్షసరాజస్య=రాక్షసరాజువైన నీ యొక్క, దర్శనార్థే=దర్శనమునిమిత్తమై, వినాశితమ్=నశింపచేయబడినది.

తా. నీ దర్శనము అంత తేలికగా లభించదు. కావున, నీ దర్శనము లభించుటకై, ప్రసిద్ధమైన ఆ ఉద్యానమును నశింపచేసినాను. 14

మూ. తతస్తే రాక్షసాః ప్రాప్తా బలినో యుద్ధకాంక్షిణః,
రక్షణార్థం తు దేహస్య ప్రతియుద్ధా మయా రణే. 15

ప్ర. అ. తతః=అటుపిమ్మట, బలినః=బలవంతులైన, తే రాక్షసాః=ఆ రాక్షసులు, యుద్ధకాంక్షిణః=యుద్ధము కోరుచున్నవారై, ప్రాప్తాః=వచ్చినారు. దేహస్య=దేహముయొక్క, రక్షణార్థం తు=రక్షణము కొరకే, మయా=నాచేత, రణే=యుద్ధమునందు, ప్రతియుద్ధాః=యుద్ధములో ఎదిరించబడినారు.

తా. అపుడు బలవంతులైన ఆ రాక్షసులందరూ యుద్ధము చేయుటకై వచ్చినారు. నాకు నా దేహమును రక్షించుకొనుటకు మాత్రమే వారితో యుద్ధము చేయవలసి వచ్చినది. 15

మూ. అస్త్రపాశైర్న శక్యోఽహం బద్ధుం దేవాసురైరపి, 16
పితామహాదేవ వరో మమాప్యేషోఽభ్యాగతః.

ప్ర. అ. అహమ్=నేను, దేవాసురైరపి=దేవతలచేతను అసురులచేతను కూడ, అస్త్రపాశైః=అస్త్రపాశములచేత, బద్ధుమ్=బంధించుటకు, న శక్యః=శక్యమైనవాడను కాను. ఏషః వరః=ఈ వరము, మమాపి=నాకు కూడా, పితామహాదేవ=బ్రహ్మదేవుని నుండియే, అభ్యాగతః=వచ్చినది.

తా. దేవతలు, అసురులు కూడ నన్ను అస్త్రపాశములతో బంధింపజాలరు. (నీకు ఏవేవో వరములు లభించినట్లే) నాకు కూడ ఈ వరము బ్రహ్మదేవుని నుండే లభించినది. 16

మూ. రాజానం ద్రష్టుకామేన మయాస్త్రమనువర్తితమ్, 17
విముక్తో హ్యహమస్త్రేణ రాక్షసైస్త్వభిపీడితః,
కేనచిద్రాజకార్యేణ సంప్రాప్తోఽస్మి తవాన్తికమ్. 18

ప్ర. అ. రాజానమ్=రాజువైన నిన్ను, ద్రష్టుకామేన=చూడవలెనని కోరిక గల, మయా=నాచేత, అస్త్రమ్=అస్త్రము, అనువర్తితమ్=అనుసరింపబడినది. రాక్షసైః=రాక్షసులచేత, అభిపీడితః తు=బంధింపబడగానే, అహమ్=నేను, అస్త్రేణ=అస్త్రముచేత, విముక్తో హి=విడవబడితిని కదా. కేనచిత్=ఒకానొక, రాజకార్యేణ=రాజకార్యముచేత, తవ=నీయొక్క, అన్తికమ్=సమీపమును గూర్చి, సంప్రాప్తః అస్మి=వచ్చినాను.

తా. నిన్ను చూడవలెనను కోరికచేతనే నేను అస్త్రబంధమునకు లొంగి ఉంటిని. రాక్షసులు నన్ను బంధింపగానే అస్త్రము నన్ను విడిచివేసినది. ఒకానొక రాజకార్యముచేత నేను నీవద్దకు వచ్చినాను. 17, 18

మూ. దూతోఽహమితి విజ్ఞేయో రాఘవస్యామితౌజసః,
శ్రూయతాం చాపి వచనం మమ పథ్యమిదం ప్రభో. 19

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే సున్దరకాణ్డే
పఞ్చాశః సర్గః.

ప్ర. అ. అహమ్=నేను, అమితౌజసః=అపరిమితమైన తేజస్సు గల, రాఘవస్య=రామునియొక్క, దూతః ఇతి=దూతను అని, విజ్ఞేయః=తెలియదగినవాడను. ప్రభో=ఓ రాక్షసరాజా ! పథ్యమ్=హితమైన, ఇదమ్=ఈ, మమ వచనమ్=నా వచనము, శ్రూయతాం చాపి=వినబడుగాక.

తా. ఓ రాక్షసరాజా ! నేను అపరిమితమైన తేజస్సు గల రాముని దూత నని తెలిసికొనుము. హితమైన మాట చెప్పుచున్నాను, వినుము. 19

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు
సుందరకాండలో ఏబదవ సర్గ సమాప్తము.

అథ ఏకపఞ్చాశః సర్గః

[హనుమంతుడు రాముని ప్రభావము వర్ణించి చెప్పుచూ రావణునకు నీతిని ఉపదేశించుట].

మూ. తం సమీక్ష్య మహాసత్త్వం సత్త్వవాన్ హరిసత్తమః,
వాక్యమర్థవదవ్యగ్రస్తమువాచ దశాననమ్. 1

ప్ర. అ. సత్త్వవాన్=బలవంతుడైన, హరిసత్తమః=హనుమంతుడు, మహాసత్త్వమ్=గొప్ప బలము గల, తం దశాననమ్=ఆ రావణుని, సమీక్ష్య=చూచి, అవ్యగ్రమ్=కంగారు లేకుండగా, అర్థవత్=అర్థయుక్తమైన, వాక్యమ్=వాక్యమును, తమ్=వానిని గూర్చి, ఉవాచ=పలికెను.

తా. మహాబలవంతుడైన హనుమంతుడు, మహాబలవంతుడైన ఆ రావణుని చూచి, ఏ మాత్రము భయము చెందక, ఆతనితో అర్థయుక్తమైన వాక్యమిట్లు పలికెను. 1

మూ. అహం సుగ్రీవసందేశాదిహ ప్రాప్తస్తవాలయమ్,
రాక్షసేన్ద్ర హరీశస్త్వాం భ్రాతా కుశలమబ్రవీత్. 2

ప్ర. అ. రాక్షసేన్ద్ర=ఓ !రాక్షసరాజా ! అహమ్=నేను, సుగ్రీవసందేశాత్=సుగ్రీవుని ఆజ్ఞవలన, ఇహ=ఇక్కడికి, తవ ఆలయమ్=నీ గృహమును గూర్చి, ప్రాప్తః=వచ్చినాను. భ్రాతా=సోదరుడైన, హరీశః=ఆ వానరప్రభువైన సుగ్రీవుడు, త్వామ్=నిన్ను గూర్చి, కుశలమ్=కుశలమును, అబ్రవీత్=పలికెను.

తా. ఓ ! రాక్షసరాజా ! నేను సుగ్రీవుని ఆజ్ఞచే ఇక్కడికి వచ్చినాను. వానరరాజైన, నీ సోదరుడు, సుగ్రీవుడు నిన్ను కుశలమడిగినాడు. 2

మూ. భ్రాతుః శృణు సమాదేశం సుగ్రీవస్య మహాత్మనః,
ధర్మార్థోపహితం వాక్యమిహ చాముత్ర చ క్షమమ్. 3

ప్ర. అ. మహాత్మనః=మహాత్ముడైన, భ్రాతుః=సోదరుడైన, సుగ్రీవస్య=సుగ్రీవునియొక్క, సమాదేశమ్=వార్తయైనది, ఇహ చ=ఈ లోకమునందు, అముత్ర చ=పరలోకమునందు, క్షమమ్=శుభమును కూర్చుటకు సమర్థమైనదీ, ధర్మార్థోపహితమ్=ధర్మముతోను, అర్థముతోను కూడినదీ అయిన వాక్యమ్=వాక్యమును, శృణు=వినుము.

తా. మహాత్ముడైన, నీ సోదరుడు సుగ్రీవుడు వార్త పంపినాడు. ధర్మార్థములతో కూడినవి, ఇహపరలోకములందు శ్రేయస్కరములూ అయిన ఆ మాటలు వినుము. 3

మూ. రాజా దశరథో నామ రథకుఞ్జరవాజిమాన్,
పితేవ బన్ధుర్లోకస్య సురేశ్వరసమద్యుతిః. 4

ప్ర. అ. రథకుఞ్జరవాజిమాన్=రథములు, ఏనుగులు, గుఱ్ఱములు కలవాడు, లోకస్య=లోకమునకు, పితేవ=తండ్రి వంటి వాడు, సురేశ్వరసమద్యుతిః=దేవేంద్రునితో సమానమైన కాంతి గలవాడు అయిన, దశరథో నామ=దశరథుడనే పేరు గల, రాజా=రాజు ఉండెను.

తా. రథములు, ఏనుగులు, గుఱ్ఱములు కలవాడు. లోకమునకు తండ్రి వంటివాడు, దేవేంద్రునితో సమానమైన కాంతి కలవాడు అయిన దశరథుడను రాజు ఉండెను. 4

మూ. జ్యేష్ఠస్తస్య మహాబాహుః పుత్రః ప్రియకరః ప్రభుః,
పితుర్నిదేశాన్నిష్క్రాన్తః ప్రవిష్టో దణ్డకావనమ్. 5
లక్ష్మణేన సహ భ్రాత్రా సీతయా చాపి భార్యయా,
రామో నామ మహాతేజా ధర్మ్యం పన్థానమాస్థితః. 6

ప్ర. అ. తస్య=ఆతనియొక్క, జ్యేష్ఠః పుత్రః=జ్యేష్ఠపుత్రుడు, మహాబాహుః=గొప్ప బాహువులు కలవాడు, ప్రియకరః=ప్రియమును చేయువాడు, ప్రభుః=ప్రభువు, మహాతేజాః=గొప్ప తేజస్సు కలవాడు అయిన, రామో నామ=రాముడు, ధర్మ్యమ్=ధర్మసంమతమైన, పన్థానమ్=మార్గమును, ఆస్థితః=ఆశ్రయించినవాడై, పితుః=తండ్రియొక్క, నిదేశాత్=ఆజ్ఞవలన, నిష్క్రాన్తః=బయలు దేరినవాడై, భ్రాత్రా=సోదరుడైన, లక్ష్మణేన=లక్ష్మణునితోను, భార్యయా=భార్యయైన, సీతయా చాపి=సీత తోను, దణ్డకావనమ్=దండకావనమును, ప్రవిష్టః=ప్రవేశించినాడు.

తా. ఆ దశరథుని జ్యేష్ఠకుమారుడు, మహాబాహువు, తండ్రికి ప్రియము చేయువాడు, మహాతేజఃశాలీ అయిన, మా ప్రభువైన రాముడు, తండ్రి ఆజ్ఞచే, ధర్మమార్గమును అవలంబించి, అయోధ్యను విడచి, సోదరుడైన లక్ష్మణుని తోను, భార్యయైన సీతతోను, దండకావనములో ప్రవేశించినాడు. 5, 6

మూ. తస్య భార్యా వనే నష్టా సీతా పతిమనువ్రతా,
వైదేహస్య సుతా రాజ్ఞో జనకస్య మహాత్మనః. 7

ప్ర. అ. వైదేహస్య=విదేహదేశాధిపతి, మహాత్మనః=మహాత్ముడూ అయిన, జనకస్య=జనకుడనే, రాజ్ఞః=రాజుయొక్క, సుతా=కుమార్తె, పతిమ్=భర్తను, అనువ్రతా=అనుసరించినదీ, తస్య=ఆ రామునియొక్క, భార్యా=భార్యఅయిన, సీతా=సీత, వనే=వనమునందు, నష్టా=కనబడకుండపోయినది.

తా. విదేహదేశాధిపతియైన మహాత్ముడైన జనకమహారాజు పుత్రి, భర్తనే అనుసరించి ఉండేది, రాముని భార్యా అయిన సీత అరణ్యములో కనబడకుండ పోయినది. 7

మూ. స మార్గమాణస్తాం దేవీం రాజపుత్రః సహానుజః,
ఋశ్యమూకమనుప్రాప్తః సుగ్రీవేణ సమాగతః. 8

ప్ర. అ. తాం దేవీమ్=ఆ దేవిని, మార్గమాణః=వెదకుచు, సహానుజః=తమ్మునితోకూడిన, సః రాజపుత్రః=ఆ రాజకుమారుడు, ఋశ్యమూకమ్=ఋశ్యమూకపర్వతమును, అనుప్రాప్తః=చేరినవాడై, సుగ్రీవేణ=సుగ్రీవునితో, సమాగతః=కలిసెను.

తా. తమ్మునితో కూడిన ఆ రాజకుమారుడైన రాముడు, సీతాదేవిని వెదకికొనుచు ఋశ్యమూకపర్వతము చేరి, అక్కడ సుగ్రీవుని కలుసుకొనెను. 8

మూ. తస్య తేన ప్రతిజ్ఞాతం సీతాయాః పరిమార్గణమ్,
సుగ్రీవస్యాపి రామేణ హరిరాజ్యం నివేదితమ్. 9

ప్ర. అ. తేన=ఆ సుగ్రీవునిచేత, తస్య=ఆ రామునకు, సీతాయాః=సీతయొక్క, పరిమార్గణమ్=వెదకుట, ప్రతిజ్ఞాతమ్=ప్రతిజ్ఞ చేయబడినది. రామేణాపి=రామునిచేత కూడ, సుగ్రీవస్య=సుగ్రీవునకు, హరిరాజ్యమ్=వానర రాజ్యము, నివేదితమ్=తెలుపబడినది (ప్రతిజ్ఞ చేయబడినది).

తా. సీతను వెదకించెదనని సుగ్రీవుడు రామునకు ప్రతిజ్ఞ చేసి చెప్పగా, నీకు వానరరాజ్యము ఇచ్చెదనని రాముడు సుగ్రీవునకు ప్రతిజ్ఞ చేసి చెప్పెను.9

మూ. తతస్తేన మృధే హత్వా రాజపుత్రేణ వాలినమ్,
సుగ్రీవః స్థాపితో రాజ్యే హర్యృక్షాణాం గణేశ్వరః. 10

ప్ర. అ. తతః=అటు పిమ్మట, తేన=ఆ, రాజపుత్రేణ=రామునిచేత, వాలినమ్=వాలిని, మృధే=యుద్ధమునందు, హత్వా=చంపి, సుగ్రీవః=సుగ్రీవుడు, హర్యృక్షాణామ్=వానరులయొక్క భల్లూకములయొక్క, గణేశ్వరః=గణములకు ప్రభువుగా, రాజ్యే=రాజ్యమునందు, స్థాపితః=స్థాపించబడినాడు.

తా. పిమ్మట రాముడు యుద్ధములో వాలిని సంహరించి సుగ్రీవుణ్ణి వానరభల్లూకగణముల అధిపతినిగా, రాజ్యమునందు స్థాపించెను. 10

మూ. త్వయా విజ్ఞాతపూర్వశ్చ వాలీ వానరపుఙ్గవః,
రామేణ నిహతః సంఖ్యే శరేణైకేన వానరః. 11

ప్ర. అ. వానరపుఙ్గవః=వానరులలో శ్రేష్ఠుడైన, వాలీ=వాలి, త్వయా=నీచేత, విజ్ఞాతపూర్వశ్చ=పూర్వమే తెలియబడినవాడు. వానరః=ఆ వాలి, రామేణ=రాముని చేత, సంఖ్యే=యుద్ధమునందు, ఏకేన=ఒక, శరేణ=బాణముచేత, నిహతః=చంపబడినాడు.

తా. వాలి ఎవరో నీకు పూర్వమే తెలియును కదా. ఆ వాలిని రాముడు, యుద్ధములో ఒక్క బాణముతో చంపినాడు. 11

మూ. స సీతామార్గణే వ్యగ్రః సుగ్రీవః సత్యసంగరః,
హరీన్ సంప్రేషయామాస దిశః సర్వా హరీశ్వరః. 12

ప్ర. అ. సత్యసంగరః=సత్యమైన ప్రతిజ్ఞ కలవాడు, హరీశ్వరః=వానరప్రభువూ అయిన, సః సుగ్రీవః=ఆ సుగ్రీవుడు, సీతామార్గణే=సీతను అన్వేషించుటయందు, వ్యగ్రః=ఆకులత చెందినవాడై, సర్వాః=సమస్తమైన, దిశః=దిక్కులను గూర్చి, హరీన్=వానరులను, సంప్రేషయామాస=పంపెను.

తా. సత్యమైన ప్రతిజ్ఞ గల, వానరప్రభువైన సుగ్రీవుడు సీతను అన్వేషించవలెనని చాల వ్యాకులుడై, అన్ని దిక్కులకు వానరులను పంపెను.

మూ. తాం హరీణాం సహస్రాణి శతాని నియుతాని చ,
దిక్షు సర్వాసు మార్గన్తే హ్యధశ్చోపరి చామ్బరే. 13

ప్ర. అ. హరీణామ్=వానరులయొక్క, సహస్రాణి=సహస్రములు, శతాని=వందలు, నియుతాని చ=లక్షలు, తామ్=ఆమెను, సర్వాసు=సమస్తమైన, దిక్షు=దిక్కులందు, అధశ్చ=క్రింద, ఉపరి=పైన, అమ్బరే చ=ఆకాశమునందు, మార్గన్తే=వెదకుచున్నారు.

తా. వందలకొలది, వేల కొలది, లక్షల కొలది వానరులు, ఆ సీత కొరకు అన్ని దిక్కులందు, పాతాళములోను, పైన ఆకాశమునందూ కూడ వెదకుచున్నారు. 13

మూ. వైనతేయసమాః కేచిత్ కేచిత్తత్రానిలోపమాః,
అసంగగతయః శీఘ్రా హరివీరా మహాబలాః. 14

ప్ర. అ. తత్ర=ఆ వానరులలో, మహాబలాః=గొప్ప బలము గల, కేచిత్=కొందరు, హరివీరాః=వానరులు, వైనతేయసమాః=గరుత్మంతునితో సమానులు. కేచిత్=కొందరు, అనిలోపమాః=వాయువుతో సమానులు, శీఘ్రాః=వేగముగా పోవువారు. అసంగగతయః=అడ్డు లేని గమనము కలవారు.

తా. ఆ వానరులలో మహాబలవంతులైన కొందరు వానరవీరులు గరుత్మంతుని వంటివారు. మరికొందరు వాయువువంటివారు. అడ్డు లేని గమనము గలవారై ఎక్కడికైనా అతిశీఘ్రముగా వెళ్ళగలరు. 14

మూ. అహం తు హనుమాన్నామ మారుతస్యౌరసః సుతః,
సీతాయాస్తు కృతే తూర్ణం శతయోజనమాయతమ్, 15
సముద్రం లంఘయిత్వైవ తాం దిదృక్షురిహాగతః.

ప్ర. అ. మారుతస్య=వాయుదేవుని యొక్క, ఔరసః సుతః=ఔరస పుత్రుడ నైన, హనుమాన్నామ=హనుమంతుడను పేరు గల, అహం తు=నేనైతే, సీతాయాః కృతే=సీతనిమిత్తమై, తూర్ణమ్=శీఘ్రముగా, శతయోజనమ్=నూరు యోజనములు, ఆయతమ్=పొడవైన, సముద్రమ్=సముద్రమును, లఙ్ఘయిత్వైవ=లంఘించియే, తామ్=ఆమెను, దిదృక్షుః=చూడదలచినవాడనై, ఇహ=ఇక్కడికి, ఆగతః=వచ్చినాను.

తా. నేను సాక్షాత్తు వాయుదేవుని కుమారుడను. నా పేరు హనుమంతుడు. నేను సీతకొరకై శతయోజనవిస్తీర్ణమైన సముద్రమును శీఘ్రముగా లంఘించి ఆమెను చూచుటకై ఇక్కడికి వచ్చినాను. 15

మూ. భ్రమతా చ మయా దృష్టా గృహే తే జనకాత్మజా. 16
తద్భవాన్ దృష్టధర్మార్థస్తపఃకృతపరిగ్రహః,
పరదారాన్ మహాప్రాజ్ఞ నోపరోద్ధుం త్వమర్హసి. 17

ప్ర. అ. భ్రమతా=తిరుగుచున్న, మయా=నాచేత, తే=నీయొక్క, గృహే=గృహమునందు, జనకాత్మజా=సీత, దృష్టా=చూడబడినది. భవాన్=నీవు, దృష్టధర్మార్థః=చూడబడిన ధర్మార్థములు కలవాడవు. తపఃకృత పరిగ్రహః=చేయబడిన తపఃసంపాదనము కలవాడవు. తత్=ఆ కారణము వలన, మహాప్రాజ్ఞ=గొప్పబుద్ధి కలవాడా ! త్వమ్=నీవు, పరదారాన్=పరభార్యను, ఉపరోద్ధుమ్=అడ్డుపెట్టుటకు (బంధించుటకు), న అర్హసి=తగవు.

తా. నేను లంకలో తిరుగుచు, తిరుగుచు, నీయింటిలో సీతను చూచినాను. నీవు ధర్మార్థముల స్వరూపము తెలిసినవాడవు. గొప్ప తపస్సు

చేసినావు. అందువలన, ఓ ! మహాబుద్ధిశాలీ ! నీవు పరభార్యను నీ యింటిలో ఉంచుకొనుట యుక్తము కాదు. 16, 17

మూ. న హి ధర్మవిరుద్ధేషు బహ్వపాయేషు కర్మసు,
మూలఘాతిషు సజ్జన్తే బుద్ధిమన్తో భవద్విధాః. 18

ప్ర. అ. భవద్విధాః=నీ వంటి, బుద్ధిమన్తః=బుద్ధిమంతులు, ధర్మవిరుద్ధేషు=ధర్మమునకు విరుద్ధములు, బహ్వపాయేషు=అధికమైన అపాయము కలవి, మూలఘాతిషు=మూలమునే నశింపచేయునవి అయిన, కర్మసు=పనులలో, న సజ్జన్తే హి=ఆసక్తులు కారు కదా !

తా. నీ వంటి బుద్ధిమంతులు, ధర్మానికి విరుద్ధమైనవి, అనేక అపాయములతో కూడినవి, మూలమునే నశింపచేయునవి అయిన పనులు చేయరు కదా ! 18

మూ. కశ్చ లక్ష్మణముక్తానాం రామకోపానువర్తినామ్,
శరాణామగ్రతః స్థాతుం శక్తో దేవాసురేష్వపి. 19

ప్ర. అ. లక్ష్మణముక్తానామ్=లక్ష్మణునిచేత విడువబడినవి, రామకోపానువర్తినామ్=రాముని కోపమును అనుసరించునవి అయిన, శరాణామ్=శరముల, అగ్రతః=ఎదుట, స్థాతుమ్=నిలచుటకు, దేవాసురేష్వపి=దేవతలలోను అసురులలోను కూడ, కః=ఎవడు, శక్తః=సమర్థుడు ?

తా. రామునికి కోపము వచ్చుట చూచి లక్ష్మణుడు ప్రయోగించిన బాణముల ఎదుట, సురాసురులలో కూడ ఎవ్వడైనా నిలువగలడా ? 19

మూ. న చాపి త్రిషు లోకేషు రాజన్విద్యేత కశ్చన,
రాఘవస్య వ్యలీకం యః కృత్వా సుఖమవాప్నుయాత్.

ప్ర. అ. రాజన్=రాజా ! యః=ఎవడు, రాఘవస్య=రామునకు, వ్యలీకమ్=అపకారమును, కృత్వా=చేసి, సుఖమ్=సుఖమును, అవాప్నుయాత్=పొందునో, అట్టివాడు, త్రిషు=మూడు, లోకేషు=లోకములందు, కశ్చన=ఎవడూ, న విద్యేత=ఉండడు.

తా. రావణా ! మూడు లోకములలో ఏ ఒక్కడూ కూడ రామునకు అపకారము చేసి సుఖముగా ఉండజాలడు. 20

మూ. తత్త్రికాలహితం వాక్యం ధర్మ్యమర్థానుబన్ధి చ,
మన్యస్వ నరదేవాయ జానకీ ప్రతిదీయతామ్. 21

ప్ర. అ. తత్=ఆ కారణమువలన, త్రికాలహితమ్=మూడు కాలములందూ హితమైనదీ, ధర్మ్యమ్=ధర్మసంమతమూ, అర్థానుబన్ధి చ=అర్థమునకు కూడ సంబంధించినదీ అయిన, వాక్యమ్=వాక్యమును, మన్యస్వ=అంగీకరించుము, నరదేవాయ=రామునకు, జానకీ=సీత, ప్రతిదీయతామ్=తిరిగి ఇవ్వబడుగాక.

తా. అందుచే నీవు మూడు కాలములలోనూ కూడ హితమైనది, ధర్మ సంమతము, అర్థమును కూర్చునదీ అయిన నామాట వినుము. సీతను రామునకు తిరిగి ఇచ్చి వేయుము. 21

మూ. దృష్టా హీయం మయా దేవీ లబ్ధం యదిహ దుర్లభమ్,
ఉత్తరం కర్మ యచ్ఛేషం నిమిత్తం తత్ర రాఘవః. 22

ప్ర. అ. మయా=నాచేత, ఇయం దేవీ=ఈ సీతాదేవి, దృష్టా హి=చూడబడినది కదా. యత్=ఏది, దుర్లభమ్=పొంద శక్యము కానిదో అది, ఇహ=ఇక్కడ, లబ్ధమ్=పొందబడినది. ఉత్తరమ్=తరువాతిదైన, యత్=ఏ, కర్మ=పని, శేషమ్=మిగిలి ఉన్నదో, తత్ర=అక్కడ, రాఘవః=రాముడు, నిమిత్తమ్=నిమిత్తము.

తా. నేను సీతాదేవిని చూచినాను. మరెక్కడా లభించని సీతాదర్శనము ఇక్కడ లభించినది. ఇటు పైన మిగిలిన ఏ కార్యము చేయవలెనో అది రాముడే నిర్ణయించగలడు. 22

మూ. లక్షితేయం మయా సీతా తథా శోకపరాయణా,
గృహ్య యాం నాభిజానాసి పఞ్చాస్యామివ పన్నగీమ్. 23

ప్ర. అ. తథా=ఆ విధముగా, శోకపరాయణా=శోకమునకు అధీనురాలైన, ఇయం సీతా=ఈ సీత, మయా=నాచేత, లక్షితా=చూడబడినది. పఞ్చాస్యామ్=ఐదు ముఖములు గల, పన్నగీమివ=ఆడ సర్పము వంటి, యామ్=ఏ సీతను, గృహ్య=గ్రహించి, నాభిజానాసి=తెలుసుకొనజాలకున్నావో !

తా. ఐదు తలల సర్పము వంటి ఏ సీతను పట్టుకొని నీవు రాబోవు గొప్ప అపాయమును గుర్తించజాలకున్నావో అట్టి సీతను, శోకములో మునిగి యుండగా నేను చూచినాను. 23

మూ. నేయం జరయితుం శక్యా సాసురైరమరైరపి,
విషసంసృష్టమత్యర్థం భుక్తమన్నమివౌజసా. 24

ప్ర. అ. అత్యర్థమ్=మిక్కిలి, విషసంసృష్టమ్=విషముతో కలిసిన, భుక్తమ్=భుజింపబడిన, అన్నమివ=అన్నము వలె, ఇయమ్=ఈమె, సాసురైః=అసురులతో కూడిన, అమరైరపి=దేవతలచేత కూడ, ఓజసా=పరాక్రమముచేత (జఠరాగ్ని

చేత అని కూడ రెండవ అర్థము) జరయితుమ్=జీర్ణింపచేసుకొనుటకు, న శక్యా=శక్యమైనది కాదు.

తా. ఎక్కువగా విషము కలిసిన అన్నము తిని ఎవ్వరూ ఏ విధముగా జీర్ణింప చేసికొనజాలరో అదే విధముగా ఈ సీతను, అసురులు గాని, సురులు గాని, ఎవ్వరూ జీర్ణింపచేసికొన జాలరు. 24

మూ. తపఃసంతాపలబ్ధస్తే యోఽయం ధర్మపరిగ్రహః,
న స నాశయితుం న్యాయ్య ఆత్మప్రాణపరిగ్రహః. 25

ప్ర. అ. తపఃసంతాపలబ్ధః=తపస్సు చేయుటచేత పొందబడిన, తే=నీయొక్క, యః=ఏ, అయమ్=ఈ, ధర్మపరిగ్రహః=ధర్మఫలమైన, ఆత్మప్రాణపరిగ్రహః=ఆత్మ యొక్క ప్రాణములయొక్క స్వీకారము అనగా జీవనము కలదో, సః=అది, నాశయితుమ్=నశింపచేయుటకు, న న్యాయ్యః=న్యాయమైనది కాదు.

తా. నీవు తపస్సు చేసి తత్ఫలితముగాను, ఇతరధర్మముల ఫలముగాను దీర్ఘాయుర్దాయమును పొంది ఉన్నావు. దానిని నశింపచేసికొనుట మంచిది కాదు.

వి. ఇది కొంచెం క్లిష్టాన్వయంగానే ఉన్నది. ప్రాచ్యపాఠంలో ఈ శ్లోకం మరొకవిధంగా ఉన్నది.

"తపఃసంతానలబ్ధస్తే యోఽయమృద్ధిపరిచ్ఛదః,
రామో నాశయితుం శక్తః సాత్మత్రాణపరిగ్రహః".

ప్ర. అ. తపఃసంతానలబ్ధః=తపస్సుయొక్క సంతానము చేత (అనగా నిరంతర దీర్ఘ తపస్సుచేత) పొందబడిన, తే=నీయొక్క, ఋద్ధిపరిచ్ఛదః=ఐశ్వర్య లాభము, సాత్మత్రాణపరిగ్రహః=ఆత్మరక్షణతో కూడినది ఏది ఉన్నదో, దానిని, రామః=రాముడు, నాశయితుం=నశింపజేయుటకు, శక్తః=సమర్థుడు.

తా. అనగా తపస్సు చేసి నీవు సంపాదించు కొన్న ఐశ్వర్యాన్నీ, నీ ఆయుస్సునూ కూడా రాముడు నశింపచేయగలడు అని భావము. 25

మూ. అవధ్యతాం తపోభిర్యాం భవాన్ సమనుపశ్యతి,
ఆత్మనః సాసురైర్దేవైర్హేతుస్తత్రాప్యయం మహాన్. 26

ప్ర. అ. భవాన్=నీవు, తపోభిః=నీవు చేసిన తపస్సులచేత, ఆత్మనః=నీకు, సాసురైః=అసురులతో కూడిన, దేవైః=దేవతలచేత కూడ, యామ్=ఏ, అవధ్యతామ్= అవధ్యత్వమును, సమనుపశ్యసి=చూచుచున్నావో, తత్రాపి=ఆ విషయమునందు కూడ, అయమ్=ఈ, మహాన్=గొప్ప, హేతుః=హేతువు, ఉన్నది.

తా. తపస్సుచేత నేను అసురులనుండి, సురులనుండీ కూడ మరణము లేకుండునట్లు చేసికొన్నాను కదా అని నీవు అనుకొనుచుండవచ్చును. కాని అది కూడ సరికాదని చెప్పటకు హేతువు వినుము. 26

మూ. సుగ్రీవో న హి దేవోఽయం నాసురో న చ రాక్షసః,
న దానవో న గన్ధర్వో న యక్షో న చ పన్నగః. 27
తస్మాత్ప్రాణపరిత్రాణం కథం రాజన్ కరిష్యసి.

ప్ర. అ. అయం సుగ్రీవః=ఈ సుగ్రీవుడు, దేవః=దేవుడు, న హి=కాదు కదా, అసురః న=అసురుడు కాదు, రాక్షసః చ న=రాక్షసుడు కూడ కాదు, దానవః న=దానవుడు కాడు. గన్ధర్వః న=గంధర్వుడు కాడు. యక్షః న=యక్షుడు కాడు. పన్నగశ్చ న=పన్నగుడు కూడ కాడు. రాజన్=రాజా, తస్మాత్=వానినుండి, ప్రాణపరిత్రాణమ్=ప్రాణముల రక్షణమును, కథమ్=ఎట్లు, కరిష్యసి=చేయగలవు?

తా. ఈ సుగ్రీవుడు దేవుడు కాని, అసురుడు కాని, రాక్షసుడు కాని, దానవుడు కాని, గంధర్వుడు కాని, యక్షుడు కాని, పన్నగుడు కాని కాడు కదా! అందుచే ఆ సుగ్రీవుని నుండి నీవు నీప్రాణములను ఎట్లు రక్షించుకొనెదవు?

మూ. న తు ధర్మోపసంహారమధర్మఫలసంహితమ్, 28
తదేవ ఫలమన్వేతి ధర్మశ్చాధర్మనాశనః.

ప్ర. అ. ధర్మోపసంహారమ్=ధర్మఫలము, అధర్మఫలసంహితమ్=అధర్మము యొక్క ఫలముతో కూడినది, న తు=కాదు. తత్=ఆ, ఫలమేవ=ధర్మముయొక్క ఫలమే, అన్వేతి=అనుసరించి వచ్చును. ధర్మశ్చ=ధర్మము, అధర్మనాశనః=అధర్మమును నశింపచేయునది.

తా. ధర్మఫలము అధర్మఫలముతో కలిసి ఉండదు. ఆ ధర్మఫలమే అనుసరించి వచ్చుచుండును. ధర్మము అధర్మాన్ని నశింపచేయును.

వి. ఇది ప్రాచీనుల వ్యాఖ్యానము. భావం ఏమీ సరిగా కుదరడం లేదు. చెప్పే అర్థం ప్రకరణానికి అనుకూలంగా ఉండాలి కదా ? "తపస్సు చేసి అవధ్యత్వం సంపాదించినాము కదా అని అనుకొని ప్రయోజనం లేదు" అని వెనుక చెప్పి, రాబోవు శ్లోకంలో హనుమంతుడు "ఇంతవరకు నీవు ధర్మ ఫలాన్ని అనుభవించినావు, ఇటు పైన అధర్మఫలం అనుభవించవలసి ఉంటుంది' అని చెప్పనున్నాడు. మధ్యలో ఉన్న ఈ శ్లోకం పూర్వోత్తరాలకు సంబంధం ఉండేదిగా

ఉండాలి కదా ? పైన చెప్పిన అర్థం తదనుగుణంగా లేదు. ఏదో కల్పించి చెప్పవలసి ఉంది. అందుచేత దీని అర్థం ఈ విధంగా చెపితే బాగుంటుందని నా అభిప్రాయం.

ధర్మోపసంహారమ్=ధర్మమును (పుణ్యమును) క్షీణముచేయు, తదేవ ఫలమ్=ఆ ధర్మఫలమే, అధర్మఫలసంహితమ్=అధర్మము ఇవ్వవలసిన ఫలముతో కలిసినదై, న అన్వేతి=అనుబద్ధమై రాదు. ధర్మః=ధర్మము, అధర్మనాశనశ్చ=అధర్మమును నశింపచేసేది కూడ, న=కాదు("న" ఇక్కడ కూడా అన్వయించుకొనవలెను).

"ధర్మఫలమును అనుభవించగా అనుభవించగా ఆ ధర్మము తగ్గిపోవుచుండును. ఈ విధముగా ధర్మమును తగ్గించే ధర్మఫలము, అధర్మము తన ఫలము ఇవ్వడానికి ప్రారంభించిన తరువాత కూడ అనువర్తించదు. ధర్మము అధర్మాన్ని నశింపచేయజాలదు" అని తాత్పర్యం. అనగా ధర్మఫలం అధర్మ ఫలానుభవం ప్రారంభం అయ్యేవరకే ; అందుచేత నువ్వు పూర్వము ఎంత ధర్మము చేసినా ఇటుపైన అధర్మఫలం అనుభవించవలసిందే. ఈ భావాన్నే రాబోవు శ్లోకంలో స్పష్టంగా చెప్పనున్నాడు.

ప్రాచ్యపాఠంలో శ్లోకం భిన్నంగా ఉన్నది-

"న హి ధర్మోఽప్యసంహార్యో విధర్మఫలసంహితః,
తదేవ ఫలమాప్నోతి ధర్మాణాం ఫలనాశనః".

ప్ర. అ. ధర్మోఽపి=ధర్మము కూడ, అసంహార్యః=తొలగించ శక్యముకానిది, నహి=కాదు కదా. విధర్మఫలసంహితః=అధర్మముయొక్క ఫలముతో కూడినవాడు అనగా అధర్మఫలమును అనుభవించవలసి ఉన్నవాడు, ధర్మాణామ్=ధర్మముల యొక్క, ఫలనాశనః=ఫలమును నశింపచేయువాడై, తదేవ ఫలమ్=అధర్మ ఫలమునే, ఆప్నోతి=పొందును అని అర్థము.

తా. "అధర్మం బలీయమైనప్పుడు ధర్మం కూడా వెనక్కి పోతుంది. అధర్మఫలం అనుభవించవలసివచ్చినప్పుడు ధర్మఫలం నశించి ఆ అధర్మఫలమే లభిస్తుంది" అని దీని భావం. 28

మూ. ప్రాప్తం ధర్మఫలం తావద్భవతా నాత్ర సంశయః,
ఫలమస్యాప్యధర్మస్య క్షిప్రమేవ ప్రపత్స్యసే. 29

ప్ర. అ. భవతా=నీ చేత, ధర్మఫలమ్=ధర్మముయొక్క ఫలము, ప్రాప్తం తావత్=పొందబడినది. అత్ర=ఈ విషయమునందు, సంశయః=సంశయము,

న=లేదు, అస్య=ఈ, అధర్మస్య=అధర్మముయొక్క, ఫలమపి=ఫలమును కూడ, క్షిప్రమేవ=శీఘ్రముగానే, ప్రపత్స్యసే=పొందగలవు.

తా. నీవింతవరకు ధర్మఫలమును పొందినావు. ఈ విషయములో సందేహము లేదు. అచిరకాలమునందే అధర్మమునకు ఫలమును కూడ పొందగలవు. 29

మూ. జనస్థానవధం బుద్ధ్వా బుద్ధ్వా వాలివధం తథా, 30
రామసుగ్రీవసఖ్యం చ బుధ్యస్వ హితమాత్మనః.

ప్ర. అ. జనస్థానవధమ్=జనస్థానములో జరిగిన రాక్షసవధను, బుద్ధ్వా=తెలిసికొని, తథా=మరియు, వాలివధమ్=వాలియొక్క వధను, బుద్ధ్వా=తెలిసికొని, రామసుగ్రీవసఖ్యం చ=రామసుగ్రీవుల స్నేహమును కూడా తెలిసికొని, ఆత్మనః=నీయొక్క, హితమ్=హితమును, బుధ్యస్వ=తెలిసికొనుము.

తా. జనస్థానములో రాక్షసుల వధను, వాలి వధను, రామసుగ్రీవుల మధ్య స్నేహమేర్పడినదను విషయమును గుర్తు ఉంచుకొని నీకు ఏది హితమో ఆలోచించుకొనుము. 30

మూ. కామం ఖల్వహమప్యేకః సవాజిరథకుఞ్జరామ్, 31
లఙ్కాం నాశయితుం శక్తస్తస్యైష తు న నిశ్చయః.

ప్ర. అ. అహమ్=నేను, ఏకోఽపి=ఒక్కడనే ఐనను, సవాజిరథకుఞ్జరామ్=గుఱ్ఱములతోను, రథములతోను, ఏనుగులతోను కూడిన, లఙ్కామ్=లంకను, నాశయితుమ్=నశింపచేయుటకు, కామమ్=నిస్సంశయముగా, శక్తః ఖలు=సమర్థుడను. ఏషః తు=ఇదైతే, తస్య=ఆ రామునియొక్క, నిశ్చయః=నిశ్చయము, న=కాదు.

తా. అశ్వగజరథాదులతో కూడిన లంకను నేనొక్కడనే నశింపచేయగలను. కాని ఇది రాముని నిర్ణయమునకు అనుగుణము కాదు. 31

మూ. రామేణ హి ప్రతిజ్ఞాతం హర్యృక్షగణసంనిధౌ, 32
ఉత్సాదనమమిత్రాణాం సీతా యైస్తు ప్రధర్షితా.

ప్ర. అ. రామేణ=రామునిచేత, హర్యృక్షగణసంనిధౌ=వానరుల యొక్క భల్లూకములయొక్క గణముల ఎదుట, యైః=ఎవరిచేత, సీతా=సీత, ప్రధర్షితా=తిరస్కరింపబడినదో, అట్టి అమిత్రాణామ్=శత్రువులయొక్క, ఉత్సాదనమ్=వినాశనము, ప్రతిజ్ఞాతం హి=ప్రతిజ్ఞ చేయబడినది కదా.

తా. ఎందుచేతననగా రాముడు వానర గణముల సమక్షమందు, భల్లూక గణముల సమక్షమందు, "సీత నపహరించిన శత్రువులను నశింపచేసెదను" అని ప్రతిజ్ఞ చేసి ఉన్నాడు. 32

మూ. అపకుర్వన్హి రామస్య సాక్షాదపి పురందరః, 33
న సుఖం ప్రాప్నుయాదన్యః కిం పునస్త్వద్విధో జనః.

ప్ర. అ. రామస్య=రామునకు, అపకుర్వన్=అపకారము చేసినచో, సాక్షాత్=సాక్షాత్తు, పురందరః అపి=దేవేంద్రుడు కూడ, సుఖమ్=సుఖమును, న ప్రాప్నుయాత్=పొందదు. త్వద్విధః=నీ వంటి, జనః=జనుడు, కిం పునః=చెప్పనేల.

తా. రామునకు అపకారము చేసినచో సాక్షాత్తు దేవేంద్రుడు కూడా సుఖముగా ఉండజాలడు. నీ వంటివాని మాట చెప్పవలెనా ! 33

మూ. యాం సీతేత్యభిజానాసి యేయం తిష్ఠతి తే వశే, 34
కాలరాత్రీతి తాం విద్ధి సర్వలఙ్కావినాశినీమ్.

ప్ర. అ. యామ్=ఏ స్త్రీని, సీతా ఇతి=సీత అని, అభిజానాసి=అనుకొనుచున్నావో, యా ఇయమ్=ఏ ఈ స్త్రీ, తే వశే=నీ వశమునందు, తిష్ఠతి=ఉన్నదో, తామ్=ఆమెను, సర్వలఙ్కావినాశినీమ్=సమస్తమైన లంకను నశింపచేసే, కాలరాత్రీతి=కాలరాత్రి అని, విద్ధి=తెలుసుకొనుము.

తా. ఏస్త్రీని నీవు సీత అని అనుకొనుచున్నావో, ఏ స్త్రీ నీ వశములో బందీగా ఉన్నదో ఆమె సమస్తమైన లంకను నశింపచేసే కాలరాత్రి అని తెలుసుకొనుము. 34

మూ. తదలం కాలపాశేన సీతావిగ్రహరూపిణా, 35
స్వయం స్కన్ధావసక్తేన క్షేమమాత్మని చిన్త్యతామ్.

ప్ర. అ. తత్=ఆ కారణము వలన, సీతావిగ్రహరూపిణా=సీత శరీరము యొక్క రూపము గల, స్వయమ్=స్వయముగా, స్కన్ధావసక్తేన=బుజానికి తగల్చుకొన్న, కాలపాశేన=కాలపాశముచేత, అలమ్=చాలును. ఆత్మని=నీ విషయమున, క్షేమమ్=యుక్తమైనది, చిన్త్యతామ్=ఆలోచించబడుగాక.

తా. అందుచేత సీతాశరీరరూపములో ఉన్న కాలపాశమును నీఅంతట నీవే మెడకు తగల్చుకొనకుము. నీకు ఏది హితమో ఆలోచించుకొనుము. 35

మూ. సీతాయాస్తేజసా దగ్ధాం రామకోపప్రపీడితామ్, 36
దహ్యమానామిమాం పశ్య పురీం సాట్టప్రతోళికామ్.

ప్ర. అ. సీతాయాః=సీతయొక్క, తేజసా=తేజస్సుచేత, దగ్ధామ్=కాల్చబడిన, రామకోపప్రపీడితామ్=రాముని కోపముచేత పీడింపబడినదై, దహ్యమానామ్=కాల్చివేయబడుచున్న, సాట్టప్రతోళికామ్=కోట బురుజుల తోను వీథులతోను కూడిన, ఇమామ్=ఈ, పురీమ్=పట్టణమును, పశ్య=చూడుము.

తా. కోట బురుజులతోను, వీథులతోను కూడిన ఈ లంకాపట్టణమును, సీత తేజస్సు ముందుగానే కాల్చివేసినది. రాముని కోపముచే పీడితమైన ఈ పట్టణము భగ్గుమని మండిపోవుచున్నది చూడుము. (జరగబోవుదానిని జరుగుచున్నట్లు వర్ణించి చెప్పుచున్నాడు). 36

మూ. స్వాని మిత్రాణి మన్త్రింశ్చ జ్ఞాతీన్ భ్రాతౄన్ సుతాన్ హితాన్,
భోగాన్ దారాంశ్చ లఙ్కాం చ మా వినాశముపానయ.

ప్ర. అ. స్వాని=నీ సంబంధమైన, మిత్రాణి=మిత్రులను, మన్త్రింశ్చ=మంత్రులను, జ్ఞాతీన్=దగ్గర బంధువులను, భ్రాతౄన్=సోదరులను, సుతాన్=కుమారులను, హితాన్=హితులను, భోగాన్=భోగములను, దారాంశ్చ=భార్యలను, లఙ్కాం చ=లంకను, వినాశమ్=వినాశమును, మా ఉపానయ=పొందించకుము.

తా. నీ మిత్రులు, మంత్రులు, జ్ఞాతులు, సోదరులు, కుమారులు, హితులు, భోగములు, భార్యలు, లంక ఇవన్నీ నశించిపోవునట్లు ప్రవర్తించకుము.

మూ. సత్యం రాక్షసరాజేన్ద్ర శృణుష్వ వచనం మమ, 38
రామదాసస్య దూతస్య వానరస్య విశేషతః.

ప్ర. అ. రాక్షసరాజేన్ద్ర=ఓ ! రాక్షసచక్రవర్తీ, రామదాసస్య=రామునిదాసుడను, దూతస్య=దూతను, విశేషతః=విశేషించి, వానరస్య=వానరుడను అయిన, మమ=నాయొక్క, సత్యమ్=సత్యమైన, వచనమ్=వచనమును, శృణుష్వ=వినుము.

తా. ఓ ! రాక్షసరాజా ! నేను రాముని దాసుడను. ఆతని దూతను, విశేషించి వానరుడను (అనగా పక్షపాతబుద్ధి ఉండ పని లేనివాడను). అట్టి నేను చెప్పు సత్యమైన వాక్యము వినుము. 38

మూ. సర్వాన్ లోకాన్ సుసంహృత్య సభూతాన్ సచరాచరాన్, 39
పునరేవ తథా స్రష్టుం శక్తో రామో మహాయశాః.

ప్ర. అ. మహాయశాః=గొప్ప కీర్తి గల, రామః=రాముడు, సభూతాన్=పంచమహాభూతములతోకూడిన, సచరాచరాన్=స్థావరజంగమ ప్రాణులతో కూడిన, సర్వాన్=అన్ని, లోకాన్=లోకములను, సుసంహృత్య=పూర్తిగా సంహరించి, పునరేవ=తిరిగి, తథా=పూర్వము ఉన్నట్లే, స్రష్టుమ్=సృజించుటకు, శక్తః=సమర్థుడు.

తా. గొప్ప కీర్తి గల రామునకు, స్థావరజంగమరూపములైన ప్రాణులతోను, పంచమహాభూతములతోను కూడిన సకలలోకములను సంహరించి, మళ్లీ పూర్వమున్నట్లే సృష్టించగల సామర్థ్యమున్నది. 39

మూ. దేవాసురనరేన్ద్రేషు యక్షరక్షోగణేషు చ, 40
విద్యాధరేషు సర్వేషు గన్ధర్వేషూరగేషు చ.
సిద్ధేషు కిన్నరేన్ద్రేషు పతత్రిషు చ సర్వతః, 41
సర్వభూతేషు సర్వత్ర సర్వకాలేషు నాస్తి సః.
యో రామం ప్రతియుధ్యేత విష్ణుతుల్యపరాక్రమమ్. 42

ప్ర. అ. విష్ణుతుల్యపరాక్రమమ్=విష్ణువుతో సమానమైన పరాక్రమము గల, రామమ్=రాముని, యః=ఎవ్వడు, ప్రతియుధ్యేత=ఎదిరించి యుద్ధము చేయునో, సః=అట్టివాడు, దేవాసురనరేంద్రేషు=దేవతలలోను, అసురులలోను, నరశ్రేష్ఠులలోను, యక్షరక్షోగణేషు చ=యక్షులలోను రాక్షసగణములలోను, సర్వేషు=సమస్తమైన, విద్యాధరేషు=విద్యాధరులలోను, గన్ధర్వేషు=గంధర్వులలోను, ఉరగేషు చ=ఉరగుల లోను, సిద్ధేషు=సిద్ధులలోను, కిన్నరేన్ద్రేషు=కిన్నరశ్రేష్ఠులలోను, సర్వతః=అన్నింటా, పతత్రిషు=పక్షులలోను, సర్వభూతేషు=సకలప్రాణులలోను, సర్వత్ర=అన్ని దేశముల లోను, సర్వకాలేషు=అన్ని కాలములలోను, నాస్తి=లేదు.

తా. విష్ణువుతో సమానమైన పరాక్రమము గల రాముని ఎదుట నిలిచి యుద్ధము చేయ గలిగినవాడు, ఏ కాలములోను, ఏ దేశములోను కూడ, దేవాసురులలో కాని, నరులలోకాని, యక్ష రాక్షసులలో కాని, విద్యాధర గంధర్వ ఉరగులలో కాని, సిద్ధ కింనరులలో కాని, పక్షులలో కాని, ఏ భూతములలోను ఉండడు. 40-42

సర్వలోకేశ్వరస్యైవం కృత్వా విప్రియముత్తమమ్,
రామస్య రాజసింహస్య దుర్లభం తవ జీవితమ్. 43

ప్ర. అ. సర్వలోకేశ్వరస్య=సమస్తలోకములకు ప్రభువు, రాజసింహస్య=రాజశ్రేష్ఠుడు అయిన, రామస్య=రామునకు, ఏవమ్=ఈ విధమైన, ఉత్తమమ్=గొప్ప, విప్రియమ్=అపకారమును, కృత్వా=చేసి, తవ=నీకు, జీవితమ్=జీవితమ్, దుర్లభమ్=దుర్లభమైనది.

తా. సర్వలోకములకు ప్రభువు, రాజశ్రేష్ఠుడు అయిన రామునకు ఇంతటి గొప్ప అపకారము చేసిన పిమ్మట నీవు బ్రతుకుట చాలా కష్టము. 43

దేవాశ్చ దైత్యాశ్చ నిశాచరేన్ద్ర
గన్ధర్వవిద్యాధరనాగయక్షాః,
రామస్య లోకత్రయనాయకస్య
స్థాతుం న శక్తాః సమరేషు సర్వే. 44

ప్ర. అ. నిశాచరేన్ద్ర=ఓ ! రాక్షసరాజా ! దేవాశ్చ=దేవతలు, దైత్యాశ్చ=దైత్యులు, గన్ధర్వవిద్యాధరనాగయక్షాః=గంధర్వులు, విద్యాధరులు, నాగులు, యక్షులు, సర్వే=వీరందరూ, లోకత్రయనాయకస్య=మూడు లోకములకూ ప్రభువైన, రామస్య=రాముని ఎదుట, సమరేషు=యుద్ధములందు, స్థాతుమ్=నిలచుటకు, న శక్తాః=సమర్థులు కారు.

తా. ఓ రాక్షసరాజా ! లోకత్రయమునకు ప్రభువైన రాముని ఎదుట యుద్ధములో, దేవతలు, దైత్యులు, గంధర్వులు, విద్యాధరులు, నాగులు, యక్షులు వీరిలో ఎవ్వరు కూడా నిలబడజాలరు. 44

బ్రహ్మా స్వయమ్భూశ్చతురాననో వా
రుద్రస్త్రినేత్రస్త్రిపురాన్తకో వా,
ఇన్ద్రో మహేన్ద్రః సురనాయకో వా
త్రాతుం న శక్తా యుధి రామవధ్యమ్. 45

ప్ర. అ. యుధి=యుద్ధమునందు, రామవధ్యమ్=రామునిచేత చంపదగిన వానిని, స్వయంభూః=స్వయముగా జన్మించిన, చతురాననః=నాలుగు ముఖములు కల, బ్రహ్మా వా=బ్రహ్మదేవుడు గాని, త్రినేత్రః=మూడు నేత్రములు గల, త్రిపురాన్తకః=త్రిపురసంహారకుడైన, రుద్రో వా=రుద్రుడు గాని, ఇన్ద్రః=అధికైశ్వర్యము కలవాడు, సురనాయకః=దేవతల ప్రభువు అయిన, మహేన్ద్రః వా=మహేంద్రుడు కాని, త్రాతుమ్=రక్షించుటకు, న శక్తాః=సమర్థులు కారు.

తా. యుద్ధములో రాముడు చంపదలచుకొన్న వానిని, స్వయముగా పుట్టిన, చతుర్ముఖుడైన బ్రహ్మదేవుడు గాని, మూడు నేత్రములు గల, త్రిపుర సంహారము చేసిన రుద్రుడు గాని, అధికైశ్వర్యవంతుడు, దేవతాప్రభువు అయిన మహేంద్రుడు గాని రక్షింపజాలరు.

వి. ఈ శ్లోకాలను, ప్రధానంగా 45వ శ్లోకాన్ని పట్టి బ్రహ్మరుద్రాదుల కంటె విష్ణువే అధికుడను విషయము స్పష్టమగుచున్నది. విష్ణ్వవతారమైన

రాముణ్ణి సర్వజగత్స్రష్ట్యాదిసమర్థునిగా చెప్పట జరిగినది కదా అని గోవింద రాజాదుల అభిప్రాయం. దీనినంతనీ అర్థవాదముగా మాత్రమే గ్రహించాలని కొందరి అభిప్రాయం. త్రిమూర్తులకు అభేదాన్ని అంగీకరించినవారికి ఇలాంటి బాధలేవీ లేనే లేవు. "సీతాయాస్తేజసా దగ్ధామ్" అనే 36వ శ్లోకం మొదలు, "స సౌష్ఠవోపేతమ్" అనే 46వ శ్లోకం వరకూ ఉన్న 11 శ్లోకాలు ప్రాచ్యప్రతిలో లేవు. 45

స సౌష్ఠవోపేతమదీనవాదినః
కపేర్నిశమ్యాప్రతిమోఽప్రియం వచః,
దశాననః కోపవివృత్తలోచనః
సమాదిశత్తస్య వధం మహాకపేః. 46

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే సున్దరకాణ్డే
ఏకపఞ్చాశః సర్గః.

ప్ర. అ. అప్రతిమః=సాటిలేని, సః దశాననః=ఆ రావణుడు, అదీన వాదినః=నిర్భయముగా మాటలాడుచున్న, కపేః=హనుమంతునియొక్క, సౌష్ఠవోపే తమ్=సౌష్ఠవముతో కూడిన, అప్రియమ్=తనకు ప్రియము కాని, వచః=వచనమును, నిశమ్య=విని, కోపవివృత్తలోచనః=కోపముచేత త్రిప్పబడిన నేత్రములు కలవాడై, తస్య=ఆ, మహాకపేః=హనుమంతునియొక్క, వధమ్=వధను, సమాదిశత్=ఆజ్ఞా పించెను.

తా. సాటిలేని ఆ దశాననుడు, నిర్భయముగా మాటలాడుచున్న ఆ హనుమంతుడు పలికిన, సౌష్ఠవముతో కూడిన, అప్రియవచనములు విని, కోపముతో నేత్రములు త్రిప్పుచు, "ఈ వానరుని వధింపుడు" అని ఆజ్ఞాపించెను.

"బాలానందిని"అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు
సుందరకాండలో ఏబదిఒకటవ సర్గ సమాప్తము.

అథ ద్విపఞ్చాశః సర్గః

[దూతను వధించుట తగదని బోధించుచూ విభీషణుడు, మరొక దండన మేదైన ఇవ్వమని రావణుని కోరుట. రావణుడు అందుకు అంగీకరించుట]

మూ. తస్య తద్వచనం శ్రుత్వా వానరస్య మహాత్మనః,
ఆజ్ఞాపయద్వధం తస్య రావణః క్రోధమూర్ఛితః. 1

ప్ర. అ. మహాత్మనః=మహాత్ముడైన, తస్య వానరస్య=ఆ హనుమంతు నియొక్క, తత్ వచనమ్=ఆ వచనమును, శ్రుత్వా=విని, రావణః=రావణుడు, క్రోధమూర్ఛితః=క్రోధముచేత వ్యాపింపబడినవాడై, తస్య=ఆతని యొక్క, వధమ్= వధను, ఆజ్ఞాపయత్=ఆజ్ఞాపించెను.

తా. మహాత్ముడైన ఆ హనుమంతుని మాటలు విని, క్రోధావిష్టుడై రావణుడు "వీనిని చంపుడు" అని ఆజ్ఞాపించెను. 1

మూ. వధే తస్య సమాజ్ఞప్తే రావణేన దురాత్మనా,
నివేదితవతో దౌత్యం నానుమేనే విభీషణః. 2

ప్ర. అ. దురాత్మనా=దుష్టబుద్ధిగల, రావణేన=రావణునిచేత, తస్య=ఆ తనియొక్క, వధే=వధ, సమాజ్ఞప్తే=ఆజ్ఞాపించబడినదగుచుండగా, విభీషణః=వి భీషణుడు, దౌత్యమ్=దూత చేయవలసిన దానిని, నివేదితవతః=తెలిపిన ఆతని వధను, నానుమేనే=అంగీకరించలేదు.

తా. దురాత్ముడైన రావణుడు హనుమంతుని వధింపుడని ఆజ్ఞాపించుట చూచి, విభీషణుడు, దూత ధర్మమును నిర్వర్తించిన ఆతని వధకు ఇష్టపడలేదు.

మూ. తం రక్షోధిపతిం క్రుద్ధం తచ్చ కార్యముపస్థితమ్,
విదిత్వా చిన్తయామాస కార్యం కార్యవిధౌ స్థితః. 3

ప్ర. అ. కార్యవిధౌ=కార్యమును సాధించుటయందు, స్థితః=నిలచిన, (సమర్థుడైన) విభీషణుడు, తమ్=ఆ, రక్షోధిపతిమ్=రావణుని, క్రుద్ధమ్=కోప గించినవానినిగాను, ఉపస్థితమ్=వచ్చి ఉన్న, తత్=ఆ, కార్యం చ=కార్యమును, విదిత్వా=తెలిసికొని, కార్యమ్=చేయదగిన పనిని గూర్చి, చిన్తయామాస=ఆలోచించెను.

తా. కార్యమును సాధించుటలో నేర్పరియైన ఆ విభీషణుడు, రావణుడు కోపించిన విషయమును గుర్తించి, దూతవధ అను కార్యము జరగనున్నదని తెలుసుకొని, "ఇప్పుడు ఏమి చేయవలెనా" అని ఆలోచించెను. 3

మూ. నిశ్చితార్థస్తతః సామ్నా పూజ్యం శత్రుజిగగ్రజమ్,
ఉవాచ హితమత్యర్థం వాక్యం వాక్యవిశారదః. 4

ప్ర. అ. తతః=అటు పిమ్మట, నిశ్చితార్థః=నిశ్చయము చేయబడిన కార్యము కలవాడై, శత్రుజిత్=శత్రువులను జయించువాడు, వాక్యవిశారదః= మాటలలో నేర్పు గలవాడు అయిన విభీషణుడు, పూజ్యమ్=పూజించదగిన వాడైన, అగ్రజమ్=అన్నగారిని గూర్చి, అత్యర్థమ్=మిక్కిలి, హితమ్=హితమైన, వాక్యమ్=వాక్యమును, సామ్నా=సామముతో, ఉవాచ=పలికెను.

తా. పిమ్మట శత్రుసంహారకుడు, మాటలలో నేర్పరీ అయిన ఆ విభీషణుడు తాను అనుసరించవలసిన పద్ధతిని నిశ్చయము చేసికొని, పూజ్యుడైన అన్నగారితో చాల హితమైన వాక్యమును ఈ విధముగ సామపూర్వకముగ పలికెను. 4

మూ. క్షమస్వ రోషం త్యజ రాక్షసేన్ద్ర
ప్రసీద మద్వాక్యమిదం శృణుష్వ,
వధం న కుర్వన్తి పరావరజ్ఞా
దూతస్య సన్తో వసుధాధిపేన్ద్రాః. 5

ప్ర. అ. రాక్షసేన్ద్ర=రాక్షసరాజా ! క్షమస్వ=క్షమించుము, రోషమ్=రోషమును, త్యజ=విడువుము, ప్రసీద=అనుగ్రహించుము, ఇదమ్=ఈ, మద్వాక్యమ్=నా వాక్యమును, శృణుష్వ=వినుము. పరావరజ్ఞాః=ఏది మంచిదో, ఏది చెడ్డదో ఎరిగిన, సన్తః=మంచివారైన, వసుధాధిపేన్ద్రాః=రాజశ్రేష్ఠులు, దూతస్య=దూతయొక్క, వధమ్=వధను, న కుర్వన్తి=చెయ్యరు.

తా. రాక్షసరాజా ! క్షమించుము, రోషము విడిచిపెట్టుము. అనుగ్రహించి నా మాట వినుము.మంచి చెడ్డలు తెలిసిన, సత్పురుషులైన రాజశ్రేష్ఠులు దూతను వధించరు. 5

మూ. రాజధర్మవిరుద్ధం చ లోకవృత్తేశ్చ గర్హితమ్,
తవ చాసదృశం వీర కపేరస్య ప్రమాపణమ్. 6

ప్ర. అ. వీర=వీరుడా ! అస్య=ఈ, కపేః=వానరునియొక్క, ప్రమాపణమ్=చంపుట, రాజధర్మవిరుద్ధం చ=రాజధర్మమునకు విరుద్ధము. లోకవృత్తేశ్చ=లోకమర్యాదకు కూడ, గర్హితమ్=నింద్యము, తవ చ=నీకు కూడ, అసదృశమ్=తగనిది.

తా. ఓ ! వీరుడా ! ఈ వానరుని చంపుట రాజధర్మానికి విరుద్ధమైనది. లోకమర్యాదప్రకారము కూడ నింద్యము. ఇది నీవు చేయవలసిన పనికాదు. 6

మూ. ధర్మజ్ఞశ్చ కృతజ్ఞశ్చ రాజధర్మవిశారదః,
పరావరజ్ఞో భూతానాం త్వమేవ పరమార్థవిత్. 7

ప్ర. అ. త్వమేవ=నీవే, ధర్మజ్ఞశ్చ=ధర్మములెరిగినవాడవు. కృతజ్ఞశ్చ=కృతజ్ఞుడవు, రాజధర్మవిశారదః=రాజధర్మములందు నేర్పుగలవాడవు. భూతానామ్=ప్రాణుల, పరావరజ్ఞః=తారతమ్యము ఎరిగినవాడవు, పరమార్థవిత్=యథార్థము ఎరిగినవాడవు.

తా. నీవు ధర్మాలు తెలిసినవాడవు. కృతజ్ఞుడవు. రాజధర్మాలలో నేర్పుకలవాడవు. ప్రాణులలో ఉన్న తారతమ్యము తెలిసినవాడవు. నీకు తెలియని పరమార్థము లేదు. 7

మూ. గృహ్యన్తే యది రోషేణ త్వాదృశోఽపి విపశ్చితః,
తతః శాస్త్రవిపశ్చిత్త్వం శ్రమ ఏవ హి కేవలమ్. 8

ప్ర. అ. త్వాదృశః=నీవంటి, విపశ్చితోఽపి=పండితులు కూడ, రోషేణ=కోపముచేత, గృహ్యన్తే యది=గ్రహింపబడినట్లయితే, తతః=అప్పుడు, శాస్త్రవిపశ్చిత్త్వమ్=శాస్త్రపాండిత్యము, కేవలమ్=కేవలము, శ్రమ ఏవ హి=శ్రమయే కదా.

తా. నీ వంటి పండితులు కూడ రోషమునకు లొంగిపోయినచో, శాస్త్రాలలో పాండిత్యము సంపాదించుట కేవలము శ్రమగానే మిగిలిపోవును కదా!

మూ. తస్మాత్ప్రసీద శత్రుఘ్న రాక్షసేన్ద్ర దురాసద,
యుక్తాయుక్తం వినిశ్చిత్య దూతదణ్డో విధీయతామ్. 9

ప్ర. అ. శత్రుఘ్న=శత్రుసంహారకుడా ! దురాసద=ఎదిరింప శక్యము కానివాడా !రాక్షసేన్ద్ర=రాక్షసరాజా ! తస్మాత్=ఆ కారణమువలన, ప్రసీద=అనుగ్రహించుము. యుక్తాయుక్తమ్=యుక్తాయుక్తములను, వినిశ్చిత్య=నిశ్చయించి, దూతదణ్డః=దూతయొక్క దండనము, విధీయతామ్=విధింపబడుగాక.

తా. శత్రుసంహారకుడవు, శత్రువులచే ఎదిరింప శక్యముకాని వాడవు అయిన ఓ రాక్షసరాజా ! అందువలన నీవు ప్రసన్నుడవై, మంచి చెడుగులు నిర్ణయించి, ఈ దూతకు తగిన దండము విధింపుము. 9

మూ. విభీషణవచః శ్రుత్వా రావణో రాక్షసేశ్వరః,
రోషేణ మహతావిష్టో వాక్యముత్తరమబ్రవీత్. 10

ప్ర. అ. రాక్షసేశ్వరః=రాక్షసప్రభువైన, రావణః=రావణుడు, విభీషణవచః=విభీషణుని వచనమును, శ్రుత్వా=విని, మహతా=గొప్ప, రోషేణ=రోషముచేత, ఆవిష్టః=ఆవేశింపబడినవాడై, ఉత్తరమ్=ప్రత్యుత్తర రూపమైన, వాక్యమ్=వాక్యమును, అబ్రవీత్=పలికెను.

తా. రాక్షసరాజైన రావణుడు విభీషణుని మాటలు విని, చాల కోపముతో ఈ విధముగ ప్రత్యుత్తరమిచ్చెను. 10

మూ. న పాపానాం వధే పాపం విద్యతే శత్రుసూదన,
తస్మాదేనం వధిష్యామి వానరం పాపచారిణమ్. 11

ప్ర. అ. శత్రుసూదన=శత్రువినాశకుడా ! పాపానామ్=పాపాత్ముల యొక్క, వధే=వధయందు, పాపమ్=పాపము, న విద్యతే=లేదు, తస్మాత్=ఆ కారణము వలన, పాపచారిణమ్=పాపములు చేసిన, ఏనమ్=ఈ, వానరమ్=వానరుణ్ణి, వధిష్యామి=వధించెదను.

తా. ఓ శత్రుసంహారకుడా ! పాపాత్ములను వధించినను పాపము కలుగదు. అందువలన, పాపము నాచరించిన ఈ వానరుణ్ణి, వధించెదను. 11

మూ. అధర్మమూలం బహుదోషయుక్త
మనార్యజుష్టం వచనం నిశమ్య,
ఉవాచ వాక్యం పరమార్థతత్త్వం
విభీషణో బుద్ధిమతాం వరిష్ఠః. 12

ప్ర. అ. బుద్ధిమతామ్=బుద్ధిమంతులలో, వరిష్ఠః=శ్రేష్ఠుడైన, విభీషణః=విభీషణుడు, అధర్మమూలమ్=అధర్మమునకు మూలము, బహురోషయుక్తమ్=చాల కోపముతో కూడినదీ, అనార్యజుష్టమ్=చెడ్డవారిచేత అంగీకరింపబడినదీ అయిన, వచనమ్=ఆ వచనమును, నిశమ్య=విని, పరమార్థ తత్త్వమ్=ఉత్తమమైన కార్యనిర్ణయము గల, వాక్యమ్=వాక్యమును, ఉవాచ=పలికెను.

తా. బుద్ధిమంతులలో శ్రేష్ఠుడైన విభీషణుడు, అధర్మమునకు మూలము, అధికమైన రోషముతో నిండినదీ, దుష్టులు మాత్రమే అంగీకరించేదీ, అయిన ఆ వాక్యమును విని, ఉత్తమమైన కార్యనిర్ణయమును తెలుపు వాక్యమును పలికెను.

మూ. ప్రసీద లఙ్కేశ్వర రాక్షసేన్ద్ర
ధర్మార్థయుక్తం వచనం శృణుష్వ,
దూతానవధ్యాన్ సమయేషు రాజన్
సర్వేషు సర్వత్ర వదన్తి సన్తః. 13

ప్ర. అ. లఙ్కేశ్వర=లంకాధిపతివైన, రాక్షసేన్ద్ర=రాక్షసరాజా ! ప్రసీద=అనుగ్రహించుము, ధర్మార్థయుక్తమ్=ధర్మార్థములతో కూడిన, వచనమ్=వచనమును, శృణుష్వ=వినుము, రాజన్=రాజా ! సర్వేషు=సమస్తమైన, సమయేషు=సమయములందు, సర్వత్ర=అన్ని ప్రదేశములందు, దూతాన్=దూతలను, అవధ్యాన్=చంపదగనివారినిగా, సన్తః=సత్పురుషులు, వదన్తి=చెప్పుచున్నారు.

తా. లంకాధిపతివైన ఓ ! రాక్షసరాజా ! అనుగ్రహింపుము. ధర్మార్థములతో కూడిన నే చెప్పు మాట వినుము. ఓ ! రాజా ! ఏ కాలమునందూ, ఏ దేశము నందూ కూడ దూతలను చంపకూడదు అని సత్పురుషులు చెప్పుచున్నారు. 13

మూ. అసంశయం శత్రురయం ప్రవృద్ధః
కృతం హ్యనేనాప్రియమప్రమేయమ్,
న దూతవధ్యాం ప్రవదన్తి సన్తో
దూతస్య దృష్టా బహవో హి దణ్డాః. 14

ప్ర. అ. అయమ్=ఈ, శత్రుః=శత్రువు, ప్రవృద్ధః=మితిమీరినాడు.అసంశయమ్=సంశయము లేదు, అనేన=ఇతనిచేత, అప్రమేయమ్=లెక్కింప శక్యముకాని, అప్రియమ్=అప్రియము, కృతం హి=చేయబడినది కదా, సన్తః=సత్పురుషులు, దూతవధ్యామ్=దూతవధను, న ప్రవదన్తి=చెప్పరు, దూతస్య=దూతకు, బహవః=అనేకమైన, దణ్డాః=దండనములు, దృష్టాః హి=చూడబడుచున్నవి కదా.

తా. శత్రువైన ఈ వానరుడు మితిమీరి ప్రవర్తించినాడను మాట నిజమే. ఇతడు లెక్కలేనంత అప్రియము చేసినాడు. ఏమైనా సత్పురుషులు దూతల వధను అంగీకరించరు. దూతలకు విధింపదగిన అనేక ఇతర దండనలు ఉన్నవి కదా ? 14

మూ. వైరూప్యమఙ్గేషు కశాభిఘాతో
మౌణ్డ్యం తథా లక్షణసంనిపాతః,
ఏతాన్ హి దూతే ప్రవదన్తి దణ్డాన్
వధస్తు దూతస్య న నః శ్రుతోఽస్తి. 15

ప్ర. అ. అఙ్గేషు=అవయవములందు, వైరూప్యమ్=వికారము, కశాభిఘాతః=కొరడాలచేత కొట్టడము, మౌణ్డ్యమ్=ముండనము చేయుట, తథా=మరియు, లక్షణసన్నిపాతః=గుర్తులు వేయుట, ఏతాన్=వీటిని, దూతే=దూతయందు, దణ్డాన్=దండములనుగా, ప్రవదన్తి=చెప్పుచున్నారు. దూతస్య=దూతయొక్క, వధస్తు=వధయైతే, నః=మనకు, శ్రుతః=వినబడినదిగా, నాస్తి=లేదు.

తా. అవయవములను ఛేదించుట మొదలైన వాటిచే శరీరమునకు వికారము కలిగించుట, కొరడాలతో కొట్టుట, తల గొరిగి పంపుట, ఏమైన గుర్తులు దేహము మీద వేయుట ఇది దూతకు ఇవ్వవలసిన దండనములు అని చెప్పుదురు. దూతలను చంపుట అనేదానిని మనమెన్నడూ వినలేదు కదా. 15

మూ. కథం చ ధర్మార్థవినీతబుద్ధిః
పరావరప్రత్యయనిశ్చితార్థః,
భవద్విధః కోపవశే హి తిష్ఠేత్
కోపం నియచ్ఛన్తి హి సత్త్వవన్తః. 16

ప్ర. అ. ధర్మార్థవినీతబుద్ధిః=ధర్మార్థములందు శిక్షితమైన బుద్ధిగల, పరావరప్రత్యయనిశ్చితార్థః=మంచిచెడ్డల జ్ఞానమునందు నిశ్చితమైన విషయము గల, భవద్విధః=నీవంటివాడు, కోపవశే=కోపవశమునందు, కథమ్=ఎట్లు, తిష్ఠేత్=ఉండును ? సత్త్వవన్తః=బుద్ధిమంతులు, కోపమ్=కోపమును, నియచ్ఛన్తి హి=అణచుకొందురు కదా.

తా. ధర్మార్థములను గూర్చి బాగుగా నేర్చిన బుద్ధి కలిగి, మంచిచెడ్డల విషయమున నిశ్చితమైన జ్ఞానము గల నీవంటివాడు ఇంత శీఘ్రముగా కోపమునకు వశుడెట్లగును ? బుద్ధిమంతులు కోపాన్ని నిగ్రహించుకొందురు కదా ? 16

మూ. న ధర్మవాదే న చ లోకవృత్తే
న శాస్త్రబుద్ధిగ్రహణేషు చాపి,
విద్యేత కశ్చిత్తవ వీరతుల్య
స్త్వం హ్యుత్తమః సర్వసురాసురాణామ్. 17

ప్ర. అ. వీర=ఓ ! వీరుడా, ధర్మవాదే=ధర్మమునకు సంబంధించిన సంభాషణమునందు, తవ=నీకు, తుల్యః=సమానుడు, కశ్చిత్=ఎవ్వడూ, న విద్యేత=ఉండడు, లోకవృత్తే=లోకవ్యవహారమునందు, న=ఉండడు, శాస్త్రబుద్ధిగ్రహణేషు చాపి=శాస్త్రములను గ్రహించుటయందు, ఇతరుల ఆలోచనలను గ్రహించుట యందును కూడ, న=ఉండడు, త్వమ్=నీవు, సర్వసురాసురాణామ్=అందరు సురాసురులలో, ఉత్తమః హి=ఉత్తముడవు కదా !

తా. ఓ ! వీరుడా ! ధర్మమును గూర్చిన వాదమునందు గాని, లోక వ్యవహార జ్ఞానమునందు గాని, శాస్త్రములను, ఇతరులబుద్ధిని గ్రహించుట యందు గాని నీతో సమానుడు ఎవ్వడూ లేడు. నీవు ఈ విషయములందు సురాసురులలో ఉత్తముడవు కదా. 17

మూ. శూరేణ వీరేణ నిశాచరేన్ద్ర
సురాసురాణామపి దుర్జయేన,
త్వయా ప్రగల్భాః సురదైత్యసంఘా
జితాశ్చ యుద్ధేష్వసకృన్నరేన్ద్రాః. 18

ప్ర. అ. నిశాచరేన్ద్ర=రాక్షసరాజా ! శూరేణ=శూరుడవు, వీరేణ=వీరుడవు, సురాసురాణామపి=సురులకు అసురులకు కూడ, దుర్జయేన=జయింపశక్యము కాని వాడవు అయిన, త్వయా=నీ చేత, ప్రగల్భాః=ప్రగల్భులైన, సురదైత్యసంఘాః=దేవతల యొక్క దైత్యులయొక్క సంఘములు, నరేన్ద్రాః=రాజులు, యుద్ధేషు=యుద్ధములలో, అసకృత్=అనేకపర్యాయములు, జితాశ్చ=జయింపబడినారు.

తా. ఓ ! రాక్షసరాజా ! నీవు శూరుడవు. వీరుడవు. సురాసురులు కూడా నిన్ను జయించజాలరు. నీవు అనేక పర్యాయములు యుద్ధములలో బలాఢ్యులైన సురదైత్యుల సముదాయములను, ఎందరో రాజులను జయించినావు.

మూ. న చాప్యస్య కపేర్ఘాతే కంచిత్పశ్యామ్యహం గుణమ్,
తేష్వయం పాత్యతాం దణ్డో యైరయం ప్రేషితః కపిః. 19

ప్ర. అ. అస్య=ఈ, కపేః=వానరునియొక్క, ఘాతే=చంపుటయందు, అహమ్=నేను, కంచిత్ గుణమ్=ఏ గుణమును కూడా, న పశ్యామి=చూడను. అయమ్=ఈ, దణ్డః=దండము, యైః=ఎవరిచేత, అయం కపిః=ఈ వానరుడు ప్రేషితః=పంపబడినాడో, తేషు=వారిపై, పాత్యతామ్=పడవేయబడుగాక.

తా. ఈ వానరుని చంపుటవల్ల నాకేమీ ప్రయోజనము కనబడుటలేదు. ఈ మరణదండమును, ఈ వానరుని పంపిన వారిమీద ప్రయోగింపుము. 19

మూ. సాధుర్వా యది వాసాధుః పరైరేష సమర్పితః,
బ్రువన్ పరార్థం పరవాన్న దూతో వధమర్హతి. 20

ప్ర. అ. సాధుర్వా=మంచివాడైనా, అసాధుర్యది వా=చెడ్డవాడైనా, ఏషః=ఇతడు, పరైః=శత్రువులచేత, సమర్పితః=పంపబడినవాడు. పరార్థమ్=ఇతరులకొరకై, బ్రువన్=మాటలాడుచున్న, పరవాన్=పరాధీనుడైన, దూతః=దూత, వధమ్=వధను, న అర్హతి=తగదు.

తా. ఇతడు మంచివాడైనా, చెడ్డవాడైనా, ఇతరులు పంపినవాడే కదా. తనకేవిధమైన స్వాతంత్ర్యమూ లేక పరుల పక్షాన మాటలాడే దూతను చంపకూడదు. 20

మూ. అపి చాస్మిన్ హతే రాజన్నాన్యం పశ్యామి ఖేచరమ్,
ఇహ యః పునరాగచ్ఛేత్పరం పారం మహోదధేః. 21

ప్ర. అ. రాజన్=రాజా, అపిచ=మరొక విషయమేమనగా, అస్మిన్=ఇతడు, హతే=చంపబడినవాడగుచుండగా, యః=ఎవ్వడు, మహోదధేః=మహాసముద్రము యొక్క, పరం పారమ్=ఆవలిఒడ్డును (కు), పునః=మరల, ఇహ=ఇక్కడికి, ఆగచ్ఛేత్=వచ్చునో, అట్టి, అన్యమ్=మరియొక, ఖేచరమ్=ఆకాశములో సంచరించ గలవానిని, న పశ్యామి=చూడను.

తా. రాజా ఇతనిని చంపివేసినచో, ఈ మహాసముద్రము ఇవతలి ఒడ్డున ఇక్కడికి రాగల, ఆకాశమునందు సంచరించగల మరొకడెవ్వడూ నాకు కనబడుటలేదు. 21

మూ. తస్మాన్నాస్య వధే యత్నః కార్యః పరపురంజయ,
భవాన్ సేన్ద్రేషు దేవేషు యత్నమాస్థాతుమర్హతి. 22

ప్ర. అ. పరపురంజయ=శత్రుపురములను జయించువాడా! తస్మాత్=ఆ కారణమువలన, అస్య=ఈతని యొక్క, వధే=వధయందు, యత్నః=ప్రయత్నము, న కార్యః=చేయదగినది కాదు. భవాన్=నీవు, సేన్ద్రేషు=ఇంద్రునితో కూడిన, దేవేషు=దేవతలపై, యత్నమ్=ప్రయత్నమును, ఆస్థాతుమ్=అవలంబించుటకు, అర్హసి=తగియున్నావు.

తా. శత్రుపురములను జయించువాడా ! అందువల్ల నీవీతని వధకై ప్రయత్నము చేయకుము. నీ వింద్రునిపైన, తక్కిన దేవతలపైన అట్టి ప్రయత్నము చేయుము. 22

మూ. అస్మిన్వినష్టే న హి వీరమన్యం
పశ్యామి యస్తౌ నరరాజపుత్రౌ,
యుద్ధాయ యుద్ధప్రియ దుర్వినీతా
వుద్యోజయేద్దీర్ఘపథావరుద్ధౌ. 23

ప్ర. అ. యుద్ధప్రియ=యుద్ధము ప్రియముగా కలవాడా ! అస్మిన్=ఇతడు, వినష్టే=మరణించినవాడగుచుండగా, దుర్వినీతౌ=గర్వించి యున్నవారు, దీర్ఘపథావరుద్ధౌ=దీర్ఘమార్గము చేత అడ్డుకొనబడినవారు అయిన, తౌ నర రాజపుత్రౌ=ఆ రాజకుమారులను, యః=ఎవడైతే, యుద్ధాయ=యుద్ధము కొరకు, ఉద్యోజయేత్=సన్నద్ధులను చేయునో, అట్టి, అన్యమ్=మరియొక, దూతమ్=దూతను, న పశ్యామి హి=చూడను.

తా. యుద్ధ ప్రియుడవైన ఓ ! రాక్షసరాజా ! ఈతడు మరణించినచో, చాలా దూరములో ఉన్న, గర్వితులైన ఆ రాజకుమారులను యుద్ధానికి తీసికొనిరా గలిగిన మరొక దూత ఎవ్వడూ నాకు కనబడదు. 23

మూ. పరాక్రమోత్సాహమనస్వినాం చ
సురాసురాణామపి దుర్జయేన,
త్వయా మనోనన్దన నైరృతానాం
యుద్ధాయతిర్నాశయితుం న యుక్తా. 24

ప్ర. అ. నైరృతానామ్=రాక్షసులకు, మనోనన్దన=మనస్సుకు ఆనందము కలిగించువాడా ! పరాక్రమోత్సాహమనస్వినాం చ=పరాక్రమము, ఉత్సాహము, ఉన్నతమైన మనస్సు కల, సురాసురాణామపి=సురాసురులకు కూడ, దుర్జయేన=జయింప శక్యము కాని, త్వయా=నీ చేత, యుద్ధాయతిః=యుద్ధము యొక్క రాక, నాశయితుమ్=నశింపచేయుటకు, న యుక్తా=యుక్తమైనది. కాదు.

తా. రాక్షసుల మనస్సుకు ఆనందము కలిగించువాడా ! పరాక్రమము, ఉత్సాహము, మనోధైర్యము గల సురాసురులు కూడ నిన్ను జయించజాలరు. అట్టి నీవు యుద్ధము వచ్చే అవకాశమునకు అడ్డుదగలకూడదు. 24

మూ. హితాశ్చ శూరాశ్చ సమాహితాశ్చ
కులేషు జాతాశ్చ మహాగుణేషు,
మనస్వినః శస్త్రభృతాం వరిష్ఠాః
కోట్యగ్రతస్తే సుభృతాశ్చ యోధాః. 25

ప్ర. అ. తే=నీకు, హితాశ్చ=హితులు, శూరాశ్చ=శూరులు, సమాహితాశ్చ=అప్రమత్తులుగా ఉన్నవాళ్లు, మహాగుణేషు=గొప్ప గుణములు గల, కులేషు=కులములందు, జాతాః=పుట్టినవాళ్ళు, మనస్వినః=ఆత్మాభిమానము కలవాళ్లు, శస్త్రభృతామ్=శస్త్రధారులలో, వరిష్ఠాః=శ్రేష్ఠులు, సుభృతాశ్చ=బాగుగా పోషించబడినవాళ్ళు అయిన, యోధాః=యోధులు, కోట్యగ్రతః=కోటి కంటె ఎక్కువగా, (ఉన్నారు)

తా. బాగుగా పోషింపబడుచు నీ హితమునే కోరు యోధులు నీ వద్ద, కోటికి మించి ఉన్నారు. వాళ్ళందరూ శూరులు ; ఏమరుపాటు లేనివాళ్ళు; ఆత్మాభిమానవంతులు; శస్త్రధారులలో శ్రేష్ఠులు. 25

మూ. తదేకదేశేన బలస్య తావ
త్కేచిత్తవాదేశకృతోఽభియాన్తు,
తౌ రాజపుత్రౌ వినిగృహ్య మూఢౌ
పరేషు తే భావయితుం ప్రభావమ్. 26

ప్ర. అ. తత్=ఆ కారణమువలన, తవ=నీయొక్క, ఆదేశకృతః=ఆజ్ఞను నిర్వహించు, కేచిత్=కొందరు, బలస్య=సేనయొక్క, ఏకదేశేన=ఒకభాగముతో, మూఢౌ=మూఢులైన, తౌ=ఆ, రాజపుత్రౌ=రాజపుత్రులను, వినిగృహ్య=నిగ్రహించి, పరేషు=శత్రువులపై, తే=నీయొక్క, ప్రభావమ్=ప్రభావమును, భావయితుమ్=ప్రసరింపచేయుటకు, అభియాన్తు=వెళ్లెదరు గాక.

తా. అందుచే ఆ సైన్యములో కొంత భాగమును తీసికొని, నీ ఆజ్ఞాకరులు కొందరు, మూఢులైన ఆ రాజకుమారులిద్దరినీ జయించి, నీ ప్రభావమును నీ శత్రువులందరిపై ప్రసరింపచేయుటకు యుద్ధానికై వెళ్ళుట మంచిది. 26

మూ. నిశాచరాణామధిపోఽనుజస్య
విభీషణస్యోత్తమవాక్యమిష్టమ్,
జగ్రాహ బుద్ధ్యా సురలోకశత్రు
ర్మహాబలో రాక్షసరాజముఖ్యః. 27

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే సున్దరకాణ్డే
ద్విపఞ్చాశః సర్గః.

ప్ర. అ. నిశాచరాణామ్=రాక్షసుల, అధిపః=ప్రభువు, సురలోకశత్రుః=దేవలోకమునకు శత్రువు, మహాబలః=గొప్ప బలము గలవాడూ, రాక్షసరాజముఖ్యః=రాక్షసరాజులలో ముఖ్యుడు అయిన రావణుడు, అనుజస్య=తమ్ముడైన,

విభీషణస్య=విభీషణునియొక్క, ఇష్టమ్=ఇష్టమైన, ఉత్తమవాక్యమ్=ఉత్తమమైన వాక్యమును, బుద్ధ్యా=బుద్ధితో, జగ్రాహ=గ్రహించెను.

తా. రాక్షసులకు రాజు, దేవలోకశత్రువు, మహాబలశాలి, రాక్షస రాజులలో శ్రేష్ఠుడూ అయిన రావణుడు తమ్ముడైన విభీషణుని ఇష్టము, ఉత్తమము అయిన వాక్యమును బుద్ధితో గ్రహించెను. 27

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు సుందరకాండలో ఏబదిరెండవ సర్గ సమాప్తము.

అథ త్రిపఞ్చాశః సర్గః

[రాక్షసులు హనుమంతుని తోకకు నిప్పు ముట్టించి నగరములో త్రిప్పుట].

మూ. తస్య తద్వచనం శ్రుత్వా దశగ్రీవో మహాత్మనః,
దేశకాలహితం వాక్యం భ్రాతురుత్తరమబ్రవీత్. 1

ప్ర. అ. దశగ్రీవః=రావణుడు, మహాత్మనః=మహాత్ముడైన, భ్రాతుః=సోదరుడైన, తస్య=ఆ విభీషణునియొక్క, దేశకాలహితమ్=దేశకాలములకు హితమైన, తత్ వచనమ్=ఆ వచనమును, శ్రుత్వా=విని, ఉత్తరమ్=ప్రత్యుత్తరమైన, వాక్యమ్=వాక్యమును, అబ్రవీత్=పలికెను.

తా. రావణుడు మహాత్ముడూ తన సోదరుడూ అయిన ఆ విభీషణుడు పలికిన, దేశకాలానుగుణమై, హితమైన మాట విని, ఇట్లు పలికెను. 1

మూ. సమ్యగుక్తం హి భవతా దూతవధ్యా విగర్హితా,
అవశ్యం తు వధాదన్యః క్రియతామస్య నిగ్రహః. 2

ప్ర. అ. భవతా=నీచేత, సమ్యక్=బాగుగా, ఉక్తం హి=చెప్పబడినది కదా. దూతవధ్యా=దూతయొక్క వధ, విగర్హితా=నింద్యమైనది. వధాత్=వధకంటె, అన్యః=మరియొక్క, నిగ్రహః=దండనము, అస్య=వీనికి, అవశ్యమ్=తప్పక, క్రియతామ్=చేయబడుగాక.

తా. నీవు చెప్పినది బాగున్నది. దూతను చంపుట నింద్యమైనది. అందుచేత వీనికి వధ కాక మరియొక దండనమేదైన తప్పక ఇవ్వవలెను. 2

మూ. కపీనాం కిల లాఙ్గూలమిష్టం భవతి భూషణమ్,
తదస్య దీప్యతాం శీఘ్రం తేన దగ్ధేన గచ్ఛతు. 3

ప్ర. అ. కపీనామ్=వానరులకు, లాఙ్గూలమ్=తోక, ఇష్టమ్=ఇష్టమైన, భూషణమ్=అలంకారముగా, భవతి కిల=అయి ఉన్నదట, అస్య=వీనియొక్క, తత్=ఆ లాంగూలము, శీఘ్రమ్=శీఘ్రముగా, దీప్యతామ్=కాల్చబడుగాక, దగ్ధేన=కాల్చబడిన, తేన=దానితో, గచ్ఛతు=వెళ్లుగాక.

తా. వానరులకు తోక చాల ఇష్టమైన అలంకారమట. దానికి నిప్పు అంటించుడు. కాలిపోయిన తోకతో ఇతడు వెనుకకు వెళ్లునట్లు చేయుడు. 3

మూ. తతః పశ్యన్త్విమం దీనమఙ్గవైరూప్యకర్శితమ్,
సమిత్రజ్ఞాతయః సర్వే బాన్ధవాః ససుహృజ్జనాః. 4

ప్ర. అ. తతః=అటు పిమ్మట, అఙ్గవైరూప్యకర్శితమ్=శరీరము యొక్క వైరూప్యము చేత కృశింపచేయబడి, దీనమ్=దీనుడైన, ఇమమ్=ఇతనిని, సమిత్రజ్ఞాతయః=మిత్రులలోను జ్ఞాతులతోను కూడిన, ససుహృజ్జనాః=స్నేహితులతో కూడిన, సర్వే=సమస్తమైన, బాన్ధవాః=బంధువులు, పశ్యన్తు=చూచెదరుగాక.

తా. అపుడు, అంగవికారముచేత కృశుడై, దీనుడై ఉన్న ఈతనిని మిత్రులు, జ్ఞాతులు, మిత్రులతో కూడిన బంధువులు చూచెదరుగాక. 4

మూ. ఆజ్ఞాపయద్రాక్షసేన్ద్రః పురం సర్వం సచత్వరమ్,
లాఙ్గూలేన ప్రదీప్తేన రక్షోభిః పరిణీయతామ్. 5

ప్ర. అ. ప్రదీప్తేన=మండుచున్న, లాఙ్గూలేన=తోకతో, రక్షోభిః=రాక్షసులచేత, సచత్వరమ్=చతుష్పథములతో కూడిన, సర్వమ్=సమస్తమైన, పురమ్=పట్టణమును, పరిణీయతామ్=త్రిప్పబడుగాక, అని, రాక్షసేన్ద్రః=రావణుడు, ఆజ్ఞాపయత్=ఆజ్ఞాపించెను.

తా. మండుచున్న తోకతో ఇతనిని, రాక్షసులు పురములోని చతుష్పథాలతో సహా అన్ని ప్రాంతములందూ త్రిప్పుదురు గాక అని రావణుడు ఆజ్ఞాపించెను.5

మూ. తస్య తద్వచనం శ్రుత్వా రాక్షసాః కోపకర్కశాః,
వేష్టయన్తి స్మ లాఙ్గూలం జీర్ణైః కార్పాసకైః పటైః. 6

ప్ర. అ. తస్య=రావణునియొక్క, తత్ వచనమ్=ఆ వచనమును, శ్రుత్వా=విని, కోపకర్కశాః=కోపముతో కఠినస్వభావులైన, రాక్షసాః=రాక్షసులు, జీర్ణైః=జీర్ణములైన, కార్పాసకైః పటైః=నూలు బట్టలతో, లాఙ్గూలమ్=తోకను, వేష్టయన్తి స్మ=చుట్టబెట్టిరి.

తా. కోపముచేత కఠినమైన స్వభావము గల ఆ రాక్షసులు రావణుని మాటలు విని, పాత నూలుబట్టలు హనుమంతుని తోకకు చుట్టబెట్టిరి. 6

మూ. సంవేష్ట్యమానే లాఙ్గూలే వ్యవర్ధత మహాకపిః,
శుష్కమిన్ధనమాసాద్య వనేష్వివ హుతాశనః. 7

ప్ర. అ. లాఙ్గూలే=తోక, సంవేష్ట్యమానే=చుట్టబడుచున్న దగుచుండగా, మహాకపిః=హనుమంతుడు, వనేషు=వనములందు, శుష్కమ్=ఎండిన,

ఇన్ధనమ్=కట్టెలను, ఆసాద్య=పొంది, హుతాశనః ఇవ=అగ్నివలె, వ్యవర్ధత=వృద్ధి పొందెను.

తా. రాక్షసులా విధముగా తోకకు బట్టలు చుట్టుచుండగా హనుమంతుడు, వనములో ఎండిన కట్టెలు లభించిన అగ్ని వలె వృద్ధిచెందెను. 7

మూ. తైలేన పరిషిచ్యాథ తేఽగ్నిం తత్రాభ్యపాతయన్.
లాఙ్గూలేన ప్రదీప్తేన రాక్షసాంస్తానపాతయత్, 8
రోషామర్షపరీతాత్మా బాలసూర్యసమాననః.

ప్ర. అ. అథ=అటుపిమ్మట, తే=వాళ్లు, తైలేన=తైలముతో, పరిషిచ్య=తడిపి, తత్ర=ఆ తోకమీద, అగ్నిమ్=అగ్నిని, అభ్యపాతయన్=ఉంచిరి. బాలసూర్యసమాననః=బాలసూర్యునితో సమానమైన ముఖము గల హనుమంతుడు, రోషామర్షపరీతాత్మా=కోపముతోను, ఓర్పులేకపోవుటతోను నిండిన మనస్సు కలవాడై, ప్రదీప్తేన=మండుచున్న, లాఙ్గూలేన=తోకతో, తాన్ రాక్షసాన్=ఆ రాక్షసులను, అపాతయత్=పడవేసెను.

తా. పిమ్మట ఆ రాక్షసులు తైలముతో తడిపి, ఆ తోకకు నిప్పు ముట్టించిరి. అప్పుడు తోక మండుచుండగా, బాలసూర్యుని వంటి ముఖము గల హనుమంతుడు, పట్టరాని కోపముతో, ఆ రాక్షసులనందరిని క్రిందికి పడద్రోసెను.

మూ. లాఙ్గూలం సంప్రదీప్తం తు ద్రష్టుం తస్య హనూమతః, 9
సహస్త్రీబాలవృద్ధాశ్చ జగ్ముః ప్రీతా నిశాచరాః.

ప్ర. అ. తస్య హనూమతః=ఆ హనుమంతునియొక్క, సంప్రదీప్తమ్=మండుచున్న, లాఙ్గూలమ్=తోకను, ద్రష్టుమ్=చూచుటకు, నిశాచరాః=రాక్షసులు, ప్రీతాః=సంతోషించుచున్నవారై, సహస్త్రీబాలవృద్ధాశ్చ=స్త్రీబాల వృద్ధులతో కూడినవారై, జగ్ముః=వెళ్ళిరి.

తా. రాక్షసులందరూ సంతోషించుచు, హనుమంతుని ప్రజ్వలించుచున్న తోకను చూచుటకై స్త్రీలతో, బాలులతో, వృద్ధులతో సహా అక్కడికి వెళ్ళిరి. 9

మూ. స భూయః సంగతైః క్రూరై రాక్షసైర్హరిసత్తమః, 10
నిబద్ధః కృతవాన్వీరస్తత్కాలసదృశీం మతిమ్.

ప్ర. అ. వీరః=వీరుడైన, సః హరిసత్తమః=ఆ వానర శ్రేష్ఠుడు, సంగతైః=కలిసిన, క్రూరైః=క్రూరులైన, రాక్షసైః=రాక్షసులచేత, భూయః=మరల,

నిబద్ధః=కట్టబడినవాడై, తత్కాలసదృశీమ్=ఆ కాలమునకు తగిన, మతిమ్=బుద్ధిని, కృతవాన్=చేసినాడు.

తా. ఆ రాక్షసులందరూ చేరి, వీరుడైన ఆ హనుమంతుని మరల బంధించిరి. అప్పుడాతడు ఆ సమయానికి తగిన ఆలోచన చేసెను. 10

మూ. కామం ఖలు న మే శక్తా నిబద్ధస్యాపి రాక్షసాః, 11
ఛిత్త్వా పాశాన్ సముత్పత్య హన్యామహమిమాన్ పునః.

ప్ర. అ. రాక్షసాః=ఆ రాక్షసులు, నిబద్ధస్యాపి=బంధింపబడినవాడనైనా, మే=నా విషయమున, న శక్తాః కామం ఖలు=(అపకారము చేయుటకు) సమర్థులు కానే కారు. అహమ్=నేను, పునః=మరల, పాశాన్=పాశములను, ఛిత్త్వా=ఛేదించి, సముత్పత్య=ఎగిరి, ఇమాన్=వీళ్ళను, హన్యామ్=చంపుదును.

తా. ఈ రాక్షసులు నన్ను బంధించినా నన్నేమీ చేయజాలరనునది నిజమే. ఎందుచేతననగా ఈ పాశములు తెంచుకొని, పైకి ఎగిరి వీళ్ళనందరినీ చంపగలను. 11

మూ. యది భర్తుర్హితార్థాయ చరన్తం భర్తృశాసనాత్, 12
బధ్నన్త్యేతే దురాత్మానో న తు మే నిష్కృతిః కృతా.

ప్ర. అ. భర్తుః=ప్రభువైన రామునియొక్క, హితార్థాయ=హితము కొరకై, చరన్తమ్=ప్రవర్తించుచున్న నన్ను, ఏతే దురాత్మానః=ఈ దుర్మతులు, భర్తృశాసనాత్=వాళ్ల ప్రభువైన రావణుని ఆజ్ఞవలన, బధ్నన్తి యది=బంధించి నట్లయితే, మే=నాకు, నిష్కృతిః=ప్రతిక్రియ, న కృతా=చేయబడలేదు.

తా. నా ప్రభువైన రాముని హితము కొరకై నేను ప్రవర్తించుచున్నాను. అట్టి నన్ను ఈ దుర్మతులు తమ ప్రభువు ఆజ్ఞను అనుసరించి బంధించినా వాళ్లేదో నాకు ప్రతిక్రియ చేయుటలో సఫలులైనారు అని నేను విచారించవలసిన పనిలేదు. 12

మూ. సర్వేషామేవ పర్యాప్తో రాక్షసానామహం యుధి, 13
కింతు రామస్య ప్రీత్యర్థం విషహిష్యేఽహమీదృశమ్,
లఙ్కా చారయితవ్యా వై పునరేవ భవేదితి. 14

ప్ర. అ. యుధి=యుద్ధమునందు, అహమ్=నేను, సర్వేషామేవ=సమస్తమైన, రాక్షసానామ్=రాక్షసులకు, పర్యాప్తః=సరిపోయినవాడను. కింతు=కాని, రామస్య=రామునియొక్క, ప్రీత్యర్థమ్=ప్రీతికొరకై, అహమ్=నేను, ఈదృశమ్=ఇట్టి

దానిని, లఙ్కా=లంక, పునరేవ=మరల, చారయితవ్యా=సంచరింపచేయబడదగినది, భవేత్=అగును, ఇతి=ఈ కారణము వలన, విషహిష్యే=సహించెదను.

తా. యుద్ధములో ఈ రాక్షసులనందరినీ చంపుటకు నేనొక్కడినే చాలుదును. అయినా రాముని సంతోషముకొరకూ, వీళ్లు నన్ను లంక అంతా త్రిప్పుదురుగాన లంకను మళ్ళీ చూచుటకొరకూ, ఈ బంధనాదులను సహించెదను.

మూ. రాత్రౌ న హి సుదృష్టా మే దుర్గకర్మవిధానతః,
అవశ్యమేవ ద్రష్టవ్యా మయా లఙ్కా నిశాక్షయే. 15

ప్ర. అ. లఙ్కా=లంక, దుర్గకర్మవిధానతః=దుర్గకర్మవిధి ననుసరించి, రాత్రౌ=రాత్రియందు, సుదృష్టా=బాగుగా చూడబడినది, న హి=కాదు కదా. నిశాక్షయే=పగలు, మయా=నాచేత, అవశ్య మేవ=తప్పక, ద్రష్టవ్యా=చూడదగినది.

తా. నేను లంకను రాత్రి చూచినప్పుడు దీని దుర్గనిర్మాణాదులను సరిగా చూడలేదు. అందుచేత దీనిని పగలు బాగుగా చూడవలెను. 15

మూ. కామం బద్ధస్య మే భూయః పుచ్ఛస్యోద్దీపనేన చ,
పీడాం కుర్వన్తు రక్షాంసి న మేఽస్తి మనసః శ్రమః. 16

ప్ర. అ. భూయః=మరల, బద్ధస్య=కట్టబడిన, మే=నాకు, పుచ్ఛస్య=తోకయొక్క, ఉద్దీపనేన చ=ప్రజ్వలింపచేయుటచేత కూడా, రక్షాంసి=రాక్షసులు, కామమ్=వాళ్ళ ఇష్టము వచ్చినట్లు, పీడామ్=పీడను, కుర్వన్తు=చేయుదురుగాక, మే=నాయొక్క, మనసః=మనస్సుకు, శ్రమః=శ్రమ, నాస్తి=లేదు.

తా. ఈ రాక్షసులు నన్ను మళ్ళీ బంధించి తోకకు నిప్పు కూడా అంటించి పీడించినచో పీడింతురు గాక !నా మనస్సుకు ఏ మాత్రము శ్రమ లేదు. 16

మూ. తతస్తే సంవృతాకారం సత్త్వవన్తం మహాకపిమ్,
పరిగృహ్య యయుర్హృష్టా రాక్షసాః కపికుఞ్జరమ్. 17

ప్ర. అ. తతః=అటు పిమ్మట, తే రాక్షసాః=ఆ రాక్షసులు, హృష్టాః=సంతోషించినవారై, సంవృతాకారమ్=కప్పబడిన ఆకారము కలవాడు (మనోభావములను రహస్యముగా ఉంచుకొన్నవాడు.) సత్త్వవన్తమ్=బలము కలవాడు, కపికుఞ్జరమ్=వానరశ్రేష్ఠుడు అయిన, మహాకపిమ్=హనుమంతుని, పరిగృహ్య=పట్టుకొని, యయుః=వెళ్ళిరి.

తా. మహాబలశాలీ, వానరశ్రేష్ఠుడూ అయిన ఆ హనుమంతుడు మనస్సు లోని భావము పైకి తెలియనీయక పడి యుండగా, ఆ రాక్షసులు పట్టుకొని, సంతోషించుచు వెళ్ళిరి. 17

మూ. శఙ్ఖభేరీనినాదైస్తం ఘోషయన్తః స్వకర్మభిః,
రాక్షసాః క్రూరకర్మాణశ్చారయన్తి స్మ తాం పురీమ్. 18

ప్ర. అ. క్రూరకర్మాణః=క్రూరమైన కర్మలు గల, రాక్షసాః=రాక్షసులు, తమ్=ఆ హనుమంతుని, శఙ్ఖభేరీనినాదైశ్చ=శంఖధ్వనులతోను భేరీధ్వనులతోను, స్వకర్మభిః=ఆతని కర్మలచేత, ఘోషయన్తః=చాటుచు, తాం పురీమ్=ఆ పట్టణమును, చారయన్తి స్మ=త్రిప్పిరి.

తా. క్రూరమైన పనులు చేయు ఆ రాక్షసులు, శంఖములు భేరీలు మ్రోగించుచు, ఆ హనుమంతుడు చేసిన వనభంగము మొదలైన అపరాధములను ఘోషించుచు, ఆతనిని ఆ నగరమునందు అంతటా త్రిప్పిరి. 18

మూ. అన్వీయమానో రక్షోభిర్యయౌ సుఖమరిందమః,
హనుమాంశ్చారయామాస రాక్షసానాం మహాపురీమ్. 19

ప్ర. అ. అరిందమః=శత్రువులను పీడించు, హనుమాన్=హనుమంతుడు, రక్షోభిః=రాక్షసులచేత, అన్వీయమానః=అనుసరింపబడుచున్నవాడై, సుఖమ్=సుఖముగా, యయౌ=వెళ్లెను. రాక్షసానామ్=రాక్షసులయొక్క, మహాపురీమ్=మహానగరమును, చారయామాస=సంచరించెను.

తా. శత్రువినాశకుడైన ఆ హనుమంతుడు రాక్షసులు వెంట రాగా సుఖముగా వెళ్ళి, రాక్షసుల మహానగరమైన లంకలో తిరిగెను. 19

మూ. అథాపశ్యద్విమానాని విచిత్రాణి మహాకపిః,
సంవృతాన్ భూమిభాగాంశ్చ సువిభక్తాంశ్చ చత్వరాన్. 20

ప్ర. అ. అథ=అటుపిమ్మట, మహాకపిః=హనుమంతుడు, విచిత్రాణి=విచిత్రములైన, విమానాని=గృహములను, సంవృతాన్=కప్పబడిన, భూమిభాగాంశ్చ=భూమిలోని ప్రదేశములను, సువిభక్తాన్=బాగుగా తీర్చిఉన్న, చత్వరాన్=చతుష్పథములను, అపశ్యత్=చూచెను.

తా. పిమ్మట హనుమంతుడు అక్కడ విచిత్రములైన విమానములను, రహస్యమైన భూగృహములను, బాగుగా తీర్చిన చతుష్పథాలను చూచెను. 20

మూ. వీథీశ్చ గృహసంబాధాః కపిః శృఙ్గాటకాని చ,
తథా రథ్యోపరథ్యాశ్చ తథైవ గృహకాన్తరాన్, 21
గృహాంశ్చ మేఘసంకాశాన్ దదర్శ పవనాత్మజః.

ప్ర. అ. పవనాత్మజః=వాయుపుత్రుడైన, కపిః=హనుమంతుడు, గృహసంబాధాః=గృహములతో ఇరుకుగా ఉన్న, వీథీః=వీథులను, శృఙ్గాటకాని చ=చతుష్పథములను, తథా=మరియు, రథ్యోపరథ్యాశ్చ=మార్గములను, చిన్నమార్గములను, తథైవ చ=మరియు, గృహకాన్తరాన్=చిన్న గృహములను, మేఘసంకాశాన్=మేఘములతో సమానమైన, గృహాంశ్చ=పెద్ద గృహములను, దదర్శ=చూచెను.

తా. వాయుపుత్రుడైన హనుమంతుడు గృహాలతో ఇరుకుగా ఉన్న వీథులనూ, చతుష్పథాలను, పెద్ద మార్గములను, చిన్న మార్గములను, చిన్న గృహములను, మేఘముల వంటి ఎత్తైన గృహములను చూచెను. 21

మూ. చత్వరేషు చతుష్కేషు రాజమార్గే తథైవ చ, 22
ఘోషయన్తి కపిం సర్వే చారీక ఇతి రాక్షసాః.

ప్ర. అ. సర్వే=సమస్తమైన, రాక్షసాః=రాక్షసులు, చత్వరేషు=చతుష్పథములందు, చతుష్కేషు=నాలుగు స్తంభాల మండపములందు, తథైవ చ=మరియు, రాజమార్గే=రాజమార్గమునందు, కపిమ్=హనుమంతునిగూర్చి, చారీకః ఇతి=గూఢచారి అని, ఘోషయన్తి=చాటుచుండిరి.

తా. ఆ రాక్షసులందరూ హనుమంతుని చతుష్పథాలకు, నాలుగు స్తంభాల మండపాలకు రాజమార్గమునకూ తీసికొని పోయి "ఇతడొక గూఢచారి" అని చాటుచుండిరి. 22

మూ. స్త్రీబాలవృద్ధా నిర్జగ్ముస్తత్ర తత్ర కుతూహలాత్, 23
తం ప్రదీపితలాఙ్గూలం హనుమన్తం దిదృక్షవః.

ప్ర. అ. ప్రదీపితలాఙ్గూలమ్=కాల్చబడిన తోక గల, తం హనుమన్తమ్=ఆ హనుమంతుణ్ణి, దిదృక్షవః=చూడదలచినవారై, స్త్రీబాలవృద్ధాః=స్త్రీలు, బాలులు, వృద్ధులు, తత్ర తత్ర=ఆయా ప్రదేశములలో, కుతూహలాత్=కుతూహలమువలన, నిర్జగ్ముః=బైటకు వచ్చిరి.

తా. తోక కాల్చిన హనుమంతుని చూడవలెననే కుతూహలములో ఆయా ప్రదేశముల నుండి, స్త్రీలు, బాలులు, వృద్ధులు బైటకు వచ్చిరి. 23

మూ. దీప్యమానే తతస్తత్ర లాఙ్గూలాగ్రే హనూమతః, 24
రాక్షస్యస్తా విరూపాక్ష్యః శంసుర్దేవ్యాస్తదప్రియమ్.

ప్ర. అ. తతః=అటు పిమ్మట, తత్ర=అక్కడ, హనూమతః=హనుమంతుని యొక్క, లాఙ్గూలాగ్రే=తోకయొక్క అగ్రభాగము, దీప్యమానే=వెలిగింపబడుచుండగా, విరూపాక్ష్యః=వికృతమైన నేత్రములు గల, తాః రాక్షస్యః=ఆ రాక్షసస్త్రీలు, దేవ్యాః= సీతాదేవికి, అప్రియమ్=అప్రియమైన, తత్=దానిని, శశంసుః=చెప్పిరి.

తా. అప్పుడు హనుమంతుని తోక చివరి భాగమును రాక్షసులు వెలిగించుచున్నప్పుడు, వికృతమైన నేత్రములు గల స్త్రీలు, అప్రియమైన ఆ విషయమును సీతాదేవికి తెలిపిరి. 24

మూ. యస్త్వయా కృతసంవాదః సీతే తామ్రముఖః కపిః, 25
లాఙ్గూలేన ప్రదీప్తేన స ఏష పరిణీయతే.

ప్ర. అ. సీతే=సీతా ! యః=ఏ, తామ్రముఖః=ఎఱ్ఱని ముఖముగల, కపిః=వానరుడు, త్వయా=నీతో, కృతసంవాదః=చేయబడిన భాషణము కలవాడో, స ఏషః=అట్టి ఈ వానరుడు, ప్రదీప్తేన=ప్రజ్వలింపబడిన, లాఙ్గూలేన=తోకతో, పరిణీయతే=(పట్టణము చుట్టూ) త్రిప్పబడుచున్నాడు.

తా. సీతా ! నీతో మాటలాడిన, ఎఱ్ఱని ముఖము గల వానరుణ్ణి, అతని తోకకు నిప్పు అంటించి పట్టణములో త్రిప్పుచున్నారు. 25

మూ. శ్రుత్వా తద్వచనం క్రూరమాత్మాపహరణోపమమ్, 26
వైదేహీ శోకసంతప్తా హుతాశనముపాగమత్.

ప్ర. అ. వైదేహీ=సీత, ఆత్మాపహరణోపమమ్=తనయొక్క అపహర ణముతో సమానమైన, క్రూరమ్=క్రూరమైన, తత్ వచనమ్=ఆ వచనమును, శ్రుత్వా=విని, శోకసంతప్తా=శోకముచేత తపింపచేయబడిన దై, హుతాశనమ్=అగ్నిని, ఉపాగమత్=ఉపాసించెను.

తా. తనను రావణుడు అపహరించి నప్పుడు ఎంత దుఃఖము కలిగెనో అంత దుఃఖమును కలిగించు క్రూరమైన ఆ మాట విని, సీత దుఃఖతప్తురాలై, అగ్నిని (జ్వలింపచేసి) ఉపాసించెను. 26

మూ. మఙ్గళాభిముఖీ తస్య సా తదాసీన్మహాకపేః, 27
ఉపతస్థే విశాలాక్షీ ప్రయతా హవ్యవాహనమ్.

ప్ర. అ. తదా=అప్పుడు, సా=ఆమె, మహాకపేః=హనుమంతుని యొక్క, మఙ్గలాభిముఖీ=క్షేమమును ఆకాంక్షించునది, ఆసీత్=అయెను. విశాలాక్షీ=విశాలాక్షి యైన ఆ సీత, ప్రయతా=పరిశుద్ధమైన మనస్సు కలదై, హవ్యవాహనమ్=అగ్నిదేవుని, ఉపతస్థే=సేవించెను. (ప్రార్థించెను).

తా. అప్పుడు, విశాలములైన నేత్రములు గల ఆ సీత హనుమంతుని క్షేమమును కోరుచు, పరిశుద్ధమైన చిత్తముతో అగ్నిదేవుని ప్రార్థించెను. 27

మూ. యద్యస్తి పతిశుశ్రూషా యద్యస్తి చరితం తపః,
యది చాస్త్యేకపత్నీత్వం శీతో భవ హనూమతః. 28

ప్ర. అ. పతిశుశ్రూషా=భర్తయొక్క సేవ, అస్తి యది=ఉన్నట్లయితే, తపః=తపస్సు, చరితమ్=చేయబడినదై, అస్తి యది=ఉన్నట్లయితే, ఏకపత్నీత్వమ్=పాతివ్రత్యము, అస్తి చ యది=ఉన్నట్లయితే, త్వమ్=నీవు, హనూమతః=హనుమంతునకు, శీతః=చల్లనివాడవు, భవ=అగుము.

తా. అగ్నిదేవా ! నేను పతిసేవ చేసినదాననే అయితే, నేనేదైన తపస్సు చేసి ఉన్నట్లయితే, నాకు పాతివ్రత్యమే ఉన్నట్లయితే, హనుమంతుని విషయమున చల్లగా ఉండుము. 28

మూ. యది కించిదనుక్రోశస్తస్య మయ్యస్తి ధీమతః, 29
యది వా భాగ్యశేషో మే శీతో భవ హనూమతః.

ప్ర. అ. ధీమతః=బుద్ధిమంతుడైన, తస్య=ఆ రామునకు, మయి=నా యందు, కించిత్=కొంచెమైనా, అనుక్రోశః=దయ, అస్తి యది=ఉన్నట్టయితే, మే=నాకు, భాగ్యశేషః=భాగ్యముయొక్క శేషము, యది వా=ఉన్నట్లయితే, హనూమతః=హనుమంతునకు, శీతః=చల్లనివాడవు, భవ=ఆగుము.

తా. అగ్నిదేవా ! బుద్ధిశాలియైన ఆ రామునకు నాపై ఏ కొంచెమైనా దయ ఉన్నట్లయితే, నా భాగ్యము ఏమైనా శేషించి ఉంటే హనుమంతునకు చల్లగా అగుము. 29

మూ. యది మాం వృత్తసంపన్నాం తత్సమాగమలాలసామ్,
స విజానాతి ధర్మాత్మా శీతో భవ హనూమతః.

ప్ర. అ. ధర్మాత్మా=ధర్మాత్ముడైన, సః=ఆ రాముడు, మామ్=నన్ను, వృత్తసంపన్నామ్=సద్వృత్తముతో కూడినదానినిగామా, తత్సమాగమలాలసామ్=ఆ

తని సమాగమమునందు చాలా ఆసక్తి కలదానినిగాను, విజానాతి యది=ఎరిగి ఉన్నట్లయితే, హనూమతః=హనుమంతునకు, శీతః=చల్లనివాడవు, భవ=అగుము.

తా. నేను చెడని సద్వృత్తముతో ఆతనిని కలియుటకు చాల ఔత్సుక్యముతో ఉన్నానని ధర్మాత్ముడైన ఆ రాముడు అనుకొనుచున్నచో హనుమంతునకు చల్లగా అగుము. 30

మూ. యది మాం తారయేదార్యః సుగ్రీవః సత్యసంగరః, 31
అస్మాద్దుఃఖామ్బుసంరోధాచ్ఛీతో భవ హనూమతః.

ప్ర. అ. ఆర్యః=పూజ్యుడు, సత్యసంగరః=సత్యమైన ప్రతిజ్ఞకల వాడు అయిన, సుగ్రీవః=సుగ్రీవుడు, అస్మాత్=ఈ, దుఃఖామ్బుసంరోధాత్=దుఃఖసముద్రమునుండి, మామ్=నన్ను, తారయేద్యది=దాటింపగలవాడైతే, హనూమతః=హనుమంతునకు, శీతః=చల్లనివాడవు, భవ=అగుము.

తా. పూజ్యుడు, సత్యమైన ప్రతిజ్ఞ కలవాడు అయిన సుగ్రీవుడు నన్ను ఈ దుఃఖసముద్రమునుండి దాటించుట జరుగనున్నచో హనుమంతునకు చల్లగా ఉండుము.

వి. ఈ శ్లోకం ప్రాచ్యప్రతిలో లేదు. పై మూడు శ్లోకాలు సీతాదేవి తన పాతివ్రత్యం పైనా, తన పవిత్రత్వాన్ని రాముడు గుర్తించుటపైన ఒట్టు పెట్టి హనుమంతుణ్ణి రక్షింపుమని అగ్నిదేవుని కోరుచున్నది. అట్టి సందర్భంలో సుగ్రీవుని మాట ఎత్తడం అంత సమంజసంగా లేదు కదా ? లక్ష్మణుని మాట కూడ ఎత్త లేదు కదా ? ఏదో శకునం చూచే వాళ్ళు అనుకొనే మాట వలె ఉన్నది. ఈ శ్లోకం లేకపోవడమే ఉచితం. పై మూడుశ్లోకాలలో "శీతో భవ" కు బదులు "శివో భవ" అని ప్రాచ్యపాఠములో ఉన్నది. "శివః" అనడంలో అన్ని విధాలా హనుమంతునకు మంగళప్రదుడవగుము అను విస్తృతార్థం లభిస్తుంది. రాబోవు శ్లోకంలో కూడా 'శివం' అని ఉన్నది. 31

మూ. తతస్తీక్ష్ణార్చిరవ్యగ్రః ప్రదక్షిణశిఖోఽనలః, 32
జజ్వాల మృగశాబాక్ష్యాః శంసన్నివ శివం కపేః.

ప్ర. అ. తతః=అటు పిమ్మట, అనలః=అగ్నిదేవుడు, మృగశాబాక్ష్యాః=లేడిపిల్ల కళ్ళ వంటికళ్ళు గల సీతకు, కపేః=హనుమంతునియొక్క, శివమ్=క్షేమమును, శంసన్నివ=చెప్పుచున్నాడా అన్నట్లు, తీక్ష్ణార్చిః=తీక్ష్ణమైన జ్వాలలు కలవాడై, ప్రదక్షిణశిఖః=ప్రదక్షిణమైన శిఖలు కలవాడై, అవ్యగ్రః=తొట్రుపాటులేనివాడై, జజ్వాల=ప్రజ్వలించెను.

తా. అప్పుడు ఆ అగ్నిదేవుడు హనుమంతుడు క్షేమముగా ఉన్నాడను విషయమును సీతకు చెప్పుచున్నాడా అన్నట్లు తీక్ష్ణమైన మంటలతో, తొట్రుపాటు లేకుండ, ప్రదక్షిణముగా ఉన్న (కుడి వైపునకు తిరుగుచున్న) జ్వాలా గ్రములతో, ప్రజ్వలించెను. 32

మూ. హనుమజ్జనకశ్చాపి పుచ్ఛానలయుతోఽనిలః, 33
వవౌ స్వాస్థ్యకరో దేవ్యాః ప్రాలేయానిలశీతలః.

ప్ర. అ. హనుమజ్జనకః=హనుమంతుని తండ్రియైన, అనిలః=వాయువు, పుచ్ఛానలయుతః=పుచ్ఛమునందున్న అగ్నితో కూడినవాడై, దేవ్యాః=సీతకు, స్వాస్థ్య కరః=చిత్తస్వాస్థ్యమును కలిగించుచు, ప్రాలేయానిలశీతలః=మంచుగాలి వలె చల్లనై, వవౌ=వీచెను.

తా. హనుమంతుని తండ్రియైన వాయుదేవుడు కూడ, తోకమీద నున్న అగ్నితో కూడినవాడై, దేవి మనస్సు కుదుటపడునట్లు, చలిగాలి వలె చల్లగా వీచెను.

వి. సీతాదేవి తన ఎదుట అగ్నిని ప్రజ్వలింపచేసి ప్రార్థించి నప్పుడు ఆ అగ్ని ప్రదక్షిణజ్వాలలతో శుభసూచనము చేయుట యుక్తముగానే ఉన్నది. సీత దగ్గర వాయుదేవుడు కూడ చల్లగా వీచినాడు అని చెప్పినచో అది కూడా శుభసూచకమని అనుకొనవచ్చును. ఆ వాయువు హనుమంతుని తోకమీద ఉన్న అగ్నితో కలిసి ఉన్నాడు అని చెప్పటలో అట్టి వాయువు సీత మనస్సుకు స్వాస్థ్యము ఎట్లు చేకూర్చగలడు ? హనుమంతుడెక్కడో నగర వీథులలో ఉన్నాడు కదా ? అందుచేతనే కాబోలు ఈ శ్లోకం ప్రాచ్యపాఠంలో లేదు. 33

మూ. దహ్యమానే చ లాఙ్గూలే చిన్తయామాస వానరః, 34
ప్రదీప్తోఽగ్నిరయం కస్మాన్న మాం దహతి సర్వతః.

ప్ర. అ. లాఙ్గూలే=తోక, దహ్యమానే=దహింపబడుచుండగా, వానరః=హనుమంతుడు, చిన్తయామాస=ఆలోచించెను, సర్వతః=అంతటా, ప్రదీప్తః=ప్రజ్వలించుచున్న, అయమ్ అగ్నిః=ఈ అగ్ని, మామ్=నన్ను, కస్మాత్=ఎందువలన, న దహతి=దహించుటలేదు. ?

తా. తన తోక దహింపబడుచుండుట చూచి హనుమంతుడిట్లు అనుకొనెను. అంతటా మండుచున్న ఈ అగ్ని నన్ను ఎందువలన దహించుట లేదో ! 34

మూ. దృశ్యతే చ మహాజ్వాలః కరోతి న చ మే రుజమ్, 35
శిశిరస్యేవ సంఘాతో లాఙ్గూలాగ్రే ప్రతిష్ఠితః.

ప్ర. అ. మహాజ్వాలః=గొప్ప జ్వాల కలదిగా, దృశ్యతే=చూడబడుచున్నది, మే=నాకు, రుజమ్=బాధను, న కరోతి చ=చేయుట లేదు. లాఙ్గూలాగ్రే=తోక చివర, శిశిరస్య=మంచుయొక్క, సంఘాతః=ముద్ద, ప్రతిష్ఠితః ఇవ=ఉంచబడి నట్లున్నది, ('సంపాతః' అనుపాఠము కంటె 'సంఘాతః' అను ప్రాచ్యపాఠము బాగున్నది).

తా. ఈ అగ్ని పెద్ద జ్వాలలతో కనబడుచున్నది. కాని నాకు మాత్రము ఏమీ బాధ కలిగించుటలేదు. నా తోక చివర మంచుముద్ద పెట్టి నట్లు ఉన్నది?

మూ. అథవా తదిదం వ్యక్తం యద్దృష్టం ప్లవతా మయా, 36
రామప్రభావాదాశ్చర్యం పర్వతః సరితాం పతౌ.

("పర్వతోదధిసంగమే" అను ప్రాచ్యపాఠం బాగున్నది).

ప్ర. అ. అథవా=లేదా, యత్=ఏ కారణమువలన, ప్లవతా=ఎగురుచున్న, మయా=నాచేత, రామప్రభావాత్=రామునియొక్క ప్రభావమువలన, పర్వతోదధిసంగమే=పర్వతములోను, సముద్రముతోను కలియుటయందు, ఆశ్చర్యమ్=ఆశ్చర్యము, దృష్టమ్=చూడబడినదో, తత్=అందువలన, ఇదమ్=ఇది, వ్యక్తమ్=స్పష్టమైనది.

తా. లేదా నేను సముద్రలంఘనము చేయునప్పుడు, రాముని ప్రభావము వలన, మైనాకముతోను, తద్ద్వారా సముద్రునితోను సంబంధము ఆశ్చర్యకరముగా ఏర్పడినది కదా ? దానిని పట్టి దీని కారణము స్పష్టమగుచున్నది. 36

మూ. యది తావత్సముద్రస్య మైనాకస్య చ ధీమతః, 37
రామార్థం సంభ్రమస్తాదృక్కిమగ్నిర్న కరిష్యతి.

ప్ర. అ. సముద్రస్య=సముద్రమునకు, ధీమతః=బుద్ధిమంతుడైన, మైనాకస్య=మైనాకమునకు, రామార్థమ్=రాముని నిమిత్తమైన, తాదృక్=అట్టి, సంభ్రమః యది=(సాహాయ్యము చేయవలెనను) తొందర ఉన్నచో, అగ్నిః=అగ్ని, కిమ్=ఎందువలన, న కరిష్యతి=చెయ్యడు ?

తా. సముద్రుడూ, ధీమంతుడైన మైనాకుడూ రామునికి సాహాయ్యము చేయవలెనని అంతగా తొందర చూపినప్పుడు అగ్నిదేవుడు మాత్రము అట్లు ఎందుకు చెయ్యడు ? 37

మూ. సీతాయాశ్చానృశంస్యేన తేజసా రాఘవస్య చ, 38
పితుశ్చ మమ సఖ్యేన న మాం దహతి పావకః.

ప్ర. అ. సీతాయాః=సీతాదేవియొక్క, ఆనృశంస్యేన=దయచేత, రాఘవస్య=రామునియొక్క, తేజసా=తేజస్సుచేత, మమ పితుః=నా తండ్రి యొక్క, సఖ్యేన=స్నేహముచేత, పావకః=అగ్ని, మామ్=నన్ను, న దహతి=కాల్చుట లేదు.

తా. నాపై సీతాదేవికి ఉన్న దయచేతను, రాముని తేజస్సు చేతను,నా తండ్రియైన వాయుదేవునితో తన కున్న స్నేహము చేతను, అగ్నిదేవుడు నన్ను కాల్చుట లేదు. 38

మూ. భూయః స చిన్తయామాస ముహూర్తం కపికుఞ్జరః, 39
ఉత్పపాతాథ వేగేన ననాద చ మహాకపిః.

ప్ర. అ. కపికుఞ్జరః=వానరశ్రేష్ఠుడైన, సః మహాకపిః=ఆ హనుమంతుడు, భూయః=మరల, చిన్తయామాస=ఆలోచించెను. అథ=అటుపిమ్మట, వేగేన=వేగముతో, ఉత్పపాత=ఎగిరెను. ననాద చ=ధ్వని చేసెను కూడ.

తా. వానరశ్రేష్ఠుడైన ఆ హనుమంతుడు మరల ఒక క్షణము ఆలోచించి, వేగముగ పైకి ఎగిరి, గర్జించెను. 39

మూ. పురద్వారం తతః శ్రీమాన్ శైలశృఙ్గమివోన్నతమ్, 40
విభక్తరక్షఃసంబాధమాససాదానిలాత్మజః.

ప్ర. అ. తతః=అటు పిమ్మట, శ్రీమాన్=అధికమైన శోభగల, అనిలాత్మజః=హనుమంతుడు, శైలశృఙ్గమివ=పర్వతశిఖరమువలె, ఉన్నతమ్=ఉన్నతమైనది, విభక్తరక్షః సంబాధమ్=దూరము చేయబడిన రాక్షసుల ఇరుకు (గుంపు) గలది ఐన, పురద్వారమ్=పట్టణము ద్వారమును, ఆససాద=సమీపించెను.

తా. పిమ్మట శ్రీమంతుడైన ఆ హనుమంతుడు, పర్వతశిఖరము వలె ఉన్నతమై, రాక్షసుల గుంపులనుండి దూరముగా ఉన్న నగరద్వారము దగ్గరకు (మీదికి) వెళ్ళెను. 40

మూ. స భూత్వా శైలసంకాశః క్షణేన పునరాత్మవాన్, 41
హ్రస్వతాం పరమాం ప్రాప్తో బన్ధనాన్యవశాతయత్.

ప్ర. అ. ఆత్మవాన్=బుద్ధిమంతుడైన, సః=ఆ హనుమంతుడు, శైలసంకాశః=పర్వతముతో సమానుడు, భూత్వా=అయి, క్షణేన=క్షణకాలములో, హ్రస్వతామ్=హ్రస్వత్వమును, ప్రాప్తః=పొందినవాడై, బన్ధనాని=బంధనములను, అవశాతయత్=విదల్చెను.

తా. బుద్ధిశాలియైన ఆతడు పర్వతమంత ఆకారము పెంచి, మరుక్షణములో చిన్న ఆకారము దాల్చి బంధనములను విదల్చివేసికొనెను. 41

మూ. విముక్తశ్చాభవచ్ఛ్రీమాన్ పునః పర్వతసన్నిభః, 42
వీక్షమాణశ్చ దదృశే పరిఘం తోరణాశ్రితమ్.

ప్ర. అ. శ్రీమాన్=శ్రీమంతుడైన, ఆ హనుమంతుడు, విముక్తశ్చ=బంధములనుండి విముక్తుడై, పునః=మరల, పర్వతసన్నిభః=పర్వతముతో సమానుడు, అభవత్=ఆయెను, వీక్షమాణశ్చ=చూచుచు, తోరణాశ్రితమ్=తోరణమును ఆశ్రయించి ఉన్న, పరిఘమ్=పరిఘను, దదృశే=చూచెను.

తా. హనుమంతుడా బంధనములు జారిపోగానే మరల పర్వతమంత శరీరము ధరించి ఇటు అటు పరికించి, అక్కడ తోరణమునకు అమర్చబడిన పరిఘను చూచెను. 42

మూ. స తం గృహ్య మహాబాహుః కాలాయసపరిష్కృతమ్, 43
రక్షిణస్తాన్ పునః సర్వాన్సూదయామాస మారుతిః.

ప్ర. అ. మహాబాహుః=గొప్ప బాహువులు గల, సః మారుతిః=ఆ హనుమంతుడు, కాలాయసపరిష్కృతమ్=ఇనుముతో పరిష్కరింపబడిన (బిగింపబడిన), తమ్=ఆ పరిఘను, పునః=మరల, గృహ్య=గ్రహించి, సర్వాన్=సమస్తమైన, తాన్ రక్షిణః=ఆ రక్షకులను, సూదయామాస=చంపెను.

తా. మహాబాహువైన ఆ హనుమంతుడు ఇనుముతో బిగించబడిన ఆ పరిఘను మళ్ళీ గ్రహించి, ఆ రక్షకుల నందరినీ చంపివేసెను. 43

మూ. స తాన్నిహత్వా రణచణ్డవిక్రమః
సమీక్షమాణః పునరేవ లఙ్కామ్,
ప్రదీప్తలాఙ్గూలకృతార్చిమాలీ
ప్రకాశతాదిత్య ఇవార్చిమాలీ. 44

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే సున్దరకాణ్డే
త్రిపఞ్చాశః సర్గః.

ప్ర. అ. రణచణ్డవిక్రమః=యుద్ధమునందు తీవ్రమైన పరాక్రమము గల, సః=ఆ హనుమంతుడు, తాన్=వాళ్ళను, నిహత్వా=చంపి, పునరేవ=మరల, లఙ్కామ్=లంకను, సమీక్షమాణః=చూచుచు, ప్రదీప్తలాఙ్గూలకృతార్చిమాలీ=మండు

చున్న తోకచేత చేయబడిన జ్వాలల మాల కలవాడై, అర్చిమాలీ=కిరణముల పంక్తిగల, ఆదిత్య ఇవ=సూర్యుడు వలె, ప్రకాశత=ప్రకాశించెను.

తా. యుద్ధములో తీవ్రమైన పరాక్రమమును ప్రదర్శించు ఆ హనుమంతుడు ఆ రాక్షసుల నందరినీ చంపి, మళ్ళీ లంక వైపే చూచుచు, మండుచున్న తోకచేత తన చుట్టూ అగ్ని జ్వాలల మాలలు విస్తరించుటచే, కిరణ పంక్తులతో కూడిన సూర్యుడు వలె ప్రకాశించెను. 44

" బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు సుందరకాండలో ఏబదిమూడవ సర్గ సమాప్తము.

అథ చతుఃపఞ్చాశః సర్గః

[లంకాదహనము-రాక్షసుల విలాపములు]

మూ. వీక్షమాణస్తతో లఙ్కాం కపిః కృతమనోరథః, 1
వర్ధమానసముత్సాహః కార్యశేషమచిన్తయత్.

ప్ర. అ. తతః=అటుపైన, కృతమనోరథః=పూర్తిచేయబడిన మనోరథము గల, కపిః=హనుమంతుడు, లఙ్కామ్=లంకను, వీక్షమాణః=చూచుచున్న వాడై, వర్ధమానసముత్సాహః=వృద్ధిపొందుచున్న ఉత్సాహము కలవాడై, కార్యశేషమ్=మిగిలిన కార్యమును గూర్చి, అచిన్తయత్=ఆలోచించెను.

తా. పిమ్మట తన మనోరథమును (కోరిన పనిని) పూర్తిచేసికొన్న హనుమంతుడు లంకను చూచుచు, వృద్ధిపొందుచున్న ఉత్సాహముతో మిగిలిన కార్యమును గూర్చి ఆలోచించెను. 1

మూ. కిం ను ఖల్వవశిష్టం మే కర్తవ్యమిహ సాంప్రతమ్, 2
యదేషాం రక్షసాం భూయః సంతాపజననం భవేత్.

ప్ర. అ. యత్=ఏది, ఏషామ్=ఈ, రక్షసామ్=రాక్షసులకు, భూయః=మరల, సంతాపజననమ్=సంతాపమును కలిగించేది, భవేత్=అగునో, అట్టి, కిం ను=ఏ, కర్తవ్యమ్=కార్యము, మే=నాకు, ఇహ=ఇక్కడ, సాంప్రతమ్=ఇప్పుడు, అవశిష్టమ్=మిగిలినది.

తా. ఏ పని ఈ రాక్షసులకు ఇంకా సంతాపాన్ని కలిగించునో అట్టి, నేను ఇక్కడ చేయవలసిన కార్యము, ఇప్పుడేమి మిగిలి ఉన్నది? 2

మూ. వనం తావత్ప్రమథితం ప్రకృష్టా రాక్షసా హతాః, 3
బలైకదేశః క్షపితః శేషం దుర్గవినాశనమ్.

ప్ర. అ. వనమ్=వనము, ప్రమథితం తావత్=నశింపచేయబడినది. ప్రకృష్టాః=శ్రేష్ఠులైన, రాక్షసాః=రాక్షసులు, హతాః=చంపబడినారు. బలైకదేశః=సైన్యములో ఒక భాగము, క్షపితః=నశింపచేయబడినది. దుర్గవినాశనమ్=దుర్గమును నశింపచేయుట, శేషమ్=మిగిలినది.

తా. వనమును విరిచినాను. ఉత్తములైన రాక్షసులను చంపినాను. సైన్యములో ఒక భాగము నశింపచేసినాను. ఇంక దుర్గమును నశింపచేయుట మిగిలినది. 3

మూ. దుర్గే వినాశితే కర్మ భవేత్సుఖపరిశ్రమమ్,
అల్పయత్నేన కార్యేఽస్మిన్ మమ స్యాత్సఫలః శ్రమః. 4

ప్ర. అ. దుర్గే=దుర్గము, వినాశితే=నశింపచేయబడినదగుచుండగా, కర్మ=కార్యము, సుఖపరిశ్రమమ్=సుఖమైన (అల్పమైన) పరిశ్రమ గలది, భవేత్=అగును. అస్మిన్=ఈ, కార్యే=కార్యమునందు, అల్పయత్నేన=అల్పమైన ప్రయత్నము చేత, శ్రమః=శ్రమ, సఫలః=సఫలము, స్యాత్=అగును.

తా. దుర్గమును కూడ నశింపచేసినచో తరువాత చేయవలసిన పని-అనగా రాముడు వచ్చి చేయవలసిన యుద్ధము, అల్పపరిశ్రమచేతనే సాధ్యమగును. నేను అల్పప్రయత్నము చేసి ఈ పని పూర్తిచేసినచో ఇంతవరకూ చేసినది సఫలమగును.

మూ. యో హ్యయం మమ లాఙ్గూలే దీప్యతే హవ్యవాహనః,
అస్య సంతర్పణం న్యాయం కర్తుమేభిర్గృహోత్తమైః. 5

ప్ర. అ. మమ=నాయొక్క, లాఙ్గూలే=తోకమీద, యః=ఏ, అయమ్ హవ్యవాహనః=ఈ అగ్ని, దీప్యతే=ప్రజ్వలించుచున్నదో, అస్య=దీనికి, ఏభిః=ఈ, గృహోత్తమైః=శ్రేష్ఠములైన గృహములతో, సంతర్పణమ్=తృప్తిపరచుట, కర్తుమ్=చేయుటకు, న్యాయమ్=న్యాయమైనది.

తా. ఈ ఉత్తమగృహములతో, నా తోకమీద ఉన్న అగ్నికి సంతర్పణము చేయుట న్యాయము. 5

మూ. తతః ప్రతప్తలాఙ్గూలః సవిద్యుదివ తోయదః,
భవనాగ్రేషు లఙ్కాయా విచచార మహాకపిః. 6

ప్ర. అ. తతః=అటుపిమ్మట, ప్రతప్తలాఙ్గూలః=కాల్చబడిన తోకగల, మహాకపిః=హనుమంతుడు, సవిద్యుత్=మెరుపులతో కూడిన, తోయదః ఇవ=మేఘమువలె, లఙ్కాయాః=లంకయొక్క, భవనాగ్రేషు=భవనముల పైభాగములందు, విచచార=సంచరించెను.

తా. ఆ హనుమంతుడు ప్రజ్వలించుచున్న తోకతో, మెరుపుతో కూడిన మేఘము వలె, లంకయందలి గృహముల పైభాగములమీద సంచరించెను. 6

మూ. గృహాద్గృహం రాక్షసానాముద్యానాని చ వానరః,
వీక్షమాణో హ్యసంత్రస్తః ప్రాసాదాంశ్చ చచార సః. 7

ప్ర. అ. సః వానరః=ఆ హనుమంతుడు, ఉద్యానాని చ=ఉద్యానములను, ప్రాసాదాంశ్చ=ప్రాసాదములను, వీక్షమాణః=చూచుచు, అసంత్రస్తః=భయములేనివాడై, రాక్షసానామ్=రాక్షసులయొక్క, గృహాత్=ఒక గృహమునుండి, గృహమ్=మరియొక గృహమును, చచార=సంచరించెను.

తా. హనుమంతుడు ఉద్యానములను, ప్రాసాదములను చూచుచు, ఏ మాత్రము భయపడక, రాక్షసుల ఒక గృహమునుండి మరియొక గృహమును సంచరించెను. 7

మూ. అవప్లుత్య మహావేగః ప్రహస్తస్య నివేశనమ్,
అగ్నిం తత్ర స నిక్షిప్య శ్వసనేన సమో బలీ. 8
తతోఽన్యత్పుప్లువే వేశ్మ మహాపార్శ్వస్య వీర్యవాన్,
ముమోచ హనుమానగ్నిం కాలానలశిఖోపమమ్. 9

ప్ర. అ. మహావేగః=గొప్ప వేగము కలవాడు, శ్వసనేన=వాయువుతో, సమః=సమానుడైన, బలీ=బలముకలవాడు, వీర్యవాన్=పరాక్రమముకలవాడు అయిన, సః=హనుమంతుడు, ప్రహస్తస్య=ప్రహస్తునియొక్క, నివేశనమ్=గృహమునుగూర్చి, అవప్లుత్య=దిగి, తత్ర=దానిమీద, అగ్నిమ్=అగ్నిని, నిక్షిప్య=ఉంచి, తతః=దానిమీదనుంచి, అన్యత్=మరియొక, మహాపార్శ్వస్య=మహాపార్శ్వునియొక్క, వేశ్మ=గృహమును గూర్చి, పుప్లువే=దుమికెను. హనుమాన్=హనుమంతుడు, కాలానలశిఖోపమమ్=ప్రళయకాలాగ్ని శిఖ వంటి, అగ్నిమ్=అగ్నిని, ముమోచ=దానిపై విడచెను.

తా. మహావేగవంతుడు, బలములో వాయువుతో సమానుడు, పరాక్రమవంతుడు అయిన హనుమంతుడు ప్రహస్తుని గృహముపై దుమికి, దానిమీద అగ్నిని ఉంచి, దానిపైనుంచి మహాపార్శ్వుని గృహముమీదికి దుమికి, దానిమీద ప్రలయకాలాగ్నిశిఖ వంటి అగ్నిని విడచెను. 8, 9

మూ. వజ్రదంష్ట్రస్య చ తదా పుప్లువే స మహాకపిః,
శుకస్య చ మహాతేజాః సారణస్య చ ధీమతః. 10

ప్ర. అ. మహాతేజాః=గొప్ప తేజస్సు గల, సః మహాకపిః=ఆ హనుమంతుడు, తదా=అప్పుడు, వజ్రదంష్ట్రస్య చ=వజ్రదంష్ట్రునియొక్క, శుకస్య=శుకునియొక్క,

ధీమతః=బుద్ధిమంతుడైన, సారణస్య చ=సారణునియొక్క గృహమును గూర్చి, పుప్లువే=ఎగిరెను.

తా. మహాతేజఃశాలియైన ఆ హనుమంతుడు అప్పుడు వరుసగా వజ్రదంష్ట్ర-శుక-సారణుల భవనముల మీదికి దుమికెను. 10

మూ. తథా చేన్ద్రజితో వేశ్మ దదాహ హరియూథపః,
జమ్బుమాలేః సుమాలేశ్చ దదాహ భవనం తతః. 11

ప్ర. అ. హరియూథపః=హనుమంతుడు, తథా=మరియు, ఇన్ద్రజితః=ఇంద్రజిత్తుయొక్క, వేశ్మ=గృహమును, దదాహ=కాల్చెను. తతః=అటుపిమ్మట, జమ్బుమాలేః=జంబుమాలియొక్క, సుమాలేశ్చ=సుమాలియొక్క, భవనమ్=భవనమును, దదాహ=కాల్చెను.

తా. హనుమంతుడు ఇంద్రజిత్తు గృహమును కాల్చెను. పిదప జంబుమాలిసుమాలుల గృహములను కాల్చెను. 11

మూ. రశ్మికేతోశ్చ భవనం సూర్యశత్రోస్తథైవ చ,
హ్రస్వకర్ణస్య దంష్ట్రస్య రోమశస్య చ రక్షసః. 12
యుద్ధోన్మత్తస్య మత్తస్య ధ్వజగ్రీవస్య రక్షసః,
విద్యుజ్జిహ్వస్య ఘోరస్య తథా హస్తిముఖస్య చ. 13
కరాళస్య పిశాచస్య శోణితాక్షస్య చైవ హి,
కుమ్భకర్ణస్య భవనం మకరాక్షస్య చైవ హి. 14
యజ్ఞశత్రోశ్చ భవనం బ్రహ్మశత్రోస్తథైవ చ,
నరాన్తకస్య కుమ్భస్య నికుమ్భస్య దురాత్మనః. 15
వర్జయిత్వా మహాతేజా విభీషణగృహం ప్రతి,
క్రమమాణః క్రమేణైవ దదాహ హరిపుఙ్గవః. 16

ప్ర. అ. మహాతేజాః=గొప్ప తేజస్సు గల, హరిపుఙ్గవః=హనుమంతుడు, క్రమేణైవ=క్రముముచేతనే, క్రమమాణః=తిరుగుచు, విభీషణగృహం ప్రతి=విభీషణుని గృహమును గూర్చి, వర్జయిత్వా=విడిచి పెట్టి, రశ్మికేతోశ్చ=రశ్మికేతువు యొక్క, భవనమ్=భవనమును, తథైవ చ=మరియు, సూర్యశత్రోః=సూర్యశత్రువుయొక్క, హ్రస్వకర్ణస్య=హ్రస్వకర్ణునియొక్క, దంష్ట్రస్య=దంష్ట్రునియొక్క, రక్షసః=రాక్షసుడైన, రోమశస్య=రోమశునియొక్క, యుద్ధోన్మత్తస్య=యుద్ధోన్మత్తునియొక్క, మత్తస్య=మత్తునియొక్క, రక్షసః=రాక్షసుడైన, ధ్వజగ్రీవస్య=ధ్వజగ్రీవునియొక్క, ఘోరస్య=భయంకరుడైన, విద్యుజ్జిహ్వస్య=విద్యుజ్జిహ్వునియొక్క, తథా=మరియు, హస్తిముఖస్య

చ=హస్తిముఖునియొక్క, కరాళస్య=కరాళునియొక్క, పిశాచస్య=పిశాచునియొక్క, శోణితాక్షస్య చైవ హి=శోణితాక్షునియొక్క, కుమ్భకర్ణస్య=కుంభకర్ణునియొక్క, భవనమ్=భవనమును, మకరాక్షస్య చైవ హి=మకరాక్షుని భవనమును, యజ్ఞశత్రోశ్చ భవనమ్=యజ్ఞశత్రువుయొక్క భవనమును, తథైవ చ=మరియు, బ్రహ్మశత్రోః=బ్రహ్మశత్రువుయొక్క, నరాన్తకస్య=నరాంతకునియొక్క, కుంభస్య=కుంభునియొక్క, దురాత్మనః=దురాత్ముడైన, నికుమ్భస్య=నికుంభునియొక్క గృహమును కాల్చెను.

తా. మహాతేజఃశాలియైన హనుమంతుడు, విభీషణుని భవనము తప్ప, వరుసగా ఒక భవనము తరువాత మరొక భవనము మీదికి వెళ్లుచు, రశ్మికేతువు, సూర్యశత్రువు, హ్రస్వకర్ణుడు, దంష్ట్రుడు, రోమశుడు, యుద్ధోన్మత్తుడు, మత్తుడు, ధ్వజగ్రీవుడు, భయంకరుడైన విద్యుజ్జిహ్వుడు, హస్తిముఖుడు, కరాళుడు, పిశాచుడు, శోణితాక్షుడు, కుంభకర్ణుడు, మకరాక్షుడు, యజ్ఞశత్రువు, బ్రహ్మశత్రువు, నరాంతకుడు, కుంభుడు, దురాత్ముడైన నికుంభుడు అను రాక్షసుల భవనములను కాల్చెను. 12-16

మూ. తేషు తేషు మహార్హేషు భవనేషు మహాయశాః,
గృహేష్వృద్ధిమతామృద్ధిం దదాహ స మహాకపిః. 17

ప్ర. అ. మహాయశాః=గొప్పకీర్తిగల, సః మహాకపిః=ఆ హనుమంతుడు, ఋద్ధిమతామ్=ఐశ్వర్యవంతులయొక్క, మహార్హేషు=శ్రేష్ఠములైన, తేషు తేషు=ఆయా, గృహేషు=గృహములందు, ఋద్ధిమ్=సంపదను, దదాహ= కాల్చివేసెను.

తా. గొప్ప కీర్తి గల ఆ హనుమంతుడు, ధనికుల శ్రేష్ఠములైన ఆయా గృహములలో ఉన్న సంపదను కాల్చివేసెను. 17

మూ. సర్వేషాం సమతిక్రమ్య రాక్షసేన్ద్రస్య వీర్యవాన్,
ఆససాదాథ లక్ష్మీవాన్ రావణస్య నివేశనమ్. 18

ప్ర. అ. వీర్యవాన్=పరాక్రమవంతుడైన, లక్ష్మీవాన్=శోభాయుక్తుడైన హనుమంతుడు, సర్వేషామ్=అందరియొక్క గృహములను, సమతిక్రమ్య=దాటి, అథ=అటుపిమ్మట, రాక్షసేన్ద్రస్య=రాక్షసరాజైన రావణునియొక్క, నివేశనమ్=గృహమును, ఆససాద=సమీపించెను.

తా. పరాక్రమవంతుడు, శోభాశాలీ అయిన హనుమంతుడు అందరి భవనములను దాటి పిదప రావణుని గృహమును చేరెను. 18

మూ. తతస్తస్మిన్ గృహే ముఖ్యే నానారత్నవిభూషితే,
మేరుమన్దరసంకాశే సర్వమఙ్గళశోభితే. 19

ప్రదీప్తమగ్నిముత్సృజ్య లాఙ్గూలాగ్రే ప్రతిష్ఠితమ్,
ననాద హనుమాన్ వీరో యుగాన్తజలదో యథా. 20

ప్ర. అ. తతః=అటు పైన, వీరః=వీరుడైన, హనుమాన్=హనుమంతుడు, నానారత్నవిభూషితే=అనేకవిధములైన రత్నములతో అలంకరించబడిన, మేరుమన్దరసంకాశే=మేరుపర్వతముతోను మందరపర్వతముతోను సమానమైన, తస్మిన్=ఆ, ముఖ్యే=ముఖ్యమైన, గృహే=గృహమునందు, లాఙ్గూలాగ్రే=తన తోక చివర, ప్రతిష్ఠితమ్=ఉన్న, ప్రదీప్తమ్=మండుచున్న, అగ్నిమ్=అగ్నిని, ఉత్సృజ్య=విడచి, యుగాన్తజలదో యథా=ప్రలయకాలమేఘము వలె, ననాద=ధ్వనిచేసెను.

తా. పిమ్మట, వీరుడైన హనుమంతుడు, అనేక విధములైన రత్నములచేత అలంకరింపబడినది, మేరుమందరపర్వతములతో సమానమూ, సకలమంగళముల తోను శోభించుచున్నదీ అయిన ఆ ప్రధానగృహముమీద, తన తోక చివరనున్న అగ్నిని ఉంచి, ప్రలయకాలమేఘమువలె గర్జించెను. 19, 20

మూ. శ్వసనేన చ సంయోగాదతివేగో మహాబలః,
కాలాగ్నిరివ జజ్వాల ప్రావర్ధత హుతాశనః. 21

ప్ర. అ. హుతాశనః=అగ్ని, శ్వసనేన=వాయువుతో, సంయోగాత్=సంయోగమువలన, అతివేగః=చాలావేగము కలదై, మహాబలః=గొప్ప బలము కలదై, ప్రావర్ధత=పెరిగెను. కాలాగ్నిరివ=ప్రలయకాలాగ్ని వలె, జజ్వాల=ప్రజ్వలించెను.

తా. వాయువు కూడ సహాయమగుటచే ఆ అగ్ని మహాబలముతో, మహావేగముతో, వృద్ధిపొంది, ప్రలయకాలాగ్ని వలె ప్రజ్వలించెను. 21

మూ. ప్రదీప్తమగ్నిం పవనస్తేషు వేశ్మస్వచారయత్,
అభూచ్ఛ్వసనసంయోగాదతివేగో హుతాశనః. 22

ప్ర. అ. పవనః=వాయువు, ప్రదీప్తమ్=ప్రజ్వలించుచున్న, అగ్నిమ్=అగ్నిని, తేషు=ఆ, వేశ్మసు=గృహములమీద, అచారయత్=సంచరింపచేసెను. శ్వసనసంయోగాత్=వాయువుతో సంయోగమువలన, హుతాశనః=అగ్ని, అతివేగః=చాలా వేగము కలది, అభూత్=ఆయెను.

తా. వాయువు, మండుచున్న అగ్నిని ఒక ఇంటి నుండి మరొక ఇంటికి ప్రసరింపచేసెను. వాయువుతో సంయోగమువలన అగ్ని వేగము చాల హెచ్చెను.

మూ. తాని కాఞ్చనజాలాని ముక్తామణిమయాని చ,
భవనాన్యవశీర్యన్త రత్నవన్తి మహాన్తి చ. 23

ప్ర. అ. కాఞ్చనజాలాని=బంగారు కిటికీలు కలవి, ముక్తామణిమయాని చ=ముత్యముల, మణుల వికారమైనవి. రత్నవన్తి=రత్నములు కలవి, మహాన్తి చ=గొప్పవి అయిన, తాని భవనాని=ఆ భవనములు, అవశీర్యన్త=బ్రద్దలైపోయినవి.

తా. బంగారు కిటికీలతో కూడినవి, ముత్యములతోను మణులతోను రత్నములతోను నిండినవి, పెద్దవి అయిన ఆ భవనములు బ్రద్దలై పడిపోయినవి.

మూ. సంజజ్ఞే తుములః శబ్దో రాక్షసానాం ప్రధావతామ్,
స్వగృహస్య పరిత్రాణే భగ్నోత్సాహోర్జితశ్రియామ్; 24
నూనమేషోఽగ్నిరాయాతః కపిరూపేణ హా ఇతి.

ప్ర. అ. స్వగృహస్య=తమ గృహములయొక్క, పరిత్రాణే=రక్షించుట యందు (కొరుకు), ప్రధావతామ్=పరుగెత్తుచున్న వారు, భగ్నోత్సాహోర్జితశ్రియామ్= భగ్నమైన ఉత్సాహము, అధికమైన సంపద కలవారు అయిన, రాక్షసానామ్= రాక్షసులయొక్క, "హా=అయ్యో! నూనమ్=నిజముగా, ఏషః అగ్నిః=ఈ అగ్ని, కపిరూపేణ=వానరరూపముతో, ఆయాతః=వచ్చినాడు. ఇతి=అని, తుములః= వ్యాకులమైన, శబ్దః=శబ్దము, సంజజ్ఞే=పుట్టెను.

తా. తమ భవనములను రక్షించుకొనుటకై ఇటు నటు పరుగెత్తుచు, ఉత్సాహమును సంపదలను కొల్పోయిన రాక్షసులు, "అయ్యో ! ఈ వానరుని రూపముతో అగ్నిదేవుడు వచ్చినాడు కదా !" అని బిగ్గరగా అరచుచుండిరి. 25

మూ. క్రన్దన్త్యః సహసా పేతుః స్తనంధయధరాః స్త్రియః, 25
కాశ్చిరగ్నిపరీతేభ్యో హర్మ్యేభ్యో ముక్తమూర్ధజాః,
పతన్త్యో రేజిరేఽభ్రేభ్యః సౌదామిన్య ఇవామ్బరాత్. 26

ప్ర. అ. కాశ్చిత్=కొందరు, స్త్రియః=స్త్రీలు, స్తనంధయధరాః=చం టిబిడ్డలను ఎత్తికొన్నవారై, ముక్తమూర్ధజాః=విడిపోయిన కేశములు కలవారై, క్రన్దన్త్యః=ఏడ్చుచు, అగ్నిపరీతేభ్యః=అగ్నిచేత చుట్టుముట్టబడిన, హర్మ్యేభ్యః=మే డలనుండి, సహసా=శీఘ్రముగా, పేతుః=పడిరి. అమ్బరాత్=ఆకాశమునుండి, అభ్రేభ్యః=మేఘములనుండి, పతన్త్యః=పడుచున్న, సౌదామిన్యః ఇవ=మెరుపులు వలె, రేజిరే=ప్రకాశించిరి.

తా. కొందరు స్త్రీలు, అరచుచు, చంటి బిడ్డలను చంకన బెట్టుకొని, జుట్టు విరబోసుకొని, నిప్పు చుట్టుముట్టిన మేడలపై నుండి క్రిందికి దుమికిరి. ఆ విధముగా పడుచున్నప్పుడు ఆ స్త్రీలు ఆకాశముపైనున్న మేఘములనుంచి క్రిందికి పడుచున్న మెరుపుల వలె ప్రకాశించిరి. 25, 26

మూ. వజ్రవిద్రుమవైదూర్యముక్తారజతసంహితాన్,
విచిత్రాన్ భవనాద్ధాతూన్ స్యన్దమానాన్ దదర్శ సః. 27

ప్ర. అ. సః=ఆ హనుమంతుడు, వజ్రవిద్రుమవైదూర్యముక్తారజతసంహితాన్=వజ్రములతోను, పగడములతోను, వైడూర్యములతోను, ముత్యములతోను, వెండితోను కలిసిన, విచిత్రాన్=విచిత్రవర్ణములు కల, భవనాత్=గృహము(ల) నుండి, స్యన్దమానాన్=స్రవించుచున్న, ధాతూన్=ధాతువులను (రంగులను), దదర్శ=చూచెను.

తా. కాలిపోయిన భవనములనుండి వజ్ర-విద్రుమ-వైదూర్య-ముక్తా-రజతములు కలిసిన వివిధరూపములు గల ధాతువులు స్రవించుచుండగా ఆ హనుమంతుడు చూచెను. 27

మూ. నాగ్నిస్తృప్యతి కాష్ఠానాం తృణానాం చ యథా తథా,
హనుమాన్ రాక్షసేన్ద్రాణాం వధే కించిన్న తృప్యతి. 28
న హనూమద్విశస్తానాం రాక్షసానాం వసున్ధరా.

ప్ర. అ. అగ్నిః=అగ్ని, కాష్ఠానామ్=కట్టెలకు, తృణానామ్=తృణములకు, యథా=ఎట్లు, న తృప్యతి=తృప్తిచెందడో, తథా=అట్లే, హనుమాన్=హనుమంతుడు, రాక్షసేన్ద్రాణామ్=రాక్షసులయొక్క, వధే=వధయందు, కించిత్=కొంచెము కూడ, న తృప్యతి=తృప్తిచెందలేదు. వసున్ధరా=భూమి, హనుమద్విశస్తానామ్=హనుమంతునిచేత చంపబడిన, రాక్షసానామ్=రాక్షసులకు, న=తృప్తిపడలేదు.

తా. అగ్నికి ఎన్ని కాష్ఠములు వేసినను, ఎంత తృణము వేసినను తృప్తి ఉండదు. అట్లే ఎంతమంది రాక్షసులను చంపినా హనుమంతునకు తృప్తి కలుగలేదు. హనుమంతుడు ఎంతమంది రాక్షసులను చంపి పడవేసినా భూమికి తృప్తికలుగలేదు. 28

మూ. క్వచిత్కింశుకసంకాశాః క్వచిచ్ఛాల్మలిసన్నిభాః, 29
క్వచిత్కుఙ్కుమసంకాశాః శిఖా వహ్నేశ్చకాశిరే.

ప్ర. అ. వహ్నేః=అగ్నియొక్క, శిఖాః=శిఖలు, క్వచిత్=కొన్ని చోట్ల, కింశుకసంకాశాః=మోదుగపువ్వుతో సమానములుగాను, క్వచిత్=కొన్ని చోట్ల, శాల్మలిసన్నిభాః=బూరుగుపువ్వుతో సమానములుగాను, క్వచిత్=కొన్ని చోట్ల, కుఙ్కుమసంకాశాః=కుంకుమపువ్వుతో సమానములుగాను, చకాశిరే=ప్రకాశించినవి.

తా. అగ్నిశిఖలు కొన్నిచోట్ల కింశుకపుష్పముల వలె, కొన్నిచోట్ల బూరుగపువ్వుల వలె, కొన్ని చోట్ల కుంకుమపువ్వుల వలె వేరు వేరు రంగులతో ప్రకాశించెను. 29

మూ. హనూమతా వేగవతా వానరేణ మహాత్మనా,
లఙ్కాపురం ప్రదగ్ధం తద్రుద్రేణ త్రిపురం యథా. 30

ప్ర. అ. వేగవతా వానరేణ=వేగముగల వానరుడైన, మహాత్మనా=మహాత్ముడైన, హనూమతా=హనుమంతునిచేత, తత్=ఆ, లఙ్కాపురమ్=లంకాపురమ్, రుద్రేణ=రుద్రునిచేత, త్రిపురం యథా=త్రిపురము వలె, ప్రదగ్ధమ్=కాల్చబడినది.

తా. వేగవంతుడైన వానరుడు, మహాత్ముడూ అయిన హనుమంతుడు, ఆ లంకాపురమును, రుద్రుడు త్రిపురమును కాల్చినట్లు కాల్చివేసెను. 30

మూ. తతస్తు లఙ్కాపురపర్వతాగ్రే
సముత్థితో భీమపరాక్రమోఽగ్నిః,
ప్రసార్య చూడావలయం ప్రదీప్తో
హనూమతా వేగవతా విసృష్టః. 31

ప్ర. అ. తతః=అటుపిమ్మట, వేగవతా=వేగము గల, హనూమతా=హనుమంతునిచేత, విసృష్టః=విడవబడిన, భీమపరాక్రమః=భయంకరమైన పరాక్రమము గల, అగ్నిః=అగ్ని, చూడావలయమ్=శిఖల వలయమును, ప్రసార్య=ప్రసరింప జేసి, ప్రదీప్తః=మండుచున్నదై, లఙ్కాపురపర్వతాగ్రే=లంకాపురమునందు, పర్వతాగ్రము నందు, సముత్థితః=లేచినది.

తా. వేగవంతుడైన హనుమంతుడు విడచిన, భయంకరమైన పరాక్రమము గల అగ్ని, శిఖావలయమును ప్రసరింప చేసి, ప్రజ్వలించుచు, లంకలోను, లంక ఉన్న పర్వతాగ్రముపైనను పైకి ఎగసెను. 31

మూ. యుగాన్తకాలానలతుల్యవేగః
సమారుతోఽగ్నిర్వవృధే దివిస్పృక్,
విధూమరశ్మిర్భవనేషు సక్తో
రక్షఃశరీరాజ్యసమర్పితార్చిః. 32

ప్ర. అ. విధూమరశ్మిః=ధూమములేని మంటలు కలది, భవనేషు=గృహములందు, సక్తః=సంబంధించినది, రక్షఃశరీరాజ్యసమర్పితార్చిః=రాక్షసుల శరీరములనే ఆజ్యము చేత కూర్చబడిన జ్వాలలు కలది అయిన, అగ్నిః=అగ్ని, సమారుతః=వాయువుతో కూడినదై, దివిస్పృక్=ఆకాశమును స్పృశించుచు,

యుగాన్తకాలానలతుల్యవేగః=యుగాంతము నందలి ప్రలయకాలాగ్నితో సమానమైన వేగము కలదై, వవృధే=వృద్ధి పొందెను.

తా. ఆ భవనములమీద వ్యాపించిన ఆ అగ్ని, వాయువు కూడ కలియుటచే యుగాంతమునందు ప్రలయకాలాగ్ని వలె మహావేగముతో, ఆకాశమునంటుచు వృద్ధి పొందెను. ధూమము లేని మంటలు చెలరేగెను. రాక్షసుల శరీరములనే ఆజ్యముచే ఆ అగ్నిజ్వాలలు పెరిగెను. 32

మూ. ఆదిత్యకోటీసదృశః సుతేజా
లఙ్కాం సమస్తాం పరివార్య తిష్ఠన్,
శబ్దైరనేకైరశనిప్రరూఢై
ర్భిన్దన్నివాణ్డం ప్రబభౌ మహాగ్నిః. 33

ప్ర. అ. ఆదిత్యకోటీసదృశః=కోటి సూర్యులతో సమానము, సుతేజాః=మంచి తేజస్సు గలది, సమస్తామ్=సమస్తమైన, లఙ్కామ్=లంకను, పరివార్య=చుట్టి, తిష్ఠన్= ఉన్న, మహాగ్నిః=గొప్ప అగ్ని, అనేకైః=అనేకములైన, అశనిప్రరూఢైః=పిడుగువలె అత్యధికమైన, శబ్దైః=ధ్వనులతో, అణ్డమ్=బ్రహ్మాండమును, భిన్దన్నివ=భేదించుచున్నది వలె, ప్రబభౌ=ప్రకాశించెను.

తా. కోటి సూర్యులతో సమానమైన తేజస్సుతో లంకనంతను చుట్టి ఉన్న ఆ మహాగ్ని, పిడుగుల వంటి అనేకవిధములైన ధ్వనులతో బ్రహ్మాండమును బ్రద్దలుకొట్టుచున్నట్లు ఉండెను. 33

మూ. తత్రామ్బరాదగ్నిరతిప్రవృద్ధో
రూక్షప్రభః కింశుకపుష్పచూడః,
నిర్వాణధూమాకులరాజయశ్చ
నీలోత్పలాభాః ప్రచకాశిరేఽభ్రాః. 34

ప్ర. అ. తత్ర=అక్కడ, రూక్షప్రభః=తీవ్రమైన కాంతి గల, కింశుకపుష్పచూడః=కింశుకపుష్పము వంటి అగ్రభాగము గల, అగ్నిః=అగ్ని, అంబరాత్=ఆకాశమువరకు, అతిప్రవృద్ధః=మిక్కిలి పెరిగినది. అభ్రాః=మేఘములు, నిర్వాణధూమకూలరాజయః=అగ్ని ఆరిపోవుటచే బయలుదేరిన ధూమము చేత వ్యాకులములైన పంక్తులు కలవై, నీలోత్పలాభాః=నల్ల కలువల కాంతి వంటి కాంతి గలవై, ప్రచకాశిరే=ప్రకాశించినవి.

తా. అక్కడ, అగ్ని తీవ్రమైన కాంతితో, కింశుకపుష్పముల వంటి అగ్రభాగములతో ఆకాశమువరకు వ్యాపించెను. మేఘములు, అక్కడక్కడ

ఆరిపోయిన అగ్నినుండి బయలుదేరిన ధూమముచేత కప్పబడుటచే నల్లకలువల వలె ప్రకాశించెను. 34

మూ. వజ్రీ మహేన్ద్రస్త్రిదశేశ్వరో వా
సాక్షాద్యమో వా వరుణోఽనిలో వా,
రుద్రోఽగ్నిరర్కో ధనదశ్చ సోమో
న వానరోఽయం స్వయమేవ కాలః. 35

(36, 37, 38 శ్లోకాలకు 39 వ శ్లోకములోని "రక్షోగణాః ఇత్యేవమ్ ఊచుః" అనేదానితో అన్వయము.)

ప్ర. అ. అయమ్=ఇతడు, వానరః=వానరుడు, న=కాదు, వజ్రీ=వజ్రధారియైన, త్రిదశేశ్వరః=దేవతాప్రభువైన, మహేన్ద్రః వా=మహేంద్రుడు కాని, సాక్షాత్=సాక్షాత్తు, యమో వా=యముడు గాని, వరుణః=వరుణుడు గాని, అనిలో వా=వాయువు గాని, రుద్రః=రుద్రుడు గాని, అగ్నిః=అగ్ని గాని, అర్కః=సూర్యుడు గాని, ధనదశ్చ=కుబేరుడు గాని, సోమః=సోముడు గాని, స్వయమ్=స్వయముగా, కాలః ఏవ వా=కాలపురుషుడో గాని (అయి ఉండును అని రాక్షసులు పలికిరి.)

తా. ఇతడు వానరుడు కాదు ; వజ్రాయుధము ధరించేవాడు, దేవతా ప్రభువూ అయిన మహేంద్రుడు గాని, కుబేరుడు కాని, సాక్షాత్తు యముడు కాని, రుద్రుడుకాని, సూర్యుడు కాని, చంద్రుడు కాని, సాక్షాత్తు కాలపురుషుడు కాని అయి ఉండవలెను అని రాక్షసులు అనుకొనిరి. 35

మూ. కిం బ్రహ్మణః సర్వపితామహస్య
సర్వస్య ధాతుశ్చతురాననస్య,
ఇహాగతో వానరరూపధారీ
రక్షోపసంహారకరః ప్రతాపః. 36

ప్ర. అ. సర్వపితామహస్య=సకలలోకములకు పితామహుడు, సర్వస్య=అందరికి, ధాతుః=పోషకుడు, చతురాననస్య=నాలుగు ముఖములు కలవాడు అయిన, బ్రహ్మణః=బ్రహ్మదేవునియొక్క, రక్షోపసంహారకరః=రాక్షసులను నశింపచేసే, ప్రతాపః=ప్రతాపము, వానరరూపధారీ=వానరరూపమును ధరించినదై, ఇహ=ఇక్కడికి, ఉపయాతః కిమ్=వచ్చినదా ?

తా. సకలలోకాలకి పితామహుడు, సకలజగత్తులను పోషించేవాడు, నాలుగు ముఖములు కలవాడు అయిన బ్రహ్మదేవుని ప్రకోపము, రాక్షససంహారము చేయుటకై వానరరూపము ధరించి వచ్చినదా ? 36

మూ. కిం వైష్ణవం వా కపిరూపమేత్య
రక్షోవినాశాయ పరం సుతేజః,
అనన్తమవ్యక్తమచిన్త్యమేకం
స్వమాయయా సాంప్రతమాగతం వా. 37

ప్ర. అ. అనన్తమ్=అంతము లేనిది, అవ్యక్తమ్=ఇంద్రియములకు గోచరించనిది, అచిన్త్యమ్=ఊహింప శక్యము కానిది, ఏకమ్=సాటిదైన మరొకటి లేనిది, అయిన, వైష్ణవమ్=విష్ణుసంబంధమైన, పరమ్=శ్రేష్ఠమైన, సుతేజః=గొప్ప తేజస్సు, సాంప్రతమ్=ఇప్పుడు, రక్షోవినాశాయ=రాక్షసుల నాశము కొరకు, స్వమాయయా=తన మాయచేత, కపిరూపమ్=వానరరూపమును, ఏత్య=పొంది, ఆగతం కిం వా=వచ్చినదా ?

తా. అనంతము, ఇంద్రియములకు గోచరించనిది, ఊహింపశక్యము కానిది, ఏకైకము అత్యుత్తమము అయిన విష్ణుతేజస్సు, తన మాయచే వానర రూపము ధరించి, ఇప్పుడు రాక్షసులను నశింపచేయుటకు వచ్చినదా? 37

మూ. ఇత్యేవమూచుర్బహవో విశిష్టా
రక్షోగణాస్తత్ర సమేత్య సర్వే,
సప్రాణిసంఘాం సగృహాం సవృక్షాం
దగ్ధాం పురీం తాం సహసా సమీక్ష్య. 38

ప్ర. అ. సప్రాణిసంఘామ్=ప్రాణుల సంఘములతో కూడినది, సగృహామ్=గృహములతో కూడినది, సవృక్షామ్=వృక్షములతో కూడినది అయిన, తాం పురీమ్=ఆ నగరమును, సహసా=శీఘ్రముగా, దగ్ధామ్=కాల్చబడినదానినిగా, సమీక్ష్య=చూచి, బహవః=అనేకులు, విశిష్టాః=ఉత్తములు అయిన, సర్వే=సమస్తమైన, రక్షోగణాః=రాక్షసగణములు, తత్ర=అక్కడ, సమేత్య=కలిసి, ఇత్యేవమ్=ఇట్లు, ఊచుః=పలికిరి.

తా. ప్రాణిసంఘములు, గృహములు, వృక్షములు వీటి అన్నింటిలో సహా ఆ లంకాపురము శీఘ్రముగా కాలిపోవుటను చూచి అక్కడ అనేక రాక్షసులు, గుంపులుగా చేరి, ఈ విధముగా పలికిరి. 38

మూ. తతస్తు లఙ్కా సహసా ప్రదగ్ధా
సరాక్షసా సాశ్వరథా సనాగా,
సపక్షిసంఘా సమృగా సవృక్షా
రురోద దీనా తుములం సశబ్దమ్. 39

ప్ర. అ. తతః=అటుపిమ్మట, సరాక్షసా=రాక్షసులతో కూడినది, సాశ్వరథా=అశ్వములతోను రథములతోను కూడినది, సనాగా=ఏనుగులతో కూడినది, సపక్షిసంఘా=పక్షిసముదాయములతో కూడినది, సమృగా=మృగములతో కూడినది, సవృక్షా=వృక్షములతో కూడినది అయిన, లఙ్కా=లంక, సహసా=వెంటనే, ప్రదగ్ధా=కాల్చబడినదై, దీనా=దీనమై, తుములమ్=వ్యాకులముగా, సశబ్దమ్=శబ్దముతో కూడినట్లుగా, రురోద=ఏడ్చెను.

తా. రాక్షసులు, అశ్వములు, రథములు, గజములు, పక్షిసముదాయములు, మృగములు, వృక్షములు-వీటి అన్నింటితో సహా శీఘ్రముగా కాల్చివేయబడిన లంకానగరము, దైన్యముతో, వ్యాకులధ్వనులతో ఏడ్చెను. 39

మూ. హా తాత హా పుత్రక కాన్త మిత్ర
హా జీవితం భోగయుతం సుపుణ్యమ్,
రక్షోభిరేవం బహుధా బ్రువద్భిః
శబ్దః కృతో ఘోరరవః సుభీమః. 40

ప్ర. అ. హా తాత=అయ్యో ! తండ్రీ! హా పుత్రక !=అయ్యో ! కుమారా! కాన్త=అయ్యో ప్రియుడా! మిత్ర=అయ్యో ! మిత్రుడా! భోగయుతమ్=భోగములతో కూడి, సుపుణ్యమ్=చాల పుణ్యమైన, హా జీవితమ్=అయ్యో! జీవితమా! ఏవమ్=ఇట్లు, బహుధా=అనేక విధములుగా, బ్రువద్భిః=పలుకుచున్న రక్షోభిః=రాక్షసులచేత, ఘోరరవః=ఘోరమైన ధ్వనిగల, సుభీమః=చాల భయంకరమైన, శబ్దః=శబ్దము, కృతః=చేయబడినది.

తా. అయ్యో ! తండ్రీ! అయ్యో! కుమారా! అయ్యో! ప్రియుడా! అయ్యో! మిత్రుడా! అయ్యో! సకలభోగపూర్ణమైన ఓ ! పుణ్యజీవనమా ! అని విలపించుచు రాక్షసులు, ఘోరమైన ధ్వని గల, భయంకరమైన శబ్దమును చేసిరి.

మూ. హుతాశనజ్వాలసమావృతా సా
హతప్రవీరా పరివృత్తయోధా,
హనూమతః క్రోధబలాభిభూతా
బభూవ శాపోపహతేవ లఙ్కా. 41

ప్ర. అ. హుతాశనజ్వాలసమావృతా=అగ్నిజ్వాలలచేత కప్పబడినదీ, హతప్రవీరా=చంపబడిన ఉత్తమవీరులు కలదీ, పరివృత్తయోధా=తిరిగిపోయిన యోధులు

కలదీ, హనూమతః=హనుమంతునియొక్క, క్రోధబలాభిభూతా=కోపబలముచేత పరాజితమైనది అయిన, సా లఙ్కా=ఆ లంక, శాపోపహతేవ=శాపముచేత కొట్టబడినది వలె, బభూవ=ఆయెను.

తా. హనుమంతుని కోపబలము ఆక్రమించగా, ఆ లంక అగ్నిజ్వాలలు చుట్టుముట్టగా, మహావీరులందరు మరణించి, యోధులు తిరిగిపోయి, ఎవ్వరో మహాపురుషుని శాపము తగిలినది వలె ఉండెను. 41

మూ. స సంభ్రమత్రస్తవిషణ్ణరాక్షసాం
సముజ్జ్వలజ్జ్వాలహుతాశనాఙ్కితామ్,
దదర్శ లఙ్కాం హనుమాన్ మహామనాః
స్వయంభుకోపోపహతామివావనిమ్. 42

ప్ర. అ. మహామనాః=గొప్ప మనస్సు గల, హనుమాన్=హనుమంతుడు, ససంభ్రమత్రస్తవిషణ్ణరాక్షసామ్=తొందరతో కూడిన, భయపడిన రాక్షసులు కలది, సముజ్జ్వలజ్జ్వాలహుతాశనాఙ్కితామ్=ప్రకాశించుచున్న జ్వాలలు గల అగ్నిచేత చిహ్నితమైనది (తో కూడినది) అయిన, లఙ్కామ్=లంకను, స్వయంభుకోపోపహతామ్=బ్రహ్మయొక్క కోపముచేత కొట్టబడిన, అవనిమ్ ఇవ=భూమి వలె ఉన్న, లఙ్కామ్=లంకను, దదర్శ=చూచెను.

తా. అప్పుడా లంకలోని రాక్షసులందరూ కంగారుతో భయపడుచుండిరి. పైకి ఎగురుచున్న జ్వాలలతో ఆ అగ్ని అంతటా వ్యాపించెను. ఈ విధముగ ఆ పురము బ్రహ్మకోపముచేత పాడుపడునట్లు చేయబడిన భూమి వలె ఉండెను. అట్టి లంకను గొప్ప మనస్సు గల హనుమంతుడు చూచెను. 42

మూ. భఙ్క్త్వా వనం పాదపరత్నసంకులం
హత్వా తు రక్షాంసి మహాన్తి సంయుగే,
దగ్ధ్వా పురీం తాం గృహరత్నమాలినీమ్
తస్థౌ హనూమాన్ పవనాత్మజః కపిః. 43

ప్ర. అ. పవనాత్మజః కపిః=వాయుపుత్రుడైన వానరుడైన, హనూమాన్=హనుమంతుడు, పాదపరత్నసంకులమ్=శ్రేష్ఠము లైన వృక్షములతో నిండియున్న, వనమ్=ఉద్యానమును, భఙ్క్త్వా=విరుగకొట్టి, సంయుగే=యుద్ధమునందు, మహాన్తి=గొప్ప, రక్షాంసి=రాక్షసులను, హత్వా=చంపి, గృహరత్నమాలినీమ్=గృహశ్రేష్ఠముల పంక్తులు గల, తాం పురీమ్=ఆ పట్టణమును, దగ్ధ్వా=కాల్చి, తస్థౌ=నిలచి ఉండెను.

తా. వాయునందనుడైన హనుమంతుడు శ్రేష్ఠము లైన వృక్షములతో నిండిన వనమును విరుగగొట్టి, యుద్ధములో గొప్ప గొప్ప రాక్షసులను సంహరించి, శ్రేష్ఠములైన గృహముల పంక్తులతో ఒప్పారుచున్న ఆ నగరమును కాల్చి, నిలిచి ఉండెను. 43

మూ. త్రికూటశృఙ్గాగ్రతలే విచిత్రే
ప్రతిష్ఠితో వానరరాజసింహః,
ప్రదీప్తలాఙ్గూలకృతార్చిమాలీ
వ్యరాజతాదిత్య ఇవాంశుమాలీ. 44

ప్ర. అ. విచిత్రే=విచిత్రమైన, త్రికూటశృఙ్గాగ్రతలే=త్రికూటపర్వతశిఖరాగ్రముమీద, ప్రతిష్ఠితః=నిలచిఉన్న, ప్రదీప్తలాఙ్గూలకృతార్చిమాలీ=ప్రజ్వలించుచున్న తోకచేత ఏర్పరుపబడిన జ్వాలల మాలలు గల, వానరరాజసింహః=శ్రేష్ఠుడైన ఆ వానరనాయకుడు, అంశుమాలీ=కిరణముల పంక్తి గల, ఆదిత్యః ఇవ=సూర్యుడు వలె, వ్యరాజత=ప్రకాశించెను.

తా. ప్రజ్వలించుచున్న తోకచేత జ్వాలల మాల ఏర్పడిన ఆ హనుమంతుడు విచిత్రమైన ఆ త్రికూటపర్వతశిఖరాగ్రమునందు, కిరణముల మాలలతో కూడిన సూర్యుడు వలె ప్రకాశించెను. 44

మూ. స రాక్షసాంస్తాన్ సుబహూంశ్చ హత్వా
వనం చ భంక్త్వా బహుపాదపం తత్,
విసృజ్య రక్షోభవనేషు చాగ్నిం
జగామ రామం మనసా మహాత్మా. 45

ప్ర. అ. మహాత్మా=మహాత్ముడైన, సః=హనుమంతుడు, సుబహూన్=చాల అధికసంఖ్యలో ఉన్న, తాన్ రాక్షసాన్=ఆ రాక్షసులను, హత్వా=చంపి, బహుపాదపమ్=అనేక వృక్షములు గల, తత్ వనం చ=ఆ వనమును కూడ, భంక్త్వా=విరిచి, రక్షోభవనేషు=రాక్షసగృహములపై, అగ్నిమ్=అగ్నిని, విసృజ్య=విడచి, మనసా=మనస్సుతో, రామమ్=రాముని గూర్చి, జగామ=వెళ్లెను.

తా. మహాత్ముడైన ఆ హనుమంతుడు అనేక రాక్షసులను చంపి, ఎన్నో వృక్షములతో నిండిన ఆ ఉద్యానమును భగ్నము చేసి, రాక్షసుల గృహముల మీద అగ్నిని ఉంచి, మనస్సుతో రాముని వద్దకు వెళ్లెను. 45

మూ. తతస్తు తం వానవీరముఖ్యం
మహాబలం మారుతతుల్యవేగమ్,

మహామతిం వాయుసుతం వరిష్ఠం
ప్రతుష్టువుర్దేవగణాశ్చ సర్వే. 46

ప్ర. అ. తతః=అటుపిమ్మట, వానరవీరముఖ్యమ్=వానరవీరులలో ముఖ్యుడు, మహాబలమ్=గొప్ప బలము గలవాడు, మారుతతుల్యవేగమ్=వాయువుతో సమానమైన వేగము గలవాడు, మహామతిమ్=గొప్ప బుద్ధి గలవాడు, వరిష్ఠమ్=శ్రేష్ఠుడు అయిన, తం వాయుసుతమ్=ఆ హనుమంతుని, సర్వే=సమస్తమైన, దేవగణాః=దేవతాగణములు, ప్రతుష్టువుః=స్తుతించినవి.

తా. అప్పుడు, వానరవీరులలో ముఖ్యుడు, గొప్ప బలము గలవాడు, వాయువుతో సమానమైన వేగము గలవాడు, గొప్ప బుద్ధిమంతుడు, శ్రేష్ఠుడు అయిన ఆ హనుమంతుని దేవత లందరు స్తుతించిరి. 46

మూ. భఙ్క్త్వా వనం మహాతేజా హత్వా రక్షాంసి సంయుగే,
దగ్ధ్వా లఙ్కాపురీం రమ్యాం రరాజ స మహాకపిః. 47

ప్ర. అ. మహాతేజాః=గొప్ప తేజస్సు గల, మహాకపిః=హనుమంతుడు, వనమ్=వనమును, భఙ్క్త్వా=విరచి, సంయుగే=యుద్ధమునందు, రక్షాంసి=రాక్షసులను, హత్వా=చంపి, రమ్యామ్=సుందరమైన, లఙ్కాపురీమ్=లంకా పట్టణమును, దగ్ధ్వా=కాల్చి, రరాజ=ప్రకాశించెను.

తా. గొప్ప తేజస్సు గల హనుమంతుడు వనము విరచి, యుద్ధములో రాక్షసులను చంపి, సుందరమైన లంకాపట్టణమును కాల్చి, ప్రకాశించెను. 47

మూ. తత్ర దేవాః సగన్ధర్వాః సిద్ధాశ్చ పరమర్షయః,
దృష్ట్వా లఙ్కాం ప్రదగ్ధాం తాం విస్మయం పరమం గతాః. 48

ప్ర. అ. తత్ర=అక్కడ, సగన్ధర్వాః=గంధర్వులతో కూడిన, దేవాః=దేవతలు, సిద్ధాశ్చ=సిద్ధులు, పరమర్షయః=గొప్ప ఋషులు, దగ్ధామ్=కాల్చబడిన, తాం లఙ్కామ్ పురీమ్=ఆ లంకాపట్టణమును, దృష్ట్వా=చూచి, పరమమ్=గొప్ప, విస్మయమ్=ఆశ్చర్యమును, గతాః=పొందినారు.

తా. అక్కడ ఆ లంకాపట్టణము కాల్చివేయబడగా చూచి, దేవతలు, గంధర్వులు, సిద్ధులు, గొప్ప ఋషులు చాల ఆశ్చర్యము చెందిరి. 48

మూ. తం దృష్ట్వా వానరశ్రేష్ఠం హనుమన్తం మహాకపిమ్,
కాలాగ్నిరితి సంచిన్త్య సర్వభూతాని తత్రసుః. 49

ప్ర. అ. వానరశ్రేష్ఠమ్=వానరులలో శ్రేష్ఠుడు, మహాకపిమ్=గొప్ప వానరుడు అయిన, తం హనుమన్తమ్=ఆ హనుమంతుని, దృష్ట్వా=చూచి,

కాలాగ్నిరితి=కాలాగ్ని అని, సంచిన్త్య=భావించి, సర్వభూతాని=సకలప్రాణులు కూడ, తత్రసుః=భయపడినవి.

తా. వానరశ్రేష్ఠుడైన ఆ హనుమంతుని చూచి, సకలభూతములు కూడ, ఆతడు సాక్షాత్తు కాలాగ్నియే అని భావించి భయపడినవి. 49

మూ. దేవాశ్చ సర్వే మునిపుఙ్గవాశ్చ
గన్ధర్వవిద్యాధరనాగయక్షాః,
భూతాని సర్వాణి మహాన్తి తత్ర
జగ్ముః పరాం ప్రీతిమతుల్యరూపామ్. 50

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే సున్దరకాణ్డే
చతుఃపఞ్చాశః సర్గః.

ప్ర. అ. తత్ర=అక్కడ, సర్వే=సమస్తమైన, దేవాశ్చ=దేవతలు, మునిపుఙ్గవాశ్చ=మునిశ్రేష్ఠులు, గన్ధర్వవిద్యాధరనాగయక్షాః=గంధర్వులు, విద్యాధరులు, నాగులు, యక్షులు, మహాన్తి=గొప్పవైన, సర్వాణి=సమస్తమైన, భూతాని=ప్రాణులు, అతుల్యరూపామ్=సాటిలేని, పరామ్=గొప్ప, ప్రీతిమ్=సంతోషమును, జగ్ముః=పొందిరి.

తా. హనుమంతుడు చేసిన ఆ లంకాదహనము చూచి దేవతలు,మునులు, గంధర్వులు విద్యాధరులు, నాగులు, యక్షులు, సమస్తమైన గొప్ప ప్రాణులు సాటిలేని గొప్ప సంతోషము పొందిరి. 50

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు
సుందరకాండలో ఏబదినాల్గవ సర్గ సమాప్తము.

అథ పఞ్చపఞ్చాశః సర్గః

[సీత కూడ అగ్నిచే దహింపబడినదేమో అని హనుమంతుడు భయపడుట, ఆ భయము నివృత్తి యగుట]

మూ. సందీప్యమానాం విత్రస్తాం త్రస్తరక్షోగణాం పురీమ్,
అవేక్ష్య హనుమాన్ లఙ్కాం చిన్తయామాస వానరః. 1

ప్ర. అ. వానరః=వానరుడైన, హనుమాన్=హనుమంతుడు, సందీప్యమానామ్=మండింపబడుచున్నది, విత్రస్తామ్=భయపడినది, త్రస్తరక్షోగణామ్=భయపడిన రాక్షసగణము కలది అయిన, లఙ్కాం పురీమ్=లంకానగరమును, అవేక్ష్య=చూచి, చిన్తయామాస=ఆలోచించెను.

తా. దహింపబడుచున్నదై, భయపడినదీ, భయాక్రాంతులైన రాక్షస గణములు కలదీ అయిన ఆ లంకాపురమును చూచి హనుమంతుడు ఇట్లు ఆలోచించెను. 1

మూ. తస్యాసీత్సుమహాంస్త్రాసః కుత్సా చాత్మన్యజాయత,
లఙ్కాం ప్రదహతా కర్మ కింస్విత్ కృతమిదం మయా. 2

ప్ర. అ. తస్య=అతనికి, సుమహాన్=చాల గొప్పదైన, త్రాసః=భయము, అభూత్=ఆయెను. ఆత్మని=తనయందు, కుత్సా చ=నింద కూడ, అజాయత=కలిగెను, లఙ్కామ్=లంకను, ప్రదహతా=కాల్చుచున్న, మయా=నాచేత, ఇదమ్=ఈ, కింస్విత్=ఏ, కర్మ=పని, కృతమ్=చేయబడినది.

తా. అప్పుడు హనుమంతునకు చాల భయము కలిగెను. తన విషయమున నిందాబుద్ధి కూడ కలిగెను. లంకను కాల్చివేయుచూ నేనెంత పని చేసితిని ? 2

మూ. ధన్యాస్తే పురుషశ్రేష్ఠా యే బుద్ధ్యా కోపముత్థితమ్,
నిరున్ధన్తి మహాత్మానో దీప్తమగ్నిమివామ్భసా. 3

ప్ర. అ. ఉత్థితమ్=బయలుదేరిన, కోపమ్=కోపమును, బుద్ధ్యా=బుద్ధిచేత, దీప్తమ్=ప్రజ్వలించుచున్న, అగ్నిమ్=అగ్నిని, అమ్భసా ఇవ=ఉదకము చేత వలె, యే=ఎవరైతే, నిరున్ధన్తి=అడ్డగించుకొందురో, మహాత్మానః=గొప్ప బుద్ధి గల, తే=ఆ, పురుషశ్రేష్ఠాః=పురుషశ్రేష్ఠులు, ధన్యాః=ధన్యులు కదా.

తా. మండుచున్న అగ్నిని నీటితో ఆర్పివేసినట్లు, పుట్టిన కోపమును ఎవరు అణచుకొందురో, గొప్ప బుద్ధి గల అట్టి పురుషశ్రేష్ఠులు ధన్యులు కదా!

మూ. క్రుద్ధః పాపం న కుర్యాత్కః క్రుద్ధో హన్యాద్గురూనపి,
క్రుద్ధః పరుషయా వాచా నరః సాధూనధిక్షిపేత్. 4

ప్ర. అ. క్రుద్ధః=కోపించిన, కః=ఎవడు, పాపమ్=పాపమును, న కుర్యాత్=చేయడు ? క్రుద్ధః=కోపించినవాడు, గురూనపి=పూజ్యులను కూడ, హన్యాత్=చంపును. క్రుద్ధః=కోపించిన, నరః=నరుడు, పరుషయా=పరుషమైన, వాచా=వాక్కుతో, సాధూన్=సత్పురుషులను, అధిక్షిపేత్=ఆక్షేపించును.

తా. కోపించినవాడు ఎవడు పాపము చేయడు ? కోపించినవాడు పూజ్యులైన పెద్దలను కూడ చంపివేయును. కోపించిన నరుడు సత్పురుషులను కూడ పరుషములైన మాటలతో ఆక్షేపించును. 4

మూ. వాచ్యావాచ్యం ప్రకుపితో న విజానాతి కర్హిచిత్,
నాకార్యమస్తి క్రుద్ధస్య నావాచ్యం విద్యతే క్వచిత్. 5

ప్ర. అ. ప్రకుపితః=బాగుగా కోపించినవాడు, కర్హిచిత్=ఎన్నడూ, వాచ్యా వాచ్యమ్=పలుకదగిన మాటను పలుకకూడని మాటను, న విజానాతి=ఎరుగడు. క్రుద్ధస్య=కోపించినవానికి, అకార్యమ్=చేయకూడని పని, న అస్తి=ఉండదు, అవాచ్యమ్=పలుకకూడనిది కూడ, క్వచిత్=ఎప్పుడును, న విద్యతే=ఉండదు.

తా. చాలా కోపించినవానికి ఏది పలుకవలెనో, ఏది పలుకకూడదో ఎన్నడూ తెలియదు. కోపించినవానికి ఎట్టి పరిస్థితులలోను చేయకూడని పని గాని, అనకూడని మాట కాని ఉండదు. 5

మూ. యః సముత్పతితం క్రోధం క్షమయైవ నిరస్యతి,
యథోరగస్త్వచం జీర్ణాం స వై పురుష ఉచ్యతే. 6

ప్ర. అ. ఉరగః=సర్పము, జీర్ణామ్=జీర్ణమైన, త్వచం యథా=కుబుసమును వలె, యః=ఎవడు, సముత్పతితమ్=హటాత్తుగా పుట్టిన, క్రోధమ్=క్రోధమును, క్షమయైవ=ఓర్పుచేతనే, నిరస్యతి=తొలగించుకొనునో, సః వై=అతడే, పురుషః=ఉత్తమపురుషుడుగా, ఉచ్యతే=చెప్పబడుచున్నాడు.

తా. సర్పము చివికి పోయిన చర్మమును (కుబుసమును) విడచివేసినట్లు, పుట్టిన కోపమును ఓర్పుచేత తొలగించుకొనువాడే ఉత్తమపురుషుడు. 6

మూ. ధిగస్తు మాం సుదుర్బుద్ధిం నిర్లజ్జం పాపకృత్తమమ్,
అచిన్తయిత్వా తాం సీతామగ్నిదం స్వామిఘాతకమ్. 7

ప్ర. అ. తాం సీతామ్=ఆ సీతను గూర్చి, అచిన్తయిత్వా=ఆలోచించకుండగా, అగ్నిదమ్=అగ్నిని ఇచ్చినవాడను, స్వామిఘాతకమ్=ప్రభువుకు ద్రోహము చేసినవాడను, సుదుర్బుద్ధిమ్=చాలా దుర్బుద్ధి కలవాడను, నిర్లజ్జమ్=లజ్జలేనివాడను, పాపకృత్తమమ్=పాపము చేసినవారిలో గొప్పవాడను అయిన, మామ్=నన్ను గూర్చి, ధిక్ అస్తు=నింద అగుగాక.

తా. ఛీ ! నే నెంత సిగ్గులేని దుర్బుద్ధిని ! సీతను గూర్చి ఆలోచించకుండగా లంకకు చిచ్చుపెట్టినాను. ప్రభుకార్యమును పాడుచేసిన మహాపాపాత్ముడను ! 7

మూ. యది దగ్ధా త్వియం లఙ్కా నూనమార్యాపి జానకీ,
దగ్ధా తేన మయా భర్తుర్హతం కార్యమజానతా. 8

ప్ర. అ. ఇయమ్=ఈ, లఙ్కా=లంక, దగ్ధా యది=కాల్చబడినట్లయితే, ఆర్యా=పూజ్యురాలైన, జానక్యపి=జానకి కూడ, దగ్ధా=కాల్చబడినది. తేన=ఆ కారణము చేత, అజానతా=తెలియని, మయా=నాచేత, భర్తుః=ప్రభువు యొక్క, కార్యమ్=కార్యము, హతమ్=కొట్టబడినది (పాడు చేయబడినది).

తా. ఈ లంక కాలిపోయినచో పూజ్యురాలైన సీత కూడ కాలిపోయియే ఉండును. ఈ విధముగా నేను తెలివి తక్కువతనముచేత ప్రభువు కార్యమును పాడుచేసినాను ! 8

మూ. యదర్థమయమారమ్భస్తత్కార్యమవసాదితమ్,
మయా హి దహతా లఙ్కాం న సీతా పరిరక్షితా. 9

ప్ర. అ. యదర్థమ్=ఏ కార్యము నిమిత్తము, అయమ్=ఈ, ఆరమ్భః=ప్రయత్నమో, తత్ కార్యమ్=ఆ కార్యము, అవసాదితమ్=చెడగొట్టబడినది. లఙ్కామ్=లంకను, దహతా=కాల్చుచున్న, మయా=నాచేత, సీతా=సీత, న పరిరక్షితా హి=రక్షింపబడలేదు.

తా. ఏ కార్యము సాధించుటకు ఈ ప్రయత్నమంతా జరిగినదో ఆ కార్యమును చెడగొట్టినాను. ఎందుచేతననగా లంకాపట్టణమును కాల్చే సమయమునందు నేను సీతాదేవిని రక్షించలేదు. 9

మూ. ఈషత్కార్యమిదం కార్యం కృతమాసీన్న సంశయః,
తస్య క్రోధాభిభూతేన మయా మూలక్షయః కృతః. 10

ప్ర. అ. ఇదం కార్యమ్=ఈ కార్యము, ఈషత్కార్యమ్=ఇంక కొంచెము మాత్రమే చేయవలసినదిగా, కృతమ్=చేయబడినది, ఆసీత్=ఆయెను. క్రోధాభిభూతేన=కోపముచేత తిరస్కరింపబడిన (అధికమైన కోపముగల) మయా=నాచేత, తస్య=అట్టి కార్యముయొక్క, మూలక్షయః=మూలముననకే వినాశము, కృతః=చేయబడినది. సంశయః=సంశయము, న=లేదు.

తా. తలబెట్టిన ఈ కార్యము చాల వరకు పూర్తియైనది. కాని నేను కోపావేశముతో మూలముననకే వినాశము చేసినాను ; సందేహము లేదు. 10

మూ. వినష్టా జానకీ నూనం న హ్యదగ్ధః ప్రదృశ్యతే,
లఙ్కాయాం కశ్చిదుద్దేశః సర్వా భస్మీకృతా పురీ. 11

ప్ర. అ. నూనమ్=నిశ్చయముగా, జానకీ=జానకి, వినష్టా=నశించినది. లఙ్కాయామ్=లంకలో, కశ్చిత్=ఏ, ఉద్దేశః=ప్రదేశము కూడ, అదగ్ధః=కాల్చబడనిది, న ప్రదృశ్యతే హి=చూడబడుటలేదు కదా. సర్వా=సమస్తమైన, పురీ=పట్టణము, భస్మీకృతా=భస్మము చేయబడినది.

తా. లంకాపట్టణ మంతా భస్మమైపోయినది. ఈ పట్టణములో కాల్చబడని ప్రదేశమేదీ కనబడుటలేదు. అందుచేత జానకి కూడ తప్పక కాలిపోయిఉండును.

మూ. యది తద్విహతం కార్యం మమ ప్రజ్ఞావిపర్యయాత్,
ఇహైవ ప్రాణసంన్యాసో మమాపి హ్యద్య రోచతే. 12

ప్ర. అ. మమ=నాయొక్క, ప్రజ్ఞావిపర్యయాత్=బుద్ధివైపరీత్యమువలన, తత్=ఆ, కార్యమ్=కార్యము, విహతం యది=నష్టమైనచో, మమాపి=నాకు కూడా, ఇహైవ=ఇక్కడనే, ప్రాణసంన్యాసః=ప్రాణపరిత్యాగము, అద్య=ఇప్పుడు, రోచతే=ఇష్టమగుచున్నది.

తా. నా బుద్ధివైపరీత్యముచే ఈ కార్యము చెడిపోయిన పక్షాన, ఇప్పుడు నేను కూడ ఇక్కడనే ప్రాణపరిత్యాగము చేయుట మంచిది. 12

మూ. కిమగ్నౌ నిపతామ్యద్య ఆహోస్విద్బడబాముఖే,
శరీరమాహో సత్త్వానాం దద్మి సాగరవాసినామ్. 13

ప్ర. అ. అద్య=ఇప్పుడు, అగ్నౌ=అగ్నియందు, నిపతామి=పడుదునా ? ఆహోస్విత్=లేక, బడబాముఖే=బడబాగ్ని (సముద్రములోని అగ్ని) ముఖమునందు పడుదునా ? ఆహో=లేక, శరీరమ్=శరీరమును, సాగరవాసినామ్=సముద్రములో నివసించు, సత్త్వానామ్=జంతువులకు, దద్మి=ఇచ్చెదనా?

తా. ఇప్పుడు నేను అగ్నిలో దుముకుదునా? బడబాగ్నిలో పడుదునా, లేక సముద్రములో ఉన్న జంతువులకు నా శరీరమును ఆహారముగా ఇచ్చివేయుదునా?

మూ. కథం హి జీవతా శక్యో మయా ద్రష్టుం హరీశ్వరః,
తౌ వా పురుషశార్దూలౌ కార్యసర్వస్వఘాతినా. 14

ప్ర. అ. కార్యసర్వస్వఘాతినా=కార్యముయొక్క సకలఫలమును చెడగొట్టిన, మయా=నాచేత, జీవతా=జీవించియుండి, హరీశ్వరః=సుగ్రీవుడు, ద్రష్టుమ్=చూచుటకు, కథం వా=ఎట్లు, శక్యః=శక్యమైనవాడు? పురుషశార్దూలౌ=పురుషశ్రేష్ఠులైన, తౌ వా=ఆ రామలక్ష్మణులైనా, చూచుటకు ఎట్లు శక్యమైనవారు?

తా. మొత్తము కార్యము అంతా చెడగొట్టిన నేను ప్రాణాలతో ఉండి, సుగ్రీవునకు గాని, పురుషశ్రేష్ఠులైన ఆ రామలక్ష్మణులకు గాని నా ముఖము ఎట్లు చూపగలను ? 14

మూ. మయా ఖలు తదేవేదం రోషదోషాత్ప్రదర్శితమ్,
ప్రథితం త్రిషు లోకేషు కపిత్వమనవస్థితమ్. 15

ప్ర. అ. మయా=నాచేత, రోషదోషాత్=రోషమనే దోషమువలన, త్రిషు లోకేషు=మూడు లోకములందు, ప్రథితమ్=ప్రసిద్ధమైన, అనవస్థితమ్=స్థిరత్వము లేని, తత్=ఆ, ఇదమ్=ఈ, కపిత్వమ్=కపిత్వము, ప్రదర్శితం ఖలు=చూపబడినది కదా ?

తా. నేను కోపావేశములో, మూడు లోకములలోను ప్రసిద్ధమైన, కపులకు సహజమైన చపలత్వము చూపినాను. 15

మూ. ధిగస్తు రాజసం భావమనీశమనవస్థితమ్,
ఈశ్వరేణాపి యద్రాగాన్మయా సీతా న రక్షితా. 16

ప్ర. అ. అనీశమ్=సమర్థము కానిది (అదుపులో ఉండజాలనిది), అనవస్థితమ్=స్థిరత్వము లేనిది అయిన, రాజసమ్=రజోగుణప్రధానమైన, భావమ్=

భావమును గూర్చి, ధిక్ అస్తు=నింద అగు గాక, యత్=ఏ కారణమువలన, ఈశ్వరేణాపి=సమర్థుడ నైనను, మయా=నాచేత, రాగాత్=రజోగుణప్రభావమువలన, సీతా=సీత, న రక్షితా=రక్షింపబడలేదో !

తా. ఛీ ! రాజసప్రవృత్తి ఎంత చెడ్డది ! ఇది అదుపులో ఉండదు. చపలత్వమును కలిగించును. దీని ప్రభావముచేతనే నేను, సీతను రక్షించుటకు సమర్థుడనై ఉండి కూడ ఆమెను రక్షించజాలకపోయితిని. 16

మూ. వినష్టాయాం తు సీతాయాం తావుభౌ వినశిష్యతః,
తయోర్వినాశే సుగ్రీవః సబన్ధుర్వినశిష్యతి. 17

ప్ర. అ. సీతాయామ్=సీత, వినష్టాయామ్=మరణించినదగుచుండగా, తౌ ఉభౌ=ఆ రామలక్ష్మణులిద్దరూ, వినశిష్యతః=మరణించెదరు. తయోః=వారిద్దరి యొక్క, వినాశే=మరణము కలుగగా, సబన్ధుః=బంధుసమేతుడైన, సుగ్రీవః=సుగ్రీవుడు, వినశిష్యతి=నశించగలడు.

తా. సీత మరణించినచో ఆ రామలక్ష్మణులిద్దరు కూడా మరణింతురు. వారు మరణించినచో బంధువులందరితో సుగ్రీవుడు మరణించగలడు. 17

మూ. ఏతదేవ వచః శ్రుత్వా భరతో భ్రాతృవత్సలః,
ధర్మాత్మా సహశత్రుఘ్నః కథం శక్ష్యతి జీవితుమ్. 18

ప్ర. అ. ఏతదేవ=ఈ, వచః=వచనమును (వార్తను) శ్రుత్వా=విని, భ్రాతృవత్సలః=సోదరులయందు ప్రేమ గల, ధర్మాత్మా=ధర్మాత్ము డైన, సహ శత్రుఘ్నః=శత్రుఘ్నునితో కూడిన, భరతః=భరతుడు, జీవితుమ్=జీవించుటకు, కథమ్=ఎట్లు, శక్ష్యతి=సమర్థుడగును ?

తా. ఈ వార్త విన్న పిమ్మట, సోదరునియందు ప్రేమ గల, ధర్మాత్ముడైన భరతుడు, శత్రుఘ్నుడు కూడ ఎట్లు జీవించగలరు ? 18

మూ. ఇక్ష్వాకువంశే ధర్మిష్ఠే గతే నాశమసంశయమ్,
భవిష్యన్తి ప్రజాః సర్వాః శోకసన్తాపపీడితాః. 19

ప్ర. అ. ధర్మిష్ఠే=ధర్మనిష్ఠగల, ఇక్ష్వాకువంశే=ఇక్ష్వాకువంశము, నాశమ్=నాశమును, గతే=పొందినదగుచుండగా, సర్వాః=సమస్తమైన, ప్రజాః=ప్రజలు, అసంశయమ్=నిస్సంశయముగా, శోకసంతాపపీడితాః=శోకముచేతను, మనస్తాపము చేతను పీడింపబడినవారు, భవిష్యన్తి=కాగలరు.

తా. ధర్మమార్గనిరత మైన ఇక్ష్వాకువంశము నశించిన పిమ్మట ప్రజలందరు శోకముచేత, మనస్తాపముచేత పీడితులై పోవుదురు. సందేహము లేదు. 19

మూ. తదహం భాగ్యరహితో లుప్తధర్మార్థసంగ్రహః, 20
రోగదోషపరీతాత్మా వ్యక్తం లోకవినాశనః.

ప్ర. అ. తత్=ఆ కారణమువలన, భాగ్యరహితః=భాగ్యము లేని వాడను, లుప్తధర్మార్థ సంగ్రహః=లోపించిన ధర్మార్థముల సంగ్రహము కలవాడను, రోషదోషపరీతాత్మా=రోష మనే దోషముతో నిండిన మనస్సు కలవాడను అయిన, అహమ్=నేను, వ్యక్తమ్=స్పష్టముగా, లోకవినాశనః=లోకమును నశింపచేసేవాడను అయినాను.

తా. ఈ విధముగా భాగ్యశూన్యుడనైన నేను ధర్మమును, అర్థమును సంరక్షించుకొనజాలక, రోషమనే దోషముతో నిండిన మనస్సు కలవాడనై లోకవినాశమునకు కారణభూతుడ నను విషయము స్పష్టము. 20

మూ. ఇతి చిన్తయతస్తస్య నిమిత్తాన్యుపపేదిరే,
పూర్వమప్యుపలబ్ధాని సాక్షాత్పునరచిన్తయత్. 21

ప్ర. అ. తస్య=ఆ హనుమంతుడు, ఇతి=ఇట్లు, చిన్తయతః=ఆలోచించు చుండగా, సాక్షాత్=సాక్షాత్తు, పూర్వమపి=పూర్వముకూడ, ఉపలబ్ధాని=పొందబడిన, నిమిత్తాని=నిమిత్తములు (శకునములు) ఉపపేదిరే=వచ్చినవి. పునః=మరల, అచిన్తయత్=ఆలోచించెను.

తా. హనుమంతుడీ విధముగా ఆలోచించుచుండగా అతడు పూర్వము కూడ స్వయముగ అనుభవించిన శకునములు కనబడెను. అప్పుడాతడు మరల ఇట్లు ఆలోచించెను. 21

మూ. అథవా చారుసర్వాఙ్గీ రక్షితా స్వేన తేజసా,
న నశిష్యతి కల్యాణీ నాగ్నిరగ్నౌ ప్రవర్తతే. 22

ప్ర. అ. అథవా=లేదా, చారుసర్వాఙ్గీ=అందమైన సమస్త అవయవములు కలదీ, స్వేన=తన సంబంధమైన, తేజసా=తేజస్సు చేత, రక్షితా=రక్షింపబడినదీ, కల్యాణీ=మంగళప్రదురాలూ అయిన సీత, న నశిష్యతి=నశించదు. అగ్నిః=అగ్ని, అగ్నౌ=అగ్నియందు, న ప్రవర్తతే=ప్రవర్తించదు.

తా. లేదా అందమైన సకలావయవములు గల ఆ సీతను ఆమె తేజస్సే రక్షించుచున్నది. మంగళప్రదురాలైన అట్టి సీత నశించదు. అగ్ని అగ్నిని కాల్చదు కదా ! 22

మూ. న హి ధర్మాత్మనస్తస్య భార్యామమితతేజసః,
స్వచారిత్రాభిగుప్తాం తాం స్ప్రష్టుమర్హతి పావకః. 23

ప్ర. అ. ధర్మాత్మనః=ధర్మాత్ముడు, అమితతేజసః=పరిమితి లేని తేజస్సు కలవాడు అయిన, తస్య=ఆ రామునియొక్క, భార్యామ్=భార్యను,స్వచారిత్రాభిగుప్తామ్=తన పాతివ్రత్యరూపమైన సచ్చరిత్రచేత రక్షింపబడినదీ అయిన, తామ్=ఆమెను, పావకః=అగ్ని, స్ప్రష్టుమ్=స్పృశించుటకు, నార్హతి హి=తగదు కదా !

తా. ధర్మాత్ముడు, అపరిమితమైన తేజస్సు కలవాడూ అయిన ఆ రాముని భార్య, తన పాతివ్రత్యముచేత రక్షింపబడినదీ అయిన ఆ సీతను అగ్ని స్పృశింపజాలదు కదా ! 23

మూ. నూనం రామప్రభావేణ వైదేహ్యాః సుకృతేన చ,
యన్మాం దహనకర్మాయం నాదహద్ధవ్యవాహనః. 24

ప్ర. అ. దహనకర్మా=కాల్చుట అను పనిగల, అయమ్=ఈ, హవ్యవాహనః=అగ్ని, మామ్=నన్ను, నాదహత్ ఇతి యత్=దహించలేదనునది ఏది కలదో, అది, నూనమ్=నిశ్చయముగా, రామప్రభావేణ=రాముని ప్రభావముచేతను, వైదేహ్యాః=సీతయొక్క, సుకృతేన చ=పుణ్యముచేతను (జరిగినది).

తా. కాల్చివేయు స్వభావము గల ఈ అగ్ని నన్ను కాల్చలేదన్నచో ఇందుకు కారణము రాముని ప్రభావము, సీత పుణ్యము మాత్రమే. 24

మూ. త్రయాణాం భరతాదీనాం భ్రాతౄణాం దేవతా చ యా,
రామస్య చ మనఃకాన్తా సా కథం వినశిష్యతి. 25

ప్ర. అ. యా=ఏ సీత, భరతాదీనామ్=భరతుడు మొదలైన, త్రయాణామ్=ముగ్గురికి, దేవతా చ=దేవతయో, రామస్య=రామునియొక్క, మనః కాన్తా=మనస్సుకు ప్రియమైనదో, సా=అట్టి, సీత, కథమ్=ఎట్లు, వినశిష్యతి=నశించును ?

తా. భరతుడు మొదలైన ముగ్గురు సోదరులకు పూజ్యురాలు, రాముని మనస్సునకు అత్యంత ప్రియురాలు అయిన ఆ సీత అగ్నిలో ఎట్లు నశించును?

మూ. యద్వా దహనకర్మాయం సర్వత్ర ప్రభురవ్యయః,
న మే దహతి లాఙ్గూలం కథమార్యాం ప్రధక్ష్యతి. 26

ప్ర. అ. యద్వా=లేదా, సర్వత్ర=అంతటను, ప్రభుః=సమర్థుడు, అవ్యయః=నాశము లేనివాడు అయిన, అయమ్=ఈ, దహనకర్మా=అగ్ని, మే=నాయొక్క, లాఙ్గూలమ్=తోకను, న దహతి=కాల్చుట లేదు. ఆర్యామ్=పూజ్యురాలైన సీతను, కథమ్=ఎట్లు, ప్రధక్ష్యతి=కాల్చును ?

తా. ఎక్కడా ఏ విధమైన అడ్డూ లేక ప్రసరించగలిగిన ఈ అగ్ని నా తోకనే కాల్చలేదు కదా ; సీతను ఎట్లు కాల్చగలదు ? 26

మూ. పునశ్చాచిన్తయత్తత్ర హనుమాన్విస్మితస్తదా,
హిరణ్యనాభస్య గిరేర్జలమధ్యే ప్రదర్శనమ్. 27

ప్ర. అ. తదా=అప్పుడు, హనుమాన్=హనుమంతుడు, విస్మితః=ఆశ్చర్యము చెందిన వాడై, జలమధ్యే=సముద్రజలమధ్యమునందు, హిరణ్యనాభస్య=హిరణ్యనాభుడను, గిరేః=పర్వతముయొక్క, ప్రదర్శనమ్=దర్శనమును గూర్చి, తత్ర=అక్కడ, పునః=మరల, అచిన్తయత్=ఆలోచించెను.

తా. అప్పుడు హనుమంతుడు తాను వచ్చుచున్నప్పుడు జలమధ్యమునందు మైనాకపర్వతము కనబడుటను గూర్చి ఆశ్చర్యపూర్వకముగా స్మరించెను. 27

మూ. తపసా సత్యవాక్యేన అనన్యత్వాచ్చ భర్తరి,
అపి సా నిర్దహేదగ్నిం న తామగ్నిః ప్రధక్ష్యతి. 28

ప్ర. అ. తపసా=తపస్సుచేతను, సత్యవాక్యేన=సత్యవాక్యము చేతను, భర్తరి=భర్తవిషయమున, అనన్యత్వాచ్చ=ఏకాగ్రచిత్తముండుటవలనను, సా=ఆ సీత, అగ్నిమ్=అగ్నిని, నిర్దహేత్ అపి=కాల్చివేయును కూడ. తామ్=ఆమెను, అగ్నిః=అగ్ని, న ప్రధక్ష్యతి=కాల్చదు.

తా. తపస్సుచేత, సత్యవాక్యముచేత, భర్త విషయమున ఏకాగ్రమైన భక్తిచేత సీత అగ్నినే కాల్చివేయును. ఆమెను అగ్ని కాల్చజాలదు. 28

మూ. స తథా చిన్తయంస్తత్ర దేవ్యా ధర్మపరిగ్రహమ్,
శుశ్రావ హనుమాన్వాక్యం చారణానాం మహాత్మనామ్. 29

ప్ర. అ. తత్ర=అక్కడ, తథా=ఆ విధముగా, దేవ్యాః=సీతాదేవి యొక్క, ధర్మపరిగ్రహమ్=ధర్మముయొక్క స్వీకారమును (ధర్మపరత్వమును) గూర్చి, చిన్తయన్=ఆలోచించుచున్న, సః హనుమాన్=ఆ హనుమంతుడు, మహాత్మనామ్=మహాత్ములైన, చారణానామ్=చారణులయొక్క, వాక్యమ్=వాక్యమును, శుశ్రావ=వినెను.

తా. అక్కడ, ఆ విధముగా, సీతాదేవి ధర్మపరాయణురాలను విషయమును గూర్చి ఆలోచించుచున్న హనుమంతునకు మహాత్ములైన చారణుల మాటలు వినవచ్చెను. 29

మూ. అహో ఖలు కృతం కర్మ దుష్కరం హి హనూమతా,
అగ్నిం విసృజతాఽభీక్ష్ణం భీమం రాక్షసవేశ్మని. 30

ప్ర. అ. రాక్షసవేశ్మని=రావణుని గృహమునందు, అభీక్ష్ణమ్=మిక్కిలి, భీమమ్=భయంకరమైన, అగ్నిమ్=అగ్నిని, విసృజతా=విడచిన, హనూమతా=హనుమంతునిచేత, దుష్కరమ్=చేయ శక్యము కాని, కర్మ=పని, కృతం ఖలు=చేయబడినది కదా ! అహో=ఎంత ఆశ్చర్యము !

తా. చాల భయంకరమైన అగ్నిని రావణుని గృహమునకు ముట్టించిన హనుమంతుడు ఎవ్వరూ చేయజాలని పనిచేసినాడు. ఎంత ఆశ్చర్యము ! 30

మూ. ప్రపలాయితరక్షఃస్త్రీబాలవృద్ధసమాకులా,
జనకోలాహలాధ్మాతా క్రన్దన్తీవాద్రికన్దరైః. 31

ప్ర. అ. ప్రపలాయితరక్షఃస్త్రీబాలవృద్ధసమాకులా=పరుగెత్తుచున్న రాక్షసులతోను, వాళ్ళ స్త్రీలతోను, బాలలతోను, వృద్ధులతోను వ్యాకులమైనదీ, జనకోలాహలాధ్మాతా=జనుల కోలాహలముచేత నింపబడినది అయిన లంక, అద్రికన్దరైః=పర్వతగుహలచేత, క్రన్దన్తీవ=ఏడ్చుచున్నట్లున్నది.

తా. రాక్షసులు, వాళ్ళ స్త్రీలు, బాలలు, వృద్ధులు ఇటునటు పరుగెత్తుట చేత వ్యాకులముగా ఉన్న ఈ లంకాపట్టణము, జనుల కోలాహలముచేత నింపబడినదై, పర్వతగుహలచేత ఏడ్చుచున్నట్లున్నది. అనగా ఈ ధ్వని పర్వత గుహలలో వ్యాపించగా ఆ గుహలనే ముఖములతో లంక ఏడ్చుచున్నది అని భావము. 31

మూ. దగ్ధేయం నగరీ సర్వా సాట్టప్రాకారతోరణా,
జానకీ న చ దగ్ధేతి విస్మయోఽద్భుత ఏవ నః. 32

ప్ర. అ. సాట్టప్రాకారతోరణా=కోటబురుజులతోను, ప్రాకారములతోను, ముఖద్వారములతోను కూడిన, ఇయమ్=ఈ, నగరీ=పట్టణము, సర్వా=సమస్తమూ, దగ్ధా=కాల్చబడినది. జానకీ చ=జానకి మాత్రము, న దగ్ధా=కాల్చబడలేదు, ఇతి=అని, నః=మాకు, అద్భుతః=ఆశ్చర్యకరమైన, విస్మయః ఏవ=ఆశ్చర్యము కలుగుచున్నది.

తా. కోటబురుజులతోను, ప్రాకారములతోను, ముఖద్వారములతోను ఈ నగరమంతా కాలిపోయినది కాని సీత మాత్రము దహింపబడలేదు అని మాకు ఆశ్చర్యము కలుగుచున్నది. 32

మూ. స నిమిత్తైశ్చ దృష్టార్థైః కారణైశ్చ మహాగుణైః,
ఋషివాక్యైశ్చ హనుమానభవత్ప్రీతమానసః. 33

ప్ర. అ. సః హనుమాన్=ఆ హనుమంతుడు, దృష్టార్థైః=చూడబడిన ప్రయోజనములు గల, నిమిత్తైః=నిమిత్తముల చేతను (శకునముల చేతను), మహాగుణైః=గొప్ప గుణములు గల, కారణైశ్చ=కారణములచేతను, ఋషివాక్యైశ్చ= ఋషీశ్వరుల వాక్యములచేతను, ప్రీతమానసః=సంతోషించిన మనస్సు కలవాడు, అభవత్=ఆయెను.

తా. ఆ హనుమంతుని మనస్సు పూర్వము సఫలములుగా కనబడిన శకునముల చేతను, గొప్ప గుణములు గల కారణములచేతను, ఋషుల మాటల చేతను సంతోషము పొందెను. 33

మూ. తతః కపిః ప్రాప్తమనోరథార్థ
స్తామక్షతాం రాజసుతాం విదిత్వా,
ప్రత్యక్షతస్తాం పునరేవ దృష్ట్వా
ప్రతిప్రయాణాయ మతిం చకార. 34

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే సున్దరకాణ్డే
పఞ్చపఞ్చాశః సర్గః.

ప్ర. అ. తతః=అటుపిమ్మట, కపిః=హనుమంతుడు, ప్రాప్తమనోరథార్థః= పొందబడిన మనోరథఫలము గలవాడై, తాం రాజసుతామ్=ఆ రాజకుమారియైన సీతను, అక్షతామ్=నశించనిదానినిగా, విదిత్వా=తెలిసికొని, తామ్=ఆమెను, పున రేవ=మరల, ప్రత్యక్షతః=ప్రత్యక్షముగా, దృష్ట్వా=చూచి, ప్రతిప్రయాణాయ=తిరిగి వెళ్లుటకు, మతిమ్=బుద్ధిని, చకార=చేసెను.

తా. హనుమంతుడు తన మనోరథము సఫలము చేసికొని, రాజకుమా రియైన సీతాదేవి జీవించియే ఉన్నట్లు తెలిసికొని, మరల ఆమెను ప్రత్యక్షముగా చూచి తిరిగి వెళ్ళుటకై నిశ్చయించుకొనెను. 34

*"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు
సుందరకాండలో ఏబదియైదవ సర్గ సమాప్తము.*

అథ షట్పఞ్చాశః సర్గః

[హనుమంతుడు మరల సీతాదర్శనము చేసి, లంకనుండి బయలుదేరి సముద్రమును లంఘించుట].

మూ. తతస్తు శింశుపామూలే జానకీం పర్యుపస్థితామ్,
అభివాద్యాబ్రవీద్దిష్ట్యా పశ్యామి త్వామిహాక్షతామ్. 1

ప్ర. అ. తతః=అటుపిమ్మట,శింశుపావృక్షే=శింశుపా వృక్షమునందు(నకు), పర్యుపస్థితామ్=సమీపించి ఉన్న, జానకీమ్=జానకిని, అభివాద్య=నమస్కరించి, అబ్రవీత్=పలికెను. దిష్ట్యా=దైవవశముచేత, అక్షతామ్=ఏ మాత్రము అపాయము లేకుండా ఉన్న, త్వామ్=నిన్ను, ఇహ=ఇక్కడ, పశ్యామి=చూచుచున్నాను.

తా. పిమ్మట హనుమంతుడు శింశుపావృక్షసమీపమునందున్న జానకిని చూచి నమస్కరించి - "నీవు దైవవశముచే ఏ అపాయము లేకుండ ఉండగా చూడగలిగినాను" అని పలికెను. 1

మూ. తతస్తం ప్రస్థితం సీతా వీక్షమాణా పునః పునః,
భర్తృస్నేహాన్వితం వాక్యం హనూమన్తమభాషత. 2

ప్ర. అ. తతః=అటు పిమ్మట, ప్రస్థితమ్=ప్రయాణమైన, తం హనూమన్తమ్=ఆ హనుమంతుని, పునః పునః=మాటి మాటికి, వీక్షమాణా=చూచుచున్నదై, సీతా=సీత, భర్తృస్నేహాన్వితమ్=భర్తయందు స్నేహముతో కూడిన, వాక్యమ్=వాక్యమును, అభాషత=పలికెను.

తా. పిమ్మట, సీత తిరిగి వెళ్ళుటకు బయలుదేరిన ఆ హనుమంతుని వైపు మాటి మాటికి చూచుచు, భర్తపై స్నేహముతో నిండిన వాక్యము పలికెను.

మూ. కామమస్య త్వమేవైకః కార్యస్య పరిసాధనే,
పర్యాప్తః పరవీరఘ్న యశస్యస్తే బలోదయః. 3

ప్ర. అ. పరవీరఘ్న=శత్రువీరులను సంహరించువాడా ! అస్య కార్యస్య=ఈ కార్యముయొక్క, పరిసాధనే=సాధించుటయందు, త్వమ్=నీవు, ఏకః ఏవ=ఒక్కడవే, కామమ్=నిశ్చితముగా, పర్యాప్తః=సరిపోయినవాడవు. తే=నీయొక్క, బలోదయః=బలముయొక్క ప్రభావము, యశస్యః=కీర్తిప్రదము.

తా. శత్రువీరులను సంహరించే ఓ ! హనుమంతుడా ! ఈ కార్యమును సాధించుటకు నీ వొక్కడవే చాలుననుటలో సందేహము లేదు. నీ బలాతిశయము ప్రశంసింపదగినది. 3

మూ. శరైస్తు సంకులాం కృత్వా లఙ్కాం పరబలార్దనః,
మాం నయేద్యది కాకుత్థ్సస్తత్తస్య సదృశం భవేత్. 4

ప్ర. అ. తు=కాని, పరబలార్దనః=శత్రుసైన్యమును నశింపచేయు, కాకుత్థ్సః=రాముడు, లఙ్కామ్=లంకను,శరైః=బాణములచేత, సంకులామ్=వ్యాకులమైనదానినిగా, కృత్వా=చేసి, మామ్=నన్ను, నయేద్యది=తీసికొనివెళ్ళినట్లయితే, తత్=అది, తస్య=ఆతనికి, సదృశమ్=తగినది, భవేత్=అగును.

తా. అయినను, శత్రుసేనలను సంహరించు రాముడు లంకను శరములచే వ్యాకులమగునట్లు చేసి, నన్ను తీసికొని వెళ్లుట ఆతనికి తగి ఉండును. 4

మూ. తద్యథా తస్య విక్రాన్తమనురూపం మహాత్మనః,
భవత్యాహవశూరస్య తథా త్వముపపాదయ. 5

ప్ర. అ. తత్=ఆ కారణమువలన, మహాత్మనః=గొప్ప బుద్ధి కలవాడూ, ఆహవశూరస్య=యుద్ధములో శూరుడూ అయిన, తస్య=ఆ రాముని యొక్క, విక్రాన్తమ్=పరాక్రమము, అనురూపమ్=తగు విధముగా, యథా=ఎట్లు, భవతి=అగునో, తథా=అట్లు, త్వమ్=నీవు, ఉపపాదయ=చేయుము.

తా. అందువలన, నీవు, యుద్ధములో శూరుడైన ఆ మహాత్ముని పరాక్రమమునకు ఏమి చేసిన తగి ఉండునో అట్లు చేయుము. 5

మూ. తదర్థోపహితం వాక్యం ప్రశ్రితం హేతుసంహితమ్,
నిశమ్య హనుమాంస్తస్యా వాక్యముత్తరమబ్రవీత్. 6

ప్ర. అ. హనుమాన్=హనుమంతుడు, ప్రశ్రితమ్=వినయముతో కూడినది, హేతుసంహితమ్=హేతుసంమతము, అర్థోపహితమ్=మంచి అర్థముతో కూడినదీ అయిన, తస్యాః=ఆమెయొక్క, తత్=ఆ, వాక్యమ్=వాక్యమును, నిశమ్య=విని, ఉత్తరమ్=ప్రత్యుత్తర రూపమైన, వాక్యమ్=వాక్యమును, అబ్రవీత్=పలికెను.

తా. సీత పలికిన మంచి అర్థము గల, తగిన కారణములతో కూడిన ఆ మాటలు విని, హనుమంతుడు ఈ విధముగ ప్రత్యుత్తర మిచ్చెను. 6

మూ. క్షిప్రమేష్యతి కాకుత్థ్సో హర్యృక్షప్రవరైర్వృతః,
యస్తే యుధి విజిత్యారీన్ శోకం వ్యపనయిష్యతి. 7

ప్ర. అ. కాకుత్థ్సః=రాముదు, హర్యృక్షప్రవరైః=వానర నాయకులతోను, భల్లూకనాయకులతోను, వృతః=కూడినవాడై, క్షిప్రమ్=శీఘ్రముగా, ఏష్యతి=రాగలడు. యః=ఏ రాముడు, యుధి=యుద్ధమునందు, అరీన్=శత్రువులను, విజిత్య=జయించి, తే=నీయొక్క, శోకమ్=దుఃఖమును, వ్యపనయిష్యతి=తొలగించగలడో.

తా. రాముడు వానరభల్లూకనాయకులతో కూడి శీఘ్రముగా వచ్చి, యుద్ధములో శత్రువులను జయించి, నీ శోకమును తొలగించగలడు. 7

మూ. ఏవమాశ్వాస్య వైదేహీం హనుమాన్ మారుతాత్మజః,
గమనాయ మతిం కృత్వా వైదేహీమభ్యవాదయత్. 8

ప్ర. అ. మారుతాత్మజః=వాయుపుత్రుడైన, హనుమాన్=హనుమంతుడు, వైదేహీమ్=సీతను, ఏవమ్=ఇట్లు, ఆశ్వాస్య=ఓదార్చి, గమనాయ=వెళ్లుటకు, మతిమ్=బుద్ధిని, కృత్వా=చేసి, వైదేహీమ్=సీతను, అభ్యవాదయత్=నమస్కరించెను.

తా. వాయుపుత్రుడైన హనుమంతుడు సీతతో ఇట్లు పలికి, తిరిగి వెళ్ళుటకు నిశ్చయించుకొని, సీతకు అభివాదనము చేసెను. 8

మూ. తతః స కపిశార్దూలః స్వామిసందర్శనోత్సుకః,
ఆరురోహ గిరిశ్రేష్ఠమరిష్టమరిమర్దనః. 9

ప్ర. అ. తతః=అటుపిమ్మట, అరిమర్దనః=శత్రుసంహారకుడైన, సః=ఆ, కపిశార్దూలః=వానరశ్రేష్ఠుడైన హనుమంతుడు, స్వామిసందర్శనోత్సుకః=ప్రభువుయొక్క దర్శనమునందు ఆసక్తి కలవాడై, అరిష్టమ్=అరిష్టమను, గిరిశ్రేష్ఠమ్=పర్వతశ్రేష్ఠమును, ఆరురోహ=ఎక్కెను.

తా. పిమ్మట, శత్రుసంహారకుడైన ఆ హనుమంతుడు ప్రభువును చూచుటకు ఆసక్తితో మంగళప్రదమైన పర్వతశ్రేష్ఠమును ఎక్కెను. 9

మూ. తుఙ్గపద్మకజుష్టాభిర్నీలాభిర్వనరాజిభిః,
సోత్తరీయమివామ్భోదైః శృంగాన్తరవిలమ్బిభిః. 10

(ఇది మొదలు 21వ శ్లోకము వరకు ఒకటే అన్వయము. ద్వితీయాంతపదములన్నీ 21వ శ్లోకములో ఉన్న "పర్వతమ్" అను దానికి విశేషణములు).

ప్ర. అ. తుఙ్గపద్మకజుష్టాభిః=ఎత్తైనవి, ఎట్టని మచ్చలు కలవీ అయిన ఏనుగులతో కూడిన, నీలాభిః=నల్లనైన, వనరాజిభిః=వనపంక్తులతో కూడినది, శృఙ్గాన్తరవిలంబిభిః=శిఖరముల మధ్య భాగములందు వ్రేలాడుచున్న, అమ్భోదైః=మేఘములచేత, సోత్తరీయమివ=ఉత్తరీయముతో కూడినది వలె ఉన్న (పర్వతమును ఎక్కెను).

తా. ఆ పర్వతమునందు అంతటా నల్లని వనముల పంక్తులు ఉండెను. ఆ వనములలో ఎఱ్ఱని మచ్చలున్న ఎత్తైన ఏనుగులు ఉండెను. శిఖరముల మధ్య మేఘములు వ్రేలాడుచుండుటచే ఆ పర్వతము ఉత్తరీయము ధరించి నట్లు ఉండెను. 10

మూ. బోధ్యమానమివ ప్రీత్యా దివాకరకరైః శుభైః,
ఉన్మిషన్తమివోద్ధూతైర్లోచనైరివ ధాతుభిః. 11

ప్ర. అ. శుభైః=మంగళకరములైన, దివాకరకరైః=సూర్యుని కిరణములచేత, ప్రీత్యా=ప్రేమతో, బోధ్యమానమివ=మేల్కొల్పబడుచున్నది వలె ఉన్నది, ఉద్ధూతైః=పైకి ఎగురగొట్టబడిన, లోచనైరివ=నేత్రముల వలె ఉన్న, ధాతుభిః=ధాతువులచేత, ఉన్మిషన్తమివ=కండ్లు విప్పి చూచుచున్నది వలె ఉన్న (పర్వతము నెక్కెను).

తా. ఆ పర్వతము మీద ఉన్న గైరికాదిధాతువులు అక్కడక్కడ పైకి స్పష్టముగా కనబడుచుండెను. అందుచే ఆ పర్వతము మంగళకరము లైన సూర్యకిరణములు ప్రేమపూర్వకముగ మేల్కొల్పగా (ధాతువులను) కళ్లు తెరచి చూచుచున్నట్లు ఉండెను. 11

మూ. తోయౌఘనిస్వనైర్మన్ద్రైః ప్రాధీతమివ పర్వతమ్,
ప్రగీతమివ విస్పష్టైర్నానాప్రస్రవణస్వనైః. 12

ప్ర. అ. మన్ద్రైః=గంభీరములైన, తోయౌఘనిస్వనైః=జలప్రవాహముల ధ్వనులచేత, ప్రాధీతమివ=వేదాధ్యయనము చేయుచున్నది వలె ఉన్నదీ, విస్పష్టైః=స్పష్టములైన, నానాప్రస్రవణస్వనైః=అనేకవిధములైన సెలయేళ్ల చప్పళ్ల చేత, ప్రగీతమివ=గానము చేయుచున్నది వలె ఉన్నదీ, పర్వతమ్=అనేక కఠిన భాగములు కలదీ అయిన, (పర్వతమును ఎక్కెను).

తా. అనేక కఠినభాగములు ఉన్న ఆ పర్వతము గంభీరములైన జల ప్రవాహధ్వనులచేత వేదాధ్యయనము చేయుచున్నట్లు ఉండెను. సెలయేళ్ల అనేక విధములైన ధ్వనులు స్పష్టముగా వినబడుచుండుటచే అది గానము చేయుచున్నట్లు ఉండెను. 12

మూ. దేవదారుభిరత్యుచ్చైరూర్ధ్వబాహుమివ స్థితమ్,
ప్రపాతజలనిర్ఘోషైః ప్రాక్రుష్టమివ సర్వతః. 13

ప్ర. అ. అత్యుచ్చైః=చాల ఉన్నతము లైన, దేవదారుభిః=దేవదారు వృక్షములచేత, ఊర్ధ్వబాహుమివ=పైకి ఎత్తబడిన బాహువులు కలది వలె, స్థితమ్=

ఉన్నదీ, ప్రపాతజలనిర్ఘోషైః=జలపాతములలోని నీటి ధ్వనులచేత, సర్వతః=అంతట, ప్రాక్రుష్టమివ=అరచుచున్నది వలె ఉన్న (పర్వతమును ఎక్కెను).

తా. ఆ పర్వతము దేవదారు వృక్షములు చాల ఎత్తుగా ఉండుటచే చేతులు పైకెత్తి నిలబడినది వలె ఉండెను. జలపాతములలోని నీటి ధ్వనులచే అది నలుమూలల అరచుచున్నట్లు ఉండెను. 13

మూ. వేపమానమివ శ్యామైః కమ్పమానైః శరద్వనైః,
వేణుభిర్మారుతోద్ధూతైః కూజన్తమివ కీచకైః. 14

ప్ర. అ. శ్యామైః=నల్లగా నున్న, కమ్పమానైః=కదలుచున్న, శరద్వనైః=శరత్కాలము నందలి వనములచేత, వేపమానమివ=వణుకుచున్నది వలె ఉన్నదీ, మారుతోద్ధూతైః=వాయువుచేత పూరింపబడిన, కీచకైః=వెదురు బొంగులచేత, కూజన్తమివ=కూయుచున్నది వలె ఉన్నదీ అయిన (పర్వతమును ఎక్కెను).

తా. ఆ పర్వతము కదలుచున్న నల్లని శరత్కాలవనములచేత వణకుచున్నదీ వలె, గాలిచేత నింపబడిన వెదురుబొంగులచేత కూయుచున్నది వలె ఉండెను. 14

మూ. నిఃశ్వసన్తమివామర్షాద్ఘోరైరాశీవిషోత్తమైః,
నీహారకృతగమ్భీరైర్ధ్యాయన్తమివ గహ్వరైః. 15

ప్ర. అ. ఘోరైః=భయంకరములైన, ఆశీవిషోత్తమైః=శ్రేష్ఠములైన సర్పములచేత, నిఃశ్వసన్తమివ=నిట్టూర్చుచున్నట్లు ఉన్నది, నీహారకృతగమ్భీరైః=మంచుచేత కప్పబడిన లోతైన, గహ్వరైః=గుహలతో, ధ్యాయన్తమివ=ధ్యానము చేయుచున్నట్లు ఉన్నది అయిన పర్వతమును ఎక్కెను.

తా. ఆ పర్వతము భయంకరములైన మహాసర్పములతో వ్యాప్తమై ఉండుటచే కోపముతో నిట్టూర్చుచున్న ట్లుండెను. లోతైన గుహలు మంచుచేత కప్పబడి యుండుటచే ఆ పర్వతము ధ్యానము చేయుచున్నట్లుండెను. 15

మూ. మేఘపాదనిభైః పాదైః ప్రక్రాన్తమివ సర్వతః,
జృమ్భమాణమివాకాశే శిఖరైరభ్రమాలిభిః. 16

ప్ర. అ. మేఘపాదనిభైః=మేఘముల పాదములతో సమానములైన, పాదైః=సమీపమునందున్న చిన్న పర్వతములచేత, సర్వతః=నలు వైపుల, ప్రక్రాన్తమివ=నడచుచున్నది వలె ఉన్నది. అభ్రమాలిభిః=మేఘపంక్తులు గల, శిఖరైః=శిఖరములచేత, ఆకాశే=ఆకాశమునందు, జృమ్భమాణమివ=ఆవులించుచున్నది వలె ఉన్నది అయిన పర్వతమును ఎక్కెను.

తా. ఆ పర్వతము మేఘాల పాదముల వలె ఉన్న, చిన్న చిన్న పర్వతములు దగ్గరగా ఉండుటచే నడచుచున్నట్లు ఉండెను. మేఘపంక్తులతో కూడిన శిఖరములతో ఆకాశమునందు ఆవులించుచున్నట్లుండెను. 16

మూ. కూటైశ్చ బహుధా కీర్ణైః శోభితం బహుకన్దరైః,
సాలతాలాశ్వకర్ణైశ్చ వంశైశ్చ బహుభిర్వృతమ్. 17

ప్ర. అ. బహుధా=అనేక విధములుగా, కీర్ణైః=వ్యాప్తములైన, బహుకన్దరైః=అనేకములైన గుహలు గల, కూటైశ్చ=శిఖరములచేత, శోభితమ్=ప్రకాశింపచేయబడినది, బహుభిః=అనేకములైన, సాలతాలాశ్వకర్ణైశ్చ=సాలవృక్షములతోను, తాటిచెట్లతోను, అశ్వకర్ణవృక్షములతోను, వంశైశ్చ=వెదుళ్లతోను, వృతమ్=కూడినదీ అయిన (పర్వతమును ఎక్కెను).

తా. ఆ పర్వతము మీద, అనేకము లైన గుహలు కల ఎన్నో శిఖరములు ప్రకాశించుచుండెను. దానిపై అనేకములైన సాల-తాల-అశ్వకర్ణవృక్షములు, వెదుళ్లు ఉండెను. 17

మూ. లతావితానైర్వితతైః పుష్పవద్భిరలంకృతమ్,
నానామృగగణాకీర్ణం ధాతునిష్యన్దభూషితమ్. 18

ప్ర. అ. వితతైః=విస్తృతములైన, పుష్పవద్భిః=పుష్పములు గల, లతావితానైః=లతాసముదాయములచేత, అలంకృతమ్=అలంకరించ బడినది, నానామృగగణాకీర్ణమ్=అనేకములైన మృగముల గణములచేత వ్యాప్తమూ, ధాతునిష్యన్దభూషితమ్=ధాతువుల స్రావములచే అలంకరింపబడినదీ అయిన (పర్వతమును ఎక్కెను).

తా. ఆ పర్వతము పుష్పములు విరివిగా కల లతాసముదాయములచే అలంకరింపబడినదై, అనేక మృగగణములచే వ్యాప్తమై యుండెను. 18

మూ. బహుప్రస్రవణోపేతం శిలాసంచయసంకటమ్,
మహర్షియక్షగన్ధర్వకిన్నరోరగసేవితమ్. 19

ప్ర. అ. బహుప్రస్రవణోపేతమ్=అనేకములైన సెలయేళ్ళతో కూడినది, శిలాసంచయసంకటమ్=శిలల సముదాయముచేత ఇరుకుగా ఉన్నది, మహర్షియక్షగన్ధర్వకిన్నరోరగసేవితమ్=మహర్షులచేత, యక్షులచేత, గంధర్వులచేత, కింనరులచేత, ఉరగులచేత సేవింపబడినది అయిన (పర్వతమును ఎక్కెను).

తా. ఆ పర్వతముమీద అనేకములైన సెలయేళ్లు ఉండెను. రాళ్లు కుప్పలు కుప్పలుగా పడి యుండుటచే ఇరుకుగా ఉండెను. దానిపై మహర్షులు, యక్షులు, గంధర్వులు, కింనరులు, ఉరగులు నివసించుచుండిరి. 19

మూ. లతాపాదపసంఘాతం సింహాధ్యుషితకన్దరమ్,
వ్యాఘ్రసంఘసమాకీర్ణం స్వాదుమూలఫలద్రుమమ్. 20

ప్ర. అ. లతాపాదపసంఘాతమ్=లతలయొక్క వృక్షములయొక్క సముదాయము కలది, సింహాధ్యుషితకన్దరమ్=సింహములచేత అధిష్ఠింపబడిన గుహలు కలది, వ్యాఘ్రసంఘసమాకీర్ణమ్=పెద్దపులుల సముదాయముచే వ్యాప్తమూ,స్వాదుమూలఫలద్రుమమ్=మధురమైన దుంపలు, ఫలవృక్షములు కలది అయిన (పర్వతమును ఎక్కెను).

తా. ఆ పర్వతము మీద అనేక లతలు, వృక్షములు, ఉండెను. గుహలలో సింహములు నివసించుచుండెను. అది పెద్దపులులతో వ్యాప్తమై యుండెను. దానిపై మధురములైన దుంపలు, ఫలవృక్షములు ఉండెను. 20

మూ. తమారురోహ హనుమాన్ పర్వతం పవనాత్మజః,
రామదర్శనశీఘ్రేణ ప్రహర్షేణాభిచోదితః. 21

ప్ర. అ. పవనాత్మజః=వాయుపుత్రుడైన, హనుమాన్=హనుమంతుడు, రామదర్శనశీఘ్రేణ=రాముని దర్శనముచేత శీఘ్రమైన, ప్రహర్షేణ=సంతోషముచేత, అభిచోదితః=ప్రేరేపింపబడినవాడై, తం పర్వతమ్=ఆ పర్వతమును, ఆరురోహ=ఎక్కెను.

తా. వాయుపుత్రుడైన హనుమంతుడు రాముని దర్శనముకొరకై తొందరపడుచున్న సంతోషముతో ఆ పర్వతమును ఎక్కెను. 21

మూ. తేన పాదతలాక్రాన్తా రమ్యేషు గిరిసానుషు,
సఘోషాః సమశీర్యన్త శిలాశ్చూర్ణీకృతాస్తతః. 22

ప్ర. అ. తతః=అటుపిమ్మట, రమ్యేషు=సుందరమైన, గిరిసానుషు=పర్వతముల చరియలయందు, తేన=ఆ హనుమంతునిచేత, పాదతలాక్రాన్తాః=పాదముల అడుగుభాగములచేత ఆక్రమింపబడి, శిలాః=శిలలు, సఘోషాః=ధ్వనులతో కూడినవై, చూర్ణీకృతాః=చూర్ణము చేయుబడిన వై, సమశీర్యన్త=నలిగిపోయినవి.

తా. అప్పుడు, రమ్యములైన పర్వతముల చరియలయందున్న శిలలు, ఆ హనుమంతుని పాదముల క్రిందబడి, పెద్ద చప్పుడుతో నలిగి చూర్ణమై పోయెను.

మూ. స తమారుహ్య శైలేన్ద్రం వ్యవర్ధత మహాకపిః,
దక్షిణాదుత్తరం పారం ప్రార్థయన్ లవణామ్భసః. 23

ప్ర. అ. సః మహాకపిః=ఆ హనుమంతుడు, లవణామ్భసః=లవణసముద్రముయొక్క, దక్షిణాత్=దక్షిణతీరమునుండి, ఉత్తరం పారమ్=ఉత్తరపు అవతలి ఒడ్డును, ప్రార్థయన్=కోరుచు, తం శైలేన్ద్రమ్=ఆ పర్వతమును, ఆరుహ్య=ఎక్కి, వ్యవర్ధత=వృద్ధి పొందెను.

తా. ఆ హనుమంతుడు లవణసముద్రము దక్షిణతీరమునుండి ఉత్తరతీరమును చేరుటకై కోరుచు, ఆ పర్వతమును ఎక్కి, దేహమును పెంచెను.

మూ. అధిరుహ్య తతో వీరః పర్వతం పవనాత్మజః,
దదర్శ సాగరం భీమం మీనోరగనిషేవితమ్. 24

ప్ర. అ. తతః=అటుపిమ్మట, వీరః=వీరుడైన, పవనాత్మజః=హనుమంతుడు, పర్వతమ్=పర్వతమును, అధిరుహ్య=ఎక్కి, మీనోరగనిషేవితమ్=మీనములచేత పాములచేతను సేవించబడిన, భీమమ్=భయంకరమైన, సాగరమ్=సముద్రమును, దదర్శ=చూచెను.

తా. పిమ్మట వీరుడైన హనుమంతుడు పర్వతమును ఎక్కి, మీనములతోను ఉరగములతోను నిండిన, భయంకరమైన సముద్రమును చూచెను. 24

మూ. స మారుత ఇవాకాశం మారుతస్యాత్మసంభవః,
ప్రపేదే హరిశార్దూలో దక్షిణాదుత్తరాం దిశమ్. 25

ప్ర. అ. మారుతస్య=వాయుదేవునియొక్క, ఆత్మసంభవః=కుమారుడైన, సః హరిశార్దూలః=ఆ వానరశ్రేష్ఠుడు, దక్షిణాత్=దక్షిణదిక్కునుండి, ఉత్తరాం దిశమ్=ఉత్తరదిక్కును గూర్చి, మారుతః ఇవ=వాయువు వలె, ఆకాశమ్=ఆకాశమును, ప్రపేదే=పొందెను.

తా. వాయునందనుడైన ఆ హనుమంతుడు దక్షిణదిక్కునుండి ఉత్తరదిక్కునకు పోవుటకై, వాయువు వలె, ఆకాశమును పొందెను (ఎగిరెను). 25

మూ. స తదా పీడితస్తేన కపినా పర్వతోత్తమః,
రరాస సహ తైర్భూతైః ప్రవిశన్వసుధాతలమ్. 26
కమ్పమానైశ్చ శిఖరైః పతద్భిరపి చ ద్రుమైః.

ప్ర. అ. తదా=అప్పుడు, తేన కపినా=ఆ హనుమంతుని చేత, పీడితః=పీడింపబడిన, సః పర్వతోత్తమః=ఆ పర్వతశ్రేష్ఠము, తైః=ఆ, భూతైః సహ=భూతములతో కూడ, వసుధాతలమ్=భూమిని, ప్రవిశన్=ప్రవేశించుచు, కమ్పమానైః=కదలుచున్న, శిఖరైః=శిఖరములతోను, పతద్భిః=పడిపోవుచున్న, ద్రుమైః=వృక్షములతోను, రరాస=ధ్వనిచేసెను.

తా. హనుమంతుడు అప్పుడు పీడించగా, ఆ పర్వతము, ఆ అన్ని ప్రాణులతోను నేలలోనికి క్రుంగిపోవుచు, కదలిపోవుచున్న శిఖరములతోను, పడిపోవుచున్న వృక్షములతోను గొప్ప ధ్వని చేసెను. 26

మూ. తస్యోరువేగోన్మథితాః పాదపాః పుష్పశాలినః, 27
నిపేతుర్భూతలే రుగ్ణాః శక్రాయుధహతా ఇవ.

ప్ర. అ. తస్య=ఆ హనుమంతునియొక్క, ఊరువేగాత్=తొడల వేగము వలన, మథితాః=కదల్చివేయబడిన, పుష్పశాలినః=పుష్పములతో ప్రకాశించుచున్న, పాదపాః=వృక్షములు, రుగ్ణాః=శిథిలములై, శక్రాయుధహతా ఇవ=వజ్రాయుధముచేత కొట్టబడినవి వలె, భూతలే=నేలపై, నిపేతుః=పడినవి.

తా. పుష్పములతో ప్రకాశించుచున్న వృక్షములు, ఆ హనుమంతుని తొడలవేగముచేత ఊపివేయబడినవై, శిథిలములై, వజ్రాయుధముచేత కొట్టబడినవి వలె నేలమీద పడిపోయినవి. 27

మూ. కన్దరాన్తరసంస్థానాం పీడితానాం మహౌజసామ్, 28
సింహానాం నినదో భీమో నభో భిన్దన్ స శుశ్రువే.

ప్ర. అ. కన్దరాన్తరసంస్థానామ్=గుహల మధ్యలలో నివసించుచున్నవి. పీడితానామ్=పీడించబడినవి, మహౌజసామ్=గొప్ప తేజస్సు కలవి అయిన, సింహానామ్=సింహములయొక్క, భీమః=భయంకరమైన, సః నినదః=ఆ ధ్వని, నభః=ఆకాశమును, భిన్దన్=భేదించుచు, శుశ్రువే=వినబడెను.

తా. గుహలలో ఉన్న, గొప్ప పరాక్రమము గల సింహములు పీడింపబడి భయంకరముగ గర్జించగా, ఆ ధ్వని ఆకాశమును భేదించుచు వినబడెను. 28

మూ. త్రస్తవ్యావిద్ధవసనా వ్యాకులీకృతభూషణాః. 29
విద్యాధర్యః సముత్పేతుః సహసా ధరణీధరాత్.

ప్ర. అ. విద్యాధర్యః=విద్యాధరస్త్రీలు, త్రస్తవ్యావిద్ధవసనాః=భయముచే వ్యాకులమైన వస్త్రములు కలవారై, వ్యాకులీకృతభూషణాః=వ్యాకులముగా చేయబ

డిన అలంకారములు కలవారై, సహసా=వెంటనే, ధరణీధరాత్=పర్వతమునుండి, సముత్పేతుః=పైకి ఎగిరిరి.

తా. విద్యాధరస్త్రీలు భయముచేత వస్త్రములు వ్యత్యస్తములు కాగా, వ్యాకులమైన అలంకారముతో, వెంటనే ఆ పర్వతమునుండి పైకి ఎగిరిపోయిరి.

మూ. అతిప్రమాణా బలినో దీప్తజిహ్వా మహావిషాః, 30
నిపీడితశిరోగ్రీవా వ్యచేష్టన్త మహాహయః.

ప్ర. అ. అతిప్రమాణాః=పెద్ద ప్రమాణము కలవి, బలినః=బలము కలవి, దీప్తజిహ్వాః=ప్రజ్వలించుచున్న నాలుకలు గలవి, మహావిషాః=గొప్ప విషము కలవి అయిన, మహాహయః=మహాసర్పములు, నిపీడితశిరోగ్రీవాః=నలగకొట్టబడిన శిరస్సు కంఠములు కలవై, వ్యచేష్టన్త=కొట్టుకొనెను.

తా. పెద్ద ప్రమాణము, గొప్ప బలము, ప్రకాశించుచున్న నాలుకలు గల పెద్ద సర్పములు, శిరస్సులు, కంఠములు నలిగిపోవుటచే కొట్టుకొనినవి.

మూ. కిన్నరోరగగన్ధర్వయక్షవిద్యాధరాస్తదా, 31
పీడితం తం నగవరం త్యక్త్వా గగనమాస్థితాః.

ప్ర. అ. తదా=అప్పుడు, కిన్నరోరగగన్ధర్వయక్షవిద్యాధరాః=కింనరులు, ఉరగులు, గంధర్వులు, యక్షులు, విద్యాధరులు, పీడితమ్=పీడింపబడిన, తం నగవరమ్=ఆ పర్వతశ్రేష్ఠమును, త్యక్త్వా=విడచి, గగనమ్=ఆకాశమును, ఆస్థితాః= ఆశ్రయించిరి.

తా. అప్పుడు కింనర- ఉరగ-గంధర్వ-యక్ష-విద్యాధరులు పీడింపబడుచున్న ఆ పర్వతమును విడచి ఆకాశము నాశ్రయించిరి. 31

మూ. స చ భూమిధరః శ్రీమాన్ బలినా తేన పీడితః, 32
సవృక్షశిఖరోదగ్రః ప్రవివేశ రసాతలమ్.

ప్ర. అ. బలినా=బలవంతుడైన, తేన=ఆ హనుమంతునిచేత, పీడితః= పీడింపబడిన, సవృక్షశిఖరోదగ్రః=వృక్షములతో కూడిన శిఖరములచే ఉన్నతమైన, శ్రీమాన్=శోభాయుక్తమైన, సః భూమిధరశ్చ=ఆ పర్వతము, రసాతలమ్=పాతాళ మును, ప్రవివేశ=ప్రవేశించెను.

తా. బలవంతుడైన ఆ హనుమంతునిచే పీడింపబడినదై, శోభాయుక్తము, వృక్షములున్న శిఖరములతో చాల ఉన్నతమూ అయిన ఆ పర్వతము పాతాలములో ప్రవేశించెను. 32

మూ. దశయోజనవిస్తారస్త్రింశద్యోజనముచ్ఛ్రితః, 33
ధరణ్యాం సమతాం యాతః స బభూవ ధరాధరః.

ప్ర. అ. దశయోజనవిస్తారః=పది యోజనముల విస్తారము కలది, త్రింశద్యోజనమ్=ముప్పది యోజనములు, ఉచ్ఛ్రితః=ఉన్నతమూ అయిన, సః ధరాధరః=ఆ పర్వతము, ధరణ్యామ్=భూమియందు, సమతామ్=సమత్వమును, యాతః=పొందినది, బభూవ=ఆయెను.

తా. పది యోజనముల వైశాల్యము, ముప్పది యోజనమున ఎత్తు గల ఆ పర్వతము నేలలో దిగిపోయి, నేలతో సమానమై పోయెను. 33

మూ. స లిలఙ్ఘయిషుర్భీమం సలీలం లవణార్ణవమ్, 34
కల్లోలాస్ఫాలవేలాన్తముత్పపాత నభో హరిః.

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే సున్దరకాణ్డే
షట్పఞ్చాశః సర్గః

ప్ర. అ. సః హరిః=ఆ హనుమంతుడు, భీమమ్=భయంకరము, కల్లోలాస్ఫాలవేలాన్తమ్=తరంగములచేత కొట్టబడిన తీరప్రాంతములు కలది అయిన, లవణార్ణవమ్=లవణసముద్రమును, సలీలమ్=అనాయాసముగా, లిలఙ్ఘయిషుః=దాట గోరుచున్నవాడై, ఉత్పపాత=ఎగిరెను.

తా. తరంగములు వేగముగా తాకుచున్న తీరప్రాంతము గల ఆ భయంకరమైన లవణసముద్రమును అనాయాసముగా దాటవలెనను కోరికతో హనుమంతుడు ఆకాశముపైకి ఎగిరెను. 34

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు
సుందరకాండలో ఏబదియారవ సర్గ సమాప్తము.

అథ సప్తపఞ్చాశః సర్గః

[హనుమంతుడు సముద్రము దాటి వెళ్ళి జాంబవదంగదాదులను చేరుట].

మూ. స చన్ద్రకుముదం రమ్యం సార్కకారణ్డవం శుభమ్,
తిష్యశ్రవణకాదమ్బమభ్రశైవాలశాద్వలమ్. 1

పునర్వసుమహామీనం లోహితాఙ్గమహాగ్రహమ్.
ఐరావతమహాద్వీపం స్వాతిహంసవిలోళితమ్. 2

వాతసంఘాతజాతోర్మి చన్ద్రాంశుశిశిరామ్బుమత్,
భుజఙ్గయక్షగన్ధర్వప్రబుద్ధకమలోత్పలమ్. 3

హనుమాన్ మారుతగతిర్మహానౌరివ సాగరమ్,
అపారమపరిశ్రాన్తః పుప్లువే గగనార్ణవమ్. 4

ప్ర. అ. మారుతగతిః=వాయువు వంటి గమనము గల, హనుమాన్=హనుమంతుడు, అపరిశ్రాన్తః=అలసట లేనివాడై, సచన్ద్రకుముదమ్=చంద్రుడనే కలువ కలది, సార్కకారణ్డవమ్=సూర్యుడనే కారండపక్షి గలదీ, శుభమ్=మంగళప్రదమైనదీ, తిష్యశ్రవణకాదమ్బమ్=పుష్యమీశ్రవణనక్షత్రము లను హంసలు కలది, అభ్రశైవాలశాద్వలమ్=మేఘములను పచ్చిక బీళ్ళవంటి నాచు కలది పునర్వసుమహామీనమ్=పునర్వసులను పెద్ద మీనము కలది, లోహితాఙ్గమహాగ్రహమ్=కుజుడను గొప్ప మొసలి కలది, ఐరావతమహాద్వీపమ్=ఐరావత మను పెద్ద ద్వీపము కలది, స్వాతిహంసవిలోళితమ్=స్వాతి యను హంసచేత కదల్చబడినది, వాతసంఘాతజాతోర్మి=వాయుసముదాయముచే పుట్టుచున్న తరంగములు కలది, చన్ద్రాంశుశిశిరామ్బుమత్=చంద్రకిరణములను చల్లని ఉదకము కలది, భుజఙ్గయక్షగన్ధర్వప్రబుద్ధకమలోత్పలమ్=సర్పములు, యక్షులు, గంధర్వులు అను వికసించిన పద్మములు నల్లకలువలు కలది, అపారమ్=అంతములేనిది అయిన, గగనార్ణవమ్=ఆకాశమను సముద్రమును, మహానౌః=గొప్ప ఓడ, సాగరమ్ ఇవ=సముద్రమును వలె, పుప్లువే=ఎగిరెను (ఎగిరి దాటెను).

తా. వాయువేగము వంటి వేగము గల హనుమంతుడు, ఏ మాత్రము అలసట లేనివాడై, ఆకాశమనే అపారమైన సముద్రమును, పెద్ద ఓడ సముద్రమును దాటినట్లు దాటెను. శుభమైన ఆ ఆకాశసముద్రములో చంద్రుడను తెల్లకలువ,

సూర్యుడను కారండవపక్షి, పుష్యశ్రవణనక్షత్రములను కలహంసలు, మేఘములను పచ్చికబీళ్ల వంటి నాచులు, పునర్వసువు అను గొప్ప మీనము, కుజుడను పెద్ద మొసలి, ఐరావతమను పెద్దద్వీపము, స్వాతినక్షత్రమను హంస, గాలితెరలను తరంగములు, చంద్రకిరణములను చల్లని ఉదకము, సర్ప-యక్ష-గంధర్వులను వికసించిన పద్మములు, నల్లకలవలు ప్రకాశించుచుండెను. 1-4

మూ. గ్రసమాన ఇవాకాశం తారాధిపమివోల్లిఖన్,
హరన్నివ సనక్షత్రం గగనం సార్కమణ్డలమ్. 5

మారుతస్యాత్మజః శ్రీమాన్ కపిర్వ్యోమచరో మహాన్,
హనుమాన్మేఘజాలాని వికర్షన్నివ గచ్ఛతి. 6

ప్ర. అ. మారుతస్య=వాయువుయొక్క, ఆత్మజః=కుమారుడు, శ్రీమాన్=శోభాయుక్తుడు, మహాన్=గొప్ప, కపిః=వానరుడు, అయిన, హనుమాన్=హనుమంతుడు, వ్యోమచరః=ఆకాశములో సంచరించుచు, ఆకాశమ్=ఆకాశమును, గ్రసమానః ఇవ=మ్రింగుచున్నవాడు వలె, తారాధిపమ్=చంద్రుని, ఉల్లిఖన్నివ=ఒరయుచున్నవాడు వలె, సనక్షత్రమ్=నక్షత్రములతో కూడిన, సార్కమణ్డలమ్=చంద్రమండలముతో కూడిన, గగనమ్=ఆకాశమును, హరన్నివ=హరించుచున్నవాడు వలె, మేఘజాలాని=మేఘపంక్తులను, వికర్షన్నివ=లాగుచున్నవాడు వలె, గచ్ఛతి=వెళ్లుచుండెను.

తా. వాయుదేవుని పుత్రుడు, శ్రీమంతుడు, మహాప్రమాణము గల వానరుడు అయిన ఆ హనుమంతుడు, ఆకాశవీథిలో ఎగురుచున్నప్పుడు, అతడు ఆకాశమును మ్రింగివేయుచున్నట్లు, చంద్రుని ఒరయుచున్నట్లు, నక్షత్రసూర్యమండలాదులతో కూడిన ఆకాశమును హరించుచున్నట్లు కనబడెను. ఆ విధముగ హనుమంతుడు మేఘముల పంక్తులను లాగుచు వెళ్ళెను. 5,6

మూ. పాణ్డరారుణవర్ణాని నీలమాఞ్జిష్ఠకాని చ,
హరితారుణవర్ణాని మహాభ్రాణి చకాశిరే. 7

ప్ర. అ. పాణ్డరారుణవర్ణాని=తెల్లని ఎఱ్ఱని రంగు గలవి, నీలమాఞ్జిష్ఠకాని చ=నీలవర్ణము, పసుపుపచ్చని రంగు గలవి, హరితారుణవర్ణాని=పచ్చని రంగు, ముతక ఎరుపు రంగు గలవి అయిన, మహాభ్రాణి=గొప్ప మేఘములు, చకాశిరే=ప్రకాశించినవి.

తా. ఆకాశములో, తెలుపు, ఎరుపు, నీలము, పసుపుపచ్చన, ముదిరిన ఎరుపు మొదలైన అనేక విధములైన రంగులతో పెద్ద మేఘములు ప్రకాశించినవి.

మూ. ప్రవిశన్నభ్రజాలాని నిష్పతంశ్చ పునః పునః,
ప్రచ్ఛన్నశ్చ ప్రకాశశ్చ చన్ద్రమా ఇవ లక్ష్యతే. 8

ప్ర. అ. అభ్రజాలాని=మేఘముల సముదాయములను, ప్రవిశన్=ప్రవేశించుచు, పునః పునః=మాటి మాటికి, నిష్పతంశ్చ=బైటకు వచ్చుచు, హనుమంతుడు, ప్రచ్ఛన్నశ్చ=కప్పబడినవాడు, ప్రకాశశ్చ=బైటకు వచ్చి ప్రకాశించుచున్నవాడు అయిన, చన్ద్రమాః ఇవ=చంద్రుడు వలె, లక్ష్యతే=చూడబడుచుండెను.

తా. మాటి మాటికి మేఘములలో ప్రవేశించుచు, బైటకు వచ్చుచు ఉన్న హనుమంతుడు, మేఘాలవెనుక మరుగు పడుచు, బైటకు వచ్చుచు ఉన్న చంద్రుడు వలె ప్రకాశించెను. 8

మూ. వివిధాభ్రఘనాసన్నగోచరో ధవళామ్బరః,
దృశ్యాదృశ్యతనుర్వీరస్తదా చన్ద్రాయతేఽమ్బరే. 9

ప్ర. అ. తదా=అప్పుడు, వివిధాభ్రఘనాసన్నగోచరః=అనేకవిధములైన దట్టమైన మేఘములకు సమీపమునందున్నవాడు, ధవళామ్బరః=తెల్లని వస్త్రములు కలవాడు, దృశ్యాదృశ్యతనుః=కనబడుచు, కనబడక ఉండు శరీరము కలవాడు అయిన, వీరః=వీరుడైన ఆ హనుమంతుడు, అమ్బరే=ఆకాశమునందు, చన్ద్రాయతే=చంద్రుడు వలె కనబడుచుండెను.

తా. అనేకవిధములైన దట్టమైన మేఘముల సమీపమున ఎగురుచున్న తెల్లని వస్త్రము ధరించిన ఆ హనుమంతుడు, ఆకాశమునందు, ఒకప్పుడు కనబడుచు, మరొకప్పుడు కనబడకుండ ఉన్న దేహము కలవాడై చంద్రుడు వలె ఉండెను. 9

మూ. తార్క్ష్యాయమాణో గగనే బభాసే వాయునన్దనః,
దారయన్మేఘబృన్దాని నిష్పతంశ్చ పునః పునః. 10
నదన్నాదేన మహతా మేఘస్వనమహాస్వనః.

ప్ర. అ. మేఘబృన్దాని=మేఘముల సముదాయములను, దారయన్=చీల్చుచు, పునః పునః=మాటిమాటికి, నిష్పతంశ్చ=బైటకు వచ్చుచు, మహతా=గొప్ప, నాదేన=శబ్దముతో, నదన్=అరచుచు, మేఘస్వనమహాస్వనః=ఉరుముల వంటి గొప్ప ధ్వని గల, వాయునన్దనః=హనుమంతుడు, గగనే=ఆకాశమునందు, తార్క్ష్యాయమాణః=గరుత్మంతుడు వలె ప్రవర్తించుచు, బభాసే=ప్రకాశించెను.

తా. ఆ హనుమంతుడు మేఘసముదాయములను చీల్చుచు, మాటిమాటికి బైటకు వచ్చుచు, గొప్ప శబ్దము వచ్చునట్లు మహానాదము చేయుచు, ఉరుముల వంటి ధ్వని చేయుచు, ఆకాశములో గరుత్మంతుడు వలె ఎగిరెను. 10

మూ. ప్రవరాన్ రాక్షసాన్ హత్వా నామ విశ్రావ్య చాత్మనః, 11
ఆకులాం నగరీం కృత్వా వ్యథయిత్వా చ రావణమ్,
అర్దయిత్వా బలం ఘోరం వైదేహీమభివాద్య చ, 12
ఆజగామ మహాతేజాః పునర్మధ్యేన సాగరమ్.

ప్ర. అ. మహాతేజాః=గొప్ప తేజస్సు గల హనుమంతుడు, ప్రవరాన్=శ్రేష్ఠులైన, రాక్షసాన్=రాక్షసులను, హత్వా=చంపి, ఆత్మనః=తనయొక్క, నామ=పేరును, విశ్రావ్య=వినిపింపచేసి, నగరీమ్=లంకానగరమును, ఆకులామ్=వ్యాకులమైన దానినిగా, కృత్వా=చేసి, రావణమ్=రావణుని, వ్యథయిత్వా=మనోవ్యథ కలవానినిగా చేసి, ఘోరమ్=భయంకరమైన, బలమ్=సైన్యమును, అర్దయిత్వా=పీడించి, వైదేహీమ్=సీతను, అభివాద్య చ=నమస్కరించి, పునః=తిరిగి, సాగరం మధ్యేన=సాగరమధ్యమార్గముచేత, ఆజగామ=వచ్చెను.

తా. మహాతేజఃశాలియైన ఆ హనుమంతుడు, రాక్షసులలో శ్రేష్ఠులైన వారిని చంపి, తన పేరును చాటి, లంకను వ్యాకులము చేసి, రావణునకు మనోవ్యథ కలిగించి, భయంకరమైన రాక్షససైన్యమును నశింపచేసి, మరల సాగరమధ్యమున ఎగురుచు తిరిగి వచ్చెను. 11,12

మూ. పర్వతేన్ద్రం సునాభం చ సముపస్పృశ్య వీర్యవాన్, 13
జ్యాముక్త ఇవ నారాచో మహావేగోఽభ్యుపాగతః.

ప్ర. అ. వీర్యవాన్=పరాక్రమవంతుడైన హనుమంతుడు, పర్వతేన్ద్రమ్=పర్వతశ్రేష్ఠుడైన, సునాభం చ=మైనాకుని, సముపస్పృశ్య=స్పృశించి, జ్యాముక్తః=వారిచేత విడువబడిన, నారాచః ఇవ=నారాచబాణము వలె, మహావేగః=గొప్ప వేగము గలవాడై, అభ్యుపాగతః=వచ్చెను.

తా. పరాక్రమశాలియైన హనుమంతుడు మార్గమధ్యమునందు మైనాక పర్వతమును స్నేహపూర్వకముగా స్పృశించి, ధనస్సు నారి విడచిన నారాచబాణము వలె మహావేగముతో వచ్చెను. 13

మూ. స కించిదనుసంప్రాప్తః సమాలోక్య మహాగిరిమ్, 14
మహేన్ద్రం మేఘసంకాశం ననాద హరిపుఙ్గవః.

ప్ర. అ. సః=ఆ, హరిపుఙ్గవః=వానరశ్రేష్ఠుడు, మహాగిరిమ్=మహాపర్వతమైన, మేఘసంకాశమ్=మేఘముతో సమానమైన, మహేన్ద్రమ్=మహేంద్రపర్వతమును, కించిత్=కొంచెము, అనుసంప్రాప్తః=సమీపించిన వాడై, సమాలోక్య=చూచి, ననాద=ధ్వని చేసెను.

తా. ఆ హనుమంతుడు మేఘముతో సమానమైన మహాపర్వతమైన మహేంద్రగిరిని కొంచెము సమీపించి, దానిని చూడగానే ధ్వని చేసెను. 14

మూ. స పూరయామాస కపిర్దిశో దశ సమన్తతః, 15
నదన్నాదేన మహతా మేఘస్వనమహాస్వనః.

ప్ర. అ. మేఘస్వనమహాస్వనః=మేఘధ్వని వంటి గొప్ప ధ్వని గల, సః కపిః=ఆ హనుమంతుడు, నదన్=ధ్వనిచేయుచు, మహతా=గొప్పదైన, నాదేన=ధ్వనిచేత, దశ దిశః=పది దిక్కులను, సమన్తతః=అంతటా, పూరయామాస=నింపెను.

తా. ఉరుముల వంటి ధ్వని గల ఆ హనుమంతుడు, ధ్వనిచేయుచు, ఆ గొప్ప ధ్వనిచేత పది దిక్కులను కూడ, అంతటా నింపివేసెను. 15

మూ. స తం దేశమనుప్రాప్తః సుహృద్దర్శనలాలసః, 16
ననాద హరిశార్దూలో లాఙ్గూలం చాప్యకమ్పయత్.

ప్ర. అ. తం దేశమ్=ఆ ప్రదేశమును, అనుప్రాప్తః=చేరిన, సుహృద్దర్శనలాలసః=మిత్రులను చూచుటకై వేగిరపడుచున్న, సః హరిశార్దూలః=ఆ హనుమంతుడు, ననాద=ధ్వనిచేసెను, లాఙ్గూలమ్=తోకను, అకమ్పయచ్చ=కదల్చెను కూడ.

తా. మిత్రులను చూడవలెనను అత్యాసక్తితో ఆ ప్రదేశమును చేరిన హనుమంతుడు బిగ్గరగా అరచి తోకను త్రిప్పుట కూడ చేసెను. 16

మూ. తస్య నానద్యమానస్య సుపర్ణచరితే పథి, 17
ఫలతీవాస్య ఘోషేణ గగనం సార్కమణ్డలమ్.

ప్ర. అ. సుపర్ణచరితే=గరుత్మంతునిచేత సంచరించబడిన, పథి=ఆకాశమార్గమునందు, నానద్యమానస్య=అధికముగా ధ్వని చేయుచున్న, అస్య=ఈ హనుమంతునియొక్క, ఘోషేణ=ధ్వనిచేత, సార్కమణ్డలమ్=సూర్యమండలసహితమైన, గగనమ్=ఆకాశము, ఫలతీవ=బ్రద్దలగుచున్నట్లు ఉండెను.

తా. గరుత్మంతుడు సంచరించు ఆకాశమార్గమునందు మహాధ్వని చేయుచున్న ఆ హనుమంతుని ధ్వనికి సూర్యమండలసహితమైన ఆకాశము బ్రద్దలై పోయినట్లయ్యెను. 17

మూ. యే తు తత్రోత్తరే తీరే సముద్రస్య మహాబలాః, 18
పూర్వం సంవిష్ఠితాః శూరా వాయుపుత్రదిదృక్షవః.

మహతో వాతనున్నస్య తోయదస్యేవ గర్జితమ్, 19
శుశ్రువుస్తే తదా ఘోషమూరువేగం హనూమతః.

ప్ర. అ. తత్ర=అక్కడ, సముద్రస్య=సముద్రముయొక్క, ఉత్తరే తీరే=ఉత్తరతీరమునందు, పూర్వమ్=పూర్వమే, సంవిష్టితాః=ఉన్న (వేచియున్న), మహాబలాః=గొప్ప బలము గల, శూరాః=శూరులైన, వాయుపుత్రదిదృక్షవః=హనుమంతుని చూడదలచుచున్న, యే=ఏ వానరులు కలరో, తే=వారు, తదా=అప్పుడు, వాతనున్నస్య=వాయువుచేత కదల్చబడిన, మహతః=గొప్పదైన, తోయదస్య=మేఘముయొక్క, గర్జితమ్ ఇవ=గర్జితము వలె ఉన్న, హనూమతః=హనుమంతునియొక్క, ఘోషమ్=ధ్వనిని, ఊరువేగమ్=తొడల వేగమును, శుశ్రువుః=వినిరి.

తా. ఉత్తర సముద్రతీరమునందు పూర్వమే ఉన్న బలశాలులు, శూరులు, అయిన వానరులు వాయునందనుని చూచుటకై ఆతురతతో నిరీక్షించుచుండిరి. ఆ వానరులకు అప్పుడు, వాయువుచేత కదల్చబడుచున్న పెద్ద మేఘముయొక్క ధ్వని వలె, హనుమంతుడు చేసిన ధ్వని, ఆతని తొడల వేగము వినవచ్చెను.

మూ. తే దీనమనసః సర్వే శుశ్రువుః కాననౌకసః, 20
వానరేన్ద్రస్య నిర్ఘోషం పర్జన్యనినదోపమమ్.

ప్ర. అ. దీనమనసః=దీనములైన మనస్సులు గల, తే=ఆ, సర్వే=సమస్తమైన, కాననౌకసః=వానరులు, వానరేన్ద్రస్య=హనుమంతునియొక్క, పర్జన్యనినదోపమమ్=మేఘధ్వనితో సమానమైన, నిర్ఘోషమ్=ధ్వనిని, శుశ్రువుః=వినిరి.

తా. అంతవరకు సీతవార్త ఏదీ తెలియకపోవుటచేత దైన్యము చెందిన మనస్సులు గల ఆ వానరులందరు ఉరుముల వంటి హనుమంతుని ధ్వనిని వినిరి.

మూ. నిశమ్య నదతో నాదం వానరాస్తే సమన్తతః, 21
బభూవురుత్సుకాః సర్వే సుహృద్దర్శనకాఙ్క్షిణః.

ప్ర. అ. సమన్తతః=నలు మూలలా ఉన్న, సర్వే=సమస్తమైన, తే వానరాః=ఆ వానరులు, నదతః=ధ్వనిచేయుచున్న, హనుమంతునియొక్క, నాదమ్=ధ్వనిని, నిశమ్య=విని, సుహృద్దర్శనకాఙ్క్షిణః=మిత్రుని దర్శనమును కోరుచు, ఉత్సుకాః=వేడుకగలవారు, బభూవుః=అయిరి.

తా. అక్కడ అన్ని ప్రదేశములలోను ఉన్న ఆ వానరులందరూ, ధ్వని చేయుచున్న హనుమంతుని ఆ శబ్దమును విని, ఆతని చూడవలెనను ఔత్సుక్యముతో నిండి యుండిరి. 21

మూ. జామ్బవాన్ స హరిశ్రేష్ఠః ప్రీతిసంహృష్టమానసః, 22
ఉపామన్త్ర్య హరీన్ సర్వానిదం వచనమబ్రవీత్.

ప్ర. అ. హరిశ్రేష్ఠః=వానరులలో శ్రేష్ఠుడైన, సః జామ్బవాన్=ఆ జాంబవంతుడు, ప్రీతిసంహృష్టమానసః=ఆనందముతో వికసించిన మనస్సు కల వాడై, సర్వాన్=సమస్తమైన, హరీన్=వానరులను, ఉపామన్త్ర్య=దగ్గరకు పిలచి, ఇదమ్=ఈ, వచనమ్=వాక్యమును, అబ్రవీత్=పలికెను.

తా. వానరులలో శ్రేష్ఠుడైన జాంబవంతుడు ఆనందముచే వికసించిన మనస్సుతో, ఆ వానరులందరినీ పిలచి, ఈ వాక్యము పలికెను. 22

మూ. సర్వథా కృతకార్యోఽసౌ హనుమాన్నాత్ర సంశయః, 23
న హ్యస్యాకృతకార్యస్య నాద ఏవంవిధో భవేత్.

ప్ర. అ. అసౌ=ఈ, హనుమాన్=హనుమంతుడు, సర్వథా=అన్ని విధములా, కృతకార్యః=చేయుబడిన కార్యము కలవాడు. అకృతకార్యస్య=చేయుబడని కార్యము గల, అస్య=ఈతనియొక్క, నాదః=ధ్వని, ఏవంవిధః=ఈ విధమైనది, న భవేత్ హి=కాదు కదా.

తా. హనుమంతుడు అన్ని విధములచేతను కార్యము సఫలము చేసికొని వచ్చుచున్నాడు. ఇందుకు సందేహము లేదు. పని పూర్తి కానిచో ఇతని ధ్వని ఈ విధముగ ఉండదు కదా. 23

మూ. తస్య బాహూరువేగం చ నినాదం చ మహాత్మనః, 24
నిశమ్య హరయో హృష్టాః సముత్పేతుస్తతస్తతః.

ప్ర. అ. మహాత్మనః=మహాత్ముడైన, తస్య=ఆ హనుమంతునియొక్క, బాహూరువేగం చ=బాహువులయొక్క తొడలయొక్క వేగమును, నినాదం చ=ధ్వనినీ, నిశమ్య=విని, హృష్టాః=సంతోషించినవారై, హరయః=వానరులు, తతస్తతః=ఆ యా ప్రదేశములనుండి, సముత్పేతుః=గంతులు వేసిరి.

తా. మహాత్ముడైన ఆ హనుమంతుని బాహువుల వేగమును, తొడల వేగమును, ధ్వనిని విని, వానరులు, సంతోషించినవారై, ఆయా ప్రదేశములనుండి గంతులు వేయుచు ఎగిరిరి. 24

మూ. తే నగాగ్రాన్నగాగ్రాణి శిఖరాచ్ఛిఖరాణి చ, 25
ప్రహృష్టాః సమపద్యన్త హనూమన్తం దిదృక్షవః.

ప్ర. అ. తే=ఆ వానరులు, ప్రహృష్టాః=సంతోషించినవారై, హనూమన్తమ్=హనుమంతుని, దిదృక్షవః=చూడనిచ్ఛగలవారై, నగాగ్రాత్=ఒక చెట్టుచివరి కొమ్మ నుండి, నగాగ్రాణి=ఇతరవృక్షముల చివరి భాగములను; శిఖరాత్=ఒక పర్వతశిఖరమునుండి; శిఖరాణి చ=పర్వతశిఖరములను, సమపద్యన్త=పొందిరి.

తా. ఆ వానరులు సంతోషించుచు హనుమంతుణ్ణి చూడవలెనను కోరికతో ఒక చెట్టు చివరినుండి మరి కొన్నిచెట్ల చివరిభాగములను, ఒక శిఖరమునుండి ఇతర శిఖరములను ఎక్కిరి. 25

మూ. తే ప్రీతాః పాదపాగ్రేషు గృహ్య శాఖాః సువిష్ఠితాః, 26
వాసాంసీవ ప్రశాఖాశ్చ సమావిధ్యన్త వానరాః.

ప్ర. అ. తే వానరాః=ఆ వానరులు, ప్రీతాః=సంతోషించివారై, పాదపాగ్రేషు=వృక్షాగ్రములయందు, శాఖాః=కొమ్మలను, గృహ్య=గ్రహించి, సువిష్ఠితాః=బాగుగా నిలచినవారై, ప్రశాఖాః=చిన్నకొమ్మలను, వాసాంసీవ=వస్త్రములను వలె, సమావిధ్యన్త=దులిపిరి.

తా. ఆ వానరులు సంతోషముతో వృక్షాగ్రముల మీద కొమ్మలు పట్టుకొని దృఢముగా నిలచి, చిన్న కొమ్మలను బట్టలు దులిపినట్లు దులిపివేసిరి.

మూ. గిరిగహ్వరసంలీనో యథా గర్జతి మారుతః, 27
ఏవం జగర్జ బలవాన్ హనుమాన్మారుతాత్మజః.

ప్ర. అ. గిరిగహ్వరసంలీనః=పర్వతముల గుహలయందు అణగిన (ప్రవేశించిన), మారుతః=వాయువు, యథా=ఎట్లు, గర్జతి=గర్జించునో, బలవాన్=బలవంతుడు, మారుతాత్మజః=వాయుకుమారుడు అయిన, హనుమాన్=హనుమంతుడు, ఏవమ్=ఇట్లు, జగర్జ=గర్జించెను.

తా. వాయుపుత్రుడు, బలశాలీ అయిన హనుమంతుడు, పర్వతగుహలో ప్రవేశించిన వాయువు ఎట్లు గర్జించునో అట్లు గర్జించెను. 27

మూ. తమభ్రఘనసంకాశమాపతన్తం మహాకపిమ్, 28
దృష్ట్వా తే వానరాః సర్వే తస్థుః ప్రాఞ్జలయస్తదా.

ప్ర. అ. తదా=అప్పుడు, అభ్రఘనసంకాశమ్=దట్టమైన మేఘముతో సమానుడు, ఆపతన్తమ్=శీఘ్రముగా వచ్చి పడుచున్నవాడూ అయిన, తం మహాకపిమ్=ఆ హనుమంతుని, దృష్ట్వా=చూచి, తే=ఆ, సర్వే=సమస్తమైన, వానరాః=వానరులు, ప్రాఞ్జలయః=కట్టబడిన దోసిళ్లు కలవారై, తస్థుః=నిలిచిరి.

తా. అప్పుడు దట్టమైన మేఘము వలె అతిశీఘ్రముగా వచ్చి క్రిందికి వాలుచున్న ఆ హనుమంతుని చూచి ఆ వానరులందరు దోసిళ్ళు పట్టి నిలిచిరి.

మూ. తతస్తు వేగవాంస్తస్య గిరేర్గిరినిభః కపిః, 29
నిపపాత మహేన్ద్రస్య శిఖరే పాదపాకులే.

ప్ర. అ. తతః=అటు పిమ్మట, గిరినిభః=పర్వతముతో సమానుడు, వేగవాన్=వేగవంతుడు అయిన, కపిః=హనుమంతుడు, తస్య=ఆ,మహేన్ద్రస్య=మహేంద్ర మను, గిరేః=పర్వతముయొక్క, పాదపాకులే=వృక్షముల చేత వ్యాకులమైన, శిఖరే=శిఖరముమీద, నిపపాత=దిగెను.

తా. పిమ్మట పర్వతముతో సమానుడైన ఆ హనుమంతుడు, మహా వేగముతో వచ్చి చెట్లతో నిండిన ఆ మహేంద్రపర్వతశిఖరముపై దిగెను. 29

మూ. హర్షేణాపూర్యమాణోఽసౌ రమ్యే పర్వతనిర్ఝరే, 30
ఛిన్నపక్ష ఇవాకాశాత్పపాత ధరణీధరః.

ప్ర. అ. హర్షేణ=సంతోషముచేత, ఆపూర్యమాణః=నింపబడుచున్న, అసౌ=ఈ హనుమంతుడు, ఛిన్నపక్షః=ఛేదింపబడిన రెక్కలు గల, ధరణీధరః ఇవ=పర్వతము వలె, రమ్యే=సుందరమైన, పర్వతనిర్ఝరే=పర్వతము నందలి జల ప్రవాహమునందు, ఆకాశాత్=ఆకాశమునుండి, పపాత=పడెను.

తా. హనుమంతుడు సంతోషముతో ఉబ్బిపోవుచు, రెక్కలు తెగగొట్టిన పర్వతమువలె, ఆకాశమునుండి పర్వతముపై నున్న సుందరమైన సెలయేటిలో దిగెను. 30

మూ. తతస్తే ప్రీతమనసః సర్వే వానరపుఙ్గవాః, 31
హనుమన్తం మహాత్మానం పరివార్యోపతస్థిరే,
పరివార్య చ తే సర్వే పరాం ప్రీతిముపాగతాః. 32

ప్ర. అ. తతః=అటు పిమ్మట, సర్వే=సమస్తమైన, తే=ఆ, వానరపుఙ్గవాః=వానరశ్రేష్ఠులు, ప్రీతమనసః=సంతోషించుచున్న మనస్సులు కల వారై, మహాత్మానమ్=మహాత్ముడైన, హనుమన్తమ్=హనుమంతుణ్ణి, పరివార్య=చుట్టి, ఉపతస్థిరే=సేవించిరి, తే సర్వే=వాళ్ళందరూ, పరివార్య=హనుమంతుని చుట్టి, పరామ్=శ్రేష్ఠమైన, ప్రీతిమ్=సంతోషమును, ఉపాగతాః=పొందిరి.

తా. పిమ్మట ఆ వానరశ్రేష్ఠులందరూ చాల సంతోషించిన మనస్సులతో మహాత్ముడైన ఆ హనుమంతుని చుట్టూ చేరి అతనిని సేవించిరి. ఆ విధముగ చుట్టూ చేరిన వాళ్ళందరూ గొప్ప సంతోషమును పొందిరి. 31, 32

మూ. ప్రహృష్టవదనాః సర్వే తమరోగముపాగతమ్,
ఉపాయనాని చాదాయ మూలాని చ ఫలాని చ, 33
ప్రత్యర్చయన్ హరిశ్రేష్ఠం హరయో మారుతాత్మజమ్.

ప్ర. అ. సర్వే హరయః=ఆ వానరులందరూ, ప్రహృష్టవదనాః=వికసించిన ముఖములు కలవారై, మూలాని చ=దుంపలను, ఫలాని చ=ఫలములను, ఉపాయనాని=కానుకలుగా, ఆదాయ=గ్రహించి, అరోగమ్=రోగము లేకుండగా, ఉపాగతమ్=వచ్చిన, హరిశ్రేష్ఠమ్=వానర శ్రేష్ఠుడైన, మారుతాత్మజమ్=హనుమంతుని, ప్రత్యర్చయన్=పూజించిరి.

తా. ఆ వానరులందరూ, వికసించిన ముఖములతో, మూలములను, ఫలములను కానుకలుగా తీసికొని వచ్చి, రోగము లేకుండగా తిరిగి వచ్చిన, వానరశ్రేష్ఠుడైన హనుమంతుని పూజించిరి. 33

మూ. హనుమాంస్తు గురూన్ వృద్ధాన్ జామ్బవత్ప్రముఖాంస్తదా, 34
కుమారమఙ్గదం చైవ సోఽవన్దత మహాకపిః.

ప్ర. అ. తదా=అప్పుడు, మహాకపిః=వానరశ్రేష్ఠుడైన, హనుమాంస్తు=హనుమంతుడైతే, గురూన్=పూజ్యులు, వృద్ధాన్=వృద్ధులూ అయిన, జామ్బవత్ప్రముఖాన్=జాంబవంతుడు మొదలైన వారిని, కుమారమ్=రాజకుమారుడైన, (యువరాజైన), అఙ్గదం చైవ=అంగదుని, అవన్దత=నమస్కరించెను.

తా. అప్పుడు, వానరశ్రేష్ఠుడైన హనుమంతుడు, పూజ్యులు, వృద్ధులూ అయిన జాంబవంతుడు మొదలైనవారికి, యువరాజైన అంగదునకు నమస్కరించెను.

మూ. స తాభ్యాం పూజితః పూజ్యః కపిభిశ్చ ప్రసాదితః, 35
దృష్టా సీతేతి విక్రాన్తః సంక్షేపేణ న్యవేదయత్.

ప్ర. అ. విక్రాన్తః=పరాక్రమించినవాడు, పూజ్యః=పూజింపదగిన వాడు అయిన, సః=ఆ హనుమంతుడు, తాభ్యామ్=ఆ జాంబవదంగదులచేత, పూజితః=పూజింపబడినవాడై, కపిభిః=ఇతరవానరులచేత, ప్రసాదితః=అనుగ్రహింపచేసికొనబడినవాడై, సీతా=సీత, దృష్టా=చూడబడినది, ఇతి=అని, సంక్షేపేణ=సంక్షేపముతో, న్యవేదయత్=తెలిపెను.

తా. తన పరాక్రమము చూపినవాడు, పూజ్యుడు అయిన ఆ హనుమంతుని జాంబవంతుడు, అంగదుడు పూజించిరి. ఇతర వానరులందరు అనుగ్రహింపచేసికొనిరి. (అతనికి సంతోషము కలుగునట్లు ప్రవర్తించిరి). అప్పుడాతడు సీతను చూచితిని అని సంక్షిప్తముగా చెప్పెను. 35

మూ. నిషసాద చ హస్తేన గృహీత్వా వాలినః సుతమ్, 36
రమణీయే వనోద్దేశే మహేన్ద్రస్య గిరేస్తదా.

ప్ర. అ. తదా=అప్పుడు, వాలినః=వాలియొక్క, సుతమ్=కుమారుని, హస్తేన=హస్తముచేత, గృహీత్వా=గ్రహించి, మహేన్ద్రస్య గిరేః=మహేంద్ర పర్వతము యొక్క, రమణీయే=సుందరమైన, వనోద్దేశే=వనప్రదేశమునందు, నిషసాద చ=కూర్చుండెను.

తా. అప్పుడు హనుమంతుడు అంగదుని (హస్తమును) హస్తముతో పట్టుకొని ఆ మహేంద్రపర్వతముపై, రమణీయమైన వనప్రదేశమునందు కూర్చుండెను. 36

మూ. హనుమానబ్రవీద్ధృష్టస్తదా తాన్వానరర్షభాన్, 37
అశోకవనికాసంస్థా దృష్టా సా జనకాత్మజా,
రక్ష్యమాణా సుఘోరాభీ రాక్షసీభిరనిన్దితా. 38
ఏకవేణీధరా బాలా రామదర్శనలాలసా,
ఉపవాసపరిశ్రాన్తా జటిలా మలినా కృశా. 39

ప్ర. అ. తదా=అప్పుడు, హృష్టః=సంతోషించిన, హనుమాన్=హనుమంతుడు, తాన్=ఆ, వానరర్షభాన్=వానరశ్రేష్ఠులను గూర్చి, అబ్రవీత్=పలికెను. అశోకవనికాసంస్థా=అశోకవనములో ఉన్నదీ, సుఘోరాభిః=చాలా భయము కలిగించు, రాక్షసీభిః=రాక్షసస్త్రీలచేత, రక్ష్యమాణా=రక్షింపబడుచున్నదీ, అనిన్దితా=నిందింపబడనిదీ, ఏకవేణీధరా=ఒకే జడను ధరించినదీ, బాలా=చిన్న వయస్సులో ఉన్నదీ, రామదర్శనలాలసా=రాముని చూచుట యందు ఆసక్తి కలది, ఉపవాసపరిశ్రాన్తా=ఉపవాసములచేత అలసిపోయినది, జటిలా=జడలు ధరించినదీ, మలినా=మలినముగా ఉన్నది, కృశా=చిక్కినదీ అయిన, సా జనకాత్మజా=ఆ సీతాదేవి, దృష్టా=చూడబడినది.

తా. అప్పుడు సంతోషభరితుడైన హనుమంతుడు ఆ వానరశ్రేష్ఠులతో ఇట్లు పలికెను. అశోకవనములో ఉన్న సీతను చూచినాను. ఎట్టి దోషము లేనిది, ఒకే జడను ధరించి ఉన్నదీ అయిన ఆమెను భయంకరులైన రాక్షసస్త్రీలు రక్షించుచున్నారు. చిన్న వయస్సులో ఉన్న ఆమె రాముని చూచుటకై తహతహలాడుచున్నది. జటాధారిణియై స్నానాది సంస్కారములు లేకపోవుటచే మలినురాలై కృశించి ఉన్న ఆమె ఉపవాసములచేత అలసిపోయి ఉన్నది. 37-39

మూ. తతో దృష్టేతి వచనం మహార్థమమృతోపమమ్,
నిశమ్య మారుతేః సర్వే ముదితా వానరాభవన్. 40

ప్ర. అ. తతః=అటుపిమ్మట, దృష్టా=చూడబడినది, ఇతి=అను, మారుతేః=హనుమంతునియొక్క, మహార్థమ్=శ్రేష్ఠమైన అర్థము గల, అమృతోపమమ్=

అమృతముతో సమానమైన, వచనమ్=మాటను, నిశమ్య=విని, సర్వే=సమస్తమైన, వానరాః=వానరులు, ముదితాః=సంతోషించిన వారు, అభవన్=అయిరి.

తా. అప్పుడు హనుమంతుడు పలికిన, గొప్ప అర్థము గల, అమృతము వంటి "చూచినాను" అను మాట వినగానే ఆ వానరులందరు సంతోషించిరి.

మూ. క్ష్వేళన్త్యన్యే నదన్త్యన్యే గర్జన్త్యన్యే మహాబలాః,
చక్రుః కిలకిలామన్యే ప్రతిగర్జన్తి చాపరే. 41

ప్ర. అ. మహాబలాః=గొప్ప బలము గల, అన్యే=కొందరు, క్ష్వేళన్తి=సింహనాదము చేయుచున్నారు (చేసిరి). అన్యే=మరికొందరు, నదన్తి=ధ్వనిచేయుచున్నారు. అన్యే=మరికొందరు, గర్జన్తి=గర్జించుచున్నారు. అన్యే=మరికొందరు, కిలకిలామ్=కిలకిలధ్వనిని, చక్రుః=చేసిరి. అపరే=మరికొందరు, ప్రతిగర్జన్తి=తిరిగి గర్జించుచున్నారు.

తా. మహాబలవంతులైన వానరులలో కొందరు సింహనాదము చేసిరి. కొందరు ధ్వని చేసిరి. కొందరు గర్జించిరి. కొందరు కిచకిచ మను ధ్వని చేసిరి. మరికొందరు ప్రతిగర్జనము చేసిరి. 41

మూ. కేచిదుచ్ఛ్రితలాఙ్గూలాః ప్రహృష్టాః కపికుఞ్జరాః,
అయతాఞ్చితదీర్ఘాణి లాఙ్గూలాని ప్రవివ్యధుః. 42

ప్ర. అ. ప్రహృష్టాః=సంతోషించి, కేచిత్=కొందరు, కపికుఞ్జరాః=వానరశ్రేష్ఠులు, ఉచ్ఛ్రితలాఙ్గూలాః=ఎత్తబడిన తోకలు కలవారై, ఆయతాఞ్చితదీర్ఘాణి=నిలువుగా చేయబడిన పొడవైన, లాఙ్గూలాని=తోకలను, ప్రవివ్యధుః=దులిపిరి.

తా. మహాబలవంతులైన వానరులలో కొందరు చాల సంతోషించి, తోకలు ఎత్తి, అట్లు నిలువుగా ఉండునట్లు ఎత్తిన, పొడవైన తోకలను ఝూళించిరి.

మూ. అపరే చ హనూమన్తం వానరా వారణోపమమ్,
ఆప్లుత్య గిరిశృఙ్గేభ్యః సంస్పృశన్తి స్మ హర్షితాః. 43

ప్ర. అ. అపరే=మరికొందరు, వానరాః=వానరులు, హర్షితాః=సంతోషించిన వారై, గిరిశృఙ్గేభ్యః=పర్వతశిఖరములనుండి, ఆప్లుత్య=దిగి, వారణోపమమ్=ఏనుగుతో సమానుడైన, హనూమన్తమ్=హనుమంతుని, సంస్పృశన్తి స్మ=స్పృశించిరి.

తా. మరి కొందరు వానరులు సంతోషముతో పర్వతశిఖరములనుండి క్రిందికి దుమికి, ఏనుగుతో సమానుడైన ఆ హనుమంతుని స్పృశించిరి. 43

మూ. ఉక్తవాక్యం హనూమన్తమఙ్గదస్తమథాబ్రవీత్,
సర్వేషాం హరివీరాణాం మధ్యే వచనముత్తమమ్. 44

ప్ర. అ. అథ=అటుపిమ్మట, అఙ్గదః=అంగదుడు, ఉక్తవాక్యమ్=పలకబడిన వాక్యము గల, హనూమన్తమ్=హనుమంతుని గూర్చి, సర్వేషామ్=సమస్తమైన, హరివీరాణామ్=వానరవీరుల, మధ్యే=మధ్యయందు, ఉత్తమమ్=ఉత్తమమైన, వచనమ్=వచనమును, అబ్రవీత్=పలికెను.

తా. హనుమంతుని మాటలు విన్న పిమ్మట, అంగదుడు సమస్తమైన వానరవీరుల మధ్య ఆతనితో ఉత్తమమైన వచనము పలికెను. 44

మూ. సత్త్వే వీర్యే న తే కశ్చిత్సమో వానర విద్యతే,
యదవప్లుత్య విస్తీర్ణం సాగరం పునరాగతః. 45

ప్ర. అ. వానర=హనుమంతుడా ! యత్=ఏ కారణమువలన, విస్తీర్ణమ్=విస్తృతమైన, సాగరమ్=సముద్రమును, అవప్లుత్య=దాటి, పునః=మరల, ఆగతః=వచ్చినావో, అందువలన, సత్త్వే=బలమునందు, వీర్యే=పరాక్రమమునందు, తే=నీకు, సమః=సమానుడు, కశ్చిత్=ఎవ్వడును, న విద్యతే=లేడు.

తా. హనుమంతుడా ! విస్తీర్ణమైన సముద్రము దాటి మరల వచ్చినావు. బలముచేత గాని, పరాక్రమముచేత గాని నీకు సాటి ఎవ్వడూ లేడు. 45

మూ. అహో స్వామిని తే భక్తిరహో వీర్యమహో ధృతిః,
దిష్ట్యా దృష్టా త్వయా దేవీ రామపత్నీ యశస్వినీ, 46
దిష్ట్యా త్యక్ష్యతి కాకుత్స్థః శోకం సీతావియోగజమ్.

ప్ర. అ. స్వామిని=ప్రభువుపై, తే=నీయొక్క, భక్తిః=భక్తి, అహో=ఎంత ఆశ్చర్యకరమైనది, వీర్యమ్=పరాక్రమము, అహో=ఎంత ఆశ్చర్యకరమైనది, ధృతిః=ధైర్యము, అహో=ఎంత ఆశ్చర్యకరమైనది దిష్ట్యా=మన అదృష్టముతో, త్వయా=నీచేత, రామపత్నీ=రాముని భార్య, యశస్వినీ=కీర్తిగలది అయిన, దేవీ=సీతాదేవి, దృష్టా=చూడబడినది. దిష్ట్యా=అదృష్టవశముచేత, కాకుత్స్థః=రాముడు, సీతావియోగజమ్=సీతావియోగమువల్ల కలిగిన, శోకమ్=శోకమును, త్యక్ష్యతి=విడువగలడు.

తా. ఏమి నీ ప్రభుభక్తి ! ఏమి నీ పరాక్రమము ! ఏమి నీ ధైర్యము! మన అదృష్టము కొలది నీవు కీర్తిమంతురాలు, రామభార్య అయిన ఆ దేవిని చూచితివి. అదృష్టవశముచే సీతావియోగము వలన కలిగిన రాముని శోకము తొలగిపోవును. 46

మూ. తతోఽఙ్గదం హనూమన్తం జామ్బవన్తం చ వానరాః, 47
పరివార్య ప్రముదితా భేజిరే విపులాః శిలాః.

ప్ర. అ. తతః=అటుపిమ్మట, వానరాః=వానరులు, ప్రముదితాః=చాలా సంతోషించినవారై, అఙ్గదమ్=అంగదుని, హనూమన్తమ్=హనుమంతుని, జామ్బవన్తం చ=జాంబవంతుని, పరివార్య=చుట్టుముట్టి, విపులాః=విశాలములైన, శిలాః=శిలలను, భేజిరే=పొందిరి.

తా. పిమ్మట వానరులందరు చాల సంతోషించుచు, అంగదునికి హనుమంతునికి జాంబవంతునికి చుట్టూ శిలాతలములపై కూర్చుండిరి. 47

మూ. శ్రోతుకామాః సముద్రస్య లఙ్ఘనం వానరోత్తమాః, 48
దర్శనం చాపి లఙ్కాయాః సీతాయా రావణస్య చ,
తస్థుః ప్రాఞ్జలయః సర్వే హనుమద్వచనోన్ముఖాః. 49

ప్ర. అ. సర్వే=సమస్తమైన, వానరోత్తమాః=వానరశ్రేష్ఠులు, సముద్రస్య=సముద్రముయొక్క, లఙ్ఘనమ్=దాటుటను, లఙ్కాయాః=లంకయొక్క, సీతాయాః=సీతయొక్క, రావణస్య చ=రావణునియొక్క, దర్శనం చాపి=దర్శనమును, శ్రోతుకామాః=వినుటయందు కోరిక గలవారై, ప్రాఞ్జలయః=కట్టబడిన దోసిళ్లు కలవారై, హనుమద్వచనోన్ముఖాః=హనుమంతుని వచనమునకై అభిముఖులై, తస్థుః=ఉండిరి.

తా. ఆ వానరశ్రేష్ఠులందరూ సముద్రము దాటుట, లంకను, సీతను రావణుని చూచుట మొదలైన విషయములను వినగోరుచు, హనుమంతుని మాటలకై, ఎదురు చూచుచు అంజలి ఘటించి ఉండిరి. 48,49

మూ. తస్థౌ తత్రాఙ్గదః శ్రీమాన్ వానరైర్బహుభిర్వృతః,
ఉపాస్యమానో విబుధైర్దివి దేవపతిర్యథా. 50

ప్ర. అ. తత్ర=అక్కడ, శ్రీమాన్=శ్రీమంతుడైన, బహుభిః=అనేకులైన, వానరైః=వానరులతో, వృతః=కూడిన, అఙ్గదః=అంగదుడు, దివి=స్వర్గలోకమునందు, విబుధైః=దేవతలచేత, ఉపాస్యమానః=ఉపాసింపబడుచున్న, దేవపతిర్యథా=దేవేంద్రుదువలె, తస్థౌ=ఉండెను.

తా. వానరులందరూ చుట్టూ కూర్చుండి సేవించుచుండగా, అంగదుడు, స్వర్గలోకమునందు దేవతలచేత సేవింపబడుచున్న దేవేంద్రుడు వలె ప్రకాశించెను.

మూ. హనూమతా కీర్తిమతా యశస్వినా
తథాఙ్గదేనాఙ్గదబద్ధబాహునా,
ముదా తదాధ్యాసితమున్నతం మహా
న్మహీధరాగ్రం జ్వలితం శ్రియాభవత్. 51

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే సున్దరకాణ్డే
సప్తపఞ్చాశః సర్గః

ప్ర. అ. కీర్తిమతా=కీర్తిగల, హనూమతా=హనుమంతునిచేతను, తథా=మరియు, యశస్వినా=కీర్తి గల, అఙ్గదబద్ధబాహునా=బాహుపురులతో కట్టబడిన బాహువులు గల, అఙ్గదేన=అంగదునిచేతను, తదా=అప్పుడు, ముదా=ఆనందముతో, అధ్యాసితమ్=అధిష్ఠింపబడిన, ఉన్నతమ్=ఉన్నతమైన, మహత్=గొప్పదైన, మహీధరాగ్రమ్=పర్వతశిఖరము, తదా=అప్పుడు, శ్రియా=శోభతో, జ్వలితం=ప్రజ్వలించుచున్నది, అభవత్=ఆయెను.

తా. అప్పుడు కీర్తిమంతుడైన హనుమంతుడు, బాహువులకు బాహుపురులు ధరించిన అంగదుడు, సంతోషించుచు ఉన్నతమైన ఆ పర్వతము పై భాగమున కూర్చొని యుండగా అది శోభతో ప్రజ్వలించెను. 51

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు
సుందరకాండలో ఏబదియేడవ సర్గ సమాప్తము.

అథ అష్టపఞ్చాశః సర్గః

[జాంబవంతుడు అడుగగా హనుమంతుడు తాను లంకకు బయలుదేరినది మొదలు జరిగిన విషయములను చెప్పుట].

మూ. తతస్తస్య గిరేః శృఙ్గే మహేన్ద్రస్య మహాబలాః,
హనుమత్ప్రముఖాః ప్రీతిం హరయో జగ్మురుత్తమామ్. 1

ప్ర. అ. తతః=అటు పిమ్మట, మహాబలాః=గొప్ప బలము గల, హనుమత్ప్రముఖాః=హనుమంతుడు మొదలైన, హరయః=వానరులు, తస్య=ఆ, మహేన్ద్రస్య గిరేః=మహేంద్రపర్వతముయొక్క, శృఙ్గే=శిఖరమునందు, ఉత్తమామ్=గొప్పదైన, ప్రీతిమ్=సంతోషమును, జగ్ముః=పొందిరి.

తా. మహేంద్రపర్వతశిఖరమునందు, మహాబలశాలులైన హనుమంతుడు మొదలైన వానరులు అత్యధికమైన సంతోషమును పొందిరి. 1

మూ. తం తతః ప్రీతిసంహృష్టః ప్రీతిమన్తం మహాకపిమ్,
జామ్బవాన్కార్యవృత్తాన్తమపృచ్ఛదనిలాత్మజమ్. 2

ప్ర. అ. తతః=అటు పిమ్మట, ప్రీతిసంహృష్టః=సంతోషముతో ఉబ్బిపోవుచున్న, జామ్బవాన్=జాంబవంతుడు, ప్రీతిమన్తమ్=సంతోషముతో కూడిన, మహాకపిమ్=గొప్పవానరుడైన, అనిలాత్మజమ్=హనుమంతుని, కార్యవృత్తాన్తమ్=సీతాన్వేషణకార్యమునకు సంబంధించిన వృత్తాంతమును గూర్చి, అపృచ్ఛత్=అడిగెను.

తా. పిమ్మట అత్యధికమైన సంతోషముతో నిండి యున్న జాంబవంతుడు, సంతోషభరితుడైన ఆ హనుమంతుని, సీతాన్వేషణము చేయుటకు ఆతడు బయలుదేరిన పిమ్మట ఏమేమి జరిగినదో చెప్పమని కోరెను. 2

మూ. కథం దృష్టా త్వయా దేవీ కథం వా తత్ర వర్తతే,
తస్యాం వా స కథంవృత్తః క్రూరకర్మా దశాననః. 3

ప్ర. అ. దేవీ=సీతాదేవి, త్వయా=నీచేత, కథమ్=ఎట్లు, దృష్టా=చూడబడినది ? తత్ర=అక్కడ, కథం వా=ఎట్లు, వర్తతే=ఉన్నది ? క్రూరకర్మా=క్రూరమైనది కర్మ గల, సః దశాననః=ఆ రావణుడు, తస్యామ్=ఆమె విషయమునందు, కథంవృత్తః=ఎట్టి ప్రవృత్తి కలవాడు ?

తా. నీవు సీతాదేవిని ఎట్లు చూచినావు ? ఆమె అక్కడ ఎట్లున్నది? క్రూరకార్యములు చేయు ఆ రావణుడు ఆమె విషయమున ఎట్లు ప్రవర్తించుచున్నాడు ? 3

మూ. తత్త్వతః సర్వమేతన్నః ప్రబ్రూహి త్వం మహాకపే,
శ్రుతార్థాశ్చిన్తయిష్యామో భూయః కార్యవినిశ్చయమ్. 4

ప్ర. అ. మహాకపే=హనుమంతుడా ! ఏతత్=దీనిని, సర్వమ్=అంతనూ, తత్త్వతః=యథార్థముగా, త్వమ్=నీవు, నః=మాకు, ప్రబ్రూహి=చెప్పుము. శ్రుతార్థాః=వినబడిన విషయము గలవారమై, భూయః=మరల, కార్యవినిశ్చయమ్=కార్యముయొక్క నిశ్చయమును గూర్చి, చిన్తయిష్యామః=ఆలోచించెదము.

తా. హనుమంతుడా ! ఈ విషయములన్నీ జరిగినవి జరిగినట్లు మాకు చెప్పుము. విషయము తెలిసిన పిమ్మట చేయవలసిన పనిని గూర్చి ఆలోచించెదము. 4

మూ. యశ్చార్థస్తత్ర వక్తవ్యో గతైరస్మాభిరాత్మవాన్,
రక్షితవ్యం చ యత్తత్ర తద్భవాన్ వ్యాకరోతు నః. 5

ప్ర. అ. గతైః=వెళ్ళిన, అస్మాభిః=మనచేత, తత్ర=అక్కడ, యః=ఏ, అర్థః=విషయము, వక్తవ్యః=చెప్పదగినదో, యత్=ఏది, తత్ర=అక్కడ, రక్షితవ్యం చ=రహస్యముగా ఉంచదగినదో, తత్=దానిని, ఆత్మవాన్=బుద్ధిమంతుడవైన, భవాన్=నీవు, నః=మాకు, వ్యాకరోతు=స్పష్టముగా చెప్పెదవు గాక.

తా. మనము అక్కడికి వెళ్ళిన పిమ్మట ఏ విషయములు చెప్పవలెనో, ఏ విషయములు రహస్యముగా ఉంచవలెనో బుద్ధిమంతుడవైన నీవు స్పష్టముగా చెప్పుము. 5

మూ. స నియుక్తస్తతస్తేన సంప్రహృష్టతనూరుహః,
ప్రణమ్య శిరసా దేవ్యై సీతాయై ప్రత్యభాషత. 6

ప్ర. అ. తేన=ఆ జాంబవంతునిచేత, నియుక్తః=ఆజ్ఞాపింపబడిన, సః=ఆ హనుమంతుడు, సంప్రహృష్టతనూరుహః=గగుర్పొడిచిన రోమములు కలవాడై, తతః=అటుపిమ్మట, దేవ్యై=దేవియైన, సీతాయై=సీతకు, శిరసా=శిరస్సుతో, ప్రణమ్య=నమస్కరించి, ప్రత్యభాషత=తిరిగి పలికెను.

తా. జాంబవంతుడు అట్లు ఆజ్ఞాపింపగా, హనుమంతుడు శరీరము గగుర్పాటు చెందగా, తల వంచి సీతాదేవికి నమస్కరించి ఇట్లు పలికెను. 6

మూ. ప్రత్యక్షమేవ భవతాం మహేన్ద్రాగ్రాత్ ఖమాప్లుతః,
ఉదధేర్దక్షిణం పారం కాంక్షమాణః సమాహితః. 7

ప్ర. అ. ఉదధేః=సముద్రముయొక్క, దక్షిణమ్=దక్షిణమునందున్న, పారమ్=తీరమును, కాంక్షమాణః=కోరుచున్నవాడనై, సమాహితః=సావధాన చిత్తుడనై, భవతామ్=మీయొక్క, ప్రత్యక్షమేవ=ప్రత్యక్షముగానే, మహేన్ద్రాగ్రాత్=మహేంద్రపర్వతమునుండి, ఖమ్=ఆకాశమును గూర్చి, అప్లుతః=ఎగిరినాను.

తా. సముద్రదక్షిణతీరమును చేరవలెనను ఉద్దేశ్యముతో, సావధానచిత్తునడై, నేను మీ ఎదుటనే మహేంద్రపర్వతమునుండి ఆకాశము పైకి ఎగిరితిని కదా ! 7

మూ. గచ్ఛతశ్చ హి మే ఘోరం విఘ్నరూపమివాభవత్,
కాఞ్చనం శిఖరం దివ్యం పశ్యామి సుమనోహరమ్. 8

ప్ర. అ. గచ్ఛతః=వెళ్లుచున్న, మే=నాకు, ఘోరమ్=భయంకరమైన, విఘ్నరూపమివ=విఘ్నము వంటిది, అభవత్=ఆయెను. కాఞ్చనమ్=బంగారు వికారమైన, దివ్యమ్=దివ్యమైన, సుమనోహరమ్=చాలా మనోహరమైన, శిఖరమ్=శిఖరమును, పశ్యామి=చూచుచున్నాను (చూచితిని)

తా. నేను వెళ్ళునప్పుడు ఒక భయంకరమైన విఘ్నమువంటిది ఏర్పడినది. నా కొక దివ్యము, సుందరము అయిన బంగారు శిఖరము కనబడినది. 8

మూ. స్థితం పన్థానమావృత్య మేనే విఘ్నం చ తం నగమ్,
ఉపసంగమ్య తం దివ్యం కాఞ్చనం నగసత్తమమ్, 9
కృతా మే మనసా బుద్ధిర్భేత్తవ్యోఽయం మయేతి చ.

ప్ర. అ. పన్థానమ్=మార్గమును, అవృత్య=ఆవరించి, స్థితమ్=ఉన్న, తం నగమ్=ఆ పర్వతమును, విఘ్నమ్=విఘ్నమునుగా, మేనే=తలచితిని. దివ్యమ్=దివ్యమైన, కాఞ్చనమ్=బంగారు వికారమైన, తం నగసత్తమమ్=ఆ పర్వతశ్రేష్ఠమును, ఉపసంగమ్య=సమీపించి, అయమ్=ఇది, మయా=నాచేత, భేత్తవ్యః ఇతి=బ్రద్దలుకొట్టదగినది అని, మే మనసా=నా మనస్సుతో, బుద్ధిః=ఆలోచన, కృతా=చేయబడినది.

తా. మార్గమును ఆవరించి నిలచి ఉన్న ఆ పర్వతమును ఒక విఘ్నమునుగా భావించితిని. దివ్యమైన ఆ బంగారుపర్వతశ్రేష్ఠమును సమీపించిన పిమ్మట, "దీనిని బ్రద్దలుకొట్టవలెను" అను బుద్ధి నాకు కలిగెను. 9

మూ. ప్రహతం చ మయా తస్య లాఙ్గూలేన మహాగిరేః, 10
శిఖరం సూర్యసంకాశం వ్యశీర్యత సహస్రధా.

ప్ర. అ. మయా=నాచేత, లాఙ్గూలేన=తోకతో, ప్రహతమ్=కొట్టబడిన, తస్య మహాగిరేః=ఆ మహాపర్వతముయొక్క, సూర్యసంకాశమ్=సూర్యుని వంటి, శిఖరమ్=శిఖరము, సహస్రధా=వేయి ముక్కలుగా, వ్యశీర్యత=బ్రద్దలైపోయెను.

తా. నేను తోకతో కొట్టగా, సూర్యుని వంటి ఆ మహాపర్వతశిఖరము వేయి ముక్కలుగా బ్రద్దలైపోయెను. 10

మూ. వ్యవసాయం చ తం బుద్ధ్వా స హోవాచ మహాగిరిః, 11
పుత్రేతి మధురాం వాణీం మనః ప్రహ్లాదయన్నివ.

ప్ర. అ. సః మహాగిరిః=ఆ మహాపర్వతము, తమ్=ఆ, వ్యవసాయమ్=ఉద్యమమును, బుద్ధ్వా=తెలిసికొని, మనః=మనస్సును, ప్రహ్లాదయన్నివ=సంతోష పెట్టుచున్నవాడు వలె, పుత్ర ఇతి="పుత్రా!" అని, మధురామ్=మధురమైన, వాణీమ్=వాక్కును, ఉవాచ హ=పలికెను.

తా. ఆ మహాపర్వతము నా ఉద్యమమును తెలిసికొని, మనస్సుకు ఆనందము కలుగునట్లుగా, మధురమైన వాక్కుతో, "నాయనా !" అని పిలచెను.

మూ. పితృవ్యం చాపి మాం విద్ధి సఖాయం మాతరిశ్వనః, 12
మైనాకమితి విఖ్యాతం నివసన్తం మహోదధౌ.

ప్ర. అ. మహోదధౌ=మహాసముద్రమునందు, నివసన్తమ్=నివసించుచున్నవాడనూ, మాతరిశ్వనః=వాయుదేవునియొక్క, సఖాయమ్=స్నేహితుడను, విఖ్యాతమ్=ప్రసిద్ధుడను అయిన, మామ్=నన్ను, మైనాకమితి=మైనాకునిగాను, పితృవ్యం చాపి=నీ తండ్రి సోదరుని గాను, విద్ధి=తెలుసుకొనుము.

తా. మహాసముద్రములో నివసించుచున్న నేను వాయుదేవుని స్నేహితుడనైన మైనాకుడని ప్రసిద్ధుడను. నీకు పినతండ్రి వంటి వాడను. 12

మూ. పక్షవన్తః పురా పుత్ర బభూవుః పర్వతోత్తమాః, 13
ఛన్దతః పృథివీం చేరుర్బాధమానాః సమన్తతః.

ప్ర. అ. పుత్ర=కుమారా ! పురా=పూర్వము, పర్వతోత్తమాః=శ్రేష్ఠములైన పర్వతములు, పక్షవన్తః=రెక్కలు గలవిగా, బభూవుః=ఉండినవి, బాధమానాః=ప్రజలను బాధించుచు, ఛన్దతః=స్వేచ్ఛానుసారముగా, సమన్తతః=అంతటను, పృథివీమ్=భూమిని, చేరుః=సంచరించినవి.

తా. నాయనా ! పూర్వము మహాపర్వతములకు రెక్కలుండెడివి. అవి ప్రాణులకు బాధ కలిగించుచు భూమిమీద అంతటను సంచరించుచుండెడివి.

మూ. శ్రుత్వా నగానాం చరితం మహేన్ద్రః పాకశాసనః, 14
చిచ్ఛేద భగవాన్ పక్షాన్ వజ్రేణైషాం సహస్రశః.

ప్ర. అ. పాకశాసనః=పాకాసురుని సంహరించిన, భగవాన్=పూజ్యుడైన మహేన్ద్రః=మహేంద్రుడు, నగానామ్=పర్వతములయొక్క, చరితమ్=చరితమును (నడవడికను), శ్రుత్వా=విని, ఏషామ్=వీటియొక్క, పక్షాన్=రెక్కలను, వజ్రేణ=వజ్రముచేత, సహస్రశః=వేయి ముక్కలుగా, చిచ్ఛేద=ఛేదించెను.

తా. పాకాసురసంహారియైన భగవంతుడైన దేవేంద్రుడు ఆ పర్వతముల చరితమును విని వజ్రాయుధముచేత వాటి రెక్కలను వేలకొలది ముక్కలుగా ఛేదించెను. 14

మూ. అహం తు మోక్షితస్తస్మాత్తవ పిత్రా మహాత్మనా, 15
మారుతేన తదా వత్స ప్రక్షిప్తోఽస్మి మహార్ణవే.

ప్ర. అ. వత్స=ఓ !వత్సా ! అహం తు=నేనైతే, తవ=నీయొక్క, పిత్రా=తండ్రియైన, మహాత్మనా=మహాత్ముడైన, మారుతేన=వాయుదేవుని చేత, తదా=అప్పుడు, తస్మాత్=ఆ దేవేంద్రునినుండి, మోక్షితః=విడిపింపబడినవాడనై, మహార్ణవే=మహాసముద్రమునందు, ప్రక్షిప్తః అస్మి=విసరివేయబడితిని.

తా. వత్సా ! మహాత్ముడైన నీతండ్రి వాయుదేవుడు నన్ను మహాసముద్రములో పడునట్లు ఎగురగొట్టి నన్ను మాత్రము మహేంద్రుని బారినుండి రక్షించినాడు. 15

మూ. రామస్య చ మయా సాహ్యే వర్తితవ్యమరిందమ, 16
రామో ధర్మభృతాం శ్రేష్ఠో మహేన్ద్రసమవిక్రమః.

ప్ర. అ. అరిందమ=శత్రుసంహారకుడా ! మయా=నాచేత, రామస్య=రామునకు, సాహ్యే=సహాయము చేయుటయందు, వర్తితవ్యమ్=ప్రవర్తింపవలసిఉన్నది. మహేన్ద్రసమవిక్రమః=మహేంద్రునితో సమానమైన పరాక్రమము గల, రామః=రాముడు, ధర్మభృతామ్=ధర్మమును పోషించువారిలో, శ్రేష్ఠః=శ్రేష్ఠుడు.

తా. శత్రుసంహారకుడవైన ఓ !హనుమంతుడా ! నేను రామునకు సహాయము చేయవలెను. మహేంద్రునితో సమానమైన పరాక్రమము గల రాముడు ధర్మమును రక్షించువారిలో శ్రేష్ఠుడు కదా ! 16

మూ. ఏతచ్ఛ్రుత్వా వచస్తస్య మైనాకస్య మహాత్మనః. 17
కార్యమావేద్య తు గిరేరుద్యతం చ మనో మమ,
తేన చాహమనుజ్ఞాతో మైనాకేన మహాత్మనా. 18

ప్ర. అ. మహాత్మనః=మహాత్ముడైన, తస్య మైనాకస్య=ఆ మైనాకుని యొక్క, వచః=వచనమును, శ్రుత్వా=విని, కార్యమ్=నా కార్యమును, గిరేః=ఆ పర్వతమునకు, ఆవేద్య=తెలిపి, మమ=నాయొక్క, మనః=మనస్సు, ఉద్యతమ్=ప్రయాణోన్ముఖమైనది. అహమ్=నేను, తేన=ఆ, మహాత్మనా=మహాత్ముడైన, మైనాకేన=మైనాకునిచేత, అనుజ్ఞాతశ్చ=ఇవ్వబడిన అనుజ్ఞ కలవాడనైతిని.

తా. మహాత్ముడైన ఆ మైనాకుని మాటలు విని, ఆతనికి నా కార్యమును తెలిపి నేను ప్రయాణమునకు ఉద్యుక్తుడనైతిని. మహాత్ముడైన ఆ మైనాకుడు కూడ నాకు వెళ్లుటకు అనుజ్ఞ ఇచ్చెను. 17, 18

మూ. స చాప్యన్తర్హితః శైలో మానుషేణ వపుష్మతా,
శరీరేణ మహాశైలః శైలేన చ మహోదధౌ. 19

ప్ర. అ. సః=ఆ, శైలః=పర్వతము, మానుషేణ వపుష్మతా=మనుష్యసంబంధిశరీరము గల రూపముతో, అన్తర్హితః=అంతర్ధానము చెందెను. మహాశైలః=ఆ మహాపర్వతము, శైలేన=పర్వతరూపమైన, శరీరేణ చ=శరీరముతో కూడ, మహోదధౌ=మహాసముద్రమునందు, అన్తర్హితః=అంతర్ధానము చెందెను.

తా. పర్వతములలో గొప్పదైన ఆ మైనాకపర్వతము మనుష్యరూపములో అంతర్ధానము చెందెను. దాని పర్వతరూపము కూడ సముద్రములో మునిగిపోయెను.

మూ. ఉత్తమం జవమాస్థాయ శేషం పన్థానమాస్థితః,
తతోఽహం సుచిరం కాలం వేగేనాభ్యాగమం పథి. 20

ప్ర. అ. తతః=అటుపిమ్మట, అహమ్=నేను, ఉత్తమమ్=ఉత్తమమైన, జవమ్=వేగమును, ఆస్థాయ=అవలంబించి, శేషమ్=మిగిలిన, పన్థానమ్=మార్గమును, ఆస్థితః=పొందినవాడనై, సుచిరం కాలమ్=చాల కాలము, వేగేన=వేగముతో, అభ్యాగమమ్=వెళ్ళితిని.

తా. పిమ్మట నేను అధికమైన వేగమును అవలంబించి, మిగిలిన మార్గమును గ్రహించి వేగముగా చాలాసేపు మార్గములో ప్రయాణము చేసితిని.

మూ. తతః పశ్యామ్యహం దేవీం సురసాం నాగమాతరమ్,
సముద్రమధ్యే సా దేవీ వచనం మామభాషత. 21

ప్ర. అ. తతః=అటుపిమ్మట, అహమ్=నేను, నాగమాతరమ్=నాగమాతయైన, సురసామ్=సురసను, పశ్యామి=చూచితిని, సా దేవీ=ఆ దేవి, సముద్రమధ్యే=సముద్రమధ్యమునందు, మామ్=నన్ను గూర్చి, వచనమ్=వాక్యమును, అభాషత=పలికెను.

తా. పిమ్మట నేను సముద్రమధ్యమునందు నాగమాతయైన సురసాదేవిని చూచితిని. ఆమె నాతో ఇట్లనెను. 21

మూ. మమ భక్షః ప్రదిష్టస్త్వమమరైర్హరిసత్తమ,
అతస్త్వాం భక్షయిష్యామి విహితస్త్వం చిరస్య మే. 22

ప్ర. అ. హరిసత్తమ=వానరశ్రేష్ఠుడా ! త్వమ్=నీవు, మమ=నాయొక్క, భక్షః=ఆహారముగా, అమరైః=దేవతలచేత, ప్రదిష్టః=చూపబడినావు. అతః=అందువలన, త్వామ్=నిన్ను, భక్షయిష్యామి=భక్షించగలను, త్వమ్=నీవు, మే=నాకు, చిరస్య=చిరకాలానికి, విహితః=(ఆహారముగా) ఏర్పరుపబడినావు.

తా. ఓ !వానరశ్రేష్ఠా ! దేవతలు నిన్ను నాకు ఆహారముగా చూపినారు. అందువలన నిన్ను భక్షించెదను. నీవు చాలకాలానికి నాకు లభించినావు. 22

మూ. ఏవముక్తః సురసయా ప్రాఞ్జలిః ప్రణతః స్థితః,
వివర్ణవదనో భూత్వా వాక్యం చేదముదీరయమ్. 23

ప్ర. అ. సురసయా=సురసచేత, ఏవమ్=ఇట్లు, ఉక్తః=పలకబడిన నేను, ప్రాఞ్జలిః=కట్టబడిన దోసిలి కలవాడనై, ప్రణతః=నమస్కరించుచు, స్థితః=నిలచితిని. వివర్ణవదనః=చెడిన రంగు గల ముఖము కలవాడను, భూత్వా=అయి, ఇదమ్=ఈ, వాక్యం చ=వాక్యమును కూడ, ఉదీరయమ్=పలికితిని.

తా. సురస మాటలు విని నేను అంజలి ఘటించి నమస్కరించుచు నిలచితిని. భయము చేత పాలిపోయిన ముఖములో ఇట్లు పలికితిని. 23

మూ. రామో దాశరథిః శ్రీమాన్ ప్రవిష్టో దణ్డకావనమ్,
లక్ష్మణేన సహ భ్రాత్రా సీతయా చ పరంతపః. 24

ప్ర. అ. దాశరథిః=దశరథకుమారుడు, శ్రీమాన్=శోభాయుక్తుడు, పరంతపః=శత్రుపీడకుడు అయిన, రామః=రాముడు, దణ్డకావనమ్=దండకారణ్యమును, భ్రాత్రా=సోదరుడైన, లక్ష్మణేన సహ=లక్ష్మణునితోను, సీతయా చ=సీతతోను, ప్రవిష్టః=ప్రవేశించినాడు.

తా. దశరథకుమారుడు, లక్ష్మీసంపన్నుడు, శత్రుసంహారకుడు అయిన రాముడు, సోదరుడైన లక్ష్మణునితోను, సీతతోను కలిసి దండకారణ్యమును ప్రవేశించెను. 24

మూ. తస్య సీతా హృతా భార్యా రావణేన దురాత్మనా,
తస్యాః సకాశం దూతోఽహం గమిష్యే రామశాసనాత్. 25

ప్ర. అ. తస్య=ఆ రామునియొక్క, భార్యా=భార్యయైన, సీతా=సీత, దురాత్మనా=దుష్టబుద్ధియైన, రావణేన=రావణునిచేత, హృతా=హరింపబడినది. అహమ్=నేను, రామశాసనాత్=రాముని ఆజ్ఞవలన, దూతః=దూతనై, తస్యాః=ఆ మెయొక్క, సకాశమ్=సమీపమును గూర్చి, గమిష్యే=వెళ్ళగలను.

తా. దుష్టబుద్ధియైన రావణుడు, రాముని భార్యయైన సీతను హరించెను. నేను రాముని ఆజ్ఞచేత, ఆమె వద్దకు దూతగా వెళ్లుచున్నాను. 25

మూ. కర్తుమర్హసి రామస్య సాహాయ్యం విషయే సతీ,
అథవా మైథిలీం దృష్ట్వా రామం చాక్లిష్టకారిణమ్, 26
ఆగమిష్యామి తే వక్త్రం సత్యం ప్రతిశృణోమి తే.

ప్ర. అ. విషయే=రామునిదేశములో, సతీ=ఉన్న నీవు, రామస్య=రాము నకు, సాహాయ్యమ్=సాహాయ్యమును, కర్తుమ్=చేయుటకు, అర్హసి=తగియున్నావు. అథవా=లేదా, మైథిలీమ్=సీతను, అక్లిష్టకారిణమ్=శ్రమపడకుండా పనులు చేయు, రామం చ=రామునీ, దృష్ట్వా=చూచి, తే=నీయొక్క, వక్త్రమ్=ముఖమును గూర్చి, ఆగమిష్యామి=రాగలను. సత్యమ్=సత్యముగా, తే=నీకు, ప్రతిశృణోమి=ప్రతిజ్ఞ చేయుచున్నాను.

తా. రాముని దేశములోనే నివసించుచున్న నీవు రామునకు సాహాయ్యము చేయవలెను. లేదా నేను సీతనూ, శ్రమపడకుండా పనులు చేయు రాముణ్ణీ చూచి నీకాహారముగా నీ ముఖములో ప్రవేశించెదను. నిజముగా ప్రతిజ్ఞ చేసి చెప్పుచున్నాను. 26

మూ. ఏవముక్తా మయా సా తు సురసా కామరూపిణీ, 27
అబ్రవీన్నాతివర్తేత కశ్చిదేష వరో మమ.

ప్ర. అ. మయా=నాచేత, ఏవమ్=ఇట్లు, ఉక్తా=పలకబడిన, కామ రూపిణీ=స్వేచ్ఛారూపము గల, సా సురసా=ఆ సురస, అబ్రవీత్=పలికెను. కశ్చిత్=ఎవ్వడూ, నాతివర్తేత=(నన్ను) అతిక్రమింపజాలడు, ఏషః=ఇది, మమ= నాయొక్క, వరః=వరము.

తా. స్వేచ్ఛానుసారము రూపములు ధరించగలిగిన ఆ సురస నామాటలు విని - "నన్నెవ్వడూ దాటి పోజాలడు ; ఇది నాకున్న వరము" అని పలికెను.27

మూ. ఏవముక్తః సురసయా దశయోజనమాయతః, 28
తతోర్ధగుణవిస్తారో బభూవాహం క్షణేన తు.

ప్ర. అ. సురసయా=సురసచేత, ఏవమ్=ఇట్లు, ఉక్తః=పలకబడిన, దశ యోజనమ్=పది యోజనములు, ఆయతః=పొడవైన, అహమ్=నేను, తతః=అటు పిమ్మట, క్షణేన=క్షణకాలములో, అర్ధగుణవిస్తారః=దానికి సగము రెట్టింపైన (పెరిగిన) విస్తారము కలవాడను, బభూవ=అయితిని.

తా. పది యోజనముల పొడవున్న నేను సురస మాటలు విని, క్షణకాలములో పదునైదు యోజనముల విస్తారముండునట్లు నా శరీరము పెంచితిని.

మూ. మత్ప్రమాణానురూపం చ వ్యాదితం చ ముఖం తయా, 29
తద్దృష్ట్వా వ్యాదితం చాస్యం హ్రస్వం హ్యకరవం వపుః,
తస్మిన్ ముహూర్తే చ పునర్బభూవాఙ్గుష్ఠమాత్రకః. 30

ప్ర. అ. తయా=ఆమెచేత, ముఖమ్=ముఖము, మత్ప్రమాణానురూపమ్=నా ప్రమాణమునకు అనుగుణముగా, వ్యాదితమ్=చాపబడినది. వ్యాదితమ్=చాపబడిన, తత్=ఆ, ఆస్యమ్=ముఖమును, దృష్ట్వా=చూచి, వపుః=శరీరమును, హ్రస్వమ్=చిన్న దానినిగా, అకరవమ్=చేసితిని. తస్మిన్=ఆ, ముహూర్తే=ముహూర్త కాలమునందే, పునః=మరల, అఙ్గుష్ఠమాత్రకః=బొటనవ్రేలు ప్రమాణము కలవాడను, బభూవ=అయితిని.

తా. ఆమె తన ముఖమును నా దేహప్రమాణమునకు చాలునంతగా చాచెను. ఆ విధముగ చాచిన ముఖమును చూచి నా శరీరమును చిన్నదిగా చేసి, ఆ క్షణమునందే బొటనవ్రేలంత ప్రమాణము కలవాడను అయితిని. 30

మూ. అభిపత్యాశు తద్వక్త్రం నిర్గతోఽహం తతః క్షణాత్,
అబ్రవీత్సురసా దేవీ స్వేన రూపేణ మాం పునః. 31

ప్ర. అ. తతః=అటు పిమ్మట, అహమ్=నేను, ఆశు=శీఘ్రముగా, తద్వక్త్రమ్=ఆమె ముఖమును, అభిపత్య=ప్రవేశించి, క్షణాత్=క్షణకాలములో, నిర్గతః=బైటకు వచ్చితిని. దేవీ=దేవియైన, సురసా=సురస, స్వేన=తన సంబంధమైన, రూపేణ=రూపముతో, పునః=మరల, మామ్=నన్ను గూర్చి, అబ్రవీత్=పలికెను.

తా. నేను వెంటనే ఆమె ముఖములో ప్రవేశించి, క్షణకాలములో దాని నుండి బైటకు వచ్చితిని. అప్పుడు సురస తన నిజస్వరూపముతో మరల ఇట్లు పలికెను. 31

మూ. అర్థసిద్ధ్యై హరిశ్రేష్ఠ గచ్ఛ సౌమ్య యథాసుఖమ్,
సమానయ చ వైదేహీం రాఘవేణ మహాత్మనా. 32
సుఖీ భవ మహాబాహో ప్రీతాస్మి తవ వానర.

ప్ర. అ. సౌమ్య=సౌమ్యుడా ! హరిశ్రేష్ఠ=వానరశ్రేష్ఠుడా ! అర్థసిద్ధ్యై=కార్యసిద్ధికొరకు, యథాసుఖమ్=సుఖముగా, గచ్ఛ=వెళ్లుము. వైదేహీమ్=సీతాదేవిని, మహాత్మనా=మహాత్ముడైన, రాఘవేణ=రామునితో, సమానయ=చేర్చుము. మహాబాహో=గొప్ప బాహువులు గల, వానర=వానరుడా ! సుఖీ=సుఖవంతుడవు, భవ=అగుము. తవ=నీవిషయమున, ప్రీతా అస్మి=సంతోషించినాను.

తా. సౌమ్యుడవైన ఓ !వానరశ్రేష్ఠా ! కార్యసిద్ధికొరకై సుఖముగా వెళ్లుము. సీతను మహాత్ముడైన రామునితో చేర్చుము. మహాబాహువైన ఓ ! వానరుడా ! సుఖముగా ఉండుము. నీ విషయమున సంతోషించినాను. 32

మూ. తతోఽహం సాధు సాధ్వితి సర్వభూతైః ప్రశంసితః, 33
తతోఽన్తరిక్షం విపులం ప్లుతోఽహం గరుడో యథా.

ప్ర. అ. తతః=అటు పిమ్మట, అహమ్=నేను, సర్వభూతైః=సమస్తభూతములచేతను, సాధు సాధ్వితి=బాగు బాగు అని, ప్రశంసితః=ప్రశంసింపబడితిని. తతః=అటు పిమ్మట, అహమ్=నేను, గరుడో యథా=గరుత్మంతుడు వలె, విపులమ్=విశాలమైన, అన్తరిక్షమ్=ఆకాశమును, ప్లుతః=దాటితిని.

తా. అప్పుడు నన్ను అక్కడ ఉన్న సకలప్రాణులు "బాగు !బాగు !" అని ప్రశంసించెను. పిదప నేను గరుత్మంతుడు వలె, విశాలమైన ఆకాశములో ఎగిరితిని. 33

మూ. ఛాయా మే నిగృహీతా చ న చ పశ్యామి కించన, 34
సోఽహం విహతవేగస్తు దిశో దశ విలోకయన్,
న కించిత్తత్ర పశ్యామి యేన మేఽపహృతా గతిః. 35

ప్ర. అ. మే=నాయొక్క, ఛాయా=నీడ, నిగృహీతా=పట్టుకొనబడెను. కించన=దేనినీ, న చ పశ్యామి=చూడలేదు. విహతవేగః=కొట్టబడిన వేగము గల, సః అహమ్=అట్టినేను, దశ దిశః=పది దిక్కులను, విలోకయన్=చూచుచు, యేన=దేనిచేత, మే=నాయొక్క, గతిః=గమనము, అపహృతా=అపహరించబడినదో అట్టి దానిని, కించిత్=దేనినీ కూడ, తత్ర=అక్కడ, న చ పశ్యామి=చూడలేదు.

తా. ఇంతలో నా నీడను ఎవ్వరో పట్టుకొనిరి. నాకు ఏదీ కనబడలేదు. వేగము తగ్గిపోగానే నేను పది దిక్కులూ చూచితిని. కాని నా గమనవేగమును అడ్డగించినది ఏదీ నాకు కనబడలేదు. 34, 35

మూ. తతో మే బుద్ధిరుత్పన్నా కిం నామ గమనే మమ,
ఈదృశో విఘ్న ఉత్పన్నో రూపం యత్ర న దృశ్యతే. 36

ప్ర. అ. తతః=అటుపిమ్మట, మే=నాకు, బుద్ధిః=ఆలోచన, ఉత్పన్నా=పుట్టినది. మమ=నాయొక్క, గమనే=గమనమునందు, యత్ర=ఎక్కడ, రూపమ్=రూపము, న దృశ్యతే=కనబడుటలేదో, అక్కడ, కిం నామ=ఏమిది? ఈదృశః=ఇట్టి, విఘ్నః=విఘ్నము, ఉత్పన్నః=పుట్టినది !

తా. "ఈ ప్రదేశమునందు ఎవ్వరూ కనబడుటలేదు. కాని నా గమనమునకు ఇట్టి విఘ్నము కలిగినది ? ఏమిది ?" అని నాకు ఆలోచన కలిగెను. 36

మూ. అధోభాగేన మే దృష్టిః శోచతా పాతితా మయా,
తతోఽద్రాక్షమహం భీమాం రాక్షసీం సలిలేశయామ్. 37

ప్ర. అ. శోచతా=ఆలోచించుచున్న, మయా=నాచేత, అధోభాగేన=క్రిందివైపు, మే=నాయొక్క, దృష్టిః=దృష్టి, పాతితా=ప్రసరింపచేయబడినది. తతః=అటుపిమ్మట, అహమ్=నేను, భీమామ్=భయంకరురాలైన, సలిలేశయామ్=నీటిలో శయనించు, రాక్షసీమ్=రాక్షసస్త్రీని, అద్రాక్షమ్=చూచితిని.

తా. ఇట్లు ఆలోచించుచు నేను క్రిందివైపు దృష్టిని ప్రసరింపచేయగా, నీటిలో శయనించి యున్న భయంకరురాలైన ఒక రాక్షసస్త్రీ కనబడెను. 37

మూ. ప్రహస్య చ మహానాదముక్తోఽహం భీమయా తయా,
అవస్థితమసంభ్రాన్తమిదం వాక్యమశోభనమ్. 38

ప్ర. అ. భీమయా=భయంకరురాలైన, తయా=ఆమెచేత, మహానాదమ్=గొప్ప ధ్వని కలుగునట్లుగా, ప్రహస్య=నవ్వి, అవస్థితమ్=నిశ్చితముగాను, అసంభ్రాన్తమ్=ఎట్టి కంగారు లేకుండాను, ఇదమ్=ఈ, అశోభనమ్=చెడ్డదైన, వాక్యమ్=వాక్యమును, అహమ్=నేను, ఉక్తః=పలకబడితిని.

తా. భయంకరురాలైన ఆమె వికటాట్టహాసము చేయుచు, నాతో నిశ్చితము గాను, ఏ మాత్రము వెరపు లేకుండగాను, ఈ చెడ్డ వాక్యమును పలికెను. 38

మూ. క్వాసి గన్తా మహాకాయ క్షుధితాయా మమేప్సితః,
భక్షః ప్రీణయ మే దేహం చిరమాహారవర్జితమ్. 39

ప్ర. అ. మహాకాయ=పెద్ద దేహము కలవాడా ! క్వ=ఎక్కడికి, గన్తా=వెళ్లేవాడవు, అసి=అయి ఉన్నావు ? క్షుధితాయాః=ఆకలిగొన్న, మమ=నాకు, ఈప్సితః=ఇష్టమైన, భక్షః=ఆహారమై, చిరమ్=చిరకాలము, ఆహారవర్జితమ్=ఆహార శూన్యమైన, మే=నాయొక్క, దేహమ్=దేహమును, ప్రీణయ=సంతృప్తిపరచుము.

తా. ఓ ! పెద్ద శరీరము కలవాడా ! ఎక్కడికి వెళ్లెదవు ? ఆకలి గొన్న నా శరీరము చాల కాలము నుండి ఆహారము లేకుండా ఉన్నది. నాకు ఇష్టమైన ఆహారముగా అయి ఈ దేహమునకు తృప్తి కలిగింపుము. 39

మూ. బాఢమిత్యేవ తాం వాణీం ప్రత్యగృహ్ణామహం తతః,
అస్యప్రమాణాదధికం తస్యాః కాయమపూరయమ్. 40

ప్ర. అ. అహమ్=నేను, బాఢమ్ ఇత్యేవ=తప్పక అట్లే చేసెదను అని, తాం వాణీమ్=ఆ వాక్యమును, ప్రత్యగృహ్ణామ్=స్వీకరించితిని. తతః=అటు పిమ్మట, తస్యాః=ఆమెయొక్క, అస్యప్రమాణాత్=ముఖప్రమాణముకంటె, అధికమ్=అధిక మగునట్లుగా, కాయమ్=(నా) శరీరమును, అపూరయమ్=పెంచితిని.

తా. "తప్పక అట్లే చేసెదను" అని పలుకుచు నేను ఆమె మాటలకు అంగీకరించి నా దేహమును ఆమె ముఖము ప్రమాణముకంటె అధికముగా ఉండునట్లు పెంచితిని. 40

మూ. తస్యాశ్చాస్యం మహద్భీమం వర్ధతే మమ భక్షణే,
న చ మాం సాధు బుబుధే మమ వా వికృతం కృతమ్. 41

ప్ర. అ. తస్యాః=ఆమె యొక్క, మహత్=పెద్దదైన, భీమమ్=భయంక రమైన, ఆస్యం చ=ముఖము కూడా, మమ భక్షణే=నా యొక్క భక్షణము నందు, వర్ధతే=వృద్ధిపొందుచున్నది. మామ్=నన్ను గూర్చి గాని, కృతమ్=చేయ బడిన, మమ=నాయొక్క, వికృతమ్=వికారమును గాని, సాధు=బాగుగా, న బుబుధే=తెలిసికొనలేదు.

తా. నన్ను భక్షించుటకై, చాల పెద్దదీ, భయంకరమూ అయిన ఆమె ముఖము కూడ పెరిగెను. ఆమెకు నన్ను గూర్చి గాని, నేను చేయదలచిన వికారమును (ఆమెను చంపే ఉపాయమును) గూర్చి గాని బాగుగా తెలియలేదు.

మూ. తతోఽహం విపులం రూపం సంక్షిప్య నిమిషాన్తరాత్,
తస్యా హృదయమాదాయ ప్రపతామి నభఃస్థలమ్. 42

ప్ర. అ. తతః=పిమ్మట, అహమ్=నేను, నిమిషాన్తరాత్=మరొక నిమిషములోనే విపులమ్=విశాలమైన, రూపమ్=రూపమును, సంక్షిప్య=కుదించి,

తస్యాః=ఆమె యొక్క, హృదయమ్=హృదయమును, ఆదాయ=గ్రహించి, నభ స్థలమ్=ఆకాశమును గూర్చి, ప్రపతామి=ఎగురుచున్నాను (ఎగిరితిని).

తా. పిదప నేను మరుక్షణములో విశాలమైన నా రూపమును చిన్నదిచేసి ఆమె గుండెకాయను త్రుంచి తీసికొని ఆకాశములోనికి ఎగిరితిని. 42

మూ. సా విసృష్టభుజా భీమా పపాత లవణామ్భసి,
మయా పర్వతసంకాశా నికృత్తహృదయా సతీ. 43

ప్ర. అ. భీమా=భయంకరురాలైన, పర్వతసంకాశా=పర్వతముతో సమానురాలైన, సా=ఆమె, మయా=నాచేత, నికృత్తహృదయా సతీ=ఛేదించబడిన హృదయము కలదై, విసృష్టభుజా=చాపబడిన భుజములు కలదై, లవణామ్భసి=లవణసముద్రమునందు, పపాత=పడెను.

తా. భయంకరురాలు, పర్వతము వంటిదీ అయిన ఆమె హృదయమును నేను ఛేదించివేయుటచే, ఆమె చేతులు చాపి లవణసముద్రములో పడిపోయెను.

మూ. శృణోమి ఖగతానాం చ సిద్ధానాం చారణైః సహ,
రాక్షసీ సింహికా భీమా క్షిప్రం హనుమతా హతా. 44

ప్ర. అ. చారణైః సహ=చారణులతో కూడ, ఖగతానామ్=ఆకాశమును పొందిన, సిద్ధానామ్=సిద్ధులయొక్క, భీమా=భయంకరమైన, రాక్షసీ=రాక్షసి, సింహికా=సింహిక, క్షిప్రమ్=శీఘ్రముగా, హనుమతా=హనుమంతునిచేత, హతా=చంపబడినది అను మాటలను శృణోమి=వినుచున్నాను (వింటిని).

తా. అప్పుడు ఆకాశమునందు గుమిగూడిన సిద్ధులు, చారణులు - "హనుమంతుడు భయంకరరాక్షసి యైన సింహికను శీఘ్రముగా చంపివేసినాడు" అని అనుచుండగా వింటిని. 44

మూ. తాం హత్వా పునరేవాహం కృత్యమాత్యయికం స్మరన్,
గత్వా చ మహదధ్వానం పశ్యామి నగమణ్డితమ్, 45
దక్షిణం తీరముదధేర్లఙ్కా యత్ర చ సా పురీ.

ప్ర. అ. అహమ్=నేను, తామ్=ఆమెను, హత్వా=చంపి, పునరేవ=తిరిగి, ఆత్యయికమ్=తొందరగా చేయదగిన, కృత్యమ్=కృత్యమును, స్మరన్=స్మరించుచు, మహత్ అధ్వానమ్=గొప్ప మార్గమును, గత్వా=వెళ్ళి, యత్ర=ఎక్కడ, సా=ఆ, లఙ్కాపురీ=లంకాపురమున్నదో, అట్టి, ఉదధేః=సముద్రముయొక్క, దక్షిణం తీరమ్=దక్షిణతీరమును, పశ్యామి=చూచుచున్నాను. (చూచితిని)

తా. నేను ఆ సింహికను చంపి, తొందరగా చేయదగిన కర్తవ్యమును గూర్చి మరల స్మరించుచు, చాల దూరము ప్రయాణము చేసి వృక్షములచే అలంకరింపబడిన లంకాపట్టణము సముద్రదక్షిణతీరమును చూచితిని. 45

మూ. అస్తం దినకరే యాతే రక్షసాం నిలయం పురమ్, 46
ప్రవిష్టోఽహమవిజ్ఞాతో రక్షోభిర్భీమవిక్రమైః.

ప్ర. అ. దినకరే=సూర్యుడు, అస్తం యాతే=అస్తాద్రిని పొందగా, అహమ్=నేను, భీమవిక్రమైః=భయంకరమైన పరాక్రమము గల, రక్షోభిః=రాక్షసులచేత, అవిజ్ఞాతః=తెలియబడని వాడనై, రక్షసామ్=రాక్షసులకు, నిలయమ్=స్థానమైన, పురమ్=పట్టణమును, ప్రవిష్టః=ప్రవేశించితిని.

తా. సూర్యుడు అస్తమించిన పిదప, నేను, భయంకరమైన పరాక్రమము గల రాక్షసులకు కనబడకుండగా, రాక్షస నివాసమైన లంకాపట్టణము ప్రవేశించితిని.

మూ. తత్ర ప్రవిశతశ్చాపి కల్పాన్తఘనసన్నిభా, 47
అట్టహాసం విముఞ్చన్తీ నారీ కాప్యుత్థితా పురః.

ప్ర. అ. తత్ర=ఆ పట్టణమునందు, ప్రవిశతః=ప్రవేశించుచున్న నాయొక్క, పురః=ఎదుట, కల్పాన్తఘనసన్నిభా=కల్పాంతము నందలి మేఘముతో సమానమైన, కాపి=ఒకానొక, నారీ=స్త్రీ, అట్టహాసమ్=అట్టహాసమును, విముఞ్చన్తీ=విడచుచు (చేయుచు), ఉత్థితా=లేచినది.

తా. నేను నగరములో ప్రవేశించుచుండగా, ప్రలయకాలమేఘము వలె ఉన్న ఒక స్త్రీ అట్టహాసము చేయుచు నా ఎదుట లేచి నిలచినది. 47

మూ. జిఘాంసన్తీం తతస్తాం తు జ్వలదగ్నిశిరోరుహామ్, 48
సవ్యముష్టిప్రహారేణ పరాజిత్య సుభైరవామ్,
ప్రదోషకాలే ప్రవిశం భీతయాహం తయోదితః. 49

ప్ర. అ. తతః=అటుపిమ్మట, జిఘాంసన్తీమ్=చంపదలచుకున్నదీ, జ్వలదగ్నిశిరోరుహామ్=మండుచున్న అగ్ని వంటి కేశములు కలదీ అయిన, సుభైరవామ్=చాల భయంకరురాలైన, తామ్=ఆమెను, సవ్యముష్టిప్రహారేణ=ఎడమ పిడికిలి దెబ్బచే, పరాజిత్య=ఓడించి, ప్రదోషకాలే=సాయంకాల సమయమునందు, ప్రవిశమ్=ప్రవేశించితిని. భీతయా=భయపడిన, తయా=ఆమెచేత, అహమ్=నేను, ఉదితః=పలకబడితిని.

తా. మండుచున్న అగ్ని వంటి కేశములు కలదీ, చాల భయంకరురాలూ అయిన ఆమె నన్ను చంపుటకు ఉద్యమించగా, నేను ఆమెను ఎడమచేతి

గ్రుద్దుతో ఓడించి ప్రదోషసమయమునందు ప్రవేశించితిని. అప్పుడు భయపడిన ఆమె ఇట్లు పలికెను. 48, 49

మూ. అహం లఙ్కాపురీ వీర నిర్జితా విక్రమేణ తే,
యస్మాత్తస్మాద్విజేతాసి సర్వరక్షాంస్యశేషతః. 50

ప్ర. అ. వీర=ఓ !వీరుడా ! అహమ్=నేను, లఙ్కాపురీ=లంకాపురిని. యస్మాత్=ఏ కారణము వలన, తే=నీయొక్క, విక్రమణే=పరాక్రమముచేత, నిర్జితా=జయింపబడితివో, తస్మాత్=ఆ కారణమువలన, సర్వరక్షాంసి=సమస్తరాక్షసులను, అశేషతః=పూర్తిగా, విజేతాసి=జయించగలవు.

తా. ఓ !వీరుడా ! నేను లంకాపురిని. నీవు నన్ను నీ పరాక్రమముచేత జయించినావు. అందువలన సకలరాక్షసులను, నిశ్శేషముగా జయించగలవు. 50

మూ. తత్రాహం సర్వరాత్రం తు విచిన్వన్ జనకాత్మజామ్,
రావణాన్తఃపురగతో న చాపశ్యం సుమధ్యమామ్. 51

ప్ర. అ. అహమ్=నేను, తత్ర=అక్కడ, రావణాన్తఃపురగతః=రావణుని అంతఃపురమునకు వెళ్ళినవాడనై, సర్వరాత్రమ్=రాత్రి అంతా, జనకాత్మజామ్=సీతను, విచిన్వన్=అన్వేషించుచు, సుమధ్యమామ్=మంచి నడుము గల ఆ సీతను, న అపశ్యం చ=చూడలేదు.

తా. అక్కడ నేను రావణుని అంతఃపురమునకు వెళ్ళి రాత్రి అంతా సీత కోసమై వెదకితిని కాని, మంచి నడుము గల ఆ సీత కనబడలేదు. 51

మూ. తతః సీతామపశ్యంస్తు రావణస్య నివేశనే,
శోకసాగరమాసాద్య న పారముపలక్షయే. 52

ప్ర. అ. రావణస్య=రావణునియొక్క, నివేశనే=గృహమునందు, సీతామ్=సీతను, అపశ్యంస్తు=చూడనివాడనై, తతః=అటుపిమ్మట, శోకసాగరమ్=శోకసముద్రమును, ఆసాద్య=పొంది, పారమ్=దాని అవతలి ఒడ్డును, న ఉపలక్షయే=చూడజాలకపోతిని.

తా. రావణుని గృహములో సీత కనబడకపోవుటచేత నేను శోకసముద్రములో పడి దాని అంతము చూడజాలకపోయితిని. 52

మూ. శోచతా చ మయా దృష్టం ప్రాకారేణ సమావృతమ్,
కాఞ్చనేన వికృష్టేన గృహోపవనముత్తమమ్. 53

ప్ర. అ. శోచతా=దుఃఖించుచున్న, మయా=నాచేత, కాఞ్చనేన=బంగారువి కారమైన, వికృష్టేన=పొడవైన, ప్రాకారేణ=ప్రాకారముచేత, సమావృతమ్=కప్పబడిన, ఉత్తమమ్=ఉత్తమమైన, గృహోపవనమ్=గృహమునకు సంబంధించిన ఉద్యానము, దృష్టమ్=చూడబడినది.

తా. దుఃఖాక్రాంతుడనైన నేను, చుట్టూ దీర్ఘమైన బంగారు ప్రాకారము ఉన్న, రావణుని గృహమునకు దగ్గరగా ఉన్న ఉత్తమమైన ఉద్యానమును చూచితిని.

మూ. స ప్రాకారమవప్లుత్య పశ్యామి బహుపాదపమ్,
అశోకవనికామధ్యే శింశుపాపాదపో మహాన్, 54
తమారుహ్య చ పశ్యామి కాఞ్చనం కదలీవనమ్.

ప్ర. అ. సః=అట్టి నేను, ప్రాకారమ్=ప్రాకారమును, అవప్లుత్య=దాటి, బహుపాదపమ్=అనేక వృక్షములు గల ఉద్యానమును, పశ్యామి=చూచుచున్నాను (చూచితిని), అశోకవనికామధ్యే=అశోకవనమధ్యమునందు, మహాన్=గొప్పదైన, శింశుపాపాదపః=శింశుపావృక్షము ఉండెను. తమ్=దానిని, ఆరుహ్య=ఎక్కి, కాఞ్చనమ్=బంగారు, కదలీవనమ్=అరటి తోపును, పశ్యామి=చూచితిని.

తా. నేను ప్రాకారము దాటి అనేకవృక్షములతో కూడిన ఉద్యానమును చూచితిని. అశోకవనమధ్యమునందు పెద్ద శింశుపావృక్షము ఉండెను. దానిని ఎక్కి బంగారు అరటిచెట్ల తోపు చూచితిని. 54

మూ. అదూరే శింశుపావృక్షాత్పశ్యామి వరవర్ణినీమ్, 55
శ్యామాం కమలపత్రాక్షీముపవాసకృశాననామ్,
తదేకవాసఃసంవీతాం రజోధ్వస్తశిరోరుహామ్, 56
శోకసన్తాపదీనాఙ్గీం సీతాం భర్తృహితే స్థితామ్,
రాక్షసీభిర్విరూపాభిః క్రూరాభిరభిసంవృతామ్, 57
మాంసశోణితభక్షాభిర్వ్యాఘ్రీభిర్హరిణీమివ.

ప్ర. అ. శింశుపావృక్షాత్=శింశుపావృక్షమునుండి, అదూరాత్=సమీపము నందు, వరవర్ణినీమ్=శ్రేష్ఠమైన వర్ణము గలదీ, శ్యామామ్=యౌవనమధ్యమునందున్నది, కమలపత్రాక్షీమ్=పద్మపత్రములవంటి నేత్రములు కలది, ఉపవాసకృశాననామ్=ఉపవాసములచేత వాడిపోయిన ముఖము కలది, తదేకవాసఃసంవీతామ్=ఆ ఒకే వస్త్రముచేతనే చుట్టబడినది. రజోధ్వస్తశిరోరుహామ్=పరాగముచేత చెడిపోయిన కేశములు గలది, శోకసంతాపదీనాఙ్గీమ్=శోకముతోను, తాపముతోను దీనమైన శరీరము గలది, భర్తృహితే=భర్తయొక్క హితము నందు, స్థితామ్=ఉన్నది,

విరూపాభిః=వికృతరూపములు కలవారు, క్రూరాభిః=క్రూరురాళ్లు, మాంసశోణితభ క్షాభిః=మాంసమును రక్తమును భక్షించువాళ్లు అయిన, రాక్షసీభిః=రాక్షసస్త్రీలచేత, వ్యాఘ్రీభిః=ఆడపులులచేత, హరిణీమివ=ఆడ లేడి వలె, అభిసంవృతామ్=చుట్టబడినది అయిన, సీతామ్=సీతను, పశ్యామి=చూచితిని.

తా. శింశుపావృక్షమునకు దగ్గరనే ఉత్తమమైన శరీరచ్ఛాయ గల, యౌవనమధ్యస్థురాలైన సీతను చూచితిని. కమలపత్రముల వంటి కళ్లు గల ఆమె ముఖము ఉపవాసములచేత వాడిపోయి ఉండెను. ఆమె ఆ వస్త్రము నొక్కదానినే చుట్టబెట్టుకొని ఉండెను. ఆమె కేశములు బూడిదకప్పి శోభావిహీనములై ఉండెను. శోకముచేత, మనస్తాపము చేత దీనమైన (కృశించిన) శరీరము గల ఆమెను, వికృతరూపములు, క్రూరస్వభావము కలవాళ్లు, మాంసరక్తములను ఆహారముగా తీసికొను వాళ్లు అయిన రాక్షసస్త్రీలు, ఆడ లేడిని ఆడ పెద్దపులులు చుట్టుముట్టి ఉన్నట్లు చుట్టి ఉండిరి. ఆమె భర్తహితమును గూర్చియే ఆలోచించుచుండెను.

మూ. సా మయా రాక్షసీమధ్యే తర్జ్యమానా ముహుర్ముహుః, 58
ఏకవేణీధరా దీనా భర్తృచిన్తాపరాయణా,
భూమిశయ్యా వివర్ణాఙ్గీ పద్మినీవ హిమాగమే, 59
రావణాద్వినివృత్తార్థా మర్తవ్యకృతనిశ్చయా,
కథంచిన్మృగశాబాక్షీ తూర్ణమాసాదితా మయా. 60

ప్ర. అ. ముహుర్ముహుః=మాటి మాటికి, తర్జ్యమానా=భయపెట్టబడుచున్నది, ఏకవేణీధరా=ఒక జడను ధరించినది, దీనా=దీనురాలు, భర్తృచిన్తాపరాయణా=భర్తను గూర్చిన ఆలోచనతో నిండినది, భూమిశయ్యా=నేలయే శయ్యగా గలది, వివర్ణాఙ్గీ=రంగు చెడిన శరీరము గలది, హిమాగమే=శిశిరర్తువునందు, పద్మినీవ=పద్మలత వలె ఉన్నది, రావణాత్=రావణుని నుండి, వినివృత్తార్థా=నివర్తించిన ప్రయోజనము గలది, మర్తవ్యకృతనిశ్చయా=మరణించవలెనని చేయబడిన నిశ్చయము గలది అయిన, సా=ఆమె, మయా=నాచేత, రాక్షసీమధ్యే=రాక్షసస్త్రీలమధ్య, ఆసాదితా=పొందబడినది. మృగశాబాక్షీ=లేడిపిల్ల కళ్లవంటి కళ్ళు గల ఆమె, మయా=నాచేత, కథంచిత్=ఎటులనో, తూర్ణమ్=శీఘ్రముగా, ఆసాదితా=పొందబడినది.

తా. ఒకే జడతో దీనురాలై భర్తను గూర్చియే ఆలోచించుచున్న ఆ సీత రాక్షసస్త్రీలమధ్య ఉండెను. వాళ్లు ఆమెను మాటిమాటికి భయపెట్టుచుండిరి. నేలపైననే శయనించుచు, రంగు మారిపోయిన ఆమె శిశిరర్తువునందలి పద్మలత వలె ఉండెను. ఆమె రావణుని విషయమున విముఖురాలై మరణించవలెనని

నిశ్చయము చేసికొనెను. లేడిపిల్ల కళ్ళ వంటి కళ్లు గల అట్టి సీతను నేను శీఘ్రముగా ఎట్లో చూడగలిగితిని. 58 - 60

మూ. తాం దృష్ట్వా తాదృశీం నారీం రామపత్నీం యశస్వినీమ్,
తత్రైవ శింశుపావృక్షే పశ్యన్నహమవస్థితః. 61

ప్ర. అ. అహమ్=నేను, తాదృశీమ్=అట్టి, నారీమ్=స్త్రీ యైన, యశస్వినీమ్=కీర్తిమంతురాలైన, తాం రామపత్నీమ్=ఆ రామభార్యను, దృష్ట్వా=చూచి, తత్ర=అక్కడ (అ), శింశుపావృక్షే ఏవ=శింశుపావృక్షమునందే, పశ్యన్=చూచుచు, అవస్థితః=ఉంటిని.

తా. కీర్తిమంతురాలు, రాముని భార్య అయిన ఆ సీత అట్టి స్థితిలో నాకు కనబడినది. నేనామెను చూచుచు, ఆ శింశుపావృక్షము పైననే ఉండిపోయితిని.

మూ. తతో హలహలాశబ్దం కాఞ్చీనూపురమిశ్రితమ్,
శృణోమ్యధికగమ్భీరం రావణస్య నివేశనే. 62

ప్ర. అ. తతః=అటు పిమ్మట, రావణస్య=రావణుని యొక్క, నివేశనే=గృహమునందు, కాఞ్చీనూపురమిశ్రితమ్=వడ్డాణములధ్వనితోను నూపురముల ధ్వనితోను కలిసిన, అధికగమ్భీరమ్=మిక్కిలి గంభీరమైన, హలహలాశబ్దమ్=కోలాహలమును, శృణోమి=వినుచున్నాను (వింటిని).

తా. ఇంతలో రావణుని గృహములో, వడ్డాణముల ధ్వనితోను, అందెళ్ళ ధ్వనితోను, కలిసిన, చాలా గంభీరమైన కోలాహలము వినబడెను. 62

మూ. తతోఽహం పరమోద్విగ్నః స్వం రూపం ప్రత్యసంహరమ్,
అహం తు శింశుపావృక్షే పక్షీవ గహనే స్థితః. 63

ప్ర. అ. తతః=అటు పిమ్మట, అహమ్=నేను, పరమోద్విగ్నః=మిక్కిలి దిగులు చెందినవాడనై, స్వం రూపమ్=తన రూపమును, ప్రత్యసంహరమ్=తగ్గించితిని. అహం తు=నేనైతే, గహనే=దట్టమైన, శింశుపావృక్షే=శింశుపావృక్షమునందు, పక్షీవ=పక్షి వలె, స్థితః=ఉంటిని.

తా. అప్పుడు నేను చాలా భయపడి నా రూపమును చిన్నదిగా చేసికొని, దట్టమైన శింశుపావృక్షము మీద పక్షివలె దాగి ఉంటిని. 63

మూ. తతో రావణదారాశ్చ రావణశ్చ మహాబలః,
తం దేశం సమనుప్రాప్తా యత్ర సీతాభవత్ స్థితా. 64

ప్ర. అ. తతః=అటు పిమ్మట, రావణదారాశ్చ=రావణుని భార్యలు, మహాబలః=గొప్ప బలము గల, రావణశ్చ=రావణుడు, సీతా=సీత, యత్ర=ఎక్కడ, స్థితా=ఉన్నది, అభవత్=అయెనో, తమ్=ఆ, దేశమ్=ప్రదేశమును, సమనుప్రాప్తాః=చేరినారు.

తా. ఇంతలో మహాబలశాలియైన రావణుడు, ఆతని భార్యలు, సీత ఉన్న ప్రదేశమునకు వచ్చిరి. 64

మూ. తం దృష్ట్వాథ వరారోహా సీతా రక్షోగణేశ్వరమ్,
సంకుచ్యోరూ స్తనౌ పీనౌ బాహుభ్యాం పరిరభ్య చ. 65

ప్ర. అ. అథ=అటు పిమ్మట, వరారోహా=శ్రేష్ఠమైన కటిప్రదేశము గల, సీతా=సీత, రక్షోగణేశ్వరమ్=రాక్షసగణమునకు ప్రభువైన, తమ్=ఆతనిని, దృష్ట్వా=చూచి, ఊరూ=తొడలను, బాహుభ్యామ్=బాహువులచేత, సంకుచ్య=ముడుచుకొని, పీనౌ=బలసిన, స్తనౌ=స్తనములను, పరిరభ్య చ=కౌగలించుకొని (ఉండెను).

తా. సుందరమైన కటిప్రదేశము గల సీత ఆ రావణుని చూచి తొడలను బాహువులచే దగ్గరగా ముడుచుకొని, బలసిన స్తనములను బాహువులచే ఆచ్ఛాదించుకొనెను. 65

మూ. విత్రస్తాం పరమోద్విగ్నాం వీక్షమాణామితస్తతః,
త్రాణం కించిదపశ్యన్తీం వేపమానాం తపస్వినీమ్. 66
తాముువాచ దశగ్రీవః సీతాం పరమదుఃఖితామ్,
అవాక్ఛిరాః ప్రపతితో బహుమన్యస్వ మామితి. 67

ప్ర. అ. విత్రస్తామ్=భయపడినదీ, పరమోద్విగ్నామ్=మిక్కిలి దిగులు చెందినదీ, తతస్తతః=ఇటు నటు, వీక్షమాణామ్=చూచుచున్నదీ, కించిత్=ఏదీ, త్రాణమ్=రక్షణమును, అపశ్యన్తీమ్=చూడనిదీ, వేపమానామ్=వణకిపోవుచున్నదీ, తపస్వినీమ్=దీనురాలూ, పరమదుఃఖితామ్=మిక్కిలి దుఃఖించినదీ అయిన, తాం సీతామ్=ఆ సీతను గూర్చి, దశగ్రీవః=రావణుడు, అవాక్ఛిరాః=క్రిందికి వంచబడిన శిరస్సు కలవాడై, ప్రపతితః=నేలపై పడినవాడై, మామ్=నన్ను, బహుమన్యస్వ=ఆదరించుము, ఇతి=అని, ఉవాచ=పలికెను.

తా. అప్పుడా సీత చాల దిగులు చెంది, భయపడుచు, రక్షకులెవ్వరూ లేక, ఇటునటు చూచుచు వణకిపోవుచుండెను. ఈ విధముగ చాల దుఃఖితురాలై దైన్యములో ఉన్న ఆమెతో రావణుడు తలక్రిందికి వంచి, నేలపై వ్రాలి, "నన్ను అంగీకరింపుము" అని పలికెను. 66, 67

మూ. యది చేత్త్వం తు దర్పాన్మాం నాభినన్దసి గర్వితే,
ద్వౌ మాసావన్తరం సీతే పాస్యామి రుధిరం తవ. 68

ప్ర. అ. గర్వితే=గర్వితురాలా ! సీతే=సీతా ! త్వమ్=నీవు, దర్పాత్=గర్వమువలన, మామ్=నన్ను, నాభినన్దసి యది చేత్=అభినందించకపోయినచో, ద్వౌ మాసౌ అన్తరమ్=రెండు మాసములు అవధిగా, తవ=నీయొక్క, రుధిరమ్=రక్తమును, పాస్యామి=త్రాగగలను.

తా. గర్వితురాలవైన సీతా ! నీవు దర్పముచేత నన్ను అంగీకరించకపోయినచో, రెండు మాసముల గడువు దాటిన పిమ్మట నీ రక్తము త్రాగెదను. 68

మూ. ఏతచ్ఛ్రుత్వా వచస్తస్య రావణస్య దురాత్మనః,
ఉవాచ పరమక్రుద్ధా సీతా వచనముత్తమమ్. 69

ప్ర. అ. దురాత్మనః=దుర్బుద్ధియైన, తస్య=ఆ, రావణస్య=రావణుని యొక్క, ఏతత్=ఈ, వచః=వచనమును, శ్రుత్వా=విని, సీతా=సీత, పరమక్రుద్ధా=మిక్కిలి కోపించినదై, ఉత్తమమ్=ఉత్తమమైన, వచనమ్=వచనమును, ఉవాచ=పలికెను.

తా. దుర్బుద్ధియైన రావణుడు పలికిన ఈ మాటలు విని సీత చాలా కోపించినదై ఉత్తమమైన వాక్యము పలికెను. 69

మూ. రాక్షసాధమ రామస్య భార్యామమితతేజసః,
ఇక్ష్వాకుకులనాథస్య స్నుషాం దశరథస్య చ, 70
అవాచ్యం వదతో జిహ్వే కథం న పతితా తవ.

ప్ర. అ. రాక్షసాధమ=ఓ ! నీచుడవైన రాక్షసుడా ! అమితతేజసః=అత్యధికమైన తేజస్సు గల, రామస్య=రామునియొక్క, భార్యామ్=భార్య, ఇక్ష్వాకుకులనాథస్య=ఇక్ష్వాకువంశప్రభువైన, దశరథస్య=దశరథునియొక్క, స్నుషాం చ=కోడలూ అయిన నన్ను గూర్చి, అవాచ్యమ్=పలక కూడని మాటలు, వదతః=పలుకుచున్న, తవ=నీయొక్క, జిహ్వే=నాలుక, కథమ్=ఎట్లు, న పతితా=పడిపోలేదు.

తా. ఓ ! రాక్షసాధమా ! అమితమైన తేజస్సు గల రాముని భార్యనూ, ఇక్ష్వాకువంశమునకు ప్రభువైన దశరథుని కోడలినీ అయిన నా విషయమున ఇట్లు ఆడకూడని మాటలాడుచున్న నీ నాలుక ఎందుచేత పడిపోవుట లేదు ? 70

మూ. కించిద్వీర్యం తవానార్య యో మాం భర్తురసన్నిధౌ, 71
అపహృత్యాగతః పాప తేనాదృష్టో మహాత్మనా.

ప్ర. అ. అనార్య=దుష్టుడా ! పాప=పాపాత్ముడా ! యః=ఏ నీవు, భర్తుః=భర్తయొక్క, అసంనిధౌ=సాన్నిధ్యము లేనపుడు, మామ్=నన్ను, అపహృత్య=అపహరించి, మహాత్మనా=మహాత్ముడైన, తేన=ఆతని చేత, అదృష్టః= చూడబడనివాడవై, ఆగతః=వచ్చినావో అట్టి, తవ=నీయొక్క, వీర్యమ్=పరాక్రమము, కించిత్= చాల అల్పమైనది.

తా. ఓరీ ! అనార్యుడా ! పాపాత్ముడా ! నా భర్త దగ్గర లేనపుడు, ఆ మహాత్ముడు చూడకుండగా, నన్ను అపహరించి తీసికొనివచ్చిన నీ పరాక్రమము అత్యల్పమైనది. 71

మూ. న త్వం రామస్య సదృశో దాస్యేఽప్యస్య న యుజ్యసే, 72
యజ్ఞీయః సత్యవాదీ చ రణశ్లాఘీ చ రాఘవః.

ప్ర. అ. త్వమ్=నీవు, రామస్య=రామునకు, సదృశః=తగినవాడవు, న=కావు, అస్య=ఈతనికి, దాస్యేఽపి=దాస్యముచేయుటయందు కూడ, న యుజ్యసే=తగవు, రాఘవః=రాముడు, యజ్ఞీయః=యాగములు చేయువాడు, సత్యవాదీ=సత్యమునే పలుకువాడు, రణశ్లాఘీ చ=రణమునందు ప్రశంస కలవాడు.

తా. నీకు రామునితో పోలికయే లేదు. నీవు రామునికి దాసుడుగా ఉండుటకు కూడ తగవు. రాముడు యాగములు చేయువాడు. సత్యవాది. యుద్ధములలో ప్రశంసలందుకొన్నవాడు. 72

మూ. జానక్యా పరుషం వాక్యమేవముక్తో దశాననః, 73
జజ్వాల సహసా కోపాచ్చితాస్థ ఇవ పావకః.

ప్ర. అ. జానక్యా=జానకి చేత, ఏవమ్=ఇట్లు, పరుషమ్=పరుషముగా, ఉక్తః=పలకబడిన, దశాననః=రావణుడు, సహసా=వెంటనే, చితాస్థః=చితయందున్న, పావకః ఇవ=అగ్ని వలె, కోపాత్=కోపము వలన, జజ్వాల=మండిపడెను.

తా. రావణుడు జానకి పలికిన ఈ పరుషవాక్యములు విని కోపముతో, చితలో ఉన్న అగ్ని వలె, వెంటనే మండిపడెను. 73

మూ. వివృత్య నయనే క్రూరే ముష్టిముద్యమ్య దక్షిణమ్, 74
మైథిలీం హన్తుమారబ్ధః స్త్రీభిర్హాహాకృతం తదా.

ప్ర. అ. క్రూరే=క్రూరములైన, నయనే=నేత్రములను, వివృత్య= త్రిప్పి, దక్షిణమ్=కుడిదైన, ముష్టిమ్=పిడికిలిని, ఉద్యమ్య=ఎత్తి, మైథిలీమ్=సీతను, హన్తుమ్=చంపుటకు, ఆరబ్ధః=ప్రారంభించెను. తదా=అప్పుడు, స్త్రీభిః=స్త్రీలచేత, హాహాకృతమ్=హాహాకారము చేయబడినది.

తా. అతడు క్రూరములైన నేత్రములు పెద్దవి చేసి, కుడి పిడికిలి ఎత్తి సీతను చంపుటకై ఉద్యమించెను. అది చూచి అక్కడ నున్న స్త్రీలందరు హాహాకారము చేసిరి. 74

మూ. స్త్రీణాం మధ్యాత్సముత్పత్య తస్య భార్యా దురాత్మనః, 75
వరా మందోదరీ నామ తయా స ప్రతిషేధితః.

ప్ర. అ. దురాత్మనః=దుష్టబుద్ధి గల, తస్య=అతనియొక్క, భార్యా=భార్యయైన, మందోదరీ నామ=మందోదరి అను పేరు గల, వరా=ఉత్తమురాలైన స్త్రీ, స్త్రీణామ్=స్త్రీలయొక్క, మధ్యాత్=మధ్యనుండి, సముత్పత్య=ఎగిరి (ముందుకు వచ్చెను).తయా=ఆమెచేత, సః=అతడు, ప్రతిషేధితః=నివారించబడెను.

తా. అప్పుడు దురాత్ముడైన ఆ రావణుని భార్య యైన ఉత్తమురాలైన మందోదరి స్త్రీల మధ్యనుండి శీఘ్రముగా ముందుకు వచ్చి ఆతనిని నివారించెను.

వి. రావణుణ్ణి నివారించినది "ధాన్యమాలిని" అను భార్య అని 22వ సర్గలో వావిళ్ళప్రతిలోను, గోరఖ్‌పూర్ ప్రతిలోను ఉన్నది. ఈ ప్రతులలో ఇక్కడ మాత్రము "మందోదరి" అని ఉన్నది. ప్రాచ్యపాఠములో రెండు చోట్లా మందోదరి అనియే ఉన్నది. 75

మూ. ఉక్తశ్చ మధురాం వాచం తయా స మదనార్దితః, 76
సీతయా తవ కిం కార్యం మహేన్ద్రసమవిక్రమ.

ప్ర. అ. మదనార్దితః=మన్మథునిచేత పీడితుడైన, సః=అతడు, తయా=ఆమె చేత, మధురామ్=మధురమైన, వాచమ్=వాక్కును, ఉక్తశ్చ=పలకబడినాడు కూడ. మహేన్ద్రసమవిక్రమ=మహేంద్రునితో సమానమైన పరాక్రమము కలవాడా! సీతయా=సీతతో, తవ=నీకు, కిం కార్యమ్=ఏమి పని ఉన్నది?

తా. మన్మథపీడితుడైన ఆతనితో ఆమె మధురముగా ఇట్లు పలికెను. మహేంద్రునితో సమానమైన పరాక్రమము గల వాడా! నీకు ఈ సీతతో ఏమి పని! 76

మూ. దేవగన్ధర్వకన్యాభిర్యక్షకన్యాభిరేవ చ, 77
సార్ధం ప్రభో రమస్వేహ సీతయా కిం కరిష్యసి.

ప్ర. అ. ప్రభో=ఓ ! ప్రభూ ! దేవగన్ధర్వకన్యాభిః=దేవకన్యలతోను, గంధర్వకన్యలతోను, యక్షకన్యాభిరేవ చ సార్ధమ్=యక్షకన్యలతోను, ఇహ=ఇక్కడ, రమస్వ=క్రీడించుము. సీతయా=సీతతో, కిం కరిష్యసి=ఏమి చేయుగలవు ?

తా. నాథా ! నీవు దేవకన్యలతోను, గంధర్వకన్యలతోను, యక్షకన్యలతోను కూడి క్రీడింపుము. నీకు సీతతో ఏమి ప్రయోజనము ? 77

మూ. తతస్తాభిః సమేతాభిర్నారీభిః స మహాబలః, 78
ప్రసాద్య సహసా నీతో భవనం స్వం నిశాచరః.

ప్ర. అ. తతః=అటు పిమ్మట, మహాబలః=గొప్ప బలము గల, సః నిశాచరః=ఆ రావణుడు, సమేతాభిః=కలిసిన, తాభిః నారీభిః=ఆ స్త్రీల చేత, ప్రసాద్య=అనుగ్రహింపచేసికొని, సహసా=శీఘ్రముగా, స్వం భవనమ్=తన భవనమును గూర్చి, నీతః=తీసికొనివెళ్ళబడినాడు.

తా. పిమ్మట ఆ స్త్రీలందరు కలిసి మహాబలవంతుడైన ఆ రాక్షసుని అనుగ్రహింపచేసికొని వెంటనే గృహములోనికి తీసికొని వెళ్ళిరి. 78

మూ. యాతే తస్మిన్ దశగ్రీవే రాక్షస్యో వికృతాననాః, 79
సీతాం నిర్భర్త్సయామాసుర్వాక్యైః క్రూరైః సుదారుణైః.

ప్ర. అ. తస్మిన్ దశగ్రీవే=ఆ రావణుడు, యాతే=వెళ్ళినవాడగు చుండగా, వికృతాననాః=వికృతమైన ముఖములు గల, రాక్షస్యః=రాక్షస స్త్రీలు, క్రూరైః=క్రూరములు, సుదారుణైః=చాల దారుణములు అయిన, వాక్యైః=మాటలతో, సీతామ్=సీతను, నిర్భర్త్సయామాసుః=భయపెట్టిరి.

తా. ఆ రావణుడు వెళ్ళిపోయిన పిదప, వికృతములైన ముఖములు గల రాక్షసస్త్రీలు, క్రూరములు, చాలా దారుణములు అయిన మాటలతో సీతను భయపెట్టిరి. 79

మూ. తృణవద్భాషితం తాసాం గణయామాస జానకీ, 80
గర్జితం చ తదా తాసాం సీతాం ప్రాప్య నిరర్థకమ్.

ప్ర. అ. జానకీ=సీత, తాసామ్=ఆ స్త్రీలయొక్క, భాషితమ్=భాషణమును, తృణవత్=గడ్డిపరకను వలె, గణయామాస=పరిగణించెను, తదా=అప్పుడు, తాసామ్=ఆ రాక్షసస్త్రీలయొక్క, గర్జితమ్=గర్జనము, సీతామ్=సీతను, ప్రాప్య=పొంది, నిరర్థకమ్=వ్యర్థమైనది.

తా. జానకి ఆ రాక్షసస్త్రీల మాటలను గడ్డిపరకవలె నిర్లక్ష్యము చేసెను. ఆ స్త్రీల గర్జనలన్నీ సీత విషయములో వ్యర్థమైనవి. 80

మూ. వృథాగర్జితనిశ్చేష్టా రాక్షస్యః పిశితాశనాః, 81
రావణాయ శశంసుస్తాః సీతాధ్యవసితం మహత్.

ప్ర. అ. పిశితాశనాః=పచ్చి మాంసము తిను, తాః రాక్షస్యః=ఆ రాక్షసస్త్రీలు, వృథాగర్జితనిశ్చేష్టాః=వ్యర్థమైన గర్జితము కలవారగుటచే నిశ్చేష్ట లై, మహత్=గొప్పదైన, తత్=ఆ, సీతాధ్యవసితమ్=సీత నిర్ణయమును, రావణాయ=రావణునకు, శశంసుః=చెప్పిరి.

తా. పచ్చి మాంసము తినే ఆ రాక్షసస్త్రీలు తమ గర్జనలు వ్యర్థమగుటచే ఏమీ చేయజాలక, గొప్పదైన ఆ సీత నిశ్చయమును రావణునకు తెలిపిరి. 81

మూ. తతస్తాః సహితాః సర్వా విహతాశా నిరుద్యమాః, 82
పరిక్షిప్య సమన్తాత్తాం నిద్రావశముపాగతాః.

ప్ర. అ. తతః=అటు పిమ్మట, సర్వాః=సమస్తమైన, తాః=ఆ స్త్రీలు, సహితాః=కలిసినవారై, విహతాశాః=హతాశులై, నిరుద్యమాః=ప్రయత్నము లేనివారై, తామ్=సీతను, సమన్తాత్=అంతట, పరిక్షిప్య=చుట్టుకొని, నిద్రావశమ్=నిద్రావశమును, ఉపాగతాః=పొందినారు.

తా. పిమ్మట ఆ స్త్రీలందరు కలిసి, సీత మనస్సు మార్చే ఆశను వదలుకొని, ఆ ప్రయత్నము మానివేసి, సీత చుట్టూ పండుకొని నిద్రించిరి.82

మూ. తాసు చైవ ప్రసుప్తాసు సీతా భర్తృహితే రతా, 83
విలప్య కరుణం దీనా ప్రశుశోచ సుదుఃఖితా.

ప్ర. అ. తాసు=ఆ స్త్రీలు, ప్రసుప్తాసు=నిద్రించినవారగుచుండగా, భర్తృహితే=భర్తయొక్క హితమునందు, రతా=ఆసక్తి గల, సీతా=సీత, దీనా=దీనురాలై, కరుణమ్=జాలి కలుగునట్లుగా, విలప్య=విలపించి, సుదుఃఖితా=చాల దుఃఖించినదై, ప్రశుశోచ=ఎక్కువగా ఏడ్చెను.

తా. ఆ రాక్షసస్త్రీలు నిద్రపోయిన పిమ్మట, భర్త హితమునే కోరు ఆ సీత దీనురాలై జాలి గలుగునట్లు విలపించి, చాల దుఃఖించుచు అధికముగా ఏడ్చెను. 83

మూ. తాసాం మధ్యాత్సముత్థాయ త్రిజటా వాక్యమబ్రవీత్, 84
ఆత్మానం ఖాదత క్షిప్రం న సీతా వినశిష్యతి,
జనకస్యాత్మజా సాధ్వీ స్నుషా దశరథస్య చ. 85

ప్ర. అ. తాసామ్=ఆ రాక్షసస్త్రీలయొక్క, మధ్యాత్=మధ్యనుండి, సముత్థాయ=లేచి, త్రిజటా=త్రిజట, వాక్యమ్=వాక్యమును, అబ్రవీత్=పలికెను. క్షిప్రమ్=శీఘ్రముగా, ఆత్మానమ్=మిమ్ములనే, ఖాదత=తినండి. జనకస్య=జనకు

నియొక్క, ఆత్మజా=కూతురు, సాధ్వీ=పతివ్రత, దశరథస్య=దశరథునియొక్క, స్నుషా=కోడలు అయిన, సీతా=సీత, న వినశిష్యతి=నశించదు.

తా. ఆ రాక్షసస్త్రీల మధ్యలోనుండి త్రిజట అను రాక్షసి లేచి ఇట్లు పలికెను. మిమ్ములను మీరే శీఘ్రముగా తినండి. జనకుని కూతురు, పతివ్రత, దశరథుని కోడలు అయిన సీత మాత్రము నశించదు. 84, 85

మూ. స్వప్నో హ్యద్య మయా దృష్టో దారుణో రోమహర్షణః,
రక్షసాం చ వినాశాయ భర్తురస్యా జయాయ చ. 86

ప్ర. అ. రక్షసామ్=రాక్షసులయొక్క, వినాశాయ చ=నాశనమునకు, అస్యాః=ఈమె యొక్క, భర్తుః=భర్తయొక్క, జయాయ చ=జయము కొరకు, అద్య=ఇప్పుడు, మయా=నాచేత, దారుణః=భయంకరము, రోమహర్షణః=రోమాంచము కలిగించునదీ అయిన, స్వప్నః=స్వప్నము, దృష్టః=చూడబడినది.

తా. ఇప్పుడు నాకు ఒక భయంకరమైన, గగుర్పాటు కలిగించే స్వప్నము వచ్చినది. అది రాక్షసుల నాశమును, ఈమె భర్త విజయమును సూచించుచున్నది.

మూ. అలమస్మాత్పరిత్రాతుం రాఘవాద్రాక్షసీగణమ్,
అభియాచామ వైదేహీమేతద్ధి మమ రోచతే. 87

ప్ర. అ. అస్మాత్=ఈ, రాఘవాత్=రామునినుండి, రాక్షసీగణమ్=రాక్షస స్త్రీల సముదాయమును, పరిత్రాతుమ్=రక్షించుటకు, అలమ్=(ఈమె) చాలును, వైదేహీమ్=సీతను, అభియాచామ=ప్రార్థించెదము, ఏతత్=ఇది, మమ=నాకు, రోచతే హి=ఇష్టమగుచున్నది కదా !

తా. ఈ సీతను ప్రార్థించెదము. ఈమె రామునినుండి, రాక్షసస్త్రీల నందరిని రక్షింప సమర్థురాలు. నాకు ఇట్లు చేయుట మంచిదని తోచుచున్నది.87

మూ. యస్యా హ్యేవంవిధః స్వప్నో దుఃఖితాయాః ప్రదృశ్యతే,
సా దుఃఖైర్వివిధైర్ముక్తా సుఖమాప్నోత్యనుత్తమమ్. 88
ప్రణిపాతప్రసన్నా హి మైథిలీ జనకాత్మజా.

ప్ర. అ. యస్యాః=ఏ స్త్రీ, దుఃఖితాయాః=దుఃఖితురాలై ఉండగా, ఏవంవిధః=ఈ విధమైన, స్వప్నః=స్వప్నము, ప్రదృశ్యతే=చూడబడునో, సా=ఆమె, వివిధైః=అనేకవిధములైన, దుఃఖైః=దుఃఖములచే, విముక్తా=విడువబడినదై, అనుత్తమమ్=అత్యధికమైన, సుఖమ్=సుఖమును, ఆప్నోతి=పొందును. జనకాత్మజా=జనకుని కూతురైన, మైథిలీ=సీత, ప్రణిపాతప్రసన్నా హి=నమస్కారము చేయుటచే ప్రసన్నురాలగును కదా.

తా. ఏ స్త్రీ దుఃఖితురాలై యుండగా ఇట్టి స్వప్నము కనబడునో, ఆమె దుఃఖములను వీడి సుఖము పొందును. సీత నమస్కారము చేసినంత మాత్రముననే ప్రీతినొందును. 88

మూ. తతః సా హ్రీమతీ బాలా భర్తుర్విజయహర్షితా, 89
అవోచద్యది తత్తథ్యం భవేయం శరణం హి వః.

ప్ర. అ. తతః=అటు పిమ్మట, హ్రీమతీ=సిగ్గుపడుచున్న, బాలా=చిన్న వయస్సు గల, సా=ఆ సీత, భర్తుః=భర్త యొక్క, విజయహర్షితా=విజయముచేత సంతోషించినదై, అవోచత్=పలికెను. తత్=అది, తథ్యం యది=సత్యమే అయినచో, వః=మీకు, శరణమ్=శరణము, భవేయమ్=అగుదును.

తా. తన భర్తకు విజయము కలుగునని వినగానే సంతోషించుచు చిన్న వయస్సులో ఉన్న ఆ సీత, సిగ్గుపడుచు- "అది సత్యమే అయినచో మిమ్ములనందరినీ రక్షించెదను" అని పలికెను.

వి. త్రిజటాస్వప్న వృత్తాంతమును వర్ణించిన 27వ సర్గలో సీత ఈ విధముగా అన్నట్లు లేదు. గోరఖ్‌పూర్ ప్రతిలో మాత్రం ఈ శ్లోకమే 27వ సర్గ చివర కూడా ఉన్నది. ప్రాచ్యపాఠంలో అసలు హనుమంతుడు త్రిజటా స్వప్న వృత్తాంతమును జాంబవదాదులకు చెప్పినట్లే లేదు. సీత ఇట్లు అన్నట్లు లేకుండా ఉంటేనే ఉచితముగా ఉంటుంది. 28వ సర్గలో సీత ప్రాణపరిత్యాగోద్యమం చేసినట్లు వర్ణించిన తీరును పట్టి చూడగా ఆ రాక్షసస్త్రీలు ఏమి మాటలాడుకుంటున్నారో సీత ఏ మాత్రము విన్నట్లు కనపడదు. అదే ఉచితము. 89

మూ. తాం చాహం తాదృశీం దృష్ట్వా సీతాయా దారుణాం దశామ్,
చిన్తయామాస విశ్రాన్తో న చ మే నిర్వృతం మనః. 90

ప్ర. అ. అహమ్=నేను, విశ్రాన్తః=విశ్రమించిన వాడనై, సీతాయాః=సీత యొక్క, తాదృశీమ్=అట్టి, తామ్=ఆ, దారుణామ్=దారుణ మైన, దశామ్=అవస్థను, దృష్ట్వా=చూచి, చిన్తయామాస=ఆలోచించితిని. మే=నాయొక్క, మనః=మనస్సు, న నిర్వృతమ్=ఊరటచెందలేదు.

తా. నేను కొంతసేపు విశ్రమించి సీతకు సంభవించిన దారుణమైన అట్టి అవస్థను చూచి, ఏమి చేయవలెనా అని ఆలోచించితిని. కాని నా మనస్సుకు ఊరట లభించలేదు. 90

మూ. సంభాషణార్థం చ మయా జానక్యాశ్చిన్తితో విధిః, 91
ఇక్ష్వాకూణాం హి వంశస్తు తతో మమ పురస్కృతః.

ప్ర. అ. మయా=నాచేత, జానక్యాః=జానకియొక్క, సంభాషణార్థమ్=సంభాషణముకొఱకు, విధిః=ఉపాయము, చిన్తితః=ఆలోచించబడినది. తతః=పిమ్మట, ఇక్ష్వాకూణామ్=ఇక్ష్వాకువంశ రాజుల, వంశస్తు=వంశము, మమ=నాకు (నాచే), పురస్కృతః=ముందు ఉంచబడినది.

తా. జానకితో సంభాషణ చేయుటకు ఉపాయమును గూర్చి ఆలోచించి, నేను ఇక్ష్వాకువంశీయుల చరిత్రను ప్రారంభములో వర్ణించితిని. 91

మూ. శ్రుత్వా తు గదితాం వాచం రాజర్షిగణపూజితామ్, 92
ప్రత్యభాషత మాం దేవీ బాష్పైః పిహితలోచనా.

ప్ర. అ. దేవీ=దేవి యైన సీత, రాజర్షిగణపూజితామ్=రాజర్షుల సముదాయముచేత పూజింపబడిన, గదితామ్=నాచే పలకబడిన, వాచమ్=వాక్కును, శ్రుత్వా=విని, బాష్పైః=కన్నీళ్ళచేత, పిహితలోచనా=కప్పబడిన నేత్రములు గలదై, మామ్=నన్ను గూర్చి, ప్రత్యభాషత=తిరిగి పలికెను.

తా. రాజర్షి సముదాయముచేత ఆదరించబడు నేను పలికిన మాటలు విని, సీతాదేవి కన్నీళ్లు కప్పిన కళ్లతో, నాతో ఇట్లు పలికెను. 92

మూ. కస్త్వం కేన కథం చేహ ప్రాప్తో వానరపుఙ్గవ, 93
కా చ రామేణ తే ప్రీతిస్తన్మే శంసితుమర్హసి.

ప్ర. అ. వానరపుఙ్గవ=ఓ ! వానర శ్రేష్ఠా ! త్వమ్=నీవు, కః=ఎవ్వడవు? కేన=ఏ కారణముచేత, కథమ్=ఎట్లు, ఇహ=ఇక్కడికి, ప్రాప్తః=వచ్చినావు? తే=నీకు, రామేణ=రామునితో, ప్రీతిః=స్నేహము, కా=ఏమిటి? తత్=దానిని, మే=నాకు, శంసితుమ్=చెప్పుటకు, అర్హసి=తగియున్నావు.

తా. ఓ ! వానరశ్రేష్ఠా ! నీవు ఎవ్వడవు? ఎందుకు వచ్చినావు? ఎట్లు వచ్చినావు? నీకు రామునితో స్నేహము ఎట్లు ఏర్పడినది? దీని నంతను నాకు చెప్పుము. 93

మూ. తస్యాస్తద్వచనం శ్రుత్వా హ్యహమప్యబ్రువం వచః, 94
దేవి రామస్య భర్తుస్తే సహాయో భీమవిక్రమః,
సుగ్రీవో నామ విక్రాన్తో వానరేన్ద్రో మహాబలః. 95

ప్ర. అ. తస్యాః=ఆమెయొక్క, తత్ వచనమ్=ఆ వచనమును, శ్రుత్వా=విని, అహమపి=నేను, వచః=వచనమును, అబ్రువమ్=పలికితిని. దేవి=ఓ ! దేవీ! తే=నీయొక్క, భర్తుః=భర్తయొక్క, సహాయః=సహాయుడు, మహాబలః=గొప్ప బలము కలవాడు, భీమవిక్రమః=భయంకరమైన పరాక్రమము కలవాడు, సుగ్రీవో నామ=సుగ్రీవుడను పేరు గలవాడు అయిన, విక్రాన్తః=పరాక్రమవంతుడైన, వానరేన్ద్రః=వానర శ్రేష్ఠుడు ఉన్నాడు.

తా. ఆమె మాటలు విని నేను ఇట్లు పలికితిని. "దేవీ ! నీ భర్తయైన రామునకు సహాయభూతుడు, భయంకరమైన పరాక్రమము కలవాడు, మహా బలశాలి, పరాక్రమమును చూపువాడు అయిన సుగ్రీవుడను వానరరాజు ఉన్నాడు." 94, 95

మూ. తస్య మాం విద్ధి భృత్యం త్వం హనుమన్తమిహాగతమ్.
భర్త్రాఽహం ప్రేషితస్తుభ్యం రామేణాక్లిష్టకర్మణా. 96

ప్ర. అ. ఇహ=ఇక్కడికి, ఆగతమ్=వచ్చిన, మామ్=నన్ను, తస్య=ఆ సుగ్రీవునియొక్క, భృత్యమ్=భృత్యునిగా, త్వమ్=నీవు, విద్ధి=తెలుసుకొనుము, అహమ్=నేను, భర్త్రా=నీ భర్త యైన, అక్లిష్టకర్మణా=శ్రమ చెందకుండ పనులు చేయు, రామేణ=రామునిచేత, తుభ్యమ్=నీ కొరకు, ప్రేషితః=పంపబడితిని.

తా. ఇక్కడకు వచ్చిన నేను ఆ సుగ్రీవుని భృత్యుడను. నీ భర్తయైన, శ్రమపడకుండా కార్యము నిర్వహించు రాముడు నీ నిమిత్తమై నన్నిచటికి పంపినాడు. 96

మూ. ఇదం చ పురుషవ్యాఘ్రః శ్రీమాన్ దాశరథిః స్వయమ్,
అఙ్గులీయమభిజ్ఞానమదాత్తుభ్యం యశస్విని. 97

ప్ర. అ. యశస్విని=కీర్తిమంతురాలా ! పురుషవ్యాఘ్రః=పురుషశ్రేష్ఠుడు, శ్రీమాన్=శ్రీమంతుడు అయిన, దాశరథిః=రాముడు, స్వయమ్=స్వయముగా, ఇదమ్=ఈ, అఙ్గులీయమ్=ఉంగరమును, తుభ్యమ్=నీకు, అభిజ్ఞానమ్=ఆనవాలుగా, అదాత్=ఇచ్చెను.

తా. కీర్తిమంతురాలా ! పురుషశ్రేష్ఠుడు లక్ష్మీసంపన్నుడు, అయిన రాముడు ఈ ఉంగరమును నీకు ఆనవాలుగా, స్వయముగా ఇచ్చినాడు. 97

మూ. తదిచ్ఛామి త్వయాజ్ఞప్తం దేవి కిం కరవాణ్యహమ్,
రామలక్ష్మణయోః పార్శ్వం నయామి త్వాం కిముత్తరమ్. 98

ప్ర. అ. దేవి=ఓ ! దేవీ ! తత్=ఆ కారణమువలన, త్వయా=నీచేత, ఆజ్ఞప్తమ్=ఆజ్ఞాపనను, ఇచ్ఛామి=కోరుచున్నాను. అహమ్=నేను, కిమ్=ఏమి, కరవాణి=చేయుదును ? త్వామ్=నిన్ను, రామలక్ష్మణయోః=రామలక్ష్మణు లయొక్క, పార్శ్వమ్=పార్శ్వమును గూర్చి, నయామి=తీసికొని వెళ్ళెదను, ఉత్తరమ్=ప్రత్యుత్తరము, కిమ్=ఏమి ?

తా. దేవీ ! ఆ కారణముచే నేనేమి చేయవలెనో ఆజ్ఞాపించుము. నిన్ను రామలక్ష్మణుల దగ్గరకు తీసికొనివెళ్లెదను. నీవేమందువు ? 98

మూ. ఏతచ్ఛ్రుత్వా విదిత్వా చ సీతా జనకనన్దినీ,
ఆహ రావణముత్సాద్య రాఘవో మాం నయత్వితి. 99

ప్ర. అ. జనకనన్దినీ=జనకుని కుమార్తె యైన, సీతా=సీత, ఏతత్=ఈ మాటను, శ్రుత్వా=విని, విదిత్వా చ=తెలుసుకొని, రాఘవః=రాముడు, రావణమ్= రావణుని, ఉత్సాద్య=చంపి, మామ్=నన్ను, నయతు=తీసికొనివెళ్లుగాక, ఇతి=అని, ఆహ=పలికెను.

తా. జనకుని కుమార్తె యైన సీతాదేవి నా మాటలు విని, విషయమును గ్రహించి- "రాముడు రావణుని సంహరించి నన్ను తీసికొనివెళ్ళవలెను" అని పలికెను. 99

మూ. ప్రణమ్య శిరసా దేవీమహమార్యామనిన్దితామ్,
రాఘవస్య మనోహ్లాదమభిజ్ఞానమయాచిషమ్. 100

ప్ర. అ. అహమ్=నేను, ఆర్యామ్=పూజ్యురాలు, అనిన్దితామ్=నిందింపబ డనిది అయిన, దేవీమ్=సీతాదేవిని, శిరసా=శిరస్సుతో, ప్రణమ్య=సమస్కరించి, రాఘవస్య=రామునకు, మనోహ్లాదమ్=మనస్సుకు ఆనందము కలిగించు, అభిజ్ఞా నమ్=ఆనవాలును, అయాచిషమ్=కోరితిని.

తా. నేను పూజ్యురాలు, ఎట్టి దోషములూ లేనిదీ అయిన సీతాదేవికి శిరస్సు వంచి నమస్కరించి, రాముని మనస్సుకు ఆహ్లాదము కలిగించు ఆనవాలు ఏదైనా ఇమ్మని ఆమెను ప్రార్థించితిని. 100

మూ. అథ మామబ్రవీత్సీతా గృహ్యతామయముత్తమః,
మణిర్యేన మహాబాహూ రామస్త్వాం బహుమన్యతే. 101

ప్ర. అ. అథ=పిమ్మట, సీతా=సీత, మామ్=నన్ను గూర్చి, అబ్ర వీత్=పలికెను. ఉత్తమః=ఉత్తమమైన, అయమ్=ఈ, మణిః=మాణిక్యము,

గృహ్యతామ్=గ్రహించబడుగాక, యేన=దేనిచేత, మహాబాహుః=గొప్ప బాహువులు గల, రామః=రాముడు, త్వామ్=నిన్ను, బహుమన్యతే=గౌరవించునో.

తా. పిమ్మట సీతాదేవి నాతో ఇట్లు పలికెను. "ఉత్తమమైన ఈ మణిని తీసికొనుము. దీనిని చూచి, మహాబాహువైన రాముడు నిన్ను ఆదరించగలడు".

మూ. ఇత్యుక్త్వా తు వరారోహా మణిప్రవరమద్భుతమ్,
ప్రాయచ్ఛత్పరమోద్విగ్నా వాచా మాం సందిదేశ హ. 102

ప్ర. అ. వరారోహా=శ్రేష్ఠమైన కటిప్రదేశము గల ఆ సీతాదేవి, ఇతి=ఇట్లు, ఉక్త్వా=పలికి, అద్భుతమ్=ఆశ్చర్యకరమైన, మణిప్రవరమ్=శ్రేష్ఠమైన మాణిక్యమును, ప్రాయచ్ఛత్=ఇచ్చెను. పరమోద్విగ్నా=మిక్కిలి దిగులు చెందినదై, మామ్=నన్ను, వాచా=వాక్కుతో, సందిదేశ హ=సందేశము నిచ్చి పంపెను.

తా. శ్రేష్ఠమైన కటిప్రదేశము గల సీతాదేవి ఇట్లు పలికి, ఆశ్చర్యకరమైన ఉత్తమమైన మాణిక్యమును ఇచ్చెను. చాల దిగులు చెందినదై, మాటలతో కూడ నాకు సందేశము నిచ్చెను. 102

మూ. తతస్తస్యై ప్రణమ్యాహం రాజపుత్ర్యై సమాహితః,
ప్రదక్షిణం పరిక్రామమిహాభ్యుద్గతమానసః. 103

ప్ర. అ. తతః=అటుపిమ్మట, అహమ్=నేను, తస్యై=ఆ, రాజపుత్ర్యై=రాజ కుమారికి, ప్రణమ్య=నమస్కరించి, సమాహితః=సావధానచిత్తుడనై, ఇహ=ఇక్కడికి, అభ్యుద్గతమానసః=వెళ్ళిన మనస్సు కలవాడనై, ప్రదక్షిణమ్=ప్రదక్షిణముగా, పరిక్రామమ్=నడచితిని.

తా. పిమ్మట నేను సావధానచిత్తముతో రాజపుత్రియైన సీతకు నమస్కరించి, మనస్సు ఇక్కడికి బయలు దేరి రాగా, ఆమెకు ప్రదక్షిణము చేసితిని. 103

మూ. ఉక్తోఽహం పునరేవేదం నిశ్చిత్య మనసా తయా,
హనుమన్ మమ వృత్తాన్తం వక్తుమర్హసి రాఘవే. 104

ప్ర. అ. అహమ్=నేను, తయా=ఆమెచేత, మనసా=మనస్సుతో, నిశ్చిత్య=నిశ్చయించి, పునరేవ=మరల, ఉక్తః=పలకబడితిని. హనుమన్=హనుమంతుడా ! రాఘవే=రామునియందు (రామునకు), మమ=నాయొక్క, వృత్తాన్తమ్=వృత్తాంతమును, వక్తుమ్=చెప్పుటకు, అర్హసి=తగియున్నావు.

తా. ఆమె మనస్సులో ఏదో నిశ్చయించుకొని మరల నాతో ఇట్లు పలికెను. హనుమంతుడా ! రామునకు నా వృత్తాంతమంతా చెప్పుము. 104

మూ. యథా శ్రుత్వైవ న చిరాత్తావుభౌ రామలక్ష్మణౌ,
సుగ్రీవసహితౌ వీరావుపేయాతాం తథా కురు. 105

ప్ర. అ. వీరౌ=వీరులైన, తౌ=ఆ, రామలక్ష్మణౌ=రామలక్ష్మణులు, ఉభౌ=ఇద్దరూ, శ్రుత్వైవ=వినగానే, సుగ్రీవసహితౌ=సుగ్రీవసహితులై, న చిరాత్=శీఘ్రముగా, యథా=ఎట్లు, ఉపేయాతామ్=వచ్చెదరో, తథా=అట్లు, కురు=చేయుము.

తా. వీరులైన ఆ రామలక్ష్మణులిద్దరూ విన్న వెంటనే సుగ్రీవునితో కలిసి ఇక్కడికి వచ్చునట్లు చేయుము. 105

మూ. యద్యన్యథా భవేదేతద్ద్వౌ మాసౌ జీవితం మమ,
న మాం ద్రక్ష్యతి కాకుత్థ్సో మ్రియే సాహమనాథవత్. 106

ప్ర. అ. అన్యథా=మరొక విధముగా, భవేద్యది=అయినట్లయితే, మమ=నాయొక్క, జీవితమ్=జీవితము, ద్వౌ=రెండు, మాసౌ=మాసములు మాత్రమే, కాకుత్థ్సః=రాముడు, మామ్=నన్ను, న ద్రక్ష్యతి=చూడడు. సా అహమ్=అట్టి నేను, అనాథవత్=నాథుడు లేనిదాని వలె, మ్రియే=మరణించెదను.

తా. రామలక్ష్మణులు రాకున్నచో నా జీవితము రెండుమాసములు మాత్రమే ఉండును. అటుపై రాముడు నన్ను చూడజాలడు. అట్టి నేను అనాథురాలను వలె మరణించెదను. 106

మూ. తచ్ఛ్రుత్వా కరుణం వాక్యం క్రోధో మామభ్యవర్తత,
ఉత్తరం చ మయా దృష్టం కార్యశేషమనంతరమ్. 107

ప్ర. అ. కరుణమ్=దీనమైన, తత్=ఆ, వాక్యమ్=వాక్యమును, శ్రుత్వా=విని, మామ్=నన్ను, క్రోధః=కోపము, అభ్యవర్తత=వ్యాపించెను. ఉత్తరమ్=అటుపిమ్మట, అనన్తరమ్=తరువాత చేయదగిన, కార్యశేషమ్=కార్యము యొక్క శేషము, మయా=నాచేత, దృష్టమ్=చూడబడినది.

తా. జాలిగొలుపు ఆ మాట వినగానే నాకు చాల కోపము కలిగెను. పిమ్మట (నేను) తరువాత చేయవలసిన, మిగిలిపోయిన పనిని గూర్చి ఆలోచించితిని. 107

మూ. తతోఽవర్ధత మే కాయస్తదా పర్వతసన్నిభః,
యుద్ధకాంక్షీ వనం తచ్చ వినాశయితుమారభే. 108

ప్ర. అ. తతః=అటు పిమ్మట, తదా=అప్పుడు, మే=నాయొక్క, కాయః=శరీరము, పర్వతసంనిభః=పర్వతముతో సమానమై, అవర్ధత=పెరిగెను.

యుద్ధకాఙ్క్షీ=యుద్ధమును కోరుచున్నవాడనై, తత్=ఆ, వనమ్=వనమును, వినాశయితుమ్=నశింపచేయుటకు, ఆరభే=ప్రారంభించితిని.

తా. అప్పుడు నా శరీరము పర్వతముతో సమానముగా పెరిగెను. యుద్ధము కోరుచు ఆ వనమును నశింపచేయుటకు ప్రారంభించితిని. 108

మూ. తద్భగ్నం వనషణ్డం తు భ్రాన్తత్రస్తమృగద్విజమ్,
ప్రతిబుద్ధా నిరీక్షన్తే రాక్షస్యో వికృతాననాః. 109

ప్ర. అ. వికృతాననాః=వికృతములైన ముఖములు గల, రాక్షస్యః=రాక్షస స్త్రీలు, ప్రతిబుద్ధాః=మేల్కొన్నవారై, భగ్నమ్=విరగగొట్టబడినది, భ్రాన్తత్రస్తమృగద్విజమ్=తిరుగుచున్న, భయపడిన మృగములు పక్షులు కలది అయిన, తత్=ఆ, వనషణ్డమ్=వృక్షసముదాయమును, నిరీక్షన్తే=చూచిరి.

తా. వికృతములైన ముఖములు గల రాక్షసస్త్రీలు నిద్రనుండి లేచి, భయముతో పారిపోవుచున్న మృగములు, పక్షులు గల విరగగొట్టబడిన వనమును చూచిరి. 109

మూ. మాం చ దృష్ట్వా వనే తస్మిన్ సమాగమ్య తతస్తతః,
తాః సమభ్యాగతాః క్షిప్రం రావణాయాచచక్షిరే. 110

ప్ర. అ. తతస్తతః=ఆ యా ప్రదేశమునుండి, సమాగమ్య=వచ్చి, తస్మిన్ వనే=ఆ వనమునందు, మామ్=నన్ను, దృష్ట్వా=చూచి, తాః=ఆ స్త్రీలు, క్షిప్రమ్=శీఘ్రముగా, సమభ్యాగతాః=వెళ్ళినవారై, రావణాయ=రావణునకు, ఆచచక్షిరే=చెప్పిరి.

తా. ఆ రాక్షసస్త్రీలు ఆయా ప్రదేశములనుండి వచ్చి, వనములో నన్ను చూచి, వెంటనే వెళ్ళి రావణునకు చెప్పిరి. 110

మూ. రాజన్వనమిదం దుర్గం తవ భగ్నం దురాత్మనా,
వానరేణ హ్యవిజ్ఞాయ తవ వీర్యం మహాబల. 111

ప్ర. అ. మహాబల=గొప్ప బలము గల, రాజన్=రాజా ! దురాత్మనా=దుర్బుద్ధియైన, వానరేణ=వానరునిచేత, తవ=నీయొక్క, వీర్యమ్=పరాక్రమమును, అవిజ్ఞాయ=తెలియక, దుర్గమ్=ప్రవేశింప శక్యము కాని, తవ=నీయొక్క, ఇదం వనమ్=ఈ వనము, భగ్నమ్=విరుగగొట్టబడినది.

తా. మహాబలవంతుడవైన ఓ ! రాజా ! దురాత్ముడైన వానరుడు, నీ పరాక్రమమును గూర్చి తెలియక ప్రవేశింప శక్యము కాని నీ ఉద్యానమును విరచివేసినాడు. 111

మూ. దుర్బుద్ధేస్తస్య రాజేన్ద్ర తవ విప్రియకారిణః,
వధమాజ్ఞాపయ క్షిప్రం యథాసౌ విలయం వ్రజేత్. 112

ప్ర. అ. రాజేన్ద్ర=మహారాజా ! అసౌ=ఈ వానరుడు, యథా=ఎట్లు, విలయమ్=నాశమును, వ్రజేత్=పొందునో అట్లు, తవ=నీకు, విప్రియకారిణః= అపకారముచేసిన, దుర్బుద్ధేః=దుర్బుద్ధియైన, తస్య=వానియొక్క, వధమ్=వధను, క్షిప్రమ్=శీఘ్రముగా, ఆజ్ఞాపయ=ఆజ్ఞాపించుము.

తా. మహారాజా ! నీకు అపకారము చేసిన ఆ దుర్బుద్ధి గల వానరుడు నాశనమును పొందునట్లు వెంటనే వానిని సంహరించుటకై ఆజ్ఞాపించుము.

మూ. తచ్ఛ్రుత్వా రాక్షసేన్ద్రేణ విసృష్టా భృశదుర్జయాః,
రాక్షసాః కింకరా నామ రావణస్య మనోనుగాః. 113

ప్ర. అ. తత్=ఆ వాక్యమును, శ్రుత్వా=విని, రాక్షసేన్ద్రేణ=రావణుని చేత, భృశదుర్జయాః=మిక్కిలి జయింప శక్యము కాని, రావణస్య=రావణునియొక్క, మనోనుగాః=మనస్సును అనుసరించిన, కింకరా నామ=కింకరులను పేరు గల, రాక్షసాః=రాక్షసులు, విసృష్టాః=పంపబడినారు.

తా. రావణుడు ఆ మాటలు విని, తన మనస్సును అనుసరించి ప్రవర్తించువారు, జయింప శక్యము కానివారు అయిన కింకరు లను రాక్షసులను పంపెను. 113

మూ. తేషామశీతిసాహస్రం శూలముద్గరపాణినామ్,
మయా తస్మిన్వనోద్దేశే పరిఘేణ నిషూదితమ్. 114

ప్ర. అ. తస్మిన్=ఆ, వనోద్దేశే=వనప్రదేశమునందు, శూలముద్గరపాణి నామ్=శూలములు, ముద్గరములు, హస్తములందు గల, తేషామ్=ఆ కింకరుల యొక్క, అశీతిసాహస్రమ్=ఎనుబది వేలు, మయా=నాచేత, పరిఘేణ=పరిఘచేత, నిషూదితమ్=నశింపచేయబడినది.

తా. నేను ఆ వనమునందు, శూలములు, ముద్గరములు ధరించి వచ్చిన ఆ ఎనుబది వేల కింకరులను పరిఘతో చంపివేసితిని. 114

మూ. తేషాం తు హతశేషా యే తే గత్వా లఘువిక్రమాః,
నిహతం చ మహత్సైన్యం రావణాయాచచక్షిరే. 115

ప్ర. అ. తేషామ్=వారిలో, యే=ఎవరు,హతశేషాః=చంపగా మిగిలినవారో, తే=వారు, లఘువిక్రమాః=శీఘ్రగమనము కలవారై, గత్వా=వెళ్ళి, మహత్=గొప్ప,

సైన్యమ్=సైన్యమును, నిహతమ్=చంపబడినదానినిగా, రావణాయ=రావణునకు, ఆచచక్షిరే=చెప్పిరి.

తా. ఆ రాక్షసులలో చావగా మిగిలినవాళ్లు శీఘ్రముగా పరుగెత్తి వెళ్ళి "ఆ మహాసైన్యమంతా నశింపచేయబడినది" అని రావణునకు తెలిపిరి. 115

మూ. తతో మే బుద్ధిరుత్పన్నా చైత్యప్రాసాదమాక్రమమ్,
తత్రస్థాన్ రాక్షసాన్ హత్వా శతం స్తమ్భేన వై పునః, 116
లలామభూతో లఙ్కాయాః స వై విధ్వంసితో మయా.

ప్ర. అ. తతః=అటు పిమ్మట, మే=నాకు, బుద్ధిః=ఆలోచన, ఉత్పన్నా=పుట్టినది. చైత్యప్రాసాదమ్=చైత్యప్రాసాదమును, ఆక్రమమ్=ఆక్రమించితిని. స్తమ్భేన=స్తంభముచేత, తత్రస్థాన్=అక్కడ నున్న, శతమ్=నూరుగురు, రాక్షసాన్=రాక్షసులను, హత్వా=చంపి, పునః=మరల, మయా=నాచేత, లఙ్కాయాః=లంకయొక్క, లలామభూతః=అలంకారమైన, సః=ఆ ప్రాసాదము, విధ్వంసితః=నశింపచేయబడినది.

తా. అప్పుడు నాకు ఒక ఆలోచన కలిగినది. అక్కడ ఉద్యానములోని ప్రధానమైన ప్రాసాదమును (చైత్యప్రాసాదమును), ఆక్రమించి, అక్కడ నున్న రాక్షసులను స్తంభముతో చంపి, లంకకే అలంకారమైన ఆ ప్రాసాదమును నశింపచేసితిని. 116

మూ. తతః ప్రహస్తస్య సుతం జమ్బుమాలినమాదిశత్, 117
రాక్షసైర్బహుభిః సార్ధం ఘోరరూపైర్భయానకైః.

ప్ర. అ. తతః=అటు పిమ్మట, ఘోరరూపైః=ఘోరమైన రూపము గల, భయానకైః=భయంకరులైన, బహుభిః=అనేకులైన, రాక్షసైః సార్ధమ్=రాక్షసులతో కూడ, ప్రహస్తస్య=ప్రహస్తునియొక్క, సుతమ్=కుమారుడైన, జమ్బుమాలినమ్=జంబుమాలిని, ఆదిశత్=ఆజ్ఞాపించెను.

తా. పిమ్మట రావణుడు ఘోరములైన రూపములతో భయంకరులుగా ఉన్న అనేక రాక్షసులతో, ప్రహస్తుని కుమారుడైన జంబుమాలిని ఆజ్ఞాపించెను.

మూ. తం మహాబలసంపన్నం రాక్షసం రణకోవిదమ్, 118
పరిఘేణాతిఘోరేణ సూదయామి సహానుగమ్.

ప్ర. అ. మహాబలసంపన్నమ్=గొప్ప బలముతో కూడినవాడు, రణకోవిదమ్=యుద్ధమునందు ప్రవీణుడు అయిన, సహానుగమ్=అనుచరులతో కూడిన, తం రాక్షసమ్=ఆ రాక్షసుణ్ణి, ఘోరేణ=ఘోరమైన, పరిఘేణ=పరిఘచేత సూదయామి=నశింపచేసితిని.

తా. మహాబలవంతుడు, యుద్ధములో ప్రవీణుడు అయిన ఆ రాక్షసుని పరివారసహితముగ, భయంకరమైన పరిఘతో సంహరించితిని. 118

మూ. తచ్ఛ్రుత్వా రాక్షసేన్ద్రస్తు మన్త్రిపుత్రాన్ మహాబలాన్, 119
పదాతిబలసంపన్నాన్ ప్రేషయామాస రావణః.

ప్ర. అ. రాక్షసేన్ద్రః=రాక్షసప్రభువైన, రావణః=రావణుడు, మహాబలాన్=గొప్ప బలము గల, పదాతిబలసంపన్నాన్=కాలిబంటుల సైన్యముతో కూడిన, మన్త్రిపుత్రాన్=మంత్రికుమారులను, ప్రేషయామాస=పంపెను.

తా. రాక్షసాధిపతియైన రావణుడు ఆతని మరణమును విని, మహాబలవంతులైన మంత్రిపుత్రులను కాలిబంటుల సైన్యముతో పంపెను. 119

మూ. పరిఘేణైవ తాన్ సర్వాన్ నయామి యమసాదనమ్, 120
మన్త్రిపుత్రాన్ హతాఞ్ఛ్రుత్వా సమరే లఘువిక్రమాన్,
పఞ్చ సేనాగ్రగాన్ శూరాన్ ప్రేషయామాస రావణః. 121

ప్ర. అ. తాన్ సర్వాన్=వారినందరిని, పరిఘేణైవ=పరిఘచేతనే, యమసాదనమ్=యమగృహమును, నయామి=పొందించితిని. రావణః=రావణుడు, సమరే=యుద్ధమునందు, లఘువిక్రమాన్=శీఘ్రమైన పరాక్రమము గల, మన్త్రిపుత్రాన్=మంత్రిపుత్రులను, హతాన్=చంపబడినవారినిగా, శ్రుత్వా=విని, శూరాన్=శూరులైన, పఞ్చ=ఐదుగురు, సేనాగ్రగాన్=సేనానాయకులను, ప్రేషయామాస=పంపెను.

తా. నేను వారినందరినీ కూడ ఆ పరిఘతోనే చంపివేసితిని. రావణుడు శీఘ్రముగా పరాక్రమము చూపు ఆ మంత్రిపుత్రులు యుద్ధములో మరణించిరని విని, శూరులైన ఐదుగురు సేనానాయకులను పంపెను. 120, 121

మూ. తానహం సహసైన్యాన్వై సర్వానేవాభ్యసూదయమ్,
తతః పునర్దశగ్రీవః పుత్రమక్షం మహాబలమ్, 122
బహుభీ రాక్షసైః సార్ధం ప్రేషయామాస రావణః.

ప్ర. అ. అహమ్=నేను, సహసైన్యాన్=సైన్యముతో కూడిన, తాన్ సర్వాన్=ఆ మంత్రిపుత్రుల నందరినీ, అభ్యసూదయమ్=నశింపచేసితిని. తతః=అటు పిమ్మట, దశగ్రీవః=పది కంఠములు గల, రావణః=రావణుడు, మహాబలమ్=గొప్ప బలము గల, పుత్రమ్=పుత్రుడైన, అక్షమ్=అక్షుణ్ణి, బహుభిః=అనేకులైన, రాక్షసైః సార్ధమ్=రాక్షసులతో కూడ, ప్రేషయామాస=పంపెను.

తా. నేను సైన్యరహితముగా ఆ మంత్రిపుత్రుల నందరినీ చంపివేసితిని. అప్పుడు పది తలలు గల రావణుడు, మహాబలవంతుడు తన పుత్రుడు అయిన అక్షకుమారుని చాలా మంది రాక్షసులతో కూడ పంపెను. 122

మూ. తం తు మన్దోదరీపుత్రం కుమారం రణపణ్డితమ్, 123
సహసా ఖం సముత్క్రాన్తం పాదయోశ్చ గృహీతవాన్,
చర్మాసినం శతగుణం భ్రామయిత్వా వ్యపేషయమ్. 124

ప్ర. అ. రణపణ్డితమ్=రణమునందు పండితుడు, మన్దోదరీపుత్రమ్=మందోదరి కుమారుడు, ఖమ్=ఆకాశమును గూర్చి, ఉత్క్రాన్తమ్=ఎగిరినవాడు, చర్మాసినమ్=ఖడ్గము డాలు కలవాడు అయిన, తం కుమారమ్=ఆ అక్షకుమారుని, సహసా=హటాత్తుగా, పాదయోః=పాదములయందు, గృహీతవాన్=గ్రహించితిని. శతగుణమ్=నూరు పర్యాయములు, భ్రామయిత్వా=త్రిప్పి, వ్యపేషయమ్=పిండివేసితిని.

తా. మందోదరి పుత్రుడు, యుద్ధములో నేర్పు కలవాడు అయిన ఆ అక్షకుమారుడు కత్తి డాలు ధరించి ఆకాశము పైకి ఎగురగా హటాత్తుగా ఆతని పాదాలు పట్టుకొని, అనేక పర్యాయములు త్రిప్పి నేలకు వేసికొట్టి ముద్ద అగునట్లు చేసితిని. 123, 124

మూ. తమక్షమాగతం భగ్నం నిశమ్య స దశాననః,
తత ఇన్ద్రజితం నామ ద్వితీయం రావణః సుతమ్, 125
వ్యాదిదేశ సుసంక్రుద్ధో బలినమ్ యుద్ధదుర్మదమ్.

ప్ర. అ. దశాననః=పది ముఖములు గల, సః రావణః=ఆ రావణుడు, ఆగతమ్=యుద్ధానికి వచ్చిన, అక్షమ్=అక్షుణ్ణి, భగ్నమ్=చంపబడినవానినిగా, నిశమ్య=విని, సుసంక్రుద్ధః=చాల కోపించినవాడై, తతః=అటు పిమ్మట, బలినమ్=బలవంతుడు, యుద్ధదుర్మదమ్=యుద్ధమునందు పెద్దమదము కలవాడు అయిన, ఇన్ద్రజితం నామ=ఇంద్రజిత్తు అను, ద్వితీయమ్=మరియొక, సుతమ్=కుమారుని, వ్యాదిదేశ=ఆజ్ఞాపించెను.

తా. పది తలలు గల ఆ రావణుడు, యుద్ధమునందు, అక్షకుమారుడు మరణించినట్లు విని, చాల కోపించినవాడై, బలవంతుడు, యుద్ధములో పెద్ద అహంకారము గలవాడు అయిన ఇంద్రజిత్తు అను మరొక కుమారుని పంపెను.

మూ. తచ్చాప్యహం బలం సర్వం తం చ రాక్షసపుఙ్గవమ్, 126
నష్టౌజసం రణే కృత్వా పరం హర్షముపాగమమ్.

ప్ర. అ. అహమ్=నేను, సర్వమ్=సమస్తమైన, తత్=ఆ, బలం చ=సైన్యమును, తమ్=ఆ, రాక్షసపుఙ్గవం చ=రాక్షసశ్రేష్ఠుని, రణే=యుద్ధమునందు, నష్టౌజసమ్=నశించిన తేజస్సు కలుగునట్లు, కృత్వా=చేసి, పరమ్=అధికమైన, హర్షమ్=సంతోషమును, ఉపాగమమ్=పొందితిని.

తా. నేను యుద్ధములో ఆ సైన్యమునంతా జయించి, రాక్షసశ్రేష్ఠుడైన ఇంద్రజిత్తును కాంతి విహీనునిగా చేసి చాల సంతోషము పొందితిని. 126

మూ. మహతాపి మహాబాహుః ప్రత్యయేన మహాబలః, 127
ప్రేషితో రావణేనైవ సహ వీరైర్మదోత్కటైః.

ప్ర. అ. మహాబాహుః=గొప్ప బాహువులు కలవాడు, మహాబలః=గొప్ప బలము కలవాడు అయిన ఆ ఇంద్రజిత్తు, మదోత్కటైః=గర్వముచేత తీవ్రముగా ఉన్న, వీరైః సహ=వీరులతో కూడ, రావణేనైవ=రావణుని చేతనే, మహతా=గొప్పదైన, ప్రత్యయేన=నమ్మకముతో, ప్రేషితః=పంపబడెను.

తా. మహాబాహువు, మహాబలశాలీ అయిన ఆ ఇంద్రజిత్తును గర్వముతో తీవ్రస్వభావులైన వీరులతో కూడ, ఎంతో నమ్మకముతో రావణుడే పంపెను.

మూ. సోఽవిషహ్యం హి మాం బుద్ధ్వా స్వం బలం చావమర్దితమ్,
బ్రాహ్మేణాస్త్రేణ స తు మాం ప్రాబధ్నాచ్చాతివేగితః.

ప్ర. అ. సః=ఆ ఇంద్రజిత్తు, మామ్=నన్ను, అవిషహ్యమ్=సహింప శక్యము కానివానినిగా, బుద్ధ్వా=తెలుసుకొని, స్వమ్=తన సంబంధమైన, బలం చ=సైన్యమును కూడ, అవమర్దితమ్=నశింపచేయబడినదానినిగా తెలుసుకొని, స తు=అతడు, అతివేగితః=చాల వేగము కలవాడై, మామ్=నన్ను, బ్రాహ్మేణ అస్త్రేణ=బ్రహ్మాస్త్రముచేత, ప్రాబధ్నాత్=కట్టెను.

తా. ఆ ఇంద్రజిత్తు తన సైన్యము నశించిపోవుట చూచి, నేను ఎదిరింప శక్యము కానివాడను అను విషయము కూడా తెలుసుకొని, ఎక్కువ వేగమును చూపుచూ నన్ను బ్రహ్మాస్త్రముతో బంధించెను. 128

మూ. రజ్జుభిశ్చాభిబధ్నన్తి తతో మాం తత్ర రాక్షసాః, 129
రావణస్య సమీపం చ గృహీత్వా మాముపానయన్.

ప్ర. అ. తతః=అటు పిమ్మట, తత్ర=అక్కడ, రాక్షసాః=రాక్షసులు, మామ్=నన్ను, రజ్జుభిః=త్రాళ్లచేత, అభిబధ్నన్తి=బంధించిరి. మామ్=నన్ను, గృహీత్వా=పట్టుకొని, రావణస్య=రావణునియొక్క, సమీపమ్=సమీపమును, ఉపానయన్=పొందించిరి.

తా. పిమ్మట రాక్షసులు, అక్కడ నన్ను పట్టి, త్రాళ్ళతో కట్టి రావణుని దగ్గరకు తీసికొని వెళ్ళిరి. 129

మూ. దృష్ట్వా సంభాషితశ్చాహం రావణేన దురాత్మనా, 130
పృష్టశ్చ లఙ్కాగమనం రాక్షసానాం చ తం వధమ్.

ప్ర. అ. అహమ్=నేను, దురాత్మనా=దుర్బుద్ధియైన, రావణేన=రావణుని చేత, దృష్ట్వా=చూచి, సంభాషితశ్చ=మాటలాడబడితిని. లఙ్కాగమనమ్=లంకకు వచ్చుటను గూర్చి, రాక్షసానామ్=రాక్షసులయొక్క, తమ్=ఆ, వధమ్=వధను గూర్చి, పృష్టశ్చ=అడగబడితిని కూడ.

తా. దురాత్ముడైన రావణుడు నన్ను చూచి మాటలాడెను. "నీవు లంకకు ఎందుకు వచ్చినావు ? రాక్షసులను అట్లు ఎందుకు వధించినావు ?" అని ప్రశ్నించెను. 130

మూ. తత్సర్వం చ మయా తత్ర సీతార్థమితి జల్పితమ్, 131
తస్యాస్తు దర్శనాకాంక్షీ ప్రాప్తస్త్వద్భవనం విభో,
మారుతస్యౌరసః పుత్రో వానరో హనుమానహమ్. 132

ప్ర. అ. తత్=ఆ, సర్వమ్=అంతా, సీతార్థమితి=సీతకొరకు అని, మయా=నాచేత, తత్ర=అక్కడ, జల్పితమ్=పలకబడెను. విభో=రాక్షసరాజా! తస్యాః=ఆమె యొక్క, దర్శనాకాంక్షీ=దర్శనము కోరుచున్నవాడనై, త్వద్భవనమ్=నీ గృహమును గూర్చి, ప్రాప్తః=వచ్చినాను. అహమ్=నేను, మారుతస్య=వాయుదేవునియొక్క, ఔరసః పుత్రః=ఔరసపుత్రుడనై, వానరః=వానరుడనైన, హనుమాన్=హనుమంతుడను.

తా. "నేను ఈ పనులన్నీ సీతకొరకై చేసితిని" అని నేను చెప్పితిని. "రాక్షసరాజా! సీతను చూడవలెనని నీ భవనమునకు వచ్చితిని. నేను వాయుదేవుని ఔరసపుత్రుడను, వానరుడను, నా పేరు హనుమంతుడు".

మూ. రామదూతం చ మాం విద్ధి సుగ్రీవసచివం కపిమ్,
సోఽహం దౌత్యేన రామస్య త్వత్సకాశమిహాగతః. 133

ప్ర. అ. కపిమ్=వానరుడనైన, మామ్=నన్ను, రామదూతమ్=రాముని దూతను గాను, సుగ్రీవసచివమ్=సుగ్రీవుని మంత్రిని గాను, విద్ధి=తెలిసికొనుము, సః అహమ్=అట్టి నేను, రామస్య=రాముని యొక్క, దౌత్యేన=దౌత్యముచేత, త్వత్సకాశమ్=నీ సమీపమును గూర్చి, ఇహ=ఇక్కడికి, ఆగతః=వచ్చినాను.

తా. వానరుడనైన నేను రాముని దూతను, సుగ్రీవుని సచివుడను. నేను రాముని దౌత్యమును పురస్కరించుకొని ఇక్కడికి వచ్చినాను. 133

మూ. సుగ్రీవశ్చ మహాతేజాః స త్వాం కుశలమబ్రవీత్,
ధర్మార్థకామసహితం హితం పథ్యమువాచ చ. 134

ప్ర. అ. మహాతేజాః=గొప్ప తేజస్సు గల, సః సుగ్రీవశ్చ=ఆ సుగ్రీవుడు, త్వామ్=నిన్ను, కుశలమ్=క్షేమమును, అబ్రవీత్=పలికెను. ధర్మార్థకామసహితమ్= ధర్మ-అర్థ-కామములతో కూడిన, పథ్యమ్=మంచిని కలిగించు, హితమ్=హితమైన వాక్యమును, ఉవాచ=పలికెను.

తా. మహాతేజఃశాలియైన ఆ సుగ్రీవుడు, నీ కుశలమును అడిగినాడు. ధర్మ-అర్థ-కామములకు అనుకూలమైన, లాభకరమైన, హితవచనము కూడ చెప్పినాడు. 134

మూ. వసతో ఋశ్యమూకే మే పర్వతే విపులద్రుమే,
రాఘవో రణవిక్రాన్తో మిత్రత్వం సముపాగతః. 135

ప్ర. అ. విపులద్రుమే=ఉన్నతములైన (అధికమైన) వృక్షములు గల, ఋశ్యమూకే=ఋశ్యమూక పర్వతమునందు, వసతః=నివసించుచున్న, మే=నాకు, రణవిక్రాన్తః=యుద్ధమునందు పరాక్రమశాలియైన, రాఘవః=రాముడు, మిత్రత్వమ్= మిత్రత్వమును, ఉపాగతః=పొందినాడు.

తా. ఉన్నతములైన వృక్షములతో నిండిన ఋశ్యమూకపర్వతమునందు నివసించుచుండగా, యుద్ధములో గొప్ప పరాక్రమము గల రాముడు నాకు మిత్రుడైనాడు. 135

మూ. తేన మే కథితం రాజ్ఞా భార్యా మే రక్షసా హృతా,
తత్ర సాహాయ్యమస్మాకం కార్యం సర్వాత్మనా త్వయా. 136

ప్ర. అ. రాజ్ఞా=రాజైన, తేన=అతనిచేత, మే=నాకు, కథితమ్=చెప్పబడినది. మే భార్యా=నా భార్య, రక్షసా=రాక్షసునిచేత, హృతా=హరించబడినది. తత్ర=ఆ విషయమున, త్వయా=నీ చేత, సర్వాత్మనా=సర్వవిధముల, అస్మాకమ్=మాకు, సాహాయ్యమ్=సాహాయ్యము, కార్యమ్=చేయదగినది.

తా. రాజైన ఆ రాముడు నాతో ఇట్లు పలికెను. "నా భార్యను రాక్షసుడు అపహరించినాడు. నీవు ఆ విషయమున నాకు సర్వవిధముల సాహాయ్యమునే చేయవలెను". 136

మూ. మయా చ కథితం తస్మై వాలినశ్చ వధం ప్రతి,
తత్ర సాహాయ్యహేతోర్మే సమయం కర్తుమర్హసి. 137

ప్ర. అ. మయా చ=నా చేత కూడ, వాలినః=వాలియొక్క, వధం ప్రతి=వధను గూర్చి, తస్మై=ఆతనికి, కథితమ్=చెప్పబడినది. తత్ర=ఆ విషయమున, మే=నాకు, సాహాయ్యహేతోః=సాహాయ్యము నిమిత్తమై, సమయమ్=ఒప్పందమును, కర్తుమ్=చేయుటకు, అర్హసి=తగియున్నావు.

తా. నేను కూడ వాలివధను గూర్చి, ఆ రామునకు తెలిపి, "నీవు ఆ విషయమున నాకూ సాహాయ్యము చేయవలెను" అని ఆతనికి కోరితిని. 137

మూ. వాలినా హృతరాజ్యేన సుగ్రీవేణ మహాప్రభుః,
చక్రేఽగ్నిసాక్షికం సఖ్యం రాఘవః సహ లక్ష్మణః. 138

ప్ర. అ. మహాప్రభుః=గొప్ప ప్రభువైన, సహ లక్ష్మణః=లక్ష్మణసమేతుడైన, రాఘవః=రాముడు, వాలినా=వాలిచేత, హృతరాజ్యేన=హరింపబడిన రాజ్యము గల, సుగ్రీవేణ=సుగ్రీవునితో, అగ్నిసాక్షికమ్=అగ్ని సాక్షిగా ఉండగా, సఖ్యమ్=స్నేహమును, చక్రే=చేసెను.

తా. సుగ్రీవుని రాజ్యమును వాలి హరించెను. అట్టి సుగ్రీవునితో మహాప్రభువు, లక్ష్మణసమేతుడు అయిన రాముడు అగ్నిసాక్షిగా స్నేహము చేసెను. 138

మూ. తేన వాలినముత్పాట్య శరేణైకేన సంయుగే,
వానరాణాం మహారాజః కృతః స ప్లవతాం ప్రభుః. 139

ప్ర. అ. తేన=ఆ రామునిచేత, సంయుగే=యుద్ధమునందు, ఏకేన=ఒక, శరేణ=బాణముచేత, వాలినమ్=వాలిని, ఉత్పాట్య=పెకిలించి, ప్లవతామ్=వానరుల యొక్క, ప్రభుః=ప్రభువైన, సః=ఆ సుగ్రీవుడు, వానరాణామ్=వానరులయొక్క, మహారాజః=మహారాజుగా, కృతః=చేయబడినాడు.

తా. ఆ రాముడు, యుద్ధములో, ఒక్క బాణముచేత వాలిని చంపి, వానరప్రభువైన సుగ్రీవుని వానరరాజుగా చేసినాడు. 139

మూ. తస్య సాహాయ్యమస్మాభిః కార్యం సర్వాత్మనా త్విహ,
తేన ప్రస్థాపితస్తుభ్యం సమీపమిహ ధర్మతః. 140

ప్ర. అ. ఇహ=ఇప్పుడు, అస్మాభిః=మాచేత, సర్వాత్మనా=అన్ని విధముల, తస్య=ఆతనికి, సాహాయ్యమ్=సాహాయ్యము, కార్యమ్=చేయదగినది. తేన=ఆ

కారణముచేత, (ఇతడు), తుభ్యమ్=నీకొరకు, సమీపమ్=సమీపమును, ధర్మతః= ధర్మానుసారముగా, ప్రస్థాపితః=పంపబడినాడు.

తా. ఇప్పుడు మేము ఆ రామునకు సర్వవిధాలా సాహాయ్యము చేయవలసిఉన్నది. అందుచేతనే ఈతనిని ధర్మానుసారముగా నీవద్దకు పంపుచున్నాను.

మూ. క్షిప్రమానీయతాం సీతా దీయతాం రాఘవాయ చ,
యావన్న హరయో వీరా విధమన్తి బలం తవ. 141

ప్ర. అ. వీరాః=వీరులైన, హరయః=వానరులు, తవ=నీయొక్క, బలమ్=సైన్యమును, యావత్=ఎంతలో, న విధమన్తి=నశింపచేయరో, అంతలో, సీతా=సీత, క్షిప్రమ్=శీఘ్రముగా, ఆనీయతామ్=తీసికొనిరాబడుగాక, రాఘవాయ=రామునకు, దీయతాం చ=ఇవ్వబడుగాక.

తా. వీరులైన వానరులు నీ సైన్యమును నశింపచేయుటకు ముందుగానే నీవు శీఘ్రముగా సీతను తీసుకొని వచ్చి రామునకు ఇచ్చివేయుము. 141

మూ. వానరాణాం ప్రభావో హి న కేన విదితః పురా,
దేవతానాం సకాశం చ యే గచ్ఛన్తి నిమన్త్రితాః. 142

ప్ర. అ. యే=ఎవరు, నిమన్త్రితాః=పిలవబడినవారై, దేవతానామ్=దేవతలయొక్క, సకాశమ్=సమీపమును గూర్చి, గచ్ఛన్తి పురా=వెళ్లెదరో, అట్టి, వానరాణామ్=వానరులయొక్క, ప్రభావః=ప్రభావము, కేన=ఎవనిచేత, న విదితః= తెలియబడలేదు.

తా. ఏ వానరులు పిలిచినచో దేవతల దగ్గరకు కూడ వెళ్లెదరో అట్టి వానరుల ప్రభావము తెలియనివారు ఎవరు ? 142

మూ. ఇతి వానరరాజస్త్వామాహేత్యభిహితో మయా,
మామైక్షత తతః క్రుద్ధశ్చక్షుషా ప్రదహన్నివ. 143

ప్ర. అ. ఇతి=ఇట్లు, వానరరాజః=వానరరాజు, త్వామ్=నిన్ను గూర్చి, ఆహ=చెప్పుచున్నాడు, ఇతి=అని, మయా=నాచేత, అభిహితః=పలకబడిన వాడై, తతః=అటు పిమ్మట, క్రుద్ధః=కోపగించినవాడై, చక్షుషా=నేత్రముతో, ప్రదహన్నివ= కాల్చివేయుచున్న వాడు వలె, మామ్=నన్ను, ఐక్షత=చూచెను.

తా. వానరరాజైన సుగ్రీవుడు నీతో ఇట్లు చెప్పినాడు అని నేను చెప్పగానే ఆతడు కోపించి, నేత్రముతో కాల్చుచున్నవాడు వలె నన్ను చూచెను. 143

మూ. తేన వధ్యోఽహమాజ్ఞప్తో రక్షసా రౌద్రకర్మణా,
మత్ప్రభావమవిజ్ఞాయ రావణేన దురాత్మనా. 144

ప్ర. అ. రౌద్రకర్మణా=భయంకరమైన కర్మ గల, రక్షసా=రాక్షసుడు, దురాత్మనా=దురాత్ముడు అయిన, తేన రావణేన=ఆ రావణునిచేత, మత్ప్రభావమ్=నాయొక్క ప్రభావమును, అవిజ్ఞాయ=తెలియకుండా, అహమ్=నేను, వధ్యః=చంపదగినవాడనుగా, ఆజ్ఞప్తః=ఆజ్ఞాపింపబడితిని.

తా. భయంకరమైన కర్మ గల రాక్షసుడు, దురాత్ముడు అయిన ఆ రావణుడు, నా ప్రభావము ఎట్టిదో తెలిసికొనక, నన్ను చంపవలసినదిగా ఆజ్ఞాపించెను. 144

మూ. తతో విభీషణో నామ తస్య భ్రాతా మహామతిః,
తేన రాక్షసరాజోఽసౌ యాచితో మమ కారణాత్. 145

ప్ర. అ. విభీషణో నామ=విభీషణు డను, మహామతిః=గొప్ప బుద్ధి గల, తస్య=ఆతనియొక్క, భ్రాతా=సోదరుడు, (ఉన్నాడు). తతః=అటు పిమ్మట, తేన=అతనిచేత, అసౌ=ఈ, రాక్షసరాజః=రాక్షసరాజు, మమ కారణాత్=నా కారణమువలన, యాచితః=యాచింపబడినాడు.

తా. అటు పిమ్మట, గొప్ప బుద్ధిగల విభీషణుడను ఆ రావణుని సోదరుడు, నా నిమిత్తమై ఆ రాక్షసరాజును ప్రార్థించెను. 145

మూ. నైవం రాక్షసశార్దూల త్యజ్యతామేష నిశ్చయః,
రాజశాస్త్రవ్యపేతో హి మార్గః సంసేవ్యతే త్వయా. 146

ప్ర. అ. రాక్షసశార్దూల=రాక్షసశ్రేష్ఠా, ఏవమ్=ఇట్లు, న=కాదు. ఏషః=ఈ, నిశ్చయః=నిశ్చయము, త్యజ్యతామ్=విడువబడుగాక, రాజశాస్త్రవ్యపేతః=రాజశాస్త్రమునుండి దూరమైన, మార్గః=మార్గము, త్వయా=నీచేత, సంసేవ్యతే హి=సేవించబడుచున్నది కదా.

తా. ఓ ! రాక్షసశ్రేష్ఠా ! ఇట్లు చేయకూడదు. ఈ నిశ్చయము విడచి పెట్టుము. నీవు రాజశాస్త్రమునకు విరుద్ధమైన మార్గమును అనుసరించుచున్నావు.

మూ. దూతవధ్యా న దృష్టా హి రాజశాస్త్రేషు రాక్షస,
దూతేన వేదితవ్యం చ యథార్థం హితవాదినా. 147

ప్ర. అ. రాక్షస=రావణా ! రాజశాస్త్రేషు=రాజశాస్త్రములందు, దూతవధ్యా=దూతను చంపుట, న దృష్టా హి=చూడబడలేదు. హితవాదినా=హితమును పలుకు, దూతేన=దూతచేత, యథార్థమ్=యథార్థము, వేదితవ్యమ్=తెలియ దగినది.

తా. రావణా ! రాజశాస్త్రాలలో దూతలను చంపుట అనేది కనబడలేదు. హితమును చెప్పే దూత యథార్థమును తెలిసికొనవలెను. 147

మూ. సుమహత్యపరాధేఽపి దూతస్యాతులవిక్రమ,
విరూపకరణం దృష్టం న వధోఽస్తీతి శాస్త్రతః. 148

ప్ర. అ. అతులవిక్రమ=సాటిలేని పరాక్రమము కలవాడా ! సుమహతి=చాల గొప్పదైన, అపరాధేఽపి=అపరాధమున్నను, దూతస్య=దూతయొక్క, విరూపకరణమ్=విరూపునిగా చేయుట, దృష్టమ్=చూడబడినది. శాస్త్రతః=శాస్త్రానుసారముగా, వధః=వధ, నాస్తి=లేదు.

తా. సాటిలేని పరాక్రమము కలవాడా ! ఎంత అపరాధము చేసినను, దూతకు ఏదైన వైరూప్యము (అవయవఖండనాదికము చేయుట) చెప్పబడినది గాని శాస్త్రములలో దూతను చంపుట విధింపబడలేదు. 148

మూ. విభీషణేనైవముక్తో రావణః సందిదేశ తాన్,
రాక్షసానేతదేవాస్య లాఙ్గూలం దహ్యతామితి. 149

ప్ర. అ. విభీషణేన=విభీషణునిచేత, ఏవమ్=ఇట్లు, ఉక్తః=పలకబడిన, రావణః=రావణుడు, అస్య=ఈతనియొక్క, ఏతత్=ఈ, లాఙ్గూలమ్=తోక, దహ్యతామితి=కాల్చివేయబడు గాక అని, తాన్ రాక్షసాన్=ఆ రాక్షసులను, సందిదేశ=ఆజ్ఞాపించెను.

తా. రావణుడు విభీషణుని మాటలు విని, "ఈతని తోక కాల్చివేయుడు" అని రాక్షసులను ఆజ్ఞాపించెను. 149

మూ. తత స్తస్య వచః శ్రుత్వా మమ పుచ్ఛం సమన్తతః,
వేష్టితం శణవల్కైశ్చ జీర్ణైః కార్పాసజైః పటైః. 150

ప్ర. అ. తతః=అటు పిమ్మట, తస్య=ఆతనియొక్క, వచః=వచనమును, శ్రుత్వా=విని, మమ పుచ్ఛమ్=నా తోక, సమంతతః=అంతటా, శణవల్కైః=జనపనార బట్టల చేతను, జీర్ణైః=చినిగిపోయిన, కార్పాసజైః=పత్తినుండి పుట్టిన, పటైః=వస్త్రములచేతను, వేష్టితమ్=చుట్టబడినది.

తా. ఆ రావణుని మాటలు వినిన వెంటనే రాక్షసులు జనపనార గుడ్డలతోను చినికిపోయిన నూలుబట్టలతోను, నా తోక అంతటా చుట్టబెట్టిరి.

మూ. రాక్షసాః సిద్ధసన్నాహాస్తతస్తే చణ్డవిక్రమాః,
తదాదహ్యన్త మే పుచ్ఛం నిఘ్నన్తః కాష్ఠముష్టిభిః, 151
బద్ధస్య బహుభిః పాశైర్యన్త్రితస్య చ రాక్షసైః.

ప్ర. అ. తతః=అటు పిమ్మట, సిద్ధసంనాహాః=సిద్ధమైన సంనాహము గల, చణ్డవిక్రమాః=తీవ్రమైన పరాక్రమము గల, రాక్షసాః=రాక్షసులు, కాష్ఠ ముష్టిభిః=కఱ్ఱలతోను పిడికిళ్ళతోను, నిఘ్నన్తః=కొట్టుచు, బహుభిః=అనేకములైన, పాశైః=పాశములచేత, బద్ధస్య=కట్టబడినవాడను, రాక్షసైః=రాక్షసులచేత, యన్త్రి తస్య=కదలకుండచేయబడినవాడను అయిన, మే=నాయొక్క, పుచ్ఛమ్=తోకను, తదా=అప్పుడు, అదహ్యన్త=కాల్చిరి.

తా. సంనాహములను పూర్తి చేసిన, తీవ్రమైన పరాక్రమము గల, ఆ రాక్షసులు, నన్ను కఱ్ఱలతోను, పిడికిళ్ళతోను కొట్టుచు, అనేకము లైన పాశములచే బంధింపబడి, రాక్షసులచేత కదలకుండ చేయబడిన నా పుచ్ఛమును కాల్చిరి. 150, 151

మూ. తతస్తే రాక్షసాః శూరా బద్ధం మామగ్నిసంవృతమ్, 152
అఘోషయన్రాజమార్గే నగరద్వారమాగతాః.

ప్ర. అ. తతః=అటు పిమ్మట, శూరాః=శూరు లైన, రాక్షసాః=రాక్షసులు, నగరద్వారమ్=పట్టణద్వారమును, ఆగతాః=పొందినవారై, బద్ధమ్=కట్టబడినవాడను, అగ్నిసంవృతమ్=అగ్ని చేత చుట్టబడియున్న వాడను అయిన, మామ్=నన్ను, రాజమార్గే=రాజమార్గమునందు, అఘోషయన్=ఘోషించిరి.

తా. పిమ్మట శూరు లైన ఆ రాక్షసులు బంధింపబడి, అగ్నిచే చుట్టబడిన నన్ను నగరద్వారమువద్దకు తీసికొని పోయి, నన్ను గూర్చి, రాజమార్గములో ఘోషణ చేసిరి. 152

మూ. తతోఽహం సుమహద్రూపం సంక్షిప్య పునరాత్మనః, 153
విమోచయిత్వా తం బన్ధం ప్రకృతిస్థః స్థితః పునః,
ఆయసం పరిఘం గృహ్య తాని రక్షాంస్యసూదయమ్. 154

ప్ర. అ. తతః=అటు పిమ్మట, అహమ్=నేను, ఆత్మనః=నాయొక్క, సుమహత్=చాల పెద్ద దైన, రూపమ్=రూపమును, పునః=మరల, సంక్షిప్య=చిన్నది చేసి, తం బన్ధమ్=ఆ బంధమును, విమోచయిత్వా=విడిపించుకొని, పునః=మరల, ప్రకృతిస్థః=సహజస్థితిని పొందినవాడనుగా, స్థితః=ఉంటిని, ఆయసమ్=ఇనుప దైన, పరిఘమ్=పరిఘను, గృహ్య=గ్రహించి, తాని రక్షాంసి=ఆ రాక్షసులను, అసూదయమ్=చంపితిని.

తా. పిమ్మట నేను చాల పెద్దదైన రూపమును మరల చిన్నదిగా చేసి, ఆ బంధమును విడిపించుకొని, స్వాభావికస్థితిని పొంది, మరల ఆ ఇనుప పరిఘను తీసికొని ఆ రాక్షసులనందరిని చంపితిని. 153, 154

మూ. తతస్తన్నగరద్వారం వేగేనాప్లుతవానహమ్,
పుచ్ఛేన చ ప్రదీప్తేన తాం పురీం సాట్టగోపురామ్, 155
దహామ్యహమసంభ్రాన్తో యుగాన్తాగ్నిరివ ప్రజాః.

ప్ర. అ. తతః=అటు పిమ్మట, అహమ్=నేను, వేగేన=వేగముతో, తత్=ఆ, నగరద్వారమ్=నగర ద్వారమును గూర్చి, ఆప్లుతవాన్=దుమికితిని. అహమ్=నేను, అసంభ్రాన్తః=భయములేనివాడనై, యుగాన్తాగ్నిః=ప్రళయకాలమునందలి అగ్ని, ప్రజాః ఇవ=ప్రజలను వలె, సాట్టప్రాకారగోపురామ్=బురుజులతోను, ప్రాకారములతోను, గోపురములతోను కూడిన, తాం పురీమ్=ఆపట్టణమును, ప్రదీప్తేన=మండుచున్న, పుచ్ఛేన=తోకచే, దహామి=కాల్చి వేసినాను.

తా. పిమ్మట నేను వేగముగా ఆ నగరద్వారముపైకి దుమికితిని. ప్రజ్వ లించుచున్న పుచ్ఛముచేత, బురుజులతోను ప్రాకారములతోను, గోపురములతోను కూడిన ఆ నగరమును ప్రళయకాలము నందలి అగ్ని ప్రజలను దహించి వేసి నట్లు ఏ మాత్రము కంగారుపడక, కాల్చివేసితిని. 155

మూ. వినష్టా జానకీ వ్యక్తం న హ్యదగ్ధః ప్రదృశ్యతే, 156
లఙ్కాయాం కశ్చిదుద్దేశః సర్వా భస్మీకృతా పురీ.

ప్ర. అ. చూ. 55వ సర్గ 12వ శ్లోకం.

మూ. దహతా చ మయా లఙ్కాం దగ్ధా సీతా న సంశయః, 157
రామస్య హి మహత్కార్యం మయేదం వితథీకృతమ్.

ప్ర. అ. లఙ్కామ్=లంకను, దహతా=కాల్చుచున్న, మయా=నాచేత, సీతా=సీత, దగ్ధా=కాల్చబడినది. సంశయః=సంశయము, న=లేదు, మయా=నాచేత, రామస్య=రామునియొక్క, ఇదమ్=ఈ, మహత్=గొప్పదైన, కార్యమ్=కార్యము, వితథీకృతమ్=వ్యర్థము చేయబడినది.

తా. లంక కాలిపోయినది గాన సీత కూడ కాలిపోయియే ఉండును. సందేహము లేదు. నేను రాముని ఈ మహాకార్యమును వ్యర్థము చేసితిని.157

మూ. ఇతి శోకసమావిష్టశ్చిన్తామహముపాగతః, 158
అథాహం వాచమశ్రౌషం చారణానాం శుభాక్షరామ్,
జానకీ న చ దగ్ధేతి విస్మయోదన్తభాషిణామ్. 159

ప్ర. అ. ఇతి=ఇట్లు, శోకసమావిష్టః=శోకముచే నింపబడినవాడనై, అహమ్=నేను, చిన్తామ్=చింతను, ఉపాగతః=పొందితిని, అథ=అటు పిమ్మట,

అహమ్=నేను, జానకీ=జానకి, న చ దగ్ధా=దహింపబడలేదు, ఇతి=అని, విస్మయోదన్త భాషిణామ్=ఆశ్చర్యముతో వార్తను పలుకుచున్న, చారణానామ్=చారణులయొక్క, శుభాక్షరామ్=మంగళప్రదము లైన అక్షరములు గల, వాచమ్=వాక్కును, అశ్రౌషమ్=వింటిని.

తా. ఈ విధముగ శోకాక్రాంతుడనై నేను చింత పొందితిని. పిమ్మట "జానకి దహింపబడలేదు" అని ఆశ్చర్యముతో మాటలాడుచున్న చారణుల, మంగళకరములైన అక్షరములు గల వాక్కును వింటిని. 158, 159

మూ. తతో మే బుద్ధిరుత్పన్నా శ్రుత్వా తామద్భుతాం గిరమ్,
అదగ్ధా జానకీత్యేవం నిమిత్తైశ్చోపలక్షితా. 160

ప్ర. అ. అద్భుతామ్=ఆశ్చర్యకరమైన, తాం గిరమ్=ఆ వాక్కును, శ్రుత్వా=విని, తతః=పిమ్మట, జానకీ=జానకి, అదగ్ధా=కాల్చబడలేదు, ఇత్యేవమ్=అని, మే=నాకు, బుద్ధిః=బుద్ధి, ఉత్పన్నా=పుట్టినది, నిమిత్తైశ్చ=శుభశకునములచేత కూడ, ఉపలక్షితా=(కాల్చబడనట్లు) ఊహింపబడినది.

తా. ఆశ్చర్యకరమైన ఆ మాటలు విన్న పిమ్మట నాకు --- "జానకి దహింపబడి యుండదు" అను ఆలోచన కలిగినది. కొన్ని సుశకునములను బట్టి కూడ అట్లు ఊహించితిని. 160

మూ. దీప్యమానే తు లాఙ్గూలే న మాం దహతి పావకః,
హృదయం చ ప్రహృష్టం మే వాతాః సురభిగన్ధినః. 161

ప్ర. అ. లాఙ్గూలే=తోక, దీప్యమానే=కాల్చబడుచుండగా, పావకః=అగ్ని, మామ్=నన్ను, న దహతి=కాల్చుటలేదు. మే=నాయొక్క, హృదయం చ=హృదయము కూడ, ప్రహృష్టమ్=సంతోషించుచున్నది. వాతాః=వాయువులు, సురభిగన్ధినః=మంచి గంధము గలవి. 161

తా. నా తోక కాల్చబడుచున్నను అగ్ని నన్ను దహించుట లేదు. నా హృదయము కూడ సంతుష్టముగా ఉన్నది. వాయువులు మంచి గంధమును ప్రసరింపచేయుచున్నవి. 161

మూ. తైర్నిమిత్తైశ్చ దృష్టార్థైః కారణైశ్చ మహాగుణైః,
ఋషివాక్యైశ్చ సిద్ధార్థైరభవం హృష్టమానసః. 162

ప్ర. అ. దృష్టార్థైః=చూడబడిన ఫలములు గల, తైః=ఆ, నిమిత్తైః=నిమిత్తములచేతను, మహాగుణైః=గొప్ప గుణములు గల, కారణైశ్చ=కారణములచేతను, సిద్ధార్థైః=సిద్ధమైన ప్రయోజనము గల, ఋషివాక్యైశ్చ=ఋషుల వాక్యముల చేతను, హృష్టమానసః=సంతోషించిన మనస్సు కలవాడనై, అభవమ్=అయితిని.

తా. పూర్వము సఫలములుగా చూడబడిన ఆ శకునములచేతను, గొప్ప గుణములు గల కారణములచేతను, తప్పక యథార్థములైన ఋషుల వాక్యముల చేతను నా మనస్సు సంతోషించినది. 162

మూ. పునర్దృష్ట్వా చ వైదేహీం విసృష్టశ్చ తయా పునః,
తతః పర్వతమాసాద్య తత్రారిష్టమహం పునః, 163
ప్రతిప్లవనమారేభే యుష్మద్దర్శనకాంక్షయా.

ప్ర. అ. వైదేహీమ్=సీతను, పునః=మరల, దృష్ట్వా చ=చూచి, తయా=ఆమెచేత, పునః=మరల, విసృష్టః=విడవబడినవాడనై, తతః=పిమ్మట, అరిష్టపర్వతమ్=అరిష్టపర్వతమును, పునః=మరల, ఆసాద్య=పొంది, అహమ్=నేను, యుష్మద్దర్శనకాంక్షయా=మీయొక్క దర్శనమునందు కోరికతో, ప్రతిప్లవనమ్=తిరిగి ఎగురుటను, ఆరేభే= ప్రారంభించితిని.

తా. సీతాదేవిని మరల చూచి, ఆమె అనుజ్ఞ పొంది, పిమ్మట అరిష్ట పర్వతమును మరల పొంది, మిమ్ములను చూడవలెనను కోరికతో మరల ఎగురుట (సముద్రలంఘనము) ప్రారంభించితిని. 163

మూ. తతః పవనచన్ద్రార్క సిద్ధగన్ధర్వసేవితమ్, 164
పన్థానమహమాక్రమ్య భవతో దృష్టవానిహ.

ప్ర. అ. తతః=పిమ్మట, అహమ్=నేను, పవనచన్ద్రార్కసిద్ధగన్ధర్వసేవితమ్=వాయు-చంద్ర-సూర్య-సిద్ధ- గంధర్వుల చేత సేవింపబడిన, పన్థానమ్=ఆకాశమార్గమును, ఆశ్రిత్య=ఆశ్రయించి, ఇహ=ఇక్కడ, భవతః=మిమ్ములను, దృష్టవాన్=చూచితిని.

తా. పిమ్మట నేను వాయు-చంద్ర-సూర్య-సిద్ధ-గంధర్వులచే సేవింపబడు ఆకాశమార్గమును అవలంబించి, ఇక్కడ, మిమ్ములను చూచితిని. 164

మూ. రాఘవస్య ప్రభావేణ భవతాం చైవ తేజసా, 165
సుగ్రీవస్య చ కార్యార్థం మయా సర్వమనుష్ఠితమ్.

ప్ర. అ. రాఘవస్య=రామునియొక్క, ప్రభావేణ=ప్రభావముచేత, భవతామ్=మీయొక్క, తేజసా చైవ=తేజస్సు చేతను, సుగ్రీవస్య=సుగ్రీవుని యొక్క, కార్యార్థం చ=కార్యము కొరకు, మయా=నాచేత, సర్వమ్=సమస్తము, అనుష్ఠితమ్=చేయబడినది.

తా. రాముని ప్రభావముచేత, మీ తేజస్సుచేత, సుగ్రీవుని కార్యము సాధించుటకు నేను అన్ని పనులు చేసితిని. 165

మూ. ఏతత్సర్వం మయా తత్ర యథావదుపపాదితమ్, 166
అత్ర యన్న కృతం శేషం తత్సర్వం క్రియతామితః.

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే సున్దరకాణ్డే
అష్టపంచాశః సర్గః

ప్ర. అ. ఏతత్=ఇది, సర్వమ్=అంతయు, తత్ర=అక్కడ, మయా=నాచేత, యథావత్=ఎట్లు చేయవలెనో అట్లు, ఉపపాదితమ్=చేయబడినది. అత్ర=ఈ కార్యమునందు, యత్=ఏది, న కృతమ్=చేయబడలేదో, శేషమ్=మిగిలిన, తత్=అది, సర్వమ్=అంతా, క్రియతామ్=చేయబడుగాక.

తా. నేను అక్కడ ఈ కార్యముల నన్నింటిని తగు విధముగా చేసితిని. నేను చేయగా మిగిలిన కార్యమంతా చేయుడు. 166

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు
సుందరకాండలో ఏబదిఎనిమిదవ సర్గ సమాప్తము.

అథ ఏకోనషష్టితమః సర్గః

[హనుమంతుడు సీత దురవస్థను వర్ణించి చెప్పి, లంకను ఆక్రమించుటకై వానరులను ప్రోత్సాహపరచుట.]

మూ. ఏతదాఖ్యాయ తత్సర్వం హనుమాన్ మారుతాత్మజః,
భూయః సముపచక్రామ వచనం వక్తుముత్తరమ్. 1

ప్ర. అ. మారుతాత్మజః=వాయుపుత్రుడైన, హనుమాన్=హనుమంతుడు, సర్వమ్=సమస్తమైన, తత్ ఏతత్=దీనిని, ఆఖ్యాయ=చెప్పి, భూయః=మరల, ఉత్తరం వచనమ్=తరువాతి వాక్యమును, వక్తుమ్=చెప్పుటకు, సముపచక్రామ=ప్రారంభించెను.

తా. వాయుపుత్రుడైన హనుమంతుడు జరిగిన ఈ విషయము అంతా చెప్పి, మరల, తాను చెప్పదలచిన మాటలను ఇట్లు చెప్పెను. 1

మూ. సఫలో రాఘవోద్యోగః సుగ్రీవస్య చ సంభ్రమః,
శీలమాసాద్య సీతాయా మమ చ ప్రవణం మనః. 2

ప్ర. అ. రాఘవోద్యోగః=రాముని ప్రయత్నము, సుగ్రీవస్య=సుగ్రీవుని యొక్క, సంభ్రమః చ=తొందర (ఉత్సాహము), సీతాయాః=సీతయొక్క, శీలమ్=పవిత్రమైన శీలమును, ఆసాద్య=పొంది, సఫలః=సఫలమైనది. మమ=నాయొక్క, మనశ్చ=మనస్సు కూడ, ప్రవణమ్=ఆమెయందు భక్తితో లగ్నమైనది.

తా. సీతాదేవి పాతివ్రత్యమహిమచే రాముని ప్రయత్నము, సుగ్రీవుని ఉత్సాహమూ కూడా సఫలములు కానున్నవి. భక్తితో నా మనస్సు ఆమెపై లగ్నమైనది. 2

మూ. తపసా నిర్దహేల్లోకాన్ క్రుద్ధో వా నిర్దహేదపి,
సర్వథాతిప్రవృద్ధోఽసౌ రావణో రాక్షసాధిపః. 3

ప్ర. అ. సర్వథా=అన్ని విధముల, అతిప్రవృద్ధః=చాల వృద్ధి చెందిన, అసౌ=ఈ, రాక్షసాధిపః=రాక్షసప్రభువైన, రావణః=రావణుడు, తపసా=తపస్సుచేత, లోకాన్=లోకములను, నిర్దహేత్=కాల్చివేయవచ్చును. క్రుద్ధో వాపి=కోపగించినను, నిర్దహేదపి (శత్రువులు మొదలైన వారిని) కాల్చి వేయవచ్చును.

తా. రాక్షసరాజైన రావణుడు అన్ని విధముల చాల బలము కలవాడు. ఇతడు తన తపోబలముచేత లోకాలను కాల్చివేయగలడు. కోపించినచో ఎవరి నైనను నశింపచేయగలడు. 3

మూ. తస్య తాం స్పృశతో గాత్రం తపసా న వినాశితమ్.
న తదగ్నిశిఖా కుర్యాత్సంస్పృష్టా పాణినా సతీ, 4
జనకస్య సుతా కుర్యాద్యత్క్రోధకలుషీకృతా.

ప్ర. అ. తామ్=ఆ సీతాదేవిని, స్పృశతః=స్పృశించిన, తస్య=వానియొక్క, గాత్రమ్=శరీరము, తపసా=తపస్సుచేత, న వినాశితమ్=నశింపచేయబడలేదు. క్రోధ కలుషీకృతా=క్రోధముచే కలతబెట్టబడిన, జనకస్య ఆత్మజా=జనకుని కుమార్తె యైన సీత, యత్=దేనిని, కుర్యాత్=చేయునో, తత్=దానిని, పాణినా=హస్తముచేత, సంస్పృష్టా సతీ=స్పృశించబడిన, అగ్నిశిఖా=అగ్నిజ్వాల కూడ, న కుర్యాత్=చేయదు.

తా. రావణుడు ఆమెను స్పృశించినను అతని శరీరము భస్మము కాలేదన్నచో దానికి కారణము అతని తపస్సే. కోపముచేత మనస్సు కలుష మైనపుడు సీత చేయగలిగినదానిని, చేతితో స్పృశించిన అగ్నిజ్వాల కూడ చేయజాలదు. 4

మూ. జామ్బవత్ప్రముఖాన్ సర్వాననుజ్ఞాప్య మహాహరీన్, 5
అస్మిన్నేవం గతే కార్యే భవతాం చ నివేదితే,
న్యాయ్యం స్మ సహ వైదేహ్యా ద్రష్టుం తౌ పార్థివాత్మజౌ. 6

ప్ర. అ. భవతామ్=మీకు, నివేదితే=తెలుపబడిన, అస్మిన్=ఈ, కార్యే=కార్యము, ఏవం గతే=ఈ విధముగా ఉండగా, జామ్బవత్ప్రముఖాన్=జాంబవంతుడు మొదలైన, మహాహరీన్=గొప్ప వానరులను, సమనుజ్ఞాప్య=అంగీకరింపచేసి, వైదేహ్యా సహ=సీతతో కూడ, తౌ=ఆ, పార్థివాత్మజౌ=రాజ కుమారులను, ద్రష్టుమ్=చూ చుటకు, న్యాయ్యం స్మ=న్యాయ్యమైనది కదా !

తా. మీకు చెప్పిన విధముగ ఈ కార్యము ఈ విధముగ ఉన్నది. ఇట్టి పరిస్థితిలో జాంబవంతుడు మొదలైన వానర నాయకుల అనుజ్ఞ తీసికొని, సీతను కూడ మనతో తీసికొని వెళ్ళియే, ఆ రామలక్ష్మణులను చూచుట యుక్తము కదా ! 5, 6

మూ. అహమేకోఽపి పర్యాప్తః సరాక్షసగణాం పురీమ్,
తాం లఙ్కాం తరసా హన్తుం రావణం చ మహాబలమ్. 7

ప్ర. అ. అహమ్=నేను, ఏకోఽపి=ఒక్కడనే, సరాక్షసగణామ్=రాక్షసగణములతో కూడిన, తాం లఙ్కాం పురీమ్=ఆ లంకాపురమును, మహాబలమ్=గొప్ప బలము గల, రావణం చ=రావణుని, తరసా=వేగముచేత, హన్తుమ్=చంపుటకు, పర్యాప్తః=చాలినవాడను.

తా. రాక్షసగణములతో కూడిన ఆ లంకాపట్టణమును నశింపచేయుటకు మహాబలశాలియైన రావణుని సంహరించుటకు కూడ నేనొక్కడనే చాలుదును.

మూ. కిం పునః సహితో వీరైర్బలవద్భిః కృతాత్మభిః,
కృతాస్త్రైః ప్లవగైః శూరైర్భవద్భిర్విజయైషిభిః. 8

ప్ర. అ. బలవద్భిః=బలవంతులు, కృతాత్మభిః=వినీతమైన మనస్సు కలవారు, కృతాస్త్రైః=చేయుబడిన (నేర్పబడిన), అస్త్రప్రయోగము గలవారు, శూరైః=శూరులు, విజయైషిభిః=విజయమును కోరువారు, ప్లవగైః=వానరులు అయిన, భవద్భిః=మీతో, సహితః=కూడినవాడనై, కిం పునః=చెప్పనేల ?

తా. మీ రందరు బలవంతులు. మనస్సును వశములో ఉంచుకొన్నవారు. అస్త్రప్రయోగమునందు నిపుణులు. శూరులు. విజయమును కోరువారు. అట్టి మీతో కలిసి యుద్ధానికి వెళ్ళినచో చెప్పవలెనా ! 8

మూ. అహం తు రావణం యుద్ధే ససైన్యం సపురఃసరమ్,
సహపుత్రం వధిష్యామి సహోదరయుతం యుధి. 9

ప్ర. అ. అహం తు=నే నైతే, యుద్ధే=యుద్ధమునందు, ససైన్యమ్=సైన్యముతో కూడినవాడు, సపురఃసరమ్=ముందు నడిచే పరివారముతో కూడిన వాడు, సపుత్రమ్=పుత్రునితో కూడినవాడు, సహోదరయుతమ్=సహోదరులతో కూడినవాడు అయిన, రావణమ్=రావణుని, యుధి=యుద్ధమునందు, వధిష్యామి=చంపెదను.

తా. సైన్యముతో యుద్ధమునకు వచ్చిన రావణుని, ఆతని ముందు నడచు పరివారమును, ఆతని పుత్రులను, సహోదరులను కూడ యుద్ధములో వధించగలను. 9

మూ. బ్రాహ్మమైన్ద్రం చ రౌద్రం చ వాయవ్యం వారుణం తథా,
యది శక్రజితోఽస్త్రాణి దుర్నిరీక్షాణి సంయుగే, 10
తాన్యహం విధమిష్యామి హనిష్యామి చ రావణమ్.

ప్ర. అ. బ్రాహ్మమ్=బ్రహ్మాస్త్రమును, ఐన్ద్రం చ=ఐంద్రాస్త్రమును, రౌద్రం చ=రౌద్రాస్త్రమును, వాయవ్యమ్=వాయవ్యాస్త్రమును, తథా=మరియు,

వారుణమ్=వారుణాస్త్రమును, శక్రజితః=ఇంద్రజిత్తుయొక్క, అస్త్రాణి=అస్త్రములు, దుర్నిరీక్ష్యాణి యది=చూడ శక్యము కానిచో, తాని=వాటిని, సంయుగే=యుద్ధము నందు, విధమిష్యామి=ఎగురగొట్టి వేయగలను, రాక్షసాన్=రాక్షసులను, హనిష్యామి చ=చంపగలను.

తా. బ్రహ్మాస్త్రమును, ఐంద్రాస్త్రమును, రౌద్రాస్త్రమును, వాయవ్యాస్త్రమును, వారుణాస్త్రమును, ఇంద్రజిత్తు ప్రయోగించు చూచుటకు శక్యము కాని ఇతరాస్త్రములను కూడ యుద్ధములో ఎగురగొట్టి వేయగలను. రాక్షసులను చంపగలను. 10

మూ. భవతామభ్యనుజ్ఞాతో విక్రమో మే రుణద్ధి తమ్. 11
మయాతులా విసృష్టా హి శైలవృష్టిర్నిరన్తరా,
దేవానపి రణే హన్యాత్కిం పునస్తాన్నిశాచరాన్. 12

ప్ర. అ. భవతామ్=మీయొక్క (మీ చేత), అభ్యనుజ్ఞాతః=అనుమతించబడిన, మే=నాయొక్క, విక్రమః=పరాక్రమము, తమ్=ఆ రావణుని, రుణద్ధి=అరికట్టుచున్నది. (అరికట్టి బంధించగలదు). మయా=నాచేత, విసృష్టా=విడవబడిన, అతులా=సాటి లేని, నిరన్తరా=అవకాశము లేని, శైలవృష్టిః=శిలలవర్షము, రణే=యుద్ధమునందు, దేవానపి=దేవతలను కూడ, హన్యాత్=చంపును. తాన్=ఆ, నిశాచరాన్=రాక్షసులను, కిం పునః=చెప్పనేల?

తా. మీరు అనుమతించినచో నా పరాక్రమము ఆ రావణుని బంధించగలదు. యుద్ధములో నేను నిరంతరముగా వర్షించిన శిలావృష్టి దేవతలను కూడ చంపగలదు. రాక్షసుల మాట చెప్పవలెనా ?

"భవతామననుజ్ఞాతం రుణద్ధి మమ విక్రమమ్" అను ప్రాచ్యపాఠము బాగున్నది. "మీ అనుజ్ఞ లేకపోవుట నా పరాక్రమమును అడ్డుపెట్టుచున్నది" అని అర్థము. 11, 12

మూ. సాగరోఽప్యతియాద్వేలాం మన్దరః ప్రచలేదపి,
న జామ్బవన్తం సమరే కమ్పయేదరివాహినీ. 13

ప్ర. అ. సాగరః=సముద్రము, వేలామ్=తీరమును, అతియాదపి=దాటవచ్చును. మన్దరః=మందరపర్వతము, ప్రచలేదపి=చలించవచ్చును. సమరే=యుద్ధమునందు, అరివాహినీ=శత్రుసైన్యము, జామ్బవన్తమ్=జాంబవంతుణ్ణి, న కమ్పయేత్=కంపింప చేయజాలదు.

తా. సముద్రము తీరము దాటిన దాటవచ్చును. మందరపర్వతము చలింపవచ్చును. కాని సమరములో జాంబవంతుణ్ణి శత్రుసేన కదల్పజాలదు.

మూ. సర్వరాక్షససంఘానాం రాక్షసా యే చ పూర్వకాః,
అలమేకో వినాశాయ వీరో వాలిసుతః కపిః. 14

ప్ర. అ. వీరః=వీరుడు, వాలిసుతః=వాలి కుమారుడు అయిన, కపిః=అంగదుడు, ఏకః=ఒక్కడే, సర్వరాక్షససంఘానామ్=సమస్తమైన రాక్షస సముదాయముల, పూర్వకాః=నాయకులు, యే=ఎవరున్నారో, వాళ్ళయొక్క, వినాశాయ=నశింపచేయుటకు, అలమ్=చాలును.

తా. వీరుడైన వాలిపుత్రుడు అంగదుడు ఒక్కడే, సకలరాక్షససముదాయముల నాయకులను కూడ, సంహరించుటకు సమర్థుడు. 14

మూ. పనసస్యోరువేగేన నీలస్య చ మహాత్మనః,
మన్దరోఽప్యవశీర్యేత కింపునర్యుధి రాక్షసాః. 15

ప్ర. అ. పనసస్య=పనసునియొక్క, మహాత్మనః=మహాత్ముడైన, నీలస్య చ=నీలునియొక్క, ఉరువేగేన=గొప్ప వేగముచేత, మన్దరోఽపి=మందరపర్వతము కూడ, అవశీర్యేత=భగ్నమైపోవును, యుధి=యుద్ధములో, రాక్షసాః=రాక్షసులు, కిం పునః=చెప్పనేల ?

తా. మహాత్ముడైన పనసుడు, నీలుడు చూపు మహావేగముచేత మందరపర్వతము కూడ, భగ్నమైపోవును. యుద్ధములో రాక్షసుల విషయము చెప్పవలెనా ? 15

మూ. సదేవాసురయక్షేషు గన్ధర్వోరగపక్షిషు,
మైన్దస్య ప్రతియోద్ధారం శంసత ద్వివిదస్య వా. 16

ప్ర. అ. సదేవాసురయక్షేషు=దేవతలలోను, అసురులలోను, యక్షులలోను, గన్ధర్వోరగపక్షిషు=గంధర్వులలోను,ఉరగులలోను, పక్షులలోను, మైన్దస్య=మైందునకు గాని, ద్వివిదస్య వా=ద్వివిదునకు గాని, ప్రతియోద్ధారమ్=ఎదిరించి యుద్ధము చేయువానిని, శంసత=చెప్పండి.

తా. దేవ-అసుర-గంధర్వ-ఉరగ-పక్షులలో ఎవ్వరైన మైందునకు గాని, ద్వివిదునకు గాని ఎదురుగా నిలచి యుద్ధము చేయగలరా ! చెప్పడు. 16

మూ. అశ్విపుత్రౌ మహాభాగావేతౌ ప్లవగసత్తమౌ,
ఏతయోః ప్రతియోద్ధారం న పశ్యామి రణాజిరే. 17

ప్ర. అ. అశ్విపుత్రౌ=అశ్వినీదేవతల పుత్రులైన, ఏతౌ=ఈ, మహాభాగౌ=మహాభాగ్యవంతులైన మైందద్వివిదులు, ప్లవగసత్తమౌ=వానరులలో శ్రేష్ఠులు,

రణాజిరే=రణరంగమునందు, ఏతయోః=ఈ ఇద్దరికి, ప్రతియోద్ధారమ్=ఎదిరించి యుద్ధము చేయువానిని, న పశ్యామి=చూడను.

తా. అశ్వినీదేవతల పుత్రులూ, మహాభాగ్యవంతులూ అయిన ఈ మైందద్వివిదులు వానరులలో శ్రేష్ఠులు. రణరంగములో వీరిని ఎదిరించి యుద్ధము చేయగలవాడెవ్వడూ కనబడడు. 17

మూ. పితామహవరోత్సేకాత్పరమం దర్పమాస్థితౌ,
అమృతప్రాశనావేతౌ సర్వవానరసత్తమౌ. 18

ప్ర. అ. పితామహవరోత్సేకాత్=బ్రహ్మ ఇచ్చిన వరములవలన కలిగిన, అతిశయము వలన, పరమమ్=గొప్ప, దర్పమ్=దర్పమును, ఆస్థితౌ=అవలంబించిన, ఏతౌ=ఈ, వానరసత్తమౌ=వానరశ్రేష్ఠులు, అమృతప్రాశినౌ=అమృతమును తిన్నవారు.

తా. బ్రహ్మదేవుడిచ్చిన వరమువలన కలిగిన అతిశయముచే దృప్తులై, వానరశ్రేష్ఠులైన ఈ మైందద్వివిదులు అమృతమును భుజించిరి. 18

మూ. అశ్వినోర్మాననార్థం హి సర్వలోకపితామహః,
సర్వావధ్యత్వమతులమనయోర్దత్తవాన్ పురా. 19

ప్ర. అ. పురా=పూర్వము, సర్వలోకపితామహః=సమస్తలోకములకు పితామహుడైన బ్రహ్మదేవుడు, అశ్వినోః=అశ్వినీదేవతలయొక్క, మాననార్థమ్=గౌరవించుటకొరకు, అనయోః=వీరికి, అతులమ్=సాటిలేని, సర్వావధ్యత్వమ్=అందరిచేతను (ఎవ్వరిచేతనూ) చంపశక్యులు కాకుండుటను, దత్తవాన్=ఇచ్చినాడు.

తా. పూర్వము, బ్రహ్మదేవుడు ఈ మైందద్వివిదులకు ఎవ్వరిచేతను చంప శక్యము కాకుండుట అను సాటిలేని వరమును ఇచ్చెను. 19

మూ. వరోత్సేకేన మత్తౌ చ ప్రమథ్య మహతీం చమూమ్,
సురాణామమృతం వీరౌ పీతవన్తౌ ప్లవంగమౌ. 20

ప్ర. అ. వరోత్సేకేన=వరమువలన కలిగిన అతిశయముచేత, మత్తౌ చ=మదించినవారై, వీరౌ=వీరులైన, ప్లవఙ్గమౌ=ఈ ఇద్దరు వానరులు, సురాణామ్=దేవతలయొక్క, మహతీమ్=గొప్పదైన, చమూమ్=సేనను, ప్రమథ్య=మథించి, అమృతమ్=అమృతమును, పీతవన్తౌ=త్రాగినారు.

తా. వరమువలన కలిగిన అతిశయముచేత మదించిన వీరులైన ఈ మైందద్వివిదులు, గొప్ప దేవతాసైన్యమును జయించి అమృతమును త్రాగిరి.20

మూ. ఏతావేవ హి సంక్రుద్ధౌ సవాజిరథకుంజరామ్,
లఙ్కాం నాశయితుం శక్తౌ సర్వే తిష్ఠన్తు వానరాః. 21

ప్ర. అ. సంక్రుద్ధౌ=కోపించిన, ఏతావేవ=ఈ మైందద్వివిదులే, సవాజిరథకుంజరామ్=అశ్వములతోను, రథములతోను ఏనుగులతోను కూడిన, లఙ్కామ్=లంకను, నాశయితుమ్=నశింపచేయుటకు, శక్తౌ=సమర్థులు, సర్వే=సమస్తమైన, వానరాః=వానరులు, తిష్ఠన్తు=ఉందురుగాక.

తా. ఇతరవానరులందరి మాట అట్లుండగా, ఈ మైందద్వివిదులే కోపించినచో అశ్వములతోను, రథములతోను, ఏనుగులతోను కూడిన ఆ లంకా నగరమునంతా నశింపచేయ గలరు. 21

మూ. మయైవ నిహతా లఙ్కా దగ్ధా భస్మీకృతా పునః,
రాజమార్గేషు సర్వత్ర నామ విశ్రావితం మయా. 22

ప్ర. అ. లఙ్కా=లంక, మయైవ=నాచేతనే, నిహతా=నశింపచేయబడినది, రాజమార్గేషు=రాజమార్గములయందు, సర్వత్ర=అంతటా, మయా=నాచేత, నామ=పేరు, విశ్రావితమ్=వినిపింపబడినది.

తా. నేనే లంకను నశింపచేసి, కాల్చి భస్మము చేసి అన్ని రాజమార్గములందు పేరును చాటితిని. 22

మూ. జయత్యతిబలో రామో లక్ష్మణశ్చ మహాబలః,
రాజా జయతి సుగ్రీవో రాఘవేణాభిపాలితః. 23
అహం కోసలరాజస్య దాసః పవనసంభవః,
హనుమానితి సర్వత్ర నామ విశ్రావితం మయా. 24

ప్ర. అ. అతిబలః=అధికమైన బలము గల, రామః=రాముడు, జయతి=సర్వోత్కర్షగా ఉన్నాడు, మహాబలః=గొప్ప బలము గల, లక్ష్మణశ్చ=లక్ష్మణుడు కూడ, సర్వోత్కర్షగా ఉన్నాడు, రాఘవేణ=రాముని చేత, అభిపాలితః=పాలింపబడిన, రాజా=రాజైన, సుగ్రీవః=సుగ్రీవుడు, జయతి=సర్వోత్కర్షగా ఉన్నాడు, పవనసంభవః=వాయుకుమారుడ నైన, అహమ్=నేను, కోసలరాజస్య=కోసలాధిపతి యైన రామునియొక్క, దాసః=దాసుడ నైన, హనుమాన్=హనుమంతుడను, ఇతి=ఇట్లు, మయా=నాచేత, నామ=పేరు, విశ్రావితమ్=చాటబడినది.

తా. "మహాబలశాలి యైన రాముడు, అధికమైన బలము గల లక్ష్మణుడు సర్వోత్కర్షగా ఉన్నారు. రామునిచేత పాలింపబడిన వానర రాజైన సుగ్రీవుడు

సర్వోత్కర్షగా ఉన్నాడు. వాయుపుత్రుడ నైన నేను రాముని దాసుడనైన హనుమంతుడను" అని నేను రామాదుల పేర్లను అంతటా ఘోషించితిని.

మూ. అశోకవనికామధ్యే రావణస్య దురాత్మనః,
అధస్తాచ్ఛింశుపావృక్షే సాధ్వీ కరుణమాస్థితా. 25
రాక్షసీభిః పరివృతా శోకసంతాపకర్శితా,
మేఘలేఖాపరివృతా చన్ద్రలేఖేవ నిష్ప్రభా, 26
అచిన్తయన్తీ వైదేహీ రావణం బలదర్పితమ్.

ప్ర. అ. దురాత్మనః=దుర్బుద్ధియైన, రావణస్య=రావణునియొక్క, అశోకవనికామధ్యే=అశోకవనమధ్యయందు, శింశుపావృక్షే=శింశుపావృక్షము (యొక్క), అధస్తాత్=క్రింద, సాధ్వీ=పతివ్రతా, రాక్షసీభిః=రాక్షసస్త్రీలచేత, పరివృతా=చుట్టబడినదీ, శోకసంతాపకర్శితా=శోకముచేత, మనస్తాపము చేత కృశింపచేయబడినది, మేఘలేఖాపరివృతా=మేఘలేఖచేత చుట్టబడిన, చన్ద్రలేఖేవ=చంద్రలేఖ వలె, నిష్ప్రభా=కాంతి లేనిదీ, బలదర్పితమ్=బలము చేత గర్వించిన, రావణమ్=రావణుని, అచిన్తయన్తీ=ఆలోచించనిదీ అయిన, వైదేహీ=సీత, కరుణమ్=దైన్యమును, ఆస్థితా=అవలంబించి ఉన్నది.

తా. దురాత్ముడైన రావణుని అశోకవనమధ్యమునందు, శింశుపావృక్ష మూలమునందు మహాపతివ్రతయైన సీత దైన్యముతో ఉన్నది. శోకముతోను, మనస్తాపముతోను కృశించిన ఆమె చుట్టూ రాక్షసస్త్రీలు కాపలా కాయుచున్నారు. ఆమె చుట్టూ మేఘలేఖ ఉన్న చంద్రలేఖ వలె కాంతివిహీనురాలై ఉన్నది. ఆమె, బలము చేత గర్వించిన రావణుని గూర్చి మనసా కూడ స్మరించుట లేదు.

మూ. పతివ్రతా చ సుశ్రోణీ అవష్టబ్ధా చ జానకీ, 27
అనురక్తా హి వైదేహీ రామం సర్వాత్మనా శుభా,
అనన్యచిత్తా రామే చ పౌలోమీవ పురన్దరే. 28

ప్ర. అ. పతివ్రతా=పతివ్రత యైన, సుశ్రోణీ=అందమైన కటిప్రదేశము గల, జానకీ=జానకి, అవష్టబ్ధా=నిరోధింపబడి ఉన్నది. శుభా=మంగళప్రదురాలైన, వైదేహీ=సీత, సర్వాత్మనా=అన్ని విధముల, రామమ్=రాముణ్ణి, అనురక్తా=అనురాగము గలది, పురందరే=దేవేంద్రుని విషయమున, పౌలోమీవ=శచీదేవి వలె, రామే=రామునియందు, అనన్యచిత్తా=ఏకాగ్రమైన చిత్తము గలది.

తా. అందమైన కటిప్రదేశము గల, పతివ్రతయైన జానకి లంకలో నిరోధింపబడి ఉన్నది. మంగళప్రదురాలైన ఆ వైదేహి సర్వవిధముల రామునియందు

అనురాగవంతురాలై ఉన్నది. శచీదేవి దేవేంద్రునియందు ఏకాగ్రచిత్తురాలై ఉన్నట్లు, రామునియందు ఏకాగ్రచిత్తురాలై ఉన్నది. 27, 28

మూ. తదేకవాసఃసంవీతా రజోధ్వస్తా తథైవ చ,
శోకసంతాపదీనాఙ్గీ సీతా భర్తృహితే రతా. 29

ప్ర. అ. తదేకవాసఃసంవీతా=ఆ ఒక్కవస్త్రమునే కట్టుకొని ఉన్నదీ, తథైవ చ=మరియు, రజోధ్వస్తా=పరాగముచేత శోభావిహీనురాలూ, శోకసంతాపదీనాఙ్గీ=శోకముచేత సంతాపముచేత దీనమైన శరీరము గలదీ అయిన, సీతా=సీత, భర్తృహితే=భర్తయొక్క హితమునందే, రతా=ఆసక్తి గలది.

తా. ఆ సీతాదేవి ఆ ఒక్కవస్త్రమునే చుట్టబెట్టుకొని, శరీరమంతా దుమ్ము కప్పివేయుటచే కాంతివిహీనురాలై ఉన్నది. ఆమె శరీరము శోకముచేత, సంతాపముచేత దుర్బలమై పోయినది. ఆమె భర్త హితమునే సర్వవిధాల కోరుకొనుచున్నది. 29

మూ. సా మయా రాక్షసీమధ్యే తర్జ్యమానా ముహుర్ముహుః,
రాక్షసీభిర్విరూపాభిర్దృష్టా హి ప్రమదావనే, 30
ఏకవేణీధరా దీనా భర్తృచిన్తాపరాయణా.
అధఃశయ్యా వివర్ణాఙ్గీ పద్మినీవ హిమాగమే,
రావణాద్వినివృత్తార్థా మర్తవ్యకృతనిశ్చయా. 31

ప్ర. అ. విరూపాభిః=వికృతములైన, ఆకారములు గల, రాక్షసీభిః=రాక్షసస్త్రీలచేత, ముహుర్ముహుః=మాటి మాటికి, తర్జ్యమానా=భయపెట్టబడుచున్నది. ఏకవేణీధరా=ఒకే జడను ధరించినది, దీనా=దీనురాలు, భర్తృచిన్తాపరాయణా=భర్తను గూర్చిన చింతయందు లగ్నమైనది, అధఃశయ్యా=నేల శయనముగా గలది, హిమాగమే= శిశిరర్తువునందు, పద్మినీవ=పద్మలత వలె, వివర్ణాఙ్గీ=చెడిన రంగు గల శరీరము గలదీ, రావణాత్=రావణునినుండి, వినివృత్తార్థా=మరలిన ప్రయోజనము గలది, మర్తవ్యకృతనిశ్చయా=మరణించవలెనని చేయబడిన నిశ్చయము కలది అయిన, సా=ఆ సీత, మయా=నాచేత, రాక్షసీమధ్యే=రాక్షసస్త్రీల మధ్యయందు, ప్రమదావనే=ఉద్యానవనమునందు, దృష్టా=చూడబడినది.

తా. ఆ సీతను నేను రాక్షసస్త్రీలమధ్య ఉద్యానమునందు చూచితిని. ఆమెను రాక్షసస్త్రీలు మాటిమాటికి భయపెట్టుచుండిరి. ఒకే జడతో దీనురాలైన ఆమె భర్తను గురించిన చింతలో నిమగ్నమై ఉన్నది. నేలపై శయనించుచు, రంగు మారిపోయిన శరీరముతో ఆమె శిశిరర్తువునందలి పద్మలత వలె ఉన్నది. ఆమె రావణుని విషయమున విముఖురాలై మరణించవలెనని నిశ్చయించుకొన్నది.

మూ. కథంచిన్మృగశాబాక్షీ విశ్వాసముపపాదితా, 32
తతః సంభాషితా చైవ సర్వమర్థం చ దర్శితా,
రామసుగ్రీవసఖ్యం చ శ్రుత్వా ప్రీతిముపాగతా. 33

ప్ర. అ. మృగశాబాక్షీ=లేడిపిల్ల కండ్ల వంటి కళ్లు గల ఆమె, కథంచిత్=అతికష్టముగా, విశ్వాసమ్=విశ్వాసమును, ఉపపాదితా=పుట్టించబడినది. తతః=అటుపిమ్మట, సంభాషితా చైవ=మాటలాడబడినదై, సర్వమ్=సమస్తమైన, అర్థం చ=విషయమును, దర్శితా=చూపబడినది, రామసుగ్రీవసఖ్యం చ=రామసుగ్రీవుల స్నేహమును కూడ, శ్రుత్వా=విని, ప్రీతిమ్=సంతోషమును, ఉపాగతా=పొందినది.

తా. లేడి పిల్ల కళ్ళవంటి కళ్లు గల ఆ సీతకు అతికష్టముగా విశ్వాసము కలిగించితిని. పిమ్మట ఆమెతో మాటలాడి విషయములన్నీ తెలిపితిని. రామసుగ్రీవుల మధ్య స్నేహము ఏర్పడినదను విషయము విని ఆమె సంతోషము పొందినది. 32, 33

మూ. నియతః సముదాచారో భక్తిర్భర్తరి చోత్తమా,
యన్న హన్తి దశగ్రీవం సా మహాత్మా కృతాగసమ్. 34

ప్ర. అ. మహాత్మా=మహాత్మురాలైన, సా=ఆమె, కృతాగసమ్=చేయబడిన అపరాధము గల, దశగ్రీవమ్=రావణుని, న హన్తి ఇతి యత్=చంపుటలేదను మాట ఏది కలదో దానికి, నియతః=నిశ్చితమైన, సముదాచారః=సముదాచారము (నియమములను పాటించు స్వభావము), భర్తరి=భర్త యందు, ఉత్తమా=ఉత్తమమైన, భక్తిః=భక్తి (కారణము).

తా. మహాత్మురాలైన ఆ సీతాదేవి అపరాధము చేసిన ఆ రావణుని చంపుటలేదన్నచో అందుకు నియమములను పాటించుటయందు ఆమెకున్న శ్రద్ధ, భర్తమీద ఉత్తమమైన భక్తి కారణము. 34

మూ. నిమిత్తమాత్రం రామస్తు వధే తస్య భవిష్యతి,
సా ప్రకృత్యైవ తన్వఙ్గీ తద్వియోగాచ్చ కర్శితా, 35
ప్రతిపత్పాఠశీలస్య విద్యేవ తనుతాం గతా.

ప్ర. అ. రామస్తు=రాముడైతే, తస్య=ఆ రావణునియొక్క, వధే=వధ యందు, నిమిత్తమాత్రం=కేవలం నిమిత్తము మాత్రమే, భవిష్యతి=కాగలడు, ప్రకృత్యైవ=స్వభావము చేత, తన్వఙ్గీ=సన్నని శరీరము గలది, తద్వియోగాత్=రాముని వియోగము వలన, కర్శితా చ=కృశించిన, సా=ఆ సీత, ప్రతిపత్పాఠశీలస్య=ప్రతిపత్తునందు పఠించు స్వభావము గల వానియొక్క, విద్యేవ=విద్య వలె, తనుతామ్=కృశత్వమును, గతా=పొందినది.

తా. ఆ రావణుని చంపుటకు రాముడు కేవలము నిమిత్తము మాత్రమే కాగలడు. స్వభావముచేతనే సన్నని శరీరము గల ఆ సీత, రాముని వియోగముచేత కృశించినదై, ప్రతిపత్తునందు చదివేవాని చదువు వలె చాల సన్నబడి పోయినది.

మూ. ఏవమత్ర మహాభాగా సీతా శోకపరాయణా, 36
యదత్ర ప్రతికర్తవ్యం తత్సర్వముపపాద్యతామ్.

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే సున్దరకాణ్డే
ఏకోనషష్టితమః సర్గః.

ప్ర. అ. మహాభాగా=మహాభాగ్యవంతురా లైన, సీతా=సీత, అత్ర=ఇక్కడ, ఏవమ్=ఈ విధముగా, శోకపరాయణా=శోకమునకు అధీనురాలై ఉన్నది. అత్ర=ఈ విషయమున, యత్=ఏది, ప్రతికర్తవ్యమ్=ప్రతిక్రియచేయదగినదో, తత్ సర్వమ్=అది అంతా, ఉపపాద్యతామ్=చేయబడుగాక.

తా. మహాభాగ్యవంతురాలైన సీత ఈ విధముగా లంకానగరములో శోకములో మునిగి ఉన్నది. అదుచేత ఈ విషయమునందు చేయవలసిన ప్రతి క్రియ చేయబడుగాక. 36

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు
సుందరకాండలో ఏబదితొమ్మిదవ సర్గ సమాప్తము.

అథ షష్టితమః సర్గః

[లంకను జయించి సీతను మనమే తీసికొని రావలెనని అంగదుడు ఉత్సాహముతో పలుకుట; అట్లు చేయుట యుక్తము కాదని జాంబవంతుడు చెప్పుట].

మూ. తస్య తద్వచనం శ్రుత్వా వాలిసూనురభాషత,
అయుక్తం తు వినా దేవీం దృష్టవద్భిశ్చ వానరాః, 1
సమీపం గన్తుమస్మాభీ రాఘవస్య మహాత్మనః.

ప్ర. అ. తస్య=హనుమంతునియొక్క, తత్=ఆ, వచనమ్=వచనమును, శ్రుత్వా=విని, వాలిసూనుః=వాలిపుత్రుడు, అభాషత=పలికెను. వానరాః=వానరులారా ! దృష్టవద్భిః=(సీతాదేవిని) చూచిన, అస్మాభిః=మనచేత, దేవీం వినా=దేవి లేకుండా, మహాత్మనః=మహాత్ముడైన, రాఘవస్య=రామునియొక్క, సమీపమ్=సమీపమును గూర్చి, గన్తుమ్=వెళ్ళుటకు, అయుక్తం తు=యుక్తము కాదు.

తా. హనుమంతుని మాటలు విని అంగదుడు ఇట్లు పలికెను. వానరులారా ! దేవిని చూచిన పిమ్మట కూడ మనము ఆమెను మనతో తీసికొనిపోకుండా మహాత్ముడైన రాముని వద్దకు వెళ్లుట యుక్తము కాదు. 1

మూ. దృష్టా దేవీ న చానీతా ఇతి తత్ర నివేదనమ్, 2
అయుక్తమివ పశ్యామి భవద్భిః ఖ్యాతవిక్రమైః.

ప్ర. అ. ఖ్యాతవిక్రమైః=ప్రసిద్ధమైన పరాక్రమము గల, భవద్భిః=మీచేత, దేవీ=దేవి, దృష్టా=చూడబడినది, న ఆనీతా చ=తీసికొని రాబడలేదు, ఇతి= ఇట్లు, తత్ర=అక్కడ, నివేదనమ్=తెలుపుట, అయుక్తమివ=అయుక్తమును వలె, పశ్యామి=చూచుచున్నాను.

తా. "దేవిని చూచినాము, కాని ఆమెను తీసుకొని రాలేదు" అని ప్రసిద్ధమైన పరాక్రమము గల మీరు అక్కడికి వెళ్ళి చెప్పుట అయుక్తమని నా అభిప్రాయము. 2

మూ. న హి నః ప్లవనే కశ్చిన్నాపి కశ్చిత్పరాక్రమే, 3
తుల్యః సామరదైత్యేషు లోకేషు హరిసత్తమాః.

ప్ర. అ. హరిసత్తమాః=వానరశ్రేష్ఠులారా ! సామరదైత్యేషు=దేవతలతోను, దైత్యులతోను కూడిన, లోకేషు=లోకములందు, ప్లవనే=ఎగురుటయందు, నః=మనకు, తుల్యః=సమానుడు, కశ్చిత్=ఎవ్వడూ, న హి=లేదు కదా. పరాక్రమేఽపి=పరాక్రమము నందు కూడ, తుల్యుడు, కశ్చిత్=ఎవ్వడూ, న=లేదు.

తా. ఓ ! వానరశ్రేష్ఠులారా ! దేవతలతోను, దైత్యులతోను కూడిన లోకములలో ఎగురుట యందు గాని, పరాక్రమమునందు గాని మనతో సమానుడు ఎవ్వడు లేదు కదా ! 3

మూ. తేష్వేవం హతవీరేషు రాక్షసేషు హనూమతా, 4
కిమన్యదత్ర కర్తవ్యం గృహీత్వా యామ జానకీమ్.

ప్ర. అ. తేషు=ఆ, రాక్షసేషు=రాక్షసులు, హనూమతా=హనుమంతునిచేత, ఏవమ్=ఇట్లు, హతవీరేషు=చంపబడిన వీరులు కలవారగుచుండగా, అత్ర=ఈ విషయమునందు, కిమ్=ఏమి, అన్యత్=మరి యొకటి, కర్తవ్యమ్=చేయదగినది ? జానకీమ్=జానకిని, గృహీత్వా=గ్రహించి, యామ=వెళ్ళెదము.

తా. రాక్షసులలోని వీరులనందరినీ హనుమంతుడీవిధముగ చంపివేసినాడు కదా ? ఇంక మనము చేయవలసిన మరొక పని ఏమున్నది ? జానకిని తీసుకొనియే వెళ్ళెదము. 4

మూ. తమేవం కృతసంకల్పం జామ్బవాన్ హరిసత్తమః, 5
ఉవాచ పరమప్రీతో వాక్యమర్థవదర్థవిత్.

ప్ర. అ. అర్థవిత్=కార్యమును ఎరిగిన, హరిసత్తమః=వానరశ్రేష్ఠుడైన, జామ్బవాన్=జాంబవంతుడు, పరమప్రీతః=చాల సంతోషించినవాడై, ఏవమ్=ఇట్లు, కృతసంకల్పమ్=చేయబడిన సంకల్పము గల, తమ్=అతనిని గూర్చి, అర్థవత్=ఉత్తమమైన అర్థము గల, వాక్యమ్=వాక్యమును, ఉవాచ=పలికెను.

తా. ఏ కార్యము ఎట్లు చేయవలెనో తెలిసినవాడు, వానరశ్రేష్ఠుడు అయిన జాంబవంతుడు చాల సంతోషించినవాడై, ఈ విధముగా సంకల్పము చేసిన ఆ అంగదునితో ఉత్తమమైన అర్థము గల వాక్యమును పలికెను. 5

మూ. న తావదేషా మతిరక్షమా నో
యథా భవాన్ పశ్యతి రాజపుత్ర,
యథా తు రామస్య మతిర్నివిష్టా
తథా భవాన్ పశ్యతు కార్యసిద్ధిమ్. 6

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే సున్దరకాణ్డే
షష్టితమః సర్గః.

ప్ర. అ. రాజపుత్ర=రాజకుమారా ! భవాన్=నీవు, యథా=ఎట్లు, పశ్యతి=చూచుచున్నావో, ఏషా=ఈ, మతిః=ఆలోచన, నః=మనకు, అక్షమా=తగనిది న తావత్=కాదు, తు=కాని, రామస్య=రామునియొక్క, మతిః=బుద్ధి, యథా=ఎట్లు, నివిష్టా=ఉన్నదో, తథా=అట్లు, భవాన్=నీవు, కార్యసిద్ధిమ్=కార్యసిద్ధిని, పశ్యతు=చూచెదవు గాక.

తా. రాజకుమారా ! నీవు చేసిన ఆలోచన మనకు తగనిది కాదు. యుక్తమైనదే. కాని రాముని ఆలోచన ఎట్లు ఉండునో ఆ విధముగా నీవు కార్యసిద్ధి కలుగునట్లు ఆలోచించుము. 6

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు
సుందరకాండలో అరువదవ సర్గ సమాప్తము.

అథ ఏకషష్టితమః సర్గః

[వానరులు మధువనములో ప్రవేశించి మధువును, ఫలములను యథేష్ట ముగా తినుట, వనరక్షకులను నేలపై పడవేసి ఈడ్చుట].

మూ. తతో జామ్బవతో వాక్యమగృహ్ణన్త వనౌకసః,
అఙ్గదప్రముఖా వీరా హనుమాంశ్చ మహాకపిః. 1

ప్ర. అ. తతః=అటు పిమ్మట, అఙ్గదప్రముఖాః=అంగదుడు మొదలైన, వీరాః=వీరులైన, వనౌకసః=వానరులు, మహాకపిః=వానరులలో గొప్ప వాడైన, హను మాంశ్చ=హనుమంతుడు, జామ్బవతః=జాంబవంతునియొక్క, వాక్యమ్=వాక్యమును, అగృహ్ణన్త=గ్రహించిరి.

తా. పిమ్మట అంగదుడు మొదలైన వీరులైన వానరులూ, వానరశ్రేష్ఠుడైన హనుమంతుడు జాంబవంతుని వాక్యమును అంగీకరించిరి. 1

మూ. ప్రీతిమన్తస్తతః సర్వే వాయుపుత్రపురస్సరాః,
మహేన్ద్రాగ్రిం పరిత్యజ్య పుప్లువుః ప్లవగర్షభాః. 2

మేరుమన్దరసంకాశా మత్తా ఇవ మహాగజాః,
ఛాదయన్త ఇవాకాశం మహాకాయా మహాబలాః. 3

సభాజ్యమానం భూతైస్తమాత్మవన్తం మహాబలమ్,
హనూమన్తం మహావేగం వహన్త ఇవ దృష్టిభిః. 4

రాఘవే చార్థనిర్వృత్తిం కర్తుం చ పరమం యశః,
సమాధాయ సమృద్ధార్థాః సర్వేసిద్ధిభిరున్నతాః. 5

ప్రియాఖ్యానోన్ముఖాః సర్వే సర్వే యుద్ధాభినన్దినః,
సర్వే రామప్రతీకారే నిశ్చితార్థా మనస్వినః. 6

ప్ర. అ. తతః=అటు పిమ్మట, మేరుమన్దరసంకాశాః=మేరు-మందర పర్వతములతో సమానులు, మత్తాః=మదించిన, గజాః ఇవ=ఏనుగులు వలె ఉన్నవారు, ఆకాశమ్=ఆకాశమును, ఛాదయన్తః ఇవ=కప్పుచున్నట్లున్నవారు, మహాకాయాః=గొప్ప శరీరములు కలవారు, మహాబలాః=గొప్ప బలము గల

వారు అయిన, ప్లవగర్షభాః=వానరశ్రేష్ఠులు, సర్వే=అందరు, మహేన్ద్రాద్రిమ్=మహేంద్రపర్వతమును, పరిత్యజ్య=విడచి, ప్రీతిమన్తః=సంతోషముగలవారై, వాయుపుత్రపురస్సరాః=హనుమంతుడు, పురఃసరుడుగా, (ముందునడచువాడుగా) కలవారై, భూతైః=ప్రాణులచేత, సభాజ్యమానమ్=ఆదరింపబడుచున్నవాడు, ఆత్మవన్తమ్=మంచిబుద్ధి కలవాడు, మహాబలమ్=గొప్ప బలము గలవాడు, మహావేగమ్=గొప్ప వేగము గలవాడు అయిన, హనూమన్తమ్=హనుమంతుని, దృష్టిభిః=దృష్టులచేత, వహన్తః ఇవ=మోయుచున్నవారు వలె, రాఘవే=రామునియందు, అర్థనిర్వృత్తిమ్=కార్యసాఫల్యమును, పరమమ్=గొప్ప, యశః=కీర్తిని, కర్తుమ్=చేయుటకు, సమాధాయ=నిశ్చయించుకొని, సమృద్ధార్థాః=సఫలమైన, కార్యము కలవారై, కర్మసిద్ధిభిః=కార్యసిద్ధులచే, ఉన్నతాః=చాల ఉత్సాహవంతులై, పుప్లువుః=ఎగిరివెళ్ళిరి. సర్వే=అందరూ, ప్రియాఖ్యానోన్ముఖాః=ప్రియమును చెప్పుటకు ఉన్ముఖులై ఉండిరి. సర్వే=అందరూ, యుద్ధాభినన్దినః=యుద్ధమును అభినందించువారు. మనస్వినః=ఉన్నతమైన మనస్సు గల, సర్వే=అందరూ, రామప్రతీకారే=రాముని ప్రతీకారమునందు, నిశ్చితార్థాః=నిశ్చయించబడిన కార్యము కలవారు.

తా. పిమ్మట, మేరు మందరపర్వతముల వలె, మదించిన మహాగజముల వలె ఉన్న ఆ వానరశ్రేష్ఠులందరు, వాయుపుత్రుణ్ణి ముందు ఉంచుకొని, మహేంద్రాద్రిని విడచి, సంతోషముతో ఎగిరి వెళ్ళిరి. పెద్ద దేహములు, అధికమైన బలము గల వాళ్ళు ఆకాశమును కప్పివేయుచున్నట్లు ఉండిరి. సమస్త ప్రాణులచేత గౌరవింపబడుచున్న బుద్ధిశాలీ, మహాబలుడూ అయిన, మహావేగవంతుడైన హనుమంతుని వారు తమ దృష్టులతో మోయుచున్నట్లు ఉండిరి. రాముని కార్యమును సఫలము చేయుటకు, గొప్ప కీర్తిని సంపాదించుటకు నిశ్చయించుకొనిరి. కార్యమును సఫలము చేసికొని, ఆ కార్యసిద్ధికే అధికోత్సాహముతో ఉండిరి. వారందరూ ప్రియవార్తను చెప్పుటకు తొందరపడుచుండిరి. అందరు యుద్ధమును అభినందించుచుండిరి. ఆత్మాభిమానవంతులైన వారందరు రాముని విషయమున రావణుడు చేసిన అపకారమునకు ప్రతిక్రియ చేయ నిశ్చయించుకొని యుండిరి.

మూ. ప్లవమానాః ఖమాప్లుత్య తతస్తే కాననౌకసః,
నన్దనోపమమాసేదుర్వనం ద్రుమలతాయుతమ్. 7

ప్ర. అ. తతః=అటు పిమ్మట, తే=ఆ, కాననౌకసః=వానరులు, ఖమ్=ఆకాశమును గూర్చి, ఆప్లుత్య=ఎగిరి, ప్లవమానాః=ఆకాశములో తేలియాడుచు, ద్రుమలతాయుతమ్=వృక్షములతోను, లతలతోను కూడిన, నన్దనోపమమ్=నందన వనముతో సమానమైన, వనమ్=వనమును, ఆసేదుః=చేరిరి.

తా. పిమ్మట ఆ వానరులు ఆకాశముపైకి ఎగిరి, తేలియాడుచు, వృక్షములతోను లతలతోను కూడిన నందనవనముతో సమాన మైన ఉద్యానవనమును చేరిరి. 7

మూ. యత్తన్మధువనం నామ సుగ్రీవస్యాభిరక్షితమ్,
అధృష్యం సర్వభూతానాం సర్వభూతమనోహరమ్. 8

ప్ర. అ. అభిరక్షితమ్=రక్షింపబడినది, సర్వభూతానామ్=సకలప్రాణులకు, అధృష్యమ్=ఆక్రమింప శక్యము కానిది, సర్వభూతమనోహరమ్=సకలప్రాణులకు మనోహరమూ అయిన, యత్=ఏ, సుగ్రీవస్య=సుగ్రీవుని యొక్క, మధువనం నామ=మధువన మనునది కలదో, తత్=ఆ వనమును (చేరిరి). 8

మూ. యద్రక్షతి మహావీర్యః సదా దధిముఖః కపిః,
మాతులః కపిముఖ్యస్య సుగ్రీవస్య మహాత్మనః. 9

ప్ర. అ. మహాత్మనః=మహాత్ముడు, కపిముఖ్యస్య=వానరనాయకుడు అయిన, సుగ్రీవస్య=సుగ్రీవునియొక్క, మాతులః=మేనమామ, మహావీర్యః=గొప్ప పరాక్రమము గలవాడు అయిన, దధిముఖః=దధిముఖుడనే, కపిః=వానరుడు, యత్=దేనిని, సదా=ఎల్లప్పుడు, రక్షతి=రక్షించుచున్నాడో (ఆ వనమును చేరిరి).

తా. మహాత్ముడు, వానరరాజు అయిన సుగ్రీవుని మేనమామ, మహా పరాక్రమవంతుడు అయిన దధిముఖుడు అను వానరుడు ఎల్లప్పుడు దానిని రక్షించుచుండును. 9

మూ. తే తద్వనముపాగమ్య బభూవుః పరమోత్కటాః,
వానరా వానరేన్ద్రస్య మనఃకాన్తతమం మహత్. 10

ప్ర. అ. తే=ఆ, వానరాః=వానరులు, వానరేన్ద్రస్య=సుగ్రీవుని యొక్క, మనఃకాన్తతమమ్=మనస్సుకు చాల మనోహరమైన, మహత్=గొప్పదైన, తత్=ఆ, వనమ్=వనమును, ఉపాగమ్య=చేరి, పరమోత్కటాః=చాల వేడుక కలవారు, బభూవుః=అయిరి.

తా. ఆ వానరులు, వానరరాజైన సుగ్రీవుని మనస్సుకు చాల ప్రియమైన ఆ గొప్ప వనమును చేరగానే వారికి దానిలోని మధువు మొదలగువాటిని ఆస్వాదించుటకు ఎక్కువ ఆసక్తి కలిగెను. 10

మూ. తతస్తే వానరా హృష్టా దృష్ట్వా మధువనం మహత్,
కుమారమభ్యయాచన్త మధూని మధుపిఙ్గలాః. 11

ప్ర. అ. తతః=అటుపిమ్మట, మధుపిఙ్గలాః=తేనెవలె పింగల వర్ణము గల, తే వానరాః=ఆ వానరులు, మహత్=గొప్పదైన, మధువనమ్=మధువనమును, దృష్ట్వా=చూచి, హృష్టాః=సంతోషించినవారై, కుమారమ్=అంగదుని, మధూని=మధువులను, అభ్యయాచన్త=యాచించిరి.

తా. పిమ్మట తేనె వలె పింగలవర్ణము గల ఆ వానరులు గొప్పదైన ఆ మధువనమును చూచి, సంతోషించినవారై, మధువుల నిమిత్తమై అంగదుని ప్రార్థించిరి. 11

మూ. తతః కుమారస్తాన్ వృద్ధాన్ జామ్బవత్ప్రముఖాన్ కపీన్,
అనుమాన్య దదౌ తేషాం నిసర్గం మధుభక్షణే. 12

ప్ర. అ. తతః=అటుపిమ్మట, కుమారః=అంగదుడు, వృద్ధాన్=వృద్ధులైన, తాన్=ఆ, జామ్బవత్ప్రముఖాన్=జాంబవంతుడు మొదలైన, కపీన్=వానరులను, అనుమాన్య=అంగీకరింపచేసి, తేషామ్=వారికి, మధుభక్షణే=మధువును భక్షించుట యందు, నిసర్గమ్=స్వేచ్ఛను (అనుజ్ఞను), దదౌ=ఇచ్చెను.

తా. పిమ్మట అంగదుడు జాంబవంతుడు మొదలైన వృద్ధులైన వానరుల అనుమతి తీసికొని, వానరులకు మధువును భక్షించుటకు అనుమతి ఇచ్చెను.

మూ. తతశ్చానుమతాః సర్వే సంప్రహృష్టా వనౌకసః,
ముదితాః ప్రేరితాశ్చాపి ప్రనృత్యన్తోఽభవంస్తదా. 13

ప్ర. అ. తతః=అటు పిమ్మట, సర్వే=సమస్తమైన, వనౌకసః=వానరులు, అనుమతాః=అనుమతించబడినవారై, సంప్రహృష్టాః=చాల సంతోషించిరి. తదా=అప్పుడు, ప్రేరితాః=(మధుభక్షణమునకై) ప్రేరేపింపబడిన ఆ వానరులు, ముదితాః=సంతోషించినవారై, ప్రనృత్యన్తః=అధికముగా నృత్యము చేయుచున్నవారు, అభవన్=అయిరి.

తా. పిమ్మట, అనుమతింపబడిన ఆ వానరులు అందరు చాల సంతోషించిరి. ఈ విధముగ ప్రేరితులై సంతోషించిన ఆ వానరులు నృత్యము చేసిరి. 13

మూ. గాయన్తి కేచిత్ప్రణమన్తి కేచి
న్నృత్యన్తి కేచిత్ప్రహసన్తి కేచిత్,
పతన్తి కేచిద్విచరన్తి కేచి
త్ప్లవన్తి కేచిత్ప్రలపన్తి కేచిత్. 14

ప్ర. అ. కేచిత్=కొందరు, గాయన్తి=గానము చేయుచున్నారు. కేచిత్=కొందరు, ప్రణమన్తి=నమస్కరించుచున్నారు. కేచిత్=కొందరు, నృత్యన్తి=నాట్యము చేయుచున్నారు. కేచిత్=కొందరు, ప్రహసన్తి=నవ్వుచున్నారు. కేచిత్=కొందరు, పతన్తి=క్రిందపడుచున్నారు. కేచిత్=కొందరు, విచరన్తి=సంచరించుచున్నారు. కేచిత్=కొందరు, ప్లవన్తి=పైకి ఎగురుచున్నారు, కేచిత్=కొందరు, ప్రలపన్తి=ప్రేలుచున్నారు.

తా. మధుమదముచేత కొందరు పాడుచున్నారు. కొందరు దండాలు పెట్టుచున్నారు. కొందరు ఆడుచున్నారు. కొందరు నవ్వుచున్నారు. కొందరు క్రిందపడుచున్నారు. కొందరు పచార్లు చేయుచున్నారు. కొందరు ఎగరుచున్నారు. కొందరు ఏమేమో ప్రేలుచున్నారు. 14

మూ. పరస్పరం కేచిదుపాశ్రయన్తే
పరస్పరం కేచిదుపాక్రమన్తే,
పరస్పరం కేచిదుపబ్రువన్తే
పరస్పరం కేచిదుపారమన్తే. 15

ప్ర. అ. కేచిత్=కొంతమంది, పరస్పరమ్=పరస్పరము, ఉపాశ్రయన్తే=ఆశ్రయించుచున్నారు. కేచిత్=కొందరు, పరస్పరమ్=పరస్పరము, ఉపాక్రమన్తే=ఆక్రమించుచున్నారు. కేచిత్=కొందరు, పరస్పరమ్=పరస్పరము, ఉపబ్రువన్తే=మాటలాడుచున్నారు. కేచిత్=కొందరు, పరస్పరమ్=పరస్పరము, ఉపారమన్తే=క్రీడించుచున్నారు.

తా. కొందరు ఒండొరులతో జట్టాబట్టాలు వేసికొని తిరుగుచున్నారు. కొందరు ఒండొరులమీద ఎక్కుచున్నారు. కొందరు ఒండొరులతో మాటలాడుకొనుచున్నారు. కొందరు ఒండొరులతో క్రీడించుచున్నారు. 15

మూ. ద్రుమాద్ద్రుమం కేచిదభిద్రవన్తే
క్షితౌ నగాగ్రాన్నిపతన్తి కేచిత్,
మహీతలాత్కేచిదుదీర్ణవేగా
మహాద్రుమాగ్రాణ్యభిసంపతన్తి. 16

ప్ర. అ. కేచిత్=కొందరు, ద్రుమాత్=ఒక చెట్టుమీద నుంచి, ద్రుమమ్=మరొక చెట్టును గూర్చి, అభిద్రవన్తే=పరుగెత్తుచున్నారు. కేచిత్=కొందరు, నగాగ్రాత్=వృక్షాగ్రమునుండి క్షితౌ=నేలమీదకు, నిపతన్తి=పడుచున్నారు. కేచిత్=

కొందరు, ఉద్దీర్ణవేగాః=అత్యధిక మైన వేగము గలవారై, మహీతలాత్=భూమినుండి, మహాద్రుమాగ్రాణి=మహావృక్షముల అగ్రములను గూర్చి, అభిసంపతన్తి=పరుగెత్తు చున్నారు.

తా. కొందరు ఒక చెట్టుమీదనుంచి మరొక చెట్టువైపుకు పరుగెత్తు చున్నారు. కొందరు చెట్టుమీదనుంచి నేలమీదికి ఉరుకుచున్నారు. కొందరు మహావేగముతో నేలమీదనుంచి మహావృక్షములపైకి పరుగెత్తుచున్నారు. 16

మూ. గాయన్తమన్యః ప్రహసన్నుపైతి
హసన్తమన్యః ప్రరుదన్నుపైతి
రుదన్తమన్యః ప్రణుదన్నుపైతి
నుదన్తమన్యః ప్రణదన్నుపైతి. 17

ప్ర. అ. గాయన్తమ్=పాడుచున్నవానిని, అన్యః=మరొకడు, ప్రహసన్=న వ్వుచు, ఉపైతి=సమీపించుచున్నాడు. హసన్తమ్=నవ్వుచున్నవానిని, అన్యః=మరి యొకడు, ప్రరుదన్=ఏడ్చుచు, ఉపైతి=సమీపించుచున్నాడు. రుదన్తమ్=ఏడ్చుచున్న వానిని, అన్యః=మరియొకడు, ప్రణుదన్=త్రోయుచు, ఉపైతి=సమీపించుచున్నాడు. నుదన్తమ్=తోయుచున్నవానిని, అన్యః=మరియొకడు, ప్రణదన్=అరచుచు, ఉపైతి= సమీపించుచున్నాడు.

తా. ఒకడు పాడుచుండగా మరొకడు నవ్వుతూ ఆతనిని చేరుచున్నాడు. నవ్వుచున్నవానిని మరొకడు ఏడ్చుచు సమీపించుచున్నాడు. ఏడ్చుచున్నవానిని మరొకడు గెంటుచు సమీపించుచున్నాడు. గెంటుచున్న వానిని మరొకడు అరచుచు సమీపించుచున్నాడు. 17

మూ. సమాకులం తత్కపిసైన్యమాసీ
న్మధుప్రపానోత్కటసత్త్వచేష్టమ్,
న చాత్ర కశ్చిన్న బభూవ మత్తో
న చాత్ర కశ్చిన్న బభూవ తృప్తః. 18

ప్ర. అ. మధుప్రపానోత్కటసత్త్వచేష్టమ్=మధువును అధికముగా త్రాగుటచే తీవ్రముగా ఉన్న మనస్సులూ, చేష్టలూ గల, తత్=ఆ, కపిసైన్యమ్=వానరసైన్యము, సమాకులమ్=వ్యాకులముగా, ఆసీత్=అయెను. అత్ర=ఈ సైన్యములో, కశ్చిత్=ఏ ఒక్కడూ, మత్తః=మదించినవాడు, న బభూవ ఇతి న=కాలేదన్నమాటలేదు. అత్ర=ఈ సైన్యములో, కశ్చిత్=ఒక్కడూ, తృప్తః=తృప్తిచెందినవాడు, న బభూవ ఇతి న=కాలేదన్నమాటలేదు.

తా. మధువును అధికముగా త్రాగుటచే మనస్సులూ, చేష్టలూ కూడ తీవ్రములుగా ఉండుటచేత ఆ వానరసైన్యమంతా వ్యాకులముగా ఉండెను. ఆ సైన్యములో మత్తెక్కనివాడు కాని, తృప్తిచెందనివాడు కాని లేకుండెను. 18

మూ. తతో వనం తత్ పరిభక్ష్యమాణం
ద్రుమాంశ్చ విధ్వంసితపత్రపుష్పాన్,
సమీక్ష్య కోపాద్దధివక్త్రనామా
నివారయామాస కపిః కపీంస్తాన్. 19

ప్ర. అ. తతః=అటుపిమ్మట, దధివక్త్రనామా=దధివక్త్రుడను పేరు గల, కపిః=వానరుడు, పరిభక్ష్యమాణమ్=భక్షింపబడుచున్న, తత్=ఆ, వనమ్=వనమును, విధ్వంసితపత్రపుష్పాన్=ధ్వంసముచేయబడిన ఆకులు పువ్వులు గల, ద్రుమాంశ్చ=వృక్షములను, సమీక్ష్య=చూచి, కోపాత్=కోపమువలన, తాన్ కపీన్=వానరులను, నివారయామాస=నివారించెను.

తా. పిమ్మట దధిముఖుడను వానరుడు, వానరులందరు ఆ వనమును భక్షించుటను, వృక్షముల ఆకులను, ఫలములను పాడుచేయుచుండుటను చూచి కోపముతో వాళ్ళను నివారించెను. 19

మూ. స తైః ప్రవృద్ధైః పరిభర్త్స్యమానో
వనస్య గోప్తా హరివీరవృద్ధః,
చకార భూయో మతిముగ్రతేజా
వనస్య రక్షాం ప్రతి వానరేభ్యః. 20

ప్ర. అ. ప్రవృద్ధైః=మితిమీరి ప్రవర్తించుచున్న, తైః=ఆ వానరులచేత, పరిభర్త్స్యమానః=భయపెట్టబడుచున్న, వనస్య గోప్తా=వనమునకు రక్షకుడైన, హరివీరవృద్ధః=వానరవీరులలో వృద్ధుడైన, ఉగ్రతేజాః=ఉగ్రమైన తేజస్సు గల దధిముఖుడు, వానరేభ్యః=వానరులనుండి, వనస్య=వనము యొక్క, రక్షాం ప్రతి=రక్షణమును గూర్చి, భూయః=మరల, మతిమ్=బుద్ధిని, చకార=చేసెను.

తా. వనమునకు రక్షకుడు, ఉగ్రమైన తేజస్సు కలవాడు, వృద్ధవానర వీరుడు అయిన దధిముఖుడు మితిమీరి ప్రవర్తించుచున్న ఆ వానరులు భయపెట్టగా, వాళ్ళనుండి వనమును రక్షించు విషయమున మరియొక ఆలోచన చేసెను. 20

మూ. ఉవాచ కాంశ్చిత్పరుషాణి ధృష్ట
మసక్తమన్యాంశ్చ తలైర్జఘాన,
సమేత్య కైశ్చిత్కలహం చకార
తథైవ సామ్నోపజగామ కాంశ్చిత్. 21

ప్ర. అ. కాంశ్చిత్=కొందరిని, పరుషాణి=పరుషవాక్కులను, ఉవాచ=పలికెను. అన్యాంశ్చ=మరికొందరిని, అసక్తమ్=అడ్డులేకుండగా, తలైః=అరచేతులతో, ధృష్టమ్=ధైర్యముగా, జఘాన=కొట్టెను. సమేత్య=దగ్గరకు వెళ్ళి, కైశ్చిత్=కొందరితో, కలహమ్=కలహమును, చకార=చేసెను. తథైవ=అట్లే, కాంశ్చిత్=కొందరిని, సామ్నా=సామముతో, ఉపజగామ=సమీపించెను.

తా. కొందరితో పరుషవాక్యములు పలికెను. ధైర్యముగా మరికొందరిని ఎట్టి అడ్డము లేకుండ అరచేతులతో కొట్టెను. కొంతమంది దగ్గరకు వెళ్ళి వాళ్ళతో కలహించెను. కొందరిని సామపూర్వకముగా ప్రార్థించెను. 21

మూ. స తైర్మదాదప్రతివార్యవేగై
ర్బలాచ్చ తేన ప్రతివార్యమాణైః,
ప్రధర్షితస్త్యక్తభయైః సమేత్య
ప్రకృష్యతే చాప్యనవేక్ష్య దోషమ్. 22

ప్ర. అ. మదాత్=మదమువలన, అప్రతివార్యవేగైః=నివారింపశక్యము కాని వేగము కలవారు, తేన=ఆ దధిముఖునిచేత, బలాత్=బలాత్కారముగా ప్రతివార్యమాణైః=నివారింపబడుచున్నవారు, త్యక్తభయైః=విడవబడిన భయము గలవారు అయిన, తైః=ఆ వానరులచేత, ప్రధర్షితః=ఎదిరింపబడినవాడై, సః=ఆ దధిముఖుడు, దోషం చ=దోషమును కూడ, అనవేక్ష్య=చూడక, సమేత్య=కలిసి, ప్రకృష్యతే చ=లాగబడెను కూడ.

తా. ఆ దధిముఖుడు బలప్రయోగము చేసి నివారించగా, మధుమదము చేత నివారింప శక్యము కాని వేగముతో, ఆ వానరులు భయము విడచి, దోషమను విషయము కూడ గుర్తించక, ఆ దధిముఖుని ఎదిరించి, ఇటు అటు లాగిరి. 22

మూ. నఖైస్తుదన్తో దశనైర్దశన్త
స్తలైశ్చ పాదైశ్చ సమాపయన్తః,
మదాత్కపిం తం కపయః సమగ్రా
మహావనం నిర్విషయం చ చక్రుః. 23

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే సున్దరకాణ్డే
ఏకషష్టితమః సర్గః

ప్ర. అ. సమగ్రాః=సమస్తమైన, కపయః=వానరులు, మదాత్=మదమువలన, నఖైః=గోళ్లచేత, తుదన్తః=పీడించుచు, దశనైః=దంతములచేత, దశన్తః=కరచుచు, తలైశ్చ=అరచేతులతోను, పాదైశ్చ=పాదములతోను, తం కపిమ్=ఆ దధిముఖుని, సమాపయన్తః=సమాప్తిపొందించుచు, మహావనమ్=ఆ మహావనమును, నిర్విషయమ్=అనుభవించదగిన వస్తువులు లేనిదానినిగా, చక్రుః=చేసిరి.

తా. ఆ వానరులందరూ, మదావేశముతో, ఆ దధిముఖుని గోళ్ళతో చీల్చుచు, దంతాలతో కరచుచు, అరచేతులతోను, పాదాలతోను, ప్రాణాలు పోవునా అన్నట్లు కొట్టుచు ఆ మహావనములోని పదార్థాల నన్నింటినీ కాజేసిరి.

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు
సుందరకాండలో అరువదియొకటవ సర్గ సమాప్తము.

అథ ద్విషష్టితమః సర్గః

[వానరులు దధిముఖుని, ఇతర వనరక్షకులను పరాభవించుట ; దధిముఖుడు భృత్యసహితుడై సుగ్రీవుని వద్దకు వెళ్ళుట].

మూ. తానువాచ హరిశ్రేష్ఠో హనుమాన్వానరర్షభః,
అవ్యగ్రమనసో యూయం మధు సేవత వానరాః, 1
అహమావారయిష్యామి యుష్మాకం పరిపన్థినః.

ప్ర. అ. హరిశ్రేష్ఠః=వానరులలో శ్రేష్ఠుడు, వానరర్షభః=వానరులలో వృషభము వంటి వాడు అయిన, హనుమాన్=హనుమంతుడు, తాన్=వారిని గూర్చి, ఉవాచ=పలికెను. వానరాః=వానరులారా !యూయమ్=మీరు, అవ్యగ్రమనసః=వ్యగ్రత (కంగారు) లేని మనస్సు కలవారై, మధు=మధువును, సేవత=సేవించండి. అహమ్=నేను, యుష్మాకమ్=మీయొక్క, పరిపన్థినః=శత్రువులను, ఆవారయిష్యామి=నివారించెదను.

తా. వానరులలో వృషభము వంటివాడు, వానరులలో అత్యుత్తముడు అయిన హనుమంతుడు వాళ్ళతో ఇట్లనెను. "ఓ ! వానరులారా ! మీ రేమీ దిగులు లేకుండా మధువును సేవించండి. నేను మీకు అడ్డు చెప్పే వారిని నివారించెదను." 1

మూ. శ్రుత్వా హనుమతో వాక్యం హరీణాం ప్రవరోఽఙ్గదః, 2
ప్రత్యువాచ ప్రసన్నాత్మా పిబన్తు హరయో మధు.

ప్ర. అ. హనుమతః=హనుమంతునియొక్క, వాక్యమ్=వాక్యమును, శ్రుత్వా=విని, హరీణామ్=వానరులలో, ప్రవరః=శ్రేష్ఠుడైన, అఙ్గదః=అంగదుడు ప్రసన్నాత్మా=ప్రసన్నమైన మనస్సు గలవాడై, ప్రత్యువాచ=తిరిగి పలికెను. హరయః=వానరులు, మధు=మధువును, పిబన్తు=త్రాగుదురు గాక.

తా. వానరులలో శ్రేష్ఠుడైన అంగదుడు హనుమంతుని మాటలు విని, సంతోషించిన మనస్సు కలవాడై, తిరిగి పలికెను "వానరులు మధువును త్రాగుదురు గాక!". 2

మూ. అవశ్యం కృతకార్యస్య వాక్యం హనుమతో మయా, 3
అకార్యమపి కర్తవ్యం కిమఙ్గ పునరీదృశమ్.

ప్ర. అ. కృతకార్యస్య=చేయబడిన కార్యము గల, హనుమతః=హనుమంతుని యొక్క, వాక్యమ్=వాక్యము, అకార్యమపి=చేయగూడని దైనను ; మయా=నాచేత, అవశ్యమ్=తప్పక, కర్తవ్యమ్=చేయదగినది. ఈదృశం పునః=ఇట్టి కార్యమైతే, కిమఙ్గ=చెప్పవలెనా !

తా. కార్యము సాధించుకొని వచ్చిన హనుమంతుని మాట చేయకూడనిదైనను నేను తప్పక చేయవలెను. ఇలాంటి మాట విషయము చెప్పవలెనా! 3

మూ. అఙ్గదస్య ముఖాచ్ఛ్రుత్వా వచనం వానరర్షభాః, 4
సాధుసాధ్వితి సంహృష్టా వానరాః ప్రత్యపూజయన్.

ప్ర. అ. వానరర్షభాః=వానరులలో వృషభము వంటి వారైన, వానరాః=వానరులు, అఙ్గదస్య=అంగదునియొక్క, ముఖాత్=ముఖమునుండి, వచః=వచనమును, శ్రుత్వా=విని, సంహృష్టాః=సంతోషించినవారై, సాధు సాధ్వితి=బాగు బాగు అని, ప్రత్యపూజయన్=పూజించిరి.

తా. వానరులలో వృషభముల వంటి వానరులు అంగదుని ముఖము నుండి వచ్చిన మాట విని చాలా సంతోషించి, "బాగు బాగు" అని అభినందించిరి.

మూ. పూజయిత్వాఙ్గదం సర్వే వానరా వానరర్షభమ్, 5
జగ్ముర్మధువనం యత్ర నదీవేగ ఇవ ద్రుమమ్.

ప్ర. అ. సర్వే=సమస్తమైన, రాక్షసాః=రాక్షసులు, వానరర్షభమ్=వానరశ్రేష్ఠుడైన, అఙ్గదమ్=అంగదుని, పూజయిత్వా=పూజించి, మధువనమ్=మధువనము, యత్ర=ఎక్కడ ఉన్నదో అక్కడికి, నదీవేగః=నదీ వేగము, ద్రుమమ్ ఇవ=వృక్షమును గూర్చి వలె, జగ్ముః=వెళ్ళిరి.

తా. వానరులందరు వానరశ్రేష్ఠుడైన అంగదుని పూజించి మధువనమున్న చోటికి నదీవేగము వృక్షమువైపు వెళ్ళునట్లు వెళ్ళిరి.

వి. "నదీవేగ ఇవ ద్రుమమ్" అనే ఉపమాలంకారంలో వాల్మీకి ఉపమానాలలో ఉండవలసిన సౌందర్యం లేదు. ఈ ఉపమానం లేని ప్రాచ్యపాఠం ఇలా ఉన్నది.

"పూజయిత్వాఙ్గదం సర్వే యూథపా యూథపర్షభమ్,
జగ్ముర్మధువనం సర్వే పానాయ సగణాస్తదా".

వావిళ్ల వారి ప్రతిలోను, గోరఖ్‌పూర్ ప్రతిలోను కూడ 61వ సర్గలోనే వానరులు మధువనం ప్రవేశించి యథేచ్ఛగా మధుపానం చేసి అడ్డుకొనడానికి ప్రయత్నించిన దధిముఖుణ్ణి లెక్క సేయక బాధ పెట్టినట్లున్నది. ఈ సర్గలో హనుమంతుని అభిప్రాయం ప్రకారం అంగదుడు వానరులకు యథేష్టంగా మధుపానం చేయడానికి అనుమతి ఇచ్చినట్లు, వారట్లు ప్రవర్తించినట్లు చెప్పబడినది. ప్రాచ్యపాఠంలో హనుమంతుడే ఆ వానరుల కోరికను అనుసరించి మధువనములో మధువు నాస్వాదించుటకు వానరులకు అనుమతి యిమ్మని అంగదుని కోరినట్లు, అంగదుడు అనుమతి ఇచ్చి నట్లు దధిముఖాదులు అడ్డుకొనగా వాళ్లను హనుమదంగదాదులు ఎదిరించినట్లు ఉన్నది. ఆ కథాక్రమము బాగున్నట్లు తోచుచున్నది. 5

మూ. తే ప్రవిష్టా మధువనం పాలానాక్రమ్య వీర్యతః, 6
అతిసర్గాచ్చ పటవో దృష్ట్వా శ్రుత్వా చ మైథిలీమ్,
పపుః సర్వే మధు తదా రసవత్ఫలమాదదుః. 7

ప్ర. అ. మైథిలీమ్=సీతను, దృష్ట్వా=చూచి, శ్రుత్వా=విని, అతిసర్గాచ్చ=(అంగదుని) అనుమతివలనను, పటవః=సమర్థులైన (నిర్భయులైన), తే=ఆ, సర్వే=వానరులందరూ, మధువనమ్=మధువనమును, ప్రవిష్టాః=ప్రవేశించినవారై, పాలాన్=పాలకులను, వీర్యతః=పరాక్రమము వలన, ఆక్రమ్య=ఆక్రమించి, తదా=అప్పుడు, మధు=మధువును, పపుః=త్రాగిరి. రసవత్=రసము గల, ఫలమ్=ఫలమును, ఆదదుః=తీసికొనిరి.

తా. సీతను చూచి, వినియుండుటచేతను, అంగదుడు అనుమతించుటచేతను నిర్భయులై, ఆ వానరులందరు మధువనములో ప్రవేశించి వనపాలకులను పరాక్రమము చేత ఆక్రమించి, మధువును త్రాగిరి. రుచిగా నున్న ఫలములను తినిరి. 6, 7

మూ. ఉత్పత్య చ తతః సర్వే వనపాలాన్ సమాగతాన్,
తాడయన్తి స్మ శతశః సక్తాన్మధువనే తదా. 8

ప్ర. అ. తదా=అప్పుడు, సర్వే=వారందరూ, మధువనే=మధువనమునందు, శతశః=వందలు వందలుగా, సక్తాన్=కలిసియున్న, సమాగతాన్=వచ్చిన, వనపాలాన్=వనపాలకులను, ఉత్పత్య=ఎగిరి, తతః=అటుపిమ్మట, తాడయన్తి స్మ=కొట్టిరి.

తా. పిమ్మట ఆ వానరులందరు, అప్పుడా మధువనములో తమను అడ్డుకొనుటకై వందలు వందలుగా వచ్చిన వనపాలకులపైకి దుమికి వాళ్ళను కొట్టిరి. 8

మూ. మధూని ద్రోణమాత్రాణి బాహుభిః పరిగృహ్య తే,
పిబన్తి సహితాః సర్వే నిఘ్నన్తి స్మ తథాపరే. 9

ప్ర. అ. తే సర్వే=ఆ వానరులు అందరూ, బాహుభిః=బాహువులతో, ద్రోణమాత్రాణి=ద్రోణము ప్రమాణము గల, (ద్రోణ మనగా ద్రవపదార్థములను కొలిచే ఒక పెద్ద ప్రమాణము) మధూని=మధువులను, పరిగృహ్య=గ్రహించి, సహితాః=కలిసినవారై, పిబన్తి=త్రాగిరి. అపరే=మరికొందరు, నిఘ్నన్తి స్మ=(అడ్డు తగిలినవారిని) కొట్టిరి.

తా. ఆ వానరులందరు కలిసి బాహువులతో ద్రోణముల కొలది మధువులు గ్రహించి త్రాగిరి. మరి కొందరు అడ్డుకొనేవాళ్ళను కొట్టిరి. 9

మూ. కేచిత్పీత్వా ప్రవిధ్యన్తి మధూని మధుపిఙ్గలాః,
మధూచ్ఛిష్టేన కేచిచ్చ జగ్మురన్యోన్యముత్కటాః. 10

ప్ర. అ. మధుపిఙ్గలాః=మధువు వలె పింగలవర్ణము గల, కేచిత్=కొందరు వానరులు, మధూని=మధువులను, పీత్వా=తాగి, ప్రవిధ్యన్తి=పార వేయుచు న్నారు, కేచిచ్చ=కొంతమంది, మధూచ్ఛిష్టేన=త్రాగగా మిగిలిన మధువుతో, ఉత్కటాః=మత్తుచేత తీవ్రముగా ఉన్నవారై, అన్యోన్యమ్=పరస్పరము, జగ్ముః=వెళ్ళిరి.

తా. కొంతమంది వానరులు మధువులను కడుపు పట్టినంత త్రాగి, త్రాగగా మిగిలినదానిని దూరముగా విసిరివేయుచుండిరి. కొందరు త్రాగగా మిగిలిన మధువు చేత పట్టుకొని తీవ్రమైన మదముతో ఒకరిమీదికి ఒకరు దుముకుచుండిరి.

వి. మధూచ్ఛిష్టమనగా తేనె తీసివేసిన తేనెపట్టు, అదే మైనముగా వండుతారు. దానిని గ్రహించివెళ్ళిరి అను ప్రాచీనుల అర్థముకంటె పై అర్థము బాగున్న దని నా అభిప్రాయము. వానరులు మధువనములో ప్రవేశించి తేనెటీగలతో నిండిన తేనెపట్టులు పిండికొని త్రాగినారన్నట్లు చాలామంది అభిప్రాయము. ఆ ఈగలతో నిండిన పట్టులు త్రాగుట అంత శక్యమైన పనికాదు కదా. అందుచేత ఈత, తాడి, కొబ్బరి చెట్లకు కల్లు గీసేవారు కుండలు కట్టి ఆ మద్యమును సేకరించినట్లు ఈ మధువనములో వివిధోపాయములతో (పుష్పఫలాదులతో)

మధువు తయారు చేసి దానిని భద్రపరచేవారనీ, దానినే ఈ వానరులు త్రాగి ఉంటారనీ చెప్పినచో బాగుంటుంది. 10

మూ. అపరే వృక్షమూలే తు శాఖాం గృహ్యా వ్యవస్థితాః,
అత్యర్థం చ మదగ్లానాః పర్ణాన్యాస్తీర్య శేరతే. 11

ప్ర. అ. అపరే=మరి కొందరు, శాఖామ్=కొమ్మను, గృహ్యా=పట్టుకొని, వృక్షమూలే=వృక్షము మొదట్లో, వ్యవస్థితాః=ఉండిరి. అత్యర్థమ్=మిక్కిలి, మదగ్లానాః=మత్తెక్కిన మరికొందరు, పర్ణాని=ఆకులను, ఆస్తీర్య=పరచుకొని, శేరతే=పండుకొనిరి.

తా. కొందరు కొమ్మలు పట్టుకొని చెట్ల మొదళ్ళ దగ్గర కూర్చుండిరి. ఎక్కువ మత్తులో ఉన్నవాళ్లు ఆకులు పరచుకొని పండుకొనిరి. 11

మూ. ఉన్మత్తభూతాః ప్లవగా మధుమత్తాశ్చ హృష్టవత్,
క్షిపన్తి చ తథాన్యోన్యం స్ఖలన్తి చ తథాపరే. 12

ప్ర. అ. మధుమత్తాః=మధువు చేత మదించిన, ప్లవగాః=వానరులు, ఉన్మత్తభూతాః=ఉన్మాదము పొందినవారు వలె అయి, హృష్టవత్=సంతోషించినవారై, అన్యోన్యమ్=పరస్పరము, క్షిపన్తి=త్రోసుకొనుచున్నారు. అపరే=మరికొందరు, స్ఖలన్తి చ=తొట్రుపడుచున్నారు.

తా. మధుపానముచే మత్తెక్కిన కొందరు వానరులు, ఉన్మత్తులై, సంతోషముతో ఒకరి నొకరు త్రోసికొనుచుండిరి. మరి కొందరు తొట్రుపడుచుండిరి.

మూ. కేచిత్ క్ష్వేలాం ప్రకుర్వన్తి కేచిత్ కూజన్తి హృష్టవత్,
హరయో మధునా మత్తాః కేచిత్సుప్తా మహీతలే. 13

ప్ర. అ. కేచిత్=కొందరు, క్ష్వేలామ్=సింహనాదమును, ప్రకుర్వన్తి=చేయుచున్నారు. కేచిత్=కొందరు, హృష్టవత్=సంతోషించినవారై, కూజన్తి=కూయుచున్నారు. మధునా=మధువుచేత, మత్తాః=మదించిన, కేచిత్ హరయః=కొందరు వానరులు, మహీతలే=నేలమీద, సుప్తాః=నిద్రించిరి.

తా. కొందరు సింహనాదములు చేయుచుండిరి. కొందరు సంతోషించి ఈలలు వేయుచుండిరి. మధువుచేత ఎక్కువ మత్తెక్కిన మరి కొందరు నేలమీద నిద్రించుచుండిరి. 13

మూ. కృత్వా కేచిద్ధసన్త్యన్యే కేచిత్కుర్వన్తి చేతరత్,
కృత్వా కేచిద్వదన్త్యన్యే కేచిద్బుధ్యన్తి చేతరత్. 14

ప్ర. అ. కేచిత్=కొందరు, కృత్వా=ఏమేమో చేసి, హసన్తి=నవ్వుచు న్నారు. అన్యే=ఇతరులైన, కేచిత్=కొందరు, ఇతరత్=మరియొక కార్యమును, కుర్వన్తి=చేయుచున్నారు. కేచిత్=కొందరు, కృత్వా=చేసి, వదన్తి=చెప్పుచున్నారు, అన్యే=ఇతరులైన, కేచిత్=కొందరు, ఇతరత్=మరొకవిషయమును, బుధ్యన్తి=తెలుసుకొనుచున్నారు.

తా. కొందరు ఏమేమో వికృతచేష్టలు చేసి నవ్వుచుండగా మరికొందరు మరొక చేష్టచేయుచుండిరి. కొందరు తాము చేసిన దానిని గూర్చి వర్ణించి చెప్పుచుండగా మరి కొందరు దానిని మరొక విధముగా అర్థము చేసికొనుచుండిరి. 14

మూ. యేఽప్యత్ర మధుపాలాః స్యుః ప్రేష్యా దధిముఖస్య తు,
తేఽపి తైర్వానరైర్భీమైః ప్రతిషిద్ధా దిశో గతాః. 15

ప్ర. అ. అత్ర=ఈ మధువనమునందు, దధిముఖస్య=దధిముఖుని యొక్క, ప్రేష్యాః=కింకరులైన, మధుపాలాః=మధురక్షకులు, యే=ఎవరు, స్యుః=ఉందురో, తేఽపి=వారు కూడ, భీమైః=భయంకరులైన, వానరైః=వానరుల చేత, ప్రతిషిద్ధాః=నిరాకరింపబడినవారై (తమ పని చేయకుండేటట్లు చేయబడినవారై), దిశః=దిక్కులను గూర్చి, గతాః=వెళ్ళిరి.

తా. ఆ మధువనములో దధిముఖుని కింకరులైన మధుపాలకులు ఆ భయంకరులైన వానరులు బాధించుటచే నలుదిక్కులకు పారిపోయిరి. 15

మూ. జానుభిస్తు ప్రకృష్టాశ్చ దేవమార్గం ప్రదర్శితాః,
అబ్రువన్ పరమోద్విగ్నా గత్వా దధిముఖం వచః. 16

ప్ర. అ. జానుభిః=మోకాళ్ళ చేత, ప్రకృష్టాః=లాగబడినవారై, దేవమార్గమ్=గుహ్యప్రదేశమును, ప్రదర్శితాః=చూపబడిన ఆ రక్షకులు, పరమోద్విగ్నాః=చాల దిగులు చెందినవారై, దధిముఖమ్=దధిముఖుని గూర్చి, గత్వా=వెళ్ళి, వచః=వాక్యమును, అబ్రువన్=పలికిరి.

తా. ఆ వానరులు ఆ రక్షకులను మోకాళ్ళతో పొడిచి, నేలమీద ఈడ్చుచు, వాళ్ళకు గుహ్యప్రదేశమును చూపిరి. అప్పుడు ఆ రక్షకులు చాల భయపడి దధిముఖుని వద్దకు వెళ్ళి ఇట్లు పలికిరి. 16

మూ. హనూమతా దత్తవరైర్హతం మధువనం బలాత్,
వయం చ జానుభిః కృష్టా దేవమార్గం చ దర్శితాః. 17

ప్ర. అ. హనూమతా=హనుమంతుని చేత, దత్తవరైః=ఇవ్వబడిన వరము గల వానరులచేత, మధువనమ్=మధువనము, బలాత్=బలమువలన, హతమ్=పాడుచేయబడినది. వయం చ=మేము, జానుభిః=మోకాళ్ళచేత, కృష్టాః=(పాడిచి) లాగబడితిమి. దేవమార్గమ్=గుహ్యప్రదేశమును, దర్శితాః=చూపబడితిమి.

తా. హనుమంతుని అనుజ్ఞ పొంది వానరులు మధువనమును తమ ఇష్టము వచ్చినట్లు పాడుచేసినారు. మమ్ములను మోకాళ్లతో పొడిచి ఈడ్చినారు. మాకు గుహ్యప్రదేశములను కూడ (ఎవరికి చెప్పకుంటారో చెప్పకొండి అన్నట్లు) చూపినారు. 17

మూ. తతో దధిముఖః క్రుద్ధో వనపస్తత్ర వానరః,
హతం మధువనం శ్రుత్వా సాన్త్వయామాస తాన్ హరీన్. 18

ప్ర. అ. తతః=అటు పిమ్మట, తత్ర=అక్కడ, వనపః=వనపాలకుడైన, దధిముఖః=దధిముఖు డను, వానరః=వానరుడు, క్రుద్ధః=కోపించినవాడై, మధువనమ్=మధువనమును, హతమ్=పాడుచేయబడినదానినిగా, శ్రుత్వా=విని, హరీన్=ఆ వానరులను, సాన్త్వయామాస=ఓదార్చెను.

తా. పిమ్మట, అక్కడ వనమును పాలించు ఆ దధిముఖుడు మధువనము పాడుచేయబడినదను విషయము విని, ఆ వానరులను ఓదార్చెను. 18

మూ. ఇహాగచ్ఛత గచ్ఛామో వానరాన్ బలదర్పితాన్,
బలేన వారయిష్యామో మధు భక్షయతో వయమ్. 19

ప్ర. అ. ఇహ=ఇక్కడికి, ఆగచ్ఛత=రండి. గచ్ఛామః=వెళ్లెదము. వయమ్=మనము, బలదర్పితాన్=బలముచేత గర్వితులైన, మధు=మధువును, భక్షయతః=భక్షించుచున్న, వానరాన్=వానరులను, బలేన=బలముచేత, వారయిష్యామః=నివారించెదము.

తా. ఇటు రండి.మనము అక్కడికి వెళ్ళి, బలముచేత దృప్తులై మధువును భక్షించుచున్న ఆ వానరులను బలప్రయోగముచేతనే నివారించెదము. 19

మూ. శ్రుత్వా దధిముఖస్యేదం వచనం వానరర్షభాః,
పునర్వీరా మధువనం తేనైవ సహసా యయుః. 20

ప్ర. అ. వీరాః=వీరులైన, వానరర్షభాః=వానరశ్రేష్ఠులు, దధిముఖస్య=దధిముఖునియొక్క, ఇదమ్=ఈ, వచనమ్=వచనమును, శ్రుత్వా=విని, సహసా=శీఘ్రముగా,

తేనైవ=ఆ దధిముఖునితో, పునః=మరల, మధువనమ్=మధువనమును గూర్చి, యయుః=వెళ్ళిరి.

తా. వీరులైన ఆ వానరశ్రేష్ఠులు దధిముఖుని మాటలు విని, వెంటనే ఆతనితో కలసి మరల ఆ మధువనమునకు వెళ్ళిరి. 20

మూ. మధ్యే చైషాం దధిముఖః ప్రగృహ్య తరసా తరుమ్,
సమభ్యధావద్వేగేన తే చ సర్వే ప్లవంగమాః. 21

ప్ర. అ. ఏషామ్=ఈ వానరులయొక్క, మధ్యే=మధ్యయందు, దధిముఖః=దధిముఖుడు, తరసా=వేగముచేత, తరుమ్=వృక్షమును, ప్రగృహ్య=గ్రహించి, వేగేన=వేగముతో, సమభ్యధావత్=పరుగెత్తెను. తే=ఆ, సర్వే=సమస్తమైన, ప్లవంగమాః చ=వానరులు కూడ పరుగెత్తిరి.

తా. దధిముఖుడు ఆ వానరులమధ్య వృక్షమును గ్రహించి వేగముగా పరుగెత్తుకొని వచ్చెను. ఆతని అనుచరులైన వానరులు కూడ పరుగెత్తుకొని వచ్చిరి. 21

మూ. తే శిలాః పాదపాంశ్చాపి పర్వతాంశ్చాపి వానరాః,
గృహీత్వాభ్యగమన్ క్రుద్ధా యత్ర తే కపికుఞ్జరాః. 22

ప్ర. అ. తే వానరాః=ఆ వానరులు, క్రుద్ధాః=కోపించినవారై, శిలాః=రాళ్లను, పాదపాంశ్చాపి=వృక్షములను, పర్వతాంశ్చాపి=పర్వతములను, గృహీత్వా=గ్రహించి, తే=ఆ, కపికుఞ్జరాః=వానరశ్రేష్ఠులు, యత్ర=ఎక్కడ ఉన్నారో అక్కడికి, అభ్యగమన్=వెళ్ళిరి.

తా. ఆ వానరులు కోపించినవారై, రాళ్ళు, చెట్లు, కొండలు పట్టుకొని, అంగదాదివానరశ్రేష్ఠులున్న చోటికి వెళ్ళిరి. 22

మూ. తే స్వామివచనం వీరా హృదయేష్వవసజ్య తత్,
త్వరయా హ్యభ్యధావన్త సాలతాలశిలాయుధాః. 23

ప్ర. అ. వీరాః=వీరులైన, తే=వారు, తత్=ఆ, స్వామివచనమ్=తమ ప్రభువుయొక్క మాటను, హృదయేషు=హృదయములందు, అవసజ్య=ఉంచుకొని, సాలతాలశిలాయుధాః=మద్దిచెట్లు, తాటిచెట్లు, శిలలు ఆయుధములుగా కలవారై, త్వరయా=తొందరతో, అభ్యధావన్త=పరుగెత్తిరి.

తా. వీరులైన ఆ వానరులు తమ ప్రభువు ఆజ్ఞను మనస్సులో ఉంచుకొని, మద్దిచెట్లను, తాటిచెట్లను, శిలలను ఆయుధములుగా ధరించి తొందరగా పరుగెత్తి వెళ్ళిరి. 23

మూ. వృక్షస్థాంశ్చ తలస్థాంశ్చ వానరాన్ బలదర్పితాన్,
అభ్యక్రామంస్తతో వీరాః పాలాస్తత్ర సహస్రశః. 24

ప్ర. అ. తతః=అటుపిమ్మట, వీరాః=వీరులైన, పాలాః=వనపాలకులు, సహస్రశః=వేలకొలది, వృక్షస్థాంశ్చ=వృక్షములపై ఉన్నవాళ్లు, తలస్థాంశ్చ=వృక్షముల మొదళ్ళలో ఉన్న వాళ్లు అయిన, బలదర్పితాన్=బలముచేత గర్వించిన, వానరాన్=వానరులను, అభ్యక్రామన్=ఆక్రమించిరి.

తా. వీరులైన ఆ వానరులు వేలకొలది వెళ్ళి అక్కడ, చెట్లమీద, చెట్ల మొదళ్లలోను ఉన్న, బలముచే దృప్తులైన వానరులను ఆక్రమించిరి. 24

మూ. అథ దృష్ట్వా దధిముఖం క్రుద్ధం వానరపుఙ్గవాః,
అభ్యధావన్త వేగేన హనుమత్ప్రముఖాస్తదా. 25

ప్ర. అ. అథ=అటు పిమ్మట, హనుమత్ప్రముఖాః=హనుమంతుడు మొదలైన, వానరపుఙ్గవాః=వానరశ్రేష్ఠులు, తదా=అప్పుడు, దధిముఖమ్=దధిముఖుని, క్రుద్ధమ్=కోపగించినవానినిగా, దృష్ట్వా=చూచి, వేగేన=వేగముతో, అభ్యధావన్త=ఎదురుగా పరుగెత్తిరి.

తా. అప్పుడు, కోపముతో వచ్చుచున్న ఆ దధిముఖుని చూచి, హనుమంతుడు మొదలైన ఆ వానరశ్రేష్ఠులు వేగముతో ఆతనిని ఎదిరించుటకై వెళ్ళిరి. 25

మూ. తం సవృక్షం మహాబాహుమాపతన్తం మహాబలమ్,
ఆర్యకం ప్రాహరత్తత్ర బాహుభ్యాం కుపితోఽఙ్గదః. 26

ప్ర. అ. కుపితః=కోపించిన, అఙ్గదః=అంగదుడు, సవృక్షమ్=వృక్షముతో కూడినవాడు, మహాబాహుమ్=గొప్ప బాహువులు కలవాడు, మహాబలమ్=గొప్ప బలము గలవాడు, ఆపతన్తమ్=శీఘ్రముగా వచ్చుచున్నవాడు అయిన, తమ్=ఆ, ఆర్యకమ్=తండ్రి మేనమామను, తత్ర=అక్కడ, బాహుభ్యామ్=బాహువులతో, ప్రాహరత్= కొట్టెను.

తా. వృక్షము ధరించి వచ్చుచున్న మహాబాహువు, మహాబలుడు అయిన, ఆ తండ్రి మేనమామయైన దధిముఖుని చూచి, అంగదుడు కోపముతో, బాహువులతో కొట్టెను. 26

మూ. మదాన్ధశ్చ న వేదైనమార్యకోఽయం మమేతి సః,
అథైనం నిష్పిపేషాశు వేగవద్వసుధాతలే. 27

ప్ర. అ. సః=అతడు, మదాన్ధశ్చ=మదాంధుడై, అయమ్=ఇతడు, మమ=నాయొక్క, ఆర్యకః=ఆర్యకుడు, ఇతి=అని, ఏనమ్=ఇతనిని గూర్చి, న వేద=తెలుసుకొనలేదు. అథ=అటు పిమ్మట, ఏనమ్=ఇతనిని, వసుధాతలే=నేలమీద, వేగవత్=వేగముగా, ఆశు=శీఘ్రముగా, నిష్పిపేష=నలిపి వేసెను.

తా. ఆ అంగదుడు మదాంధుడై ఇతడు ఆర్యకుడు అను విషయమును కూడ గుర్తించలేదు. పిదప శీఘ్రముగా అతనిని వేగముగా నేలమీద పడవేసి నలిపివేసెను. 27

మూ. స భగ్నబాహూరుభుజో విహ్వలః శోణితోక్షితః,
ముమోహ సహసా వీరో ముహూర్తం కపికుఞ్జరః. 28

ప్ర. అ. భగ్నబాహూరుభుజః=విరగగొట్టబడిన బాహువులు, తొడలు, భుజములుగల, విహ్వలః=వ్యాకులుడైన, శోణితోక్షితః=రక్తముచే తడపబడిన, సః=ఆ, వీరః=వీరుడైన, కపికుఞ్జరః=వానరశ్రేష్ఠుడు, సహసా=వెంటనే, ముహూర్తమ్=క్షణ కాలము పాటు, ముమోహ=మోహము చెందెను.

తా. అప్పుడా వీరుడైన దధిముఖుని బాహువులు, తొడలు, భుజములు విరిగి పోయెను. రక్తముతో తడిసి వ్యాకులుడై ఆతడు వెంటనే ముహూర్తకాలము పాటు మూర్ఛ చెందెను. 28

మూ. స సమాశ్వస్య సహసా సంక్రుద్ధో రాజమాతులః,
వానరాన్వారయామాస దణ్డేన మధుమోహితాన్. 29

ప్ర. అ. రాజమాతులః=సుగ్రీవుని మేనమామయైన, సః=అతడు, సహసా=శీఘ్రముగా, సమాశ్వస్య=ఊరడిల్లి, సంక్రుద్ధః=కోపగించినవాడై, మధుమోహితాన్=మధువుచేత మత్తెక్కి ఉన్న, వానరాన్=వానరులను, దణ్డేన=దండనముచేత, వారయామాస=నివారించెను.

తా. సుగ్రీవుని మేనమామయైన ఆ దధిముఖుడు వెంటనే తెప్పరిల్లి, చాల కోపించిన వాడై, మధువు త్రాగి మత్తెక్కి ఉన్న ఆ వానరులను దండ ప్రయోగము చేసి నివారించెను. 29

మూ. స కథంచిద్విముక్తస్తైర్వానరైర్వానరర్షభః,
ఉవాచైకాన్తమాశ్రిత్య భృత్యాన్ స్వాన్ సముపాగతాన్. 30

ప్ర. అ. తైః=ఆ, వానరైః=వానరులచేత, కథంచిత్=ఎట్లో, విముక్తః=విడవబడిన, సః=ఆ, వానరర్షభః=వానరశ్రేష్ఠుడు, ఏకాన్తమ్ ఏకాంతప్రదేశమును,

ఆశ్రిత్య=ఆశ్రయించి, సముపాగతాన్=వచ్చిన, స్వాన్=తన సంబంధమైన, భృత్యాన్=భృత్యులను గూర్చి, ఉవాచ=పలికెను.

తా. ఆ దధిముఖుడు ఆ వానరులనుండి ఎట్లో తప్పించుకొని, ఏకాంత స్థానమునకు వెళ్ళి, అక్కడికి వచ్చిన తన భృత్యులతో ఇట్లు పలికెను. 30

మూ. ఏతే తిష్ఠన్తు గచ్ఛామో భర్తా నో యత్ర వానరః,
సుగ్రీవో విపులగ్రీవః సహ రామేణ తిష్ఠతి. 31

ప్ర. అ. ఏతే=ఈ వానరులు, తిష్ఠన్తు=ఉందురుగాక. నః=మనయొక్క, భర్తా=ప్రభువు, వానరః=వానరుడు, విపులగ్రీవః=విశాలమైన కంఠము కలవాడు అయిన, సుగ్రీవః=సుగ్రీవుడు, యత్ర=ఎక్కడ, రామేణ సహ=రామునితో కూడ, తిష్ఠతి=ఉన్నాడో అక్కడికి, గచ్ఛామః=వెళ్లెదము.

తా. ఈ వానరులను ఇట్లే ఉండనిండు. మనము, మనప్రభువు, విశాలమైన కంఠము గలవాడు అయిన సుగ్రీవుడు రామునితో ఎక్కడ ఉన్నాడో అక్కడికి వెళ్లెదము. 31

మూ. సర్వం చైవాఙ్గదే దోషం శ్రావయిష్యామి పార్థివే,
అమర్షీ వచనం శ్రుత్వా ఘాతయిష్యతి వానరాన్. 32

ప్ర. అ. అఙ్గదే=అంగదునియందున్న, సర్వమ్=సమస్తమైన, దోషమ్=అపరాధమును, పార్థివే=రాజునందు (రాజునకు), శ్రావయిష్యామి=వినిపించెదను. వచనమ్=నా వచనమును, శ్రుత్వా=విని, అమర్షీ=కోపము గలవాడై, వానరాన్=వానరులను, ఘాతయిష్యతి=చంపించగలడు.

తా. అంగదుడు చేసిన అపరాధమును అంతా రాజుకు చెప్పెదను. నా మాట విని, అతడు కోపముతో వానరులను అందరినీ చంపించగలడు. 32

మూ. ఇష్టం మధువనం హ్యేతత్పార్థివస్య మహాత్మనః,
పితృపైతామహం దివ్యం దేవైరపి దురాసదమ్. 33

ప్ర. అ. పితృపైతామహమ్=తండ్రితాతలనాటిది, దివ్యమ్=శ్రేష్ఠమైనది, దేవైరపి=దేవతలచేత గూడ, దురాసదమ్=పొంద శక్యముకానిది అయిన, ఏతత్ మధువనమ్=ఈమధువనము, మహాత్మనః=మహాత్ముడైన, పార్థివస్య=రాజునకు, ఇష్టం హి=ఇష్టమైనది కదా.

తా. ఈ మధువనము రాజుకు చాల ఇష్ట మైనది. శ్రేష్ఠము, దేవతలచేత కూడ ఆక్రమించ శక్యము కాని ఈ వనము మహాత్ముడైన సుగ్రీవుని తండ్రి తాతలనుండి వచ్చుచున్నది. 33

మూ. స వానరానిమాన్ సర్వాన్ మధులుబ్ధాన్ గతాయుషః,
ఘాతయిష్యతి దణ్డేన సుగ్రీవః ససుహృజ్జనాన్. 34

ప్ర. అ. సః సుగ్రీవః=ఆ సుగ్రీవుడు, మధులుబ్ధాన్=మధువునందు దురాశ కలవారు, గతాయుషః=క్షీణించిన ఆయుర్దాయము కలవారు, ససుహృజ్జనాన్=స్నేహితులతో కూడినవారు అయిన, ఇమాన్=ఈ, సర్వాన్=సమస్తమైన, వానరాన్=వానరులను, దణ్డేన=దండముచేత, ఘాతయిష్యతి=చంపించగలడు.

తా. మధువునందు దురాశాపరులైన ఈ వానరుల ఆయుస్సు క్షీణించినది. స్నేహితులు సహితముగా వీరినందరినీ ఆ సుగ్రీవుడు దండించి చంపించగలడు.

మూ. వధ్యా హ్యేతే దురాత్మానో నృపాజ్ఞాపరిభావినః,
అమర్షప్రభవో రోషః సఫలో నో భవిష్యతి. 35

ప్ర. అ. నృపాజ్ఞాపరిభావినః=రాజాజ్ఞను తిరస్కరించిన, ఏతే=ఈ, దురాత్మానః=దుర్బుద్ధులు, వధ్యాః హి=చంపదగినవారు కదా. అమర్షప్రభవః=సహించకపోవుట కారణముగా గల, నః రోషః=మన రోషము, సఫలః=సఫలము, భవిష్యతి=కాగలదు.

తా. రాజాజ్ఞను లిరస్కరించిన ఈ దుర్బుద్ధులు చంపదగినవారు. వీరి పనులు సహించకపోవుటచే కలిగిన మన కోపము సఫలము కాగలదు. 35

మూ. ఏవముక్త్వా దధిముఖో వనపాలాన్మహాబలః,
జగామ సహసోత్పత్య వనపాలైః సమన్వితః. 36

ప్ర. అ. మహాబలః=గొప్పబలము గల, దధిముఖః=దధిముఖుడు, వనపాలాన్=వనపాలులను గూర్చి, ఏవమ్=ఇట్లు, ఉక్త్వా=పలికి, సహసా=శీఘ్రముగా, వనపాలైః=వనపాలులతో, సమన్వితః=కూడినవాడై, ఉత్పత్య=ఎగిరి, జగామ=వెళ్ళెను.

తా. మహాబలశాలియైన దధిముఖుడు వనపాలులతో ఇట్లు పలికి, వారితో కూడినవాడై, శీఘ్రముగా ఎగిరి వెళ్ళెను. 36

మూ. నిమేషాన్తరమాత్రేణ స హి ప్రాప్తో వనాలయః,
సహస్రాంశుసుతో ధీమాన్ సుగ్రీవో యత్ర వానరః. 37

ప్ర. అ. సః=ఆ, వనాలయః=వానరుడు, సహస్రాంశుసుతః=సూర్యుని కుమారుడు, ధీమాన్=బుద్ధిమంతుడు అయిన, సుగ్రీవః వానరః=సుగ్రీవుడు, యత్ర=ఎక్కడ ఉన్నాడో అక్కడికి, నిమేషాన్తరమాత్రేణ=రెండవ నిమేష మాత్రకాలముచే, ప్రాప్తః=వెళ్లెను.

తా. ఆ దధిముఖుడు రెండవ నిమేషములో, సూర్యకుమారుడు, ధీమంతుడు, వానరుడు అయిన సుగ్రీవుడున్న చోటికి వెళ్ళెను. 37

మూ. రామం చ లక్ష్మణం చైవ దృష్ట్వా సుగ్రీవమేవ చ,
సమప్రతిష్ఠాం జగతీమాకాశాన్నిపపాత హ. 38

ప్ర. అ. రామం చ=రాముని, లక్ష్మణం చైవ=లక్ష్మణుని, సుగ్రీవమేవ చ=సుగ్రీవుని, దృష్ట్వా=చూచి, ఆకాశాత్=ఆకాశమునుండి, సమప్రతిష్ఠామ్=సమానమైన స్థితిగల జగతీమ్=భూమిని గూర్చి, నిపపాత=దిగెను.

తా. రాముణ్ణి, లక్ష్మణుణ్ణి, సుగ్రీవుణ్ణి చూచి, ఆకాశమునుండి చదునైన నేలపై దిగెను. 38

మూ. సంనిపత్య మహావీర్యః సర్వైస్తైః పరివారితః,
హరిర్దధిముఖః పాలైః పాలానాం పరమేశ్వరః. 39
స దీనవదనో భూత్వా కృత్వా శిరసి చాఞ్జలిమ్,
సుగ్రీవస్య శుభౌ మూర్ధ్నా చరణౌ పర్యపీడయత్. 40

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే సున్దరకాణ్డే
ద్విషష్టితమః సర్గః.

ప్ర. అ. సర్వైః=సమస్తమైన, తైః పాలైః=ఆ వనపాలకులచేత, పరివారితః=చుట్టువారుకొనబడిన, పాలానామ్=ఆ పాలకులకు, పరమేశ్వరః=ప్రధాన ప్రభువైన, హరిః=వానరుడైన, మహావీర్యః=గొప్ప పరాక్రమము గల, సః దధిముఖః=ఆ దధిముఖుడు, దీనవదనః=దీనమైన ముఖము గలవాడై, శిరసి=శిరస్సుమీద, అఞ్జలిమ్=దోసిలిని, కృత్వా= చేసి, సంనిపత్య=నేలపై పడి, సుగ్రీవస్య=సుగ్రీవుని యొక్క, శుభే=మంగళప్రదములైన, చరణౌ=పాదములను, మూర్ధ్నా=శిరస్సు చేత, పర్యపీడయత్=స్పృశించెను.

తా. వనపాలకులకు ప్రధానాధిపతియైన మహాపరాక్రమవంతుడైన దధిముఖుడు, దీనమైన ముఖముతో, శిరస్సుపై అంజలి ఘటించి, నేలపై పడి, సుగ్రీవుని మంగళకరములైన పాదములను, శిరస్సుతో స్పృశించి నమస్కరించెను.

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు
సుందరకాండలో అరువదిరెండవ సర్గ సమాప్తము.

అథ త్రిషష్టితమః సర్గః

[మధువనమును ధ్వంసింపచేసిన వార్త దధిముఖునినుండి విని, హనుమ దాదులు కార్యము సాధించి యుందురని సుగ్రీవుడు ఊహించుట.]

మూ. తతో మూర్ధ్నా నిపతితం వానరం వానరర్షభః,
దృష్ట్వైవోద్విగ్నహృదయో వాక్యమేతదువాచ హ. 1

ప్ర. అ. తతః=అటు పిమ్మట, వానరర్షభః=వానరశ్రేష్ఠుడైన సుగ్రీవుడు, మూర్ధ్నా=శిరస్సుచేత, నిపతితమ్=పడిన, వానరమ్=దధిముఖుణ్ణి, దృష్ట్వైవ=చూడగానే, ఉద్విగ్నహృదయః=దిగులు చెందిన హృదయము కలవాడై, ఏతత్=ఈ, వాక్యమ్=వాక్యమును, ఉవాచ హ=పలికెను.

తా. పిమ్మట తన పాదములపై శిరస్సు ఉంచి నమస్కరించుచున్న దధిముఖుణ్ణి చూడగానే, వానరశ్రేష్ఠుడైన సుగ్రీవుడు దిగులు చెందిన మనస్సుతో ఇట్లు పలికెను. 1

మూ. ఉత్తిష్ఠోత్తిష్ఠ కస్మాత్త్వం పాదయోః పతితో మమ,
అభయం తే భవేద్వీర సర్వమేవాభిధీయతామ్. 2

ప్ర. అ. వీర=వీరుడా ! ఉత్తిష్ఠ ఉత్తిష్ఠ=లెమ్ము లెమ్ము, త్వమ్=నీవు, కస్మాత్=ఏ కారణమువలన, మమ=నాయొక్క, పాదయోః=పాదములపై, పతితః=పడినావు ? తే=నీకు, అభయమ్=అభయము, భవేత్=అగు గాక. సర్వమేవ=సమస్తము, అభిధీయతామ్=చెప్పబడు గాక.

తా. ఓ! వీరుడా! లెమ్ము లెమ్ము. నీవు నా పాదములపై ఎందుకు పడినావు ? నీకు అభయ మగుగాక. ఏమి జరిగినదో అంతా చెప్పుము. 2

మూ. స తు విశ్వాసితస్తేన సుగ్రీవేణ మహాత్మనా,
ఉత్థాయ సుమహాప్రాజ్ఞో వాక్యం దధిముఖోఽబ్రవీత్. 3

ప్ర. అ. మహాత్మనా=మహాత్ముడైన, తేన సుగ్రీవేణ=ఆ సుగ్రీవునిచేత, విశ్వాసితః=విశ్వసింపచేయబడిన, సుమహాప్రాజ్ఞః=చాల గొప్ప బుద్ధిమంతుడైన, సః దధిముఖః=ఆ దధిముఖుడు, ఉత్థాయ=లేచి, వాక్యమ్=వాక్యమును, అబ్రవీత్=పలికెను.

తా. మహాత్ముడైన సుగ్రీవుడీవిధముగ విశ్వాసము కలిగించగా, చాల బుద్ధిమంతుడైన దధిముఖుడు లేచి, ఇట్లు పలికెను. 3

మూ. నైవర్క్షరజసా రాజన్న త్వయా నాపి వాలినా,
వనం నిసృష్టపూర్వం హి భక్షితం తచ్చ వానరైః. 4

ప్ర. అ. రాజన్=రాజా, వనమ్=మధువనము, ఋక్షరజసా=ఋక్షరజస్సు చేత, నైవ నిసృష్టపూర్వం హి=పూర్వమెన్నడూ ఇవ్వబడలేదు. త్వయా=నీ చేత, న=ఇవ్వబడలేదు. వాలినాపి=వాలిచేత కూడ, న=కాదు. తచ్చ=అది, వానరైః=వానరులచేత, భక్షితమ్=భక్షింపబడినది.

తా. రాజా ! మధువనమును నీ తండ్రియైన ఋక్షరజస్సుగాని, నీవు గాని, వాలి గాని, స్వేచ్ఛగా అనుభవించుటకై పూర్వమెవ్వరికీ ఇచ్చి ఉండలేదు కదా. ఆ మధువనమును వానరులు భక్షించివేసినారు. 4

మూ. ఏభిః ప్రధర్షితాశ్చైవ వానరా వనరక్షిభిః,
మధూన్యచిన్తయిత్వేమాన్ భక్షయన్తి పిబన్తి చ. 5

ప్ర. అ. ఏభిః=ఈ, వనరక్షిభిః=వనరక్షకులచేత, ప్రధర్షితాశ్చైవ=భయపెట్టబడిన, వానరాః=వానరులు, ఇమాన్=వీళ్లను, అచిన్తయిత్వా=లెక్క చేయక, మధూని=మధువులను, భక్షయన్తి=భక్షించుచున్నారు. పిబన్తి చ=త్రాగుచున్నారు కూడా.

తా. ఈ వనరక్షకులు వారిని అడ్డుకొనగా ఆ వానరులు వీళ్ళను లెక్క చేయక, మధువులను తినివేయుచున్నారు ; త్రాగి వేయుచున్నారు. 5

మూ. శిష్టమత్రాపవిధ్యన్తి భక్షయన్తి తథాపరే,
నివార్యమాణాస్తే సర్వే భ్రువో వై దర్శయన్తి హి. 6

ప్ర. అ. శిష్టమ్=మిగిలినదానిని, అత్ర=ఇక్కడ, అపవిధ్యన్తి=పారవేయుచున్నారు. తథా=మరియు, అపరే=మరికొందరు, భక్షయన్తి=భక్షించుచున్నారు. తే సర్వే=వాళ్ళందరూ, నివార్యమాణాః=నివారింపబడుచున్నవారై, భ్రువః=కనుబొమ్మలను, దర్శయన్తి చ=చూపుచున్నారు.

తా. కొందరు త్రాగగా మిగిలిన దానిని పారవేయుచుండగా, మరికొందరు దానిని తీసికొని భక్షించుచున్నారు. మేము వాళ్లను నివారింపగా కోపముతో కనుబొమ్మలు విరచుచున్నారు. 6

మూ. ఇమే హి సంరబ్ధతరాస్తథా తైః సంప్రధర్షితాః,
వారయన్తో వనాత్తస్మాత్క్రుద్ధైర్వానరపుఙ్గవైః. 7

ప్ర. అ. సంరబ్ధతరాః=ఎక్కువ తొందరపడుచున్నవారై, తథా=మరియు, తస్మాత్=ఆ, వనాత్=వనమునుండి, వారయన్తః=నివారించుచున్న, ఇమే=వీళ్లు క్రుద్ధైః=కోపించిన, తైః వానరపుఙ్గవైః=ఆ వానరశ్రేష్ఠులచేత, సంప్రధర్షితాః=బెదిరింపబడినారు.

తా. ఈ వనపాలకులు తొందరగా వెళ్ళి వాళ్లను నివారింపగా, ఆ వానరశ్రేష్ఠులు, కోపముతో వీళ్లను బెదిరించిరి. 7

మూ. తతస్తైర్బహుభిర్వీరైర్వానరైర్వానరర్షభ,
సంరక్తనయనైః క్రోధాద్ధరయః ప్రవిచాలితాః. 8

ప్ర. అ. వానరర్షభ=వానరశ్రేష్ఠుడా ! తతః=అటు పిమ్మట, క్రోధాత్=కోపమువలన, సంరక్తనయనైః=ఎఱ్ఱనైన నేత్రములు గల, వీరైః=వీరులైన, బహుభిః=అనేకులైన, తైః వానరైః=ఆ వానరులచేత, హరయః=వానరులు, ప్రవిచాలితాః=తరుమబడినారు.

తా. ఓ !వానరశ్రేష్ఠా ! అప్పుడు కోపముచేత ఎఱ్ఱనైన నేత్రములతో, అధికసంఖ్యలో ఉన్న, వీరులైన, ఆ వానరులు, వనరక్షకులను తరిమివేసిరి. 8

మూ. పాణిభిర్నిహతాః కేచిత్కేచిజ్జానుభిరాహతాః,
ప్రకృష్టాశ్చ యథాకామం దేవమార్గం చ దర్శితాః. 9

ప్ర. అ. కేచిత్=కొందరు, పాణిభిః=పాదములచేత, నిహతాః=కొట్టబడిరి. కేచిత్=కొందరు, జానుభిః=మోకాళ్ళచేత, ఆహతాః=కొట్టబడిరి. యథాకామమ్=ఇష్టము వచ్చినట్లు, ప్రకృష్టాః=ఈడ్చబడినవారై, దేవమార్గమ్=గుహ్యప్రదేశమును, దర్శితాః చ=చూపబడినారు కూడ.

తా. ఆ వానరులు, ఈ వనరక్షకులలో కొందరిని చేతులతో కొట్టిరి. కొందరిని మోకాళ్ళతో పొడిచిరి. ఇష్టము వచ్చినట్లు ఈడ్చి గుహ్యప్రదేశము కూడ చూపించిరి. 9

మూ. ఏవమేతే హతాః శూరాస్త్వయి తిష్ఠతి భర్తరి,
కృత్స్నం మధువనం చైవ ప్రకామం తైః ప్రభక్ష్యతే. 10

ప్ర. అ. త్వయి=నీవు, భర్తరి=ప్రభువుగా, తిష్ఠతి=ఉండగా, ఏతే=ఈ, శూరాః=శూరులు, ఏవమ్=ఇట్లు, హతాః=కొట్టబడినారు. తైః=వాళ్లచేత, కృత్స్నమ్=సమస్తమైన, మధువనం చైవ=మధువనము కూడ, ప్రకామమ్=మిక్కిలి, ప్రభక్ష్యతే=భక్షింపబడుచున్నది.

తా. నీవు ప్రభువుగా ఉండగా కూడ శూరులైన ఈ వనరక్షకులను ఆ వానరులు ఈ విధముగా కొట్టి, మధువనమును పూర్తిగా భక్షించివేయుచున్నారు.

మూ. ఏవం విజ్ఞాప్యమానం తం సుగ్రీవం వానరర్షభమ్,
అపృచ్ఛత్తం మహాప్రాజ్ఞో లక్ష్మణః పరవీరహా. 11

ప్ర. అ. ఏవమ్=ఈ విధముగా, విజ్ఞాప్యమానమ్=విజ్ఞాపనచేయబడుచున్న, వానరర్షభమ్=వానరశ్రేష్ఠుడైన, తం సుగ్రీవమ్=ఆ సుగ్రీవుని, పరవీరహా=శత్రు వీరులను సంహరించువాడు, మహాప్రాజ్ఞః=గొప్ప బుద్ధి కలవాడు అయిన, లక్ష్మణః=లక్ష్మణుడు, అపృచ్ఛత్=అడిగెను.

తా. దధిముఖుడీవిధముగ సుగ్రీవునకు విజ్ఞాపన చేయుచుండగా, మహా బుద్ధిశాలి, శత్రువీరసంహారకుడు అయిన లక్ష్మణుడు సుగ్రీవుని ఇట్లు ప్రశ్నించెను.

మూ. కిమయం వానరో రాజన్ వనపః ప్రత్యుపస్థితః,
కం చార్థమభినిర్దిశ్య దుఃఖితో వాక్యమబ్రవీత్. 12

ప్ర. అ. రాజన్=రాజా, వనపః=మధువనపాలకుడైన, అయం వానరః=ఈ వానరుడు, కిమ్=ఎందుకు, ప్రత్యుపస్థితః=వచ్చినాడు ? దుఃఖితః=దుఃఖితుడై, కమ్=ఏ, అర్థమ్=విషయమును, అభినిర్దిశ్య=నిర్దేశించి, వాక్యమ్=వాక్యమును, అబ్రవీత్=పలికెను ?

తా. రాజా ! వనపాలకుడైన ఈ వానరుడు ఎందుకు వచ్చినాడు ? ఇతడు దుఃఖితుడై ఏదో విషయమును గూర్చి చెప్పుచున్నాడు ; అది ఏమి? 12

మూ. ఏవముక్తస్తు సుగ్రీవో లక్ష్మణేన మహాత్మనా,
లక్ష్మణం ప్రత్యువాచేదం వాక్యం వాక్యవిశారదః. 13

ప్ర. అ. మహాత్మనా=మహాత్ముడైన, లక్ష్మణేన=లక్ష్మణునిచేత, ఏవమ్=ఇట్లు, ఉక్తః=పలుకబడిన, వాక్యవిశారదః= మాటలలో నేర్పరియైన, సుగ్రీవః=సుగ్రీవుడు, ఇదమ్=ఈ, వాక్యమ్=వాక్యమును, ప్రత్యువాచ=తిరిగి పలికెను.

తా. మహాత్ముడైన లక్ష్మణుని మాటలు విని, మాటలలో నేర్పు గల సుగ్రీవుడు లక్ష్మణునకిట్లు బదులు చెప్పెను. 13

మూ. ఆర్య లక్ష్మణ సంప్రాహ వీరో దధిముఖః కపిః,
అఙ్గదప్రముఖైర్వీరైర్భక్షితం మధు వానరైః, 14
విచిత్య దక్షిణామాశామాగతైర్హరిపుఙ్గవైః.

ప్ర. అ. ఆర్య=పూజ్యుడవైన, లక్ష్మణ=లక్ష్మణుడా ! వీరః=వీరుడైన, కపిః=వానరుడైన, దధిముఖః=దధిముఖుడు, సంప్రాహ=చెప్పుచున్నాడు, దక్షిణామ్ ఆశామ్=దక్షిణదిక్కును, విచిత్య=అన్వేషించి, ఆగతైః=వచ్చిన, హరిపుఙ్గవైః=వానరులలో శ్రేష్ఠులైన, వీరైః=వీరులైన, అఙ్గదప్రముఖైః=అంగదుడు మొదలైన, వానరైః=వానరులచేత, మధు=మధువు, భక్షితమ్=భక్షించబడినది.

తా. పూజ్యుడ వైన లక్ష్మణా ! ఈ దధిముఖుడు -"దక్షిణదిక్కు వెదకి తిరిగి వచ్చిన వానరశ్రేష్ఠులు, వీరులు అయిన అంగదాదివానరులు మధువును తినివేసినారు" అని చెప్పుచున్నాడు.

వి. వావిళ్లప్రతిలో గాని, గోరఖ్‌పూర్‌ప్రతిలో గాని, దధిముఖునిమాటలలో అంగదాదులు మధువనమును చెల్లాచెదరుచేసినారని చెప్పి నట్లు లేదు. సుగ్రీవుడు ఇక్కడ అంగదాదులావిధముగ చేసినట్లు చెప్పుచున్నాడు. ఆతనికి ఆ వానరులు అంగదాదులని ఎట్లు తెలిసినదో సూచనలేదు. ప్రాచ్యప్రతిలో ఒక శ్లోకములో అంగదాదులు మధువనభంగము చేసినట్లున్నది.

"అఙ్గదః సహితైః సర్వైర్హనుమత్ప్రముఖైః కపిః,
దృష్ట్వా మధూన్యపాస్యైవ సర్వానస్మానభక్షయత్." 14

మూ. నైషామకృత్యానామీదృశః స్యాదుపక్రమః. 15
ఆగతైశ్చ ప్రమథితం యథా మధువనం హి తైః,
ధర్షితం చ వనం కృత్స్నముపయుక్తం చ వానరైః. 16

ప్ర. అ. ఆగతైః=తిరిగి వచ్చిన, తైః వానరైః=ఆ వానరులచేత, మధువనమ్=మధువనము, యథా=ఎట్లు, ప్రమథితమ్=భగ్నము చేయబడినదో, కృత్స్నమ్=సమస్తమైన, వనమ్=ఆ వనము, ధర్షితమ్=ఆక్రమింపబడినదై, ఉపయుక్తం చ=ఉపయోగింపబడినదో, (తథా=దానినిపట్టి చూడగా), ఏషామ్=ఈ వానరులు, అకృతకృత్యానామ్=కార్యమును సఫలము చేయనివారైనచో, ఈదృశః=ఇట్టి, ఉపక్రమః=కార్యపద్ధతి, న స్యాత్=ఉండజాలదు.

తా. తిరిగి వచ్చిన ఈ వానరులు మధువనమును ఆక్రమించి, దానిని పాడుచేసి, దానినంతనూ అనుభవించినారనగా, తాము వెళ్ళిన పనిని సఫలము చేసికొననిచో వారట్లు ప్రవర్తించరు. 15, 16

మూ. వనం యదాభిపన్నాస్తే సాధితం కర్మ వానరైః,
దృష్టా దేవీ న సన్దేహో న చాన్యేన హనూమతా. 17

ప్ర. అ. తే=ఆ వానరులు, యదా=ఎప్పుడు, వనమ్=మధువనమును, అభిపన్నాః=పొందినారో, అప్పుడు, వానరైః=వానరులచేత, కర్మ=పని, సాధితమ్=సాధింపబడినది. దేవీ=సీతాదేవి, దృష్టా=చూడబడినది. సన్దేహః=సందేహము, న=లేదు. అన్యేన=మరెవ్వనిచేత, న=కాదు. హనూమతా=హనుమంతునిచేతనే (చూడబడినది).

తా. ఆ వానరులు మధువనమును ఆక్రమించినారనగా వానరులు పనిని సాధించియే ఉందురు. దేవి కనబడినది ; సందేహము లేదు. మరెవ్వరో కాదు ; హనుమంతుడే ఆ దేవిని చూచి ఉండును. 17

మూ. న హ్యన్యః సాధనే హేతుః కర్మణోఽస్య హనూమతః,
కార్యసిద్ధిర్మతిశ్చైవ తస్మిన్వానరపుఙ్గవే. 18
వ్యవసాయశ్చ వీర్యం చ శ్రుతం చాపి ప్రతిష్ఠితమ్.

ప్ర. అ. అస్య కర్మణః=ఈ పనియొక్క, సాధనే=సాధించుటయందు, హనూమతః=హనుమంతునికంటె, అన్యః=ఇతరుడు, హేతుః=కారణభూతుడు, న హి=కాజాలడు కదా? కార్యసిద్ధిః=కార్యసిద్ధి, మతిశ్చైవ=మంచి ఆలోచన, వ్యవసాయశ్చ=ప్రయత్నము, వీర్యం చ=పరాక్రమము, శ్రుతం చాపి=శాస్త్రజ్ఞానము, తస్మిన్ వానరపుఙ్గవే=ఆ వానరశ్రేష్ఠునియందు, ప్రతిష్ఠితమ్=స్థిరముగా ఉన్నది (వి).

తా. హనుమంతుడు తప్ప మరెవ్వరూ ఈ పని సాధించజాలరు. వానరశ్రేష్ఠుడైన ఆ హనుమంతునిలో కార్యసిద్ధి, ఆలోచనాశక్తి, ప్రయత్నము, పరాక్రమము, శాస్త్రజ్ఞానము మొదలైన మంచి లక్షణములు స్థిరముగా ఉన్నవి.

మూ. జామ్బవాన్యత్ర నేతా స్యాదఙ్గదశ్చ మహాబలః, 19
హనుమాంశ్చాప్యధిష్ఠాతా న తస్య గతిరన్యథా.

ప్ర. అ. యత్ర=ఏ కార్యమునందు, జామ్బవాన్=జాంబవంతుడు, నేతా=నాయకుడుగా, స్యాత్=ఉండునో, మహాబలః=గొప్ప బలము గల, అఙ్గదశ్చ=అంగదుడు కూడ, నాయకుడుగా ఉండునో, హనుమాంశ్చ=హనుమంతుడు, అధిష్ఠాతా=అధ్యక్షుడుగా ఉండునో, తస్య=ఆ కార్యము యొక్క, గతిః=గతి [ఫలము], అన్యథా=మరొక విధముగా, న=కాజాలదు.

తా. ఏ కార్యసంపాదనమునందు జాంబవంతుడు, మహాబలశాలియైన అంగదుడూ నాయకులుగా ఉందురో, హనుమంతుడు అధ్యక్షుడుగా ఉండునో, అది తప్పక సఫలమగును గాని, మరొక విధముగా కాజాలదు. 19

మూ. అఙ్గదప్రముఖైర్వీరైర్హతం మధువనం కిల, 20
వారయన్తశ్చ సహితాస్తదా జానుభిరాహతాః.

ప్ర. అ. అఙ్గదప్రముఖైః=అంగదుడు మొదలైన, వీరైః=వీరులచేత, మధువనమ్=మధువనము, హతం కిల=పాడుచేయబడినదట. సహితాః=కలిసి వెళ్ళినవారై, వారయన్తః చ=నివారించుచున్న వనపాలకులు కూడ, తదా=అప్పుడు, జానుభిః=మోకాళ్ళచేత, ఆహతాః=కొట్టబడినారు.

తా. అంగదుడు మొదలైన వీరులు మధువనమును భగ్నము చేసినారట. వనపాలకులందరూ కలిసి నివారించగా వాళ్లను మోకాళ్ళతో పొడిచినారట.20

మూ. ఏతదర్థమయం ప్రాప్తో వక్తుం మధురవాగిహ, 21
నామ్నా దధిముఖో నామ హరిః ప్రఖ్యాతవిక్రమః.

ప్ర. అ. నామ్నా=పేరుచేత, దధిముఖో నామ=దధిముఖుడని ప్రసిద్ధిపొందిన, ప్రఖ్యాతవిక్రమః=ప్రసిద్ధమైన పరాక్రమము గల, హరిః=వానరుడు, ఏతదర్థమ్=ఈ విషయమును, వక్తుమ్=చెప్పుటకు, మధురవాక్=మధురమైన వాక్కు కలవాడై, ఇహ=ఇక్కడికి, ప్రాప్తః=వచ్చినాడు.

తా. ప్రసిద్ధమైన పరాక్రమము గల దధిముఖుడనే వానరుడు ఈ విషయమునే చెప్పుటకై, మనకందరికీ మధురమైన వాక్కు పలుకుచు ఇక్కడికి వచ్చినాడు. 21

మూ. దృష్టా సీతా మహాబాహో సౌమిత్రే పశ్య తత్త్వతః, 22
అభిగమ్య తథా సర్వే పిబన్తి మధు వానరాః.

ప్ర. అ. మహాబాహో=గొప్ప బాహువులు గల, సౌమిత్రే=లక్ష్మణా ! సీతా=సీత, దృష్టా=చూడబడినది. తత్త్వతః=యథార్థమును, పశ్య=చూడుము [తెలిసికొనుము]. తథా=మరియు, వానరాః=వానరులు, సర్వే=అందరూ, అభిగమ్య=చేరి, మధు=మధువును, పిబన్తి=త్రాగుచున్నారు.

తా. ఓ ! మహాబాహూ ! లక్ష్మణా ! సీత జాడ తెలిసినదను సత్యమును తెలుసుకొనుము. ఎందుచేతననగా వానరులందరూ చేరి మధువు త్రాగుచున్నారు. 22

మూ. న చాప్యదృష్ట్వా వైదేహీం విశ్రుతాః పురుషర్షభ, 23
వనం దత్తవరం దివ్యం ధర్షయేయుర్వనౌకసః.

ప్ర. అ. పురుషర్షభ=ఓ ! పురుషశ్రేష్ఠుడా !విశ్రుతాః ప్రసిద్ధులైన, వనౌకసః=వానరులు, వైదేహీమ్=సీతను, అదృష్ట్వా=చూడకుండగా, దత్తవరమ్=ఇవ్వబడిన వరము గలది, దివ్యమ్=దివ్యమూ అయిన, వనమ్=మధువనమును, న ధర్షయేయుః=ఆక్రమింపరు.

తా. ఓ ! పురుషశ్రేష్ఠా ! కీర్తిమంతులైన హనుమదాదివానరులు, సీతను చూడకపోయినచో, ఎవ్వరూ చొరగూడదు అను నియమముతో కాపాడబడుచున్న ఆ ఉత్తమమైన మధువనమును ఆక్రమించరు. 23

మూ. తతః ప్రహృష్టో ధర్మాత్మా లక్ష్మణః సహ రాఘవః. 24
శ్రుత్వా కర్ణసుఖాం వాణీం సుగ్రీవవదనాచ్చ్యుతామ్,
ప్రాహృష్యత భృశం రామో లక్ష్మణశ్చ మహాబలః. 25

ప్ర. అ. తతః=అటు పిమ్మట, సహ రాఘవః=రామునితో కూడిన, ధర్మాత్మా=ధర్మాత్ముడైన, లక్ష్మణః=లక్ష్మణుడు, ప్రహృష్టః=సంతోషించెను. సుగ్రీవవదనాత్=సుగ్రీవుని ముఖమునుండి, చ్యుతామ్=వచ్చిన, కర్ణసుఖామ్=చెవులకు సుఖకరమైన, వాణీమ్=వాక్కును, శ్రుత్వా=విని, రామః=రాముడు, ప్రాహృష్యత=సంతోషించెను. మహాబలః=గొప్ప బలము గల, లక్ష్మణశ్చ=లక్ష్మణుడు కూడ, భృశమ్=మిక్కిలి, ప్రాహృష్యత=సంతోషించెను.

తా. అప్పుడు రామసహితుడైన ధర్మాత్ముడైన లక్ష్మణుడు సంతోషించెను. సుగ్రీవుని ముఖమునుండి వెలువడిన, చెవులకు సుఖము కలిగించు ఆ వాణిని విని రాముడు, మహాబలశాలియైన లక్ష్మణుడు సంతోషించిరి. 24, 25

మూ. శ్రుత్వా దధిముఖస్యేదం సుగ్రీవః సంప్రహృష్య చ,
వనపాలం పునర్వాక్యం సుగ్రీవః ప్రత్యభాషత. 26

ప్ర. అ. సుగ్రీవః=మంచి కంఠము గల, సుగ్రీవః=సుగ్రీవుడు, దధిముఖస్య=దధిముఖునియొక్క, ఇదమ్=ఈ వాక్యమును, శ్రుత్వా=విని, సంప్రహృష్య చ=చాల సంతోషించి, పునః=తిరిగి, వనపాలమ్=ఆ వనపాలుని గూర్చి, వాక్యమ్=వాక్యమును, ప్రత్యభాషత=పలికెను.

తా. అందమైన కంఠము గల సుగ్రీవుడు దధిముఖుని మాటలు విని చాల సంతోషించి, ఆతనితో మరల ఇట్లు పలికెను. 26

మూ. ప్రీతోఽస్మి సోఽహం యద్భుక్తం వనం తైః కృతకర్మభిః,
మర్షితం మర్షణీయం చ చేష్టితం కృతకర్మణామ్. 27

ప్ర. అ. కృతకర్మభిః=చేయబడిన కార్యము గల, తైః=ఆ వానరులచేత, వనమ్=మధువనము, యత్ భుక్తమ్=అనుభవింపబడెను అనునది ఏది కలదో, దానివలన, సః అహమ్=అట్టి నేను, ప్రీతః అస్మి=సంతోషించినాను. కృతకర్మణామ్=చేయబడిన కార్యము గల ఆ వానరుల యొక్క, మర్షణీయమ్=సహించదగిన, చేష్టితమ్=పని, మర్షితమ్=సహింపబడినది.

తా. వెళ్ళిన పని చేసికొని వచ్చిన ఆ వానరులు మధువనమును అనుభవించినందుకు నేను సంతోషించినాను. పని పూర్తిచేసికొని వచ్చిన వాళ్లు చేసిన ఆ పని (మధువనభంగము) క్షమింపదగినదే గాన క్షమించినాను. 27

మూ. ఇచ్ఛామి శీఘ్రం హనుమత్ప్రధానాన్
శాఖామృగాంస్తాన్ మృగరాజదర్పాన్,
ద్రష్టుం కృతార్థాన్ సహ రాఘవాభ్యాం
శ్రోతుం చ సీతాధిగమే ప్రయత్నమ్. 28

ప్ర. అ. హనుమత్ప్రధానాన్=హనుమంతుడు ప్రధానుడుగా గల, మృగరాజదర్పాన్=సింహము వంటి దర్పము గల, కృతార్థాన్=చేయబడిన కార్యము గల, తాన్=ఆ, శాఖామృగాన్=వానరులను, రాఘవాభ్యాం సహ=రామలక్ష్మణులతో కూడిన నేను, ద్రష్టుమ్=చూచుటకు, సీతాధిగమే=సీతను పొందుటయందు, ప్రయత్నమ్=ప్రయత్నమును, శ్రోతుం చ=వినుటకు, ఇచ్ఛామి=కోరుచున్నాను.

తా. పని సఫలము చేసికొని వచ్చినవారు, సింహము వంటి దర్పము గలవారు అయిన హనుమంతుడు నాయకుడుగా ఉన్న ఆ వానరులందరినీ చూడవలెననీ, సీతను పొందుటకు చేసిన ప్రయత్నమును వినవలెననీ, రామలక్ష్మణులు నేను కూడ కోరుచున్నాము. 28

మూ. ప్రీతిస్ఫీతాక్షౌ సంప్రహృష్టౌ కుమారౌ
దృష్ట్వా సిద్ధార్థౌ వానరాణాం చ రాజా,
అఙ్గైః సంహృష్టైః కర్మసిద్ధిం విదిత్వా
బాహ్వోరాసన్నాం సోఽతిమాత్రం ననన్ద. 29

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే సున్దరకాణ్డే
త్రిషష్టితమః సర్గః.

ప్ర. అ. సః=ఆ, వానరాణాం రాజా=వానరరాజు, ప్రీతిస్ఫీతాక్షౌ=సంతోషముతో విశాలములైన నేత్రములు కలవారు, సంప్రహృష్టౌ=గగుర్పాటుపొందినవారు,

సిద్ధార్థౌ=సిద్ధమైన కార్యము కలవారు అయిన, కుమారౌ=ఆ రాజకుమారులను, దృష్ట్వా=చూచి, సంప్రహృష్టైః=గగుర్పాటు చెందిన, అఙ్గైః=అవయవములతో కూడినవాడై, కర్మ సిద్ధిమ్=కార్యసిద్ధిని, బాహ్వోః=చేతులయందు, ఆసన్నామ్=సమీపించినదానినిగా, విదిత్వా=తెలిసికొని, అతిమాత్రమ్=మిక్కిలి, ననన్ద=సంతోషించెను.

తా. సీతాన్వేషణకార్యము సఫలమగుటచే ఆ రామలక్ష్మణులిద్దరు సంతోషముతో వికసించిన నేత్రములు కలవారై, గగుర్పాటు చెందిరి. వారిని చూచి సుగ్రీవుడు శరీరము గగుర్పాటుచెందగా, కార్యసిద్ధి చేతులలో ఉన్నట్లు గ్రహించి చాల సంతోషించెను. 29

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు సుందరకాండలో అరువదిమూడవ సర్గ సమాప్తము.

అథ చతుఃషష్టితమః సర్గః

[దధిముఖుని ద్వారా సుగ్రీవసందేశమును విని హనుమంతుడు మొదలైన వానరులు కిష్కింధకు వెళ్ళుట. హనుమంతుడు శ్రీరామునకు నమస్కరించి తాను సీతను చూచినట్లు తెలుపుట]

మూ. సుగ్రీవేణైవముక్తస్తు హృష్టో దధిముఖః కపిః,
రాఘవం లక్ష్మణం చైవ సుగ్రీవం చాభ్యవాదయత్. 1

ప్ర. అ. సుగ్రీవేణ=సుగ్రీవునిచేత, ఏవమ్=ఇట్లు, ఉక్తః=పలకబడిన, కపిః=వానరుడైన, దధిముఖః=దధిముఖుడు, హృష్టః=సంతోషించినవాడై, రాఘవమ్=రాముణ్ణి, లక్ష్మణం చైవ=లక్ష్మణుణ్ణి, సుగ్రీవం చ=సుగ్రీవుణ్ణి, అభ్యవాదయత్=సమస్కరించెను.

తా. దధిముఖుడు సుగ్రీవుని మాటలు విని, సంతోషించి, రామునకు, లక్ష్మణునకు, సుగ్రీవునకు నమస్కరించెను. 1

మూ. స ప్రణమ్య చ సుగ్రీవం రాఘవౌ చ మహాబలౌ,
వానరైః సహితః శూరైర్దివమేవోత్పపాత హ. 2

ప్ర. అ. సః=అతడు, సుగ్రీవమ్=సుగ్రీవుణ్ణి, మహాబలౌ=మహాబలము గల, రాఘవౌ చ=రామలక్ష్మణులను, ప్రణమ్య=సమస్కరించి, శూరైః=శూరులైన, వానరైః=వానరులతో, సహితః=కూడినవాడై, దివమేవ=ఆకాశమును గూర్చి, ఉత్పపాత=ఎగిరెను.

తా. అతడు సుగ్రీవునకు, మహాబలశాలులైన రామలక్ష్మణులకు నమస్కరించి శూరులైన వానరులతో కలిసి, ఆకాశముపైకి ఎగిరెను. 2

మూ. స ప్రవిష్టో మధువనం దదర్శ హరియూథపాన్,
విమదానుత్థితాన్సర్వాన్ వేపమానాన్ మదాత్యయే. 3

ప్ర. అ. మధువనమ్=మధువనమును, ప్రవిష్టః=ప్రవేశించిన, సః=అతడు, విమదాన్=మదము తొలగినవారు, మదాత్యయే=మదము తొలగినదగుచుండగా, వేపమానాన్=వణకుచున్నవారు (తూలుచున్నవారు) అయిన, సర్వాన్=సమస్తమైన, హరియూథపాన్=వానరనాయకులను, దదర్శ=చూచెను.

తా. ఆ దధిముఖుడు మధువనమునకు వెళ్ళి, అక్కడ మదము తొలగి, మత్తు తగ్గుటచే కొంచెము తూలుచు ఉన్న ఆ వానరనాయకు లందరినీ చూచెను. 3

వి. "మేహమానాన్ మధూదకమ్" (మధువుతో కలిసిన మూత్రము విడచుచున్న) అన్న పాఠం అశ్లీలంగా ఉండడంచేత ప్రాచ్యపాఠం గ్రహింపబడినది.3

మూ. స తానుపాగమద్వీరో బద్ధ్వా కరపుటాఞ్జలిమ్,
ఉవాచ వచనం శ్లక్ష్ణమిదం హృష్టవదఙ్గదమ్. 4

ప్ర. అ. వీరః=వీరుడైన, సః=ఆ దధిముఖుడు, కరపుటాఞ్జలిమ్=కర పుటములో దోసిలిని, బద్ధ్వా=కట్టి, తాన్=వారిని, ఉపాగమత్=సమీపించెను, హృష్టవత్=సంతోషించినవాడు వలె, అఙ్గదమ్=అంగదుని గూర్చి, శ్లక్ష్ణమ్=మృదువైన, ఇదం వచనమ్=ఈ వచనమును, ఉవాచ=పలికెను.

తా. వీరుడైన ఆ దధిముఖుడు అంజలి ఘటించి వారి వద్దకు వెళ్ళి అంగదునితో సంతోషపూర్వకముగా ఈ మృదువైన వాక్యమును పలికెను. 4

మూ. సౌమ్య రోషో న కర్తవ్యో యదేతత్పరివారితమ్,
అజ్ఞానాద్రక్షిభిః క్రోధాద్భవన్తః ప్రతిషేధితాః. 5

ప్ర. అ. సౌమ్య=సౌమ్యుడా ! ఏతత్=ఈ విధముగా, యత్ పరివారితమ్=నివారింపబడినది అనునది ఏది కలదో, దానిని గూర్చి, రోషః=కోపము, న కర్తవ్యః=చేయదగినది కాదు, భవన్తః=మీరు, రక్షిభిః=రక్షకులచేత, అజ్ఞానాత్=అజ్ఞానమువలన, క్రోధాత్=కోపమువలన, ప్రతిషేధితాః=నివారింపబడినారు.

తా. ఓ ! సౌమ్యుడా ! ఈ వనరక్షకులు, తెలియక, కోపముతో మిమ్ములను నివారించినారు, ఇట్లు నివారించినందుకు కోపించవద్దు. 5

మూ. యువరాజస్త్వమీశశ్చ వనస్యాస్య మహాబల,
మౌర్ఖ్యాత్ పూర్వం కృతో దోషస్తం భవాన్ క్షన్తుమర్హతి. 6

ప్ర. అ. మహాబల=ఓ మహాబలవంతుడా ! త్వమ్=నీవు, యువరాజః=యువరాజువు, అస్య వనస్య=ఈ వనమునకు, ఈశశ్చ=ప్రభువువు కూడా, పూర్వమ్=ముందు, మౌర్ఖ్యాత్=మూర్ఖత్వమువలన, దోషః=దోషము, కృతః=చేయబడినది, తమ్=దానిని, భవాన్=నీవు, క్షన్తుమ్=క్షమించుటకు, అర్హతి=తగియున్నావు.

తా. నీవు యువరాజువు. ఈ వనము పై అధికారము కలవాడవు. ఇంతకు ముందు, మూర్ఖత్వముచే తప్పు చేసినాము. దానిని క్షమింపుము. 6

మూ. ఆఖ్యాతం హి మయా గత్వా పితృవ్యస్య తవానఘ,
ఇహోపయాతం సర్వేషామేతేషాం వనచారిణామ్. 7

ప్ర. అ. అనఘ=దోషములు లేనివాడా ! మయా=నాచేత, గత్వా=వెళ్ళి, తవ=నీయొక్క, పితృవ్యస్య=పినతండ్రికి, సర్వేషామ్=సమస్త మైన, ఏతేషామ్=ఈ, వనచారిణామ్=వానరులయొక్క, ఇహ=ఇక్కడికి, ఉపయాతమ్=వచ్చుట, ఆఖ్యాతం హి=చెప్పబడినది కదా.

తా. దోషములు లేనివాడా ! ఈ వానరులందరు ఇక్కడకు వచ్చినట్లు, నేను వెళ్ళి నీ పినతండ్రికి తెలిపితిని. 7

మూ. స త్వదాగమనం శ్రుత్వా సహైభిర్హరియూథపైః,
ప్రహృష్టో న తు రుష్టోఽసౌ వనం శ్రుత్వా ప్రధర్షితమ్. 8

ప్ర. అ. సః=ఆ నీ పినతండ్రి, ఏభిః=ఈ, హరియూథపైః సహ=వానరనాయకులతో కూడ, త్వదాగమనమ్=నీ రాకను, శ్రుత్వా=విని, ప్రహృష్టః=సంతోషించినాడు, తు=కాని, వనమ్=వనమును, ప్రధర్షితమ్=చెరచబడినదానినిగా, శ్రుత్వా=విని, అసౌ=ఇతడు, న రుష్టః=కోపించలేదు.

తా. నీవు, ఈ వానరనాయకులతో కలిసి వచ్చినట్లు విని నీ పినతండ్రి సంతోషించినాడు. మధువనము చెరచబడినదని విని కూడ అతడు కోపించలేదు. 8

మూ. ప్రహృష్టో మాం పితృవ్యస్తే సుగ్రీవో వానరేశ్వరః,
శీఘ్రం ప్రేషయ సర్వాంస్తానితి హోవాచ పార్థివః. 9

ప్ర. అ. తే పితృవ్యః=నీ పినతండ్రి, వానరేశ్వరః=వానరప్రభువు, పార్థివః=రాజు అయిన, సుగ్రీవః=సుగ్రీవుడు, ప్రహృష్టః=సంతోషించినవాడై, తాన్ సర్వాన్=వారినందరినీ, శీఘ్రమ్=శీఘ్రముగా, ప్రేషయ=పంపుము, ఇతి=అని, మామ్=నన్ను గూర్చి, ఉవాచ హ=పలికెను.

తా. వానరరాజు, రాజ్యాధిపతి, నీ పినతండ్రి అయిన సుగ్రీవుడు సంతోషించి, "వాళ్ళనందరిని శీఘ్రముగా పంపుము" అని నాతో చెప్పినాడు. 9

మూ. శ్రుత్వా దధిముఖస్యేదం వచనం శ్లక్ష్ణమఙ్గదః,
అబ్రవీత్తాన్ హరిశ్రేష్ఠో వాక్యం వాక్యవిశారదః. 10

ప్ర. అ. దధిముఖస్య=దధిముఖునియొక్క, ఇదమ్=ఈ, శ్లక్ష్ణమ్=మృదువైన, వచనమ్=వచనమును, శ్రుత్వా=విని, హరిశ్రేష్ఠః=వానరులలో శ్రేష్ఠుడు, వాక్యవిశా

రదః=మాటలయందు నేర్పు గలవాడు అయిన, అఙ్గదః=అంగదుడు, తాన్=ఆ వానరులను గూర్చి, వాక్యమ్=వాక్యమును, అబ్రవీత్=పలికెను.

తా. వానరులలో శ్రేష్ఠుడూ, మాటలలో నేర్పరి అయిన అంగదుడు దధిముఖుని మృదువైన మాటలు విని, ఆ వానరులతో ఇట్లు పలికెను. 10

మూ. శఙ్కే శ్రుతోఽయం వృత్తాన్తో రామేణ హరియూథపాః,
తత్క్షమం నేహ నః స్థాతుం కృతే కార్యే పరంతపాః. 11

ప్ర. అ. పరంతపాః=శత్రుసంహారకులైన, హరియూథపాః=వానర నాయకులారా ! అయం వృత్తాన్తః=ఈ వృత్తాంతము, రామేణ=రామునిచేత, శ్రుతః=వినబడినది అని, శఙ్కే=ఊహించుచున్నాను. తత్=ఆ కారణమువలన, కార్యే=కార్యము, కృతే=చేయబడినదగుచుండగా, ఇహ=ఇక్కడ, స్థాతుమ్=ఉండుటకు, నః=మనకు, న క్షమమ్=తగినది కాదు.

తా. శత్రుసంహారకులైన ఓ ! వానరశ్రేష్ఠులారా ! ఈ వృత్తాంతము రాముడు విని ఉంటాడని తలచెదను. కార్యము పూర్తిచేసిన పిమ్మట మనము ఇంకా ఇక్కడనే ఉండుట యుక్తము కాదు. 11

మూ. పీత్వా మధు యథాకామం విశ్రాన్తా వనచారిణః,
కిం శేషం గమనం తత్ర సుగ్రీవో యత్ర మే గురుః. 12

ప్ర. అ. వనచారిణః=వానరులు, యథాకామమ్=ఇష్టము వచ్చినట్లుగా, మధు=మధువును, పీత్వా=త్రాగి, విశ్రాన్తాః=విశ్రమించినారు. కిమ్=ఏమి, శేషమ్=మిగిలినది ? మే=నాయొక్క, గురుః=పినతండ్రియైన, సుగ్రీవః=సుగ్రీవుడు, యత్ర=ఎక్కడ ఉన్నాడో, తత్ర=అక్కడికి, గమనమ్=వెళ్లుటయే మిగిలినది.

తా. వానరులందరు ఇష్టము వచ్చినట్లు మధువు త్రాగి విశ్రమించినారు. ఇంక మిగిలినది ఏమి ? నా పినతండ్రియైన సుగ్రీవుడు ఉన్న చోటికి వెళ్ళుటయే ఇంక చేయవలసిన పని. 12

మూ. సర్వే యథా మాం వక్ష్యన్తి సమేత్య హరియూథపాః,
తథాస్మి కర్తా కర్తవ్యే భవద్భిః పరవానహమ్. 13

ప్ర. అ. సర్వే=సమస్తమైన, హరియూథపాః=వానరనాయకులు, సమేత్య=కలిసి, మామ్=నన్నుగూర్చి, యథా=ఎట్లు, వక్ష్యన్తి=చెప్పగలరో, తథా=అట్లు, కర్తా=చేయువాడను, అస్మి=అయి ఉన్నాను, కర్తవ్యే=కర్తవ్యము విషయమున, అహమ్=నేను, భవద్భిః=మీ చేత, పరవాన్=పరాధీనుడను.

తా. వానరనాయకులందరూ కలిసి ఆలోచించి ఏమి చెప్పెదరో అట్లు చేసెదను. ఇపు డేమి చేయవలెను అను విషయమున నేను మీకు అధీనుడను; మీరు చెప్పినట్లు చేసెదను. 13

మూ. నాజ్ఞాపయితుమీశోఽహం యువరాజోఽస్మి యద్యపి,
అయుక్తం కృతకర్మాణో యూయం ధర్షయితుం మయా. 14

ప్ర. అ. అహమ్=నేను, యువరాజః=యువరాజునుగా, అస్మి యద్యపి= అయి ఉన్నను, ఆజ్ఞాపయితుమ్=ఆజ్ఞాపించుటకు, న ఈశః=సమర్థుడను కాను. కృతకర్మాణః=చేయబడిన పని గల, యూయమ్=మీరు, మయా=నా చేత, ధర్షయితుమ్=ఎదిరించుటకు, అయుక్తమ్=యుక్తము కాదు.

తా. నేను యువరాజునే అయినను మిమ్ములను ఆజ్ఞాపింపజాలను. కార్యమును నిర్వర్తించిన మీ మాట కాదనుట నాకు యుక్తము కాదు. 14

మూ. బ్రువతశ్చాఙ్గదస్యైవం శ్రుత్వా వచనమవ్యయమ్,
ప్రహృష్టమనసో వాక్యమిదమూచుర్వనౌకసః. 15

ప్ర. అ. ఏవమ్=ఇట్లు, బ్రువతః=పలుకుచున్న, అఙ్గదస్య=అంగదునియొక్క, అవ్యయమ్=ఉత్తమమైన, వచనమ్=వచనమును, శ్రుత్వా=విని, వనౌకసః=వానరులు, ప్రహృష్టమనసః=సంతోషించిన మనస్సు కలవారై, ఇదమ్=ఈ వాక్యమును, ఊచుః=పలికిరి.

తా. అంగదుడు పలికిన ఆ ఉత్తమమైన మాట విని, వానరులు సంతోషించిన మనస్సులతో ఇట్లు పలికిరి. 15

మూ. ఏవం వదతి కో రాజన్ ప్రభుః సన్ వానరర్షభ,
ఐశ్వర్యమదమత్తో హి సర్వోఽహమితి మన్యతే. 16

ప్ర. అ. వానరర్షభ=వానరశ్రేష్ఠుడవైన, రాజన్=రాజా ! ప్రభుఃసన్=ప్రభువై యుండి, కః=ఎవడు, ఏవమ్=ఇట్లు, వదతి=పలుకును ? సర్వః=ప్రతివాడు, ఐశ్వర్యమదమత్తః=ఐశ్వర్యమదముచేత మదించినవాడై, అహమ్ ఇతి="నేను" అని, మన్యతే హి=తలచుచుండును కదా ?

తా. వానరశ్రేష్ఠుడవైన ఓ ! యువరాజా ! ప్రభువై యుండి ఎవడు ఇట్లు పలుకును ? ప్రతివాడూ ఐశ్వర్యముచే మదించి "నేను, నేను" అనుకొనుచుండును కదా ? 16

మూ. తవ చేదం సుసదృశం వాక్యం నాన్యస్య కస్యచిత్,
సన్నతిర్హి తవాఖ్యాతి భవిష్యచ్ఛుభయోగ్యతామ్. 17

ప్ర. అ. ఇదం వాక్యమ్=ఈ వాక్యము, తవ చ=నీకే, సుసదృశమ్=చాల తగియున్నది. అన్యస్య=ఇతరునకు, కస్య చిత్=ఎవనికీ, న=తగినది కాదు. తవ=నీయొక్క, సన్నతిః=వినయము, భవిష్యచ్ఛుభయోగ్యతామ్=రానున్న శుభమునకు యోగ్యత్వమును, ఆఖ్యాతి=చెప్పుచున్నది.

తా. ఇట్లు మాట్లాడుట నీకే తగును. ఇతరుడెవ్వడూ ఇట్లు మాట్లాడజాలడు. నీలో ఉన్న వినయము నీకు మున్ముందు మంచి శుభము కలుగ నున్నదని, దానికి నీవు యోగ్యుడవని సూచించుచున్నది. 17

మూ. సర్వే వయమపి ప్రాప్తాస్తత్ర గన్తుం కృతక్షణాః,
స యత్ర హరివీరాణాం సుగ్రీవః పతిరవ్యయః. 18

ప్ర. అ. ప్రాప్తాః=ఇక్కడికి వచ్చిన, వయమ్=మేము, సర్వేஉపి=అందరము, హరివీరాణామ్=వానరవీరులయొక్క, పతిః=ప్రభువు, అవ్యయః=వినాశము లేనివాడు అయిన, సః సుగ్రీవః=ఆ సుగ్రీవుడు, యత్ర=ఎక్కడ ఉన్నాడో, తత్ర=అక్కడికి, గన్తుమ్=వెళ్ళుటకు, కృతక్షణాః=చేయబడిన అవకాశము గలవారము (వేచియున్నాము).

తా. ఇక్కడికి చేరిన మేమందరము కూడ, వానరనాయకుల ప్రభువు, నిత్యాభివృద్ధిమంతుడు అయిన సుగ్రీవుడు ఉన్న స్థానమునకు వెళ్లుటకు వేచిఉన్నాము.

మూ. త్వయా హ్యనుక్తైర్హరిభిర్నైవ శక్యం పదాత్పదమ్,
క్వచిద్గన్తుం హరిశ్రేష్ఠ బ్రూమః సత్యమిదం తు తే. 19

ప్ర. అ. హరిశ్రేష్ఠ=వానరశ్రేష్ఠుడా ! త్వయా=నీచేత, అనుక్తైః=ఆజ్ఞాపింపబడని, హరిభిః=వానరులచేత, పదాత్=ఒక అడుగునుండి, పదమ్=మరొక అడుగును, క్వచిత్=ఎక్కడికిని, గన్తుమ్=వెళ్లుటకు, న శక్యమ్=శక్యము కాదు. సత్యమ్=సత్యమైన, ఇదమ్=ఈవాక్యమును, తే=నీకు, బ్రూమః=చెప్పుచున్నాము.

తా. ఓ ! వానరశ్రేష్ఠా ! నీ ఆజ్ఞ లేకుండా వానరులు అడుగు తీసి అడుగు పెట్టి ఎక్కడికీ వెళ్ళజాలరు. నీకు సత్యముగా చెప్పుచున్నాము. 19

మూ. ఏవం తు వదతాం తేషామఙ్గదః ప్రత్యువాచ హ,
బాఢం గచ్ఛామ ఇత్యుక్త్వా ఖముత్పేతుర్మహాబలాః. 20

ప్ర. అ. తేషామ్=వాళ్లు, ఏవమ్=ఇట్లు, వదతామ్=పలుకుచుండగా, అఙ్గదః=అంగదుడు, బాఢమ్=తప్పక, గచ్ఛామ=వెళ్లుదము, అని, ప్రత్యువాచ హ=తిరిగి పలికెను. ఇతి=ఇట్లు, ఉక్త్వా=పలికి, మహాబలాః=గొప్ప బలము గల ఆ వానరులు, ఖమ్=ఆకాశమును గూర్చి, ఉత్పేతుః=ఎగిరిరి.

తా. ఆ వానరుల మాట విని అంగదుడు "తప్పక వెళ్లుదము"అని పలికెను. ఇట్లు పలికిన పిదప మహాబలవంతులైన వానరులు ఆకాశముపైకి ఎగిరిరి. 20

మూ. ఉత్పతన్తమనూత్పేతుః సర్వే తే హరియూథపాః,
కృత్వాకాశం నిరాకాశం యన్త్రోత్క్షిప్తా ఇవాచలాః. 21

ప్ర. అ. సర్వే=సమస్తమైన, తే హరియూథపాః=ఆ వానరనాయకులు, యన్త్రోత్క్షిప్తాః=యంత్రముచేత ఎత్తబడిన, అచలాః ఇవ=పర్వతములు వలె, ఆకాశమ్=ఆకాశమును, నిరాకాశమ్=అవకాశము లేని దానినిగా, కృత్వా=చేసి, ఉత్పతన్తమ్=పైకి ఎగురుచున్న ఆ అంగదుని, అనూత్పేతుః=అనుసరించి ఎగిరిరి.

తా. ఆ వానరనాయకులందరు యంత్రముచేత పైకి ఎత్తబడిన పర్వతములవలె, ఆకాశములో అవకాశము లేకుండ చేయుచు, పైకి ఎగురుచున్న ఆ అంగదుని అనుసరించి ఎగిరిరి. 21

మూ. తేఽమ్బరం సహసోత్పత్య వేగవన్తః ప్లవఙ్గమాః,
వినదన్తో మహానాదం ఘనా వాతేరితా యథా. 22

ప్ర. అ. వేగవన్తః=వేగము గల, తే ప్లవఙ్గమాః=ఆ వానరులు, మహానాదమ్=గొప్ప ధ్వని కలుగునట్లుగా, వినదన్తః=ధ్వనిచేయుచు, వాతేరితాః=వాయువుచేత ప్రేరేపింపబడిన, ఘనాః యథా=మేఘములు వలె, సహసా=శీఘ్రముగా, అమ్బరమ్=ఆకాశమును గూర్చి, ఉత్పత్య=ఎగిరి వెళ్ళిరి.

తా. వేగము గల ఆ వానరనాయకులు, అత్యధికముగా ధ్వని చేయుచు గాలికి ఎగురుచున్న మేఘముల వలె, శీఘ్రముగా ఆకాశముపై ఎగిరివెళ్ళిరి. 22

మూ. అఙ్గదే హ్యననుప్రాప్తే సుగ్రీవో వానరాధిపః,
ఉవాచ శోకోపహతం రామం కమలలోచనమ్. 23

ప్ర. అ. అఙ్గదే=అంగదుడు, అననుప్రాప్తే=రాకుండగా (వచ్చుటకు పూర్వము), వానరాధిపః=వానర రాజైన, సుగ్రీవః=సుగ్రీవుడు, శోకోపహతమ్=శోకము చేత పీడింపబడిన, కమలలోచనమ్=కమలముల వంటి నేత్రములు గల, రామమ్=రాముని గూర్చి, ఉవాచ=పలికెను.

తా. అంగదుడు ఇంకా అక్కడికి చేరక పూర్వము వానరరాజైన సుగ్రీవుడు, శోకము చేత పీడింపబడిన మనస్సు గల, పద్మముల వంటి నేత్రములు గల రామునితో ఇట్లు పలికెను. 23

మూ. సమాశ్వసిహి భద్రం తే దృష్టా దేవీ న సంశయః,
నాగన్తుమిహ శక్యం తైరతీతే సమయే హి నః. 24

ప్ర. అ. సమాశ్వసిహి=ఊరడిల్లుము. తే=నీకు, భద్రమ్=క్షేమమగుగాక, దేవీ=దేవి, దృష్టా=చూడబడినది. సంశయః=సంశయము, న=లేదు. నః=మనయొక్క, సమయే=సమయము, అతీతే=గడచినదగుచుండగా, తైః=వారిచేత, ఇహ=ఇక్కడికి, ఆగన్తుమ్=వచ్చుటకు, న శక్యమ్=శక్యము కాదు.

తా. రామా ! ఊరడిల్లుము. నీకు క్షేమమగుగాక. దేవి కనబడినది. సందేహము లేదు. మనమిచ్చిన సమయము గడచిన పిమ్మట వాళ్లు ఇక్కడికి రాజాలరు. 24

మూ. న మత్సకాశమాగచ్ఛేత్కృత్యే హి వినిపాతితే,
యువరాజో మహాబాహుః ప్లవతాం ప్రవరోఽఙ్గదః. 25

ప్ర. అ. యువరాజః=యువరాజు, మహాబాహుః=గొప్ప బాహువులు కలవాడు. ప్లవతామ్=వానరులలో, ప్రవరః=శ్రేష్ఠుడూ అయిన, అఙ్గదః=అంగదుడు, కృత్యే=కార్యము, వినిపాతితే=చెడగొట్టబడినదగుచుండగా, మత్సకాశమ్=నా సమీపమును, నాగచ్ఛేత్=రాడు.

తా. మహాబాహువు, వానరులలో శ్రేష్ఠుడు, యువరాజు అయిన అంగదుడు, కార్యము చెడిపోయిన పక్షాన నా దగ్గరికి వచ్చేవాడు కాదు. 25

మూ. యద్యప్రకృతకృత్యానామీదృశః స్యాదుపక్రమః,
భవేత్స దీనవదనో భ్రాన్తవిప్లుతమానసః. 26

ప్ర. అ. అకృతకృత్యానామ్=చేయబడని కార్యము కల ఈ వానరుల యొక్క, ఉపక్రమః=ఉద్యమము, ఈదృశః=ఇట్టిది, యద్యపి స్యాత్=అయినను కూడ, సః=ఆ అంగదుడు, దీనవదనః=దీనమైన ముఖము గలవాడు, భ్రాన్త విప్లుతమానసః=భ్రాంతిచెందినదీ దుఃఖాక్రాంతమూ అయిన మనస్సు కలవాడు, భవేత్=అయి ఉండును.

తా. కార్యము సఫలముచేయకనే ఈ వానరులు ఈవిధముగా ప్రవర్తించినా కూడ (తిరిగి వచ్చినా కూడ) ఈ అంగదుడు దీనమైన ముఖములో, భ్రాంతి చెంది దుఃఖాక్రాంతమైన మనస్సుతో దిగులుగా ఉండెడివాడు. 26

మూ. పితృపైతామహం చైతత్పూర్వకైరభిరక్షితమ్,
న మే మధువనం హన్యాదహృష్టః ప్లవగేశ్వరః. 27
కౌసల్య సుప్రజా రామ సమాశ్వసిహి సువ్రత.

ప్ర. అ. ప్లవగేశ్వరః=వానరుల ప్రభువైన అంగదుడు, అహృష్టః=సంతోషము లేనివాడైనచో, పితృపైతామహమ్=తండ్రితాతల నాటిదైన, పూర్వకైః=పూర్వపురుషులచేత, అభిరక్షితమ్=రక్షింపబడిన, మే మధువనమ్=నా మధువవమును, న హన్యాత్=పాడుచేసెడివాడు కాడు. కౌసల్యాసుప్రజాః=కౌసల్యసుపుత్రుడనైన, సువ్రత=మంచి నియమము గల, రామ=రామా ! సమాశ్వసిహి=ఊరడిల్లుము.

తా. అంగదుడు సంతోషముతో ఉండక పోయినచో, తండ్రితాతలనాటిది, పూర్వపురుషులచేత రక్షింపబడినదీ అయిన నా మధువనమును నశింపచేసెడివాడుకాడు. కౌసల్య సుపుత్రుడవు, ఉత్తమనియమవంతుడవూ అయిన ఓ! రామా! ఊరడిల్లుము. 27

మూ. దృష్టా దేవీ న సన్దేహో న చాన్యేన హనూమతా, 28
న హ్యన్యః కర్మణో హేతుః సాధనేఽస్య హనూమతః.

ప్ర. అ. తా.మూ. 63వ సర్గ. 17 వ శ్లోకం.

మూ. హనూమతి హి సిద్ధిశ్చ మతిశ్చ మతిసత్తమ, 29
వ్యవసాయశ్చ వీర్యం చ సూర్యే తేజ ఇవ ధ్రువమ్.

ప్ర. అ. మతిసత్తమ=బుద్ధిచేత గొప్పవాడా ! హనూమతి=హనుమంతుని యందు,. సూర్యే=సూర్యునియందు, తేజః ఇవ=తేజస్సు వలె, సిద్ధిశ్చ=కార్యసిద్ధి, మతిశ్చ=బుద్ధి, వ్యవసాయశ్చ=ప్రయత్నము, వీర్యం చ=పరాక్రమము, ధ్రువమ్=నిశ్చయముగా ఉన్నవి.

తా. బుద్ధిమంతులలో శ్రేష్ఠుడవైన రామా ! హనుమంతుని యందు కార్యసిద్ధి, బుద్ధి, నిరంతరప్రయత్నము, పరాక్రమము అను లక్షణములు, సూర్యుని యందు తేజస్సు వలె నిశ్చితముగా ఉండును. 29

మూ. జామ్బవాన్యత్ర నేతా స్యాదఙ్గదశ్చ బలేశ్వరః,
హనుమాంశ్చాప్యధిష్ఠాతా న తస్య గతిరన్యథా. 30

ప్ర. అ. తా. మూ. 63 వ సర్గ. 19 వ శ్లోకం. అక్కడ ఉన్న "అఙ్గదశ్చ మహాబలః"కు బదులు "అఙ్గదశ్చ బలేశ్వరః"అని ఇక్కడ పాఠము. "అంగదుడు సేనాధిపతిగా ఉండునో "అని అర్థము. 30

మూ. మా భూశ్చిన్తాసమాయుక్తః సంప్రత్యమితవిక్రమ, 31
తతః కిలకిలాశబ్దం శుశ్రావాసన్నమమ్బరే,
హనుమత్కర్మదృప్తానాం నర్దతాం కాననౌకసామ్, 32
కిష్కిన్ధాముపయాతానాం సిద్ధిం కథయతామివ.

ప్ర. అ. అమితవిక్రమ=అమితమైన పరాక్రమము కలవాడా ! సంప్రతి=ఇప్పుడు, చిన్తాసమాయుక్తః=చింతతో కూడినవాడవు, మా భూః=అవకుము. తతః=అటుపిమ్మట, హనుమత్కర్మదృప్తానామ్=హనుమంతుని కార్యముచేత గర్వితులు, నర్దతామ్=ధ్వనిచేయుచున్నవారు, సిద్ధిమ్=కార్యసిద్ధిని, కథయతామివ=చెప్పుచున్నవారు వలె ఉన్నవారు అయిన, కిష్కిన్ధామ్=కిష్కింధను, ఉపయాతానామ్=పొందిన, కాననౌకసామ్=వానరులయొక్క, అమ్బరే=ఆకాశమునందు, ఆసన్నమ్=సమీపించిన, కిలకిలాశబ్దమ్=కిలకిలాశబ్దమును, శుశ్రావ=వినెను.

తా. "అపరిమితపరాక్రమవంతుడవైన ఓ ! రామా ! ఇపుడు చింతాక్రాంతుడవు అవకుము". ఇంతలో హనుమంతుడు చేసిన కార్యముచే గర్వితులై ధ్వని చేయుచు, కార్యసిద్ధిని చెప్పుచున్నారా అన్నట్లున్న ఆ వానరులు కిష్కింధను సమీపించగా, వారి కిలకిలాశబ్దము ఆకాశముమీద దగ్గరగా వినవచ్చెను. 32

మూ. తతః శ్రుత్వా నినాదం తం కపీనాం కపిసత్తమః, 33
ఆయతాఞ్చితలాఙ్గూలః సోఽభవద్ధృష్టమానసః.

ప్ర. అ. తతః=అటు పిమ్మట, సః కపిసత్తమః=ఆ వానరశ్రేష్ఠుడు, కపీనామ్=వానరులయొక్క, తం నినాదమ్=ఆ ధ్వనిని, శ్రుత్వా=విని, ఆయతాఞ్చితలాఙ్గూలః=నిలువుగా వంచబడిన తోక కలవాడై, హృష్టమానసః=సంతోషించిన మనస్సు కలవాడు, అభవత్=ఆయెను.

తా. పిమ్మట ఆ సుగ్రీవుడు వానరుల ధ్వనిని విని, సంతోషించిన మనస్సు కలవాడై తోకను నిలువుగా ఎత్తి నిలచెను. 33

మూ. ఆజగ్ముస్తేఽపి హరయో రామదర్శనకాంక్షిణః, 34
అఙ్గదం పురతః కృత్వా హనూమన్తం చ వానరమ్.

ప్ర. అ. తే హరయః అపి=ఆ వానరులు కూడా, అఙ్గదమ్=అంగదుని, వానరమ్=వానరుడైన, హనూమన్తమ్=హనుమంతుని, పురతః=ఎదుట, కృత్వా=ఉంచుకొని, రామదర్శనకాంక్షిణః=రాముని దర్శనము కోరుచున్నవారై, ఆజగ్ముః=వచ్చిరి.

తా. ఆ వానరులు కూడ, అంగదుని, హనుమంతుని తమ ముందు ఉంచుకొని, రాముని చూడవలెనను ఉత్కంఠతో వచ్చిరి. 34

మూ. తేఽఙ్గదప్రముఖా వీరాః ప్రహృష్టాశ్చ ముదాన్వితాః, 35
నిపేతుర్హరిరాజస్య సమీపే రాఘవస్య చ.

ప్ర. అ. అఙ్గదప్రముఖాః=అంగదుడు మొదలైన, తే వీరాః=ఆ వీరులు, ప్రహృష్టాశ్చ=సంతోషించినవారై, ముదా=ఆనందముతో, అన్వితాః=కూడినవారై, హరిరాజస్య=సుగ్రీవుని యొక్క, రాఘవస్య చ=రామునియొక్క, సమీపే=సమీప మునందు, నిపేతుః=పడిరి (దిగిరి).

తా. అంగదుడు మొదలైన ఆ వీరులు సంతోషించుచు, ఆనందభరితులై, రామసుగ్రీవుల ఎదుట దిగిరి. 35

మూ. హనుమాంశ్చ మహాబాహుః ప్రణమ్య శిరసా తతః, 36
నియతామక్షతాం దేవీం రాఘవాయ న్యవేదయత్.

ప్ర. అ. తతః=అటు పిమ్మట, మహాబాహుః=గొప్ప బాహువులు గల, హనుమాన్=హనుమంతుడు, శిరసా=శిరస్సుతో, ప్రణమ్య=నమస్కరించి, దేవీమ్=సీతాదేవిని, నియతామ్=నియమవంతురాలినిగాను, అక్షతామ్=ఆరోగ్యవంతురాలిని గాను, రాఘవాయ=రామునకు, న్యవేదయత్=తెలిపెను.

తా. పిదప, గొప్ప బాహువులు గల హనుమంతుడు శిరస్సు వంచి నమస్కరించి, సీతాదేవి పాతివ్రత్యనియమమును కాపాడుకొనుచు, ఆరోగ్యవంతురాలై ఉన్నట్లు రామునకు తెలిపెను. 36

మూ. దృష్టా దేవీతి హనుమద్వదనాదమృతోపమమ్, 37
ఆకర్ణ్య వచనం రామో హర్షమాప సలక్ష్మణః.

ప్ర. అ. సలక్ష్మణః=లక్ష్మణునితో కూడిన, రామః=రాముడు, హనుమద్వదనాత్=హనుమంతుని ముఖమునుండి, అమృతోపమమ్=అమృతముతో సమానమైన, దేవీ దృష్టా ఇతి="సీతాదేవి చూడబడినది" అని, వచనమ్=వచనమును, ఆకర్ణ్య=విని, హర్షమ్=సంతోషమును, ఆప=పొందెను.

తా. లక్ష్మణసమేతుడైన రాముడు, "సీతాదేవి కనబడినది" అని హనుమంతుని ముఖమునుండి వెడలిన వచనమును విని సంతోషించెను. 37

మూ. నిశ్చితార్థం తతస్తస్మిన్ సుగ్రీవం పవనాత్మజే, 38
లక్ష్మణః ప్రీతిమాన్ ప్రీతం బహుమానాదవైక్షత.

ప్ర. అ. తతః=అటుపిమ్మట, లక్ష్మణః=లక్ష్మణుడు, తస్మిన్ పవనాత్మజే=ఆ హనుమంతునియందు, నిశ్చితార్థమ్=నిశ్చయింపబడిన విషయముగల, ప్రీతమ్=సంతోషించిన, సుగ్రీవమ్=సుగ్రీవుని, బహుమానాత్=గౌరవ భావముతో, అవైక్షత=చూచెను.

తా. పిమ్మట లక్ష్మణుడు సంతోషించుచు, హనుమంతుడు తప్పక కార్యము సాధించును అను విశ్వాసమును ప్రకటించిన, సంతోషించిన, ఆ సుగ్రీవుని గౌరవభావముతో చూచెను. 38

మూ. ప్రీత్యా చ పరయోపేతో రాఘవః పరవీరహా, 39
బహుమానేన మహతా హనుమన్తమవైక్షత.

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే సున్దరకాణ్డే
చతుఃషష్టితమః సర్గః.

ప్ర. అ. పరవీరహా=శత్రువీరులను సంహరించు, రాఘవః=రాముడు, పరయా=గొప్ప, ప్రీత్యా=సంతోషముతో, ఉపేతః=కూడినవాడై, మహతా=గొప్పదైన, బహుమానేన=గౌరవభావముతో, హనుమన్తమ్=హనుమంతుని, అవైక్షత=చూచెను.

తా. శత్రువీరులను సంహరించు రాముడు గొప్ప ఆనందము పొంది, హనుమంతుని అధికమైన గౌరవభావముతో చూచెను. 39

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు
సుందరకాండలో అరువదినాల్గవసర్గ సమాప్తము.

అథ పఞ్చషష్టితమః సర్గః

[హనుమంతుడు శ్రీరామునకు సీతావృత్తాంతము చెప్పుట]

మూ. తతః ప్రస్రవణం శైలం తే గత్వా చిత్రకాననమ్,
ప్రణమ్య శిరసా రామం లక్ష్మణం చ మహాబలమ్. 1
యువరాజం పురస్కృత్య సుగ్రీవమభివాద్య చ,
ప్రవృత్తిమథ సీతాయాః ప్రవక్తుముపచక్రముః. 2

ప్ర. అ. తతః=అటు పిమ్మట, తే-ఆ వానరులు, చిత్రకాననమ్=చిత్రములైన అడవులు గల, ప్రస్రవణం శైలమ్=ప్రస్రవణపర్వతమును గూర్చి, యువరాజమ్=యువరాజును, పురస్కృత్య=ముందు ఉంచుకొని, గత్వా=వెళ్ళి, రామమ్=రాముణ్ణి, మహాబలమ్=గొప్ప బలము గల, లక్ష్మణం చ=లక్ష్మణుణ్ణి, శిరసా=శిరస్సు చేత, ప్రణమ్య=నమస్కరించి, సుగ్రీవమ్=సుగ్రీవుని, అభివాద్య చ=నమస్కరించి, అథ=అటు పిమ్మట, సీతాయాః=సీతయొక్క, ప్రవృత్తిమ్=వార్తను, ప్రవక్తుమ్=చెప్పుటకు, ఉపచక్రముః=ప్రారంభించిరి.

తా. ఆ వానరులు యువరాజైన అంగదుని ముందు ఉంచుకొని, చిత్రమైన అడవులు గల ప్రస్రవణపర్వతమునకు వెళ్ళి, రామునకు, మహాబలశాలి యైన లక్ష్మణునకు శిరసా నమస్కరించి, సుగ్రీవునకు నమస్కరించి, పిమ్మట సీతవార్తను చెప్పుటకు ప్రారంభించిరి. 1, 2

మూ. రావణాన్తఃపురే రోధం రాక్షసీభిశ్చ తర్జనమ్,
రామే సమనురాగం చ యశ్చాయం సమయః కృతః. 3
ఏతదాఖ్యాన్తి తే సర్వే హరయో రామసన్నిధౌ.

ప్ర. అ. సర్వే=సమస్తమైన, తే హరయః=ఆ వానరులు, రావణాన్తః పురే=రావణుని అంతఃపురమునందు, రోధమ్=నిరోధమును, రాక్షసీభిః=రాక్షసస్త్రీలచేత, తర్జనం చ=భయపెట్టుటను, రామే=రామునియందు, సమనురాగం చ=అనురాగమును, యః=ఏ, అయమ్=ఈ, సమయః=గడువు, కృతః=చేయబడినదో, ఏతత్=దీనినంతను, రామసంనిధౌ=రామునివద్ద, ఆఖ్యాన్తి=చెప్పచుండిరి.

తా. ఆ వానరులందరూ, సీత రావణుని అంతఃపురములో నిరోధింపబడి ఉండుట, రాక్షసస్త్రీలు భయపెట్టుట, ఆమెకు రామునిమీద ఉన్న అనురాగము,

రావణుడిచ్చిన రెండు మాసాల గడువు-ఈ విషయములన్నీ రాముని ఎదుట చెప్పటకు ప్రారంభించిరి. 3

మూ. వైదేహీమక్షతాం శ్రుత్వా రామస్తూత్తరమబ్రవీత్, 4
క్వ సీతా వర్తతే దేవీ కథం చ మయి వర్తతే,
ఏతన్మే సర్వమాఖ్యాత వైదేహీం ప్రతి వానరాః. 5

ప్ర. అ. వైదేహీమ్=సీతను, అక్షతామ్=క్షేమముగా ఉన్నదానినిగా, శ్రుత్వా=విని, రామస్తు=రాముడైతే, ఉత్తరమ్=ప్రత్యుత్తరమును, అబ్రవీత్=పలికెను, దేవీ=దేవియైన, సీతా=సీత, క్వ=ఎక్కడ, వర్తతే=ఉన్నది ? మయి=నా విషయమునందు, కథమ్=ఎట్లు, వర్తతే=ఉన్నది, వానరాః=వానరులారా ! వైదేహీం ప్రతి=సీతను గూర్చి, ఏతత్=దీనిని, సర్వమ్=అంతనూ, మే=నాకు, ఆఖ్యాత=చెప్పడు.

తా. సీత క్షేమముగా ఉన్నదను విషయము విని రాముడు ఇట్లు పలికెను, "వానరులాలా ! సీత ఎక్కడ ఉన్నది ? నా విషయమునందు ఏ అభిప్రాయముతో ఉన్నది ? సీతకు సంబంధించిన ఈ విషయములన్నీ నాకు చెప్పడు " 4, 5

మూ. రామస్య గదితం శ్రుత్వా హరయో రామసన్నిధౌ,
చోదయన్తి హనూమన్తం సీతావృత్తాన్తకోవిదమ్. 6

ప్ర. అ. హరయః=వానరులు, రామస్య=రామునియొక్క, గదితమ్=మాటను, శ్రుత్వా=విని, సీతావృత్తాన్తకోవిదమ్=సీతావృత్తాంతము ఎరిగిన, హనూమన్తమ్=హనుమంతుని, రామసన్నిధౌ=రామునివద్దకు, చోదయన్తి=ముందుకు త్రోసిరి.

తా. ఆ వానరులు రాముని మాటలు విని, సీత వృత్తాంతమును తెలిసిన హనుమంతుణ్ణి, "నువ్వు చెప్పుము" అని రాముని ముందుకు త్రోసిరి.6

మూ. శ్రుత్వా తు వచనం తేషాం హనుమాన్ మారుతాత్మజః,
ప్రణమ్య శిరసా దేవ్యై సీతాయై తాం దిశం ప్రతి. 7
ఉవాచ వాక్యం వాక్యజ్ఞః సీతాయా దర్శనం యథా.

ప్ర. అ. మారుతాత్మజః=వాయుపుత్రుడు, వాక్యజ్ఞః=మాటలు తెలిసిన వాడు (మాటలాడుటలో నేర్పరి) అయిన, హనుమాన్=హనుమంతుడు, తేషామ్=ఆ వానరులయొక్క, వచనమ్=వచనమును, శ్రుత్వా=విని, దేవ్యై=దేవియైన, సీతాయై=సీతకు, తాం దిశం ప్రతి=ఆ దిక్కును గూర్చి, శిరసా=శిరస్సుతో, ప్రణమ్య=నమస్కరించి, సీతాయాః=సీతయొక్క, దర్శనమ్=దర్శనము, యథా=ఎట్లు జరిగినదో, వాక్యమ్=వాక్యమును, ఉవాచ=పలికెను.

తా. మాటలలో నేర్పరి, వాయుపుత్రుడు అయిన హనుమంతుడు ఆ వానరుల మాటలు విని, సీత ఉన్న దిక్కు వైపు తిరిగి సీతాదేవికి శిరస్సు వంచి నమస్కరించి, సీతను తానెట్లు చూచెనో తెలుపుచు ఇట్లు పలికెను. 7

మూ. సముద్రం లఙ్ఘయిత్వాహం శతయోజనమాయతమ్, 8
అగచ్ఛం జానకీం సీతాం మార్గమాణో దిదృక్షయా.

ప్ర. అ. అహమ్=నేను, శతయోజనమ్=నూరు యోజనములు, ఆయతమ్=పొడవైన, సముద్రమ్=సముద్రమును, లఙ్ఘయిత్వా=దాటి, జానకీమ్=జనకుని కుమార్తె యైన, సీతామ్=సీతను, మార్గమాణః=వెదకుచూ, దిదృక్షయా=ఆమెను చూడవలెనను కోరికతో, అగచ్ఛమ్=వెళ్ళితిని.

తా. నేను నూరు యోజనములు పొడవైన సముద్రము లంఘించి, జనకుని కుమార్తెయైన సీతను వెదకుచు, ఆమెను చూడవలెనను కోరికతో వెళ్ళితిని. 8

మూ. తత్ర లఙ్కేతి నగరీ రావణస్య దురాత్మనః, 9
దక్షిణస్య సముద్రస్య తీరే వసతి దక్షిణే.

ప్ర. అ. తత్ర=అక్కడ, దక్షిణస్య సముద్రస్య=దక్షిణసముద్రము యొక్క, దక్షిణే తీరే=దక్షిణతీరమునందు, దురాత్మనః=దుష్టబుద్ధి గల, రావణస్య=రావణుని యొక్క, లఙ్కేతి=లంక అను, నగరీ=పట్టణము, వసతి=ఉన్నది.

తా. అక్కడ, దక్షిణసముద్ర దక్షిణతీరమునందు, దురాత్ముడైన రావణుని లంక అను నగరము ఉన్నది. 9

మూ. తత్ర దృష్టా మయా సీతా రావణాన్తఃపురే సతీ, 10
సంన్యస్య త్వయి జీవన్తీ రామా రామ మనోరథమ్.

ప్ర. అ. రామ=ఓ ! రామా ! తత్ర=అక్కడ, రావణాన్తఃపురే=రావణుని అంతఃపురమునందు, సతీ=పతివ్రత, త్వయి=నీయందు, మనోరథమ్=కోరికను, సంన్యస్య=ఉంచి, జీవన్తీ=జీవించుచున్న, రామా=స్త్రీ, సీతా=సీత, మయా=నాచేత, దృష్టా=చూడబడినది.

తా. రామా ! ఆ లంకలో, రావణాంతఃపురములో నేను పతివ్రత యైన సీతను చూచితిని. ఆమె తన మనోరథములన్నీ నీ మీదనే ఉంచుకుని జీవించుచున్నది. 10

మూ. దృష్టా మే రాక్షసీమధ్యే తర్జ్యమానా ముహుర్ముహుః, 11
రాక్షసీభిర్విరూపాభీ రక్షితా ప్రమదావనే.

ప్ర. అ. ప్రమదావనే=ఉద్యానవనమునందు, విరూపాభిః=వికృతములైన రూపముల గల, రాక్షసీభిః=రాక్షసస్త్రీలచేత, రక్షితా=రక్షించబడినదీ, ముహుర్ముహుః=మాటి మాటికి, తర్జ్యమానా=భయపెట్టబడుచున్నదీ అయిన, ఆ సీత, మే=నాకు, రాక్షసీమధ్యే=రాక్షసస్త్రీల మధ్యయందు, దృష్టా=చూడబడినది.

తా. ఉద్యానవనములో, వికృతములైన ముఖములు గల రాక్షసస్త్రీలు ఆ సీతను రక్షించుచున్నారు. మాటి మాటికి ఆమెను భయపెట్టుచున్నారు. అట్టి సీతను నేను రాక్షసస్త్రీల మధ్య చూచితిని. 11

మూ. దుఃఖమాపద్యతే దేవీ త్వయా వీర సుఖోచితా. 12
రావణాన్తఃపురే రుద్ధా రాక్షసీభిః సురక్షితా,
ఏకవేణీధరా దీనా త్వయి చిన్తాపరాయణా. 13
అధఃశయ్యా వివర్ణాఙ్గీ పద్మినీవ హిమాగమే,
రావణాద్వినివృత్తార్థా మర్తవ్యకృతనిశ్చయా. 14
దేవీ కథంచిత్కాకుత్స్థ త్వన్మనా మార్గితా మయా.

ప్ర. అ. వీర= ఓ ! వీరుడా ! త్వయా=నీతో, సుఖోచితా=సుఖమునకు అలవాటు పడిన, దేవీ=ఆ దేవి, దుఃఖమ్=దుఃఖమును, ఆపద్యతే=పొందుచున్నది, కాకుత్స్థ=రామా ! ఏకవేణీధరా=ఒకే జడను ధరించినది, దీనా=దీనురాలు, త్వయి=నీయందు, చిన్తాపరాయణా=చింతలో మునిగి యున్నది, అధఃశయ్యా=నేల శయనముగా గలది, హిమాగమే=శిశిరర్తువునందు, పద్మినీవ=పద్మలత వలె, వివర్ణాఙ్గీ=రంగు మారిన శరీరము గలది, రావణాత్=రావణునినుండి, వినివృత్తార్థా=మరలిన ప్రయోజనము కలది, మర్తవ్యకృతనిశ్చయా=చావవలెనని నిశ్చయము చేసికొన్నది, త్వన్మనాః=నీ మీదనే మనస్సు కలదీ అయిన, దేవీ=ఆ దేవి, కథంచిత్=ఎటులనో, మయా=నాచేత, మార్గితా=వెదకబడినది.

తా. ఓ ! వీరుడా ! నీతో కలిసి సుఖములనుభవించుటకు అలవాటుపడిన ఆ దేవి ఇప్పుడు దుఃఖమనుభవించుచున్నది. ఆమె నిన్ను గూర్చిన ఆలోచనతోనే నిండినదై, ఒకే జడలో దీనురాలై యున్నది. నేలమీదనే పండుకొనుచు, రంగు మారిన శరీరము గల ఆమె శిశిరఋతువులో పద్మలత వలె ఉన్నది. ఆమె రావణునియందు ఏ మాత్రము దృష్టి లేనిదై ఆతని చేతిలో చచ్చుటకే నిశ్చయించుకొన్నది. రామా ! నీ మీదనే మనస్సు నిలుపుకొని ఉన్న ఆ సీతాదేవిని నేను ఎట్లో అన్వేషించగలిగితిని. 12-14

మూ. ఇక్ష్వాకుకులవిఖ్యాతిం శనైః కీర్తయతానఘ, 15
సా మయా నరశార్దూల విశ్వాసముపపాదితా.

ప్ర. అ. అనఘ=దోషములు లేనివాడా ! నరశార్దూల=నరశ్రేష్ఠుడవైన రామా ! ఇక్ష్వాకుకులవిఖ్యాతిమ్=ఇక్ష్వాకువంశముయొక్క ప్రసిద్ధిని, శనైః=మెల్లగా, కీర్తయతా=వర్ణించిన, మయా=నాచేత, సా=ఆమె, విశ్వాసమ్=విశ్వాసమును, ఉపపాదితా=పుట్టించబడినది.

తా. దోషములు లేని, మనుష్యశ్రేష్ఠుడవైన ఓ ! రామా ! నేను ఇక్ష్వాకువంశము కీర్తిని మెల్లగా వర్ణించుచు, సీతాదేవికి నాపై విశ్వాసము కలుగునట్లు చేసితిని. 15

మూ. తతః సంభాషితా దేవీ సర్వమర్థం చ దర్శితా. 16
రామసుగ్రీవసఖ్యం చ శ్రుత్వా ప్రీతిముపాగతా,
నియతః సముదాచారో భక్తిశ్చాస్యాస్తథా త్వయి. 17

ప్ర. అ. తతః=అటు పిమ్మట, దేవీ=సీతాదేవి, సంభాషితా=మాటలాడబడినది, సర్వమ్=సమస్తమైన, అర్థమ్=విషయమును, దర్శితా=చూపబడినది (తెలుపబడినది). రామసుగ్రీవసఖ్యం చ=రామసుగ్రీవుల స్నేహమును, శ్రుత్వా=విని, ప్రీతిమ్=సంతోషమును, ఉపాగతా=పొందినది, అస్యాః=ఈమెయొక్క, సముదాచారః=సచ్చరిత్రపాలనము, నియతః=స్థిరముగా నున్నది. తథా=అట్లే, త్వయి=నీయందు, భక్తిశ్చ=భక్తి కూడ, స్థిరముగా నున్నది.

తా. పిమ్మట నేను సీతాదేవితో సంభాషణము చేసి విషయములను తెలిపితిని. రామసుగ్రీవుల మధ్య స్నేహమేర్పడినదని తెలిసికొని ఆమె సంతోషించినది. ఆమె సదాచారనిష్ఠతో నీపై స్థిరమైన భక్తితో ఉన్నది. 16, 17

మూ. ఏవం మయా మహాభాగా దృష్టా జనకనన్దినీ,
ఉగ్రేణ తపసా యుక్తా త్వద్భక్త్యా పురుషర్షభ. 18

ప్ర. అ. పురుషర్షభ=పురుషశ్రేష్ఠుడా ! ఉగ్రేణ=ఉగ్రమైన, తపసా=తపస్సుతోను, త్వద్భక్త్యా=నీపై భక్తితోను, యుక్తా=కూడిన, మహాభాగా=మహాభాగ్యవంతురాలైన, జనకనన్దినీ=సీతాదేవి, మయా=నాచేత, ఏవమ్=ఇట్లు, దృష్టా=చూడబడినది.

తా. ఓ ! పురుషశ్రేష్ఠుడా ! నీయందు అచంచలభక్తితో ఉగ్రమైన తపస్సు చేయుచున్న మహాభాగ్యవంతురాలైన సీతాదేవిని నేను ఇట్టి స్థితిలో చూచితిని.

మూ. అభిజ్ఞానం చ మే దత్తం యథా వృత్తం తవాన్తికే,
చిత్రకూటే మహాప్రాజ్ఞ వాయసం ప్రతి రాఘవ. 19

ప్ర. అ. మహాప్రాజ్ఞ=గొప్ప బుద్ధి గల, రాఘవ=రామా ! చిత్రకూటే=చిత్రకూటమునందు, తవ=నీయొక్క, అన్తికే=సమీపమునందు, వాయసం ప్రతి=కాకిని గూర్చి, యథా=ఎట్లు, వృత్తమ్=జరిగినదో, అది, అభిజ్ఞానమ్=ఆనవాలుగా, మే=నాకు, దత్తమ్=ఇవ్వబడినది.

తా. మహాబుద్ధిశాలివైన ఓ రామా ! చిత్రకూటపర్వతముమీద, నీ దగ్గర జరిగిన కాకవృత్తాంతమును ఆమె ఆనవాలుగా చెప్పింది. 19

మూ. విజ్ఞాప్యశ్చ నరవ్యాఘ్రో రామో వాయుసుత త్వయా,
అఖిలేనేహ యద్దృష్టమితి మామాహ జానకీ. 20

ప్ర. అ. వాయుసుత=హనుమంతుడా ! నరవ్యాఘ్రః=మనుష్యశ్రేష్ఠుడైన, రామః=రాముడు, త్వయా=నీచేత, ఇహ=ఇక్కడ, యత్=ఏది, దృష్టమ్=చూడబడినదో, అఖిలేన=దాని అంతచేతను, విజ్ఞాప్యః=తెలుపదగినవాడు, ఇతి=అని, జానకీ=సీత, మామ్=నన్ను గూర్చి, ఆహ=పలికినది.

తా. "ఓ ! హనుమంతుడా ! నీవు ఇక్కడ చూచినది అంతా మనుష్యశ్రేష్ఠుడైన రామునకు చెప్పవలెను." అని సీతాదేవి నాతో పలికెను. 20

మూ. అయం చాస్మై ప్రదాతవ్యో యత్నాత్సుపరిరక్షితః,
బ్రువతా వచనాన్యేవం సుగ్రీవస్యోపశృణ్వతః. 21

ప్ర. అ. సుగ్రీవస్య=సుగ్రీవుడు, ఉపశృణ్వతః=వినుచుండగా, ఏవమ్=ఇట్లు, వచనాని=వచనములను, బ్రువతా=చెప్పుచున్న నీచేత, యత్నాత్=ప్రయత్నమువలన, సుపరిరక్షితః=బాగా రక్షించబడిన, అయం చ=ఈ మణి కూడ, అస్మై=ఈ రామునకు, ప్రదాతవ్యః=ఇవ్వదగినది.

తా. సుగ్రీవుడు దగ్గరనే ఉండి వినుచుండగా నీవు ఈ మాటలన్నీ చెప్పి, నేను ప్రయత్నపూర్వకముగా రక్షించి ఉంచిన ఈ మణిని రామునకు ఇవ్వవలెను. 21

మూ. ఏష చూడామణిః శ్రీమాన్ మయా సుపరిరక్షితః,
మనఃశిలాయాస్తిలకో గణ్డపార్శ్వే నివేశితః, 22
త్వయా ప్రణష్టే తిలకే తం కిల స్మర్తుమర్హసి.

ప్ర. అ. శ్రీమాన్=శోభాయుక్త మైన, ఏషః=ఈ, చూడామణిః=చూడామణి, మయా=నాచేత, సుపరిరక్షితః=బాగుగా రక్షించబడినది.

తా. శోభాయుక్తమైన ఈ చూడామణిని నేను చాల జాగ్రత్తగా సంరక్షించినాను "మనశ్శిలాయాః" ఇత్యాది శ్లోకానికి చూ. 40వ సర్గ, 5వ శ్లోకము. 22

మూ. ఏష నిర్యాతితః శ్రీమాన్ మయా తే వారిసంభవః. 23
ఏతం దృష్ట్వా ప్రమోదిష్యే వ్యసనే త్వామివానఘ.

ప్ర. అ. తా. చూ. 40వ సర్గ 7వ శ్లోకము. అక్కడ 'ప్రమోదిష్యే' కి బదులు "ప్రహృష్యామి" అని ఉన్నది. ప్రమోదిష్యే=సంతోషించగలను. 23

మూ. జీవితం ధారయిష్యామి మాసం దశరథాత్మజ, 24
ఊర్ధ్వం మాసాన్న జీవేయం రక్షసాం వశమాగతా.

ప్ర. అ. దశరథాత్మజ=రామా ! మాసమ్=ఒక మాసమును, జీవితమ్=జీవితమును, ధారయిష్యామి=ధరించెదను. రక్షసామ్=రాక్షసులయొక్క, వశమ్=వశమును, ఆగతా=పొందిన నేను, మాసాత్=మాసముకంటె, ఊర్ధ్వమ్=పైన, న జీవేయమ్=జీవించను.

తా. రామా ! నేను ఒక్క మాసము మాత్రమే జీవితము ధరింతును. రాక్షసులకు వశురాలనై పోయిన నేను మాసము తరువాత జీవింపజాలను. 24

మూ. ఇతి మామబ్రవీత్సీతా కృశాఙ్గీ ధర్మచారిణీ, 25
రావణాన్తఃపురే రుద్ధా మృగీవోత్ఫుల్లలోచనా.

ప్ర. అ. కృశాఙ్గీ=కృశించిన శరీరము గలది, ధర్మచారిణీ=ధర్మమును ఆచరించుచున్నది, రావణాన్తఃపురే=రావణుని అంతఃపురమువందు, రుద్ధా=నిరోధింపబడినది, మృగీవ=ఆడ లేడి వలె, ఉత్ఫుల్లలోచనా=వికసించిన నేత్రములు గలది అయిన, సీతా=సీత, మామ్=నన్ను గూర్చి, ఇతి=ఇట్లు, అబ్రవీత్=పలికెను.

తా. రావణాంతఃపురములో నిరోధింపబడి, శరీరము కృశించి, ధర్మమును ఆచరించుచున్నది, ఆడలేడి వలె వికసించిన నేత్రములు కలది అయిన సీత నాతో ఈ విధముగ చెప్పినది. 25

మూ. ఏతదేవ మయాఖ్యాతం సర్వం రాఘవ యద్యథా, 26
సర్వథా సాగరజలే సంతారః ప్రవిధీయతామ్.

ప్ర. అ. రాఘవ=రామా ! యత్=ఏది, యథా=ఎట్లు జరిగినదో, ఏతత్=ఇది, సర్వమేవ=సమస్తము, మయా=నాచేత, ఖ్యాతమ్=చెప్పబడినది, సర్వథా=అన్ని విధములచేత, సాగరజలే=సముద్రజలమునందు, సంతారః=సేతువు, ప్రవిధీయతామ్= నిర్మింపబడుగాక.

తా. రాఘవా ! ఈ విషయము అంతా జరిగినది జరిగినట్లు చెప్పినాను. లంకను ఆక్రమించుటకై సర్వవిధాల సముద్రోదకముమీద సేతువు బంధింపవలెను. 26

మూ. తౌ జాతాశ్వాసౌ రాజపుత్రౌ విదిత్వా
తచ్చాభిజ్ఞానం రాఘవాయ ప్రదాయ,
దేవ్యా చాఖ్యాతం సర్వమేవానుపూర్వ్యా
ద్వాచా సంపూర్ణం వాయుపుత్రః శశంస. 27

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే సున్దరకాణ్డే
పఞ్చషష్టితమః సర్గః.

ప్ర. అ. వాయుపుత్రః=హనుమంతుడు, తౌ రాజపుత్రౌ=ఆ రాజకుమారులను, జాతాశ్వాసౌ=పుట్టిన విశ్వాసము కలవారినిగా, విదిత్వా=తెలుసుకొని, తత్=ఆ, అభిజ్ఞానమ్=ఆనవాలును, రాఘవాయ=రామునకు, ప్రదాయ=ఇచ్చి, దేవ్యా=సీతాదేవిచేత, ఆఖ్యాతమ్=చెప్పబడిన, సర్వమేవ=సమస్తమును, సంపూర్ణమ్=పూర్తిగా, ఆనుపూర్వ్యాత్=క్రమమును అనుసరించి, వాచా=వాక్కుతో, శశంస=చెప్పెను.

తా. హనుమంతుడు ఆ రామలక్ష్మణులకు ఊరట కలిగినదని గుర్తించి ఆనవాలుగా తెచ్చిన ఆ చూడామణిని రామునకు ఇచ్చి, సీతాదేవి సందేశమునంతను పూర్తిగా, క్రమము తప్పకుండగా మాటలలో చెప్పెను. 27

*"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు
సుందరకాండలో అరువదియైదవ సర్గ సమాప్తము.*

అథ షట్షష్టితమః సర్గః

[రాముడు సీత వృత్తాంతము విని చూడామణిని చూచుచు సీతకొరకు విలపించుట.]

మూ. ఏవముక్తో హనుమతా రామో దశరథాత్మజః,
తం మణిం హృదయే కృత్వా ప్రరురోద సలక్ష్మణః. 1

ప్ర. అ. హనుమతా=హనుమంతునిచేత, ఏవమ్=ఇట్లు, ఉక్తః=పలకబడిన, సలక్ష్మణః=లక్ష్మణసమేతుడైన, దశరథాత్మజః=దశరథపుత్రుడైన, రామః=రాముడు, తం మణిమ్=ఆ మణిని, హృదయే=హృదయముపై, కృత్వా=ఉంచుకొని, ప్రరురోద హ=ఏడ్చెను.

తా. లక్ష్మణసహితుడైన ఆ దశరథకుమారుడు, రాముడు, హనుమంతుని మాటలు విని, ఆ చూడామణిని హృదయముమీద ఉంచుకొని ఏడ్చెను. 1

మూ. తం తు దృష్ట్వా మణిశ్రేష్ఠం రాఘవః శోకకర్శితః,
నేత్రాభ్యామశ్రుపూర్ణాభ్యాం సుగ్రీవమిదమబ్రవీత్. 2

ప్ర. అ. తం మణిశ్రేష్ఠమ్=ఆ శ్రేష్ఠమైన మణిని, దృష్ట్వా=చూచి, రాఘవః=రాముడు, శోకకర్శితః=శోకముచేత కృశింపచేయబడినవాడై, అశ్రుపూర్ణాభ్యామ్=కన్నీళ్లతో నిండిన, నేత్రాభ్యామ్=నేత్రములతో, సుగ్రీవమ్=సుగ్రీవుని గూర్చి, ఇదమ్=ఈ వాక్యమును, అబ్రవీత్=పలికెను.

తా. శ్రేష్ఠమైన ఆ మణిని చూడగానే రాముడు శోకముచే పీడితుడై, కన్నీళ్ళతో నిండిన నేత్రములతో, సుగ్రీవునితో ఇట్లు పలికెను. 2

మూ. యథైవ ధేనుః స్రవతి స్నేహాద్వత్సస్య వత్సలా,
తథా మమాపి హృదయం మణిరత్నస్య దర్శనాత్. 3

ప్ర. అ. వత్సలా=లేడదూడయందు అధిక ప్రేమగల, ధేనుః=ధేనువు, వత్సస్య=లేగదూడయొక్క, స్నేహాత్=స్నేహమువలన, యథైవ=ఎట్లు, స్రవతి=స్రవించునో, మమ హృదయమపి=నా హృదయము కూడ, మణిరత్నస్య=శ్రేష్ఠమైన ఈ మణియొక్క, దర్శనాత్=దర్శనమువలన, తథా=అట్లే అగుచున్నది.

తా. లేగదూడయందు అధికమైన ప్రేమ ఉన్న ధేనువు దూడపై స్నేహముచేత ఎట్లు ద్రవించునో, నా హృదయము కూడ ఈశ్రేష్ఠమైన మణిని చూడగానే ద్రవించుచున్నది. 3

మూ. మణిరత్నమిదం దత్తం వైదేహ్యాః శ్వశురేణ మే,
వధూకాలే యథాబద్ధమధికం మూర్ధ్ని శోభతే. 4

ప్ర. అ. వధూకాలే=వివాహవధువుగా ఉన్నప్పుడు, మూర్ధ్ని=శిరస్సుపై, ఆబద్ధమ్=కట్టబడినదై, యథా=ఎట్లు, శోభతే=ప్రకాశించునో, ఆ విధముగా, ఇదమ్=ఈ, మణిరత్నమ్=శ్రేష్ఠమైన మణి, మే శ్వశురేణ=నా మామగారిచేత, వైదేహ్యాః=సీతకు, దత్తమ్=ఇవ్వబడినది.

తా. వివాహసమయమునందు వధువైన సీత తలపై కట్టగా అధికముగా శోభించు నిమిత్తము ఈ మణిని నా మామగారు సీతకు ఇచ్చినారు. 4

మూ. అయం హి జలసంభూతో మణిః సజ్జనపూజితః,
యజ్ఞే పరమతుష్టేన దత్తః శక్రేణ ధీమతా. 5

ప్ర. అ. జలసంభూతః=జలమునుండి పుట్టినది, సజ్జనపూజితః=సజ్జనులచేత పూజింపబడినది అయిన, అయం మణిః=ఈ మాణిక్యము, యజ్ఞే=యజ్ఞమునందు, పరమతుష్టేన=మిక్కిలి సంతోషించిన, ధీమతా=బుద్ధిమంతుడైన, శక్రేణ=దేవేంద్రునిచేత, దత్తః=ఇవ్వబడినది.

తా. ఈ మణి జలములో పుట్టినది. సజ్జనులచే పూజింపబడు ఈ మణిని జనకమహారాజు చేసిన ఒక యజ్ఞమునందు చాలా సంతోషించిన, ధీమంతుడైన దేవేంద్రుడు అతని కిచ్చినాడు. 5

మూ. ఇమం దృష్ట్వా మణిశ్రేష్ఠం యథా తాతస్య దర్శనమ్,
అద్యాస్మ్యవగతః సౌమ్య వైదేహస్య తథా విభోః. 6

ప్ర. అ. సౌమ్య=ఓ ! సౌమ్యుడా ! అద్య=ఇప్పుడు, ఇమమ్=ఈ, మణిశ్రేష్ఠమ్=శ్రేష్ఠమైన మణిని, దృష్ట్వా=చూచి, తాతస్య=తండ్రిగారి యొక్క, తథా=మరియు, విభోః=ప్రభువైన, వైదేహస్య=జనకమహారాజు యొక్క, దర్శనమ్=దర్శనము, యథా=ఎట్లో, అట్లు, అవగతః=తెలుసుకొనుచున్నాను.

తా. సౌమ్యుడవైన సుగ్రీవా ! ఈ మణిశ్రేష్ఠమును చూడగానే నాకు నా తండ్రిగారిని, పూజ్యుడైన జనకమహారాజును చూచినట్లు అనిపించుచున్నది.

మూ. అయం హి శోభతే తస్యాః ప్రియాయా మూర్ధ్ని మే మణిః,
అస్యాద్య దర్శనే నాహం ప్రాప్తాం తామివ చిన్తయే. 7

ప్ర. అ. అయం మణిః=ఈ మణి, మే ప్రియాయాః=నా ప్రియురాలి యొక్క, మూర్ధ్ని=శిరస్సుపైన, శోభతే హి=ప్రకాశించుచున్నది కదా. అద్య=ఇప్పుడు, అస్య=దీనియొక్క, దర్శనేన=దర్శనముచేత, తామ్=ఆమెను, ప్రాప్తామివ=పొందబడినదానిని వలె, చిన్తయే=ఆలోచించుచున్నాను.

తా. ఈ మణి నా ప్రియురాలి శిరస్సుపై అధికముగా శోభించును. ఇప్పుడు ఇది కనబడుటచేత, నా ప్రియురాలే లభించినట్లు భావించుచున్నాను.

మూ. కిమాహ సీతా వైదేహీ బ్రూహి సౌమ్య పునః పునః,
పిపాసుమివ తోయేన సిఞ్చన్తీ వాక్యవారిణా. 8

ప్ర. అ. సౌమ్య=సౌమ్యుడా ! పిపాసుమ్=దప్పికొన్నవానిని, తోయేన ఇవ=ఉదకముతో వలె, వాక్యవారిణా=వాక్యములను ఉదకముతో, సిఞ్చన్తీ=తడుపుచున్నదై, వైదేహీ=విదేహరాజుకుమార్తె యైన, సీతా=సీత, కిమ్=ఏమి, పునః పునః=మాటిమాటికి, ఆహ=పలికినది ? బ్రూహి=చెప్పుము.

తా. దప్పికొన్న వానిని ఉదకముతో తడపినట్లు మాటలనే ఉదకముతో తడుపుచు, జనకరాజనందినియైన సీత మాటి మాటికి ఏమన్నదో చెప్పుము.

వి. ఈ శ్లోకభావము సరిగా లేదు. వాక్యోదముతో సీత ఎక్కడో ఉన్న రాముణ్ణి తడిపే ప్రసక్తి లేదు. అందుచేత "సీత అన్న మాటలు మాటిమాటికి చెప్పి, ఆ మాటలనే ఉదకముతో నన్ను తడుపుము" అని హనుమంతునితో రాముడన్నచో బాగుండును. కాని "సిఞ్చన్తీ" అనేది 'సీతా' అనేదానికి విశేషణముగా ప్రయోగింపబడినది గాన ఈ భావం చెప్పడం కుదరదు. అందుచేత "సిఞ్చంస్తే" అను పాఠ మున్నచో బాగుండును. కాని వావిళ్ళప్రతిలో గాని, గోరఖ్‌పూర్ ప్రతిలో గాని ఇట్లు లేదు. మనం స్వతంత్రించి మార్చుట యుక్తము కాదు. కాని ప్రాచ్యపాఠంలో - "శోకాగ్నినా దహ్యమానం సిఞ్చ మాం వాక్యవారిణా" అను పాఠమున్నది. అది బాగున్నది. (శోకాగ్ని చేత దహింపబడుచున్న నన్ను నీమాటలనే ఉదకముతో తడుపుము అని అర్థం). 8

మూ. ఇతస్తు కిం దుఃఖతరం యదిమం వారిసంభవమ్,
మణిం పశ్యామి సౌమిత్రే వైదేహీమాగతాం వినా. 9

ప్ర. అ. సౌమిత్రే=లక్ష్మణా ! వారిసంభవమ్=ఉదకములో పుట్టిన, ఇమం మణిమ్=ఈ మణిని, వైదేహీమ్=సీతను, ఆగతాం వినా=రాకుండగా,

యత్ పశ్యామి=చూచుచున్నాను అనునది ఏది కలదో, ఇతః=దీనికంటె, దుఃఖతరమ్=అధికముగా దుఃఖమైనది, కిమ్=ఏమి ?

తా. లక్ష్మణా ! సీత రాకుండగా, ఉదకములో పుట్టిన మణిని మాత్రము చూచుచున్నాను; ఇంతకంటె కష్టము మరేమి ఉండును? 9

మూ. చిరం జీవతి వైదేహీ యది మాసం ధరిష్యతి,
క్షణం సౌమ్య న జీవేయం వినా తామసితేక్షణామ్. 10

ప్ర. అ. సౌమ్య=సౌమ్యుడా! వైదేహీ=సీత, మాసమ్=ఒక మాసము, ధరిష్యతి యది=జీవించినట్లయితే, చిరమ్=చిరకాలము, జీవతి=జీవించును. సౌమ్య=ఓ! సౌమ్యుడా! తామ్=ఆ, అసితేక్షణాం వినా=సీత లేకుండగా, క్షణమ్=క్షణకాలము కూడ, న జీవేయమ్=జీవించను.

తా. సౌమ్యుడా ! సీత ఒక మాసము జీవించగలిగినచో చిరకాలము జీవించుచున్నదనవలెను. నల్లని కళ్లు గల ఆ సీత లేనిచో నేను క్షణకాలము కూడ జీవించజాలను. 10

మూ. నయ మామపి తం దేశం యత్ర దృష్టా మమ ప్రియా,
న తిష్ఠేయం క్షణమపి ప్రవృత్తిముపలభ్య చ. 11

ప్ర. అ. మమ=నాయొక్క, ప్రియా=ప్రియురాలు, యత్ర=ఎక్కడ, దృష్టా=చూడబడినదో, మామపి=నన్ను కూడ, తం దేశమ్=ఆ ప్రదేశమును గూర్చి, నయ=తీసికొనివెళ్లుము. ప్రవృత్తిమ్=వార్తను, ఉపలభ్య చ=పొందికూడ, క్షణమపి=క్షణకాలమైనా, న తిష్ఠేయమ్=ఉండను.

తా. నన్ను కూడ నా ప్రియురాలు కనబడిన ప్రదేశమునకు తీసికొని వెళ్లుము. ఆమె జాడ తెలిసిన పిమ్మట కూడ ఇంక క్షణకాలమైనా నిలువజాలను.

మూ. కథం సా మమ సుశ్రోణీ భీరుభీరుః సతీ సదా,
భయావహానాం ఘోరాణాం మధ్యే తిష్ఠతి రక్షసామ్. 12

ప్ర. అ. సదా=ఎల్లప్పుడు, భీరుభీరుః సతీ=చాల భయము కలదై ఉన్న, మమ సుశ్రోణీ=నా ప్రియురాలైన ఆ అందమైన కటిప్రదేశము గల సీత, భయావహానామ్=భయమును కలిగించు, ఘోరాణామ్=క్రూరులైన, రక్షసామ్=రాక్షసులయొక్క, మధ్యే=మధ్యయందు, కథమ్=ఎట్లు, తిష్ఠతి=ఉంటూన్నది.

తా. ఎల్లప్పుడూ మిక్కిలి భయపడుచు ఉండే, సుశ్రోణియైన నా ప్రియురాలు, భయమును కలిగించు, క్రూరులైన రాక్షసుల మధ్య ఎట్లు ఉంటూన్నదో కదా! 12

మూ. శారద స్తిమిరోన్ముక్తో నూనం చంద్ర ఇవాంబుదైః,
ఆవృతం వదనం తస్యా న విరాజతి రాక్షసైః. 13

ప్ర. అ. తిమిరోన్ముక్తః=చీకటిచేత విడవబడిన, అమ్బుదైః=మేఘములచేత కప్పబడిన, చన్ద్రః ఇవ=చంద్రుడు వలె, రాక్షసైః=రాక్షసులచేత, ఆవృతమ్=ఆవరించబడిన, తస్యాః=ఆమెయొక్క, వదనమ్=ముఖము, న విరాజతి=ప్రకాశించదు. నూనమ్=నిశ్చయము.

తా. చీకటినుండి బైటపడిన చంద్రబింబము మేఘములచే కప్పబడి ఎట్లు ప్రకాశించదో అట్లే ఆమె ముఖము, రాక్షసులచేత ఆవరింపబడినదై ప్రకాశించదు; సత్యము.

వి. ముఖము రాక్షసులచేత ఆవరింపబడినది అనునది అంతగా సంగతము కాదు. సీత ఆవరింపబడవచ్చును గాని ముఖము మాత్రము ఆవరింపబడదు కదా. అందుచేత "ఆవృతో వదనం తస్యా న విరాజతి సామ్ప్రతమ్" అను గోరఖ్‌పూర్ పాఠము బాగున్నది. "ఆవృతః చన్ద్రః ఇవ=ఆవరింపబడిన చంద్రుడు వలె, సంప్రతి=ఇప్పుడు, ఆమె ముఖము ప్రకాశించదు"అని అర్థము. 13

మూ. కిమాహ సీతా హనుమంస్తత్త్వతః కథయాద్య మే,
ఏతేన ఖలు జీవిష్యే భేషజేనాతురో యథా. 14

ప్ర. అ. హనుమన్=హనుమంతుడా ! సీతా=సీత, కిమ్=ఏమి, ఆహ=చెప్పినది ? అద్య=ఇప్పుడు, తత్త్వతః=యథార్థముగా, మే=నాకు, కథయ=చెప్పుము. ఆతురః=రోగి, భేషజేన యథా=మందుచేత వలె, ఏతేన=దీనితో, జీవిష్యే ఖలు=జీవించగలను గదా ?

తా. హనుమంతుడా ! సీత ఇంకా ఏమన్నదో, ఇప్పుడు, యథార్థముగా చెప్పుము. రోగి ఔషధముచేత జీవించినట్లు ఆమె మాటలు వినుటచే జీవించెదను.

మూ. మధురా మధురాలాపా కిమాహ మమ భామినీ,
మద్విహీనా వరారోహా హనుమన్ కథయస్వ మే. 15

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే సున్దరకాణ్డే
షట్‌షష్టితమః సర్గః.

ప్ర. అ. మధురా=మధురస్వభావము కలది, మధురాలాపా=మధురమైన మాటలు కలదీ, వరారోహా=శ్రేష్ఠమైన కటి ప్రదేశము కలది, మద్విహీనా=నాతో శూన్యురాలూ అయిన, మమ భామినీ=నా స్త్రీ (నా ప్రియురాలు), కిమ్=ఏమి, ఆహ=చెప్పినది ? మే=నాకు, కథయస్వ=చెప్పుము.

తా. మధురమైన స్వభావము కలది, మధురముగా మాటలాడునది, అందమైన కటి ప్రదేశము కలది, నా వియోగమును అనుభవించుచున్నది అయిన నా ప్రియురాలు ఏమన్నది? నాకు చెప్పుము. 15

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు సుందరకాండలో అరువదిఆరవ సర్గ సమాప్తము.

అథ సప్తషష్టితమః సర్గః

[హనుమంతుడు రామునకు సీతాసందేశమును చెప్పుట.]

మూ. ఏవముక్తస్తు హనుమాన్ రాఘవేణ మహాత్మనా,
సీతాయా భాషితం సర్వం న్యవేదయత రాఘవే. 1

ప్ర. అ. మహాత్మనా=మహాత్ముడైన, రాఘవేణ=రామునిచేత, ఏవమ్=ఇట్లు, ఉక్తః=పలకబడిన, హనుమాన్=హనుమంతుడు, సీతాయాః=సీతయొక్క, భాషితమ్=వాక్యమును, సర్వమ్=అంతనూ, రాఘవే=రామునియందు (నికి), న్యవేదయత=తెలిపెను.

తా. మహాత్ముడైన రాముని వచనమును విని హనుమంతుడు సీత పలికిన మాటలన్నీ రామునకు తెలిపెను. 1

మూ. ఏవముక్తవతీ దేవీ జానకీ పురుషర్షభ,
పూర్వవృత్తమభిజ్ఞానం చిత్రకూటే యథాతథమ్. 2

ప్ర. అ. పురుషర్షభ=పురుషశ్రేష్ఠుడా ! దేవీ=దేవియైన, జానకీ=జానకి, చిత్రకూటే=చిత్రకూటపర్వతమునందు, పూర్వవృత్తమ్=పూర్వము జరిగిన దానిని, అభిజ్ఞానమ్=ఆనవాలుగా, యథాతథమ్=జరిగినది జరిగినట్లుగా, ఏవమ్=ఇట్లు, ఉక్తవతీ=పలికినది.

తా. పురుషశ్రేష్ఠుడా ! సీతాదేవి చిత్రకూటమునందు పూర్వము జరిగిన విషయమును ఆనవాలుగా, జరిగినది జరిగినట్లు చెప్పెను. 2

మూ. సుఖసుప్తా త్వయా సార్ధం జానకీ పూర్వముత్థితా,
వాయసః సహసోత్పత్య విదదార స్తనాన్తరే. 3

ప్ర. అ. త్వయా సార్ధమ్=నీతో కూడ, సుఖసుప్తా=సుఖముగా నిద్రించిన, జానకీ=జానకి, పూర్వమ్=ముందుగా, ఉత్థితా=లేచినది. వాయసః=కాకి, సహసా=శీఘ్రముగా, ఉత్పత్య=ఎగిరి, స్తనాన్తరే=స్తనమధ్యమునందు, విదదార=చీల్చెనట.

తా. నీతో (నీ సమీపమున) సుఖముగా నిద్రించిన జానకి ముందుగా లేచెను. అప్పుడు ఒక కాకి హటాత్తుగా ఎగిరివచ్చి ఆమెను స్తనముల మధ్య చీల్చెనట. 3

మూ. పర్యాయేణ చ సుప్తస్త్వం దేవ్యఙ్కే భరతాగ్రజ,
పునశ్చ కిల పక్షీ స దేవ్యా జనయతి వ్యథామ్. 4

ప్ర. అ. భరతాగ్రజ=రామా !త్వమ్=నీవు, పర్యాయేణ=క్రమము చేత, దేవ్యఙ్కే=సీత ఒడిలో, సుప్తః=నిద్రించితివి, సః పక్షీ=ఆ పక్షి, పునశ్చ=మరల, దేవ్యాః=దేవికి, వ్యథామ్=బాధను, జనయతి కిల=కలిగించినదట.

తా. రామా ! నీవు నీవంతుగా సీత అంకముమీద తల ఉంచి నిద్రించితివట. ఆ కాకి మరల వచ్చి సీతకు బాధకలిగించినదట. 4

మూ. పునః పునరుపాగమ్య విదదార భృశం కిల,
తతస్త్వం బోధితస్తస్యాః శోణితేన సముక్షితః. 5

ప్ర. అ. పునః పునః=మాటిమాటికి, ఉపాగమ్య=వచ్చి, భృశమ్=అధికముగా, విదదార కిల=చీల్చినదట. తతః=అటుపిమ్మట, త్వమ్=నీవు, తస్యాః=ఆమెయొక్క, శోణితేన=రక్తముచేత, సముక్షితః=తడపబడినవాడవై, బోధితః కిల=లేపబడినావట.

తా. ఆ కాకి మాటిమాటికి వచ్చి ఎక్కువగా చీల్చినదట. అప్పుడు నీవు ఆమె రక్తము చేత తడపబడినవాడవై మేల్కొంటివట. 5

మూ. వాయసేన చ తేనైవ సతతం బాధ్యమానయా,
బోధితః కిల దేవ్యా త్వం సుఖసుప్తః పరంతప. 6

ప్ర. అ. పరంతప=శత్రువులను బాధించువాడా ! తేన=ఆ, వాయసేనైవ=కాకిచేతనే, సతతమ్=ఎడతెగకుండా, బాధ్యమానయా=బాధింపబడుచున్న, దేవ్యా=సీతాదేవిచేత, సుఖసుప్తః=సుఖముగా నిద్రించుచున్న, త్వమ్=నీవు, బోధితః కిల=నిద్రనుండి లేపబడితివట.

తా. శత్రుసంహారకుడవైన రామా ! ఆ కాకి ఈ విధముగ ఎడతెగకుండా బాధించగా ఆ దేవి సుఖముగా నిద్రించుచున్న నిన్ను మేల్కొల్పినదట. 6

మూ. తాం తు దృష్ట్వా మహాబాహో దారితాం చ స్తనాన్తరే,
ఆశీవిష ఇవ క్రుద్ధో నిశ్వసన్నభ్యభాషథాః. 7

ప్ర. అ. మహాబాహో=గొప్ప బాహువులు కలవాడా ! స్తనాన్తరే=స్తనమధ్యమునందు, దారితామ్=చీల్చబడిన, తామ్=ఆమెను, దృష్ట్వా=చూచి, క్రుద్ధః=కోపగించినవాడవై, ఆశీవిష ఇవ=సర్పము వలె, నిశ్వసన్=బుసగొట్టుచు, అభ్యబాషథాః=పలికితివట.

తా. ఓ ! మహాబాహూ ! స్తనమధ్యమునందు చీల్చబడిన ఆ దేవిని చూచి, కోపించినవాడవై, సర్పము వలె బుసలుగొట్టుచు పలికితివట. 7

మూ. నఖాగ్రైః కేన తే భీరు దారితం తు స్తనాన్తరమ్,
కః క్రీడతి సరోషేణ పఞ్చవక్త్రేణ భోగినా. 8

ప్ర. అ. భీరు=భయస్వభావము కలదానా ! తే=నీయొక్క, స్తనాన్తరమ్=స్తనమధ్యము, కేన=ఎవనిచేత, నఖాగ్రైః=గోళ్ల అగ్రభాగములచేత, దారితమ్=చీల్చబడినది? సరోషేణ=కోపముతో కూడిన, పఞ్చవక్త్రేణ=ఐదు ముఖములు గల, భోగినా=సర్పముతో, కః=ఎవడు, క్రీడతి=క్రీడించుచున్నాడు?

తా. భయస్వభావము గల ఓ !సీతా ! నీ స్తనమధ్యమును ఎవరు చీల్చినారు? కోపముతో కూడిన, ఐదు ముఖముల సర్పముతో ఎవడు ఆడుకొనుచున్నాడు ! 8

మూ. నిరీక్షమాణః సహసా వాయసం సమవైక్షథాః,
నఖైః సరుధిరైస్తీక్ష్ణైస్తామేవాభిముఖం స్థితమ్. 9

ప్ర. అ. నిరీక్షమాణః=పరికించి చూచుచు, సరుధిరైః=రక్తముతో కూడిన, తీక్ష్ణైః=తీక్ష్ణములైన, నఖైః=గోళ్లతో, తామేవ అభిముఖమ్=ఆమెకే ఎదురుగా, స్థితమ్=ఉన్న, వాయసమ్=కాకిని, సహసా=శీఘ్రముగా, సమవైక్షథాః=చూచితి వట.

తా. నీవు శీఘ్రముగా అటు ఇటు పరికించి చూడగా, రక్తముతో కూడిన తీక్ష్ణములైన గోళ్లతో ఆ సీతకే అభిముఖముగా ఉన్న ఆ కాకి కనబడినదట. 9

మూ. సుతః కిల స శక్రస్య వాయసః పతతాం వరః,
ధరాన్తరచరః శీఘ్రం పవనస్య గతౌ సమః. 10

ప్ర. అ. తా. చూ. 38వ సర్గ, 28వ శ్లోకము.

మూ. తతస్తస్మిన్మహాబాహో కోపసంవర్తితేక్షణః,
వాయసే త్వం కృథాః క్రూరాం మతిం మతిమతాం వర. 11

ప్ర. అ. మహాబాహో=గొప్ప బాహువులు కలవాడా ! మతిమతామ్=బుద్ధిమంతులలో, వర=శ్రేష్ఠుడా ! త్వమ్=నీవు, కోపసంవర్తితేక్షణః=కోపము చేత త్రిప్పబడిన నేత్రములు కలవాడవై, తతః=అటు పిమ్మట, తస్మిన్ వాయసే=ఆ కాకివిషయమున, క్రూరామ్=క్రూరమైన, మతిమ్=బుద్ధిని, కృథాః=చేసితివట.

తా. గొప్ప బాహువులు కలవాడా ! బుద్ధిమంతులలో శ్రేష్ఠుడా ! పిమ్మట నీవు కోపముతో కళ్లు పెద్దవి చేసి, ఆ కాకివిషయమునందు క్రూరమైన ఆలోచనను చేసినావట. 11

మూ. స దర్భం సంస్తరాద్గృహ్య బ్రహ్మేస్త్రేణ హ్యయోజయః,
ప్రదీప్త ఇవ కాలాగ్నిర్జ్వాలాభిముఖః ఖగమ్. 12

ప్ర. అ. తా. చూ. 38వ సర్గ, 30వ శ్లోకం "బ్రాహ్మేణాస్త్రేణయోజయత్" అని ఉన్నది. "బ్రహ్మేస్త్రేణ=బ్రహ్మేస్త్రముతో, అయోజయః హి=కూర్చితివి" అని ఇక్కడ అర్థము. 'ద్విజమ్'కు బదులు 'ఖగమ్'; అర్థము సమానమే. 12

మూ. క్షిప్తవాంస్త్వం ప్రదీప్తం హి దర్భం తం వాయసం ప్రతి,
తతస్తు వాయసం దీప్తః స దర్భోఽనుజగామ హ. 13

ప్ర. అ. త్వమ్=నీవు, ప్రదీప్తమ్=మండుచున్న, తం దర్భమ్=ఆ దర్భను, వాయసం ప్రతి=కాకిని గూర్చి, క్షిప్తవాన్=విసిరితివి. తతః=అటు పిమ్మట, సః దర్భః=ఆ దర్భ, దీప్తః=మండుచున్నదై, వాయసమ్=కాకిని, అనుజగామ హ=అనుసరించెను.

తా. నీవు మండుచున్న ఆ దర్భను కాకిమీదకు విసిరితివట. అప్పుడు ఆ దర్భ మండుచు ఆ కాకిని తరుముకొని వెళ్ళినదట. 13

మూ. స పిత్రా చ పరిత్యక్తః సురైశ్చ సమహర్షిభిః,
త్రీన్ లోకాన్ సంపరిక్రమ్య త్రాతారం నాధిగచ్ఛతి. 14

ప్ర. అ. సః=ఆ కాకి, పిత్రా చ=తండ్రియైన ఇంద్రునిచేత, సమహర్షిభిః=మహర్షులతో కూడిన, సురైశ్చ=దేవతలచేతను, పరిత్యక్తః=విడవబడినదై, త్రీన్=మూడు, లోకాన్=లోకములను, సంపరిక్రమ్య=చుట్టు తిరిగి వచ్చి, త్రాతారమ్=రక్షకుణ్ణి, నాధిగచ్ఛతి=పొందలేదు.

తా. ఆ కాకిని తండ్రియైన ఇంద్రుడు, దేవతలు, మహర్షులుకూడ వదిలి వేయగా అది మూడు లోకములు చుట్టు తిరిగినను రక్షకుడు ఎవ్వడూ లభించలేదు. 14

మూ. పునరేవాగతస్త్రస్తస్త్వత్సకాశమరిందమ.
స తం నిపతితం భూమౌ శరణ్యః శరణాగతమ్, 15
వధార్హమపి కాకుత్స్థ కృపయా పర్యపాలయః.

ప్ర. అ. అరిందమ=శత్రుసంహారకుడా ! త్రస్తః=భయపడినవాడై, పునరేవ=మరల, త్వత్సకాశమ్=నీ సమీపమును, ఆగతః=వచ్చినాడు. తరువాత

శ్లోకానికి చూ. 38వ సర్గ 34వ శ్లోకము. అక్కడ "కాకుత్స్థః పర్యపాలయత్"అని ఉన్నది. "కాకుత్స్థ=రామా ; పర్యపాలయః=పాలించితివి"అని ఇక్కడ అర్థము.

తా. శత్రుసంహారకా ! ఆ కాకి భయపడినదై మరల నీ దగ్గరికే వచ్చినది. రామా ! అప్పుడు శరణాగతరక్షకుడవైన నీవు, శరణు జొచ్చి నేలపై పడిన ఆ కాకి చంపదగినదేయైనను దానిని దయతో రక్షించితివట. 15

మూ. మోఘమస్త్రం న శక్యం తు కర్తుమిత్యేవ రాఘవ, 16
భవాంస్తస్యాక్షి కాకస్య హినస్తి స్మ స దక్షిణమ్.

ప్ర. అ. రాఘవ=రామా ! అస్త్రమ్=అస్త్రము, మోఘమ్=వ్యర్థమైనదిగా కర్తుమ్=చేయుటకు, న శక్యమ్=శక్యము కాదు, ఇత్యేవ=అని, భవాన్=నీవు, తస్య కాకస్య=ఆ కాకియొక్క, దక్షిణమ్ అక్షి=కుడి కంటిని, హినస్తి స్మ=హింసించితివట.

తా. రామా ! అస్త్రము వ్యర్థము కాకూడదు అను అభిప్రాయము మాత్రము చేతనే నీవు ఆ కాకి కుడి కన్ను కొట్టివేసితివట. 16

మూ. రామ త్వాం స నమస్కృత్య రాజ్ఞే దశరథాయ చ, 17
విసృష్టస్తు తదా కాకః ప్రతిపేదే స్వమాలయమ్.

ప్ర. అ. రామ=రామా ! తదా=అప్పుడు, సః కాకః=ఆ కాకి, విసృష్టః=విడువబడినదై, త్వామ్=నిన్ను, రాజ్ఞే=రాజైన, దశరథాయ చ=దశరథునకు, నమస్కృత్య=నమస్కరించి, స్వమ్=తనసంబంధమైన, ఆలయమ్=స్థానమును, ప్రతిపేదే=పొందెను.

తా. రామా ! అప్పుడా కాకి విడువబడినదై, నీకు, నీ తండ్రియైన దశరథునకు నమస్కరించి తన నివాసమునకు వెళ్ళిపోయెనట. 17

మూ. ఏవమస్త్రవిదాం శ్రేష్ఠః సత్త్వవాన్ శీలవానపి, 18
కిమర్థమస్త్రం రక్షస్సు న యోజయతి రాఘవః.

ప్ర. అ. శీలవానపి=మంచి శీలము కలవాడైనను, చూ. 38వ సర్గ. 43వ శ్లోకం.

తా. ఈ విధముగ అస్త్రవేత్తలలో శ్రేష్ఠుడైనను, బలముకలవాడైనను, ఉత్తమశీలము కలవాడైనను రాముడు రాక్షసులపై అస్త్రమును ఎందువలన ప్రయోగించుటలేదు? 18

మూ. న నాగా నాపి గన్ధర్వా నాసురా న మరుద్గణాః, 19
న చ సర్వే రణే శక్తా రామం ప్రతిసమాసితుమ్.

ప్ర. అ. రణే=యుద్ధమునందు, రామం ప్రతి=రామునికి ఎదురుగా, ప్రతిసమాసితుమ్=నిలచుటకు, నాగాః=నాగులు, న శక్తాః=సమర్థులు కాదు. గన్ధర్వాః అపి=గంధర్వులు, న=కారు. అసురాః=అసురులు, న=కారు. మరుద్గణాః=దేవతాగణములు, న=కారు. సర్వే=నాగాదులందరూ కలిసి కూడ, న=కారు

తా. నాగులు గాని, గంధర్వులు గాని, అసురులు గాని, దేవతాగణములు గాని, వీరందరూ కలిసి కాని యుద్ధములో రాముని ఎదుట నిలువజాలరు. 19

మూ. తస్య వీర్యవతః కశ్చిద్యద్యస్తి మయి సంభ్రమః, 20
క్షిప్రం సునిశితైర్బాణైర్హన్యతాం యుధి రావణః.

ప్ర. అ. వీర్యవతః=పరాక్రమవంతుడైన, తస్య=ఆ రామునకు, మయి=నా విషయమున, సంభ్రమః=తొందర, అస్తి యది=ఉన్నట్లయితే, సునిశితైః=బాగా వాడియైన, బాణైః=బాణములచేత, రావణః=రావణుడు, క్షిప్రమ్=శీఘ్రముగా, యుధి=యుద్ధమునందు, హన్యతామ్=చంపబడుగాక.

తా. పరాక్రమవంతుడైన ఆ రామునకు నా విషయమునందు ఏమైన తొందర ఉన్నచో తీక్ష్ణములైన బాణములచేత యుద్ధములో రావణుడు చంపబడుగాక. 20

మూ. భ్రాతురాదేశమాజ్ఞాయ లక్ష్మణో వా పరంతపః, 21
స కిమర్థం నరవరో న మాం రక్షతి రాఘవః.

ప్ర. అ. పరంతపః=శత్రుసంహారకుడు, నరవరః=నరశ్రేష్ఠుడు, రాఘవః=రఘువంశసంజాతుడు అయిన, సః లక్ష్మణో వా=ఆ లక్ష్మణుడైనా, భ్రాతుః=సోదరుని యొక్క, ఆదేశమ్=ఆజ్ఞను, ఆజ్ఞాయ=తెలిసికొని, మామ్=నన్ను, కిమర్థమ్=ఎందుకు, న రక్షతి=రక్షించుటలేదు ?

తా. శత్రుసంహారకుడు, నరశ్రేష్ఠుడు, రఘువంశాలంకారభూతుడు అయిన ఆ లక్ష్మణుడైనా అన్నగారి ఆజ్ఞ పొంది నన్ను రక్షించవచ్చును కదా ? 21

మూ. శక్తౌ తౌ పురుషవ్యాఘ్రౌ వాయ్వగ్నిసమతేజసౌ, 22
సురాణామపి దుర్ధర్షౌ కిమర్థం మాముపేక్షతః.

ప్ర. అ. శక్తౌ=సమర్థులైన, చూ. 38వ సర్గ. 47వ శ్లోకం.

తా. సమర్థులు, వాయువుతోను అగ్నితోను సమానమైన తేజస్సు కలవారు, దేవతలకు కూడ ఎదిరింపశక్యము కానివారు అయిన ఆ పురుషశ్రేష్ఠులు నన్ను ఎందుచేత ఉపేక్షించుచున్నారు? 22

మూ. మమైవ దుష్కృతం కించిన్మహదస్తి న సంశయః, 23
సమర్థౌ సహితౌ యన్మాం నావేక్షేతే పరంతపౌ.

ప్ర. అ. తా. చూ. 38వ సర్గ. 48వ శ్లోకం. 23

మూ. వైదేహ్యా వచనం శ్రుత్వా కరుణం సాశ్రు భాషితమ్,
పునరప్యహమార్యాం తామిదం వచనమబ్రవమ్. 24

ప్ర. అ. కరుణమ్=దీనము, సాశ్రుభాషితమ్=కన్నీళ్ళతో కూడిన మాటలు గలది అయిన, వైదేహ్యాః=సీత యొక్క, వచనమ్=వచనమును, శ్రుత్వా=విని, అహమ్=నేను, పునరపి=మరల, తామ్ ఆర్యామ్=ఆ పూజ్యురాలిని గూర్చి, ఇదమ్=ఈ, వచనమ్=వచనమును, అబ్రవమ్=పలికితిని.

తా. దీనములు, కన్నీళ్ళతో కూడిన వాక్యములు గల సీతాదేవి మాటలు విని, నేను మరల పూజ్యురాలైన ఆమెతో ఇట్లు పలికితిని. 24

మూ. త్వచ్ఛోకవిముఖో రామో దేవి సత్యేన తే శపే, 25
రామే దుఃఖాభిభూతే తు లక్ష్మణః పరితప్యతే.

ప్ర. అ. తా.దుఃఖాభిభూతే=దుఃఖముచేత తిరస్కరింపబడినవాడగుచుండగా (దుఃఖాక్రాంతుడగుచుండగా చూ. 38వ సర్గ. 50వ శ్లోకం) 25

మూ. కథం చిద్భవతీ దృష్ట్వా న కాలః పరిశోచితుమ్, 26
అస్మిన్ముహూర్తే దుఃఖానామన్తం ద్రక్ష్యసి భామిని.

ప్ర. అ. తా.భామిని=ఓ వనితా. చూ. 38వ సర్గ. 52వ శ్లోకం. 26

మూ. తావుభౌ నరశార్దూలౌ రాజపుత్రావనిన్దితౌ, 27
త్వద్దర్శనకృతోత్సాహౌ లఙ్కాం భస్మీకరిష్యతః.

ప్ర. అ. తా.నరశార్దూలౌ=నరశ్రేష్ఠులు, అనిన్దితౌ=నిందింపబడని వారు. చూ. 38వ సర్గ. 52వ శ్లోకం. 27

మూ. హత్వా చ సమరే రౌద్రం రావణం సహ బాన్ధవమ్, 28
రాఘవస్త్వాం వరారోహే స్వాం పురీం నయతే ధ్రువమ్.

ప్ర. అ. వరారోహే=శ్రేష్ఠమైన కటిప్రదేశము గలదానా ! రాఘవః=రాముడు, రౌద్రమ్=భయంకరుడు, సహబాన్ధవమ్=బంధువులతో కూడిన వాడు అయిన, రావణమ్=రావణుని, సమరే=యుద్ధమునందు, హత్వా చ=చంపి, త్వామ్=నిన్ను, స్వాం పురీమ్=తన పట్టణమును గూర్చి, నయతే=తీసికొని వెళ్లును. ధ్రువమ్=నిశ్చయము.

తా. ఓ ! దేవీ ! రాముడు భయంకరుడైన రావణుని, ఆతని బంధువులను యుద్ధములో చంపి నిన్ను తప్పక తన అయోధ్యాపురికి తీసికొని వెళ్ళగలడు. 28

మూ. యత్తు రామో విజానీయాదభిజ్ఞానమనిన్దితే, 29
ప్రీతిసంజననం తస్య ప్రదాతుం త్వమిహార్హసి.

ప్ర. అ. అనిన్దితే=నిందింపబడనిదానా ! రామః=రాముడు, యత్=దేనిని, విజానీయాత్=గుర్తించునో అట్టి, తస్య=ఆ రామునకు, ప్రీతిసంజననమ్=సంతోషమును కలిగించు, అభిజ్ఞానమ్=ఆనవాలును, ఇహ=ఇప్పుడు, దాతుమ్=ఇచ్చుటకు, త్వమ్=నీవు, అర్హసి=తగియున్నావు.

తా. దోషరహితురాలవైన ఓ ! దేవీ ! రామునకు సంతోషమును కలిగించేది, అతడు గుర్తించగలిగినదీ అయిన ఆనవాలు నేదైన ఒకటి ఇమ్ము.29

మూ. సాభివీక్ష్య దిశః సర్వా వేణ్యుద్గ్రథితముత్తమమ్, 30
ముక్త్వా వస్త్రాద్దదౌ మహ్యం మణిమేతం మహాబల.

ప్ర. అ. మహాబల=గొప్ప బలము కలవాడా ! సా=ఆ సీత, సర్వాః=సమస్తమైన, దిశః=దిక్కులను, అభివీక్ష్య=చూచి, వేణ్యుద్గ్రథితమ్=వేణియందు గుచ్చబడినదైన, ఉత్తమమ్=ఉత్తమమైన, ఏతం మణిమ్=ఈ మాణిక్యమును, వస్త్రాత్=వస్త్రమునుండి, ముక్త్వా=విప్పి, మహ్యమ్=నాకు, దదౌ=ఇచ్చెను.

తా. మహాబలశాలివైన ఓ ! రామా ! ఆమె అన్ని దిక్కులవైపు చూచి, తాను వేణిలో ధరించే ఈ ఉత్తమమైన మణిని బట్టముడినుండి విప్పి నా కిచ్చెను. 30

మూ. ప్రతిగృహ్య మణిం దివ్యం తవ హేతో రఘూద్వహ, 31
శిరసా తాం ప్రణమ్యార్యామహమాగమనే త్వరే.

ప్ర. అ. రఘుద్వహ=రామా ! దివ్యమ్=దివ్యమైన, మణిమ్=మణిని, తవ హేతోః=నీ కొరకై, ప్రతిగృహ్య=గ్రహించి, ఆర్యామ్=పూజ్యురాలైన, తామ్=ఆమెను,

శిరసా=శిరస్సుతో, ప్రణమ్య=నమస్కరించి, అహమ్=నేను, ఆగమనే=తిరిగివచ్చుట యందు, త్వరే=తొందరపడితిని.

తా. రామా ! నేను ఆ దివ్యమైన మణిని నీ కొరకై ఆమెనుండి తీసికొని పూజ్యురాలైన ఆమెకు శిరస్సు వంచి నమస్కరించి తిరిగి వచ్చు తొందరలో ఉంటిని. 31

మూ. గమనే చ కృతోత్సాహమవేక్ష్య వరవర్ణినీ, 32
వివర్ధమానం చ హి మాముగాచ జనకాత్మజా.

ప్ర. అ. వరవర్ణినీ=శ్రేష్ఠమైన వర్ణము గల, జనకాత్మజా=సీత, గమనే=వెళ్లుటయందు, కృతోత్సాహమ్=చేయబడిన ఉత్సాహము గల, వివర్ధమానం చ=దేహముచేత పెరుగుచున్న, మామ్=నన్ను, అవేక్ష్య=చూచి, ఉవాచ=పలికెను.

తా. మంచి వర్ణము గల ఆ జానకి తిరిగి వచ్చే ఉత్సాహముతో శరీరము పెంచుచున్న నన్ను చూచి ఇట్లు పలికెను. 32

మూ. అశ్రుపూర్ణముఖీ దీనా బాష్పసందిగ్ధభాషిణీ, 33
మమోత్పతనసంభ్రాన్తా శోకవేగసమాహతా.

ప్ర. అ. అశ్రుపూర్ణముఖీ=కన్నీళ్ళతో నిండిన ముఖము గలదై, దీనా=దీనురాలై, బాష్పసందిగ్ధభాషిణీ=డగ్గుత్తికచే అస్పష్టముగ పలుకుచున్నదై, మమ=నాయొక్క, ఉత్పతనసంభ్రాన్తా=ఎగిరి వెళ్ళిపోవుటను గూర్చి దిగులు చెందినదై, శోకవేగసమాహతా=శోకవేగముచేతకొట్టబడినదై,(ఆమె ఇట్లు పలికెను).

తా. నేను తిరిగి వెళ్ళిపోవుచున్నానని దిగులు చెందిన ఆ దీనురాలి ముఖము కన్నీళ్ళతో నిండి యుండెను. డగ్గుత్తికచే ఆమె మాటలు అస్పష్టముగా ఉండెను. శోకవేగము చేత పీడితురాలై ఉండెను. 33

మూ. హనుమన్ సింహసంకాశావుభౌ తౌ రామలక్ష్మణౌ, 34
సుగ్రీవం చ సహామాత్యం సర్వాన్ బ్రూయా హ్యనామయమ్.

ప్ర. అ. హనుమన్=హనుమంతుడా ! సింహసంకాశౌ=సింహములతో సమానులైన, తౌ రామలక్ష్మణౌ=ఆ రామలక్ష్మణులను, ఉభౌ=ఇద్దరిని, సహామాత్యమ్=మంత్రులతో కూడిన, సుగ్రీవం చ=సుగ్రీవుణ్ణీ, సర్వాన్=అందరినీ, అనామయమ్=ఆరోగ్యమును, బ్రూయాః=చెప్పుము.

తా. ఓ ! హనుమంతుడా ! సింహముల వంటి ఆ రామలక్ష్మణులిద్దరినీ, మంత్రిసమేతుడైన సుగ్రీవుని, అందరినీ కూడ క్షేమమడిగినానని చెప్పుము. 34

మూ. యథా చ స మహాబాహుర్మాం తారయతి రాఘవః,
అస్మాద్దుఃఖామ్బుసంరోధాత్త్వం సమాధాతుమర్హసి. 35

ప్ర. అ. తా.40వ సర్గ 9వ శ్లోకం.

మూ. ఇమం చ తీవ్రం మమ శోకవేగం
రక్షోభిరేభిః పరిభర్త్సనం చ,
బ్రూయాస్తు రామస్య గతః సమీపమ్
శివస్తవాధ్వాస్తు హరిప్రవీర. 36

ప్ర. అ. తా.మూ. 40వ సర్గ. 24వ శ్లోకం.

మూ. ఏతత్తవార్యా నృపరాజసింహ
సీతా వచః ప్రాహ విషాదపూర్వమ్,
ఏతచ్చ బుద్ధ్వా గదితం మయా త్వం
శ్రద్ధత్స్వ సీతాం కుశలాం సమగ్రామ్. 37

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే సుందరకాణ్డే
సప్తషష్టితమః సర్గః.

ప్ర. అ. నృపరాజసింహ=రాజరాజశ్రేష్ఠా ! ఆర్యా=పూజ్యురాలైన, సీతా=సీత, విషాదపూర్వమ్=దుఃఖపూర్వకముగా, ఏతత్ వచః=ఈ వచనమును, తవ=నీకు, ఆహ=చెప్పినది. మయా=నాచేత, గదితమ్=చెప్పబడిన, ఏతత్=దీనిని, బుద్ధ్వా=తెలిసికొని, సీతామ్=సీతను, సమగ్రామ్=పరిపూర్ణురాలిని గాను, కుశలామ్=క్షేమముగా ఉన్న దానిని గాను, శ్రద్ధత్స్వ=నమ్ముము.

తా. రాజాధిరాజా ! పూజ్యురాలైన సీత చాలా దుఃఖించుచు నీకు చెప్పమని ఈ మాటలు చెప్పినది. నేను చెప్పిన ఈ మాటలు విని, సీత పరిపూర్ణ క్షేమములో ఉన్నదను విషయమును నమ్ముము. 37

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు
సుందరకాండలో అరువదియేడవ సర్గ సమాప్తము.

అథ అష్టషష్టితమః సర్గః

[సీతకు కలిగిన సందేహమును తానెట్లు నివారించెనో హనుమంతుడు చెప్పుట.]

మూ. అథాహముత్తరం దేవ్యా పునరుక్తః ససంభ్రమమ్,
తవ స్నేహాన్నరవ్యాఘ్ర సౌహార్దాదనుమాన్య వై. 1

ప్ర. అ. నరవ్యాఘ్ర=మనుష్యశ్రేష్ఠుడా ! అథ=అటుపిమ్మట, అహమ్=నేను, దేవ్యా=సీతాదేవిచేత, తవ=నీయొక్క, స్నేహాత్=స్నేహమువలన, సౌహార్దాత్=మంచి హృదయము కలిగి ఉండుటవలనను, అనుమాన్య=అనుమతించి, పునః=మరల, ఉత్తరమ్=ప్రత్యుత్తరమును, ససంభ్రమమ్=తొందరతో కూడుకొన్నట్లుగా, ఉక్తః=పలుకబడితిని.

తా. ఓ ! నరశ్రేష్ఠుడా ! పిమ్మట ఆ సీతాదేవి నీమీద నున్న ప్రేమ వలన, సౌహార్దమువలన నాకు అనుమతి ఇచ్చి, తొందరగా మరల ఇట్లు పలికెను.1

మూ. ఏవం బహువిధం వాచ్యో రామో దాశరథిస్త్వయా,
యథా మామాప్నుయాచ్ఛీఘ్రం హత్వా రావణమాహవే. 2

ప్ర. అ. దాశరథిః=దశరథకుమారుడైన, రామః=రాముడు, ఆహవే=యుద్ధమునందు, రావణమ్=రావణుని, శీఘ్రమ్=శీఘ్రముగా, హత్వా=చంపి, మామ్=నన్ను, యథా=ఎట్లు, ఆప్నుయాత్=పొందునో, తథా=అట్లు, ఏవమ్=ఇట్లు, బహువిధమ్=అనేకవిధములుగ, వాచ్యః=చెప్పదగినవాడు.

తా. దశరథకుమారుడైన రాముడు యుద్ధములో శీఘ్రముగా రావణుని చంపి, నన్ను పొందునట్లుగా ఈ విధముగ అన్ని విషయములు చెప్పవలెను. 2

మూ. యది వా మన్యసే వీర వసైకాహమరిందమ,
కస్మింశ్చిత్సంవృతే దేశే విశ్రాన్తః శ్వో గమిష్యసి. 3

ప్ర. అ. తా. మూ. 39వ సర్గ, 20వ శ్లోకం.

మూ. మమ చాప్యల్పభాగ్యాయాః సాన్నిధ్యాత్తవ వీర్యవన్,
అస్య శోకవిపాకస్య ముహూర్తం స్యాద్విమోక్షణమ్. 4

ప్ర. అ. వీర్యవన్=పరాక్రమవంతుడా ! తవ=నీయొక్క, సాన్నిధ్యాత్=సాన్నిధ్యమువలన, అల్పభాగ్యాయాః=అల్పమైన భాగ్యము గల, మమ=నాయొక్క, అస్య=ఈ, శోకవిపాకస్య=దుఃఖవిపాకమునకు, ముహూర్తమ్=ముహూర్తకాలమైనా, విమోక్షణమ్=విడుదల, స్యాత్=కలుగవచ్చును.

తా. ఓ ! పరాక్రమవంతుడా ! దురదృష్టవంతురాలైన నాకు, నీవు దగ్గర ఉండుటచే, ఈ శోకపరిపాకము నుండి ముహూర్తసమయమైనను విమోచనము కలుగవచ్చును. 4

మూ. గతే హి త్వయి విక్రాన్తే పునరాగమనాయ వై,
ప్రాణానామపి సన్దేహో మమ స్యాన్నాత్ర సంశయః. 5

ప్ర. అ. విక్రాన్తే=పరాక్రమవంతుడవైన, త్వయి=నీవు. చూ. 39వ సర్గ, 22వ శ్లోకము.

తా. పరాక్రమవంతుడవైన నీవు తిరిగి వచ్చుటకై వెళ్ళిపోయిన పిమ్మట నేను జీవించి ఉందునా అనేది కూడ సందేహాస్పదమే. ఇందులో సందేహము లేదు. 5

మూ. తవాదర్శనజః శోకో భూయో మాం పరితాపయేత్,
దుఃఖాద్దుఃఖపరాభూతాం దుర్గతాం దుఃఖభాగినీమ్. 6

ప్ర. అ. దుఃఖాత్=ఒక దుఃఖము తరవాత, దుఃఖభాగినీమ్=మరొక దుఃఖమును పొందుచున్నదానను, దుర్గతామ్=దీనురాలను, దుఃఖభాగినీమ్=దుఃఖములనే పొందేదానను అయిన, మామ్=నన్ను, తవ=నీయొక్క, అదర్శనజః=కనబడకపోవుటవలన కలిగిన, శోకః=శోకము, భూయః=ఇంకను, పరితాపయేత్=బాధించును.

తా. ఒక దుఃఖము తరువాత మరొక దుఃఖమును అనుభవించుచు, దీనురాలనై, దుఃఖములు అనుభవించుటకే పుట్టిన నాకు నీవు కనబడకపోవుటచే దుఃఖము ఇంకా అధికమగును. 6

మూ. అయం చ వీర సన్దేహస్తిష్ఠతీవ మమాగ్రతః,
సుమహాం స్త్వత్సహాయేషు హర్యృక్షేషు హరీశ్వర. 7

ప్ర. అ. తా. చూ. 39వ సర్గ, 24వ శ్లోకం.

మూ. కథం ను ఖలు దుష్పారం తరిష్యన్తి మహోదధిమ్,
తాని హర్యృక్షసైన్యాని తౌ వా నరవరాత్మజౌ. 8

ప్ర. అ. తా. చూ. 39వ సర్గ, 25వ శ్లోకం.

మూ. త్రయాణామేవ భూతానాం సాగరస్యాస్య లఙ్ఘనే,
శక్తిః స్యాద్వైనతేయస్య తవ వా మారుతస్య వా. 9

ప్ర. అ. తా. మూ. 39వ సర్గ, 26వ శ్లోకం.

మూ. తదస్మిన్ కార్యనిర్యోగే వీరైవం దురతిక్రమే,
కిం పశ్యసి సమాధానం బ్రూహి కార్యవిదాం వర. 10

ప్ర. అ. తా. మూ. 39వ సర్గ, 27వ శ్లోకం, "కార్యవిదామ్=కార్యవేత్తలలో, వర=శ్రేష్ఠుడా, బ్రూహి=చెప్పుము.

మూ. కామమస్య త్వమేవైకః కార్యస్య పరిసాధనే,
పర్యాప్తః పరవీరఘ్న యశస్యస్తే బలోదయః. 11

ప్ర. అ. తా. మూ. 39వ సర్గ, 28వ శ్లోకం.

మూ. బలైః సమగ్రైర్యది మాం హత్వా రావణమాహవే,
విజయీ స్వాం పురీం రామో నయేత్తత్స్యాద్యశస్కరమ్. 12

ప్ర. అ. రామః=రాముడు, రావణమ్=రావణుని, సమగ్రైః=సమస్తమైన, బలైః=సైన్యములతో కూడ, ఆహవే=యుద్ధమునందు, హత్వా=చంపి, విజయీ=విజయవంతుడై, స్వామ్=తన సంబంధమైన, పురీమ్=పట్టణమును గూర్చి, మామ్=నన్ను, నయేద్యది=తీసికొనివెళ్ళినట్లయితే, తత్=అది, యశస్కరమ్=యశస్సును కలిగించేది, స్యాత్=అగును.

తా. రాముడు యుద్ధములో సమస్త సైన్యములతో సహా రావణుని చంపి, విజయవంతుడై నన్ను తన నగరమునకు తీసికొని వెళ్ళినచో అది యశస్కరముగా ఉండును. 12

మూ. యథాహం తస్య వీరస్య వనాదుపధినా హృతా,
రక్షసా తద్భయాదేవ తథా నార్హతి రాఘవః. 13

ప్ర. అ. అహమ్=నేను, రక్షసా=రాక్షసునిచేత, వీరస్య=వీరుడైన రాముని యొక్క, ఉపధినా=వంచనచేత, యథా=ఎట్లు, హృతా=హరింపబడితినో, తథా=అట్లు, తద్భయాదేవ=ఆ రాక్షసునినుండి భయము వలన, రాఘవః=రాముడు, నార్హతి=తగదు.

తా. రావణుడు వీరుడైన రాముని మోసగించి నన్ను హరించినట్లు, రాముడు ఆ రావణునికి భయపడి ఆ విధముగ నన్ను తీసికొనివెళ్లుట యుక్తము కాదు. 13

మూ. బలైస్తు సంకులాం కృత్వా లఙ్కాం పరబలార్దనః,
మాం నయేద్యది కాకుత్థ్సస్తత్తస్య సదృశం భవేత్. 14

ప్ర. అ. తా. బలైః=సేనలచేత, చూ. 39వ సర్గ. 30వ శ్లోకం.

మూ. తద్యథా తస్య విక్రాన్తమనురూపం మహాత్మనః,
భవేదాహవశూరస్య తథా త్వముపపాదయ. 15

ప్ర. అ. తా.భవేత్=అగునో. చూ. 39వ సర్గ. 31వ శ్లోకం.

మూ. తదర్థోపహితం వాక్యం ప్రశ్రితం హేతుసంహితమ్,
నిశమ్యాహం తతః శేషం వాక్యముత్తరమబ్రవమ్. 16

ప్ర. అ. అహమ్=నేను, అర్థోపహితమ్=అర్థముతో కూడినదీ, ప్రశ్రితమ్=వినయముతో కూడినది, హేతుసంహితమ్=హేతువులతో కూడినది అయిన, తత్=ఆ, వాక్యమ్=వాక్యమును, నిశమ్య=విని, తతః=పిమ్మట, శేషమ్=మిగిలిన, ఉత్తరమ్=ప్రత్యుత్తరరూపమైన, వాక్యమ్=వాక్యమును, అబ్రవమ్=పలికితిని.

తా. ఉత్తమమైన అర్థము కలది, వినయసంపన్నము, యుక్తియుక్తము అయిన ఆ మాటలు విని నేను దానికి ప్రత్యుత్తరముగా ఇట్లు చెప్పితిని. 16

మూ. దేవి హర్యృక్షసైన్యానామీశ్వరః ప్లవతాం వరః,
సుగ్రీవః సత్త్వసంపన్నస్తవార్థే కృతనిశ్చయః. 17

ప్ర. అ. తా. చూ. 39వ సర్గ, 33వ శ్లోకం

మూ. తస్య విక్రమసంపన్నాః సత్త్వవన్తో మహాబలాః,
మనఃసంకల్పసంపాతా నిదేశే హరయః స్థితాః. 18
ఏషాం నోపరి నాధస్తాన్న తిర్యక్సజ్జతే గతిః,
న చ కర్మసు సీదన్తి మహత్స్వమితతేజసః. 19

ప్ర. అ. తా. చూ. 39వ సర్గ 35, 36 శ్లోకాలు, ఏషామ్=వీరియొక్క.

మూ. అసకృత్తైర్మహాభాగైర్వానరైర్బలదర్పితైః,
ప్రదక్షిణీకృతా భూమిర్వాయుమార్గానుసారిభిః. 20

ప్ర. అ. మహాభాగైః=మహాభాగ్యవంతులు, బలదర్పితైః=బలముచేత గర్వించినవారు, వాయుమార్గానుసారిభిః=వాయుమార్గమున పోవువారు అయిన, తైః=ఆ, వానరైః=వానరులచేత, భూమిః=భూమి, ప్రదక్షిణీకృతా=ప్రదక్షిణము చేయబడినది.

తా. గొప్పభాగ్యముకలవారైన ఆ వానరులు బలముచే గర్వించి, ఆకాశమార్గమున బయలుదేరి భూమినంతను అనేకపర్యాయములు ప్రదక్షిణముచేసిరి.

మూ. మద్విశిష్టాశ్చ తుల్యాశ్చ సన్తి తత్ర వనౌకసః,
మత్తః ప్రత్యవరః కశ్చిన్నాస్తి సుగ్రీవసన్నిధౌ. 21

అహం తావదిహ ప్రాప్తః కిం పునస్తే మహాబలాః,
న హి ప్రకృష్టాః ప్రేష్యన్తే ప్రేష్యన్తే హీతరే జనాః. 22

ప్ర. అ. తా. చూ. 39వ సర్గ. 38,39వ శ్లోకాలు.

మూ. తదలం పరితాపేన దేవి మన్యుర్వ్యపైతు తే,
ఏకోత్పాతేన వై లఙ్కామేష్యన్తి హరియూథపాః. 23

ప్ర. అ. తా. చూ. 39వ సర్గ, 40వ శ్లోకం. మన్యుః=దుఃఖము. 23

మూ. మమ పృష్ఠగతౌ తౌ చ చన్ద్రసూర్యావివోదితౌ,
త్వత్సకాశం మహాభాగే నృసింహావాగమిష్యతః. 24

ప్ర. అ. తా. చూ. 39వ సర్గ. 41వ శ్లోకం. "మహాభాగే=గొప్ప భాగ్యము కలదానా."

మూ. అరిఘ్నం సింహసంకాశం క్షిప్రం ద్రక్ష్యసి రాఘవమ్,
లక్ష్మణం చ ధనుష్పాణిం లఙ్కాద్వారముపస్థితమ్. 25

ప్ర. అ. చూ. 39 వ సర్గ. 48వ శ్లోకం. "సింహసంకాశమ్=సింహముతో సమానుడు"

మూ. నఖదంష్ట్రాయుధాన్వీరాన్ సింహశార్దూలవిక్రమాన్,
వానరాన్వారణేన్ద్రాభాన్ క్షిప్రం ద్రక్ష్యసి సంగతాన్. 26

ప్ర. అ. తా. చూ. 39వ సర్గ. 49వ శ్లోకం.

మూ. శైలామ్బుదనికాశానాం లఙ్కామలయసానుషు,
నర్దతాం కపిముఖ్యానామచిరాచ్ఛ్రోష్యసి స్వనమ్. 27

ప్ర. అ. శైలామ్బుదనికాశానామ్=శైలములతోను మేఘములతోను సమానమైన, లఙ్కామలయసానుషు=లంక యందు మలయపర్వతము చరియలయందు, నర్దతామ్=ధ్వని చేయుచున్న, కపిముఖ్యానామ్=వానరశ్రేష్ఠులయొక్క, స్వనమ్=ధ్వనిని, అచిరాత్=కొద్దికాలములో, శ్రోష్యసి=వినగలవు.

తా. పర్వతము, మేఘములవంటి పెద్దదేహము గల కపిశ్రేష్ఠులు, లంకలోను, మలయాద్రి చరియల పైన ధ్వని చేయుచుండగా అచిరకాలములో వినగలవు. 27

మూ. నివృత్తవనవాసం చ త్వయా సార్థమరిందమమ్,
అభిషిక్తమయోధ్యాయాం క్షిప్రం ద్రక్ష్యసి రాఘవమ్. 28

ప్ర. అ. నివృత్తవనవాసమ్=పూర్తియైన వనవాసము కలవాడు, అరిందమమ్=శత్రుసంహారకుడు, అయోధ్యాయామ్=అయోధ్యలో, త్వయా సార్ధమ్=నీతో కూడ, అభిషిక్తమ్=రాజ్యాభిషిక్తుడూ అయిన, రాఘవమ్=రాముణ్ణి, క్షిప్రమ్=శీఘ్రముగా, ద్రక్ష్యసి=చూడగలవు.

తా. శత్రుసంహారకుడైన రాముడు వనవాసము పూర్తిచేసికొని అయోధ్యా నగరములో నీతో కలిసి రాజ్యాభిషిక్తుడు అగుటను చూడగలవు. 28

మూ. తతో మయా వాగ్భిరదీనభాషిణా
శివాభిరిష్టాభిరభిప్రసాదితా,
జగామ శాన్తిం మమ మైథిలాత్మజా
తవాపి శోకేన తదాభిపీడితా. 29

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే సున్దరకాణ్డే
అష్టషష్టితమః సర్గః.
సమాప్తశ్చాయం సున్దరకాణ్డః.

ప్ర. అ. తతః=అటు పిమ్మట, తవ=నీయొక్క, శోకేనాపి=శోకము చేతకూడ. తదా=అప్పుడు, అభిపీడితా=పీడింపబడిన, మైథిలాత్మజా=సీత, అదీనభాషిణా=దైన్యము లేకుండా మాటలాడిన, మయా=నాచేత, శివాభిః=మంగళకరములు, ఇష్టాభిః=ఇష్టములు అయిన, మమ=నాయొక్క, వాగ్భిః=వాక్కులచేత, అభిప్రసాదితా=ఓదార్చబడినదై, శాన్తిమ్=శాంతిని, జగామ=పొందెను.

తా. నీవు శోకముతో ఉన్నావు అని వినుటచేత కూడ సీత ఎక్కువ దుఃఖించుచుండెను. అట్టి ఆమెను నేను, దైన్యము లేకుండా మాటలాడుచు, మంగళప్రదములు, ఇష్టములు అయిన మాటలతో ఓదార్చగా ఆమె మనస్సులో శాంతి పొందినది. 29

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు
సుందరకాండలో అరువదిఎనిమిదవ సర్గ సమాప్తము.
సుందరకాండ సమాప్తము.

యత్కృపాలేశసంసర్గాద్వ్యాఖ్యేయం రచితా మయా,
తస్యైవ జానకీజానేః పదయోరియమర్ప్యతే.
దేవతానుగ్రహః పిత్రోస్తపశ్చాచార్యసత్కృపా,
కర్తాస్మద్గ్రన్థజాతస్య కరణం కేవలం వయమ్.

శ్రీః శ్రీః శ్రీః